రామాయణం

వాల్మీకి రామాయణము-ఉత్తర కాండ-2 వ భాగము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org

సదాశివ సమారంభాం

గురు దక్షిణామూర్తి

గురు వేదవ్యాస మహర్షి

గురు శుక మహర్షి

గురు నారద మహర్షి

గురు వాల్మీకి మహర్షి

గురు శ్రీకృష్ణ

శంకరాచార్య మధ్యమాం


గురు దత్తాత్రేయ

గురు బాబాజి

గురు గౌతమ బుద్ధ

గురు ఆదిశంకరాచార్య

గురు రామానుజాచార్యులు

గురు జ్ఞానేశ్వర్

గురు రవిదాస్

గురు కబీర్ దాస్

గురు చైతన్య మహా ప్రభువు

గురు నానక్

గురు రాఘవేంద్ర స్వామి

గురు వీరబ్రహ్మేంద్ర స్వామి

యోగి వేమన

అస్మదాచార్య పర్యంతాం


గురు త్రైలింగ స్వామి

గురు లాహిరి మహాశయ

గురు రామకృష్ణ పరమహంస

అమ్మ శారదా దేవి

గురు వివేకానంద

గురు సాయిబాబా

గురు అరబిందో

గురు రమణ మహర్షి

గురు యోగానంద

గురు భక్తివేదాంత ప్రభుపాద

గురు మళయాళ స్వామి

గురు విద్యాప్రకాశానందగిరి

గురు చంద్రశేఖర పరమాచార్య

వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in

అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని జళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజూ పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీరామాయి నమః

శ్రీ మద్వాల్మీకి మహర్షి ప్రణీత

శ్రీమద్రామాయణము

ఉత్తరకాండము

(రెండవ సంపుటము)

ఆచార్య శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడుగారు రచించిన

బాలానందినీ వ్యాఖ్యతో కూడినది

ప్రచురణ

ఆర్ష విజ్ఞాన ట్రస్టు

హైదరాబాదు

1995

ముందుమాట

జస్టిస్ పమిడిఘంటం కోదండరామయ్య
ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి
ఆర్ష విజ్ఞాన ట్రస్టు స్థాపకాధ్యక్షులు.

శ్రీరామసదనం
జూబ్లీహిల్స్,
హైదరాబాదు-500 034.

ఈ ఉత్తరకాండ ప్రచురణతో ఆర్ష విజ్ఞాన సంస్థవారు తలపెట్టిన సారస్వత యజ్ఞము పూర్తి అయినది. రామాయణమునకు సీతాచరితము, పౌలస్త్యవధము అని మరి రెండు పేర్లుకూడ ఉన్నవి. ఈ కాండయందు రావణుని పరాక్రమము, అతడు సాధించిన విజయపరంపరలు సుదీర్ఘంగా వర్ణించబడినవి.

ఈ కాండ అధ్యయనమువలన రెండు విషయములు స్థూలముగా మన హృదయమున నెలకొనును. అందొకటి రావణుని స్వభావమువల్ల తెలియదగినది. హనుమంతుడు మొట్టమొదట రావణుని చూడగానే-

"అహో రూప మహో ధైర్యమహో సత్త్వమహో ద్యుతిః,
అహో రాక్షసరాజస్య సర్వలక్షణయుక్తతా."

(సుందర. 49-17)

"ఆహా! ఏమి ఈ రావణుని రూపము! ఏమి ధైర్యము! ఏమి బలము! ఏమి కాంతి! ఏమి సర్వలక్షణసంపన్నత్వము! బలవత్తరమైన అధర్మప్రవర్తన లేనిచో ఇంద్రునితో సహా దేవలోకాని కంతటికీ ప్రభువై ఉండేవాడు." అని భావించాడు.

రాముడు కూడా అతనిని మొదట చూచినపుడు-

"అహో! దీప్తో మహాతేజా రావణో రాక్షసేశ్వరః,
ఆదిత్య ఇవ దుష్ప్రేక్షో రశ్మిభిర్భాతి రావణః."

(యుద్ధ. 59-26)

"ఆహా ! ఈ రాక్షసరాజగు రావణుడు దివ్యతేజముతో వెలుగుచున్నాడు. మహాప్రతాపుడుగ నున్నాడు. ఆశ్చర్యము ! ఇతడు తేజమున సూర్యునివలె చూడ శక్యముకాక వెలుగుచున్నాడు."

చివరిసారి రావణుడు సర్వసన్నద్ధుడై వచ్చినపుడు ఇతనిని జయించగలనా? అని రాముడు చింతించగా అగస్త్యుడు వచ్చి ఆదిత్యహృదయము ఉపదేశించెను.

విభీషణుడు కూడా రావణవధను పురస్కరించుకొని.

గతః సేతుః సునీతానాం గతో ధర్మస్య విగ్రహః,
గతః సత్త్వస్య సంక్షేపః ప్రస్తావానాం గతి ర్గతా.
యుద్ధ. 112-6

సమస్తనీతులు తెలిసినవాడు నశించెను. ధర్మముయొక్క ఆకారమే అన్న దగినవాడు నశించెను. సమస్తలోకములందు అందరికన్న బలవంతు డనదగిన వాడు మృతినొందెను. అందరికిని స్తోత్రపాత్రమైనవాడు పడిపోయెను.' అని అనెను.

ఈ సీతాపహరణ మహాపాపకార్యమువల్ల ఇతని కీ దుర్గతి పట్టెను. అతని భార్య మండోదరి తీవ్రముగా విలపించెను. 'నీవు ఇంద్రియములను జయించి, ముల్లోకములు జయించితివి. ఇపుడు ఇంద్రియములకు లోబడుటచే హతుడ వైతి' వని చింతించెను. పరస్త్రీయైన సీతవిషయమున మోహము పొందితివి. నీచమైన స్త్రీచౌర్యము చేసితివి. అదే నీ ఈ గతికి కారణమని విలపించెను.

శ్రీరాముడు లంకపై దండెత్తి వచ్చినపుడు రాముని తల కల్పించి, దానిని ధనుఃసహితముగా విద్యుజ్జిహ్వానిచే తెప్పించి, రాముడు మరణించెనని ఘోరమైన అసత్యముపలికి సీతను వశపరచుకొన చూచెను. రావణుడు వేదాధ్యయనమునందు గొప్ప నిష్ణాతుడు. అతని పాఠక్రమము ఈనాటికి దేశమున అనుసరింతురు. ధర్మము, సత్యము ఉల్లంఘించిన వారికి వేదాధ్యయనము నిష్ప్రయోజనము. కావున ఈ కాండ అధ్యయనము వలన రామునివలె ప్రవర్తించవలెను కాని రావణునివలె కాదని రూఢిగా తెలియును.

శ్రీరాముడు ఆదర్శపురుషుడే కాక ఆదర్శపరిపాలకుడుగా కూడ ఈ మహాకావ్యమున రూపొందెను. ఈ రాజధర్మము సామాన్య మానవధర్మమునకు పైస్థాయి

లోను ఒక్కొక్కసారి విభిన్నముగాకూడ ఉండును. శ్రీరాముడు ఈ విషయమై విశ్వామిత్రునిద్వారా ఉపదేశము పొంది, దానిని శిరసావహించెను. తాటక స్త్రీకదా అని సంహరింప సందేహించునపుడు

నృశంసమనృశంసం వా ప్రజారక్షణకారణాత్,
పాతకం వా సదోషం వా కర్తవ్యం రక్షతా సతా.

బాల. 25-17

ధర్మాత్ముడైన రాజు, ప్రజారక్షణము కొరకై చేపట్టు కార్యము, క్రూరమైనను కాకపోయినను, పాపమైనను దోషములతో కూడినదైనను చేయదగినదే.

వాల్మీకి హృదయ మెఱిగిన భవభూతి మహాకవి పై శ్లోకమునకు నిజమైన వ్యాఖ్యాన మనదగునట్లు తన ఉత్తరరామచరితనాటకమున రామునిద్వారా తన ప్రజాపరిపాలనాదక్షతను, ప్రజాసంరక్షణను తెల్పు శపథపూర్వకమైన ఈ క్రింది వాక్యమును పలికించెను–

స్నేహం దయాం చ సౌఖ్యం చ యది వా జానకీమపి,
ఆరాధనాయ లోకస్య ముంచతో నాస్తి మే వ్యథా.

స్నేహమును, దయను, సౌఖ్యమును చివరకు జానకిని కూడ ప్రజారాధనకై విడిచిపెట్టుచు కూడ నే నెంతమాత్రము బాధపడను.

వినికిడిగా తెలిసిన కథను పురస్కరించుకొని రాముని విమర్శించక మూలము సమగ్రముగా అధ్యయనము చేసిన సత్యము విదితమగును. ప్రాణము కన్న అధికమైన భార్యను కోల్పోయి రాముడు సుదీర్ఘకాలము ఉపాసనరూపముగా రాజ్యము చేసెను. (రామో రాజ్య ముపాసిత్వా) కాలమే ఆయన సద్గుణమునకు తీర్పు నిచ్చినది.

'శ్రీమద్వియ్యాతిలతాక్రామితరోదోంతరాళ' అని తెలుగుకవి పోతనామాత్యుడు ఆయన కీర్తిలత మూడు లోకములలో వ్యాపించినదని ప్రశంసించెను.

ఉత్తరకాండ మిగతాభాగమునకు వ్యాఖ్యానమని పండితాభిప్రాయము. ముముక్షువు లీ కాండను కూడ చదువు ఆచారము కలదు. ఆర్ష విజ్ఞాన ట్రస్టువారు కోరగానే ఈ ఉత్తరకాండమునకు కూడా తమ దివ్యమైన బాలానందినీ వ్యాఖ్యను

సమకూర్చిన ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారు తాము కృతకృత్యులై ఈ సంస్థ సభ్యులను ధన్యజీవులను చేసిరి. ఆయన దీర్ఘతరమైన తన శ్రమకు ఆర్థికంగా ఏ విధమైన ప్రతిఫలమును అంగీకరింపని సౌజన్యశీలుడు. గ్రంథము చివర ఆయన రచించిన–

'దేవతానుగ్రహః పిత్రోస్తప శ్చాచార్యసత్కృపా,
కర్తాస్మద్గ్రంథజాతస్య కరణం కేవలం వయమ్."

తను రచించిన కృతులకు దేవతానుగ్రహము, మాతృ–పితృపాదుల తపస్సు ఆచార్యుల కృపా కారణమని, తాను కేవలము ఉపకరణమని తెలిపిన వారి వాక్యము వారికి ఆర్షసంప్రదాయమునందు కల విశ్వాసమును వేనోళ్ళ చాటుచున్నది. పరాత్పరుడు వీరికి సర్వశ్రేయస్సులు సమకూర్చుగాక.

ఈ గ్రంథరాజముల ముద్రణమునకు సహాయపడిన వదాన్యులందరికి ఈ ఆర్ష విజ్ఞాన సంస్థ పక్షమున కృతజ్ఞతా పూర్వక వందనములు.

యువ విజయదశమీ

పమిడిఘంటం కోదండరామయ్య

విషయసూచిక

సర్గసంఖ్య	విషయము	పుట
38.	రాముడు చేసిన సత్కారములు అందుకొని జనకాదులు తమ తమ దేశములకు వెళ్లుట.	1
39.	రాజులు రామునకు కానుకలు పంపుట, రాముడు వాటిని స్వీకరించి తన మిత్రులైన వానరాదులకు ఇచ్చుట. వానరాదులు అక్కడ సుఖముగా ఉందుట.	5
40.	రాముడు సుగ్రీవాదివానరులను, విభీషణాదిరాక్షసులను సన్మానించి వారి వారి దేశములకు పంపుట.	23
41.	కుబేరుడు పంపగా పుష్పకము రామునివద్దకు వచ్చుట. రాముడు దానిని పూజించి మరల పంపివేయుట. భరతుడు రామరాజ్యములోని అద్భుతప్రభావములను వర్ణించి చెప్పుట	34
42	సీతారాములు అశోకవాటికలో విహరించుట. గర్భవతియైన సీతకు తపోవనమును చూడవలెనను కోరిక ఉదయించుట. రాముడు ఆ కోరిక తీర్చెద నని మాట ఇచ్చుట	42
43.	భద్రుడు సీతను గూర్చిన లోకాపవాదమును రామునకు తెలుపుట.	55
44.	రాముడు ద్వారపాలకుని పంపి లక్ష్మణభరతశత్రుఘ్నులను పిలిపించుట.	63
45	సీతవిషయమున వచ్చిన లోకాపవాదమును గూర్చి సోదరులకు తెలిపి రాముడు సీతను ఆరణ్యములో విడచి రమ్మని లక్ష్మణుని ఆదేశించుట.	71
46.	లక్ష్మణుడు సీతను రథమునందు కూర్చుండబెట్టి ఆమెను వనములో విడచుటకై బయలుదేరి గంగాతీరము చేరుట.	80

సర్గసంఖ్య	విషయము	పుట
47.	సీతను గంగానది దాటించిన పిమ్మట లక్ష్మణుడు ఆమెకు పరిత్యాగమును గూర్చి చెప్పుట	92
48.	సీత దుఃఖావిష్టురాలై రామునకు సందేశము పంపుట. లక్ష్మణుడు వెళ్ళిపోవుట. సీత విలపించుట.	99
49.	వాల్మీకి మునికుమారులద్వారా సీతనుగూర్చి విని. అక్కడికి వచ్చి, సీతను ఓదార్చి ఆమెను తన ఆశ్రమములోనికి తీసికొని వెళ్లుట.	109
50.	లక్ష్మణ సుమంత్రుల సంభాషణము.	118
51	సుమంత్రుడు తాను దుర్వాసుని ద్వారా విన్న భృగుశాపవృత్తాంతమును, కొంచెము రాబోవు కథను లక్ష్మణునికి చెప్పి, అతనిని ఓదార్చుట.	126
52.	అయోధ్యలో రాజభవనములో ప్రవేశించిన లక్ష్మణుడు దుఃఖించుచున్న రాముణ్ణి ఓదార్చుట.	137
53.	పనిమీద వచ్చినవారిని ఉపేక్షించుటచేత నృగమహారాజుకు వచ్చిన శాపమును గూర్చిన కథ చెప్పి రాముడు కార్యార్థులను నిరీక్షింప వలెను అని లక్ష్మణుణ్ణి ఆదేశించుట.	144
54.	నృగమహారాజు తన పుత్రునకు రాజ్యమిచ్చివేసి, భూమిలో అందమైన గొయ్యి ప్రవ్వించుకొని శాపమును అనుభవించుట.	154
55.	నిమిచక్రవర్తి, వసిష్ఠుడు ఒకరి నొకరు శపించుకొని దేహములు త్యజించుట.	162
56.	బ్రహ్మదేవుడు చెప్పగా వసిష్ఠుడు వరుణుని రేతస్సులో ప్రవేశించుట, వరుణుడు ఊర్వశి సమీపమున ఒక కలశలో తన రేతస్సును ఉంచుట, మిత్రుని శాపముచేత ఊర్వశి భూలోకములో పురూరవుని దగ్గర ఉండి పుత్రుణ్ణి కనుట.	170

సర్గసంఖ్య	విషయము	పుట
57.	వసిష్ఠుడు క్రొత్త దేహమును పొందుట. నిమి ప్రాణుల నేత్రముల మీద నివసించుట.	181
58.	శుక్రాచార్యుడు యయాతిని శపించుట.	190
59.	యయాతి పుత్రుడైన పూరువునకు తన వార్ధక్యము నిచ్చి అతని యౌవనమును తీసికొనుట. భోగము లనుభవించి తృప్తుడైన పిమ్మట అతడు చాలాకాలానికి అతని యౌవనమును తిరిగి ఇచ్చివేయుట. పూరువును రాజ్యమునందు అభిషేకించుట. యదువును శపించుట.	199
ప్ర.1.	కార్యార్థియై కుక్క ఒకటి రాముని భవనము ద్వారమునకు వచ్చుట. దానిని రాజసభలోనికి తీసికొని రమ్మని రాముడు లక్ష్మణుణ్ణి ఆదేశించుట.	208
ప్ర.2.	శునకము విషయమున రాముడు న్యాయనిర్ణయము చేయుట. దాని అభిప్రాయము ప్రకారము రాముడు దానిని కొట్టిన బ్రాహ్మణునకు మఠాధిపత్య మిచ్చుట. శునకము మఠాధిపత్యములో ఉన్న దోషాలు వర్ణించి చెప్పుట	218
ప్ర.3.	గ్రద్ద గుడ్లగూబల వివాదము.	236
60.	రాముని సభకు ఋషులు వచ్చుట. రాముడు వారిని సత్కరించి వారి అభీష్టమును పూరించుటకై ప్రతిజ్ఞ చేయుట. ఆ ఋషులు రాముణ్ణి ప్రశంసించుట.	259
61.	మునులు రామునకు మధువు సంపాదించిన వరమును, లవణాసురుని బలమును. అతడు చేయుచున్న ఉపద్రవమును గూర్చిచెప్పి అతనివలన తమకు కలిగిన భయమును తొలగింపు మని రాముణ్ణి వేడుట.	266
62.	లవణాసురుని ఆహారాదుల విషయమున రాముడు మునులను ప్రశ్నించుట. వానిని చంపుటకై శత్రుఘ్నుని ఉత్సాహము తెలిసికొని అతనిని ఆ కార్యమునకై ఆజ్ఞాపించుట.	275

సర్గసంఖ్య	విషయము	పుట
63.	రాముడు శత్రుఘ్నుణ్ణి మధురాజ్యమునందు అభిషిక్తుని చేసి లవణుని శూలమునుండి ఆత్మరక్ష చేసికొను ఉపాయమును చెప్పుట.	283
64.	రాముని ఆజ్ఞచేత శత్రుఘ్నుడు ముందుగా సైన్యమును పంపి ఒక మాసము తరువాత మధురకు ప్రయాణమై వెళ్లుట.	294
65.	వాల్మీకి శత్రుఘ్నునకు సౌదాసుడైన కల్మాషపాదుని కథ చెప్పుట.	301
66.	సీత ఇద్దరు పుత్రులను కనుట. వాల్మీకి ఆ శిశువులకు రక్షణము ఏర్పరచుట. ఈ విషయము విని శత్రుఘ్నుడు సంతోషించి, అక్కడినుండి బయలుదేరి యమునాతటమునకు వెళ్లుట.	315
67.	చ్యవనుడు శత్రుఘ్నునకు లవణాసురుని శూలమునకు గల శక్తిని చెప్పుచు, పూర్వము జరిగిన మాంధాత వధను గూర్చి తెలుపుట.	322
68.	లవణాసురుడు ఆహారముకొరకై బయలుదేరుట. శత్రుఘ్నుడు మధురాపురద్వారమునందు నిలచి ఉండుట. తిరిగివచ్చిన లవణునితో అతని సంభాషణము.	332
69.	శత్రుఘ్న లవణాసురుల యుద్ధము. లవణుని సంహారము.	348
70.	శత్రుఘ్నుడు దేవతలనుండి వరములను పొందుట. మధుపురిని నిర్మించి పిదప రామునివద్దకు వెళ్ళవలెనని అతడు సంకల్పించుట.	354
71.	స్వల్పమైన సైన్యము తీసికొని శత్రుఘ్నుడు అయోధ్యకు బయలుదేరుట. మార్గమధ్యములో వాల్మీక్యాశ్రమమునందు శ్రీరామచరిత గానమును విని వారందరు ఆశ్చర్యమును చెందుట.	361
72.	శత్రుఘ్నుడు వాల్మీకి అనుజ్ఞ పొంది, అయోధ్యకు వెళ్ళి రామాదులతో కలిసి, అక్కడ ఏడురోజులు ఉండి, మరల మధురకు బయలుదేరి వెళ్లుట.	370
73.	ఒకానొక బ్రాహ్మణుడు మరణించిన బాలుడైన పుత్రుణ్ణి తీసికొని రాజద్వారము వద్దకు వచ్చి విలపించుట.	378

సర్గసంఖ్య	విషయము	పుట
74.	'తపస్సు చేయుచున్న శూద్రుడు అధర్మము చేయుటయే బ్రాహ్మణ పుత్రుని మరణమునకు హేతువు' అని నారదుడు రామునకు తెలుపుట.	386
75.	రాముడు పుష్పకము నెక్కి తన రాజ్యములో అంతటా తిరుగుచు పాపకర్మలు జరుగుచున్నవా అని అన్వేషించుట. అంతటా పుణ్యకర్మలే జరుగుచుండుట చూచుట, దక్షిణదిక్కున తపస్సు చేయుచున్న శూద్రునివద్దకు వెళ్లుట.	399
76.	రాముడు శంబూకుణ్ణి వధించుట; దేవతలు ప్రశంసించుట, అగస్త్యాశ్రమములో అగస్త్యుడు రాముణ్ణి సత్కరించి, అతనికి అలంకారమును ఇచ్చుట.	406
77.	అగస్త్యుడు రామునకు స్వర్గములో ఉండు ఒక పురుషుడు శవమును భక్షించిన కథ చెప్పుట.	424
78.	శ్వేతుడు తనకు కుత్సితమైన ఆహారము తినవలసివచ్చినందుకు కారణమును అగస్త్యునకు చెప్పుట. బ్రహ్మతో తనకు జరిగిన సంభాషణమును తెలుపుట. అగస్త్యునకు దివ్యాలంకారమును దానము చేయుటచే అతడు ఆకలిదప్పులనుండి విముక్తుడగుట.	432
79.	ఇక్ష్వాకుపుత్రుడైన దండుని రాజ్యము.	442
80.	దండుడు శుక్రాచార్యుని పుత్రిని బలాత్కరించుట.	450
81.	శుక్రాచార్యుని శాపముచేత దండుడు, వాని రాజ్యము నశించుట.	457
82	రాముడు అగస్త్యాశ్రమమునుండి అయోధ్యకు బయలుదేరుట.	465
83.	భరతుడు సలహా చెప్పగా రాముడు రాజసూయయాగము చేయు ప్రయత్నమునుండి విరమించుట.	473
84.	లక్ష్మణుడు అశ్వమేధయాగమును గూర్చి చెప్పుచు ఇంద్రవృత్రుల కథను చెప్పుట. వృత్రుడు తపస్సు చేయుట. అతనిని చంపుమని ఇంద్రుడు విష్ణువును ప్రార్థించుట.	481

సర్గ సంఖ్య	విషయము	పుట
85.	ఇంద్రునిలోను, వాని వజ్రాయుధములోను విష్ణుతేజస్సు ప్రవేశించుట. ఇంద్రుని వజ్రాయుధము చేత వృత్రాసురుని సంహారము. బ్రహ్మహత్య ఆవహించిన ఇంద్రుడు తమోమయమైన ప్రదేశములోనికి వెళ్ళిపోవుట.	488
86.	ఇంద్రుడు లేకపోవుటచే జగత్తులో అశాంతి పెరుగుట. ఇంద్రుడు అశ్వమేధము చేసి బ్రహ్మహత్య నుండి విముక్తుడగుట.	496
87.	రాముడు లక్ష్మణునకు ఇలోపాఖ్యానము చెప్పుట. ఇలుడు ఒక మాసము పాటు స్త్రీగాను, ఒక మాసము పురుషుడుగాను ఉండుట.	504
88.	ఇలాబుధుల పరస్పర దర్శనము. ఇలా సహచారిణులకు కింపురుషి అను పేరు పెట్టి బుధుడు వాళ్ళను పర్వతముమీద నివసింపు డని పంపుట.	515
89.	ఇలాబుధులకు పురూరవుడు అను పుత్రుడు పుట్టుట.	524
90.	అశ్వమేధయాగము చేయుటచే ఇలకు పురుషత్వము లభించుట.	533
91.	రాముని ఆజ్ఞచేత అశ్వమేధయాగమునకు ఏర్పాటు జరుగుట.	542
92.	రాముని అశ్వమేధయాగములో దానగౌరవములు బాగా జరుగుట.	552
93.	వాల్మీకి రాముని యజ్ఞమునకు వచ్చుట. రామాయణము గానము చేయుడని వాల్మీకి కుశలవులను ఆదేశించుట.	559
94.	కుశలవులు రామాయణము గానము చేయుట. రాముడు ఆ గానమును సభలో వినుట.	566
95.	సీత తన పరిశుద్ధత్వము విషయమున శపథము చేయవలె నని రాముడు అనుట.	577
96.	సీత పరిశుద్ధురాలని వాల్మీకి ఘోషించుట.	583
97.	సీత శపథము చేయుట. రసాతలములో ప్రవేశించుట.	591
98.	సీతకై రాముని శోకము, బ్రహ్మదేవుడు ఓదార్చి ఉత్తరకాండ శేషమును వినుమని చెప్పుట.	600

సర్గ సంఖ్య	విషయము	పుట
99.	సీత రసాతలములో ప్రవేశించిన విమ్మట రాముని జీవన విధానము. రామరాజ్యములోని పరిస్థితులు. రాముని తల్లులు స్వర్గస్థులగుట.	611
100.	కేకయదేశమునుండి కానుకలు తీసికొని గార్గ్యుడు వచ్చుట. అతడు తీసికొని వచ్చిన సందేశమును అనుసరించి భరతుడు రాముని ఆజ్ఞచేత, ఇద్దరు కుమారులతో కలిసి గంధర్వదేశమును ఆక్రమించుటకు వెళ్ళుట.	619
101.	భరతుడు గంధర్వులను సంహరించి, రెండు పురములను నెలకొల్పి వాటిని పుత్రులిద్దరికీ ఇచ్చి, మరల అయోధ్యకు తిరిగివచ్చుట.	628
102.	రాముని ఆజ్ఞను అనుసరించి భరత లక్ష్మణులు కారుపథ ప్రదేశమునందు వేరు వేరు రాజ్యములలో లక్ష్మణుని పుత్రులైన అంగద చంద్రకేతువులను నియమించుట.	635
103.	రామునివద్దకు కాలపురుషుడు వచ్చుట. ఒక సమయము (షరతు) పెట్టి ఆ కాలపురుషుడు రామునితో మాటలాడుటకు ఉద్యమించుట.	642
104.	కాలపురుషుడు రామునకు బ్రహ్మదేవుని సందేశము చెప్పుట. రాముడు అంగీకరించుట.	649
105.	దుర్వాసుడు శపించు ననే భయముచేత లక్ష్మణుడు నియమభంగమైనను లెక్కచేయక రాముని దగ్గరకు వచ్చి అతని రాకను గూర్చి చెప్పుట. రాముడు దుర్వాసునకు భోజనము పెట్టుట. అతడు వెళ్ళిపోయిన పిమ్మట రామునకు లక్ష్మణుని విషయమున చింత కలుగుట.	656
106.	రామునిచే విడువబడిన లక్ష్మణుడు శరీరముతో స్వర్గమునకు వెళ్లుట.	663
107.	వసిష్ఠుని ఆజ్ఞప్రకారము పౌరు లందరిని తనతో పరమధామమునకు	

సర్గ సంఖ్య	విషయము	పుట
	తీసికొని వెళ్ళవలె నని రాముడు ఆలోచించుట. కుశలవులను రాజ్యము నందు అభిషిక్తులను చేయుట.	669
108.	సోదరులతోను, వానరులతోను. భల్లూకములతోను కలిసి పరమ ధామము నకు వెళ్ళవలె నని రాముడు నిశ్చయించుకొనుట. మీరు భూలోకమునందే ఉండుడు అని విభీషణ-హనుమత్-జాంబవత్-మైంద-ద్వివిదులను ఆజ్ఞాపించుట.	677
109.	పరమధామమును చేరుటకై బయలుదేరిన రామునితో అయోధ్యా వాసులందరూ కూడ బయలుదేరుట.	691
110.	సోదరసహితుడైన రాముడు తన వైష్ణవతేజస్సులో ప్రవేశించుట. ఆ రామునితో వచ్చినవారి కందరికీ సంతానక మను లోకము లభించుట.	699
111.	శ్రీమద్రామాయణ మాహాత్మ్యము.	710

T R. కృష్ణాచార్య సంపాదకులుగా, T.R. వెంకోబాచార్య ప్రకాశకులుగా, హిందీ ప్రచార్ ప్రెస్, మద్రాసువారు ముద్రాపకులుగా 1930 లో ప్రచురింపబడిన శ్రీమద్రామాయణం ఉత్తరకాండ ప్రతిలో ఈ క్రింది శ్లోకం అధికంగా కనిపిస్తున్నది-

భూతాని దేవతాబుద్ధ్యా దేవతాగురుబుద్ధితః,
గురూంశ్చ పరమాత్మేతి నిత్యం పశ్యతి ధర్మపః.

ఉత్తరకాండ స. 48. శ్లో. 16



భద్రాచల శ్రీ సీతారామలక్ష్మణులు

వామాంకస్థితజానకీ పరిలసత్కోదండదండం కరే
చక్రం చోర్ధ్వకరేణ బాహుయుగళే శంఖం శరం దక్షిణే,
బిభ్రాణం జలజాతపత్రనయనం భద్రాద్రిమూర్ధ్ని స్థితం
కేయూరాదివిభూషితం రఘుపతిం సౌమిత్రియుక్తం భజే.

శ్రీః

ఓం స్వస్తి శ్రీ గణేశాయ నమః

శ్రీరామచన్ద్ర పరబ్రహ్మణే నమః

'బాలానందినీ' సహితమగు

శ్రీమద్రామాయణము - ఉత్తరకాండము

(రెండవ సంపుటము)

అష్టాత్రింశః సర్గః

[రాముడు చేసిన సత్కారములు అందుకొని జనకాదులు తమ తమ దేశములకు వెళ్లుట.]

మూ. ఏవమాస్తే మహాబాహురహన్యహని రాఘవః,
ప్రశాసన్ సర్వకార్యాణి పౌరజానపదేషు చ. 1

ప్ర. అ. మహాబాహుః = గొప్ప బాహువులు గల, రాఘవః = రాముడు, అహని అహని = ప్రతి దివసమునందూ, పౌరజానపదేషు = పౌరులయందు జానపదులయందు, సర్వకార్యాణి = సమస్త కార్యములను, ఏవమ్ = ఈ విధముగా, ప్రశాసన్ = శాసించుచు, ఆస్తే = ఉన్నాడు.

తా. మహాబాహువైన రాముడు ఈ విధముగా ప్రతిదివసమునందు పౌర జానపదులను వారి వారి కర్తవ్యములయందు నియమించుచు ఉండెను. 1

మూ. తతః కతిపయాహస్సు వైదేహం మిథిలాధిపమ్,
రాఘవః ప్రాఞ్జలిర్భూత్వా వాక్యమేతదువాచ హ. 2

ప్ర. అ. తతః = అటుపిమ్మట, కతిపయాహస్య = కొన్ని రోజులలో, రాఘవః = రాముడు, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడు, భూత్వా = అయి, మిథిలాధిపమ్ = మిథిలానగరప్రభువైన, వైదేహమ్ = జనకుని గూర్చి, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. కొన్ని రోజులు గడచిన పిమ్మట రాముడు అంజలి ఘటించి మిథిలాధిపతి యైన జనకునితో ఇట్లు పలికెను. 2

మూ. భవాన్ హి గతిరవ్యగ్రా భవతా పాలితా వయమ్,
భవతస్తేజసోగ్రేణ రావణో నిహతో మయా. 3

ప్ర. అ. భవాన్ = నీవు, అవ్యగ్రా = అచంచలమైన, గతిః = గతివి వయమ్ = మేము, భవతా = నీచేతనే, పాలితాః = పాలించబడినాము. భవతః = నీయొక్క, ఉగ్రేణ = ఉగ్రమైన, తేజసా = తేజస్సుచేత, మయా = నాచేత, రావణః = రావణుడు, నిహతః = చంపబడినాడు.

తా. నీవే మాకు అచంచలమైన ఆశ్రయము. నీచేతనే మేము పాలించబడినాము. ఉగ్రమైన నీ తేజస్సుచేతనే నేను రావణుణ్ణి చంపగలిగితిని. 3

మూ. ఇక్ష్వాకూణాం చ సర్వేషాం మైథిలానాం చ సర్వశః,
అతులాః ప్రీతయో రాజన్ సంబన్ధకపురోగమాః. 4

ప్ర. అ. రాజన్ = రాజా! సర్వేషామ్ = సమస్తమైన, ఇక్ష్వాకూణామ్ = ఇక్ష్వాకువంశీయులకు, మైథిలానాం చ = మిథిలానగరరాజులకు, సర్వశః = అన్ని ప్రకారములచేతనూ కూడ, సంబన్ధపురోగమాః = సంబంధము మొదలైన, అతులాః = సాటిలేని, ప్రీతయః = ప్రేమలు ఉన్నవి.

తా. రాజా! ఇక్ష్వాకువంశీయులకూ మిథిలారాజులకు మధ్య అన్ని ప్రకారములచేతను వియ్యము మొదలైన ప్రేమలు సాటిలేనివిగా ఉన్నవి. 4

మూ. తద్భవాన్ స్వపురం యాతు రత్నాన్యాదాయ పార్థివ,
భరతశ్చ సహాయార్థం పృష్ఠతశ్చానుయాస్యతి. 5

ప్ర. అ. పార్థివ = రాజా! తత్ = ఆ కారణమువలన, భవాన్ = నీవు,

రత్నాని=రత్నములను, ఆదాయ=గ్రహించి, స్వపురమ్=నీ పురమును గూర్చి, యాతు = వెళ్లెదవు గాక. భరతః చ = భరతుడు కూడ, సహాయార్థమ్ = సహాయముకొరకై, పృష్ఠతః = వెనుక, అనుయాస్యతి = అనుసరించి రాగలడు.

తా. అందువలన ఓ రాజా! నేను బహూకరించు రత్నములు స్వీకరించి నీవు నీ నగరమునకు వెళ్ళుము. నీకు సహాయుడుగా భరతుడు నీ వెనుకనే రాగలడు. 5

మూ. స తథేతి తతః కృత్వా రాఘవం వాక్యమబ్రవీత్,
ప్రీతోఽస్మి భవతో రాజన్ దర్శనేన నయేన చ. 6

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సః = అతడు, తథా ఇతి = అట్లే అని, కృత్వా = చేసి, రాఘవమ్ = రాముణ్ణి గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. రాజన్ = రాజా! భవతః = నీయొక్క, దర్శనేన = దర్శనముచేత, నయేన చ = నీతిచేత, ప్రీతః అస్మి = సంతోషించినవాడను అయితిని.

తా. జనకుడు 'అట్లే' అని ప్రయాణమై రామునితో ఇట్లనెను. "రాజా! నీ దర్శనము చేతా, నీతిచేతా చాలా సంతోషించినాను". 6

మూ. యాన్యేతాని తు రత్నాని మదర్థం సంచితాని వై,
దుహిత్రోస్తాన్యహం రాజన్ సర్వాణ్యేవ దదామి వై. 7

ప్ర. అ. రాజన్ = రాజా! ఏతాని = ఈ, యాని రత్నాని = ఏ రత్నములు, మదర్థమ్ = నాకొరకై, సంచితాని వై = ప్రోగుచేయబడినవో, తాని = వాటిని, సర్వాణి = అన్నింటినీ, అహమ్ = నేను, దుహిత్రోః = కుమార్తె లిద్దరికీ, దదామి వై = ఇచ్చుచున్నాను.

తా. రాజా! నీవు నాకోసమై ఇచ్చిన ఈ రత్నములను (శ్రేష్ఠములైన వస్తువులు, మణులు మొదలైనవాటిని) అన్నింటినీ నా ఇద్దరు కుమార్తెలకు ఇచ్చుచున్నాను. 7

మూ. ఏవముక్త్వా తు కాకుత్స్థం జనకో హృష్టమానసః,
ప్రయయౌ మిథిలాం శ్రీమాంస్తమనుజ్ఞాయ రాఘవమ్. 8

ప్ర. అ. శ్రీమాన్ = శోభాయుక్తుడైన, జనకః = జనకుడు, కాకుత్స్థమ్ = రాముణ్ణి గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, హృష్టమానసః = సంతోషించిన మనస్సు కలవాడై, తం రాఘవమ్ = ఆ రాముణ్ణి, అనుజ్ఞాయ = అనుజ్ఞ ఇచ్చి, మిథిలామ్ = మిథిలను గూర్చి, ప్రయయౌ = వెళ్లెను.

తా. శ్రీమంతుడైన జనకుడు రామునితో ఇట్లు పలికి, సంతోషించిన మనస్సుతో రామునకు అనుజ్ఞ ఇచ్చి మిథిలకు వెళ్లెను. 8

మూ. తతః ప్రయాతే జనకే కేకయం మాతులం ప్రభుమ్,
రాఘవః ప్రాఞ్జలిర్భూత్వా వినయాద్వాక్యమబ్రవీత్. 9

ప్ర. అ. తతః = అటుపిమ్మట, జనకే = జనకుడు, ప్రయాతే = వెళ్ళిన వాడగుచుండగా, రాఘవః = రాముడు, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడు, భూత్వా = అయి, ప్రభుమ్ = ప్రభువు, మాతులమ్ = మేనమామ అయిన, కేకయమ్ = కేకయదేశరాజును గూర్చి, వినయాత్ = వినయమువలన, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. జనకుడు వెళ్ళిపోయిన పిమ్మట రాముడు అంజలి ఘటించి మేనమామయైన కేకయరాజుతో (యుధాజిత్తుతో) వినయపూర్వకముగా ఇట్లు పలికెను. 9

మూ. ఇదం రాజ్యమహం చైవ భరతశ్చ సలక్ష్మణః,
ఆయత్తాస్త్వం హి నో రాజన్ గతిశ్చ పురుషర్షభ. 10

ప్ర. అ. పురుషర్షభ = పురుషులలో శ్రేష్ఠుడా! రాజన్ = రాజా! ఇదమ్ = ఈ, రాజ్యమ్ = రాజ్యమూ, అహం చైవ = నేనూ, సలక్ష్మణః = లక్ష్మణునితో కూడిన, భరతః చ = భరతుడు, ఆయత్తాః = నీయందు ఆధీనమైనవారము. త్వమ్ = నీవు, నః = మాకు, గతిః చ = గతివి కూడ.

తా. పురుషశ్రేష్ఠుడవైన ఓ! రాజా! ఈ రాజ్యము, నేను, భరతుడు లక్ష్మణుడూ కూడ నీమీద ఆధారపడినవాళ్లము. నీవే మాకు గతివి. 10

మూ. రాజా హి వృద్ధః సంతాపం త్వదర్థముపయాస్యతి,
తస్మాద్గమనమద్యైవ రోచయే తవ పార్థివ. 11

ప్ర. అ. వృద్ధః = వృద్ధుడైన, రాజా = రాజు. త్వదర్థమ్=నీ నిమిత్తము, సంతాపమ్ = దుఃఖమును, ఉపయాస్యతి=పొందగలడు, తస్మాత్ = ఆ కారణము వలన, పార్థివ = రాజా! ఆద్యైవ = నేడే, తవ = నీయొక్క, గమనమ్ = గమనమును, రోచయే = ఇష్టపడుచున్నాను.

తా. రాజా! వృద్ధుడైన రాజు నీనిమిత్తము తాపము చెందుచుండును. అందువలన నీవు నేడే బయలుదేరి వెళ్ళుట మంచిదని నా అభిప్రాయము. 11

మూ. లక్ష్మణేనానుయాత్రేణ పృష్ఠతోఽనుగమిష్యతే,
ధనమాదాయ బహులం రత్నాని వివిధాని చ. 12

ప్ర. అ. బహులమ్ = అధికమైన, ధనమ్ = ధనమును, వివిధాని = ఆనేక విధములైన, రత్నాని చ = రత్నములను, ఆదాయ = తీసికొని, అనుయాత్రేణ= కూడావచ్చి, లక్ష్మణేన = లక్ష్మణునిచేత, అనుగమిష్యతే = అనుసరించి గమనము చేయబడును.

తా. అధికమైన ధనము అనేకవిధములైన రత్నములూ తీసికొని లక్ష్మణుడు నీ వెనుక రాగలడు. 12

మూ. యుధాజిత్తు తథేత్యాహ గమనం ప్రతి రాఘవమ్,
రత్నాని చ ధనం చైవ త్వయ్యేవాక్షయ్యమస్త్వితి. 13

ప్ర. అ. యుధాజిత్తు = యుధాజిత్తైతే, గమనం పతి=గమనమును గూర్చి, రాఘవమ్ = రాముణ్ణి, తథేతి = అట్లే అని, ఆహ = పలికెను. రత్నాని = రత్నములు, అక్షయ్యమ్ = అక్షయమైన, ధనం చైవ = ధనమూ, త్వయ్యేవ = నీయందే, అస్తు = ఉండుగాక, ఇతి = అని పలికెను.

తా. యుధాజిత్తు గమనమును గూర్చి అంగీకరించి, "రత్నములు అక్షయమైన ఈ ధనము కూడ నీవద్దనే ఉండుగాక" అని పలికెను. 13

మూ. ప్రదక్షిణం చ రాజానం కృత్వా కేకయవర్ధనః,
రామేణ చ కృతః పూర్వమభివాద్య ప్రదక్షిణమ్. 14

ప్ర. అ. పూర్వమ్ = ముందుగా, రామేణ = రామునిచేత, అభివాద్య =

నమస్కరించి, ప్రదక్షిణమ్ = ప్రదక్షిణము, కృతః = చేయబడిన, కేకయవర్ధనః = కేకయదేశమును వృద్ధిపొందించు యుధాజిత్తు, రాజానమ్ = రాముణ్ణి, ప్రదక్షిణం కృత్వా = ప్రదక్షిణము చేసి బయలుదేరెను.

తా. ముందుగా రాముడు యుధాజిత్తునకు ప్రదక్షిణనమస్కారాలు చేసెను. పిమ్మట యుధాజిత్తు రామునకు ప్రదక్షిణముచేసి (బయలుదేరెను.) 14

మూ. లక్ష్మణేన సహాయేన ప్రయాతః కేకయేశ్వరః,
హతేఽసురే యథా వృత్రే విష్ణునా సహ వాసవః. 15

ప్ర. అ. వృత్రే అసురే = వృత్రాసురుడు, హతే = చంపబడినవాడగుచుండగా, విష్ణునా సహ = విష్ణువుతో కూడ, వాసవః యథా = దేవేంద్రుడు వలె, కేకయేశ్వరః = కేకయదేశరాజు, సహాయేన = సహాయుడైన, లక్ష్మణేన = లక్ష్మణునితో కూడ, ప్రయాతః = వెళ్ళినాడు.

తా. వృత్రసంహారానంతరము దేవేంద్రుడు విష్ణువుతో కలిసి వెళ్ళినట్లు సహాయుడుగా వచ్చిన లక్ష్మణునితో కలిసి కేకయదేశరాజు వెళ్లెను. 15

మూ. తం విసృజ్య తతో రామో వయస్య మకుతోభయమ్,
ప్రతర్దనం కాశిపతిం పరిష్వజ్యేదమబ్రవీత్. 16

ప్ర. అ. రామః = రాముడు, తమ్ = అతనిని, విసృజ్య = పంపివేసి, తతః = అటుపిమ్మట, వయస్యమ్ = తన మిత్రుడు, అకుతోభయమ్ = ఎవరికీ భయపడనివాడు, కాశిపతిమ్ = కాశీరాజు అయిన, ప్రతర్దనమ్ = ప్రతర్దనుణ్ణి, పరిష్వజ్య = కౌగలించుకొని, ఇదమ్ = ఈ వాక్యము, అబ్రవీత్ = పలికెను.

తా. రాముడు యుధాజిత్తును పంపివేసిన పిమ్మట, తన మిత్రుడూ, ఎవరికీ భయపడనివాడూ అయిన కాశిరాజైన ప్రతర్దనుణ్ణి కౌగలించుకొని ఇట్లు పలికెను. 16

మూ. దర్శితా భవతా ప్రీతిర్దర్శితం సౌహృదం పరమ్,
ఉద్యోగశ్చ త్వయా రాజన్ భరతేన కృతః సహ. 17

ప్ర. అ. రాజన్ = రాజా! భవతా = నీచేత, ప్రీతిః = ప్రేమ, దర్శితా =

చూపబడినది. పరమ్ = అధికమైన, సౌహృదమ్ = స్నేహము, దర్శితమ్ = చూపబడినది. త్వయా = నీచేత, భరతేన సహ = భరతునితో కూడ, ఉద్యోగః చ = ప్రయత్నము కూడ, కృతః = చేయబడినది.

తా. రాజా! నీవు ప్రేమను, గొప్ప స్నేహమును చూపినావు. భరతుతోని కలిసి రాజ్యపాలనాది కార్యములను నిర్వహించినావు. 17

మూ. తద్భవానద్య కాశేయ పురీం వారాణసీం వ్రజ,
రమణీయాం త్వయా గుప్తాం సుప్రాకారాం సుతోరణామ్.

ప్ర. అ. కాశేయ = కాశీరాజా! తత్ = ఆ కారణమువలన, అద్య = ఇప్పుడు, త్వయా = నీచేత, గుప్తామ్ = రక్షించబడినది, సుప్రాకారామ్ = మంచి ప్రాకారములు గలది, సుతోరణామ్ = మంచి ముఖద్వారములు గలదీ, రమణీయామ్ = సుందరమూ అయిన, వారాణసీం పురీమ్ = వారాణసిని గూర్చి, వ్రజ = వెళ్ళుము.

తా. ఓ కాశిరాజా! అందువలన నీవిపుడు నీచేత రక్షింపబడుచున్న మంచి ప్రాకారములు, ముఖద్వారములూ ఉన్న సుందరమైన వారాణసికి వెళ్లుము. 18

మూ. ఏతావదుక్త్వా చోత్థాయ కాకుత్థ్సః పరమాసనాత్,
పర్యష్వజత ధర్మాత్మా నిరన్తరమురోగతమ్. 19

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, కాకుత్థ్సః = రాముడు, ఏతావత్ = ఇంత మాత్రము, ఉక్త్వా = పలికి, పరమాసనాత్ = సింహాసనమునుండి, ఉత్థాయ = లేచి, ఉరోగతమ్ = వక్షస్థలము దగ్గర ఉన్న అతనిని, నిరన్తరమ్ = గాఢముగా పర్యష్వజత = కౌగలించుకొనెను.

తా. ధర్మాత్ముడైన రాముడు ఇట్లు పలికి సింహాసనమునుండి లేచి అతనిని గాఢముగా కౌగలించుకొనెను. 19

మూ. విసర్జయామాస తదా కౌసల్యాప్రీతివర్ధనః,
రాఘవేణ కృతానుజ్ఞః కాశీయో హ్యకుతోభయః, 20
వారాణసీం యయౌ తూర్ణం రాఘవేణ విసర్జితః.

ప్ర. అ. తదా = అప్పుడు, కౌసల్యాప్రీతివర్ధనః = కౌసల్యయొక్క ఆనందమును వృద్ధి పొందించు రాముడు, విసర్జయామాస = వెళ్ళుటకు అనుజ్ఞ ఇచ్చెను.

రాఘవేణ = రామునిచేత, కృతానుజ్ఞః = చేయబడిన అనుజ్ఞ గల, అకుతోభయః = ఎటునుండీ భయము లేని, కాశిరాజః = కాశిరాజు, రాఘవేణ = రామునిచేత, విసర్జితః = పంపబడిన వాడై, తూర్ణమ్ = శీఘ్రముగా, వారాణసీమ్ = వారాణసిని గూర్చి, యయౌ = వెళ్ళెను.

తా. అప్పుడు రాముడు ఆతనిని పంపివేసెను. రాముని అనుజ్ఞ పొంది, ఎవరికీ భయపడని ఆ కాశిరాజు, రాముడు పంపుటచే శీఘ్రముగా వారాణసికి వెళ్ళెను. 20

మూ. విసృజ్య తం కాశిపతిం త్రిశతం పృథివీపతీన్, 21
ప్రహసన్ రాఘవో వాక్యమువాచ మధురాక్షరమ్.

ప్ర. అ. రాఘవః = రాముడు, తమ్ = ఆ, కాశిపతిమ్ = కాశిరాజును, విసృజ్య = పంపివేసి, ప్రహసన్ = నవ్వుచు, త్రిశతమ్ = మూడువందల, పృథివీపతీన్ = రాజులను గూర్చి, మధురాక్షరమ్ = మధురమైన అక్షరములు గల, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. రాముడు ఆ కాశిరాజును పంపివేసిన తరువాత మూడు వందలమంది రాజులను కలిసికొని నవ్వుచు మధురమైన మాటలతో ఇట్లు పలికెను. 21

మూ. భవతాం ప్రీతిరవ్యగ్రా తేజసా పరిరక్షితా, 22
ధర్మశ్చ నియతో నిత్యం సత్యం చ భవతాం సదా.

ప్ర. అ. భవతామ్ = మీయొక్క, తేజసా = తేజస్సుచేత, అవ్యగ్రా = ఒడుదుడుకులు లేని, ప్రీతిః = ప్రేమ, పరిరక్షితా = రక్షింపబడినది. భవతామ్ = మీయొక్క, ధర్మః చ = ధర్మము కూడ, నిత్యమ్ = నిత్యమూ, నియతః = స్థిరమైనది. సత్యం చ = సత్యము కూడ, సదా = ఎల్లప్పుడూ స్థిరమైనది.

తా. మీ తేజస్సుచేత స్నేహమునకు ఎట్టి ఒడుదుడుకులూ లేకుండ రక్షింపబడినది. మీలో ధర్మమూ, సత్యమూ కూడా నిత్యము స్థిరముగా ఉన్నవి. 22

మూ. యుష్మాకం చానుభావేన తేజసా చ మహాత్మనామ్, 23
హతో దురాత్మా దుర్బుద్ధీ రావణో రాక్షసాధమః.

ప్ర. అ. మహాత్మనామ్ = మహాత్ములైన, యుష్మాకమ్ = మీయొక్క, తేజసా = తేజస్సుచేత, ఆనుభావేన = సామర్థ్యముచేత, దురాత్మా = దురాత్ముడూ, దుర్బుద్ధిః = చెడ్డ బుద్ధిగలవాడు, రాక్షసాధమః = రాక్షసాధముడూ అయిన, రావణః = రావణుడు, హతః = చంపబడినాడు.

తా. మహాత్ములైన మీ ప్రభావముచేత, తేజస్సుచేతా దురాత్ముడూ, దుర్బుద్ధికలవాడు, రాక్షసాధముడూ అయిన రావణుడు చంపబడినాడు. 23

మూ హేతుమాత్రమహం తత్ర భవతాం తేజసా హతః, 24
రావణః సగణో యుద్ధే సపుత్రామాత్యబాన్ధవః.

ప్ర. అ. అహమ్ = నేను, తత్ర = ఆ చంపుటయందు, హేతుమాత్రమ్ = కేవలము హేతువుమాత్రమే. సగణః = గణములతో కూడిన, సపుత్రామాత్యబాన్ధవః = పుత్రులతోను, అమాత్యులతోను, బంధువులతోనూ కూడిన, రావణః = రావణుడు, యుద్ధే = యుద్ధమునందు, భవతామ్ = మీయొక్క, తేజసా = తేజస్సుచేత, హతః = చంపబడినాడు.

తా. రావణుడు, వాని సైన్యము, వాని పుత్రులు, అమాత్యులు బంధువులు యుద్ధములో మీ తేజస్సుచేతనే చంపబడినారు. నేను కేవలం నిమిత్తమాత్రమే. 24

మూ. భవన్తశ్చ సమానీతా భరతేన మహాత్మనా, 25
శ్రుత్వా జనకరాజస్య కాననాత్తనయాం హృతామ్.

ప్ర. అ. జనకరాజస్య = జనకునియొక్క, తనయామ్ = కుమార్తెను, కాననాత్ = అడవినుండి, హృతామ్ = హరించబడినదానినిగా, శ్రుత్వా = విని, మహాత్మనా = మహాత్ముడైన, భరతేన = భరతునిచేత, భవన్తః = మీరు, సమానీతాః = తీసికొనిరాబడినారు.

తా. అరణ్యమునుండి సీత అపహరించబడి నట్లు విని మహాత్ముడైన భరతుడు మిమ్ములను అందరినీ పిలిపించినాడు. 25

మూ. ఉద్యుక్తానాం చ సర్వేషాం పార్థివానాం మహాత్మనామ్, 26
కాలోఽప్యతీతః సుమహాన్ గమనం రోచయామ్యతః.

ప్ర. అ. ఉద్యుక్తానామ్ = యుద్ధసంనద్ధులైన, సర్వేషామ్ = సమస్తమైన, మహాత్మనామ్ = మహాత్ము లైన, పార్థివానామ్ = రాజులకు, సుమహాన్ = చాల గొప్పదైన, కాలః అపి = కాలము కూడ, అతీతః = గడచినది. అతః = అందు వలన, గమనమ్ = వెళ్ళుటను, రోచయామి = ఇష్టపడుచున్నాను.

తా. యుద్ధోద్యుక్తులై మీరందరూ వచ్చి చాల కాలము గడచిపోయినది. అందుచేత మీరందరూ తిరిగి వెళ్ళుట మంచి దని అనుకొనుచున్నాను. 26

మూ. ప్రత్యూచుస్తం చ రాజానో హర్షేణ మహతా వృతాః, 27
దిష్ట్యా త్వం విజయీ రామ రాజ్యం చాపి ప్రతిష్ఠితమ్,
దిష్ట్యా ప్రత్యాహృతా సీతా దిష్ట్యా శత్రుః పరాజితః. 28

ప్ర. అ. రాజానః = రాజులు, మహతా = గొప్ప, హర్షేణ = సంతోషముతో, వృతాః = కూడినవారై, ప్రత్యూచుః = తిరిగి పలికిరి. రామ = రామా! దిష్ట్యా = అదృష్టవశముచేత, త్వమ్ = నీవు, విజయీ = విజయముగలవాడవు. రాజ్యం చాపి = రాజ్యము కూడ, ప్రతిష్ఠితమ్ = ప్రతిష్ఠింపచేయబడినది. దిష్ట్యా = అదృష్ట వశముచేత, సీతా = సీత, ప్రత్యాహృతా = తిరిగి తీసికొనిరాబడినది. దిష్ట్యా = అదృష్టవశముచేత, శత్రుః = శత్రువు, పరాజితః = ఓడించబడినాడు.

తా. ఆ రాజులు చాల సంతోషించుచు ఇట్లు బదులు చెప్పిరి - "రామా! అదృష్టవశముచేత నీవు విజయము పొందినావు. రాజ్యమును నిలిపినావు. అదృష్ట వశముచేత శత్రువును ఓడించి సీతను తిరిగి తీసికొనివచ్చినావు. 27, 28

మూ. ఏష నః పరమః కామ ఏషా నః ప్రీతిరుత్తమా,
యత్త్వాం విజయినం రామ పశ్యామో హతశాత్రవమ్. 29

ప్ర. అ. రామ = రామా! విజయినమ్ = విజయవంతుడవైన, హతశాత్ర వమ్ = చంపబడిన శత్రువులు గల, త్వామ్ = నిన్ను, యత్ పశ్యామః = చూచు చున్నా మనేది ఏది కలదో, ఏషః = ఇది, నః = మాయొక్క, పరమః = గొప్ప, కామః = కోరిక. నః = మాయొక్క, ఉత్తమా = ఉత్తమమైన, ప్రీతిః = ఆనందము.

తా. రామా! శత్రువులను సంహరించి విజయవంతుడవైన నిన్ను చూడ గలుగుచున్నాము. ఇదియే మా గొప్ప కోరిక. ఇదియే మా గొప్ప సంతోషము.

మూ. ఏతత్త్వయ్యుపపన్నం చ య దస్మాం స్త్వం ప్రశంససే,
ప్రశంసార్హ న జానీమః ప్రశంసాం వక్తుమీదృశీమ్. 30

ప్ర. అ. ప్రశంసార్హ=ప్రశంసకు తగినవాడా! త్వమ్=నీవు, అస్మాన్=మమ్ములను, ప్రశంససే ఇతి యత్=ప్రశంసించుచున్నావు అనునది ఏది గలదో, ఏతత్=ఇది, త్వయి=నీయందు, ఉపపన్నం చ=తగి ఉన్నది. ఈదృశీమ్=ఇట్టి, ప్రశంసామ్=ప్రశంసను, వక్తుమ్=చెప్పుటకు, న జానీమః=మేము ఎరుగము.

తా. ప్రశంసలకు తగిన రామా! నీవు మమ్ములను ప్రశంసించుచున్నావు. ఇది నీకే తగును. ఇట్టి ప్రశంసలను పలుకుట మేమెరుగము. 30

మూ. ఆపృచ్ఛామో గమిష్యామో హృదిస్థో నః సదా భవాన్,
వర్తామహే మహాబాహో ప్రీత్యాత్ర మహతా వృతాః, 31
భవేచ్చ తే మహారాజ ప్రీతిరస్మాసు సర్వదా.

ప్ర. అ. ఆపృచ్ఛామః=అనుజ్ఞ వేడుచున్నాము. గమిష్యామః=వెళ్ళెదము. భవాన్=నీవు, సదా=ఎల్లప్పుడూ, నః=మాకు, హృదిస్థః=హృదయములో ఉన్నవాడవు. మహాబాహో=గొప్ప బాహువులు గలవాడా! మహతా=గొప్ప, ప్రీత్యా=ప్రేమతో, వృతాః=కూడినవారమై, ఆత్ర=ఇక్కడ, వర్తామహే=ఉంటున్నాము. మహారాజ=మహారాజా! అస్మాసు=మాయందు, సర్వదా=ఎల్లప్పుడూ, ప్రీతిః=ప్రేమ, తే=నీకు, భవేత్ చ=ఉండుగాక!

తా. ఓ! మహాబాహూ! మేము సెలవుతీసికొని వెళ్ళుచున్నాము. నీవు ఎల్లప్పుడూ మా హృదయములలో ఉన్నావు. మేము గొప్ప ప్రేమతో ఇక్కడ ఉంటిమి. మహారాజా! నీకు ఎల్లప్పుడూ మాయందు స్నేహభావము ఉండుగాక.

మూ. బాఢమిత్యేవ రాజానో హర్షేణ పరమాన్వితాః, 32
ఊచుః ప్రాఞ్జలయః సర్వే రాఘవం గమనోత్సుకాః,
పూజితాస్తే చ రామేణ జగ్ముర్దేశాన్ స్వకాన్ స్వకాన్.33

ఇత్యార్షే శ్రీమదాధ్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
అష్టాత్రింశః సర్గః.

ప్ర. అ. బాఢమ్ = తప్పక, ఇత్యేవ = అని, (రామునిచే పలకబడినవారై) హర్షేణ = సంతోషముతో, పరమాన్వితాః = మిక్కిలి కూడిన, సర్వే = సమస్తమైన, రాజానః = రాజులు, గమనోత్సుకాః = వెళ్ళుటయందు ఆసక్తి గలవారై, ప్రాఞ్జలయః = కట్టబడిన దోసిళ్ళు గలవారై, ఊచుః = పలికిరి. తే = వారు, రామేణ = రామునిచేత, పూజితాః = పూజించబడినవారై, స్వకాన్ స్వకాన్ = తమ తమ, దేశాన్ = దేశములను గూర్చి, జగ్ముః = వెళ్ళిరి.

తా. "తప్పక అట్లే"అని రాముడు పలుకగా ఆ రాజులందరూ చాల సంతోషించుచు, వెళ్ళుటకు సిద్ధమైనవారై, దోసిళ్ళు కట్టి రామునితో వెళ్లెద మని చెప్పి, ఆతనిచే పూజింపబడినవారై తమ తమ దేశములకు వెళ్ళిరి. 32

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో ముప్పది ఎనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనచత్వారింశః సర్గః

[రాజులు రామునకు కానుకలు పంపుట, రాముడు వాటిని స్వీకరించి తన మిత్రులైన వానరాదులకు ఇచ్చుట. వానరాదులు అక్కడ సుఖముగా ఉండుట].

మూ. తే ప్రయాతా మహాత్మానః పార్థివాస్తే ప్రహృష్టవత్,
గజవాజిసహస్రౌఘైః కమ్పయన్తో వసుంధరామ్. 1

ప్ర. అ. మహాత్మానః = మహాత్ములైన, తే = ఆ, పార్థివాః = రాజులు, ప్రహృష్టవత్ = సంతోషించినవారై, గజవాజిసహస్రౌఘైః = గజములయొక్క, గుఱ్ఱములయొక్క సహస్రముల సముదాయములచేత, వసున్ధరామ్ = భూమిని, కమ్పయన్తః = కంపింపచేయుచు, ప్రయాతాః = వెళ్ళిరి.

తా. మహాత్ములైన ఆ రాజులు సంతోషించి, వేలకొలది ఏనుగుల, గుఱ్ఱముల సముదాయములచేత భూమిని కంపింపచేయుచు వెళ్ళిరి. 1

మూ. అక్షౌహిణ్యో హి తత్రాసన్ రాఘవాయ సముద్యతాః,
భరతస్యాజ్ఞయానేకాః ప్రహృష్టబలవాహనాః. 2

ప్ర. అ. భరతస్య = భరతునియొక్క, ఆజ్ఞయా = ఆజ్ఞచేత, ప్రహృష్ట బలవాహనాః = సంతోషించిన సైన్యములు, వాహనములూ గల, అక్షౌహిణ్యః = అక్షౌహిణులు, రాఘవాయ = రామునికొరకు, సముద్యతాః = సన్నద్ధమైనవై, తత్ర = అక్కడ, ఆసన్ హి = ఉండెను కదా ?

తా. రామునికి సహాయముగా వెళ్ళుటకై, భరతుని ఆజ్ఞచేత ఉత్సాహముతో కూడిన సైన్యములు, వాహనములూ గల అక్షౌహిణులు అక్కడ ఉండెను. 2

మూ. ఊచుస్తే చ మహీపాలా బలదర్పసమన్వితాః,
న రామ రావణం యుద్ధే పశ్యామః పురతః స్థితమ్. 3

ప్ర. అ. బలదర్పసమన్వితాః = బలగర్వముతో కూడిన, తే = ఆ, మహీపాలాః = రాజులు, ఊచుః = ఇట్లనిరి, రామ = రామా! యుద్ధే = యుద్ధము నందు, పురతః = ఎదుట, స్థితమ్ = నిలచిన, రావణమ్ = రావణుణ్ణి, న పశ్యామః = చూడలేదు.

తా. బలగర్వముతో ఆ రాజులు ఇట్లనిరి-"రామా! యుద్ధములో రావణుడు మా ఎదుట నిలచి ఉండగా కనబడలేదు. (కనబడినచో ఏమి చేసి ఉండేవారమో!)"

మూ. భరతేన వయం పశ్చాత్సమానీతా నిరర్థకమ్,
హతా హి రాక్షసాః క్షిప్రం పార్థివైః స్యుర్న సంశయః. 4

ప్ర. అ. భరతేన = భరతునిచేత, వయమ్ = మేము, నిరర్థకమ్ = వ్యర్థముగా. పశ్చాత్ = తరవాత, సమానీతాః = తీసికొనిరాబడినాము. పార్థివైః = రాజులచేత, రాక్షసాః = రాక్షసులు, క్షిప్రమ్ = శీఘ్రముగా, హతాః స్యుః = చంపబడి ఉందురు. సంశయః = సంశయము, న = లేదు.

తా. భరతుడు మమ్ములను పని అంతా అయిపోయినతరవాత వ్యర్థముగా లీసికొని వచ్చినాడు. ముందు వచ్చినచో రాజులు నిఃసంశయముగా, రాక్షసులను వెంటనే చంపి ఉండేవారు. 4

మూ. రామస్య బాహువీర్యేణ రక్షితా లక్ష్మణస్య చ,
సుఖం పారే సముద్రస్య యుధ్యేమ విగతజ్వరాః. 5

ప్ర. అ. రామస్య = రామునియొక్క, లక్ష్మణస్యచ = లక్ష్మణునియొక్క, బాహువీర్యేణ = బాహుపరాక్రమముచేత, రక్షితాః = రక్షించబడిన మేము, సముద్రస్య పారే = సముద్రము అవతలి ఒడ్డున, విగతజ్వరాః = పోయిన భయము గలవారమై, యుధ్యేమ = యుద్ధము చేసి ఉండేవారము.

తా. రామలక్ష్మణుల బాహుపరాక్రమముచేత రక్షింపబడుచు, ఏ భయమూ లేకుండగా సముద్రము ఆవలి ఒడ్డున సుఖముగా యుద్ధముచేసి ఉండేవారము. 5

మూ. ఏతాశ్చాన్యాశ్చ రాజానః కథాస్తత్ర సహస్రశః,
కథయన్తః స్వరాజ్యాని జగ్ముర్హర్షసమన్వితాః. 6

ప్ర. అ. సహస్రశః = వేలకొలది, రాజానః = రాజులు, తత్ర = అక్కడ, ఏతాః = ఈ, అన్యాః చ = ఇతరములూ అయిన, కథాః = కథలను, కథయన్తః = చెప్పుచూ, హర్షసమన్వితాః = సంతోషముతో కూడినవారై, స్వరాజ్యాని = తమ రాజ్యములను గూర్చి, జగ్ముః = వెళ్ళిరి.

తా. వేలకొలది రాజులు ఈ కథలను, మరి ఇతరకథలను చెప్పుకొనుచు సంతోషముతో తమ తమ రాజ్యములకు వెళ్ళిరి. 6

మూ. స్వాని రాజ్యాని ముఖ్యాని బుద్ధాని ముదితాని చ,
సమృద్ధధనధాన్యాని పూర్ణాని వసుమన్తి చ. 7

యథాపురాణి తే గత్వా రత్నాని వివిధాన్యథ,
రామస్య ప్రియకామార్థముపహారం నృపా దదుః. 8

ప్ర. అ. ముఖ్యాని = ప్రసిద్ధములు, బుద్ధాని = ఐశ్వర్యసంపన్నములు, ముదితాని = సంతోషించినవి, సమృద్ధధనధాన్యాని = ధనధాన్యసమృద్ధములు, పూర్ణాని = నిండినవి, వసుమన్తి చ = ధనము కలవీ అయిన, యథాపురాణి = పూర్వము వలెనే ఉన్న, స్వాని రాజ్యాని = తమ రాజ్యములను గూర్చి, గత్వా = వెళ్ళి, తే నృపాః = ఆ రాజులు, అథ = అటుపిమ్మట, రామస్య = రామునియొక్క, ప్రియకామార్థమ్ = ప్రియకామములకొరకు, వివిధాని = అనేకవిధములైన, రత్నాని = రత్నములను, ఉపహారమ్ = కానుకనుగా, దదుః = ఇచ్చిరి.

తా. ఆ రాజులు ప్రసిద్ధములు, సమృద్ధములు, ఆనందభరితములు, ధన ధాన్య సమృద్ధములు, పరిపూర్ణములు, ధనము గలవి అయిన, తాము విడిచి వచ్చినప్పుడు ఎట్లు ఉండెనో అట్లే ఉన్న తమ రాజ్యములకు వెళ్ళి రామునికి ప్రియము చేయుటకై అనేకవిధములైన రత్నములను కానుకగా పంపిరి. 7,8

మూ. అశ్వాన్యానాని రత్నాని హస్తినశ్చ మదోత్కటాన్,
చన్దనాని చ ముఖ్యాని దివ్యాన్యాభరణాని చ. 9

మణిముక్తాప్రవాలాంస్తు దాస్యో రూపసమన్వితాః,
అజావికం చ వివిధం రథాంస్తు వివిధాన్ బహూన్. 10

ప్ర. అ. ఆశ్వాన్=గుఱ్ఱములను, యానాని=వాహనములను, రత్నాని=రత్నములను, మదోత్కటాన్=మదముచేత తీవ్రముగా ఉన్న, హస్తినః చ=ఏనుగులను, ముఖ్యాని=శ్రేష్ఠములైన, చన్దనాని చ=చందనములను, దివ్యాని=దివ్యములైన, ఆభరణాని చ=అలంకారములను, మణిముక్తాప్రవాలాన్ తు=మణులను, ముత్యములను, పొగడములను, రూపసమన్వితాఃరూపముతో కూడిన, దాస్యఃదాసీలను, వివిధమ్=అనేకవిధములైన, అజావికం చ=మేకలను, గొఱ్ఱెలను, వివిధాన్=అనేకవిధములైన, బహూన్=అనేకములైన, రథాన్ తు=రథములను పంపిరి.

తా. గుఱ్ఱములు, వాహనములు, రత్నములు, మదముచేత తీవ్రముగా ఉన్న ఏనుగులు, ముఖ్యములైన చందనములు, దివ్యములైన అలంకారములు, మణులు, ముత్యములు, పొగడములు, రూపవతులైన దాసీలు, అనేకవిధములైన మేకల గొఱ్ఱెల మందలు, చాలా రకములైన అనేకరథములు పంపిరి. 9,10

మూ. భరతో లక్ష్మణశ్చైవ శత్రుఘ్నశ్చ మహాబలః,
ఆదాయ తాని రత్నాని స్వాం పురీం పునరాగతాః. 11

ప్ర. అ. భరతఃభరతుడు, లక్ష్మణఃచైవ=లక్ష్మణుడు, మహాబలఃగొప్ప బలము గల, శత్రుఘ్నఃచ=శత్రుఘ్నుడూ, తాని రత్నాని=ఆ రత్నములను, ఆదాయ=తీసికొని, స్వామ్=తమ సంబంధమైన, పురీమ్=పట్టణమును గూర్చి, పునఃమరల, ఆగతాఃవచ్చినారు.

తా. భరతలక్ష్మణశత్రుఘ్నులు ఆ రత్నములను తీసికొని తమ నగరమునకు తిరిగి వచ్చిరి. 11

మూ. ఆగమ్య చ పురీం రమ్యామయోధ్యాం పురుషర్షభాః,
తాని రత్నాని చిత్రాణి రామాయ సముపానయన్. 12

ప్ర. అ. పురుషర్షభాఃఆ పురుషశ్రేష్ఠులు, రమ్యామ్=సుందరమైన, అయోధ్యాం పురీమ్=అయోధ్యాపురమును గూర్చి, ఆగమ్య=వచ్చి, చిత్రాణి=చిత్రములైన, తాని రత్నాని=ఆ రత్నములను, రామాయ=రామునికొరకు, సముపానయన్=సమర్పించిరి.

మూ. హనూమన్తం చ నృపతిరిక్ష్వాకూణాం మహారథః,
ఆజ్గదం చ మహాబాహుమజ్కమారోప్య వీర్యవాన్ 16
రామః కమలపత్రాక్షః సుగ్రీవమిదమబ్రవీత్.

ప్ర. అ. ఇక్ష్వాకూణామ్ =ఇక్ష్వాకు వంశీయుల, నృపతిః =రాజూ, మహారథః=మహారథుడు, వీర్యవాన్=పరాక్రమవంతుడు, కమలపత్రాక్షః =పద్మపత్రముల వంటి నేత్రములు కలవాడు అయిన, రామః = రాముడు, హనూమన్తం చ = హనుమంతుణ్ణి, మహాబాహుమ్=గొప్పబాహువులు గల, అజ్గదం చ=అంగదుణ్ణి, అజ్కమ్=తొడను ఆరోప్య = అధిష్ఠింపజేసి, సుగ్రీవమ్ = సుగ్రీవుణ్ణి గూర్చి, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. ఇక్ష్వాకువంశరాజు, మహారథుడు, వీర్యవంతుడు, కమలపత్రాక్షుడు అయిన రాముడు హనుమంతుణ్ణి మహాబాహువైన అంగదుణ్ణి ఒడిలో కూర్చుండ పెట్టుకొని (దగ్గరకు చేరదీసి) సుగ్రీవునితో ఇట్లు పలికెను. 16, 16

మూ. అంగదస్తే సుపుత్రోఽయం మన్త్రీ చాప్యనిలాత్మజః. 17
సుగ్రీవమన్త్రితే యుక్తౌ మమ చాపి హితేరతౌ,
అర్హతో వివిధాం పూజాం త్వత్కృతే వై హరీశ్వర. 18

ప్ర. అ. హరీశ్వర =వానరరాజా! అయమ్ = ఈ, అజ్గదః = అంగదుడు, తే = నీయొక్క, సుపుత్రః = సుపుత్రుడు, అనిలాత్మజః = హనుమంతుడు మన్త్రీ చాపి = మంత్రి, సుగ్రీవమన్త్రితే = సుగ్రీవుని ఆలోచనలో, యుక్తౌ=సంబంధించి వున్నవారు, మమ చాపి = నాయొక్క కూడ, హితే = హితమునందు, రతౌ = ఆసక్తులూ అయిన వీరిద్దరూ, త్వత్కృతే = నీ నిమిత్తమై, వివిధామ్ = అనేకవిధములైన, పూజామ్ = పూజను, అర్హతః = తగి ఉన్నారు.

తా. వానరరాజా! ఈ అంగదుడు నీ సుపుత్రుడు. ఈ హనుమంతుడు నీ మంత్రి. నీ ఆలోచనం ప్రకారము ప్రవర్తించు వీరిద్దరూ నా హితమును కూడ కోరువారు. నిన్ను పట్టి వీళ్ళు అనేక విధములైన సత్కారములు పొందతగినవారు. 17,18

మూ. ఇత్యుక్త్వా వ్యపముచ్యాజ్గాద్భూషణాని మహాయశాః,
స బబన్ధ మహార్హాణి తదాజ్గదహనూమతోః. 19

ప్ర. అ. మహాయశాః=గొప్ప కీర్తిగల, సః = ఆ రాముడు, ఇతి = ఇట్లు, ఉక్త్వా = పలికి, అఙ్గాత్ = తన శరీరమునుండి, మహార్హాణి = గొప్ప విలువ గల, భూషణాని =అలంకారములను, అపముచ్య=తీసి, తదా = అప్పుడు, అఙ్గదహనూమతోః = అంగదహనుమంతులకు, బబన్ధ = కట్టెను.

తా గొప్పకీర్తిగల రాముడు ఇట్లు పలికి, తనశరీరము నుండి అమూల్యము మైన ఆభరణములు తీసి అంగదహనుమంతులకు కట్టెను. 19

మూ. ఆభాష్య చ మహావీర్యాన్ రాఘవో యూథపర్షభాన్,
నీలం నలం కేసరిణం కుముదం గన్ధమాదనమ్. 20

సుషేణం పనసం వీరం మైన్దం ద్వివిదమేవ చ,
జామ్బవన్తం గవాక్షం చ వినతం ధూమ్రమేవ చ.

వలీముఖం ప్రజఙ్ఘం చ సంనాదం చ మహాబలమ్,
దరీముఖం దధిముఖమిన్ద్రజానుం చ యూథపమ్. 22

మధురం శ్లక్ష్ణయా వాచా నేత్రాభ్యామాపిబన్నివ,
సుహృదో మే భవన్తశ్చ శరీరం భ్రాతరస్తథా. 23

యుష్మాభిరుద్ధృతశ్చాహం వ్యసనాత్కాననౌకసః,
ధన్యో రాజా చ సుగ్రీవో భవద్భిః సుహృదాం వరైః. 24

ఏవముక్త్వా దదౌ తేభ్యో భూషణాని యథార్హతః,
వజ్రాణి చ మహార్హాణి సస్వజే చ నరర్షభః. 25

ప్ర. అ. నరర్షభః = నరులలో శ్రేష్ఠుడైన, రాఘవః = రాముడు, మహా వీర్యాన్ = గొప్ప పరాక్రమము గల, యూథపర్షభాన్ = వానరయూథ నాయకులలో శ్రేష్ఠులైన, నీలమ్ = నీలుణ్ణి, నలమ్ = నలుణ్ణి, కేసరిణమ్ = కేసరిని, కుముదమ్ = కుముదుణ్ణి, గన్ధమాదనమ్ = గంధమాదనుణ్ణి. సుషేణమ్ = సుషేణుణ్ణి, వీరమ్ = వీరుడైన, పనసమ్ = పనసుణ్ణి. మైన్దమ్= మైందుణ్ణి, ద్వివిదమేవ చ =ద్వివిదుణ్ణి. జామ్బవన్తమ్ = జాంబవంతుణ్ణి, గవాక్షమ్ = గవాక్షుణ్ణి, వినతమ్ = వినతుణ్ణి, ధూమ్రమ్ ఏవ చ = ధూమ్రుణ్ణి వలీముఖమ్= వలీముఖుణ్ణి,

(లేదా వానరుడైన) ప్రజఙ్ఘం చ = ప్రజంఘుణ్ణి, మహాబలమ్ = గొప్ప బలము గల, సంనాదం చ = సంనాదుణ్ణి, దరీముఖమ్ = దరీముఖుణ్ణి, యూథపమ్ = వానర యూథనాయకుడైన, ఇన్ద్రజానుమ్ = ఇంద్రజానుణ్ణి, ఆభాష్య = పలకరించి, నేత్రాభ్యామ్ = నేతములతో, ఆపిబన్నివ = త్రాగుచున్నాడా అన్నట్లు చూచుచు, శ్లక్ష్ణయా = మృదువైన, వాచా = వాక్కుతో, మధురమ్ = మధురముగా, కానౌకసః వానరులారా! భవన్తః = మీరు, మే = నాకు, సుహృదః = మిత్రులు. శరీరమ్ = శరీరము. తథా = మరియు, భ్రాతరః = సోదరులు. యుష్మాభిః = మీచేత, అహమ్ = నేను, వ్యసనాత్ = వ్యసనమునుండి, ఉద్ధృతః = ఉద్ధరించబడినాను. సుహృదామ్ = స్నేహితులతో, వరైః = శ్రేష్ఠులైన, భవద్భిః = మీచేత, రాజా = రాజైన, సుగ్రీవః = సుగ్రీవుడు, ధన్యః = ధన్యుడు. ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి తేభ్యః = వాళ్లకు, యథార్హతః = అర్హతానుసారముగా, భూషణాని = భూషణములను, మహార్హాణి = గొప్ప విలువ గల, వజ్రాణి = వజ్రములను, దదౌ = ఇచ్చెను. సస్వజే చ = కౌగిలించుకొనెను కూడ.

తా. నరులలో శ్రేష్ఠుడైన రాముడు గొప్ప పరాక్రమము గలవారు, వానర యూథనాయకులు అయిన నీల-నల- కేసరి-కుముద- గంధమాదన-సుషేణ-పనస-మైంద - ద్వివిద - జాంబవంతులను, గవాక్ష-వినత-ధూమ్ర- వలీముఖ-ప్రజంఘ-సంనాద-మహాబల-దరీముఖ-దధిముఖ, ఇంద్రజానులను వేరువేరుగా పలకరించి, నేత్రములతో త్రాగుచున్నాడా అన్నట్లు చూచుచు- "ఓ! వానరులారా! మీరు నాకు మిత్రులు; నా దేహమువంటివారు; నా సోదరులు; మీరే నన్ను ఆపద నుండి ఉద్ధరించినారు; మీరు ఉత్తమమిత్రులుగా ఉన్న సుగ్రీవుడు ధన్యుడు"అని మధురముగా మృదువైన మాటలు పలికి తగు విధముగా అలంకారములు, అమూల్యములైన వజ్రములు బహూకరించి కౌగలించుకొనెను. 20-25

మూ. తే పిబన్తః సుగన్ధీని మధూని మధు పిఙ్గలాః।
మాంసాని చ సుమృష్టాని మూలాని చ ఫలాని చ. 26

ప్ర.అ. తే = ఆ, మధుపిఙ్గలాః = వానరులు, సుగన్ధీని = చాలా మంచి వాసన గల, మధూని = తేనెలను, పిబన్తః = త్రాగుచున్నవారై, సుమృష్టాని = చాలపరిశుద్ధమైన, మాంసాని = మాంసములను, మూలాని చ = మూలములను, ఫలాని చ = ఫలములను, తినుచుండిరి.

తా. ఆ వానరులు మంచి వాసన గల మధువులను త్రాగుచు పరిశుద్ధము లైన మాంసములను, మూలములను, ఫలములను తినుచు నివసించిరి.

వి. వానరులు మాంసం తినడం ఈ ఉత్తరకాండరచయిత మాత్రమే చెప్పినాడు. 26

మూ. ఏవం తేషాం నివసతాం మాసః స్రాగో యయౌ తదా,
ముహూర్తమివ తే సర్వే రామభక్త్యా చ మేనిరే. 27

ప్ర. అ. తేషామ్ = ఆ వానరులు, ఏవమ్ = ఇట్లు, నివసతామ్ = నివసించు చుండగా, తదా = అప్పుడు, స్రాగః = కొంచెము అధికమైన, మాసః = మాసము, యయౌ = గడచెను. తే సర్వే = వాళ్ళందరూ, రామభక్త్యా = రామభక్తిచేత, ముహూర్తమివ = ముహూర్తకాలమును వలె, మేనిరే = తలచిరి.

తా. ఆ వానరులు ఈ విధముగ నివసించుచుండగా కొంచెము అధికమైన మాసము గడచెను. కాని రామభక్తి గల వాళ్ళకు మాత్రము ఆ కాలము ముహూర్తము వలె ఉండెను. 27

మూ. రామోఽపి రేమే తైః సార్ధం వానరైః కామరూపిభిః,
రాక్షసైశ్చ మహావీర్యైర్ఋక్షైశ్చైవ మహాబలైః. 28

ప్ర. అ. రామః = రాముడు కూడ, కామరూపిభిః = స్వేచ్ఛారూపము గల, తైః = ఆ, వానరైః సార్ధమ్ = వానరులతోను, మహావీర్యైః = గొప్ప పరాక్రమము గల, రాక్షసైః చ = రాక్షసులతోను, మహాబలైః = గొప్ప బలము గల, ఋక్షైః చ ఏవ = భల్లూకములతోను, రేమే = క్రీడించెను.

తా. రాముడు కూడ స్వేచ్ఛారూపధారులైన ఆ వానరులతోను, గొప్ప పరాక్రమము గల రాక్షసులతోను, గొప్ప బలము గల భల్లూకములతోను సుఖముగా కాలము గడపెను. 28

మూ. ఏవం తేషాం యయౌ మాసో ద్వితీయః శిశిరః సుఖమ్,
వానరాణాం ప్రహృష్టానాం రాక్షసానాం చ సర్వశః. 29

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, సర్వశః = అన్ని ప్రకారములచేతా,

ప్రహృష్టానామ్ = సంతోషించిన, తేషామ్ = ఆ, వానరాణామ్ = వానరులకు, రాక్షసానాం చ = రాక్షసులకు, ద్వితీయః = రెండవ, శిశిరః మాసః = శిశిరమాసము, సుఖమ్ = సుఖముగా, యయౌ = వెళ్లెను.

తా. ఆన్ని విధాలా సంతోషముతో ఉన్న వానరులకు, రాక్షసులకు ఈ విధముగ రెండవదైన శిశిరర్తువుకు సంబంధించిన మాసము సుఖముగా గడచెను.

మూ. ఇక్ష్వాకునగరే రమ్యే పరాం ప్రీతిముపాసతామ్,
రామస్య ప్రీతికరణైః కాలస్తేషాం యయౌ సుఖమ్. 30

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకోనచత్వారింశః సర్గః.

ప్ర. ఆ. రమ్యే = సుందరమైన, ఇక్ష్వాకునగరే = అయోధ్యయందు, పరామ్ = గొప్ప, ప్రీతిమ్ = ఆనందమును, ఉపాసతామ్ = పొందుచున్న, తేషామ్ = వారికి, రామస్య = రామునియొక్క, ప్రీతికరణైః = ప్రేమతో చేసిన పనులచేత, కాలః = కాలము, సుఖమ్ = సుఖముగా, యయౌ = వెళ్లెను.

తా. రమ్యమైన ఆ అయోధ్యానగరమునందు గొప్ప ఆనందమును అనుభవించుచున్న ఆ వానరాదులకు కాలము, రాముడు ప్రేమపూర్వకముగ చూపు ఆదరాదులచే సుఖముగా గడచెను. 30

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానములో ఉత్తరకాండలో
ముప్పదితొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ చత్వారింశ: సర్గ:

[రాముడు సుగ్రీవాదివానరులను, విభీషణాదిరాక్షసులను సన్మానించి వారి వారి దేశములకు పంపుట.]

మూ. తథా స్మ తేషాం వసతామృక్షవానరరక్షసామ్,
రాఘవస్తు మహాతేజాఃసుగ్రీవమిదమబ్రవీత్. 1

ప్ర. అ. తేషామ్ = ఆ, ఋక్షవానరరక్షసామ్ = భల్లూకవానరరాక్షసులు, తథా = అట్లు, వసతామ్=నివసించుచుండగా, మహాతేజాఃగొప్ప తేజస్సు గల, రాఘవఃతు = రాముడు, సుగ్రీవమ్=సుగ్రీవుణ్ణి గూర్చి, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. ఆ భల్లూకవానరరాక్షసులు ఆ విధముగ నివసించుచుండగా, గొప్ప తేజస్సు గల రాముడు సుగ్రీవునితో ఇట్లు పలికెను. 1

మూ. గమ్యతాం సౌమ్య కిష్కింధాం దురాధర్షాం సురాసురై:,
పాలయస్వ సహామాత్యై రాజ్యం నిహతకణ్టకమ్. 2

ప్ర. అ. సౌమ్య=సౌమ్యుడా! సురాసురై:=సురులచేతను, అసురులచేతను, దురాధర్షామ్ = ఎదిరింప శక్యము కాని, కిష్కింధామ్ = కిష్కింధను గూర్చి, గమ్యతామ్ = వెళ్లెదవుగాక. అమాత్యైఃసహ = మంత్రులతో కూడ, నిహతకణ్టకమ్= తొలగించబడిన శత్రుబాధ గల, రాజ్యమ్ = రాజ్యమును, పాలయస్వ= పాలించుము.

తా. సౌమ్యుడా! సురాసురులు కూడ ఎదిరించ జాలని కిష్కింధకు వెళ్ళి, అమాత్యసహితుడవై తొలగింపబడిన శత్రుబాధ గల రాజ్యమును పాలించుము. 2

మూ. అభ్యదం చ మహాబాహో ప్రీత్యా పరమయా యుత:,
పశ్య త్వం హనుమన్తం చ నలం చ సుమహాబలమ్. 3

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా ! త్వమ్ = నీవు, వరమయా = గొప్పదైన, ప్రీత్యా = ప్రేమతో, యుతః = కూడినవాడవై, అఙ్గదం చ = అంగదుణ్ణీ, హనుమన్తం చ = హనుమంతుణ్ణీ, సుమహాబలమ్ = చాల గొప్ప బలము గల, నలం చ = నలుణ్ణీ, పశ్య = చూడుము.

తా. ఓ! మహాబాహూ! అంగదుణ్ణీ, హనుమంతుణ్ణీ, మహాబలశాలియైన నలుణ్ణీ ప్రేమతో చూచుకొనుము. 3

మూ. సుషేణం శ్వశురం వీరం తారం చ బలినాం వరమ్,
కుముదం చైవ దుర్ధర్షం నీలం చైవ మహాబలమ్. 4

వీరం శతబలిం చైవ మైన్దం ద్వివిదమేవ చ,
గజం గవాక్షం గవయం శరభం చ మహాబలమ్. 5

ఋక్షరాజం దురాధర్షం జామ్బవన్తం మహాబలమ్,
పశ్య ప్రీతిసమాయుక్తో గన్ధమాదనమేవ చ. 6

ప్ర. అ. శ్వశురమ్ = నీ మామయైన, సుషేణమ్ = సుషేణుణ్ణీ, వీరమ్ = వీరుడైన, తారం చ = తారుణ్ణీ, బలినామ్ = బలవంతులలో, వరమ్ = శ్రేష్ఠుడైన, కుముదం చైవ = కుముదుణ్ణీ, దుర్ధర్షమ్ = ఎదిరింప శక్యము కాని, మహాబలమ్ = గొప్ప బలము గల, నీలం చైవ = నీలుణ్ణీ, వీరమ్ = వీరుడైన, శతబలిం చైవ = శతబలిని, మైన్దమ్ = మైందుణ్ణీ, ద్వివిదమేవ చ = ద్వివిదుణ్ణీ, గవయమ్ = గవయుణ్ణీ, మహాబలమ్ = గొప్ప బలము గల, శరభం చ = శరభుణ్ణీ, ఋక్షరాజమ్ = భల్లూకముల రాజైన, దుర్ధర్షమ్ = ఎదిరింప శక్యము కాని, మహాబలమ్ = గొప్ప బలము గల, జామ్బవన్తమ్ = జాంబవంతుణ్ణీ, గన్ధమాదనమేవ చ = గంధమాదనుణ్ణీ, ప్రీతిసమాయుక్తః = ప్రేమతో కూడినవాడవై, పశ్య = చూడుము.

తా. నీ మామయైన సుషేణుణ్ణీ, తార-కుముద-నీల-శతబలి - మైంద - ద్వివిద-గజ-గవాక్ష-గవయ-శరభులను, ఎదిరింప శక్యము కాని, మహాబలశాలియైన భల్లూకరాజు జాంబవంతుణ్ణీ గంధమాదనుణ్ణీ ప్రేమతో చూచుకొనుము. 4-6

మూ. ఋషభం చ సువిక్రాన్తం ప్లవంగం చ సుపాటలమ్,
కేసరిం శరభం శుమ్భం శఙ్ఖచూడం మహాబలమ్. 7

యే చేమే సుమహాత్మానో మదర్థే త్యక్తజీవితాః,
పశ్య త్వం ప్రీతిసంయుక్తో మా చైషాం విప్రియం కృథాః.

ప్ర. అ. సువిక్రాన్తమ్ = మంచి పరాక్రమము గల, ఋషభం చ = ఋషభుణ్ణి, సుపాటలమ్ = సుపాటలు డను, ప్లవంగం చ = వానరుణ్ణి, కేసరిమ్ = కేసరిని, శరభమ్ = శరభుణ్ణి, శుమ్భమ్ = శుంభుణ్ణి మహాబలమ్ = గొప్ప బలము గల, శఙ్ఖచూడమ్ = శంఖచూడుణ్ణి. మదర్థే = నానిమిత్తమై, త్యక్తజీవితాః = విడువబడిన ప్రాణములు గల (ప్రాణములు త్యజించుటకు సిద్ధపడిన), యే = ఏ, ఇమే = ఈ, సుమహాత్మానః = గొప్ప మహాత్ము లున్నారో వారినీ, త్వమ్ = నీవు, ప్రీతిసంయుక్తః = ప్రేమతో కూడినవాడవై, పశ్య = చూడుము. ఏషామ్ = వీళ్లకు, విప్రియమ్ = అప్రియమును, మా చ కృథాః = చేయకుము.

తా. విక్రమవంతుడైన ఋషభుణ్ణి, సుపాటల-కేసరి-శరభ-శంఖచూడులను, నాకోసమై ప్రాణాలకు తెగించిన మహాత్ముల నందరినీ ప్రేమతో చూచుకొనుము. వీళ్ళకు అప్రియము చేయకుము. 7,8

మూ. ఏవముక్త్వా చ సుగ్రీవమాశ్లిష్య చ పునఃపునః,
విభీషణమువాచాథ రామో మధురయా గిరా. 9

ప్ర. అ. రామః = రాముడు, సుగ్రీవమ్ = సుగ్రీవుణ్ణి గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి. పునఃపునః = మాటిమాటికి, ఆశ్లిష్య చ = కౌగిలించుకొని, అథ = అటుపిమ్మట, విభీషణమ్ = విభీషణుణ్ణి గూర్చి, మధురయా = మధుర మైన, గిరా = వాక్కు-తో, ఉవాచ = పలికెను.

తా. రాముడు సుగ్రీవునితో ఇట్లు పలికి, మాటిమాటికి కౌగలించుకొని, పిమ్మట విభీషణునితో మధురముగా ఇట్లు పలికెను. 9

మూ. లఙ్కాం ప్రశాధి ధర్మేణ ధర్మజ్ఞస్త్వం మతో మమ,
పురస్య రాక్షసానాం చ భ్రాతుర్వైశ్రవణస్య చ. 10

ప్ర. అ. లఙ్కామ్ = లంకను, ధర్మేణ = ధర్మముచేత, ప్రశాధి = పరిపాలించుము. త్వమ్ = నీవు, ధర్మజ్ఞః = ధర్మమును ఎరిగినవాడవుగా, పురస్య =

= పట్టణమునకు, రాక్షసానాం చ = రాక్షసులకు, భ్రాతుః = సోదరుడైన, వైశ్రవణస్య చ = కుబేరునకు, మమ = నాకు, మతః = అంగీకరింపబడినవాడవు.

తా. లంకకు ధర్మమును అనుసరించి పాలించుము. నీవు ధర్మము తెలిసినవాడవు ఆని నేను, నీ పట్టణములోని ప్రజలు, రాక్షసులు, నీ సోదరుడైన కుబేరుడు నమ్ముచున్నాము. 10

మూ. మా చ బుద్ధిమధర్మే త్వం కుర్యా రాజన్ కదాచన,
బుద్ధిమన్తో హి రాజానో ధ్రువమశ్నన్తి మేదినీమ్. 11

ప్ర. అ. రాజన్ = రాజా! త్వమ్ = నీవు, కదాచన = ఎప్పుడూ కూడ, అధర్మే = అధర్మమునందు, బుద్ధిమ్ = బుద్ధిని, మా చ కురు = చేయకుము. బుద్ధిమన్తః = బుద్ధిమంతులైన, రాజానః = రాజులు, ధ్రువమ్ = తప్పక, మేదినీమ్ = భూమిని, అశ్నన్తి = అనుభవింతురు.

తా. రాజా! నీవు ఎన్నడూ కూడా నీ బుద్ధిని అధర్మముమీద ఉంచకుము. మంచి బుద్ధిగల రాజులే తప్పక భూమిని అనుభవింతురు. 11

మూ. అహం చ నిత్యశో రాజన్ సుగ్రీవసహితస్త్వయా,
స్మర్తవ్యః పరయా ప్రీత్యా గచ్ఛ త్వం విగతజ్వరః. 12

ప్ర. అ. రాజన్ = రాజా! సుగ్రీవసహితః = సుగ్రీవునితో కూడిన, అహం చ = నేను, త్వయా = నీచేత, నిత్యశః = నిత్యమూ, పరయా = గొప్ప, ప్రీత్యా = ప్రేమతో, స్మర్తవ్యః = స్మరించదగినవాడను. త్వమ్ = నీవు, విగతజ్వరః = పోయిన బాధలు కలవాడవై, గచ్ఛ = వెళ్లుము.

తా. రాజా! నీవు నిత్యము సుగ్రీవుణ్ణి నన్నూ స్నేహపూర్వకముగా, జ్ఞాపకము ఉంచుకొనుము. ఏ బాధలూ లేనివాడవై వెళ్ళుము. 12

మూ. రామస్య భాషితం శ్రుత్వా ఋక్షవానరరాక్షసాః,
సాధు సాధ్వితి కాకుత్స్థం ప్రశశంసుః పునః పునః. 13

ప్ర. అ. ఋక్షవానరరాక్షసాః = ఎల్లుకములు, వానరులు, రాక్షసులు, రామస్య = రామునియొక్క, భాషితమ్ = మాటను, శ్రుత్వా = విని, సాధు సాధు

ఇతి = బాగు బాగు అని, పునఃపునః = మాటిమాటికి, కాకుత్థ్సమ్ = రాముణ్ణి, ప్రశశంసుః = ప్రశంసించిరి.

తా. రాముని మాటలు విని ఋక్ష-వానర-రాక్షసులు "బాగు బాగు" అని మాటిమాటికీ ఆ రాముణ్ణి ప్రశంసించిరి. 13

మూ. తవ బుద్ధిర్మహాబాహో వీర్య మద్భుతమేవ చ,
మాధుర్యం పరమం రామ స్వయంభోరివ నిత్యదా. 14

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహుపులు గలవాడా! రామ = రామా! స్వయంభోః ఇవ = బ్రహ్మదేవునియొక్క వలె, తవ = నీయొక్క, బుద్ధిః = బుద్ధి, అద్భుతమ్ = ఆశ్చర్యకరమైన, వీర్యమ్ = పరాక్రమము, పరమమ్ = గొప్ప, మాధుర్యమ్ = మాధుర్యము, నిత్యదా = నిత్యము ఉండునవి.

తా. మహాబాహో! రామా! నీ బుద్ధి, అద్భుతమైన వీర్యము, గొప్ప మాధుర్యము ఇవి, బ్రహ్మయొక్క బుద్ధ్యాదుల వలె స్థిరమైనవి. 14

మూ. తేషామేవం బ్రువాణానాం వానరాణాం చ రక్షసామ్,
హనూమాన్ ప్రణతో భూత్వా రాఘవం వాక్యమబ్రవీత్.

ప్ర. అ. తేషామ్ = ఆ, వానరాణామ్ = వానరులు, రక్షసాం చ = రాక్షసులూ, ఏవమ్ = ఇట్లు, బ్రువాణానామ్ = పలుకుచుండగా, హనూమాన్ = హనుమంతుడు, ప్రణతః = వంగినవాడు, భూత్వా = అయి, రాఘవమ్ = రాముణ్ణి గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. ఆ వానరులు, రాక్షసులు ఇట్లు పలుకుచుండగా హనుమంతుడు వంగి నమస్కరించుచు రామునితో ఇట్లనెను. 15

మూ. స్నేహో మే పరమో రాజంస్త్వయి తిష్ఠతు నిత్యదా,
భక్తిశ్చ నియతా వీర భావో నాన్యత్ర గచ్ఛతు. 16

ప్ర. అ. రాజన్ = రాజా! మే = నాకు, త్వయి = నీయందు, పరమః = గొప్ప, స్నేహః = స్నేహము, నిత్యదా = ఎల్లప్పుడూ, తిష్ఠతు = ఉండుగాక, వీర = వీరుడా! భక్తిః చ = భక్తి కూడా, నియతా = స్థిరమైనది (ఉండుగాక). భావః = నా భావము, అన్యత్ర = మరియొకచోటకు, న గచ్ఛతు = వెళ్ళకుండు గాక.

తా. రాజా! నాకు నీపై నిత్యమూ గొప్ప స్నేహము. స్థిరమైన భక్తి ఉండుగాక. నా భావము మరొకవైపు ఎటూ వెళ్ళకుండుగాక. 16

మూ. యావద్రామకథా వీర చరిష్యతి మహీతలే,
తావచ్ఛరీరే వత్స్యన్తి మమ ప్రాణా న సంశయః. 17

ప్ర. అ. వీర = వీరుడా! రామకథా = రామకథ, యావత్ = ఎంతవరకు, మహీతలే = భూతలమునందు, చరిష్యతి = వ్యాపించునో, తావత్ = అంతవరకు, మమ = నాయొక్క, ప్రాణాః = ప్రాణములు, శరీరే = శరీరమునందు, వత్స్యన్తి = నివసించగలవు. సంశయః = సంశయము, న = లేదు.

తా. ఓ! వీరుడా! ఈ భూలోకములో నీ చరిత్ర వ్యాప్తిలో ఉండువరకు నా శరీరములో ప్రాణములు ఉండగలవు. సందేహము లేదు. 17

మూ. యచ్చైతచ్చరితం దివ్యం కథా తే రఘునన్దన,
తన్మమాప్సరసో రామ శ్రావయేయుర్నరర్షభ. 18

ప్ర. అ. రఘునన్దన = రఘువంశమును ఆనందింపచేయువాడా! నరర్షభ = నరులలో శ్రేష్ఠుడా! రామ = రామా! తే = నీయొక్క, యత్ = ఏ, దివ్యమ్ = దివ్యమైన, చరితమ్ = చరిత్ర ఉన్నదో, కథా = కథ ఉన్నదో, తత్ = దానిని, అప్సరసః = అప్సరః స్త్రీలు, మమ = నాకు, శ్రావయేయుః = వినిపించుచుందురు గాక.

తా. ఓ రఘునందనా! నరశ్రేష్ఠా! రామా! దివ్యమైన నీ చరితమును, కథను అప్సరఃస్త్రీలు నాకు వినిపించుచుందురు గాక. 18

మూ. తచ్ఛ్రుత్వాహం తతో వీర తవ చర్యామృతం ప్రభో,
ఉత్కణ్ఠాం తాం హరిష్యామి మేఘలేఖామివానిలః. 19

ప్ర. అ. వీర = వీరుడా, ప్రభో = ప్రభూ! తవ = నీయొక్క, తత్ = ఆ, చర్యామృతమ్ = చరిత్రామృతమును, శ్రుత్వా = విని, తతః = పిమ్మట, అనిలః = వాయువు, మేఘలేఖామ్ ఇవ = మేఘపంక్తిని వలె, తామ్ = ఆ, ఉత్కణ్ఠామ్ = బెంగను, హరిష్యామి = తొలగించుకొనెదను.

తా. ఓ! ప్రభూ! మహావీరా! నేను నీ చరితామృతమును విని దానిచేత నా బెంగను గాలి మేఘపంక్తిని చెల్లాచెదరు చేసినట్లు, తొలగించుకొనెదను. 19

మూ. ఏవం బ్రువాణం రామస్తు హనూమాన్తం వరాసనాత్,
ఉత్థాయ సస్వజే స్నేహాద్వాక్యమేతదువాచ హ. 20

ప్ర. అ. రామః తు = రాముడైతే, వరాసనాత్ = సింహాసనమునుండి, ఉత్థాయ = లేచి, ఏవమ్ = ఇట్లు, బ్రువాణమ్ = పలుకుచున్న, హనూమన్తమ్ = హనుమంతుణ్ణి, సస్వజే = కౌగిలించుకొనెను. స్నేహాత్ = స్నేహమువలన, ఏతత్ = ఈ వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. హనుమంతుడు ఇట్లు అనుచుండగా రాముడు సింహాసనమునుండి లేచి అతనిని కౌగిలించుకొని స్నేహపూర్వకముగా ఇట్లు పలికెను. 20

మూ. ఏవమేతత్కపిశ్రేష్ఠ భవితా నాత్ర సంశయః,
చరిష్యతి కథా యావదేషా లోకే చ మామికా. 21
తావత్తే భవితా కీర్తిః శరీరేఽప్యసవస్తథా,
లోకా హి యావత్ స్థాస్యన్తి తావత్ స్థాసన్తి మే కథాః.

ప్ర. అ. కపిశ్రేష్ఠ = వానరశ్రేష్ఠుడా! ఏతత్ = ఇది, ఏవమ్ = ఇట్లు, భవితా = కాగలదు. అత్ర = దీనియందు, సంశయః = సంశయము, న = లేదు. మామికా = నాసంబంధమైన, ఏషా కథా = ఈ కథ, యావత్ = ఎంతవరకు, లోకే = లోకమునందు, చరిష్యతి = సంచరించగలదో, తావత్ = అంతవరకు, తే = నీయొక్క, కీర్తిః = కీర్తి, భవితా = ఉండగలదు. తథా = మరియు, శరీరే = శరీరమునందు, అసనః అపి = ప్రాణములు కూడ ఉండగలవు. లోకాః = లోకములు యావత్ = ఎంతవరకు, స్థాస్యన్తి = ఉండగలవో, తావత్ = అంతవరకు, మే కథాః = నా కథలు, స్థాస్యన్తి = ఉండగలవు.

తా. వానరశ్రేష్ఠా! నీవు కోరిన విధముగ జరుగగలదు. సంశయము లేదు. నా కథ లోకములో ఎంతవరకు ప్రచారములో ఉండునో అంతవరకు నీ కీర్తి స్థిరముగ ఉండగలదు. నీ శరీరములో ప్రాణములు ఉండగలవు. ఈ లోకములున్నంతవరకు నా కథ ఉండగలదు. 21, 22.

మూ. ఏకైకస్యోపకారస్య ప్రాణాన్ దాస్యామి తే కపే,
శేషస్యేహోపకారాణాం భవామ ఋణినో వయమ్. 23

ప్ర. అ. కపే = హనుమంతుడా! ఏకైకస్య = ఒక్కొక్క, ఉపకారస్య = ఉపకారమునకు, తే = నీకు, ప్రాణాన్ = ప్రాణములను, దాస్యామి = ఇచ్చెదను. ఉపకారాణామ్ = ఉపకారములలో, శేషస్య = మిగిలిదానికి, వయమ్ = మేము, ఋణినః = ఋణము గలవారము, భవామ = అయి ఉందుము.

తా. హనుమంతుడా! నీవు చేసిన ఒక్కొక్క ఉపకారానికి నేను నా ప్రాణములను ఇచ్చెదను. కాని మిగిలిన ఉపకారాలకు నీకు ఋణపడియే ఉందును. 23

మూ. మదఙ్గే జీర్ణతాం యాతు యత్త్వయోపకృతం కపే,
నరః ప్రత్యుపకారాణామాపత్స్వాయాతి పాత్రతామ్. 24

ప్ర. అ. కపే = హనుమంతుడా! త్వయా = నీచేత, యత్ = ఏది, ఉప కృతమ్ = ఉపకారము చేయబడినదో అది, మదఙ్గే = నాశరీరమునందే, జీర్ణతామ్ = జీర్ణత్వమును, యాతు = పొందుగాక. నరః = నరుడు, ఆపత్సు = ఆపత్సమయములందు, ప్రత్యుపకారాణామ్ = ప్రత్యుపకారములకు, పాత్రతామ్ = పాత్రత్వమును, ఆయాతి = పొందును.

తా. హనుమంతుడా! నీవు నాకు చేసిన ఉపకారము నా శరీరమునందే జీర్ణమైపోవుగాక. నరుడు ఆపదలు వచ్చినప్పుడే ప్రత్యుపకారమునకు తగినవాడగును. అందుచేత నీకు ఏనాటికైన ప్రత్యుపకారము చేసి నీ ఋణము తీర్చుకొనెదను అని నేను అనను అని భావము. 24

మూ. తతోఽస్య హారం చన్ద్రాభం ముచ్య కణ్ఠాత్స రాఘవః,
వైదూర్యతరలం కణ్ఠే బబన్ధ చ హనూమతః. 25

ప్ర అ తతః = అటుపిమ్మట, సః రాఘవః = ఆ రాముడు, కణ్ఠాత్ = తన కంఠమునుండి, చన్ద్రాభమ్ = చంద్రునివంటి కాంతిగల, వైదూర్యతరలమ్ = వైదూర్యము మధ్యమణిగా గల, హారమ్ = హారమును, ముచ్య = తీసి, అస్య హనూమతః = ఈ హనుమంతునియొక్క, కణ్ఠే = కంఠమునందు, బబన్ధ = కట్టెను.

తా. పిమ్మట రాముడు తన కంఠమునుండి చంద్రుని వంటి కాంతి గల వైదూర్యము మధ్యమణిగా ఉన్న హారమును తీసి హనుమంతుని మెడలో కట్టెను. 25

మూ. తేనోరపి నిబద్ధేన హారేణ మహతా కపిః,
రరాజ హేమశైలేన్ద్రశ్చన్ద్రేణాక్రాన్తమస్తకః. 26

ప. అ. ఉరసి = వక్షఃస్థలమునందు, నిబద్ధేన = కట్టబడిన, మహతా = గొప్పదైన, తేన హారేన = ఆ హారముతో, కపిః = హనుమంతుడు, చన్ద్రేణ = చంద్రునిచేత, ఆక్రాన్తమస్తకః = ఆక్రమించబడిన శిఖరము గల, హేమశైలేన్ద్రః = మేరుపర్వతము వలె, రరాజ = ప్రకాశించెను.

తా. వక్షఃస్థలముపై కట్టిన ఆ గొప్ప హారముతో హనుమంతుడు శిఖరము మీద చంద్రుడు ఉన్న మేరుపర్వతము వలె ప్రకాశించెను. 26

మూ. శ్రుత్వా తు రాఘవస్యైతదుత్థాయోత్థాయ వానరాః,
ప్రణమ్య శిరసా పాదౌ నిర్జగ్ముస్తే మహాబలాః. 27

ప్ర. అ. మహాబలాః = గొప్ప బలము గల, తే = ఆ, వానరాః = వానరులు, రాఘవస్య = రామునియొక్క, ఏతత్ = ఈ వాక్యమును, శ్రుత్వా తు = విని, ఉత్థాయ ఉత్థాయ = లేచి లేచి, శిరసా = శిరస్సుచేత, పాదౌ = పాదములను, ప్రణమ్య = నమస్కరించి, నిర్జగ్ముః = బయల్వెడలిరి.

తా. గొప్ప బలము గల ఆ వానరులు రాముని (మాటలు) విని లేచి లేచి శిరస్సుచేత అతని పాదములకు నమస్కరించి బయలుదేరిరి. 27

మూ. సుగ్రీవః స చ రామేణ నిరన్తరముపాగతః,
విభీషణశ్చ ధర్మాత్మా సర్వే తే బాష్పవిక్లవాః. 28

ప్ర. ఆ. రామేణ = రామునితో, నిరన్తరమ్ = గాఢముగా, ఉపాగతః = వక్షఃస్థలమును పొందిన, సః = ఆ, సుగ్రీవః = సుగ్రీవుడు, ధర్మాత్మా = ధర్మాత్ముడైన, విభీషణః చ = విభీషణుడూ, తే = వారు, సర్వే = అందరూ, బాష్పవిక్లవాః = కన్నీటిచేత వ్యాకులులు అయిరి.

తా. రాముణ్ణి గాఢముగా ఆలింగనము చేసికొనిన సుగ్రీవుడు, ధర్మాత్ముడైన విభీషణుడు అందరూ కూడ కన్నీటితో వ్యాకులత్వము చెందిరి. 29

మూ. సర్వే చ తే బాష్పకలాః సాశ్రునేత్రా విచేతసః,
సంమూఢా ఇవ దుఃఖేన త్యజన్తో రాఘవం తదా. 29

ప్ర. అ. తదా = అప్పుడు. రాఘవమ్ = రాముణ్ణి, త్యజన్తః = విడిచిపెట్టుచున్న, తే సర్వే = వాళ్ళందరూ, బాష్పకలాః = కన్నీటిచేత అవ్యక్తముగా మాటలాడుచున్నవారై, సాశ్రునేత్రాః = కన్నీళ్ళతో కూడిన నేత్రములు కలవారై, విచేతసః = ఆలోచనలు లేని వారై, దుఃఖేన = దుఃఖముచేత, సంమూఢాః ఇవ = ఏమీ తోచనివారు వలె అయిరి.

తా. అప్పుడు రాముణ్ణి విడచుచున్న వాళ్ళందరూ డగ్గుత్తికచేత అస్పష్టముగా మాటలాడుచు, కన్నీళ్ళతో నిండిన నేత్రములతో మనస్సులు పనిచేయక దుఃఖము చేత ఏమి తోచని స్థితిలో ఉండిరి. 29

మూ. కృతప్రసాదాస్తైవం రాఘవేణ మహాత్మనా,
జగ్ముః స్వం స్వం గృహం సర్వే దేహీ దేహమివ త్యజన్.

ప్ర. అ. మహాత్మనా = మహాత్ముడైన, తేన రాఘవేణ = ఆ రామునిచేత ఏవమ్ = ఇట్లు, కృతప్రసాదాః = చేయబడిన అనుగ్రహము గల, సర్వే = ఆ వానరాదులు అందరూ, దేహమ్ = దేహమును, త్యజన్ = విడచుచున్న, దేహీ = ఇవ = జీవుడు వలె, స్వం స్వం గృహమ్ = తన తన గృహమును గూర్చి, జగ్ముః = వెళ్ళిరి.

తా. మహాత్ముడైన రాముని అనుగ్రహమును ఈ విధముగ పొందిన ఆ వానరరాక్షసాదులందరూ, దేహమును విడచిపోవుచున్న జీవుడు వలె తమ తమ గృహములకు వెళ్ళిరి. 30

మూ. తతస్తు తే రాక్షసభుక్షవానరాః
ప్రణమ్య రామం రఘువంశవర్ధనమ్,
వియోగజాశ్రుప్రతిపూర్ణలోచనాః,
ప్రతిప్రయాతాస్తు యథానివాసినః. 31

ఇత్యార్షే శ్రీ మద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
చత్వారింశః సర్గః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తే = ఆ, రాక్షసఋక్షవానరాః = రాక్షస భల్లూక వానరులు, రఘువంశవర్ధనమ్ = రఘువంశమును వృద్ధిపొందించిన, రామమ్ = రాముణ్ణి, ప్రణమ్య = నమస్కరించి, వియోగజాశ్రు ప్రతిపూర్ణలోచనాః = వియోగమువల్ల కలిగిన కన్నీళ్ళతో నిండిన నేత్రములు గలవారై, వివాసినః యథా = ప్రవాసమునకు పోవుచున్నవారు వలె, ప్రతిప్రయాతాః తు = తిరిగి వెళ్ళిరి.

తా. అప్పుడు ఆ రాక్షస - భల్లూక - వానరులు రఘువంశమును వృద్ధి పొందించువాడైన రామునికి నమస్కరించి వియోగదుఃఖముచే కలిగిన కన్నీళ్ళతో నిండిన నేత్రములతో, ప్రవాసమునకు వెళ్ళుచున్నవారు వలె, తమ గృహములకు తిరిగి వెళ్ళిరి.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు,
ఉత్తరకాండలో నలుబదవ సర్గ సమాప్తము.

అథ ఏకచత్వారింశః సర్గః

[కుబేరుడు పంపగా పుష్పకము రాముని వద్దకు వచ్చుట, రాముడు దానిని పూజించి మరల పంపివేయుట. భరతుడు రామరాజ్యములోని అద్భుత ప్రభావములను వర్ణించి చెప్పుట.]

మూ. విసృజ్య చ మహాబాహుర్ఋక్షవానరరాక్షసాన్,
భ్రాతృభిః సహితో రామః ప్రముమోద సుఖం సుఖీ. 1

ప్ర. అ. మహాబాహుః = గొప్ప బాహువులు గల, రామః = రాముడు, ఋక్షవానరరాక్షసాన్ = భల్లూకవానరరాక్షసులను, విసృజ్య = వంపివేసి, భ్రాతృభిః = సోదరులతో, సహితః = కూడినవాడై, సుఖీ = సుఖవంతుడై, సుఖమ్ = సుఖముగా, ప్రముమోద = సంతోషించెను.

తా. బాహుబలశాలియైన రాముడు భల్లూక-వానర-రాక్షసులను పంపివేసి, సోదరులతో సుఖవంతుడై సుఖముగా ఆనందించెను. 1

మూ. అథాపరాహ్ణసమయే భ్రాతృభిః సహ రాఘవః,
శుశ్రావ మధురాం వాణీమన్తరిక్షాన్మహాప్రభుః. 2

ప్ర. అ. అథ = అటుపిమ్మట, మహాప్రభుః = మహాప్రభువైన, రాఘవః = రాముడు, అపరాహ్ణసమయే = అపరాహ్ణ సమయమునందు, అన్తరిక్షాత్ = ఆకాశమునుండి, మధురామ్ = మధురమైన, వాణీమ్ = వాక్కును, భ్రాతృభిః సహ = సోదరులతో కూడ, శుశ్రావ = వినెను.

తా. మహాప్రభువైన రాముడు సోదరులతో కూర్చుని ఉండగా అపరాహ్ణ సమయమునందు ఆకాశమునుండి మధురమైన వాక్కు వినబడెను. 2

మూ. సౌమ్య రామ నిరీక్షస్వ సౌమ్యేన వదనేన మామ్,
కుబేరభవనాత్ప్రాప్తం విద్ధి మాం పుష్పకం ప్రభో. 3

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడవై న, రామ = రామా ! మామ్ = నన్ను, సౌమ్యేన = సౌమ్యమైన, వదనేన = ముఖముతో, నిరీక్షస్వ = చూడుము. ప్రభో = ఓ ! ప్రభూ ! మామ్ = నన్ను, కుబేరభవనాత్ = కుబేరుని భవనమునుండి, ప్రాప్తమ్ = వచ్చిన, పుష్పకమ్ = పుష్పకమునుగా, విద్ధి = తెలుసుకొనుము.

తా. సౌమ్యుడా ! రామా ! నన్ను అనుగ్రహపూర్వకముగా చూడుము. ఓ! ప్రభూ ! నేను కుబేరుని భవనమునుండి వచ్చిన పుష్పకమును అని తెలుసు కొనుము. 3

మూ. తవ శాసనమాజ్ఞాయ గతోఽస్మి భవనం ప్రతి,
ఉపస్థాతుం నరశ్రేష్ఠ స చ మాం ప్రత్యభాషత. 4

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడా ! తవ = నీయొక్క, శాసనమ్ = ఆజ్ఞను, ఆజ్ఞాయ = తెలిసికొని, భవనం ప్రతి = కుబేరభవనమును గూర్చి, ఉపస్థాతుమ్ = కుబేరుణ్ణి సేవించుటకొరకు, గతః అస్మి = వెళ్ళితిని. సః చ = ఆ కుబేరుడు కూడ, మామ్ = నన్ను గూర్చి, ప్రత్యభాషత = పలికెను.

తా. నరులలో శ్రేష్ఠుడవైన రామా ! నీ ఆజ్ఞ ప్రకారము కుబేరుని సేవించు టకై ఆతని భవనమునకు వెళ్ళితిని. అతడు నాతో ఇట్లు పలికెను. 4

మూ. నిర్జితస్త్వం నరేన్ద్రేణ రాఘవేణ మహాత్మనా,
నిహత్య యుధి దుర్ధర్షం రావణం రాక్షసేశ్వరమ్. 5

ప్ర. అ. మహాత్మనా = మహాత్ముడైన, నరేన్ద్రేణ = రాజైన, రాఘవేణ = రామునిచేత, దుర్ధర్షమ్ = ఎదిరింప శక్యము కాని. రాక్షసేశ్వరమ్ = రాక్షసరాజైన, రావణమ్ = రావణుణ్ణి, యుధి = యుద్ధమునందు, నిహత్య = చంపి, త్వమ్ = నీవు, నిర్జితః = జయింపబడినావు.

తా. మహాత్ముడైన రాజైన రాముడు రాక్షసరాజైన, ఎదిరింప శక్యముకాని రావణుణ్ణి యుద్ధములో చంపి నిన్ను జయించుకొనినాడు. 5

మూ. మమాపి పరమా ప్రీతిర్భవతే తస్మిన్ దురాత్మని,
రావణే సగణే చైవ సపుత్రే సహబాన్ధవే. 6

ప్ర. అ. దురాత్మని = దుష్టబుద్ధి గల, సగణే = గణములతో కూడిన, సపుత్రే = పుత్రులతో కూడిన, సహబాన్ధవే = బంధువులతో కూడిన, తస్మిన్ రావణే = ఆ రావణుడు, హతే = చంపబడినవాడగుచుండగా, మమాపి = నాకు కూడ, పరమా = గొప్ప, ప్రీతిః = సంతోషము.

తా. దురాత్ముడైన ఆ రావణుడు, ఆతని పరివారము, పుత్రులు, బంధువులు చంపబడుటచే నేను కూడ సంతోషించుచున్నాను. 6

మూ. స త్వం రామేణ లఙ్కాయాం నిర్జితః పరమాత్మనా,
వహ సౌమ్య తమేవ త్వమహమాజ్ఞాపయామి తే. 7

ప్ర. అ. సః = అట్టి, త్వమ్ = నీవు, పరమాత్మనా = పరమాత్ముడైన, రామేణ = రామునిచేత, లఙ్కాయామ్ = లంకయందు, నిర్జితః = జయింపబడినావు. సౌమ్య = ఓ! సౌమ్యా! త్వమ్ = నీవు, తమేవ = ఆ రాముణ్ణే, వహ = మోయుము. అహమ్ = నేను, తే = నీకు, అజ్ఞాపయామి = ఆజ్ఞాపించుచున్నాను.

తా. పరమాత్ముడైన రాముడు లంకలో నిన్ను జయించుకొనినాడు. అందువలన, ఓ సౌమ్యా! నీవు ఆ రాముణ్ణే మోయుము. నేను నిన్ను ఆజ్ఞాపించుచున్నాను.

మూ. పరమో హ్యేష మే కామో యత్త్వం రాఘవనన్దనమ్,
వహేర్లోకస్య సంయానం గచ్ఛస్వ విగతజ్వరః. 8

ప్ర. అ. ఏషః = ఇది, మే = నాయొక్క, పరమః = గొప్పదైన, కామః = కోరిక, యత్ = ఏమనగా, త్వమ్ = నీవు, లోకస్య = లోకమునకు, సంయానమ్ = నడిపించువాడైన, రాఘవనన్దనమ్ = రాముణ్ణి, వహేః = మోయుదువు. విగతజ్వరః = పోయిన మనస్తాపము గలవాడవై, గచ్ఛస్వ = వెళ్లుము.

తా. నీవు లోకములను అన్నింటినీ నడిపించే ఆ రాముణ్ణి మోయవలె ననినా కోరిక. అందుచేత ఏమాత్రము మనస్తాపము లేక వెళ్ళుము. 8

మూ. సోఽహం శాసనమాజ్ఞాయ ధనదస్య మహాత్మనః,
త్వత్సకాశమనుప్రాప్తో నిర్విశఙ్కః ప్రతీచ్ఛ మామ్. 9

ప్ర. అ. సః అహమ్ = అట్టి నేను, మహాత్మనః = మహాత్ముడైన, ధనదస్య =

కుబేరునియొక్క, శాసనమ్ = ఆజ్ఞను, ఆజ్ఞాయ = తెలుసుకొని, త్వత్సకాశమ్= నీ సమీపమును గూర్చి, అనుప్రాప్తః=వచ్చినాను. నిర్విశఙ్కః=శంక లేనివాడవై, మామ్ = నన్ను, ప్రతీచ్ఛ = స్వీకరించుము.

తా. నేను మహాత్ముడైన కుబేరుని ఆజ్ఞను అనుసరించి నీవద్దకు వచ్చినాను. ఏ మాత్రము సందేహము లేనివాడవై నన్ను స్వీకరించుము. 9

మూ. అధృష్యః సర్వభూతానాం సర్వేషాం ధనదాజ్ఞయా,
చరామ్యహం ప్రభావేణ తవాజ్ఞాం పరిపాలయన్. 10

ప్ర. అ. ధనదాజ్ఞయా=కుబేరుని ఆజ్ఞచేత, సర్వేషామ్=అందరికి, సర్వ భూతానామ్ = సమస్తభూతములకు, అధృష్యః = ఎదిరింప శక్యముకానివాడను. తవ=నీయొక్క, ఆజ్ఞామ్ = ఆజ్ఞను, పరిపాలయన్ = పాలించుచు, అహమ్ = నేను, ప్రభావేణ = ప్రభావముచేత, చరామి = సంచరించుచున్నాను.

తా. కుబేరుని ఆజ్ఞచేత ఏ భూతములూ కూడ నన్ను ఎదిరించజాలవు. నేను ఇపుడు నీ ఆజ్ఞను అనుసరించి ప్రభావముతో సంచరించగలను. 10

మూ. ఏవముక్తస్తదా రామః పుష్పకేణ మహాబలః,
ఉవాచ పుష్పకం దృష్ట్వా విమానం పునరాగతమ్. 11

ప్ర. అ. తదా = అప్పుడు, పుష్పకేణ = పుష్పకముచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, మహాబలః=గొప్ప బలము గల, రామః = రాముడు, పునరా గతమ్=తిరిగి వచ్చిన, పుష్పకం విమానమ్=ఆ పుష్పకవిమానమును, దృష్ట్వా= చూచి, ఉవాచ = పలికెను.

తా. మహాబలశాలియైన రాముడు మరల వచ్చిన ఆ పుష్పకవిమానము పలికిన మాటలు విని దానిని చూచి ఇట్లనెను. 11

మూ. యద్యేవం స్వాగతం తేఽస్తు విమానవర పుష్పక,
అనుకూల్యాద్ధనేశస్య వృత్తదోషో ననో భవేత్. 12

ప్ర. అ. విమానవర = విమానములలో శ్రేష్ఠమైన, పుష్పక=పుష్పకమా! ఏవం యది = ఇట్లు అయినచో, తే = నీకు, స్వాగతమ్ = స్వాగతము, అస్తు =

ఆగుగాక, ధనేశస్య = కుబేరుడు, ఆనుకూల్యాత్ = అనుకూలుడుగా ఉండుటవలన, నః = మాకు, వృత్తదోషః = చరిత్రదోషము, న భవేత్ = కాదు.

తా. విమానశ్రేష్ఠమైన ఓ! పుష్పకమా! అల్లనచో నీకు స్వాగత మగుగాక. కుబేరుడు అంగీకరించినాడు గాన మేము నిన్ను ఉపయోగించుకొన్నను మా నడవడికలో తప్పుండదు. 12

మూ. లాజైశ్చైవ తథా పుష్పైర్ధూపైశ్చైవ సుగన్ధిభిః,
పూజయిత్వా మహాబాహూ రాఘవః పుష్పకం తదా. 13
గమ్యతామితి చోవాచ ఆగచ్ఛ త్వం స్మరే యదా.

ప్ర.అ. మహాబాహుః = గొప్ప బాహువులు గల, రాఘవః = రాముడు, తదా = అప్పుడు, పుష్పకమ్ = పుష్పకమును, లాజైః చ ఏవ = పేలాలతోను, తథా = మరియు, పుష్పైః = పువ్వులతోను, ధూపైః చ ఏవ = ధూపములతోను, సుగన్ధిభిః = మంచి వాసన గల వస్తువులతోను, పూజయిత్వా = పూజించి, గమ్యతామ్ = వెళ్లెదవుగాక, ఇతి చ = అని, ఉవాచ = పలికెను. యదా = ఎప్పుడు, స్మరే = స్మరింతునో అప్పుడు, త్వమ్ = నీవు, ఆగచ్ఛ = రమ్ము.

తా. అప్పుడు మహాబాహువైన రాముడు ఆ పుష్పకమును లాజలతోనూ, పువ్వులతోను ధూపములతోను, సువాసనద్రవ్యములతోను పూజించి "నీవు వెళ్లుము" అని పలికెను. "నేను ఎప్పుడు స్మరింతునో అప్పుడు రమ్ము". 13

మూ. సిద్ధానాం చ గతౌ సౌమ్య మా విషాదేన యోజయ. 14
ప్రతిఘాతశ్చ తే మా భూదయథేష్టం గచ్ఛతో దిశః.

ప్ర. అ. సౌమ్య = సౌమ్యా! సిద్ధానామ్ = సిద్ధులయొక్క, గతౌ = గమనమునందు, విషాదేన = దుఃఖముతో, మా యోజయ = కూర్చకుము. యథేష్టమ్ = ఇష్టము ప్రకారము, దిశః = దిక్కులను గూర్చి, గచ్ఛతః = వెళ్ళుచున్న, తే = నీకు, ప్రతిఘాతః చ = అడ్డు కూడ, మా భూత్ = లేకుండుగాక.

తా. సౌమ్యా! సిద్ధుల సంచారమునందు అడ్డము తగలకుము. యథేష్టముగా దిక్కులందు సంచరించుచున్న నీకు ఏ అడ్డూ లేకుండు గాక. 14

మూ. ఏవమస్త్వితి రామేణ పూజయిత్వా విసర్జితమ్, 15
అభిప్రేతాం దిశం తస్మాత్ప్రాయాత్తత్పుష్పకం తదా.

ప్ర. ఆ ఏవమ్ = ఇట్లు, అస్తు=అగుగాక, ఇతి=అని, రామేణ = రాముని చేత, పూజయిత్వా=పూజించి, విసర్జితమ్ = విడవబడిన, పుష్పకమ్=పుష్పకము, తదా = అప్పుడు, తస్మాత్=ఆ ప్రదేశమునుండి, అభిప్రేతామ్=తనకు ఇష్టమైన, దిశమ్ = దిక్కునుగూర్చి, ప్రాయాత్ = వెళ్లెను.

తా. రామునిచేత పూజించి విడువబడిన ఆ పుష్పకము "అట్లే అగుగాక" అని పలికి ఆ ప్రదేశమునుండి తన కిష్టమైన దిక్కునకు వెళ్లెను. 15

మూ. ఏవమన్తర్హితే తస్మిన్ పుష్పకే సుకృతాత్మని, 16
భరతః ప్రాఞ్జలిర్వాక్యమువాచ రఘునన్దనమ్.

ప్ర. ఆ. సుకృతాత్మని = పుణ్యస్వరూపము గల, తస్మిన్ పుష్పకే = ఆ పుష్పకము, ఏవమ్ = ఇట్లు, అన్తర్హితే = అంతర్ధానము చెందిన దగుచుండగా, భరతః=భరతుడు, ప్రాఞ్జలిః=కట్టబడిన దోసిలికలవాడై, రఘునన్దనమ్=రాముణ్ణి గూర్చి, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. పుణ్యస్వరూపమైన ఆ పుష్పకము అంతర్ధానము చెందిన పిమ్మట భరతుడు అంజలి ఘటించి రామునితో ఇట్లు పలికెను. 16

మూ. విబుధాత్మని దృశ్యన్తే త్వయి వీర ప్రశాసతి, 17
అమానుషాణి సత్త్వాని వ్యాహృతాని ముహుర్ముహుః.

ప్ర. అ. వీర = వీరుడా ! విబుధాత్మని=దేవతాస్వరూపుడవైన, త్వయి= నీవు, ప్రశాసతి=పాలించుచుండగా, అమానుషాణి=మనుష్యభిన్నమైన, సత్త్వాని= ప్రాణులు, ముహుః ముహుః = మాటిమాటికి, వ్యాహృతాని = పలుకుచున్నవిగా, దృశ్యన్తే = కనబడుచున్నవి.

తా. ఓ ! వీరుడా ! దేవతాస్వరూపుడవైన నీవు పరిపాలించుచుండగా మనుష్యభిన్నములైన ప్రాణులు కూడ మాటిమాటికి మాటలాడుచు కనబడుచున్నవి. 17

మూ. అనామయశ్చ మర్త్యానాం సాగ్రో మాసోగతో హ్యయమ్,
జీర్ణానామపి సత్త్వానాం మృత్యుర్నాయాతి రాఘవ.

ప్ర. అ. రాఘవ = రామా ! అయమ్ = ఈ, సాగ్రః = అగ్రముతో కూడిన, మాసః = మాసము, గతః హి = గడచినది కదా. మర్త్యానామ్ = మర్త్యులకు, అనామయః చ = రోగాభావము కూడ. జీర్ణానామ్ = ముసలివై పోయిన, సత్త్వానామ్ అపి = ప్రాణులకు కూడ, మృత్యుః = మృత్యువు, న ఆయాతి = వచ్చుటలేదు.

తా. రామా ! నీవు రాజ్యమునకు వచ్చి ఒక మాసము కంటె కొంచెము ఎక్కువ అయినది. మర్త్యులలో అనారోగ్యము లేదు. జీర్ణమైపోయిన (ముసలి) ప్రాణులకు కూడ మృత్యువు వచ్చుటలేదు. 18

మూ. అరోగప్రసవా నార్యో వపుష్మన్తో హి మానవాః, 19
హర్షశ్చాభ్యధికో రాజన్ జనస్య పురవాసినః.

ప్ర. అ. రాజన్ = రాజా ! నార్యః = స్త్రీలు, అరోగప్రసవాః = రోగములు లేని సంతానము కలవారు. మానవాః = మానవులు, వపుష్మన్తః = మంచి శరీరములు గలవారు. పురవాసినః = నగరమునందున్న, జనస్య = జనమునకు, హర్షః చ = సంతోషము కూడ, అభ్యధికః = అధికమైనది.

తా. రాజా ! స్త్రీలు రోగములు లేని సంతానమును కనుచున్నారు. పురుషులు శరీరసౌష్ఠవముతో ఉన్నారు. పురమునందు నివసించుచున్న జనులు చాల సంతోషముతో ఉన్నారు. 19

మూ. కాలే వర్షతి పర్జన్యః పాతయన్నమృతం పయః, 20
వాతాశ్చాపి ప్రవాన్త్యేతే స్పర్శయుక్తాః సుఖాః శివాః.

ప్ర. అ. పర్జన్యః = మేఘము, అమృతమ్ = అమృతమువంటి, పయః = ఉదకమును, పాతయన్ = కురియుచు, కాలే = తగిన కాలమునందు, వర్షతి = వర్షించుచున్నది. ఏతే = ఈ, వాతాః = వాయువులు, స్పర్శయుక్తాః = మంచి స్పర్శతో కూడినవై, సుఖాః = సుఖకరములై, శివాః = మంగళప్రదములై, ప్రవాన్తి = వీచుచున్నవి.

తా. మేఘము యుక్తకాలమునందు అమృతము వంటి ఉదకమును వర్షించుచున్నది. వాయువులు కూడ స్పర్శకు సుఖకరములై మంగళప్రదములై వీచుచున్నవి. 20

మూ. ఈదృశో నశ్చిరం రాజా భవేదితి నరేశ్వర, 21
కథయన్తి పురే రాజన్ పౌరా జానపదాస్తథా.

ప్ర. అ. నరేశ్వర = నరులకు ప్రభువైన, రాజన్ = రాజా ! నః = మాకు, ఈదృశః = ఇట్టి, రాజా = రాజు, చిరమ్ = చిరకాలము, భవేత్ = ఉండుగాక, ఇతి = అని, పురే = పట్టణమునందున్న, పౌరాః = పౌరులు, తథా = మరియు, జానపదాః = జానపదులు, కథయన్తి = చెప్పుచున్నారు.

తా. నరులకు ప్రభువైన ఓ ! రాజా ! మాకు చిరకాలము ఇట్టి రాజు ఉండుగాక అని పురములో నివసించువారు, గ్రామనివాసులైన ప్రజలూ కూడ అనుచున్నారు. 21

మూ. ఏతా వాచః సుమధురా భరతేన సమీరితాః,
శ్రుత్వా రామో ముదా యుక్తో బభూవ నృపసత్తమః. 22

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకచత్వారింశః సర్గః.

ప్ర. అ. భరతేన = భరతునిచేత, సమీరితాః = పలకబడిన, ఏతాః = ఈ, సుమధురాః = చాల మధురములైన, వాచః = వాక్కులను, శ్రుత్వా = విని, నృపసత్తమః = రాజశ్రేష్ఠుడైన, రామః = రాముడు, ముదా = సంతోషముతో, యుక్తః = కూడినవాడు, బభూవ = ఆయెను.

తా. భరతుడు పలికిన మధురములైన ఈ మాటలు విని రాజశ్రేష్ఠుడైన రాముడు చాల సంతోషించెను. 22

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో నలుబది ఒకటవ సర్గ సమాప్తము.

అథ ద్విచత్వారింశః సర్గః

[సీతారాములు అశోకవాటికలో విహరించుట. గర్భవతియైన సీతకు తపోవనమును చూడవలె ననుకోరిక ఉదయించుట. రాముడు ఆ కోరిక తీర్చెద నని మాట ఇచ్చుట.]

మూ. స విసృజ్య తతో రామః పుష్పకం హేమభూషితమ్,
ప్రవివేశ మహాబాహురశోకవనికాం ముదా. 1

ప్ర. అ. మహాబాహుః=గొప్ప బాహువులు గల, సః రామః=ఆ రాముడు, హేమభూషితమ్ = బంగారముచేత అలంకరించబడిన, పుష్పకమ్=పుష్పకమును, విసృజ్య = పంపివేసి, తతః = అటుపిమ్మట, ముదా = సంతోషముతో, అశోకవనికామ్ = అశోకవనమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. మహాబాహువైన ఆ రాముడు బంగారముచేత అలంకరింపబడిన పుష్పకమును పంపివేసి సంతోషముతో అశోకవనములో ప్రవేశించెను. 1

మూ. చన్దనాగురుచూతైశ్చ తుఙ్గకాలేయకైరపి,
దేవదారువనైశ్చాపి సమన్తాదుపశోభితామ్. 2

ప్ర. అ. చన్దనాగురుచూతైః చ = చందన-అగురు-చూతవృక్షములచేతను, తుఙ్గకాలేయకైః అపి = పుంనాగవృక్షములచేతను, రక్తచందనవృక్షములచేతను, దేవదారువనైః చ అపి = దేవదారువృక్షములచేతను, సమన్తాత్ = చుట్టూ, ఉపశోభితామ్ = ప్రకాశింపచేయబడిన (అశోకవనమును ప్రవేశించెను).

తా. ఆ అశోకవనము చుట్టూ చందన-అగురు.చూత-పుంనాగ-రక్తచందన దేవదారు వృక్షములు ఉండి దాని శోభను ఇనుమడింపచేయుచుండెను. 2

మూ. చమ్పకాశోకపుంనాగ మధూకపనసాసనైః,
శోభితాం పారిజాతైశ్చ విధూమజ్వలనప్రభైః. 3

ప్ర. అ. చమ్పకాశోక పున్నాగ మధూకపనసాసనైః = చంపక (సంపంగి) అశోక-పున్నాగ-మధూక (ఇప్ప)-పనస-అసనవృక్షములచేతను, విధూమజ్వలన ప్రభైః = ధూమము లేని అగ్ని వంటి కాంతి గల, పారిజాతైః చ = పారిజాత వృక్షములచేతను, శోభితామ్ = ప్రకాశింపచేయబడిన (అశోకవనమును ప్రవేశించెను.)

తా. ఆ అశోకవనమును చంపక-అశోక-పున్నాగ- మధూక-పనస- అసన వృక్షములు, ధూమము లేని అగ్ని వంటి కాంతి గల పారిజాతవృక్షములు ప్రకాశవంతము చేయుచుండెను. 3

మూ. లోధ్రనీపార్జునైర్నాగైః సప్తపర్ణాతిముక్తకైః,
మన్దారకదలీగుల్మలతాజాలసమాకులామ్. 4

ప్ర. అ. లోధ్రనీపార్జునైః = లోధ్ర-నీప-అర్జున (మద్ది) వృక్షములతోనూ, నాగైః = నాగవృక్షములతోను, సప్తపర్ణాతిముక్తకైః = ఏడాకుల అరటిచెట్లతోను, బండిగులివెంద పొదలతోను, మన్దారకదలీగుల్మలతాజాలసమాకులామ్ = మందార వృక్షములతోను, అరటి తోపులతోను, లతలతోను వ్యాకులమైన (అశోకవనమును ప్రవేశించెను).

తా. ఆ అశోకవనము లోధ్ర-నీప-అర్జున వృక్షములతోను, నాగవృక్షములతోను, ఏడాకుల అరటిచెట్లతోను, బండిగులివెంద తీగలతోను, మందారవృక్షములతోను, అరటి తోపులతోను, తీగల తోను వ్యాకులమై ఉండెను. 4

మూ. ప్రియఙ్గుభిః కదమ్బైశ్చ తథా చ వకులైరపి,
జమ్బూభిర్దాడిమైశ్చైవ కోవిదారైశ్చ శోభితామ్. 5

ప్ర. అ. ప్రియఙ్గుభిః = ప్రియంగువులచేత, కదమ్బైః చ = కదంబ వృక్షములచేత, తథా చ = మరియు, వకులైః అపి = వకులవృక్షములచేతను, జమ్బూభిః = నేరేడుచెట్లచేత, దాడిమైః చ ఏవ = దాడిమవృక్షములచేత, కోవిదారైః చ ఏవ = కోవిదారవృక్షములచేత, శోభితామ్ = ప్రకాశింపచేయబడిన (అశోకవనికను ప్రవేశించెను).

తా. ఆ అశోకవనము ప్రియంగు-కదంబ-వకుల-జంబూ-కోవిదార వృక్షములతో శోభించుచుండెను. 5

మూ. సర్వదాకుసుమై రమ్యైః ఫలవద్భిర్మనోరమైః,
దివ్యగన్ధరసోపేతై స్తరుణాఙ్కురపల్లవైః. 6

ప్ర. అ. సర్వదాకుసుమైః = ఎల్లప్పుడూ పుష్పములు గల, రమ్యైః = సుందరములైన, ఫలవద్భిః = ఫలములు గల, మనోరమైః = మనోహరములైన, దివ్యగన్ధరసోపేతైః = దివ్యములైన గంధరసములతో కూడిన, తరుణాఙ్కుర పల్లవైః = లేత అంకురములు, చిగుళ్ళు గల (వృక్షములతో ప్రకాశించుచున్న....)

తా. ఆ అశోకవనములోని వృక్షములు ఎల్లప్పుడు పుష్పములతో, ఫలములతో నిండి మనోహరములై ఉండెను. దివ్యమైన రసము, గంధమూ గల ఆవి లేత అంకురములతోను, చిగుళ్ళతోను నిండి ఉండెను. 6

మూ. తథైవ తరుభిర్దివ్యైః శిల్పిభిః పరికల్పితైః,
చారుపల్లవపుష్పాఢ్యైర్మత్తభ్రమరసంకులైః.

ప్ర. అ. తథా ఏవ = మరియు, శిల్పిభిః = శిల్పులచేత, పరికల్పితైః = చక్కగా ఏర్పరుపబడిన, చారుపల్లవపుష్పాఢ్యైః = అందమైన చిగుళ్ళతోను పుష్పములతోను నిండిన, మత్తభ్రమరసంకులైః = మదించిన తుమ్మెదలతో వ్యాకులములైన, దివ్యైః = దివ్యములైన, తరుభిః = వృక్షములచేత (ప్రకాశింపచేయబడిన....)

తా. అక్కడ ఉన్న దివ్యములైన చెట్లను శిల్పులు (ఉద్యానసంరక్షకులు) చూచుటకు అందముగా ఉండునట్లు కొమ్మలు మొదలైనవి కత్తిరించి ఏర్పరిచిరి. అవి అందమైన చిగుళ్ళతోను, పుష్పములతోను నిండి మదించిన తుమ్మెదలతో వ్యాకులములై ఉండెను. 7

మూ. కోకిలైర్భృఙ్గరాజైశ్చ నానావర్ణైశ్చ పక్షిభిః,
శోభితాం శతశశ్చిత్రాం చూతవృక్షావతంసకైః. 8

ప్ర. అ. కోకిలైః = కోకిలలచేత, భృఙ్గరాజైః చ = శ్రేష్ఠములైన తుమ్మెదలచేత, నానావర్ణైః = అనేకవర్ణములు గల, పక్షిభిః చ = పక్షులచేతను, శోభితామ్

= ప్రకాశింపచేయబడినది, శతశః = వందలకొలది, చూతవృక్షావతంసకైః = చూతవృక్షముల శిరోభూషణములైన పూవుల గుత్తులచేత, చిత్రామ్ = చిత్రవర్ణమూ (అయిన అశోకవనికను....)

తా. ఆ అశోకవనము కోకిలలతోను, శ్రేష్ఠములైన తుమ్మెదలతోను, అనేక వర్ణములు గల పక్షులతోను, శోభించుచుండెను. వందలకొలది చూతవృక్షములు అగ్రభాగములం దున్న పూలగుత్తులతో చిత్రవర్ణముగా ఉండెను. 8

మూ. శాతకుమ్భనిభాః కేచిత్కేచిదగ్నిశిఖోపమాః,
నీలాఞ్జననిభాశ్చాన్యే భాన్తి తత్ర స్మ పాదపాః. 9

ప్ర. అ. తత్ర = అక్కడ, కేచిత్ = కొన్ని, పాదపాః = వృక్షములు, శాతకుమ్భనిభాః = బంగారముతో సమానములుగాను, కేచిత్ = కొన్ని, అగ్ని శిఖోపమాః = అగ్నిజ్వాలలతో సమానములుగాను, అన్యే = మరికొన్ని, నీలాఞ్జన నిభాః = నల్లని కాటుకతో సమానముగాను, భాన్తి స్మ = ప్రకాశించుచుండెను.

తా. అక్కడ కొన్ని చెట్లు బంగారముతో సమానముగాను, మరికొన్ని అగ్నిజ్వాలలతో సమానములుగాను, ఇంకను కొన్ని నల్లని కాటుకతో సమానముగాను ప్రకాశించుచుండెను. 9

మూ. సురభీణి చ పుష్పాణి మాల్యాని వివిధాని చ,
దీర్ఘికా వివిధాకారాః పూర్ణాః పరమవారిణా. 10

ప్ర. అ. పుష్పాణి = పుష్పములు, వివిధాని = అనేకవిధములైన, మాల్యాని = మాలలు, సురభీణి = పరిమళించుచున్నవి. వివిధాకారాః = అనేకవిధములైన ఆకారములు గల. దీర్ఘికాః = దిగుడుబావులు, పరమవారిణా = శ్రేష్ఠమైన ఉదకముతో, పూర్ణాః = నిండినవి.

తా. అక్కడ పరిమళించుచున్న పుష్పములు, అనేకవిధములైన మాలికలు, మంచి ఉదకముతో నిండిన, అనేక ఆకారములు గల దిగుడుబావులూ ఉన్నవి.

మూ. మాణిక్యకృతసోపానాః స్ఫాటికాన్తరకుట్టిమాః,
పుల్లపద్మోత్పలవనాశ్చక్రవాకోపశోభితాః, 11

దాత్యూహశుకసంఘుష్టా హంససారసనాదితాః,
తరుభిః పుష్పశబలైస్తీరజైరుపశోభితాః, 12
ప్రాకారైర్వివిధాకారైః శోభితాశ్చ శిలాతలైః.

ప్ర. అ. మాణిక్యకృతసోపానాః=మాణిక్యములతో నిర్మింపబడిన మెట్లు గల, స్ఫాటికాన్తరకుట్టిమాః = స్ఫటికమాణిక్యవికారమైన లోపలి చపటాలు గల, ఫుల్లపద్మోత్పలవనాః = వికసించిన పద్మవనములు, ఉత్పలవనములూ గల, చక్రవాకోపశోభితాః=చక్రవాకపక్షులచేత అలంకరింపబడిన, దాత్యూహశుకసంఘుష్టాః = నీటికాకులచేతను, చిలుకలచేతను ధ్వనింపచేయబడిన, హంససారసనాదితాః= హంసలచేతను సారసపక్షులచేతను ధ్వనింపచేయబడిన, పుష్పశబలైః = పువ్వులతో విచిత్రవర్ణములుగా ఉన్న, తీరజైః = తీరమునందు మొలచిన, తరుభిః = వృక్షములచేత, ఉపశోభితాః = శోభింపచేయబడిన, వివిధాకారైః = అనేక విధములైన ఆకారములు గల, ప్రాకారైః = ప్రాకారములచేతను, శిలాతలైః = శిలాఫలకములచేతను, శోభితాః చ = శోభింపచేయబడిన (దిగుడుబావు లున్నవి).

తా. ఆ దిగుడుబావుల మెట్లు మాణిక్యములతో నిర్మించిరి. వాటి మధ్య ఉన్న చపటాలు స్ఫటికమాణిక్యములతో నిర్మించిరి. వికసించిన పద్మముల సముదాయము, కలవలు, చక్రవాకపక్షులు వాటిని శోభింపచేయుచుండెను. అవి నీటికాకులు, చిలుకలు, హంసలు, సారసపక్షులు చేయు ధ్వనులతో మారుమ్రోగుచుండెను. తీరములమీద ఉన్న, పువ్వులతో విచిత్రవర్ణములైన వృక్షములు వాటి శోభను పెంచుచుండెను. వాటికి అనేక ఆకారములలో ప్రాకారములు, చుట్టూ శిలాఫలకములు ఉండెను. 11,12

మూ. తత్రైవ చ వనోద్దేశే వైదూర్యమణిసంనిభైః, 13
శాద్వలైః పరమోపేతాం పుష్పితద్రుమకాననామ్.

ప్ర. అ. తత్ర = ఆ, వనోద్దేశే ఏవ=వనప్రాంతమునందే, వైదూర్యమణిసంనిభైః = వైదూర్యమాణిక్యతుల్యములైన, శాద్వలైః = పచ్చికబీడులతో, పరమోపేతామ్ = అధికముగా కూడిన, పుష్పితద్రుమకాననామ్ = పుష్పించిన వృక్షములు గల వనములుగలది అయిన (అశోకవనిని ప్రవేశించెను.)

తా. అక్కడ అశోకవనసమీపమునందు వైదూర్య మణుల వంటి పచ్చిక

బీడులు ఉండెను. సమీపమునందున్న వనములు పుష్పించిన వృక్షములతో నిండి యుండెను. 13

మూ. తత్ర సంహర్షజాతానాం వృక్షాణాం పుష్పశాలినామ్, 14
ప్రస్తరాః పుష్పశబలా నభస్తారాగణైరివ.

ప్ర. అ. తత్ర = అక్కడ, ప్రస్తరాః = శిలాఫలకములు, సంహర్షజాతానామ్ = పోటిపడి పుట్టిన, పుష్పశాలినామ్ = పుష్పములతో ప్రకాశించుచున్న, వృక్షాణామ్ = వృక్షములయొక్క, పుష్పశబలాః = పుష్పములచేత విచిత్రవర్ణములై, తారాగణైః = నక్షత్రములగణములచేత, నభః ఇవ = ఆకాశము వలె ఉండెను.

తా. అక్కడ పోటి పడి పెరుగుచున్నవా అన్నట్లు పెద్దవిగా పెరిగిన, పుష్పములతో నిండిన వృక్షముల పుష్పములు రాలి విచిత్రవర్ణములుగా ఉన్న శిలాఫలకములు నక్షత్రగణములతో కూడిన ఆకాశము వలె ఉండెను. 14

మూ. నన్దనం హి యథేన్ద్రస్య బ్రాహ్మం చైత్రరథం యథా, 15
తథాభూతం హి రామస్య కాననం సన్నివేశనమ్.

ప్ర. అ. రామస్య = రామునియొక్క, సన్నివేశనమ్ = చక్కని ఏర్పాట్లుగల, కాననమ్ = ఉద్యానము, ఇన్ద్రస్య = ఇంద్రునియొక్క, నన్దనమ్ = నందనము, యథా = ఎట్లో, బ్రాహ్మమ్ = బ్రహ్మనిర్మితమైన, చైత్రరథమ్ = చైత్రరథమను ఉద్యానము, యథా = ఎట్లో, తథాభూతం హి = ఆ విధముగా ఉన్నది కదా?

తా. చక్కగా ఏర్పరుపబడిన ఆ రాముని ఉద్యానము ఇంద్రుని నందనోద్యానము వలె, బ్రహ్మ నిర్మించిన చైత్రరథోద్యానము వలె ఉండెను. 15

మూ. బహ్వాసనగృహోపేతాం లతాసనసమావృతామ్, 16
అశోకవనికాం స్ఫీతాం ప్రవిశ్య రఘునన్దనః.
ఆసనే తు శుభాకారే పుష్పప్రకరభూషితే, 17
కుథాస్తరణసంస్తీర్ణే రామః సంనిషసాద హ.

ప్ర అ. రఘునన్దనః = రఘువంశరాజులను ఆనందింపచేయు, రామః = రాముడు, బహ్వాసనగృహోపేతామ్ = ఆనేకములైన ఆసనములు గల గృహము

లతో కూడిన, లతాసనసమావృతామ్=లతాగృహములతో వ్యాప్తమైన, స్ఫీతామ్= విశాలమైన, అశోకవనికామ్=అశోకవనమును, ప్రవిశ్య = ప్రవేశించి, శుభాకారే= శుభమైన ఆకారము గల, పుష్పప్రకరభూషితే=పుష్పసముదాయముచేత అలంకరించబడిన, కుథాస్తరణసంస్తీర్ణే = తివాచీచేత పరవబడిన, ఆసనే=ఆసనముమీద, సంనిషసాద = కూర్చుండెను.

తా. రఘువంశీయులకు ఆనందమును చేయు రాముడు అనేకవిధములైన ఆసనములున్న గృహములూ, అక్కడక్కడ లతాగృహములూ ఉన్న విశాలమైన ఆ అశోకవనములో ప్రవేశించి తివాచీ పరచిన, పుష్పసముదాయముచేత అలంకృతమైన, అందమైన ఆకారము గల ఆసనముమీద కూర్చుండెను. 16,17

మూ. సీతామాదాయ హస్తేన మధు మైరేయకం శుచి, 18
పాయయామాస కాకుత్స్థః శచీమివ పురన్దరః.

ప్ర. అ. కాకుత్స్థః = రాముడు, శుచి = పరిశుద్ధమైన, మైరేయకమ్ = పెద్దఉసిరి బెల్లము మొదలైనవాటితో తయారుచేయబడిన, మధు = మధువును, హస్తేన = హస్తముచేత, ఆదాయ = గ్రహించి, పురన్దరః = దేవేంద్రుడు, శచీమివ = శచీదేవిని వలె, సీతామ్ = సీతను, పాయయామాస = త్రాగించెను.

తా॥ రాముడు పరిశుద్ధమైన మైరేయక మను మధ్యమును చేతితో తీసికుని, ఇంద్రుడు శచీదేవికి త్రాగించినట్లు సీతకు త్రాగించెను. 18

మూ. మాంసాని చ సుమృష్టాని ఫలాని వివిధాని చ, 19
రామస్యాభ్యవహారార్థం కింకరాస్తూర్ణమాహరన్.

ప్ర. అ. కింకరాః = కింకరులు, సుమృష్టాని = బాగా శుద్ధిచేయబడిన, మాంసాని = మాంసములను, వివిధాని = అనేకవిధములైన, ఫలాని చ = ఫలములను, రామస్య = రామునియొక్క-, అభ్యవహారార్థమ్ = తినుటకొరకు, తూర్ణమ్= శీఘ్రముగా, ఆహరన్ = తీసికొనివచ్చిరి.

తా. రాముడు భుజించుటకై కింకరులు బాగా శుద్ధి చేసిన మాంసములను, అనేకవిధములైన ఫలములను శీఘ్రముగా తీసికొని వచ్చిరి. 19

మూ. ఉపానృత్యంశ్చ రాజానం న్యత్యగీతవిశారదాః, 20
అప్సరోరగసంఘాశ్చ కింనరీపరివారితాః.

ప్ర. అ. నృత్యగీతవిశారదాః = నృత్యమునందు సంగీతమునందు నేర్పు గల, కింనరీపరివారితాః = కింనరస్త్రీలచేత చుట్టబడిన, అపరోన్నరగసంఘాః చ = అప్సరఃస్త్రీల, ఉరగుల సంఘములు, రాజానమ్ = ఆ రాజును, ఉపానృత్యన్ = సమీపమునందు నృత్యము చేసిరి.

తా. కింనరస్త్రీలతో కూడిన, నృత్యసంగీతములయందు నేర్పు గల అప్సరఃస్త్రీలు, ఉరగస్త్రీలు రాముని దగ్గర నృత్యములు చేసిరి. 20

మూ. దక్షిణా రూపవత్యశ్చ స్త్రియః పానవశం గతాః, 21
ఉపానృత్యన్త కాకుత్థ్సం నృత్యగీతవిశారదాః.

ప్ర. అ. దక్షిణాః = నేర్పుగలవారు, రూపవత్యః చ = రూపవతులు, పానవశమ్ = పానమునకు వశమును, గతాః = పొందిన, నృత్యగీతవిశారదాః = నృత్యగీతములయందు నేర్పు గల, స్త్రియః = స్త్రీలు, కాకుత్థ్సమ్ ఉపానృత్యన్త = రాముని దగ్గర నృత్యములు చేసిరి.

తా. మంచి నేర్పు గల, సౌందర్యవతులైన, నృత్యగీతములలో ప్రావీణ్యము గల, స్త్రీలు పానమునకు వశలై రాముని దగ్గర నృత్యము చేసిరి. 21

మూ. మనోభిరామా రామాస్తా రామో రమయతాం వరః. 22
రమయామాస ధర్మాత్మా నిత్యం పరమభూషితాః.

ప్ర. అ. రమయతామ్ = ఆనందింపచేయువారిలో, వరః = శ్రేష్ఠుడు, ధర్మాత్మా = ధర్మాత్ముడు అయిన, రామః = రాముడు, మనోభిరామాః = మనస్సుకు ఆనందము కలిగించు, పరమభూషితాః = బాగా అలంకరించబడిన, తాః రామాః = ఆ స్త్రీలను, నిత్యమ్ = నిత్యమూ, రమయామాస = క్రీడింపచేసెను.

తా. ఆనందింపచేయువారిలో శ్రేష్ఠుడూ, ధర్మాత్ముడూ అయిన రాముడు మనస్సు ఆకర్షించు, బాగా అలంకరించుకొనిన అ స్త్రీలను నిత్యము క్రీడింపచేసెను.

వి. ఈశ్లోకం ప్రాచ్యప్రతిలో లేదు. 22

మూ. స తయా సీతయా సార్ధమాసినో విరరాజ హ, 23
అరున్ధత్యా ఇవాసీనో వసిష్ఠ ఇవ తేజసా.

ప్ర. అ. తయా = ఆ. సీతయా సార్ధమ్ = సీతతో కూడ, ఆసీనః = కూర్చున్న, సః = ఆ రాముడు, అరున్ధత్యా సహ = అరుంధతితో కూడ, ఆసీనః = కూర్చున్న, వసిష్ఠః ఇవ = వసిష్ఠుడు వలె, తేజసా = తేజస్సుతో, విరరాజ హ = ప్రకాశించెను.

తా. ఆ సీతతో కూడ కూర్చున్న రాముడు, తేజస్సుచేత, అరుంధతితో కూర్చున్న వసిష్ఠుడు వలె ప్రకాశించెను. 23

మూ. ఏవం రామో ముదా యుక్తః సీతాం సురసుతోపమామ్,
రమయామాస వై దేహీమహన్యహని దేవవత్.

ప్ర. అ. రామః = రాముడు, ముదా = సంతోషముతో, యుక్తః = కూడిన వాడై, సురసుతోపమామ్ = దేవతాకన్యతో సమానురాలైన, వైదేహీమ్ = విదేహ రాజకుమారియైన, సీతామ్ = సీతను, దేవవత్ = దేవతాపురుషుడు వలె, అహన్యహని = ప్రతిదినమునందు, రమయామాస = క్రీడింపచేసెను.

తా. రాముడు ఈ విధముగా సంతోషముతో కూడినవాడై, దేవకన్యతో సమానురాలైన, విదేహరాజకన్య అయిన సీతను ప్రతిదినమునందు, దేవతాపురుషుడు వలె ఆనందింపచేసెను. 24

మూ. తథా తయోర్విహరతోః సీతారాఘవయోశ్చిరమ్, 25
అత్యక్రామచ్ఛుభః కాలః శైశిరో భోగదః సదా.

ప్ర. అ. తథా = అట్లు, చిరమ్ = చిరకాలము, విహరతోః = విహరించు చున్న, తయోః = ఆ, సీతారాఘవయోః = సీతారాములకు, సదా = ఎల్లప్పుడూ, భోగదః = భోగమును ఇచ్చు, శుభః = శుభమైన, శైశిరః కాలః = శిశిరర్తువుకు సంబంధించిన కాలము, అత్యక్రామత్ = గడచెను.

తా. సీతారాములు చిరకాలము ఈ విధముగా భోగములను అనుభవించు చుండగా ఎల్లప్పుడూ భోగమును అనుభవించుటకు అనువైన, రమ్యమైన శిశిర కాలము గడచెను. 25

మూ. దశ వర్షసహస్రాణి గతాని సుమహాత్మనోః, 26
ప్రాప్తయోర్వివిధాన్ భోగానతీతః శిశిరాగమః.

ప్ర. అ. సుమహాత్మనోః = చాల గొప్ప మనస్సులు గల వారిద్దరికీ, దశ వర్షసహస్రాణి = పది వేల సంవత్సరములు, గతాని = గడచినవి. వివిధాన్ = అనేకవిధములైన, భోగాన్ = భోగములను, ప్రాప్తయోః = పొందిన వారిద్దరికీ, శిశిరాగమః = శిశిరర్తువు, గతః = గడచినది.

తా. ఆ మహాత్ములిద్దరికీ పది వేల సంవత్సరములు గడచెను. వారిరువురూ, అనేకవిధములైన భోగములను అనుభవించుచుండగా శిశిరర్తువు గడచెను.

వి. పై రెండు శ్లోకాలకు బదులు ప్రాచ్యపాఠములో—

"తథా చ రమమాణస్య తస్యాథ శిశిరాగమః
వ్యతీతః పూరుషేన్ద్రస్య రాఘవస్య మహాత్మనః"

అను ఒక్క శ్లోకము మాత్రమే ఉన్నది. 26

మూ. పూర్వాహ్ణే ధర్మకార్యాణి కృత్వా ధర్మేణ ధర్మవిత్,
శేషం దివసభాగార్ధమన్తఃపురగతోఽనయత్. 27

ప్ర. అ. ధర్మవిత్ = ధర్మవేత్త అయిన రాముడు, పూర్వాహ్ణే = పూర్వాహ్ణమునందు, ధర్మేణ = ధర్మముచేత, ధర్మకార్యాణి = ధర్మకార్యములను, కృత్వా = చేసి, శేషమ్ = మిగిలిన, దివసభాగార్ధమ్ = పగటిభాగములో సగమును, అన్తఃపురగతః = అంతఃపురములో ఉన్నవాడుగా, అనయత్ = గడపెను.

తా. ధర్మము లన్నీ తెలిసిన రాముడు పూర్వాహ్ణమునందు ధర్మానుసారముగా చేయవలసిన ధర్మకార్యము లన్నీ పూర్తిచేసికొని అపరాహ్ణమును అంతఃపురములో గడుపుచుండెడివాడు. 27

మూ. సీతాపి దేవకార్యాణి కృత్వా పౌర్వాహ్ణికాని వై,
శ్వశ్రూణామకరోత్పూజాం సర్వాసామవిశేషతః. 28

ప్ర. అ. సీతాపి = సీత కూడ, పౌర్వాహ్ణికాని = పూర్వాహ్ణమునకు సంబంధించిన, దేవకార్యాణి = దేవకార్యములను, కృత్వా = చేసి, సర్వాసామ్ = సమస్తమైన, శ్వశ్రూణామ్ = అత్తగార్లయొక్క, పూజామ్ = పూజను, అవిశేషతః = భేదము లేకుండా, అకరోత్ = చేసెను.

తా. సీత కూడ పూర్వాహ్ణమునందు చేయవలసిన దేవతాపూజాదులు చేసి కొని అందరు అత్తలకు, ఏమీ భేదభావము లేకుండా, సేవ చేసెడిది. 28

మూ. అభ్యాగచ్ఛత్తతో రామం విచిత్రాభరణాంబరా,
త్రివిష్టపే సహస్రాక్షముపవిష్టం యథా శచీ. 29

ప్ర. అ. తతః = అటుపిమ్మట, విచిత్రాభరణాంబరా = విచిత్రములైన ఆభరణములు, వస్త్రములూ కలదై, త్రివిష్టపే = స్వర్గమునందు, ఉపవిష్టమ్ = కూర్చుని ఉన్న, సహస్రాక్షమ్ = ఇంద్రుణ్ణి, శచీ యథా = శచీదేవి వలె, రామమ్ = రాముణ్ణి, అభ్యాగచ్ఛత్ = సమీపించెడిది.

తా. పిమ్మట ఆమె విచిత్రములైన ఆభరణములు, వస్త్రములు ధరించి, స్వర్గములో కూర్చుని ఉన్న ఇంద్రుణ్ణి శచీదేవి సమీపించినట్లు రాముని దగ్గరకు వెళ్ళుచుండెడిది. 29

మూ. దృష్ట్వా తు రాఘవః పత్నీం కల్యాణేన సమన్వితామ్,
ప్రహర్షమతులం లేభే సాధు సాధ్వితి చాబ్రవీత్. 30

ప్ర. అ. రాఘవః = రాముడు. కల్యాణేన = మంగళకరమైన వేషముతో, సమన్వితామ్ = కూడిన, పత్నీమ్ = భార్యను, దృష్ట్వా = చూచి, అతులమ్ = సాటిలేని, ప్రహర్షమ్ = సంతోషమును, లేభే = పొందెను. సాధు సాధు ఇతి = బాగు బాగు అని, అబ్రవీత్ చ = పలికెను కూడ.

తా. మంగళకరమైన వేషము ధరించి వచ్చిన సీతను చూచి రాముడు చాల సంతోషించి "బాగు బాగు"అని అభినందించెను. 30

మూ. అబ్రవీచ్చ వరారోహాం సీతాం సురసుతోపమామ్,
అపత్యలాభో వైదేహి త్వయా మే సముపస్థితః. 31

ప్ర. అ. సురసుతోపమామ్ = దేవతాకన్యతో సమానురాలైన, వరారోహామ్ = శ్రేష్ఠమైన కటిప్రదేశము గల సీతామ్ = సీతను గూర్చి, అబ్రవీత్ చ = పలికెను కూడ; వైదేహి = సీతా! త్వయి = నీయందు, మే = నాకు, అపత్యలాభః = సంతాన లాభము, సముపస్థితః = సమీపించినది.

తా. దేవతాస్త్రీతో సమానురాలైన, ఉత్తమమైన కటిప్రదేశము గల సీతతో ఇట్లనెను-"ఓ ! సీతా ! నీవలన నాకు సంతానప్రాప్తి అచిరకాలములో కలుగ నున్నది." 31

మూ. కిమిచ్ఛసి వరారోహే కామః కః క్రియతాం తవ,
స్మితం కృత్వా తు వైదేహీ రామం వాక్యమథాబ్రవీత్. 32

ప్ర. అ. వరారోహే=శ్రేష్ఠమైన కటిప్రదేశము గలదానా ! కిమ్ = దేనిని, ఇచ్ఛసి = కోరుచున్నావు? తవ = నీకు, కః=ఏ, కామః = కోరిక, క్రియతామ్= చేయబడుగాక? అథ = అటుపిమ్మట, వైదేహీ = సీత, స్మితమ్ = చిరునవ్వును, కృత్వా = చేసి, రామమ్ = రాముణ్ణి గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్= పలికెను.

తా. ఓ! సీతా! నీకు ఏమి కోరిక ఉన్నది. నేను నీ ఏ కోరిక తీర్చవలెను?" అప్పుడు సీత చిరునవ్వు నవ్వి రామునితో ఇట్లు పలికెను. 32

మూ. తపోవనాని పుణ్యాని ద్రష్టుమిచ్ఛామి రాఘవ,
గఙ్గాతీరోపవిష్టానామృషీణాముగ్రతేజసామ్, 33
ఫలమూలాశినాం దేవ సారమూలేషు వర్తితుమ్.

ప్ర. అ. రాఘవ = రామా! పుణ్యాని = పవిత్రములైన, తపోవనాని = తపోవనములను, ద్రష్టుమ్=చూచుటకు, గఙ్గాతీరోపవిష్టానామ్=గంగాతీరమునందు కూర్చుని ఉన్న, ఉగ్రతేజసామ్ = ఉగ్రమైన తేజస్సు గల, ఫలమూలాశినామ్ = ఫలమూలములను భక్షించు, ఋషీణామ్=ఋషులయొక్క, పాదమూలేషు = పాద మూలములయందు, వర్తితుమ్ = ఉండుటకూ, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. రామా! పవిత్రములైన తపోవనములు చూడవలె ననీ, గంగాతీరము నందు నివసించువారు, ఫలమూలములను మాత్రమే భక్షించువారు, ఉగ్రమైన తేజస్సు కలవారూ అయిన ఋషుల పాదాల దగ్గర ఉండవలె ననీ నాకు కోరిక ఉన్నది. 33

మూ. ఏష మే పరమః కామో యన్మూలఫలభోజినామ్, 34
అప్యేకరాత్రిం కాకుత్స్థ నివసేయం తపోవనే.

ప్ర. అ. కాకుత్స్థ = రామా! ఏషః = ఇది, మే = నాయొక్క, పరమః=

గొప్ప, కామః = కోరిక, యత్ = ఏమనగా, ఏకరాత్రిమ్ = ఒక్క రాత్రి అయినా, మూలఫలభోజినామ్ = మూలఫలములను భుజించు మునులయొక్క, తపోవనే = తపోవనమునందు, వసేయమ్ = నివసింతును.

తా. రామా ! మూలఫలములు భుజించు మునీశ్వరుల ఆశ్రమమునందు ఒక్క రాత్రి అయినా నివసించవలెను అనేదే నా కోరిక. 34

మూ. తథేతి చ ప్రతిజ్ఞాతం రామేణాక్లిష్టకర్మణా, 35
విశ్రబ్ధా భవ వైదేహి శ్వో గమిష్యస్యసంశయమ్.

ప్ర. అ. వైదేహి = సీతా, తథా = అట్లే; అసంశయమ్ = నిఃసంశయముగా, శ్వః = రేపు, గమిష్యసి = వెళ్ళగలవు. విశ్రబ్ధా = నమ్మకము కలదానవు, భవ = అగుము; ఇతి = అని, అక్లిష్టకర్మణా = క్లేశములు లేకుండ కర్మలు చేయు, రామేణ = రామునిచేత, ప్రతిజ్ఞాతమ్ = ప్రతిజ్ఞ చేయబడినది.

తా. "సీతా! అట్లే, రేపు తప్పక వెళ్లెదవు. నమ్మకముతో ఉండుము"అని క్లేశము లేకుండ పనులు చేయు రాముడు మాట ఇచ్చెను. 35

మూ. ఏవముక్త్వా తు కాకుత్స్థో మైథిలీం జనకాత్మజామ్,
మధ్యకక్షాన్తరం రామో నిర్జగామ సుహృద్వృతః. 36

ఇత్యార్షే శ్రీమదార్షరామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ద్విచత్వారింశః సర్గః.

ప్ర. అ. కాకుత్స్థః = కకుత్స్థవంశసంజాతుడైన, రామః = రాముడు, జనకాత్మజామ్ = జనకుని కుమార్తెయైన, మైథిలీమ్ = సీతను గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, సుహృద్వృతః = స్నేహితులతో కూడినవాడై, మధ్యకక్షాన్తరమ్ = మధ్యనున్న మరొక కక్ష(హాలు)ను గూర్చి, నిర్జగామ = బయలుదేరి వెళ్లెను.

తా. రాముడు సీతతో ఇట్లు పలికి స్నేహితులతో కలిసి ప్రాసాదమధ్యమునం దున్న మరొక కక్షకు వెళ్లెను. 36

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
నలబదిరెండవ సర్గ సమాప్తము.

అథ త్రిచత్వారింశ: సర్గ:

[భద్రుడు సీతను గూర్చిన లోకాపవాదమును రామునకు తెలుపుట].

మూ. తత్రోపవిష్టం రాజానముపాసన్తే విచక్షణా:,
కథానాం బహురూపాణాం హాస్యకారా: సమన్తత:. 1

ప్ర. అ. తత్ర = అక్కడ, ఉపవిష్టమ్ = కూర్చుని ఉన్న, రాజానమ్ = రాజును, బహురూపాణామ్ = అనేకవిధములైన, కథానామ్ = కథలకు (లో), విచక్షణా: = నేర్పు గల, హాస్యకారా: = హాస్యము చేయువాళ్ళు, సమన్తత: = చుట్టూ, ఉపాసన్తే = సేవించుచున్నారు.

తా. రాజు అక్కడ కూర్చుని ఉండగా అనేకవిధాలైన కథలలో నేర్పరులైన హాస్యము కలుగునట్లు మాట్లాడేవాళ్ళు ఆతని చుట్టూ కూర్చుండి సేవించుచుండిరి. 1

మూ. విజయో మధుమత్తశ్చ కాశ్యపో మఙ్గల: కుల:,
సురాజి: కాలియో భద్రో దన్తవక్త్ర: సుమాగధ:. 2

ఏతే కథా బహువిధా: పరిహాససమన్వితా:,
కథయన్తి స్మ సంహృష్టా రాఘవస్య మహాత్మన:. 3

ప్ర. అ. విజయ: = విజయుడు, మధుమత్త: చ = మధుమత్తుడు, కాశ్యప: = కాశ్యపుడు, మఙ్గల: = మంగలుడు, కుల: = కులుడు, సురాజి: = సురాజి, కాలియ: = కాలియుడు, దన్తవక్త్ర: = దంతవక్త్రుడు, సుమాగధ: = సుమాగధుడు, ఏతే = వీరు, పరిహాససమన్వితా: = పరిహాసముతో కూడిన, బహువిధా: = అనేకవిధములైన, కథా: = కథలను, మహాత్మన: = మహాత్ముడైన, రాఘవస్య = రామునకు, సంహృష్టా: = సంతోషించుచు, కథయన్తి స్మ = చెప్పుచుండిరి.

తా. విజయుడు, మధుమత్తుడు, కాశ్యపుడు, మంగలుడు, కులుడు, సురాజి,

కాలియుడు, భద్రుడు, దంతవక్త్రిడు, సుమాగధుడు, వీరందరూ మంచి ఉత్సాహముతో మహాత్ముడైన రామునితో పరిహాసపూర్వకములైన మాటలు చెప్పుచుండిరి.

మూ. తతః కథాయాం కస్యాం చిద్రాఘవః సమభాషత,
కాః కథా నగరే భద్ర వర్తన్తే విషయేషు చ. 4

ప్ర. అ. తతః = అటుపిమ్మట, కస్యాం చిత్ = ఒకానొక, కథాయామ్ = కథయందు, రాఘవః = రాముడు, సమభాషత = పలికెను. భద్ర = భద్రుడా ! నగరే = నగరమునందు, విషయేషు చ = దేశములయందు, కాః కథాః = ఏ కథలు (ఎట్టి సంభాషణలు-కబుర్లు), వర్తన్తే = జరుగుచున్నవి.

తా. అపుడు మాటల సందర్భములో రాముడు ఇట్లు అడిగెను-"భద్రుడా ! నగరములోను, దేశములోను ప్రజలు ఏమేమి చెప్పుకొనుచున్నారు ?" 4

మూ. మమాశ్రితాని కావ్యాహుః పౌరజానపదా జనాః,
కిం చ సీతాం సమాశ్రిత్య భరతం కిం చ లక్ష్మణమ్. 5

ప్ర. అ. పౌరజానపదాః = పురములకు, గ్రామాలకు సంబంధించిన, జనాః = జనులు, మమ = నాకు, ఆశ్రితాని = సంబంధించిన, కాని = వేటిని, ఆహుః = చెప్పుకొనుచున్నారు? సీతామ్ = సీతను, సమాశ్రిత్య = సంబంధించి, కిం చ = ఏమి చెప్పుకొనుచున్నారు ? భరతమ్ = భరతుణ్ణి, లక్ష్మణం చ = లక్ష్మణుణ్ణి గూర్చి, కిమ్ = ఏమి చెప్పుకొనుచున్నారు ?

తా. పురములలోను, గ్రామాలలోను నివసించు జనులు నన్ను గూర్చి, సీతను గూర్చి, భరతుణ్ణి గూర్చి, లక్ష్మణుణ్ణి గూర్చి ఏమి చెప్పుకొనుచున్నారు?

మూ. కిం ను శత్రుఘ్నముద్దిశ్య కైకేయీం కిం ను మాతరమ్,
వక్తవ్యతాం చ రాజానో నవే రాజ్యే ప్రజన్తి హి. 6

ప్ర. అ. శత్రుఘ్నమ్ = శత్రుఘ్నుణ్ణి, ఉద్దిశ్య = గూర్చి, కిం ను = ఏమి చెప్పుకొనుచున్నారు ? మాతరమ్ = తల్లియైన, కైకేయీమ్ = కైకేయిని గూర్చి, కిం ను = ఏమి చెప్పుకొనుచున్నారు ? రాజ్యే = రాజ్యము, నవే = క్రొత్తది అగుచుండగా, రాజానః = రాజులు, వక్తవ్యతామ్ = ఏమేమో చెప్పుకొనదగియుండుటను, ప్రజన్తి హి = పొందుదురు కదా ?

తా. శత్రుఘ్నుణ్ణి గూర్చి, మా తల్లి కైకేయిని గూర్చి ఏమి చెప్పుకొనుచున్నారు? రాజ్యానికి క్రొత్తగా వచ్చిన రాజును గూర్చి ప్రజలు ఏమెమో చెప్పుకొనుచుందురు కదా?

వి. ఉత్తరార్ధము ప్రాచ్యప్రతిలో లేదు. 6

మూ. ఏవముక్తే తు రామేణ భద్రః ప్రాఞ్జలిరబ్రవీత్,
శుభాశుభాః కథా రాజన్ వర్తన్తే పురవాసినామ్. 7

ప్ర. అ. రామేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తే = పలకబడినదగుచుండగా, భద్రః=భద్రుడు, ప్రాఞ్జలిః=కట్టబడిన దోసిలి కలవాడై, అబ్రవీత్= పలికెను, రాజన్ = రాజా ! పురవాసినామ్ = పౌరులయొక్క, శుభాశుభాః = శుభములు, అశుభములూ అయిన, కథాః = కథలు, వర్తన్తే = జరుగుచున్నవి.

తా. రాముని మాటలు విని భద్రుడు నమస్కరించి ఇట్లు చెప్పెను. రాజా! పౌరులు మంచిగాను చెడ్డగాను కూడ చెప్పుకొనుచున్నారు.

వి. స్థితాః శుభాః అను దాక్షిణాత్యపాఠానికి బదులు "శుభాశుభాః" ప్రాచ్య పాఠము గ్రహింపబడినది.

మూ. అయం తు విజయః సౌమ్య దశగ్రీవవధార్జితః,
భూయిష్ఠం స్వపురే పౌరైః కథ్యతే పురుషర్షభ. 8

ప్ర. పురుషర్షభ=పురుషశ్రేష్ఠుడా! సౌమ్య=సౌమ్యుడా ! దశగ్రీవవధార్జితః =రావణుని వధద్వారా సంపాదించబడిన, అయం విజయః తు= ఈ విజయమైతే, స్వపురే = మన పట్టణములో, పౌరైః=పౌరులచేత, భూయిష్ఠమ్ = అధికముగా, కథ్యతే = చెప్పబడుచున్నది.

తా. సౌమ్యుడవు, పురుషశ్రేష్ఠుడవూ అయిన ఓ! రాజా! మన పురములోని ప్రజలు రావణుని వధకు సంబంధించిన ఈ విజయమును గూర్చి ఎక్కువగా మాటలాడుకొనుచున్నారు. 8

మూ. ఏవముక్తస్తు భద్రేణ రాఘవో వాక్యమబ్రవీత్,
కథయస్వ యథాతత్త్వం సర్వం నిరవశేషతః. 9

ప్ర. అ. భద్రేణ = భద్రునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, రాఘవః = రాముడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. యథా తత్త్వమ్ = యథార్థముగా, సర్వమ్ = సమస్తమునూ, నిరవశేషతః = శేషము లేకుండగా, కథయస్వ = చెప్పుము.

తా. భద్రుని మాటలు విని రాము డిట్లు పలికెను-"ఉన్నది ఉన్నట్లుగా పూర్తిగా, అంతా చెప్పుము".

మూ. శుభాశుభాని వాక్యాని కాన్యాహుః పురవాసినః,
శ్రుత్వేదానీం శుభం కుర్యాం న కుర్యామశుభాని చ. 10

ప్ర. అ. పురవాసినః = పురమునందు నివసించువారు, కాని = ఏ, శుభాశుభాని = శుభాశుభములైన, వాక్యాని = వాక్యములను, ఆహుః = పలుకుచున్నారు? ఇదానీమ్ = ఇప్పుడు, శ్రుత్వా = విని, శుభమ్ = శుభమును, కుర్యామ్ = చేయుదును. అశుభాని = అశుభములను, న కుర్యాం చ = చేయను.

తా. పురమునందు నివసించువారు మంచిగాను, చెడ్డగాను ఏమి చెప్పుకొనుచున్నారు? వారు చెప్పుకొనేది విని నేనిపుడు మంచి కార్యములనే చేయుటకు, చెడ్డ పనులు చేయకుండుటకు వీలుకలుగును. 10

మూ. కథయస్వ చ విస్రబ్ధో నిర్భయం విగతజ్వరః,
కథయన్తి యథా పౌరాః పురే జనపదేషు చ. 11

ప్ర. అ. పురే = పట్టణమునందు, జనపదేషు చ = గ్రామములయందు, పౌరాః = పౌరులు, యథా = ఎట్లు, కథయన్తి = చెప్పుకొనుచున్నారో, విస్రబ్ధః = విశ్వాసము కలవాడవై, నిర్భయమ్ = నిర్భయముగా, విగతజ్వరః = పోయిన మనోవ్యథ కలవాడవై, కథయస్వ = చెప్పుము.

తా. పట్టణములలోను, గ్రామాలలోను ఉన్న జనులు ఏమి చెప్పుకొనుచున్నారో నీవు విశ్వాసముతో నిర్భయముగా, ఏ మాత్రమూ సంకోచము లేకుండా చెప్పుము. 11

మూ. రాఘవేణైవముక్తస్తు భద్రః సురుచిరం వచః,
ప్రత్యువాచ మహాబాహుం ప్రాఞ్జలిః సుసమాహితః. 12

ప్ర. ఆ రాఘవేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, సురుచిరమ్ = చాల మంచి, వచః = వచనమును, ఉక్తః = పలకబడిన, భద్రః = భద్రుడు, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, సుసమాహితః = బాగా సావధానచిత్తుడై, మహా బాహుమ్ = గొప్ప బాహువులు గల రాముణ్ణి గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. రాముడీ విధముగా పలికిన ఆ మంచి మాటలు విని భద్రుడు అంజలి ఘటించి, సావధానచిత్తుడై ఆ మహాబాహువైన రామునితో ఇట్లు చెప్పెను. 12

మూ. శృణు రాజన్యథా పౌరాః కథయన్తి శుభాశుభామ్,
చత్వరాపణరథ్యాసు వనేషూపవనేషు చ. 13

ప్ర. ఆ. రాజన్ = రాజా! పౌరాః = పౌరులు, చత్వరాపణరథ్యాసు = నాలుగు వీథుల మొగలయందు, బజారులలోను, వీథులలోను, వనేషు = వనములలోను, ఉప వనేషు చ = ఉద్యానములలోను, యథా = ఎట్లు, శుభాశుభమ్ = మంచిగాను, చెడ్డగాను, కథయన్తి = చెప్పుకొనుచున్నారో, శృణు = వినుము

తా. రాజా! పౌరులు నాలుగు వీథుల మొగలలోను, వీథులలోను, వనముల లోను, ఉద్యానములలోను కలిసి మంచిగాను చెడ్డగాను ఏమి చెప్పుకొనుచున్నారో వినుము. 13

మూ. దుష్కరం కృతవాన్ రామః సముద్రే సేతుబన్ధనమ్,
అశ్రుతం పూర్వకైః కైశ్చిద్దేవైరపి సదానవైః. 14

ప్ర. అ. రామః = రాముడు, పూర్వకైః = పూర్వికులైన, కైః చిత్ = ఎవరిచేతనూ, సదానవైః = దానవులతో కూడిన, దేవైః = దేవతలచేతనూ, అశ్రుతమ్ = వినబడని, దుష్కరమ్ = చేయ శక్యము కాని, సముద్రే = సముద్రమునందు, సేతుబన్ధనమ్ = సేతుబంధనమును, కృతవాన్ = చేసినాడు.

తా. రాముడు సముద్రముమీద ఎవ్వరూ చేయజాలని సేతుబంధనము చేసినాడు. ఇట్టి దానిని పూర్వికు లెవ్వరూ గాని, దేవతలు గాని, దానవులు గాని విని ఉండరు 14

మూ. రావణశ్చ దురాధర్షో హతః సబలవాహనః,
వానరాశ్చ వశం నీతా ఋక్షాశ్చ సహ రాక్షసైః. 15

ప్ర. అ. దురాధర్షః = ఎదిరింప శక్యము కాని, సబలవాహనః = సైన్యవాహనములతో కూడిన, రావణః చ = రావణుడు కూడ, హతః = చంపబడినాడు, రాక్షసైః సహ = రాక్షసులతో కూడ, వానరాః చ = వానరులు, ఋక్షాశ్చ = భల్లూకములు, వశమ్ = వశమును, సీతాః = పొందించబడినారు.

తా. ఎదిరింప శక్యము కాని సేనావాహనసహితుడైన రావణుణ్ణి చంపినాడు. వానరులను, భల్లూకములను, రాక్షసులనూ కూడ వశము చేసికొనినాడు.

మూ. హత్వా చ రావణం సంఖ్యే సీతామాహృత్య రాఘవః,
అమర్షం పృష్ఠతః కృత్వా స్వవేశ్మ పునరానయత్. 16

ప్ర. అ. రాఘవః = రాముడు, సంఖ్యే = యుద్ధమునందు, రావణమ్ = రావణుణ్ణి, హత్వా = చంపి, సీతామ్ = సీతను, ఆహృత్య = తీసికొనివచ్చి, అమర్షమ్ = కోపమును, పృష్ఠతః = వెనుకకు, కృత్వా = చేసి, పునః = తిరిగి, స్వవేశ్మ = తన గృహమును, ఆనయత్ = పొందించెను.

తా. రాముడు యుద్ధమునందు రావణుణ్ణి చంపి, సీతను తీసికొని, రావణస్పర్శవలన కలిగిన కోపమును లెక్కచేయక (విడచి) ఆమెను మరల తన ఇంటికి చేర్చినాడు. 16

మూ. కీదృశం హృదయే తస్య సీతాసంగమజం సుఖమ్,
అజ్ఞామారోప్య తు పురీం రావణేన బలాద్ధృతామ్. 17
లఙ్కామపి పురీం సీతామశోకవనికాం గతామ్,
రక్షసాం వశమాపన్నాం కథం రామో న కుత్సతే. 18

ప్ర. అ. తస్య = ఆ రామునియొక్క, హృదయే = హృదయమునందు, సీతాసంగమజమ్ = సీతాసంగమమువలన కలిగిన, సుఖమ్ = సుఖము, కీదృశమ్ = ఎట్టిది ? పురా = పూర్వము, రావణేన = రావణునిచేత, బలాత్ = బలాత్కారముగా, అజ్ఞామ్ = ఒడిని, ఆరోప్య = అధిష్ఠింపచేసి, హృతామ్ = హరింపబడిన, లఙ్కాం పురీమపి = లంకాపట్టణమును గూర్చి కూడ, సీతామ్ = తీసికొనివెళ్ళబడిన, అశోకవనికామ్ = అశోకవనమును, గతామ్ = పొందిన, రక్షసామ్ = రాక్షసులయొక్క, వశమ్ = వశమును, ఆపన్నామ్ = పొందిన ఆ సీతను, రామః = రాముడు, కథమ్ = ఎట్లు, న కుత్సతే = ఏవగించుకొనుటలేదు ?

తా. ఆతని హృదయమునందు సీతాసమాగమమువలన ఏమి సుఖముకలుగునో! రావణుడు బలాత్కారముగా ఒడిలో కూర్చుండబెట్టుకొని హరించి, లంకకు తీసికొనిపోయి, అశోకవనమును చేర్చగా రాక్షసుల వశురాలైపోయిన ఆ సీతను గూర్చి రాముడు ఏవగించుకొనకుండగా ఎట్లుండకలుగుచున్నాడో! 17, 18

మూ. అస్మాకమపి దారేషు సహనీయం భవిష్యతి,
యథా హి కురుతే రాజా ప్రజా తమనువర్తతే. 19

ప్ర. అ. అస్మాకమ్ = మనయొక్క, దారేష్వపి = భార్యల విషయమునందు కూడ, సహనీయమ్ = సహింపదగినది, భవిష్యతి = కాగలదు; రాజా = రాజు, యథా = ఎట్లు, కురుతే = చేయునో, ప్రజా = ప్రజ, తమ్ = వానిని, అనువర్తతే హి = అనుసరించునుకదా ?

తా. మన భార్యల విషయమునందు కూడ మనము సహించవలసి ఉండును. రాజు ఎట్లు చేయునో ప్రజలు కూడ అట్లే ఆతనిని అనుసరించి ప్రవర్తించుచుందురు కదా ? 19

మూ. ఏవం బహువిధా వాచో వదన్తి పురవాసినః,
నగరేషు చ సర్వేషు రాజన్ జనపదేషు చ. 20

ప్ర. అ. రాజన్ = రాజా ! సర్వేషు = సమస్తమైన, నగరేషు = నగరములయందు, జనపదేషు చ = గ్రామములయందు, పురవాసినః = పౌరులు, ఏవమ్ = ఈ విధముగా, బహువిధాః = అనేకవిధములైన, వాచః = వాక్కులను, వదన్తి = పలుకుచున్నారు.

తా. రాజా! అన్ని నగరాలలోను, గ్రామాలలోను పౌరులు ఈ విధముగా అనేకవిధములైన మాటలు చెప్పుకొనుచున్నారు. 20

మూ. తస్యైవం భాషితం శ్రుత్వా రాఘవః పరమార్తవత్,
ఉవాచ సుహృదః సర్వాన్ కథమేతద్వదన్తు మామ్. 21

ప్ర. అ. తస్య = వానియొక్క, ఏవమ్ = ఇట్లు, భాషితమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, రాఘవః = రాముడు, పరమార్తవత్ = చాల దుఃఖితుడై, సర్వాన్ =

సమస్తమైన, సుహృదః = స్నేహితులను గూర్చి, ఏతత్ = ఇది, కథమ్ = ఎట్లు ? మామ్ = నన్ను గూర్చి, వదన్తు = చెప్పెదరు గాక అని, ఉవాచ = పలికెను.

తా. రాముడు ఆతడు చెప్పిన మాటలు విని, చాల దుఃఖితుడై "ఇది ఎట్లు ? నాకు చెప్పుడు" అని అక్కడ నున్న మిత్రుల నందరినీ అడిగెను. 21

మూ. సర్వే తు శిరసా భూమావభివాద్య ప్రణమ్య చ,
ప్రత్యూచూ రాఘవం దీనమేవమేతన్న సంశయః. 22

ప్ర. అ. సర్వే తు = వాళ్ళందరూ అయితే, శిరసా = శిరస్సుచేత, భూమౌ = భూమిమీద, అభివాద్య = నమస్కరించి, ప్రణమ్య చ = వంగి, దీనమ్ = దీనుడైన, రాఘవమ్ = రాముణ్ణి గూర్చి, ప్రత్యూచుః = తిరిగి పలికిరి. ఏతత్ = ఇది. ఏవమ్ = ఇట్లే, సంశయః = సంశయము, న = లేదు.

తా. వాళ్ళందరూ శిరస్సులతో భూమిని స్పృశించి నమస్కరించి, నమ్రులై "ఇతడు చెప్పినది నిజమే; అసత్యము కాదు"అని రామునికి బదులు చెప్పిరి. 22

మూ. శ్రుత్వా తు వాక్యం కాకుత్స్థః సర్వేషాం సముదీరితమ్,
విసర్జయామాస తదా వయస్యాన్ శత్రుసూదనః. 23

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
త్రిచత్వారింశః సర్గః.

ప్ర. అ. శత్రుసూదనః = శత్రుసంహారకుడైన, కాకుత్స్థః = రాముడు, సముదీరితమ్ = పలకబడిన, సర్వేషామ్ = అందరియొక్క, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, తదా = అప్పుడు, వయస్యాన్ = స్నేహితులను, విసర్జయామాస = విడచెను.

తా. శత్రుసంహారకుడైన రాముడు అప్పుడు వాళ్ళందరూ చెప్పిన మాటలు విని ఆ స్నేహితుల నందరినీ పంపివేసెను. 23

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానములో ఉత్తరకాండలో
నలుబదిమూడవ సర్గ సమాప్తము.

కర్తా = కర్తయైన, భగవాన్ = భగవంతుడైనఁ వాల్మీకిఃఁ = వాల్మీకి, యజ్ఞసంవిధమ్ = యజ్ఞసమీపమును గూర్చి, సంప్రాప్తఃఁ = వచ్చినాడు.

తా. ఇట్లు ప్రశ్నించుచున్న రామునితో ఆమునికుమారులు ఇట్లు పలికిరి. "ఈ కావ్యమును రచించిన భగవంతుడైన వాల్మీకి యజ్ఞసమీపమునకు వచ్చి ఉన్నాడు. 25

మూ. యేనేదం చరితం తుభ్యమశేషం సంప్రదర్శితమ్,
సంనిబద్ధం హి శ్లోకానాం చతుర్వింశత్సహస్రకమ్. 26

ప్ర. అ. యేన = ఏకావ్యముచేత, తుభ్యమ్ = నీయొక్క, అశేషమ్ = సమస్తమైన, చరితమ్ = చరితము, సంప్రదర్శితమ్ = చూపబడినదో ఆ కావ్యము, శ్లోకానామ్ = శ్లోకములయొక్క, చతుర్వింశత్సహస్రకమ్ = ఇరవైనాలుగు వేలుగా, సంనిబద్ధం హి = రచింపబడినది.

తా. నీచరిత్రమును పూర్తిగా వర్ణించిన ఈ కావ్యము ఇరవైనాలుగు వేల శ్లోకాలలో రచింపబడినది. 26

మూ. ఉపాఖ్యానశతం చైవ భార్గవేణ తపస్వినా,
ఆదిప్రభృతి వై రాజన్ పఞ్చసర్గశతాని చ, 27
కాణ్డాని షట్ కృతానీహ సోత్తరాణి మహాత్మనా.

ప్ర. అ. రాజన్ = రాజా! ఉపాఖ్యానశతంచైవ = వందఉపాఖ్యానములు, ఆదిప్రభృతి = మొదటిది మొదలు, పఞ్చ = ఐదు, సర్గశతాని = సర్గల శతములు, సోత్తరాణి = ఉత్తరకాండతో కూడిన, షట్ = ఆరు, కాణ్డాని = కాండములు, ఇహ = దీనియందు, మహాత్మనా = మహాత్ముడైన, తపస్వినా = తపస్సుగల, భార్గవేణ = వాల్మీకిచేత, కృతాని = చేయబడినవి.

తా. రాజా! మహాత్ముడైన, తపఃశాలియైన వాల్మీకిమహాముని నూరు ఉపాఖ్యానములను, మొదటి సర్గ మొదలు ఐదువందల సర్గలను, ఉత్తరకాండతోకూడిన ఆరు కాండలను ఈ కావ్యములో రచించెను. 27

మూ. కృతాని గురుణాస్మాకమృషిణా చరితం తవ, 28
ప్రతిష్ఠా జీవితం యావత్తావత్సర్వస్య వర్తతే.

ప్ర. అ. ద్వాఃస్థః = ద్వారపాలకుడు, రామస్య = రామునియొక్క, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, మూర్ధ్ని = శిరస్సునందు, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి కలవాడై, లక్ష్మణస్య = లక్ష్మణునియొక్క, గృహమ్ = గృహమును గూర్చి, గత్వా = వెళ్ళి, అనివారితః = నివారించబడనివాడై, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. ద్వారపాలకుడు రాముని మాటలు విని, శిరస్సుపై అంజలి ఘటించి నమస్కరించి లక్ష్మణుని ఇంటికి వెళ్ళి, ఎవ్వరిచేత అడ్డుకొనబడనివాడై లోనికి ప్రవేశించెను. 3

మూ. ఉవాచ సుమహాత్మానం వర్ధయిత్వా కృతాఞ్జలిః,
ద్రష్టుమిచ్ఛతి రాజా త్వాం గమ్యతాం తత్ర మా చిరమ్.

ప్ర. అ. మహాత్మానమ్ = మహాత్ముడైన లక్ష్మణుణ్ణి, వర్ధయిత్వా = వృద్ధిపొందించి (అభినందించి), కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి కలవాడై, ఉవాచ = పలికెను. రాజా = రాజు, త్వామ్ = నిన్ను, ద్రష్టుమ్ = చూచుటకు, ఇచ్ఛతి = కోరుచున్నాడు. తత్ర = అక్కడికి, గమ్యతామ్ = వెళ్లెదవుగాక, చిరం మా = ఆలస్యము వద్దు.

తా. దోసిలి కట్టి ఆ మహాత్ముడైన లక్ష్మణుణ్ణి "జయ విజయీ భవ" అను మాటలచేత అభినందించి "రాజు నిన్ను చూడదలచుకున్నాడు. ఆలస్యము చేయక శీఘ్రముగా వెళ్లుము" అని చెప్పెను. 4

మూ. బాఢమిత్యేవ సౌమిత్రిః శ్రుత్వా రాఘవశాసనమ్,
ప్రాద్రవద్రథమారుహ్య రాఘవస్య నివేశనమ్. 5

ప్ర. అ. సౌమిత్రిః = లక్ష్మణుడు, రాఘవశాసనమ్ = రాముని ఆజ్ఞను, శ్రుత్వా = విని, బాఢమ్ ఇత్యేవ = తప్పక అని పలికి, రథమ్ = రథమును, ఆరుహ్య = ఎక్కి, రాఘవస్య = రామునియొక్క, నివేశనమ్ = గృహమును గూర్చి, ప్రాద్రవత్ = శీఘ్రముగా వెళ్లెను.

తా. లక్ష్మణుడు రాముని ఆజ్ఞ విని "తప్పక అట్లే వెళ్ళెదను" అని పలికి రథ మెక్కి శీఘ్రముగా రాముని ఇంటికి వెళ్ళెను. 5

మూ. ప్రయాన్తం లక్ష్మణం దృష్ట్వా ద్వాఃస్థో భరతమన్తికాత్,
ఉవాచ భరతం తత్ర వర్ధయిత్వా కృతాఞ్జలిః. 6
వినయావనతో భూత్వా రాజా త్వాం ద్రష్టుమిచ్ఛతి

ప్ర. అ. ద్వాఃస్థః = ద్వారపాలకుడు, ప్రయాన్తమ్ = వెళ్ళుచున్న, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి, దృష్ట్వా = చూచి, భరతమ్ అన్తికాత్ = భరతుని దగ్గరకు వెళ్ళి, తత్ర = అక్కడ, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి కలవాడై, భరతమ్ = భరతుణ్ణి, వర్ధయిత్వా = అభినందించి, వినయావనతః = వినయముతో వంగినవాడు, భూత్వా = అయి, రాజా = రాజు, త్వామ్ = నిన్ను, ద్రష్టుమ్ = చూచుటకు, ఇచ్ఛతి = కోరుచున్నాడు అని, ఉవాచ = పలికెను.

తా. ఆ ద్వారపాలకుడు, లక్ష్మణుడు వెళ్ళుచున్నట్లు చూచి, భరతుని వద్దకు వెళ్ళి, అంజలి ఘటించి అభినందించి, వినయముతో నమ్రుడై - "రాజు నిన్ను చూడ గోరుచున్నాడు"అని చెప్పెను. 6

మూ. భరతస్తు వచః శ్రుత్వా ద్వాఃస్థాద్రామసమీరితమ్, 7
ఉత్పపాతాసనాత్తూర్ణం పద్భ్యామేవ యయౌ బలీ.

ప్ర. అ. బలీ = బలశాలియైన, భరతః తు = భరతుడైతే, ద్వాఃస్థాత్ = ద్వారపాలకునినుండి, రామసమీరితమ్ = రామునిచేత పలకబడిన, వచః = వాక్యమును, శ్రుత్వా = విని, తూర్ణమ్ = శీఘ్రముగా, ఆసనాత్ = ఆసనమునుండి, ఉత్పపాత = ఎగిరి లేచెను, పద్భ్యామ్ ఏవ = పాదములచేతనే, యయౌ = వెళ్లెను.

తా. బలవంతుడైన భరతుడు ద్వారపాలకుడు చెప్పిన రాముని ఆజ్ఞను విని వెంటనే ఆసనమునుండి లేచి కాలినడకనే వెళ్లెను. 7

మూ. దృష్ట్వా ప్రయాన్తం భరతం త్వరమాణః కృతాఞ్జలిః, 8
శత్రుఘ్నభవనం గత్వా తతో వాక్యమువాచ హ.

ప్ర. అ. భరతమ్ = భరతుణ్ణి, ప్రయాన్తమ్ = వెళ్ళుచున్నవానినిగా, దృష్ట్వా = చూచి, త్వరమాణః = తొందరపడుచు, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి కలవాడై, తతః = అటుపిమ్మట, శత్రుఘ్నభవనమ్ = శత్రుఘ్నుని గృహమును గూర్చి, గత్వా = వెళ్ళి, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. భరతుడు వెళ్ళుచున్నట్లు చూచి ద్వారపాలకుడు తొందరపడుచు శత్రుఘ్నుని గృహమునకు వెళ్ళి అంజలి ఘటించి నమస్కరించి ఇట్లు పలికెను.

మూ. ఏహ్యాగచ్ఛ రఘుశ్రేష్ఠ రాజా త్వాం ద్రష్టుమిచ్ఛతి, 9
గతౌ హి లక్ష్మణః పూర్వం భరతశ్చ మహాయశాః.

ప్ర. అ. రఘుశ్రేష్ఠ = రఘువంశరాజులలో శ్రేష్ఠుడా! ఏహి = రమ్ము, ఆగచ్ఛ = రమ్ము. రాజా = రాజు, త్వామ్ = నిన్ను, ద్రష్టుమ్ = చూచుటకు, ఇచ్ఛతి = కోరుచున్నాడు. లక్ష్మణః = లక్ష్మణుడు, పూర్వమ్ = ముందుగా, గతః హి = వెళ్ళినాడు కదా. మహాయశాః = గొప్ప కీర్తి గల, భరతః చ = భరతుడు కూడ వెళ్ళినాడు.

తా. ఓ! రఘుశ్రేష్ఠా! రమ్ము రమ్ము. రాజు నిన్ను చూడవలె నని అనుకొనుచున్నాడు. లక్ష్మణుడు, గొప్ప కీర్తి గల భరతుడు ముందుగానే వెళ్ళినారు.

మూ. శ్రుత్వా తు వచనం తస్య శత్రుఘ్నః పరమాసనాత్,
శిరసా వన్ద్య ధరణీం ప్రయయౌ యత్ర రాఘవః.

ప్ర. అ. శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, తస్య = వానియొక్క, వచనమ్ = మాటను, శ్రుత్వా = విని, పరమాసనాత్ = శ్రేష్ఠమైన ఆసనమునుండి, ధరణీమ్ = భూమిని పొంది, శిరసా = శిరస్సుచేత, వన్ద్య = నమస్కరించి, రాఘవః = రాముడు, యత్ర = ఎక్కడ ఉన్నాడో అక్కడికి, ప్రయయౌ = వెళ్ళెను.

తా. శత్రుఘ్నుడు అతని మాటలు విని, శ్రేష్ఠమైన ఆసనమునుండి నేల మీదికి, రాముడున్న వైపుకు నమస్కరించి రాముని దగ్గరకు వెళ్ళెను. 10

మూ. ద్వాఃస్థస్త్వాగత్య రామాయ సర్వానేవ కృతాఞ్జలిః, 11
నివేదయామాస తదా భ్రాతౄన్ స్వాన్ సముపస్థితాన్.

ప్ర. అ. ద్వాఃస్థః తు = ద్వారపాలకుడైతే, ఆగత్య = వచ్చి, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి కలవాడై, తదా = అప్పుడు, రామాయ = రామునకు, స్వాన్ = తనసంబంధమైన, సర్వానేవ = సమస్తమైన, భ్రాతౄన్ = సోదరులను, ఉపస్థితాన్ = వచ్చినవారినిగా, నివేదయామాస = తెలిపెను.

తా. అప్పుడు ద్వారపాలకుడు వచ్చి, చేతులు జోడించి నమస్కరించి సోదరు లందరూ వచ్చినట్లు రామునకు తెలిపెను. 11

మూ. కుమారానాగతాన్ శ్రుత్వా చింతావ్యాకులితేన్ద్రియః, 12
అవాఙ్ముఖో దీనమనా ద్వాఃస్థం వచనమబ్రవీత్.

ప్ర. అ. కుమారాన్ = రాజకుమారులను, ఆగతాన్ = వచ్చినవారినిగా, శ్రుత్వా = విని, చింతావ్యాకులితేన్ద్రియః = చింతచేత వ్యాకులముగా చేయబడిన ఇంద్రియములు కలవాడై, అవాఙ్ముఖః = క్రిందికి వంచబడిన ముఖము గలవాడై, దీనమనాః = దీనమైన మనస్సు గలవాడై, ద్వాఃస్థమ్ = ద్వారపాలకుణ్ణి గూర్చి, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. సోదరులు వచ్చినట్లు విని రాముడు చింతచేత వ్యాకులములైన ఇంద్రియములు కలవాడై, తల క్రిందికి వంచి, దీనమైన మనస్సుతో, ద్వారపాలకునితో ఇట్లు పలికెను. 12

మూ. ప్రవేశయ కుమారాంస్త్వం మత్సమీపం త్వరాన్వితః, 13
ఏతేషు జీవితం మహ్యమేతే ప్రాణాః ప్రియా మమ.

ప్ర. అ. త్వమ్ = నీవు, కుమారాన్ = సోదరులను, త్వరాన్వితః = తొందరతో కూడినవాడవై, మత్సమీపమ్ = నా సమీపమును, ప్రవేశయ = ప్రవేశపెట్టుము. మహ్యమ్ = నాకొరకు, జీవితమ్ = జీవితము, ఏతేషు = వీళ్ళయందే ఏతే = వీళ్ళు, మమ = నాకు, ప్రియాః = ఇష్టమైన, ప్రాణాః = ప్రాణములు.

తా. నీవు వెంటనే సోదరులను నా దగ్గరకు తీసికొని రమ్ము. నా జీవితము వీళ్ళమీద ఆధారపడి ఉన్నది. వీళ్లే నా ప్రియమైన ప్రాణములు. 13

మూ. ఆజ్ఞప్తాస్తు నరేన్ద్రేణ కుమారాః శుక్రతేజసః, 14
ప్రహ్వాః ప్రాఞ్జలయో భూత్వా వివిశుస్తే సమాహితాః.

ప్ర. అ. నరేన్ద్రేణ = రాజుచేత, ఆజ్ఞప్తాః = ఆజ్ఞాపించబడిన, శుక్ర తేజసః = శుక్రుని వంటి తేజస్సు గల, తే = ఆ, కుమారాః = రాజకుమారులు,

ప్రహ్వాఃⵆ వంగినవారై, ప్రాఞ్జలయఃⵆ కట్టబడిన దోసిళ్ళు గలవారు, భూత్వాⵆ అయి, సమాహితాఃⵆ సావధానచిత్తులై, వివిశుఃⵆ ప్రవేశించిరి.

తా. రాజు ఆజ్ఞ పొంది శుక్రునివంటి తేజస్సు గల ఆ రాజకుమారులు నమ్రులై, అంజలులు ఘటించి, సావధానచిత్తులై లోపల ప్రవేశించిరి. 14

మూ. తే తు దృష్ట్వా ముఖం తస్య సగ్రహం శశినం యథా, 15
సంధ్యాగతమివాదిత్యం ప్రభయా పరివర్జితమ్,
బాష్పపూర్ణే చ నయనే దృష్ట్వా రామస్య ధీమతః 16
హతశోభం యథా పద్మం ముఖం వీక్ష్య చ తస్య తే
తతోఽభివాద్య త్వరితాః పాదౌ రామస్య మూర్ధభిః 17
తస్థుః సమాహితాః సర్వే రామస్త్వశ్రూణ్యవర్తయత్.

ప్ర. అ. తే తుⵆ వారైతే, ధీమతఃⵆ బుద్ధిమంతుడైన, తస్య రామస్యⵆ ఆ రామునియొక్క, సగ్రహమ్ⵆ గ్రహముతో కూడిన, శశినం యథాⵆ చంద్రుడు వలె ఉన్న, సంధ్యాగతమ్ⵆ సంధ్యాసమయమునం దున్న, ఆదిత్యమ్ⵆ ఇవⵆ సూర్యుడు వలె, ప్రభయాⵆ కాంతితో, పరివర్జితమ్ⵆ శూన్యమైన, ముఖమ్ⵆ ముఖమును, దృష్ట్వాⵆ చూచి, బాష్పపూర్ణేⵆ కన్నీళ్ళతో నిండిన, నయనేⵆ నేత్రములను, దృష్ట్వాⵆ చూచి, హతశోభమ్ⵆ తొలగింప చేయబడిన శోభ గల, పద్మం యథాⵆ పద్మము వలె ఉన్న, తస్యⵆ ఆతనియొక్క, ముఖమ్ⵆ ముఖమును, వీక్ష్యⵆ చూచి, తతఃⵆ అటుపిమ్మట, త్వరితాఃⵆ తొందరపడుచున్న వారై, రామస్యⵆ రామునియొక్క, పాదౌⵆ పాదములను, మూర్ధభిఃⵆ శిరస్సులతో, అభివాద్యⵆ నమస్కరించి, తే సర్వేⵆ వాళ్ళందరూ, సమాహితాఃⵆ సావధానచిత్తులై, తస్థుఃⵆ నిలచిరి. రామఃⵆ తుⵆ రాముడు, అశ్రూణిⵆ కన్నీళ్ళను, అవర్తయత్ⵆ ప్రవర్తింపచేసెను.

తా. ఆ సమయమునందు బుద్ధిమంతుడైన ఆ రాముని ముఖము రాహువు ఆక్రమించిన చంద్రబింబము వలె, సంధ్యాసమయమునందలి సూర్యబింబము వలె, శోభావిహీనమైన పద్మము వలె, కాంతి లేక ఉండెను. నేత్రములు కన్నీళ్లతో నిండి ఉండెను. ఆ లక్ష్మణాదులు ఇట్టి స్థితిలో ఉన్న రాముణ్ణి చూచి తొందరగా వెళ్ళి శిరస్సులతో పాదాభివందనము చేసి, సావధానచిత్తులై నిలబడిరి. రాముడు కన్నీళ్ళు కార్చెను. 15-17

మూ. తాన్ పరిష్వజ్య బాహుభ్యాముత్థాప్య చ మహాబలః, 18
ఆసనేష్వాసతేత్యుక్త్వా తతో వాక్యం జగాద హ.

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గల రాముడు, తాన్ = వాళ్ళను, ఉత్థాప్య = లేవదీసి, బాహుభ్యామ్ = బాహువులచేత, పరిష్వజ్య = కౌగలించుకొని, ఆసనేషు = ఆసనములమీద, ఆసత = కూర్చొనుడు, ఇతి = అని, ఉక్త్వా = పలికి, తతః = అటుపిమ్మట, వాక్యమ్ = వాక్యమును, జగాద హ = పలికెను.

తా. గొప్ప బలము గల రాముడు వాళ్ళను లేవదీసి, బాహువులతో కౌగలించుకొని, ఆసనములమీద కూర్చొనుడు అని చెప్పి తరవాత ఇట్లు పలికెను.

మూ. భవన్తో మమ సర్వస్వం భవన్తో మమ జీవితమ్, 19
భవద్భిశ్చ కృతం రాజ్యం పాలయామి నరేశ్వరాః.

ప్ర. అ. నరేశ్వరాః = నరుల ప్రభువులారా! భవన్తః = మీరు, మమ = నాయొక్క, సర్వస్వమ్ = సర్వస్వము. భవన్తః = మీరు, మమ = నాయొక్క, జీవితమ్ = జీవితము, భవద్భిః = మీచేత, కృతమ్ = చేయబడిన, రాజ్యమ్ = రాజ్యమును, పాలయామి = పాలించుచున్నాను.

తా. ఓ! రాజులారా! మీరే నా సర్వస్వము. మీరే నా జీవితము. రక్షకులుల ద్వారా మీరు సంపాదించి ఇచ్చిన రాజ్యమునే నేను పాలించుచున్నాను.

మూ. భవన్తః కృతశాస్త్రార్థా బుద్ధ్యా చ పరినిష్ఠితాః, 20
సంభూయ చ మదర్థోఽయ మన్వేష్టవ్యో నరేశ్వరాః.

ప్ర. అ. నరేశ్వరాః = రాజులారా! భవన్తః = మీరు, కృతశాస్త్రార్థాః = చేయబడిన శాస్త్రార్థములు కలవారు, బుద్ధ్యా = బుద్ధితో, పరినిష్ఠితాః చ = స్థిరమైనవారు (కూడినవారు). అయమ్ = ఈ, మదర్థః = నా కార్యము, సంభూయ = కలసి, అన్వేష్టవ్యః = అన్వేషించదగినది.

తా. ఓ! రాజులారా! మీరు శాస్త్రవిషయములు తెలిసినవారు, మంచి బుద్ధి గలవారు, మీరందరూ కలిసి నా కార్యమును నిర్ణయించవలెను. 20

మూ. తథా వదతి కాకుత్స్థే అవధానపరాయణాః. 21
ఉద్విగ్నమనసః సర్వే కిం ను రాజాభిధాస్యతి.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
చతుశ్చత్వారింశః సర్గః.

ప్ర. అ. కాకుత్థ్సే = రాముడు, తథా = అట్లు, వదతి = పలుకుచుండగా, అవధానపరాయణాః = ఆలోచనాపరాయణులై, సర్వే = వారందరూ, రాజా = రాజు, కిమ్ = ఏమి, అభిధాస్యతి ను = చెప్పునో అని, ఉద్విగ్నమనసః = దిగులు చెందిన వారైరి.

తా. రాముడు ఆ విధముగా మాటలాడుచుండగా లక్ష్మణభరతశత్రుఘ్నులు ఆలోచనలో మునిగి "రాజు ఇప్పుడు ఏమి చెప్పనున్నాడో కదా!" అని మనస్సులో దిగులు చెందిరి.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
నలభైనాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చచత్వారింశః సర్గః

[సీత విషయమున వచ్చిన లోకాపవాదమును గూర్చి సోదరులకు తెలిపి రాముడు సీతను అరణ్యాములో విడిచి రమ్మని లక్ష్మణుని ఆదేశించుట.]

మూ. తేషాం సముపవిష్టానాం సర్వేషాం దీనచేతసామ్,
ఉవాచ వాక్యం కాకుత్థ్సో ముఖేన పరిశుష్యతా. 1

ప్ర. అ. దీనచేతసామ్ = దీనమైన మనస్సు గల, తేషాం సర్వేషామ్ = వారందరూ, సముపవిష్టానామ్ = కూర్చున్నవారగుచుండగా, కాకుత్థ్సః = రాముడు, పరిశుష్యతా = ఎండిపోవుచున్న, ముఖేన = ముఖముతో, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. మనస్సులలో దైన్యము వహించి లక్ష్మణాదులు కూర్చున్న పిమ్మట రాముడు వాడిపోయిన ముఖముతో ఇట్లు పలికెను. 1

మూ. సర్వే శృణుత భద్రం వో మా కురుధ్వం మనోఽన్యథా,
పౌరాణాం మమ సీతాయాం యాదృశీ వర్తతే కథా. 2

ప్ర. అ. మమ = నా విషయమునందు, సీతాయామ్ = సీతయందు, పౌరాణామ్ = పౌరులయొక్క, కథా = చెప్పుకొనుట, యాదృశీ = ఏ విధముగా ఉన్నదో, సర్వే = మీరందరూ, శృణుత = వినండి. వః = మీకు, భద్రమ్ = మంగళ మగుగాక. మనః = మనస్సును, అన్యథా = మరొక విధముగా, మా కురుధ్వమ్ = చేయకుడు.

తా. మీకందరికీ క్షేమ మగుగాక. నా విషయమునందు, సీత విషయమునందు పౌరులు ఏమి చెప్పుకొనుచున్నారో వినండి. నా అభిప్రాయమునకు విరుద్ధముగా ఆలోచించకండి. 2

మూ. పౌరాపవాదః సుమహాంస్తథా జనపదస్య చ,
వర్తతే మయి బీభత్సా సా మే మర్మాణి కృన్తతి. 3

ప్ర. అ. సుమహాన్ = చాల గొప్పదైన, పౌరాపవాదః = పౌరుల అపవాదము, తథా = మరియు, జనపదస్య చ = గ్రామమునయొక్క అపవాదము వచ్చినది. మయి = నా విషయమునందు, బీభత్సా = నింద, వర్తతే = ప్రవర్తించుచున్నది. సా = ఆది, మే = నాయొక్క, మర్మాణి = మర్మస్థానములను, కృన్తతి = చేదించుచున్నది.

తా. పౌరులలోను, జానపదులలోను చాల గొప్ప అపవాదు బయలుదేరినది. నా విషయమున నింద ప్రచారములో ఉన్నది. ఆది నా మర్మస్థానములను చేదించి వేయుచున్నది. 3

మూ. అహం కిల కులే జాత ఇక్ష్వాకూణాం మహాత్మనామ్,
సీతాపి సత్కృలే జాతా జనకానాం మహాత్మనామ్. 4

ప్ర. అ. అహమ్ = నేను, మహాత్మనామ్ = మహాత్ములైన, ఇక్ష్వాకూణామ్ = ఇక్ష్వాకువంశ రాజుల, కులే = కులమునందు, జాతః కిల = పుట్టితిని కదా. సీతాపి = సీతకూడ, మహాత్మనామ్ = మహాత్ములైన, జనకానామ్ = జనకరాజుల, సత్కృలే = సత్కులమునందు, జాతా = పుట్టినది.

తా. నేను మహాత్ములైన ఇక్ష్వాకువంశీయుల కులములో పుట్టినాను కదా? సీత కూడ మహాత్ములైన జనకరాజుల వంశములో పుట్టినది. 4

మూ. జానాసి త్వం యథా సౌమ్య దణ్డకే విజనే వనే,
రావణేన హృతా సీతా స చ విధ్వంసితో మయా. 5

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! విజనే = జనశూన్యమైన, దణ్డకే వనే = దండకావనమునందు, సీతా = సీత, రావణేన = రావణునిచేత, యథా = ఎట్లు, హృతా = హరించ బడినదో, సః చ = అతడు, మయా = నాచేత, విధ్వంసితః = నశింపచేయబడినాడో, త్వమ్ = నీవు, జానాసి = ఎరుగుదువు కదా!

తా. సౌమ్యుడవైన లక్ష్మణా! నిర్జనమైన దండకారణ్యమునుండి రావణుడు

సీతను ఎట్లు హరించినాడో, నేను ఆతనిని ఎట్లు నశింపచేసినానో నీకు తెలియును కదా? 5

మూ. తత్ర మే బుద్ధి రుత్పన్నా జనకస్య సుతాం ప్రతి,
అత్రోషితామిమాం సీతామానయేయం కథం పురీమ్. 6

ప్ర. అ. తత్ర = అక్కడ, మే=నాకు. జనకస్య సుతాం ప్రతి = సీతను గూర్చి, బుద్ధిః=బుద్ధి, ఉత్పన్నా=పుట్టినది. అత్ర=ఇక్కడ, ఉషితామ్ = ఉన్న, ఇమామ్ = ఈ, సీతామ్ = సీతను, పురీమ్=పట్టణమును గూర్చి, కథమ్=ఎట్లు, నయేయమ్ = తీసికొనివెళ్ళుదును.

తా. "ఈ లంకా పట్టణములో ఉన్న సీతను అయోధ్యకు ఎలా తీసికొని వెళ్ళగలను" అని నాకు ఆ సమయమునందు సీత విషయమున ఆలోచన కలిగినది. 6

మూ. ప్రత్యయార్థం తతః సీతా వివేశ జ్వలనం తదా,
ప్రత్యక్షం తవ సౌమిత్రే దేవానాం హవ్యవాహనః. 7
అపాపాం మైథిలీం ప్రాహ వాయుశ్చాకాశగోచరః.

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా! తతః = అటు పిమ్మట, సీతా = సీత, తదా = అప్పుడు, ప్రత్యయార్థమ్ = నమ్మకముకొరకు, తవ ప్రత్యక్షమ్ = నీ ఎదురుగానే, జ్వలనమ్=అగ్నిని, వివేశ =ప్రవేశించినది. దేవానామ్ = దేవతలలో, హవ్యవాహనః=అగ్ని, మైథిలీమ్=సీతను, అపాపామ్=పాపము లేని దానినిగా, ప్రాహ = చెప్పినాడు. ఆకాశగోచరః=ఆకాశమునందు సంచరించు, వాయుశ్చ= వాయువు కూడ చెప్పినాడు.

తా. లక్ష్మణా! అప్పుడు సీత నమ్మకము కలిగించుటకొరకు నీ ఎదుటనే అగ్నిలో ప్రవేశించినది కదా? దేవతలలో అగ్ని దేవుడూ, ఆకాశములో సంచరించే వాయువు కూడ ఆమె పాప రహితురా లని చెప్పినారు కదా? 7

మూ. చన్ద్రాదిత్యౌ చ శంసేతే సురాణాం సంనిధౌ పురా, 8
ఋషీణాం చైవ సర్వేషామపాపాం జనకాత్మజామ్.

ప్ర. అ. పురా = పూర్వము, సురాణామ్ = దేవతలయొక్క, సర్వేషామ్=

సమస్తమైన, ఋషీణాం చైవ = ఋషులయొక్క, సంనిధౌ = సంనిధియందు, చన్ద్రార్కాదిత్యౌ = చంద్రసూర్యులు కూడ, జనకాత్మజామ్ = సీతను, అపాపామ్ = పాపములేనిదానినిగ, శంసేతే = చెప్పినారు.

తా. పూర్వము దేవతల సంనిధిలోను, అందరు ఋషీశ్వరుల సంనిధిలోసూ సూర్యచంద్రులు కూడ సీత పాపము లేనిది అని చెప్పినారు కదా? 8

మూ. ఏవం శుద్ధసమాచారా దేవగన్ధర్వసంనిధౌ, 9
లఙ్కాద్వీపే మహేన్ద్రేణ మమ హస్తే నివేశితా.

ప్ర. ఆ. ఏవమ్ = ఇట్లు, శుద్ధసమాచారా = పరిశుద్ధమైన ప్రవర్తన గల సీత, లఙ్కాద్వీపే = లంకద్వీపమునందు, మహేన్ద్రేణ = మహేంద్రునిచేత, మమ = నాయొక్క, హస్తే = హస్తమునందు, నివేశితా = ఉంచబడినది.

తా. ఈ విధముగ పరిశుద్ధమైన చరిత్ర గల సీతను, దేవతల, గంధర్వుల సంనిధిలో దేవేంద్రుడు నా చేతిలో ఉంచినాడు. 9

మూ. అన్తరాత్మా చ మే వేత్తి సీతాం శుద్ధాం యశస్వినీమ్, 10
తతో గృహీత్వా వైదేహీమయోధ్యామహమాగతః.

ప్ర. అ. యశస్వినీమ్ = కీర్తి గల, సీతామ్ = సీతను, శుద్ధామ్ = పరిశుద్ధురాలినిగా, మే = నాయొక్క, అన్తరాత్మా చ = అంతరాత్మ కూడ, వేత్తి = తెలిసికొని ఉన్నది. తతః = ఆ కారణము వలన, వైదేహీమ్ = సీతను, గృహీత్వా = తీసికొని, అహమ్ = నేను, అయోధ్యామ్ = అయోధ్యను గూర్చి, ఆగతః = వచ్చినాను.

తా. కీర్తిమంతురాలైన సీత పరిశుద్ధురాలని నా అంతరాత్మకు కూడా తెలియును. అందువలననే నేను సీతను తీసికొని అయోధ్యకు వచ్చినాను. 10

మూ. అయం తు మే మహాన్వాదః శోకశ్చ హృది వర్తతే, 11
పౌరాపవాదః సుమహాంస్తథా జనపదస్య చ.

ప్ర. అ. "(అయం మహానధర్మో మే'' అను ప్రాచ్యపాఠము బాగున్నది). అయమ్ = ఈ, మహాన్ = గొప్ప, అధర్మః = అధర్మము, శోకః చ = శోకము,

మే = నా యొక్క, హృది = హృదయమునందు, వర్తతే = ఉన్నది. సుమహాన్ = చాల గొప్పదైన, పౌరాపవాదః = పౌరుల అపవాదము, తథా = మరియు, జనపదస్య చ = గ్రామముయొక్క అపవాదము కూడ ఉన్నది.

తా. నా హృదయములో ఈ గొప్ప అధర్మచింతా, శోకము కూడ ఉన్నవి. చాల గొప్పదైన పౌరుల అపవాదము, గ్రామప్రజల అపవాదము వచ్చినవి. 11

మూ. అకీర్తిర్యస్య గీయేత లోకే భూతస్య కస్యచిత్, 12
పతత్యేవాధమాన్ లోకాన్యావచ్ఛబ్దః ప్రకీర్త్యతే.

ప్ర. అ. యస్య కస్య చిత్ = ఏ ఒక్క, భూతస్య = నరునియొక్క, అకీర్తిః = అపకీర్తి, లోకే = లోకమునందు, గీయతే = గానము చేయబడునో, అతడు, శబ్దః = ఆ చెడ్డమాట, యావత్ = ఎంతవరకు, ప్రకీర్త్యతే = చెప్పబడునో అంతవరకు, అధమాన్ = అధములైన, లోకాన్ = లోకములను గూర్చి, పతతి ఏవ = పడును.

తా. ఈ లోకములో ఎవని అపకీర్తి వ్యాపించి ఉండునో అతడు ఆ చెడ్డ మాట వ్యాప్తిలో ఉన్నంతవరకు నరకములో పడి ఉండును. 12

మూ. అకీర్తిర్నిన్ద్యతే దేవైః కీర్తిర్లోకేషు పూజ్యతే, 13
కీర్త్యర్థం తు సమారమ్భః సర్వేషాం సుమహాత్మనామ్.

ప్ర. అ. అకీర్తిః = అపకీర్తి, దేవైః = దేవతలచేత, నిన్ద్యతే = నిందింపబడును. కీర్తిః = కీర్తి, లోకేషు = లోకములందు, పూజ్యతే = పూజింపబడును. సర్వేషామ్ = సమస్తమైన, సుమహాత్మనామ్ = మహాత్ములయొక్క, సమారమ్భః = ప్రయత్నము, కీర్త్యర్థం తు = కీర్తికొరకు.

తా. అపకీర్తిని దేవతలు నిందింతురు. కీర్తిని లోకములో అందరూ పూజింతురు. మహాత్ములందరూ చేయు ప్రయత్నము కీర్తికొరకే. 13

మూ. అప్యహం జీవితం జహ్యాం యుష్మాన్వా పురుషర్షభాః, 14
అపవాదభయాద్భీతః కిం పునర్జనకాత్మజామ్.

ప్ర. అ. పురుషర్షభాః = పురుషశ్రేష్ఠులారా ! అపవాదభయాత్ = అపవాద భయమునుండి, భీతః = భయపడిన, అహమ్ = నేను, జీవితమ్ = జీవితమును కాని, యుష్మాన్ వా = మిమ్ములను కాని, జహ్యామ్ = విడతును. జనకాత్మజామ్ = సీతను, కిం పునః = చెప్పనేల ?

తా. పురుషశ్రేష్ఠులారా ! అపవాదుకు భయపడిన నేను నా జీవితమునైనా, మిమ్ములనైనా కూడా విడిచివేనెదను. సీత మాట చెప్పవలెనా ? 14

మూ. తస్మాద్భవన్తః పశ్యన్తు పతితం శోకసాగరే, 15
న హి పశ్యామ్యహం భూతం కించిద్దుఃఖమతోఽధికమ్.

ప్ర. అ. తస్మాత్ = ఆ కారణమువలన, భవన్తః = మీరు, శోకసాగరే = శోకసముద్రమునందు, పతితమ్ = పడిన నన్ను, పశ్యన్తు = చూచెదరుగాక. అహమ్ = నేను, అతః = దీనికంటె, అధికమ్ = అధికమైన, భూతమ్ = సంభవించిన, దుఃఖమ్ = దుఃఖమును, కించిత్ = దేనినీ, న పశ్యామి హి = చూడను కదా ?

తా. ఈ విధముగా నేను ఎట్లు శోకసముద్రములో పడినానో చూడుడు. ఇంతకంటె అధికమైన దుఃఖమేదీ వచ్చినట్లు నాకు కనబడుటలేదు. 15

మూ. శ్వస్త్వం ప్రభాతే సౌమిత్రే సుమన్త్రాధిష్ఠితం రథమ్, 16
ఆరుహ్య సీతామారోప్య విషయాన్తే సముత్సృజ.

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా ! త్వమ్ = నీవు, శ్వః ప్రభాతే = రేపు ఉదయమునందు, సుమన్త్రాధిష్ఠితమ్ = సుమంత్రునిచేత ఆధిష్ఠింపబడిన, రథమ్ = రథమును, ఆరుహ్య = ఎక్కి, సీతామ్ = సీతను, ఆరోప్య = ఎక్కించి, విషయాన్తే = దేశము చివర, సముత్సృజ = విడిచిపెట్టుము.

తా. లక్ష్మణా! రేపు ప్రాతఃకాలమునందు నీవు సుమంత్రుడు నడుపు రథమునెక్కి, సీతను ఎక్కించి ఆమెను దేశము చివర విడువుము. 16

మూ. గఙ్గాయాస్తు పరే పారే వాల్మీకేస్తు మహాత్మనః, 17
ఆశ్రమో దివ్యసంకాశ స్తమసాతీరమాశ్రితః.

తత్రైతాం విజనే దేశే విసృజ్య రఘునన్దన, 18
శీఘ్రమాగచ్ఛ భద్రం తే కురుష్వ వచనం మమ.

ప్ర. అ. రఘునన్దన=లక్ష్మణా! గఙ్గాయాః=గంగయొక్క, పరే పారే=అవతలి ఒడ్డున, మహాత్మనః=మహాత్ముడైన, వాల్మీకేః=వాల్మీకియొక్క, దివ్య సంకాశః=దివ్యమైన ఆశ్రమముతో సమానమైన, ఆశ్రమః=ఆశ్రమము, తమసాతీరమ్=తమసానదీతీరమును, ఆశ్రితః=ఆశ్రయించి ఉన్నది. తత్ర=అక్కడ, విజనే=జనము లేని, దేశే=దేశమునందు, ఏతామ్=ఈమెను, విసృజ్య=విడచి, శీఘ్రమ్=శీఘ్రముగా, ఆగచ్ఛ=రమ్ము. తే=నీకు, భద్రమ్=మంగళ మగుగాక. మమ=నాయొక్క, వచనమ్=వచనమును, కురుష్వ=చేయుము.

తా. లక్ష్మణా! గంగకు అవతలి ఒడ్డున, తమసాతీరమును ఆనుకొని మహాత్ముడైన వాల్మీకి ఆశ్రమము ఉన్నది. ఇది దేవలోకములోని ఆశ్రమముతో సమానమైనది. సీతను అక్కడ విజనప్రదేశమునందు విడచి శీఘ్రముగా రమ్ము. నీకు భద్ర మగుగాక. నేను చెప్పినట్లు చేయుము. 17,18

మూ. న చాస్మి ప్రతివక్తవ్యః సీతాం ప్రతి కథం చన, 19
తస్మాత్త్వం గచ్ఛ సౌమిత్రే నాత్ర కార్యా విచారణా.

ప్ర. అ. సీతాం ప్రతి=సీతను గూర్చి, కథం చన=ఏ విధముగానూ కూడ, ప్రతివక్తవ్యః=ఎదురు చెప్పదగినవాడను, న చ అస్మి=కాను. సౌమిత్రే=లక్ష్మణా! తస్మాత్=ఆ కారణమువలన, త్వమ్=నీవు, గచ్ఛ=వెళ్ళుము. అత్ర=ఈ విషయమునందు, విచారణా=ఆలోచన, న కార్యా=చేయదగినది కాదు.

తా. సీత విషయములో ఏ విధముగానూ కూడ నాకు అడ్డు చెప్పకూడదు. అందువలన, లక్ష్మణా! వెళ్ళుము. ఈ విషయములో మరొక ఆలోచన ఏమీ చేయవద్దు. 19

మూ. అప్రీతిర్హి పరా మహ్యం భవేత్తు ప్రతివారితే, 20
శ్రాపితా హి మయా యూయం పాదాభ్యాం జీవితేన చ.

ప్ర. అ. ప్రతివారితే=అడ్డుకొనబడినదగుచుండగా, మహ్యమ్=నాకు,

పరా=గొప్ప, అప్రీతిః=అసంతోషము, భవేత్ తు హి=అగును కదా. యూయమ్ =మీరు, మయా=నాచేత, పాదాభ్యామ్=పాదములచేత, జీవితేన చ=నా జీవితముచేతా, శాపితాః హి=ఒట్టు పెట్టబడినారు.

తా. దీనికి అడ్డు చెప్పినచో నాకు చాల అసంతోషము కలుగును. నా పాదాల మీద, జీవితముమీద ఒట్టు పెట్టి చెప్పుచున్నాను. 20

మూ. యే మాం వాక్యాన్తరే బ్రూయురనునేతుం కథం చన, 21
అహితా నామ తే నిత్యం మదభీష్టవిఘాతనాత్.

ప్ర. అ. యే=ఎవరు, మామ్=నన్ను, వాక్యాన్తరే=వాక్యమధ్యము నందు, కథం చన=ఏ విధముగానైనా, అనునేతుమ్=బ్రతిమాలుటకు, బ్రూయుః =మాటలాడుదురో, తే=వారు, మదభీష్టవిఘాతనాత్=నా ఇష్టమునకు విఘాతము కలిగించుటవలన, నిత్యమ్=ఎల్లప్పుడూ, అహితాః నామ=అహితులు అగుదురు.

తా. నా మాటకు అడ్డు వచ్చి మధ్యలో బ్రతిమాలుటకు మాట్లాడేవారు నా ఇష్టమునకు అడ్డము తగులుటచే ఎప్పటికీ నా అహితులుగా పరిగణింప బడుదురు. 21

మూ. మానయన్తు భవన్తో మాం యది మచ్ఛాసనే స్థితాః, 22
ఇతోఽద్య నీయతాం సీతా కురుష్వ వచనం మమ.

ప్ర. అ. భవన్తః=మీరు, మచ్ఛాసనే=నా ఆజ్ఞయందు, స్థితాః యది= ఉన్నట్లయితే, మామ్=నన్ను, మానయన్తు=మన్నించెదరుగాక. అద్య= ఇప్పుడు, సీతా=సీత, ఇతః=ఇక్కడినుండి, నీయతామ్=తీసికొనివెళ్ళబడు గాక. మమ=నాయొక్క, వచనమ్=వచనమును, కురుష్వ=చేయుము.

తా. మీరు నా ఆజ్ఞలో ఉన్నవారైతే నా మాట మన్నించుడు. సీతను ఇప్పుడు ఇక్కడినుండి తీసికొని పోవలెను. నా మాట ప్రకారము చేయుము. 22

మూ. పూర్వముక్తోఽహమనయా గఙ్గాతీరేఽహమాశ్రమాన్, 23
పశ్యేయమితి తస్యాశ్చ కామః సంవర్త్యతామయమ్.

ప్ర. అ. అహమ్=నేను, గఙ్గాతీరే=గంగాతీరమునందున్న, ఆశ్రమాన్= ఆశ్రమములను, పశ్యేయమ్=చూచెదనుగాక, ఇతి=అని, అహమ్=నేను,

అనయా = ఈమెచేత, పూర్వమ్ = పూర్వము, ఉక్తః = పలకబడితిని, తస్యాః = ఆమెయొక్క, అయమ్ = ఈ, కామః చ = కోరిక కూడ, సంవర్త్యతామ్ = తీర్చబనుగాక.

తా. "నాకు గంగాతీరమునందున్న ఆశ్రమములను చూడవలె నని ఉన్నది" అని ఈమె వెనుక నాతో చెప్పి ఉన్నది. ఈమె కోరిక కూడ తీర్చబడుగాక. 23

మూ. ఏవముక్త్వా తు కాకుత్థ్సో బాష్పేణ పిహితేక్షణః, 24
ప్రవివేశ స ధర్మాత్మా భ్రాతృభిః పరివారితః.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
పఞ్చచత్వారింశః సర్గః.

ప్ర. ఆ. ధర్మాత్మా=ధర్మాత్ముడైన, భ్రాతృభిః=సోదరులచేత, పరివారితః = చుట్టబడిన, సః = ఆ, కాకుత్థ్సః = రాముడు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, బాష్పేణ = కన్నీటిచేత, పిహితేక్షణః=కప్పబడిన నేత్రములు కలవాడై, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. సోదరులతో కూడి ఉన్న ధర్మాత్ముడైన ఆ రాముడు ఇట్లు పలుకు చుండగా కన్నీరు ఆతని కండ్లను కప్పివేసెను. అతడు సోదరులను పంపివేసి తన ఇంటిలో ప్రవేశించెను. 24

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో నలభైఐదవ సర్గ సమాప్తము.

అథ షట్చత్వారింశ: సర్గ:

[లక్ష్మణుడు సీతను రథమునందు కూర్చుండబెట్టి ఆమెను వన ములో విడచుటకై బయలుదేరి గంగాతీరము చేరుట.]

మూ. తతో రజన్యాం వ్యుష్టాయాం లక్ష్మణో దీనచేతన:,
సుమన్త్రమబ్రవీద్వాక్యం ముఖేన పరిశుష్యతా. 1

ప్ర. అ. తత: = అటుపిమ్మట, రజన్యామ్ = రాత్రి, వ్యుష్టాయామ్ = తెల్లవారిన దగుచుండగా, లక్ష్మణ: = లక్ష్మణుడు, దీనచేతన: = దీనమైన మనస్సు గలవాడై, పరిశుష్యతా = ఎండిపోవుచున్న, ముఖేన = ముఖ ముతో, సుమన్త్రమ్ = సుమంత్రుణ్ణి గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. రాత్రి తెల్లవారినది. మనస్సులో చాల దైన్యముతోఉన్న లక్ష్మణుడు, వాడిపోయిన ముఖముతో సుమంత్రునితో ఇట్లు పలికెను. 1

మూ. సారథే తురగాన్ శీఘ్రాన్యోజయస్వ రథోత్తమే,
స్వాస్తీర్ణం రాజవచనాత్సీతాయాశ్చాసనం కురు. 2

ప్ర. అ. సారథే = ఓ! సారథీ, రథోత్తమే = ఉత్తమమైన రథమునందు, శీఘ్రాన్ = శీఘ్రముగా నడచు, తురగాన్ = గుఱ్ఱములను, యోజయస్వ = కూర్చుము. రాజవచనాత్ = రాజాజ్ఞవలన, సీతాయా: = సీతకు, స్వాస్తీర్ణమ్ = బాగుగా పరచ బడిన, ఆసనం చ = ఆసనమును కూడ, కురు = చేయుము.

తా. సారథీ! శ్రేష్ఠమైన రథానికి వేగము గల గుఱ్ఱాలను కట్టి సీతకొరకై మెత్తని, అందమైన వస్త్రాదులు పరచిన ఆసనము తయారుచేయుము. ఇది రాజాజ్ఞ. 2

మూ. సీతా హి రామవచనాదాశ్రమం పుణ్యకర్మణామ్,
మయా నేయా మహర్షీణాం శీఘ్రమానీయతాం రథ:. 3

ప్ర. అ. రామవచనాత్ = రాముని ఆజ్ఞవలన, సీతా = సీత, మయా = నాచేత, పుణ్యకర్మణామ్ = పుణ్యమైన కర్మ గల, మహర్షీణామ్ = మహర్షుల యొక్క, ఆశ్రమమ్ = ఆశ్రమమును గూర్చి, నేయా = తీసికొనివెళ్ళదగివది. రథః = రథము, శీఘ్రమ్ = శీఘ్రముగా, ఆనీయతామ్ = తీసికొనిరాబడుగాక.

తా. రాముని ఆజ్ఞ ప్రకారము నేను సీతను పుణ్యాత్ములైన మహర్షుల ఆశ్రమానికి తీసికొని వెళ్ళవలెను. రథమును శీఘ్రముగా తీసికొనిరమ్ము. 3

మూ. సుమన్త్రస్తు తథేత్యుక్త్వా యుక్తం పరమవాజిభిః,
రథం సురుచిరప్రఖ్యం స్వాస్తీర్ణం సుఖశయ్యయా. 4

ఆనీయోవాచ సౌమిత్రిం మిత్రాణాం మానవర్ధనమ్,
రథోఽయం సమనుప్రాప్తో యత్కార్యం క్రియతాం ప్రభో.

ప్ర. అ. సుమన్త్రః తు = సుమంత్రుడైతే, తథా ఇతి = అట్లే అని, ఉక్త్వా = పలికి, పరమవాజిభిః = ఉత్తమములైన గుఱ్ఱములచేత, యుక్తమ్ = కట్టబడిన, సురుచిరప్రఖ్యమ్ = చాల అందమైన శోభ గల, సుఖశయ్యయా = సుఖకరమైన పరుపుచేత, స్వాస్తీర్ణమ్ = చక్కగా పరవబడిన, రథమ్ = రథమును, ఆనీయ = తీసికొని వచ్చి, మిత్రాణామ్ = మిత్రులయొక్క, మానవర్ధనమ్ = గౌరవమును పెంచు, సౌమిత్రిమ్ = లక్ష్మణుణ్ణి గూర్చి, ఉవాచ = పలికెను. ప్రభో = ఓ! ప్రభూ! అయం రథః = ఈ రథము, సమనుప్రాప్తః = వచ్చినది; యత్ = ఏది, కార్యమ్ = చేయదగినదో అది, క్రియతామ్ = చేయబడుగాక.

తా. సుమంత్రుడు "అట్లే చేసెదను" అని పలికి, ఉత్తమములైన గుఱ్ఱములు కట్టిన, సుఖకరమైన చక్కని పరుపు పరచిన, మంచి కాంతి గల రథమును తీసికొనివచ్చి, ప్రభూ! ఇదిగో, రథము వచ్చినది ఏమి చేయవలెనో ఆ పని చేయుము" అని మిత్రుల గౌరవమును వృద్ధి పొందించు లక్ష్మణునితో పలికెను. 4,5

మూ. ఏవముక్తః సుమన్త్రేణ రాజవేశ్మని లక్ష్మణః,
ప్రవిశ్య సీతామాసాద్య వ్యాజహార నరర్షభః. 6

ప్ర. అ. సుమన్త్రేణ = సుమంత్రునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః =

పలకబడిన, నరర్షభః = నరులలో శ్రేష్ఠుడైన, లక్ష్మణః=లక్ష్మణుడు, రాజవేశ్మని = రాజగృహములో, ప్రవిశ్య = ప్రవేశించి, సీతామ్ = సీతను, ఆసాద్య = సమీపించి, వ్యాజహార = పలికెను.

తా. మానవులలో శ్రేష్ఠుడైన లక్ష్మణుడు సుమంత్రుని మాటలు విని, రాజప్రసాదములో ప్రవేశించి సీత దగ్గరకు వెళ్ళి ఇట్లు పలికెను. 6

మూ. త్వయా కిలైష నృపతిర్వరం వై యాచితః ప్రభుః,
నృపేణ చ ప్రతిజ్ఞాతమాజ్ఞప్తశ్చాశ్రమం ప్రతి. 7

ప్ర. అ. ప్రభుః = ప్రభువైన, ఏషః = ఈ, నృపతిః = రాజు, త్వయా = నీచేత, వరమ్ = వరమును, యాచితః కిల=యాచింపబడినాడట. నృపేణ చ= రాజుచేత కూడ, ప్రతిజ్ఞాతమ్ = ప్రతిజ్ఞ చేయబడినదట. ఆశ్రమం ప్రతి=ఆశ్రమమును గూర్చి, ఆజ్ఞప్తః = ఆజ్ఞాపించబడితిని.

తా. నీవు ప్రభువైన రాజును వరమును కోరినావట. రాజు కూడ అట్లే ఇచ్చెద నని ప్రతిజ్ఞ చేసినా డట. అందుచేత నిన్ను ఆశ్రమమునకు తీసికొనివెళ్ళి వలసినదిగా నన్నాజ్ఞాపించినాడు. 7

మూ. గఙ్గాతీరే మయా దేవి ఋషీణామాశ్రమాన్ శుభాన్,
శీఘ్రం గత్వా తు వైదేహి శాసనాత్పార్థివస్య నః, 8
అరణ్యే మునిభిర్జుష్టే అపనేయా భవిష్యసి.

ప్ర. అ. దేవి = దేవీ ! వైదేహి = సీతా ! నః=మనయొక్క, పార్థివస్య= రాజుయొక్క, శాసనాత్ = ఆజ్ఞవలన, మయా = నాచేత, గఙ్గాతీరే = గంగానదీతీరమునందు, శుభాన్ = పవిత్రములైన, ఆశ్రమాన్ = ఆశ్రమములను గూర్చి, శీఘ్రమ్ = శీఘ్రముగా, గత్వా = వెళ్ళి, మునిభిః = మునులచేత, జుష్టే = పొందబడిన, అరణ్యే = అరణ్యమునందు, అపనేయా = పొందింపదగినదానవు, భవిష్యసి = కాగలవు.

తా. ఓ ! సీతాదేవీ ! మన రాజుగారి ఆజ్ఞప్రకారము నేను గంగాతీరమునందున్న పవిత్రములైన ఋష్యాశ్రమములకు శీఘ్రముగా నిన్ను తీసికొనివెళ్ళి అక్కడ మునులు నివసించు అరణ్యమును చేర్చవలసి ఉన్నది. 8

మూ. ఏవముక్తా తు వైదేహీ లక్ష్మణేన మహాత్మనా, 9
ప్రహర్షమతులం లేభే గమనం చాప్యరోచయత్.

ప్ర. అ. మహాత్మనా = మహాత్ముడైన, లక్ష్మణేన = లక్ష్మణునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తా = పలకబడిన, వైదేహీ = సీత, అతులమ్ = సాటి లేని, ప్రహర్షమ్ = సంతోషమును, లేభే = పొందెను. గమనం చ అపి = గమనమును గూర్చి, అరోచయత్ = ఇష్టపడెను.

తా. సీత మహాత్ముడైన లక్ష్మణుని మాటలు విని చాల సంతోషించి వెళ్ళుటకు సిద్ధమయ్యేను. 9

మూ. వాసాంసి చ మహార్హాణి రత్నాని వివిధాని చ, 10
గృహీత్వా తాని వైదేహీ గమనాయోపచక్రమే.

ప్ర. అ. వైదేహీ = సీత, మహార్హాణి = గొప్ప విలువ గల, వాసాంసి = వస్త్రములను, వివిధాని = అనేకవిధములైన, రత్నాని చ = రత్నములను, గృహీత్వా = గ్రహించి, గమనాయ = వెళ్ళుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. సీత చాల విలువ గల వస్త్రములు, అనేకవిధములైన రత్నాలు తీసికొని వెళ్ళుటకు సిద్ధ మయ్యేను. 10

మూ. ఇమాని మునిపత్నీనాం దాస్యామ్యాభరణాన్యహమ్, 11
వస్త్రాణి చ మహార్హాణి ధనాని వివిధాని చ.

ప్ర. అ. అహమ్ = నేను, ఇమాని = ఈ, ఆభరణాని = ఆభరణములను, మహార్హాణి = గొప్పవిలువగల, వస్త్రాణి = వస్త్రములను, వివిధాని = అనేకవిధములైన, ధనాని చ = ధనములను, మునిపత్నీనామ్ = మునిభార్యలకు, దాస్యామి = ఇవ్వగలను.

తా. "నేను ఈ ఆభరణములు, చాల విలువైన వస్త్రాలు, అనేకవిధములైన ధనాలూ కూడ మునిభార్యలకు ఇచ్చెదను" అని సీత చెప్పెను. 11

మూ. సౌమిత్రిస్తు తథేత్యుక్త్వా రథమారోప్య మైథిలీమ్, 12
ప్రయయౌ శీఘ్రతురగం రామస్యాజ్ఞామనుస్మరన్.

ప్ర. అ. సౌమిత్రిః తు = లక్ష్మణుడైతే, తథేతి = అట్లే అని, ఉక్త్వా = పలికి, మైథిలీమ్ = సీతను, శీఘ్రతురగమ్ = వేగము గల గుఱ్ఱములు గల, రథమ్ = రథమును, ఆరోప్య = ఎక్కించి, రామస్య = రామునియొక్క, ఆజ్ఞామ్ = ఆజ్ఞను, అనుస్మరన్ = స్మరించుచు, ప్రయయౌ = వెళ్లెను.

తా. లక్ష్మణుడు "సరే! అట్లే చేయుము" అని పలికి సీతను వేగము గల గుఱ్ఱములు కట్టిన రథమును ఎక్కించి, రాముని ఆజ్ఞను స్మరించుచు తీసికొని వెళ్లెను. 12

మూ. అబ్రవీచ్చ తదా సీతా లక్ష్మణం లక్ష్మివర్ధనమ్, 13
అశుభాని బహూన్యేవ పశ్యామి రఘునన్దన.

ప్ర. అ. తదా = అప్పుడు, సీతా = సీత, లక్ష్మివర్ధనమ్ = లక్ష్మిని వృద్ధి పొందించు, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి గూర్చి, అబ్రవీత్ చ = పలికెను. రఘునన్దన = లక్ష్మణా! బహూని = అనేకములైన, అశుభాని = అశుభములను, పశ్యామి = చూచుచున్నాను.

తా. అప్పుడు సీత లక్ష్మిని వృద్ధి పొందించు లక్ష్మణునితో ఇట్లు పలికెను. "లక్ష్మణా! నాకు చాల అశుభములు (అపశకునములు) కనబడుచున్నవి. 13

మూ. నయనం మే స్ఫురత్యద్య గాత్రోత్కమ్పశ్చ జాయతే, 14
హృదయం చైవ సౌమిత్రే అస్వస్థమివ లక్షయే.

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా! అద్య = ఇప్పుడు, మే = నాయొక్క, నయనమ్ = నేత్రము, స్ఫురతి = అదురుచున్నది. గాత్రోత్కమ్పః చ = శరీరము వణకుకూడ, జాయతే = కలుగుచున్నది. హృదయం చైవ = హృదయమును కూడ, అస్వస్థమ్ ఇవ = అస్వస్థముగా ఉన్నదానిని వలె, లక్షయే = ఊహించుచున్నాను.

తా. లక్ష్మణా! ఇప్పుడు నా (కుడి) కన్ను ఆదరుచున్నది. శరీరము వణకుచున్నది. నా హృదయము కూడ అస్వస్థముగా ఉన్నట్లు కనబడుచున్నది.

మూ. ఔత్పుక్యం పరమం చాపి అధృతిశ్చ పరా మమ, 15
శూన్యామేవ చ పశ్యామి పృథివీం పృథులోచన

ప్ర. అ. పృథులోచన = పెద్ద నేత్రములు గలవాడా ! మమ = నాయొక్క, ఔత్సుక్యమ్ = బెంగ, పరమం చ అపి = అధికముగా ఉన్నది. అధృతిః చ = అధైర్యము కూడ, పరా = అధికమైనది. పృథివీమ్ = భూమిని, శూన్యామ్ ఏవ చ = శూన్యమైనదానినిగా, పశ్యామి = చూచుచున్నాను.

తా. విశాలనేత్రములు గల ఓ ! లక్ష్మణా ! నాకేమో చాల బెంగగా ఉన్నది. అధైర్యము అధికముగా ఉన్నది. ఈ భూమి అంతా శూన్యముగా ఉన్నట్లు కనబడుచున్నది. 15

మూ. అపి స్వస్తి భవేత్తస్య భ్రాతుస్తే భ్రాతృవత్సల, 16
శ్వశ్రూణాం చైవ మే వీర సర్వాసామవిశేషతః.

ప్ర. అ. భ్రాతృవత్సల = సోదరునియందు ప్రేమ కలవాడా ! వీర = వీరుడా ! తే = నీయొక్క, తస్య భ్రాతుః = ఆ సోదరునికి, అవిశేషతః = భేదము లేకుండా, సర్వాసామ్ = సమస్తమైన, శ్వశ్రూణాం చ = అత్తలకు, స్వస్తి = క్షేమము, అపి భవేత్ = అగును కదా !

తా. సోదరునియందు ప్రేమ గల ఓ ! వీరుడా ! నీ సోదరుడైన రాము నకు అత్తగార్లందరికీ క్షేమము కలుగునుకదా ! 16

మూ. పురే జనపదే చైవ కుశలం ప్రాణినామపి, 17
ఇత్యఞ్జలికృతా సీతా దేవతా అభ్యయాచత.

ప్ర. అ. పురే = పట్టణమునందు, జనపదే చాపి = గ్రామమునందు, ప్రాణినామ్ అపి = అన్ని ప్రాణులకూ కూడ, కుశలమ్ = క్షేమము కలుగునా ? ఇతి = ఇట్లు, సీతా = సీత, అఞ్జలికృతా = చేయబడిన దోసిలి కలదై, దేవతాః = దేవతలను, అభ్యయాచత = ప్రార్థించెను.

తా. "పట్టణములందు గ్రామాలలోను ప్రజలు, ఇతర ప్రాణులు సుఖముగా ఉందురా!" ఇట్లు పలుకుచు సీత దేవతలకు నమస్కారము చేసెను. 17

మూ. లక్ష్మణోఽర్థం తతః శ్రుత్వా శిరసా వన్ద్య మైథిలీమ్, 18
శివమిత్యబ్రవీద్దృష్టో హృదయేన విశుష్యతా.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, లక్ష్మణః = లక్ష్మణుడు, అర్థమ్ = ఆ విషయమును, శ్రుత్వా = విని, మైథిలీమ్ = సీతను, శిరసా = శిరస్సుతో, వన్ద్యా = నమస్కరించి, హృష్టః = పైకి సంతోషించుచున్నవాడై, విశుష్యతా = శోషించుచున్న, హృదయేన = హృదయముతో, శివమ్ ఇతి = మంగళము అని, అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట లక్ష్మణుడు ఆమె చెప్పు విషయమును గ్రహించి, సీతకు తల వంచి నమస్కరించి, హృదయము శుష్కించుచుండగా, పైకి సంతోషము కనబరచుచు "అంతా మంగళప్రదముగా ఉండును" అని పలికెను. 18

మూ. తతో వాసముపాగమ్య గోమతీతీర ఆశ్రమే, 19
ప్రభాతే పునరుత్థాయ సౌమిత్రిః సూతమబ్రవీత్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, గోమతీతీరే = గోమతీనదీతీరమునందు, ఆశ్రమే = ఆశ్రమమునందు, వాసమ్ = నివాసమును, ఉపాగమ్య = పొంది, ప్రభాతే = ప్రాతఃకాలమునందు, పునః = మరల, ఉత్థాయ = లేచి, సౌమిత్రిః = లక్ష్మణుడు, సూతమ్ = సారథిని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట లక్ష్మణుడు గోమతీతీరమునందున్న ఆశ్రమములో విడిది చేసి, ప్రాతఃకాలమునందు మరల లేచి సారథితో ఇట్లనెను. 19

మూ. యోజయస్వ రథం శీఘ్రమద్య భాగీరథీజలమ్, 20
శిరసా ధారయిష్యామి త్రియమ్బక ఇవౌజసా.

ప్ర. అ. శీఘ్రమ్ = శీఘ్రముగా, రథమ్ = రథమును, యోజయస్వ = కూర్చుము. అద్య = ఇప్పుడు, భాగీరథీజలమ్ = గంగాజలమును, ఓజసా = తేజస్సుతో, త్రియమ్బకః ఇవ = శివుడు వలె, శిరసా = శిరస్సుచేత, ధారయిష్యామి = ధరించెదను.

తా. శీఘ్రముగా రథమును సిద్ధము చేయుము. ఇప్పుడా గంగాజలమును, ఈశ్వరుడు శక్తిచేత శిరస్సుమీద ధరించి నట్లు, నా శిరస్సుమీద ధరించెదను.

వి. దీనిని బట్టి రుద్రుడు కూడ గంగను స్నానంకోసమే ధరించినా డని

తెలియుచున్నది అని గోవిందరాజు ఊహ. "దృష్టాన్తో రుద్రోఽపి స్నానార్థమేవ గఙ్గాం దధారేతి గమ్యతే". 20

మూ. సోఽశ్వాన్విచారయిత్వా తు రథే యుక్తాన్మనోజవాన్,
ఆరోహస్వేతి వైదేహీం సూతః ప్రాఞ్జలిరబ్రవీత్.

ప్ర. అ. సః సూతః = ఆ సారథి, రథే = రథమునందు, యుక్తాన్ = కట్టబడిన, మనోజవాన్ = మనస్సువంటి వేగము గల, అశ్వాన్ = గుఱ్ఱములను, విచారయిత్వా = నడిపి, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, ఆరోహస్వ = ఎక్కుము, ఇతి = అని, వైదేహీమ్ = సీతను గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. సారథి మనోవేగము గల అశ్వములను రథమునకు కట్టి, వాటిని నడిపి తీసికొని వచ్చి, అంజలి ఘటించి సీతతో "ఎక్కుము" అని పలికెను. 21

మూ. సా తు సూతస్య వచనాదారురోహ రథోత్తమమ్, 22
సీతా సౌమిత్రిణా సార్ధం సుమన్త్రేణ చ ధీమతా.

ప్ర. అ. సా సీతా తు = ఆ సీత, సూతస్య = సారథియొక్క, వచనాత్ = మాటవలన, సౌమిత్రిణా సార్ధమ్ = లక్ష్మణునితో కూడ, ధీమతా = బుద్ధిమంతుడైన, సుమన్త్రేణ చ = సుమంత్రునితో కూడ, రథోత్తమమ్ = ఆ రథశ్రేష్ఠమును, ఆరురోహ = ఎక్కెను.

తా. సారథి మాట విని సీత రథమును ఎక్కెను. లక్ష్మణుడు, ధీమంతుడైన సుమంత్రుడూ కూడ ఎక్కిరి. 22

మూ. ఆససాద విశాలాక్షీ గఙ్గాం పాపవినాశినీమ్, 23
అథార్ధదివసం గత్వా భాగీరథ్యా జలాశయమ్,
నిరీక్ష్య లక్ష్మణో దీనః ప్రరురోద మహాస్వనః. 24

ప్ర. అ. విశాలాక్షీ = విశాలములైన నేత్రములు గల సీత, పాపవినాశినీమ్ = పాపములను నశింపచేయు, గఙ్గామ్ = గంగానదిని, ఆససాద = సమీపించెను. అథ = పిమ్మట, లక్ష్మణః = లక్ష్మణుడు, అర్ధదివసమ్ = పగటి సగము కాలమును, భాగీరథ్యాః = గంగయొక్క, జలాశయమ్ = జలస్థానమును గూర్చి,

గత్వా = వెళ్ళి, దీనః = దీనుడై, నిరీక్ష్య = చూచి, మహాస్వనః = గొప్ప ధ్వని కలవాడై, ప్రరురోద = ఏడ్చెను.

తా. విశాలాక్షియైన సీత పాపములను నశింపచేయు గంగను సమీపించెను. దివసములో సగముకాలము ప్రయాణము చేసిన లక్ష్మణుడు గంగాజలమును చూచి దీనుడై బిగ్గరగా ఏడ్చెను. 23,24

మూ. సీతా తు పరమత్రస్తా దృష్ట్వా లక్ష్మణమాతురమ్,
ఉవాచ వాక్యం ధర్మజ్ఞా కిమిదం రుద్యతే త్వయా. 25

ప్ర. అ. ధర్మజ్ఞా = ధర్మజ్ఞురాలైన, సీతా తు = సీత యైతే, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి, ఆతురమ్ = దుఃఖితుణ్ణిగా, దృష్ట్వా = చూచి, పరమత్రస్తా = చాల భయపడినదై, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను. త్వయా = నీచేత, రుద్యతే = రోదనము చేయబడుచున్నది; ఇదమ్ = ఇది, కిమ్ = ఏమి ?

తా. ధర్మములు తెలిసిన సీత లక్ష్మణుడు దుఃఖించుటను చూచి చాల భయపడి ఇట్లు పలికెను- "నీవు ఏడ్చుచున్నావు; ఇది ఏమి ?". 25

మూ. జాహ్నవీతీరమాసాద్య చిరాభిలషితం మమ,
హర్షకాలే కిమర్థం మాం విషాదయసి లక్ష్మణ. 26

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! మమ = నాకు, చిరాభిలషితమ్ = చాల కాలమునుండి కోరబడిన, జాహ్నవీతీరమ్ = గంగాతీరమును, ఆసాద్య = పొంది, హర్షకాలే = సంతోషసమయమునందు, మామ్ = నన్ను, కిమర్థమ్ = ఎందుకు, విషాదయసి = దుఃఖింపచేయుచున్నావు ?

తా. లక్ష్మణా ! నేను చాలా కాలమునుండి కోరుకొనుచున్న గంగాతీరమును సమీపించిన తరువాత సంతోషించవలసిన సమయమునందు నాకు దిగులు కలిగించుచున్నా వేమి ? 26

మూ. నిత్యం త్వం రామపార్శ్వేషు వర్తసే పురుషర్షభ,
కచ్చిద్వినాకృతస్తేన ద్విరాత్రం శోకమాగతః. 27

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా ! త్వమ్ = నీవు, నిత్యమ్ =

=మహర్షులయొక్క, అభివాదనమ్ = నమస్కారమును, కృత్వా=చేసి, తత్ర = అక్కడ, ఏకామ్ = ఒక, నిశామ్ = రాత్రిని, ఉష్య = ఉండి, పునః = మరల, తాం పురీమ్ = పట్టణమును గూర్చి, యాస్యామః = వెళ్ళెదము.

తా. అటుపైన తగు విధముగా మహర్షుల అభివాదనము చేసి, అక్కడ ఒక రాత్రి ఉండి మరల నగరమునకు వెళ్ళెదము. 30

మూ. మమాపి పద్మపత్రాక్షం సింహోరస్కం కృశోదరమ్,
త్వరతే హి మనో ద్రష్టుం రామం రమయతాం వరమ్.

ప్ర. అ. పద్మపత్రాక్షమ్ = పద్మపత్రముల వంటి నేత్రములు కలవాడు, సింహోరస్కమ్ = సింహమువంటి వక్షఃస్థలము కలవాడు, కృశోదరమ్ = కృశమైన ఉదరము గలవాడు, రమయతామ్ = ఆనందింపచేయువారిలో, వరమ్ = శ్రేష్ఠుడూ అయిన, రామమ్ = రాముణ్ణి, ద్రష్టుమ్ = చూచుటకు, మమ = నాయొక్క, మనః అపి = మనస్సు కూడ, త్వరతే హి = తొందరపడుచున్నది కదా ?

తా. పద్మపత్రముల వంటి నేత్రములు, సింహము వంటి వక్షఃస్థలము, సన్నని నడుమూ గల, ఆనందింపచేసేవాళ్ళలో శ్రేష్ఠుడైన రాముణ్ణి చూడవలెనని నా మనస్సు కూడ తొందరపడుచున్నది. 31

మూ. తస్యాస్తద్వచనం శ్రుత్వా ప్రమృజ్య నయనే శుభే,
నావికానాహ్వయామాస లక్ష్మణః పరవీరహా. 32

ప్ర. అ. తస్యాః = ఆమెయొక్క, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, పరవీరహా = శత్రువీరులను సంహరించు, లక్ష్మణః=లక్ష్మణుడు, శుభే = మంగళప్రదములైన, నయనే = నేత్రములను, ప్రమృజ్య = తుడుచుకొని, నావికాన్ = నావ నడుపువాళ్ళను, ఆహ్వయామాస = పిలచెను.

తా. శత్రువీరులను సంహరించు లక్ష్మణుడు ఆమె మాటలు విని, సుందరములైన నేత్రములు తుడుచుకొని, నావ నడిపేవాళ్ళను పిలచెను. 32

మూ. ఇయం చ సజ్జా నౌశ్చేతి దాశాః ప్రాఞ్జలయోఽబ్రువన్,
తితీర్షుర్లక్ష్మణో గఙ్గాం శుభాం నావముపారుహత్, 33
గఙ్గాం సంతారయామాస లక్ష్మణస్తాం సమాహితః.

ఇత్యార్షే శ్రీ మద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
షట్చత్వారింశః సర్గః.

ప్ర. అ. ఇయమ్ = ఈ, నౌః = నావ, సజ్జా ఇతి = సిద్ధముగా ఉన్నది అని, దాశాః = పల్లెవారు, ప్రాఞ్జలయః = కట్టబడిన దోసిళ్ళు కలవారై, అబ్రువన్ = పలికిరి. లక్ష్మణః = లక్ష్మణుడు, గఙ్గామ్ = గంగను, తితీర్షుః = దాటదలచిన వాడై, శుభామ్ = సుందరమైన, నావమ్ = నావను, ఉపారుహత్ = ఎక్కెను. లక్ష్మణః = లక్ష్మణుడు, సమాహితః = సావధానచిత్తుడై, తామ్ = సీతను, గఙ్గామ్ = గంగను, తారయామాస = దాటించెను.

తా. "ఇదిగో నావ సిద్ధముగా ఉన్నది" అని నావికులు సవినయముగా చెప్పిరి. గంగను దాటదలచిన లక్ష్మణుడు సుందరమైన ఆ నావలోనికి ఎక్కి సీతను కూడ చాల జాగరూకతతో గంగను దాటించెను. 32,33

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు,
ఉత్తరకాండలో నలభైఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తచత్వారింశః సర్గః

[సీతను గంగానది దాటించిన పిమ్మట లక్ష్మణుడు ఆమెకు పరిత్యాగమును గూర్చి చెప్పుట].

మూ. అథ నావం సువిస్తీర్ణాం నైషాదీం రాఘవానుజః,
ఆరురోహ సమాయుక్తాం పూర్వమారోప్య మైథిలీమ్. 1

ప్ర. అ అథ = అటుపిమ్మట. రాఘవానుజః = లక్ష్మణుడు, సువిస్తీర్ణామ్ = చాల విశాలమైన, సమాయుక్తామ్ = సిద్ధము చేయబడిన, నైషాదీమ్ = నిషాదుని చేత తీసికొనిరాబడిన, నావమ్ = నావను, పూర్వమ్ = ముందుగా, మైథిలీమ్ = సీతను, ఆరోప్య = ఎక్కించి, ఆరురోహ = ఎక్కెను.

తా. పిమ్మట లక్ష్మణుడు నిషాదుడు తీసికొనివచ్చిన, విశాలమైన, సిద్ధము చేయబడిన నావపై సీతను ముందుగా ఎక్కించి పిదప తాను ఎక్కెను.

మూ. సుమన్త్రం చైవ సరథం స్థీయతామితి లక్ష్మణః,
ఉవాచ శోకసంతప్తః ప్రయాహీతి చ నావికమ్. 2

ప్ర. అ. శోకసంతప్తః = శోకముచేత తపింపచేయబడిన, లక్ష్మణః = లక్ష్మణుడు, సరథమ్ = రథముతో కూడిన, సుమన్త్రమ్ = సుమంత్రుణ్ణి, స్థీయతామ్ ఇతి = ఉండుము అని, నావికమ్ = నావవానిని, ప్రయాహీతి చ = నడువుము అని, ఉవాచ = పలికెను.

తా. దుఃఖాక్రాంతుడైన లక్ష్మణుడు "నువ్వు రథముతో ఇక్కడనే ఉండుము" అని సుమంత్రునితో చెప్పి, "నడిపింపుము" అని నావవానితో పలికెను.

మూ. తతస్తీరముపాగమ్య భాగీరథ్యాః స లక్ష్మణః,
ఉవాచ మైథిలీం వాక్యం ప్రాఞ్జలిర్బాష్పసంవృతః. 3

ప్ర. అ. తతః=ఆటుపిమ్మట, సః లక్ష్మణః=ఆ లక్ష్మణుడు, భాగీరథ్యాః =గంగయొక్క, తీరమ్ = తీరమును, ఉపాగమ్య = పొంది, ప్రాఞ్జలిః = కట్ట బడిన దోసిలికలవాడై, బాష్పసంవృతః = కన్నీటితో కూడినవాడై, మైథిలీమ్ = సీతను గూర్చి, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. అప్పుడు లక్ష్మణుడు గంగాతీరమున చేరిన పిమ్మట అంజలి ఘటించి, కన్నీళ్ళు కార్చుచు సీతతో ఇట్లు పలికెను. 3

మూ. హృద్గతం మే మహచ్ఛల్యం యస్మాదార్యేణ ధీమతా,
అస్మిన్నిమిత్తే వైదేహి లోకస్య వచనీకృతః. 4

ప్ర. అ. వైదేహి = సీతాదేవీ! ధీమతా = బుద్ధిమంతుడైన, ఆర్యేణ = అన్నగారిచేత, యస్మాత్ = ఏ కారణమువలన, అస్మిన్ = ఈ, నిమిత్తే = నిమిత్తమునందు (కార్యమునందు), లోకస్య = లోకమునకు, వచనీకృతః = నిందార్హుడను చేయబడినానో, అందువలన, మహత్ = గొప్ప, శల్యమ్ = శల్యము, మే = నాయొక్క, హృద్గతమ్ = హృదయములో ఉన్నది.

తా. సీతాదేవీ! బుద్ధి శాలియైన మా అన్నగారు నన్ను ఈ విషయములో లోకాల నిందకు పాలైయేటట్లు చేసినాడు. ఇది నా హృదయములో గొప్ప శల్యముగా ఏర్పడినది. 4

మూ. శ్రేయో హి మరణం మేఽద్య మృత్యుర్వాయత్పరంభవేత్,
న చాస్మిన్నీదృశే కార్యే నియోజ్యో లోకనిన్దితే. 5

ప్ర. అ. ('మృత్యుర్వా'కు బదులు 'మృత్యోర్వా' అన్న పాఠము ఉన్నచో బాగుండును.) అద్య = ఇప్పుడు, మే = నాకు, మరణమ్ = మరణము, శ్రేయః హి = శ్రేయస్కరము. మృత్యోః = మృత్యువుకంటె, యత్ = ఏది, అధికమ్ = అధికముగా, భవేత్ = అగునో, (తత్)వా = అదైనా, శ్రేయస్కరము అగును. ఈదృశే = ఇట్టి, లోకనిన్దితే = లోకమునందు నిందింపబడిన, అస్మిన్ = ఈ, కార్యే = కార్యమునందు, నియోజ్యః = నియమింపదగినవాడను, న చ = కాను.

తా. ఈ విధమైన లోకనిందితమైన కార్యమునందు నియోగింపబడుటకంటె నాకు మరణమో, అంతకంటె గొప్పది ఏదైనా ఉన్నచో అదో శ్రేయస్కరము అయి ఉండెడిది. 5

మూ. ప్రసీద చ న మే పాపం కర్తుమర్హసి శోభనే,
ఇత్యఞ్జలికృతో భూమౌ నిపపాత సలక్ష్మణః. 6

ప్ర. అ. శోభనే = మంగళప్రదురాలా ! ప్రసీద = అనుగ్రహించుము. మే = నాకు, పాపమ్ = పాపమును, కర్తుమ్ = చేయుటకు (ఆరోపించుటకు), నార్హసి = తగవు. ఇతి = ఇట్లు, లక్ష్మణః = లక్ష్మణుడు, అఞ్జలికృతః = కట్టబడిన దోసిలి కలవాడై, భూమౌ = నేలమీద, నిపపాత = పడెను.

తా. మంగళప్రదురాలా ! నా విషయమున దోషమును ఊహించకుము. (నేను దోషిని కాదు)అని పలుకుచు లక్ష్మణుడు అంజలి ఘటించి నమస్కరించుచు భూమిమీద పడెను. 6

మూ. రుదన్తం ప్రాఞ్జలిం దృష్ట్వా కాఙ్క్షన్తం మృత్యుమాత్మనః,
మైథిలీ భృశసంవిగ్నా లక్ష్మణం వాక్యమబ్రవీత్. 7

ప్ర. అ. రుదన్తమ్ = ఏడ్చుచున్నవాడు, ప్రాఞ్జలిమ్ = కట్టబడిన దోసిలి కలవాడు, ఆత్మనః = తనకు, మృత్యుమ్ = మృత్యువును, కాఙ్క్షన్తమ్ = కోరుచున్న వాడూ అయిన, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి, దృష్ట్వా = చూచి, మైథిలీ = సీత, భృశ సంవిగ్నా = చాల దిగులు చెందినదై, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. చేతులు జోడించి ఏడ్చుచు తనకు మృత్యువు వచ్చిన బాగుండు నని కోరుకొనుచున్న ఆ లక్ష్మణుని చూచి సీత చాల దిగులు చెంది ఇట్లు పలికెను. 7

మూ. కిమిదం నావగచ్ఛామి బ్రూహి తత్త్వేన లక్ష్మణ,
పశ్యామి త్వాం న చ స్వస్థమపి క్షేమం మహీపతేః. 8

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! ఇదమ్ = ఇది, కిమ్ = ఏమి ? తత్త్వేన = యథార్థముచేత, బ్రూహి = చెప్పుము. త్వామ్ = నిన్ను, స్వస్థమ్ = స్వస్థుణ్ణిగా, న చ పశ్యామి = చూడను కూడ; మహీపతేః = రాజునకు, అపి క్షేమమ్ = క్షేమమే కదా ?

తా. లక్ష్మణా ! ఇదేమో నాకు అర్థము అగుటలేదు. అసలు విషయ మేమో చెప్పుము. నువ్వు స్వస్థుడవుగా ఉన్నట్లు కూడ కనబడుటలేదు. రాజునకు క్షేమమే కద ? 8

మూ. శాపితోఽసి నరేన్ద్రేణ యత్త్వం సంతాపమాగతః,
తద్బ్రూయాః సంనిధౌ మహ్యమహమాజ్ఞాపయామి తే. 9

ప్ర. అ. నరేన్ద్రేణ = రాజుచేత, శాపితః = ఒట్టు పెట్టబడినవాడవు, అసి = అయి ఉన్నావు. త్వమ్ = నీవు, యత్ = ఎందువలన, సంతాపమ్ = దుఃఖమును, ఆగతః = పొందినావో, తత్ = దానిని, సంనిధౌ = నా సంనిధియందు, మహ్యమ్ = నాకొరకు, బ్రూయాః = చెప్పుము, తే = నీకు, ఆజ్ఞాపయామి = ఆజ్ఞాపించుచున్నాను.

తా. రాజుమీద ఒట్టు పెట్టి అడుగుచున్నాను. నీకు ఇంత దుఃఖము ఎందుకు కలిగినదో చెప్పుము. నిన్ను ఆజ్ఞాపించుచున్నాను. 9

మూ. వైదేహ్యా చోద్యమానస్తు లక్ష్మణో దీనచేతనః,
అవాఙ్ముఖో బాష్పగలో వాక్యమేతదువాచ హ. 10

ప్ర. అ. వైదేహ్యా = సీతచేత, చోద్యమానః = ప్రేరేపింపబడుచున్న, లక్ష్మణః = లక్ష్మణుడు, దీనచేతనః = దీనమైన మనస్సు కలవాడై, అవాఙ్ముఖః = క్రిందికి ముఖము కలవాడై, బాష్పగలః = కన్నీరు కంఠమునందు కలవాడై, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. సీత ఈ విధముగా ప్రేరేపించగా లక్ష్మణుడు దైన్యముతో నిండిన మనస్సుతో తల వంచుకొని, డగ్గుత్తికతో ఇట్లు పలికెను. 10

మూ. శ్రుత్వా పరిషదో మధ్యే హ్యపవాదం సుదారుణమ్,
పురే జనపదే చైవ త్వత్కృతే జనకాత్మజే, 11
రామః సంతప్తహృదయో మాం నివేద్య గృహం గతః.

ప్ర. అ. జనకాత్మజే = సీతా! రామః = రాముడు, పరిషదః = పరిషత్తు యొక్క, మధ్యే = మధ్యయందు, పురే = పురమునందు, జనపదే చైవ = గ్రామమునందు, త్వత్కృతే = నీకొరకై (నీ విషయమునందు), సుదారుణమ్ = చాల దారుణమైన, అపవాదమ్ = అపవాదమును, శ్రుత్వా = విని, సంతప్తహృదయః = తపింపచేయబడిన హృదయము కలవాడై, మామ్ = నన్ను గూర్చి, నివేద్య = తెలిపి, గృహమ్ = గృహమును గూర్చి, గతః = వెళ్ళినాడు.

తా. దేవీ! అట్టి నిర్దోషురాలవైన నిన్ను పౌరుల అపవాదమునుండి భయపడిన రాజు నా సంనిధిలో (నా ద్వారా) విడచినాడు. నీవు మరొక విధముగా అనుకొనకుము. నిన్ను రాజాజ్ఞానుసారము ఆశ్రమప్రాంతాలలో విడువలసి ఉన్నది. నీవు కూడ అట్లే కోరుకొన్నావట కదా ? 13,14.

మూ. తదేతజ్జాహ్నవీతీరే బ్రహ్మర్షీణాం తపోవనమ్, 15
పుణ్యం చ రమణీయం చ మా విషాదం కృథాః శుభే.

ప్ర. ఆ. జాహ్నవీతీరే = గంగాతీరమువందు, తత్ ఏతత్ = అట్టి ఇది, పుణ్యమ్ = పుణ్యమూ, రమణీయం చ = సుందరమూ అయిన, తపోవనమ్ = తపోవనము. శుభే = మంగళప్రదురాలా, విషాదమ్ = దుఃఖమును, మా కృథాః = చేయకుము.

తా. గంగాతీరమునందు అదే ఆ కనపడుచున్నది పుణ్యము, సుందరమూ అయిన బ్రహ్మర్షుల తపోవనము. ఓ! మంగళప్రదురాలా! దుఃఖము చెందకుము.

మూ. రాజ్ఞో దశరథస్యైవ పితుర్మే మునిపుంగవః, 16
సఖా పరమకో విప్రో వాల్మీకిః సుమహాయశాః.

ప్ర. ఆ. మునిపుంగవః = మునిశ్రేష్ఠుడు, మే పితుః = నా తండ్రియైన, రాజ్ఞః దశరథస్య = రాజైన దశరథునియొక్క, పరమకః = గొప్ప, సఖా = స్నేహితుడు, సుమహాయశాః = చాలా గొప్ప కీర్తి గలవాడు అయిన, వాల్మీకిః = వాల్మీకి అను, విప్రః = బ్రాహ్మణుడు (ఉన్నాడు).

తా. మా తండ్రియైన దశరథమహారాజుకు పరమమిత్రుడు, మునిశ్రేష్ఠుడూ, గొప్ప కీర్తి గలవాడూ అయిన వాల్మీకి ఇక్కడనే ఉన్నాడు. 16

మూ. పాదచ్ఛాయాముపాగమ్య సుఖమస్య మహాత్మనః, 17
ఉపవాసపరైకాగ్రా వస త్వం జనకాత్మజే,
పతివ్రతాత్వమాస్థాయ రామం కృత్వా సదా హృది, 18
శ్రేయస్తే పరమం దేవి తథా కృత్వా భవిష్యతి.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
సప్తచత్వారింశః సర్గః.

ప్ర. అ. జనకాత్మజే = సీతాదేవీ! మహాత్మనః = మహాత్ముడైన, అస్య = ఇతనియొక్క, పాదచ్ఛాయామ్ = పాదముల నీడను, ఉపాగమ్య = పొంది, త్వమ్ = నీవు, ఉపవాసపరా = ఉపవాసమునందు ఆసక్తురాలవై, (పతివ్రతలకు తగిన భోజనమునందు ఆసక్తి గలదానవై), ఏకాగ్రా = ఏకాగ్రచిత్తముగలదానవై, రామమ్ = రాముణ్ణి, సదా = ఎల్లప్పుడూ, హృది = హృదయమునందు, కృత్వా = ఉంచుకొని, పతివ్రతాత్వమ్ = పతివ్రతాత్వమును, ఆస్థాయ = అవలంబించి, వస = నివసించుము. దేవి = ఓ దేవీ! తథా = అట్లు, కృత్వా = చేసి, తే = నీకు, పరమమ్ = గొప్ప, శ్రేయః = శ్రేయస్సు, భవిష్యతి = కాగలదు.

తా. ఓ! సీతాదేవీ! ఆ మహాత్ముని పాదముల చెంతకు చేరి, పతివ్రతాధర్మములను ఆచరించుచు నిత్యమూ రాముణ్ణే హృదయమునందు స్మరించుచు నియమపూర్వక మగు ఆహారము భుజించుచు ఇక్కడ నివసించుము. అట్లు చేసినచో నీకు శ్రేయస్సు కాగలదు. 17, 18

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో నలభైవీడవ సర్గ సమాప్తము.

అథ అష్టచత్వారింశః సర్గః

[సీత దుఃఖావిష్టురాలై రామునకు సందేశము పంపుట. లక్ష్మణుడు వెళ్ళిపోవుట. సీత విలపించుట].

మూ. లక్ష్మణస్య వచః శ్రుత్వా దారుణం జనకాత్మజా,
పరం విషాదమాగమ్య వైదేహీ నిపపాత హ. 1

ప్ర. అ. జనకాత్మజా = జనకుని కుమార్తె యైన, వైదేహీ = సీత, దారుణమ్ = దారుణమైన, లక్ష్మణస్య = లక్ష్మణునియొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, పరమ్ = గొప్ప, విషాదమ్ = దుఃఖమును, ఆగమ్య = పొంది, నిపపాత హ = క్రింద పడిపోయెను.

తా. దారుణమైన లక్ష్మణుని మాటలు విని సీత చాల దుఃఖమును పొంది మూర్ఛిల్లి నేలపై పడిపోయెను. 1

మూ. సా ముహూర్తమివాసంజ్ఞా బాష్పపర్యాకులేక్షణా,
లక్ష్మణం దీనయా వాచా ఉవాచ జనకాత్మజా. 2

ప్ర. అ. ముహూర్తమివ = క్షణకాలము, అసంజ్ఞా = సంజ్ఞలేకుండా ఉండిన, సా జనకాత్మజా = ఆ సీత, బాష్పపర్యాకులేక్షణా = కన్నీళ్ళతో వ్యాకులములైన నేత్రములు గలదై, దీనయా = దీనమైన, వాచా = వాక్కుతో, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. క్షణకాలము స్పృహ తప్పి పడిపోయిన ఆ సీత నేత్రములు కన్నీళ్ళతో నిండగా దీనముగా లక్ష్మణునితో ఇట్లు పలికెను. 2

మూ. మామికేయం తనుర్మానం సృష్టా దుఃఖాయ లక్ష్మణ,
ధాతా యస్యాస్తథా మేఽద్య దుఃఖమూర్తిః ప్రదృశ్యతే.

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! యస్యాఃఏ, మే = నాకు, దుఃఖ మూర్తిః = దుఃఖముల మూర్తియే, అద్య = ఇప్పుడు, ప్రదృశ్యతే = చూడబడు చున్నదో, (కనబడుచున్నదో), మామికా=నా సంబంధమైన, ఇయం తనుఃఈ శరీరము, నూనమ్ = నిశ్చయముగా, ధాత్రా = బ్రహ్మదేవునిచేత, దుఃఖాయ = దుఃఖముకొరకే, సృష్టా = సృజించబడినది.

తా. లక్ష్మణా! బ్రహ్మదేవుడు నిజముగా నా దేహమును దుఃఖము అనుభ వించుటకే సృష్టించినాడు. అందుచేతనే నేను ఇప్పుడు మూర్తీభవించిన దుఃఖ మును చూచుచున్నాను. 3

మూ. కిం ను పాపం కృతం పూర్వం కో ను దారైర్వియోజితః,
యాహం శుద్ధసమాచారా త్యక్తా నృపతినా సతీ. 4

ప్ర. ఆ. శుద్ధసమాచారా = పరిశుద్ధమైన ఆచారము గల, సతీ = పతివ్రత నైన, యా అహమ్ = ఏ నేను, నృపతినా = రాజుచేత, త్యక్తా = విడువబడితినో అట్టి నాచేత, పూర్వమ్ = పూర్వము, కిం పాపమ్ = ఏమి పాపము, కృతం ను= చేయబడినదో? దారైఃః = భార్యతో, కఃః = ఎవడు, వియోజితఃనుః = దూరము చేయబడినాడో.

తా. పరిశుద్ధమైన నడవడిక గల పతివ్రతనైన నన్ను రాజు విడచివేయు చున్నాడు. పూర్వము నేను ఏమి పాపము చేసినానో! ఎవరికి భార్యావియోగము కలిగించినానో! 4

మూ. పురాహమాశ్రమే వాసం రామపాదానువర్తినీ,
అనురుధ్యామి సౌమిత్రే దుఃఖే చ పరివర్తినీ. 5

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా! అహమ్ = నేను, పురా = పూర్వము, దుఃఖే = దుఃఖమునందు, పరివర్తినీ = ఉన్నదాననై నను. రామపాదానువర్తినీ = = రాముని పాదములను అనుసరించుదాననై, ఆశ్రమే = ఆశ్రమమునందు వాసమ్ = నివాసమును, అనురుధ్యామి = అనుసరించితిని.

తా. లక్ష్మణా! పూర్వము నేను ఎన్ని కష్టములలో ఉన్నను రాముని పాదములను ఆశ్రయించి ఆశ్రమములో నివసించితిని. 5

మూ. సా కథం హ్యాశ్రమే సౌమ్య వత్స్యామి విజనీకృతా,
ఆఖ్యాస్యామి చ కస్యాహం దుఃఖం దుఃఖపరాయణా. 6

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! సా = అట్టి, అహమ్ = నేను, విజనీకృతా = జనులు లేకుండ చేయబడినదానినై, ఆశ్రమే = ఆశ్రమములో, కథమ్ = ఎట్లు, వత్స్యామి = నివసింతును? దుఃఖపరాయణా = దుఃఖమునకు అధీనురాలనైన నేను, దుఃఖమ్ = నా దుఃఖమును, కస్య = ఎవనికి, ఆఖ్యాస్యామి = చెప్పుకొందును.

తా. సౌమ్యుడా! బంధుజనులకు దూరము చేయబడిన నేను ఆశ్రమములో ఎట్లు నివసించగలను? దుఃఖముతో నిండిన నేను నా కష్టములు ఎవరికి చెప్పుకొందును? 6

మూ. కిం ను వక్ష్యామి మునిషు కర్మ చాసత్కృతం ప్రభో,
కస్మిన్ వా కారణే త్యక్తా రాఘవేణ మహాత్మనా. 7

ప్ర. అ. ప్రభో = ఓ! ప్రభూ! కిం ను = ఏ, అసత్ = చెడ్డ, కర్మ = పనిని, కృతమ్ = చేయబడిన దానినిగా, మునిషు = మునులయందు (కు), వక్ష్యామి = చెప్పుదును, మహాత్మనా = మహాత్ముడైన, రాఘవేణ = రామునిచేత, కస్మిన్ వా = ఏ, కారణే = కారణమునందు, త్యక్తా = విడవబడినదాననో చెప్పుదును?

తా. ప్రభూ! లక్ష్మణా! నేను ఏమి తప్పు పని చేసితినని మునులకు చెప్పుదును. నన్ను మహాత్ముడైన రాముడు ఏ కారణముచేత విడచినా డని చెప్పుదును? 7

మూ. న ఖల్వద్యైవ సౌమిత్రే జీవితం జాహ్నవీజలే,
త్యజేయం రాజవంశస్తు భర్తుర్మే పరిహాస్యతే. 8

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా! అద్యైవ = ఇప్పుడే, జాహ్నవీజలే = గంగాజలమునందు, జీవితమ్ = ప్రాణమును, న ఖలు త్యజేయమ్ = విడువను. మే భర్తుః = నా భర్తయొక్క, వంశః = వంశము, పరిహాస్యతే తు = నష్టము కాగలదు కదా?

తా. లక్ష్మణా! నేనిప్పుడే గంగాజలములో ప్రాణాలను విడువను. ఎందు

చేతననగా (నా గర్భము కూడ నశించినచో) నా భర్త వంశము విచ్ఛిన్నమై పోవును. 8

మూ. యథాజ్ఞం కురు సౌమిత్రే త్యజ్య మాం దుఃఖభాగినీమ్,
నిదేశే స్థీయతాం రాజ్ఞః శృణు చేదం వచో మమ. 9

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా! యథాజ్ఞమ్ = ఆజ్ఞానుసారముగా, కురు = చేయుము. దుఃఖభాగినీమ్ = దుఃఖమును అనుభవించవలసిన, మామ్ = నన్ను, త్యజ్య = విడచి, రాజ్ఞః = రాజుయొక్క, నిదేశే = ఆజ్ఞయందు, స్థీయతామ్ = ఉండెదవుగాక. మమ = నాయొక్క, ఇదమ్ = ఈ, వచః చ = వచనమును కూడ శృణు = వినుము.

తా. లక్ష్మణా! రాజాజ్ఞప్రకారము చేయుము. దుఃఖమును అనుభవించవలసిన నన్ను విడచి రాజాజ్ఞను ఆచరించుము. నేను చెప్పు ఈ మాటలు కూడా వినుము. 9

మూ. శ్వశ్రూణామవిశేషేణ ప్రాఞ్జలిప్రగ్రహేణ చ,
శిరసా వన్ద్య చరణౌ కుశలం బ్రూహి పార్థివమ్. 10

ప్ర. అ. శ్వశ్రూణామ్ = అత్తగార్లకు, అవిశేషేణ = విశేషము లేకుండ, ప్రాఞ్జలిప్రగ్రహేణ చ = దోసిలి కట్టుటచేత, శిరసా = శిరస్సుతో, చరణౌ = పాదాలను, వన్ద్య = నమస్కరించి, పార్థివమ్ = రాజును, కుశలమ్ = కుశలమును, బ్రూహి = పలుకుము.

తా. అత్తగార్లందరికీ భేదమేమీ లేకుండా చేతులు జోడించి, పాదములు స్పృశించి నమస్కరించినట్లు చెప్పవలెను. రాజును కుశల మడిగి నట్లు చెప్పుము.

మూ. శిరసాభినతో బ్రూయాః సర్వాసామేవ లక్ష్మణ,
వక్తవ్యశ్చాపి నృపతిర్ధర్మేషు సుసమాహితః. 11

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! సర్వాసామ్ ఏవ = అత్త లందరికీ, శిరసా = శిరస్సుతో, అభినతః = వంగినవాడవై, బ్రూయాః = చెప్పుము. ధర్మేషు = ధర్ములయందు, సుసమాహితః = బాగా సావధానచిత్తుడైన, నృపతిః చ అపి = రాజు కూడ, వక్తవ్యః = చెప్పదగినవాడు.

తా. లక్ష్మణా ! అత్తలందరికి శిరస్సుతో నమస్కరించి నా విషయము చెప్పుము. ధర్మములయందు చాల శ్రద్ధ గల రాజుతో కూడ ఇట్లు చెప్పుము. 11

మూ. జానాసి చ యథా శుద్ధా సీతా తత్త్వేన రాఘవ,
భక్త్యా చ పరయా యుక్తా హితా చ తవ నిత్యశః. 12

ప్ర. అ. రాఘవ = రామా! సీతా = సీత, తత్త్వేన = యాథార్థ్యముచేత, యథా = ఎట్లు, శుద్ధా = పరిశుద్ధురాలో, పరమయా = గొప్ప, భక్త్యా = భక్తితో, యుక్తా చ = కూడినదో, నిత్యశః = నిత్యము, తవ = నీకు, హితా చ = హితురాలో, జానాసి = ఎరుగుదువు.

తా. రామా! సీత పరిశుద్ధురాలు; గొప్ప భక్తి గలది; నిత్యము నీ హితమును కోరునది అను విషయము నీకు తెలియును. 12

మూ. అహం త్యక్తా త్వయా వీర అయశోభీరుణా జనే,
యచ్చ తే వచనీయం స్యాదపవాదసముత్థితమ్, 13
మయా చ పరిహర్తవ్యం త్వం హి మే పరమా గతిః.

ప్ర. అ. వీర = వీరుడా! జనే = జనమునందు, అయశోభీరుణా = అపకీర్తి వలన భయపడిన, త్వయా = నీచేత, అహమ్ = నేను, త్యక్తా = విడవబడితిని. అపవాదసముత్థితమ్ = లోకాపవాదమువలన కలిగిన, తే = నీయొక్క, యత్ = ఏ, వచనీయమ్ = నింద గలదో అది, మయా = నాచేత, పరిహర్తవ్యమ్ = పరిహరించదగినది. త్వమ్ = నీవే, మే = నాయొక్క, పరమా = గొప్ప, గతిః = గతివి కదా.

తా. వీరుడా ! ప్రజలలో వచ్చిన అపకీర్తినుండి భయపడి నీవు నన్ను త్యజించినావు. లోకాపవాదవలన నీకు కలిగిన ఈ నిందను నేను తొలగించవలెను. నీవే నా ఉత్తమగతివి కదా? 13

మూ. వక్తవ్యశ్చేతి నృపతిర్ధర్మేణ సుసమాహితః, 14
యథా భ్రాతృషు వర్తేథాస్తథా పౌరేషు నిత్యదా.

ప్ర. అ. ధర్మేణ = ధర్మముచేత, సుసమాహితః = చాల సావధానచిత్తు

డైన, నృపతిః = రాజు, ఇతి = ఇట్లు, వక్తవ్యః చ = చెప్పదగినవాడు. భ్రాతృషు = సోదరుల విషయమునందు, యథా = ఎట్లు, వర్తేథాః = ప్రవర్తింతువో, పౌరేషు = పౌరులవిషయమునందు, నిత్యదా = ఎల్లప్పుడూ, తథా = అట్లే ప్రవర్తించెదవు గాక.

తా. ధర్మము విషయమున సావధానచిత్తుడైన రాజుతో ఇట్లు చెప్పుము. నీవు పౌరులను నిత్యము సోదరులను చూచుకొన్నట్లు చూచుకొనుము. 14

మూ. పరమో హ్యేష ధర్మస్తే తస్మాత్కీర్తిరనుత్తమా, 15
యత్తు పౌరజనే రాజన్ ధర్మేణ సమవాప్నుయాత్.

ప్ర. అ. ఏషః = ఇది, తే = నీయొక్క, పరమః = గొప్ప, ధర్మః హి = ధర్మము కదా ? రాజన్ = రాజా ! పౌరజానపదే = పౌరజానపదుల విషయమున, ధర్మేణ = ధర్మముచేత, యత్ = దేనిని, సమవాప్నుయాత్ = పొందునో, తస్మాత్ = దానివలన, అనుత్తమా = చాల గొప్పదైన, కీర్తిః = కీర్తి కలుగును.

తా. ఇది (పౌరులను సోదరులను వలె చూచుకొనుట) నీకు గొప్ప ధర్మము. రాజా! పౌరజానపదుల విషయమునందు ధర్మప్రవృత్తిచే లభించు పుణ్యమువలన అత్యధికమైన కీర్తి లభించును కదా? 15

మూ. అహం తు నానుశోచామి స్వశరీరం నరర్షభ, 16
యథాపవాదః పౌరాణాం తథైవ రఘునన్దన.

ప్ర. అ. నరర్షభ = నరులలో శ్రేష్ఠుడా! అహం తు = నేనైతే, స్వశరీరమ్ = నా శరీరమునుగూర్చి, న అనుశోచామి = విచారించను. రఘునన్దన = రామా ! పౌరాణామ్ = పౌరులయొక్క, అపవాదః = అపవాద, యథా = ఎట్లున్నదో, తథైవ = అట్లే.

తా. నరశ్రేష్ఠుడవైన రామా! నేను నా శరీరమును గూర్చి విచారించుటలేదు. పౌరుల అపవాదము ఎట్లున్నదో దానిని పట్టియే నేను ప్రవర్తించెదను; అనగా నీకు దూరముగా ఉండుటకు సిద్ధముగా ఉన్నాను. 16

మూ. పతిర్హి దేవతా నార్యాః పతిర్బన్ధుః పతిర్గురుః, 17
ప్రాణైరపి ప్రియం తస్మాద్భర్తుః కార్యం విశేషతః.

ప్ర. అ. నార్యాఃస్త్రీకి, పతిఃభర్త, దేవతా హిదేవత కదా? పతిఃభర్తయే, బన్ధుఃబంధువు, పతిఃభర్తయే, గురుఃగురువు. తస్మాత్ఆ కారణమువలన. భర్తుఃభర్తకు, ప్రియమ్ప్రియమైనది, విశేషతఃవిశేషముగా, ప్రాణైఃఅపిప్రాణములచేత కూడ, కార్యమ్చేయదగినది.

తా. స్త్రీకి భర్తయే దేవత; భర్తయే బంధువు, భర్తయే గురువు. అందువలన భర్తకు ఇష్టమైన కార్యమును విశేషించి ప్రాణాలు అర్పించియైనా చేయవలెను. 17

మూ. ఇతి మద్వచనాద్రామో వక్తవ్యో మమ సంగ్రహః, 18
నిరీక్ష్య మాద్య గచ్ఛ త్వమృతుకాలాతివర్తినీమ్.

ప్ర. అ. ఇతిఇట్లు, మద్వచనాత్నా మాటవలన, రామఃరాముడు, వక్తవ్యఃచెప్పదగినవాడు. (ఇది) మమనాయొక్క, సంగ్రహఃసంక్షిప్త వచనము. అద్యఇప్పుడు, ఋతుకాలాతివర్తినీమ్గర్భవతినైన, మాననున్ను, నిరీక్ష్యచూచి, త్వమ్నీవు, గచ్ఛవెళ్ళుము.

తా. నా మాటగా రామునితో ఇట్లు చెప్పుము. ఇదే నేను చెప్పదలచిన మాటల సంగ్రహము. నేను గర్భవతినై ఉన్నాను అను విషయమును చూచి వెళ్ళుము.

వి. మరల లోకాపవాదము కలుగకుండుటకై సీత లక్ష్మణుణ్ణి సాక్షిగా చూపుటకై ఇట్లు అన్నదని కొందరు వ్యాఖ్యాతలు వ్రాసిరి. నిజానికి ఇది అనుచితమైన వాక్యము. అందుచేతనే ఈ శ్లోకంలోని ఉత్తరార్ధము, 21, 22 శ్లోకాలూ ప్రాచ్యప్రతిలో లేవు. 18

మూ. ఏవం బ్రువన్త్యాం సీతాయాం లక్ష్మణో దీనచేతనఃః, 19
శిరసా వన్ద్య ధరణీం వ్యాహర్తుం న శశాక హ.

ప్ర. అ. సీతాయామ్సీత, ఏవమ్ఈ విధముగా, బ్రువన్త్యామ్పలుకుచున్నదగుచుండగా, లక్ష్మణఃలక్ష్మణుడు, దీనచేతనఃదీనమైన మనస్సు గలవాడై, ధరణీమ్భూమిని, శిరసాశిరస్సుతో, వన్ద్యనమస్కరించి, వ్యాహర్తుమ్పలుకుటకు, న శశాక హసమర్థుడు కాలేదు.

తా. సీత ఇట్లు పలుకుచున్నప్పుడు లక్ష్మణుడు దైన్యముతో నిండిన

మనస్సుతో, సీత నిలచిన భూమికి శిరస్సుతో నమస్కరించి, ఏమీ మాటలాడలేక పోయెను. 19

మూ. ప్రదక్షిణం చ తాం కృత్వా రుదన్నేవ మహాస్వనః, 20
ధ్యాత్వా ముహూర్తం తామాహ కిం మాం వక్ష్యసి శోభనే.

ప్ర. అ. మహాస్వనః = గొప్ప ధ్వని కలవాడై, రుదన్నేవ = ఏడ్చుచునే, తామ్ = ఆమెను, ప్రదక్షిణం కృత్వా = ప్రదక్షిణము చేసి, ముహూర్తమ్ = ముహూర్తకాలము, ధ్యాత్వా = ఆలోచించి, తామ్ = ఆమెను గూర్చి, ఆహ = పలికెను. శోభనే = మంగళప్రదురాలా, మామ్ = నన్ను గూర్చి, కిమ్ = ఏమి, వక్ష్యసి = చెప్పెదవు ?

తా. అతడు బిగ్గరగా ఏడ్చుచు ఆమెకు ప్రదక్షిణము చేసి, ముహూర్త కాలము ఆలోచించి, ఆమెతో ఇట్లనెను- "మంగళప్రదురాలా! నీవు నాతో ఏమను చున్నావు ?" 20

మూ. దృష్టపూర్వం న తే రూపం పాదౌ దృష్టౌ తవానఘే, 21
కథమత్ర హి పశ్యామి రామేణ రహితాం వనే,
ఇత్యుక్త్వా తాం నమస్కృత్య పునర్నావముపారుహత్.

ప్ర. అ. అనఘే = దోషము లేనిదానా ! తే = నీయొక్క, రూపమ్ = రూపము, న దృష్టపూర్వమ్ = పూర్వము చూడబడలేదు. పాదౌ = పాదములు (మాత్రము) దృష్టౌ = చూడబడినవి, అత్ర = ఈ, వనే = వనమునందు, రామేణ = రామునితో, రహితామ్ = శూన్యురాలవైన నిన్ను, కథమ్ = ఎట్లు, పశ్యామి = చూచెదను. ఇతి = ఇట్లు, ఉక్త్వా = పలికి, తామ్ = ఆమెను, నమస్కృత్య = నమస్కరించి, పునః = మరల, నావమ్ = నావను, ఉపారుహత్ = ఎక్కెను.

తా. "దోషములేనిదానా ! నీ రూపమును పూర్వము నేనెన్నడూ చూడ లేదు. పాదాలు మాత్రమే చూచితిని. ఇక్కడ ఈ వనమునందు, రాముడు దగ్గర లేని నిన్ను నేనెట్లు చూచెదను ?" ఇట్లు పలికి, ఆమెకు నమస్కరించి మరల నావ ఎక్కెను. 21, 22

మూ. ఆరురోహ పునర్నావం నావికం చాభ్యచోదయత్,
స గత్వా చోత్తరం తీరం శోకభారసమన్వితః, 23
సంమూఢ ఇవ దుఃఖేన రథమధ్యారుహద్ద్రుతమ్.

ప్ర. అ. పునః = తిరిగి, నావమ్ = నావను, ఆరురోహ = ఎక్కెను. నావికమ్ = నావికుణ్ణి, అభ్యచోదయత్ చ = ప్రేరేపించెను కూడ. శోకభార సమన్వితః = దుఃఖభారముతో కూడిన, దుఃఖేన = దుఃఖముచేత, సమూఢః ఇవ = మూఢుడు వలె ఉన్న, సః = అతడు, ఉత్తరం తీరమ్ = ఉత్తరము వైపు తీరమును, గత్వా = పొంది, ద్రుతమ్ = శీఘ్రముగా, రథమ్ = రథమును, అధ్యారుహత్ = ఎక్కెను.

తా. శోకభావముతో క్రుంగి, దుఃఖముచేత ఏమీ తోచని స్థితిలో ఉన్న ఆ లక్ష్మణుడు గంగ ఆవలి ఒడ్డు చేరి శీఘ్రముగా రథము నెక్కెను. 23

మూ. ముహుర్ముహుః పరావృత్య దృష్ట్వా సీతామనాథవత్,
చేష్టన్తీం పరతీరస్థాం లక్ష్మణః ప్రయయావథ.

ప్ర. అ. లక్ష్మణః = లక్ష్మణుడు, పరతీరస్థామ్ = మరొక ఒడ్డున ఉన్న, అనాథవత్ = అనాథురాలి వలె, చేష్టన్తీం = దొరలుచున్న, సీతామ్ = సీతను, పరావృత్య = వెనుకకు తిరిగి, ముహుః ముహుః = మాటిమాటికి, దృష్ట్వా = చూచి, అథ = అటుపిమ్మట, ప్రయయౌ = వెళ్లెను.

తా. రెండవ ఒడ్డున అనాథురాలు వలె దుఃఖముతో పొరలుచున్న సీతను మాటిమాటికి వెనుకకు తిరిగి చూచుచు లక్ష్మణుడు వెళ్లెను. 24

మూ. దూరస్థం రథమాలోక్య లక్ష్మణం చ ముహుర్ముహుః,25
నిరీక్షమాణాం తూద్విగ్నాం సీతాం శోకః సమావిశత్.

ప్ర. అ. దూరస్థమ్ = దూరమునందున్న, రథమ్ = రథమును, లక్ష్మణం చ = లక్ష్మణుణ్ణి, ముహుః ముహుః = మాటిమాటికి, ఆలోక్య = చూచి, నిరీక్షమాణామ్ = ఆలోచించుచున్న, ఉద్విగ్నామ్ = దిగులుచెందిన, సీతామ్ = సీతను, శోకః = శోకము, సమావిశత్ = ఆవహించెను.

తా. దూరముగా ఉన్న రథమును, లక్ష్మణుణ్ణి మాటిమాటికీ చూచి ఆలోచించుచు దిగులుచెందిన ఆ సీతను శోకము ఆవహించెను. 25

మూ. సా దుఃఖభారావనతా యశస్వినీ
యశోధరా నాథమపశ్యతీ సతీ,
రురోద సా బర్హిణనాదితే వనే
మహాస్వనం దుఃఖపరాయణా సతీ. 26

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
అష్టాచత్వారింశః సర్గః.

ప్ర. అ. దుఃఖభారావనతా = దుఃఖభారముచేత క్రుంగిపోయినది, యశస్వినీ = కీర్తి గలది, యశోధరా = యశస్సును ధరించినది, నాథమ్ = భర్తను, అపశ్యతీ = చూడనిది, సతీ = పతివ్రతా అయిన, సా = ప్రసిద్ధురాలైన, సా = ఆ సీత, దుఃఖపరాయణా సతీ = దుఃఖమునకు లొంగిపోయినదై, బర్హిణనాదితే = నెమళ్ళచేత ధ్వనిచేయించబడిన, వనే = వనమునందు, మహాస్వనమ్ = గొప్ప ధ్వని కలుగునట్లుగా, రురోద = ఏడ్చెను.

తా. కీర్తిమంతురాలైన ఆ సీత దుఃఖభారముచేత క్రుంగిపోయెను. కీర్తిని ధరించిన ఆమెకు నాథుడు కనబడకపోవుటచే దుఃఖావిష్టురాలై, నెమళ్ళ ధ్వనులతో నిండిన ఆ వనమునందు బిగ్గరగా ఏడ్చెను. 26

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
నలభైఎనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనపఞ్చాశః సర్గః

[వాల్మీకి మునికుమారులద్వారా సీతను గూర్చి విని అక్కడికి వచ్చి, సీతను ఓదార్చి ఆమెను తన ఆశ్రమములోనికి తీసికొని వెళ్ళుట]

మూ. సీతాం చ రుదతీం దృష్ట్వా తే తత్ర మునిదారకాః,
ప్రాద్రవన్ యత్ర భగవానాస్తే వాల్మీకిరుగ్రధీః. 1

ప్ర. అ. తత్ర = అక్కడ, తే మునిదారకాః = ఆ మునికుమారులు, రుదతీమ్ = ఏడ్చుచున్న, సీతామ్ = సీతను, దృష్ట్వా = చూచి, భగవాన్ = పూజ్యుడైన, ఉగ్రధీః = గొప్ప బుద్ధి గల, వాల్మీకిః = వాల్మీకి, యత్ర = ఎక్కడ, ఆస్తే = ఉన్నాడో అక్కడికి, ప్రాద్రవన్ = పరుగెత్తి వెళ్ళిరి.

తా. మునికుమారులు, అక్కడ ఏడ్చుచున్న సీతను చూచి, పూజ్యుడు, గొప్పబుద్ధి గలవాడు అయిన వాల్మీకి దగ్గరికి పరుగెత్తి వెళ్ళిరి. 1

మూ. అభివాద్య మునేః పాదౌ మునిపుత్రా మహర్షయే,
సర్వే నివేదయామాసుస్తస్యాస్తు రుదితస్వనమ్. 2

ప్ర. అ. సర్వే = సమస్తమైన, మునిపుత్రాః = మునిపుత్రులు, మునేః = మునియొక్క, పాదౌ = పాదములను, అభివాద్య = నమస్కరించి, తస్యాః = సీతయొక్క, రుదితస్వనమ్ = ఏడ్పుయొక్క ధ్వనిని గూర్చి, మహర్షయే = ఆ మహర్షికి, నివేదయామాసుః = తెలిపిరి.

తా. ఆ మునిపుత్రు లందరూ వాల్మీకి పాదములకు నమస్కరించి ఆతనికి సీత ఏడ్పును గూర్చి తెలిపిరి. 2

మూ. అదృష్టపూర్వా భగవాన్ కస్యాప్యేషా మహాత్మనః,
పత్నీ శ్రీరివ సంమోహాద్విరౌతి భృశమాకులా. 3

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా! కస్యాపి = ఎవరో, మహాత్మనః = మహాత్మునియొక్క, పత్నీ = భార్యఅయిన, శ్రీరివ = లక్ష్మి వలె ఉన్న, అదృష్ట పూర్వా = పూర్వము చూడబడని, ఏషా = ఈమె, సంమోహాత్ = మోహము వలన, భృశమ్ = మిక్కిలి, ఆకులా = వ్యాకులురాలై, విరౌతి = ఏడ్చుచున్నది.

తా. పూజ్యుడా! ఎవరో మహానుభావుని భార్య అయిన లక్ష్మీదేవి వలె ఉన్న, పూర్వ మెన్నడూ చూడబడని ఈమె చాల వ్యాకులురాలై మోహమువలన ఏడ్చుచున్నది. 3

మూ. భగవన్ సాధు పశ్యేస్త్వం దేవతామివ ఖాచ్చ్యుతామ్,
నద్యాస్తు తీరే భగవన్ వరస్త్రీ కాపి దుఃఖితా. 4

దృష్టాస్మాభిః ప్రరుదితా దృఢం శోకపరాయణా,
అనర్హా దుఃఖశోకాభ్యామేకా దీనా అనాథవత్. 5

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా! నద్యాః = నదియొక్క, తీరే = తీరము నందు, దుఃఖితా = దుఃఖితురాలైనది, ప్రరుదతీ = ఏడ్చుచున్నది, దృఢమ్ = మిక్కిలి, శోకపరాయణా = శోకమునకు అధీనురాలైనది, దుఃఖశోకాభ్యామ్ = దుఃఖశోకములచేత, అనర్హా = తగనిది, ఏకా = ఒంటరిది, దీనా = దీనురాలు, అనాథవత్ = నాథుడు లేనివది వలె ఉన్న, కాపి = ఒకానొక, వరస్త్రీ = శ్రేష్ఠురాలైన స్త్రీ, అస్మాభిః = మాచేత, దృష్టా = చూడబడినది. భగవన్ = పూజ్యుడా! ఖాత్ = ఆకాశమునుండి, చ్యుతామ్ = జారిన, దేవతామ్ ఇవ = దేవత వలె ఉన్న ఈమెను, త్వమ్ = నీవు, సాధు = బాగుగా, పశ్యేః = చూచెదవుగాక.

తా. ఓ! పూజ్యుడా! నదీతీరమునందు మేము ఒక దుఃఖించుచున్న ఉత్తమ స్త్రీని చూచినాము. ఆమె అధికమైన దుఃఖావేశముతో బిగ్గరగా ఏడ్చుచున్నది. దుఃఖశోకములకు తగని ఆమె అనాథ వలె ఒంటరిగా దీనురాలై ఉన్నది. ఆకాశమునుండి పడిన దేవత వలె ఉన్న ఆమెను చూడుము. 4, 5

మూ. న హ్యేనాం మానుషీం విద్మః సత్క్రియాస్యాః ప్రయుజ్యతామ్,
ఆశ్రమస్యావిదూరే చ త్వామియం శరణం గతా. 6
త్రాతారమిచ్ఛతీ సాధ్వీ భగవంస్త్రాతుమర్హసి.

ప్ర. అ. ఏనామ్ = ఈమెను, మానుషీమ్ = మనుష్యస్త్రీనిగా, న విద్మః = అనుకొనము. అస్యాః = ఈమెయొక్క, సత్క్రియా = సత్కారము, ప్రయుజ్యతామ్ = చేయబడుగాక. ఇయమ్ = ఈమె, ఆశ్రమస్య = ఆశ్రమముయొక్క, అవిదూరే = సమీపమునందు, త్వామ్ = నిన్ను, శరణం గతా = శరణము పొందినది. భగవన్ = పూజ్యుడా! సాధ్వీ = ఉత్తమురాలైన ఈమె, త్రాతారమ్ = రక్షకుణ్ణి, ఇచ్ఛతీ = కోరుచున్నది. త్రాతుమ్ = రక్షించుటకు, అర్హసి = తగి ఉన్నావు.

తా. ఓ! పూజ్యుడా! ఈమె మనుష్యస్త్రీ అని అనుకొనము. ఈమెకు సత్కారము చేయుము. ఈమె ఆశ్రమసమీపమునకు వచ్చి నిన్ను శరణుజొచ్చినది. రక్షకుణ్ణి కోరుచున్నది. నీవు ఈమెను రక్షించుము. 6

మూ. తేషాం తు వచనం శ్రుత్వా బుద్ధ్యా నిశ్చిత్య ధర్మవిత్. 7
తపసా లబ్ధచక్షుష్మాన్ ప్రాద్రవద్యత్ర మైథిలీ,
తం ప్రయాన్తమభిప్రేక్ష్య శిష్యా హ్యేనం మహామతిమ్. 8

ప్ర. అ. తపసా = తపస్సుచేత, లబ్ధచక్షుష్మాన్ = పొందబడిన నేత్రములు గల, ధర్మవిత్ = ధర్మములు ఎరిగిన వాల్మీకి, తేషామ్ = వాళ్ళయొక్క, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, బుద్ధ్యా = బుద్ధిచేత, నిశ్చిత్య = నిశ్చయించి, మైథిలీ = సీత, యత్ర = ఎక్కడ ఉన్నదో అక్కడికి, ప్రాద్రవత్ = శీఘ్రముగా వెళ్ళెను. ప్రయాన్తమ్ = వెళ్ళుచున్న, తమ్ = అతనిని, అభిప్రేక్ష్య = చూచి, శిష్యాః = శిష్యులు, మహామతిమ్ = గొప్ప బుద్ధి గల, ఏనమ్ = ఈతనిని, (అనుసరించి పరుగెత్తిరి).

తా. తపస్సుచేత దివ్యదృష్టి సంపాదించిన ధర్మములు తెలిసిన ఆ వాల్మీకి వాళ్ళ మాటలు విని బుద్ధిచేత ఒక నిర్ణయము చేసికొని, సీత ఉన్నచోటికి శీఘ్రముగా వెళ్ళెను. ఆ వాల్మీకి వెంట ఆయన శిష్యులుకూడ శీఘ్రముగా వెళ్ళిరి. 7, 8

మూ. తం తు దేశమభిప్రేత్య కించిత్ పద్భ్యాం మహామతిః,
అర్ఘ్యమాదాయ రుచిరం జాహ్నవీతీరమాగమత్, 9
దదర్శ రాఘవస్యేష్టాం సీతాం పత్నీమనాథవత్.

లేనిదానవని నేను ఎరుగుదును. ఇప్పుడు నీవు నాదగ్గర ఉన్నావు. నిర్భయముగా ఉండుము. 14

మూ. ఆశ్రమస్యావిదూరే మే తాపస్యస్తపసి స్థితాః, 15
తాస్త్వాం వత్సే యథా వత్సం పాలయిష్యన్తి నిత్యశః.

ప్ర. అ. వత్సే! = ఓ వత్సా! మే = నాయొక్క, ఆశ్రమస్య=ఆశ్రమమునకు, అవిదూరే = సమీపమునందు, తాపస్యః = తాపసస్త్రీలు, తపసి = తపస్సునందు, స్థితాః = ఉన్నారు. తాః=ఆ తాపసస్త్రీలు, త్వామ్ = నిన్ను, వత్సం యథా = లేగదూడను వలె, నిత్యశః = ఎల్లప్పుడూ, పాలయిష్యన్తి = పాలించగలరు.

తా. అమ్మా! నా ఆశ్రమానికి దగ్గరనే కొందరు స్త్రీలు తపస్సు చేసికొనుచున్నారు. ఆ తాపసస్త్రీలు నిన్ను, గోవు తన లేగదూడను పాలించి నట్లు, నిత్యమూ పాలించగలరు. 15

మూ. ఇదమర్ఘ్యం ప్రతీచ్ఛ త్వం విస్రబ్ధా విగతజ్వరా, 16
యథా స్వగృహమభ్యేత్య విషాదం చైవ మా కృథాః.

ప్ర. అ. త్వమ్ = నీవు, ఇదమ్ = ఈ, అర్ఘ్యమ్=అర్ఘ్యమును, ప్రతీచ్ఛ= స్వీకరించుము. విస్రబ్ధా = నమ్మకము గలదానవై, విగతజ్వరా = పోయిన మనస్తాపము కలదానవై, స్వగృహం యథా = స్వగృహమును వలె, అభ్యేత్య = పొంది, విషాదమ్ = దుఃఖమును, మా చ ఏవ కృథాః = చేయకుము.

తా: ఈ అర్ఘ్యమును స్వీకరించుము. మనోవ్యథను విడచి, పూర్తి నమ్మకముతో నీ స్వగృహమునకు వచ్చినట్లు వచ్చి ఉండుము. దుఃఖించకుము. 16

మూ. శ్రుత్వా తు భాషితం సీతా మునేః పరమమద్భుతమ్, 17
శిరసా వన్ద్య చరణౌ తథేత్యాహ కృతాఞ్జలిః.

ప్ర. అ. సీతా = సీత, మునేః = మునియొక్క, పరమమ్ = మిక్కిలి, అద్భుతమ్ = ఆశ్చర్యకరమైన, భాషితమ్ = మాటను, శ్రుత్వా = విని, శిరసా= శిరస్సుచేత, చరణౌ = పాదాలను, వన్ద్య = నమస్కరించి, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి కలదై, తథేతి = అట్లే అని, ఆహ = పలికెను.

తా. సీత చాల ఆశ్చర్యకరములైన ఆ వాల్మీకి మాటలు విని, శిరస్సుచేత ఆతని పాదాలకు నమస్కరించి, దోసిలి కట్టి "అట్లే చేసెదను" అని పలికెను.

మూ. తం ప్రయాన్తం మునిం సీతా ప్రాఞ్జలిః పృష్ఠతోఽన్వగాత్,
తం దృష్ట్వా మునిమాయాన్తం వై దేహ్యా మునిపత్నయః,
ఉపాజగ్ముర్ముదా యుక్తా వచనం చేదమబ్రువన్. 19

ప్ర. అ. ప్రయాన్తమ్ = నడచుచున్న, తం మునిమ్=ఆ మునిని, సీతా= సీత, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలదై, పృష్ఠతః = వెనుకనే, అన్వగాత్ = అనుసరించి వెళ్లెను. వైదేహ్యా = సీతతో కూడ, ఆయాన్తమ్ = వచ్చుచున్న, తం మునిమ్ = ఆ మునిని, దృష్ట్వా=చూచి, మునిపత్నయః = మునుల భార్యలు, ముదా=సంతోషముతో, యుక్తాః = కూడినవారై, ఉపాజగ్ముః = సమీపించిరి. ఇదమ్ = ఈ, వచనం చ = వచనమును కూడ, అబ్రువన్ = పలికిరి.

తా. ముందు నడచుచున్న ఆ ముని వెనుకనే సీత అంజలి ఘటించి నడచి వెళ్ళెను. సీతను తీసికొని వచ్చుచున్న ఆ వాల్మీకిని మునిపత్నులు చూచి, సంతోషముతో ఆయన దగ్గరకు వచ్చి ఇట్లు పలికిరి. 18, 19

మూ. స్వాగతం తే మునిశ్రేష్ఠ చిరస్యాగమనం చ తే,
అభివాదయామస్త్వాం సర్వా ఉచ్యతాం కిం చ కుర్మహే.

ప్ర. అ. మునిశ్రేష్ఠ = మునిశ్రేష్ఠా ! తే = నీకు, స్వాగతమ్=స్వాగతము. తే = నీయొక్క, ఆగమనమ్ = ఆగమనము, చిరస్య = చిరకాలమునకు జరిగినది. సర్వాః = మేమందరమూ, త్వామ్ = నిన్ను, అభివాదయామః = నమస్కరించుచున్నాము. కిం కుర్మహే=ఏమి చేయుదుము ? ఉచ్యతామ్=చెప్పబడుగాక.

తా. మునిశ్రేష్ఠా ! నీకు స్వాగతము. నీవు చాలకాలము తరువాత వచ్చినావు. నీకు అభివాదనము చేయుచున్నాము. ఏమి చేయవలెనో చెప్పుము. 20

మూ. తాసాం తద్వచనం శ్రుత్వా వాల్మీకిరిదమబ్రవీత్,
సీతేయం సమనుప్రాప్తా పత్నీ రామస్య ధీమతః. 21

ప్ర. అ. తాసామ్=ఆ స్త్రీలయొక్క, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా=విని, వాల్మీకిః = వాల్మీకి, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రవీత్=పలికెను,

ధీమతః = బుద్ధిమంతుడైన, రామస్య = రామునియొక్క, పత్నీ = భార్య అయిన. ఇయమ్ = ఈ, సీతా = సీత, సమనుప్రాప్తా = వచ్చినది.

తా. ఆ స్త్రీల మాటలు విని వాల్మీకి ఇట్లు పలికెను-"బుద్ధిమంతుడైన రాముని భార్యయైన సీత ఇక్కడికి వచ్చినది". 21

మూ. స్నుషా దశరథస్యైషా జనకస్య సుతా సతీ.
అపాపా పతినా త్యక్తా పరిపాల్యా మయా సదా. 22

ప్ర. అ. దశరథస్య=దశరథునియొక్క, స్నుషా = కోడలు, జనకస్య= జనకునియొక్క, సుతా = కూతురు, సతీ = పతివ్రత, అపాపా = పాపము లేనిదీ అయిన, ఏషా = ఈమె, పతినా = భర్తచేత, త్యక్తా = విడువబడినది. మయా = నాచేత, సదా = ఎల్లప్పుడూ, పరిపాల్యా = పాలింపదగినది.

తా. ఈమె దశరథుని కోడలు; జనకుని కూతురు; పతివ్రత. ఏ పాపమూ లేని ఈమెను భర్త పరిత్యజించినాడు. అందుచే నేను ఈమెను నిత్యము పాలించవలెను. 22

మూ. ఇమాం భవత్యః పశ్యన్తు స్నేహేన పరమేణ హి,
గౌరవాన్మమ వాక్యాచ్చ పూజ్యా వోఽస్తు విశేషతః. 23

ప్ర. అ. భవత్యః = మీరు, ఇమామ్ = ఈమెను, పరమేణ = గొప్ప, స్నేహేన= స్నేహముతో, పశ్యన్తు=చూచెదరుగాక. గౌరవాత్ =గౌరవమువలన, మమ = నాయొక్క, వాక్యాచ్చ = వాక్యమువలన, విశేషతః = విశేషముగ, వః= మీకు, పూజ్యా = పూజించదగినది, అస్తు = అగుగాక.

తా. మీరు ఈమెను గొప్ప స్నేహముతో చూచెదరుగాక. ఈమె కుటుంబమునందు గౌరవభావమువలన నా మాటవలన మీరు ఈమెను విశేషించి పూజింతురుగాక. 23

మూ. ముహుర్ముహుశ్చ వైదేహీం పరిదాయ మహాయశాః,
స్వమాశ్రమం శిష్యవృతః పునరాయాన్మహాతపాః. 24

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకోనపఞ్చాశః సర్గః.

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గల. మహాతపాః = గొప్ప తపస్సు గల ఆ వాల్మీకి. వైదేహీమ్ = సీతను, ముహుః ముహుః చ = మాటిమాటికి, పరిదాయ = అప్పచెప్పి, శిష్యవృతః = శిష్యులతో కూడినవాడై, స్వమ్ = తన సంబంధమైన, ఆశ్రమమ్ = ఆశ్రమమును గూర్చి, పునః = మరల, ఆయాత్ = వచ్చెను.

తా. గొప్ప కీర్తి, తపస్సు గల ఆ వాల్మీకి సీతను మాటిమాటికి వారికి, అప్పగించి, శిష్యులతో కలిసి తన ఆశ్రమమునకు తిరిగి వచ్చెను. 24

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో నలభైతొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ పఞ్చాశః సర్గః

[లక్ష్మణసుమంత్రుల సంభాషణము]

మూ. దృష్ట్వా తు మైథిలీం సీతామాశ్రమే సంప్రవేశితామ్,
సంతాపమగమద్ఘోరం లక్ష్మణో దీనచేతనః. 1

ప్ర. అ. మైథిలీమ్ = మిథిలారాజకుమారియైన, సీతామ్ = సీతను, ఆశ్రమే = ఆశ్రమమునందు, సంప్రవేశితామ్ = ప్రవేశ పెట్టబడిన దానినిగా, దృష్ట్వా = చూచి, లక్ష్మణః = లక్ష్మణుడు, దీనచేతనః = దీనమైన బుద్ధి గలవాడై, ఘోరమ్ = భయంకరమైన, సంతాపమ్ = సంతాపమును, ఆగమత్ = పొందెను.

తా. సీత ఆశ్రమములో ప్రవేశించుట చూచి లక్ష్మణుడు మనస్సులో గొప్ప దైన్యము చెంది చాల సంతాపమును పొందెను. 1

మూ. అబ్రవీచ్చ మహాతేజాః సుమన్త్రం మన్త్రిసారథిమ్,
సీతాసంతాపజం దుఃఖం పశ్య రామస్య సారథే. 2

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల లక్ష్మణుడు, మన్త్రిసారథిమ్ = ఆలోచనలలో సారథి అయిన, సుమన్త్రమ్ = సుమంత్రుణ్ణి గూర్చి, అబ్రవీత్ చ = పలికెను. సారథే = సారథీ, రామస్య = రామునియొక్క, సీతాసంతాపజమ్ = సీతావియోగసంతాపమువలన కలిగిన, దుఃఖమ్ = దుఃఖమును, పశ్య = చూడుము.

తా. గొప్ప తేజస్సు గల ఆ లక్ష్మణుడు ఆలోచనలో సారథి అయిన సుమంత్రునితో ఇట్లనెను-"సారథీ! రామునకు సీతావియోగమువలన ఎంతటి దుఃఖము కలిగినదో చూడుము". 2

మూ. తతో దుఃఖతరం కిం ను రాఘవస్య భవిష్యతి,
పత్నీం శుద్ధసమాచారాం విసృజ్య జనకాత్మజామ్. 3

ప్ర. అ. శుద్ధసమాచారామ్=పరిశుద్ధమైన ఆచారముగల, పత్నీమ్=భార్య అయిన, జనకాత్మజామ్ = సీతను, విసృజ్య = విడచి, రాఘవస్య = రామునకు, తతః=దానికంటె, దుఃఖతరమ్ = ఎక్కువ దుఃఖము కలిగించేది, కిం ను=ఏది, భవిష్యతి = కాగలదు.

తా. పరిశుద్ధమైన చరిత్ర గల భార్యయైన సీతను విడచిన రామునకు ఇంతకంటె అధికమైన దుఃఖము మరొకటి ఏదైన ఉందునా? 3

మూ. వ్యక్తం దైవాదహం మన్యే రాఘవస్య వినాభవమ్,
వైదేహ్యా సారథే నిత్యం దైవం హి దురతిక్రమమ్. 4

ప్ర అ. సారథే = సారథీ, రాఘవస్య = రామునియొక్క, వైదేహ్యా = సీతతో, వినాభవమ్ = వియోగమును, అహమ్ = నేను, వ్యక్తమ్ = స్పష్టముగా, దైవాత్ = దైవమువలన కలిగినదానినిగా, మన్యే = తలచుచున్నాను. నిత్యమ్ = నిత్యమూ, దైవమ్ = దైవము, దురతిక్రమం హి = దాట శక్యము కానిది కదా?

తా. సారథీ! రామునకు ఈ సీతావియోగము తప్పక దైవమువలననే కలిగిన దని తలచెదను. దైవము ఏనాటికైనా దాట శక్యము కాదు కదా? 4

మూ. యో హి దేవాన్ సగన్ధర్వానసురాన్ సహరాక్షసైః,
నిహన్యాద్రాఘవః క్రుద్ధః స దైవమనువర్తతే. 5

ప్ర. అ. యః రాఘవః = ఏ రాముడు, క్రుద్ధః = కోపించినవాడై, సగన్ధర్వాన్ = గంధర్వులతో కూడిన, దేవాన్ = దేవతలను, సహరాక్షసైః = రాక్షసులతో కూడిన, అసురాన్ = అసురులను, నిహన్యాత్ = చంపునో, సః = అట్టి రాముడు, దైవమ్ = దైవమును, అనువర్తతే = అనుసరించుచున్నాడు.

తా. ఏ రాముడు కోపము వచ్చినచో గంధర్వులను, దేవతలను, అసురులను, రాక్షసులను సంహరించగలడో అట్టి రాముడు దైవమునకు కట్టుబడి ఉన్నాడు! 5

మూ. పురా రామః పితుర్వాక్యాద్దణ్డకే విజనే వనే,
ఉషితో నవ వర్షాణి పఞ్చ చైవ మహావనే. 6

ప్ర. అ. పురా = పూర్వము, రామః = రాముడు, పితుః = తండ్రియొక్క, వాక్యాత్ = వాక్యమువలన, విజనే వనే = జనశూన్యవనమైన, దణ్డకే = దండక మను, మహావనే = మహావనమునందు, నవ పఞ్చ చ = పద్నాలుగు, వర్షాణి = సంవత్సరములను, ఉషితః = నివసించినాడు.

తా. పూర్వము రాముడు తండ్రి మాటవలన విజనమైన దండకవనము నందు పదునాలుగు సంవత్సరములు నివసించినాడు. 6

మూ. తతో దుఃఖతరం భూయః సీతాయా విప్రవాసనమ్,
పౌరాణాం వచనం శ్రుత్వా నృశంసం ప్రతిభాతి మే. 7

ప్ర. అ. పౌరాణామ్ = పౌరులయొక్క, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, భూయః = మరల, సీతాప్రవాసనమ్ = సీతను ప్రవాసము చేయించుట, తతః = దానికంటె, దుఃఖతరమ్ = చాల దుఃఖకరముగాను, నృశంసమ్ = క్రూరముగాను, మే = నాకు, ప్రతిభాతి = తోచుచున్నది.

తా. పౌరుల మాటలు విని సీతను దూరము పంపివేయుట దానికంటె ఎక్కువ దుఃఖకరము, క్రూరమూ అని నాకు తోచుచున్నది. 7

మూ. కో ను ధర్మాశ్రయః సూత కర్మణ్యస్మిన్ యశోహరే,
మైథిలీం సమనుప్రాప్తః పౌరైర్హీనార్థవాదిభిః. 8

ప్ర. అ. సూత = సారథీ! మైథిలీమ్ = సీతను గూర్చి, హీనార్థవాదిభిః = చెడ్డ విషయము పలికిన, పౌరైః = పౌరులచేత, యశోహరే = యశస్సును హరించు, అస్మిన్ కర్మణి = ఈ కర్మయందు, కః ను = ఏమి, ధర్మాశ్రయః = ధర్మము యొక్క ఆశ్రయము, సమనుప్రాప్తః = పొందబడినది. 8

తా. సారథీ! సీత విషయములో చెడ్డ మాటలు పలికిన పౌరులకు కీర్తిని హరించు ఈ కర్మవలన ఏమి ధర్మము లభించినది?

మూ. ఏతా వాచో బహువిధాః శ్రుత్వా లక్ష్మణభాషితాః,
సుమన్త్రః శ్రద్దయా ప్రాజ్ఞో వాక్యమేతదువాచ హ. 9

ప్ర. అ. లక్ష్మణభాషితాః = లక్ష్మణునిచేత పలకబడిన, బహువిధాః =

అనేకవిధములైన, ఏతాః = ఈ, వాచః = వాక్కులను, శ్రుత్వా = విని, ప్రాజ్ఞః = బుద్ధిమంతుడైన, సుమన్త్రిః = సుమంత్రుడు, శ్రద్ధయా = శ్రద్ధతో, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. లక్ష్మణుడు పలికిన అనేకవిధములైన ఈ మాటలు విని బుద్ధిమంతుడైన సుమంత్రుడు శ్రద్ధతో ఇట్లు పలికెను. 9

మూ. న సంతాపస్త్వయా కార్యః సౌమిత్రే మైథిలీం ప్రతి,
దృష్టమేతత్పురా విప్రైః పితుస్తే లక్ష్మణాగ్రతః. 10

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా ! మైథిలీం ప్రతి = సీతను గూర్చి, త్వయా = నీచేత, సంతాపః = దుఃఖము, న కార్యః = చేయదగినదికాదు. లక్ష్మణ = లక్ష్మణా ! పురా = పూర్వము, తే పితుః = నీ తండ్రియొక్క, అగ్రతః = ఎదుట, విప్రైః = బ్రాహ్మణులచేత, ఏతత్ = ఇది, దృష్టమ్ = చూడబడినది.

తా. లక్ష్మణా ! సీత విషయమున నీవు దుఃఖించకుము. పూర్వము నీ తండ్రి సమక్షమున బ్రాహ్మణులు ఈ విషయమును గూర్చి ముచ్చటించి ఉన్నారు.

మూ. భవిష్యతి దృఢం రామో దుఃఖప్రాయోఽప్యసౌఖ్యభాక్,
ప్రాప్స్యతే చ మహాబాహుర్విప్రయోగం ప్రియైర్ధ్రువమ్.

ప్ర. అ. రామః = రాముడు, దృఢమ్ = తప్పక, దుఃఖప్రాయః = ఎక్కువ దుఃఖము గలవాడు, అసౌఖ్యభాక్ అపి = అసౌఖ్యమును పొందేవాడూ, భవిష్యతి = కాగలడు. మహాబాహుః = గొప్ప బాహువులు గల రాముడు, ధ్రువమ్ = తప్పక, ప్రియైః = ఇష్టులతో, విప్రయోగమ్ = వియోగమును, ప్రాప్స్యతే చ = పొందగలడు కూడ.

తా. రాముడు తప్పక ఎక్కువ దుఃఖములు కలవాడు, కష్టములు అనుభవించేవాడు అగును. మహాబాహువైన ఇతడు తప్పక ఇష్టజనుల వియోగమును పొందును. 11

మూ. త్వాం చైవ మైథిలీం చైవ శత్రుఘ్నభరతౌ తథా,
స త్యజిష్యతి ధర్మాత్మా కాలేన మహతా మహాన్. 12

ప్ర. అ. మహాన్ = గొప్పవాడు, ధర్మాత్మా = ధర్మాత్ముడూ అయిన, సః = ఆ రాముడు, మహతా = గొప్ప, కాలేన = కాలముచేత, త్వాం చైవ = నిన్ను, మైథిలీం చైవ = సీతను, తథా = మరియు, శత్రుఘ్నభరతౌ = శత్రుఘ్నభరతులను, త్యజిష్యతి = త్యజించగలడు.

తా. మహాత్ముడు, ధర్మాత్ముడూ అయిన రాముడు చాల కాలము తరువాత నిన్ను, సీతను, భరతశత్రుఘ్నులను కూడ విడచివేయు నని వారు చెప్పిరి. 12

మూ. ఇదం త్వయి న వక్తవ్యం సౌమిత్రే భరతేఽపి వా,
రాజ్ఞో వో వ్యాహృతే వాక్యే దుర్వాసా యదువాచ హ. 13

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా! వః = మీయొక్క, రాజ్ఞే = రాజునకు, వ్యాహృతే = పలకబడిన, వాక్యే = వాక్యమునందు, దుర్వాసాః = దుర్వాసుడు, యత్ = దేనిని, ఉవాచ హ = పలికెనో, ఇదమ్ = ఇది, త్వయి = నీయందు గాని, భరతేఽపి వా = భరతునియందు గాని, న వక్తవ్యమ్ = చెప్పదగినది కాదు.

తా. లక్ష్మణా! మీ రాజైన (తండ్రియైన) దశరథమహారాజుతో దుర్వాసుడు పలికిన మాటలలో చెప్పిన విషయము నీకు గాని. భరతునకు గాని చెప్పదగినది కాదు. 13

మూ. మహాజనసమీపే చ మమ చైవ నరర్షభ,
ఋషిణా వ్యాహృతం వాక్యం వసిష్ఠస్య చ సంనిధౌ. 14

ప్ర. అ. నరర్షభ = నరులలో శ్రేష్ఠుడా! ఋషిణా = దుర్వాసర్షిచేత, వాక్యమ్ = వాక్యము, మహాజనసమీపే చ = గొప్పవాడైన దశరథుని సమీపమునందు, మమ చైవ = నా సమీపమునందు, వసిష్ఠస్య చ = వసిష్ఠునియొక్క, సంనిధౌ = సంనిధియందు, వ్యాహృతమ్ = పలకబడినది.

తా. నరులలో శ్రేష్ఠుడవైన లక్ష్మణా! దుర్వాసుడు నేను, దశరథమహారాజు, వసిష్ఠుడు ఉండగా మా ఎదుట చెప్పినాడు. 14

మూ. ఋషేస్తు వచనం శ్రుత్వా మామాహ పురుషర్షభః,
సూత న క్వచిదేవం తే వక్తవ్యం జనసంనిధౌ. 15

ప్ర. అ. ఋషేః = ఆ ఋషియొక్క, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, పురుషర్షభః = పురుషశ్రేష్ఠుడైన దశరథుడు, మామ్ = నన్ను గూర్చి, ఆహ = పలికినాడు. సూత = సారథీ ! ఏవమ్ = ఈ విధముగా, తే = నీకు (నీచేత), క్వచిత్ = ఎక్కడనూ, జనసంనిధౌ = జనుల సంనిధియందు, న వక్తవ్యమ్ = చెప్పదగినది కాదు.

తా. దుర్వాసర్షి మాటలు విని దశరథుడు నాతో- "సుమంత్రా ! ఈ విషయమును ఎక్కడా కూడ జనుల సముదాయములో చెప్పకూడదు" అని పలికినాడు. 15

మూ. తస్యాహం లోకపాలస్య వాక్యం తత్సుమాహితః,
నైవ జాత్వనృతం కుర్యామితి మే సౌమ్య దర్శనమ్. 16

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! అహమ్ = నేను, సుసమాహితః = మిక్కిలి సావధానచిత్తుడనై, తస్య = ఆ, లోకపాలస్య = రాజుయొక్క, తత్ వాక్యమ్ = ఆ వాక్యమును, జాతు = ఎన్నడూ కూడ, అనృతమ్ = అసత్యమునుగా, నైవ కుర్యామ్ = చెయ్యను, ఇతి = అని, మే = నాయొక్క, దర్శనమ్ = ఆలోచన.

తా. ఓ ! సౌమ్యుడా ! నేను చాల జాగరూకత వహించి దశరథమహారాజు చెప్పిన మాటను ఎన్నడూ అసత్యము చేయకూడ దని నా అభిప్రాయము.

మూ. సర్వథైవ న వక్తవ్యం మయా సౌమ్య తవాగ్రతః,
యది తే శ్రవణే శ్రద్ధా శ్రూయతాం రఘునన్దన. 17

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! రఘునన్దన = లక్ష్మణా ! మయా = నాచేత, తవ = నీయొక్క, అగ్రతః = ఎదట, సర్వథైవ = అన్ని విధములా, న వక్తవ్యమ్ = చెప్పదగినది కాదు. తే = నీకు, శ్రవణే = వినుటయందు, శ్రద్ధా యది = శ్రద్ధ ఉన్నట్లయితే, శ్రూయతామ్ = వినబడుగాక.

తా. సౌమ్యుడవైన లక్ష్మణా ! నేను నీ ఎదుట ఈ విషయమును చెప్పనే కూడదు. కాని నీకు వినవలెనను శ్రద్ధ ఉన్నచో వినుము. 17

మూ. యద్యప్యహం నరేన్ద్రేణ రహస్యం శ్రావితః పురా,
తథాప్యుదాహరిష్యామి దైవం హి దురతిక్రమమ్. 18

యేనేదమీదృశం ప్రాప్తం దుఃఖం శోకసమన్వితమ్,
న త్వయా భరతే వాచ్యం శత్రుఘ్నస్యాపి సంనిధౌ. 19

ప్ర. అ. పురా=పూర్వము, నరేన్ద్రేణ = రాజుచేత, అహమ్ = నేను, రహస్యమ్ = రహస్యము అని, శ్రావితః యద్యపి = చెప్పబడినను, తథాపి = అట్టయినను, ఉదాహరిష్యామి = చెప్పెదను. దైవమ్ = దైవము, దురతిక్రమం హి = దాట శక్యము కానిది కదా ? యేన = దేనిచేత, ఈదృశమ్ = ఇట్టి, శోక సమన్వితమ్ = శోకముతో కూడిన, దుఃఖమ్ = దుఃఖము, ప్రాప్తమ్ = వచ్చినదో, త్వయా = నీచేత, భరతే=భరతునియందు, శత్రుఘ్నస్య=శత్రుఘ్నునియొక్క, సంనిధౌ చ = సంనిధియందు, న వాచ్యమ్ = చెప్పదగినది కాదు.

తా. పూర్వము దశరథుడు ఈ విషయము రహస్యము అని చెప్పి ఉన్నా కూడ నేను నీకు చెప్పెదను. ఏ దైవముచేత ఇట్టి శోకముతో కూడిన దుఃఖము కలిగినదో ఆ దైవము దాట శక్యము కాదు కదా ? నీవు భరతునకు గాని శత్రుఘ్నునకు గాని చెప్పకూడదు. (శోకము అనగా తలచి తలచి ఏడవడం. దుఃఖం అనగా అనుభవిస్తూన్న కష్టం. సాధారణంగా ఈ పదాలను పర్యాయపదాలుగానే వాడినా ఒకే చోట రెండు పదాలూ ప్రయోగించినప్పుడు ఈ భేదం గుర్తించాలి).

మూ. తచ్ఛ్రుత్వా భాషితం తస్య గమ్భీరార్థపదం మహత్,
తథ్యం బ్రూహీతి సౌమిత్రిః సూతం తం వాక్యమబ్రవీత్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
పఞ్చాశః సర్గః.

ప్ర. అ. తస్య = సుమంత్రునియొక్క, గమ్భీరార్థపదమ్ = గంభీరమైన అర్థము పదములూ గల, తత్ = ఆ, మహత్ = గొప్ప, భాషితమ్ = మాటను, శ్రుత్వా = విని, సౌమిత్రిః = లక్ష్మణుడు, తథ్యమ్ = సత్యమును, బ్రూహి =

చెప్పుము, ఇతి = అని, తం సూతమ్ = ఆ సారథిని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

శ్రా. లక్ష్మణుడు గంభీరమైన అర్థము పదములూ గల సుమంత్రుని ఈ గొప్ప మాటలు విని "సత్యము చెప్పుము" అని ఆతనితో పలికెను.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో ఏబదవ సర్గ సమాప్తము.

అథ ఏకపఞ్చాశః సర్గః

[సుమంత్రుడు తాను దుర్వాసుని ద్వారా విన్న భృగుశాప వృత్తాంతమును, కొంచెము రాబోవు కథను లక్ష్మణునికి చెప్పి ఆతనిని ఓదార్చుట.]

మూ. తథా సంచోదితః సూతో లక్ష్మణేన మహాత్మనా,
తద్వాక్యమృషిణా ప్రోక్తం వ్యాహర్తుముపచక్రమే. 1

ప్ర. అ. మహాత్మనా = మహాత్ముడైన, లక్ష్మణేన = లక్ష్మణునిచేత, తథా = అట్లు, సంచోదితః = ప్రేరేపించబడిన, సూతః = సారథి, ఋషిణా = దుర్వాసునిచేత, ప్రోక్తమ్ = పలకబడిన, తత్ వాక్యమ్ = ఆ వాక్యమును, వ్యాహర్తుమ్ = చెప్పుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. మహాత్ముడైన లక్ష్మణుడు అట్లు ప్రేరేపించగా సుమంత్రుడు దుర్వాసుడు చెప్పిన మాటలు చెప్పుటకు ఉపక్రమించెను. 1

మూ. పురా నామ్నా హి దుర్వాసా అత్రేః పుత్రో మహామునిః,
వసిష్ఠస్యాశ్రమే పుణ్యే వార్షిక్యం సమువాస హ. 2

ప్ర. అ. పురా = పూర్వము, నామ్నా = పేరుచేత, దుర్వాసాః = దుర్వాసుడైన, అత్రేః = అత్రియొక్క, పుత్రః = పుత్రుడైన, మహామునిః = మహాముని, పుణ్యే = పవిత్రమైన, వసిష్ఠస్య ఆశ్రమే = వసిష్ఠుని ఆశ్రమమునందు, వార్షిక్యమ్ = వర్షకాలసంబంధమైన చాతుర్మాస్యమును, ఉవాస హ = నివసించెను.

తా. పూర్వము అత్రి పుత్రుడైన దుర్వాసమహాముని పవిత్రమైన వసిష్ఠాశ్రమముసందు చాతుర్మాస్యమునకై నివసించెను. 2

మూ. తమాశ్రమం మహాతేజాః పితా తే సుమహాయశాః,
పురోహితం మహాత్మానం దిదృక్షురగమత్స్వయమ్. 3

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, సుమహాయశాః = చాల గొప్ప కీర్తి గల, తే పితా = నీ తండ్రి, మహాత్మానమ్ = మహాత్ముడైన, పురోహితమ్ = పురోహితుణ్ణి, దిదృక్షుః = చూడ దలచినవాడై, స్వయమ్ = స్వయముగా, తమ్ ఆశ్రమమ్ = ఆ ఆశ్రమమును గూర్చి, అగమత్ = వెళ్ళెను.

తా. గొప్ప తేజస్సూ, యశస్సూ గల నీ తండ్రి పురోహితుడైన వసిష్ఠుని చూచుటకై స్వయముగా ఆ ఆశ్రమమునకు వెళ్ళెను. 3

మూ. స దృష్ట్వా సూర్యసంకాశం జ్వలన్తమివ తేజసా,
ఉపవిష్టం వసిష్ఠస్య సవ్యపార్శ్వే మహాముని మ్, 4
తౌ మునీ తాపసశ్రేష్ఠౌ వినీతో హ్యభ్యవాదయత్.

ప్ర. అ. సః = అతడు, సూర్యసంకాశమ్ = సూర్యునితో సమానుడు, తేజసా = తేజస్సుతో, జ్వలన్తమివ = మండుచున్నట్లున్నవాడూ, వసిష్ఠస్య = వసిష్ఠునియొక్క, సవ్యపార్శ్వే = కుడి ప్రక్కన, ఉపవిష్టమ్ = కూర్చొని ఉన్న వాడూ అయిన, మహాముని మ్ = ఆ మహాముని ని, దృష్ట్వా = చూచి, తాపసశ్రేష్ఠౌ = తాపసులలో శ్రేష్ఠులైన, తౌ మునీ = ఆ మును లిద్దరినీ, వినీతః = వినయ వంతుడై, అభ్యవాదయత్ = నమస్కరించెను.

తా. సూర్యునితో సమానుడైన దూర్వాసుడు తేజస్సుతో మండుచున్న ట్లుండెను. ఆ మహాముని వసిష్ఠుని కుడి ప్రక్కన కూర్చొని ఉండెను. దశరథుడు ఆ ముని ని చూచి, మునులలో శ్రేష్ఠులైన వారిద్దరికీ, సవినయముగా నమస్కరించెను.

మూ. స తాభ్యాం పూజితో రాజా స్వాగతేనాసనేన చ, 5
పాద్యేన ఫలమూలైశ్చ ఉవాస మునిభిః సహ.

ప్ర. అ. సః రాజా = ఆ రాజు, తాభ్యామ్ = వారిద్దరిచేత, స్వాగతేన = స్వాగతముచేత, ఆసనేన చ = ఆసనముచేత, పాద్యేన = పాద్యముచేత, ఫలమూలైశ్చ = ఫలమూలములచేత, పూజితః = పూజింపబడినవాడై, మునిభిః సహ = మునులతో కూడ. ఉవాస = నివసించెను.

తా. ఆ మునులిద్దరూ దశరథమహారాజును స్వాగతము, ఆసనము,

పాద్యము, కందమూలములు ఇచ్చి ఆదరించిరి. అతడు మునులతో కలిసి కొంత సేపు అక్కడ ఉండెను. 5

మూ. తేషాం తత్రోపవిష్టానాం తాస్తాః సుమధురాః కథాః, 6
బభూవుః పరమర్షీణాం మధ్యాదిత్యగతేఽహని.

ప్ర. అ. ("తదా మధ్యగతేఽహని"అను ప్రాచ్యపాఠము బాగున్నది.) తత్ర =అక్కడ, ఉపవిష్టానామ్ = కూర్చొని ఉన్న, తేషామ్ = ఆ, పరమర్షీణామ్ = మహర్షులకు, తదా = అప్పుడు, అహని = పగటిభాగము, మధ్యగతే = మధ్యను పొందిన దగుచుండగా, సుమధురాః = చాల మధురములైన, తాః తాః = ఆ యా, కథాః = కథలు, బభూవుః = అయినవి.

తా. అక్కడ కూర్చొని ఉన్న ఆ మహర్షులు మధ్యాహ్నసమయమునందు చాల మధురములైన ఆ యా కథలు (మాటలు) చెప్పుకొనిరి. 6

మూ. తతః కథాయాం కస్యాంచిత్ప్రాఞ్జలిః ప్రగ్రహో నృపః, 7
ఉవాచ తం మహాత్మానమత్రేః పుత్రం తపోధనమ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, కస్యాం చిత్ = ఒకానొక, కథాయామ్ = కథయందు (ప్రసంగమునందు), ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలిగల, ప్రగ్రహః= నిగ్రహవంతుడైన, నృపః = రాజు, మహాత్మానమ్=మహాత్ముడైన, అత్రేఃపుత్రమ్ =అత్రి కుమారుడైన, తం తపోధనమ్ = ఆ మునిని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. పిమ్మట ఒక ప్రసంగములో వినయవంతుడైన రాజు అంజలి ఘటించి అత్రిపుత్రుడైన మహాత్ముడైన ఆ దూర్వాసునితో ఇట్లనెను. 7

మూ. భగవన్ కింప్రమాణేన మమ వంశో భవిష్యతి, 8
కిమాయుశ్చ హి మే రామః పుత్రాశ్చాన్యే కిమాయుషః.

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా ! మమ = నాయొక్క, వంశః = వంశము, కింప్రమాణేన = ఎంత ప్రమాణముచేత, భవిష్యతి = ఉండగలదు ? మే రామః= నా రాముడు, కిమాయుః చ = ఎంత ఆయుర్దాయము కలవాడు ? అన్యే పుత్రాః చ =ఇతరపుత్రులు కూడ, కిమాయుషః = ఎంత ఆయుర్దాయము కలవారు ?

తా. పూజ్యుడా ! నా వంశము ఎంతకాలము ఉండును ? నా రాముని ఆయుర్దాయ మెంత? నా ఇతరపుత్రుల ఆయుర్దాయ మెంత ? 8

మూ. రామస్య చ సుతా యే స్యుస్తేషామాయుః కియద్భవేత్,9
కామ్యయా భగవన్ బ్రూహి వంశస్యాస్య గతిం మమ.

ప్ర. అ. రామస్య = రామునియొక్క, యే = ఏ, సుతాః = పుత్రులు, స్యుః = ఉందురో, తేషామ్ = వాళ్ళయొక్క, ఆయుః = ఆయుర్దాయము, కియత్ = ఎంత, భవేత్ = ఉండును ? భగవన్ = పూజ్యుడా ! మమ = నాయొక్క, అస్య = ఈ, వంశస్య = వంశముయొక్క, గతిమ్ = గతిని గూర్చి, కామ్యయా = ఇచ్ఛచేత, బ్రూహి = చెప్పుము.

తా. పూజ్యుడా ! రామునకు పుట్టబోవు పుత్రుల ఆయుర్దాయము ఎంత ఉండును ? నా వంశము గతిని గూర్చి ఇచ్ఛానుసారము (నీకు చెప్పవలె నని ఉన్నచో) చెప్పుము. 9

మూ. తచ్ఛ్రుత్వా వ్యాహృతం వాక్యం రాజ్ఞో దశరథస్య తు,
దుర్వాసాః సుమహాతేజా వ్యాహర్తుముపచక్రమే.

ప్ర. అ. రాజ్ఞః = రాజైన, దశరథస్య = దశరథునియొక్క, తత్ = ఆ, వ్యాహృతమ్ = పలకబడిన, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, సుమహాతేజాః = చాల గొప్ప తేజస్సు గల, దుర్వాసాః = దుర్వాసుడు, వ్యాహర్తుమ్ = చెప్పుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. దశరథమహారాజు పలికిన మాటలు విని గొప్ప తేజస్సు గల దుర్వాసుడు చెప్పుటకు ఉపక్రమించెను. 10

మూ. శృణు రాజన్ పురావృత్తం తదా దేవాసురే యుధి, 11
దైత్యాః సురైర్భర్త్స్యమానా భృగుపత్నీం సమాశ్రితాః.
తయా దత్తాభయాస్తత్ర న్యవసన్నభయాస్తదా. 12

ప్ర. అ. రాజన్ = రాజా ! పురా = పూర్వము. వృత్తమ్ = జరిగినదానిని, శృణు = వినుము. తదా = అప్పుడు, దేవాసురే యుధి = దేవాసురయుద్ధమునందు,

సురైః=దేవతలచేత, భర్త్స్యమానాః = భయ పెట్టబడుచున్న, దైత్యాః=దైత్యులు, భృగుపత్నీమ్=భృగుమహర్షి భార్యను, సమాశ్రితాః = ఆశ్రయించినారు. తయా= ఆమెచేత, దత్తాభయాః = ఇవ్వబడిన అభయము కలవారై, తదా = అప్పుడు, అభయాః = భయములేనివారై, తత్ర = అక్కడ, న్యవసన్ = నివసించిరి.

తా. రాజా! పూర్వము జరిగిన కథను వినుము. దేవాసురయుద్ధమునందు దేవతలు పీడించగా అసురులు భృగుమహర్షి భార్యను ఆశ్రయించిరి. ఆమె వాళ్లకు అభయ మిచ్చెను. అప్పుడు వాళ్లు భయము లేకుండ నివసించిరి. 11,12

మూ. తయా పరిగృహీతాంస్తాన్ దృష్ట్వా క్రుద్ధః సురేశ్వరః,
చక్రేణ శితధారేణ భృగుపత్న్యాః శిరోఽహరత్. 13

ప్ర. అ. తయా = ఆమెచేత, తాన్ = అసురులను, పరిగృహీతాన్ = గ్రహింపబడినవారినిగా, దృష్ట్వా = చూచి, సురేశ్వరః = విష్ణువు, క్రుద్ధః = కోపించినవాడై, శితధారేణ = వాడియైన అంచు గల, చక్రేణ = చక్రముచేత, భృగుపత్న్యాః=భృగుమహర్షి భార్యయొక్క, శిరః=శిరస్సును, అహరత్=హరించెను.

తా. ఆ అసురులను ఆమె ఆ విధముగా చేరదీయుట చూచి కోపించిన విష్ణువు వాడియైన అంచుగల చక్రముతో భృగుమహర్షి భార్య తల నరికివేసెను.

మూ. తతస్తాం నిహతాం దృష్ట్వా పత్నీం 'భృగుకులోద్వహః,
శశాప సహసా క్రుద్ధో విష్ణుం రిపుకులార్దనమ్. 14

ప్ర. అ. తతః = అటుపిమ్మట, భృగుకులోద్వహః = భృగువుయొక్క కులమును ఉద్ధరించిన భృగుమహర్షి, పత్నీమ్=భార్యను, నిహతామ్=చంపబడిన దానినిగా, దృష్ట్వా = చూచి, క్రుద్ధః = కోపించి, సహసా = వెంటనే, రిపుకులార్దనమ్ = శత్రుకులమును పీడించువాడైన, విష్ణుమ్ = విష్ణువును, శశాప=శపించెను.

తా. భృగుమహర్షి తన భార్యను విష్ణువు చంపివేయుట చూచి, వెంటనే కోపించి శత్రుసంహారకుడైన ఆ విష్ణువును శపించెను. 14

మూ. యస్మాదవధ్యాం మే పత్నీమవధీః క్రోధమూర్ఛితః,
తస్మాత్త్వం మానుషే లోకే జనిష్యసి జనార్దన. 15
తత్ర పత్నీవియోగం త్వం ప్రాప్స్యసే బహువార్షికమ్.

ప్ర. అ. జనార్దన = విష్ణూ! త్వమ్ = నీవు, క్రోధమూర్ఛితః = క్రోధావిష్టుడవై, అవధ్యామ్ = చంపదగని, మే పత్నీమ్ = నా భార్యను, యస్మాత్ = ఏ కారణమువలన, అవధీః = చంపితివో, తస్మాత్ = ఆ కారణమువలన, మానుషే లోకే = మనుష్యలోకమునందు, జనిష్యసి = పుట్టగలవు. తత్ర = అక్కడ, బహువార్షికమ్ = అనేకసంవత్సరములకు సంబంధించిన, పత్నీవియోగమ్ = భార్యావియోగమును, ప్రాప్స్యసే = పొందగలవు.

తా. జనార్దనా! నీవు కోపావేశముతో, చంపకూడని నా భార్యను చంపినావు. అందువలన మనుష్యలోకములో పుట్టి చాల సంవత్సరములు భార్యావియోగము పొందెదవు. 15

మూ. శాపాభిహతచేతాస్తు స్వాత్మనా భావితోఽభవత్, 16
అర్చయామాస తం దేవం భృగుః శాపేన పీడితః.

ప్ర. అ. శాపాభిహతచేతాః = శాపముచేత (ఇట్లు విష్ణువుకు శాప మిచ్చుట చేత) కొట్టబడిన మనస్సుగలవాడై, స్వాత్మనా = తన ఆత్మచేత, భావితః = భావన చేయబడినవాడు, అభవత్ = ఆయెను. భృగుః = భృగువు, శాపేన = శాపముచేత, పీడితః = పీడింపబడినవాడై, తం దేవమ్ = ఆ దేవుణ్ణి, అర్చయామాస = పూజించెను.

తా. ఆ భృగువు విష్ణువునకు శాప మిచ్చుటచేత వికారము చెందిన మనస్సుగలవాడై తన ఆత్మతో తనను ధ్యానించుకొని, ఆ శాపముచేత పీడితుడై (పశ్చాత్తాపము చెంది) విష్ణువును పూజించెను. 16

మూ. తపసారాధితో దేవో హ్యబ్రవీద్భక్తవత్సలః, 17
లోకానాం సంప్రియార్థం తు తం శాపం గృహ్యముక్తవాన్.

ప్ర. అ. తపసా = తపస్సుచేత, ఆరాధితః = ఆరాధించబడిన, భక్తవత్సలః = భక్తులయందు దయ గల, దేవః = విష్ణువు, అబ్రవీత్ = పలికెను. లోకానామ్ = లోకములయొక్క, సంప్రియార్థమ్ = ప్రియముకొరకై, తం శాపమ్ = ఆ శాపమును, గృహ్యమ్ = గ్రహించదగినదానినిగా, ఉక్తవాన్ = చెప్పినాడు.

తా. తపస్సుచేత ఆరాధించబడిన భక్తవత్సలుడైన విష్ణువు-"లోకముల హితముచేయుటకై ఈ శాపము నాకు గ్రాహ్యమే"అని పలికెను. 17

మూ. ఇతి శప్తో మహాతేజా భృగుణా పూర్వజన్మని, 18
ఇహాగతో హి పుత్రత్వం తవ పార్థివసత్తమ.

ప్ర. అ. పార్థివసత్తమ = రాజోత్తమా ! భృగుణా = భృగుమహర్షిచేత, పూర్వజన్మని = పూర్వజన్మయందు, ఇతి = ఇట్లు, శప్తః = శపించబడిన, మహా తేజాః = గొప్ప తేజస్సు గల విష్ణువు, ఇహ = ఈ జన్మలో (ఇక్కడ), తవ = నీకు, పుత్రత్వమ్ = పుత్రత్వమును, ఆగతః హి = పొందినాడు.

తా. రాజోత్తమా ! పూర్వజన్మలో ఈ విధముగా శపింపబడిన గొప్ప తేజస్సు గల ఆ విష్ణువు ఇప్పుడు నీ పుత్రుడుగా అయినాడు. 18

మూ. రామ ఇత్యభివిఖ్యాతస్త్రిషు లోకేషు మానద, 19
తత్ఫలం ప్రాప్స్యతే చాపి భృగుశాపకృతం మహత్.

ప్ర. అ. మానద = గౌరవమును ఇచ్చువాడా ! త్రిషు లోకేషు = మూడు లోకములయందు, రామః ఇతి = రాముడు అని, అభివిఖ్యాతః = ప్రసిద్ధుడైన ఆతడు, భృగుశాపకృతమ్ = భృగుమహర్షియొక్క శాపముచేత చేయబడిన, మహత్ = గొప్పదైన, తత్ = ఆ, ఫలమ్ = ఫలమును, ప్రాప్స్యతే = పొందగలడు.

తా. గౌరవమును రక్షించు దశరథమహారాజా! రాముడను పేరుతో మూడు లోకాలలో ప్రసిద్ధుడైన ఆ విష్ణువు (నీ పుత్రుడు) భృగుశాపఫలము కూడ అనుభవించ గలడు.

వి. మహావిష్ణువు భృగుమహర్షి భార్యను సంహరించినట్లు, ఆయనను భృగువు శపించినట్లు, ఈ వృత్తాంతము ప్రాచ్యపాఠములో లేదు. శ్రీమహావిష్ణువుకు శాప మనగా ఏమిటి ? 19

మూ. అయోధ్యాయాః పతీ రామో దీర్ఘకాలం భవిష్యతి, 20
సుఖినశ్చ సమృద్ధాశ్చ భవిష్యన్త్యస్య యేఽనుగాః.

ప్ర. అ. రామః = రాముడు, దీర్ఘకాలమ్ = చాలకాలము, అయోధ్యాయాః = ఆయోధ్యకు, పతిః = ప్రభువుగా, భవిష్యతి = కాగలడు. అస్య = ఈ రాముని యొక్క, యే = ఏ, అనుగాః = అనుచరులు ఉందురో వారు, సుఖినః = సుఖవంతులు, సమృద్ధాః చ = సమృద్ధి కలవారు, భవిష్యన్తి = కాగలరు.

తా. రాముడు చాల కాలము అయోధ్యాధిపతిగా ఉండగలడు. ఈతని అనుచరులు కూడ సుఖసమృద్ధులతో తులతూగగలరు. 20

మూ. దశ వర్షసహస్రాణి దశ వర్షశతాని చ, 21
రామో రాజ్యముపాసిత్వా బ్రహ్మలోకం గమిష్యతి.

ప్ర. అ. రామః = రాముడు, దశ = పది, వర్షసహస్రాణి = సంవత్సరముల సహస్రములు, దశ = పది, వర్షశతాని చ = సంవత్సరముల శతములను, రాజ్యమ్ = రాజ్యమును, ఉపాసిత్వా = ఉపాసించి, బ్రహ్మలోకమ్ = బ్రహ్మలోకమును గూర్చి, గమిష్యతి = వెళ్ళగలడు.

తా. రాముడు పదకొండువేల సంవత్సరముల కాలము రాజ్యము పాలించి బ్రహ్మలోకమునకు వెళ్లును. 21

మూ. సమృద్ధైశ్చాశ్వమేధైశ్చ ఇష్ట్వా పరమదుర్జయః, 22
రాజవంశాంశ్చ బహుశో బహూన్ సంస్థాపయిష్యతి.

ప్ర. అ. పరమదుర్జయః = మిక్కిలి జయింప శక్యము కాని ఇతడు, సమృద్ధైః = సమృద్ధములైన, అశ్వమేధైః = అశ్వమేధములచేత, ఇష్ట్వా = యాగము చేసి, బహుశః = అనేక పర్యాయములు, బహూన్ = అనేకములైన, రాజవంశాన్ చ = రాజవంశములను కూడ, స్థాపయిష్యతి = స్థాపించగలడు.

తా. ఏ మాత్రమూ జయింప శక్యము కాని రాముడు దానాదులతో సమృద్ధములైన యాగాలనూ, అశ్వమేధయాగమునూ చేసి, అనేకపర్యాయములు అనేక రాజవంశములను నిలబెట్టగలడు. 22

మూ. ద్వౌ పుత్రౌ తు భవిష్యేతే సీతాయాం రాఘవస్య తు, 23
స సర్వమఖిలం రాజ్ఞో వంశస్యాహ గతాగతమ్,
ఆఖ్యాయ సుమహాతేజాస్తూష్ణీమాసీన్మహామునిః. 24

ప్ర. అ. రాఘవస్య = రామునకు, సీతాయామ్ = సీతయందు, ద్వౌ పుత్రౌ = ఇద్దరు పుత్రులు, భవిష్యేతే = పుట్టగలరు. సః మహాముని = ఆ మహాముని, రాజ్ఞః = రాజుయొక్క, వంశస్య = వంశముయొక్క, సర్వమ్ = సమస్తమైన, గతా

గతమ్=గడచినదానిని రాబోవుదానిని, సర్వమ్ = అంతను, అఖిలమ్=పూర్తిగా, ఆహ=చెప్పెను. సుమహాతేజాఃచాల గొప్ప తేజస్సు గల అతడు, ఆఖ్యాయ= చెప్పి, తూష్ణిమ్ = మౌనముగా, ఆసీత్ = ఉండెను.

తా. "రామునకు సీతయందు ఇద్దరు పుత్రులు కలుగుదురు" మహాతేజఃశాలియైన ఆ దూర్వాసుడు రాజు వంశమునకు సంబంధించిన గడచినదానిని, రాబోవుదానిని పూర్తిగా చెప్పి ఊరకుండెను. 23,24

మూ. తూష్ణింభూతే తదా తస్మిన్ రాజా దశరథో మునౌ,
అభివాద్య మహాత్మానౌ పునరాయాత్పురోత్తమమ్. 25

ప్ర. అ. తదా = అప్పుడు, తస్మిన్ మునౌ = ఆ ముని, తూష్ణింభూతే = మౌనముగా ఉండగా, రాజా = రాజైన, దశరథఃదశరథుడు, మహాత్మానౌ = ఆ మహాత్ములను, అభివాద్య = నమస్కరించి, పునఃతిరిగి, పురోత్తమమ్=శ్రేష్ఠమైన నగరమును గూర్చి. ఆయాత్ = వచ్చెను.

తా. ఆ ముని మౌనము వహించగా దశరథమహారాజు మహాత్ములైన ఆ వసిష్ఠదూర్వాసులకు నమస్కరించి తన నగరమునకు తిరిగి వచ్చెను. 25

మూ. ఏతద్వచో మయా తత్ర మునినా వ్యాహృతం పురా,
శ్రుతం హృది చ నిక్షిప్తం నాన్యథా తద్భవిష్యతి. 26

ప్ర. అ. తత్ర = అక్కడ, పురా = పూర్వము, మునినా = మునిచేత, వ్యాహృతమ్ = పలకబడిన, ఏతత్ = ఈ, వచఃవచనము, మయా = నాచేత, శ్రుతమ్ = వినబడినది. హృది = హృదయమునందు, నిక్షిప్తం చ = ఉంచుకొనబడినది. తత్ = అది, అన్యథా = మరియొక విధముగ, న భవిష్యతి = కాదు.

తా. పూర్వము అక్కడ ముని పలికిన మాటలు విని నేను వాటిని మనస్సులోనే ఉంచుకొంటిని. అది మరొక విధముగా కాజాలదు. 26

మూ. సీతాయాశ్చ తతఃపుత్రావభిషేక్ష్యతి రాఘవఃఅన్యత్ర న త్వయోధ్యాయాం మునేస్తు వచనం యథా. 27

ప్ర. అ. రాఘవఃరాముడు, తతఃఅటుపిమ్మట, సీతాయాఃసీత

యొక్క, పుత్రౌ=పుత్రులను, మునేః = మునియొక్క, వచనమ్ = వచనము, యథా = ఎట్లో, ఆ విధముగ, అన్యత్ర=మరియొక చోట, అభిషేక్ష్యతి = అభిషేకించగలడు; అయోధ్యాయాం తు = అయోధ్యలో అయితే, న = కాదు.

తా. పిమ్మట రాముడు సీతాపుత్రులను అయోధ్యలో కాక మరొక చోట అభిషిక్తులను చేయగలడు; ఇది ముని చెప్పిన విషయము. 27

మూ. ఏవంగతే న సంతాపం కర్తుమర్హసి రాఘవ,
సీతార్థే రాఘవార్థే వా దృఢో భవ నరోత్తమ. 28

ప్ర. అ. నరోత్తమ = నరులలో ఉత్తముడా ! రాఘవ = లక్ష్మణా ! ఏవంగతే = ఇది ఇలా ఉండగా, సీతార్థే = సీతకొరకు గాని, రాఘవార్థే వా = రాముని కొరకు గాని, సంతాపమ్ = దుఃఖమును, కర్తుమ్ = చేయుటకు, న అర్హసి = తగవు. దృఢః = దృఢుడవై, భవ = ఉండుము.

తా. నరోత్తముడవైన లక్ష్మణా! ఇట్టి స్థితిలో నీవు రాముని విషయమునందు గాని సీతవిషయమునందు గాని దుఃఖించకుము. ధైర్యముగా ఉండుము. 28

మూ. శ్రుత్వా తు వ్యాహృతం వాక్యం సూతస్య పరమాద్భుతమ్,
ప్రహర్షమతులం లేభే సాధు సాధ్వితి చాబ్రవీత్. 29

ప్ర. అ. వ్యాహృతమ్ = పలకబడిన, సూతస్య=సారథియొక్క, పరమాద్భుతమ్ = చాల ఆశ్చర్యకరమైన, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా తు = విని, అతులమ్ = సాటి లేని, ప్రహర్షమ్ = సంతోషమును, లేభే = పొందెను. సాధు సాధు ఇతి = బాగు బాగు అని, అబ్రవీత్ చ = పలికెను కూడ.

తా. సుమంత్రుడు పలికిన చాల ఆశ్చర్యకరములైన మాటలు విని లక్ష్మణుడు చాల సంతోషించెను. "బాగు బాగు"అని మెచ్చుకొనెను. 29

మూ. తతః సంవదతోరేవం సూతలక్ష్మణయోః పథి,
అస్తమర్క్ గతే వాసం కేశిన్యాం తావథోషతుః. 30

ఇత్యార్షే శ్రీమదార్మాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకపఞ్చాశః సర్గః.

ప్ర. అ. సూతలక్ష్మణయోఃసారథీ, లక్ష్మణుడూ, పథి=మార్గమునందు, ఏవమ్ = ఇట్లు, సంవదతోఃమాట్లాడుకొనుచుండగా, తతఃఅటుపిమ్మట, అర్కే = సూర్యుడు, అస్తం గతేఅస్తాద్రిని పొందినవాడగుచుండగా, తౌ = వారిద్దరూ, అథ = పిమ్మట, కేశిన్యామ్ = కేశినీ నదీతీరమునందు, వాసమ్ = నివాసమును, ఊషతుఃఉండిరి.

తా. ఆ సుమంత్రలక్ష్మణులు మార్గమునందు ఈ విధముగా మాటలాడుకొనుచుండగా అంతలో సూర్యుడు అస్తమించెను. అప్పుడు వారు కేశినీ నదీతీరమునందు నివసించిరి. 30

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో యాభై ఒకటవ సర్గ సమాప్తము.

అథ ద్విపఞ్చాశః సర్గః

[అయోధ్యాలో రాజభవనములో ప్రవేశించిన లక్ష్మణుడు దుఃఖించుచున్న రాముణ్ణి ఓదార్చుట]

మూ. తత్ర తాం రజనీముష్య కేశిన్యాం రఘునన్దనః,
ప్రభాతే పునరుత్థాయ లక్ష్మణః ప్రయయౌ తదా. 1

ప్ర. అ. రఘునన్దనః = రఘువంశమునకు ఆనందకరుడైన, లక్ష్మణః = లక్ష్మణుడు, తత్ర = అక్కడ, కేశిన్యామ్ = కేశినీనదీతీరమునందు, తాం రజనీమ్ = ఆ రాత్రి, ఉష్య = ఉండి, ప్రభాతే = ప్రాతఃకాలమునందు, ఉత్థాయ = లేచి, తదా = అప్పుడు, పునః = మరల, ప్రయయౌ = వెళ్ళెను.

తా. రఘువంశానందకరుడైన లక్ష్మణుడు ఆ రాత్రికి ఆ కేశినీనదీతీరమునందు ఉండి మరునాడు ఉదయముననే లేచి మరల ప్రయాణ మయ్యెను. 1

మూ. తతోఽర్ధదివసే ప్రాప్తే ప్రవివేశ మహారథః,
అయోధ్యాం రత్నసంపూర్ణాం హృష్టపుష్టజనావృతామ్. 2

ప్ర. అ. తతః = ఆటుపిమ్మట, అర్ధదివసే = మధ్యాహ్నము, ప్రాప్తే = వచ్చినదగుచుండగా, మహారథః = మహారథుడైన లక్ష్మణుడు, రత్నసంపూర్ణామ్ = రత్నములతో నిండిన, హృష్టపుష్టజనావృతామ్ = సంతోషించిన పరిపుష్టులైన జనులతో కూడిన, అయోధ్యామ్ = అయోధ్యను, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. మహారథుడైన లక్ష్మణుడు మధ్యాహ్నసమయానికి, శ్రేష్ఠములైన వస్తువులతో నిండి సంతోషించిన బాగా పరిపుష్టులైన జనులు నివసించుచున్న అయోధ్యానగరములో ప్రవేశించెను. 2

మూ. సౌమిత్రిస్తు పరం దైన్యం జగామ సుమహామతిః,
రామపాదౌ సమాసాద్య వక్ష్యామి కిమహం గతః. 3

ప్ర. అ. సుమహామతిః = చాల గొప్ప బుద్ధి గల, సౌమిత్రిః తు=లక్ష్మణుడైతే, గతః = వెళ్ళిన, అహమ్ = నేను, రామపాదౌ=రాముని పాదములను, సమాసాద్య = పొంది, కిమ్ = ఏమి, వక్ష్యామి=చెప్పెదను అని, పరమ్ = అధికమైన, దైన్యమ్ = దైన్యమును, జగామ = పొందెను.

తా. గొప్ప బుద్ధి గల ఆ లక్ష్మణుడు "వెళ్ళి రాముని పాదాల చెంత చేరిన నేను ఆయనకు ఏమని చెప్పవలెను"అను ఆలోచనతో చాల దైన్యమును పొందెను.

మూ. తస్యైవం చిన్తయానస్య భవనం శశిసంనిభమ్,
రామస్య పరమోదారం పురస్తాత్సమదృశ్యత. 4

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, చిన్తయానస్య = ఆలోచించుచున్న, తస్య = ఆతనికి, రామస్య = రామునియొక్క, పరమోదారమ్ = చాల గొప్పదైన, శశిసంనిభమ్ = చంద్రునితో సమానమైన, భవనమ్ = భవనము, పురస్తాత్ = ఎదుట, సమదృశ్యత = చూడబడెను.

తా. ఆతడు ఆ విధముగా ఆలోచించుచుండగా, చంద్రుడు వలె తెల్లగా ఉన్న చాల అద్భుతమైన రాముని భవనము ఆతని ఎదుట కనబడెను. 4

మూ. రాజ్ఞస్తు భవనద్వారి సోఽవతీర్య నరోత్తమః,
అవాఙ్ముఖో దీనమనాః ప్రవివేశానివారితః. 5

ప్ర. అ. నరోత్తమః = నరులలో ఉత్తముడైన, సః = లక్ష్మణుడు, రాజ్ఞః = రాజుయొక్క, భవనద్వారి = గృహద్వారమునందు, అవతీర్య = దిగి, అవాఙ్ముఖః = క్రిందికి ముఖము గలవాడై, దీనమనాః = దీనమైన మనస్సు గలవాడై, అనివారితః = నివారింపబడనివాడై, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. నరులలో శ్రేష్ఠుడైన ఆ లక్ష్మణుడు రాజభవనద్వారమువద్ద దిగి, దీనమైన మనస్సుతో, తల వంచుకొని, లోపల ప్రవేశించెను. ఆతనిని ఎవరూ అడ్డుపెట్టలేదు. 5

మూ. స దృష్ట్వా రాఘవం దీనమాసీనం పరమాసనే,
నేత్రాభ్యామశ్రుపూర్ణాభ్యాం దదర్శాగ్రజమగ్రతః. 6

జగ్రాహ చరణౌ తస్య లక్ష్మణో దీనచేతనః,
ఉవాచ దీనయా వాచా ప్రాఞ్జలిః సుసమాహితః. 7

ప్ర. అ. ("దదర్శాగ్రజమగ్రతః" కు బదులు "దహన్తమిద మేదినీమ్"అను ప్రాచ్యపాఠము బాగున్నది. "దృష్ట్వా దదర్శ"అనుదానికి అర్థము సరిగా ఉండదు) సః లక్ష్మణః = ఆ లక్ష్మణుడు, పరమాసనే = శ్రేష్ఠమైన ఆసనమునందు, ఆసీనమ్ = కూర్చొని ఉన్న, అశ్రుపూర్ణాభ్యామ్ = కన్నీళ్ళతో నిండిన, నేత్రాభ్యామ్ = నేత్రములతో, మేదినీమ్ = భూమిని, దహన్తమ్ ఇవ = కాల్చివేయుచున్నాడా అన్నట్లున్న, దీనమ్ = దీనుడైన, రాఘవమ్ = రాముణ్ణి, అగ్రతః = ఎదుట, దృష్ట్వా = చూచి, దీనచేతనః = దీనమైన మనస్సు గలవాడై, తస్య = ఆతనియొక్క, చరణౌ = పాదములను, జగ్రాహ = గ్రహించెను, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై. సుసమాహితః = బాగా సావధానచిత్తుడై, దీనయా = దీనమైన, వాచా = వాక్కుతో, ఉవాచ = పలికెను.

తా. రాముడు దీనుడై, కన్నీళ్ళతో నిండిన కండ్లతో భూమిని కాల్చివేయుచున్నాడా అన్నట్లు, ఉత్తమమైన ఆసనముమీద కూర్చుండి ఉండెను. లక్ష్మణుడు అట్టి రాముణ్ణి చూచి, దీనమైన మనస్సుతో ఆతని పాదములు పట్టుకుని, సావధానచిత్తుడై, అంజలి ఘటించి దైన్యముతో కూడిన మాటలతో ఇట్లు పలికెను. 6,7

మూ. ఆర్యస్యాజ్ఞాం పురస్కృత్య విసృజ్య జనకాత్మజామ్,
గఙ్గాతిరే యథోద్దిష్టే వాల్మీకేరాశ్రమే శుభే. 8
తత్ర తాం చ శుభాచారామాశ్రమాన్తే యశస్వినీమ్,
పునరప్యాగతో వీర పాదమూలముపాసితుమ్. 9

ప్ర. అ. వీర = వీరుడా! ఆర్యస్య = పూజ్యుడవైన నీయొక్క, ఆజ్ఞామ్ = ఆజ్ఞను, పురస్కృత్య = పురస్కరించుకొని, యథోద్దిష్టే = చెప్పబడిన విధముగా ఉన్న, గఙ్గాతీరే = గంగాతీరమునందు, శుభే = శుభమైన, వాల్మీకేః ఆశ్రమే = ఆ వాల్మీకియొక్క ఆశ్రమమునందు (ప్రవేశించి), తత్ర = అక్కడ, ఆశ్రమాన్తే = ఆశ్రమప్రాంతమునందు, శుభాచారామ్ = పవిత్రమైన ఆచారము గల, యశస్వినీమ్ = కీర్తి గల, తామ్ = ఆ, జనకాత్మజామ్ = సీతను, విసృజ్య = విడచి, ఉపాసితుమ్ = సేవించుటకు, పునరపి = మరల, పాదమూలమ్ = నీ పాదమూలమును గూర్చి, 'ఆగతః = వచ్చినాను'.

తా. వీరుడా! పూజ్యుడవైన నీ ఆజ్ఞ ప్రకారము సీతను నీవు చెప్పిన గంగా తీరమునం దున్న పవిత్రమైన వాల్మీక్యాశ్రమమునకు తీసికొనివెళ్ళి పవిత్రమైన నడ వడిక గల, కీర్తిమంతురాలైన ఆ జానకిని అక్కడ ఆశ్రమప్రాంతమునందు విడచి, నీ సేవకై మరల నీ పాదాల చెంతకు వచ్చినాను. 8,9

మూ. మా శుచః పురుషవ్యాఘ్ర కాలస్య గతిరీదృశీ,
త్వద్విధా న హి శోచన్తి బుద్ధిమన్తో మనస్వినః. 10

ప్ర. అ. పురుషవ్యాఘ్ర = పురుషశ్రేష్ఠుడా! మా శుచః = దుఃఖించకుము. కాలస్య = కాలముయొక్క, గతిః = గతి, ఈదృశీ = ఇట్టిది. త్వద్విధాః = నీవంటి, బుద్ధిమన్తః = బుద్ధిమంతులైన, మనస్వినః = ఆత్మాభిమానవంతులు, న శోచన్తి హి = దుఃఖించరు కదా?

తా. పురుషశ్రేష్ఠుడా! దుఃఖించకుము. కాలగతి ఇలాంటిది. నీవంటి బుద్ధి మంతులైన ఆత్మాభిమానవంతులు దుఃఖించరు కదా? 10

మూ. సర్వే క్షయాన్తా నిచయాః పతనాన్తాః సముచ్ఛ్రయాః,
సంయోగా విప్రయోగాన్తా మరణాన్తం చ జీవితమ్. 11

ప్ర. అ. సర్వే = సమస్తమైన, నిచయాః = ప్రోగుచేయుటలు, క్షయాన్తాః = క్షయము అంతమునందు గలవి. సముచ్ఛ్రయాః = ఉన్నతత్వములు, పతనాన్తాః = పతనము అంతమునందు గలవి. సంయోగాః = సంయోగములు, విప్రయోగాన్తాః = వియోగము అంతమునందు గలవి. జీవితమ్ = జీవితము, మరణాన్తమ్ = మరణమే అంతముగా గలది.

తా. కూడబెట్టిన వన్నీ చివరికి నశించవలసినదే. ఎంత ఉన్నతి లభించినా చివరికి క్రింద పడవలసినదే. కలయికలు చివరికి వియోగమునందే ముగియును. ఎంతకాలము జీవించినా చివరికి మరణించవలసినదే. 11

మూ. తస్మాత్పుత్రేషు దారేషు మిత్రేషు చ ధనేషు చ,
నాతిప్రసఙ్గః కర్తవ్యో విప్రయోగో హి తైర్ధ్రువః. 12

ప్ర. అ. తస్మాత్ = ఆ కారణమువలన, పుత్రేషు = పుత్రులయందు, దారేషు = భార్యయందు, మిత్రేషు = మిత్రులయందు, ధనేషు చ = ధనములయందు,

అతిప్రసంగః=ఎక్కువ ఆసక్తి, న కర్తవ్యః=చేయదగినది కాదు త్రీ=వాటితో వియోగః = దూర మగుట, ధ్రువః హి = నిశ్చితము కదా?

తా. అందువలన పుత్రులవిషయమునందు, భార్య విషయమునందు మిత్రుల విషయమునందు, ధనముల యందు, ఎక్కువ సంగము చూపకూడదు. వీటితో వియోగము ఏనాటికైనా తప్పదు. 12

మూ. శక్తస్త్వమాత్మనాత్మానం వినేతుం మనసా మనః,
లోకాన్ సర్వాంశ్చ కాకుత్స్థ కిం పునః శోకమాత్మనః.

ప్ర. అ. కాకుత్స్థ = రామా ! త్వమ్ = నీవు, ఆత్మనా = తనచేత, ఆత్మానమ్ = తనను, మనసా=మనస్సుచేత, మనః=మనస్సును, సర్వాన్=సమస్తమైన, లోకాన్ చ=లోకములను, వినేతుమ్=అదుపులో ఉంచుటకు, శక్తః=సమర్థుడవు. ఆత్మనః = నీయొక్క, శోకమ్ = శోకమును, కిం పునః = చెప్పనేల!

తా. రామా ! నీవు తనచే తాను అదుపులో ఉంచుకొనగలవు. మనస్సును మనస్సుచేత నిగ్రహించుకొనగలవు. సమస్తలోకములనూ కూడ నిగ్రహించగలవు. నీ శోకమును అణచుకొనగల వను మాట చెప్పవలెనా ? 13

మూ. నేదృశేషు విముహ్యన్తి త్వద్విధాః పురుషర్షభాః,
అపవాదః స కిల తే పునరేష్యతి రాఘవ. 14

ప్ర. అ. రాఘవ = రామా ! త్వద్విధాః = నీవంటి, పురుషర్షభాః=పురుషశ్రేష్ఠులు, ఈదృశేషు = ఇలాంటివాటియందు, న విముహ్యన్తి=మోహము చెందరు. సః అపవాదః=ఆ అపవాద, తే=నీకు, పునః=మరల, ఏష్యతి కిల=రాగలదు కదా?

తా. రామా ! నీవంటి పురుషశ్రేష్ఠులు ఇలాంటి విషయముల యందు మోహము చెందరు. నీవు ఇట్లు ఉన్నచో మళ్ళి ఆ అపవాద వచ్చును. పరగృహములో ఉన్న భార్యను విడిచి పెట్టిన రాముడు ఆమెను గూర్చియే విచారించుచు స్వకర్తవ్యములు మరచినాడు అను అపవాద వచ్చును అని భావము. 14

మూ. యదర్థం మైథిలీ త్యక్తా అపవాదభయాన్నృప,
సోఽపవాదః పురే రాజన్ భవిష్యతి న సంశయః. 15

ప్ర. అ. నృప = మానవులను పాలించువాడా ! మైథిలీ = సీత, యదర్థమ్ = దేనినిమిత్తమై, అపవాదభయాత్ = అపవాదభయమువలన, త్యక్తా = విడవబడినదో, రాజన్ = రాజా ! సః = ఆ, అపవాదః = అపవాద, పురే = పట్టణమునందు, భవిష్యతి = కాగలదు; సంశయః = సంశయము, న = లేదు.

తా. రాజా ! ఏ అపవాదభయమువలన సీతను విడచినావో అదే అపవాద మరొకరూపమున నీవు స్వకర్తవ్యవిముఖుడవై ఉన్నావు అని పురములో కలుగును. సంశయము లేదు. 15

మూ. స త్వం పురుషశార్దూల ధైర్యేణ సుసమాహితః,
త్యజేమాం దుర్బలాం బుద్ధిం సంతాపం మా కురుష్వ హ.

ప్ర. అ. పురుషశార్దూల = పురుషశ్రేష్ఠుడా ! సః త్వమ్ = అట్టి నీవు, ధైర్యేణ = ధైర్యముతో, సుసమాహితః = బాగా సావధానచిత్తుడవై, దుర్బలామ్ = దుర్బలమైన, ఇమామ్ = ఈ, బుద్ధిమ్ = బుద్ధిని, త్యజ = విడువుము. సంతాపమ్ = సంతాపమును, మా కురుష్వ హ = చేయకుము.

తా. ఓ ! పురుషశ్రేష్ఠుడా ! అట్టి నీవు ధైర్యముచేత సావధానచిత్తుడవై దుర్బలమైన ఈ బుద్ధిని విడిచిపెట్టుము. సంతాపము చెందకుము. 16

మూ. ఏవముక్తః స కాకుత్థ్సో లక్ష్మణేన మహాత్మనా,
ఉవాచ పరయా ప్రీత్యా సౌమిత్రిం మిత్రవత్సలః. 17

ప్ర. అ. మహాత్మనా = మహాత్ముడైన, లక్ష్మణేన = లక్ష్మణునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = చెప్పబడిన, మిత్రవత్సలః = మిత్రులయందు ప్రేమ గల, సః కాకుత్థ్సః = ఆ రాముడు, సౌమిత్రిమ్ = లక్ష్మణుని గూర్చి, పరమయా = గొప్పదైన, ప్రీత్యా = ప్రేమతో, ఉవాచ = పలికెను.

తా. మహాత్ముడైన లక్ష్మణుని మాటలు విని మిత్రులయందు ప్రేమ గల రాముడు గొప్ప సంతోషముతో ఇట్లు పలికెను. 17

మూ. ఏవమేతన్నరశ్రేష్ఠ యథా వదసి లక్ష్మణ,
పరితోషశ్చ మే వీర మమ కార్యానుశాసనే. 18

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడవైన, లక్ష్మణ = లక్ష్మణా ! యథా = ఎట్లు, వదసి = చెప్పుచున్నావో, ఏతత్ = ఇది, ఏవమ్ = ఇట్లే. వీర = వీరుడా ! మమ = నాయొక్క, కార్యానుశాసనే = కర్తవ్యమును గూర్చి శాసించుట యందు, మే = నాకు, పరితోషః చ = సంతోషము కూడ గలిగినది.

తా. నరశ్రేష్ఠుడవైన లక్ష్మణా ! నీవు చెప్పినది సత్యము. వీరుడా ! నీవు నా కర్తవ్యమును గూర్చి శాసించినందుకు సంతోషము కలిగినది. 18

మూ. నివృత్తిశ్చాగతా సౌమ్య సంతాపశ్చ నిరాకృతః,
భవద్వాక్యైః సురుచిరైరనునీతోఽస్మి లక్ష్మణ. 19

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ద్విపఞ్చాశః సరః.

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! లక్ష్మణ = లక్ష్మణా ! నివృత్తిః = దుఃఖ నివృత్తి, ఆగతా = వచ్చినది. సంతాపః చ = సంతాపము, నిరాకృతః = దూరము చేయబడినది. సురుచిరైః = మిక్కిలి అందమైన, భవద్వాక్యైః = నీ వాక్యముల చేత, అనునీతః = బ్రతిమాలుకొనబడినవాడను (బోధింపబడినవాడను), అస్మి = అయినాను.

తా. సౌమ్యా ! లక్ష్మణా ! దుఃఖము నివర్తించినది. నేను సంతాపమును విడిలివేసినాను. చాల అందమైన నీ మాటలచేత నేను బోధింపబడితిని. 19

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
ఏబదిరెండవ సర్గ సమాప్తము.

అథ త్రిపఞ్చాశః సర్గః

[పనిమీద వచ్చినవారిని ఉపేక్షించుటచేత నృగమహారాజుకు వచ్చిన శాపమును గూర్చిన కథ చెప్పి రాముడు కార్యార్థులను నిరీక్షించ వలెను అని లక్ష్మణుణ్ణి ఆదేశించుట.]

మూ. లక్ష్మణస్య తు తద్వాక్యం నిశమ్య పరమాద్భుతమ్,
సుప్రీతశ్చాభవద్రామో వాక్యమేతదువాచ హ. 1

ప్ర. అ. రామః = రాముడు, లక్ష్మణస్య = లక్ష్మణునియొక్క, పరమాద్భుతమ్ = చాల ఆశ్చర్యకరమైన, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, నిశమ్య = విని, సుప్రీతః = చాల సంతోషించినవాడు, ఆసీత్ = ఆయెను. ఏతత్ = ఈ, వాక్యం చ = వాక్యమును కూడ, ఉవాచ హ = పలికెను.

తా. రాముడు చాల అద్భుతమైన లక్ష్మణుని వాక్యమును విని చాల సంతోషించి ఇట్లు పలికెను. 1

మూ. దుర్లభస్త్వాదృశో బన్ధురస్మిన్ కాలే విశేషతః,
యాదృశస్త్వం మహాబుద్ధిర్మమ సౌమ్య మనోనుగః. 2

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! మహాబుద్ధిః = గొప్ప బుద్ధి గల, మనోనుగః = (నా) మనస్సును అనుసరించి ప్రవర్తించు. త్వమ్ = నీవు, మమ = నాకు, యాదృశః = ఎట్టివాడవో, ఈదృశః = ఇట్టి, బన్ధుః = బంధువు, దుర్లభః = దుర్లభుడు. అస్మిన్ = ఈ, కాలే = కాలమునందు, విశేషతః = విశేషించి దుర్లభుడు.

తా. సౌమ్యుడా ! మహాబుద్ధివి, నా మనస్సుకు అనుగుణముగా ప్రవర్తించువాడవూ అయిన నీవు నాకెట్టి బంధువుగా ఉన్నావో అట్టి బంధువు లభించుట చాలా కష్టము. విశేషించి ఈ కాలములో ఇంకనూ కష్టము. 2

మూ. యచ్చ మే హృదయే కిం చిద్వర్తతే శుభలక్షణ,
తన్నిశామయ చ శ్రుత్వా కురుష్వ వచనం మమ. 3

ప్ర. అ. శుభలక్షణ=శుభములైన లక్షణములు కలవాడా! మే=నాయొక్క, హృదయే = హృదయమునందు, యత్ = ఏది, వర్తతే = ఉన్నదో, తత్ = దానిని, నిశామయ = వినుము. శ్రుత్వా = విని, మమ = నాయొక్క, వచనమ్= వచనమును, కురుష్వ = చేయుము.

తా. శుభలక్షణములు కలవాడా! నా మనస్సులో ఉన్న మాట చెప్పెదను వినుము; విని దాని ప్రకారము చేయుము. 3

మూ. చత్వారో దివసాః సౌమ్య కార్యం పౌరజనస్య చ,
అకుర్వాణస్య సౌమిత్రే తన్మే మర్మాణి కృన్తతి. 4

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! సౌమిత్రే = లక్ష్మణా! పౌరజనస్య = పౌరజనులయొక్క, కార్యమ్ = కార్యమును, అకుర్వాణస్య = చేయని నాకు, చత్వారః=నాలుగు, దివసాః=రోజులు గడచినవి. తత్=అది, మే=నాయొక్క, మర్మాణి = మర్మములను, కృన్తతి = భేదించుచున్నది.

తా. సౌమ్యా! లక్ష్మణా! నేను పౌరుల పనులు చూచి నాలుగు రోజులు అయినది. అది నా మర్మమును భేదించుచున్నది. (నా అంతరాత్మ అందుకు చాల బాధపడుచున్నది). 4

మూ. ఆహూయన్తాం ప్రకృతయః పురోధా మన్త్రిణస్తథా,
కార్యార్థినశ్చ పురుషాః స్త్రియో వా పురుషర్షభ. 5

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! ప్రకృతయః = ప్రకృతులు, పురోధాః = పురోహితుడు, తథా=మరియు, మన్త్రిణః=మంత్రులు, కార్యార్థినః= కార్యార్థులైన, పురుషాః = పురుషులు గాని, స్త్రియో వా = స్త్రీలు గాని, ఆహూయన్తామ్ = పిలవబడెదరుగాక.

తా. పురుషశ్రేష్ఠుడా! వ్యవహారము ఉన్న పురుషులను, స్త్రీలను, (ఎవరి ఎదుట ఆ వ్యవహారము నిర్ణయించవలెనో) ఆ ప్రకృతులను, పురోహితుని, మంత్రులను పిలిపించుము. 5

మూ. పౌరకార్యాణి యో రాజా న కరోతి దినే దినే,
సంవృతే నరకే ఘోరే పతితో నాత్ర సంశయః. 6

ప్ర. అ. యః రాజా = ఏ రాజు, దినే దినే = ప్రతిదినమునందు, పౌర కార్యాణి = పౌరుల పనులను, న కరోతి = చేయడో, అతడు, సంవృతే = కప్ప బడిన, ఘోరే = ఘోర మైన, నరకే = నరకమునందు, పతితః = పడినాడు. సంశయః = సంశయము, న = లేదు.

తా. ప్రతిదినమూ పౌరుల కార్యాలు చూడని రాజు గాలి, వెలుతురూ లేకుండే టట్లు కప్పివేయబడిన ఘోరనరకములో పడినట్లే; సందేహము లేదు.

మూ. శ్రూయతే హి పురా రాజా నృగో నామ మహాయశాః,
బభూవ పృథివీపాలో బ్రహ్మణ్యః సత్యవాక్ శుచిః. 7

ప్ర. అ. పురా = పూర్వము, మహాయశాః = గొప్ప కీర్తి గల, పృథివీ పాలః = భూమిని పాలించు, బ్రహ్మణ్యః = బ్రాహ్మణభక్తుడైన, సత్యవాక్ = సత్య మైన వాక్కు గల, శుచిః = మనోవాక్కాయశుద్ధుడైన, నృగో నామ = నృగు డను, రాజా = రాజు, బభూవ = ఉండెను. శ్రూయతే హి = ఇట్లు వినబడుచున్నది కదా.

తా. పూర్వము గొప్ప కీర్తి గల నృగు డనే రాజు ఉండె నని విను చున్నాము. భూమిని చక్కగ పాలించే అతడు బ్రాహ్మణభక్తుడు; సత్యమే పలుకు వాడు. పరిశుద్ధుడు. 7

మూ. స కదాచిద్గవాం కోటీః సవత్సాః స్వర్ణభూషితాః,
నృదేవో భూమిదేవేభ్యః పుష్కరేషు దదౌ నృపః. 8

ప్ర. అ. నృదేవః = నరుల దేవుడైన, సః నృపః = ఆ రాజు, పుష్కరేషు = పుష్కరములయందు, కదాచిత్ = ఒకప్పుడు, సవత్సాః = లేగదూడ్లతో కూడిన, స్వర్ణభూషితాః = బంగారముచేత అలంకరించబడిన, గవామ్ = గోవులయొక్క, కోటీః = కోట్లను, భూమిదేవేభ్యః = బ్రాహ్మణులకు, దదౌ = ఇచ్చెను.

తా. ఒకప్పుడు ఆ రాజు పుష్కరములయందు, లేగదూడలతో కూడిన, బంగారముచేత అలంకరించిన కోట్లకొలది ఆవులను బ్రాహ్మణులకు దానము చేసెను. 8

మూ. తతః సజ్గాద్గతా ధేనుః సవత్సా స్పర్శితానఘ,
బ్రాహ్మణస్యాహితాగ్నేస్తు దరిద్రస్యోఞ్ఛవర్తినః. 9

ప్ర. అ. తతః = అపుడు, అనఘ = దోషములులేనివాడా ! ఆహితాగ్నేః = ఆహితాగ్ని, దరిద్రస్య = దరిద్రుడు, ఉఞ్ఛవర్తినః = ఉంఛవృత్తి చేసికొనువాడు అయిన, బ్రాహ్మణస్య = ఒక బ్రాహ్మణునియొక్క, సవత్సా = లేగదూడతో కూడిన, ధేనుః = ఆవు, సజ్గాత్ = కలిసిపోవుటవలన, గతా = వెళ్ళిపోయినది.

తా. ఆహితాగ్ని, దరిద్రుడు, ఉంఛవృత్తితో (చేలలో రాలిన ధాన్యపు గింజలు ఏరికొని జీవించుట) జీవించు ఒక బ్రాహ్మణుని గోవు, దాని లేగదూడ ఆ ఆవులతో కలిసి (దానముచేసినవాటితో) వెళ్ళి పోయినవి. 9

మూ. స నష్టాం గాం క్షుధార్తో వై అన్విష్యంస్తత్ర తత్ర హ,
నాపశ్యత్సర్వరాష్ట్రేషు సంవత్సరగణాన్ బహూన్. 10

ప్ర. అ. క్షుధా = ఆకలిచేత, ఆర్తః = పీడితుడైన, సః = ఆతడు, నష్టామ్ = నష్టమైన, గామ్ = గోవును, సర్వరాష్ట్రేషు = అన్ని రాష్ట్రములయందు, తత్ర తత్ర = అక్కడక్కడ, బహూన్ = అనేకములైన, సంవత్సరగణాన్ = సంవత్సర సముదాయములను, అన్విష్యన్ = వెదకుచు, నాపశ్యత్ = చూడలేదు.

తా. ఆకలితో బాధపడుచున్న ఆబ్రాహ్మణుడు కనబడకుండా పోయిన ఆ ఆవుకొరకై అన్ని రాష్ట్రములలోను అక్కడక్కడ అనేకసంవత్సరములపాటు వెదకెను. కాని అది కనబడలేదు. 10

మూ. తతః కనఖలం గత్వా జీర్ణవత్సాం నిరామయామ్,
దదృశే తాం స్వికాం ధేనుం బ్రాహ్మణస్య నివేశనే. 11

ప్ర. అ. తతః = అటుపిమ్మట, కనఖలమ్ = కనఖల మను ప్రదేశమును గూర్చి, గత్వా = వెళ్ళి, బ్రాహ్మణస్య = బ్రాహ్మణునియొక్క, నివేశనే = గృహము నందు, జీర్ణవత్సామ్ = దుర్బలమైన దూడ గల, నిరామయామ్ = రోగములు లేని, స్వికామ్ = తన సంబంధమైన, తామ్ = ఆ, ధేనుమ్ = ధేనువును, దదృశే = చూచెను.

తా. పిమ్మట అతడు కనఖల మను ప్రదేశమునకు వెళ్ళి అక్కడ ఒక

బ్రాహ్మణుని ఇంటిలో ఆరోగ్యముగా ఉన్న తన ధేనువును చూచెను. దాని దూడ మాత్రము దుర్బలముగా ఉండెను. 11

మూ. అథ తాం నామధేయేన స్వకేనోవాచ బ్రాహ్మణః,
ఆగచ్ఛ శబలేత్యేవం సా తు శుశ్రావ గౌః స్వరమ్. 12

ప్ర. అ. అథ = అటుపిమ్మట, బ్రాహ్మణః = బ్రాహ్మణుడు, తామ్ = ఆ ఆవును, స్వకేన = తన సంబంధమైన, నామధేయేన = పేరుతో, శబలే = శబలా! ఆగచ్ఛ = రమ్ము, ఇత్యేవమ్ = అని, ఉవాచ = పలికెను. సా = ఆ, గౌః తు = గోవు అయితే, స్వరమ్ = స్వరమును, శుశ్రావ = వినెను.

తా. పిమ్మట ఆ బ్రాహ్మణుడు "శబలా! రమ్ము"అని ఆ ఆవును పేరు పెట్టి పిలచెను. అప్పుడు ఆ గోవు ఆ స్వరమును వినెను. 12

మూ. తస్య తం స్వరమాజ్ఞాయ క్షుధార్తస్య ద్విజస్య వై,
అన్వగాత్పృష్ఠతః సా గౌర్గచ్ఛన్తం పావకోపమమ్. 13

ప్ర. అ. క్షుధార్తస్య = ఆకలిచేత పీడితుడైన, తస్య ద్విజస్య = ఆ బ్రాహ్మణునియొక్క, తం స్వరమ్ = ఆ స్వరమును, ఆజ్ఞాయ = గుర్తుపట్టి, సా గౌః = ఆ గోవు, గచ్ఛన్తమ్ = నడచుచున్న, పావకోపమమ్ = అగ్నితో సమానుడైన అతనిని, పృష్ఠతః = వెనుకనే, అన్వగచ్ఛత్ = అనుసరించి వెళ్లెను.

తా. క్షుధార్తుడైన ఆ బ్రాహ్మణుని స్వరమును గుర్తుపట్టి ఆ గోవు అగ్నితో సమానుడైన అతడు ముందు నడచుచుండగా ఆతని వెనుకనే వెళ్లెను. (క్షుధార్తుడు అనేది ఆ బ్రాహ్మణుని పేరుకూడ కావచ్చును). 13

మూ. యోఽపి పాలయతే విప్రః సోఽపి గామన్వగాద్ద్రుతమ్,
గత్వా చ తమృషిం చష్టే మమ గౌరితి సత్వరమ్. 14

ప్ర. అ. యః విప్రః = ఏ బ్రాహ్మణుడు పాలయతే = పాలించుచున్నాడో సః అపి = అతడు కూడ, ద్రుతమ్ = శీఘ్రముగా, గామ్ = గోవును, అన్వగాత్ = అనుసరించి వెళ్ళెను సత్వరమ్ = శీఘ్రముగా, గత్వా చ = వెళ్ళి, మమ గౌః = ఇది నా గోవు, ఇతి = అని, తమ్ = ఆ, ఋషిమ్ = ఋషిని గూర్చి, చష్టే = చెప్పెను.

తా. ఆ గోవును పాలించుచున్న బ్రాహ్మణుడు కూడ శీఘ్రముగా గోవు వెంట వెళ్ళెను. తొందరగా వెళ్ళి ఆ ఋషితో "ఇది నా గోవు"అని పలికెను. 14

మూ. స్పర్శితా రాజసింహేన మమ దత్తా నృగేణ హ,
తయోర్బ్రాహ్మణయోరాసీద్వివాదో మహానాసీద్విపశ్చితోః. 15

ప్ర. అ. రాజసింహేన = రాజశ్రేష్ఠుడైన, నృగేణ=నృగునిచేత, స్పర్శితా= స్పృశించబడినది. మమ = నాకు, దత్తా = ఇవ్వబడినది. విపశ్చితోః = విద్వాంసులైన, తయోః=ఆ, బ్రాహ్మణయోః=బ్రాహ్మణులకు, మహాన్ = గొప్ప, వివాదః= కలహము, ఆసీత్ = ఆయెను.

తా. "నృగమహారాజు ఈ గోవును స్పృశించి నాకు ఇచ్చినాడు" అని చెప్పెను. పండితులైన ఆ బ్రాహ్మణు లిద్దరికీ పెద్ద కలహము జరిగెను. 15

మూ. వివదన్తౌ తతోఽన్యోన్యం దాతారమభిజగ్మతుః,
తౌ రాజభవనద్వారి న ప్రాప్తౌ నృగశాసనమ్. 16

ప్ర. అ. తతః = అటుపిమ్మట, అన్యోన్యమ్ = పరస్పరము, వివదన్తౌ = కలహించుకొనుచున్న, తౌ=వారు, దాతారమ్ = దాతను గూర్చి, అభిజగ్మతుః= వెళ్ళిరి. రాజభవనద్వారి = రాజగృహద్వారమునందు, నృగశాసనమ్ = నృగమహారాజు శాసనమును, న ప్రాప్తౌ = పొందలేదు.

తా. వాళ్ళిద్దరూ పరస్పరమూ కలహించుకొనుచు దానము చేసిన నృగుని దగ్గరికి వెళ్ళిరి. కాని రాజభవనద్వారమునందు వారికి నృగుని అనుమతి లభించలేదు. 16

మూ. అహోరాత్రాణ్యనేకాని వసన్తౌ క్రోధమీయతుః,
ఊచతుశ్చ మహాత్మానౌ తావుభౌ ద్విజసత్తమౌ, 17
క్రుద్ధౌ పరమసంతప్తౌ వాక్యం మోఘాభిసంహితమ్.

ప్ర. అ. మహాత్మానౌ = మహాత్ములైన, ఉభౌ=ఇద్దరు, తౌ ద్విజసత్తమౌ = ఆ బ్రాహ్మణోత్తములు, అనేకాని = అనేకములైన, అహోరాత్రాణి = అహోరాత్రములను, వసన్తౌ = నివసించుచున్నవారై, క్రోధమ్=క్రోధమును, ఈయతుః

= పొందిరి. పరమసంతప్తౌ = మిక్కిలి బాధపడిన, క్రుద్ధౌ = కోపించిన ఆ బ్రాహ్మణులు, ఘోరాభిసంహితమ్ = ఘోరమైన అర్థము గల, వాక్యమ్ = వాక్యమును, ఊచతుః = పలికిరి.

తా. మహాత్ములైన ఆ బ్రాహ్మణోత్తము లిద్దరూ చాల రాత్రింబవళ్లు అక్కడ ఉండిరి. చిపరికి కోపించిరి. చాల బాధపడిన వారిద్దరూ కోపించి ఘోరమైన తాత్పర్యము గల వాక్యము పలికిరి. 17

మూ. అర్థినాం కార్యసిద్ధ్యర్థం యస్మాత్త్వం నైషి దర్శనమ్, 18
అదృశ్యాః సర్వభూతానాం కృకలాసో భవిష్యసి.

ప్ర. అ. త్వమ్ = నీవు. అర్థినామ్ = కార్యార్థుల, కార్యసిద్ధ్యర్థమ్ = కార్యసిద్ధికొరకు, యస్మాత్ = ఏకారణమువలన, దర్శనమ్ = దర్శనమును, నైషి = పొందుటలేదో, అందువలన, సర్వభూతానామ్ = సమస్తప్రాణులకూ, అదృశ్యాః = కనబడని, కృకలాసః = తొండగా, భవిష్యసి = కాగలవు.

తా. కార్యార్థులై వచ్చినవారికి నీవు దర్శనము ఇచ్చుటలేదు. అందువలన నీవు ఏ ప్రాణులకూ కనబడని తొండవుగా అయ్యెదవుగాక. 18

మూ. బహువర్షసహస్రాణి బహువర్షశతాని చ, 19
శ్వభ్రే త్వం కృకలీభూతో దీర్ఘకాలం నివత్స్యసి.

ప్ర. అ. త్వమ్ = నీవు, బహువర్షసహస్రాణి = చాలా వేల సంవత్సరములను, బహువర్షశతాని చ = చాలా వందల సంవత్సరములను, కృకలీభూతః = తొండవై, దీర్ఘకాలమ్ = దీర్ఘకాలము, శ్వభ్రే = గోతిలో, నివత్స్యసి = నివసించగలవు.

తా. నీవు తొండవుగా అయి కొన్ని వేల సంవత్సరాలు, కొన్ని వందల సంవత్సరాలు దీర్ఘకాలము, గోతిలో పడి ఉండగలవు. 19

మూ. ఉత్పత్స్యతే హి లోకేఽస్మిన్ యదూనాం కీర్తివర్ధనః, 20
వాసుదేవ ఇతి ఖ్యాతో విష్ణుః పురుషవిగ్రహః.

ప్ర. అ. విష్ణుః = విష్ణువు, యదూనామ్ = యాదవులయొక్క, కీర్తివర్ధనః

= కీర్తిని వృద్ధిపొందించుచు, వాసుదేవః ఇతి = వాసుదేవుడు అని, ఖ్యాతః = ప్రసిద్ధుడై, పురుషవిగ్రహః = మానవరూపుడై, అస్మిన్ = ఈ, లోకే = లోకము నందు, ఉత్పత్స్యతే = పుట్టగలడు.

తా. విష్ణువు యాదవుల కీర్తిని వృద్ధిపొందించుచు, వాసుదేవు డను పేరుతో మానవుడై ఈ లోకములో పుట్టగలడు. 21

మూ. స తే మోక్షయితా శాపాద్రాజంస్తస్మాదభవిష్యతి, 21
కృతా చ తేన కాలేన నిష్కృతిస్తే భవిష్యతి.

ప్ర. అ. రాజన్ = రాజా, సః = అతడు, తస్మాత్ = ఆ, శాపాత్ = = శాపమునుండి, తే = నీకు, మోక్షయితా = విడిపించేవాడు, భవిష్యతి = కాగలడు. తేన కాలేన = ఆ కాలముచేత, తే = నీకు, నిష్కృతిః = ప్రాయశ్చిత్తము కృతా = చేయబడినది, భవిష్యతి = కాగలదు.

తా. రాజా! అతడు నిన్ను ఈ శాపమునుండి విడిపించగలడు. ఆ కాలా నికి నీకు ప్రాయశ్చిత్తము పూర్తి అగును. 21

మూ. భారావతరణార్థం హి నరనారాయణావుభౌ, 22
ఉత్పత్స్యేతే మహావీర్యౌ కలౌ యుగ ఉపస్థితే.

ప్ర. అ. కలౌ యుగే = కలియుగము, ఉపస్థితే = సమీపించిన దగు చుండగా, మహావీర్యౌ = గొప్ప పరాక్రమము గల, నరనారాయణౌ = నరనారాయ ణులు, ఉభౌ = ఇద్దరూ, భారావతరణార్థమ్ = భూభారమును తొలగించుటకు, ఉత్పత్స్యేతే = పుట్టగలరు.

తా. కలియుగము దగ్గరపడినప్పుడు భూభారమును తొలగించుటకై గొప్ప పరాక్రమము గల నరనారాయణులు భూలోకములో పుట్టగలరు. 22

మూ. ఏవం తౌ శాపముత్సృజ్య బ్రాహ్మణౌ విగతజ్వరౌ, 20
తాం గాం హి దుర్బలాం వృద్ధాం దదతుర్బ్రాహ్మణాయ వై.

ప్ర. అ. తౌ = ఆ, బ్రాహ్మణౌ = బ్రాహ్మణులు, ఏవమ్ = ఇట్లు, శాపమ్ = శాపమును, ఉత్సృజ్య = విడచి, విగతజ్వరౌ = పోయిన కోపావేశము గల

తా. అందువలన, పనులున్నవారు వెంటనే నా దర్శనమును పొందుదురు గాక. రాజు బాగా నిర్వహించిన కార్యము ఫలమును పొందును కదా? లక్ష్మణా! అందువలన నీవు వెళ్ళి కార్యార్థులై ఎవరైన వచ్చినారా చూడుము. 25, 26

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో ఏభైమూడవ సర్గ సమాప్తము.

అథ చతుఃపఞ్చాశః సర్గః

[నృగమహారాజు తన పుత్రునకు రాజ్యమిచ్చివేసి భూమిలో అంద మైన గొయ్యి త్రవ్వించుకొని శాపమును అనుభవించుట].

మూ. రామస్య భాషితం శ్రుత్వా లక్ష్మణః పరమార్థవిత్,
ఉవాచ ప్రాఞ్జలిర్వాక్యం రాఘవం దీప్తతేజసమ్. 1

ప్ర. అ. రామస్య = రామునియొక్క, భాషితమ్ = మాటను, శ్రుత్వా = విని, పరమార్థవిత్ = పరమార్థమును ఎరిగిన, లక్ష్మణః = లక్ష్మణుడు, ప్రాఞ్జలిః = ఎత్తబడిన దోసిలికలవాడై, దీప్తతేజసమ్ = ప్రకాశించుచున్న తేజస్సు గల, రాఘవమ్ = రాముణ్ణి గూర్చి, ఉవాచ = పలికెను.

తా. పరమార్థమును ఎరిగిన లక్ష్మణుడు రాముని మాటలు విని, అంజలి ఘటించి తేజస్సుతో ప్రకాశించుచున్న రామునితో ఇట్లనెను. 1

మూ. అల్పాపరాధే కాకుత్స్థ ద్విజాభ్యాం శాప ఈదృశః,
మహాన్నృగస్య రాజర్షేర్యమదణ్డ ఇవాపరః. 2

ప్ర. అ. కాకుత్స్థ = రామా! అల్పాపరాధే=అల్పమైన అపరాధమునందు, ద్విజాభ్యామ్ = బ్రాహ్మణులచేత, ఈదృశః = ఇట్టి, అపరః = మరియొక, యమదణ్డః ఇవ = యమదండము వంటి, మహాన్ = గొప్ప, శాపః=శాపము, రాజర్షేః = రాజర్షియైన, నృగస్య = నృగునకు ఇవ్వబడినది.

తా. రామా! ఆ బ్రాహ్మణులు ఇంత చిన్న అపరాధానికి రాజర్షియైన నృగ మహారాజునకు యమదండమువంటి ఇంత గొప్ప శాపము ఇచ్చినారు కదా? 2

మూ. శ్రుత్వా తు పాపసంయుక్తమాత్మానం పురుషర్షభ,
కిమువాచ నృగో రాజా ద్విజౌ క్రోధసమన్వితౌ. 3

ప్ర. అ. పురుషర్షభ = వురుషశ్రేష్ఠుడా! నృగః రాజా = నృగమహారాజు, ఆత్మానామ్ = తనను, పాపసంయుక్తమ్ = పాపముతో కూడినవానినిగా, శ్రుత్వా = విని, క్రోధసమన్వితౌ = క్రోధముతో కూడిన, ద్విజౌ = ఆ బ్రాహ్మణులను గూర్చి, కిమ్ = ఏమి, ఉవాచ = పలికెను.

తా. పురుషశ్రేష్ఠా! నృగమహారాజు తనకు శాపము తగిలి నట్లు తెలిసిన పిమ్మట కోపించిన ఆ ఇద్దరి బ్రాహ్మణులతో ఏమనెను?

మూ. లక్ష్మణేనైవముక్తస్తు రాఘవః పునరబ్రవీత్,
శృణు సౌమ్య యథా పూర్వం స రాజా శాపవిక్షతః. 4

ప్ర. అ. లక్ష్మణేన = లక్ష్మణునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, రాఘవః = రాముడు, పునః = మరల, అబ్రవీత్ = పలికెను. సౌమ్య = సౌమ్యుడా! పూర్వమ్ = పూర్వము, సః రాజా = ఆ రాజు, యథా = ఎట్లు, శాపవిక్షతః = శాపముచేత పీడింపబడినాడో, శృణు = వినుము.

తా. లక్ష్మణుని మాటలు విని రాముడు మరల పలికెను. "సౌమ్యుడా! పూర్వము ఆ రాజు ఏ విధముగ శాపముచేత బాధపడెనో వినుము. 4

మూ. అథాధ్వని గతౌ విప్రౌ విజ్ఞాయ స నృపస్తదా,
ఆహూయ మన్త్రిణః సర్వాన్నైగమాన్ సపురోధసః. 5

తానువాచ నృగో రాజా సర్వాశ్చ ప్రకృతీస్తదా,
దుఃఖేన సుసమావిష్టః శ్రూయతాం మే సమాహితైః. 6

ప్ర. ఆ. అథ = ఆటుపిమ్మట, నృపః = నరులను పాలించు, సః = ఆ, నృగః రాజా = నృగమహారాజు, విప్రౌ = బ్రాహ్మణులను, అధ్వని = మార్గమునందు, గతౌ = వెళ్ళిన వారినిగా, విజ్ఞాయ = తెలిసికొని, తదా = అప్పుడు, మన్త్రిణః = మంత్రులను, సర్వాన్ = సమస్తమైన, సపురోధసః = పురోహితునితో కూడిన, నైగమాన్ = ఆ యా సంఘముల పెద్దలను, ఆహూయ = పిలచి, తాన్ = వాళ్ళను గూర్చి, తథా = మరియు, సర్వాః = సమస్తమైన, ప్రకృతీః = ప్రకృతులను గూర్చి, దుఃఖేన = దుఃఖముతో, సుసమావిష్టః = కూడినవాడై, ఉవాచ = పలికెను. సమాహితైః = సావధానచిత్తులైన మీచేత, శ్రూయతామ్ = వినబడుగాక.

తా. పిమ్మట ఆ నృగమహారాజు ఆ బ్రాహ్మణు లిద్దరూ వెళ్ళిపోయినట్లు తెలిసికొని చాల దుఃఖించుచు మంత్రులను, ఆ యా గణముల ముఖ్యులను పురో హితుణ్ణి పిలిపించి, వాళ్ళతోను, మిగిలిన ప్రకృతు లందరితోను ఇట్లు పలికెను. మీరు సావధానచిత్తులై వినుడు. 6

మూ. నారదః పర్వతశ్చైవ మమ దత్త్వా మహద్భయమ్,
గతౌ త్రిభువనం భద్రౌ వాయుభూతావనిన్దితౌ. 7

ప్ర. అ. భద్రౌ = మంగళప్రదులైన, అనిన్దితౌ = నిందింపబడని, నారదః = నారదుడు, పర్వతః చైవ = పర్వతుడు, మమ = నాకు, మహత్ = గొప్ప, భయమ్ = భయమును, దత్త్వా = ఇచ్చి, వాయుభూతౌ = వాయువువంటివారై, త్రిభువనమ్ = మూడులోకములకు, గతౌ = వెళ్ళినారు.

తా. మంగళప్రదులు, నిందావిహీనులూ అయిన, నారదుడు, (అతని మిత్రుడు) పర్వతుడూ నాకు చాల భయంకరమైన విషయము చెప్పి వాయువేగ ముతో త్రిలోకములకు వెళ్ళిరి.

వి. ఈ శ్లోకం అన్వయం సరిగాలేదు. ఉన్నదానికి అర్థం చెప్పాలి కదా అని అర్థం వ్రాయడం జరిగింది. ఆ వచ్చిన ఇద్దరి బ్రాహ్మణుల పేర్లు నారద పర్వతులని కొందరు వ్యాఖ్యాతలు వ్రాసినారు. అయితే వాళ్ళు త్రిభువనాలకి వెళ్లడం ఏమిటి? నారదుడు వలెనే అయన మిత్రుడు పర్వతుడు అనే దేవర్షి ఉన్నా డనీ వీళ్ళిద్దరూ త్రిలోకసంచారం చేస్తూ ఉంటా రనీ పురాణాలలో కథలు ఉన్నాయి. అయితే ఇక్కడ ప్రాచ్య పాఠం బాగున్నది.

"నారదప్రతిమావేతౌ మమ దత్త్వా మహద్భయమ్,
ఉభౌ యాతౌ ద్విజశ్రేష్ఠౌ దేవభూతౌ మహామునీ"

"నారదుని వంటి, దేవతాసదృశులైన ఈ ఇద్దరు బ్రాహ్మణులు నాకు చాలా గొప్ప భయము కలిగించి (శాపమిచ్చి) వెళ్ళిపోయినారు" అని దీని భావం. 7

మూ. కుమారోఽయం వసుర్నామ స చేహాద్యాభిషిచ్యతామ్,
శ్వభ్రం యత్సుఖసంస్పర్శం క్రియతాం శిల్పిభిర్మమ. 8

ప్ర. అ. అయమ్ = ఈ, వసుః నామ = వసువు అను పేరు గల, కుమారః

=నా కుమారు డున్నాడు. సః చ = అతడు, అద్య = ఇప్పుడు, ఇహ = ఇక్కడ అభిషిచ్యతామ్ = అభిషేకించబడుగాక, శిల్పిభిః = శిల్పులచేత, మమ = నాకు, యత్ = ఏది, సుఖసంస్పర్శమ్ = సుఖమైన స్పర్శ గలదో అట్టి, శ్వభ్రం = గొయ్యి, క్రియతామ్ = నిర్మించబడుగాక.

తా. నా కుమారుడైన ఈ వసువును రాజ్యాభిషిక్తుణ్ణి చేయుడు. నా కోసమై శిల్పులచేత స్పర్శసుఖకరముగా ఉండే గొయ్యి నిర్మించబడుగాక. 8

మూ. యత్రాహం సంక్షయిష్యామి శాపం బ్రాహ్మణనిఃసృతమ్,
వర్షఘ్నమేకం శ్వభ్రం తు హిమఘ్నమపరం తథా, 9
గ్రీష్మఘ్నం తు సుఖస్పర్శమేకం కుర్వన్తు శిల్పినః.

ప్ర. అ. అహమ్=నేను, యత్ర = దేనియందు. బ్రాహ్మణనిఃసృతమ్ = బ్రాహ్మణులవలన వచ్చిన, శాపమ్ = శాపమును, సంక్షయిష్యామి = క్షీణింపచేసుకొందునో అట్టి, వర్షఘ్నమ్ = వర్షములను అడ్డుకొను, ఏకం శ్వభ్రం తు = ఒక గోతిని, తథా = మరియు, హిమఘ్నమ్ = మంచును తొలగించు, అపరమ్ = మరొకదానిని, గ్రీష్మఘ్నమ్ = వేడిని అడ్డుకొను, సుఖస్పర్శమ్=సుఖమైన స్పర్శ గల, ఏకమ్ = ఒక గోతిని, శిల్పినః = శిల్పులు, కుర్వన్తు = నిర్మింతురుగాక.

తా. శిల్పులు వర్షబాధ ఉండని ఒక గోతిని, చలివలన బాధ ఉండని మరొక గోతిని, వేడిబాధ లేక స్పర్శసుఖము నిచ్చు వేరొక గోతిని నిర్మింతురుగాక. నేను వాటిలో నివసించి బ్రాహ్మణులవలన వచ్చిన శాపమును క్షీణింపచేసికొందును. 9

మూ. ఫలవన్తశ్చ యే వృక్షాః పుష్పవత్యశ్చ యా లతాః, 10
విరోప్యన్తాం బహువిధాశ్ఛాయావన్తశ్చ గుల్మినః.

ప్ర. అ. ఫలవన్తః = పండ్లుగల, యే = ఏ, వృక్షాః=వృక్షము లున్నవో, పుష్పవత్యః = పుష్పములు గల, యాః=ఏ, లతాః=లతలు గలవో అవి. ఛాయావన్తః=నీడగల, గుల్మినః=పొదలు గల, వివిధాః=అనేకవిధములైన మొక్కలు, విరోప్యన్తామ్ = నాటబడుగాక.

తా. ఆ గోతుల దగ్గర ఫలవృక్షములను, పుష్పములతో నిండిన లతలను నీడ నిచ్చే పొదలుగా పెరిగే మొక్కలను నాటించవలెను. 10

మూ. క్రియతాం రమణీయం చ శ్వభ్రాణాం సర్వతో దిశమ్,
సుఖమత్ర వసిష్యామి యావత్కాలస్య పర్యయః.

ప్ర. అ. శ్వభ్రాణామ్ = గోతులకు, సర్వతోదిశమ్ = అన్ని వైపులా, రమణీయమ్ = సుందరముగా, క్రియతామ్ = చేయబడుగాక, కాలస్య = కాలము యొక్క, పర్యయః = గడచుట, యావత్ = ఎంతవరకు (ఎప్పటికి) జరుగునో, అంతవరకు, అత్ర = ఇక్కడ, సుఖమ్ = సుఖముగా, వసిష్యామి = నివసించెదను.

తా. గోతులకు అన్ని వైపులా సుందరముగా ఉండు నట్లు చేయవలెను. శాపకాలము గడచేవరకు నేను అక్కడ నివసించెదను. 11

మూ. పుష్పాణి చ సుగన్ధీని క్రియన్తాం తేషు నిత్యశః, 12
పరివార్య యథా మే స్యురధ్యర్ధం యోజనం తథా.

ప్ర. అ. అధ్యర్ధమ్ = అర్ధము అధికముగా గల, యోజనమ్ = యోజనమును, మే = నాకు, పరివార్య = చుట్టి, యథా = ఎట్లు, స్యుః = ఉండునో, తథా = అట్లు, తేషు = ఆ ప్రాంతములయందు, సుగన్ధీని = మంచి సువాసన గల, పుష్పాణి = పుష్పములు, నిత్యశః = ఎల్లప్పుడు, క్రియన్తామ్ = చేయబడు గాక.

తా. నా నివాసమునకు చుట్టూ ఒకటిన్నర యోజనముల దూరము నిత్యము సుగంధపుష్పములు ఉండునట్లు ఏర్పాటు చేయవలెను. 12

మూ. ఏవం కృత్వా విధానం స సంనివేశ్య వసుం తథా. 13
ధర్మనిత్యః ప్రజాః పుత్ర క్షత్రధర్మేణ పాలయ,
ప్రత్యక్షం తే యథా శాపో ద్విజాభ్యాం మయి పాలితః,
నరశ్రేష్ఠ సరోషాభ్యామపరాధేఽపి తాదృశే.

ప్ర. అ. సః = నృగమహారాజు, ఏవమ్ = ఇట్లు, విధానమ్ = ఏర్పాటును, కృత్వా = చేసి, తదా = అప్పుడు, వసుమ్ = వసువును, సంనివేశ్య = రాజ్యము నందు నిలిపి (ఇట్లు పలికెను). పుత్ర = పుత్రా! ధర్మనిత్యః = ధర్మమునందు స్థిరుడవై, ప్రజాః = ప్రజలను, క్షత్రధర్మేణ = క్షత్రియధర్మముచేత, పాలయ =

పాలించుము, నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడా! తాదృశే = అట్టి, అపరాధేఽపి = = అపరాధమునందు కూడ, సరోషాభ్యామ్ = కోపముతో కూడిన, ద్విజాభ్యామ్ = బ్రాహ్మణులచేత, మయి = నాయందు, యథా = ఎట్లు, శాపః = శాపము, పాతితః = పడవేయబడినదో, తే = నీకు, ప్రత్యక్షమ్ = ప్రత్యక్షమే.

తా. ఆ నృగమహారాజు ఈ విధానముగా ఏర్పాట్లు చేసికొని పుత్రుణ్ణి రాజ్యాభిషిక్తుని చేసి ఆతని కిట్లు ఉపదేశించెను. "పుత్రా! ధర్మమునందు స్థిరుడవై క్షత్రియధర్మానుసారము ప్రజలను పాలించుము. అలాంటి చిన్న అపరాధానికి కూడా కోపించిన ఆ ఇద్దరు బ్రాహ్మణులూ నాకు ఎట్లు శాప మిచ్చినారో నీవే చూచినావు కదా! 13, 14

మూ. మా కృథాస్త్వానుసంతాపం మత్కృతే హి నరర్షభ, 15
కృతాన్తః కుశలః పుత్ర యేనాస్మి వ్యసనీకృతః.

ప్ర. అ. నరర్షభ = నరులలో శ్రేష్ఠుడా! మత్కృతే = నా నిమిత్తమై, అను సంతాపమ్ = మనస్తాపమును, మా కృథాః = చేయకుము. పుత్ర = పుత్రా! యేన = ఏ దైవముచేత, వ్యసనీ = వ్యసనముకలవాడనుగా, కృతః అస్మి = చేయబడితినో అట్టి, కృతాన్తః = దైవము, కుశలః = సమర్థమైనది.

తా. "నరశ్రేష్ఠా! నా నిమిత్తమై మనస్సులో బాధపడకుము పుత్రా! దైవము (సామర్థ్యము) చాల గొప్పది. ఆ దైవమే నా కీ కష్టము తెచ్చి పెట్టినది".

మూ. ప్రాప్తవ్యాన్యేవ ప్రాప్నోతి గన్తవ్యాన్యేవ గచ్ఛతి, 16
లబ్ధవ్యాన్యేవ లభతే దుఃఖాని చ సుఖాని చ,
పూర్వే జాత్యన్తరే వత్స మా విషాదం కురుష్వ హ. 17

ప్ర. అ. వత్స = వత్సా! పూర్వే = పూర్వమునందలి, జాత్యన్తరే = జన్మాంతరమునందు, (చేసిన కర్మను బట్టి) ప్రాప్తవ్యాన్యేవ = పొందతగినవాటినే, ప్రాప్నోతి = పొందును. గన్తవ్యాన్యేవ = వెళ్ళదగిన స్థానములను గూర్చియే, గచ్ఛతి = వెళ్ళును. లబ్ధవ్యాన్యేవ = పొందతగినవే అయిన, దుఃఖాని చ = దుఃఖములను, సుఖాని చ = సుఖములను, లభతే = పొందును. విషాదమ్ = దుఃఖమును, మా కురుష్వ హ = చేయకుము.

తా. "వత్సా! ప్రతి ఒక్కడూ కూడ పూర్వజన్మలో చేసిన కర్మల ననుసరించి పొందదగిన ధనాదులను పొందును. వెళ్ళవలసిన స్థానములకు వెళ్ళును. రావలసిన దుఃఖములను గాని సుఖములను గాని అనుభవించును. అందుచేత నాకోసమై దుఃఖించకుము." 16, 17

మూ. ఏవముక్త్వా నృగస్తత్ర సుతం రాజా మహాయశాః,
శ్వభ్రం జగామ సుకృతం వాసాయ పురుషర్షభ. 18

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడవైన లక్ష్మణా! మహాయశాః = గొప్ప కీర్తి గల, రాజా = రాజైన, నృపః = నృగమహారాజు, తత్ర = అక్కడ, సుతమ్ = కుమారుణ్ణి గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, సుకృతమ్ = బాగా నిర్మించబడిన, శ్వభ్రమ్ = గోతిని గూర్చి, వాసాయ = నివాసముకొరకు, జగామ = వెళ్ళెను.

తా. లక్ష్మణా! మహాకీర్తిశాలియైన ఆ నృగమహారాజు పుత్రుని కిట్లు బోధించి, చక్కగా ఏర్పరుపబడిన గోతిలో నివసించుటకై వెళ్ళిపోయెను. 18

మూ. ఏవం ప్రవిశ్యైవ నృపస్తదానీం
శ్వభ్రం మహారత్నవిభూషితం తత్,
సంపాదయామాస తదా మహాత్మా
శాపం ద్విజాభ్యాం హి రుషా విముక్తమ్. 19

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
చతుఃపఞ్చాశః సర్గః.

ప్ర. అ. మహాత్మా = మహాత్ముడైన, నృపః = రాజు, తదానీమ్ = అప్పుడు, రత్నవిభూషితమ్ = రత్నములచేత అలంకరించబడిన, మహత్ = గొప్పదైన, తత్ = ఆ, శ్వభ్రమ్ = గోతిని, ఏవమ్ = ఈ విధముగా, ప్రవిశ్యైవ ప్రవేశించి, తదా = అప్పుడు, ద్విజాభ్యామ్ = బ్రాహ్మణులచేత, రుషా = కోపముతో, విముక్తమ్ = విడువబడిన, (ఇవ్వబడిన), శాపమ్ = శాపమును, సంపాదయామాస = సంపాదించెను. (అనుభవించుట ప్రారంభించెను).

తా. మహాత్ముడైన ఆ నృగమహారాజా రత్నములచేత అలంకరించబడిన ఆ పెద్ద గోతిలో ప్రవేశించి, ఆ ఇద్దరు బ్రాహ్మణుల కోపముతో ఇచ్చిన శాప మును అనుభవించుట ప్రారంభించెను. 19

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో ఏబది నాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చపఞ్చాశః సర్గః

[నిమిచక్రవర్తి వసిష్ఠుడు ఒకరి నొకరు శపించుకొని దేహములు త్యజించుట.]

మూ. ఏష తే నృగశాపస్య విస్తరోఽభిహితో మయా,
యద్యస్తి శ్రవణే శ్రద్ధా శృణుష్వేహాపరాం కథామ్. 1

ప్ర. అ. నృగశాపస్య = నృగమహారాజు శాపముయొక్క, ఏషః = ఈ, విస్తరః = విస్తరము, మయా = నాచేత, తే = నీకు, అభిహితః = చెప్పబడినది. శ్రవణే = వినుటయందు, శ్రద్ధా = శ్రద్ధ, అస్తి యది = ఉన్నట్లయితే, ఇహ = ఇక్కడ, అపరామ్ = మరియొక, కథామ్ = కథను, శృణుష్వ = వినుము.

తా. లక్ష్మణా! నృగశాపమును గూర్చిన విశేషములు చెప్పినాను. నీకు శ్రద్ధ ఉన్నచో మరొక కథ చెప్పెదను; వినుము. 1

మూ. ఏవముక్తస్తు రామేణ సౌమిత్రిః పునరబ్రవీత్,
తృప్తిరాశ్చర్యభూతానాం కథానాం నాస్తి మే నృప. 2

ప్ర. అ. రామేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, సౌమిత్రిః = లక్ష్మణుడు, పునః = మరల, అబ్రవీత్ = పలికెను. నృప = రాజా! ఆశ్చర్యభూతానామ్ = ఆశ్చర్యములైన, కథానామ్ = కథల విషయమునందు, మే = నాకు, తృప్తిః = తృప్తి, నాస్తి = = లేదు.

తా. లక్ష్మణుడు రాముని మాటలు విని మరల ఇట్లు పలికెను-"రాజా! ఆశ్చర్యకరములైన కథలు వినుటలో నాకు సంతృప్తి లేదు". 2

మూ. లక్ష్మణేనైవముక్తస్తు రామ ఇక్ష్వాకునన్దనః,
కథాం పరమధర్మిష్ఠాం వ్యాహర్తుముపచక్రమే. 3

ప్ర. అ. లక్ష్మణేన = లక్ష్మణునిచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తః=పలకబడిన, ఇక్ష్వాకునన్దనః = ఇక్ష్వాకువంశమునకు ఆనందకరుడైన, రామః=రాముడు, పరమ ధర్మిష్ఠామ్ = చాల ధర్మయుక్తమైన, కథామ్ = కథను, వ్యాహర్తుమ్ = చెప్పుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. లక్ష్మణు డిట్లు అనగా, ఇక్ష్వాకుకులమునకు ఆనందకరుడైన రాముడు చాల ధర్మసంమతమైన ఒక కథ చెప్పుటకు ఉపక్రమించెను. 3

మూ. ఆసీద్రాజా నిమిర్నామ ఇక్ష్వాకూణాం మహాత్మనామ్,
పుత్రో ద్వాదశమో వీర్యే ధర్మే చ పరినిష్ఠితః. 4

ప్ర. అ. మహాత్మనామ్=మహాత్ములైన, ఇక్ష్వాకూణామ్ = ఇక్ష్వాకుపుత్రులలో, ద్వాదశమః = పండ్రెండవ, పుత్రః = పుత్రుడైన, వీర్యే = పరాక్రమమునందు, ధర్మే చ = ధర్మమునందు, పరినిష్ఠితః = స్థిరుడైన, నిమిః నామ = నిమి అను, రాజా = రాజు, ఆసీత్ = ఉండెను.

తా. మహాత్ములైన ఇక్ష్వాకుపుత్రులలో పండ్రెండవవాడు, పరాక్రమమునందు, ధర్మమునందూ స్థిరుడూ అయిన నిమి అను రాజు ఉండెను. 4

మూ. స రాజా వీర్యసంపన్నః పురం దేవపురోపమమ్,
నివేశయామాస తదా అభ్యాశే గౌతమస్య తు. 5

ప్ర. అ. వీర్యసంపన్నః = పరాక్రమసంపన్నుడైన, సః రాజా = ఆ రాజు, తదా = అప్పుడు, గౌతమస్య = గౌతమునియొక్క, అభ్యాశే = సమీపమునందు, దేవపురోపమమ్=దేవతల పట్టణముతో సమానమైన, పురమ్=పట్టణమును, నివేశయామాస = నిర్మింపచేసెను.

తా. గొప్ప పరాక్రమము గల ఆ రాజు గౌతమాశ్రమముదగ్గర దేవతాపురమైన అమరావతితో సమానమైన నగరమును నిర్మింపచేసెను. 5

మూ. పురస్య సుకృతం నామ వైజయన్తమితి శ్రుతమ్,
నివేశం యత్ర రాజర్షిర్నిమిశ్చక్రే మహాయశాః. 6

ప్ర. అ. పురస్య = ఆ పట్టణమునకు, వైజయన్తమ్ ఇతి = వైజయంతము

అని, ప్రథితమ్ = ప్రసిద్ధమైన, నామ = పేరు, సుకృతమ్ = బాగుగా చేయబడినది. యత్ర = ఎక్కడ. మహాయశాః = గొప్ప కీర్తి గల, రాజర్షిః = రాజర్షియైన, నిమిః = నిమి, నివేశమ్ = నివాసమును, చక్రే = చేసెనో.

తా. ఆ పట్టణమునకు వైజయంతము అను ప్రసిద్ధమైన చక్కని పేరు పెట్టిరి. మహాయశఃశాలీ, రాజర్షీ అయిన నిమి ఆ నగరములో నివాస మేర్పరచు కొనెను. 6

మూ. తస్య బుద్ధిః సముత్పన్నా నివేశ్య సుమహాపురమ్,
యజేయం దీర్ఘసత్రేణ పితుః ప్రహ్లాదయన్మనః. 7

ప్ర. అ. తస్య=అతనికి, సుమహాపురమ్=చాల గొప్పదైన ఆ పురమును, నివేశ్య = నిర్మించి, బుద్ధిః=బుద్ధి, ఉత్పన్నా = పుట్టినది. పితుః=తండ్రియొక్క, మనః = మనస్సును, ప్రహ్లాదయన్=సంతోషపెట్టుచు, దీర్ఘసత్రేణ = దీర్ఘసత్రము చేత, యజేయమ్ = యాగముచేయుదును.

తా. ఆ మహాపురమును నిర్మించిన పిదప ఆతనికి-"తండ్రిగారి మనస్సుకు ఆనందము కలిగించుచు ఒక దీర్ఘసత్రము (కొన్ని సంవత్సరములపాటు చేయ వలసిన యజ్ఞము) చేసెదను"అను బుద్ధి కలిగెను. 7

మూ. తతః పితరమామన్త్ర్య ఇక్ష్వాకుం హి మనోః సుతమ్,
వసిష్ఠం వరయామాస పూర్వం బ్రహర్షిసత్తమమ్. 8

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మనోః = మనువుయొక్క, సుతమ్ = పుత్రుడైన, పితరమ్=తనతండ్రియైన, ఇక్ష్వాకుమ్ = ఇక్ష్వాకువును, ఆమన్త్ర్య= ఆహ్వానించి, పూర్వమ్ = ముందుగా, బ్రహ్మర్షిసత్తమమ్ = బ్రహ్మర్షులలో శ్రేష్ఠుడైన, వసిష్ఠమ్ = వసిష్ఠుణ్ణి, వరయామాస = (ఋత్విక్కుగా) వరించెను.

తా. పిమ్మట అతడు తన తండ్రీ, మనుచక్రవర్తి కుమారుడూ అయిన ఇక్ష్వాకువును ఆహ్వానించి, ముందుగా బ్రహ్మర్షులలో ఉత్తముడైన వసిష్ఠుణ్ణి ఋత్విక్కుగా వరించెను 8

మూ. అనన్తరం స రాజర్షిర్నిమిరిక్ష్వాకునన్దనః,
అత్రిమఙ్గిరసం చైవ భృగుం చైవ తపోనిధిమ్ 9

ప్ర. అ. అనన్తరమ్ = అనంతరము, సః రాజర్షిః = ఆ రాజర్షియైన, ఇక్ష్వాకునన్దనః = ఇక్ష్వాకుపుత్రుడైన, నిమిః = నిమి, అత్రిమ్ = అత్రినీ, అఙ్గిరసం చైవ = అంగిరసుణ్ణి, తపోనిధిమ్ = తపస్సుకు నిధి యైన, భృగుం చైవ = భృగువునూ వరించెను.

తా. పిదప ఇక్ష్వాకుపుత్రుడు రాజర్షి అయిన నిమి అత్రిని, అంగిరసుని, తపోనిధియైన భృగువునూ కూడ వరించెను. 9

మూ. తమువాచ వసిష్ఠస్తు నిమిం రాజర్షిసత్తమమ్,
వృతోహం పూర్వమిన్ద్రేణ అన్తరం ప్రతిపాలయ. 10

ప్ర. అ. వసిష్ఠస్తు = వసిష్ఠుడైతే, రాజర్షిసత్తమమ్ = రాజర్షులలో ఉత్తముడైన, నిమిమ్ = నిమిని గూర్చి, ఉవాచ = పలికెను. అహమ్ = నేను, పూర్వమ్ = ముందుగా, ఇన్ద్రేణ = ఇంద్రునిచేత, వృతః = వరింపబడితిని, అన్తరమ్ = అవకాశమును, ప్రతిపాలయ = నిరీక్షించుము.

తా. వసిష్ఠుడు రాజర్షులలో శ్రేష్ఠుడైన ఆ నిమితో-"నన్ను ముందుగా ఇంద్రుడు వరించి ఉన్నాడు; సమయానికై వేచి ఉండుము"అని పలికెను. 10

మూ. అనన్తరం మహావిప్రో గౌతమః పర్యపూరయత్,
వసిష్ఠోఽపి మహాతేజా ఇన్ద్రయజ్ఞమథాకరోత్. 11

ప్ర. అ. అనన్తరమ్ = అనంతరమునందు, మహావిప్రః = గొప్ప బ్రాహ్మణుడైన, గౌతమః = గౌతముడు, పర్యపూరయత్ = పూరించెను. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, వసిష్ఠః అపి = వసిష్ఠుడు, అథ = అటుపిమ్మట, ఇన్ద్రయజ్ఞమ్ = ఇంద్రుని యజ్ఞమును, అకరోత్ = చేసెను.

తా. పిదప గొప్ప బ్రాహ్మణుడైన గౌతముడు (వసిష్ఠుని స్థానమును) పూరించెను. గొప్పతేజస్సు గల వసిష్ఠుడు ఇంద్రుని యజ్ఞమును చేసెను. 11

మూ. నిమిస్తు రాజా విప్రాంస్తాన్ సమానీయ నరాధిపః,
అయజద్దిమవత్పార్శ్వే స్వపురస్య సమీపతః. 12
పఞ్చ వర్షసహస్రాణి రాజా దీక్షామథాకరోత్.

ప్ర. అ. రాజా = రాజైన, నరాధిపః = నరుల ప్రభువైన, నిమిః తు = నిమి అయితే, తాన్ = ఆ, విప్రాన్ = బ్రాహ్మణులను, సమానీయ = తీసికొనివచ్చి, హిమవత్పార్శ్వే = హిమవత్పర్వతము ప్రక్కన, స్వపురస్య = తన పురముయొక్క, సమీపతః = సమీపమునందు, అయజత్ = యాగము చేసెను. అథ = అటుపిమ్మట, రాజా = రాజు, పఞ్చవర్షసహస్రాణి = ఐదువేల సంవత్సరములు, దీక్షామ్ = దీక్షను, అకరోత్ = చేసెను.

తా. నిమిమహారాజు, ఆ బ్రాహ్మణులను తీసికొని వచ్చి హిమవత్పర్వతము ప్రక్క, తన పురము దగ్గర యజ్ఞము చేసెను. ఆ రాజు ఐదు వేల సంవత్సరములు ఆ యజ్ఞదీక్ష జరిపించెను. 12.

మూ. ఇన్ద్రియజ్ఞావసానే తు వసిష్ఠో భగవాన్ ఋషిః, 13.
సకాశమాగతో రాజ్ఞో హౌత్రం కర్తుమనిన్దితః.

ప్ర. అ. ఇన్ద్రియజ్ఞావసానే = ఇంద్రుని యజ్ఞముయొక్క అంతమునందు, భగవాన్ = పూజ్యుడైన, అనిన్దితః = నిందింపబడని, వసిష్ఠః ఋషిః = వసిష్ఠ మహర్షి, హౌత్రమ్ = హౌత్రమును, కర్తుమ్ = చేయుటకు, రాజ్ఞః = రాజుయొక్క, సకాశమ్ = సమీపమును, ఆగతః = వచ్చినాడు.

తా. ఇంద్రుని యజ్ఞము పూర్తియైన పిమ్మట పూజ్యుడూ, దోషరహితుడూ అయిన వసిష్ఠమహర్షి హోత ఆను ఋత్విక్కుగా ఉండుటకు రాజుదగ్గరికి వచ్చెను.

మూ. తదన్తరమథాపశ్యద్గౌతమేనాభిపూరితమ్, 14.
కోపేన మహతావిష్టో వసిష్ఠో బ్రహ్మణః సుతః,
స రాజ్ఞో దర్శనాకాఙ్క్షీ ముహూర్తం సముపావిశత్. 15.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, తత్ అన్తరమ్ = ఆ అవకాశమును, గౌతమేన = గౌతమునిచేత, అభిపూరితమ్ = నింపబడినదానినిగా, అపశ్యత్ = చూచెను. బ్రహ్మణః = బ్రహ్మయొక్క, సుతః = కుమారుడైన, సః వసిష్ఠః = ఆ వసిష్ఠుడు, మహతా = గొప్ప, కోపేన = కోపముతో, ఆవిష్టః = కూడినవాడై, రాజ్ఞః = రాజుయొక్క, దర్శనాకాఙ్క్షీ = దర్శనమును కోరుచున్నవాడై, ముహూర్తమ్ = ముహూర్తకాలము, సముపావిశత్ = కూర్చుండెను.

తా. పిమ్మట అతడు తన స్థానమును గౌతముడు పూరించినట్లు చూచెను. అప్పుడు బ్రహ్మపుత్రుడైన ఆ వసిష్ఠుడు క్రోధావిష్టుడై రాజును చూచుట కై ముహూర్త కాలము కూర్చుండెను. 14,15

మూ. తస్మిన్నహని రాజర్షిర్నిద్రయాపహృతో భృశమ్,
తతో మన్యుర్వసిష్ఠస్య ప్రాదురాసీన్మహాత్మనః, 16
అదర్శనేన రాజర్షేర్వ్యాహర్తుముపచక్రమే.

ప్ర. అ. తస్మిన్ = ఆ, అహని = దివసమునందు, రాజర్షిః = రాజర్షి, భృశమ్ = మిక్కిలి, నిద్రయా = నిద్రచేత, అపహృతః = అపహరింపబడెను. తతః = అటుపిమ్మట, రాజర్షేః = రాజర్షియొక్క, అదర్శనేన = కనబడకపోవుట చేత, మహాత్మనః = మహాత్ముడైన, వసిష్ఠస్య = వసిష్ఠునకు, మన్యుః = కోపము, ప్రాదురాసీత్ = పుట్టెను. వ్యాహర్తుమ్ = పలుకుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. ఆ రోజున ఆ రాజర్షికి చాల నిద్ర వచ్చెను. ఆ రాజర్షి కనబడకపోవుట చేత మహాత్ముడైన వసిష్ఠునకు కోపము వచ్చెను. అత డిట్లు పలికెను. 16

మూ. యస్మాత్త్వమన్యం వృతవాన్ మామవజ్ఞాయ పార్థివ, 17
చేతనేన వినా భూతో దేహస్తవ భవిష్యతి.

ప్ర. అ. పార్థివ = రాజా! యస్మాత్ = ఎందువలన, మామ్ = నన్ను, అవజ్ఞాయ = అవమానముచేసి, త్వమ్ = నీవు, అన్యమ్ = మరిఒకనిని, వృతవాన్ = వరించినవాడవు, అసి = అయినావో, అందువలన, తవ దేహః = నీ దేహము, చేతనేన వినాభూతః = చైతన్యము లేనిదిగా, భవిష్యతి = కాగలదు.

తా. రాజా! నీవు నన్ను అవమానము చేసి మరొకనిని వరించినావు; అందు వలన నీ దేహము చైతన్యము లేనిది అగుగాక. 17

మూ. తతః ప్రబుద్ధో రాజా తు శ్రుత్వా శాపముదాహృతమ్, 18
బ్రహ్మయోనిమథోవాచ సంరమ్భాత్ క్రోధమూర్ఛితః.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, రాజా తు=రాజైతే, ప్రబుద్ధః=నిద్రనుండి

లేచినవాడై, ఉదాహృతమ్ = పలకబడిన, శాపమ్ = శాపమును, శ్రుత్వా = విని, క్రోధమూర్ఛితః = క్రోధావిష్టుడై, అథ = అటుపిమ్మట, సంరమ్భాత్ = తొందర వలన, బ్రహ్మయోనిమ్ = బ్రహ్మపుత్రుణ్ణి గూర్చి, ఉవాచ = పలికెను.

తా. పిదప మేల్కొనిన రాజు ఆ శాపవాక్యమును విని క్రోధావిష్టుడై బ్రహ్మ పుత్రుడైన వసిష్ఠునితో ఇట్లు పలికెను. 18

మూ. అజానతః శయానస్య క్రోధేన కలుషీకృతః, 19
ఉక్తవాన్మమ శాపాగ్నిం యమదణ్డమివాపరమ్.

ప్ర. అ. క్రోధేన = కోపముచేత, కలుషీకృతః = కలుషముగా చేయబడిన వాడవై, శయానస్య = నిద్రపోవుచున్న, అజానతః = ఏమీ తెలియని, మమ = నాకు, అపరమ్ = మరియొక, యమదణ్డమ్ ఇవ = యమదండము వంటి, శాపాగ్నిమ్ = శాపాగ్నిని, ఉక్తవాన్ = పలికినావు.

తా. నేను స్పృహలేకుండా నిద్రపోవుచున్నప్పుడు నీవు కోపావేశముతో నెండవ యమదండము వంటి శాపాగ్నిని ప్రయోగించినావు. 19

మూ. తస్మాత్తవాపి బ్రహ్మర్షే చేతనేన వినాకృతః, 20
దేహః స రుచిరప్రఖ్యో భవిష్యతి న సంశయః.

ప్ర. అ. బ్రహ్మర్షే !=బ్రహ్మర్షి ! తస్మాత్ = ఆ కారణమువలన, తవ= నీయొక్క, రుచిరప్రఖ్యః = అందమైన కాంతి గల, సః దేహః అపి = దేహము కూడ, చేతనేన వినాకృతః = చైతన్యము లేనిది, భవిష్యతి = కాగలదు; సంశయః = సంశయము, న = లేదు.

తా. బ్రహ్మర్షి! ఆ కారణముచేత మంచి కాంతి గల నీ దేహము కూడ చైతన్యరహితము కాగలదు; సందేహము లేదు. 20

మూ. ఇతి రోషవశాదుభౌ తదానీ
మన్యోన్యం శపితౌ నృపద్విజేన్ద్రౌ,
సహసైవ బభూవతుర్విదేహౌ
తత్తుల్యాధిగతప్రభావవన్తౌ. 21

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
పఞ్చపఞ్చాశః సర్గః.

ప్ర. అ. ఇతి = ఇట్లు, రోషవశాత్ = కోపవశమువలన, అన్యోన్యమ్ = పరస్పరము, శపితౌ = శపించబడిన, తత్తుల్యాధిగతప్రభావవన్తౌ = వారితో సమాన మైనదిగా తెలియబడిన ప్రభావము గల, నృపద్విజేన్ద్రౌ = రాజబ్రాహ్మణులు, ఉభౌ = ఇద్దరూ, తదానీమ్ = అప్పుడు, సహసైవ = వెంటనే, విదేహౌ = దేహములు లేనివారుగా, బభూవతుః = అయిరి.

తా. ప్రభావముచేత ఒకరితో ఒకరు సమాను లని ప్రసిద్ధులైన ఆ నిమి వసిష్ఠులు రోషావేశముచేత ఈ విధముగా ఒకరి నొకరు శపించుకొని అప్పుడు వెంటనే దేహములు లేనివారు అయిరి.

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో యాభై యైదవ సర్గ సమాప్తము.

అథ షట్పఞ్చాశః సర్గః

[బ్రహ్మదేవుడు చెప్పగా వసిష్ఠుడు వరుణుని రేతస్సులో ప్రవేశించుట, వరుణుడు ఊర్వశి సమీపమున ఒక కలశలో తన రేతస్సును ఉంచుట. మిత్రుని శాపముచేత ఊర్వశి భూలోకములో పురూరవుని దగ్గర ఉండి పుత్రుణ్ణి కనుట]

మూ. రామస్య భాషితం శ్రుత్వా లక్ష్మణః పరవీరహా,
ఉవాచ ప్రాఞ్జలిర్భూత్వా రాఘవం దీప్తతేజసమ్. 1

ప్ర. అ. పరవీరహా = శత్రువీరులను చంపు, లక్ష్మణః = లక్ష్మణుడు, రామస్య = రామునియొక్క, భాషితమ్ = మాటను, శ్రుత్వా = విని, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడు, భూత్వా = అయి, దీప్తతేజసమ్ = ప్రకాశించుచున్న తేజస్సు గల, రాఘవమ్ = రాముణ్ణి గూర్చి, ఉవాచ = పలికెను.

తా. శత్రువీరసంహారకుడైన లక్ష్మణుడు రాముని మాటలు విని, అంజలి ఘటించి ప్రకాశించుచున్న తేజస్సు గల రామునితో ఇట్లనెను. 1

మూ. నిక్షిప్య దేహౌ కాకుత్స్థ కథం తౌ ద్విజపార్థివౌ,
పునర్దేహేన సంయోగం జగ్మతుర్దేవసంమతౌ. 2

ప్ర. అ. కాకుత్స్థ=రామా! తౌ=ఆ, దేవసంమతౌ=దేవతలకు ఇష్టులైన, ద్విజపార్థివౌ=బ్రాహ్మణరాజులు, దేహౌ=దేహములను, నిక్షిప్య = ఉంచి, పునః= మరల, దేహేన = దేహముతో, సంయోగమ్ = సంబంధమును, కథమ్ = ఎట్లు, జగ్మతుః = పొందిరి.

తా. రామా! దేవతలకు కూడ పూజ్యులైన ఆ వసిష్ఠనిమిచక్రవర్తులు దేహములను విడిచివేసిన పిమ్మట మరల దేహములను ఎట్లు పొందిరి? 2

మూ. లక్ష్మణేనైవముక్తస్తు రామ ఇక్ష్వాకునన్దనః,
ప్రత్యువాచ మహాతేజా లక్ష్మణం పురుషర్షభః. 3

ప్ర. అ. లక్ష్మణేన = లక్ష్మణునిచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తః=పలకబడిన, ఇక్ష్వాకునన్దనః = ఇక్ష్వాకువంశమునకు ఆనందమును కలిగించు, పురుషర్షభః = పురుషశ్రేష్ఠుడైన, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, రామః = రాముడు, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. లక్ష్మణుని మాటలు విని ఇక్ష్వాకువంశమునకు ఆనందకరుడు, గొప్ప తేజస్సు కలవాడు, పురుషశ్రేష్ఠుడూ అయిన రాముడు లక్ష్మణునితో ఇట్లు పలికెను.

మూ. తౌ పరస్పరశాపేన దేహముత్సృజ్య ధార్మికౌ,
అభూతాం నృపవిప్రర్షీ వాయుభూతౌ తపోధనౌ. 4

ప్ర. అ. ధార్మికౌ=ధార్మికులైన, తౌ=ఆ, నృపవిప్రర్షీ=రాజబ్రహ్మర్షులు, పరస్పరశాపేన=పరస్పరశాపముచేత, దేహమ్ = దేహమును, ఉత్సృజ్య=విడచి, వాయుభూతౌ = వాయువుగా అయిన, తపోధనౌ = మునులుగా, అభూతామ్ = అయిరి.

తా. ధార్మికులైన ఆ రాజర్షిబ్రహ్మర్షులు పరస్పరశాపముచేత దేహమును విడచి వాయురూపములో ఉన్న మునులుగా అయిరి. 4

మూ. అశరీరః శరీరస్య కృతేఽన్యస్య మహామునిః,
వసిష్ఠస్తు మహాతేజా జగామ పితురన్తికమ్. 5

ప్ర. అ. అశరీరః = శరీరము లేని, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, మహామునిః = మహామునియైన, వసిష్ఠః తు = వసిష్ఠుడైతే, అన్యస్య = మరియొక, శరీరస్య కృతే = శరీరముకొరకై, పితుః = తండ్రియొక్క, అన్తికమ్ = సమీపమును గూర్చి, జగామ = వెళ్లెను.

తా. శరీరము లేని మహాతేజఃశాలియైన వసిష్ఠమహాముని మరి యొక శరీరముకొరకై తండ్రి దగ్గరకు వెళ్లెను. 5

మూ. సోఽభివాద్య తతః పాదౌ దేవదేవస్య ధర్మవిత్,
పితామహమథోవాచ వాయుభూత ఇదం వచః. 6

ప్ర. అ. ధర్మవిత్ = ధర్మములను ఎరిగిన, వాయుభూతః = వాయువుగా అయిన, సః = ఆ వసిష్ఠుడు, తతః = అటుపిమ్మట, దేవదేవస్య = ఆ దేవదేవుని యొక్క, పాదౌ = పాదములను, అభివాద్య = నమస్కరించి, అథ = అటుపిమ్మట, పితామహమ్ = బ్రహ్మదేవుని గూర్చి, ఇదమ్ = ఈ, వచః = వచనమును, ఉవాచ = పలికెను.

తా. వాయువుగా అయిన, ధర్మము నెరిగిన ఆ వసిష్ఠుడు ఆ దేవదేవుని పాదాలకు నమస్కరించి ఆ బ్రహ్మదేవునితో ఇట్లు పలికెను. 6

మూ. భగవన్నిమిశాపేన విదేహత్వముపాగమమ్.
దేవదేవ మహాదేవ వాయుభూతోఽహమబ్జజ. 7

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా! దేవదేవ = దేవతలకు దేవుడా! మహాదేవ = మహాదేవా! అబ్జజ = బ్రహ్మదేవుడా! అహమ్ = నేను, నిమిశాపేన = నిమియొక్క శాపముచేత, విదేహత్వమ్ = దేహము లేకపోవుటను, ఉపాగమమ్ = పొందితిని. వాయుభూతః = వాయువుగా అయిపోయితిని.

తా. పూజ్యుడా! దేవదేవా! మహాదేవా! బ్రహ్మదేవా! నేను నిమి ఇచ్చిన శాపమువలన దేహమును కోల్పోయి వాయురూపుడను అయిపోయినాను. 7

మూ. సర్వేషాం దేహహీనానాం మహద్దుఃఖం భవిష్యతి,
లుప్యన్తే సర్వకార్యాణి హీనదేహస్య వై ప్రభో. 8

ప్ర. అ. ప్రభో = ప్రభూ! దేహహీనానామ్ = దేహము లేని, సర్వేషామ్ = అందరికీ, మహత్ = గొప్ప, దుఃఖమ్ = దుఃఖము, భవిష్యతి = అగును, హీన దేహస్య = దేహహీనునియొక్క, సర్వకార్యాణి = సమస్త కార్యములూ, లుప్యన్తే = లోపించును.

తా. ప్రభూ! దేహము లేని అందరికీ చాల దుఃఖము కలుగును. దేహము లేనివాని అన్ని పనులూ లోపించును. 8

మూ. దేహస్యాన్యస్య సద్భావే ప్రసాదం కర్తుమర్హసి,
తమువాచ తతో బ్రహ్మా స్వయంభూరమితప్రభః. 9

ప్ర. అ. అన్యస్య=మరియొక, దేహస్య=దేహముయొక్క, సద్భావే=ఉండుటయందు, ప్రసాదమ్=అనుగ్రహమును, కర్తుమ్=చేయుటకు, అర్హసి=తగిఉన్నావు. తతః=అటుపిమ్మట, స్వయంభూః=స్వయముగా పుట్టిన, అమిత ప్రభః=సాటిలేని కాంతి గల, బ్రహ్మా=బ్రహ్మదేవుడు, తమ్=అతనిని గూర్చి, ఉవాచ=పలికెను.

తా. "నాకు మరొక దేహము ఉండునట్లు అనుగ్రహించుము." అప్పుడు స్వయముగ పుట్టినవాడు, సాటి లేని కాంతి గలవాడూ అయిన బ్రహ్మదేవుడు అతనితో ఇట్లనెను. 9

మూ. మిత్రావరుణజం తేజ ఆవిశ త్వం మహాయశః,
అయోనిజ స్త్వం భవితా తత్రాపి ద్విజసత్తమ, 10
ధర్మేణ మహతా యుక్తః పునరేష్యసి మే వశమ్.

ప్ర. అ. మహాయశః=గొప్ప కీర్తి గలవాడా! త్వమ్=నీవు, మిత్రావరుణజమ్=మిత్రావరుణులవలన పుట్టిన, తేజః=తేజస్సును, ఆవిశ=ప్రవేశించుము. ద్విజసత్తమ=ఓ! బ్రాహ్మణశ్రేష్ఠుడా! తత్రాపి=అక్కడ కూడ, త్వమ్=నీవు, అయోనిజః=గర్భమునుండి పుట్టనివాడవు, భవితా=కాగలవు. మహతా=గొప్ప, ధర్మేణ=ధర్మముతో, యుక్తః=కూడినవాడవై, పునః=మరల, మే=నాయొక్క, వశమ్=వశమును, ఏష్యసి=పొందగలవు.

తా. గొప్ప కీర్తి గలవాడా! నీవు మిత్రావరుణులవలన కలిగిన తేజస్సులో ప్రవేశించుము. నీవు అక్కడకూడ అయోనిజుడవు అయ్యెదవు. ద్విజశ్రేష్ఠుడా! గొప్ప ధర్మముతో కూడినవాడవై మరల నాకు వశుడవు అగుదువు (నావద్దకు వచ్చెదవు). 10

మూ. ఏవముక్తస్తు దేవేన అభివాద్య ప్రదక్షిణమ్, 11
కృత్వా పితామహం తూర్ణం ప్రయయౌ వరుణాలయమ్.

ప్ర. అ. దేవేన=బ్రహ్మదేవునిచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తః=పలుకబడిన వసిష్ఠుడు, పితామహమ్=బ్రహ్మదేవుణ్ణి, ప్రదక్షిణం కృత్వా=ప్రదక్షిణము చేసి, అభివాద్య=నమస్కరించి, తూర్ణమ్=శీఘ్రముగా, వరుణాలయమ్=వరుణుని స్థానమును గూర్చి, ప్రయయౌ=వెళ్లెను.

తా. వసిష్ఠుడు బ్రహ్మదేవుని మాటలు విని ఆయనకు ప్రదక్షిణనమస్కారములు చేసి శీఘ్రముగా వరుణుని నివాసమునకు వెళ్లెను. 11

మూ. తమేవ కాలం మిత్రోఽపి వరుణత్వమకారయత్, 12
క్షీరోదేన సహోపేతః పూజ్యమానః సురేశ్వరైః.

ప్ర. అ. తం కాలమ్ ఏవ=ఆ కాలమునే (నందే), మిత్రోఽపి=మిత్రుడు కూడ, క్షీరోదేన సహ = క్షీరసముద్రముతో, ఉపేతః = కూడినవాడై, సురేశ్వరైః = దేవతానాయకులచేత, పూజ్యమానః = పూజింపబడుచు, వరుణత్వమ్ = వరుణత్వమును (వరుణుడు చేయవలసిన కార్యమును), ఆకారయత్ = చేసెను.

తా. అదే సమయమునందు మిత్రుడు కూడ క్షీరసముద్రమునందు ఉండి, దేవతలు పూజించుచుండగా వరుణత్వమును చేయుచుండెను. 12

మూ. ఏతస్మిన్నేవ కాలే తు ఊర్వశీ పరమాప్సరాః, 13
యదృచ్ఛయా తముద్దేశమాగతా సఖిభిర్వృతా.

ప్ర. అ. ఏతస్మిన్ = ఈ, కాలే ఏవ = కాలమునందే, ఊర్వశీ నామ = ఊర్వశి అను పేరు గల, పరమాప్సరాః = గొప్ప అప్సరఃస్త్రీ, సఖిభిః = సఖురాళ్ళతో, వృతా = కూడినదై, యదృచ్ఛయా=దైవవశముచేత, తమ్=ఆ, ఉద్దేశమ్ = ప్రదేశమును గూర్చి, ఆగతా = వచ్చినది.

తా. ఆ సమయమునందే ఊర్వశి అను అప్సరఃస్త్రీ సఖురాళ్ళతో కలిసి దైవవశముచేత, ఆ ప్రదేశమునకు వచ్చెను. 13

మూ. తాం దృష్ట్వా రూపసంపన్నాం క్రీడన్తీం వరుణాలయే, 14
తదావిశత్పరో హర్షో వరుణం చోర్వశీకృతే.

ప్ర. అ. రూపసంపన్నామ్ = మంచి రూపముతో కూడిన, వరుణాలయే = వరుణుని స్థానమునందు, క్రీడన్తీమ్ = క్రీడించుచున్న, తామ్ = ఆమెను, దృష్ట్వా = చూచి, తదా = అప్పుడు, ఊర్వశీకృతే = ఊర్వశి నిమిత్తమై, వరుణమ్ = వరుణుణ్ణి, పరః = గొప్ప, హర్షః = సంతోషము, ఆవిశత్ = ఆవేశించెను.

తా. వరుణుని స్థానమునందు క్రీడించుచున్న, సౌందర్యవతియైన ఆ

ఊర్వశిని చూడగానే వరుణునకు ఆమె విషయమునందు గొప్ప సంతోషము కలిగెను. 14

మూ. స తాం పద్మపలాశాక్షీం పూర్ణచన్ద్రనిభాననామ్, 15
వరుణో వరయామాస మైథునాయాప్సరోవరామ్.

ప్ర. అ. సః వరుణః = ఆ వరుణుడు, పద్మపలాశాక్షీమ్ = పద్మపత్రముల వంటి నేత్రములు గల, పూర్ణచన్ద్రనిభాననామ్ = పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గల, తామ్ = ఆ, అప్సరోవరామ్ = శ్రేష్ఠమైన అప్సరసను, మైథునాయ = మైథునముకొరకు, వరయామాస = కోరెను.

తా. ఆ వరుణుడు పద్మపత్రములవంటి నేత్రములు, పూర్ణచంద్రుని వంటి ముఖమూ గల ఆ అప్సరసలలో శ్రేష్ఠురాలైన ఊర్వశిని మైథునముకొరకు వరించెను. 15

మూ. ప్రత్యువాచ తతః సా తు వరుణం ప్రాఞ్జలిః స్థితా, 16
మిత్రేణాహం వృతా సాక్షాత్పూర్వమేవ సురేశ్వర.

ప్ర. అ. సా తు = ఆమె యైతే, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలదై, స్థితా = నిలచినదై, వరుణమ్ = వరుణుణ్ణి గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను. సురేశ్వర = ఓ ! దేవతాప్రభూ ! అహమ్ = నేను, సాక్షాత్ = ప్రత్యక్షముగా, మిత్రేణ = మిత్రునిచేత, పూర్వమేవ = ముందుగానే, వృతా = కోరబడితిని.

తా. ఆమె అంజలి ఘటించి నిలచి వరుణునితో ఇట్లనెను- "దేవతల ప్రభూ ! ముందుగా మిత్రుడు నన్ను ప్రత్యక్షముగా వరించి ఉన్నాడు". 16

మూ. వరుణస్త్వబ్రవీద్వాక్యం కన్దర్పశరపీడితః, 17
ఇదం తేజః సముత్సృష్టం కుమ్భేఽస్మిన్ దేవనిర్మితే.

ప్ర. అ. కన్దర్పశరపీడితః = మన్మథుని బాణములచేత పీడింపబడిన, వరుణః తు = వరుణుడైతే, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. ఇదమ్ = ఈ, తేజః = తేజస్సును, అస్మిన్ = ఈ, దేవనిర్మితే = బ్రహ్మదేవునిచేత నిర్మించబడిన, కుమ్భే = కుంభమునందు, సముత్సృష్టం = విడచెదను.

తా. మన్మథశరములచేత పీడింపబడిన వరుణు డిట్లు పలికెను. "బ్రహ్మ దేవుడు నిర్మించిన ఈ కుంభమునందు ఈ తేజస్సును విడచెదను." 17

మూ. భావముత్సృజ సుశ్రోణి మయి త్వం వరవర్ణిని, 18
కృతకామో భవిష్యామి యది నేచ్ఛసి సంగమమ్.

ప్ర. అ. ("ఏవముత్సృజ్య సుశ్రోణి త్వయ్యహం వరవర్ణిని" అను దానికి బదులుగా పైవిధముగా ప్రాచ్యపాఠము గ్రహింపబడినది). సుశ్రోణి = అందమైన పిరుదులు గలదానా! వరవర్ణిని = మంచి వర్ణము గలదానా, త్వమ్=నీవు, మయి = నాయందు, భావమ్ = భావమును (అనురాగమును), ఉత్సృజ = ప్రవర్తింప చేయుము సంగమమ్ = సంగమమును, నేచ్ఛసి యది=ఇచ్ఛయింపకపోయినను, కృతకామః = చేయబడిన కామము కలవాడను, భవిష్యామి = కాగలను.

తా. అందమైన కటిప్రదేశము, మంచి వర్ణమూ గలదానా! నాతో సంగమునకు ఇష్టపడకపోయిననూ నాపై అనురాగము చూపుము. నా కోరిక తీరును. 18

మూ. తస్య తల్లోకనాథస్య వరుణస్య సుభాషితమ్, 19
ఊర్వశీ పరమప్రీతా శ్రుత్వా వాక్యమువాచ హ.

ప్ర. అ. ఊర్వశీ=ఊర్వశి. లోకనాథస్య=లోకపాలుడైన, తస్య వరుణస్య = ఆ వరుణునియొక్క. తత్ సుభాషితమ్ = ఆ మంచి మాటను, శ్రుత్వా = విని, పరమప్రీతా = చాల సంతోషించినదై, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. లోకపాలుడైన వరుణుని ఆ మాటలు విని ఊర్వశి చాల సంతోషించి ఇట్లు పలికెను. 19

మూ. కామమేతద్భవత్వేవం హృదయం మే త్వయి స్థితమ్, 20
భావశ్చాప్యధికం తుభ్యం దేహో మిత్రస్య తు ప్రభో.

ప్ర. అ. ప్రభో = ప్రభూ! కామమ్ = తప్పక, ఏతత్ = ఇది, ఏవమ్= ఇట్లు, భవతు = అగుగాక. మే=నాయొక్క, హృదయమ్=హృదయము, త్వయి = నీయందు, స్థితమ్ = ఉన్నది. భావః చ = భావము కూడ, అధికమ్ = అధికముగా, తుభ్యమ్ = నీకొరకే. దేహః తు = దేహమైతే, మిత్రస్య = మిత్రునికి.

తా. ప్రభూ! తప్పక ఇది ఇట్లే అగుగాక. నా హృదయము నీమీదనే ఉన్నది. భావము కూడ అధికముగా నీకే. నా దేహముమాత్రమే మిత్రునకివ్వ బడినది. 20

మూ. ఉర్వశ్యా ఏవముక్తస్తు రేత స్తన్మహదద్భుతమ్, 21
జ్వలదగ్నిసమప్రఖ్యం తస్మిన్ కుమ్భే న్యవాసృజత్.

ప్ర. అ. ఉర్వశ్యా = ఉర్వశిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలుకబడిన వాడై, తత్ = ఆ, మహత్ = గొప్ప, అద్భుతమ్ = ఆశ్చర్యకరమైన, జ్వలదగ్ని సమప్రఖ్యమ్ = ప్రజ్వలించుచున్న అగ్నితో సమానమైన కాంతి గల, రేతః = రేతస్సును, తస్మిన్ = ఆ, కుమ్భే = కుంభమునందు, న్యవాసృజత్ = విడచెను.

తా. వరుణుడు ఉర్వశి మాటలు విని చాల ఆశ్చర్యకరముగా ఉన్న, ప్రజ్వలించుచున్న అగ్నితో సమానమైన కాంతి గల రేతస్సు ఆ కుంభములో విడచెను.

మూ. ఉర్వశీ త్వగమత్తత్ర మిత్రో వై యత్ర దేవతా, 22
తాం తు మిత్రః సుసంక్రుద్ధ ఉర్వశీమిదమబ్రవీత్.

ప్ర. అ. ఉర్వశీ తు = ఉర్వశియైతే, దేవతా = దేవతయైన, మిత్రః = మిత్రుడు, యత్ర = ఎక్కడ ఉండెనో, తత్ర = అక్కడికి, అగమత్ = వెళ్ళెను. మిత్రః తు = మిత్రుడైతే, సుసంక్రుద్ధః = చాల కోపించినవాడై, తామ్ = ఆ, ఉర్వశీమ్ = ఉర్వశిని గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. ఉర్వశి దేవతయైన మిత్రుడున్న చోటికి వెళ్ళెను. కాని మిత్రుడు చాల కోపించి ఆ ఉర్వశితో ఇట్లనెను. 22

మూ. మయాభిమన్త్రితా పూర్వం కిమర్థమవిశఙ్కితా, 23
భావేనాన్యం వృతవతీ పురుషం దుష్టచారిణీ.

ప్ర. అ. మయా = నాచేత, పూర్వమ్ = ముందుగా, అభిమన్త్రితా = పిలవబడిన, దుష్టచారిణీ = దుష్టముగా ప్రవర్తించు నీవు, కిమర్థమ్ = ఎందువలన, అవిశఙ్కితా = శంక లేనిదానవై, భావేన = భావముచేత, అన్యమ్ = మరియొక, పురుషమ్ = పురుషుణ్ణి, వృతవతీ = వరించినావు?

తా. నిన్ను నేను ముందుగా పిలచితిని కదా; దుష్టముగా ప్రవర్తించు నీవు ఏమాత్రము సందేహము లేక భావముచేత మరొక పురుషుణ్ణి ఎందుకు వరించినావు?

మూ. అనేన దుష్కృతేన త్వం మత్క్రోధకలుషీకృతా, 24
మనుష్యలోకమాస్థాయ కంచిత్కాలం నివత్స్యసి.

ప్ర. అ. మత్క్రోధకలుషీకృతా=నా క్రోధముచేత కలుషము చేయబడిన, త్వమ్ = నీవు, అనేన = ఈ, దుష్కృతేన = పాపముచేత, మనుష్యలోకమ్ = మనుష్యలోకమును, ఆస్థాయ=అధిష్ఠించి, కంచిత్కాలమ్ = కొంత కాలము, నివత్స్యసి = నివసించగలవు.

తా. ఈ చెడ్డ పని చేసినందుకు నా కోపముచేత బాధింపబడిన నీవు మనుష్యలోకమునకు వెళ్ళి అక్కడ కొంత కాలము నివసించగలవు. 24

మూ. బుధస్య పుత్రో రాజర్షిః కాశిరాజః పురూరవాః, 25
తమభ్యాగచ్ఛ దుర్బుద్ధే స తే భర్తా భవిష్యతి.

ప్ర. అ. బుధస్య=బుధునియొక్క, పుత్రః = పుత్రుడు, రాజర్షిః=రాజర్షి, కాశిరాజః = కాశిరాజు అయిన, పురూరవాః = పురూరవు డున్నాడు. దుర్బుద్ధే = ఓ! చెడ్డ బుద్ధి గలదానా! తమ్ = వానిని, అభ్యాగచ్ఛ=పొందుము, సః = అతడు, తే = నీకు, భర్తా = భర్త, భవిష్యతి = కాగలడు.

తా. బుధుని పుత్రుడు, కాశిరాజు అయిన పురూరవు డను రాజర్షి ఉన్నాడు. ఓ! దుర్బుద్ధీ! ఆతనివద్దకు వెళ్లుము, అతడు నీకు భర్త కాగలడు. 25

మూ. తతః సా శాపదోషేణ పురూరవసమభ్యగాత్, 26
ప్రతిష్ఠానే పురవరే బుధస్యాత్మజమౌరసమ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సా = ఆమె, శాపదోషేణ=శాపదోషము చేత, ప్రతిష్ఠానే = ప్రతిష్ఠాన మను, పురవరే = పురశ్రేష్ఠమునందు, బుధస్య = బుధునియొక్క, ఔరసమ్ ఆత్మజమ్=ఔరసపుత్రుడైన, పురూరవసమ్ = పురూరవస్సును గూర్చి, అభ్యగాత్ = వెళ్ళెను.

తా. పిమ్మట ఆమె శాపదోషముచేత ప్రతిష్ఠాన మను నగరములో ఉన్న, బుధుని ఔరసపుత్రుడైన పురూరవసుణ్ణి పొందెను. 26

మూ. తస్య జజ్ఞే తతః శ్రీమానాయుః పుత్రో మహాబలః, 27
నహుషో యస్య పుత్రస్తు బభూవేన్ద్రసమద్యుతిః.

ప్ర. అ. తస్య = ఆతనికి, తతః = ఆమెవల్ల, శ్రీమాన్ = శ్రీమంతుడు, మహాబలః = గొప్ప బలము కలవాడు అయిన, ఆయుః = ఆయువు అను, పుత్రః = పుత్రుడు, జజ్ఞే = పుట్టెను. ఇన్ద్రసమద్యుతిః = ఇంద్రునితో సమానమైన కాంతి గల, నహుషః = నహుషుడు, యస్య = ఎవనియొక్క, పుత్రః = పుత్రుడుగా, బభూవ = ఆయెనో.

తా. ఆ పురూరువునకు ఊర్వశియందు గొప్ప బలము గల శ్రీమంతుడైన ఆయువు అను పుత్రుడు కలిగెను. ఇంద్రునితో సమానమైన కాంతి గల నహుషుడు ఆతని పుత్రుడు. 27

మూ. వజ్రముత్సృజ్య వృత్రాయ ప్రాన్తేఽథ త్రిదివేశ్వరే, 28
శతం వర్షసహస్రాణి యేనేన్ద్రత్వం ప్రశాసితమ్.

ప్ర. అ. వృత్రాయ = వృత్రునకు, వజ్రమ్ = వజ్రమును, ఉత్సృజ్య = విడచి, అథ = అటుపిమ్మట, త్రిదశేశ్వరే = ఇంద్రుడు, ప్రాన్తే = తిరుగుచుండగా, యేన = ఎవనిచేత, శతమ్ = నూరు, వర్షసహస్రాణి = సంవత్సరముల సహస్రములను, ఇన్ద్రత్వమ్ = ఇంద్రత్వము. ప్రశాసితమ్ = శాసింపబడినదో.

తా. ఇంద్రుడు వజ్రముచేత వృత్రుణ్ణి సంహరించిన పిదప తిరుగుచుండగా నహుషుడు లక్ష సంవత్సరముల కాలము ఇంద్రుడై పాలించెను. 28

మూ. సా తేన శాపేన జగామ భూమిం
తదోర్వశీ చారుదతీ సునేత్రా,
బహూని వర్షాణ్యవసచ్చ సుభ్రూ:
శాపక్షయాదిన్ద్రసరో యయౌ చ. 29

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
షట్పఞ్చాశ: సర్గ:.

ప్ర. అ. తదా = అప్పుడు, చారుదతీ = అందమైన దంతములు కలది,

సునేత్రా = మంచి నేత్రములు కలది అయిన, సా ఊర్వశీ = ఆ ఊర్వశి, శాపేన = శాపముచేత, భూమిమ్ = భూమిని గూర్చి, జగామ = వెళ్ళెను. సుభ్రూః = అందమైన కనుబొమ్మలు గల ఆమె, బహూని = అనేకమైన, వర్షాణి = సంవత్సరములను, అవసచ్చ = నివసించెను. శాపక్షయాత్ = శాపము క్షీణించుటవలన, ఇన్ద్రస్య సదః = ఇంద్రుని సభను గూర్చి, యయౌ చ = వెళ్ళెను కూడ.

తా. అందమైన దంతములు, నేత్రములూ, కనుబొమ్మలూ గల ఆ ఊర్వశి శాపముచేత భూలోకమునకు వెళ్ళి చాల సంవత్సరములు అక్కడ ఉండి, శాప కాలము పూర్తి అవగానే ఇంద్రుని సభకు తిరిగి వెళ్ళెను. 29

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో యాభై ఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తపఞ్చాశః సర్గః

[వసిష్ఠుడు క్రొత్త దేహమును పొందుట. నిమి ప్రాణుల నేత్ర ములమీద నివసించుట].

మూ. తాం శ్రుత్వా దివ్యసంకాశాం కథామద్భుతదర్శనామ్,
లక్ష్మణః పరమప్రీతో రాఘవం వాక్యమబ్రవీత్. 1

ప్ర. అ. దివ్యసంకాశామ్ = దివ్యమైనదానితో సమానమైన, అద్భుత దర్శనామ్ = అద్భుతమైన దర్శనముగల, తాం కథామ్ = ఆ కథను, శ్రుత్వా = విని, లక్ష్మణః = లక్ష్మణుడు, పరమప్రీతః = చాల సంతోషించినవాడై, రాఘవమ్ = రాముణ్ణి గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. దివ్యమైన, అద్భుతమైన ఆ కథను విని లక్ష్మణుడు చాల సంతోషించి రామునితో ఇట్లనెను. 1

మూ. నిక్షిప్తదేహౌ కాకుత్స్థ కథం తౌ ద్విజపార్థివౌ,
పునర్దేహేన సంయోగం జగ్మతుర్దేవసంమతౌ. 2

ప్ర. అ. తా. 56వ సర్గ, 2 వ శ్లోకం చూడుడు. 2

మూ. తస్య తద్భాషితం శ్రుత్వా రామః సత్యపరాక్రమః,
తాం కథాం కథయామాస వసిష్ఠస్య మహాత్మనః. 3

ప్ర. అ. తస్య = ఆతనియొక్క, తత్ = ఆ, భాషితమ్ = మాటను, శ్రుత్వా = విని, సత్యపరాక్రమః = సత్యమైన పరాక్రమము గల, రామః = రాముడు, మహాత్మనః = మహాత్ముడైన, వసిష్ఠస్య = వసిష్ఠుని యొక్క, తాం కథామ్ = ఆ కథను, కథయామాస = చెప్పెను.

తా. లక్ష్మణుని మాటలు విని సత్యమైన పరాక్రమము గల రాముడు మహాత్ముడైన వసిష్ఠుని ఆ కథను చెప్పెను. 3

మూ. యః స కుమ్భో రఘుశ్రేష్ఠ తేజఃపూర్ణో మహాత్మనః,
తస్మింస్తేజోమయౌ విప్రౌ సంభూతావృషిసత్తమౌ. 4

ప్ర. అ. రఘుశ్రేష్ఠ = లక్ష్మణా ! మహాత్మనః = మహాత్మునియొక్క, తేజఃపూర్ణః = తేజస్సుతో నిండిన, యః = ఏ, సః = ఆ, కుమ్భః = కుంభమున్నదో, తస్మిన్ = దానియందు, తేజోమయౌ = తేజఃస్వరూపులైన, ఋషిసత్తమౌ = ఋషిశ్రేష్ఠులైన, విప్రౌ = ఇద్దరు బ్రాహ్మణులు, సంభూతౌ = పుట్టిరి.

తా. లక్ష్మణా ! మహాత్ముడైన ఆ వరుణుని తేజస్సు నింపిన ఆ కుంభమునందు తేజఃస్వరూపులు, ఋషిశ్రేష్ఠులూ అయిన ఇద్దరు బ్రాహ్మణులు పుట్టిరి. 4

మూ. పూర్వం సమభవత్తత్ర అగస్త్యో భగవాన్ ఋషిః,
నాహం సుతస్తవేత్యుక్త్వా మిత్రం తస్మాదపాక్రమత్. 5

ప్ర. అ. పూర్వమ్ = ముందుగా, తత్ర = ఆక్కడ, భగవాన్ = భగవంతుడైన, అగస్త్యః ఋషిః = అగస్త్యఋషి, సమభవత్ = పుట్టెను. అహమ్ = నేను, తవ సుతః = నీ కుమారుడను, న = కాను. ఇతి = ఇట్లు, మిత్రమ్ = మిత్రుణ్ణిగూర్చి, ఉక్త్వా = పలికి, తస్మాత్ = దానినుండి, అపాక్రమత్ = వెళ్ళిపోయెను.

తా. ముందుగా భగవంతుడైన అగస్త్యమహాముని జన్మించెను. "నేను నీ పుత్రుడను కాను" అని మిత్రునితో చెప్పి అతడు ఆక్కడినుండి వెళ్ళిపోయెను. రాబోయే శ్లోకాన్ని పట్టి ఆ కుంభమునందు వరుణతేజస్సు కూడ ఉండుటచేత అగస్త్యవసిష్ఠులు మిత్రవరుణుల ఇద్దరి పుత్రులు కాని ఒకరి పుత్రులు కారని భావము అని వ్యాఖ్యాతలు వ్రాసిరి. 5

మూ. తద్ధి తేజస్తు మిత్రస్య ఉర్వశ్యాః పూర్వమాహితమ్,
తస్మిన్ సమభవత్కుమ్భే తత్తేజో యత్ర వారుణమ్. 6

ప్ర. అ. పూర్వమ్ = పూర్వము, మిత్రస్య = మిత్రునియొక్క, తత్ = ఆ, తేజః = తేజస్సు, ఉర్వశ్యాః = ఊర్వశిని నిమిత్తముగా చేసికొని, ఆహితమ్ = ఉంచబడినది. యత్ర = దేనియందు, వారుణమ్ = వరుణిని సంబంధమైన, తత్ = ఆ, తేజః = తేజస్సు ఉన్నదో, తస్మిన్ కుమ్భే = ఆ కుంభమునందు, సమభవత్ = పుట్టెను.

తా. ఊర్వశి నిమిత్తముగా స్ఖలితమైన మిత్రుని తేజస్సు పూర్వము ఆ కుంభమునందు ఉంచబడినది. తరువాత వరుణుని తేజస్సు ఉంచబడినది. ఆ కుంభమునుండియే అగస్త్యుడు పుట్టెను. 6

మూ. కస్య చిత్త్వథ కాలస్య మిత్రావరుణసంభవః,
వసిష్ఠస్తేజసా యుక్తో జజ్ఞే ఇక్ష్వాకుదైవతమ్. 7

ప్ర. అ. అథ = అటుపిమ్మట, కస్యచిత్ కాలస్య = కొంత కాలమునకు, మిత్రావరుణసంభవః = మిత్రావరుణులవలన పుట్టుక గల, తేజసా = తేజస్సుతో, యుక్తః = కూడిన, ఇక్ష్వాకుదైవతమ్ = ఇక్ష్వాకువంశీయుల దేవతయైన, వసిష్ఠః = వసిష్ఠుడు, జజ్ఞే = పుట్టెను.

తా. పిమ్మట కొంతకాలానికి మిత్రావరుణులు కారణముగా గల, తేజఃశాలి యైన ఇక్ష్వాకువంశీయుల దేవతయైన వసిష్ఠుడు పుట్టెను. 7

మూ. తమిక్ష్వాకుర్మహాతేజా జాతమాత్రమనిన్దితమ్,
వవ్రే పురోధసం సౌమ్య వంశస్యాస్య హితాయ నః. 8

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! అనిన్దితమ్ = నిందింపబడని, తమ్ = ఆతనిని, జాతమాత్రమ్ = పుట్టినవెంటనే, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, ఇక్ష్వాకుః = ఇక్ష్వాకువు, నః అస్య వంశస్య = మన ఈ వంశముయొక్క, హితాయ = హితముకొరకు, పురోధసమ్ = పురోహితుణ్ణిగా, వవ్రే = వరించెను.

తా. సౌమ్యుడా ! దోషరహితుడైన ఆ వసిష్ఠుడు పుట్టిన వెంటనే గొప్ప తేజస్సు గల ఇక్ష్వాకువు మన వంశము హితముకొరకు పురోహితుణ్ణిగా వరించెను.

మూ. ఏవం త్వపూర్వదేహస్య వసిష్ఠస్య మహాత్మనః,
కథితో నిర్గమః సౌమ్య నిమేః శృణు యథాభవత్. 9

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! ఏవమ్ = ఈ విధముగా, మహాత్మనః = మహాత్ముడైన, వసిష్ఠస్య = వసిష్ఠునియొక్క, అపూర్వదేహస్య = నూతనదేహము యొక్క, నిర్గమః = బైటకు వచ్చుట (పుట్టుక), కథితః = చెప్పబడినది. నిమేః = నిమికి, యథా = ఎట్లు, అభవత్ = ఆయెనో, శృణు = వినుము.

తా. సౌమ్యా! మహాత్ముడైన వసిష్ఠుని నూతనదేహము ఎట్లు పుట్టినదో చెప్పినాను. నిమి విషయము చెప్పెదను వినుము. 9

మూ. దృష్ట్వా విదేహం రాజానమృషయః సర్వ ఏవ తే,
తం తతో యోజయామాసుర్యాగదీక్షాం మనీషిణః. 10

ప్ర. అ. మనీషిణః = బుద్ధిమంతులైన, సర్వే ఏవ = సమస్తమైన, తే ఋషయః = ఆ ఋషులు, రాజానమ్ = రాజును, విదేహమ్ = దేహములేనివానినిగా, దృష్ట్వా = చూచి, తే = వారు, తమ్ = ఆతనిని, యజ్ఞదీక్షామ్ = యజ్ఞదీక్షను, యోజయామాసుః = కూర్పించిరి.

తా. బుద్ధిమంతులైన ఆ ఋషీశ్వరు లందరూ ఆ రాజు దేహము లేనివాడయినాడని చూచి ఆతనికి యోగదీక్ష ఇచ్చిరి. 10

మూ. తం చ దేహం నరేన్ద్రస్య రక్షన్తి స్మ ద్విజోత్తమాః,
గన్ధైర్మాల్యైశ్చ వస్త్రైశ్చ పౌరభృత్యసమన్వితాః. 11

ప్ర. అ. ద్విజోత్తమాః = ఆ బ్రాహ్మణశ్రేష్ఠులు, పౌరభృత్యసమన్వితాః = పౌరులతోను, భృత్యులతోను కూడినవారై, నరేన్ద్రస్య = రాజుయొక్క, తం దేహమ్ = ఆ దేహమును, గన్ధైః = గంధములచేత, మాల్యైః = మాలలచేత, వస్త్రైః చ = వస్త్రములచేత, రక్షన్తి స్మ = రక్షించిరి.

తా. ఆ బ్రాహ్మణోత్తములు పౌరులతోను, భృత్యులతోను కలిసి, ఆ రాజు దేహమును సుగంధద్రవ్యములచేత, మాలలచేత, వస్త్రములచేత రక్షించిరి. 11

మూ. తతో యజ్ఞే సమాప్తే తు భృగుస్తత్రేదమబ్రవీత్,
ఆనయిష్యామి తే చేతస్తుష్టోఽస్మి తవ పార్థివ. 12

ప్ర. అ. తతః = అటుపిమ్మట, యజ్ఞే = యజ్ఞము, సమాప్తే = సమాప్తమైన దగుచుండగా, తత్ర = ఆక్కడ, భృగుః = భృగువు, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను. పార్థివ = రాజా! తవ = నీ విషయమున, తుష్టః అస్మి = సంతోషించితిని. తే = నీయొక్క, చేతః = చిత్తమును, ఆనయిష్యామి = తీసికొనివచ్చెదను.

తా. పిమ్మట యజ్ఞము సమాప్తమైనది. అక్కడ భృగువు ఇట్లు పలికెను. రాజా ! నీ విషయమున సంతోషించినాను. నీ మనస్సును మరల ఈ దేహములోనికి తీసికొనివచ్చెదను.

వి. ఆత్మ ఆకాశం వలె సర్వత్రా వ్యాపించి ఉండునది. అందుచేత ఒక దేహంలోనికి ఆత్మ రావడం గాని, దేహాన్ని విడిచిపోవడం గాని లేదు. ఇంద్రియాదులతో కూడిన మనస్సే (అంతఃకరణమే) ఒక దేహంలో ప్రవేశిస్తూంటుంది. కొంత కాలానికి దానిని విడిచివేస్తూ ఉంటుంది. ఒక పాత్రని ఒక చోటునుండి మరొకచోటికి తీసికొని వెళ్ళేటప్పుడు వెళ్ళేది ఆ పాత్రే కాని ఆకాశం ఎక్కడికీ వెళ్ళడం లేదు. అట్లే అంతఃకరణం ఎక్కడెక్కడికి ప్రయాణం చేసినా అక్కడల్లా ఆత్మ ఉంటూనే ఉంది. ఆత్మకి కదలిక లేదు. ఇది అద్వైతవేదాంతులు చెప్పే పద్ధతి. ఈ సిద్ధాంతం ప్రకారం చిత్తాన్ని దేహంలో ప్రవేశ పెట్టడం అనగా ఈ దేహాన్ని విడిచిపెట్టి పోయిన చిత్తాన్ని వెనుకకు తీసికొని రావడం అని అర్థం. ఇతరదార్శనికుల అభిప్రాయం ప్రకారం జీవుడు వేరుగా ఉంటాడు. ఒక దేహంలో కొంతకాలం ఉండి, దాన్ని విడచి మరొక దేహంలోకి వెడుతుంటాడు. అందుచేత ఇక్కడ చిత్తాన్ని దేహంలో ప్రవేశ పెట్టడం అనగా ఈ దేహాన్ని విడిచి వెళ్ళిపోయిన జీవుణ్ణి (ఇక్కడ చిత్తం అనగా జీవుడు) మరల తీసికొని రావడం అని అర్థం. ఈ శ్లోకం ప్రాచ్యప్రతిలో లేదు. 12

మూ. సుప్రీతాశ్చ సురాః సర్వే నిమేశ్చేత స్తదాబ్రువన్,
వరం వరయ రాజర్షే క్వ తే చేతో నిరూప్యతామ్. 13

ప్ర. అ. తదా = అప్పుడు, సుప్రీతాః = బాగా సంతోషించిన, సర్వే = సమస్తమైన, సురాః = దేవతలు, నిమేః = నిమియొక్క, చేతః = చిత్తమును గూర్చి, అబ్రువన్ = పలికిరి. రాజర్షే = రాజర్షి ! వరమ్ = వరమును, వరయ = కోరుకొనుము. తే = నీయొక్క, చేతః = చిత్తము, క్వ = ఎక్కడ, నిరూప్యతామ్ = ఉంచబడుగాక.

తా. అప్పుడు దేవత లందరు చాల సంతోషించి నిమి చిత్తముతో ఇట్లనిరి- "రాజర్షి ! మేము చాల సంతోషించినాము. వరమును కోరుకొనుము. నీ చిత్తమును ఎక్కడ ఉంచవలెనో చెప్పుము." 13

మూ. ఏవముక్తః సురైః సర్వైర్నిమేశ్చేతస్తదాబ్రవీత్,
నేత్రేషు సర్వభూతానాం వసేయం సురసత్తమాః. 14

ప్ర. అ. సర్వైః = సమస్తమైన, సురైః = దేవతలచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, నిమేః = నిమియొక్క, చేతః = చిత్తము, తదా = అప్పుడు, అబ్రవీత్ = పలికెను. సురసత్తమాః = దేవతాశ్రేష్ఠులారా ! సర్వభూతానామ్ = సమస్తప్రాణులయొక్క, నేత్రేషు = నేత్రములయందు, వసేయమ్ = నివసించెదను గాక.

తా. ఆ దేవతల మాటలు విని నిమి చిత్తము- "దేవతాశ్రేష్ఠులారా ! నేను సకలప్రాణుల నేత్రములమీద నివసించెదను గాక"అని పలికెను. 14

మూ. బాఢమిత్యేవ విబుధా నిమేశ్చేతస్తదాబ్రువన్,
నేత్రేషు సర్వభూతానాం వాయుభూతశ్చరిష్యసి. 15

ప్ర. అ. తదా = అప్పుడు, విబుధాః = దేవతలు, బాఢమ్ = తప్పక అట్లే, ఇతి ఏవ = అని, నిమేః = నిమియొక్క, చేతః = చిత్తమును గూర్చి, అబ్రువన్ = పలికిరి. వాయుభూతః = వాయువుగా అయి, సర్వభూతానామ్ = సకలప్రాణుల యొక్క, నేత్రేషు = నేత్రములమీద, చరిష్యసి = సంచరించగలవు.

తా. అప్పుడు దేవత లందరూ ''తప్పక అట్లే, నీవు వాయురూపములో ఉండి సమస్తప్రాణుల నేత్రములమీద నివసించెదవు''అని నిమి చిత్తముతో చెప్పిరి.

వి. పైశ్లోకాలలోని 'చిత్త' శబ్దమునకు బదులుగా ప్రాచ్యప్రతిలో 'ఆత్మ' శబ్దము ఉన్నది. ఆప్పుడు అర్థము స్పష్టముగా కుదురును. 15

మూ. త్వత్కృతే చ నిమిష్యన్తి చక్షూంషి పృథివీపతే,
వాయుభూతేన చరతా విశ్రమార్థం ముహుర్ముహుః. 16

ప్ర. అ. పృథివీపతే = రాజా ! వాయుభూతేన = వాయువుగా అయి, చరతా = (నీవు) సంచరించుచుండగా, త్వత్కృతే చ = నీ నిమిత్తమే (నీ మూలముననే), ముహుః ముహుః = మాటిమాటికి, విశ్రమార్థమ్ = విశ్రాన్తికొరకు, చక్షూంషి = నేత్రములను, నిమిష్యన్తి = మూయగలరు.

తా. రాజా ! నీవు వాయురూపముతో సంచరించుచుండగా, ప్రాణు లన్నీ విశ్రాంతికొరకై మాటి మాటికి నీ మూలముననే నేత్రములు మూసికొనుచుండును.

వి. నీవు విశ్రాంతిసుఖమును ఇవ్వగల వని భావమై ఉండును. 'నిమేషం' అనగా 'కనురెప్పపాటు'అని అర్థం. ఈ రాజు పేరు 'నిమి'. ఈ సంబంధాన్ని పట్టి ఈ కథ వచ్చి ఉంటుంది. 16

మూ. ఏవముక్త్వా తు విబుధాః సర్వే జగ్ముర్యథాగతమ్,
ఋషయోఽపి మహాత్మానో నిమేర్దేహం సమాహరన్. 17

ప్ర. అ. సర్వే=సమస్తమైన, విబుధాః = దేవతలు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా =పలికి. యథాగతమ్=వచ్చినట్లుగానే, జగ్ముః=వెళ్ళిరి. మహాత్మానః=మహాత్ములైన, ఋషయః అపి = ఋషులు కూడ, నిమేః = నిమియొక్క, దేహమ్ = దేహమును, సమాహరన్ = తీసికొని వచ్చిరి.

తా. ఇట్లు పలికి దేవత లందరూ వచ్చిన దోవనే వెళ్ళిపోయిరి. మహాత్ములైన ఋషులు ఆ నిమి దేహమును తీసికొని వచ్చిరి. 17

మూ. అరణిం తత్ర నిక్షిప్య మథనం చక్రురోజసా,
మన్త్రిహోమైర్మహాత్మానః పుత్రహేతోర్నిమేస్తదా. 18

ప్ర. అ. తదా = అప్పుడు, మహాత్మానః = మహాత్ములైన ఋషులు, నిమేః = నిమియొక్క, పుత్రహేతోః = పుత్రునికొరకై, తత్ర = ఆ దేహమునందు, అరణిమ్ = అరణిని, నిక్షిప్య=ఉంచి, మన్త్రిహోమైః = మంత్రములతోను హోమములతోను, ఓజసా = బలముతో, మథనమ్ = మథనమును, చక్రుః=చేసిరి.

తా. మహాత్ములైన ఆ ఋషులు అప్పుడు నిమికి కుమారుని పుట్టించుటకై ఆ దేహముమీద అరణిని (యజ్ఞాలకై అగ్నిని పుట్టించడానికి ఉపయోగించే కర్రలకు అరణి అని పేరు) ఉంచి మంత్రములు పఠించుచు, హోమాలు చేయుచు బలముగా మథించిరి. 18

మూ. అరణ్యాం మథ్యమానాయాం ప్రాదుర్భూతో మహాతపాః,
మథనాన్మథిరిత్యాహుర్జననాజ్జనకోఽభవత్. 19

ప్ర. అ. అరణ్యామ్ = అరణి, మథ్యమానాయామ్ = మథింపబడుచున్న దగుచుండగా, మహాతపాః = గొప్ప తపస్సు గల పురుషుడు, ప్రాదుర్భూతః = పుట్టినాడు. మథనాత్ = మథించుటవలన, మిథిః ఇతి = మిథి అని, ఆహుః = చెప్పుదురు. జననాత్ = పుట్టుటవలన, జనకః = జనకుడు, అభవత్ = ఆయెను.

తా. అరణిని మథించగా గొప్ప తపస్సు గల పురుషుడు ఆవిర్భవించెను. మథించుటచేత పుట్టుటచేత "మిథి' అనీ, జనించుటచేత "జనకుడు" అని ఆతనికి పేరు వచ్చెను. 19

మూ. యస్మాద్వి దేహాత్సంభూతో వై దేహస్తు తతః స్మృతః,
ఏవం విదేహరాజశ్చ జనకః పూర్వకోఽభవత్,
మిథిర్నామ మహాతేజాస్తేనాయం మైథిలోఽభవత్. 20

ప్ర. అ. యస్మాత్ = ఏ కారణమువలన, విదేహాత్ = దేహము లేనివాని నుండి, సంభూతః = పుట్టినదో, తతః = ఆ కారణమువలన, వై దేహః = వైదేహుడు అని, స్మృతః = చెప్పబడినాడు. ఏవమ్ = ఈ విధముగా, పూర్వకః = ఆ ప్రాచీన పురుషుడు, విదేహరాజః = విదేహరాజు గాను, జనకః చ = జనకుడు గాను, అభవత్ = ఆయెను. (మిథిర్నామ మహావీర్యో యేన సా మిథిలాభవత్"అను ప్రాచ్య పాఠము బాగున్నది). మహావీర్యః = గొప్పపరాక్రమము గల అతడు, మిథిః నామ = మిథి అను ప్రసిద్ధి గలవాడు. యేన = దేనిచేత, మిథిలా = మిథిలానగరము, అభవత్ = ఆయెనో).

తా. దేహములేని నిమినుండి పుట్టుటచేత ఆ పూర్వపురుషునకు 'విదేహరాజు' 'జనకుడు' అను పేర్లు వచ్చెను. గొప్ప పరాక్రమము గల ఆతనికి ఉన్న 'మిథి'అను ప్రసిద్ధిని పట్టి ఆ 'మిథిలా'నగరమైనది. 20

మూ. ఇతి సర్వమశేషతో మయా
కథితం సంభవకారణం తు సౌమ్య,
నృపపుంగవశాపజం ద్విజస్య
ద్విజశాపాచ్చ యదద్భుతం నృపస్య. 21

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
సప్తషష్ట్యధికశతతమః సర్గః.

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! నృపపుంగవశాపజమ్ = రాజశ్రేష్ఠుని శాపము వలన కలిగిన, ద్విజస్య = బ్రాహ్మణునియొక్క, ద్విజశాపాత్ = బ్రాహ్మణుని శాపమువలన, నృపస్య = రాజుయొక్క, యత్ = ఏ, అద్భుతమ్ = ఆశ్చర్యకర మైన, సంభవకారణమ్ = పుట్టుకకు కారణ మున్నదో అది, సర్వమ్ = సమస్తమూ, అశేషతః = శేషము లేకుండగా, మయా = నాచేత, ఇతి = ఇట్లు, కథితమ్ = చెప్పబడినది.

తా. సౌమ్యుడా ! నిమిచక్రవర్తి శాపమువలన వసిష్ఠునకు, వసిష్ఠుని శాపమువలన నిమిచక్రవర్తికీ ఎట్లు జన్మలు వచ్చినవో ఆశ్చర్యకరమైన ఈ కథను నేను పూర్తిగా నీకు చెప్పినాను. 21

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో యాభైవేడవ సర్గ సమాప్తము.

అథ అష్టపఞ్చాశః సర్గః

[శుక్రాచార్యుడు యయాతిని శపించుట.]

మూ. ఏవం బ్రువతి రామే తు లక్ష్మణః పరవీరహా,
ప్రత్యువాచ మహాత్మానం జ్వలన్తమివ తేజసా. 1

ప్ర. అ. రామే = రాముడు, ఏవమ్ = ఇట్లు, బ్రువతి = పలుకుచుండగా, పరవీరహా = శత్రువీరులను సంహరించు, లక్ష్మణః = లక్ష్మణుడు, తేజసా = తేజస్సుతో, జ్వలన్తమ్ ఇవ = మండుచున్నట్లు ఉన్న, మహాత్మానమ్ = మహాత్ముడైన రాముణ్ణి గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. రాముని మాటలు విని శత్రువీరసంహారకుడైన లక్ష్మణుడు తేజస్సుతో మండుచున్నాడా అన్నట్లు ఉన్న ఆ మహాత్మునితో ఇట్లు పలికెను. 1

మూ. మహదద్భుతమాశ్చర్యం విదేహస్య పురాతనమ్,
నిర్వృత్తం రాజశార్దూల వసిష్ఠస్య మునేశ్చ హ. 2

ప్ర. అ. రాజశార్దూల = రాజశ్రేష్ఠుడా ! విదేహస్య = దేహములేని, వసిష్ఠస్య మునేః = వసిష్ఠమహర్షియొక్క, పురాతనమ్ = ప్రాచీనమైన, నిర్వృత్తమ్ = జరిగిన వృత్తాంతము, మహత్ = గొప్ప, అద్భుతమ్ = అద్భుతము, ఆశ్చర్యం హ = ఆశ్చర్యము.

తా. రాజశ్రేష్ఠా ! దేహము లేని వసిష్ఠునికి సంబంధించిన పూర్వము జరిగిన ఈ వృత్తాంతము చాల అద్భుతము; ఆశ్చర్యకరము. 2

మూ. నిమిస్తు క్షత్రియః శూరో విశేషేణ చ దీక్షితః,
న క్షమం కృతవాన్ రాజా వసిష్ఠస్య మహాత్మనః. 3

ప్ర. అ. క్షత్రియః = క్షత్రియుడు, శూరః = శూరుడు, విశేషేణ = విశేషము

చేత, దీక్షితః చ = దీక్షితుడూ అయిన, రాజా=రాజైన, నిమిః తు=నిమి అయితే, మహాత్మనః = మహాత్ముడైన, వసిష్ఠస్య = వసిష్ఠునకు, క్షమమ్ = తగు విధముగా, న కృతవాన్ = చేయలేదు.

తా. కాని శూరుడైన క్షత్రియుడు విశేషించి దీక్షలో ఉన్నవాడూ అయిన నిమిచక్రవర్తి మహాత్ముడైన వసిష్ఠుని విషయమున తగు విధముగా ప్రవర్తించ లేదు. 3

మూ. ఏవముక్తస్తు తేనాయం రామః క్షత్రియపుంగవః,
ఉవాచ లక్ష్మణం వాక్యం సర్వశాస్త్రవిశారదమ్. 4

ప్ర. అ. తేన = లక్ష్మణునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలుకబడిన, క్షత్రియపుంగవః = క్షత్రియశ్రేష్ఠుడైన, రామః = రాముడు, సర్వశాస్త్రవిశారదమ్ = సకల శాస్త్రములయందు నేర్పు గల, లక్ష్మణమ్=లక్ష్మణుని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. క్షత్రియులలో శ్రేష్ఠుడైన రాముడు లక్ష్మణుని మాటలు విని సకల శాస్త్రములయందు నేర్పు గల ఆ లక్ష్మణునితో ఇట్లు పలికెను. 4

మూ. రామో రమయతాం శ్రేష్ఠో భ్రాతరం దీప్తతేజసమ్,
న సర్వత్ర క్షమా వీర పురుషేషూపలక్ష్యతే. 5

ప్ర. అ. రమయతామ్ = ఆనందింపచేయువారిలో, శ్రేష్ఠః = శ్రేష్ఠుడైన, రామః = రాముడు, దీప్తతేజసమ్=ప్రజ్వరిల్లుచున్న తేజస్సు గల, భ్రాతరమ్ = సోదరుని గూర్చి పలికెను. వీర = వీరుడా ! పురుషేషు = పురుషులలో, సర్వత్ర = అందరియందూ, క్షమా = ఓర్పు, న ఉపలక్ష్యతే = చూడబడుటలేదు.

తా. ఆనందింపచేయువారిలో శ్రేష్ఠుడైన రాముడు సోదరునితో ఇట్లనెను. ఓ ! వీరుడా ! పురుషు లందరిలోను ఓర్పు కనబడదు. 5

మూ. సౌమిత్రే దుఃసహో రోషో యథా క్షాన్తో యయాతినా,
సత్త్వానుగం పురస్కృత్య తన్నిబోధ సమాహితః. 6

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా ! యయాతినా = యయాతిచేత, సత్త్వా

నుగమ్ = సత్త్వగుణమును అనుసరించు మార్గమును, పురస్కృత్య = పురస్కరించుకొని, దుఃసహః = సహింప శక్యము కాని, రోషః = కోపము, యథా = ఎట్లు, క్షాన్తః = సహించబడినదో, తత్ = దానిని, సమాహితః = సావధానచిత్తుడవై, నిబోధ = తెలిసికొనుము.

తా. లక్ష్మణా! యయాతి సత్త్వగుణానుసారియైన మార్గమును అనుసరించి సహింప శక్యము కాని రోషమును ఎట్లు సహించినాడో సావధానచిత్తుడవై తెలిసికొనుము. 6

మూ. నహుషస్య సుతో రాజా యయాతిః పౌరవర్ధనః,
తస్య భార్యాద్వయం సౌమ్య రూపేణాప్రతిమం భువి. 7

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! నహుషస్య = నహుషునియొక్క, సుతః = కుమారుడు, పౌరవర్ధనః = పౌరులను వృద్ధి పొందించువాడూ అయిన, యయాతిః = యయాతి ఉండెను తస్య = ఆతనికి, రూపేణ = రూపముచేత, భువి = భూలోకమునందు, అప్రతిమమ్ = సాటిలేని, భార్యాద్వయమ్ = భార్యాద్వయమున్నది.

తా. సౌమ్యుడా! నహుషుని పుత్రుడు, పౌరులను చక్కగా పాలించువాడు అయిన యయాతి అనే రాజు ఉండెను. ఆతనికి భూలోకములో సాటిలేని రూపము గల ఇద్దరు భార్యలు ఉండిరి. 7

మూ. ఏకా తు తస్య రాజర్షేర్నాహుషస్య పురస్కృతా,
శర్మిష్ఠా నామ దైతేయీ దుహితా వృషపర్వణః. 8

ప్ర. అ. వృషపర్వణః = వృషపర్వునియొక్క, దుహితా = కుమార్తెయైన, దైతేయీ = దైత్యస్త్రీ అయిన, శర్మిష్ఠా నామ = శర్మిష్ఠ అను పేరు గల, ఏకా తు = ఒకతె అయితే, రాజర్షేః = రాజర్షియైన, తస్య = ఆ, నాహుషస్య = నహుషపుత్రునకు, పురస్కృతా = గౌరవింపబడినది.

తా. వృషపర్వుని కుమార్తె అయిన శర్మిష్ఠ అనే ఒక దైత్యస్త్రీ రాజర్షియైన ఆ యయాతికి చాల ప్రేమపాత్రురాలై ఉండెను. 8

మూ. సుతా తూశనసః పత్నీ యయాతేః పురుషర్షభ,
న తు సా దయితా రాజ్ఞో దేవయానీ సుమధ్యమా. 9

ప్ర. అ. పురుషర్షభ=పురుషశ్రేష్ఠుడా ! ఉశనసః=శుక్రాచార్యునియొక్క, సుతా=కుమార్తెయైన, సుమధ్యమా=మంచి నడుము గల, దేవయానీ=దేవయాని, యయాతేః=యయాతియొక్క, పత్నీ=భార్య. సా తు=ఆమె యైతే, రాజ్ఞః=రాజునకు, దయితా=ఇష్టురాలు, న=కాదు.

తా. పురుషశ్రేష్ఠుడా ! శుక్రాచార్యుని పుత్రిక యైన దేవయాని యయాతికి రెండవ భార్య. కాని ఆమె ఆ రాజుకు ఇష్టురాలు కాదు. 9

మూ. తయోః పుత్రౌ తు సంభూతౌ రూపవన్తౌ సమాహితౌ,
శర్మిష్ఠాజనయత్పూరుం దేవయానీ యదుం తదా. 10

ప్ర. అ. తయోః=వారిద్దరికీ, రూపవన్తౌ=రూపము గల, సమాహితౌ=సమాహితమైన, (నిలకడగల) చిత్తము గల, పుత్రౌ=పుత్రులు, సంభూతౌ=పుట్టిరి. తదా=అప్పుడు, శర్మిష్ఠా=శర్మిష్ఠ, పూరుమ్=పూరువును, అజనయత్=కనెను. దేవయానీ=దేవయాని, యదుమ్=యదువును కనెను.

తా. ఆ భార్య లిద్దరికీ రూపవంతులు, సుగుణవంతులూ అయిన ఇద్దరు కుమారులు జనించిరి. శర్మిష్ఠ పూరువును, దేవయాని యదువును కనెను. 10

మూ. పూరుస్తు దయితో రాజ్ఞో గుణైర్మాతృకృతేన చ,
తతో దుఃఖసమావిష్టో యదుర్మాతరమబ్రవీత్. 11

ప్ర. అ. పూరుస్తు=పూరువైతే, గుణైః=గుణములచేతను, మాతృకృతేన చ=తల్లి కారణముచేతను, రాజ్ఞః=రాజునకు, దయితః=ఇష్టుడు. తతః=ఆ కారణమువలన, దుఃఖసమావిష్టః=దుఃఖముతో కూడిన, యదుః=యదువు, మాతరమ్=తల్లిని గూర్చి, అబ్రవీత్=పలికెను.

తా. పూరువు తన సద్గుణములచేతా, తల్లిని పట్టి కూడ తండ్రికి చాల ఇష్టుడయ్యెను. అందువలన యదువు దుఃఖావిష్టుడై తల్లితో ఇట్లు పలికెను. 11

మూ. భార్గవస్య కులే జాతా దేవస్యాక్లిష్టకర్మణః,
సహసే హ్యార్దతం దుఃఖమవమానం చ దుఃసహమ్. 12

ప్ర. అ. దేవస్య = దేవుడు, అక్లిష్టకర్మణః = శ్రమలేని పనులు గల, భార్గవస్య = శుక్రాచార్యునియొక్క, కులే = కులమునందు, జాతా = పుట్టిన నీవు, హ్యార్దతమ్ = హృదయములో ఉన్న, దుఃఖమ్ = దుఃఖమును, దుఃసహమ్ = సహింపశక్యముకాని, అవమానం చ = అవమానమునూ, సహసే = సహించుచున్నావు!

తా. నీవు! దేవతాస్వరూపుడు, అనాయాసముగ కర్మలు సాధించగల వాడూ అయిన శుక్రాచార్యుని కులమందు పుట్టి ఈ విధముగా హృదయములో ఉన్న దుఃఖమునూ, సహింప శక్యము కాని అవమానమునూ సహించుచున్నావు! 12

మూ. ఆవాం చ సహితౌ దేవి ప్రవిశావ హుతాశనమ్,
రాజా తు రమతాం సార్ధం దైత్యపుత్ర్యా బహూక్షపాః. 13

ప్ర. అ. దేవి = దేవీ! ఆవామ్ = మన మిద్దరమూ, సహితౌ = కలిసిన వాళ్ళమై, హుతాశనమ్ = అగ్నిని, ప్రవిశావ = ప్రవేశించెదము. రాజా తు = రాజైతే, దైత్యపుత్ర్యా సార్ధమ్ = దైత్యుని కుమార్తెతో కూడ, బహూక్షపాః = చాల రాత్రులు, రమతామ్ = క్రీడించుగాక.

తా. దేవీ! మన మిద్దరమూ కలిసి అగ్నిలో ప్రవేశించెదము. రాజును శర్మిష్ఠతో కలిసి అనేకరాత్రులు రమించ నిమ్ము. 13

మూ. యది వా సహనీయం తే మామనుజ్ఞాతుమర్హసి,
క్షమ త్వం న క్షమిష్యేఽహం మరిష్యామి న సంశయః.

ప్ర. అ. తే = నీకు, సహనీయం యది వా = సహించదగినదైతే, మామ్ = నన్ను, అనుజ్ఞాతుమ్ = అనుమతించుటకు, అర్హసి = తగి ఉన్నావు. త్వమ్ = నీవు, క్షమ = ఓర్చుకొనుము. అహమ్ = నేను, న క్షమిష్యే = ఓర్చుకొనను. మరిష్యామి = మరణించెదను. సంశయః = సంశయము, న = లేదు.

తా. నీవు సహించకలిగినచో నాకు అనుమతి ఇమ్ము. నీవు ఓర్పు వహించుము. నేను మాత్రము ఓర్పు వహించజాలను; మరణించెదను. సందేహము లేదు.

మూ. పుత్రస్య భాషితం శ్రుత్వా పరమార్తస్య రోదతః,
దేవయానీ తు సంక్రుద్ధా సస్మార పితరం తదా. 15

ప్ర. అ. దేవయానీ తు = దేవయాని యైతే, పరమార్తస్య = మిక్కిలి దుఃఖితుడైన, రోదతః = ఏడ్చుచున్న, పుత్రస్య = పుత్రునియొక్క, భాషితమ్ = మాటను, శ్రుత్వా = విని, సంక్రుద్ధా = కోపించినదై, తదా = అప్పుడు, పితరమ్ = తండ్రిని, సస్మార = స్మరించెను.

తా. అప్పుడు, చాల దుఃఖించుచు ఏడ్చుచున్న పుత్రుని మాటలు విని దేవయాని చాల కోపించి తండ్రిని స్మరించెను. 15

మూ. ఇఙ్గితం తదభిజ్ఞాయ దుహితుర్భార్గవస్తదా,
ఆగత స్త్వరితం తత్ర దేవయానీ స్మ యత్ర సా. 16

ప్ర. అ. తదా = అప్పుడు, భార్గవః = శుక్రుడు, దుహితుః = కుమార్తె యొక్క, తత్ = ఆ, ఇఙ్గితమ్ = మనస్సులోని అభిప్రాయమును, అభిజ్ఞాయ = తెలుసుకొని, సా దేవయానీ = ఆ దేవయాని, యత్ర = ఎక్కడ ఉన్నదో, తత్ర = అక్కడికి, త్వరితమ్ = శీఘ్రముగా, ఆగతః = వచ్చినాడు.

తా. అప్పుడు శుక్రాచార్యులు కుమార్తె మనస్సులోని అభిప్రాయమును తెలిసికొని, వెంటనే ఆమె ఉన్న చోటికి వచ్చెను. 16

మూ. దృష్ట్వా చాప్రకృతిస్థాం తామప్రహృష్టామచేతనామ్,
పితా దుహితరం వాక్యం కిమేతదితి చాబ్రవీత్. 17

ప్ర. అ. అప్రకృతిస్థామ్ = స్వస్థురాలుగా లేని, అప్రహృష్టామ్ = సంతోషించని, అచేతనామ్ = ఆలోచనలేని, తామ్ = ఆ, దుహితరమ్ = కుమార్తెను, దృష్ట్వా = చూచి, పితా = తండ్రి, ఏతత్ = ఇది, కిమ్ = ఏమి, ఇతి చ = అని, అబ్రవీత్ = పలికెను.

తా. సంతోషము లేక. ఆలోచనాశక్తి ఉడిగి అస్వస్థురాలుగా ఉన్న కూతురును చూచి తండ్రి "ఇది ఏమి?" అని అడిగెను. 17

మూ. పృచ్ఛన్తమసకృత్తం వై భార్గవం దీప్తచేతసమ్,
దేవయానీ తు సంక్రుద్ధా పితరం వాక్యమబ్రవీత్. 18

ప్ర. అ. అసకృత్ = మాటిమాటికి, పృచ్ఛన్తం = అడుగుచున్న, దీప్త చేతసమ్=మండుచున్న మనస్సు గల, పితరమ్=తండ్రియైన, తం భార్గవమ్ = ఆ శుక్రాచార్యుని గూర్చి, సంక్రుద్ధా=కోపించిన, దేవయానీ = దేవయాని, వాక్యం- = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. మాటిమాటికి అడుగుచున్న, మనస్సులో మండిపడుచున్న తండ్రియైన ఆ శుక్రాచార్యునితో దేవయాని కోపముతో ఇట్లు పలికెను. 18

మూ. అహమగ్నిం విషం తీక్ష్ణమపో వా మునిసత్తమ,
భక్షయిష్యే ప్రవేక్ష్యే వా న తు శక్ష్యామి జీవితుమ్. 19

ప్ర. అ. మునిసత్తమ = మునిశ్రేష్ఠా! అహమ్=నేను, అగ్నిమ్ = అగ్నిని- కాని, అపః వా = జలమును కాని, ప్రవేక్ష్యే = ప్రవేశించెదను. తీక్ష్ణమ్ = తీక్ష్ణమైన, విషం వా = విషమునైనా, భక్షయిష్యే = భక్షించెదను. తు=కాని, జీవితుమ్ = జీవించుటకు, న శక్ష్యామి = సమర్థురాలను కాను.

తా. ఓ! మునీశ్వరా! నేను అగ్నిలో గాని, ఉదకములో గాని పడెదను. లేదా తీక్ష్ణమైన విషమును తినెదను; కాని జీవించజాలను. 19

మూ. న మాం త్వమవజానీషే దుఃఖితామవమానితామ్,
వృక్షస్యావజ్ఞయా బ్రహ్మంశ్ఛిద్యన్తే వృక్షజీవినః. 20

ప్ర. అ. త్వమ్=నీవు, మామ్=నన్ను, దుఃఖితామ్=దుఃఖితురాలనుగాను, అవమానితామ్=అవమానించబడినదాననుగాను, న అవజానీషే = తెలుసుకొనుట లేదు. బ్రహ్మన్ = ఓ! బ్రాహ్మణా! వృక్షస్య = వృక్షముయొక్క, అవజ్ఞయా = అనాదరముచేత, వృక్షజీవినః=వృక్షమును ఆధారముగా చేసికొని జీవించే ప్రాణులు, ఛిద్యన్తే = చేదింపబడును (పీడింపబడును).

తా. నేను దుఃఖించుచున్నట్లు, అవమానింపబడినట్లు నీవు తెలుసుకొనుట లేదు. బ్రాహ్మణా! చెట్టును అవమానించుటచే ఆ చెట్టును ఆశ్రయించి జీవించు ప్రాణులకు బాధ కలుగును. 20

మూ. అవజ్ఞయా చ రాజర్షిః పరిభూయ చ భార్గవ,
మయ్యవజ్ఞాం ప్రయుఙ్క్తే హి న చ మాం బహుమన్యతే.

ప్ర. అ. భార్గవ = శుక్రాచార్యా ! రాజర్షిః = రాజర్షి, అవజ్ఞయా = నీయందు అనాదరముచేత, పరిభూయ = తిరస్కరించి, మయి = నాయందు, అవజ్ఞామ్ = అనాదరమును, ప్రయుఙ్క్తే = ప్రయోగించుచున్నాడు. మామ్ = నన్ను, న బహుమన్యతే చ = గౌరవించుటలేదు కూడ.

తా. శుక్రాచార్యా! ఈ రాజర్షి నీయందు అనాదరముచేత నిన్ను తిరస్కరించి నాయందు కూడ అనాదరము చూపుచున్నాడు. నన్ను గౌరవించుటలేదు.

మూ. తస్యాస్తద్వచనం శ్రుత్వా శోకేనాభిపరిప్లుతః,
వ్యాహర్తుముపచక్రామ భార్గవో నహుషాత్మజమ్. 22

ప్ర. అ. తస్యాః = ఆమెయొక్క, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, భార్గవః = శుక్రుడు, శోకేన = శోకముతో, అభిపరిప్లుతః = నిండినవాడై, నహుషాత్మజమ్ = యయాతిని గూర్చి, వ్యాహర్తుమ్ = పలుకుటకు, ఉపచక్రామ = ఉపక్రమించెను.

తా. శుక్రాచార్యుడు ఆమె మాటలు విని కోపావిష్టుడై యయాతిని గూర్చి ఇట్లనెను. 22

మూ. యస్మాన్మామవజానీషే నాహుష త్వం దురాత్మవాన్,
వయసా జరయా జీర్ణః శైథిల్యముపయాస్యసి. 23

ప్ర. అ. నాహుష = నహుషపుత్రుడా! త్వమ్ = నీవు, దురాత్మవాన్ = చెడ్డ బుద్ధి కలవాడవై, యస్మాత్ = ఎందువలన, మామ్ = నన్ను, అవజానీషే = అవమానించుచువ్నావో, జరయా వయసా = ముసలితనముచేత, జీర్ణః = జీర్ణుడవై, శైథిల్యమ్ = శిథిలత్వమును, ఉపయాస్యసి = పొందగలవు.

తా. ఓ ! యయాతీ ! దుర్బుద్ధివైన నీవు నన్ను అవమానించుచున్నావు. అందుచే ముసలితనముచేత జీర్ణుడవై శిథిలత్వమును పొందగలవు. 23

మూ. ఏవముక్త్వా దుహితరం సమాశ్వాస్య స భార్గవః,
పునర్జగామ బ్రహ్మర్షిర్భవనం స్వం మహాయశాః. 24

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గల, బ్రహ్మర్షిః = బ్రహ్మర్షియైన, సః భార్గవః = ఆ శుక్రుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, దుహితరమ్ = కుమార్తెను, సమాశ్వాస్య = ఓదార్చి, పునః = తిరిగి, స్వభవనమ్ = తన భవనమును గూర్చి, జగామ = వెళ్ళెను.

తా. గొప్ప కీర్తి గల బ్రహ్మర్షి యైన ఆ శుక్రుడు ఇట్లు శపించి, కుమార్తెను ఓదార్చి, మరల తన ఇంటికి వెళ్ళిపోయెను. 24

మూ. స ఏవముక్త్వా ద్విజపుంగవాగ్ర్యః
సుతాం సమాశ్వాస్య చ దేవయానీమ్,
పునర్యయౌ సూర్యసమానతేజా
దత్త్వా చ శాపం నహుషాత్మజాయ. 25

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
అష్టపఞ్చాశః సర్గః.

ప్ర. అ. సూర్యసమానతేజాః = సూర్యునితో సమానమైన తేజస్సు గల, ద్విజపుంగవాగ్ర్యః = బ్రాహ్మణశ్రేష్ఠులలో మొదటివాడైన, సః = ఆ శుక్రుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, సుతామ్ = కుమార్తెయైన, దేవయానీమ్ = దేవయానిని, సమాశ్వాస్య = ఓదార్చి, నహుషాత్మజాయ = యయాతికి, శాపం చ = శాపమును కూడ, దత్త్వా = ఇచ్చి, పునః = తిరిగి, యయౌ = వెళ్ళెను.

తా. సూర్యునితో సమానమైన తేజస్సు గల, బ్రాహ్మణోత్తములలో మొదటివాడైన ఆ శుక్రాచార్యులు, ఇట్లు పలికి, కుమార్తెయైన దేవయానిని ఓదార్చి, యయాతికి శాప మిచ్చి, మరల వెళ్ళిపోయెను.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
యాభైఎనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనషష్టితమః సర్గః

[యయాతి పుత్రుడైన పూరువునకు తన వార్ధక్యము నిచ్చి అతని యౌవనమును తీసికొనుట. భోగము లనుభవించి తృప్తుడైన పిమ్మట ఆతడు చాలకాలానికి అతని యౌవనమును తిరిగి ఇచ్చివేయుట. పూరువును రాజ్యమునందు అభిషేకించుట. యదువును శపించుట].

మూ. శ్రుత్వా తూశనసం క్రుద్ధం తదార్తో నహుషాత్మజః,
జరాం పరమికాం ప్రాప్య యదుం వచనమబ్రవీత్. 1

ప్ర. అ. ఉశనసమ్ = శుక్రాచార్యుణ్ణి, క్రుద్ధమ్ = కోపించినవానినిగా, శ్రుత్వా = విని, నహుషాత్మజః = యయాతి, తదా = అప్పుడు, ఆర్తః = దుఃఖితుడై, పరమికామ్ = గొప్ప, జరామ్ = ముసలితనమును, ప్రాప్య = పొంది, యదుమ్ = యదువును గూర్చి, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. అప్పుడు యయాతి శుక్రాచార్యుడు కోపించినట్లు తెలిసికొని చాలా దుఃఖితుడై, చాల ముసలివాడై, యదువుతో ఇట్లు పలికెను. 1

మూ. యదో త్వమసి ధర్మజ్ఞో మదర్థం ప్రతిగృహ్యతామ్,
జరా పరమికా పుత్ర భోగై రంస్యే మహాయశః. 2

ప్ర. అ. మహాయశః = గొప్ప కీర్తి గలవాడా! పుత్ర = పుత్రా! యదో = యదూ! త్వమ్ = నీవు, ధర్మజ్ఞః = ధర్మములు తెలిసినవాడవు, అసి = అయి ఉన్నావు. మదర్థమ్ = నాకొరకై, పరమికా = గొప్పదైన, జరా = ముసలితనము, ప్రతిగృహ్యతామ్ = స్వీకరించబడుగాక. భోగైః = భోగములతో, రంస్యే = క్రీడించెదను.

తా. గొప్ప కీర్తి గల పుత్రా! యదూ! నాకు సాహాయ్యము చేయుటకై

ఈ అధికమైన ముసలితనమును నీవు తీసికొనుము. నేను భోగములు అనుభవించె దను. 2

మూ. న తావత్కృతకృత్యోఽస్మి విషయేషు నరర్షభ,
అనుభూయ తదా కామం తతః ప్రాప్స్యామ్యహం జరామ్.

ప్ర. అ. నరర్షభ = పురుషశ్రేష్ఠుడా! విషయేషు = భోగములయందు, కృతకృత్యః = కృతకృత్యుడను (తృప్తి చెందినవాడను), న తావత్ అస్మి = కాలేదు. తదా = అప్పుడు, కామమ్ = కామమును, అనుభూయ = అనుభవించి, తతః = అటుపిమ్మట, అహమ్ = నేను, జరామ్ = ముసలితనమును, ప్రాప్స్యామి = పొందెదను.

తా. పురుషశ్రేష్ఠుడా! నాకు భోగాలయందు తృప్తి కలుగలేదు. కామము లను అనుభవించి పిమ్మట మరల ముసలితనమును తీసికొనెదను. 3

మూ. యదుస్తద్వచనం శ్రుత్వా ప్రత్యువాచ నరర్షభమ్,
పుత్రస్తే దయితః పూరుః ప్రతిగృహ్ణాతు వై జరామ్. 4

ప్ర. అ. యదుః = యదువు, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, నరర్షభమ్ = మనుష్యశ్రేష్ఠుణ్ణి గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను. తే = నీకు, దయితః = ఇష్టుడైన, పుత్రః = పుత్రుడైన, పూరుః = పూరువు, జరామ్ = ముసలితనమును, ప్రతిగృహ్ణాతు వై = తీసికొనుగాక.

తా. ఆ మాట విని యదువు రాజుతో ఇట్లు పలికెను. "నీ ప్రియపుత్రు డైన పూరువు నీ ముసలితనమును తీసికొనుగాక". 4

మూ. బహిష్కృతోఽహమర్థేషు సంనికర్షాచ్చ పార్థివ,
ప్రతిగృహ్ణాతు వై రాజన్యైః సహాశ్నాసి భోజనమ్. 5

ప్ర. అ. పార్థివ = రాజా! అహమ్ = నేను, అర్థేషు = కార్యములయందు, సంనికర్షాత్ చ = సామీప్యమునుండి, బహిష్కృతః = బహిష్కరించబడితిని, రాజన్ = రాజా! యైః సహ = ఎవరితో కూడి, భోజనమ్ = భోజనమును, అశ్నాసి = తినుచున్నావో అతడు, ప్రతిగృహ్ణాతు వై = తీసికొను గాక.

తా. రాజా! నన్ను రాజకార్యములనుండి, సామీప్యమునుండి దూరముగా ఉంచినావు. రాజా! ఎవరితో కలిసి భోజనము చేయుచున్నావో అతడే నీ ముసలి తనమును తీసుకొనుగాక. 5

మూ. తస్య తద్వచనం శ్రుత్వా రాజా పూరుమథాబ్రవీత్,
ఇయం జరా మహాబాహో మదర్థం ప్రతిగృహ్యతామ్. 6

ప్ర. అ. తస్య = వానియొక్క, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, అథ = అటుపిమ్మట, రాజా = రాజు, పూరుమ్ = పూరువును గూర్చి, అబ్రవీత్ = పలికెను. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా! ఇయం జరా = ఈ ముసలితనము, మదర్థమ్ = నా కొరకై, ప్రతిగృహ్యతామ్ = ప్రతిగ్రహింపబడుగాక.

తా. రాజు వాని మాటలు విని పిదప పూరువుతో "ఓ మహాబాహూ! నాకు ఉపకారము జరుగుటకై ఈ ముసలితనము నీపైకి తీసికొనుము" అని పలికెను. 6

మూ. నాహుషేణైవముక్తస్తు పూరుః ప్రాఞ్జలిరబ్రవీత్,
ధన్యోఽస్మ్యనుగృహీతోఽస్మి శాసనేఽస్మి తవ స్థితః. 7

ప్ర. అ. నాహుషేణ = నహుషుని పుత్రునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, పూరుః = పూరువు, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, అబ్రవీత్ = పలికెను. ధన్యః = ధన్యుడను, అస్మి = అయినాను. అనుగృహీతః = అనుగ్రహించబడినవాడను, అస్మి = అయి ఉన్నాను. తవ = నీయొక్క, శాసనే = శాసనమునందు, స్థితః = ఉన్నాను.

తా. యయాతి మాటలు విని పూరువు అంజలి ఘటించి- "ధన్యుడనైతిని, అనుగ్రహింపబడితిని, నీ ఆజ్ఞను అనుసరించుచున్నాను" అని పలికెను. 7

మూ. పూరోర్వచనమాజ్ఞాయ నాహుషః పరయా ముదా,
ప్రహర్షమతులం లేభే జరాం సంక్రామయచ్చ తామ్. 8

ప్ర. అ. పూరోః = పూరువుయొక్క, వచనమ్ = వచనమును, ఆజ్ఞాయ = తెలిసికొని, నాహుషః = యయాతి, పరమయా = గొప్ప, ముదా = సంతోషముతో,

తామ్ = ఆ, జరామ్ = ముసలితనమును, సంక్రామయత్ = సంక్రమింపచేసెను. అతులమ్ = సాటిలేని, ప్రహర్షమ్ = ఆనందమును, లేభే = పొందెను.

తా. యయాతి పూరువు పలికిన మాటలు విని గొప్ప ఆనందముతో తన ముసలితనమును అతనికి సంక్రమింపజేసి చాల సంతోషించెను. 8

మూ. తతః స రాజా తరుణః ప్రాప్య యజ్ఞాన్ సహస్రశః,
బహువర్షసహస్రాణి పాలయామాస మేదినీమ్. 9

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తరుణః = యువకుడైన, సః రాజా = ఆ రాజు, సహస్రశః = వేలకొలది, యజ్ఞాన్ = యజ్ఞములను, ప్రాప్య = పొంది, బహువర్షసహస్రాణి = చాల వేల సంవత్సరములను, మేదినీమ్ = భూమిని, పాలయామాస = పాలించెను.

తా. పిమ్మట యువకుడైన ఆ రాజు వేలకొలది యజ్ఞములు చేసి చాలా వేల సంవత్సరములు రాజ్యము చేసెను. 9

మూ. అథ దీర్ఘస్య కాలస్య రాజా పూరుమథాబ్రవీత్,
ఆనయస్వ జరాం పుత్ర న్యాసం నిర్యాతయస్వ మే. 10

ప్ర. అ. అథ = అటుపిమ్మట, దీర్ఘస్య = దీర్ఘమైన, కాలస్య అథ = కాలమునకు తరవాత, పూరుమ్ = పూరువును గూర్చి, అబ్రవీత్ = పలికెను. పుత్ర = పుత్రా! జరామ్ = ముసలితనమును, ఆనయస్వ = తీసికొనిరమ్ము (తెమ్ము); మే = నాయొక్క, న్యాసమ్ = న్యాసమును (దాచడానికి ఇచ్చిన వస్తువు న్యాసము), నిర్యాతయస్వ = తిరిగి ఇచ్చివేయుము.

తా. పిమ్మట చాల కాలానికి రాజు పూరువుతో ఇట్లనెను. "పుత్రా! ముసలితనమును తెమ్ము; నా న్యాసమును తిరిగి ఇచ్చివేయుము. 10

మూ. న్యాసభూతా మయా పుత్ర త్వయి సంక్రామితా జరా,
తస్మాత్ప్రతిగ్రహీష్యామి తాం జరాం మా వ్యథాం కృథాః.

ప్ర. అ. పుత్ర = పుత్రుడా! మయా = నాచేత, జరా = ముసలితనము, త్వయి = నీయందు, న్యాసభూతా = న్యాసముగా, సంక్రామితా = సంక్రమింప

చేయబడినది, తస్మాత్ = ఆ కారణమువలన, తాం జరామ్ = ఆ ముసలితనమును, ప్రతిగ్రహిష్యామి = తిరిగి తీసికొనెదను. వ్యథామ్ = వ్యథను, మా కృథాః = = చేయకుము (చెందకుము).

తా. నాయనా! నేను ముసలితనమును న్యాసమునుగా నీపై సంక్రమింప చేసితిని. అందువలన దానిని మరల తీసికొనెదను; వ్యథ చెందకుము. 11

మూ. ప్రీతశ్చాస్మి మహాబాహో శాసనస్య ప్రతిగ్రహాత్,
త్వాం చాహమభిషేక్ష్యామి ప్రీతియుక్తో నరాధిపమ్. 12

ప్ర. అ. మహాబాహో = మహాబాహూ! శాసనస్య = శాసనముయొక్క, ప్రతిగ్రహాత్ = అంగీకరించుటవలన, ప్రీతః చ = సంతోషించినవాడను, అస్మి = అయినాను. ప్రీతియుక్తః = సంతోషముతో కూడిన నేను, త్వామ్ = నిన్ను, నరాధిపమ్ = రాజునుగా, అభిషేక్ష్యామి = అభిషేకించెదను.

తా. మహాబాహూ! నా ఆజను అంగీకరించినందుకు సంతోషించినాను. నేను సంతోషపూర్వకముగా నిన్ను రాజ్యాభిషిక్తుణ్ణి చేసెదను. 12

మూ. ఏవముక్త్వా సుతం పూరుం యయాతిర్నహుషాత్మజః,
దేవయానీసుతం క్రుద్ధో రాజా వాక్యమువాచ హ. 13

ప్ర. అ. నహుషాత్మజః = నహుషుని కుమారుడు, రాజా = రాజూ అయిన, యయాతిః = యయాతి, సుతమ్ = కుమారుడైన, పూరుమ్ = పూరువును గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = చెప్పి, దేవయానీసుతమ్ = దేవయాని కుమారుడైన యదువును గూర్చి, క్రుద్ధః = కోపించినవాడై, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. నహుషుని పుత్రుడైన యయాతిమహారాజు పుత్రుడైన పూరువుతో ఇట్లు పలికి యదువుతో కోపించి ఇట్లు పలికెను. 13

మూ. రాక్షసస్త్వం మయా జాతః క్షత్రరూపో దురాత్మవాన్,
ప్రతిహంసి మమాజ్ఞాం త్వం ప్రజార్థే విఫలో భవ. 14

ప్ర. అ. దురాత్మవాన్ = దుష్టబుద్ధి గల, త్వమ్ = నీవు, క్షత్రరూపః =

క్షత్రియరూపము గల, రాక్షసః = రాక్షసుడవు, మయా = నాచేత, జాతః = పుట్టినావు, త్వమ్ = నీవు, మమ = నాయొక్క, ఆజ్ఞామ్ = ఆజ్ఞను, ప్రతిహంసి = కొట్టివేయుచున్నావు. ప్రజార్థే = సత్సంతానము విషయమై, విఫలః = వ్యర్థుడవు, భవ = అగుము.

తా. దుర్బుద్ధివైన నీవు క్షత్రియరూపములో ఉన్న రాక్షసుడవు. నా ఆజ్ఞను ధిక్కరించినావు. అందువలన నీకు సత్సంతానము లేకపోవుగాక. 14

మూ. పితరం గురుభూతం త్వం య స్మాత్త్వమవమన్యసే,
రాక్షసాన్ యాతుధానాంస్త్వం జనయిష్యసి దారుణాన్.15

ప్ర. అ. త్వమ్ = నీవు, గురుభూతమ్ = గురువైన, పితరమ్ = తండ్రిని, యస్మాత్ = ఏ కారణమువలన, అవమన్యసే = అవమానించుచున్నావో, తస్మాత్ = అందువలన, త్వమ్ = నీవు, దారుణాన్ = భయంకరులైన రాక్షసులను, యాతుధానాన్ = పిశాచములను, జనయిష్యసి = పుట్టించగలవు.

తా. నీవు పూజ్యుడనైన తండ్రినైన నన్ను అవమానించితివి గాన నీకు క్రూరులైన రాక్షసులు, పిశాచములు పుత్రులుగా పుట్టెదరు. 15

మూ. న తు సోమకులోత్పన్నే వంశే స్థాస్యసి దుర్మతే,
వంశోఽపి భవతస్తుల్యో దుర్వినీతో భవిష్యతి. 16

ప్ర. అ. దుర్మతే = దుష్టబుద్ధి గలవాడా! సోమకులోత్పన్నే = చంద్ర కులమునందు పుట్టిన, వంశే = వంశమునందు, న స్థాస్యసి = ఉండవు. భవతః = నీయొక్క, వంశోఽపి = వంశముకూడ, తుల్యః = నీతో సమానమైనదై, దుర్వినీతః = చెడ్డది, భవిష్యతి = కాగలదు.

తా. ఓ! దుర్మతీ! నీవు ఈ చంద్రవంశములో ఉండవు. నీ వంశము కూడ నీతో సమానమై చెడ్డది కాగలదు. 16

మూ. తమేవముక్త్వా రాజర్షిః పూరుం రాజ్యవివర్ధనమ్,
అభిషేకేణ సంపూజ్య ఆశ్రమం ప్రవివేశ హ. 17

ప్ర. అ. రాజర్షిః = ఆ రాజర్షి, తమ్ = ఆతనిని గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, రాజ్యవివర్ధనమ్ = రాజ్యమును వృద్ధి పొందించు, పూరుమ్ = పురువును, అభిషేకేణ = అభిషేకముచేత, సంపూజ్య = ఆదరించి, ఆశ్రమమ్ = ఆశ్రమమును, ప్రవివేశ హ = ప్రవేశించెను.

తా. రాజర్షియైన ఆ యయాతి యదువును ఇట్లు శపించి రాజ్యమును వృద్ధిపొందించు పూరువును రాజ్యాభిక్తుని చేసి ఆదరించి, ఆశ్రమములో ప్రవేశించెను. (వానప్రస్థాశ్రమము స్వీకరించెను). 17

మూ. తతః కాలేన మహతా దిష్టాన్తముపజగ్మివాన్,
త్రిదివం స గతో రాజా యయాతిర్నహుషాత్మజః. 18

ప్ర. అ. తతః = అటుపిమ్మట, నహుషాత్మజః = నహుషుని కుమారుడైన యయాతిః రాజా = యయాతిమహారాజు, మహతా కాలేన = చాల కాలముచేత, దిష్టాన్తమ్ = మరణమును, ఉపజగ్మివాన్ = పొందినవాడై, త్రిదివమ్ = స్వర్గమును గూర్చి, గతః = వెళ్ళినాడు.

తా. తరువాత చాలకాలానికి మరణించిన యయాతిమహారాజు స్వర్గమునకు వెళ్ళెను. 18

మూ. పూరుశ్చకార తద్రాజ్యం ధర్మేణ మహతా వృతః,
ప్రతిష్ఠానే పురవరే కాశిరాజ్యే మహాయశాః. 19

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గల, పూరుః = పూరువు, మహతా = గొప్ప, ధర్మేణ = ధర్మముతో, వృతః = కూడినవాడై కాశిరాజ్యే = కాశిరాజ్యమునందు మహతా = గొప్ప, ధర్మేణ = ధర్మముతో, వృతః = కూడినవాడై, ప్రతిష్ఠానే = ప్రతిష్ఠాన మను, పురవరే = శ్రేష్ఠమైన పట్టణమునందు, రాజ్యమ్ = రాజ్యమును, చకార = చేసెను.

తా. గొప్ప కీర్తి గల పూరువు కాశిరాజ్యములో ప్రతిష్ఠాన మను ఉత్తమమైన పురమునందు పూర్తిగా ధర్మమార్గము అవలంబించి రాజ్యము చేసెను. 19

మూ. యదుస్తు జనయామాస యాతుధానాన్ సహస్రశః,
పురే క్రౌఞ్చవనే దుర్గే రాజవంశబహిష్కృతః. 20

ప్ర. అ. రాజవంశబహిష్కృతః=రాజవంశమునుండి బహిష్కరించబడిన, యదుః తు = యదువైతే, దుర్గే = ప్రవేశింప శక్యము కాని, క్రౌఞ్చవనే = క్రౌంచవనమునందు, పురే = పట్టణమునందు, సహస్రశః = వేలకొలది, యాతుధానాన్ = రాక్షసులను, జనయామాస = పుట్టించెను.

తా. రాజవంశమునుండి బహిష్కరింపబడిన యదువు ప్రవేశింప శక్యము కాని క్రౌంచవనమునందు, పురములో వేలకొలది రాక్షసులను పుట్టించెను. 20

మూ. ఏష తూశనసా ముక్తః శాపోత్సర్గో యయాతినా,
దారితః క్షత్రధర్మేణ యం నిమిశ్చక్షమే న చ. 21

ప్ర. అ. ఉశనసా = శుక్రాచార్యునిచేత, ముక్తః = విడవబడిన (ఇవ్వబడిన), ఏషః = ఈ, శాపోత్సర్గః = శాపదానము, యయాతినా = యయాతిచేత, క్షత్రధర్మేణ = క్షత్రియధర్మముచేత, ధారితః = ధరించబడినది. యమ్ = దేనిని, నిమిః = నిమి, న చ చక్షమే = క్షమించలేదో.

తా. ఈ విధముగా యయాతి క్షత్రియధర్మమును పాటించుచు శుక్రాచార్యుడిచ్చిన శాపమును సహించెను. అట్టి శాపముచే నిమి సహించలేదు. 21

మూ. ఏతత్తే సర్వమాఖ్యాతం దర్శనం సర్వకార్యిణామ్,
అనువర్తామహే సౌమ్య దోషో న స్యాద్యథా నృగే. 22

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! ఏతత్ = ఇది, సర్వమ్ = అంతా, ఆఖ్యాతమ్ = చెప్పబడినది. సర్వకార్యిణామ్ = అందరు కార్యవంతులయొక్క, దర్శనమ్ = దర్శనమును, అనువర్తామహే = అనుసరించెదము. నృగే యథా = నృగునియందు వలె, దోషః = దోషము, న స్యాత్ = లేకుండుగాక.

తా. సౌమ్యా! నీకు ఈ కథ అంతా చెప్పినాను. పనులున్నవారి నందరినీ చూచెదము. అట్లు చేయకపోవుటచేత నృగమహారాజునకు కలిగినట్లు దోషము కలుగకుండు గాక. 22

మూ. ఇతి కథయతి రామే చన్ద్రితుల్యాననే చ
ప్రవిరలతరతారం వ్యోమ జజ్ఞే తదానీమ్,
అరుణకిరణరక్తా దిగ్బభౌ చైవ పూర్వా
కుసుమరసవిరక్తం వస్త్రమాగుణితేవ. 23

ఇత్యార్షే శ్రీమదార్షరామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకోనషష్టితమః సర్గః.

ప్ర. అ. చన్ద్రితుల్యాననే = చంద్రునితో సమానమైన ముఖము గల, రామే = రాముడు, ఇతి = ఇట్లు, కథయతి = చెప్పుచుండగా, తదానీమ్ = అప్పుడు, వ్యోమ = ఆకాశము, ప్రవిరలతారమ్ = చాల విరళమైన నక్షత్రములు కలది, జజ్ఞే = అయ్యెను. పూర్వా దిక్ = తూర్పు దిక్కు, కుసుమర సవిరక్తమ్ = పుష్పరసముచేత ఎఱ్ఱనైన, వస్త్రమ్ = వస్త్రమును, ఆగుణ్ఠితేవ = కప్పుకొన్నది వలె, అరుణకిరణరక్తా = సూర్యుని కిరణములచేత ఎఱ్ఱనైనదై, బభౌ = ప్రకాశించెను.

తా. చంద్రునితో సమానమైన ముఖము గల రాముడు ఇట్లు పలుకుచుండగానే ఆకాశము మీద నక్షత్రములు పల్చబడెను. సూర్యకిరణములచేత ఎఱ్ఱనైన తూర్పుదిక్కు పుష్పరసముచేత ఎఱ్ఱనైన వస్త్రమును కప్పుకొన్నదా అన్నట్లు ప్రకాశించెను. 23

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో యాభైతొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ ప్రక్షిప్తః సర్గః ప్రథమః

(ఇటుపైన వచ్చే మూడుసర్గలు ప్రక్షిప్తసర్గలు, వ్యాఖ్యాతలు వ్యాఖ్యానము వ్రాయలేదు).

[కార్యార్థియై మరల ఒకటి రాముని భవనము ద్వారమునకు వచ్చుట. దానిని రాజసభలోనికి తీసికొనిరమ్మని రాముడు లక్ష్మణుణ్ణి ఆదేశించుట].

మూ. తతః ప్రభాతే విమలే కృత్వా పౌర్వాహ్ణికీం క్రియామ్,
ధర్మాసనగతో రాజా రామో రాజీవలోచనః. 1

రాజధర్మానవేక్షన్వై బ్రాహ్మణైర్నైగమైః సహ,
పురోధసా వసిష్ఠేన ఋషిణా కశ్యపేన చ. 2

ప్ర అ. తతః = అటుపిమ్మట, విమలే = స్వచ్ఛమైన, ప్రభాతే = ప్రాతఃకాలమునందు, రాజీవలోచనః = పద్మములవంటి నేత్రములు గల, రాజా = రాజైన, రామః = రాముడు, పౌర్వాహ్ణికీమ్ = పూర్వాహ్ణమునకు సంబంధించిన, క్రియామ్ = క్రియను, బ్రాహ్మణైః = బ్రాహ్మణులతోను, నైగమైః సహ = ఆ యా సంఘాల ముఖ్యులతోను, పురోధసా = పురోహితుడైన, వసిష్ఠేన = వసిష్ఠునితోను, ఋషిణా = ఋషియైన, కశ్యపేన చ = కశ్యపునితోను, రాజధర్మాన్ = రాజధర్మములను, అవేక్షన్ వై = చూచుచు, ధర్మాసనగతః = ధర్మాసనము పొందెను.

తా. పిమ్మట తెల్లవారెను. పద్మపత్రముల వంటి నేత్రములు గల రాజైన రాముడు పూర్వాహ్ణమునందు చేయవలసిన కృత్యము లన్నీ చేసికొని బ్రాహ్మణులతోను, ఆ యా సంఘముల ముఖ్యులతోను, పురోహితుడైన వసిష్ఠునితోను, కశ్యప ఋషితోను కలిసి, రాజ్యవ్యవహారములను పరిశీలించుటకై ధర్మాసనమునందు ఉండెను. 1, 2

మూ. మన్త్రిభిర్వ్యవహారజ్ఞైస్తథాన్యైర్ధర్మపాఠకైః,
నీతిజ్ఞైరథ సభ్యైశ్చ రాజభిః సా సభా వృతా. 3

సభా యథా మహేన్ద్రస్య యమస్య వరుణస్య చ,
ఋఋభే రాజసింహస్య రామస్యాక్లిష్టకర్మణః. 4

ప్ర. అ. అక్లిష్టకర్మణః=క్లేశము లేకుండా కర్మలుచేయు, రాజసింహస్య = ఆ రాజశ్రేష్ఠు డైన, రామస్య = రామునియొక్క, సా = ఆ, సభా = సభ, వ్యవహారజ్ఞైః=పాలనావ్యవహారమును ఎరిగిన, మన్త్రిభిః=మంత్రులతోను, అన్యైః = ఇతరులైన, ధర్మపాఠకైః = ధర్మశాస్త్రములు చదివినవారితోను, అథ = మరియు, నీతిజ్ఞైః = నీతిని ఎరిగిన, సభ్యైః చ = సభ్యులతోను, రాజభిః=రాజుల తోను, మహేన్ద్రస్య = మహేంద్రునియొక్క, సభా యథా = సభ వలె, యమస్య = యముని సభ వలె, వరుణస్య చ = వరుణుని సభ వలె, ఋఋభే = ప్రకాశించెను.

తా. రాజులలో శ్రేష్ఠుడు శ్రమ లేకుండా పనులు సాధించువాడు అయిన ఆ రాముని సభ వ్యవహారజ్ఞానమున్న మంత్రులతోను, ధర్మశాస్త్రాధ్యయనము చేసిన ఇతరులతోను, నీతిని ఎరిగిన సభ్యులతోను, రాజులతోను, మహేంద్రుని సభ వలె, యముని సభ వలె, వరుణుని సభ వలె ప్రకాశించెను. 3, 4

మూ. అథ రామోఽబ్రవీత్తత్ర లక్ష్మణం శుభలక్షణమ్,
నిర్గచ్ఛ త్వం మహాబాహో సుమిత్రానన్దవర్ధన, 5
కార్యార్థినశ్చ సౌమిత్రే వ్యాహర్తుం త్వముపక్రమ.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, రామః = రాముడు, శుభలక్షణమ్ = శుభ మైన లక్షణములు గల, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను. మహాబాహో=గొప్ప బాహువులు గలవాడా! సుమిత్రానన్దవర్ధన=సుమిత్రయొక్క ఆనందమును వృద్ధిపొందించువాడా! సౌమిత్రే = లక్ష్మణా, త్వమ్ = నీవు, నిర్గచ్ఛ = బైటకు వెళ్ళుము. త్వమ్ = నీవు, కార్యార్థినః = కార్యమును కోరువారినిగూర్చి, వ్యాహర్తుమ్ = మాటలాడుటకు, ఉపక్రమ = ఉపక్రమించుము.

తా. పిమ్మట రాముడు శుభలక్షణములు గల లక్ష్మణునితో ఇట్లు పలికెను. మహాబాహూ! సుమిత్ర ఆనందమును వృద్ధి పొందించువాడా! లక్ష్మణా! నీవు బైటకు వెళ్ళి కార్యార్థులు ఉన్నచో వారితో మాటలాడుటకు ప్రారంభించుము.

మూ. రామస్య భాషితం శ్రుత్వా లక్ష్మణః శుభలక్షణః, 6
ద్వారదేశముపాగమ్య కార్యిణశ్చాహ్వయత్ స్వయమ్.

ప్ర. అ. శుభలక్షణః = శుభలక్షణములు గల, లక్ష్మణః = లక్ష్మణుడు, రామస్య = రామునియొక్క, భాషితమ్ = మాటను, శ్రుత్వా = విని, ద్వారదేశమ్ = ద్వారప్రదేశమును, ఉపాగమ్య = పొంది, స్వయమ్ = స్వయముగా, కార్యిణః = వ్యవహారము ఉన్నవారిని, ఆహ్వయత్ = పిలచెను.

తా. శుభలక్షణములు గల లక్ష్మణుడు రాముని మాటలు విని ద్వారము దగ్గరకు వచ్చి స్వయముగా వ్యవహారము ఉన్నవాళ్ళను పిలచెను. 6

మూ. న కశ్చిదబ్రవీత్తత్ర మమ కార్యమిహాద్య వై, 7
నాధయో వ్యాధయశ్చైవ రామే రాజ్యం ప్రశాసతి,
పక్వసస్యా వసుమతీ సర్వౌషధిసమన్వితా. 8

ప్ర. అ. అద్య = ఇప్పుడు, ఇహ = ఇక్కడ, మమ = నాకు, కార్యమ్ = కార్యము, అస్తి వై = ఉన్నది అని, తత్ర = అక్కడ, కశ్చిత్ = ఎవ్వడూ కూడ, న అబ్రవీత్ = పలకలేదు. రామే = రాముడు, రాజ్యమ్ = రాజ్యమును, ప్రశాసతి = శాసించుచుండగా, ఆధయః = మనోబాధలు, వ్యాధయః = రోగములు, న = లేవు. వసుమతీ = భూమి, పక్వసస్యా = పక్వమైన సస్యములు గలది, సర్వౌషధిసమన్వితా = సమస్తములైన ఓషదులతో కూడినది అయి ఉండెను.

తా. "ఇప్పుడు నాకు ఇక్కడ ఈ వ్యవహారము ఉన్నది" అని అక్కడ ఎవ్వరూ చెప్పలేదు. ఎందుచేత ననగా రాముడు రాజ్యము పాలించుచుండగా ప్రజలకు మనోవ్యథలు గాని, రోగములు గాని లేకుండెను. భూమి పక్వములైన సస్యములతో నిండి సమస్తములైన ఓషదులతో సమృద్ధముగా ఉండెను. 7, 8

మూ. న బాలో మ్రియతే తత్ర న యువా న చ మధ్యమః,
ధర్మేణ శాసితం సర్వం న చ బాధా విధీయతే. 9

ప్ర. అ. తత్ర=అక్కడ, బాలః=బాలుడు, న ప్రమీయతే = మరణించుట లేదు. యువా = యువకుడు, న = మరణించుటలేదు. మధ్యమః చ = మధ్యమ వయస్కుడు కూడ, న = మరణించుటలేదు, సర్వమ్ = సమస్తమూ, ధర్మేణ= ధర్మముచేత, శాసితమ్ = శాసించబడినది. బాధా = బాధ, న విధీయతే = చేయ బడలేదు.

తా. అక్కడ బాలుడు కాని, యువకుడు గాని, మధ్యవయస్కుడు గాని మరణించెడివాడు కాడు. అంతా ధర్మానుసారము పాలింపబడుచుండెను. ఎవరికీ బాధ కలిగింపబడలేదు. 9

మూ. దృశ్యతే న చ కార్యార్థీ రామే రాజ్యం ప్రశాసతి,
లక్ష్మణః ప్రాఞ్జలిర్భూత్వా రామాయైవం న్యవేదయత్.

ప్ర. అ. రామే = రాముడు, రాజ్యమ్ = రాజ్యమును, ప్రశాసతి = శాసించు చుండగా, కార్యార్థీ = కార్యార్థి, న చ దృశ్యతే = చూడబడడు. లక్ష్మణః = లక్ష్మణుడు, ప్రాఞ్జలిః = కట్టబడినదోసిలి కలవాడు, భూత్వా = అయి, రామాయ = రామునకు, ఏవమ్ = ఇట్లు, న్యవేదయత్ = తెలిపెను.

తా. రాముడు రాజ్యమును పాలించుచుండగా వ్యవహారము కొరకై వచ్చే వాడు ఎవడూ కూడ లేకుండెను. లక్ష్మణుడు అంజలి ఘటించి రామునకు ఈ విషయము చెప్పెను. 10

మూ. అథ రామః ప్రసన్నాత్మా సౌమిత్రిమిదమబ్రవీత్,
భూయ ఏవ తు గచ్ఛ త్వం కార్యిణః ప్రవిచారయ. 11

ప్ర. అ. అథ=అటుపిమ్మట, రామః=రాముడు, ప్రసన్నాత్మా=ప్రసన్న మైన మనస్సు గలవాడై, సౌమిత్రిమ్ = లక్ష్మణుణ్ణి గూర్చి, ఇదమ్ = ఈ వాక్య మును, అబ్రవీత్ = పలికెను. త్వమ్ = నీవు, భూయః ఏవ = మరల, గచ్ఛ = వెళ్ళుము. కార్యిణః = కార్యమున్నవారిని గూర్చి. ప్రవిచారయ = విచారించుము.

తా. రాముడు సంతోషించి లక్ష్మణునితో. "మరల వెళ్ళి నీవు కార్యాపేక్ష ఉన్నవారెవరైనా ఉన్నారా చూచి రమ్ము" అని ఆదేశించెను. 11

మూ. ఏతచ్ఛ్రుత్వా తు వచనం సారమేయస్య లక్ష్మణః,
రాఘవాయ తదాఖ్యాతుం ప్రవివేశాలయం శుభమ్. 18

ప్ర. అ. లక్ష్మణః = లక్ష్మణుడు, సారమేయస్య = కుక్కయొక్క, ఏతత్ = ఈ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, రాఘవాయ = రామునకు, తత్ = దానిని, ఆఖ్యాతుమ్ = చెప్పుటకు, శుభమ్ = మంగళకరమైన, ఆలయమ్ = గృహమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. లక్ష్మణుడు కుక్కమాటలు విని ఈ విషయమును రామునకు తెలుపుటకై సుందరమైన గృహములోనికి వెళ్ళెను. 18

మూ. నివేద్య రామస్య పునర్నిర్జగామ నృపాలయాత్,
వక్తవ్యం యది తే కించిత్ తత్త్వం బ్రూహి నృపాయ వై.

ప్ర. అ. రామస్య = రామునకు, నివేద్య = తెలిపి, పునః = తిరిగి, నృపాలయాత్ = రాజగృహమునుండి, నిర్జగామ = బైటకువచ్చెను. తే = నీకు, కించిత్ = ఏమైన, వక్తవ్యం యది = చెప్పదగినది ఉన్నట్లయితే, తత్ = దానిని, నృపాయ = రాజుకు, బ్రూహి వై = చెప్పుము.

తా. రామునికి తెలిపి మరల రాజభవనమునుండి బైటకు వచ్చి "నీకేమైన చెప్పవలసినది ఉన్నచో రాజుకు చెప్పుము" అని ఆ శునకముతో అనెను. 19

మూ. లక్ష్మణస్య వచః శ్రుత్వా సారమేయోఽబ్యభాషత,
దేవాగారే నృపాగారే ద్విజవేశ్మసు వై తథా. 20

వహ్నిః శతక్రతుశ్చైవ సూర్యో వాయుశ్చ తిష్ఠతి,
నాత్ర యోగ్యాస్తు సౌమిత్రే యోనీనామధమా వయమ్. 21

ప్ర. అ. లక్ష్మణస్య = లక్ష్మణునియొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, సారమేయః = కుక్క, అబ్యభాషత = పలికెను. సౌమిత్రే = లక్ష్మణా! దేవాగారే = దేవాలయమునందు, నృపాగారే = రాజభవనమునందు, తథా = మరియు, ద్విజవేశ్మసు = ద్విజులగృహములయందు, వహ్నిః = అగ్ని, తిష్ఠతి = ఉండును. శతక్రతుః చ ఏవ = ఇంద్రుడు, సూర్యః = సూర్యుడు, వాయుః చ =

వాయువూ కూడ ఉందురు, యోనీనామ్ = యోనులలో, అధమాః = అధముల మైన, వయమ్ = మేము, అత్ర = ఈ గృహములలో (ప్రవేశించుటకు), న యోగ్యాః = యోగ్యులము కాదు.

తా. లక్ష్మణుని మాటలు విని ఆ శునకము ఇట్లు పలికెను. "లక్ష్మణా! దేవతాగృహమునందు, ద్విజుల గృహములలోను అగ్ని, ఇంద్రుడు, సూర్యుడు, వాయువూ ఉందురు. అధమయోనులమైన మేము ఆ గృహములలో ప్రవేశించుటకు యోగ్యులము కాదు. 20, 21

మూ. ప్రవేష్టుం నాత్ర శక్ష్యామి ధర్మో విగ్రహవాన్ నృపః,
సత్యవాదీ రణపటుః సర్వసత్త్వహితే రతః. 22

ప్ర. అ. అత్ర = ఈ గృహమునందు, ప్రవేష్టుమ్ = ప్రవేశించుటకు, న శక్ష్యామి = సమర్థుడను కాను. నృపః = రాజు, విగ్రవాన్ = రూపము గల, ధర్మః = ధర్మము, సత్యకారీ = సత్యము వలుకువాడు, రణపటుః = యుద్ధములందు సమర్థుడు, సర్వసత్త్వహితే = సమస్తప్రాణుల హితమునందు, రతః = ఆసక్తుడు.

తా. నేను ఈ భవనము ప్రవేశింపజాలను. రాజు మూర్తీభవించిన ధర్మము. సత్యమే పలుకును. రణరంగములందు సమర్థుడు. సకలప్రాణుల హితమునందు ఆసక్తి కలవాడు. 22

మూ. షాడ్గుణ్యస్య పదం వేత్తి నీతికర్తా స రాఘవః,
సర్వజ్ఞః సర్వదర్శీ చ రామో రమయతాం వరః. 23

ప్ర. అ. రాఘవః = రఘువంశసంజాతుడు, రమయతామ్ = ఆనందింప చేసేవారిలో, వరః = శ్రేష్ఠుడూ అయిన, రామః = రాముడు, షాడ్గుణ్యస్య = ఆరు గుణములయొక్క, పదమ్ = స్థానమును, వేత్తి = ఎరుగును. నీతికర్తా = నీతిని నిర్మించువాడు. సర్వజ్ఞః = అన్ని తెలిసినవాడు. సర్వదర్శీ చ = అన్నీ చూచే వాడు.

తా. రఘువంశసంజాతుడు, ఆనందింపచేసేవారిలో శ్రేష్ఠుడూ అయిన రాముడు సంధి-విగ్రహ-యాన-ఆసన-ద్వైధీభావ-సమాశ్రయణములను ఆరు గుణముల ప్రయోగము తెలిసినవాడు. నీతిమార్గమును చూపువాడు అన్నీ తెలిసినవాడు. అన్నీ చూడగలిగినవాడు. 23

మూ. స సోమః స చ మృత్యుశ్చ స యమో ధనదస్తథా,
వహ్నిః శతక్రతుశ్చైవ సూర్యో వై వరుణస్తథా. 24

ప్ర. అ. సః = అతడు, సోమః = చంద్రుడు, సః = అతడు, మృత్యుః చ = మృత్యువు, సః = అతడు, యమః = యముడు, తథా = మరియు, ధనదః = కుబేరుడు, వహ్నిః = అగ్ని దేవుడు, శతక్రతుః చైవ = ఇంద్రుడు, సూర్యః వై = సూర్యుడు, తథా = మరియు, వరుణః = వరుణుడు.

తా. ఆ రాముడే చంద్రుడు, మృత్యువు, యముడు, కుబేరుడు, అగ్ని, ఇంద్రుడు, సూర్యుడు, వరుణుడు. 24

మూ. తస్య త్వం బ్రూహి సౌమిత్రే ప్రజాపాలః స రాఘవః,
అనాజ్ఞప్తస్తు సౌమిత్రే ప్రవేష్టుం నేచ్ఛయామ్యహమ్. 25

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా! త్వమ్ = నీవు, తస్య = ఆ రామునకు, బ్రూహి = చెప్పుము. సః రాఘవః = ఆ రాముడే, ప్రజాపాలః = ప్రజలను పాలించువాడు. సౌమిత్రే = లక్ష్మణా! అహమ్ = నేను, అనాజ్ఞప్తః తు = ఆజ్ఞాపించబడనివాడనై, ప్రవేష్టుమ్ = ప్రవేశించుటకు, న ఇచ్ఛయామి = ఇచ్ఛయించను.

తా. లక్ష్మణా! ఆ రామునితో చెప్పుము. ఆ రాముడే ప్రజాపాలకుడు. లక్ష్మణా! నేను రాముని ఆజ్ఞ లేకుండా లోపలికి వచ్చుటకు ఇష్టపడను. 25

మూ. ఆనృశంస్యాన్మహాభాగః ప్రవివేశ మహాద్యుతిః,
నృపాలయం ప్రవిశ్యాథ లక్ష్మణో వాక్యమబ్రవీత్. 26

ప్ర. అ. మహాభాగః = గొప్ప భాగ్యము గల, మహాద్యుతిః = గొప్ప కాంతి గల ఆ లక్ష్మణుడు, ఆనృశంస్యాత్ = మంచితనమువలన, ప్రవివేశ = ప్రవేశించెను. లక్ష్మణః = లక్ష్మణుడు, నృపాలయమ్ = రాజభవనమును, ప్రవిశ్య = ప్రవేశించి, అథ = అటుపిమ్మట, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. మహాభాగ్యవంతుడు, మహాతేజఃశాలి అయిన లక్ష్మణుడు మంచితనముచేత విసిగికొనక మరల రాజభవనములో ప్రవేశించి ఇట్లు పలికెను. 26

మూ. శ్రూయతాం మమ విజ్ఞాప్యం కౌసలానన్దవర్ధన,
యన్మయోక్తం మహాబాహో తవ శాసనజం విభో. 27
శ్వా వై తే తిష్ఠతే ద్వారి కార్యార్థీ సముపాగతః.

ప్ర. ఆ. కౌసల్యానన్దవర్ధన=కౌసల్యయొక్క ఆనందమును వృద్ధిపొందించు వాడా! మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా! విభో = ప్రభూ! తవ = నీయొక్క, శాసనజమ్ = ఆజ్ఞ వల్ల కలిగిన, యత్ = ఏది, మయా = నాచేత, ఉక్తమ్ = చెప్పబడినదో, విజ్ఞాప్యమ్ = విజ్ఞాపన చేయవలసిన అది, శ్రూయతామ్ = వినబడుగాక. శ్వా = కుక్క, కార్యార్థీ = కార్యార్థియై, సముపాగతః = వచ్చినది, ద్వారి = ద్వారమునందు, తిష్ఠతే = నిలచిఉన్నది.

తా. కౌసల్యకు ఆనందమును వృద్ధిపొందించువాడా! మహాబాహూ! ప్రభూ! నీ ఆజ్ఞవలన ఏర్పడిన విజ్ఞాపింపదగిన అంశ మొకటి ఉన్నది; వినుము. ఒక శునకము కార్యార్థియై వచ్చినది. ద్వారమువద్ద నిలచి ఉన్నది. 27

మూ. లక్ష్మణస్య వచః శ్రుత్వా రామో వచనమబ్రవీత్,
సంప్రవేశయ వై క్షిప్రం కార్యార్థీ యోఽత్ర తిష్ఠతి. 28

ఇత్యార్షే శ్రీ మద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ప్రక్షిప్తః సర్గః ప్రథమః.

ప్ర. ఆ. లక్ష్మణస్య = లక్ష్మణునియొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, రామః = రాముడు, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను. కార్యార్థీ = కార్యమును అర్థించుచున్నదై, యః = ఏ శునకము, అత్ర = ఇక్కడ, తిష్ఠతి = ఉన్నదో దానిని, క్షిప్రమ్ = శీఘ్రముగా, సంప్రవేశయ వై = ప్రవేశ పెట్టుము.

తా. లక్ష్మణుని మాటలు విని రాముడు- "కార్యార్థియై వచ్చిఉన్న దానిని వెంటనే ప్రవేశ పెట్టుము" అని లక్ష్మణునితో పలికెను. 28

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు,
ఉత్తరకాండలో ప్రక్షిప్తసర్గలలో మొదటిసర్గ సమాప్తము.

అథ ప్రక్షిప్తః సర్గః ద్వితీయః

[శునకము విషయమున రాముడు న్యాయనిర్ణయము చేయుట. దాని అభిప్రాయము ప్రకారము రాముడు దానిని కొట్టిన బ్రాహ్మణునకు మఠాధిపత్యమిచ్చుట. శునకము మఠాధిపత్యములో ఉన్న దోషాలు వర్ణించి చెప్పుట.]

మూ. శ్రుత్వా రామస్య వచనం లక్ష్మణస్త్వరితస్తదా,
శ్వానమాహూయ మతిమాన్ రాఘవాయ న్యవేదయత్. 1

ప్ర. అ. రామస్య = రామునియొక్క, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, తదా = అప్పుడు, మతిమాన్ = బుద్ధిమంతుడైన, లక్ష్మణః = లక్ష్మణుడు, త్వరితః = తొందరపడుచున్నవాడై, శ్వానమ్ = శునకమును, ఆహూయ = పిలచి, రాఘవాయ = రామునకు, న్యవేదయత్ = తెలిపెను.

తా. రాముని మాటలు విని బుద్ధిమంతుడైన లక్ష్మణుడు తొందరగా ఆ శునకమును పిలుచుకొని వెళ్ళి రామునకు చూపెను. 1

మూ. దృష్ట్వా సమాగతం శ్వానం రామో వచనమబ్రవీత్,
వివక్షితార్థం మే బ్రూహి సారమేయ న తే భయమ్. 2

ప్ర. అ. సమాగతమ్ = వచ్చిన, శ్వానమ్ = శునకమును, దృష్ట్వా = చూచి, రామః = రాముడు, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను, సారమేయ = శునకమా! వివక్షితార్థమ్ = చెప్పదలచిన విషయమును, మే = నాకు, బ్రూహి = చెప్పుము. తే = నీకు, భయమ్ = భయము, న = లేదు.

తా. వచ్చిన ఆ శునకమును చూచి రాముడు దానితో- "ఓ శునకమా! నీవు చెప్పదలచుకున్న విషయమును చెప్పుము- నీకేమీ భయము లేదు" అని పలికెను. 2

మూ. అథాపశ్యత తత్రస్థం రామం శ్వా భిన్నమస్తకః,
తతో దృష్ట్వా స రాజానం సారమేయోఽబ్రవీదిదమ్. 3

ప్ర. అ. అథ = ఆటుపిమ్మట, భిన్నమస్తకః = బ్రద్దలుకొట్టబడిన తల గల, శ్వా = ఆ కుక్క, తత్రస్థమ్ = అక్కడ నున్న, రామమ్ = రాముణ్ణి, అపశ్యత = చూచెను తతః = ఆటుపిమ్మట, సః సారమేయః = ఆ శునకము, రాజానమ్ = రాజును, దృష్ట్వా = చూచి, వచః = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. తలబ్రద్దలై ఉన్న ఆ శునకము అక్కడ ఉన్న రాముణ్ణి చూచెను. ఆ రాజును చూచి ఆ శునకము ఇట్లనెను. 3

మూ. రాజైవ కర్తా భూతానాం రాజా చైవ వినాయకః,
రాజా సుప్తేషు జాగర్తి రాజా పాలయతి ప్రజాః. 4

ప్ర. అ. రాజైవ = రాజే, భూతానామ్ = ప్రాణులకు, కర్తా = సృజించువాడు, రాజా చ ఏవ = రాజే, వినాయకః = గొప్ప నాయకుడు, సుప్తేషు = అందరూ నిద్రపోవుచుండగా, రాజా = రాజు, జాగర్తి = జాగరూకుడై ఉండును. రాజా = రాజే, ప్రజాః = ప్రజలను, పాలయతి = పాలించును.

తా. సకలభూతముల సృష్టికి హేతువు రాజు. రాజే గొప్ప నాయకుడు. అందరూ నిద్రపోవుచుండగా రాజు మేల్కొని ఉండును. రాజే ప్రజలను పాలించును. 4

మూ. నీత్యా సునీతయా రాజా ధర్మం రక్షతి రక్షితా,
యదా న పాలయేద్రాజా క్షిప్రం నశ్యన్తి వై ప్రజాః. 5

ప్ర. అ. రక్షితా = రక్షకుడైన, రాజా = రాజు, సునీతయా = బాగుగా నడపబడిన, నీత్యా = నీతిచేత, ధర్మమ్ = ధర్మమును, రక్షతి = రక్షించును. యదా = ఎప్పుడు, రాజా = రాజు, న పాలయేత్ = పాలించదో అప్పుడు, ప్రజాః = ప్రజలు, క్షిప్రమ్ = శీఘ్రముగా, నశ్యన్తి వై = నశింతురు.

తా. రక్షకుడైన రాజే బాగుగా నడపబడిన నీతిచేత ధర్మమును రక్షించును. రాజు పాలించనిచో ప్రజలు శీఘ్రముగా నశింతురు. 5

మూ. రాజా కర్తా చ గోప్తా చ సర్వస్య జగతః పితా,
రాజా కాలో యుగం చైవ రాజా సర్వమిదం జగత్. 6

ప్ర. అ. రాజా = రాజే, కర్తా = కర్త; గోప్తా చ = రక్షకుడు, సర్వస్య = సమస్తమైన, జగతః = జగత్తుకు, పితా = తండ్రి. రాజా = రాజే, కాలః = కాలము, యుగం చైవ = యుగము. రాజా = రాజే, సర్వమ్ = సమస్తమైన, ఇదమ్ = ఈ, జగత్ = జగత్తు.

తా. రాజే కర్త. రాజే రక్షకుడు. రాజే జగత్తుకు అంతకీ తండ్రి. రాజే కాలము, యుగమూ కూడ. ఈ సర్వజగత్తూ రాజే. 6

మూ. ధారణాద్ధర్మమిత్యాహుర్ధర్మేణ విధృతాః ప్రజాః,
యస్మాద్ధారయతే సర్వం త్రైలోక్యం సచరాచరమ్. 7

ప్ర. అ. ధారణాత్ = ధరించుటవలన, ధర్మమ్ ఇతి = ధర్మము అని, ఆహుః = చెప్పుదురు. ధర్మేణ = ధర్మముచేత, ప్రజాః = ప్రజలు, విధృతాః = ధరించబడినారు. సచరాచరమ్ = జంగమస్థావరములతో కూడిన, సర్వమ్ = సమస్తమైన, త్రైలోక్యమ్ = మూడు లోకముల సముదాయమును, యస్మాత్ = ఎందువలన, ధారయతే = ధరించుచున్నదో అందువలన 'ధర్మము'.

తా. ధరించునది కావున ధర్మ మని అందురు. ధర్మమే ప్రజలను నిల బెట్టును. స్థావరజంగమాత్మకమైన మూడు లోకాలను నిలబెట్టేది ధర్మమే. 7

మూ. ధారణాద్విద్విషాం చైవ ధర్మేణారక్షయన్ ప్రజాః,
తస్మాద్ధారణమిత్యుక్తం స ధర్మ ఇతి నిశ్చయః. 8

ప్ర. అ. విద్విషామ్ = శత్రువులయొక్క, ధారణాత్ చ ఏవ = అదుపులో పెట్టుటవలన కూడ ఇది ధర్మము. ధర్మేణ = ధర్మముచేత, ప్రజాః = ప్రజలను, ఆరక్షయన్ = రంజింపచేసిరి. తస్మాత్ = ఆ కారణమువలన, ధారణమ్ ఇతి = ధరించునది అని, ఉక్తమ్ = చెప్పబడినది. సః = అదే, ధర్మః ఇతి = ధర్మము అని, నిశ్చయః = నిశ్చయము.

తా. శత్రువులను అదుపులో ఉంచుటచేత కూడ ఇది ధర్మము. ధర్మము

చేతనే రాజులు ప్రజలను రంజింపచేసిరి. అందుచేత ఇది ధరింపచేయునది అని చెప్పబడినది. అదే ధర్మము అని నిశ్చయము. 8

మూ. ఏష రాజన్ పరో ధర్మ్మః ఫలవాన్ ప్రేత్య రాఘవ,
న హి ధర్మ్మాద్ భవేత్కించిద్దుష్ప్రాపమితి మే మతిః. 9

ప్ర. అ. రాజన్ = రాజా ! రాఘవ = రామా! ఏషః = ఈ, పరః = శ్రేష్ఠమైన, ధర్మ్మః = ధర్మమే, ప్రేత్య = మరణించి, ఫలవాన్ = ఫలము గలది. ధర్మ్మాత్ = ధర్మమువలన, దుష్ప్రాపమ్ = పొంద శక్యము కానిది, కించిత్ = ఏదీ, న హి = లేదు, ఇతి = అని, మే = నాయొక్క. మతిః = బుద్ధి.

తా. రాజా! రామా! మరణానంతరము కూడ ఫలము నిచ్చునది ఈ ఉత్తమమైన ధర్మమే. ధర్మమువలన లభించనిది ఏదీ ఉండ దని నా అభిప్రాయము. 9

మూ. దానం దయా సతాం పూజా వ్యవహారేషు చార్జవమ్,
ఏష రామ పరో ధర్మో రక్షణాత్ ప్రేత్య చేహ చ. 10

ప్ర. అ. రామ = రామా! దానమ్ = దానము, దయా = దయ, సతామ్ = సత్పురుషులయొక్క, పూజా = పూజ, వ్యవహారేషు = వ్యవహారములయందు, ఆర్జవమ్ = ఋజుత్వము, ఏషః = ఇదే, ప్రేత్య చ = మరణించిన పిమ్మట, ఇహ చ = ఈ లోకమునందూ, రక్షణాత్ = రక్షించుటవలన, పరః = గొప్పదైన, ధర్మ్మః = ధర్మము.

తా రామా! దానము, దయ, సత్పురుషులను పూజించుట, వ్యవహారములలో ఋజుత్వము, ఇవి మరణానంతరము, ఇహలోకములోనూ కూడ రక్షించుటవలన "ధర్మము". 10

మూ. త్వం ప్రమాణం ప్రమాణానామసి రాఘవ సువ్రత,
విదితశ్చైవ తే ధర్మ్మః సద్భిరాచరితస్తు వై. 11

ప్ర. అ. సువ్రత = మంచి నియమములు గలవాడా ! రాఘవ = రామా ! త్వమ్ = నీవు, ప్రమాణానామ్ = ప్రమాణములకు, ప్రమాణమ్ = ప్రమాణముగా, అసి = అయి ఉన్నావు. సద్భిః = సత్పురుషులచేత, ఆచరితః = ఆచరించబడిన, ధర్మ్మః = ధర్మము, తే = నీకు, విదితః చ వై = తెలియబడినదే.

తా. ఉత్తమనియమపాలకుడవైన రామా! నీవు ప్రమాణాలకు ప్రమాణము. సత్పురుషులచేత ఆచరింపబడిన ధర్మము నీకు బాగా తెలిసినదే. 11

మూ. ధర్మాణాం త్వం పరం ధామ గుణానాం సాగరోపమః,
అజ్ఞానాచ్చ మయా రాజన్నుక్తస్త్వం రాజసత్తమ. 12
ప్రసాదయామి శిరసా న త్వం క్రోధమిహార్హసి.

ప్ర. అ. రాజన్=రాజా! త్వమ్=నీవు, ధర్మాణామ్=ధర్మములయొక్క, పరమ్=గొప్ప, ధామ=స్థానము. గుణానామ్=గుణములకు, సాగరోపమః=సాగరముతో సమానుడవు. రాజసత్తమ=రాజశ్రేష్ఠా, మయా=నాచేత, అజ్ఞానాత్=అజ్ఞానమువలన, ఉక్తః=చెప్పబడినావు. శిరసా=శిరస్సుచేత, ప్రసాదయామి=అనుగ్రహింపచేసుకొనుచున్నాను. త్వమ్=నీవు, ఇహ=ఇక్కడ, క్రోధమ్=క్రోధమును, కర్తుమ్=చేయుటకు, న అర్హసి=తగవు.

తా. రాజులలో శ్రేష్ఠుడవైన రాజా! నీవు ధర్మాలకు ఉత్తమస్థానము. గుణములకు సముద్రము వంటివాడవు. అజ్ఞానమువలన నేను నీముందు ధర్మమును గూర్చి మాటలాడుచున్నాను. శిరస్సు వంచి నమస్కరించుచున్నాను. ఈ విషయమున కోపము చేయకుము. 12

మూ. శునఃస వచనం శ్రుత్వా రాఘవో వాక్యమబ్రవీత్, 13
కిం తే కార్యం కరోమ్యద్య బ్రూహి విశ్రబ్ధ మా చిరమ్.

ప్ర. అ. శునఃశునకముయొక్క, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, సః రాఘవః=ఆ రాముడు, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను. అద్య=ఇప్పుడు, తే=నీకు, కిమ్=ఏమి, కార్యమ్=కార్యమును, కరోమి=చేయుదును? విశ్రబ్ధః=నమ్మకము కలదానవై, బ్రూహి=చెప్పుము. చిరమ్=చిరకాలము, మా=వద్దు.

తా. శునకము మాటలు విని రాముడు-"నీకు నేను ఇప్పుడు ఏమి చేయవలెనో నిర్భయముగా చెప్పుము; ఆలస్యము చేయవద్దు" అని దానితో పలికెను.

మూ. రామస్య వచనం శ్రుత్వా సారమేయోఽబ్రవీదిదమ్, 14
ధర్మేణ రాష్ట్రం విన్దేత ధర్మేణైవానుపాలయేత్.

ప్ర. అ. రామస్య = రామునియొక్క, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, సారమేయః = శునకము, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను. ధర్మేణ = ధర్మముచేత, రాష్ట్రమ్ = రాష్ట్రమును, విన్దేత = పొందవలెను. ధర్మేణైవ = ధర్మముచేతనే, అనుపాలయేత్ = పాలించవలెను.

తా. రాముని మాటలు విని శునకము ఇట్లు పలికెను - "ధర్మముచేతనే రాష్ట్రమును పొందవలెను. ధర్మముచేతనే దానిని పాలించవలెను". 14

మూ. ధర్మాచ్ఛరణ్యతాం యాతి రాజా సర్వభయాపహః,
ఇదం విజ్ఞాయ యత్ కృత్యం శ్రూయతాం మమ రాఘవ.

ప్ర. అ. ధర్మాత్ = ధర్మమువలన, సర్వభయాపహః = అన్ని భయములనూ తొలగించు, రాజా = రాజు, శరణ్యతామ్ = శరణుపొంద యోగ్యుడగుటను, యాతి = పొందును. రాఘవ = రామా ! ఇదమ్ = దీనిని, విజ్ఞాయ = తెలిసికొని, మమ = నాకు, యత్ = ఏది, కృత్యమ్ = చేయదగినదో, శ్రూయతామ్ = వినబడుగాక.

తా. రామా ! ధర్మమువలన సకలభయములను తొలగించు రాజు రక్షకుడు అగును. ఈ విషయమును తెలిసికొని నాకొరకై ఏమి చేయవలెనో వినుము.

మూ. భిక్షుః సర్వార్థసిద్ధశ్చ బ్రాహ్మణావసథే వసన్, 16
తేన దత్తః ప్రహారో మే నిష్కారణమనాగసః.

ప్ర. అ. బ్రాహ్మణావసథే = బ్రాహ్మణులుండు ప్రదేశమునందు, వసన్ = నివసించుచున్న, సర్వార్థసిద్ధః = సర్వార్థసిద్ధుడను, భిక్షుః = సంన్యాసి ఉన్నాడు. తేన = వానిచేత, నిష్కారణమ్ = కారణము లేకుండగా, అనాగసః = అపరాధము లేని, మే = నాకు, ప్రహారః = దెబ్బ, దత్తః = ఇవ్వబడినది.

తా. బ్రాహ్మణులు నివసించు ప్రదేశమునందు నివసించే సర్వార్థసిద్ధుడనే సంన్యాసి ఏ కారణము లేకుండగా, అపరాధ మేమీ లేని నన్ను కొట్టినాడు. 16

మూ. ఏతచ్ఛ్రుత్వా తు రామేణ ద్వాఃస్థః సంప్రేషితస్తదా, 17
ఆనీతశ్చ ద్విజస్తేన సర్వశాస్త్రార్థకోవిదః.

ప్ర. అ. తదా = అప్పుడు, రామేణ = రామునిచేత, ఏతత్ = దీనిని,

మూ. క్రోధః ప్రాణహరః శత్రుః క్రోధో మిత్రముఖో రిపుః,
క్రోధో హ్యసిర్మహాతీక్ష్ణః సర్వం క్రోధోఽపకర్షతి. 21

ప్ర. అ. క్రోధః = కోపము, ప్రాణహరః = ప్రాణములను హరించు, శత్రుః = శత్రువు. క్రోధః = కోపము, మిత్రముఖః = మిత్రుని ముఖము గల, రిపుః = శత్రువు. క్రోధః = కోపము, మహాతీక్ష్ణః = చాల వాడియైన, అసిః హి = కత్తి. క్రోధః = కోపము, సర్వమ్ = అంతనూ, అపకర్షతి = క్రిందికి లాగివేయును.

తా. కోపము ప్రాణాలను హరించే శత్రువు. కోపము మిత్రుడు వలె కనబడు శత్రువు. కోపము చాల వాడియైన కత్తి. కోపము సమస్తమునూ నశింపచేయును. 21

మూ. తపతే యజతే చైవ యచ్చ దానం ప్రయచ్ఛతి,
క్రోధేన సర్వం హరతి తస్మాత్ క్రోధం విసర్జయేత్. 22

ప్ర. అ. యత్ తపతే = తపస్సు చేయుచున్నా డనునది ఏది గలదో, యత్ యజతే చైవ = యాగము చేయుచున్నా డనునది ఏది గలదో, దానమ్ = దానమును, యత్ ప్రయచ్ఛతి = ఇచ్చుచున్నా డనునది ఏది గలదో, క్రోధేన = కోపముచేత, సర్వమ్ = సమస్తమునూ, హరతి = హరించును. తస్మాత్ = ఆ కారణమువలన, క్రోధమ్ = కోపమును, విసర్జయేత్ = విడువవలెను.

తా. తపస్సు చేసినా, యజ్ఞాలు చేసినా, దానాలు ఇచ్చినా వాటి నన్నింటినీ కోపముచేత నశింపచేసికొనును. అందువలన కోపమును విడువవలెను. 22

మూ. ఇన్ద్రియాణాం ప్రదుష్టానాం హయానామివ ధావతామ్,
కుర్వీత ధృత్యా సారథ్యం సంహృత్యేన్ద్రియగోచరమ్. 23

ప్ర. అ. ఇన్ద్రియగోచరమ్ = ఇంద్రియములకు గోచరమైన విషయములను, సంహృత్య = ఉపసంహరించి, ప్రదుష్టానామ్ = దుష్టములైన, హయానామివ = గుఱ్ఱములు వలె, ధావతామ్ = పరుగెత్తుచున్న, ఇన్ద్రియాణామ్ = ఇంద్రియములకు, ధృత్యా = ధైర్యముతో, సారథ్యమ్ = సారథ్యమును, కుర్వీత = చేయవలెను.

తా. ఇంద్రియములకు గోచరములైన భోగ్యవిషయములను వాటినుండి దూరము చేసి, దుష్టములైన అశ్వముల వలె పరుగెత్తుచున్న ఇంద్రియములకు ధైర్యముతో (మనఃస్థైర్యముతో) సారథ్యము చేయవలెను. 23

మూ. మనసా కర్మణా వాచా చక్షుషా చ సమాచరేత్,
శ్రేయో లోకస్య చరతో న ద్వేష్టి చ న లిప్యతే. 24

ప్ర. అ. మనసా = మనస్సుచేతను, కర్మణా = కర్మచేతను, వాచా = మాట చేతను, చక్షుషా చ = చూపుచేతను, చరతః = కదలుచున్న, లోకస్య = లోకమునకు, శ్రేయః = శ్రేయస్సును, సమాచరేత్ = చేయవలెను. న ద్వేష్టి = ద్వేషించడు, న లిప్యతే = లిప్తుడుకాడు.

తా. మనస్సు చేత, కర్మచేత, వాక్కుచేత, చూపుచేత, తన ఎదుట నడచుచున్న (వ్యవహరించుచున్న) లోకమునకు శ్రేయస్సు చేయవలెను. అట్టివాడు ఎవరినీ ద్వేషించడు. పాపపుణ్యాదులు ఆతనికి అంటవు. 24

మూ. న తత్కుర్యాదసి స్తీక్ష్ణః సర్పో వా వ్యాహతః పదా,
అరిర్వా నిత్యసంక్రుద్ధో యథాత్మా దురనుష్ఠితః. 25

ప్ర. అ. దురనుష్ఠితః = చెడ్డగా ఉండేటట్లు చేయబడిన (సరిగా అదుపులో ఉంచుకొనబడని), ఆత్మా = మనస్సు, యథా = ఎట్లు (ఎంత అపకారము) చేయునో, తత్ = దానిని, తీక్ష్ణః = వాడియైన, అసిః = కత్తిగాని, పదా = పాదముచేత, వ్యాహతః = కొట్టబడిన, సర్పో వా = సర్పము గాని, నిత్యసంక్రుద్ధః = నిత్యము కోపముతో ఉన్న, అరిః వా = శత్రువు గాని, న కుర్యాత్ = చేయజాలకుండును.

తా. అదుపులో ఉంచుకొనని మనస్సు ఎంత అపకారము చేయునో అంత అపకారమును వాడియైన కత్తి గాని, కాలితో త్రొక్కిన సర్పము గాని, నిత్యమూ కోపముతో ఉన్న శత్రువు గాని చేయజాలరు. 25

మూ. వినీతవినయస్యాపి ప్రకృతిర్న విధీయతే,
ప్రకృతిం గూహమానస్య నిశ్చయేన కృతిర్ధ్రువా. 26

ప్ర. అ. వినీతవినయస్యాపి = నేర్పబడిన వినయము కలవాడైనను, ప్రకృతిమ్ = సహజమైన స్వభావమును, గూహమానస్య = కప్పుచున్నవానికి, ప్రకృతిః

= సహజస్వభావము, న విధీయతే = విధింపబడదు (మార్చబడదు). నిశ్చయేన = నిశ్చయముచేత, కృతిః = చేయుట, ధ్రువా = స్థిరమైనది.

తా. తన సహజమైన స్వభావమును కప్పిపెట్టుకొనువానికి ఎంత వినయము నేర్పినా ఆ ప్రకృతి (సహజస్వభావము) మారదు. నిశ్చయముగా ప్రకృత్యనుసారము పనులు చేయుట తప్పదు.

వి. శ్లోకార్థం అంత స్పష్టంగా లేదు. "నిశ్చయేన కృతిర్ధ్రువా"కు బదులు "నిశ్చయః ప్రకృతిర్ధ్రువా"అని ప్రాచ్యపాఠంలో ఉన్నది. "ప్రకృతియే స్థిరమైనది. ఇది నిశ్చయము" అని దాని అర్థము. భావం సమానమే. 26

మూ. ఏవముక్తః స విప్రో వై రామేణాక్లిష్టకర్మణా,
ద్విజః సర్వార్థసిద్ధస్తు అబ్రవీద్రామసంనిధౌ. 27

ప్ర. అ. అక్లిష్టకర్మణా = శ్రమ లేని పనులు గల, రామేణ = రాముని చేత, ఇతి = ఇట్లు, ఉక్తః = పలకబడిన, సః = ఆ, ద్విజః=ద్విజాతియైన, విప్రః = బ్రాహ్మణుడైన, సర్వార్థసిద్ధః తు = సర్వార్థసిద్ధుడు, రామసంనిధౌ = రాముని సంనిధియందు, అబ్రవీత్ = పలికెను.

తా. శ్రమపడకుండ పనులు చేయు రాముని మాటలు విని, బ్రాహ్మణుడైన ఆ సర్వార్థసిద్ధుడు రాముని సంనిధిలో ఇట్లు పలికెను. 27

మూ. మయా దత్తప్రహారోఽయం క్రోధేనావిష్టచేతసా,
భిక్షార్థమటమానేన కాలే విగతభైక్షకే. 28

ప్ర. అ. భిక్షార్థమ్ = భిక్షకొరకు, అటమానేన = తిరుగుచున్న, విగతభైక్షకే = పోయిన భిక్ష గల (భిక్ష లభించని), కాలే = కాలమునందు, క్రోధేన= కోపముతో, ఆవిష్టచేతసా = ఆవేశించబడిన చిత్తము గల, మయా = నాచేత, అయమ్ = ఇది, దత్తప్రహారః = ఇవ్వబడిన ప్రహారము కలది.

తా. నేను భిక్షకోసమై తిరుగుచుండగా భిక్ష దొరకలేదు. ఆ సమయమున కోపావేశములో ఉన్న నేను ఈ శునకమును కొట్టితిని. 28

మూ. రథ్యాస్థితస్త్వయం శ్వా వై గచ్ఛ గచ్ఛేతి భాషితః,
అథ స్త్వైరేణ గచ్ఛంస్తు రథ్యాస్థే విషమం స్థితః. 29

ప్ర. అ. రథ్యాస్థితః = వీథిలో ఉన్న, అయమ్ = ఈ, శ్వా = కుక్క, గచ్ఛ గచ్ఛ ఇతి = పొమ్ము పొమ్ము అని, భాషితః = పలక బడినది. అథ = అటు పిమ్మట, స్వైరేణ = స్వేచ్ఛగా, గచ్ఛన్తు = వెళ్ళుచు, రథ్యా న్తే = వీథి చివర, విషమమ్ = అడ్డముగా, స్థితః = నిలచినది.

తా. వీథిలో ఉన్న ఈ కుక్కను "వెళ్ళుము, వెళ్ళుము" అని తోలితిని. అయినను ఇది స్వేచ్ఛగా నడచుచు వీథి చివర అడ్డముగా నిలచినది. 29

మూ. క్రోధేన క్షుధయావిష్ట స్తతో దత్తోఽస్య రాఘవ,
ప్రహారో రాజరాజేన్ద్ర శాధి మామపరాధినమ్. 30

ప్ర. అ. రాజరాజేన్ద్ర = రాజరాజులకు ప్రభువైన, రాఘవ = రామా! క్రోధేన = కోపముతోను, క్షుధయా = ఆకలితోను, ఆవిష్టః = ఆవేశింపబడి ఉంటిని. తతః = పిమ్మట(అందువలన), అస్య = దీనికి, ప్రహారః = దెబ్బ, దత్తః = ఇవ్వ బడినది. అపరాధినమ్ = అపరాధినైన, మామ్ = నన్ను, శాధి = శిక్షించుము.

తా. రాజరాజేంద్రా! రామా! ఆ సమయములో ఆకలితో క్రోధావేశములో ఉన్న నేను దానిని కొట్టితిని. అపరాధము చేసిన నన్ను శిక్షింపుము. 30

మూ. త్వయా శస్తస్య రాజేన్ద్ర నా స్తి మే నరకాద్భయమ్,
అథ రామేణ సంపృష్టాః సర్వ ఏవ సభాసదః. 31

ప్ర. అ. రాజేన్ద్ర = రాజేంద్రా! త్వయా = నీచేత, శస్తస్య = శిక్షింప బడిన, మే = నాకు, నరకాత్ = నరకమువలన, భయమ్ = భయము, నా స్తి = లేదు. అథ = అటుపిమ్మట, రామేణ = రామునిచేత, సర్వే ఏవ = సమస్తమైన, సభాసదః = సభాసదులు, సంపృష్టాః = అడగబడినారు.

తా. "రాజేంద్రా! నీవు శిక్షించినచో నాకింక నరకభయము ఉండదు." పిమ్మట రాముడు సభలో ఉన్నవారినందరినీ ఇట్లు అడిగెను. 31

మూ. కిం కార్యమస్య వై బ్రూత దణ్డో వై కోఽస్య పాత్యతామ్,
సమ్యక్ ప్రణిహితే దణ్డే ప్రజా భవతి రక్షితా. 32

ప్ర. అ. కిమ్ = ఏమి, కార్యమ్ = చేయదగినది? అస్య = వీనికి, కః

దణ్డః = ఏమి దండనము, పాత్యతాం వై = పడవేయ(ఇవ్వ) బడుగాక ? దణ్డే= దండము, సమ్యక్ = బాగుగా, ప్రణిహితే = చేయబడిన దగుచుండగా, ప్రజా = ప్రజ, రక్షితా = రక్షింపబడినది, భవతి = అగును. బ్రూత = చెప్పండి ?

తా. ఇప్పు డేమి చేయవలెను? ఇతనికి ఎట్టి శిక్ష ఇవ్వవలెనో చెప్పండి. సరిగా శిక్ష ఇచ్చినపుడే ప్రజలు రక్షింపబడుదురు. 32

మూ. భృగ్వఙ్గిరసకుత్సాద్యా వసిష్ఠశ్చ సకాశ్యపః,
ధర్మపాఠకముఖ్యాశ్చ సచివా నైగమా స్తథా, 33
ఏతే చాన్యే చ బహవః పణ్డితా స్తత్ర సంగతాః,
అవధ్యో బ్రాహ్మణో దణ్డైరితి శాస్త్రవిదో విదుః, 34
బ్రువతే రాఘవం సర్వే రాజధర్మేషు నిష్ఠితాః.

ప్ర. ఆ. భృగ్వఙ్గిరసకుత్సాద్యాః = భృగుపు, ఆంగిరసుడు, కుత్సుడు మొదలైనవారు, సకాశ్యపః = కాశ్యపునితో కూడిన, వసిష్ఠః చ = వసిష్ఠుడు, ధర్మ పాఠకముఖ్యాః చ = ధర్మశాస్త్రములు చదివినవారిలో ముఖ్యులు, సచివాః = మంత్రులు, తథా = మరియు, నైగమాః = నైగములు, ఏతే = వీరు, తత్ర = అక్కడ, సంగతాః = కలిసిన, రాజధర్మేషు = రాజధర్మములయందు, నిష్ఠితాః = నిష్ఠ గల, బహవః = అనేకులు, అన్యే = ఇతరులైన, పణ్డితాః చ = పండితులూ, సర్వే = అందరూ, బ్రాహ్మణః = బ్రాహ్మణుడు, దణ్డైః = దండనములచేత, అవధ్యః = చంపదగనివాడు (పీడింపదగనివాడు), ఇతి = అని, శాస్త్రవిదః = శాస్త్రవేత్తలు, విదుః = తెలుసుకొనుచున్నారు అని, రాఘవమ్ = రామున్ని గూర్చి, బ్రువతే = చెప్పుచున్నారు (చెప్పిరి).

తా. భృగు-అంగిరస-కుత్స- వసిష్ఠ- కాశ్యపాదులు, ధర్మశాస్త్రాధ్యయనము చేసినవారిలో ప్రముఖులు, మంత్రులు, ఆ యా సంఘముల ముఖ్యులు, ధర్మశాస్త్రములలో నిష్ణాతులైన, అక్కడ కలిసిన ఇంకా ఎందరో పండితులూ రామునితో "బ్రాహ్మణుణ్ణి దండించకూడదు అని శాస్త్రవేత్తలు చెప్పుచున్నారు"అని పలికిరి.

మూ. అథ తే మునయః సర్వే రామమేవా బ్రువం స్తదా, 35
రాజా శాస్తా హి సర్వస్య త్వం విశేషేణ రాఘవ,
త్రైలోక్యస్య భవాన్ శాస్తా దేవో విష్ణుః సనాతనః. 36

ప్ర. అ. అథ = అటుపిమ్మట, తే మునయః = ఆ మునులు, సర్వే = అందరూ, తదా = అప్పుడు, రామమ్ ఏవ = రాముణ్ణి గూర్చి, అబ్రువన్ = పలికిరి. రాఘవ = రామా ! రాజా = రాజు, సర్వస్య = అందరికీ, శాస్తా హి = శిక్షకుడు కదా ? త్వమ్ = నీవు, విశేషేణ = విశేషముచేత శిక్షకుడవు. సనాతనః = ప్రాచీనుడైన, దేవః = దేవుడవైన, విష్ణుః = విష్ణువైన, భవాన్ = నీవు, త్రైలోక్యస్య = మూడులోకాలసముదాయమునకు, శాస్తా = శిక్షకుడవు.

తా. పిమ్మట ఆ మును లందరూ అప్పుడు రామునితో-"రామా ! అందరినీ శిక్షించువాడు రాజే కదా ? విశేషించి నీవు శాసకుడవు. సనాతనుడైన విష్ణువైన నీవు మూడు లోకాలను శాసించువాడవు"అని పలికిరి. 35,36

మూ. ఏవముక్తే తు తైః సర్వైః శ్వా వై వచనమబ్రవీత్,
యది తుష్టోఽసి మే రామ యది దేయో వరో మమ, 37

ప్రతిజ్ఞాతం త్వయా వీర కిం కరోమీతి విశ్రుతమ్,
ప్రయచ్ఛ బ్రాహ్మణస్యాస్య కౌలపత్యం నరాధిప, 38
కాలఞ్జరే మహారాజ కౌలపత్యం ప్రదీయతామ్.

ప్ర. అ. తైః సర్వైః = వారందరిచేతా, ఏవమ్ = ఇట్లు, ఉక్తే = పలకబడగా, శ్వా = శునకము, వచనమ్ = వచనమును, అబ్రవీత్ వై = పలికెను. రామ = రామా ! మే = నా విషయమునందు, తుష్టః అసి యది = నీవు సంతోషించినట్లయితే, మమ = నాకు, వరః = వరము, దేయః యది = ఇవ్వదగినదైతే, (చెప్పెదను). వీర = వీరుడా, కిమ్ = ఏమి, కరోమి = చేయుదును. ఇతి = అని, త్వయా = నీచేత, విశ్రుతమ్ = బిగ్గరగా వినబడునట్లు, ప్రతిజ్ఞాతమ్ = ప్రతిజ్ఞ చేయబడినది. నరాధిప = రాజా ! అస్య బ్రాహ్మణస్య = ఈ బ్రాహ్మణునకు, కౌలపత్యమ్ = కులపతిత్వమును (దేవాలయ మఠాద్యాధిపత్యమును), ప్రయచ్ఛ = ఇమ్ము. మహారాజ = మహారాజా ! కాలఞ్జరే = కాలంజరక్షేత్రమునందు, కౌలపత్యమ్ = కులపతిత్వము, ప్రదీయతామ్ = ఇవ్వబడుగాక.

తా. వారందరు ఇట్లు చెప్పిన పిమ్మట శునకము ఇట్లు పలికెను- "రామా ! నీవు నా విషయమున అనుగ్రహించినట్లయితే, నాకు వరము ఇవ్వదలచినట్లయితే చెప్పెదను వినుము. వీరుడా ! "నీకు ఏమి చేయుదును ?" అని నీవు ప్రతిజ్ఞా

పూర్వకముగా అందరిలోనూ అడిగితివి కదా ? రాజా! ఈ బ్రాహ్మణునకు కుల పతిత్వమును ఇమ్ము. మహారాజా ! కాలంజరక్షేత్రములో కులపతిత్వమును ఇమ్ము.'' 37,38

మూ. ఏతచ్ఛ్రుత్వా తు రామేణ కౌలపత్యేఽభిషేచితః, 39
ప్రయయౌ బ్రాహ్మణో హృష్టో గజస్కన్ధేన సోఽర్చితః.

ప్ర. అ. ఏతత్=దీనిని, శ్రుత్వా=విని, రామేణ=రామునిచేత, బ్రాహ్మణః =బ్రాహ్మణుడు, కౌలపత్యే = కులపతిత్వమునందు, అభిషేచితః = అభిషేకింప బడి, హృష్టః = సంతోషించినవాడై, ప్రయయౌ = వెళ్ళెను. సః = అతడు, గజ స్కన్ధేన=ఏనుగు మూపుచేత (మూపు ఎక్కించి), అర్చితః=సన్మానింపబడినాడు. (అతడు శిక్ష పొందడానికి బదులు పదవి పొందుట అనేది ఏనుగుమీద ఊరేగించడం వంటిది అని భావము). 39

తా. రాముడు దీనిని విని బ్రాహ్మణుని కులపతిని చేయగా అతడు సంతోషించినవాడై వెళ్లెను. ఇట్లతడు ఏనుగు నెక్కించినంతగా గౌరవింపబడెను.

మూ. అథ తే రామసచివాః స్మయమానా వచోఽబ్రువన్, 40
వరోయం దత్త ఏతస్య నాయం శాపో మహాద్యుతే.

ప్ర. అ. అథ=అటు పిమ్మట, తే=ఆ, రామసచివాః=రాముని మంత్రులు, స్మయమానాః = ఆశ్చర్యపడుచు, అబ్రువన్ = పలికిరి. మహాద్యుతే = గొప్ప కాంతి కలవాడా ! ఏతస్య = వీనికి, ఏషః = ఇది, వరః దత్తః = వరము ఇవ్వ బడినది. అయమ్ = ఇది. శాపః = శాపము(దండనము), న = కాదు.

తా. అప్పుడు రాముని మంత్రులు ఆశ్చర్యపడుచు - "గొప్ప కాంతి గల రామా ! ఇది ఈతనికి వర మిచ్చినట్లయినది; దండనము కాదు" అనిరి. 40

మూ. ఏవముక్తస్తు సచివై రామో వచనమబ్రవీత్, 41
న యూయం గతితత్త్వజ్ఞాః శ్వా వై జానాతి కారణమ్.

ప్ర. అ. సచివైః = మంత్రులచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, రామః = రాముడు, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను. యూయమ్=

మీరు, గతితత్త్వజ్ఞాః = గతియొక్క తత్త్వమును ఎరిగినవారు, న = కారు. శ్వా= శునకము, కారణమ్ = కారణమును, జానాతి = ఎరుగును.

తా. రాముడు మంత్రుల మాటలు విని వారితో-"మీకు దీనిలోని రహస్యము తెలియదు; ఇందుకు కారణము ఈ శునకమునకు తెలియును"అని పలికెను. 44

మూ. అథ పృష్టస్తు రామేణ సారమేయోఽబ్రవీదిదమ్, 42
అహం కులపతిస్తత్ర ఆసం శిష్టాన్నభోజనః,
దేవద్విజాతిపూజాయాం దాసీదాసేషు రాఘవ, 43

సంవిభాగీ శుభరతిర్దేవద్రవ్యస్య రక్షితా,
వినీతః శీలసంపన్నః సర్వభూతహితే రతః. 44
సోఽహం ప్రాప్త ఇమాం ఘోరామవస్థామధమాం గతిమ్.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, రామేణ = రామునిచేత, పృష్టః = అడగబడిన, సారమేయః = శునకము, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను. రాఘవ = రామా ! అహమ్ = నేను, తత్ర = అక్కడ, కులపతిః = కులపతిగా, ఆసమ్ = ఉంటిని. దేవద్విజాతిపూజాయామ్ = దేవతలయొక్క, బ్రాహ్మణులయొక్క పూజయందు, శిష్టాన్నభోజనః = మిగిలిన అన్నమును భుజించువాడు, దాసీదాసేషు = దాసీదాసులయందు, సంవిభాగీ = ధనాదికమును పంచి ఇచ్చేవాడు, శుభరతిః = శుభములయందు ఆసక్తి కలవాడు, దేవద్రవ్యస్య = దేవతాద్రవ్యమునకు, రక్షితా = రక్షకుడు, వినీతః = వినయసంపన్నుడు, శీలసంపన్నః = మంచి శీలము కలవాడు, సర్వభూతహితే = సకలభూతముల హితమునందు, రతః = ఆసక్తుడు అయిన, సః అహమ్ = అట్టి నేను, ఘోరామ్ = ఘోరమైన, ఇమామ్ = ఈ, అవస్థామ్ = అవస్థను, అధమామ్ = అధమమైన, గతిమ్ = గతిని, ప్రాప్తః = పొందితిని.

తా. రాముడు అడుగగా ఆ శునకము ఇట్లు చెప్పెను- "రామా ! నేను అక్కడ కులపతిగా ఉంటిని. దేవతాబ్రాహ్మణుల పూజ జరిగిన పిమ్మట మిగిలిన దానిని మాత్రమే తినుచుండేవాడను. దాసీదాసులకు అన్నాదులు ఇచ్చుచు, శుభమైన బుద్ధితో దేవతాద్రవ్యమును రక్షించుచుంటిని. శీలవినయసంపన్నుడనై

సమస్త ప్రాణులయందూ కూడ దయ కలవాడనై ఉండెడివాడను. అట్టి నాకే ఈ ఘోరమైన ఇట్టి అవస్థా, అధమగతీ వచ్చినవి." 42-44

మూ. ఏవం క్రోధాన్వితో విప్ర స్త్యక్తధర్మాహితే రతః, 45
క్రుద్ధో నృశంసః పరుష అవిద్వాంశ్చాప్యధార్మికః,
కులాని పాతయత్యేవ సప్త సప్త చ రాఘవ. 46

ప్ర. అ. రాఘవ = రామా! ఏవమ్ = ఈ విధముగా, క్రోధాన్వితః = క్రోధముతో కూడిన, త్యక్తధర్మా = విడవబడిన ధర్ముగల, అహితే = అహితమునందు, రతః = ఆసక్తుడైన, క్రుద్ధః = కోపించిన, నృశంసః = క్రూరుడైన, పరుషః = కఠినుడైన, అవిద్వాన్ చ = అవిద్వాంసుడైన, అధార్మికః = అధార్మికుడైన, విప్రః = బ్రాహ్మణుడు, సప్త సప్త చ = ఏడేసి ఏడేసి, కులాని = కులములను, పాతయత్యేవ = పతితము లగునట్లు చేయును.

తా. (అంత పవిత్రజీవితము గడపిన నాకే ఈ కులపతిత్వము మూలమున ఇట్టి గతి పట్టినదనగా) కోపస్వభావుడు, ధర్మమును పరిత్యజించినవాడు, అహితము చేయుటయందు ఆసక్తి కలవాడు, క్రుద్ధుడు, క్రూరుడు, కఠినుడు, అవిద్వాంసుడు, అధార్మికుడు అయిన ఈ బ్రాహ్మణుడు (కులపతిత్వమును వహించి) వెనుకటి తరాలను ఏడించిని, రాబోవు తరాలు ఏడించిని పతితములుగా చేయును. 45,46

మూ. తస్మాత్సర్వాస్వవస్థాసు కౌలపత్యం న కారయేత్,
యమిచ్ఛేన్నరకం నేతుం సపుత్రపశుబాన్ధవమ్, 47
దేవేష్వధిష్ఠితం కుర్యాద్ గోషు చ బ్రాహ్మణేషు చ.

ప్ర. అ. తస్మాత్ = ఆ కారణమువలన, సర్వాసు = అన్ని, అవస్థాసు = అవస్థలయందూ కూడ, కౌలపత్యమ్ = కులపతిత్వమును, న కారయేత్ = చేయ కూడదు. యమ్ = ఎవనిని, సపుత్రపశుబాన్ధవమ్ = పుత్రపశుబంధుసహితముగా, నరకమ్ = నరకమును గూర్చి, నేతుమ్ = తీసికొనిపోవుటకు (పొందించుటకు), ఇచ్ఛేత్ = ఇచ్ఛయించునో, వానిని, దేవేషు = దేవతలయందు, గోషు చ = గోవుల యందు, బ్రాహ్మణేషు చ = బ్రాహ్మణులయందు, అధిష్ఠితమ్ = అధికారము గల వానినిగా, కుర్యాత్ = చేయవలెను.

తా. అందువలన ఎట్టి పరిస్థితులలోనూ కూడ కులపతిత్వమును చేయ కూడదు. ఎవనిని వ్రత-పశు-బంధుసహితముగా నరకమునకు పంపవలె ననికోరిక ఉండునో వానికి దేవతలమీద (దేవాలయాలమీద) గోవులమీద, బ్రాహ్మణుల మీద అధికార మివ్వవలెను. 47

మూ. బ్రహ్మస్వం దేవతాద్రవ్యం స్త్రీణాం బాలధనం చ యత్,
దత్తం హరతి యో భూయ ఇష్టైః సహ వినశ్యతి.

ప్ర. అ. యః=ఎవడు, దత్తమ్ = ఇవ్వబడిన, బ్రహ్మస్వమ్=బ్రాహ్మణధనమును, దేవతాద్రవ్యమ్ = దేవతాద్రవ్యమును, స్త్రీణామ్ = స్త్రీలధనమును, యత్ = ఏ, బాలధనమ్ = బాలుల ధన మున్నదో, దానినీ, భూయః = మరల, హరతి = హరించునో, అతడు, ఇష్టైః సహ = ఇష్టులతో కూడ, వినశ్యతి = నశించును.

తా. ఎవడు తానే ఇచ్చిన లేదా తన దగ్గర రక్షణార్థమై ఉంచిన, బ్రాహ్మణధనమును, దేవతాధనమును, స్త్రీధనమును, బాలధనమును హరించునో అతడు ఇష్టులతో కూడ నశించును. 48

మూ. బ్రాహ్మణద్రవ్యమాదత్తే దేవానాం చైవ రాఘవ, 49
సద్యః పతతి ఘోరే వై నరకేఽవీచిసంజ్ఞకే.

ప్ర. అ. రాఘవ = రామా ! (ఎవడు), బ్రాహ్మణద్రవ్యమ్ = బ్రాహ్మణద్రవ్యమును, దేవానాం చైవ=దేవతలయొక్క ద్రవ్యమును, ఆదత్తే=గ్రహించునో అతడు, సద్యః = వెంటనే, ఘోరే = ఘోరమైన, అవీచిసంజ్ఞకే = అవీచి అను పేరు గల, నరకే = నరకమునందు, పతతి = పడును.

తా. రామా! బ్రాహ్మణద్రవ్యమును, దేవతాద్రవ్యమును అపహరించినవాడు వెంటనే అవీచి అనే నరకమునందు పడును. 49

మూ. మనసాపి హి దేవస్వం బ్రహ్మస్వం చ హరేత్తు యః, 50
నిరయాన్నిరయం నిత్యం పతత్యేవ నరాధమః.

ప్ర. అ. యః = ఎవడు, మనసాపి = మనస్సుచేత నైనా, దేవస్వమ్ = దేవతాధనమును, బ్రహ్మస్వం చ=బ్రాహ్మణధనమును, హరేత్తు=హరించునో,

నరాధమః=అట్టి నరాధముడు, నిత్యమ్ = నిత్యమూ, నిరయాత్ = నరకమునుండి, నిరయమ్=మరొక నరకమును (నందు), పతత్యేవ = పడుచునే ఉండును.

తా. దేవతల ధనమునూ, బ్రాహ్మణధనమునూ మనస్సుచేతనైనా ఎవడు కోరుకొనునో ఆ నరాధముడు నిత్యము నరకములో పడును. 50

మూ. తచ్ఛ్రుత్వా వచనం రామో విస్మయోత్ఫుల్లలోచనః, 51
శ్వాప్యగచ్ఛన్మహాతేజా యత ఏవాగతస్తతః.

ప్ర. అ. రామః = రాముడు, తత్=ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, విస్మయోత్ఫుల్లలోచనః = ఆశ్చర్యముచేత వికసించిన నేత్రములు కలవాడాయెను; మహాతేజాః=గొప్ప తేజస్సు గల, శ్వాపి=శునకముకూడ, యతః ఏవ = ఎక్కడినుండి, ఆగతః = వచ్చినదో, తతః = అటువైపు, ఆగచ్ఛత్ = వెళ్లెను.

తా. ఆ మాటలు విని రాముని నేత్రములు ఆశ్చర్యముతో వికసించెను. ఆ శునకము కూడ వచ్చినచోటికే వెళ్ళిపోయెను. 51

మూ. మనస్వీ పూర్వజాతిజ్ఞో జాతిమాత్రోపదూషితః,
వారాణస్యాం మహాభాగః ప్రాయం చోపవివేశ హ. 52

ఇత్యార్షే శ్రీమదాదిమాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ప్రక్షిప్తసర్గః ద్వితీయః.

ప్ర. అ. మనస్వీ = ఆత్మాభిమానముకలది, పూర్వజాతిజ్ఞః = పూర్వజన్మను ఎరిగినదీ అయిన, జాతిమాత్రోపదూషితః= కేవలము జాతిచేతనే దూషితమైన, మహాభాగః = గొప్ప భాగ్యము గల ఆ శునకము, వారాణస్యామ్ = వారాణసిలో, ప్రాయమ్ ఉపవివేశ హ = ప్రాయోపవేశము చేసెను.

తా. ఆత్మాభిమానము గలది, పూర్వజన్మజ్ఞానము గలది, జాతిమాత్రము చేతనే దూషింపబడినది (నీచముగా పరిగణింపబడుచున్నది) అయిన, గొప్ప భాగ్యము గల ఆ శునకము వారాణసిలో ప్రాయోపవేశము చేసి ప్రాణములు విడచెను. 52

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో రెండవ ప్రక్షిప్తసర్గ సమాప్తము.

అథ తృతీయః ప్రక్షిప్తసర్గః

[గ్రద్ధ గుడ్లగూబల వివాదము.]

మూ. అథ తస్మిన్వనోద్దేశే రమ్యే పాదపశోభితే,
నదీకీర్ణే గిరివరే కోకిలానేకకూజితే. 1

సింహవ్యాఘ్రసమాకీర్ణే నానాద్విజగణావృతే,
గృధ్రోలూకౌ ప్రవసతో బహువర్షగణానపి. 2

ప్ర. అ. అథ = అటుపిమ్మట, రమ్యే = సుందరమైన, పాదపశోభితే = వృక్షములచేత ప్రకాశింపచేయబడిన, నదీకీర్ణే = నదిచేత వ్యాప్తమైన, వనోద్దేశే = వనమునందు, కోకిలానేకకూజితే = అనేకములైన కోకిలలచేత ధ్వనింపచేయబడుచున్న, సింహవ్యాఘ్రసమాకీర్ణే = సింహములతోను వ్యాఘ్రములతోను నిండిన, నానాద్విజగణావృతే = అనేకవిధములైన పక్షిసముదాయములతో కూడిన, గిరివరే = పర్వతశ్రేష్ఠమైన, బహువర్షగణాన్ అపి = అనేకసంవత్సరముల సముదాయములను, గృధ్రోలూకౌ = గ్రద్ధ గుడ్లగూబ, ప్రవసతః = నివసించుచున్నవి.

తా. వృక్షములతో ప్రకాశించుచున్న, నదిచేత వ్యాప్తమైన ఆ వనమునందు అనేక కోకిలలచేత ధ్వనింపచేయబడిన, సింహములతోను పెద్దపులులతోను వ్యాప్తమైన, అనేకవిధములైన వక్షులగుంపులతో నిండిన పర్వతశ్రేష్ఠముమీద అనేక సంవత్సరముల (సముదాయముల) నుండి ఒక గ్రద్ద, ఒక గుడ్లగూబ నివసించుచుండెను. 1,2

మూ. అథోలూకస్య భవనం గృధ్రః పాపవినిశ్చయః,
మమేదమితి కృత్వాసౌ కలహం తేన చాకరోత్. 3

ప్ర. అ. అథ = అటుపిమ్మట, పాపవినిశ్చయః = పాపబుద్ధి గల, అసౌ = ఈ, గృధ్రః = గ్రద్ధ, ఉలూకస్య = ఉలూకముయొక్క, భవనమ్ = భవనమును

ఇదమ్ = ఇది, మమ = నాది, ఇతి = అని, కృత్వా = చేసి (అని), తేన = దానితో, కలహమ్ = కలహమును, అకరోత్ = చేసెను.

తా. పాపబుద్ధి గల ఆ గ్రద్ద, గుడ్లగూబ ఇంటిని గూర్చి ఇది నాది అని చెప్పుచు కలహము ప్రారంభించెను. 3

మూ. రాజా సర్వస్య లోకస్య రామో రాజీవలోచనః,
తం ప్రపద్యావహే శీఘ్రం యస్యైతద్భవనం భవేత్. 4

ప్ర. అ. రాజీవలోచనః = పద్మముల వంటి నేత్రములు గల, రామః = రాముడు, సర్వస్య = సమస్తమైన, లోకస్య = లోకమునకు, రాజా = రాజు. ఏతత్ = ఇది, యస్య = ఎవనియొక్క, భవనమ్ = భవనము, భవేత్ = అగునో తమ్ = ఆ రాముణ్ణి, శీఘ్రమ్ = శీఘ్రముగా, ప్రపద్యామహే = పొందెదము.

తా. పద్మనేత్రుడైన రాముడు సమస్త లోకమునకు రాజు. ఈ ఇల్లు ఎవరిదో తేల్చుకొనుటకు ఆ రామునివద్దకు వెళ్లెదము. 4

మూ. ఇతి కృత్వా మతిం తాం తు నిశ్చయార్థం సునిశ్చితామ్,
గృధ్రోలూకౌ ప్రపద్యేతాం కోపావిష్టౌ హ్యమర్షితౌ. 5

ప్ర. అ. ఇతి = ఇట్లు. నిశ్చయార్థమ్ = నిర్ణయము కొరకు, సునిశ్చితామ్ = బాగా నిశ్చయమైన, తామ్ = ఆ, మతిమ్ = బుద్ధిని. కృత్వా = చేసి, కోపావిష్టౌ = కోపావిష్టములైన, అమర్షితౌ = ఆమర్షములతో కూడిన, గృధ్రోలూకౌ = గృధ్రోలూకములు, ప్రపద్యేతామ్ = (రాముణ్ణి) చేరినవి.

తా. కోపావిష్టములైన ఆ గృధ్రోలూకములు, అమర్షముతో ఈ విధముగ నిశ్చయించుకొని నిర్ణయముకొరకై రామునివద్దకు వెళ్ళినవి. 5

మూ. రామం ప్రపద్య తౌ శీఘ్రం కలివ్యాకులచేతసౌ,
తౌ పరస్పరవిద్వేషాత్ స్పృశతుశ్చరణౌ తదా. 6

ప్ర. అ. కలివ్యాకులచేతసౌ = కలహముచేత వ్యాకులమైన చిత్తము గల, తౌ = అవి, శీఘ్రమ్ = శీఘ్రముగా, పరస్పరవిద్వేషాత్ = పరస్పరద్వేషమువలన, రామమ్ = రాముణ్ణి, ప్రపద్య = పొంది, తదా = అప్పుడు, తౌ = ఆ, చరణౌ = పాదములను, స్పృశతుః = స్పృశించినవి.

తా. కలహముచేత వ్యాకులమైన చిత్తములు గల ఆ గృధ్రోలూకములు అప్పుడు పరస్పరద్వేషముతో శీఘ్రముగా రామునివద్దకు వెళ్ళి అతని పాదములు స్పృశించి నమస్కరించినవి. 6

మూ. అథ దృష్ట్వా నరేన్ద్రం తం గృధ్రో వచనమబ్రవీత్,
సురాణామసురాణాం చ ప్రధానస్త్వం మతో మమ. 7

ప్ర. అ. అథ = పిమ్మట, గృధ్రః = గ్రద్ద, తమ్ = ఆ, నరేన్ద్రమ్ = రాజును, దృష్ట్వా = చూచి, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను. త్వమ్ = నీవు, సురాణామ్ = సురులలోను, అసురాణాం చ = అసురులలోను, ప్రధానః = ప్రధానుడవుగా, మమ = నాకు, మతః = ఇష్టుడవు.

తా. పిమ్మట ఆ గృధ్రము రాజును చూచి నీవు సురాసురులలో ప్రధానుడవు అని నా నమ్మకము. 7

మూ. బృహస్పతేశ్చ శుక్రాచ్చ విశిష్టోఽసి మహాద్యుతే,
పరావరజ్ఞో భూతానాం కాన్త్యా చన్ద్రి ఇవాపరః. 8

ప్ర. అ. మహాద్యుతే = గొప్ప కాంతి గలవాడా! బృహస్పతేః చ = బృహస్పతికంటె, శుక్రాచ్చ = శుక్రునికంటె, విశిష్టః = గొప్పవాడవు, అసి = అయిఉన్నావు. భూతానామ్ = ప్రాణులయొక్క, పరావరజ్ఞః = తారతమ్యములు ఎరిగినవాడవు. కాన్త్యా = కాంతిచేత, అపరః = మరియొక, చన్ద్రిః = చంద్రుడు వంటివాడవు.

తా. గొప్ప కాంతి గలవాడా! నీవు బృహస్పతికంటె, శుక్రాచార్యునికంటె గొప్పవాడవు. ప్రాణులలో తారతమ్యము తెలిసినవాడవు. కాంతిచేత మరియొక చంద్రునివంటివాడవు. 8

మూ. దుర్నిరీక్ష్యో యథా సూర్యో హిమవాంశ్చైవ గౌరవే,
సాగరశ్చైవ గామ్భీర్యే లోకపాలో యమో హ్యసి. 9

ప్ర. అ. సూర్యః యథా = సూర్యుడు వలె, దుర్నిరీక్ష్యః = చూడ శక్యము కానివాడవు. గౌరవే = గౌరవమునందు, హిమవాన్ చైవ = హిమవంతుడవు,

గామ్భీర్యే = గాంభీర్యమునందు, సాగరః చ ఏవ = సముద్రుడవు. లోకపాలః = లోకపాలుడైన, యమః = యముడవుగా, అసి = అయిఉన్నావు.

తా. సూర్యుడు వలె నీవు చూడశక్యము కానివాడవు. గౌరవమునందు హిమవంతుడవు. గాంభీర్యములో సముద్రుడవు. లోకపాలుడవైన యముడవు. 9

మూ. క్షాన్త్యా ధరణ్యా తుల్యోఽసి శీఘ్రతేవ హ్యనిలోపమః,
గురుస్త్వం సర్వసంపన్నః కీర్తియుక్తశ్చ రాఘవ. 10

ప్ర. అ. రాఘవ = రామా! త్వమ్ = నీవు, క్షాన్త్యా = కాంతిచేత, ధరణ్యా = భూమితో, తుల్యః = సమానుడవు, అసి = అయి ఉన్నావు. శీఘ్రతేవ = శీఘ్రత్వమునందు, అనిలోపమః = వాయువుతో సమానుడవు, గురుః = పూజ్యుడవు, సర్వసంపన్నః = సర్వసమృద్ధి కలవాడవు, కీర్తియుక్తః చ = కీర్తితో కూడినవాడవు.

తా. రామా! నీవు ఓర్పుచేత భూమితో సమానుడవు. శీఘ్రత్వములో వాయువుతో సమానుడవు. పూజ్యుడవు. అన్ని సంపదలూ ఉన్నవాడవు. కీర్తి గలవాడవు. 10

మూ. అమర్షీ దుర్జయో జేతా సర్వాస్త్రవిధిపారగః,
శృణుష్వ మమ వై రామ విజ్ఞాప్యం నరపుఙ్గవ. 11

ప్ర. అ. అమర్షీ = పట్టుదలకలవాడవు. దుర్జయః = జయింప శక్యము కానివాడవు. జేతా = జయించువాడవు. సర్వాస్త్రవిధిపారగః = సమస్తమైన అస్త్ర ప్రయోగముల అంతమును పొందినవాడవు. నరపుఙ్గవ = నరులలో శ్రేష్ఠుడా! రామ = రామా! మమ = నాయొక్క, విజ్ఞాప్యమ్ = విజ్ఞాపించవలసిన విషయమును, శృణుష్వ = వినుము.

తా. పట్టుదలగలవాడవు. జయింపశక్యము కానివాడవు. జయించువాడవు. సకలాస్త్రముల విధానము తెలిసినవాడవు. నరశ్రేష్ఠుడవైన రామా! నేను విజ్ఞాపన చేయునది వినుము. 11

మూ. మమాలయం పూర్వకృతం బాహువీర్యేణ రాఘవ,
ఉలూకో హరతే రాజంస్తత్ర త్వం త్రాతుమర్హసి. 12

ప్ర. అ. రాజన్ = రాజా! రాఘవ = రామా! పూర్వకృతమ్ = పూర్వము నిర్మించబడిన, మమ = నాయొక్క, ఆలయమ్ = గృహమును, ఉలూకః = ఉలూకము, బాహువీర్యేణ = బాహుబలముచేత, హరతి = హరించుచున్నది, తత్ర = ఆ విషయమునందు, త్వమ్ = నీవు, త్రాతుమ్ = రక్షించుటకు, అర్హసి = తగి ఉన్నావు.

తా. మహారాజా! రామా! నేను పూర్వము నిర్మించుకొన్న గృహమును ఈ ఉలూకము బాహుబలముచేత హరించుచున్నది. ఆ విషయమున నీవు రక్షించవలయును. 12

మూ. ఏవముక్తే తు గృధ్రేణ ఉలూకో వాక్యమబ్రవీత్,
సోమాచ్ఛతక్రతోః సూర్యాద్ధనదాద్వా యమాత్తథా. 13

జాయతే వై నృపో రామ కించిద్భవతి మానుషః,
త్వం తు సర్వమయో దేవో నారాయణ ఇవాపరః. 14

ప్ర. అ. గృధ్రేణ = గ్రద్దచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తే = చెప్పబడగా, ఉలూకః = ఉలూకము, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. రామ = రామా! నృపః = రాజు, సోమాత్ = చంద్రునివలన, శతక్రతోః = ఇంద్రునివలన, సూర్యాత్ = సూర్యునివలన, ధనదాత్ = కుబేరునివలన, తథా = మరియు, యమాత్ = యమునివలన, జాయతే = పుట్టును. కించిత్ = కొంచెము, మానుషః = మనుష్యుడుగా, భవతి = ఉండును. త్వం తు = నీవైతే, అపరః = మరియొక, దేవః = దేవుడైన, నారాయణః ఇవ = నారాయణుడు వలె, సర్వమయః = సకల దేవతాస్వరూపుడవు.

తా. గ్రద్ద ఇట్లు చెప్పిన తరవాత ఉలూకము ఇట్లు పలికెను. "రామా! రాజు చంద్ర–ఇంద్ర–సూర్య–కుబేర–యములవలన పుట్టును. మనుష్యాంశ కొంచెము మాత్రమే ఉండును. కాని నీవు మాత్రము రెండవ నారాయణుడు వలె సకల దేవస్వరూపుడవు. 13, 14

మూ. యా చ తే సౌమ్యతా రాజన్ సమ్యక్ప్రణిహితా విభో,
సమం చరసి చాన్విష్య తేన సోమాంశకో భవాన్. 15

ప్ర. అ. రాజన్ = రాజా! విభో = ప్రభూ! తే = నీయొక్క, యా =

ఏ, సౌమ్యతా = సౌమ్యత్వమున్నదో అది, సమ్యక్ = బాగుగా, ప్రణిహితా = ఉంచబడినది. అన్విష్య = బాగుగా పరిశీలించి, సమమ్ = సముగా, చరసి = ప్రవర్తించుచున్నావు. తేన = ఆ కారణముచేత, భవాన్ = నీవు, సోమాంశకః = సోమాంశ ఉన్నవాడవు.

తా. రామా! నీవు నీ సౌమ్యత్వమును బాగుగా పరిశీలించి సమముగా ప్రవర్తింపచేయుదువు. అందువలన నీలో సోమాంశ ఉన్నది. 15

మూ. క్రోధే దణ్డే ప్రజానాథ దానే పాపభయాపహః,
దాతా హర్తాసి గోప్తాసి తేనేన్ద్రో ఇవ నో భవాన్. 16

ప్ర. అ. క్రోధే = కోపమునందు, దణ్డే = దండమునందు, దానే = దానమునందు, పాపభయాపహః = పాపభయమును పోగొట్టినవాడవు. ప్రజానాథ = ప్రజలనాథుడా! తేన = ఆ కారణముచేత, భవాన్ = నీవు, నః = మాకు, ఇన్ద్రో ఇవ = ఇంద్రుడు వలె, దాతా = దాతవు, హర్తా = హరించువాడవు, అసి = అయి ఉన్నావు. గోప్తా = రక్షకుడవు, అసి = అయి ఉన్నావు.

తా. ప్రజల నాథుడవైన రామా! నీవు క్రోధమునందు. దండమునందు, దానమునందు, పాపభయమును పోగొట్టి ఇంద్రుడు వలె దాతవు, హర్తవు, రక్షకుడవు అయి ఉన్నావు. 16

మూ. అధృష్యః సర్వభూతేషు తేజసా చానలోపమః,
అభీక్ష్ణం తపసే లోకాంస్తేన భాస్కరసంనిభః. 17

ప్ర. అ. సర్వభూతేషు = సకలభూతములయందు, అధృష్యః = ఎదిరింప శక్యము కానివాడవై, తేజసా = తేజస్సుచేత, అనలోపమః = అగ్నితో సమానుడవై, లోకాన్ = లోకములను, అభీక్ష్ణమ్ = మిక్కిలి, తపసే = తపింపచేయుచున్నావు. తేన = ఆ కారణముచేత, భాస్కరసంనిభః = సూర్యునితో సమానుడవు.

తా. సకలభూతములచేతను ఎదిరింప శక్యముకానివాడవై అగ్నితో సమానమైన తేజస్సుతో లోకములను మిక్కిలి తపింపచేయుచున్నావు. అందువలన సూర్యునితో సమానుడవు. 17

మూ. సాక్షాద్వైత్తేశతుల్యోఽసి అథవా ధనదాధికః,
వైత్తేశస్యేవ పద్మా శ్రీర్నిత్యం తే రాజసత్తమ. 18

ప్ర. అ. రాజసత్తమ = రాజశ్రేష్ఠా! సాక్షాత్ = సాక్షాత్తు, వైత్తేశతుల్యః = కుబేరునితో సమానుడవు, అసి = అయి ఉన్నావు. అథవా = లేదా, ధనదాధికః = కుబేరునికంటె అధికుడవు. వైత్తేశస్య = కుబేరునకు, పద్మా ఇవ = పద్మము వలె, శ్రీః = లక్ష్మి, తే = నీకు, నిత్యమ్ = నిత్యమూ ఉన్నది.

తా. రాజశ్రేష్ఠా! నీవు సాక్షాత్తు కుబేరునితో సమానుడవు. లేదా నీవు కుబేరునికంటె అధికుడవు. కుబేరుని దగ్గర పద్మ ఉన్నట్లు లక్ష్మి నీదగ్గర నిత్యమూ ఉండును. 18

మూ. ధనదస్య తు కార్యేణ ధనదస్తేన నో భవాన్,
సమః సర్వేషు భూతేషు స్థావరేషు చరేషు చ. 19

ప్ర. అ. ధనదస్య = కుబేరునియొక్క, తేన = ఆ, కార్యేణ = కార్యము చేత, భవాన్ = నీవు, నః = మాకు, ధనదః = కుబేరుడవు. స్థావరేషు = స్థావరములు, చరేషు = జంగమములు అయిన, సర్వేషు = సమస్తమైన, భూతేషు = భూతముల యందు, సమః = సముడవు.

తా. కుబేరుడు చేయు పని నీవు చేయుటచే మాకు నీవే కుబేరుడవు. నీవు స్థావరములు, జంగమములు అయిన అన్ని భూతములయందు సముడవు. 19

మూ. శత్రౌ మిత్రే చ తే దృష్టిః సమతాం యాతి రాఘవ,
ధర్మేణ శాసనం నిత్యం వ్యవహారే విధిక్రమాత్. 20

ప్ర. అ. రాఘవ = రామా! తే దృష్టిః = నీ దృష్టి, శత్రే = శత్రువునందు, మిత్రే చ = మిత్రునియందు, సమతామ్ = సమత్వమును, యాతి = పొందుచున్నది. వ్యవహారే = వ్యవహారమునందు, విధిక్రమాత్ = విధిక్రమమువలన, ధర్మేణ = ధర్మముచేత, శాసనమ్ = శాసనము, నిత్యమ్ = నిత్యము.

తా. రామా! నీ దృష్టి శత్రువునందు, మిత్రునియందు కూడా సముగా ఉండును. వ్యవహారములయందు విధ్యనుసారముగా నిత్యమూ ధర్మముచేత శాసనము చేయుదువు. 20

మూ. యస్య రుష్యసి వై రామ తస్య మృత్యుర్విధావతి,
గీయసే తేన వై రామ యమ ఇత్యభివిక్రమః. 21

ప్ర. అ. రామ=రామా! యస్య=ఎవనికి, రుష్యసి=కోపింతువో, తస్య =వానికి, మృత్యుః=మృత్యువు, విధావతి = పరుగెత్తుకొనివచ్చును. రామ=రామా! అభివిక్రమః=గొప్ప పరాక్రమము గల నీవు, తేన=వానిచేత, యమః ఇతి= యముడు అని, గీయసే = చెప్పబడుచున్నావు.

తా. రామా! నీవు ఎవనిమీద కోపింతువో వాని దగ్గరకు మృత్యువు పరుగెత్తి వెళ్ళును. అతడు మహాపరాక్రమవంతుడవైన నిన్ను "యముడు" అని అనును. 21

మూ. యశ్చైష మానుషో భావో భవతో నృపసత్తమ,
ఆనృశంస్యపరో రాజన్ సత్త్వేషు క్షమయాన్వితః. 22

ప్ర. అ. రాజన్ = రాజా! నృపసత్తమ = రాజులలో శ్రేష్ఠుడా! భవతః= నీయొక్క, ఏషః = ఈ, మానుషః భావః = మనుష్యత్వ మున్నదో అది, ఆనృశంస్యపరః = క్రూరత్వము లేకపోవుటయందు ఆసక్తి కలది. సత్త్వేషు = ప్రాణుల యందు, క్షమయా = ఓర్పుతో, అన్వితః = కూడినది.

తా. రాజులలో శ్రేష్ఠుడవైన రాజా! నీ మానవత్వము క్రౌర్యము లేక సకలప్రాణుల యందు ఓర్పుతో కూడినది. 22

మూ. దుర్బలస్య త్వనాథస్య రాజా భవతి వై బలమ్,
అచక్షుషోత్తమం చక్షురగతేః స గతిర్భవాన్. 23

ప్ర. అ. అనాథస్య = నాథుడు లేని, దుర్బలస్య = దుర్బలునకు, రాజా= రాజు, బలమ్=బలముగా, భవతి = అగుచున్నాడు. సః భవాన్ = అట్టి నీవు, అచక్షుషః = నేత్రములు లేనివానికి, ఉత్తమం చక్షుః=ఉత్తమమైన నేత్రము. అగతేః = గతి లేనివానికి, గతిః = గతివి.

తా. నాథుడు లేని దుర్బలునకు రాజే బలము. అట్టి నీవు కళ్ళు లేనివానికి కన్ను; గతి లేనివానికి గతివి. 23

మూ. అస్మాకమపి నాథస్త్వం శ్రూయతాం మమ ధార్మిక,
మమాలయం ప్రవిష్టస్తు గృధ్రో మాం బాధతే నృప,
త్వం హి దేవమనుష్యేషు శాస్తా వై నరపుంగవః.

ప్ర. అ. త్వమ్ = నీవు, అస్మాకమపి = మాకు కూడ, నాథః = నాథుడవు. ధార్మిక = ధార్మికుడా! మమ = నాకు, శ్రూయతామ్ = వినబడుగాక. నృప = రాజా! గృధ్రః = ఈ గ్రద్ద, మమ = నాయొక్క, ఆలయమ్ = గృహమును, ప్రవిష్టః = ప్రవేశించినదై, బాధతే = బాధించుచున్నది, నరపుంగవ = నరశ్రేష్ఠుడా! దేవ = ప్రభూ! త్వమ్ = నీవే, మనుష్యేషు = మనుష్యులలో, శాస్తా వై హి = శిక్షకుడవు కదా?

తా. నీవు మాకు కూడ రక్షకుడవు. ధార్మికుడా! నా మాట వినుము. రాజా! ఈ గ్రద్ద నా ఇంటిలో ప్రవేశించి బాధించుచున్నది. నరశ్రేష్ఠుడవైన దేవా! నీవే మానవులలో శిక్షకుడవు కదా? 24

మూ. ఏతచ్ఛ్రుత్వా తు వై రామః సచివానాహ్వయత్స్వయమ్,
ధృష్టిర్జయన్తో విజయః సిద్ధార్థో రాష్ట్రవర్ధనః,
అశోకో ధర్మపాలశ్చ సుమన్త్రశ్చ మహాబలః. 26

ఏతే రామస్య సచివా రాజ్ఞో దశరథస్య చ,
నీతియుక్తా మహాత్మానః సర్వశాస్త్రవిశారదాః, 27
హ్రీమన్తశ్చ కులీనాశ్చ నయే మన్త్రే చ కోవిదాః.

ప్ర. అ. రామః = రాముడు, ఏతత్ = దీనిని, శ్రుత్వా = విని, స్వయమ్ = స్వయముగా, సచివాన్ = మంత్రులను, ఆహ్వయత్ = పిలచెను. నీతియుక్తాః = = నీతితో కూడినవారు. మహాత్మానః = మహాత్ములు, సర్వశాస్త్రవిశారదాః = సకలశాస్త్రములయందు నేర్పు గలవారు, హ్రీమన్తః = సిగ్గుగలవారు. కులీనాః = చ = మంచి కులమునందు పుట్టినవారు, నయే = నీతియందు, మన్త్రే చ = మంత్రమునందు. కోవిదాః = పండితులు అయిన, ధృష్టిః = ధృష్టి, జయన్తః = జయంతుడు, విజయః = విజయుడు, సిద్ధార్థః = సిద్ధార్థుడు, రాష్ట్రవర్ధనః = రాష్ట్రవర్ధనుడు, అశోకః = అశోకుడు, ధర్మపాలః చ = ధర్మపాలుడు, మహా-

బలః = గొప్ప బలము గల, సుమన్త్రః చ = సుమంత్రుడు, ఏతే = వీరు, రామస్య = రామునియొక్క, దశరథస్య రాజ్ఞః చ = దశరథమహారాజుయొక్క, సచివాః = మంత్రులు.

తా. రాముడు ఇది విని మంత్రులను స్వయముగా పిలచెను. ధృష్టి, జయంతుడు. విజయుడు, సిద్ధార్థుడు, రాష్ట్రవర్ధనుడు, అశోకుడు, ధర్మపాలుడు, గొప్పబుద్ధిబలము గల సుమంత్రుడు- వీరు దశరథునికి, రామునికి కూడ మంత్రులు. ఈ మహాత్ములందరూ నీతిమంతులు, సకలశాస్త్రవిశారదులు. సిగ్గు గలవారు, సత్కులములయందు పుట్టినవారు. నీతియందు, ఆలోచనలయందు పండితులు. 25-27

మూ. తానాహూయ చ ధర్మాత్మా పుష్పకాదవతీర్య చ, 28
గృధ్రోలూకవివాదం తం పృచ్ఛతి స్మ రఘూత్తమః.

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, రఘూత్తమః = రాముడు, తాన్ = వాళ్ళను, ఆహూయ = పిలచి, పుష్పకాత్ = పుష్పకమునుండి, అవతీర్య చ = = దిగి, తమ్ = ఆ, గృధ్రోలూకవివాదమ్ = గృధ్రోలూకముల తగవును గూర్చి, పృచ్ఛతి స్మ = అడిగెను.

తా. ధర్మాత్ముడైన రాముడు వారిని పిలచి పుష్పకమునుండి దిగి ఆ గృధ్రోలూకముల తగవును గూర్చి వాటిని ప్రశ్నించెను. 28

మూ. కతి వర్షాణి వై గృధ్ర తవేదం నిలయం కృతమ్, 29
ఏతన్మే కారణం బ్రూహి యది జానాసి తత్త్వతః,
ఏతచ్ఛ్రుత్వా తు వై గృధ్రో భాషతే రాఘవం స తమ్.

ప్ర. అ. గృధ్ర = గృధ్రమా! ఏతత్ = ఈ, నిలయమ్ = గృహము, తవ = నీకు, కతి వర్షాణి = ఎన్ని సంవత్సరములు, కృతమ్ = చేయబడినది? తత్త్వతః = యథార్థముగా, జానాసి యది = ఎరిగి ఉన్నట్లయితే, ఏతత్ = ఈ, కారణమ్ = కారణమును, మే = నాకు, బ్రూహి = చెప్పుము. ఏతత్ = దీనిని, శ్రుత్వా తు = విని, సః = ఆ, గృధ్రః = గ్రద్ద, తం రాఘవమ్ = ఆ రాముణ్ణి గూర్చి, భాషతే వై = పలికెను.

తా. "గృధ్రమా! నీవు ఈ గృహమును నిర్మించుకొని ఎన్నాళ్ళయినది? తెలిసినట్లయితే యథార్థముగా ఈ కారణమును చెప్పుము." ఈ మాటలు విని ఆ గృద్ధ రామునితో ఇట్లు పలికెను. 29, 30

మూ. ఇయం వసుమతీ రామ మనుష్యైః పరితో యదా,
ఉత్థితైరావృతా సర్వా తదా ప్రభృతి మే గృహమ్. 31

ప్ర. అ. రామ = రామా! ఇయమ్ = ఈ, సర్వా=సమస్తమైన, వసుమతీ =భూమి, యదా=ఎప్పుడు, ఉత్థితైః=లేచిన (పుట్టిన), మనుష్యైః=మనుష్యులతో పరితః=అంతటా, ఆవృతా=కప్పబడినదో, తదాప్రభృతి=అదిమొదలు, మే= నాయొక్క, గృహమ్=గృహము.

తా. రామా! ఈ భూమి అంతా ఉద్భవించిన మానవులచేత ఏనాడు కప్ప బడినదో ఆనాటినుండి ఇది నా గృహముగా ఉన్నది. 31

మూ. ఉలూకశ్చాబ్రవీద్రామం పాదపైరుపశోభితా,
యదేయం పృథివీ రాజంస్తదా ప్రభృతి మే గృహమ్. 32
ఏతచ్ఛ్రుత్వా తు వై రామః సభాసదమువాచ హ.

ప్ర. అ. ఉలూకః చ = గుడ్లగూబ కూడ, రామమ్=రాముణ్ణి గూర్చి, ఆబ్రవీత్=పలికెను. రాజన్=రాజా! ఇయం పృథివీ=ఈ భూమి, యదా= ఎప్పుడు, పాదపైః=వృక్షములచేత, ఉపశోభితా = ప్రకాశింపచేయబడినదో, తదా ప్రభృతి=అది మొదలు, మే = నాయొక్క, గృహమ్=గృహము. రామః= రాముడు, ఏతత్=దీనిని, శ్రుత్వా=విని, సభాసదమ్=సభాసదులను గూర్చి, ఉవాచ హ వై=పలికెను.

తా. అప్పుడు గుడ్లగూబ రామునితో- "రాజా! ఈ భూమి వృక్షములతో ఎప్పటినుండి ప్రకాశించుచున్నదో అప్పటినుండి ఇది నా గృహము" అని పలికెను. రాముడు ఈ మాటలు విని సభాసదులతో ఇట్లనెను. 32

మూ. న సా సభా యత్ర న సన్తి వృద్ధా
వృద్ధా న తే యే న వదన్తి ధర్మమ్,
నాసౌ ధర్మో యత్ర న సత్యమస్తి
న తత్సత్యం యచ్ఛలేనానువిద్ధమ్. 33

ప్ర. అ. యత్ర=ఎక్కడ, వృద్ధాః=వృద్ధులు, న సన్తి=లేరో, సా=అది, సభా=సభ, న=కాదు. యే=ఎవరు, ధర్మమ్=ధర్మమును, న వదన్తి=పలకరో, తే=వారు, వృద్ధాః=వృద్ధులు, న=కారు. యత్ర=దేనియందు సత్యమ్=సత్యము, నాస్తి=లేదో, అసౌ=ఇది, ధర్మః=ధర్మము, న=కాదు. యత్=ఏది, ఛలేన=కపటముతో, అనువిద్ధమ్=కూడినదో, తత్=అది, సత్యమ్=సత్యము, న=కాదు.

తా. వృద్ధులు లేనిది సభ కాదు. ధర్మమును చెప్పనివారు వృద్ధులు కారు. సత్యము లేనిది ధర్మము కాదు. కపటముతో కూడినది సత్యము కాదు. 33

మూ. యే తు సభ్యా సదా జ్ఞాత్వా తూష్ణీం ధ్యాయన్త ఆసతే,
యథాప్రాప్తం న బ్రువతే తే సర్వేఽనృతవాదినః. 34

ప్ర. అ. యే=ఏ, సభ్యాః=సభ్యులు, జ్ఞాత్వా=తెలిసికొని కూడ, ధ్యాయన్తః=ఆలోచించుచున్నవారై (చూచుచున్నవారై), సదా=ఎల్లప్పుడూ, తూష్ణీమ్ ఆసతే=మౌనముగా కూర్చుందురో, యథాప్రాప్తమ్=తగువిధముగా, న బ్రువతే=మాటలాడరో, తే సర్వే=వాళ్ళందరూ, అనృతవాదినః=అసత్యము చెప్పువారు.

తా. ఏ సభ్యులు తెలిసి ఉండి కూడ మాటలాడకుండగా చూచుచు కూర్చుందురో, చెప్పవలసిన మాట చెప్పరో, వాళ్ళందరూ అసత్యము పలుకువారే. 34

మూ. జానన్న చాబ్రవీత్ప్రశ్నాన్ కామాత్క్రోధాద్భయాత్తథా,
సహస్రం వారుణాన్ పాశానాత్మని ప్రతిముఞ్చతి. 35

ప్ర. అ. జానన్=ఎరిగినవాడైనను, ఎవడు, కామాత్=కామమువలన, క్రోధాత్=కోపమువలన, తథా=మరియు, భయాత్=భయమువలన, ప్రశ్నాన్=ప్రశ్నలను, న చ అబ్రవీత్=చెప్పలేదో అతడు, సహస్రమ్=వెయ్యి, వారుణాన్=వరుణుని సంబంధమైన, పాశాన్=పాశములను, ఆత్మని=తనయందు ప్రతిముఞ్చతి=తగల్చుకొనుచున్నాడు.

తా. కామమువలన గాని, క్రోధమువలన గాని, భయమువలన గాని

ఎవడు తెలిసి ఉండి కూడ ప్రశ్నలకు సమాధానములు చెప్పడో వాడు వెయ్యి వరుణపాశములను తనకు తగల్చుకొనుచున్నాడు. 35

మూ. తేషాం సంవత్సరే పూర్ణే పాశ ఏకః ప్రముచ్యతే,
తస్మాత్సత్యేన వక్తవ్యం జానతా సత్యమిచ్ఛతా. 36

ప్ర. అ. సంవత్సరే = సంవత్సరము, పూర్ణే = నిండినదగుచుండగా, తేషామ్ = ఆ పాశములలో, ఏకః పాశః = ఒక పాశము, ప్రముచ్యతే = విడచును. తస్మాత్ = ఆ కారణమువలన, సత్యమ్ = సత్యమును. జానతా = ఎరిగినవానిచేత, ఆఇచ్ఛతా = చక్కగా, సత్యేన = సత్యముచేత, వక్తవ్యమ్ = చెప్పబడవలెను.

తా. ఆ వెయ్యి పాశాలలో ఒక పాశము ఒక సంవత్సరము గడచిన తరువాత విడచును. అందుచే సత్యము తెలిసినవాడు చక్కగా సత్యమే చెప్పవలెను.

మూ. ఏతచ్ఛ్రుత్వా తు సచివా రామమేవాబ్రువంస్తదా,
ఉలూకః శోభతే రాజన్న తు గృధ్రో మహామతే. 37

ప్ర. అ. ఏతత్ = దీనిని, శ్రుత్వా = విని, సచివాః = మంత్రులు, రామమ్ ఏవ = రాముణ్ణి గూర్చి, తదా = అప్పుడు, అబ్రువన్ = పలికిరి. రాజన్ = రాజా! మహామతే = గొప్ప బుద్ధి గలవాడా! ఉలూకః = ఉలూకము, శోభతే = ప్రకాశించుచున్నది; గృధ్రః తు = గృధ్రమైతే, న = కాదు.

తా. ఈ మాట విని మంత్రులు రామునితో ఇట్లు పలికిరి-"గొప్ప బుద్ధి గల రామా! ఈ ఉలూకము మంచిది వలె కనబడుచున్నది; గృధ్రము కాదు". 37

మూ. త్వం ప్రమాణం మహారాజ రాజా హి పరమా గతిః,
రాజమూలాః ప్రజాః సర్వా రాజా ధర్మః సనాతనః. 38

ప్ర. అ. మహారాజ = మహారాజా! త్వమ్ = నీవు, ప్రమాణమ్ = ప్రమాణము. రాజా = రాజు, పరమా = గొప్ప, గతిః హి = గతి కదా? సర్వాః = సమస్తమైన, ప్రజాః = ప్రజలు, రాజమూలాః = రాజే మూలముగా గలవారు. రాజధర్మః = రాజధర్మము, సనాతనః = చాల ప్రాచీన మైనది.

తా. మహారాజా! నీవే నిర్ణయము చేయవలెను. రాజే పరమగతి కదా? ప్రజ లందరికి రాజే మూలము. రాజధర్మము చాల ప్రాచీన మైనది. 38

మూ. శాస్తా న్యాణాం నృపో యేషాం తే న గచ్ఛన్తి దుర్గతిమ్,
వైవస్వతేన ముక్తాస్తు భవన్తి పురుషోత్తమాః. 39

ప్ర. అ. యేషామ్ = ఏ, న్యాణామ్ = నరులకు, నృపః = రాజు, శాస్తా = శిక్షకుడో, తే = వాళ్లు, దుర్గతిమ్ = దుర్గతిని, న గచ్ఛన్తి = పొందరు. వైవస్వతేన = యమునిచేత, ముక్తాః = విడవబడినవారై, పురుషోత్తమాః = పురుషోత్తములుగా, భవన్తి = అగుదురు.

తా. ఏ మానవులకు రాజు శిక్షకుడుగా ఉండునో వాళ్లు దుర్గతి పొందరు. యమునిచేత విడవబడినవారై పురుషోత్తము లగుదురు. 39

మూ. సచివానాం వచః శ్రుత్వా రామో వచనమబ్రవీత్,
శ్రూయతామభిధాస్యామి పురాణే యదుదాహృతమ్. 40

ప్ర. అ. సచివానామ్ = మంత్రులయొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, రామః = రాముడు, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను. పురాణే = పురాణమునందు, యత్ = ఏది, ఉదాహృతమ్ = చెప్పబడినదో, అభిధాస్యామి = చెప్పెదను; శ్రూయతామ్ = వినబడుగాక.

తా. మంత్రుల మాట విని రాముడు ఇట్లు పలికెను-"పురాణమునందు చెప్పిన విషయమును చెప్పెదను వినుము". 40

మూ. ద్యౌః సచన్ద్రార్కనక్షత్రా సపర్వతమహావనా,
సలిలార్ణవసంపూర్ణం త్రైలోక్యం సచరాచరమ్. 41

ప్ర. అ. సచన్ద్రార్కనక్షత్రా = చంద్రసూర్యనక్షత్రములతో కూడిన, సపర్వతమహావనా = పర్వతములతోను మహావనములతోను కూడిన, ద్యౌః = ఆకాశము, సచరాచరమ్ = చరాచరములతో కూడిన, త్రైలోక్యమ్ = మూడు లోకముల సముదాయము, సలిలార్ణవసంపూర్ణమ్ = సముద్రోదకముతో నిండినది.

తా. చంద్ర-సూర్య-నక్షత్ర-పర్వత-మహారణ్యములతో కూడిన ఆకాశము, స్థావరజంగములతో కూడిన మూడు లోకములూ కూడ సముద్రోదకముతో నిండిపోయెను. 41

మూ. ఏక ఏవ తదా హ్యాసీత్సుప్తో మేరురివాపరః,
పురా భూః సహ లక్ష్మ్యా చ విష్ణోర్జఠరమావిశత్. 42

ప్ర. అ. తదా = అప్పుడు, ఏక ఏవ = ఒక్కటిగానే ఉండి, అపరః = మరియొక, మేరుః ఇవ = మేరుపర్వతము వలె, సుప్తః = నిద్రించుచున్నది, ఆసీత్ = ఆయెను. పురా = పూర్వము, భూః = భూమి, లక్ష్మ్యా చ సహ = లక్ష్మితో కూడ, విష్ణోః = విష్ణువుయొక్క, జఠరమ్ = జఠరమును, ఆవిశత్ = ప్రవేశించెను.

తా. అప్పుడు ప్రపంచకము అంతా ఒక్కటిగా అయిపోయి రెండవ మేరుపర్వతము వలె నిద్రపోవుచుండెను (నిశ్చలముగా ఉండెను). పూర్వము భూమి లక్ష్మితో కలసి విష్ణువు జఠరములో ప్రవేశించెను. 42

మూ. తాం నిగృహ్య మహాతేజాః ప్రవిశ్య సలిలార్ణవమ్,
సుష్వాప దేవో భూతాత్మా బహూన్వర్షగణానపి. 43

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, భూతాత్మా = సకలభూత స్వరూపుడైన, దేవః = విష్ణువు, తామ్ = లక్ష్మిసహితయైన ఆ భూమిని, నిగృహ్య = పొట్టలో ఉంచుకొని, సలిలార్ణవమ్ = సముద్రోదకమును, ప్రవిశ్య = ప్రవేశించి, బహూన్ = అనేకమైన, వర్షగణాన్ = సంవత్సరముల సముదాయములను, సుష్వాప = నిద్రించెను.

తా. గొప్ప తేజస్సు గల, సకలభూతస్వరూపుడైన ఆ విష్ణువు ఆమెను గ్రహించి, సముద్రోదకములో ప్రవేశించి అనేకసంవత్సరసముదాయములపాటు నిద్రించెను. 43

మూ. విష్ణౌ సుప్తే తదా బ్రహ్మా వివేశ జఠరం తతః,
రుద్ధస్రోతం తు తం జ్ఞాత్వా మహాయోగీ సమావిశత్. 44

ప్ర. అ. తదా = అప్పుడు, విష్ణౌ = విష్ణువు, సుప్తే = నిద్రించుచుండగా, తతః = పిమ్మట, బ్రహ్మా = బ్రహ్మ, జఠరమ్ = జఠరమును, వివేశ = ప్రవేశించెను. తమ్ = ఆ విష్ణువును, రుద్ధస్రోతమ్ = నిరోధించబడిన జలప్రవాహము గలవానినిగా, జ్ఞాత్వా = తెలిసికొని, మహాయోగీ = మహాయోగి, తమ్ = ఆ విష్ణువును, సమావిశత్ = ప్రవేశించెను.

తా. విష్ణువు నిద్రించి ఉండగా అప్పుడు బ్రహ్మదేవుడు ఆతని జఠరములో ప్రవేశించెను. ఆ విష్ణువు జలప్రవాహమును నిరోధించినట్లు చూచి మహాయోగియైన బ్రహ్మదేవుడు ఆతని జఠరములో ప్రవేశించెను. 44

మూ. నాభ్యాం విష్ణోః సముత్పన్నే పద్మే హేమవిభూషితే,
స తు నిర్గమ్య వై బ్రహ్మా యోగీ భూత్వా మహాప్రభుః.

ప్ర. అ. విష్ణోః=విష్ణువుయొక్క, నాభ్యామ్=నాభియందు, సముత్పన్నే=పుట్టిన, హేమవిభూషితే=బంగారముచేత అలంకరించబడిన, పద్మే=పద్మము నందు, మహాప్రభుః=గొప్ప ప్రభువైన, సః=ఆ, బ్రహ్మా=బ్రహ్మ, నిర్గమ్య=బయల్వెడలి, యోగీ=యోగము కలవాడు, భూత్వా=అయి (ఆలోచించెను).

తా. విష్ణువు నాభియందు బంగారు పద్మము పుట్టగా దానినుండి మహా ప్రభువైన బ్రహ్మదేవుడు బైటకు వచ్చి యోగి అయి ఆలోచించెను. 45

మూ. సిసృక్షుః పృథివీం వాయుం పర్వతాన్ సమహీరుహాన్,
తదన్తరే ప్రజాః సర్వాః సమనుష్యసరీసృపాః, 46
జరాయుజాణ్డజాః సర్వాః స ససర్జ మహాతపాః.

ప్ర. అ. పృథివీమ్=భూమిని, వాయుమ్=వాయువును, సమహీరుహాన్=వృక్షములతోకూడిన, పర్వతాన్=పర్వతములను, సిసృక్షుః=సృష్టి చేయదలచిన వాడై, తదన్తరే=అంతకు ముందు, సమనుష్యసరీసృపాః=మనుష్యులతోను పాములు మొదలైన పాకే జంతువులతోను కూడిన, జరాయుజాణ్డజాః=మావివల్ల పుట్టిన వాటిని, గ్రుడ్లనుండి పుట్టినవాటిని, సర్వాః=అన్నింటిని, సర్వాః ప్రజాః=అన్ని ప్రజలను, మహాతపాః=గొప్ప తపస్సు గల ఆ బ్రహ్మ, ససర్జ=సృష్టించెను.

తా. గొప్ప తపస్సు గల బ్రహ్మదేవుడు భూమిని, వాయువును, పర్వతములను, వృక్షములను సృష్టించ దలచినవాడై అంతలో అందరు ప్రజలను (సృష్టింపబడినది ప్రతీదీ ప్రజయే) మనుష్యులను, సర్పములను, జరాయుజములను, అండజములను సృష్టించెను. 46

మూ. తత్ర శ్రోత్రమలోత్పన్నౌ కైటభో మధునా సహ. 47
దానవౌ తౌ మహావీర్యౌ ఘోరరూపౌ దురాసదౌ,
దృష్ట్వా ప్రజాపతిం తత్ర క్రోధావిష్టౌ బభూవతుః. 48

ప్ర. అ. తత్ర = అక్కడ, మధునా సహ = మధువుతో కూడ, కైటభః = కైటభుడు, శ్రోత్రమలోత్పన్నౌ = చెవుల మలమునుండి పుట్టినాడు. మహావీర్యౌ = గొప్ప పరాక్రమము గల, ఘోరరూపౌ = ఘోరమైన రూపము గల, దురాసదౌ = ఎదిరింప శక్యము కాని, తౌ దానవౌ = ఆ దానవులు, తత్ర = అక్కడ, ప్రజాపతిమ్ = బ్రహ్మను, దృష్ట్వా = చూచి, క్రోధావిష్టౌ = క్రోధావిష్టులు, బభూవతుః = అయిరి.

తా. అక్కడ చెవి గులిమినుండి కైటభుడు, మధువు పుట్టిరి. మహావీర్యవంతులు, ఘోరమైన రూపము గలవారు, ఎదిరింప శక్యము కానివారూ అయిన ఆ దానవులు అక్కడ బ్రహ్మదేవుణ్ణి చూచి కోపావేశమును పొందిరి. 47,48

మూ. వేగేన మహతా తత్ర స్వయంభువమధావతామ్,
దృష్ట్వా స్వయంభువా ముక్తో రావో వై వికృతస్తదా. 49

ప్ర. అ. తత్ర = అక్కడ, మహతా = గొప్ప, వేగేన = వేగముతో, స్వయంభువమ్ = బ్రహ్మను గూర్చి, అధావతామ్ = పరుగెత్తిరి. దృష్ట్వా = చూచి, స్వయమ్భువా = బ్రహ్మచేత, తదా = అప్పుడు, వికృతః = వికృతమైన, రావః = ధ్వని, ముక్తః = విడవబడినది.

తా. వాళ్ళిద్దరూ గొప్ప వేగముతో బ్రహ్మమీదికి రాగా అతడు వికృతముగా అరచెను. 49

మూ. తేన శబ్దేన సంప్రాప్తో హరో వై హరిణా సహ,
అథ చక్రప్రహారేణ సూదితౌ మధుకైటభౌ. 50

ప్ర. అ. తేన = ఆ, శబ్దేన = శబ్దముచేత, హరః = శివుడు, హరిణా సహ = విష్ణువుతో కూడా, సంప్రాప్తః = వచ్చినాడు. అథ = అటుపిమ్మట, మధుకైటభౌ = మధుకైటభులు, చక్రప్రహారేణ = చక్రప్రహారముచేత, సూదితౌ = చంపబడిరి.

తా. ఆ శబ్దము వినగానే శివుడు, విష్ణువు అక్కడికి వచ్చిరి. పిమ్మట చక్రముచేత ఆ మధుకైటభులు చంపబడిరి. 50

మూ. మేదసా ప్లావితా సర్వా పృథివీ చ సమన్తతః,
భూయో విశోధితా తేన హరిణా లోకధారిణా. 51

ప్ర. అ. సర్వా = సమస్తమైన, పృథివీ చ = భూమి, సమన్తతః = అంతటా, మేదసా = కొవ్వుచేత, ఆప్లావితా = ముంచెత్తబడినది. భూయః = మరల లోక ధారిణా = లోకములను పోషించు, తేన హరిణా = ఆ విష్ణువుచేత, విశోధితా = పరిశుభ్రముచేయబడినది.

తా. వాళ్ళ కొవ్వుతో భూమి అంతా అన్నివైపులా నిండిపోయెను. అప్పుడు లోకములను పోషించు విష్ణువు ఆ భూమిని మరల పరిశోధించెను. 51

మూ. శుద్ధాం వై మేదినీం తాం తు వృక్షైః సర్వైరపూరయత్,
ఓషధ్యః సర్వసస్యాని నిష్పద్యన్త పృథగ్విధాః. 52

ప్ర. అ. శుద్ధామ్ = పరిశుద్ధమైన, తామ్ = ఆ, మేదినీమ్ = భూమిని, సర్వైః = సమస్తమైన, వృక్షైః = వృక్షములచేత, అపూరయత్ = నింపెను, పృథగ్విధాః = వేరువేరు విధములైన, ఓషధ్యః = ఓషధులు, సర్వసస్యాని = సమస్తసస్యములు, నిష్పద్యన్త = పుట్టినవి.

తా. పరిశుద్ధమైన ఆ భూమిని అన్ని వృక్షములతోను నింపెను. అనేక విధములైన ఓషధులు, సమస్తసస్యములూ కూడ మొలచినవి. 52

మూ. మేదోగన్ధా తు ధరణీ మేదినీత్యభిసంజ్ఞితా,
తస్మాన్న గృధ్రస్య గృహమురూకస్యేతి మే మతిః. 53

ప్ర. అ. మేదోగన్ధా = కొవ్వు వాసన గల, ధరణీ = భూమి, మేదినీతి = "మేదిని" అని, అభిసంజ్ఞితా = పేరు కలదైనది. తస్మాత్ = ఆ కారణమువలన, గృధ్రస్య = గ్రద్దయొక్క, గృహమ్ = గృహము, న = కాదు; ఉరూకస్య = గుడ్లగూబయొక్క గృహము, ఇతి = అని, మే = నాయొక్క, మతిః = బుద్ధి

తా. కొవ్వు (మేదస్సు) వాసనచే భూమికి 'మేదిని'అను పేరు వచ్చినది. అందుచే ఇల్లు గ్రద్దది కాదు, గుడ్లగూబదే అని నా అభిప్రాయము.

వి. భూమిమీద మనుష్యసృష్టి అయినప్పటినుంచీ అది నా ఇల్లుగా ఉన్నది అని గ్రద్ద చెప్పినది. చెట్లు పుట్టినప్పటినుంచీ అది నా ఇల్లుగా ఉన్న దని గుడ్లగూబ చెప్పినది. కాని ఇప్పుడు చెప్పిన సృష్టిక్రమము ప్రకారము చెట్లకంటె ముందు మనుష్యులు సృష్టింపబడినారు. చెట్లు తరవాత వచ్చినవి. చెట్లు లేనిదే ఈ పక్షులు గూళ్ళు కట్టుకొనజాలవు గాన మనుష్యసృష్టినుండే ఆ యిల్లు నాదే అని చెప్పిన గ్రద్ద మాట అసత్య మని బహుశా తీర్పు చెప్పినట్లు ఊహించుకొనవలెను. 53

మూ. తస్మాద్గృధ్రస్తు దణ్డ్యో వై పాపో హర్తా పరాలయమ్,
పీడాం కరోతి పాపాత్మా దుర్వినీతో మహానయమ్. 54

ప్ర అ. తస్మాత్ = ఆ కారణమువలన, పాపః = పాపముచేసినది, పరాలయమ్ = వరులగృహమును, హర్తా = హరించునదీ అయిన, గృధ్రః తు = గ్రద్దయే, దణ్డనీయః = దండింపదగినది. మహాన్ దుర్వినీతః = గొప్ప దుర్వినయము గల, అయమ్ = ఈ, పాపాత్మా = పాపబుద్ధి, పీడామ్ = పీడను, కరోతి = చేయుచున్నది.

తా. అందుచేత పరగృహమును అపహరించిన, పాపము చేసిన ఈ గ్రద్ద దండింపదగినది. చాల దుష్టబుద్ధి గల, పాపమును ఆచరించుచున్న ఇది ఉలూకమును పీడించుచున్నది. 54

మూ. అథాశరీరిణీ వాణీ అన్తరిక్షాత్ప్రబోధినీ,
మా వధీ రామ గృధ్రం త్వం పూర్వదగ్ధం తపోబలాత్.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, ప్రబోధినీ = బోధించుచున్న, అశరీరిణీ = శరీరములేని, వాణీ = వాణి, అన్తరిక్షాత్ = ఆకాశమునుండి(వినవచ్చినది). రామ = రామా ! తపోబలాత్ = తపోబలమువలన, పూర్వదగ్ధమ్ = పూర్వమే కాల్చబడిన, గృధ్రమ్ = ఈ గ్రద్దను, మా వధీః = చంపకుము.

తా. ఇంతలో ఆకాశమునుండి బోధించు అశరీరవాక్కు వెలువడినది- రామా ! తపోబలముచేత పూర్వమే కాల్చబడి (పీడింపబడి)ఉన్న ఈ గ్రద్దను చంపకుము." 55

మూ. కాలగౌతమదగ్ధోఽయం ప్రజానాథో నరేశ్వర,
బ్రహ్మదత్తేతి నామ్నైష శూరః సత్యవ్రతః శుచిః. 56

ప్ర. అ. నరేశ్వర = రాజా ! అయమ్ = ఇతడు, కాలగౌతమదగ్ధః = కాలగౌతమునిచేత పీడితుడైన, ప్రజానాథః = రాజు. నామ్నా = పేరుచేత, బ్రహ్మదత్తేతి = బ్రహ్మదత్తుడు అను, ఏషః = ఇతడు, శూరః = శూరుడు; సత్యవ్రతః = సత్యమైన వ్రతము గలవాడు, లేదా సత్యనిష్ఠ గలవాడు. శుచిః = పరిశుద్ధుడు.

తా. రాజా ! ఇతడు కాలగౌతమునిచేత పీడింపబడిన రాజు. ఇతని పేరు బ్రహ్మదత్తుడు. ఇతడు శూరుడు; సత్యవ్రతుడు; పరిశుద్ధుడు. 56

మూ. గృహం తస్యాగతో విప్రో భోజనం ప్రత్యమార్గత,
సాగ్రం వర్షశతం చైవ భోక్తవ్యం నృపసత్తమ. 57

ప్ర. అ. తస్య = వానియొక్క, గృహం ప్రతి = గృహమును గూర్చి, ఆగతః = వచ్చిన, విప్రః = బ్రాహ్మణుడు, భోజనమ్ = భోజనమును, ప్రత్యమార్గత = అన్వేషించెను(కోరెను). నృపసత్తమ = రాజా ! సాగ్రమ్ = కొంచెము అధికమైన, వర్షశతం చ ఏవ = నూరు సంవత్సరములను, భోక్తవ్యమ్ = తినవలెను.

తా. ఒక బ్రాహ్మణుడు ఇతని గృహమునకు వచ్చి "రాజా నాకు కొంచెము ఎక్కువగా నూరు సంవత్సరములు భోజనము కావలెను" అని కోరెను. 57

మూ. బ్రహ్మదత్తః స వై తస్య పాద్యమర్ఘ్యం స్వయం నృపః,
హార్దం చైవాకరోత్తస్య భోజనార్థం మహాద్యుతేః. 58

ప్ర. అ. నృపః = రాజైన, సః బ్రహ్మదత్తః = ఆ బ్రహ్మదత్తుడు, మహాద్యుతేః = గొప్ప కాంతి గల, తస్య = అతనికి, స్వయమ్ = స్వయముగా, పాద్యమ్ = పాద్యమును, అర్ఘ్యమ్ = అర్ఘ్యమును, భోజనార్థమ్ = భోజనముకొరకు, హార్దమ్ = స్నేహమును, అకరోత్ = చేసెను.

తా. బ్రహ్మదత్తమహారాజు గొప్ప కాంతిగల ఆతనికి స్వయముగా పాద్యమును, అర్ఘ్యమును, భోజనముకొరకై స్నేహపూర్వకమైన ఏర్పాట్లను చేసెను.

మూ. మాంసమత్స్యోభవంస్తత్ర ఆహారే తు మహాత్మనః,
అథ క్రుద్ధేన మునినా శాపో దత్తోఽస్య దారుణః. 59

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన అతనియొక్క, తత్ర = ఆ, ఆహారే = ఆహారమునందు, మాంసమత్స్యాః = మాంసము మత్స్యములు, అభవన్ = ఉండెను. అథ = అటుపిమ్మట, క్రుద్ధేన = కోపించిన, మునినా = మునిచేత, అస్య = ఇతనికి, దారుణః = దారుణమైన, శాపః = శాపము, దత్తః = ఇవ్వబడినది.

తా. ఆ మహాత్మునకిచ్చిన ఆహారములో మాంసము మత్స్యములు ఉండెను. ఆప్పుడు ఆ ముని కోపించి ఇతనికి దారుణమైన శాపము నిచ్చెను. 59

మూ. గృధ్రస్త్వం భవ వై రాజన్మామైనం హ్యథ సోఽబ్రవీత్,
ప్రసాదం కురు ధర్మజ్ఞ అజ్ఞానాన్మే మహావ్రత, 60
శాపస్యాన్తం మహాభాగ క్రియతాం వై మమానఘ.

ప్ర. అ. రాజన్ = రాజా ! త్వమ్ = నీవు, గృధ్రః = గ్రద్దవుగా, భవ = అగుము అథ = అటుపిమ్మట, సః = ఆ రాజు, ఏనమ్ = ఇతనిని గూర్చి, అబ్రవీత్ = పలికెను. మా మా = వద్దు వద్దు, మహావ్రత = గొప్ప వ్రతములు కల వాడా ! ధర్మజ్ఞ = ధర్మములు తెలిసినవాడా ! మే = నాయొక్క, అజ్ఞానాత్ = అజ్ఞానమువలన, (అజ్ఞానము విషయమున), ప్రసాదమ్ = అనుగ్రహమును, కురు = చేయుము మహాభాగ = మహాభాగ్యవంతుడా ! అనఘ = దోషములు లేనివాడా ! మమ = నాయొక్క, శాపస్య = శాపమునకు, అన్తమ్ = అంతము, క్రియతాం వై = చేయబడుగాక.

తా. "రాజా ! నీవు గ్రద్దవు అయ్యేదవుగాక." అప్పుడు ఆ రాజు మునితో ఇట్లనెను. "ఇట్లు అనకుము, అనకుము. ధర్మములు తెలిసినవాడా ! గొప్ప నియమములు కలవాడా ! నా అజ్ఞానమునలన కలిగిన అపరాధమును క్షమించి అనుగ్రహించుము మహాభాగ్యవంతుడా ! దోషరహితుడా ! శాపమునకు అంతమును చేయుము." 60

మూ. తదజ్ఞానకృతం మత్వా రాజానం మునిరబ్రవీత్, 61
ఉత్పత్స్యతి కులే రాజ్ఞాం రామో నామ మహాయశాః,
ఇక్ష్వాకూణాం మహాభాగో రాజా రాజీవలోచనః, 62
తేన స్పృష్టో విపాప స్త్వం భవితా నరపుంగవ.

ప్ర. అ. తత్ = దానిని, అజ్ఞానమ్ ఇతి = అజ్ఞానము అని, జ్ఞాత్వా = తెలుసు కొని, మునిః = ముని, రాజానమ్ = రాజును గూర్చి, అబ్రవీత్ = పలికెను. ఇక్ష్వాకూణామ్ = ఇక్ష్వాకువంశీయులైన, రాజ్ఞామ్ = రాజులయొక్క, కులే = కులమునందు, రామో నామ = రాముడను పేరు గల, మహాభాగః = మహాభాగ్యవంతుడైన, రాజీవలోచనః = పద్మముల వంటి నేత్రములు గల, రాజా = రాజు, ఉత్పత్స్యతి = పుట్టగలడు. నరపుంగవ = నరశ్రేష్ఠుడా ! తేన = అతనిచేత, స్పృష్టః = స్పృశింపబడినవాడవై, త్వమ్ = నీవు, విపాపః = పాపములు లేనివాడవు, భవితా = కాగలవు.

తా. అది అజ్ఞానముచేతనే చేసినట్లు తెలిసికొని ఆ ముని రాజుతో ఇట్లు పలికెను— "ఇక్ష్వాకువంశీయులైన రాజుల కులమునందు రాముడను, పద్మపత్ర విశాలనేత్రుడైన రాజు పుట్టగలడు. ఓ! నరశ్రేష్ఠుడా ! అతడు స్పృశించగా నీ పాపము లన్నీ తొలగిపోవును." 61, 62

మూ. స్పృష్టో రామేణ తచ్ఛ్రుత్వా నరేన్ద్రిః పృథివీపతిః, 63
గృధ్రత్వం త్యక్తవాన్ రాజా దివ్యగన్ధానులేపనః,
పురుషో దివ్యరూపోఽభూదువాచేదం చ రాఘవమ్. 64

ప్ర. అ. తత్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, రామేణ = రామునిచేత, స్పృష్టః = స్పృశించబడిన, నరేన్ద్రిః = నరులప్రభువైన, పృథివీపతిః = భూమికి అధిపతియైన, రాజా = ఆ రాజు, గృధ్రత్వమ్ = గృధ్రత్వమును, త్యక్తవాన్ = విడచినాడు. దివ్యగన్ధానులేపనః = దివ్యములైన గంధములు మైపూతగా గల, దివ్యరూపః = దివ్యమైన రూపము గల, పురుషః = పురుషుడుగా, అభూత్ = ఆయెను. రాఘవమ్ = రాముణ్ణి గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. రాముడు ఆ మాటలు విని స్పృశించగా, నరుల ప్రభువు, భూమికి అధిపతీ అయిన ఆ రాజు గ్రద్దరూపమును విడచి దివ్యగంధములను పూసుకొన్న, దివ్యరూపము గల పురుషుడుగా అయి రామునితో ఇట్లు పలికెను. 63, 64

మూ. సాధు రాఘవ ధర్మజ్ఞ త్వత్ప్రసాదాదహం విభో,
విముక్తో నరకాద్ఘోరాచ్ఛాపస్యాన్తః కృతస్త్వయా. 65

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ప్రక్షిప్తః సర్గఃతృతీయఃః.

ప్ర. అ. ధర్మజ్ఞ=ధర్మములు ఎరిగినవాడా ! రామ = రామా ! సాధు= బాగు, విభో = ప్రభూ ! త్వత్ప్రసాదాత్ = నీ అనుగ్రహమువలన, అహమ్=నేను, ఘోరాత్ = ఘోరమైన, నరకాత్ = నరకమునుండి, విముక్తఃః = విడువబడితిని. త్వయా = నీచేత, శాపస్య = శాపమునకు, అన్తః = అంతము, కృతఃః = చేయ బడినది.

తా. ధర్మముల నెరిగిన రామా ! బాగు బాగు. ప్రభూ ! నీ అనుగ్రహము వలన నేను ఘోరమైన నరకమునుండి విముక్తుడను అయితిని. నీవు నా శాపానికి అంతము చేసినావు. 65

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
మూడవ ప్రక్షిప్త సర్గ సమాప్తము.

అథ షష్టితమః సర్గః

[రాముని సభకు ఋషులు వచ్చుట. రాముడు వారిని సత్కరించి వారి అభీష్టమును పూరించుటకై ప్రతిజ్ఞ చేయుట. ఆ ఋషులు రాముఁజ్ఞి ప్రశంసించుట.]

మూ. తయోఃసంవదతోరేవం రామలక్ష్మణయోస్తదా,
వాసన్తికీ నిశా ప్రాప్తా నశీతా నచ ఘర్మదా. 1

ప్ర. అ. తయోఃసంవదతోఃరేవం రామలక్ష్మణయోఃతదా = ఇట్లు మాటలాడుకొనుచుండగా, నశీతా = చల్లనిది కాని, నచ ఘర్మదా = వేడిని ఇవ్వని, వాసన్తికీ = వసంతర్తువుకు సంబంధించిన, నిశా = రాత్రి, ప్రాప్తా = వచ్చినది.

తా. రామలక్ష్మణులు ఈ విధముగా మాటలాడుకొనుచుండగా ఎక్కువ చల్లగా కాని, ఎక్కువ వేడిగా కాని ఉండని వసంతర్తువుకు సంబంధించిన రాత్రి వచ్చినది. 1

మూ. తతఃప్రభాతే విమలే కృతపూర్వాహ్ణికక్రియః,
అభిచక్రామ కాకుత్థ్సో దర్శనం పౌరకార్యవిత్. 2

ప్ర. అ. తతఃవిమలే = అటుపిమ్మట, స్వచ్ఛమైన, ప్రభాతే = ప్రాతఃకాలమునందు, కృతపూర్వాహ్ణికక్రియఃపౌరకార్యవిత్ = చేయబడిన పూర్వాహ్ణమునకు సంబంధించిన కృత్యములు గల, పౌరకార్యములను ఎరిగిన, కాకుత్థ్సఃరాముడు, దర్శనమ్ = ప్రజలకు దర్శనమిచ్చే భవనమును గూర్చి, అభిచక్రామ = వచ్చెను.

తా. పిమ్మట తెల్లవారగానే పూర్వాహ్ణకృత్యము లన్నీ పూర్తిచేసికొని రాముడు పౌరుల కార్యములు పరీక్షించుటకై(వినుటకై) దర్శనగృహమును చేరెను.

మూ. తతః సుమన్త్రస్త్వాగమ్య రాఘవం వాక్యమబ్రవీత్,
ఏతే ప్రతిహతా రాజన్ ద్వారి తిష్ఠన్తి తాపసాః. 3

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సుమన్త్రః తు = సుమంత్రుడు, ఆగమ్య = వచ్చి, రాఘవమ్ = రాముణ్ణి గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. రాజన్ = రాజా! ఏతే తాపసాః = ఈ మునులు, ప్రతిహతాః = అడ్డుకొన బడినవారై, ద్వారి = ద్వారమునందు, తిష్ఠన్తి = నిలచినారు.

తా. అప్పుడు సుమంత్రుడు వచ్చి రామునితో ఇట్లు పలికెను-"రాజా! ఈ మునులు ద్వారము దగ్గర ఆపివేయబడినారు; అక్కడ నిలచి ఉన్నారు". 3

మూ. భార్గవం చ్యవనం చైవ పురస్కృత్య మహర్షయః,
దర్శనం తే మహారాజ చోదయన్తి కృతత్వరాః. 4

ప్ర. అ. మహారాజ = మహారాజా! మహర్షయః = మహర్షులు, భార్గవమ్ = భార్గవుణ్ణి, చ్యవనం చైవ = చ్యవనుణ్ణి, పురస్కృత్య = పురస్కరించుకొని, కృత త్వరాః = చేయబడిన తొందర గలవారై, తే దర్శనమ్ = నీ దర్శనమును గూర్చి, చోదయన్తి = ప్రేరేపించుచున్నారు.

తా. మహారాజా! భార్గవుణ్ణి, చ్యవనుణ్ణి ముందు ఉంచుకొని వచ్చిన ఆ మహర్షులు నీ దర్శనముకొరకు తొందరపడుచు ద్వారపాలాదులను ప్రేరేపించు చున్నారు. 4

మూ. ప్రీయమాణా నరవ్యాఘ్ర యమునాతీరవాసినః,
తస్య తద్వచనం శ్రుత్వా రామః ప్రోవాచ ధర్మవిత్ 5
ప్రవేశ్యన్తాం మహాభాగా భార్గవప్రముఖా ద్విజాః.

ప్ర. అ. నరవ్యాఘ్ర = నరశ్రేష్ఠుడా! ప్రీయమాణాః = సంతోషపెట్టుబడు చున్న, యమునాతీరవాసినః = యమునాతీరమునందున్న (ఆ ఋషులు వచ్చి ఉన్నారు). తస్య = అతనియొక్క, తత్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, ధర్మవిత్ = ధర్మవేత్త అయిన, రామః = రాముడు, ప్రోవాచ = పలికెను. మహాభాగాః = మహాభాగ్యవంతులైన, భార్గవప్రముఖాః = భార్గవుడు మొదలైన, ద్విజాః = బ్రాహ్మణులు, ప్రవేశ్యన్తామ్ = ప్రవేశపెట్టబడుదురుగాక.

తా. "నరశ్రేష్ఠుడా! యమునాతీరవాసులైన ఆ ఋషులు సంతోషముతో కనబడుచున్నారు". ధర్మవేత్తయైన రాముడు ఆ సుమంత్రుని మాటలు విని-"భార్గవుడు మొదలైన మహాభాగ్యవంతులైన ఆ బ్రాహ్మణులను ప్రవేశ పెట్టుము"అని పలికెను. 5

మూ. రాజ్ఞస్త్వాజ్ఞాం పురస్కృత్య ద్వాస్థో మూర్ధ్నా కృతాఞ్జలిః,
ప్రవేశయామాస తదా తాపసాన్ సుదురాసదాన్. 6

ప్ర. అ. రాజ్ఞః=రాజుయొక్క, ఆజ్ఞామ్=ఆజ్ఞను, పురస్కృత్య=పురస్కరించుకొని, ద్వాస్థః = ద్వారపాలకుడు, మూర్ధ్నా = శిరస్సుచేత, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి కలవాడై, తదా = అప్పుడు, సుదురాసదాన్ = సమీపింప శక్యము కాని, తాపసాన్ = ఆ మునులను, ప్రవేశయామాస = ప్రవేశ పెట్టెను.

తా. ద్వారపాలకుడు తల వంచి నమస్కారము చేసి రాజాజ్ఞానుసారము సమీపింప శక్యము కాని తేజస్సు గల ఆ మునులను ప్రవేశ పెట్టెను. 6

మూ. శతం సమధికం తత్ర దీప్యమానం స్వతేజసా, 7
ప్రవిష్టం రాజభవనం తాపసానాం మహాత్మనామ్.

ప్ర. అ. తత్ర = అక్కడ, స్వతేజసా = తన తేజస్సుచేత, దీప్యమానమ్ = ప్రజ్వరిల్లుచున్న, మహాత్మనామ్ = మహాత్ములైన, తాపసానామ్ = మునులయొక్క, సమధికమ్ = కొంచెము ఎక్కువ అయిన, శతమ్ = శతము, రాజభవనమ్ = రాజభవనమును, ప్రవిష్టమ్ = ప్రవేశించినది.

తా. ఆప్పుడు తమ తేజస్సుతో ప్రకాశించుచున్న మహాత్ములైన వందమంది మునీశ్వరులు రాజభవనములో ప్రవేశించిరి. 7

మూ. తే ద్విజాః పూర్ణకలశైః సర్వతీర్థామ్బుసత్కృతైః, 8
గృహీత్వా ఫలమూలం చ రామస్యాభ్యాహరన్ బహు.

ప్ర. అ. తే ద్విజాః=ఆ బ్రాహ్మణులు, సత్కృతైః = అలంకరించబడిన, పూర్ణకలశైః = పూర్ణకలశలతో, సర్వతీర్థామ్బు = సకలతీర్థముల ఉదకమును, గృహీత్వా = గ్రహించి, రామస్య = రామునకు, బహు = అధికమైన, ఫలమూలం చ = ఫలమూలములను కూడ, అభ్యాహరన్ = తీసికొని వచ్చి ఇచ్చిరి.

మూ. ఉపవిష్టాన్ ఋషీం స్తత్ర దృష్ట్వా పరపురంజయః, 12
ప్రయతః ప్రాఞ్జలిర్భూత్వా రాఘవో వాక్యమబ్రవీత్.

ప్ర. అ. పరపురంజయః = శత్రుపురములను జయించు, రాఘవః = రాముడు, తత్ర = అక్కడ, ఉపవిష్టాన్ = కూర్చున్న, ఋషీన్ = ఋషులను, దృష్ట్వా = చూచి, ప్రయతః = నియమవంతుడై, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడు, భూత్వా = అయి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. శత్రుపురములను జయించు రాముడు అక్కడ కూర్చున్న మునులను చూచి, నియమము పాటించుచు, అంజలి ఘటించి ఇట్లు పలికెను. 12

మూ. కిమాగమనకార్యం వః కిం కరోమి సమాహితః, 13
ఆజ్ఞాప్యోఽహం మహర్షీణాం సర్వకామకరః సుఖమ్.

ప్ర. అ. వః = మీయొక్క, ఆగమనకార్యమ్ = వచ్చుటకు కార్యము, కిమ్ = ఏమి? సమాహితః = సావధానచిత్తుడనై, కిమ్ = ఏమి, కరోమి = చేయుదును? సర్వకామకరః = సమస్తమైన కోరిన పనులు చేయు, అహమ్ = నేను, మహర్షీణామ్ = మహర్షులకు, సుఖమ్ = సుఖముగా, ఆజ్ఞాప్యః = ఆజ్ఞాపించ దగినవాడను.

తా. మీరు వచ్చిన పని ఏమి? సావధానచిత్తముతో నేను మీకు ఏమి చేయ వలెను? కోరిన పనులు చేయగలను. నన్ను మహర్షులు నిస్సంకోచముగా ఆజ్ఞా పించవచ్చును. 13

మూ. ఇదం రాజ్యం చ సకలం జీవితం చ హృది స్థితమ్ 14
సర్వమేతద్ద్విజార్థం మే సత్యమేతద్ బ్రవీమి వః.

ప్ర. అ. మే = నాయొక్క, ఇదమ్ = ఈ, సకలమ్ = సమస్తమైన, రాజ్యమ్ = రాజ్యము, హృది స్థితమ్ = హృదయమునందున్న, జీవితమ్ = జీవితము, ఏతత్ = ఇది, సర్వమ్ = అంతా కూడ, ద్విజార్థమ్ = బ్రహ్మణులకొరకే. వః = మీకు, సత్యమ్ = సత్యముగా, ఏతత్ = దీనిని, బ్రవీమి = చెప్పుచున్నాను.

తా. ఈనా సమస్తరాజ్యము, హృదయమునందున్న జీవితము, సర్వమూ కూడ ద్విజులకొరకే. మీకు ఇది సత్యముగా చెప్పుచున్నాను. 14

మూ. తస్య తద్వచనం శ్రుత్వా సాధుకారో మహానభూత్, 15
ఋషీణాముగ్రతపసాం యమునాతీరవాసినామ్,
ఊచుశ్చైవ మహాత్మానో హర్షేణ మహతా వృతాః. 16

ప్ర. అ. తస్య = రామునియొక్క, తత్ = ఆ. వచనమ్ = వచనమును, శ్రుత్వా=విని, యమునాతీరవాసినామ్ = యమునాతీరమునందు నివసించుచున్న, ఉగ్రతపసామ్ = ఉగ్రమైన తపస్సు గల, ఋషీణామ్ = ఋషులయొక్క, మహాన్ = గొప్ప, సాధుకారః = "సాధు" శబ్దము, అభూత్ = ఆయెను. మహాత్మానః = ఆ మహాత్ములు, మహతా = గొప్ప, హర్షేణ = సంతోషముతో, వృతాః = కూడినవారై, ఊచుః చ = పలికిరి కూడ.

తా. రాముని మాటలు విని యమునాతీరవాసులైన, ఉగ్రతపస్సు గల ఆ మునులు పెద్దగా "బాగు బాగు"అనిరి. ఆ మహత్ములు గొప్ప సంతోషముతో ఇట్లు పలికిరి. 15,16

మూ. ఉపపన్నం నరశ్రేష్ఠ తవైవ భువి నాన్యతః,
బహవః పార్థివా రాజన్నతిక్రాన్తా మహాబలాః, 17
కార్యస్య గౌరవం మత్వా ప్రతిజ్ఞాం నాభ్యరోచయన్.

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడవైన రామా! భువి = ఈ భూమియందు, తవైవ = నీకే, ఉపపన్నమ్ = యుక్తమైనది. అన్యతః = ఇతరులకు, న = కాదు. రాజన్ = రాజా! మహాబలాః = గొప్ప బలము గల, బహవః = చాలమంది, పార్థివాః = రాజులు, అతిక్రాన్తాః = గడచినారు. కార్యస్య = కార్యమునొక్క, గౌరవమ్ = గురుత్వమును, మత్వా = తలచి, ప్రతిజ్ఞామ్ = ప్రతిజ్ఞను, నాభ్యరోచయన్ = ఇష్టపడలేదు.

తా. రామా! ఇట్లు పలుకుట ఈ భూలోకములో నీకే తగి యున్నది; మరెవ్వరికీ కాదు. రాజా! పూర్వము మహాబలశాలులైన ఎందరో రాజులు ఉండెడివారు. కాని వారెవరూ అశగబోయే కార్యము ఎంత గొప్పదో అని ఆలోచించి ముందు ప్రతిజ్ఞ చేసేవారు కాదు. 17

మూ. త్వయా పునర్బ్రాహ్మణగౌరవాదియం
కృతా ప్రతిజ్ఞా హ్యనవేక్ష్య కారణమ్,

తతశ్చ కర్తా హ్యసి నాస్తి సంశయో
మహాభయాత్త్రాతుమృషీంస్త్వమర్హసి. 18

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
షష్టితమః సర్గః.

ప్ర. అ. త్వయా పునః = నీచేతనైతే, కారణమ్ = కారణమును, అనవేక్ష్య = చూడకుండగా, బ్రాహ్మణగౌరవాత్ = బ్రాహ్మణులయందు గౌరవముచేత, ఇయం ప్రతిజ్ఞా = ఈ ప్రతిజ్ఞ, కృతా = చేయబడినది. తతః = అందువలన, కర్తా = చేయువాడవు, అసి హి = అయి ఉన్నావు. సంశయః = సంశయము, నాస్తి = లేదు. ఋషీన్ = ఋషులను, మహాభయాత్ = గొప్పభయమునుండి, త్రాతుమ్ = రక్షించుటకు, అర్హసి = తగిఉన్నావు.

తా. నీవు మాత్రము వచ్చిన పని ఏదో తెలుసుకొనకుండగానే, బ్రాహ్మణులపై నీకున్న గౌరవముచేత ప్రతిజ్ఞ చేసినావు. అందువలన తప్పక ఈ పని చేయగలవు. ఋషులను మహాభయమునుండి రక్షింపుము.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
అరవైయవ సర్గ సమాప్తము.

అథ ఏకషష్టితమః సర్గః

[మునులు రామునకు మధువు సంపాదించిన వరమును లవణాసురుని బలమును, ఆతడు చేయుచున్న ఉపద్రవమునూ గూర్చి చెప్పి అతనివలన తమకు కలిగిన భయమును తొలగింపు మని రాముఁజ్ఞి వేఁడుట].

మూ. బ్రువద్భిరేవమృషిభిః కాకుత్థ్సో వాక్య మబ్రవీత్,
కిం కార్యం బ్రూత మునయో భయం తావదపైతు వః. 1

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, బ్రువద్భిః = పలుకుచున్న, ఋషిభిః = ఋషులతో, కాకుత్థ్సః = రాముడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. మునయః = మునులారా! కార్యమ్ = కార్యము, కిమ్ = ఏమి? బ్రూత = చెప్పండి, వః = మీయొక్క, భయమ్ = భయము, అపైతు తావత్ = తొలగుగాక!

తా. ఋషుల మాటలు విని రాముడు-"మునులారా! ఏమి పని మీద వచ్చినారు? మీ భయము తొలగిపోవుగాక"అని పలికెను. 1

మూ. తథా బ్రువతి కాకుత్థ్సే భార్గవో వాక్యమబ్రవీత్,
భయానాం శృణు యన్మూలం దేశస్య చ నరేశ్వర. 2

ప్ర. అ. కాకుత్థ్సే = రాముడు, తథా = అట్లు, బ్రువతి = పలుకుచుండగా, భార్గవః = భార్గవుడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. నరేశ్వర = రాజా! దేశస్య = దేశమునొక్క, భయానామ్ = భయములకు, యత్ = ఏది, మూలమ్ = మూలమో, శృణు = వినుము.

తా. రాముని మాటలు విని భార్గవు డిట్లు పలికెను-"రాజా! దేశమునకు భయకారణ మేమో వినుము". 2

మూ. పురా కృతయుగే రాజన్ దైతేయః సుమహామతిః,
లోలాపుత్రోఽభవజ్జ్యేష్ఠో మధుర్నామ మహాసురః. 3

ప్ర. అ. రాజన్ = రాజా! పురా = పూర్వము, కృతయుగే = కృతయుగమునందు, సుమహామతిః = చాలా గొప్ప బుద్ధి కలవాడు, దైతేయః = దైత్యుడు,

జ్యేష్ఠః = పెద్ద, లోలాపుత్రః = లోలాపుత్రుడూ అయిన, మధుః నామ = మధువు అను పేరు గల, మహాసురః = గొప్ప అసురుడు, అభవత్ = ఉండెను.

తా. రాజాఁ పూర్వము కృతయుగమునందు చాల గొప్ప బుద్ధి గలవాడూ లోల జ్యేష్ఠపుత్రుడు, దైత్యుడు అయిన మధువు అను మహాసురుడు ఉండెను. 3

మూ. బ్రహ్మణ్యశ్చ శరణ్యశ్చ బుద్ధ్యా చ పరినిష్ఠితః,
సురైశ్చ పరమోదారైః ప్రీతిస్తస్యాతులాభవత్. 4

ప్ర. అ. బ్రహ్మణ్యః చ = బ్రాహ్మణపూజకుడు, శరణ్యః చ = రక్షకుడు, బుద్ధ్యా = బుద్ధితో, పరినిష్ఠితః = కూడినవాడూ (అయిన మధువు ఉండెను). తస్య = అతనికి, పరమోదారైః = మిక్కిలి ఉదారులైన, సురైః = దేవతలతో, అతులా = సాటిలేని, ప్రీతి = ప్రేమ, అభవత్ = ఆయెను.

తా. ఆ మధువు బ్రాహ్మణపూజకుడు, రక్షకుడు, సద్బుద్ధికలవాడు. ఆతనికి ఉత్తమస్వభావవంతులైన దేవతలతో మంచి స్నేహ ముండెను. 4

మూ. స మధుర్వీర్యసంపన్నో ధర్మే చ సుసమాహితః,
బహుమానాచ్చ రుద్రేణ దత్తస్తస్యాద్భుతో వరః. 5

ప్ర. అ. సః = ఆ, మధుః = మధువు. వీర్యసంపన్నః = వీర్యవంతుడు, ధర్మే చ = ధర్మమునందు, సుసమాహితః = బాగుగా సావధానచిత్తుడు, రుద్రేణ = రుద్రునిచేత, బహుమానాత్ = గౌరవమువలన, తస్య = వానికి, అద్భుతః = ఆశ్చర్యకరమైన, వరః = వరము, దత్తః = ఇవ్వబడినది.

తా. ఆ మధువు మంచి పరాక్రమము గలవాడు. ధర్మమునందు స్థిరమైన చిత్తము గలవాడు. రుద్రుడు గౌరవభావముతో అతనికి ఒక ఆశ్చర్యకరమైన వరమును ఇచ్చెను. 5

మూ. శూలం శూలాద్వినిష్కృష్య మహావీర్యం మహాప్రభమ్.
దదౌ మహాత్మా సుప్రీతో వాక్యం చైతదువాచ హ. 6

ప్ర. అ. మహాత్మా = మహాత్ముడైన రుద్రుడు, శూలాత్ = శూలమునుండి, మహావీర్యమ్ = గొప్ప పరాక్రమము గల, మహాప్రభమ్ = గొప్ప కాంతి గల, శూలమ్ = శూలమును, వినిష్కృష్య = పైకి లాగి, సుప్రీతః = చాల సంతోషించిన

వాడై, దదౌ = ఇచ్చెను. ఏతత్ = ఈ, వాక్యం చ = వాక్యమును కూడ, ఉవాచ హ = పలికెను.

తా. మహాత్ముడైన రుద్రుడు తన శూలమునుండి గొప్పశక్తి, కాంతి గల మరొక శూలమును పైకి తీసి ఆతని కిచ్చి ఇట్లు పలికెను. 6

మూ. త్వయాయమతులో ధర్మో మత్ప్రసాదకరః కృతః,
ప్రీత్యా పరమయా యుక్తో దదామ్యాయుధముత్తమమ్. 7

ప్ర. అ. త్వయా = నీచేత, అయమ్ = ఈ, మత్ప్రసాదకరః = నాకు సంతోషమును కలిగించు, అతులః = సాటిలేని, ధర్మః = ధర్మము, కృతః = చేయబడినది. పరమయా = గొప్ప, ప్రీత్యా = ప్రేమతో, యుక్తః = కూడిన నేను, ఉత్తమమ్ = గొప్పదైన, ఆయుధమ్ = ఆయుధమును, దదామి = ఇచ్చు చున్నాను.

తా. నీవు నాకు ఆనందమును కలిగించు సాటి లేని ధర్మము ఆచరించి తివి. గొప్ప ప్రీతితో నీకు ఉత్తమమైన ఆయుధమును ఇచ్చుచున్నాను. 7

మూ. యావత్సురైశ్చ విప్రైశ్చ న విరుద్ధ్యేర్మహాసుర,
తావచ్ఛూలం తవేదం స్యాదన్యథా నాశమేష్యతి. 8

ప్ర. అ. మహాసుర = ఓ! మహాసురుడా! యావత్ = ఎంతవరకు, సురైః చ = దేవతలతోను, విప్రైః చ = బ్రాహ్మణులతోను, న విరుద్ధ్యేః = విరోధము చేయవో, తావత్ = అంతవరకు, ఇదం శూలమ్ = ఈ శూలము, తవ = నీదిగా, స్యాత్ = ఉండును. అన్యథా = అట్లు కానిచో, నాశమ్ = నాశమును, యాస్యతి = పొందగలదు.

తా. ఓ! మహాసురా! నీవు ఎంతవరకు దేవతలవిషయమునందు, బ్రాహ్మ ణుల విషయమునందు ద్వేషము వహింపవో అంతవరకు ఇది నీదిగా ఉండ గలదు. అట్లు కానిచో ఇది అదృశ్య మయిపోవును. 8

మూ. యశ్చ త్వామభియుఞ్జీత యుద్ధాయ విగతజ్వరః,
తం శూలో భస్మసాత్ కృత్వా పునరేష్యతి తే కరమ్. 9

ప్ర. అ యః = ఎవడు, విగతజ్వరః = పోయిన పీడ గలవాడై, యుద్ధాయ = యుద్ధముకొరకు, త్వామ్ = నిన్ను, అభియుఙ్క్ష్యతి = ఎదుర్కొనునో, తమ్ = వానిని, శూలః = శూలము, భస్మసాత్ కృత్వా = భస్మముగా చేసి, పునః = మరల, తే = నీయొక్క, కరమ్ = హస్తమును గూర్చి, ఏష్యతి = రాగలదు.

తా. నిన్ను ఎవడు నిర్భయుడై యుద్ధములో ఎదిరించుటకు వచ్చునో వానిని ఈ శూలము భస్మము చేసి మరల నీ చేతిలోనికి వచ్చును. 9

మూ. ఏవం రుద్రాద్వరం లబ్ధ్వా భూయ ఏవ మహాసురః,
ప్రణిపత్య మహాదేవం వాక్యమేతదువాచ హ. 10

ప్ర అ. ఏవమ్ = ఇట్లు, రుద్రాత్ = రుద్రునినుండి, వరమ్ = వరమును లబ్ధ్వా = పొంది, మహాసురః = ఆ మహాసురుడు, మహాదేవమ్ = పరమశివుణ్ణి, భూయః ఏవ = మరల, ప్రణిపత్య = నమస్కరించి, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. ఆ మధువు రుద్రునినుండి ఈ విధముగా వరమును పొంది మరల ఆతనికి నమస్కరించి ఇట్లు పలికెను. 10

మూ. భగవన్మమ వంశస్య శూలమేతదనుత్తమమ్,
భవేత్తు సతతం దేవ సురాణామీశ్వరో హ్యసి. 11

ప్ర. అ. భగవన్ = భగవంతుడా! అనుత్తమమ్ = శ్రేష్ఠమైన, ఏతత్ = ఈ, శూలమ్ = శూలము, సతతమ్ = ఎల్లప్పుడూ, మమ వంశస్య = నా వంశమునకు, భవేత్ తు = ఉండుగాక. సురాణామ్ = దేవతలయొక్క, ఈశ్వరః = ప్రభువు, అసి హి = అయి ఉన్నావు కదా.

తా. భగవంతుడా! శ్రేష్ఠమైన ఈ శూలము నిత్యమూ నా వంశమునకు చెందినదై ఉండుగాక. నీవు దేవతల ప్రభువు కదా (ఈ వరము నిమ్ము). 11

మూ. తం బ్రువాణం మధుం దేవః సర్వభూతపతిః శివః,
ప్రత్యువాచ మహాదేవో నైతదేవం భవిష్యతి. 12

ప్ర. అ. సర్వభూతపతిః = సకలప్రాణులకు అధిపతియైన, దేవః = దేవుడైన, శివః = శివుడైన, మహాదేవః = మహాదేవుడు, ఏవమ్ = ఇట్లు, బ్రువాణమ్ = పలుకుచున్న, తం మధుమ్ = ఆ మధువును గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను. ఏతత్ = ఇది, ఏవమ్ = ఇట్లు, న భవిష్యతి = కాదు.

తా. సకలప్రాణులకు ప్రభువు, దేవుడు, మంగళప్రదుడు అయిన మహాదేవుడు ఇట్లు పలుకుచున్న ఆ మధువుతో ఇట్లనెను. "ఇది ఇట్లు జరుగదు". 12

మూ. మా భూత్తే విఫలా వాణీ మత్ప్రసాదకృతా శుభా,
భవతః పుత్రమేకం తు శూలమేతద్బజిష్యతే. 13

ప్ర. అ. మత్ప్రసాదకృతా = నా అనుగ్రహముచేత చేయబడిన, శుభా = శుభమైన, తే వాణీ = నీ వాక్కు, విఫలా = వ్యర్థము, మా భూత్ = కాకపోవుగాక. ఏతత్ శూలమ్ = ఈ శూలము, భవతః = నీయొక్క, ఏకమ్ = ఒక్క, పుత్రమ్ = పుత్రుణ్ణి, భజిష్యతే = పొందగలదు.

తా. నా అనుగ్రహముచేత వెలువడిన నీ శుభమైన వాక్కు వ్యర్థము కాకుండు గాక; అందుచేత ఈ శూలము నీ కుమారుడు ఒక్కని దగ్గర మాత్రము ఉండగలదు. 13

మూ. యావత్కరస్థః శూలోఽయం భవిష్యతి సుతస్య తే,
అవధ్యః సర్వభూతానాం శూలహస్తో భవిష్యతి. 14

ప్ర. అ. అయమ్ = ఈ, శూలః = శూలము, తే సుతస్య = నీ కుమారునియొక్క, కరస్థః = కరమునందు ఉన్నది, యావత్ భవిష్యతి = ఎంతవరకు కాగలదో అంతవరకు, శూలహస్తః = శూలము హస్తమునందు గల అతడు, సర్వభూతానామ్ = సకలభూతములకు, అవధ్యః = చంపశక్యము కానివాడు, భవిష్యతి = కాగలడు.

తా. ఈ శూలము ఎంతవరకు నీ కుమారుని చేతిలో ఉండునో అంతవరకు ఆతనిని ఎవ్వరూ కూడ చంపజాలరు. 14

మూ. ఏవం మధుర్వరం లబ్ధ్వా దేవాత్సుమహదద్భుతమ్,
భవనం సోఽసురశ్రేష్ఠః కారయామాస సుప్రభమ్. 15

ప్ర. ఆ. అసురశ్రేష్ఠః = అసురులలో శ్రేష్ఠుడైన, మధుః = మధువు, ఏవమ్ = ఇట్లు, దేవాత్ = పరమేశ్వరునివలన, సుమహత్ = చాల గొప్పదైన, అద్భుతమ్ = ఆశ్చర్యకరమైన, వరమ్ = వరమును, లబ్ధ్వా = పొంది, సుప్రభమ్ = మంచి కాంతి గల, భవనమ్ = భవనమును, కారయామాస = చేయించెను.

తా. ఆసురులలో శ్రేష్ఠుడైన ఆ మధువు ఈ విధముగా మహాదేవునినుండి అద్భుతమైన చాల గొప్ప వరమును పొంది, మంచి కాంతి గల ఒక భవనమును నిర్మింపచేసెను. 15

మూ. తస్య పత్నీ మహాభాగా ప్రియా కుమ్భీనసీతి యా,
విశ్వావసోరపత్యం సా ప్యనలాయాం మహాప్రభా. 16

ప్ర. ఆ. యా = ఎవ్వతె, అనలాయామ్ = అనలయందు, విశ్వావసోః = విశ్వావసువుయొక్క, అపత్యమ్ = సంతానమో, సా = ఆ, మహాప్రభా = గొప్ప కాంతి గల, కుమ్భీనసీ ఇతి = కుంభీనసి అను, మహాభాగా = మహాభాగ్యవంతురాలు, తస్య = ఆతనియొక్క, పత్నీ = భార్య.

తా. విశ్వావసువునకు అనలయందు జనించిన గొప్ప కాంతి గల కుంభీనసి అను మహాభాగ్యవంతురాలు ఆ మధువు భార్య. 16

మూ. తస్యాః పుత్రో మహావీర్యో లవణో రామ దారుణః,
బాల్యాత్ప్రభృతి దుష్టాత్మా పాపాన్యేవ సమాచరత్. 17

ప్ర. ఆ. మహావీర్యః = గొప్ప పరాక్రమము గల, దారుణః = భయంకరుడైన, లవణో నామ = లవణుడు అనువాడు, తస్యాః = ఆమెయొక్క, పుత్రః = పుత్రుడు, దుష్టాత్మా = దుష్టాత్ముడైన అతడు, బాల్యాత్ ప్రభృతి = బాల్యమునుండి కూడ, పాపాన్యేవ = పాపములనే, సమాచరత్ = చేసెను.

తా. ఆ కుంభీనసికి గొప్ప పరాక్రమము గల, భయంకరుడైన లవణుడను పుత్రుడు పుట్టెను. దుష్టబుద్ధియైన అతడు బాల్యమునుండీ కూడ పాపకార్యములనే చేసెను. 17

మూ. తం పుత్రం దుర్వినీతం తు దుష్ట్వా క్రోధసమన్వితః,
మధుః స శోకమాపేదే న చైనం కిం చిదబ్రవీత్. 18

ప్ర అ. మధుః = మధువు, దుర్వినీతమ్ = వినయవిహీనుడైన, తం పుత్రమ్ = ఆ పుత్రుణ్ణి, దృష్ట్వా = చూచి, క్రోధసమన్వితః = కోపముతో కూడిన వాడై, శోకమ్ = దుఃఖమును, ఆపేదే = పొందెను. ఏనమ్ = వీనిని గూర్చి, కించిత్ = ఏమీ కూడ, న ఆబ్రవీత్ = పలకలేదు.

తా. దుష్టస్వభావము గల ఆ పుత్రుణ్ణి చూచి మధువుకు కోపము, దుఃఖమూ గూడ కలిగెను కాని అతడు వానిని ఏమీ అనలేదు. 18

మూ. స విహాయ ఇమం లోకం ప్రవిష్టో వరుణాలయమ్,
శూలం నివేశ్య లవణే వరం తస్మై న్యవేదయత్. 19

ప్ర. అ. సః = అతడు, ఇమం లోకమ్ = ఈ లోకమును, విహాయ = విడచి, వరుణాలయమ్ = వరుణలోకమును, ప్రవిష్టః = ప్రవేశించెను. లవణే = లవణునియందు, శూలమ్ = శూలమును, నివేశ్య = ఉంచి, తస్మై = వానికి, వరమ్ = వరమును, న్యవేదయత్ = తెలిపెను.

తా. అతడు శూలమును లవణునకు అప్పచెప్పి, దానిని గూర్చిన వరమును కూడ అతనికి తెలిపి ఈ లోకమును విడచి వరుణలోకమునకు వెళ్ళిపోయెను. 19

మూ. స ప్రభావేణ శూలస్య దౌరాత్మ్యేనాత్మనస్తథా,
సంతాపయతి లోకాంస్త్రీన్ విశేషేణ చ తాపసాన్. 20

ప్ర. అ. సః = అతడు, శూలస్య = శూలముయొక్క, ప్రభావేణ = ప్రభావముచేతను, తథా = మరియు, ఆత్మనః = తనయొక్క, దౌరాత్మ్యేన చ = దుష్టత్వముచేతను, త్రీన్ = మూడు, లోకాన్ = లోకములను, సంతాపయతి = పీడించుచున్నాడు.

తా. అతడు సహజముగా దుష్ట డగుటచేతను, ఆ శూలము ప్రభావముచేతను మూడు లోకములను కూడ పీడించుచున్నాడు. విశేషించి మునులను పీడించుచున్నాడు. 20

మూ. ఏవంప్రభావో లవణః శూలం చైవ తథావిధమ్.
శ్రుత్వా ప్రమాణం కాకుత్స్థ త్వం హి నః పరమా గతిః.

ప్ర. అ. కాకుత్స్థ = రామా! లవణః = లవణుడు, ఏవంప్రభావః = ఇట్టి ప్రభావము కలవాడు, శూలం చైవ = శూలము కూడ, తథావిధమ్ = అట్టిది. శ్రుత్వా = విని, త్వమ్ = నీవే, ప్రమాణమ్ = ప్రమాణము. నః = మాకు, పరమా గతిః హి = గొప్ప గతివి కదా?

తా. రామా! లవణుని ప్రభావము ఇట్టిది. శూలము కూడా ఆలాంటిది. ఈ విషయమున నీదే తుది నిర్ణయము. నీవే మాకు దిక్కు కదా? 21

మూ. బహవః పార్థివా రామ భయార్తైర్ఋషిభిః పురా,
అభయం యాచితా వీర త్రాతారం న చ విద్మహే. 22

ప్ర. అ. వీర = వీరుడా! రామ = రామా! పురా = పూర్వము, భయార్తైః = భయపీడితులైన. ఋషిభిః = ఋషుల చేత, బహవః = చాలామంది, పార్థివాః = రాజులు, అభయమ్ = అభయమును, యాచితాః = యాచింపబడినవారు. త్రాతారమ్ = రక్షించేవాణ్ణి (మేము), న చ విద్మహే = పొందుటలేదు.

తా. వీరుడవైన రామా! భయపీడితులైన ఋషులు పూర్వము చాలామంది రాజులదగ్గరకు వెళ్ళి అభయము యాచించినారు. కాని మాకు ఒక్క రక్షకుడు కూడా లభించలేదు. 22

మూ. తే వయం రావణం శ్రుత్వా హతం సబలవాహనమ్,
త్రాతారం విద్మహే తాత నాన్యం భువి నరాధిపమ్. 23
తత్పరిత్రాతుమిచ్ఛామో లవణాద్భయపీడితాన్.

ప్ర. అ. తాత = తండ్రీ! తే వయమ్ = అట్టి మేము, సబలవాహనమ్ = సైన్యవాహనములతో కూడిన, రావణమ్ = రావణుణ్ణి. హతమ్ = చంపబడినవానినిగా, శ్రుత్వా = విని, భువి = భూమియందు, అన్యమ్ = మరియొక, నరాధిపమ్ = రాజును, త్రాతారమ్ = రక్షకుణ్ణిగా, న విద్మహే = ఎరుగము. తత్ = ఆ కారణమువలన, లవణాత్ = లవణునినుండి, భయపీడితాన్ = భయపీడితులమైన మమ్ములను, త్రాతుమ్ = రక్షించుటకు, ఇచ్ఛామః = కోరుచున్నాము.

తా. తండ్రీ! నీవు సైన్యవాహనాదులతో సహా రావణుణ్ణి సంహరించి నట్లు విన్నాము. ఈ భూలోకములో రక్షకుడైన మరొక రాజు ఎవ్వడూ కనబడుటలేదు.

అందువలన లవణాసురునినుండి భయముచేత పీడితులమైన మమ్ము రక్షించవలె నని కోరుచున్నాము. 23

మూ. ఇతి రామ నివేదితం తు తే
భయజం కారణముత్థితం చ యత్,
వినివారయితుం భవాన్ క్షమః
కురు తం కామమహీనవిక్రమ. 24

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకషష్టితమః సర్గః.

ప్ర. అ. రామ = రామా! ఇతి = ఈ విధముగా, భయజమ్ = భయము వలన కలిగిన, యత్ = ఏ, కారణమ్ = కారణము, ఉత్థితమ్ = బయల్వెడలినదో (ఏర్పడినదో) అది, తే = నీకు, నివేదితమ్ = తెలుపబడినది. భవాన్ = నీవు, వినివారయితుమ్ = నివారించుటకు, క్షమః = సమర్థుడవు. అహీనవిక్రమ = గొప్ప పరాక్రమము గలవాడా! తమ్ = ఆ, కామమ్ = కోరికను, కురు = చేయుము.

తా. రామా! భయమునకు కారణమును నీకు తెలిపినాము. దీనిని నివారించుటకు నీవే సమర్థుడవు. గొప్ప పరాక్రమము కలవాడా! ఈ కోరిక తీర్చుము.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు,
ఉత్తరకాండలో అరవై ఒకటవసర్గ సమాప్తము.

అథ ద్విషష్టితమః సర్గః

[లవణాసురుని ఆహారాదుల విషయమున రాముడు మునులను ప్రశ్నించుట. వానిని చంపుటకై శత్రుఘ్నుని ఉత్సాహము తెలిసికొని ఆతనిని ఆ కార్యమునకై ఆజ్ఞాపించుట].

మూ. తథోక్తే తాన్ఋషీన్ రామః ప్రత్యువాచ కృతాఞ్జలిః,
కిమాహారః కిమాచారో లవణః క్వ చ వర్తతే. 1

ప్ర. అ. తథా = అట్లు, ఉక్తే = చెప్పబడగా, రామః = రాముడు, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి కలవాడై, తాన్ = ఆ, ఋషీన్ = ఋషులను గూర్చి, ప్రత్యువాచ హ = తిరిగి పలికెను. లవణః=లవణుడు, కిమాహారః = ఏమి ఆహారము కలవాడు? కిమాచారః = ఎట్టి ప్రవర్తన కలవాడు, క్వ చ = ఎక్కడ, వర్తతే = ఉంటున్నాడు.

తా. రాముడు ఋషుల మాటలు విని, వారికి నమస్కరించుచు- "ఆ లవణాసురుడు ఎట్టి ఆహారము తినును? ఏవిధముగా ప్రవర్తించుచుండును?" అని ప్రశ్నించెను. 1

మూ. రాఘవస్య వచః శ్రుత్వా ఋషయః సర్వ ఏవ తే,
తతో నివేదయామాసుర్లవణో వవృధే యథా. 2

ప్ర. అ. రాఘవస్య = రామునియొక్క, వచః=వచనమును, శ్రుత్వా = విని, తే = ఆ, సర్వే ఏవ = సమస్తమైన, ఋషయః = ఋషులు, తతః = అటు పిమ్మట, లవణః = లవణుడు, యథా = ఎట్లు, వవృధే = వృద్ధి పొందెనో, నివేదయామాసుః = తెలిపిరి.

తా. రాముని మాటలు విని ఆ ఋషు లందరూ ఆ లవణుడు ఎట్లు వృద్ధి పొందెనో తెలిపిరి. 2

మూ. ఆహారః సర్వసత్త్వాని విశేషేణ చ తాపసాః,
ఆచారో రౌద్రతా నిత్యం వాసో మధువనే తథా. 3

ప్ర. అ. సర్వసత్త్వాని = సమస్తప్రాణులూ కూడ, ఆహారః = ఆహారము, విశేషేణ = విశేషించి, తాపసాః = మునులు. నిత్యమ్ = నిత్యమూ, రౌద్రతా = క్రూరత్వము, ఆచారః = ఆచారము, తథా = మరియు, మధువనే = మధువనమునందు, వాసః = నివాసము.

తా. అన్ని ప్రాణులూ కూడ వాని ఆహారమే; విశేషించి మునులు వాని ఆహారము. నిత్యమూ క్రూరముగా ఉండుట వాని ఆచారము. మధువనములో వాని నివాసము. 3

మూ. హత్వా బహుసహస్రాణి సింహవ్యాఘ్రమృగాణ్ణజాన్,
మానుషాంశ్చైవ కురుతే నిత్యమాహారమాహ్నికమ్. 4

ప్ర. అ. బహుసహస్రాణి = ఎన్నో వేల, సింహవ్యాఘ్రమృగాణ్ణజాన్ = సింహములను, వ్యాఘ్రములను, లేళ్ళను, పశువులను, మానుషాన్ చ ఏవ = మనుష్యులను, హత్వా = చంపి, నిత్యమ్ = నిత్యమూ, ఆహ్నికమ్ = పగటికి సంబంధించిన, ఆహారమ్ = ఆహారమును. కురుతే = చేయును.

తా. కొన్నివేల సింహములను, పెద్దపులులను, లేళ్ళను, పశువులను, మనుష్యులను చంపి నిత్యము పగలు భోజనము చేయుచుండును. 4

మూ. తతోఽన్తరాణి సత్త్వాని ఖాదతే స మహాబలః,
సంహారే సమనుప్రాప్తే వ్యాదితాస్య ఇవాన్తకః. 5

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గల, సః = అతడు, సంహారే = ప్రళయము, సమనుప్రాప్తే = వచ్చిన దగుచుండగా, వ్యాదితాస్యః = తెరవబడిన ముఖము గల, అన్తకః = ఇవ యమునుడు వలె తతః = పూర్వము చెప్పిన వాటి కంటె, అన్తరాణి = భిన్నమైన, సత్త్వాని = ప్రాణులను, ఖాదతే = తినును.

తా. ప్రళయకాలమునందు నోరు తెరచుకొనిన మృత్యుదేవత వలె మహాబలశాలియైన ఆ లవణుడు, రాత్రులందు ఇతర మృగములను తినుచుండును. 5

మూ. తచ్ఛ్రుత్వా రాఘవో వాక్యమువాచ స మహామునీన్,
ఘాతయిష్యామి తద్రక్షో వ్యపగచ్ఛతు వో భయమ్. 6

ప్ర. అ. సః = ఆ, రాఘవః = రాముడు. తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, మహామునీన్ = మహాములను గూర్చి, ఉవాచ = పలికెను. తత్ = ఆ, రక్షః = రాక్షసుణ్ణి. ఘాతయిష్యామి = చంపెదను. వః = మీయొక్క, భయమ్ = భయము, వ్యపగచ్ఛతు = తొలగుగాక.

తా. రాముడు ఆ మాటలు విని ఆ మునులతో- "ఆ రాక్షసుణ్ణి చంపించెదను. మీరు భయమును విడిచిపెట్టుడు" అని పలికెను. 6

మూ. ప్రతిజ్ఞాయ తదా తేషాం మునీనాముగ్రతేజసామ్,
స భ్రాతౄన్ సహితాన్ సర్వానువాచ రఘునన్దనః. 7

ప్ర. అ. సః రఘునన్దనః = ఆ రాముడు, ఉగ్రతేజసామ్ = ఉగ్రమైన తేజస్సుగల, తేషామ్ = ఆ, మునీనామ్ = మునులకు, ప్రతిజ్ఞాయ = ప్రతిజ్ఞ చేసి, తదా = అప్పుడు, సహితాన్ = అక్కడనే కలిసి ఉన్న, సర్వాన్ = సమస్తమైన, భ్రాతౄన్ = సోదరులను గూర్చి, ఉవాచ = పలికెను.

తా. రాముడు ఉగ్రమైన తేజస్సుగల ఆ మునులకు ఈ విధముగ ప్రతిజ్ఞ చేసి అక్కడనే ఉన్న సోదరులతో ఇట్లు పలికెను. 7

మూ. కో హన్తా లవణం వీరః కస్యాంశః స విధీయతామ్,
భరతస్య మహాబాహోః శత్రుఘ్నస్య చ ధీమతః. 8

ప్ర. అ. కః వీరః = ఏ వీరుడు, లవణమ్ = లవణుని, హన్తా = చంపగలడు? సః = అతడు, కస్య = ఎవనియొక్క, అంశః = అంశగా, విధీయతామ్ = చేయబడుగాక! మహాబాహోః = గొప్ప బాహువులు గల, భరతస్య = భరతునికా, ధీమతః = బుద్ధిమంతుడైన, శత్రుఘ్నస్య చ = శత్రుఘ్నునికా?

తా. లవణుణ్ణి ఏ వీరుడు చంపగలడు? వానిని మహాబాహువైన భరతుని వాటాగా చేయవలెనా, ధీమంతుడైన శత్రుఘ్ని వాటాగా చేయవలెనా? 8

మూ. రాఘవేణైవముక్తస్తు భరతో వాక్యమబ్రవీత్,
అహమేనం వధిష్యామి మమాంశః స విధీయతామ్. 9

ప్ర. అ. రాఘవేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, భరతః = భరతుడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. అహమ్ = నేను, ఏనమ్ = వీనిని, వధిష్యామి = చంపెదను. సః = అతడు, మమ = నాయొక్క, అంశః = అంశముగా, విధీయతామ్ = చేయబడుగాక.

తా. రాముని మాటలు విని భరతుడు "నేను వానిని చంపెదను. వానిని నా భాగముగా చేయుము" అని పలికెను. 9

మూ. భరతస్య వచః శ్రుత్వా ధైర్యశౌర్యసమన్వితమ్,
లక్ష్మణావరజస్తస్థౌ హిత్వా సౌవర్ణమాసనమ్. 10

ప్ర. అ. భరతస్య = భరతునియొక్క, ధైర్యశౌర్యసమన్వితమ్ = ధైర్యశౌర్యములతో కూడిన, వచః = వచనమును, శ్రుత్వా = విని, లక్ష్మణావరజః = లక్ష్మణుని తమ్ముడు, సౌవర్ణమ్ = బంగారము వికారమైన, ఆసనమ్ = ఆసనమును, హిత్వా = విడచి, తస్థౌ = నిలబడెను.

తా. భరతుడు పలికిన ధైర్యశౌర్యాలతో కూడిన ఆ మాట విని శత్రుఘ్నుడు తాను కూర్చున్న బంగారు ఆసనమునుండి లేచి నిలబడెను. 10

మూ. శత్రుఘ్నస్త్వబ్రవీద్వాక్యం ప్రణిపత్య నరాధిపమ్,
కృతకర్మా మహాబాహుర్మధ్యమో రఘునన్దనః. 11

ప్ర. అ. శత్రుఘ్నః తు = శత్రుఘ్నుడైతే, నరాధిపమ్ = రాజును, ప్రణిపత్య = నమస్కరించి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. మహాబాహుః = గొప్ప బాహువులు గల, మధ్యమః = మధ్యముడైన, రఘునన్దనః = రఘువంశ రాజులను ఆనందపరచువాడు, కృతకర్మా = చేయబడిన కర్మ గలవాడు.

తా. శత్రుఘ్నుడు నమస్కరించుచు రాజుతో ఇట్లు పలికెను. "మహాబాహువైన భరతుడు గొప్ప కార్యమును ఇంతకు పూర్వమే చేసినాడు". 11

మూ. ఆర్యేణ హి పురా శూన్యా త్వయోధ్యా పరిపాలితా,
సంతాపం హృదయే కృత్వా హ్యార్యస్యాగమనం ప్రతి. 12

ప్ర. అ. పురా = పూర్వము, ఆర్యేణ = పూజ్యుడవైన నీతో, శూన్యా =

శూన్యమైన, ఆయోధ్యా = అయోధ్య, ఆర్యస్య = ఆర్యుడవైన నీయొక్క, ఆగమనం ప్రతి = ఆగమనమును గూర్చి, సంతాపమ్ = తాపమును, హృదయే = హృదయమునందు, కృత్వా = చేసికొని, పరిపాలితా హి = పాలింపబడినది కదా.

తా. పూర్వము ఇతడు నీవు లేని అయోధ్యను నీ రాకను గూర్చి మనస్సులో పరితపించుచు రక్షించినాడు కదా. 12

మూ. దుఃఖాని చ బహూనీహ అనుభూతాని పార్థివ,
శయానో దుఃఖశయ్యాసు నన్దిగ్రామే మహాయశాః. 12

ఫలమూలాశనో భూత్వా జటీ చీరధరస్తథా,
అనుభూయేదృశం దుఃఖమేష రాఘవనన్దనః. 13
ప్రేష్యే మయి స్థితే రాజన్న భూయః క్లేశమాప్నుయాత్.

ప్ర. అ. పార్థివ = రాజా! ఇహ = ఇక్కడ, బహూని = అనేకమైన, దుఃఖాని చ = దుఃఖములు కూడ, అనుభూతాని = అనుభవించబడినవి. రాజన్ = రాజా! నన్దిగ్రామే = నందిగ్రామమునందు, ఫలమూలాశనః = ఫలమూలములను భుజించువాడు, భూత్వా = అయి, జటీ = జటాధారియై, తథా = మరియు, చీరధరః = నారబట్టలు ధరించినవాడై, దుఃఖశయ్యాసు = దుఃఖకరములైన శయ్యల మీద, శయానః = శయనించిన, మహాయశాః = గొప్ప కీర్తి గల, ఏషః = ఈ, రాఘవనన్దనః = భరతుడు, ఈదృశమ్ = ఇట్టి, దుఃఖమ్ = దుఃఖమును, అనుభూయ = అనుభవించి, ప్రేష్యే = పంపదగిన, మయి = నేను, స్థితే = ఉండగా, భూయః = మరల, క్లేశమ్ = క్లేశమును, నాప్నుయాత్ = పొందకుండుగాక.

తా. రాజా! ఇతడు అనేక దుఃఖములు అనుభవించినాడు. గొప్ప కీర్తి గల ఈ భరతుడు నందిగ్రామములో ఫలములు, దుంపలు తినుచు జటలను నారబట్టలను ధరించి దుఃఖకరములైన శయ్యలమీద శయనించినాడు. ఇట్టి దుఃఖములను అనుభవించిన ఇతడు పంపదగిన నేను ఉండగా మరల క్లేశమును పొందకుండుగాక. 13, 14

మూ. తథా బ్రువతి శత్రుఘ్నే రాఘవః పునరబ్రవీత్. 15
ఏవం భవతు కాకుత్స్థ క్రియతాం మమ శాసనమ్.

ప్ర అ. శత్రుఘ్నే = శత్రుఘ్నుడు, తథా = అట్లు, బ్రువతి = పలుకు చుండగా, రాఘవః = రాముడు, పునఃమరల, అబ్రవీత్ = పలికెను. కాకుత్స్థ= శత్రుఘ్నా! ఏవమ్ = ఇట్లు, భవతు = అగుగాక. మమ = నాయొక్క, శాసనమ్ = ఆజ్ఞ, క్రియతామ్ = చేయబడుగాక.

తా. శత్రుఘ్నుని మాటలు విని రాముడు ఇట్లు పలికెను. "శత్రుఘ్నా! ఇట్లే అగుగాక. నా ఆజ్ఞ ప్రకారము చేయుము". 15

మూ. రాజ్యే త్వామభిషేక్ష్యామి మధోస్తు నగరే శుభే, 16
నివేశయ మహాబాహో భరతం యద్యవేక్షసే,
శూరస్త్వం కృతవిద్యశ్చ సమర్థశ్చ నివేశనే. 17

ప్ర. అ. శుభే=మంగళకర మైన, మధోః నగరే=మధుపుయొక్క నగరము నందు, రాజ్యే = రాజ్యమునందు, త్వామ్ = నిన్ను, అభిషేక్ష్యామి = అభిషేకించె దను. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా! భరతమ్ = భరతుణ్ణి, అవే క్షసే యది = (శ్రమపెట్టదగనివానినిగా) చూచినట్లయితే, నివేశయ = నీపు రాజ్యమును ఏర్పరచుము. త్వమ్ = నీవు, శూరః చ = శూరుడవు, కృతవిద్యః చ = చేయబడిన విద్యలు కలవాడవు. నివేశనే = రాజ్యమును ఏర్పరచుటయందు, సమర్థః చ = సమర్థుడవు.

తా. నిన్ను మంగళకరమైన మధువు నగరమునందు రాజ్యాభిషిక్తుణ్ణి చేసె దను. మహాబాహూ! భరతుణ్ణి శ్రమపెట్టకూడ దని నీవు భావించినచో నీవు రాజ్య మును ఏర్పరచుము. నీవు శూరుడవు విద్యలు నేర్చినవాడవు. రాజ్యమును ఏర్ప రుచుటలో కూడ సమర్థుడవు. 16, 17

మూ. నగరం యమునాజుష్టం తథా జనపదాన్ శుభాన్,
యో హి వంశం సముత్పాట్య పార్థివస్య నివేశనే. 18
న విధత్తే నృపం తత్ర నరకం స హి గచ్ఛతి.

ప్ర. అ. యమునాజుష్టమ్ = యమునతో కూడిన, నగరమ్=నగరమును,

తథా = మరియు, శుభాన్ = మంగళకరమైన, జనపదాన్ = జనపదములను (ఏర్పరుచుము). యః = ఎవడు, వంశమ్ = వంశమును, సముత్పాట్య = పెకిలించి వేసి, పార్థివస్య = ఆ రాజుయొక్క, తత్ర = ఆ, నివేశనే = రాజ్యనివేశనమునందు, నృపమ్ = మరొక రాజును, న విధత్తే = నిలపడో, సః = అతడు, నరకమ్ = నరకమును గూర్చి, గచ్ఛతి హి = వెళ్లును కదా!

తా. యమునానదీతీరమునందు నగరమును, సుందరమైన జనపదములను ఏర్పరుపుము. ఒక రాజవంశమును నిర్మూలించి ఆ స్థానమునందు మరొకరిని నియమించనివాడు నరకమునకు వెళ్లును. 18

మూ. స తం హత్వా మధుసుతం లవణం పాపనిశ్చయమ్, 19
రాజ్యం ప్రశాధి ధర్మేణ వాక్యం మే యద్యవేక్షసే.

ప్ర. అ. సః త్వమ్ = అట్టి నీవు, మధుసుతమ్ = మధువు కుమారుడైన, పాపనిశ్చయమ్ = పాపబుద్ధి గల, తం లవణమ్ = ఆ లవణుణ్ణి, హత్వా = చంపి, మే వాక్యమ్ = నా మాటను, అవేక్షసే యది = మన్నించినట్లయితే, రాజ్యమ్ = రాజ్యమును, ధర్మేణ = ధర్మముచేత, ప్రశాధి = రక్షించుము.

తా. నీవు నా మాట మన్నించినట్లయితే దుష్టబుద్ధి గల మధుపుత్రుడైన ఆ లవణుణ్ణి చంపి ధర్మానుసారముగా రాజ్యము పాలించుము. 19

మూ. ఉత్తరం న చ వక్తవ్యం శూరవాక్యాన్తరే మమ, 20
బాలేన పూర్వజస్యాజ్ఞా కర్తవ్యా నాత్ర సంశయః.

ప్ర. అ. శూర = శూరుడా! మమ = నాయొక్క, వాక్యాన్తరే = మాటల మధ్య, ఉత్తరమ్ = ప్రత్యుత్తరము, న చ వక్తవ్యమ్ = చెప్పదగినది కాదు. బాలేన = చిన్నవానిచేత, పూర్వజస్య = అన్నగారియొక్క, ఆజ్ఞా = ఆజ్ఞ, కర్తవ్యా = చేయదగినది. అత్ర = ఈ విషయమునందు, సంశయః = సంశయము, న = లేదు.

తా. ఓ! శూరుడా! నా మాటల మధ్య నీవు మరేమీ చెప్పవద్దు. చిన్నవాడు అన్నగారి ఆజ్ఞ ఆచరించవలెను. ఈ విషయములో సందేహము లేదు. 20

మూ. అభిషేకం చ కాకుత్స్థ ప్రతీచ్ఛస్వ మయోద్యతమ్, 21
వసిష్ఠప్రముఖైర్విప్రైర్విధిమన్త్రపురస్కృతమ్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ద్విషష్టితమః సర్గః.

ప్ర. అ. కాకుత్స్థ = శత్రుఘ్నా! మయా = నాచేత, ఉద్యతమ్ = సంకల్పించబడిన, విధిమన్త్రపురస్కృతమ్ = శాస్త్రముచేతను, మంత్రములచేత పురస్కృతమైన, వసిష్ఠప్రముఖైః = వసిష్ఠుడు మొదలైన, విప్రైః = బ్రాహ్మణుల చేత చేయబడిన, అభిషేకం చ = అభిషేకము కూడ, ప్రతీచ్ఛస్వ = స్వీకరించుము.

తా. శత్రుఘ్నా! నేను సంకల్పించిన వసిష్ఠాదిబ్రాహ్మణులు యథాశాస్త్రముగా, మతపూర్వకముగా చేయబోవు అభిషేకమును పొందుము. 21

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో అరవై రెండవ సర్గ సమాప్తము.

అథ త్రిషష్టితమః సర్గః

[రాముడు శత్రుఘ్నుణ్ణి మధురాజ్యమునందు అభిషిక్తుని చేసి లవణుని శూలమునుండి ఆత్మరక్ష చేసికొను ఉపాయమును చెప్పుట].

మూ. ఏవముక్తస్తు రామేణ పరాం వ్రీడాముపాగమత్,
శత్రుఘ్నో వీర్యసంపన్నో మన్దం మన్దమువాచ హ. 1

ప్ర. అ. వీర్యసంపన్నః = పరాక్రమసంపన్నుడైన, శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, రామేణ = రాముని చేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడినవాడై, పరామ్ = గొప్ప, వ్రీడామ్ = సిగ్గును, ఉపాగమత్ = పొందెను. మన్దం మన్దమ్ = మెల్ల మెల్లగా, ఉవాచ హ = పలికెను.

తా. రాముని మాటలు విని పరాక్రమసంపన్నుడైన శత్రుఘ్నుడు చాల సిగ్గుపడుచు మెల్లమెల్లగా ఇట్లు పలికెను. 1

మూ. అధర్మం విద్మ కాకుత్స్థ అస్మిన్నర్థే నరేశ్వర,
కథం తిష్ఠత్సు జ్యేష్ఠేషు కనీయానభిషిచ్యతే. 2

ప్ర. అ. కాకుత్స్థ = రామా! నరేశ్వర = రాజా! అస్మిన్ = ఈ, అర్థే = విషయమునందు, అధర్మమ్ = అధర్మమును, విద్మ = తెలిసికొనుచున్నాము. జ్యేష్ఠేషు = పెద్దవాళ్ళు, తిష్ఠత్సు = ఉండగా, కనీయాన్ = చిన్నవాడు, కథమ్ = ఎట్లు, అభిషిచ్యతే = అభిషేకించబడును?

తా. మహారాజా! రామా! ఈ విషయము అధర్మమని భావించుచున్నాను. పెద్దవాళ్లు ఉండగా చిన్నవానికి అభిషేకము ఎట్లు జరుగును? 2

మూ. అవశ్యం కరణీయం చ శాసనం పురుషర్షభ,
తవ చైవ మహాభాగ శాసనం దురతిక్రమమ్. 3

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! శాసనమ్ = ఆజ్ఞ, అవశ్యమ్ = తప్పక, కరణీయం చ = చేయదగినది. మహాభాగ = మహాభాగ్యవంతుడా! తవ = నీయొక్క, శాసనం చ ఏవ = శాసనము, దురతిక్రమమ్ = అతిక్రమింప శక్యము కానిది.

తా. పురుషశ్రేష్ఠా! ఆజ్ఞను తప్పక పాటించవలెను. మహాభాగ్యవంతుడా! నీ శాసనము తప్పక ఆచరింప దగినది. 3

మూ. త్వత్తో మయా శ్రుతం వీర శ్రుతిభ్యశ్చ మయా శ్రుతమ్,
నోత్తరం హి మయా వీర మధ్యమే ప్రతిజానతి. 4

ప్ర. అ. వీర = వీరుడా! త్వత్తః = నీనుండి, మయా = నాచేత, శ్రుతమ్ = వినబడినది. శ్రుతిభ్యః చ = శ్రుతులనుండి కూడ, మయా = నాచేత, శ్రుతమ్ = వినబడినది. మధ్యమే = భరతుడు, ప్రతిజానతి = ప్రతిజ్ఞ చేయుచుండగా, మయా = నాచేత, ఉత్తరమ్ = ప్రత్యుత్తరము, న వాచ్యమ్ = చెప్పదగినది కాదు.

తా. ఓ! వీరుడా! నీవు చెప్పగా విని ఉన్నాను; శ్రుతులనుండి విని ఉన్నాను; మధ్యముడైన భరతుడు ప్రతిజ్ఞ చేయుచున్నప్పుడు (లవణాసురుణ్ణి చంపెద నని అనుచున్నప్పుడు) నేను మాటలాడుట యుక్తము కాదు. 4

మూ. వ్యాహృతం దుర్వచో ఘోరం హన్తాస్మి లవణం మృధే,
తస్యైవ మే దురుక్తస్య దుర్గతిః పురుషర్షభ. 5

ప్ర. అ. మృధే = యుద్ధమునందు, లవణమ్ = లవణాసురుణ్ణి, హన్తాస్మి = చంపగలను అని, ఘోరమ్ = ఘోరమైన, దుర్వచః = దుష్టమైనవచనము, వ్యాహృతమ్ = పలకబడినది. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! తస్య = ఆ, మే దురుక్తస్య ఏవ = నా చెడ్డమాటకే, దుర్గతిః = ఈ దుర్గతి కలిగినది.

తా. పురుషశ్రేష్ఠుడా! భరతుడు మాటలాడిన పిమ్మట "నేను లవణాసురుణ్ణి చంపెదను"అని నేను ఘోరమైన చెడ్డ మాట పలికినాను. ఆ చెడ్డమాటకు ఫలితముగా ఈ దుర్గతి (అన్నలకంటె ముందు రాజ్యాభిషిక్తుడు అగుట అనే పాపము చేయవలసిన దుఃస్థితి) వచ్చినది. 5

మూ. ఉత్తరం నహి వక్తవ్యం జ్యేష్ఠేనాభిహితే పునః,
ఆధర్మసహితం చైవ పరలోకవివర్జితమ్. 6

ప్ర. అ. జ్యేష్ఠేన = పెద్దవానిచేత, అభిహితే = చెప్పబడినదగుచుండగా, పునః = మరల, ఆధర్మసహితం చ ఏవ = అధర్మముతో కూడిన, పరలోకవివర్జితమ్ = పరలోకశూన్యమైన, ఉత్తరమ్ = ప్రత్యుత్తరము, న వక్తవ్యం హి = చెప్పదగినది కాదు కదా.

తా. పెద్దవాడు మాటలాడిన పిమ్మట అధర్మసహితము, పరలోకమునకు విరుద్ధమూ అయే రీతిలో ఎదురు చెప్పగూడదుకదా ? 6

మూ. సోఽహం ద్వితీయం కాకుత్స్థ న వక్ష్యామి తవోత్తరమ్,
మా ద్వితీయేన దణ్డో వై నిపతేన్మయి మానద. 7

ప్ర అ. కాకుత్స్థ = రామా ! సః అహమ్ = అట్టి నేను, తవ = నీకు, ద్వితీయమ్ = రెండవ, ఉత్తరమ్ = ఉత్తరమును, న వక్ష్యామి = చెప్పను, మానద = గౌరవమును ఇచ్చువాడా ! ద్వితీయేన = రెండవదానిచేత, మయి = నాయందు, దణ్డః = దండనము, మా నిపతేత్ = పడకుండుగాక.

తా. రామా ! (భరతుని మాటకు ఎదురు చెప్పుటచేతనే ఈ శిక్ష లభించినది). అందుచేత మళ్ళీ నీకు కూడ ఎదురు చెప్పి మరొక శిక్షకు పాత్రుడను కాకుందునుగాక. 7

మూ. కామకారో హ్యహం రాజంస్తవాస్మి పురుషర్షభ,
అధర్మం జహి కాకుత్స్థ మత్కృతే రఘునన్దన. 8

ప్ర అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! రాజన్ = రాజా! అహమ్ = నేను, తవ = నీయొక్క, కామకారః = ఇచ్ఛ ప్రకారము చేసేవాడను, అస్మి హి = అయి ఉన్నాను కదా ? కాకుత్స్థ = కాకుత్స్థవంశమునందు పుట్టినవాడా ! రఘునన్దన = రామా! మత్కృతే = నా నిమిత్తమై, అధర్మమ్ = అధర్మమును, జహి = చంపుము (తొలగింపుము).

తా. పురుషశ్రేష్ఠుడవైన రాజా! నేను నీ ఇచ్ఛ ప్రకారము చేసెదను. రామా! నీవు నా నిమిత్తమై అధర్మమును తొలగింపుము. (చిన్నవాడను అయి ఉండి

రాజ్యాభిషిక్తుడను అగుట అనే నేను చేయు అధర్మము నాకు తగలకుండా చేయుము అని భావము). 8

మూ. ఏవముక్తే తు శూరేణ శత్రుఘ్నేన మహాత్మనా,
ఉవాచ రామః సంహృష్టో భరతం లక్ష్మణం తథా. 9

ప్ర. అ. శూరేణ = శూరుడైన, మహాత్మనా = మహాత్ముడైన, శత్రుఘ్నేన = శత్రుఘ్నునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తే = చెప్పబడగా, రామః = రాముడు, సంహృష్టః = సంతోషించినవాడై, భరతమ్ = భరతుని గూర్చి, తథా = మరియు, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. శూరుడు, మహాత్ముడూ అయిన శత్రుఘ్నుని మాటలు విని రాముడు సంతోషించి, భరతునితోను, లక్ష్మణునితోను ఇట్లు పలికెను. 9

మూ. సంభారానభిషేకస్య ఆనయధ్వం సమాహితాః,
అద్యైవ పురుషవ్యాఘ్రమభిషేక్ష్యామి రాఘవమ్. 10

ప్ర. అ. సమాహితాః = సావధానచిత్తులై, అభిషేకస్య = అభిషేకము యొక్క, సంభారాన్ = సంభారములను, ఆనయధ్వమ్ = తీసికొనిరండి. అద్యైవ = ఇప్పుడే, పురుషవ్యాఘ్రమ్ = పురుషశ్రేష్ఠుడైన, రాఘవమ్ = శత్రుఘ్నుణ్ణి, అభిషేక్ష్యామి = అభిషేకించెదను.

తా. సావధానచిత్తులై అభిషేకసంభారములను తీసికొనిరండి. పురుషశ్రేష్ఠుడైన శత్రుఘ్నునకు ఇప్పుడే రాజ్యాభిషేకము చేసెదను. 10

మూ. పురోధసం చ కాకుత్స్థ నైగమాన్ బుత్విజస్తథా,
మన్త్రిణశ్చైవ తాన్ సర్వానానయధ్వం మమాజ్ఞయా.

ప్ర. అ. కాకుత్స్థ = భరతా! పురోధసమ్ = పురోహితుణ్ణి, నైగమాన్ = నైగములను, తథా = మరియు, బుత్విజః = బుత్విక్కులను, తాన్ సర్వాన్ = వారి నందరినీ, మమ = నాయొక్క, ఆజ్ఞయా = ఆజ్ఞచేత, ఆనయధ్వమ్ = తీసికొనిరండి.

తా. భరతా! పురోహితుణ్ణి, ఆ యా సంఘాల ప్రముఖులను బుత్విక్కులను వీరి నందరినీ నా ఆజ్ఞాచేత తీసికొనిరండి. 11

మూ. రాజ్ఞః శాసనమాజ్ఞాయ తథా కుర్వన్ మహారథాః,
అభిషేకసమారమ్భం పురస్కృత్య పురోధసమ్. 12

ప్ర. అ. మహారథాః = మహారథులు, రాజ్ఞః = రాజుయొక్క, శాసనమ్ = ఆజ్ఞను, ఆజ్ఞాయ = తెలిసికొని, పురోధసమ్ = పురోహితుణ్ణి, పురస్కృత్య = పురస్కరించుకొని, అభిషేకసమారమ్భమ్ = అభిషేకము ఏర్పాటును, తథా = చెప్పిన విధముగ, అకుర్వన్ = చేసిరి.

తా. మహారథులు రాజు శాసనమును తెలిసికొని, పురోహితుణ్ణి ముందు ఉంచుకొని ఆ విధముగ అభిషేకము ఏర్పాట్లు చేసిరి. 12

మూ. ప్రవిష్టా రాజభవనం రాజానో బ్రాహ్మణా స్తథా,
తతోఽభిషేకో వవృధే శత్రుఘ్నస్య మహాత్మనః. 13

ప్ర. అ. రాజానః = రాజులు, తథా = మరియు, బ్రాహ్మణాః = బ్రాహ్మణులు, రాజభవనమ్ = రాజభవనమును, ప్రవిష్టాః = ప్రవేశించినారు. తతః = అటు పిమ్మట, మహాత్మనః = మహాత్ముడైన, శత్రుఘ్నస్య = శత్రుఘ్నునియొక్క, అభిషేకః = అభిషేకము, వవృధే = వృద్ధిపొందెను.

తా. రాజులూ, బ్రాహ్మణులూ రాజభవనములో ప్రవేశించిరి. పిమ్మట మహాత్ముడైన శత్రుఘ్నుని అభిషేకము వైభవముతో జరిగెను. 13

మూ. సంప్రహర్షకరః శ్రీమాన్ రాఘవస్య పురస్య చ,
అభిషిక్తస్తు కాకుత్స్థో బభౌ చాదిత్యసంనిభః, 14
అభిషిక్తః పురా స్కన్దః సేన్ద్రైరివ మరుద్గణైః.

ప్ర. అ. అభిషిక్తః తు = అభిషిక్తుడైన, శ్రీమాన్ = శోభాయుక్తుడైన, కాకుత్స్థః = శత్రుఘ్నుడు, రాఘవస్య = రామునకు, పురస్య చ = పురమునకు, సంప్రహర్షకరః = ఆనందమునుకలిగించుచు, పురా = పూర్వము, సేన్ద్రైః = ఇంద్రునితోకూడిన, మరుద్గణైః = దేవతాగణములచేత, అభిషిక్తః = అభిషిక్తుడైన, స్కన్దః ఇవ = కుమారస్వామివలె, ఆదిత్యసంనిభః = సూర్యునితోసమానుడై, బభౌ = ప్రకాశించెను.

తా. శ్రీమంతుడైన శత్రుఘ్నుడు రాజ్యాభిషిక్తుడై, రామునకూ, పురజనులకు కూడ ఇంద్రాదిదేవతలచేత అభిషిక్తుడైన కుమారస్వామివలె, ఆనందము కలిగించుచు, సూర్యుడు వలె ప్రకాశించెను. 14

మూ. అభిషిక్తే తు శత్రుఘ్నే రామేణాక్లిష్టకర్మణా, 15
పౌరాః ప్రముదితాశ్చాసన్ బ్రాహ్మణాశ్చ బహుశ్రుతాః.

ప్ర. అ. శత్రుఘ్నే = శత్రుఘ్నుడు, అక్లిష్టకర్మణా = అనాయాసముగా పనులు చేయు, రామేణ = రామునిచేత, అభిషిక్తే తు = అభిషేకించబడగా, పౌరాః = పౌరులు, బహుశ్రుతాః = చాల విద్యావంతులైన, బ్రాహ్మణాః చ = బ్రాహ్మణులూ, ప్రముదితాః = సంతోషించినవారు, ఆసన్ = అయిరి.

తా. శ్రమపడకుండగా కార్యములు నిర్వహించు రాముడు శత్రుఘ్నుణ్ణి రాజ్యాభిషిక్తుని చేయగా, పౌరులు అధికవిద్యావంతులైన బ్రాహ్మణులూ కూడ సంతోషించిరి. 15

మూ. కౌసల్యా చ సుమిత్రా చ మఙ్గలం కేకయీ తథా, 16
చక్రుస్తా రాజభవనే యాశ్చాన్యా రాజయోషితః.

ప్ర. అ. కౌసల్యా చ = కౌసల్య, సుమిత్రా చ = సుమిత్ర, తథా = మరియు, కేకయీ = కైకేయి, రాజభవనే = రాజభవనమునందు, అన్యాః = ఇతరలైన, యాః = ఏ, రాజయోషితః = రాజస్త్రీలు గలరో, తాః చ = వాళ్ళు, మఙ్గలమ్ = మంగళమును, చక్రుః = చేసిరి.

తా. కౌసల్య, సుమిత్ర, కైకేయి రాజభవనములో ఉన్న ఇతరరాజభార్యలూ కూడా అతనికి మంగళము చేసిరి. 16

మూ. ఋషయశ్చ మహాత్మానో యమునాతీరవాసినః, 17
హతం లవణమాశంసుః శత్రుఘ్నస్యాభిషేచనాత్.

ప్ర. అ. యమునాతీరవాసినః = యమునాతీరమునందు, నివసించుచున్న, మహాత్మనః = మహాత్ములైన, ఋషయశ్చ = ఋషులుకూడ, శత్రుఘ్నస్య = శత్రుఘ్నునియొక్క. అభిషేచనాత్ = అభిషేకించుటవలన, లవణమ్ = లవణాసురుణ్ణి, హతమ్ = చంపబడిన వానినిగా, ఆశంసుః = తలచిరి.

తా. శత్రుఘ్నుడు రాజ్యాభిషిక్తుడు కాగానే యమునాతీరవాసులైన మహర్షులు "లవణుడు ఇక చచ్చినట్లే" అని అనుకొనిరి. 17

మూ. తతోఽభిషిక్తం శత్రుఘ్నమజ్కమారోప్య రాఘవః, 18
ఉవాచ మధురాం వాణీం తేజస్తస్యాభివూరయన్.

ప్ర. అ. తతః = ఆటుపిమ్మట, రాఘవః = రాముడు, అభిషిక్తమ్ = అభిషిక్తుడైన, శత్రుఘ్నమ్ = శత్రుఘ్నుణ్ణి, అజ్కమ్ = అంకమును, ఆరోప్య = అధిష్ఠింపచేసి, తస్య = వానియొక్క, తేజః = తేజస్సును, అభివూరయన్ = నింపుచు, మధురామ్ = మధురమైన, వాణీమ్ = వాక్కును, ఉవాచ = పలికెను.

తా. పిమ్మట రాముడు రాజ్యాభిషిక్తుడైన శత్రుఘ్నుణ్ణి ఒడిలో కూర్చుండ బెట్టుకొని ఆతని తేజస్సు పెంచుచు మధురమైన వాక్కును పలికెను. 18

మూ. అయం శరస్త్వమోఘస్తే దివ్యః పరపురంజయః, 19
అనేన లవణం సౌమ్య హన్తాసి రఘునన్దన.

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! రఘునన్దన = శత్రుఘ్నుడా! తే = నీకు, (ఇవ్వబడుచున్న), అయమ్ = ఈ, పరంపురంజయః = శత్రుపురములను జయించు, దివ్యః = దివ్యమైన, శరః = శరము, అమోఘః = వ్యర్థముకానిది. అనేన = దీనిచేత, లవణమ్ = లవణాసురుణ్ణి, హన్తాసి = చంపగలవు.

తా. సౌమ్యుడవైన శత్రుఘ్నా! దివ్యము, శత్రుపురవినాశకము అయిన ఈ బాణమును నీకిచ్చుచున్నాను. ఇది అమోఘ మైనది. దీనితో లవణాసురుణ్ణి చంపగలవు. 19

మూ. సృష్టః శరోఽయం కాకుత్స్థ యదా శేతే మహార్ణవే, 20
స్వయంభూరజితో దివ్యో యం నాపశ్యన్ సురాసురాః.

ప్ర. అ. కాకుత్స్థ = శత్రుఘ్న! స్వయంభూః = స్వయముగా ఆవిర్భవించిన, అజితః = శ్రీమహావిష్ణువు, యదా = ఎప్పుడు, మహార్ణవే = మహాసముద్రమునందు, శేతే = నిద్రించుచుండెనో అప్పుడు, అయమ్ = ఈ, దివ్యః = దివ్యమైన, శరః = శరము, సృష్టః = సృజించబడినది. యమ్ = దేనిని, సురాసురాః = సురాసురులు, నాపశ్యన్ = చూడలేదో.

తా. స్వయముగా ఆవిర్భవించిన శ్రీ మహావిష్ణువు మహాసముద్రములో శయనించి ఉన్నప్పుడు ఈ దివ్యమైన శరము సృష్టించబడినది. దీనిని సురులు గాని ఆసురులు గాని చూడలేదు. 20

మూ. అదృశ్యః సర్వభూతానాం తేనాయం హి శరోత్తమః, 21
సృష్టః క్రోధాభిభూతేన వినాశార్థం దురాత్మనోః,
మధుకైటభయోర్వీర విమాతే సర్వరక్షసామ్.

ప్ర. అ. వీర = వీరుడా! తేన = ఆ కారణముచేత, అయమ్ = ఈ, శరోత్తమః = శ్రేష్ఠమైన బాణము, సర్వభూతానామ్ = సకలభూతములకూ కూడ, అదృశ్యః = కనబడనిది. క్రోధాభిభూతేన = కోపముతో నిండిన విష్ణువుచేత, దురాత్మనోః = చెడ్డ బుద్ధిగల, మధుకైటభయోః = మధుకైటభుల, వినాశార్థమ్ = వినాశముకొరకు, సర్వరక్షసామ్ = సకలరాక్షసులయొక్క, విమాతే = నాశనమునందు, సృష్టః = సృష్టించబడినది.

తా. వీరుడా! ఆ కారణముచేత ఈ బాణము ఏ ప్రాణికీ కూడ కనబడదు. క్రోధావిష్టుడైన విష్ణువు దురాత్ముడైన మధుకైటభులను చంపుటకు, సకలరాక్షసులను నశింపచేయుటకు ఈ శరమును సృజించినాడు. 21

మూ. స్రష్టుకామేన లోకాంస్త్రీం స్త్రో చానేన హతౌ యుధి, 22
తౌ హత్వా జనభోగార్థే కైటభం తు మధుం తదా,
అనేన శరముఖ్యేన తతో లోకాంశ్చకార సః. 23

ప్ర. అ. త్రీన్ = మూడు, లోకాన్ = లోకములను, స్రష్టుకామేన = సృజించుటకు కోరికగల విష్ణువుచేత, అనేన = ఈబాణముచేత, తౌ = వాళ్ళిద్దరూ, యుధి = యుద్ధమునందు, హతౌ = చంపబడిరి. సః = ఆ విష్ణువు, అనేన = ఈ శరముఖ్యేన = ముఖ్యమైన శరముచేత, కైటభమ్ = కైటభుని, తథా = మరియు, మధుమ్ = మధువునూ, తౌ = వారిద్దరినీ, హత్వా = చంపి, తతః = అటుపిమ్మట, జనభోగార్థే = జనముయొక్క భోగము కొరకు, లోకాన్ = లోకములను, చకార = చేసెను.

తా. మూడు లోకములను సృష్టింపదలచిన ఆ విష్ణువు దీనిచేత యుద్ధము

నందు వాళ్ళిద్దరినీ చంపివేసెను. శ్రీమహావిష్ణువు మధుకైటభులను ఈ శ్రేష్ఠమైన బాణముచేత సంహరించి ప్రాణుల భోగముకొరకై లోకములను సృష్టించెను.

మూ. నాయం మయా శరః పూర్వం రావణస్య వధార్థినా,
ముక్తః శత్రుఘ్న భూతానాం మహాన్ ప్రాసో భవేదితి. 24

ప్ర. అ. శత్రుఘ్న = శత్రుఘ్నా! పూర్వమ్ = పూర్వము, రావణస్య = రావణునియొక్క, వధార్థినా = వధను కోరిన, మయా = నాచేత, అయం శరః = ఈ బాణము, భూతానామ్ = ప్రాణులయొక్క, మహాన్ = గొప్ప, ప్రాసః = ప్రాసము, భవేత్ ఇతి = అగును అని, న ముక్తః = విడవబడలేదు.

తా. శత్రుఘ్నా! రావణుని చంపదలచిన నేను పూర్వము చాలమంది ప్రాణులకు నాశము కలుగు నను భయముచేత ఈ బాణమును ప్రయోగించలేదు.

మూ. యచ్చ తస్య మహచ్ఛూలం త్ర్యమ్బకేణ మహాత్మనా,
దత్తం శత్రువినాశాయ మధోరాయుధముత్తమమ్. 25
స తం నిక్షిప్య భవనే పూజ్యమానం పునః పునః,
దిశః సర్వాః సమాసాద్య ప్రాప్నోత్యాహారముత్తమమ్. 26

ప్ర. అ. మహాత్మనా = మహాత్ముడైన, త్ర్యమ్బకేణ = శివునిచేత, యత్ = ఏ, మహత్ = గొప్పదైన, శూలమ్ = శూలము, తస్య మధోః = ఆ మధువునకు, శత్రువినాశాయ = శత్రునాశముకొరకు, ఉత్తమమ్ = ఉత్తమమైన, ఆయుధమ్ = ఆయుధముగా, దత్తమ్ = ఇవ్వబడినదో, పునః పునః = మాటిమాటికి, పూజ్యమానమ్ = పూజించబడుచున్న, తమ్ = దానిని, భవనే = గృహములో నిక్షిప్య = ఉంచి, సః = ఆ లవణుడు, సర్వాః = సమస్తమైన, దిశః = దిక్కులను, సమాసాద్య = పొంది, ఉత్తమమ్ = ఉత్తమమైన, ఆహారమ్ = ఆహారమును, ప్రాప్నోతి పొందుచుండును.

తా. మహాత్ముడైన మహేశ్వరుడు శత్రువినాశముకొరకై మధువుకు ఉత్తమమైన ఆయుధముగా ఇచ్చిన ఆ గొప్ప శూలమునకు లవణుడు మాటిమాటికి పూజలు చేయుచుండును. దానిని ఇంటిలోనే ఉంచి ఉత్తమమైన ఆహారము సంపాదించుటకై అన్ని దిక్కులకు పోవుచుండును. 25, 26

మూ. యదా తు యుద్ధమాకాఙ్క్షన్ కశ్చిదేనం సమాహ్వయేత్,
తదా శూలం గృహీత్వా తం భస్మ రక్షః కరోతి హి. 27

ప్ర. అ. కశ్చిత్ = ఎవడైనా, యుద్ధమ్ = యుద్ధమును, ఆకాఙ్క్షన్ = కోరుచు, యదా = ఎప్పుడు, ఏనమ్ = వీనిని, సమాహ్వయేత్ = పిలుచునో, తదా = అప్పుడు, రక్షః = ఆ రాక్షసుడు, శూలమ్ = శూలమును, గృహీత్వా = గ్రహించి, తమ్ = వానిని, భస్మ = భస్మముగా, కరోతి హి = చేయుచుండును.

తా. ఎవ్వడైనా వచ్చి యుద్ధానికి పిలచినపుడు ఈ లవణుడు ఆ శూలమును గ్రహించి వానిని భస్మముచేయుచుండును. 27

మూ. స త్వం పురుషశార్దూల తమాయుధవినాకృతమ్,
ఆప్రవిష్టం పురం పూర్వం ద్వారి తిష్ఠ ధృతాయుధః. 28

ప్ర. అ. పురుషశార్దూల = పురుషశ్రేష్ఠుడా! సః త్వమ్ = అట్టి నీవు, ధృతాయుధః = ధరించబడిన ఆయుధములు కలవాడవై, పురమ్ = పట్టణమును, ఆప్రవిష్టమ్ = ప్రవేశించని, ఆయుధవినాకృతమ్ = ఆయుధము లేకుండ ఉన్న, తమ్ = వానినిగూర్చి, పూర్వమ్ = ముందుగానే, ద్వారి = ద్వారమునందు, తిష్ఠ = నిలచి ఉండుము.

తా. పురుషశ్రేష్ఠుడవైన శత్రుఘ్న! నీవు ఆయుధములు ధరించి, ఆయుధము చేతిలో లేని ఆ లవణుడు పురములో ప్రవేశించుటకు పూర్వమే ఆతని కొరకై ద్వారమువద్ద వేచి ఉండుము. 28

మూ. అప్రవిష్టం చ భవనం యుద్ధాయ పురుషర్షభ,
ఆహ్వయేథా మహాబాహో తతో హన్తాసి రాక్షసమ్. 29

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా! భవనమ్ = భవనమును, అప్రవిష్టమ్ = ప్రవేశించని, రాక్షసమ్ = రాక్షసుణ్ణి, యుద్ధాయ = యుద్ధముకొరకు, ఆహ్వయేథాః = ఆహ్వానించుము. తతః = అటుపిమ్మట, హన్తాసి = చంపగలవు.

తా. పురుషశ్రేష్ఠా! మహాబాహూ! ఆతడు భవనములో ప్రవేశించుటకు ముందుగానే నీవు వానిని యుద్ధానికి పిలుపుము. అప్పుడు వానిని చంపగలవు. 29

మూ. అన్యథా క్రియమాణే తు అవధ్యః స భవిష్యతి,
యది త్వేవం కృతం వీర వినాశముపయాస్యతి. 30

ప్ర. అ. వీర=వీరుడా! అన్యథా=మరియొక విధముగా, క్రియమాణే తు =చేయబడినట్లయితే, సః=అతడు, అవధ్యః=చంప శక్యము కానివాడు, భవిష్యతి =కాగలడు. ఏవమ్=ఇట్లు, కృతం యది=చేయబడినట్లయితే, వినాశమ్ = వినాశమును, ఉపయాస్యతి=పొందగలడు.

తా. వీరుడా! మరొక విధముగా చేసినచో అతడు చంపశక్యము కానివా డగును. ఇట్లు చేసినచో నశించగలడు. 30

మూ. ఏతత్తే సర్వమాఖ్యాతం శూలస్య చ విపర్యయః,
శ్రీమతః శితికణ్ఠస్య కృత్యం హి దురతిక్రమమ్. 31

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
త్రిషష్టితమః సర్గః.

ప్ర. అ. ఏతత్ = ఇది, సర్వమ్=అంతా, తే = నీకు, ఆఖ్యాతమ్=చెప్ప బడినది. శూలస్య=శూలముయొక్క, విపర్యయః అపి = పరిహారము కూడ చెప్ప బడినది. శ్రీమతః = శ్రీమంతుడైన, శితికణ్ఠస్య = శివునియొక్క, కృత్యమ్ = కృత్యము, దురతిక్రమం హి = అతిక్రమింప శక్యము కానిది కదా?

తా. నీకు ఈ విషయ మంతా చెప్పినాను. శూలమును ఎట్లు పరిహరించ వలెనో కూడ చెప్పినాను. శ్రీమంతుడైన ఈశ్వరుని కృత్యము (ఆజ్ఞ) దాట శక్యము కాదు కదా? 31

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో అరువదిమూడవ సర్గ సమాప్తము.

అథ చతుఃషష్టితమః సర్గః

[రాముని ఆజ్ఞచేత శత్రుఘ్నుడు ముందుగా సైన్యమును పంపి ఒక మాసము తరవాత మధురకు ప్రయాణమై వెళ్లుట.]

మూ. ఏవముక్త్వా చ కాకుత్స్థం ప్రశస్య చ పునఃపునః,
పునరేవాపరం వాక్యమువాచ రఘునన్దనః. 1

ప్ర. అ. రఘునన్దనః = రాముడు, కాకుత్స్థమ్ = శత్రుఘ్నుని గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, పునఃపునః = మాటిమాటికి, ప్రశస్య చ = ప్రశంసించి, పునఃఏవ = మరల, అపరమ్ = మరి యొక, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. రాముడు శత్రుఘ్నునితో ఇట్లు పలికి, మాటి మాటికి ప్రశంసించి, మరల మరొక మాట చెప్పెను. 1

మూ. ఇమాన్యశ్వసహస్రాణి చత్వారి పురుషర్షభ,
రథానాం ద్వే సహస్రే చ గజానాం శతముత్తమమ్. 2

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! ఇమాని = ఈ, చత్వారి = నాలుగు, అశ్వసహస్రాణి = అశ్వముల సహస్రములు, రథానామ్ = రథములయొక్క, ద్వే = రెండు, సహస్రే చ = సహస్రములు, గజానామ్ = గజములయొక్క, ఉత్తమమ్ = ఉత్తమమైన, శతమ్ = శతము.

తా. పురుషశ్రేష్ఠుడా! ఇవిగో నాలుగు వేల గుఱ్ఱాలు, రెండు వేల రథాలు, ఒక వంద ఏనుగులు. 2

మూ. అన్తరాపణవీథ్యశ్చ నానాపణ్యోపశోభితాః,
అనుగచ్ఛన్తు కాకుత్స్థం తథైవ నటనర్తకాః. 3

ప్ర. అ. తథైవ = మరియు, నానాపణ్యోపశోభితాః = అనేకమైన (అమ్మ టకు చూపబడిన) వస్తుపులతో ప్రకాశింపచేయబడిన, అన్తరాపణవీథ్యః చ = బజారువీథుల మధ్యయందు, నటనర్తకాః = నటులు, నర్తకులు, కాకుత్స్థమ్ = శత్రుఘ్నుని, అనుగచ్ఛన్తు = అనుసరించి వెళ్లెదరుగాక.

తా. అమ్మ జూపిన అనేకవస్తువులతో ప్రకాశించుచున్న ఆపణముల వీథుల మధ్యలో నటులు నర్తకులు శత్రుఘ్నుని వెనుక వెళ్లెదరుగాక. 3

మూ. హిరణ్యస్య సువర్ణస్య నియుతం పురుషర్షభ,
ఆదాయ గచ్ఛ శత్రుఘ్న పర్యాప్తధనవాహనః. 4

ప్ర. అ. శత్రుఘ్న = శత్రుఘ్నా ! పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా ! పర్యాప్త ధనవాహనః = సరిపడిన ధనమూ వాహనములూ గలవాడవై, సువర్ణస్య = మంచి వర్ణము గల, హిరణ్యస్య = బంగారముయొక్క, నియుతమ్ = నియుతమును, ఆదాయ = గ్రహించి, గచ్ఛ = వెళ్లుము.

తా. పురుషశ్రేష్ఠుడవైన శత్రుఘ్నా! సరిపడునంత ధనముతో వాహనము లతో కూడిన నీవు మంచి బంగారు నాణెములు లక్ష (లేదా వదిలక్షలు) తీసికొని వెళ్లుము. 4

మూ. బలం చ సుభృతం వీర హృష్టతుష్టమనుద్ధతమ్,
సంభాషాసంప్రదానేన రఞ్జయస్వ నరోత్తమ. 5

ప్ర. అ. వీర = వీరుడా ! నరోత్తమ = నరశ్రేష్ఠుడా! సుభృతమ్ = బాగా పోషింపబడిన, హృష్టతుష్టమ్ = ఉత్సాహముగలదై సంతోషించుచున్న, బలం చ = సైన్యమును, సంభాషాసంప్రదానేన = బాగుగా మాటలాడుటను ఇచ్చుటచేత, రఞ్జయస్వ = సంతోష పెట్టుము.

తా. వీరుడవు, నరశ్రేష్ఠుడవు అయిన శత్రుఘ్నా! సైన్యమును బాగుగా పోషించుచు మంచి ఉత్సాహముతోను, సంతోషముతోను ఉండునట్లు చేయుచు, మంచి మాటలతో రజింపచేయుచుండుము. 5

మూ. న హ్యర్థాస్తత్ర తిష్ఠన్తి న దారా న చ బాన్ధవాః,
సుప్రీతో భృత్యవర్గస్తు యత్ర తిష్ఠతి రాఘవ. 6

ప్ర. అ. రాఘవ = శత్రుఘ్న ! సుప్రీతః = బాగా సంతోషించిన, భృత్య వర్గః = భృత్యుల సముదాయము, యత్ర = ఏ ఆపత్సమయమునందు, తిష్ఠతి = నిలచునో, తత్ర = అక్కడ, అర్థాః = ధనములు, న తిష్ఠన్తి = నిలబడవు. దారాః = భార్యలు, న = నిలబడరు, బాన్ధవాః చ = బంధువులు కూడ నిలబడరు.

తా. బాగా సంతోష పెట్టబడిన సైనికాదులు ఎట్టి ఆపత్సమయాదులలో అందగా నిలచెదరో అట్టి సమయాలలో ధనములు గాని, భార్యలు గాని, బంధువులు గాని నిలబడరు. 6

మూ. అతో హృష్టజనాకీర్ణాం ప్రస్థాప్య మహతీం చమూమ్,
ఏక ఏవ ధనుష్పాణిర్గచ్ఛ త్వం మధునో వనమ్. 7

ప్ర. అ. అతః = అందువలన, హృష్టజనాకీర్ణామ్ = సంతోషించిన జనులతో కూడిన, మహతీమ్ = గొప్పదైన, చమూమ్ = సైన్యమును, ప్రస్థాప్య = ప్రయాణము చేయించి, త్వమ్ = నీవు, ఏకః ఏవ = ఒక్కడవే, ధనుష్పాణిః = ధనస్సు హస్తము నందు గలవాడవై, మధునః = మధువుయొక్క, వనమ్ = వనమునుగూర్చి, గచ్ఛ = వెళ్లుము.

తా. అందువలన ఉత్సాహవంతులైన భటులతో నిండిన పెద్ద సైన్యమును బయలుదేరతీసి, నీవు ఒక్కడవే ధనస్సు హస్తమునందు ధరించి మధుపు వనమునకు వెళ్లుము. 7

మూ. యథా త్వాం న ప్రజానాతి గచ్ఛన్తం యుద్ధకాఙ్క్షిణమ్,
లవణస్తు మధోః పుత్రస్తథా గచ్ఛేరశఙ్కితమ్. 8

ప్ర. ఆ. మధోః = మధువుయొక్క, పుత్రః = పుత్రుడైన, లవణః = లవణుడు, గచ్ఛన్తమ్ = వెళ్లుచున్న, త్వామ్ = నిన్ను, యుద్ధకాఙ్క్షిణమ్ = యుద్ధమును కోరుచున్నవానినిగా, యథా = ఎట్లు, న ప్రజానాతి = ఎరుగడో, తథా = ఆ విధముగా, అశఙ్కితమ్ = శంకింపబడకుండునట్లు, గచ్ఛేః = వెళ్లుము.

తా. మధువు పుత్రుడైన లవణునకు నీవు యుద్ధానికి వచ్చుచున్నట్లు తెలియకుండు నట్లు, వానికి శంక కలిగించకుండగా (లేదా) నిర్భయముగా వెళ్లుము. 8

మూ. న తస్య మృత్యురన్యోఽస్తి కశ్చిద్ధి పురుషర్షభ,
దర్శనం యోఽభిగచ్ఛేత స వధ్యో లవణేన హి. 9

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! తస్య = వానికి, అన్యః = మరి యొక, మృత్యుః = మృత్యువు, కశ్చిత్ = ఏదీ కూడ, నాస్తి = లేదు. యః = ఎవడు; దర్శనమ్ = దర్శనమును, అభిగచ్ఛేత = పొందునో, సః = అతడు, లవణేన = లవణునిచేత, వధ్యః హి = చంపదగినవాడు కదా?

తా. పురుషశ్రేష్ఠుడా! వానికి శంక కలగకుండా వెళ్ళి అడ్డగించి యుద్ధము చేయుటతప్ప మరొక మృత్యుపాయము లేదు. అట్లు కాక అతని దృష్టిలో పడిన వానిని ఆతడు చంపివేయును. 9

మూ. స గ్రీష్మ అపయాతే తు వర్షారాత్ర ఉపాగతే,
హన్యాస్త్వం లవణం సౌమ్య స హి కాలోఽస్య దుర్మతే.

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! సః త్వమ్ = అట్టి నీవు, గ్రీష్మ = గ్రీష్మము, అపయాతే = గడచినదగుచుండగా, వర్షరాత్రే = వర్షాకాలరాత్రి, ఉపాగతే = వచ్చిన దగుచుండగా, లవణమ్ = లవణుణ్ణి, హన్యాః = చంపెదవు గాక. సః = అది, దుర్మతేః = దుర్మతియైన, అస్య = వీనికి, కాలః = కాలము.

తా. సౌమ్యుడా! గ్రీష్మము గడచి వర్షాకాలము ప్రారంభము కాగానే నీవు లవణాసురుణ్ణి చంపుము; ఆ దుర్మతిని చంపుటకు తగిన కాలము ఆదే. 10

మూ. మహర్షీంస్తు పురస్కృత్య ప్రయాన్తు తవ సైనికాః,
యథా గ్రీష్మావశేషేణ తరేయుర్జాహ్నవీజలమ్. 11

ప్ర. అ. తవ = నీయొక్క, సైనికాః = సైనికులు, మహర్షీన్ = మహర్షులను, పురస్కృత్య = ఎదుట ఉంచుకొని, యథా = ఎట్లు, గ్రీష్మావశేషేణ = గ్రీష్మముయొక్క కొంచెము మిగులుటచేత, జాహ్నవీజలమ్ = గంగాజలమును, తరేయుః = దాటెదరో, ఆ విధముగ, ప్రయాన్తు = వెళ్లెదరుగాక.

తా. నీ సైనికులు గ్రీష్మము కొంచెము మిగిలి ఉన్న దనగా గంగాజలమును దాటేటట్లు మహర్షులను ముందు ఉంచుకొని వెళ్లెదరు గాక. 11

మూ. తత్ర స్థాప్య బలం సర్వం నదీతీరే సమాహితః,
అగ్రతో ధనుషా సార్ధం గచ్ఛ త్వం లఘువిక్రమః. 12

ప్ర. అ. సర్వమ్ = సమస్తమైన, బలమ్ = సైన్యమును, తత్ర = అక్కడ, నదీతీరే = నదీతీరమునందు, స్థాప్య = నిలిపి, సమాహితః = సావధానచిత్తుడవై, లఘువిక్రమః = శీఘ్రగమనము గలవాడవై, ధనుషా సార్ధమ్ = ధనస్సుతో, అగ్రతః = ముందుకు, వ్రజ = వెళ్ళుము.

తా. సైన్యము నంతను అక్కడ నదీతీరమునందు నిలిపి, సావధానచిత్తుడవై ధనస్సు ధరించి శీఘ్రముగా ముందుకు వెళ్ళుము. 12

మూ. ఏవముక్తస్తు రామేణ శత్రుఘ్నస్తాన్ మహాబలాన్,
సేనాముఖ్యాన్ సమానీయ తతో వాక్యమువాచ హ. 13

ప్ర. అ. రామేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలుకబడిన, శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, తాన్ = ఆ, మహాబలాన్ = గొప్ప బలము గల, సేనాముఖ్యాన్ = సేనలోని నాయకులను, సమానీయ = రప్పించి, తతః = అటు పిమ్మట, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. శత్రుఘ్నుడు రాముని మాటలు విని, మహాబలవంతులైన సేనా నాయకులను పిలిపించి ఇట్లనెను. 13

మూ. ఏతే వో గణితావాసా యత్ర తత్ర నివత్స్యథ,
స్థాతవ్యం చావిరోధేన యథా బాధా న కస్య చిత్. 14

ప్ర. అ. యత్ర యత్ర = ఎక్క-డెక్కడ, నివత్స్యథ = నివసించగలరో, ఏతే = ఈ, వః = మీయొక్క, వాసాః = నివాసస్థానములు, గణితాః = లెక్క-పెట్టబడినవి. కస్యచిత్ = ఎవనికి కూడ, బాధా = బాధ, యథా = ఎట్లు, న భవేత్ = కాదో అట్లు, అవిరోధేన = విరోధము లేకుండగా, స్థాతవ్యమ్ = ఉండవలెను.

తా. మీరు ఎక్క-డెక్కడ విడిది చేయవలెనో ఆ ప్రదేశము నిర్ణయించబడినది; ఇవిగో అక్కడ ఎవరికి బాధ కలగకుండగా, పరస్పరవిరోధము లేకుండగా నివసించవలెను. 14

మూ. తథా తాంస్తు సమాజ్ఞాప్య ప్రస్థాప్య చ మహద్బలమ్,
కౌసల్యాం చ సుమిత్రాం చ కైకేయీం చాభ్యవాదయత్.

ప్ర. అ. తాన్ = వాళ్ళను, తథా = అట్లు, సమాజ్ఞాప్య = ఆజ్ఞాపించి, మహత్ = గొప్ప, బలమ్ = సైన్యమును, ప్రస్థాప్య = బయలుదేరజేసి, కౌసల్యాం చ = కౌసల్యను, సుమిత్రాం చ = సుమిత్రను, కైకేయీం చ = కైకేయిని, అభ్యవాదయత్ = నమస్కరించెను

తా. సైన్యాధ్యక్షులకు ఆ విధముగా ఆజ్ఞ ఇచ్చి, గొప్ప సైన్యమును బయలుదేరజేసి, కౌసల్యా-సుమిత్రా-కైకేయిలకు నమస్కరించెను. 15

మూ. రామం ప్రదక్షిణీకృత్య శిరసాభిప్రణమ్య చ,
లక్ష్మణం భరతం చైవ ప్రణిపత్య కృతాఞ్జలిః, 16
పురోహితం వసిష్ఠం చ శత్రుఘ్నః ప్రయతాత్మవాన్.

ప్ర అ. శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, ప్రయతాత్మవాన్ = నిగ్రహించుకొనబడిన మనస్సు కలవాడై, రామమ్ = రాముణ్ణి, ప్రదక్షిణీకృత్య = ప్రదక్షిణము చేసి, శిరసా = శిరస్సుచేత, అభిప్రణమ్య చ = నమస్కరించి, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలికలవాడై, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి, భరతం చైవ = భరతుణ్ణి, ప్రణిపత్య = నమస్కరించి, పురోహితమ్ = పురోహితుడైన, వసిష్ఠం చ = వసిష్ఠుణ్ణి కూడ నమస్కరించి బయలుదేరెను.

తా. పరిశుద్ధమైన మనస్సు గల శత్రుఘ్నుడు రామునకు ప్రదక్షిణముచేసి శిరస్సు వంచి నమస్కరించి, లక్ష్మణభరతులకు అంజలి ఘటించి నమస్కరించి పురోహితుడైన వసిష్ఠునకు నమస్కరించి బయలుదేరెను. 16

మూ. రామేణ చాభ్యనుజ్ఞాతః శత్రుఘ్నః శత్రుతాపనః, 17
ప్రదక్షిణమథో కృత్వా నిర్జగామ మహాబలః.

ప్ర. అ. మహాబలః = గొప్ప బలముగలవాడు, శత్రుతాపనః = శత్రువులను పీడించువాడు అయిన, శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, రామేణ = రామునిచేత, అభ్యనుజ్ఞాతః = అనుమతించబడినవాడై, అథో = అటుపిమ్మట, ప్రదక్షిణం కృత్వా = ప్రదక్షిణముచేసి, నిర్జగామ = బయల్వెడలెను.

తా. గొప్ప బలము గల శత్రుసంహారకుడైన శత్రుఘ్నుడు రాముని అనుజ్ఞపొంది ఆతనికి ప్రదక్షిణము చేసి బయలుదేరెను. 17

మూ. నిర్యాప్య సేనామథ సోఽగ్రతస్తదా
గజేన్ద్రివాజిప్రవరౌఘసంకులమ్,
ఉపాస్యమానః స నరేన్ద్రిపార్శ్వతః
ప్రతిప్రయాతో రఘువంశవర్ధనః. 18

ఇత్యార్షే శ్రీ మద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
చతుఃషష్టితమః సర్గః.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, సః = ఆ, రఘునన్దనః = శత్రుఘ్నుడు, తదా = అప్పుడు, గజేన్ద్రివాజిప్రవరౌఘసంకులామ్ = ఏనుగులతోను, శ్రేష్ఠములైన గుఱ్ఱములతోను నిండిన, సేనామ్ = సేనను, అగ్రతః = ముందు, నిర్యాప్య = బయలుదేరజేసి, ఉపాస్యమానః = సేవించబడుచు, నరేన్ద్రిపార్శ్వతః = రాజ సమీపమునుండి, ప్రతిప్రయాతః = వెళ్ళెను.

తా. అప్పుడు శత్రుఘ్నుడు ఏనుగులతోను, శ్రేష్ఠములైన అశ్వములతోను నిండిన సేనను ముందు పంపివేసి, అనుచరులు సేవింపగా, రాజు దగ్గరనుండి బయలుదేరెను. 18

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో అరవైనాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చషష్టితమః సర్గః

[వాల్మీకి శత్రుఘ్నునకు సాదాసుడైన కల్మాషపాదుని కథ చెప్పుట].

మూ. ప్రస్థాప్య చ బలం సర్వం మాసమాత్రోషితః పథి,
ఏక ఏవాశు శత్రుఘ్నో జగామ త్వరితం తదా. 1

ప్ర. అ. శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, సర్వమ్ = సమస్తమైన, బలమ్ = సైన్యమును, ప్రస్థాప్య = బయలుదేరదీసి, పథి = మార్గమునందు, మాసమాత్రోషితః = మాసముమాత్రము ఉన్నవాడై, తదా = అప్పుడు, ఏక ఏవ = ఒక్కడే, ఆశు = శీఘ్రముగా, త్వరితమ్ = తొందరగా, జగామ = వెళ్లెను.

తా. శత్రుఘ్నుడు సైన్యము నంతను బయలుదేరదీసి మార్గమునందు ఒక్క మాసము మాత్రమే ఉన్నవాడై అప్పుడు తానొక్కడే తొందరగా ముందుకు వెళ్లెను. 1

మూ. ద్విరాత్రమన్తరే శూర ఉష్య రాఘవనన్దనః,
వాల్మీకేరాశ్రమం పుణ్యమగచ్ఛద్వాసముత్తమమ్. 2

ప్ర. అ. రాఘవనన్దనః = శత్రుఘ్నుడు, అన్తరే = మధ్యయందు, ద్విరాత్రమ్ = రెండు రోజులు, ఉష్య = ఉండి, ఉత్తమమ్ = ఉత్తమమైన, వాసమ్ = నివాసమైన, పుణ్యమ్ = పవిత్రమైన, వాల్మీకేః ఆశ్రమమ్ = వాల్మీకి ఆశ్రమమును గూర్చి, అగచ్ఛత్ = వెళ్లెను.

తా. శత్రుఘ్నుడు మార్గమధ్యమునందు రెండు రోజులు గడిపి ఉత్తమ నివాసమైన, పవిత్రమైన వాల్మీక్యాశ్రమమును చేరెను. 2

మూ. సోఽభివాద్య మహాత్మానం వాల్మీకిం మునిసత్తమమ్,
కృతాఞ్జలిరథో భూత్వా వాక్యమేతదువాచ హ. 3.

ప్ర. అ. సః = అతడు, మహాత్మానమ్ = మహాత్ముడు, మునిసత్తమమ్ = మునులలో శ్రేష్ఠుడూ అయిన, వాల్మీకిమ్ = వాల్మీకిని, అభివాద్య = నమస్కరించి, అథో = అటుపిమ్మట, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి కలవాడు, భూత్వా = అయి, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. అతడు మునిశ్రేష్ఠుడూ, మహాత్ముడూ అయిన వాల్మీకికి నమస్కరించి అంజలి ఘటించి ఇట్లు పలికెను. 3

మూ. భగవన్వస్తుమిచ్ఛామి గురోః కార్యాదిహాగతః,
శ్వః ప్రభాతే గమిష్యామి ప్రతీచీం దారుణామ్ దిశమ్. 4

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా! గురోః = అన్నగారియొక్క, కార్యాత్ = పనివలన, ఆగతః = వచ్చిన నేను, ఇహ = ఇక్కడ, వస్తుమ్ = నివసించుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను. శ్వః = రేపు, ప్రభాతే = ప్రాతఃకాలమునందు, దారుణామ్ = భయంకరమైన, ప్రతీచీం దిశమ్ = పశ్చిమదిక్కును గూర్చి, గమిష్యామి = వెళ్ళెదను.

తా. పూజ్యుడా! అన్నగారి పనిమీద వచ్చిన నేను ఇక్కడ నివసించగోరుచున్నాను. రేపు ప్రాతఃకాలమునందు భయంకరమైన పశ్చిమదిక్కు వైపు వెళ్ళెదను. 4

మూ. శత్రుఘ్నస్య వచః శ్రుత్వా ప్రహస్య మునిపుంగవః,
ప్రత్యువాచ మహాత్మానం స్వాగతం తే మహాయశః. 5

ప్ర. అ. మునిపుంగవః = మునిశ్రేష్ఠుడు, శత్రుఘ్నస్య = శత్రుఘ్నుని యొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, మహాత్మానమ్ = మహాత్ముడైన ఆతనిని గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను. మహాయశః = గొప్ప కీర్తి గలవాడా! తే = నీకు, స్వాగతమ్ = స్వాగతము.

తా. మునిశ్రేష్ఠుడైన వాల్మీకి శత్రుఘ్నుని మాటలు విని ఆ మహాత్మునితో ఇట్లు పలికెను. "గొప్పకీర్తి గలవాడా! నీకు స్వాగతము". 5

మూ. స్వమాశ్రమమిదం సౌమ్య రాఘవాణాం కులస్య వై,
ఆసనం పాద్యమర్ఘ్యం చ నిర్విశఙ్కః ప్రతీచ్ఛ మే. 6

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! ఇదమ్ = ఇది, రాఘవాణామ్ = రఘు వంశమునకు చెందినవారియొక్క, కులస్య = కులముయొక్క, స్వమ్ = తమదైన, ఆశ్రమమ్ = ఆశ్రమము, ఆసనమ్ = ఆసనమును, పాద్యమ్ = పాద్యమును, అర్ఘ్యం చ = ఆర్ఘ్యమును, నిర్విశఙ్కః = శంక లేనివాడవై, మే = నానుండి, ప్రతీచ్ఛ = గ్రహించుము.

తా. ఓ! సౌమ్యుడా! ఇది రఘువంశమువారి స్వాశ్రమము వంటిది. నేను ఇచ్చుచున్న ఆసనమును, పాద్యమును, అర్ఘ్యమును నిఃసందేహముగా స్వీకరింపుము. 6

మూ. ప్రతిగృహ్య తదా పూజాం ఫలమూలం చ భోజనమ్,
భక్షయామాస కాకుత్స్థస్తృప్తిం చ పరమాం గతః. 7

ప్ర. అ. తదా = అప్పుడు. కాకుత్స్థః = శత్రుఘ్నుడు, పూజామ్ = పూజను, ప్రతిగృహ్య = స్వీకరించి, ఫలమూలమ్ = ఫలమూలరూపమైన, భోజనమ్ = భోజనమును, భక్షయామాస = భక్షించెను. పరమామ్ = గొప్ప, తృప్తిం చ = తృప్తిని, గతః = పొందెను.

తా. అప్పుడు శత్రుఘ్నుడు ఆ పూజలు స్వీకరించి ఫలమూలములను భుజించి బాగా తృప్తి చెందెను. 7

మూ. స భుక్త్వా ఫలమూలం చ మహర్షిం తమువాచ హ,
ఇయం యజ్ఞవిభూతిస్తే కస్యాశ్రమసమీపతః. 8

ప్ర. అ. సః = అతడు, ఫలమూలం చ = ఫలమూలములను, భుక్త్వా = భుజించి, తమ్ = ఆ, మహర్షిమ్ = మహర్షిని గూర్చి, ఉవాచ హ = పలికెను. తే = నీయొక్క, ఆశ్రమసమీపతః = ఆశ్రమసమీపమునందు, ఇయమ్ = ఈ, యజ్ఞ విభూతిః = యజ్ఞసమృద్ధి, కస్య = ఎవనిది?

తా. అతడు ఫలమూలములను భక్షించి ఆ మహర్షిని "నీ ఆశ్రమసమీపము నందు ఈ యజ్ఞసమృద్ధి ఎవరిది?" అని ప్రశ్నించెను. 8

మూ. తత్తస్య భాషితం శ్రుత్వా వాల్మీకిర్వాక్యమబ్రవీత్,
శత్రుఘ్న శృణు యస్యేదం బభూవాయతనం పురా. 9

ప్ర. అ. తస్య = అతనియొక్క, తత్ = ఆ, భాషితమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, వాల్మీకిః = వాల్మీకి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. శత్రుఘ్న = శత్రుఘ్నుడా? పురా = పూర్వము, ఇదమ్ = ఇది, యస్య = ఎవని యొక్క, ఆయతనమ్ = నివాసముగా, అభూత్ = ఉండెనో, శృణు = వినుము.

తా. వాల్మీకి ఆతని మాటలు విని ఇట్లు పలికెను. "శత్రుఘ్నా! ఇది పూర్వము ఎవరి నివాసముగా ఉండెనో చెప్పెదను; వినుము. 9

మూ. యుష్మాకం పూర్వకో రాజా సుదాసస్తస్య భూపతేః,
పుత్రో మిత్రసహో నామ వీర్యవానతిధార్మికః. 10

ప్ర. అ. సుదాసః = సుదాసుడు, యుష్మాకమ్ = మీయొక్క, పూర్వకః = పూర్వికుడైన, రాజా = రాజు. తస్య = అతనికి, వీర్యవాన్ = పరాక్రమవంతుడు, అతిధార్మికః = చాల ధార్మికుడూ అయిన, మిత్రసహః నామ = మిత్రసహు డను, పుత్రః = పుత్రుడు ఉండెను.

తా. సుదాసు డను మీ పూర్వికుడైన రాజు ఉండెను. ఆతని కుమారుడు మిత్రసహుడు. అతడు పరాక్రమశాలి, చాల ధార్మికుడు. 10

మూ. స బాల ఏవ సౌదాసో మృగయా ముపచక్రమే,
చఞ్చూర్యమాణం దదృశే స శూరో రాక్షసద్వయమ్. 11

ప్ర. అ. సః సౌదాసః = ఆ సౌదాసుడు, బాలః ఏవ = బాలుడుగా ఉండగానే, మృగయామ్ = వేటను, ఉపచక్రమే = ఉపక్రమించెను. శూరః = శూరుడైన, సః = అతడు, చఞ్చూర్యమాణమ్ = అధికముగా సంచరించుచున్న, రాక్షసద్వయమ్ = రాక్షసుల ద్వయమును, దదృశే = చూచెను.

తా. ఆ సౌదాసుడు (సుదాసుని పుత్రుడైన మిత్రసహుడు) బాల్యము నుండియే వేటాడుటకు వెళ్ళుచుండెను. శూరుడైన అతడు అధికముగా సంచరించు చున్న ఇద్దరు రాక్షసులను చూచెను. 11

మూ. శార్దూలరూపిణౌ ఘోరౌ మృగాన్ బహుసహస్రశః,
భక్షమాణావసంతుష్టౌ పర్యాప్తిం నైవ జగ్మతుః. 12

ప్ర. అ. శార్దూలరూపిణౌ = పెద్దపులి రూపము గల, ఘోరౌ = క్రూరులైన ఆ రాక్షసులు, బహుసహస్రశః = ఎన్నో వేలకొలది, మృగాన్ = మృగములను, భక్షమాణౌ = భక్షించుచున్నవారై, అసంతుష్టౌ = తృప్తిచెందనివారై, పర్యాప్తిమ్ = 'చాలు'అను బుద్ధిని, నైవ జగ్మతుః = పొందలేదు.

తా. ఆ భయంకరులైన రాక్షసులిద్దరూ పెద్దపులుల రూపములు ధరించి ఎన్నో వేల మృగాలను భక్షించినను తృప్తి చెందక, "చాలును"అను మాట లేక ఉండిరి. 12

మూ. స తు తౌ రాక్షసౌ దృష్ట్వా నిర్మృగం చ వనం కృతమ్,
క్రోధేన మహతావిష్టో జఘానైకం మహేషుణా. 13

ప్ర. అ. సః = అతడు, తౌ రాక్షసౌ = ఆ రాక్షసులను, నిర్మృగమ్ = మృగములు లేనిదిగా, కృతమ్ = చేయబడిన, వనం చ = వనమును, దృష్ట్వా = చూచి, మహతా = గొప్పదైన, క్రోధేన = క్రోధముతో, ఆవిష్టః = కూడినవాడై, ఏకమ్ = ఒకనిని, మహేషుణా = గొప్ప బాణముచేత, జఘాన = చంపెను.

తా. ఆ రాక్షసు లిద్దరూ వనములో మృగములు లేకుండా చేయుట చూచి క్రోధావిష్టుడైన ఆ సౌదాసుడు గొప్ప బాణముతో ఒక రాక్షసుణ్ణి చంపెను. 13

మూ. వినిపాత్య తమేకం తు సౌదాసః పురుషర్షభః,
విజ్వరో విగతామర్షో హతం రక్షో హ్యుదైక్షత. 14

ప్ర. అ. పురుషర్షభః = పురుషశ్రేష్ఠుడైన, సౌదాసః = సౌదాసుడు, తమ్ = ఆ, ఏకమ్ = ఒక రాక్షసుణ్ణి, వినిపాత్య = పడగొట్టి, విజ్వరః = బాధ లేనివాడై, విగతామర్షః = పోయిన కోపము గలవాడై, హతమ్ = చంపబడిన, రక్షః = రాక్షసుణ్ణి, ఉదైక్షత = చూచెను.

తా. పురుషశ్రేష్ఠుడైన సౌదాసుడు ఒక రాక్షసుణ్ణి చంపి, మనస్తాపమును, కోపమును విడచి, చచ్చిన ఆ రాక్షసుణ్ణి చూచెను. 14

మూ. నిరీక్షమాణం తం దృష్ట్వా సహాయం తస్య రక్షసః,
సంతాపమకరోద్ఘోరం సౌదాసం చేదమబ్రవీత్. 15

ప్ర. అ. తస్య = ఆ, రక్షసః = రాక్షసునియొక్క, సహాయమ్ = సహాయుడైన రాక్షసుడు, నిరీక్షమాణమ్ = చూచుచున్న, తమ్ = ఆతనిని, దృష్ట్వా = చూచి, ఘోరమ్ = ఘోరమైన, సంతాపమ్ = విచారమును, అకరోత్ = చేసెను. సౌదాసం చ = సౌదాసుణ్ణి గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. చనిపోయిన రాక్షసుని మిత్రుడైన రాక్షసుడు ఆ విధముగా చూచుచున్న సౌదాసుని చూచి చాల విచారించుచు ఇట్లు పలికెను. 15

మూ. యస్మాదనపరాధం తం సహాయం మమ జఘ్నివాన్,
తస్మాత్తవాపి పాపిష్ఠ ప్రదాస్యామి ప్రతిక్రియామ్. 16

ప్ర. అ. పాపిష్ఠ = పాపిష్ఠుడా! మమ = నాయొక్క, సహాయమ్ = సహాయుడైన, అనపరాధమ్ = అపరాధము లేని, తమ్ = వానిని, యస్మాత్ = ఏ కారణమువలన, జఘ్నివాన్ = చంపినావో, తస్మాత్ = ఆ కారణమువలన, తవాపి = నీకు కూడ, ప్రతిక్రియామ్ = ప్రతిక్రియను, దాస్యామి = ఇచ్చెదను.

తా. పాపిష్ఠుడా! అపరాధము లేని నా మిత్రుణ్ణి చంపినావు. అందువలన నేను నీకు ప్రతిక్రియ చేసెదను. 16

మూ. ఏవముక్త్వా తు తద్రక్ష స్తత్రైవాన్తరధీయత,
కాలపర్యాయయోగేన రాజా మిత్రసహోఽభవత్. 17

ప్ర. అ. తత్ రక్షః = ఆ రాక్షసుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, తత్రైవ = అక్కడనే, అన్తరధీయత = అంతర్ధానము చెందెను. కాలపర్యాయయోగేన = కాలక్రమసంబంధముచేత, మిత్రసహః = మిత్రసహుడు, రాజా = రాజుగా, అభవత్ = ఆయెను.

తా. ఆ రాక్షసుడు ఇట్లు పలికి అక్కడనే అంతర్ధానము చెందెను. కాలక్రమమున మిత్రసహుడు రాజయ్యెను. 17

మూ. రాజాపి యజతే యజ్ఞమస్యాశ్రమసమీపతః,
అశ్వమేధం మహాయజ్ఞం తం వసిష్ఠోఽభ్యపాలయత్. 18

ప్ర. అ. రాజాపి = రాజు, అస్య = ఈ, ఆశ్రమసమీపతః = ఆశ్రమము

యొక్క సమీపమునందు, యజ్ఞమ్ = యజ్ఞమును, యజతే = చేసెను. తమ్=ఆ, అశ్వమేధం మహాయజ్ఞమ్ = అశ్వమేధమహాయజ్ఞమును, వసిష్ఠః = వసిష్ఠుడు, అభ్యపాలయత్ = పాలించెను.

తా. ఆ రాజు ఈ ఆశ్రమము సమీపమునందు అశ్వమేధమహాయజ్ఞమును చేసెను. ఆ యజ్ఞమును వసిష్ఠుడు పరిపాలించెను. 18

మూ. తత్ర యజ్ఞో మహానాసీద్బహువర్షగణాయుతః,
సమృద్ధః పరయా లక్ష్మ్యా దేవయజ్ఞసమోఽభవత్. 19

ప్ర. అ. తత్ర = అక్కడ, బహువర్షగణాయుతః = అనేక సంవత్సరముల సముదాయముతో కూడిన, మహాన్=గొప్ప, యజ్ఞః=యజ్ఞము, ఆసీత్=జరిగెను. పరయా = గొప్ప, లక్ష్మ్యా = లక్ష్మితో, సమృద్ధః = సమృద్ధమైన ఆ యజ్ఞము, దేవయజ్ఞసమః = దేవయజ్ఞముతో సమానమైనదిగా, అభవత్=ఉండెను.

తా. అక్కడ ఆ మహాయజ్ఞము అనేకసంవత్సరముల పాటు జరిగెను. గొప్ప శోభతో నడచిన ఆ యజ్ఞము దేవయజ్ఞము వలె ఉండెను. 19

మూ. అథావసానే యజ్ఞస్య పూర్వవైరమనుస్మరన్,
వసిష్ఠరూపీ రాజానమితి హోవాచ రాక్షసః. 20

ప్ర. అ. అథ = అటుపిమ్మట, యజ్ఞస్య = యజ్ఞముయొక్క, అవసానే= అంతమునందు, రాక్షసః = రాక్షసుడు, పూర్వవైరమ్ = పూర్వవైరమును, అనుస్మరన్=స్మరించుచు, వసిష్ఠరూపీ=వసిష్ఠరూపము కలవాడై, రాజానమ్=రాజును గూర్చి, ఇతి = ఇట్లు, ఉవాచ హ = పలికెను.

తా. యజ్ఞము పూర్తి యైన పిమ్మట ఆ రాక్షసుడు వెనుకటి వైరమును స్మరించుచు, వసిష్ఠుని రూపము ధరించి రాజుతో ఇట్లు పలికెను. 20

మూ. అద్య యజ్ఞస్య జాతోఽన్తః సామిషం భోజనం మమ,
దీయతామిహ శీఘ్రం వై నాత్ర కార్యా విచారణా. 21

ప్ర. అ. అద్య = నేడు, యజ్ఞస్య = యజ్ఞముయొక్క, అన్తః=అంతము, జాతః = అయినది. మమ = నాకు, సామిషమ్ = మాంసముతో కూడిన, భోజ

నమ్ = భోజనము, ఇహ = ఇక్కడ, శీఘ్రమ్ = శీఘ్రముగా, దీయతామ్ = ఇవ్వబడుగాక. అత్ర = దీని విషయమున, విచారణా = ఆలోచన, న కార్యా = చేయదగినదికాదు.

తా. నేడు యజ్ఞము పూర్తి అయినది. నాకు శీఘ్రముగా మాంసముతో కూడిన భోజనమును పెట్టుము. ఈ విషయమున ఆలోచించవద్దు. 21

మూ. తచ్ఛ్రుత్వా వ్యాహృతం వాక్యం రక్షసా బ్రహ్మరూపిణా,
సూదాన్ సంస్కారకుశలానువాచ పృథివీపతిః. 22

ప్ర. అ. బ్రహ్మరూపిణా = బ్రాహ్మణరూపము గల, రక్షసా = రాక్షసుని చేత, వ్యాహృతమ్ = పలకబడిన, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, పృథివీపతిః = రాజు, సంస్కారకుశలాన్ = వంటలో నేర్పరులైన, సూదాన్ = వంటవారిని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. వసిష్ఠరూపములో ఉన్న రాక్షసుని మాటలు విని రాజు వంటలో నేర్పు గల వంటవాళ్ళతో ఇట్లు పలికెను. 22

మూ. హవిష్యం సామిషం స్వాదు యథా భవతి భోజనమ్,
తథా కురుత శీఘ్రం వై పరితుష్యేద్యథా గురుః. 23

ప్ర. అ. హవిష్యమ్ = హవిస్సుగా ఉపయోగించేది, సామిషమ్ = మాంసముతో కూడినది అయిన, భోజనమ్ = భోజనము, యథా = ఎట్లు, స్వాదు = రుచియైనది, భవతి = అగునో, గురుః = గురువు, యథా = ఎట్లు, పరితుష్యేత్ = సంతోషించునో, తథా = అట్లు, శీఘ్రమ్ = శీఘ్రముగా, కురుత వై = చెయ్యండి.

తా. హవిస్సుగా ఉపయోగింపదగిన మాంసముతో కూడిన భోజనము మధురముగా ఉండేటట్లు గురువుకు సంతోషము కలిగే టట్లు శీఘ్రముగా తయారు చేయుడు. 23

మూ. శాసనాత్పార్థివేన్ద్రస్య సూదః సంభ్రాన్తమానసః,
తచ్చ రక్షః పునస్తత్ర సూదవేషమథాకరోత్. 24

ప్ర. అ. పార్థివేన్ద్రస్య = రాజుయొక్క, శాసనాత్ = ఆజ్ఞవలన, సూదః =

వంటవాడు, సంభ్రాన్తమానసః = సంభ్రమము (కంగారు) చెందిన మనస్సుకలవాడయ్యెను. తత్ = ఆ, రక్షః పునః = రాక్షసుడైతే, అథ = అటుపిమ్మట, తత్ర = అక్కడ, సూదవేషమ్ = వంటవాని వేషమును, అకరోత్ = చేసెను.

తా. రాజు ఆజ్ఞ విని వసిష్ఠుడు మాంసాహారము తినుటయా అని వంటవాడు కంగారుపడెను. అప్పుడా రాక్షసుడు వంటవాని రూపము ధరించెను. 24

మూ. స మానుషమథో మాంసం పార్థివాయ న్యవేదయత్,
ఇదం స్వాదు హవిష్యం చ సామిషం చాన్నమాహృతమ్.

ప్ర. అ. సః = అతడు, అథో = అటుపిమ్మట, స్వాదు = మధురమైన, హవిష్యమ్ = హవిస్సుగా ఉపయోగించు, సామిషమ్ = మాంసముతో కూడిన, ఇదమ్ = ఈ, అన్నమ్ = అన్నము, ఆహృతమ్ = తీసికొనిరాబడినది అని, మానుషం మాంసమ్ = మనుష్యమాంసమును, పార్థివాయ = రాజునకు, న్యవేదయత్ = తెలిపెను.

తా. "మధురము, హవిస్సుగా ఉపయోగించేదీ, మాంసయుక్తమూ అయిన అన్న మిదిగో" అని అతడు రాజుకు మనుష్యమాంసమును చూపెను. 25

మూ. స భోజనం వసిష్ఠాయ పత్న్యా సార్ధముపాహరత్,
మదయన్త్యా నరశ్రేష్ఠ సామిషం రక్షసాహృతమ్. 26

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడా! పత్న్యా = భార్యయైన, మదయన్త్యా సార్ధమ్ = మదయంతితో కూడ, సః = ఆ రాజు, రక్షసా = రాక్షసునిచేత, ఆహృతమ్ = తీసికొనిరాబడిన, సామిషమ్ = మాంసముతో కూడిన, భోజనమ్ = భోజనమును, వసిష్ఠాయ = వసిష్ఠునికొరకు, ఉపాహరత్ = తీసికొని వచ్చెను.

తా. శత్రుఘ్న! ఆ రాజు భార్యయైన మదయంతితో కలిసి వెళ్ళి, రాక్షసుడు తీసికొనివచ్చిన ఆ మాంససహితమైన భోజనమును వసిష్ఠునకు సమర్పించెను.

మూ. జ్ఞాత్వా తదామిషం విప్రో మానుషం భోజనాగతమ్,
క్రోధేన మహతావిష్టో వ్యాహర్తుముపచక్రమే. 27

ప్ర. అ. విప్రః = వసిష్ఠుడు, భోజనాగతమ్ = భోజనముతో వచ్చిన,

తత్ = ఆ, మానుషం మాంసమ్ = మనుష్యమాంసమును, జ్ఞాత్వా = తెలిసికొని, మహతా = గొప్ప, క్రోధేన = కోపముతో, ఆవిష్టః = కూడినవాడై, వ్యాహర్తుమ్ = పలుకుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. వసిష్ఠుడు భోజనములో మనుష్యమాంస మున్నట్లు తెలిసికొని చాల కోపముతో ఇట్లు పలికెను. 27

మూ. యస్మాత్త్వం భోజనం రాజన్ మమైతద్దాతుమిచ్ఛసి,
తస్మాద్భోజనమేతత్తే భవిష్యతి న సంశయః. 28

ప్ర. అ. రాజన్ = రాజా! త్వమ్ = నీవు, యస్మాత్ = ఏ కారణమువలన, మమ = నాకు, ఈదృశమ్ = ఇట్టి, భోజనమ్ = భోజనమును, దాతుమ్ = ఇచ్చుటకు, ఇచ్ఛసి = కోరుచున్నావో, తస్మాత్ = ఆ కారణమువలన, తే = నీకు, ఏతత్ = ఇది, భోజనమ్ = భోజనముగా, భవిష్యతి = కాగలదు, సంశయః = సంశయము, న = లేదు.

తా. రాజా! నీవు నాకు ఈ భోజనము ఇవ్వవలె నని కోరుచున్నావు గాన నీకు ఇదే భోజనము కాగలదు. సందేహము లేదు. 28

మూ. తతః క్రుద్ధస్తు సౌదాసస్తోయం జగ్రాహ పాణినా,
వసిష్ఠం శప్తుమారేభే భార్యా చైనమవారయత్. 29

ప్ర. అ. తతః = అటుపిమ్మట, అయం సౌదాసః తు = ఈ సౌదాసుడైతే, క్రుద్ధః = కోపించినవాడై, పాణినా = హస్తముచేత, తోయమ్ = ఉదకమును, జగ్రాహ = గ్రహించెను. వసిష్ఠమ్ = వసిష్ఠుణ్ణి, శప్తుమ్ = శపించుటకు, ఆరేభే = ప్రారంభించెను. ఏనమ్ = ఇతనిని, భార్యా చ = భార్య, అవారయత్ = నివారించెను.

తా. అప్పుడు సౌదాసుడు క్రోధముతో చేతిలో జలము తీసికొని వసిష్ఠుణ్ణి శపించుటకు ఉద్యమించగా భార్య అతనిని నివారించెను. 29

మూ. రాజన్ ప్రభుర్యతోఽస్మాకం వసిష్ఠో భగవాన్ ఋషిః,
ప్రతిశప్తుం న శక్తస్త్వం దేవతుల్యం పురోధసమ్. 30

ప్ర. అ. రాజన్ = రాజా! భగవాన్ = పూజ్యుడైన, ఋషిః = ఋషి యైన,

వసిష్ఠః = వసిష్ఠుడు, యతః = ఏ కారణమువలన, అస్మాకమ్ = మనకు, ప్రభుః = ప్రభువో, దేవతుల్యమ్ = దేవతాసమానుడైన, పురోధసమ్ = పురోహితుణ్ణి, ప్రతిశపుమ్ = తిరిగి శపించుటకు, త్వమ్ = నీవు, న శక్తః = సమర్థుడవు కావు.

తా. రాజా! పూజ్యుడైన వసిష్ఠమహర్షి మన ప్రభువు. అందువలన దేవతా సమానుడైన మన పురోహితుణ్ణి తిరిగి శపించకూడదు. 30

మూ. తతః క్రోధమయం తోయం తేజోబలసమన్వితమ్,
వ్యసర్జయత ధర్మాత్మా తతః పాదౌ సిషేచ చ. 31

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ధర్మాత్మా = ఆ ధర్మాత్ముడు, తేజోబల సమన్వితమ్ = తేజస్సుతోను బలముతోను కూడిన, క్రోధమయమ్ = క్రోధవికార మైన, తోయమ్ = ఉదకమును, వ్యసర్జయత = విడచెను. తతః = పిమ్మట, పాదౌ = పాదములను, సిషేచ చ = తడిపెను.

తా. అప్పుడు ధర్మాత్ముడయిన ఆ రాజు క్రోధముతో నిండిన తేజో బలములతో కూడిన ఆ జలమును క్రిందకు విడచి తన పాదములు తడిపెను. 31

మూ. తేనాస్య రాజ్ఞస్తౌ పాదౌ తదా కల్మాషతాం గతౌ,
తదాప్రభృతి రాజాసౌ సౌదాసః సుమహాయశాః, 32
కల్మాషపాదః సంవృత్తః ఖ్యాతశ్చైవ తథా నృపః.

ప్ర. అ. తేన = ఆ కారణముచేత, తదా = అప్పుడు, అస్య రాజ్ఞః = ఈ రాజుయొక్క, తౌ పాదౌ = ఆ పాదములు, కల్మాషతామ్ = నీలత్వమును, గతౌ = పొందినవి. తదా ప్రభృతి = అది మొదలు, సుమహాయశాః = చాల గొప్ప కీర్తి గల, రాజా = రాజైన, అసౌ సౌదాసః = ఈ సౌదాసుడు, కల్మాషపాదః = కల్మాష పాదుడుగా, సంవృత్తః = అయినాడు. నృపః = ఆ రాజు, తథా = అట్లు, ఖ్యాతః చ ఏవ = ప్రసిద్ధుడైనాడు.

తా. అప్పుడు అట్లు చేయుటచే ఆ రాజు పాదములు నల్లగా అయినవి. అది మొదలు గొప్ప కీర్తి గల ఆ సౌదాసమహారాజు కల్మాషపాదుడు (పాదా లలో నలుపు ఉన్నవాడు) అయెను. ఆ రాజు ఆ పేరుతోనే ప్రసిద్ధుడయ్యెను. 32

మూ. స రాజా సహ పత్న్యా వై ప్రణిపత్య ముహుర్ముహుః,
పునర్వసిష్ఠం ప్రోవాచ యదుక్తం బ్రహ్మరూపిణా.

ప్ర. అ. సః రాజా = ఆ రాజు, పత్న్యా సహ = భార్యతో కూడ, ముహుః ముహుః = మాటి మాటికి, ప్రణిపత్య = నమస్కరించి, బ్రహ్మరూపిణా = వసిష్ఠరూపముగల, రక్షసా = రాక్షసునిచేత, యత్ = ఏది, ఉక్తమ్ = చెప్పబడెనో, దానిని, వసిష్ఠమ్ = వసిష్ఠుని గూర్చి, పునః = మరల, ప్రోవాచ = పలికెను.

తా. ఆ రాజూ, భార్యా వసిష్ఠునకు మాటిమాటికి నమస్కరించి వసిష్ఠ రూపమును ధరించిన ఆ రాక్షసుడు చెప్పిన మాటలు ఆయనకు తెలిపిరి. 33

మూ. తచ్ఛ్రుత్వా పార్థివేన్ద్రస్య రక్షసా వికృతం చ తత్, 34
పునః ప్రోవాచ రాజానం వసిష్ఠః పురుషర్షభమ్.

ప్ర. అ. పార్థివేన్ద్రస్య = ఆ రాజేంద్రునియొక్క, తత్ = ఆ వాక్యమును శ్రుత్వా = విని, రక్షసా = రాక్షసునిచేత, వికృతమ్ = చెడ్డగా చేయబడిన, తత్ = ఆ పనిని (తెలిసికొని), వసిష్ఠః = వసిష్ఠుడు, పురుషర్షభమ్ = పురుషశ్రేష్ఠుడైన, రాజానమ్ = రాజును గూర్చి, పునః = మరల, ప్రోవాచ = పలికెను.

తా. వసిష్ఠుడు ఆ రాజు మాటలు విని, రాక్షసుడు చేసిన మోసమును తెలిసికొని పురుషశ్రేష్ఠుడైన ఆ రాజుతో మరల ఇట్లు పలికెను. 34

మూ. మయా రోషపరీతేన యదిదం వ్యాహృతం వచః, 35
నైతచ్ఛక్యం వృథా కర్తుం ప్రదాస్యామి చ తే వరమ్.

ప్ర. అ. రోషపరీతేన = రోషముతో కూడిన, మయా = నాచేత, యత్ = ఏ, ఇదమ్ = ఈ, వచః = వచనము, వ్యాహృతమ్ = పలకబడినదో, ఏతత్ = ఇది, వృథా = వ్యర్థమైనదిగా, కర్తుమ్ = చేయుటకు, న శక్యమ్ = శక్యము కాదు తే = నీకు, వరం చ = వరమును, ప్రదాస్యామి = ఇచ్చెదను.

తా. రోషముతో నిండిన మనస్సుతో నేను పలికిన మాటను మరొక విధ ముగా చేయుట శక్యముకాదు. కాని నీకొక వరమును ఇచ్చెదను. 35

మూ. కాలో ద్వాదశవర్షాణి శాపస్యాన్తో భవిష్యతి, 36
మత్ప్రసాదాచ్చ రాజేన్ద్ర అతీతం న స్మరిష్యసి.

ప్ర. అ. ద్వాదశవర్షాణి = పండ్రెండు సంవత్సరములు, కాలః = కాలము, శాపస్య = శాపముయొక్క, అన్తః = అంతము, భవిష్యతి = కాగలదు రాజేన్ద్ర = రాజేంద్రా! మత్ప్రసాదాత్ = నా అనుగ్రహమువలన, అతీతమ్ = గడచినదానిని, న స్మరిష్యసి = స్మరించవు.

తా. రాజేంద్రా! పన్నెండు సంవత్సరముల కాలము గడవగానే శాపాంతము అగును. నా అనుగ్రహమువలన నీకు, ఆ కాలములో చేసిన అభక్ష్యభక్షణాదికము స్మరణ ఉండదు. 36

మూ. ఏవం స రాజా తం శాపముపభుజ్యారిసూదనః,
ప్రతిలేభే పునా రాజ్యం ప్రజాశ్చైవాన్వపాలయత్. 37

ప్ర. అ. అరిసూదనః = శత్రుసంహారకుడైన, సః రాజా = ఆ రాజు, ఏవమ్ = ఈ విధముగా, తం శాపమ్ = ఆ శాపమును, ఉపభుజ్య = అనుభవించి, పునః = మరల, రాజ్యమ్ = రాజ్యమును, ప్రతిలేభే = పొందెను. ప్రజాః చ ఏవ = ప్రజలను, అన్వపాలయత్ = పాలించెను.

తా. శత్రుసంహారకుడైన ఆ రాజు ఆ శాపమును ఈ విధముగా అనుభవించి, మరల రాజ్యమును పొంది ప్రజలను పాలించెను 37

మూ. తస్య కల్మాషపాదస్య యజ్ఞస్యాయతనం శుభమ్,
ఆశ్రమస్య సమీపేఽస్య యన్మాం పృచ్ఛసి రాఘవ. 38

ప్ర. అ. రాఘవ = శత్రుఘ్నా! మామ్ = నన్ను, యత్ = దేనిని గూర్చి, పృచ్ఛసి = అడుగుచున్నావో అది, అస్య = ఈ, ఆశ్రమస్య = ఆశ్రమముయొక్క, సమీపే = సమీపమునందు, కల్మాషపాదస్య = కల్మాషపాదునియొక్క, యజ్ఞస్య = యజ్ఞముయొక్క, శుభమ్ = పవిత్రమైన, ఆయతనమ్ = స్థానము.

తా. శత్రుఘ్నా! నీవు అడుగుచున్న ఈ ఆశ్రమసమీపస్థానము కల్మాషపాదుడు యజ్ఞము చేసిన పవిత్రస్థానము. 38

మూ. తస్య తాం పార్థివేన్ద్రస్య కథాం శ్రుత్వా సుదారుణామ్,
వివేశ పర్ణశాలాయాం మహర్షిమభివాద్య చ. 39

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
పఞ్చషష్టితమః సర్గః.

ప్ర. అ. తస్య పార్థివేన్ద్రస్య = ఆ రాజేంద్రునియొక్క, సుదారుణామ్ = చాల దారుణమైన, తాం కథామ్ = ఆ కథను, శ్రుత్వా = విని, మహర్షిమ్ = మహర్షిని, అభివాద్య = నమస్కరించి, పర్ణశాలాయామ్ = పర్ణశాలయందు, వివేశ = ప్రవేశించెను.

తా. శత్రుఘ్నుడు చాల దారుణమైన ఆ సౌదాసుని కథ విని, మహర్షికి అభివాదనము చేసి పర్ణశాలలో ప్రవేశించెను. 39

"కాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో ఆరవై అయిదవ సర్గ సమాప్తము.

అథ షట్‌షష్టితమః సర్గః

[సీత ఇద్దరు పుత్రులను కనుట. వాల్మీకి ఆశీర్వచనములకు రక్షణము ఏర్పరచుట. ఈ విషయము విని శత్రుఘ్నుడు సంతోషించి, అక్కడి నుండి బయలుదేరి యమునాతటమునకు వెళ్లుట.]

మూ. యామేవ రాత్రిం శత్రుఘ్నః పర్ణశాలాం సమావిశత్,
తామేవ రాత్రిం సీతాపి ప్రసూతా దారకద్వయమ్. 1

ప్ర. అ. శత్రుఘ్నః=శత్రుఘ్నుడు, యామ్ ఏవ = ఏ, రాత్రిమ్=రాత్రిని (యందు), పర్ణశాలామ్ = పర్ణశాలను, సమావిశత్ = ప్రవేశించెనో, తామ్ = ఆ, రాత్రిమ్ ఏవ = రాత్రియందే, సీతాపి = సీత కూడ, దారకద్వయమ్ = ఇద్దరు పుత్రులను, ప్రసూతా = కనినది.

తా. శత్రుఘ్నుడు పర్ణశాలలో ప్రవేశించిన రాత్రియందే సీత ఇద్దరు పుత్రులను కనెను. 1

మూ. తతోఽర్ధరాత్రసమయే బాలకా మునిదారకాః,
వాల్మీకేః ప్రియమాచఖ్యుః సీతాయాః ప్రసవం శుభమ్. 2

ప్ర. అ. తతః = ఆటుపిమ్మట, అర్ధరాత్రసమయే=అర్ధరాత్రి సమయమునందు, మునిదారకాః = మునిపుత్రులైన, బాలకాః = బాలకులు, శుభమ్ = శుభమైన, సీతాయాః = సీతయొక్క, ప్రసవమ్=ప్రసవమును, వాల్మీకేః = వాల్మీకికి, ప్రియమ్ = ప్రియమునుగా, ఆచఖ్యుః = చెప్పిరి.

తా. మునికుమారులు అర్ధరాత్రిసమయమునందు వచ్చి సీత ప్రసవించినదను శుభమైన ప్రియవార్తను వాల్మీకికి చెప్పిరి. 2

మూ. భగవన్ రామపత్నీ సా ప్రసూతా దారకద్వయమ్,
తతో రక్షాం మహాతేజః కురు భూతవినాశినీమ్. 3

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా! సా = ఆ, రామపత్నీ = రామభార్య, దార కద్వయమ్ = ఇద్దరుపిల్లలను, ప్రసూతా = కనినది. మహాతేజః = గొప్ప తేజస్సు కలవాడా ! తతః = ఆ కారణమువలన, భూతవినాశినీమ్ = భూతములను నశింప చేయు, రక్షామ్ = రక్షను, కురు = చేయుము.

తా. పూజ్యుడా ! రాముని భార్య ఇద్దరు పిల్లలను కన్నది. గొప్ప తేజస్సు గలవాడా! అందువలన భూతబాధానివారకమైన రక్షావిధానము చేయుము. 3

మూ. తేషాం తద్వచనం శ్రుత్వా మహర్షిః సముపాగమత్,
బాలచన్ద్రప్రతీకాశౌ దేవపుత్రౌ మహౌజసౌ. 4

ప్ర. అ. మహర్షిః = మహర్షి, తేషామ్ = వాళ్ళయొక్క, తత్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = ఏని, బాలచన్ద్రప్రతీకాశౌ = బాలచంద్రునితో సమానులైన, మహౌజసౌ = గొప్ప తేజస్సు గల, దేవపుత్రౌ = దేవపుత్రులవంటి ఆ బాలులను, సముపాగమత్ = చేరెను.

తా. వాల్మీకి వాళ్ళ మాటలు విని బాలచంద్రుల వంటి, గొప్ప కాంతి గల, దేవపుత్రులతో సమానులైన ఆ పిల్లలవద్దకు వచ్చెను. 4

మూ. జగామ తత్ర హృష్టాత్మా దదర్శ చ కుమారకౌ,
భూతఘ్నీం చాకరోత్తాభ్యాం రక్షాం రక్షోవినాశినీమ్. 5

ప్ర. అ. హృష్టాత్మా = సంతోషించిన మనస్సు కలవాడై, తత్ర = అక్కడికి, జగామ = వెళ్లెను. కుమారకౌ = బాలులను, దదర్శ చ = చూచెను. తాభ్యామ్ = వాళ్ళిద్దరికి, భూతఘ్నీమ్ = భూతములను నశింపచేయు, రక్షోవినాశనీమ్ = రాక్షసులను నశింపచేయు, రక్షామ్ = రక్షను, అకరోత్ చ = చేసెను కూడ.

తా. సంతోషించిన మనస్సుతో అక్కడికి వెళ్ళి, ఆ పిల్లలను చూచి, వాళ్లకు భూతములను, రాక్షసులనూ నశింపచేయు రక్షను చేసెను. 5

మూ. కుశముష్టిముపాదాయ లవం చైవ తు స ద్విజః,
వాల్మీకిః ప్రదదౌ తాభ్యాం రక్షాం భూతవినాశనీమ్. 6

ప్ర. అ. ద్విజః = ద్విజుడైన, సః వాల్మీకిః = ఆ వాల్మీకి, కుశముష్టిమ్ =

కుశముష్టిని, ఉపాదాయ=గ్రహించి, లవం చైవ తు=లవమును కూడ గ్రహించి, తాభ్యామ్ = వారిద్దరికీ, భూతవినాశనమ్ = భూతములను నశింపచేయు, రక్షామ్= రక్షను, ప్రదదౌ = ఇచ్చెను.

తా. వాల్మీకి కుశముష్టిని, లవమును గ్రహించి ఆ శిశువుల కిద్దరికీ భూతములను నశింపచేయు రక్షను చేసెను.

వి. వ్రేళ్ళతో తుంపిన కుశల అగ్రభాగమునకు "కుశముష్టి'అని వాటి మొదళ్లున్న భాగమునకు "లవము"అని పేర్లు. వీటిని అభిమంత్రించి ఇవ్వగా వృద్ధ స్త్రీలు వాటితో శిశువుల శరీరముల సంమార్జనము (తుడుచుట) చేయుదురు. అట్లు చేయించె నని భావము. 6

మూ. యస్తయోః పూర్వజో జాతః స కుశైర్మన్త్రిసత్కృతైః,
నిర్మార్జనీయస్తు తదా కుశ ఇత్యస్య నామ తత్. 7

ప్ర. అ. తయోః = వారిలో, యః = ఎవడు, పూర్వజః = ముందు పుట్టిన వాడుగా, జాతః=పుట్టినాడో, సః = అతడు, మన్త్రిసత్కృతైః=మంత్రములచేత సత్కరించబడిన. కుశైః = కుశలచేత, తదా = అప్పుడు, నిర్మార్జనీయః = నిర్మార్జనము చేయదగినవాడు. తత్ =ఆ కారణమువలన, అస్య = వీనికి, కుశః ఇతి= కుశుడు అని, నామ = పేరు.

తా. వారిలో ముందు పుట్టినవానికి మంత్రముచేత సంస్కరించిన కుశలతో (కుశముష్టితో-అనగా పిడికెడు కుశలతో) సంమార్జనము చేయవలెను. అందుచేత అతని పేరు 'కుశుడు'. 7

మూ. యశ్చాపరో భవేత్తాభ్యాం లవేన సుసమాహితః,
నిర్మార్జనీయో వృద్ధాభిర్లవేతి చ స నామతః. 8

ప్ర. అ. తాభ్యామ్ = వారిచేత (వారిలో), యః = ఏ, అపరః = రెండవ వాడు, భవేత్ = ఉండునో అతడు, సుసమాహితః = బాగసావధానచిత్తుడుగా, వృద్ధాభిః = వృద్ధస్త్రీలచేత, నిర్మార్జనీయః = తుడవదగినవాడు. సః = అతడు, నామతః = పేరువలన, లవేతి చ = 'లవుడు'అని అగును.

తా. వారిలో రెండవవానిని సావధానచిత్తుడుగా ఉండునట్లు చేయుచు, వృద్ధ స్త్రీలు లవముచేత తుడవవలెను. వాని పేరు "లవుడు" అని అగును. 8

మూ. ఏవం కుశలవౌ నామ్నా తావుభౌ యమజాతకౌ,
మత్కృతాభ్యాం చ నామభ్యాం ఖ్యాతియుక్తౌ భవిష్యతః.

ప్ర. అ. తౌ = ఆ, ఉభౌ = ఇద్దరు, యమజాతకౌ = కవలలు, ఏవమ్= ఈ విధముగా, నామ్నా = పేరుచేత, కుశలవౌ = కుశలవులు, మత్కృతాభ్యామ్ = నాచేత చేయబడిన, నామభ్యామ్ = పేర్లచేత, ఖ్యాతియుక్తౌ = కీర్తి కలవారు, భవిష్యతః = కాగలరు.

తా. ఈ విధముగా ఈ కవలలు ఇద్దరూ నేను పెట్టిన కుశలవు లను పేర్లతో ప్రసిద్ధులు అగుదురు. 9

మూ. తాం రక్షాం జగృహుస్తాశ్చ మునిహస్తాత్సమాహితాః,
అకుర్వంశ్చ తతో రక్షాం తయోర్విగతకల్మషాః. 10

ప్ర. అ. తాః చ = ఆ వృద్ధస్త్రీలు, సమాహితాః=సావధానచిత్తలై, మునిహస్తాత్ = మునియొక్క హస్తమునుండి, తాం రక్షామ్=ఆ రక్షను, జగృహుః= గ్రహించిరి. విగతకల్మషాః = పోయిన పాపము గల ఆ స్త్రీలు, తతః = అటు పిమ్మట, తయోః = ఆ శిశువులకు, రక్షామ్ = రక్షను, అకుర్వన్ = చేసిరి.

తా. పుణ్యవతులైన ఆ వృద్ధస్త్రీలు ఆ రక్షను మునిచేతుల నుండి శ్రద్ధా పూర్వకముగా తీసికొని ఆ శిశువులకు రక్ష చేసిరి. 10

మూ. తథా తాం క్రియమాణాం చ వృద్ధాభిర్గోత్రనామ చ,
సంకీర్తనం చ రామస్య సీతాయాః ప్రసవే శుభే. 11

అర్ధరాత్రే తు శత్రుఘ్నః శుశ్రావ సమహత్ప్రియమ్,
పర్ణశాలాం తతో గత్వా మాతర్దిష్ట్యేతి చాబ్రవీత్. 12

ప్ర. అ. శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, తథా = ఆ విధముగా, వృద్ధాభిః= వృద్ధస్త్రీలచేత, క్రియమాణామ్ = చేయబడుచున్న, తామ్=ఆ రక్షను, గోత్రనామ చ = గోత్రము పేరును, రామస్య = రామునియొక్క, సంకీర్తనమ్ = పేరు చెప్పుటను, సీతాయాః = సీతయొక్క, శుభే=మంగళకరములైన, ప్రసవే=సంతానమును, సుమహత్ = చాలగొప్పదైన, ప్రియమ్ = ప్రియమును, అర్ధరాత్రే=అర్ధ

రాత్రమునందు, శుశ్రావ = వినెను. తతః = పిమ్మట, పర్ణశాలామ్ = పర్ణశాలను, గత్వా = పొంది, మాతః = తల్లీ, దిష్ట్యా = అదృష్టవశముచేత, ఇతి చ = అని కూడ, అబ్రవీత్ = పలికెను.

తా. ఆ వృద్ధస్త్రీలు ఆ విధముగా రక్ష చేయుటను, వాళ్లు తన గోత్రము, రాముని పేరు చెప్పుకొనుటను, సీత ఇద్దరు శిశువులను కన్నది అను మాటను అత్యంతప్రియమైన దీని నంతను అర్ధరాత్రియందు వినెను. పర్ణశాలకు వెళ్ళి "తల్లీ అదృష్టవశము చేత సుఖముగా ఉన్నావు" అనెను.

వి. రాముడు త్యజించిన సీతను ఇతడు చూచుట యుక్తము కాదు. అందు చేత ఇదంతా విని పర్ణశాలలోనే ఉండి మనస్సులోనే శత్రుఘ్ను డిట్లు అనుకొన్నాడు అని కొందరు వ్యాఖ్యాతలు వ్రాసిరి. పాఠము పై విధముగా ఉన్న పక్షాన మేము చెప్పిన అర్థమే యుక్తముగా ఉండును. కాని ఈ బాధ ఏమీ లేకుండా ప్రాచ్యపాఠం- "పర్ణశాలాం గతో రాత్రౌ దిష్ట్యా దిష్ట్యేతి చాబ్రవీత్" అని ఉన్నది. 12

మూ. తదా తస్య ప్రహృష్టస్య శత్రుఘ్నస్య మహాత్మనః,
వ్యతీతా వార్షికీ రాత్రిః శ్రావణీ లఘువిక్రమా. 13

ప్ర. అ. తదా = అప్పుడు, ప్రహృష్టస్య = సంతోషించిన, మహాత్మనః = మహాత్ముడైన, తస్య శత్రుఘ్నస్య = ఆ శత్రుఘ్నునియొక్క, లఘువిక్రమా = శీఘ్రగమనము గల, వార్షికీ = వర్షకాలసంబంధమైన, శ్రావణీ = శ్రావణసంబంధమైన, రాత్రిః = రాత్రి, వ్యతీతా = గడచినది.

తా. అప్పుడు సంతోషించిన ఆ మహాత్ముడైన శత్రుఘ్నునకు వర్షాకాల సంబంధమైన ఆ శ్రావణరాత్రి తొందరగా గడచిపోయెను. 13

మూ. ప్రభాతే సుమహావీర్యః కృత్వా పౌర్వాహ్ణికీం క్రియామ్,
మునిం ప్రాఞ్జలిరామన్త్ర్య యయౌ పశ్చాన్ముఖః పునః.

ప్ర. అ. సుమహావీర్యః = చాల గొప్ప పరాక్రమము గల అతడు, ప్రభాతే = ప్రాతఃకాలమునందు, పౌర్వాహ్ణికీమ్ = పూర్వాహ్ణమునకు సంబంధించిన, క్రియామ్ = క్రియను, కృత్వా = చేసికొని, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, మునిమ్

= మునీశ్వరుణ్ణి, ఆమన్త్ర్య = అనుమతింపచేసి, పునః = మరల, పశ్చాన్ముఖః = పశ్చిమాభిముఖుడై, యయౌ = వెళ్ళెను.

తా. మహాపరాక్రమశాలియైన శత్రుఘ్నుడు ప్రాతఃకాలమునందు పూర్వాహ్ణ క్రియలు చేసికొని అంజలి ఘటించి మునివద్ద సెలవు తీసికొని మరల పశ్చిమాభిముఖుడై వెళ్ళెను. 14

మూ. స గత్వా యమునాతీరం సప్తరాత్రోషితః పథి,
ఋషీణాం పుణ్యకీర్తీనామాశ్రమే వాసమభ్యయాత్. 15

ప్ర. అ. పథి = మార్గమునందు, సప్తరాత్రోషితః = ఏడురోజులు ఉన్న, సః = అతడు, యమునాతీరమ్ = యమునాతీరమును గూర్చి, గత్వా = వెళ్ళి, పుణ్యకీర్తీనామ్ = పుణ్య కీర్తి గల, ఋషీణామ్ = ఋషులయొక్క, ఆశ్రమే = ఆశ్రమమునందు, వాసమ్ = నివాసమును, అభ్యయాత్ = పొందెను.

తా. శత్రుఘ్నుడు మార్గమునందు ఏడు దివసములు (ఉండ) ప్రయాణము చేసి యమునాతీరము చేరి, పుణ్యకీర్తి గల ఋషీశ్వరుల ఆశ్రమమునందు నివాసము చేసెను. 15

మూ. స తత్ర మునిభిః సార్ధం భార్గవప్రముఖైర్నృపః,
కథాభిరభిరూపాభిర్వాసం చక్రే మహాయశాః. 16

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గల, సః నృపః = ఆ రాజు, తత్ర = అక్కడ, భార్గవప్రముఖైః = చ్యవనుడు మొదలైన, మునిభిః సార్ధమ్ = మునులతో కూడ, అనురూపాభిః = తగిన, కథాభిః = కథలతో, వాసమ్ = నివాసమును, చక్రే = చేసెను.

తా. గొప్ప కీర్తి గల ఆ శత్రుఘ్నుడు చ్యవనుడు మొదలైన మునులతో తగు విధములైన సంభాషణలు చేయుచు నివసించెను. 16

మూ. స కాఞ్చనాద్యైర్మునిభిః సమేతై
రఘుప్రవీరో రజనీం తదానీమ్,
కథాప్రకారైర్బహుభిర్మహాత్మా
విరామయామాస నరేన్ద్రసూనుః. 17

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
షట్‌షష్టితమః సర్గః.

ప్ర అ. నరేన్ద్రసూనుః=రాజకుమారుడైన, మహాత్మా=మహాత్ముడైన, సః రఘుప్రవీరః=ఆ శత్రుఘ్నుడు, సమేతైః=కలసిన, కాఞ్చనాద్యైః=కాంచనుడు మొదలుగా గల, మునిభిః=మునులతో, బహుభిః=అనేకమైన, కథాప్రకారైః=కథల ప్రకారములతో, రజనీమ్=రాత్రిని, విరామయామాస=గడపెను.

తా. మహాత్ముడైన ఆ రాజకుమారుడైన శత్రుఘ్నుడు అక్కడ కలిసి ఉన్న కాంచనాదిమునులతో అనేకవిధములైన సంభాషణలు చేయుచు ఆ రాత్రిని గడపెను. 17

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
అరవైయారవ సర్గ సమాప్తము.

అథ సప్తషష్టితమః సర్గః

[చ్యవనుడు శత్రుఘ్నునకు లవణాసురుని శూలమునకు గల శక్తిని చెప్పుచు పూర్వము జరిగిన మాంధాతవధను గూర్చి తెలుపుట.]

మూ. అథ రాత్ర్యాం ప్రవృత్తాయాం శత్రుఘ్నో భృగునన్దనమ్,
పప్రచ్ఛ చ్యవనం విప్రం లవణస్య యథాబలమ్. 1

ప్ర. అ. అథ = అటుపిమ్మట, రాత్ర్యామ్ = రాత్రి, ప్రవృత్తాయామ్ = ప్రారంభమయినదగుచుండగా, శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, భృగునన్దనమ్ = భృగుమహర్షి కుమారుడు, విప్రమ్ = బ్రాహ్మణుడూ అయిన, చ్యవనమ్ = చ్యవనుణ్ణి, లవణస్య = లవణునియొక్క, బలమ్ = బలము, యథా = ఎట్లున్నదో, పప్రచ్ఛ = అడిగెను.

తా. రాత్రి ప్రారంభమైన పిమ్మట శత్రుఘ్నుడు, భృగువు కుమారుడు, బ్రాహ్మణుడూ అయిన చ్యవనుణ్ణి, లవణుని బలము ఎట్టిది అని ప్రశ్నించెను. 1

మూ. శూలస్య చ బలం బ్రహ్మన్ కే చ పూర్వం వినాశితాః,
అనేన శూలముఖ్యేన ద్వన్ద్వయుద్ధముపాగతాః. 2

ప్ర. అ. బ్రహ్మన్ = ఓ ! బ్రాహ్మణుడా ! శూలస్య = శూలమయొక్క, బలమ్ = బలము ఎట్టిది? పూర్వమ్ = పూర్వము, ద్వన్ద్వయుద్ధమ్ = ద్వంద్వయుద్ధమును, ఉపాగతాః = పొందిన, కే = ఎవరు, అనేన = ఈ, శూలముఖ్యేన = ముఖ్యమైన శూలముచేత, వినాశితాః = నశింపచేయబడినారు ?

తా. మునీంద్రా! శూలము బలము ఎట్టిది ? పూర్వము ఆతనితో ద్వంద్వయుద్ధమునకు తలపడిన ఎవరెవరిని అతడు ఈ గొప్ప శూలముతో చంపినాడు?

మూ. తస్య తద్వచనం శ్రుత్వా శత్రుఘ్నస్య మహాత్మనః,
ప్రత్యువాచ మహాతేజాశ్చ్యవనో రఘునన్దనమ్. 3

ప్ర. అ మహాత్మనః = మహాత్ముడైన, తస్య శత్రుఘ్నస్య = ఆ శత్రుఘ్నునియొక్క, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, చ్యవనః = చ్యవనుడు, రఘునన్దనమ్ = శత్రుఘ్నుణ్ణి గూర్చి, ప్రత్యువాచ = తిరిగి వలికెను.

తా. మహాత్ముడైన ఆ శత్రుఘ్నుని మాటలు విని గొప్ప తేజస్సు గల చ్యవనుడు ఇట్లు బదులు చెప్పెను. 3

మూ. అసంఖ్యేయాని కర్మాణి యాన్యస్య రఘునన్దన,
ఇక్ష్వాకువంశప్రభవే యద్వృత్తం తచ్ఛ్రుణుష్వ మే. 4

ప్ర. అ. రఘునన్దన = శత్రుఘ్నా, అస్య = వీనియొక్క, యాని = ఏ, కర్మాణి = కర్మలు గలవో అవి, అసంఖ్యేయాని = లెక్కపెట్ట శక్యము కానివి. ఇక్ష్వాకువంశప్రభవే = ఇక్ష్వాకువంశమునందు పుట్టినవాని విషయమునందు, యత్ = ఏది, వృత్తమ్ = జరిగినదో, తత్ = దానిని, మే = నానుండి, శృణుష్వ = వినుము.

తా. శత్రుఘ్నుడా ! ఇతడు చేసిన పనులు లెక్కింప శక్యము కానివి. ఇక్ష్వాకువంశమునకు చెందిన ఒక రాజు విషయమున జరిగిన వృత్తాంతమును వినుము. 4

మూ. అయోధ్యాయాం పురా రాజా యువనాశ్వసుతో బలీ,
మాంధాతా ఇతి విఖ్యాతస్త్రిషు లోకేషు వీర్యవాన్. 5

ప్ర. అ. పురా = పూర్వము, అయోధ్యాయామ్ = అయోధ్యయందు, యువనాశ్వసుతః = యువనాశ్వుని కుమారుడు, బలీ = బలవంతుడు, త్రిషు లోకేషు = మూడు లోకములందూ, విఖ్యాతః = ప్రసిద్ధుడూ, వీర్యవాన్ = పరాక్రమవంతుడూ అయిన, మాంధాతా ఇతి = మాంధాత అను, రాజా = రాజు, ఉండెడివాడు.

తా. పూర్వము అయోధ్యలో యువనాశ్వుని పుత్రుడైన మహాబలపరాక్రమములు గల మూడు లోకములలోను ప్రసిద్ధుడైన మాంధాత అనే రాజు ఉండేవాడు.

మూ. స కృత్వా పృథివీం కృత్స్నాం శాసనే పృథివీపతిః,
సురలోకమితో జేతుముద్యోగమకరోన్నృపః. 6

ప్ర. అ. పృథివీపతిః = భూమండలమునకు ప్రభువైన, సః నృపః = ఆ రాజు, కృత్స్నామ్=సమస్తమైన, పృథివీమ్ = భూమిని, శాసనే=శాసనమునందు, కృత్వా = చేసి, ఇతః = ఇక్కడినుండి, సురలోకమ్=స్వర్గలోకమును, జేతుమ్= జయించుటకు, ఉద్యోగమ్ = ప్రయత్నమును, అకరోత్ = చేసెను.

తా. భూమండలాధిపతియైన ఆరాజు భూమినంతనూ తన శాసనములోనికి తీసికొనివచ్చి ఇక్కడినుండి దేవలోకమును జయించుటకు ప్రయత్నము చేసెను.

మూ. ఇన్ద్రస్య చ భయం తీవ్రం సురాణాం చ మహాత్మనామ్,
మాంధాతరి కృతోద్యోగే దేవలోకజిగీషయా. 7

ప్ర. అ. మాంధాతరి = మాంధాత, దేవలోకజిగీషయా = దేవలోకమును జయించవలె ననుఇచ్ఛచేత, కృతోద్యోగే=చేయబడిన ప్రయత్నము కలవాడగు చుండగా, ఇన్ద్రస్య చ = ఇంద్రునకు, మహాత్మనామ్ = మహాత్ములైన, సురాణాం చ = దేవతలకూ, తీవ్రమ్ = తీవ్రమైన. భయమ్ = భయము కలిగెను.

తా. మాంధాత దేవలోకమును జయించవలె ననే ఇచ్ఛతో ప్రయత్నము ప్రారంభించగానే ఇంద్రునికీ, మహాత్ములైన దేవతలకీ కూడ తీవ్రమైన భయము కలిగెను. 7

మూ. అర్ధాసనేన శక్రస్య రాజ్యార్ధేన చ పార్థివః,
ఛన్ద్యమానః సురగణైః ప్రతిజ్ఞామధ్యరోహత. 8

ప్ర. అ. పార్థివః = ఆ రాజు, శక్రస్య = ఇంద్రునియొక్క, అర్ధాసనేన= అర్ధాసనముచేతను, రాజ్యార్ధేన చ=రాజ్యముయొక్క అర్ధముచేతను. సురగణైః= దేవగణములచేత, ఛన్ద్యమానః=ప్రతిమాలుకొనబడుచున్నను, ప్రతిజ్ఞామ్ = ప్రతిజ్ఞను, అధ్యరోహత = అధిష్ఠించి ఉండెను.

తా. దేవేంద్రునితో అర్ధాసనము, రాజ్యములో సగమూ ఇచ్చెద మని సురగణాలు ప్రతిమాలినను అతడు తన ప్రతిజ్ఞను ఎక్కడయే ఉండెను (వదలలేదు).

మూ. తస్య పాపమభిప్రాయం విదిత్వా పాకశాసనః,
సాన్త్వపూర్వమిదం వాక్యమువాచ యువనాశ్వజమ్. 9

ప్ర. అ. పాకశాసనః = ఇంద్రుడు, తస్య = వానియొక్క-, పాపమ్ = పాపమైన, అభిప్రాయమ్ = అభిప్రాయమును, విదిత్వా = తెలిసికొని, యువనాశ్వజమ్ = మాంధాతను గూర్చి, సాన్త్వపూర్వమ్ = బ్రతిమాలుకొనుట పూర్వమునందు కలుగునట్లుగా, ఇదమ్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. ఇంద్రుడు ఆతని చెడ్డ ఆలోచనను తెలిసికొని బ్రతిమాలుచు ఆతనితో ఇట్లనెను. 9

మూ. రాజా త్వం మానుషే లోకే న తావత్పురుషర్షభ,
అకృత్వా పృథివీం వశ్యాం దేవరాజ్యమిహేచ్ఛసి. 10

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! త్వమ్ = నీవు, మానుషే లోకే = మనుష్యలోకమునందే, రాజా = రాజువు, న తావత్ = కావు. పృథివీమ్ = భూమిని, వశ్యామ్ = వశ్యమైనదానినిగా, అకృత్వా = చేయకుండగా, ఇహ = ఇక్కడ, దేవరాజ్యమ్ = దేవరాజ్యమును, ఇచ్ఛసి = కోరుచున్నావు.

తా. పురుషశ్రేష్ఠుడా! నీవు మనుష్యలోకములోనే రాజువు కావు. భూలోకమును అంతనూ వశము చేసికొనకుండగానే స్వర్గరాజ్యమును కోరుచున్నావు! 10

మూ. యది వీర సమగ్రా తే మేదినీ నిఖిలా వశే,
దేవరాజ్యం కురుష్వేహ సభృత్యబలవాహనః. 11

ప్ర. అ. వీర = వీరుడా! నిఖిలా = పూర్తియైన; సమగ్రా = సమస్తమైన, మేదినీ = భూమి, తే = నీకు, వశే యది = వశమునం దున్నట్లయితే, ఇహ = ఇక్కడ, సభృత్యబలవాహనః = భృత్యులతోను, సైన్యముతోను వాహనములతోను కూడినవాడవై, దేవరాజ్యమ్ = దేవరాజ్యమును, కురుష్వ = చేయుము.

తా. ఓ! వీరుడా! ఈ భూమి అంతా పూర్తిగా నీ ఆధీనములో ఉన్నట్లయితే నీవు భృత్యులతోను, సైన్యములతోను, వాహనములతోను వచ్చి ఇక్కడ దేవరాజ్యము చేయుము. 11

మూ. ఇన్ద్రియేవం బ్రువాణం తం మాంధాతా వాక్యమబ్రవీత్,
క్వ మే శక్ర ప్రతిహతం శాసనం పృథివీతలే. 12

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, బ్రువాణమ్=పలుకుచున్న, ఇన్ద్రమ్=ఇంద్రుణ్ణి గూర్చి, మాంధాతా = మాంధాత, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. శక్ర = ఇంద్రా! మే = నాయొక్క, శాసనమ్ = శాసనము, పృథివీతలే = భూమియందు, క్వ = ఎక్కడ, ప్రతిహతమ్ = అడ్డుకొనబడినది ?

తా. ఇంద్రుని మాటలు విని మాంధాత-"ఇంద్రా! నా ఆజ్ఞ భూలోకములో ఎక్కడ చెల్లుటలేదు"అని ప్రశ్నించెను. 12

మూ. తమువాచ సహస్రాక్షో లవణో నామ రాక్షసః,
మధుపుత్రో మధువనే తే నాజ్ఞాం కురుతేఽనఘ. 13

ప్ర. అ. సహస్రాక్షః=ఇంద్రుడు,తమ్=వానినిగూర్చి, ఉవాచ=పలికెను. అనఘ = దోషములు లేనివాడా ! మధుపుత్రః=మధువుయొక్క పుత్రుడైన, లవణో నామ = లవణు డను పేరు గల, రాక్షసః = రాక్షసుడు, మధువనే = మధువనము నందు, తే = నీయొక్క, ఆజ్ఞామ్ = ఆజ్ఞను, నకురుతే = చేయుటలేదు.

తా. ఇంద్రుడు మాంధాతతో-"దోషములు లేనివాడా! మధువనములో నివసించుచున్న, మధువు కుమారుడైన లవణుడను రాక్షసుడు నీ ఆజ్ఞను చేయుటలేదు" అని చెప్పెను. 13

మూ. తచ్ఛ్రుత్వా విప్రియం ఘోరం సహస్రాక్షేణ భాషితమ్,
వ్రీడితోఽవాఙ్ముఖో రాజా వ్యాహర్తుం నశశాక హ. 14

ప్ర. అ. సహస్రాక్షేణ = ఇంద్రునిచేత, భాషితమ్=పలకబడిన, తత్ = ఆ, ఘోరమ్ = ఘోరమైన, విప్రియమ్ = అప్రియమైన విషయమును, శ్రుత్వా = విని, రాజా = రాజు, వ్రీడితః = సిగ్గు చెందినవాడై, అవాఙ్ముఖః = క్రిందికి ముఖము కలవాడై, వ్యాహర్తుమ్=పలుకుటకు, నశశాక హ=సమర్థుడు కాలేదు.

తా. దేవేంద్రుడు తెలిపిన ఘోరమైన ఆ అప్రియమైన విషయమును విని మాంధాత సిగ్గు చెంది తల వంచుకొనెను. ఏమీ జవాబు చెప్పజాలకపోయెను. 14

మూ. ఆమన్త్ర్య తు సహస్రాక్షం ప్రాయాత్ కించిదవాఙ్ముఖః,
పునరేవాగమచ్ఛ్రీమానిమం లోకం నరేశ్వరః. 15

ప్ర. అ. శ్రీమాన్ = శ్రీమంతుడైన, నరేశ్వరః = ఆ రాజు, సహస్రాక్షమ్ = ఇంద్రుణ్ణి, ఆమన్త్ర్య = అనుజ్ఞ అడిగి, కించిత్ = కొంచెము, అవాఙ్ముఖః = క్రిందికి ముఖము గలవాడై, పునః ఏవ = మరల. ఇమమ్ = ఈ, లోకమ్ = లోకమును గూర్చి, ఆగమత్ = వచ్చెను.

తా. శ్రీమంతుడైన ఆ రాజు ఇంద్రుని వద్ద సెలవు గైకొని, కొంచెము తల వంచుకొని మరల ఈ లోకమునకు వచ్చెను. 15

మూ. స కృత్వా హృదయేఽమర్షం సభృత్యబలవాహనః,
ఆజగామ మధోః పుత్రం వశే కర్తుమరిందమః. 16

ప్ర. అ. అరిందమః = శత్రుసంహారకుడైన, సః = అతడు, హృదయే = హృదయమునందు, అమర్షమ్ = కోపమును, కృత్వా = చేసి, మధోః = మధువు యొక్క, పుత్రమ్ = పుత్రుణ్ణి, వశే = వశమునందు, కర్తుమ్ = చేయుటకు, సభృత్య బలవాహనః = భృత్యసైన్యవాహనములతో కూడినవాడై, ఆజగామ = వచ్చెను.

తా. శత్రుసంహారకుడైన మాంధాత మనస్సులో కోపము ఉంచుకొని లవణాసురుణ్ణి తన వశములో ఉంచుకొనుటకై భృత్య–సైన్య–వాహనములతో కలిసి వచ్చెను. 16

మూ. స కాఙ్క్షమాణో లవణం యుద్ధాయ పురుషర్షభః,
దూతం సంప్రేషయామాస సకాశం లవణస్య హి. 17

ప్ర. అ. పురుషర్షభః = పురుషశ్రేష్ఠుడైన, సః = అతడు, యుద్ధాయ = యుద్ధముకొరకు, లవణమ్ = లవణుణ్ణి, కాఙ్క్షమాణః = కోరుచు, లవణస్య సమీపమ్ = లవణుని సమీపమును గూర్చి, దూతమ్ = దూతను, సంప్రేషయామాస = పంపెను.

తా. పురుషశ్రేష్ఠుడైన మాంధాత లవణునితో యుద్ధమును కోరుచు ఆతని వద్దకు దూతను పంపెను. 17

మూ. స గత్వా విప్రియాణ్యాహ బహూని మధునః సుతమ్,
వదన్నేవం తం దూతం భక్షయామాస రాక్షసః. 18

ప్ర. అ. సః=ఆ దూత, మధునః సుతమ్=లవణాసురుణ్ణి గూర్చి, గత్వా =వెళ్ళి, బహూని = అనేకమైన, విప్రియాణి = అప్రియములైన మాటలు, ఆహ =పలికెను. ఏవమ్ = ఇట్లు, వదన్తమ్ = పలుకుచున్న, తం దూతమ్ = ఆ దూతను, రాక్షసః = రాక్షసుడు, భక్షయామాస = భక్షించెను.

తా. అతడు లవణాసురునివద్దకు వెళ్ళి చాలా అప్రియవాక్యములు పలికెను. అతడు అట్లు పలుకుచుండగా రాక్షసుడు వానిని భక్షించివేసెను. 18

మూ. చిరాయమాణే దూతే తు రాజా క్రోధసమన్వితః,
అర్దయామాస తద్రక్షః శరవృష్ట్యా సమన్తతః. 19

ప్ర. అ. దూతే = దూత, చిరాయమాణే = ఆలస్యము చేయుచుండగా, రాజా = రాజా, క్రోధసమన్వితః = క్రోధముతో కూడినవాడై, సమన్తతః = నలు వైపులా, శరవృష్ట్యా = బాణవర్షముచేత, తత్ = ఆ, రక్షః = రాక్షసుణ్ణి, అర్ద యామాస = పీడించెను.

తా. ఆ దూత ఆలస్యము చేయుచుండగా మాంధాత కోపముతో ఆ రాక్ష సుణ్ణి అన్నివైపులా బాణవర్షముచేత వర్షించెను. 19

మూ. తతః ప్రహస్య తద్రక్షః శూలం జగ్రాహ పాణినా,
వధాయ సానుబన్ధస్య ముమోచాయుధముత్తమమ్. 20

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తత్ రక్షః = ఆ రాక్షసుడు, ప్రహస్య= నవ్వి, పాణినా = హస్తముతో, శూలమ్ = శూలమును, జగ్రాహ = గ్రహించెను. సానుబన్ధస్య = పరివారముతో కూడిన ఆతనియొక్క, వధాయ = వధకొరకు, ఉత్తమమ్ = ఉత్తమమైన, ఆయుధమ్ = ఆయుధమును, ముమోచ = విడచెను.

తా. ఆ రాక్షసుడు నవ్వి, శూలమును హస్తముతో గ్రహించి, ఆ రాజునూ, ఆతని పరివారమునూ కూడ చంపుటకై ఆ ఉత్తమమైన ఆయుధమును విడచెను. 20

మూ. తచ్ఛూలం దీప్యమానం తు సభృత్యబలవాహనమ్,
భస్మీకృత్వా నృపం భూమౌ లవణస్యాగమత్కరమ్. 21

ప్ర. అ. దీప్యమానమ్=ప్రజ్వలించుచున్న, తత్ శూలమ్ = ఆ శూలము, సభృత్యబలవాహనమ్=భృత్య-సైన్య-వాహనములతో కూడిన, నృపమ్=రాజును, భూమౌ = భూమియందు, భస్మ కృత్వా = భస్మము చేసి, లవణస్య = లవణుని యొక్క, కరమ్ = హస్తమును, అగమత్ = పొందెను.

తా. ప్రజ్వలించుచున్న ఆ శూలము ఆ రాజునూ, ఆతని భృత్య-సైన్య వాహనములనూ నేలమీద భస్మము చేసి లవణుని చేతిలోనికి చేరెను. 21

మూ. ఏవం స రాజా సుమహాన్ హతః సబలవాహనః,
శూలస్య తు బలం సౌమ్య అప్రమేయమనుత్తమమ్. 22

ప్ర. అ. సుమహాన్ = చాలా గొప్పవాడైన, సః రాజా = ఆ రాజు, ఏవమ్ = ఈ విధముగా, సబలవాహనః = సైన్యవాహనములతో కూడినవాడై, హతః = చంపబడెను. సౌమ్య = సౌమ్యుడా! శూలస్య=శూలముయొక్క, బలమ్=బలము, అప్రమేయమ్ = సాటి లేనిది, అనుత్తమమ్ = చాలా గొప్పది.

తా. చాల గొప్పవాడైన ఆ మాంధాత ఆతని సైన్యవాహనములూ కూడ ఈ విధముగా చంపబడినవి. సౌమ్యుడా! శూలమున కున్న శక్తి చాల గొప్పది. ఊహింప శక్యము కానిది. 22

మూ. శ్వః ప్రభాతే తు లవణం వధిష్యసి న సంశయః,
అగృహీతాయుధం క్షిప్రం ధ్రువో హి విజయస్తవ. 23

ప్ర. అ. శ్వః= రేపు, ప్రభాతే=ప్రాతఃకాలమునందు, అగృహీతాయుధమ్ =గ్రహింపబడని ఆయుధము గల, లవణమ్ = లవణుణ్ణి, క్షిప్రమ్ = శీఘ్రముగా, వధిష్యసి = చంపగలవు. సంశయః = సంశయము, న = లేదు. తవ = నీ యొక్క, విజయః = విజయము, ధ్రువః హి = నిశ్చితము కదా?

తా. రేపు ప్రాతఃకాలమునందు నీవు శూలాయుధము లేని ఆతనిని శీఘ్రముగా చంపగలవు. సందేహము లేదు. నీకు జయము నిశ్చితము. 23

మూ. లోకానాం స్వస్తి చైవం స్యాత్ కృతే కర్మణి చ త్వయా,
ఏతత్తే సర్వమాఖ్యాతం లవణస్య దురాత్మనః. 24

ప్ర. అ. త్వయా = నీచేత, కర్మణి = ఈ పని, ఏవమ్ = ఇట్లు. కృతే = చేయబడినదగుచుండగా, లోకానామ్ = లోకములకు, స్వస్తి = క్షేమము, స్యాత్ = అగును. దురాత్మనః = దురాత్ముడైన, లవణస్య = లవణునియొక్క, ఏతత్ = ఈ, సర్వమ్ = సమస్తమూ, తే = నీకు, ఆఖ్యాతమ్ = చెప్పబడినది.

తా. నీవు ఈ పని ఈ విధముగా నెరవేర్చినచో లోకములకు క్షేమము అగును. దురాత్ముడైన లవణునికి సంబంధించిన ఈ విషయ మంతా నీకు చెప్పబడినది. 24

మూ. శూలస్య చ బలం ఘోరమప్రమేయం నరర్షభ,
వినాశశ్చైవ మాన్ధాతుర్యత్నేనాభూచ్చ పార్థివ. 25

ప్ర. అ. నరర్షభ = నరులలో శ్రేష్ఠుడా! శూలస్య = శూలముయొక్క, బలమ్ = బలము, ఘోరమ్ = ఘోరమైనది. అప్రమేయం చ = ఊహింప శక్యము కానిది. పార్థివ = రాజా! మాంధాతుః = మాంధాతయొక్క, వినాశః చ ఏవ = = వినాశము, యత్నేన = (ఇంద్రుని) ప్రయత్నము చేత, అభూత్ = ఆయెను.

తా. నరశ్రేష్ఠుడా! శూలమున కున్న బలము ఘోరమైనది; ఊహింప శక్యముకానిది. ఇంద్రుని ప్రయత్నముచేత ఈ శూలము ద్వారా మాంధాత నశించినాడు. 25

మూ. త్వం శ్వః ప్రభాతే లవణం మహాత్మన్
వధిష్యసే నాత్ర తు సంశయో మే,
శూలం వినా నిర్గతమామిషార్థే
ధ్రువో జయస్తే భవితా నరేన్ద్ర. 26

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
సప్తషష్టితమః సర్గః.

ప్ర. అ. మహాత్మన్ = ఓ! మహాత్మా! శ్వః = రేపు, ప్రభాతే = ప్రాతఃకాలమునందు, ఆమిషార్థే = మాంసముకొరకై, శూలం వినా = శూలము లేకుండా, నిర్గతమ్ = బయలుదేరిన, లవణమ్ = లవణాసురుణ్ణి, వధిష్యసే = చంపగలవు. అత్ర = ఈ విషయమునందు, మే = నాకు, సంశయః = సంశయము, న = లేదు.

నరేన్ద్ర = రాజా! తే = నీకు, ధ్రువః = నిశ్చితమైన, విజయః = విజయము, భవితా = కలగగలదు.

తా. ఓ మహాత్మా! రాజా! రేపు ప్రాతఃకాలమునందు మాంసము నిమిత్తము శూలము లేకుండగా బయల్వెడలిన లవణాసురుణ్ణి చంపగలవు. నాకీ విషయము నందు సందేహము లేదు. నీకు తప్పక విజయము లభించగలదు. 26

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు,
ఉత్తరకాండలో అరవైఏడవ సర్గ సమాప్తము.

అథ అష్టషష్టితమః సర్గః

[లవణాసురుడు ఆహారముకొరకై బయలుదేరుట. శత్రుఘ్నుడు మధురాపురద్వారమునందు నిలచి ఉండుట. తిరిగి వచ్చిన లవణునితో ఆతని సంభాషణము].

మూ. కథాం కథయతాం తేషాం జయం చాకాఙ్క్షతాం శుభమ్,
వ్యతీతా రజనీ శీఘ్రం శత్రుఘ్నస్య మహాత్మనః. 1

ప్ర. అ. తేషామ్ = ఆ మునులు, కథామ్ = కథను, కథయతామ్ = చెప్పుచుండగా, శుభమ్ = శుభమును, జయం చ = జయమును, ఆకాఙ్క్షతామ్ = కోరుచుండగా, మహాత్మనః = మహాత్ముడైన, శత్రుఘ్నస్య = శత్రుఘ్ననకు, రజనీ = రాత్రి, శీఘ్రమ్ = శీఘ్రముగా, వ్యతీతా = గడచినది.

తా. ఆ మునులు ఆ కథను చెప్పుచు జయమును, శుభమునూ కోరుచుండగా మహాత్ముడైన శత్రుఘ్ననకు రాత్రి శీఘ్రముగా గడచిపోయినది. 1

మూ. తతః ప్రభాతే విమలే తస్మిన్ కాలే స రాక్షసః,
నిర్గతస్తు పురాద్వీరో భక్ష్యాహారప్రచోదితః. 2

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ప్రభాతే = తెల్లవారిన, విమలే = నిర్మలమైన, తస్మిన్ కాలే = ఆ కాలమునందు, వీరః = వీరుడైన, సః రాక్షసః = ఆ రాక్షసుడు, భక్ష్యాహారప్రచోదితః = తినదగిన ఆహారముచేత, లేదా భక్ష్యము తీసికొనుటకై ప్రేరితుడై, పురాత్ = పట్టణమునుండి, నిర్గతః = బయలుదేరినాడు.

తా. ఇంతలో తెల్లవారెను. నిర్మలమైన ఆ కాలమునందు వీరుడైన ఆ రాక్షసుడు భక్షింపదగిన ఆహారముచేత ప్రేరితుడై (ఆహారమును సంపాదించుటకై) పట్టణమునుండి బైటకు వెళ్ళెను. 2

మూ. ఏతస్మిన్నన్తరే వీరః శత్రుఘ్నో యమునాం నదీమ్,
తీర్త్వా మధుపురద్వారి ధనుష్పాణిరతిష్ఠత. 3

ప్ర. అ. ఏతస్మిన్ = ఈ, అన్తరే = మధ్యకాలములో, వీరః = వీరుడైన, శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, యమునాం నదీమ్ = యమునానదిని, తీర్త్వా = దాటి, ధనుష్పాణిః = ధనస్సు హస్తమునందు కలవాడై, మధుపురద్వారి = మధుపుర ద్వారమునందు, అతిష్ఠత = నిలచెను.

తా. ఈ మధ్యసమయములో వీరుడైన శత్రుఘ్నుడు యమునానదిని దాటి ధనస్సు ధరించి, మధుపురద్వారమునందు నిలచెను. 3

మూ. తతోఽర్ధదివసే ప్రాప్తే క్రూరకర్మా స రాక్షసః,
ఆగచ్ఛత్ బహుసాహస్రం ప్రాణినాం భారముద్వహన్. 4

ప్ర. అ. తతః = ఆటుపిమ్మట, అర్ధదివసే = దివసార్ధము, ప్రాప్తే = వచ్చినదగుచుండగా, క్రూరకర్మా = క్రూరమైన కర్మ గల, సః రాక్షసః = ఆ రాక్షసుడు, ప్రాణినామ్ = ప్రాణులయొక్క, బహుసాహస్రమ్ = అనేక సహస్ర ముల రూపములో ఉన్న, భారమ్ = భారమును, ఉద్వహన్ = మోయుచు, ఆగ చ్ఛత్ = వచ్చెను.

తా. పిమ్మట మధ్యాహ్నసమయమున క్రూరకర్మలు చేయు ఆ రాక్షసుడు కొన్నివేల ప్రాణుల భారము మోయుచు ఆచటికి వచ్చెను. 4

మూ. తతో దదర్శ శత్రుఘ్నం స్థితం ద్వారి ధృతాయుధమ్,
తమువాచ తతో రక్షః కిమనేన కరిష్యసి. 5

ప్ర. అ. తతః = పిమ్మట, రక్షః = రాక్షసుడు, ద్వారి స్థితమ్ = ద్వారము నందు నిలచిన, ధృతాయుధమ్ = ధరించబడిన ఆయుధము గల, శత్రుఘ్నమ్ = శత్రుఘ్నుణ్ణి, దదర్శ = చూచెను. తతః = పిమ్మట, తమ్ = వానిని గూర్చి, ఉవాచ = పలికెను. అనేన = దీనితో, కిం కరిష్యసి = ఏమి చేసెదవు?

తా. పిమ్మట ఆ రాక్షసుడు ద్వారమునందు ఆయుధము ధరించి నిలచిన శత్రుఘ్నుణ్ణి చూచి "దీనితో ఏమి చేసెదవు?" అని ఆతనిని అడిగెను. 5

మూ. ఈదృశానాం సహస్రాణి సాయుధానాం నరాధమ,
భక్షితాని మయా రోషాత్ కాలేనానుగతో హ్యసి. 6

ప్ర. అ. నరాధమ = ఓ! నరాధమా! సాయుధానామ్ = ఆయుధములతో కూడిన. ఈదృశానామ్ = ఇట్టివాళ్ళయొక్క, సహస్రాణి = సహస్రములు, మయా = నాచేత, రోషాత్ = కోపమువలన, భక్షితాని = భక్షింపబడినవి. కాలేన = కాలము చేత, అనుగతః = అనుసరించబడినవాడవు, అసి హి = అయి ఉన్నావు కదా?

తా. ఓ! నరాధమా! ఆయుధాలు ధరించిన నీవంటివాళ్ళను కొన్ని వేల మందిని నేమ కోపముతో భక్షించి ఉన్నాను. నీవు కాలము ప్రేరేపింపగా వచ్చి నట్లున్నావు! 6

మూ. ఆహారశ్చాప్యసంపూర్ణో మమాయం పురుషాధమ,
స్వయం ప్రవిష్టోఽద్య ముఖం కథమాసాద్య దుర్మతే. 7

ప్ర. అ. పురుషాధమ = ఓ! పురుషాధమా! మమ = నాయొక్క, అయమ్ = ఈ, ఆహారః చ = ఆహారము కూడ, అసంపూర్ణః = చాలదు. దుర్మతే = దుర్మతీ! అద్య = ఇప్పుడు, ఆసాద్య = దగ్గరకు వచ్చి, స్వయమ్ = స్వయముగానే, ముఖమ్ = ముఖమును, కథమ్ = ఎట్లు, ప్రవిష్టః = ప్రవేశించితివి?

తా. దుర్మతీ! ఈ ఆహారము నాకు చాలినంతగా లేదు. ఓ పురుషాధమా! నా దగ్గరకు వచ్చి ఇప్పుడు స్వయముగానే వచ్చి నా ముఖములో ప్రవేశించు చున్నావు కదా! 7

మూ. తస్యైవం భాషమాణస్య హసతశ్చ ముహుర్ముహుః,
శత్రుఘ్నో వీర్యసంపన్నో రోషాదశ్రూణ్యవాసృజత్. 8

ప్ర. అ. తస్య = అతడు, ఏవమ్ = ఇట్లు, భాషమాణస్య = మాటలాడు చుండగా, ముహుః ముహుః = మాటిమాటికి, హసతః చ = నవ్వుచుండగా, వీర్య సంపన్నః = పరాక్రమసంపన్నుడైన, శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, రోషాత్ = కోపమువలన. అశ్రూణి = కన్నీళ్ళను, అవాసృజత్ = ప్రవర్తింపచేసెను.

తా. లవణుడు ఈ విధముగా మాటలాడుచు మాటిమాటికి నవ్వుచుండగా మహాపరాక్రమవంతుడైన శత్రుఘ్నుడు కోపముతో కన్నీళ్ళను రాల్చెను. 8

మూ. తస్య రోషాభిభూతస్య శత్రుఘ్నస్య మహాత్మనః,
తేజోమయా మరీచ్యస్తు సర్వగాత్రైర్వినిష్పతన్. 9

ప్ర. అ. రోషాభిభూతస్య = రోషముచేత ఆక్రమించబడిన, మహాత్మనః = మహాత్ముడైన, తస్య శత్రుఘ్నస్య = ఆ శత్రుఘ్ననియొక్క, సర్వగాత్రైః = అన్ని అవయవములనుండి, తేజోమయాః = తేజోవికారములైన, మరీచ్యః తు = కిరణములు, వినిష్పతన్ = ప్రసరించినవి.

తా. రోషావేశములో ఉన్న మహాత్ముడైన ఆ శత్రుఘ్నుని సమస్తములైన అవయవములనుండి తేజోమయములైన కిరణములు ప్రసరించినవి. 9

మూ. ఉవాచ చ సుసంక్రుద్ధః శత్రుఘ్నః స నిశాచరమ్,
యోద్ధుమిచ్ఛామి దుర్బుద్ధే ద్వన్ద్వయుద్ధం త్వయా సహ.

ప్ర. అ. సుసంక్రుద్ధః = మిక్కిలి కోపించిన, సః శత్రుఘ్నుః = ఆ శత్రుఘ్నుడు, నిశాచరమ్ = రాక్షసుణ్ణి గూర్చి, ఉవాచ చ = పలికెను, దుర్బుద్ధే = ఓ ! దుర్బుద్ధీ ! త్వయా సహ = నీతో కూడ, ద్వన్ద్వయుద్ధమ్ = ద్వంద్వయుద్ధమును, యోద్ధుమ్ = (యుద్ధము) చేయుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. చాల కోపించిన శత్రుఘ్నుడు ఆ రాక్షసునితో ఇట్లు పలికెను - "ఓ ! దుర్బుద్ధీ ! నీతో ద్వంద్వయుద్ధము చేయవలె నని కోరుచున్నాను. 10

మూ. పుత్రో దశరథస్యాహం భ్రాతా రామస్య ధీమతః,
శత్రుఘ్నో నామ శత్రుఘ్నో వధాకాఙ్క్షీ తవాగతః. 11

ప్ర. అ. అహమ్ = నేను, దశరథస్య = దశరథునియొక్క, పుత్రః = పుత్రుడను. ధీమతః = బుద్ధిమంతుడైన, రామస్య = రామునియొక్క, భ్రాతా = సోదరుడను. శత్రుఘ్నో నామ = శత్రుఘ్ను డను పేరు గలవాడను. శత్రుఘ్నుః = శత్రువులను చంపువాడను. తవ = నీయొక్క, వధాకాఙ్క్షీ = వధను కోరుచు, ఆగతః = వచ్చినాను.

తా. నేను దశరథుని పుత్రుడను, బుద్ధిమంతుడైన రాముని సోదరుడను, శత్రువులను సంహరించు నా పేరు శత్రుఘ్నుడు. నిన్ను చంపుటకై ఇక్కడికి వచ్చినాను. 11

మూ. తస్య మే యుద్ధకామస్య యుద్ధమద్య ప్రదీయతామ్,
శత్రుస్త్వం సర్వభూతానాం న మే జీవన్ గమిష్యసి. 12

ప్ర. అ. యుద్ధకామస్య = యుద్ధమునందు కోరిక గల, తస్య మే = అట్టి నాకు, అద్య = ఇప్పుడు, యుద్ధమ్ = యుద్ధము, ప్రదీయతామ్ = ఇవ్వబడుగాక, సర్వభూతానామ్ = సమస్త ప్రాణులకూ కూడ, శత్రుః = శత్రువైన నీవు, జీవన్ = జీవించినవాడవై, మే = నానుండి, న గమిష్యసి = వెళ్ళవు.

తా. యుద్ధమును కోరుచున్న అట్టి నాకు ఇప్పుడు యుద్ధమును ఇమ్ము. సమస్తప్రాణులకూ కూడ శత్రువైన నీవు ప్రాణాలతో నానుండి బైటపడజాలవు. 12

మూ. తస్మింస్తథా బ్రువాణే తు రాక్షసః ప్రహసన్నివ,
ప్రత్యువాచ నరశ్రేష్ఠం దిష్ట్యా ప్రాప్తోఽసి దుర్మతే. 13

ప్ర. అ. తస్మిన్ = ఆతడు, తథా = అట్లు, బ్రువాణే = పలుకుచుండగా, రాక్షసః తు = రాక్షసుడైతే, ప్రహసన్నివ = నవ్వుచు, నరశ్రేష్ఠమ్ = నరశ్రేష్ఠుని గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను. దుర్మతే = దుర్మతీ! దిష్ట్యా = దైవవశము చేత, ప్రాప్తః అసి = వచ్చినావు

తా. శత్రుఘ్నుని మాటలు విని రాక్షసుడు పరిహాసపూర్వకముగా ఇట్లు పలికెను. "ఓ! దుర్మతీ! దైవవశముచేత వచ్చినావు". 13

మూ. మమ మాతృష్వసుర్భ్రాతా రావణో నామ రాక్షసః,
హతో రామేణ దుర్బుద్ధే స్త్రీహేతోః పురుషాధమ. 14

ప్ర. అ. దుర్బుద్ధే = చెడ్డ బుద్ధి కలవాడా! పురుషాధమ = పురుషులలో అధముడా, మమ = నాయొక్క, మాతృష్వసుః = తల్లి సోదరియొక్క, భ్రాతా = సోదరుడైన, రావణో నామ = రావణు డను, రాక్షసః = రాక్షసుడు, స్త్రీహేతోః = స్త్రీనిమిత్తమున, రామేణ = రామునిచేత, హతః = చంపబడినాడు.

తా. ఓ! దుర్బుద్ధీ! పురుషాధమా! నా తల్లి సోదరికి సోదరుడైన రావణు డను రాక్షసుణ్ణి రాముడు స్త్రీనిమిత్తమై చంపినాడు. 14

మూ. తచ్చ సర్వం మయా క్షాన్తం రావణస్య కులక్షయమ్,
అవజ్ఞాం పురతః కృత్వా మయా యూయం విశేషతః. 15

ప్ర అ. రావణస్య = రావణునియొక్క, తత్ = ఆ, సర్వమ్ = సమస్తమైన, కులక్షయమ్ = కులక్షయము, మయా = నాచేత, క్షాన్తమ్ = క్షమింపబడినది. అవజ్ఞామ్ = అనాదరమును, పురతః కృత్వా = ముందు ఉంచుకొని, యూయమ్ = మీరు, విశేషతః = విశేషించి, మయా = నాచేత క్షమించబడినారు.

తా. నేను ఆ రావణకులవినాశమును క్షమించితిని. ప్రధానముగా కేవలము అనాదరభావమునే పురస్కరించుకొని మిమ్ములనందరినీ క్షమించినాను. 15

మూ. నిహతాశ్చ హి మే సర్వే పరిభూతాస్తృణం యథా,
భూతాశ్చైవ భవిష్యాశ్చ యూయం చ పురుషాధమాః.16

ప్ర. అ. మే = నాకు, నిహతాః = చంపబడినవారు, భూతాః చ ఏవ = పూర్వము ఉన్నవాళ్ళు, భవిష్యాః చ = రాబోవువారు అయిన, పురుషాధమాః = పురుషాధములు, యూయం చ = మీరూ, సర్వే = అందరూ, తృణం యథా = గడ్డిపరక వలె, పరిభూతాః = తిరస్కరింపబడినారు.

తా. నేను చాలమందిని చంపివేసితిని. పురుషాధములైన పూర్వము ఉన్నవాళ్ళను, రాబోవువాళ్ళనూ, మిమ్ములనూ గడ్డిపరక వలె అనాదరము చేసితిని.

మూ. తస్య తే యుద్ధకామస్య యుద్ధం దాస్యామి దుర్మతే,
తిష్ఠ త్వం చ ముహూర్తం తు యావదాయుధమానయే.

ప్ర. అ. దుర్మతే = ఓ! దుర్మతీ! యుద్ధకామస్య = యుద్ధమునందు కోరికగల, తస్య తే = అట్టి నీకు, యుద్ధమ్ = యుద్ధమును, దాస్యామి = ఇచ్చెదను. యావత్ = ఎంతలో, ఆయుధమ్ = ఆయుధమును, ఆనయే = తీసికొనివచ్చెదనో అంతవరకు, త్వమ్ = నీవు, ముహూర్తమ్ = ముహూర్తకాలము, తిష్ఠ = నిండుము.

తా. దుర్మతీ! యుద్ధమును కోరుచున్న నీకు యుద్ధము నిచ్చెదను. నేను ఆయుధమును తెచ్చుకొనునంతవరకు క్షణకాలము ఆగుము. 17

మూ. ఈప్సితం యాదృశం తుభ్యం సజ్జయే యావదాయుధమ్,
తమువాచాశు శత్రుఘ్నః క్వ మే జీవన్ గమిష్యసి. 18

ప్ర. అ. తుభ్యమ్ = నీకొరకు, యాదృశమ్ = ఎట్టిది, ఈప్సితమ్ = ఇష్ట

మైనదో, ఆయుధమ్ = అట్టి ఆయుధమును, యావత్ సజ్జయే = సిద్ధముచేసెదను. శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, ఆశు = శీఘ్రముగా, తమ్ = అతనిని గూర్చి, ఉవాచ = పలికెను. మే = నానుండి, జీవన్ = జీవించుచు, క్వ = ఎక్కడికి, గమిష్యసి = వెళ్ళెదవు ?

తా. "నీకు తగిన ఆయుధమును సిద్ధముచేసికొనువరకు ఆగుము." వెంటనే శత్రుఘ్నుడు ఆతనితో ఇట్లనెను - "నేను ఉండగా ప్రాణాలతో ఎక్కడికి వెళ్ళెదవు ?" 18

మూ. స్వయమేవాగతః శత్రుర్న మోక్తవ్యః కృతాత్మనా,
యో హి విక్లవయా బుద్ధ్యా ప్రసరం శత్రవే దిశేత్, 19
స హతో మన్దబుద్ధిః స్యాద్యథా కాపురుష స్తథా.

ప్ర. అ. కృతాత్మనా = బుద్ధిమంతునిచేత, స్వయమేవ = స్వయముగానే, ఆగతః = వచ్చిన, శత్రుః = శత్రువు, న మోక్తవ్యః = విడవదగినవాడు కాదు. యః = ఎవడు, విక్లవయా = వ్యాకులమైన, బుద్ధ్యా = బుద్ధితో, శత్రవే = శత్రువునకు, ప్రసరమ్ = అవకాశమును, దిశేత్ = ఇచ్చునో, సః = ఆ, మన్దబుద్ధిః = మూఢుడు, కాపురుషః = నీచపురుషుడు, యథా = ఎట్లో, తథా = అట్లు, హతః = చంపబడినవాడు, స్యాత్ = అగును.

తా. స్వయముగా వచ్చిన శత్రువును బుద్ధిమంతుడు విడువగూడదు. తెలివితక్కువతనముచేత శత్రువుకు అవకాశమును ఇచ్చు మందబుద్ధి నీచుడు వలె చంపివేయబడును. 19

మూ. తస్మాత్సంవృష్టం కురు జీవలోకం
శరైః శితైస్త్వాం వివిధైర్నయామి,
యమస్య గేహాభిముఖం హి పాపం
రిపుం త్రిలోకస్య చ రాఘవస్య. 20

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఒష్టషష్టితమః సర్గః.

ప్ర. అ. తస్మాత్ = ఆ కారణమువలన, జీవలోకమ్ = ప్రాణిలోకమును,

సుదృష్టమ్ = బాగా చూడబడినదానినిగా, కురు = చేయుము. త్రిలోకస్య = మూడు లోకాలకు, రాఘవస్య చ = రామునకు, రిపుమ్ = శత్రువైన, పాపమ్ = పాపాత్ముడవైన, త్వామ్ = నిన్ను, శితైః = వాడియైన, వివిధైః = అనేకవిధములైన, శరైః = బాణములచేత, యమస్య = యమునియొక్క, గేహాభిముఖమ్ = గృహమునకు అభిముఖుణ్ణిగా, నయామి = తీసికొనివెళ్ళెదను.

తా. మూడు లోకాలకు, రామునికీ కూడ శత్రువు, పాపాత్ముడవూ అయిన నిన్ను అనేకవిధములైన వాడియైన బాణాలచేత యమలోకమువైపు పంపెదను. అందుచేత చివరిసారిగా ఈ జీవలోకమును చూచుకొనుము. 20

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో అరవై ఎనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనసప్తతితమః సర్గః

[శత్రుఘ్నలవణాసురుల యుద్ధము. లవణుని సంహారము.]

మూ. తచ్ఛ్రుత్వా భాషితం తస్య శత్రుఘ్నస్య మహాత్మనః,
క్రోధమాహారయత్తీవ్రం తిష్ఠ తిష్ఠేతి చాబ్రవీత్.

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన, తస్య శత్రుఘ్నస్య = ఆ శత్రుఘ్నునియొక్క, తత్ భాషితమ్ = ఆ మాటను, శ్రుత్వా = విని, తీవ్రమ్ = తీవ్రమైన, క్రోధమ్ = క్రోధమును, ఆహారయత్ = తెప్పించుకొనెను, తిష్ఠ తిష్ఠ ఇతి = నిలువుము నిలువుము అని, అబ్రవీత్ చ = పలికెను కూడ.

తా. లవణుడు మహాత్ముడైన శత్రుఘ్నుని మాటలు విని చాల కోపముతో "నిలుమము, నిలువుము"అని పలికెను. 1

మూ. పాణౌ పాణిం స నిష్పిష్య దన్తాన్ కటకటాయ్య చ,
లవణో రఘుశార్దూల మాహ్వాయామాస చాసకృత్. 2

ప్ర అ. సః = ఆ, లవణః = లవణుడు, పాణౌ = హస్తమునందు, పాణిమ్ = హస్తమును, నిష్పిష్య = గట్టిగా నలిపి, దన్తాన్ = దంతములను, కటకటాయ్య చ = కటకటలాడించి, అసకృత్ = మాటిమాటికి, రఘుశార్దూలమ్ = రఘువంశీయులలో శ్రేష్ఠుడైన శత్రుఘ్నుణ్ణి ఆహ్వాయత్ = పిలచెను.

తా. ఆ లవణుడు ఆరచేతితో ఆరచేతిని గట్టిగా నలుపుచు, పళ్ళు పటపటలాడించుచు, మాటిమాటికి శత్రుఘ్నుణ్ణి యుద్ధానికి ఆహ్వానించెను. 2

మూ. తం బ్రువాణం తథా వాక్యం లవణం మోరదర్శనమ్,
శత్రుమ్మో దేవశత్రుఘ్న ఇదం వచనమబ్రవీత్. 3

ప్ర. అ. తథా = అట్లు, వాక్యమ్ = వాక్యమును, బ్రువాణమ్ = పలుకు

చున్న, ఘోరదర్శనమ్ = ఘోరమైన చర్మనము గల, తం లవణమ్ = ఆ లవణుని గూర్చి, దేవశత్రుఘ్నః = రాక్షసులను సంహరించు, శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, ఇదమ్ = ఈ, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. ఈ విధముగా పలుకుచున్న, చూచుటకు భయంకరుడుగా ఉన్న ఆ లవణునితో రాక్షససంహారకుడైన శత్రుఘ్నుడు ఇట్లు పలికెను. 3

మూ. శత్రుఘ్నో న తదా జాతో యదాన్యే నిర్జితా స్త్వయా,
తదద్య బాణాభిహతో వ్రజ త్వం యమసాదనమ్. 4

ప్ర. అ. త్వయా = నీచేత, యదా = ఎప్పుడు, అన్యే = ఇతరులు, నిర్జితాః = జయింపబడినారో, తదా = అప్పుడు, శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, న జాతః = పుట్టలేదు. తత్ = ఆ కారణమువలన, త్వమ్ = నీవు, అద్య = ఇప్పుడు, బాణాభిహతః = బాణములచేత కొట్టబడినవాడవై, యమసాదనమ్ = యమలోకమును గూర్చి, వ్రజ = వెళ్ళుము.

తా. నీవు ఇతరులను జయించిననాటికి శత్రుఘ్నుడు పుట్టలేదు. అందుచేత బాణాల దెబ్బలు తిని యమలోకమునకు వెళ్ళుము. 4

మూ. ఋషయోఽప్యద్య పాపాత్మన్ మయా త్వాం నిహతం రణే,
పశ్యన్తు విప్రా విద్వాంస స్త్రిదశా ఇవ రావణమ్. 5

ప్ర. అ. పాపాత్మన్ = పాపాత్ముడా ! అద్య = ఇప్పుడు, మయా = నాచేత, రణే = యుద్ధమునందు, నిహతమ్ = చంపబడిన, త్వామ్ = నిన్ను, ఋషయః అపి = ఋషులూ, విప్రాః = బ్రాహ్మణులూ, విద్వాంసః = పండితులు, రావణమ్ = రావణుణ్ణి, త్రిదశాః ఇవ = దేవతలు వలె, పశ్యన్తు = చూచెదరుగాక.

తా. పాపాత్ముడా ! యుద్ధమునందు నాచేత చంపబడిన నిన్ను, రాముని చేత చంపబడిన రావణుణ్ణి దేవతలు చూచినట్లు ఋషులు, బ్రాహ్మణులు, విద్వాంసులు చూచెదరుగాక. 5

మూ. త్వయి మద్బాణనిర్దగ్ధే పతితేఽద్య నిశాచరే,
పురే జనపదే చాపి క్షేమమేవ భవిష్యతి. 6

ప్ర. అ నిశాచరే = రాక్షసుడవైన, త్వయి = నీపు, మద్బాణనిర్దగ్ధే=నా బాణముచేత కాల్చబడినవాడవై, అద్య = ఇప్పుడు, పతితే = పడినవాడవగు చుండగా, పురే=పురమునందు, జనపదే చాపి=జనపదమునందు కూడ, క్షేమమ్, ఏవ = క్షేమమే, భవిష్యతి = కాగలదు.

తా. నిశాచరుడవైన నీవు ఇప్పుడు నా బాణములచే దహింపబడి నేలమీద కూలగా పురమునందు, జనపదమునందు కూడ క్షేమమే కలుగును. 6

మూ. అద్య మద్బాహునిష్క్రాన్తః శరో వజ్రనిభాననః,
ప్రవేక్ష్యతే తే హృదయం పద్మమంశురివార్క-జః. 7

ప్ర. అ. అద్య = ఇప్పుడు, మద్బాహునిష్క్రాన్తః = నా బాహువునుండి బయల్వెడలిన, వజ్రనిభాననః = వజ్రమువంటి ముఖము గల, శరః = బాణము, అర్క-జః = సూర్యునినుండి బయల్వెడలిన, అంశుః = కిరణము, పద్మమ్ ఇవ= పద్మమును వలె, తే హృదయమ్ = నీ హృదయమును, ప్రవేక్ష్యతే = ప్రవేశించ గలదు.

తా. నా బాహువునుండి బయల్వెడలిన వజ్రము వంటి అగ్రభాగము గల బాణము, సూర్యునినుండి బయల్వెడలిన కిరణము పద్మములో ప్రవేశించి నట్లు, నీ హృదయములో ప్రవేశించును. 7

మూ. ఏవముక్తో మహావృక్షం లవణః క్రోధమూర్ఛితః,
శత్రుఘ్నోరసి చిక్షేప స చ తం శతధాచ్ఛినత్. 8

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, లవణః = లవణుడు, క్రోధమూర్ఛితః = కోపావిష్టుడై, మహావృక్షమ్ = మహావృక్షమును, శత్రుఘ్నోరసి = శత్రుఘ్నుని వక్షఃస్థలమునందు, చిక్షేప=విసిరెను. సః చ=అతడు, తమ్= దానిని, శతధా = నూరు ముక్కలుగా, అచ్ఛినత్ = ఛేదించెను.

తా. లవణుడు ఆ మాటలు విని కోపావిష్టుడై ఒక పెద్దచెట్టును శత్రుఘ్నుని వక్షఃస్థలముమీద పడవేసెను. ఆతడు దానిని నూరుముక్కలుగా ఛేదించెను. 8

మూ. తద్దృష్ట్వా విఫలం కర్మ రాక్షసః పునరేవ తు,
పాదపాన్ సుబహూన్ గృహ్య శత్రుఘ్నాయాసృజద్భువి. 9

ప్ర. ఆ. బలీ = బలవంతుడైన, రాక్షసః = రాక్షసుడు, తత్ కర్మ = ఆ పనిని, విఫలమ్ = విఫలమైనదానినిగా, దృష్ట్వా = చూచి, సుబహూన్ = చాల అధికమైన, పాదపాన్ = వృక్షములను, గృహ్య = గ్రహించి, శత్రుఘ్నాయ = శత్రుఘ్నుని కొరకు, అసృజత్ = విడచెను.

తా బలవంతుడైన ఆ రాక్షసుడు ఆ కర్మ వ్యర్థ మగుట చూచి, మరల అనేకవృక్షములను గ్రహించి శత్రుఘ్నునిమీదికి విసిరెను. 9

మూ. శత్రుఘ్నశ్చాపి తేజస్వీ వృక్షానాపతతో బహూన్,
త్రిభిశ్చతుర్భి రేకైకం చిచ్ఛేద నతపర్వభిః. 10

ప్ర. అ. తేజస్వీ = తేజస్సు కల, శత్రుఘ్నః చ అపి = శత్రుఘ్నుడు కూడ, ఆపతతః = వచ్చి మీదపడుచున్న, బహూన్ = అనేకమైన, వృక్షాన్ = వృక్షములను, ఏకైకమ్ = ఒక్కొక్కదానిని, త్రిభిః = మూడింటి చేతను, చతుర్భిః = నాల్గింటిచేతను; నతపర్వభిః = వంగిన కణుపులు గల బాణములచేత, చిచ్ఛేద = ఛేదించెను.

తా. తేజస్సు గల శత్రుఘ్నుడు కూడ వచ్చి మీద పడుచున్న అనేకములైన ఆ చెట్లను, ఒక్కొక్కదానిని మూడు బాణాలచేత, నాలుగు బాణాలచేత ఛేదించెను. 10

మూ. తతో బాణమయం వర్షం వ్యసృజద్రాక్షసోపరి,
శత్రుఘ్నో వీర్యసంపన్నో వివ్యథే న స రాక్షసః. 11

ప్ర అ. తతః = అటుపిమ్మట, వీర్యసంపన్నః = పరాక్రమసంపన్నుడైన, శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, రాక్షసోపరి = రాక్షసునిమీద, బాణమయమ్ = బాణమయమైన, వర్షమ్ = వర్షమును, వ్యసృజత్ = విడచెను. సః రాక్షసః = రాక్షసుడు, న విద్యతే = వ్యథ చెందలేదు.

తా. పరాక్రమసంపన్నుడైన శత్రుఘ్నుడు రాక్షసుని మీద బాణవర్షమును కురిపించెను. కాని ఆ రాక్షసుడు ఏమాత్రము వ్యధ చెందలేదు. 11

మూ. తతః ప్రహస్య లవణో వృక్షముద్యమ్య వీర్యవాన్,
శిరస్యభ్యహనచ్ఛూరం ప్రస్రస్తాఙ్గః స ముమోహ వై. 12

ప్ర. అ. తతః = అటుపిమ్మట, వీర్యవాన్ = వీర్యవంతుడైన, లవణః = లవణుడు, ప్రహస్య = నవ్వి, వృక్షమ్ = వృక్షమును, ఉద్యమ్య = ఎత్తి, శూరమ్ = శూరుడైన శత్రుఘ్నుణ్ణి, శిరసి = తలమీద, అభ్యహనత్ = కొట్టెను. సః = అతడు, ప్రస్రస్తాఙ్గః = జారిపోయిన అవయవములు కలవాడై, ముమోహ వై = మోహము చెందెను.

తా పిమ్మట పరాక్రమవంతుడైన లవణుడు అట్టహాసము చేయుచు చెట్టు ఎత్తి శత్రుఘ్నుని తలమీద కొట్టెను. అప్పుడు అతడు అవయవములు జారవిడచి మోహము చెందెను. 12

మూ. తస్మిన్నిపతితే వీరే హాహాకారో మహానభూత్,
ఋషీణాం దేవసంఘానాం గన్ధర్వాప్సరసాం తథా. 13

ప్ర. అ. వీరే = వీరుడైన, తస్మిన్ = అతడు, నిపతితే = పడినవాడగు చుండగా, ఋషీణామ్ = ఋషులయొక్క, దేవసంఘానామ్ = దేవతాసంఘముల యొక్క, తథా = మరియు, గన్ధర్వాప్సరసామ్ = గంధర్వులయొక్క, అప్సరసల యొక్క, మహాన్ = గొప్ప, హాహాకారః = హాహాకారము, అభూత్ = అయెను.

తా. వీరుడైన ఆ శత్రుఘ్నుడు పడిపోగానే ఋషులు, దేవసంఘములు, గంధర్వులు, అప్సరసలు హాహాకారము చేసిరి. 13

మూ. తమవజ్ఞాయ తు హతం శత్రుఘ్నం భువి పాతితమ్,
రక్షో లబ్ధాన్తరమపి న వివేశ స్వమాలయమ్.

ప్ర. అ. రక్షః = రాక్షసుడు, హతమ్ = కొట్టబడిన, భువి = నేలమీద, పాతితమ్ = పడగొట్టబడిన, తం శత్రుఘ్నమ్ = ఆ శత్రుఘ్నుణ్ణి, అవజ్ఞాయ = అనాదరము చేసి, లబ్ధాన్తరమ్ అపి = పొందబడిన అవకాశము కలవాడైనను, స్వమ్ = తన సంబంధమైన, ఆలయమ్ = గృహమును, న వివేశ = ప్రవేశించ లేదు.

తా. దెబ్బతిని నేలమీద పడిపోయిన ఆ శత్రుఘ్నుని విషయమున అనాదరభావముచేత, ఇంటిలోనికి వెళ్ళుటకు అవకాశము దొరికినను ఆ రాక్షసుడు వెళ్ళలేదు. 14

మూ. నాపి శూలం ప్రజగ్రాహ తం దృష్ట్వా భువి పాతితమ్,
తతో హత ఇతి జ్ఞాత్వా తాన్ భక్షాన్ సముదావహత్.15

ప్ర. అ. భువి = నేలమీద, పాతితమ్ = పడగొట్టబడిన, తమ్ = అతనిని, దృష్ట్వా = చూచి, శూలమ్ = శూలమును, న ప్రజగ్రాహ అపి = గ్రహించలేదు. తతః = అటు పిమ్మట, హతః ఇతి = చంపబడినాడు అని, జ్ఞాత్వా = తెలిసికొని, తాన్ = ఆ, భక్షాన్ = తినవలసిన మృగాదులను, సముదావహత్ = పైకి ఎత్తికొనెను.

తా. అతడు నేలమీద పడిపోయినట్లు చూచి కూడ ఆ రాక్షసుడు శూలమును తీసికొనలేదు. అతడు మరణించినా డని అనుకొని ఆహారముకొరకై తెచ్చిన ఆ మృగాదులను పైకి ఎత్తికొనెను. 15

మూ. ముహూర్తాల్లబ్ధసంజ్ఞస్తు పున స్తస్థౌ ధృతాయుధః,
శత్రుఘ్నో వై పురద్వారి ఋషిభిః సంప్రపూజితః. 16

ప్ర. అ. శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, ముహూర్తాత్ = ముహూర్తకాలము వలన, లబ్ధసంజ్ఞః = పొందబడిన సంజ్ఞ కలవాడై, ఋషిభిః = ఋషులచేత, సంప్రపూజితః = పూజింపబడినవాడై, పునః = మరల, ధృతాయుధః = ధరించబడిన ఆయుధము కలవాడై, పురద్వారి = పట్టణద్వారమునందు, తస్థౌ = నిలబడెను.

తా. శత్రుఘ్నుడు ముహూర్తకాలములో స్పృహ పొంది, ఋషులచేత పూజింపబడుచు, ఆయుధములు ధరించి మరల పురద్వారమునందు నిలబడెను.16

మూ. తతో దివ్యమమోఘం తం జగ్రాహ శరముత్తమమ్,
జ్వలన్తం తేజసా ఘోరం పూరయన్తం దిశో దశ. 17

వజ్రాననం వజ్రవేగం మేరుమన్దరసంనిభమ్,
నతం పర్వసు సర్వేషు సంయుగేష్వపరాజితమ్. 18

అసృక్చన్దనదిగ్ధాఙ్గం చారుపత్రం పతత్రిణమ్,
దానవేన్ద్రాచలేన్ద్రాణామసురాణాం చ దారణమ్. 18

ప్ర. అ. తతః = అటుపిమ్మట, దివ్యమ్ = దివ్యమూ, అమోఘమ్ = వ్యర్థము కానిది, ఘోరమ్ = భయంకరము, తేజసా = తేజస్సుతో, జ్వలన్తమ్ =

మండుచున్నది, దశ దిశః = పది దిక్కులను, పూరయన్తమ్ = నింపుచున్నది, వజ్రాననమ్ = వజ్రమువంటి అగ్రభాగము గలది, వజ్రవేగమ్ = పిడుగు వంటి వేగము గలది, మేరుమన్దరసంనిభమ్ = మేరుమందరపర్వతములతో సమానము, సర్వేషు = సమస్తమైన, పర్వసు = కణుపులయందు, అపరాజితమ్ = ఓడింపబడనిది, అస్రక్చన్దనదిగ్ధాఙ్గమ్ = రక్తమనే చందనముచేత పూయబడిన శరీరము గలది, చారుపత్రమ్ = అందమైన రెక్కలు గలది, పతత్రిణమ్ = పక్షివలె ప్రయాణము చేయునది, దానవేన్ద్రాచలేన్ద్రాణామ్ = దానవేంద్రులకు పర్వతములకు, అసురాణాం చ = రాక్షసులకు, దారణమ్ = చీల్చివేయునది అయిన, ఉత్తమమ్ = ఉత్తమమైన, తం శరమ్ = ఆ బాణమును, జగ్రాహ = గ్రహించెను.

తా. పిమ్మట శత్రుఘ్నుడు దివ్యమూ, అమోఘమూ అయిన ఆ ఉత్తమమైన శరమును బైటకు తీసెను. తేజస్సుతో మండుచున్న భయంకరమైన ఆ బాణము తేజస్సుతో పది దిక్కులను నింపుచుండెను. వజ్రమువంటి వేగము, పిడుగు వంటి వేగము గల, మేరుమందరపర్వతములతో సమానమైన ఆ శరము అన్ని కణుపులయందూ కూడ వంగి ఉండెను. యుద్ధములలో ఎన్నడూ ఓటమి ఎరగని ఆ బాణము రక్తమనే చందనముచే పూయబడి, అందమైన రెక్కలతో పక్షి వలె ఉండెను. ఇది దానవనాయకులను, పర్వతములను, అసురులను కూడ చీల్చివేసినది. 17.19

మూ. తం దీప్తమివ కాలాగ్నిం యుగాన్తే సముపస్థితమ్,
దృష్ట్వా సర్వాణి భూతాని పరిత్రాసముపాగమన్. 20

ప్ర. అ. యుగాన్తే = ప్రలయకాలమునందు, సముపస్థితమ్ = వచ్చిన, దీప్తమ్ = ప్రజ్వలించుచున్న, కాలాగ్నిమ్ ఇవ = ప్రలయకాలాగ్ని వలె ఉన్న, తమ్ = దానిని, దృష్ట్వా = చూచి, సర్వాణి = సమస్తమైన, భూతాని = భూతములు, పరిత్రాసమ్ = భయమును, ఉపాగమన్ = పొందినవి.

తా. హఠాత్తుగా వచ్చిన ప్రలయకాలాగ్ని వలె మండుచున్న ఆ బాణమును చూచి అన్ని ప్రాణులు భయపడినవి. 20

మూ. సదేవాసురగన్ధర్వం మునిభిః సాప్సరోగణమ్,
జగద్ది సర్వమస్వస్థం పితామహముపస్థితమ్. 21

ప్ర. అ సదేవాసురగన్ధర్వమ్= దేవ-అసుర-గంధర్వులతో కూడిన, సాప్స రోగణమ్=అప్సరఃస్త్రీగణములతో కూడిన, సర్వమ్=సమస్తమైన, జగత్=జగత్తు, అస్వస్థమ్ = అస్వస్థమై, మునిభిః = మునులతో, పితామహమ్ = బ్రహ్మదేవుణ్ణి, ఉపస్థితమ్ = పొందినది.

తా. అపుడు జగత్తు అంతా అస్వస్థమై బ్రహ్మదేవునివద్దకు వెళ్లెను. దేవతలు, అసురులు, గంధర్వులు, మునులు, అప్సరఃస్త్రీలు అందరూ కూడ భయము చెందిరి. 21

మూ. ఊచుశ్చ దేవదేవేశం వరదం ప్రపితామహమ్,
దేవానాం భయసంమోహో లోకానాం సంక్షయం ప్రతి.

ప్ర. ఆ. లోకానామ్=లోకములయొక్క, సంక్షయం ప్రతి = వినాశమును గూర్చి, దేవానామ్ = దేవతలకు. భయసంమోహః = భయము సంమోహము కలిగెను. దేవదేవేశమ్=దేవదేవుడు ప్రభువు అయిన, వరదమ్ = వరముల నిచ్చు, ప్రపితామహమ్ = బ్రహ్మదేవుణ్ణి గూర్చి, ఊచుః చ = పలికిరి.

తా. లోకములు నశించునేమో అని దేవతలకు భయము, మోహము కలిగెను. దేవదేవుడు, సర్వసమర్థుడు, వరములను ఇచ్చువాడూ అయిన బ్రహ్మ దేవునితో ఇట్లు పలికిరి. 22

మూ. కచ్చిల్లోకక్షయో దేవ సంప్రాప్తో వా యుగక్షయః,
నేదృశం దృష్టపూర్వం చ న శ్రుతం ప్రపితామహ. 23

ప్ర. ఆ. ప్రపితామహ = ప్రపితామహా! లోకక్షయః = లోకనాశము గాని, యుగక్షయః వా = ప్రలయము గాని, సంప్రాప్తః కచ్చిత్ = వచ్చినదా? ఈదృశమ్ = ఇట్టిది, దృష్టపూర్వమ్ = పూర్వము చూడబడినది, న = కాదు. న శ్రుతమ్ = వినబడలేదు.

తా. పితామహా ! లోకవినాశము గాని మహాప్రళయము గాని వచ్చినదా ? ఇట్టిదానిని పూర్వ మెన్నడూ చూడలేదు, వినలేదు. 23

మూ. తేషాం తద్వచనం శ్రుత్వా బ్రహ్మా లోకపితామహః,
భయకారణమాచష్ట దేవానామభయంకరః. 24

ప్ర. అ. తేషామ్=వారియొక్క, తత్ వచనమ్=ఆ వచనమును, శ్రుత్వా =విని, లోకపితామహఃలోకములకు పితామహుడైన, అభయంకరః = అభయమును ఇచ్చు, బ్రహ్మా = బ్రహ్మ. దేవానామ్ = దేవతలకు, భయకారణమ్ = ఆ భయకారణమును, ఆచష్ట = చెప్పెను.

తా. లోకములకు పితామహుడు, అభయప్రదుడూ అయిన బ్రహ్మదేవుడు వాళ్ళ మాటలు విని ఈ భయమునకు ఏది కారణమో దేవతలకు చెప్పెను. 24

మూ. ఉవాచ మధురాం వాణీం శృణుధ్వం సర్వదేవతాః,
వధాయ లవణస్యాజౌ శరః శత్రుఘ్నధారితః. 25

ప్ర. అ. మధురామ్ = మధురమైన, వాణీమ్ = వాక్కును, ఉవాచ = పలికెను. సర్వదేవతాః = సమస్తదేవతలారా! శృణుధ్వమ్=వినండి. లవణస్య = లవణునియొక్క, వధాయ = వధకొరకు, ఆజౌ = యుద్ధమునందు, శరః = బాణము, శత్రుఘ్నధారితః = శత్రుఘ్నునిచేత ధరించబడినది.

తా. మధురమైన వాక్కును పలికెను-"సకలదేవతలారా! వినండి. లవణుని చంపుటకై శత్రుఘ్నుడు యుద్ధములో బాణమును ధరించినాడు". 25

మూ. తేజసా తస్య సంమూఢాః సర్వే స్మః సురసత్తమాః,
ఏష పూర్వస్య దేవస్య లోకకర్తుః సనాతనః, 26
శరస్తేజోమయో వత్సా యేన వై భయమాగతమ్.

ప్ర. అ. సురసత్తమాః = దేవతాశ్రేష్ఠులారా! సర్వే = మన మందరమూ, తస్య = దానియొక్క, తేజసా = తేజస్సుచేత, సంమూఢాః = మూఢులమైతిమి. వత్సాః = వత్సలారా! సనాతనః=ప్రాచీనమైన, ఏషః = ఇది, లోకకర్తుః = లోకముల నిర్మాత అయిన, పూర్వస్య = సనాతనుడైన, దేవస్య = దేవునియొక్క, తేజోమయః = తేజఃస్వరూపమైన, శరః = బాణము, యేన = దేనిచేత, భయమ్= భయము, ఆగతమ్ = వచ్చినదో.

తా. దేవతాశ్రేష్ఠులారా! మనము అందరమూ దీని తేజస్సుచేత ఏమీ తోచకుండ ఉన్నాము. వత్సలారా! అతిసనాతనమైన ఈ బాణము తేజఃస్వరూపమైనది.

లోకములను సృజించిన పురాణపురుషోత్తముడైన మహావిష్ణువు బాణము. దీనిచేతనే భయము ఏర్పడినది. 26

మూ. ఏష వై కైటభస్యార్థే మధునశ్చ మహాశరః, 27
సృష్టో మహాత్మనా తేన వధార్థే దైత్యయోస్తయోః.

ప్ర. అ. ఏషః మహాశరః = ఈ గొప్ప బాణము, కైటభస్య అర్థే = కైటభుని కొరకు, మధునః చ = మధువుకొరకు, తయోః దైత్యయోః = ఆ దైత్యులయొక్క, వధార్థే = వధకొరకై, తేన మహాత్మనా = ఆ మహాత్మునిచేత, సృష్టః = సృజింపబడినది.

తా. మహాత్ముడైన ఆ శ్రీమహావిష్ణువు మధుకైటభు లను ఇద్దరు దానవులను వధించుటకై ఈ గొప్ప బాణమును సృజించినాడు. 27

మూ. ఏక ఏవ ప్రజానాతి విష్ణుస్తేజోమయం శరమ్, 28
ఏషా ఏవ తనుః పూర్వా విష్ణోస్తస్య మహాత్మనః.

ప్ర. అ. తేజోమయమ్ = తేజోవికారమైన, శరమ్ = ఈ శరమును గూర్చి, ఏకః = ఒక్క, విష్ణుః ఏవ = విష్ణువు మాత్రమే, ప్రజానాతి = ఎరుగును. ఏషా = ఇది, మహాత్మనః = మహాత్ముడైన, తస్య = ఆ, విష్ణోః ఏవ = విష్ణువుయొక్కయే, పూర్వా = ప్రాచీనమైన, తనుః = శరీరము.

తా. తేజోమయమైన ఈ శరమును గూర్చి పూర్తిగా తెలిసినవాడు ఆ విష్ణువు ఒక్కడే. ఇది మహాత్ముడైన ఆ విష్ణువుయొక్క ప్రాచీనమైన రూపమే. 28

మూ. ఇతో గచ్ఛత పశ్యధ్వం వధ్యమానం మహాత్మనా, 29
రామానుజేన వీరేణ లవణం రాక్షసోత్తమమ్

ప్ర. అ. ఇతః = ఇక్కడినుండి, గచ్ఛత = వెళ్ళండి. మహాత్మనా = మహాత్ముడైన, వీరేణ = వీరుడైన, రామానుజేన = శత్రుఘ్నునిచేత. వధ్యమానమ్ = చంపబడుచున్న, రాక్షసోత్తమమ్ = రాక్షసులో ఉత్తముడైన, లవణమ్ = లవణుణ్ణి, పశ్యధ్వమ్ = చూడండి.

తా. ఇక్కడినుంచి వెళ్ళి మహాత్ముడూ వీరుడూ అయిన శత్రుఘ్నునిచేత చంపబడుచున్న రాక్షసోత్తముడైన లవణాసురుణ్ణి చూడండి. 29

మూ. తస్య తే దేవదేవస్య నిశమ్య వచనం సురాః, 30
ఆజగ్ముర్యత్ర యుధ్యేతే శత్రుఘ్నలవణావుభౌ

ప్ర. అ. తే సురాః = ఆ దేవతలు, తస్య దేవదేవస్య = ఆ బ్రహ్మదేవుని యొక్క, వచనమ్ = వచనమును, నిశమ్య = విని, శత్రుఘ్నలవణౌ = శత్రుఘ్న లవణులు, ఉభౌ = ఇద్దరూ, యత్ర = ఎక్కడ, యుధ్యేతే = యుద్ధము చేయు చున్నారో అచటికి. ఆజగ్ముః = వచ్చిరి.

తా. దేవతలు బ్రహ్మదేవుని మాటలు విని శత్రుఘ్నలవణులు యుద్ధము చేయుచున్న ప్రదేశమునకు వచ్చిరి. 30

మూ. తం శరం దివ్యసంకాశం శత్రుఘ్నకరధారితమ్, 31
దదృశుః సర్వభూతాని యుగాన్తాగ్నిమివోదితమ్.

ప్ర. అ. సర్వభూతాని = సమస్తభూతములు, దివ్యసంకాశమ్ = దివ్యమైన, శత్రుఘ్నకరధారితమ్ = శత్రుఘ్నుని కరమునందు ధరించబడిన, ఉదితమ్ = బయలుదేరిన, యుగాన్తాగ్నిమ్ ఇవ = ప్రలయకాలాగ్ని వలె ఉన్న, తం శరమ్ = ఆ శరమును, దదృశుః = చూచినవి.

తా. బయలుదేరిన ప్రలయకాలాగ్ని వలె ఉన్న, శత్రుఘ్నుని చేతిలోని ఆ దివ్యమైన శరమును అన్ని భూతములు చూచెను. 31

మూ. ఆకాశమావృతం దృష్ట్వా దేవైర్హి రఘునన్దనః, 32
సింహనాదం భృశం కృత్వా దదర్శ లవణం పునః.

ప్ర. అ. రఘునన్దనః = శత్రుఘ్నుడు, దేవైః = దేవతలచేత, ఆవృతమ్ = కప్పబడిన, ఆకాశమ్ = ఆకాశమును, దృష్ట్వా = చూచి, భృశమ్ = మిక్కిలి, సింహనాదమ్ = సింహనాదమును, కృత్వా = చేసి, పునః = మరల, లవణమ్ = లవణాసురుణ్ణి, దదర్శ = చూచెను.

తా. శత్రుఘ్నుడు ఆకాశము నంతా దేవతలు ఆవరించి ఉండుట చూచి, బిగ్గరగా సింహనాదము చేసి, మరల లవణుని వైపు చూచెను. 32

మూ. ఆహూతశ్చ పునస్తేన శత్రుఘ్నేన మహాత్మనా, 33
లవణః క్రోధసంయుక్తో యుద్ధాయ సముపస్థితః.

ప్ర. అ. మహాత్మనా = మహాత్ముడైన, తేన శత్రుఘ్నేన = ఆ శత్రుఘ్ను నిచేత, పునః = మరల, ఆహూతః = పిలవబడిన, లవణః = లవణుడు, క్రోధ సంయుక్తః = క్రోధముతో కూడినవాడై, యుద్ధాయ = యుద్ధముకొరకు, సముప స్థితః = వచ్చినాడు.

తా. మహాత్ముడైన శత్రుఘ్నునిచేత మరల యుద్ధానికై పిలవబడిన లవణుడు కోపముతో కూడినవాడై యుద్ధమునకు వచ్చెను. 33

మూ. ఆకర్ణాత్స వికృష్యాథ తద్ధనుర్ధన్వినాం వరః, 34
స ముమోచ మహాబాణం లవణస్య మహోరసి.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, ధన్వినామ్ = ధనుర్ధరులలో, వరః = శ్రేష్ఠుడైన, సః = ప్రసిద్ధుడైన, సః = ఆతడు, తత్ ధనుః = ఆ ధనస్సును, ఆకర్ణాత్ = చెవివరకు, ఆకృష్య = లాగి, మహాబాణమ్ = గొప్పబాణమును, లవణస్య = లవణునియొక్క, మహోరసి = గొప్ప వక్షఃస్థలమునందు, ముమోచ = విడచెను.

తా. పిమ్మట ధనుర్ధరులలో శ్రేష్ఠుడైన ఆ శత్రుఘ్నుడు ధనస్సును ఆకర్ణాంతము లాగి ఆ గొప్ప బాణమును లవణుని విశాలవక్షఃస్థలముమీద విడచెను.

మూ. ఉరస్తస్య విదార్యాశు ప్రవివేశ రసాతలమ్, 35
గత్వా రసాతలం దివ్యః శరో విబుధపూజితః,
పునరేవాగమత్తూర్ణమిక్ష్వాకుకులనన్దనమ్. 36

ప్ర. అ. విబుధపూజితః = దేవతలచేత పూజింపబడిన, దివ్యః శరః = దివ్యమైన ఆ బాణము, ఆశు = శీఘ్రముగా, తస్య = వానియొక్క, ఉరః = వక్షఃస్థలమును, విదార్య = చీల్చి, రసాతలమ్ = పాతాలమును, ప్రవివేశ = ప్రవేశించెను. రసాతలమ్ = రసాతలమును గూర్చి, గత్వా = వెళ్ళి, పునః ఏవ = మరల, తూర్ణమ్ = శీఘ్రముగా, ఇక్ష్వాకుకులనన్దనమ్ = శత్రుఘ్నుని గూర్చి, ఆగమత్ = వచ్చెను.

తా. దేవతలచేత పూజింపబడిన ఆ దివ్యమైన శరము వాని వక్షఃస్థలమును చీల్చి, రసాతలములో ప్రవేశించి మరల శీఘ్రముగా శత్రుఘ్నుని చేరెను. 35,36

మూ. శత్రుఘ్నశరనిర్భిన్నో లవణః స నిశాచరః,
పపాత సహసా భూమౌ వజ్రాహత ఇవాచలః. 37

ప్ర. అ. నిశాచరః = రాక్షసుడైన, సః లవణః = ఆ లవణుడు, శత్రుఘ్న శరనిర్భిన్నః = శత్రుఘ్నుని శరముచేత బ్రద్దలుకొట్టబడినవాడై, వజ్రాహతః = వజ్రముచేత కొట్టబడిన, ఆచలః ఇవ = పర్వతము వలె, సహసా = వెంటనే, భూమౌ = నేలమీద, పపాత = పడెను.

తా. శత్రుఘ్నుని బాణముచేత బ్రద్దలైపోయిన ఆ లవణాసురుడు వజ్రము చేత కొట్టబడిన పర్వతము వలె నేలపై కూలెను. 37

మూ. తచ్చ శూలం మహద్దివ్యం హతే లవణరాక్షసే,
పశ్యతాం సర్వదేవానాం రుద్రస్య వశమన్వగాత్. 38

ప్ర. అ. లవణరాక్షసే = లవణాసురుడు, హతే = చంపబడినవాడగు చుండగా, దివ్యమ్ = దివ్యమైన, మహత్ = గొప్పదైన, తత్ = ఆ, శూలమ్ = శూలము, సర్వదేవానామ్ = సమస్తదేవతలు, పశ్యతామ్ = చూచుచుండగా, రుద్రస్య = రుద్రునియొక్క, వశమ్ = వశమును, అన్వగాత్ = పొందెను.

తా. లవణాసురుడు మరణించగానే దివ్యమైన ఆ గొప్ప శూలము, సకల దేవతలు చూచుచుండగా రుద్రునికి వశ మయ్యెను. 38

మూ. ఏకేషుపాతేన భయం నిపాత్య
లోకత్రయస్యాస్య రఘుప్రవీరః,
వినిర్బభావుత్తమచాపబాణ
స్తమః ప్రణుద్యేవ సహస్రరశ్మిః. 39

ప్ర. అ. ఉత్తమచాపబాణః = ఉత్తమములైన ధనస్సూ బాణములూ గల, రఘుప్రవీరః = శత్రుఘ్నుడు, ఏకేషుపాతేన = ఒక్క బాణముయొక్క పాతము చేత, అస్య లోకస్య = ఈ లోకముయొక్క, భయమ్ = భయమును, నిపాత్య = పడగొట్టి, తమః = చీకటిని, ప్రణుద్య = తొలగించి, సహస్రరశ్మిః ఇవ = సూర్యుడు వలె, వినిర్బభౌ = ప్రకాశించెను.

తా. ఉత్తమములైన ధనుర్బాణములు గల శత్రుఘ్నుడు ఒక బాణమును ప్రయోగించుటచే మూడు లోకముల భయమును తొలగించి చీకటిని తొలగించిన సూర్యుడు వలె ప్రకాశించెను. 39

మూ. తతో హి దేవా ఋషిపన్నగాశ్చ
ప్రపూజిరే హ్యప్సరసశ్చ సర్వాః,
దిష్ట్యా జయో దాశరథేరవాప్త
స్త్యక్త్వా భయం సర్వ ఇవ ప్రశాన్తః. 40

ఇత్యార్షే శ్రీమదార్ష్యామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకోనసప్తతితమః సర్గః.

ప్ర. అ. "దిష్ట్యా జయో దాశరథే తవాద్య
దిష్ట్యా చ లోకాః సకలాః ప్రసన్నాః"

అను ప్రాచ్యపాఠము బాగున్నది. తతః = అటుపిమ్మట, దేవాః = దేవతలు, ఋషి పన్నగాః = ఋషుల పన్నగులు, సర్వాః = సమస్తమైన, అప్సరసః చ = అప్సరః స్త్రీలు, దాశరథే = శత్రుఘ్న ! అద్య = ఇప్పుడు, దిష్ట్యా = అదృష్టవశముచేత, తవ = నీకు, జయః = జయము లభించినది. దిష్ట్యా = అదృష్టవశముచేత, సకలాః = సమస్తమైన, లోకాః = లోకములు, ప్రసన్నాః = ప్రసన్నమైనవి అని, ప్రపూజిరే = పూజించిరి.

తా. అప్పుడు దేవతలు, ఋషులు, పన్నగములు, అప్సరస లందరు– "శత్రుఘ్న ! అదృష్టవశముచేత ఇప్పుడు జయము పొందినావు; అదృష్టవశము చేత అన్ని లోకాలూ కూడ ప్రసన్నము లైనవి" అని పలుకుచు శత్రుఘ్నుణ్ణి పూజించిరి. 40

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో ఆరవై తొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ సప్తతితమః సర్గః

[శత్రుఘ్నుడు దేవతలనుండి వరములను పొందుట. మధుపురిని నిర్మించి పిదప రామునివద్దకు వెళ్ళవలె నని ఆతడు సంకల్పించుట].

మూ. హతే తు లవణే దేవాః సేన్ద్రాగ్నిః సాగ్నిపురోగమాః,
ఊచుః సుమధురాం వాణీం శత్రుఘ్నం శత్రుతాపనమ్. 1

ప్ర. అ. లవణే=లవణుడు, హతే = చంపబడినవాడగుచుండగా, సేన్ద్రాగ్నిః = ఇంద్రునితో కూడిన, సాగ్నిపురోగమాః = అగ్ని ముందు ఉన్నవాడుగా గల, దేవాః = దేవతలు, శత్రుతాపనమ్ = శత్రువులను పీడించు, శత్రుఘ్నమ్ = శత్రుఘ్నుని గూర్చి, సుమధురామ్ = చాల మధురమైన, వాణీమ్ = వాక్కును, ఊచుః = పలికిరి.

తా. లవణుడు చంపబడిన పిమ్మట ఇంద్రుడు, అగ్ని మొదలైన దేవతలు శత్రుసంహారకుడైన శత్రుఘ్నునితో చాల మధురమైన వాక్యమును పలికిరి. 1

మూ. దిష్ట్యా తే విజయో వత్స దిష్ట్యా లవణరాక్షసః,
హతః పురుషశార్దూల వరం వరయ సువ్రత. 2

ప్ర. అ. వత్స=వత్సా! దిష్ట్యా=అదృష్టవశముచేత. తే=నీకు, విజయః = విజయము లభించినది. దిష్ట్యా = అదృష్టవశముచేత, లవణరాక్షసః = లవణాసురుడు, హతః = చంపబడినాడు. పురుషశార్దూల = పురుషశ్రేష్ఠుడా! సువ్రత= మంచి నియమములు కలవాడా! వరమ్ = వరమును, వరయ = కోరుకొనుము.

తా. వత్సా! అదృష్టవశముచేత నీవు విజయవంతుడవు అయినావు. అదృష్టవశముచేత లవణుడు చంపబడినాడు. పురుషశ్రేష్ఠుడా! మంచి నియమములు కలవాడా! వరము కోరుకొనుము. 2

మూ. వరదాస్తు మహాబాహో సర్వ ఏవ సమాగతాః,
విజయాకాఙ్క్షిణస్తుభ్యమమోఘం దర్శనం హి నః. 3

ప్ర. అ. మహాబాహో = మహాబాహూ! తుభ్యమ్ = నీకొరకు, విజయకాఙ్క్షిణః = విజయమును కోరిన, సర్వే ఏవ = మేమందరమూ, వరదాః = వరమును ఇచ్చువారమై, సమాగతాః = వచ్చినాము. నః = మాయొక్క, దర్శనమ్ = దర్శనము, అమోఘం హి = వ్యర్థము కానిది కదా?

తా. మహాబాహూ! నీకు విజయము రావలె నను కోరిక గల మేము అందరమూ నీకు వరములను ఇచ్చుటకై వచ్చినాము. మా దర్శనము వ్యర్థముకాదు కదా? 3

మూ. దేవానాం భాషితం శ్రుత్వా శూరో మూర్ధ్ని కృతాఞ్జలిః,
ప్రత్యువాచ మహాబాహుః శత్రుఘ్నః ప్రయతాత్మవాన్. 4

ప్ర. అ. శూరః = శూరుడు, మహాబాహుః = గొప్ప బాహువులు కలవాడు, ప్రయతాత్మవాన్ = నిగ్రహించబడిన మనస్సు కలవాడూ అయిన, శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, దేవానామ్ = దేవతలయొక్క, భాషితమ్ = మాటను, శ్రుత్వా = విని, మూర్ధ్ని = శిరస్సుపైన, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి కలవాడై, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. శూరుడు, మహాబాహువు, మనోనిగ్రహవంతుడూ అయిన శత్రుఘ్నుడు దేవతల మాటలు విని శిరస్సుపై అంజలి ఘటించి ఇట్లనెను. 4

మూ. ఇయం మధుపురీ రమ్యా మధురా దేవనిర్మితా,
నివేశం ప్రాప్నుయాచ్ఛ్రిఘ్రమేష మేఽస్తు వరః పరః. 5

ప్ర. అ. ఇయమ్ = ఈ, రమ్యా = సుందరమైన, మధురా = మధురమైన, మధుపురీ = మధుపురి, దేవనిర్మితా = దేవతలచేత నిర్మితమై, శీఘ్రమ్ = శీఘ్రముగా, నివేశమ్ = స్థితిని (రాజధానీత్వమును), ప్రాప్నుయాత్ = పొందుగాక. ఏషః = ఇది, మే = నాయొక్క, పరః = గొప్ప, వరః = వరము, అస్తు = అగుగాక.

తా. రమ్యమూ, మధురమూ అయిన ఈ మధుపురి దేవతానిర్మితమై శీఘ్రముగా రాజధాని అగుగాక. ఇదియే నా ప్రధానమైన వరము. 5

మూ. తం దేవాః ప్రీతమనసో బాఢమిత్యేవ రాఘవమ్,
భవిష్యతి పురీ రమ్యా శూరసేనా న సంశయః. 6

ప్ర. అ. దేవాః = దేవతలు, ప్రీతమనసః = సంతోషించిన మనస్సు కలవారై, పురీ = పట్టణము, శూరసేనా = శూరులైన సైనికులు గలది, రమ్యా = సుందరము, బాఢమ్ = తప్పక, భవిష్యతి = కాగలదు. సంశయః = సంశయము, న = లేదు, ఇత్యేవ = అని, తం రాఘవమ్ = ఆ శత్రుఘ్నుని గూర్చి పలికిరి.

తా. ఆ దేవతలు మనస్సులో సంతోషించి శత్రుఘ్నునితో- "ఈ మధుపురి నిఃసంశయముగా రమ్యముగా శూరులైన సైనికులతో నిండి ఉండును" అని పలికిరి. 6

మూ. తే తథోక్త్వా మహాత్మానో దివమారురుహుస్తదా,
శత్రుఘ్నోఽపి మహాతేజాస్తాం సేనాం సముపానయత్. 7

ప్ర. అ. మహాత్మానః = మహాత్ములైన, తే = ఆ దేవతలు, తథా = అట్లు, ఉక్త్వా = పలికి, తదా = అప్పుడు, దివమ్ = స్వర్గమును, ఆరురుహుః = ఎక్కిరి. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, శత్రుఘ్నోఽపి = శత్రుఘ్నుడు కూడ, తామ్ = ఆ, సేనామ్ = సేనను, సముపానయత్ = తీసికొని వచ్చెను.

తా. మహాత్ములైన ఆ దేవతలు అట్లు పలికి స్వర్గలోకమునకు వెళ్ళిపోయిరి. గొప్ప తేజస్సు గల శత్రుఘ్నుడు కూడ ఆ సైన్యమును తీసికొని వచ్చెను. 7

మూ. సా సేనా శీఘ్రమాగచ్ఛచ్ఛ్రుత్వా శత్రుఘ్నశాసనమ్,
నివేశనం చ శత్రుఘ్నః శ్రావణేన సమారభత్. 8

ప్ర. అ. సా సేనా = ఆ సేన, శత్రుఘ్నశాసనమ్ = శత్రుఘ్నుని శాసనమును, శ్రుత్వా = విని, శీఘ్రమ్ = శీఘ్రముగా, ఆగచ్ఛత్ = వచ్చెను. శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, శ్రావణేన = శ్రావణమాసముచేత, నివేశనమ్ = పురమును నెలకొల్పుటను, సమారభత్ = ప్రారంభించెను.

తా. ఆ సేన శత్రుఘ్నుని శాసనమును విని శీఘ్రముగా వచ్చెను. శత్రుఘ్నుడు, శ్రావణమాసమునందు నగరస్థాపనము ప్రారంభించెను. 8

మూ. సా పురీ దివ్యసంకాశా వర్షే ద్వాదశమే శుభే,
నివిష్టా శూరసేనానాం విషయశ్చాకుతోభయః. 9

ప్ర. అ. శుభే = శుభమైన, ద్వాదశమే వర్షే = పండ్రెండవ సంవత్సరమునందు, సా పురీ = ఆ పట్టణము, దివ్యసంకాశా = దివ్యపురితో సమానమై, శూరసేనానామ్ = శూరులైన సేనలకు సంబంధించినదై, నివిష్టా = స్థాపించబడినది. విషయః చ = దేశము కూడ, అకుతోభయః = ఎక్కడినుండి భయము లేనిదిగా చేయబడినది.

తా. శుభమైన పండ్రెండవ సంవత్సరమునందు శూరులైన సైనికులతో కూడిన ఆ నగరము దివ్యనగరము వలె నిర్మింపబడెను. దేశము కూడ ఏ వైపునుండి భయము లేకుండ ఉండెను. 9

మూ. క్షేత్రాణి సస్యయుక్తాని కాలే వర్షతి వాసవః,
అరోగవీరపురుషా శత్రుఘ్నభుజపాలితా. 10

అర్ధచన్ద్రప్రతీకాశా యమునాతీరశోభితా,
శోభితా గృహముఖ్యైశ్చ చత్వరాపణవీథికైః. 11
చాతుర్వర్ణ్యసమాయుక్తా నానావాణిజ్యశోభితా.

ప్ర. అ. క్షేత్రాణి = పొలములు, సస్యయుక్తాని = సస్యములతో కూడినవి. వాసవః = ఇంద్రుడు, కాలే = కాలమునందు, వర్షతి = వర్షించుచున్నాడు. శత్రుఘ్నభుజపాలితా = శత్రుఘ్నుని భుజములచేత పాలింపబడిన ఆ నగరము, అరోగవీరపురుషా = రోగములు లేని వీరులైన పురుషులు గలది. అర్ధచన్ద్రప్రతీకాశా = అర్ధచంద్రునితో సమానము. యమునాతీరశోభితా = యమునాతీరమునందు శోభించుచున్నది. గృహముఖ్యైః చ = ఉత్తమములైన గృహములచేత, చత్వరాపణవీథికైః = ముంగిళ్ళచేత, బజారులచేత, వీథులచేత, శోభితా = ప్రకాశింపచేయబడినది. చాతుర్వర్ణ్యసమాయుక్తా = నాలుగు వర్ణములవారితో కూడినది. నానావాణిజ్యశోభితా = అనేకవిధములైన వర్తకవ్యాపారములచేత శోభింపచేయబడినది.

తా. పొలములు సస్యములతో నిండి ఉండెను. ఇంద్రుడు కాలమునందు వర్షించుచుండెను. యమునాతీరమునందు అర్ధచంద్రాకారములో నిర్మించిన, శత్రుఘ్నుడు పాలించుచున్న ఆ నగరములోని పురుషులు రోగము లేవీ లేనివారై వీరులుగా ఉండిరి. దానియందు నాలుగు వర్ణముల వారు నివసించుచుండిరి. ఉత్తమములైన గృహములతోను, ముంగిళ్ళతోను (లేదా చతుష్పథములతోను) బజారువీథులతోను, అనేకవిధములైన వర్తకవ్యాపారములతోను శోభించుచుండెను. 10, 11

మూ. యచ్చ తేన పురా శుభ్రం లవణేన కృతమ్ మహత్, 12
తచ్ఛోభయతి శత్రుఘ్నో నానావర్ణోపశోభితమ్.

ప్ర. అ. పురా = పూర్వము, లవణేన = లవణునిచేత, యత్ = ఏ, మహత్ = గొప్ప భవనము, శుభ్రమ్ = తెల్లనిదిగా, కృతమ్ = చేయబడినదో, తత్ = దానిని, శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, నానావర్ణోపశోభితమ్ = అనేకవిధములైన రంగులచేత శోభింపబడినదానినిగా, శోభయతి = శోభింపచేసెను.

తా. పూర్వము లవణాసురుడు తెల్లగా చేసిన మహాభవనమును శత్రుఘ్నుడు అనేకములైన వర్ణములతో అందముగా ఉండునట్లు చేసెను. 12

మూ. ఆరామైశ్చ విహారైశ్చ శోభమానాం సమన్తతః, 13
శోభితాం శోభనీయైశ్చ తథాన్యైర్దేవమానుషైః.

తాం పురీం దివ్యసంకాశాం నానాపణ్యోపశోభితామ్. 14
నానాదేశాగతైశ్చాపి వణిగ్భిరుపశోభితామ్,
తాం సమృద్ధాం సమృద్ధార్థః శత్రుఘ్నో భరతానుజః. 15
నిరీక్ష్య పరమప్రీతః పరం హర్షముపాగమత్.

ప్ర. అ. సమన్తతః = అన్ని వైపులా, ఆరామైః చ = ఉద్యానములతోను, విహారైః చ = విహరించు క్రీడాస్థానములతోను, శోభమానామ్ = ప్రకాశించుచున్న, తథా = మరియు, దైవమానుషైః = దేవతలకు మనుష్యులకు సంబంధించిన, అన్యైః = ఇతరములైన, శోభనీయైః = శోభార్హము లైన అలంకరణములచేత, శోభితామ్ = శోభింపచేయబడిన, దివ్యసంకాశామ్ = దేవతాపురముతో సమానమైన,

నానాపణ్యోపశోభితామ్ = అనేకవిధములైన పణ్యములతో (అమ్మటకు చూపిన వస్తువులతో) ప్రకాశించుచున్న, నానాదేశాగతైః = అనేకదేశములనుండి వచ్చిన, వణిగ్భిః = వర్తకులచేత, ఉపశోభితామ్ = ప్రకాశింపచేయబడిన, తామ్ = ప్రసిద్ధమైన, సమృద్ధామ్ = సమృద్ధమైన, తామ్ = ఆ, పురీమ్ = పట్టణమును, నిరీక్ష్య = చూచి, సమృద్ధార్థః = సమృద్ధమైన (సఫలమైన) కార్యము గల, భరతానుజః = = భరతుని తమ్ముడైన, శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, పరమప్రీతః = చాల సంతోషించినవాడై, పరమ్ = గొప్ప, హర్షమ్ = ఆనందమును, ఉపాగమత్ = పొందెను.

తా. తాను వచ్చిన పని సఫలము చేసికొనిన, భరతానుజుడైన ఆ శత్రుఘ్నుడు, సకలైశ్వర్యసమృద్ధమై ఉన్న ఆ నగరమును చూచి చాల సంతోషించెను. ఆ నగరము చుట్టూ ఉద్యానములు, క్రీడాస్థానములు ఉండెను. దేవతలకు, మనుష్యులకు సంబంధించిన అనేక అలంకరణములు చేయబడెను. అన్ని దిక్కులనుండి వచ్చిన వర్తకులతో నిండిన ఆ నగరము అనేకపణ్యవస్తువులతో ప్రకాశించుచుండెను. దేవతానగరము వలె ఉండెను. 13-15

మూ. తస్య బుద్ధిః సముత్పన్నా నివేశ్య మధురాం పురీమ్, 16
రామపాదౌ నిరీక్షేఽహం వర్షే ద్వాదశ ఆగతే.

ప్ర. అ. మధురాం పురీమ్ = మధురాపురిని, నివేశ్య = నిర్మించి, ద్వాదశే వర్షే = పన్నెండవ సంవత్సరము, ఆగతే = వచ్చిన దగుచుండగా, తస్య = ఆతనికి, అహమ్ = నేను, రామపాదౌ = రాముని పాదములను, నిరీక్షే = చూచెదను అని, బుద్ధిః = బుద్ధి, సముత్పన్నా = పుట్టినది.

తా. ఆ మధురాపురిని ఏర్పరచిన పిమ్మట పన్నెండవ సంవత్సరము వచ్చిన తరువాత శత్రుఘ్నునకు రామపాదదర్శనము చేసికొనవలె నని బుద్ధి పుట్టెను. 16

మూ. తతః స తామమరపురోపమాం పురీం
నివేశ్య వై వివిధజనాభిసంవృతామ్,
నరాధిపో రఘుపతిపాదదర్శనే
దధే మతిం రఘుకులవంశవర్ధనః. 17

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
సప్తతితమః సర్గః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, నరాధిపః = రాజైన, సః = ఆ, రఘుకుల వంశవర్ధనః = శత్రుఘ్నుడు, వివిధజనాభిసంవృతామ్ = అనేకులైన జనులతో నిండిన, అమరపురోపమామ్ = అమరావతితో సమానమైన, తాం పురీమ్ = ఆ పురిని, నివేశ్య వై = నిలిపి, రఘుపతిపాదదర్శనే = రాముని పాదములను చూచుట యందు, మతిమ్ = బుద్ధిని, దధే = ధరించెను.

తా. రాజైన ఆ శత్రుఘ్నుడు అమరావతి వంటి, అనేకవిధములైన జనులతో నిండిన ఆ మధుపురిని నెలకొల్పి రాముని పాదముల దర్శనము చేసికొనవలె నని సంకల్పించెను. 17

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో డెబ్బదవ సర్గ సమాప్తము.

అథ ఏకసప్తతితమః సర్గః

[స్వాల్పమైన సైన్యము తీసికొని శత్రుఘ్నుడు అయోధ్యకు బయలుదేరుట. మార్గమధ్యములో వాల్మీక్యాశ్రమమునందు శ్రీరామ చరితగానమును విని వారందరు ఆశ్చర్యమును చెందుట].

మూ. తతో ద్వాదశమే వర్షే శత్రుఘ్నో రామపాలితామ్,
అయోధ్యాం చకమే గన్తుమల్పభృత్యబలానుగః. 1

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ద్వాదశమే = పన్నెండవ, వర్షే = సంవత్సరమునందు, శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, అల్పభృత్యబలానుగః = అల్పమైన భృత్యులు, సైన్యము అనుచరులుగా గలవాడై, రామపాలితామ్ = రామునిచేత పాలింపబడిన, అయోధ్యామ్ = అయోధ్యను గూర్చి, గన్తుమ్ = వెళ్ళుటకు, చకమే = కోరెను.

తా. పండ్రెండవ సంవత్సరములో శత్రుఘ్నుడు చాల స్వల్పమైన భృత్యగణము, సైన్యము వెంటరాగా రాముడు పాలించుచున్న అయోధ్యకు వెళ్ళుటకు నిశ్చయించెను. 1

మూ. తతో మన్త్రిపురోగాంశ్చ బలముఖ్యాన్నివర్త్య చ,
జగామ హయముఖ్యైశ్చ రథానాం చ శతేన చ. 2

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మన్త్రిపురోగాన్ = మంత్రులు మొదలైనవాళ్ళను, బలముఖ్యాన్ చ = సేనానాయకులను, నివర్త్య = వెనుకకుమరలించి, హయముఖ్యైః చ = శ్రేష్ఠములైన గుఱ్ఱములతోను, రథానామ్ = రథములయొక్క, శతేన = శతములతోను, సః = అతడు, జగామ = వెళ్ళెను.

తా. అతడు మంత్రులు మొదలైనవారిని, సేనానాయకులను వెనుకకు పంపివేసి కొన్ని శ్రేష్ఠములైన అశ్వములతోను, వంద రథములతోను వెళ్ళెను. 2

మూ. స గత్వా గణితాన్ వాసాన్ సప్తాష్టౌ రఘునన్దనః,
వాల్మీక్యాశ్రమమాసాద్య వాసం చక్రే మహాయశాః. 3

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గల, సః రఘునన్దనః = ఆ శత్రుఘ్నుడు, గణితాన్ = లెక్కపెట్టబడిన (ముందుగానే నిర్ణయింపబడిన), సప్త అష్టౌ = ఏడెనిమిది, వాసాన్ = నివాసములను, గత్వా = వెళ్ళి, వాల్మీక్యాశ్రమమ్ = వాల్మీక్యాశ్రమమును, ఆసాద్య = చేరి, వాసమ్ = నివాసమును, చక్రే = చేసెను.

తా. గొప్ప కీర్తి గల ఆ శత్రుఘ్నుడు నిర్ణయించుకొనిన ప్రకారము ఏడెనిమిది నివాసములు (మకాములు) చేసి, వాల్మీకి ఆశ్రమము చేరి అక్కడ విడిసెను. 3

మూ. సోఽభివాద్య తతః పాదౌ వాల్మీకేః పురుషర్షభః,
పాద్యమర్ఘ్యం తథాతిథ్యం జగ్రాహ మునిహస్తతః. 4

ప్ర. అ. సః = ఆ, పురుషర్షభః = పురుషశ్రేష్ఠుడు, తతః = అటుపిమ్మట, వాల్మీకేః = వాల్మీకియొక్క, పాదౌ = పాదములను, అభివాద్య = నమస్కరించి, మునిహస్తతః = మునియొక్క హస్తమునుండి, పాద్యమ్ = పాద్యమును, అర్ఘ్యమ్ = అర్ఘ్యమును, తథా = మరియు, ఆతిథ్యమ్ = ఆతిథ్యమును, జగ్రాహ = గ్రహించెను.

తా. పురుషశ్రేష్ఠుడైన ఆ శత్రుఘ్నుడు వాల్మీకికి అభివాదనము చేసి, ఆతడిచ్చిన పాద్యమును, అర్ఘ్యమును, ఆతిథ్యమును స్వీకరించెను. 4

మూ. బహురూపాః సుమధురాః కథాస్తత్ర సహస్రశః,
కథయామాస స మునిః శత్రుఘ్నాయ మహాత్మనే. 5

ప్ర. అ. సః మునిః = ఆ మునీశ్వరుడు, మహాత్మనే = మహాత్ముడైన, శత్రుఘ్నాయ = శత్రుఘ్నునకు, బహురూపాః = అనేకరూపములు గల, సుమధురాః = చాల మధురములైన, కథాః = కథలను, తత్ర = అక్కడ, సహస్రశః = వేలకొలది, కథయామాస = చెప్పెను.

తా. అక్కడ ఆ మునీశ్వరుడు మహాత్ముడైన శత్రుఘ్నునకు అనేక విధములైన, మధురములైన, వేలకొలది కథలు చెప్పెను. 5

మూ. ఉవాచ చ మునిర్వాక్యం లవణస్య వధాశ్రితమ్,
సుదుష్కరం కృతం కర్మ లవణం నిఘ్నతా త్వయా. 6

ప్ర. అ. మునిః = మునీశ్వరుడు, లవణస్య = లవణునియొక్క, వధాశ్రితమ్ = వధకు సంబంధించిన, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను. లవణమ్ = లవణుణ్ణి, నిఘ్నతా = చంపిన, త్వయా = నీచేత, సుదుష్కరమ్ = మిక్కిలి చేయ శక్యము కాని, కర్మ = పని, కృతమ్ = చేయబడినది.

తా. వాల్మీకి లవణుని వధకు సంబంధించి ఇట్లు పలికెను-"నీవు లవణాసురుణ్ణి చంపి చాల చేయ శక్యము కాని పని చేసినావు". 6

మూ. బహవః పార్థివాః సౌమ్య హతాః సబలవాహనాః,
లవణేన మహాబాహో యుధ్యమానా మహాబలాః. 7

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా! లవణేన = లవణునిచేత, యుధ్యమానాః = యుద్ధము చేయుచున్న, మహాబలాః = గొప్ప బలము గల, సబలవాహనాః = సైన్యముతోను, వాహనములతోను కూడిన, బహవః = చాలమంది, పార్థివాః = రాజులు, హతాః = చంపబడిరి.

తా. మహాబాహూ! సౌమ్యుడవైన శత్రుఘ్న! లవణుడు తనతో యుద్ధము చేసిన గొప్ప బలము గల ఎందరో రాజులను వారి సైన్యవాహనాదులతో సహా చంపివేసినాడు. 7

మూ. స త్వయా నిహతః పాపో లీలయా పురుషర్షభ,
జగతశ్చ భయం తత్ర ప్రశాన్తం తవ తేజసా. 8

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! పాపః = పాపాత్ముడైన, సః = అతడు, త్వయా = నీచేత, లీలయా = అనాయాసముగా, నిహతః = చంపబడినాడు. తవ = నీయొక్క, తేజసా = తేజస్సుచేత, తత్ర = వాని విషయమునందు, జగతః = జగత్తుయొక్క, భయం చ = భయము కూడ, ప్రశాన్తమ్ = శాంతించినది.

తా. పురుషశ్రేష్ఠుడా! అట్టి పాపాత్ముణ్ణి నీవు అనాయాసముగా చంపివేసినావు. నీ తేజస్సుచేత వానివలన జగత్తుకు భయము శాంతించినది. 8

మూ. రావణస్య వధో ఘోరో యత్నేన మహతా కృతః,
ఇదం చ సుమహత్కర్మ త్వయా కృతమయత్నతః. 9

ప్ర. అ. రావణస్య = రావణునియొక్క, ఘోరః = ఘోరమైన, వధః = వధ, మహతా = గొప్ప, యత్నేన = ప్రయత్నముచేత, కృతః = చేయబడినది. ఇదమ్ = ఈ, సుమహత్ = చాల గొప్పదైన, కర్మ = పని, త్వయా = నీచేత, అయత్నతః = ప్రయత్నము లేకుండగా, కృతమ్ = చేయబడినది.

తా. ఘోరమైన రావణవధ గొప్ప ప్రయత్నముచేత చేయబడినది. కాని చాల గొప్పదైన ఈ పనిని నీవు అనాయాసముగ చేసినావు. 9

మూ. ప్రీతిశ్చాస్మిన్ పరా జాతా దేవానాం లవణే హతే,
భూతానాం చైవ సర్వేషాం జగతశ్చ ప్రియం కృతమ్. 10

ప్ర. అ. అస్మిన్ = ఈ, లవణే = లవణుడు, హతే = చంపబడినవాడగు చుండగా, దేవానామ్ = దేవతలకు, సర్వేషామ్ = సమస్తమైన, భూతానాం చ ఏవ = భూతములకుకూడ, పరా = గొప్ప, ప్రీతిః = సంతోషము, జాతా = కలిగినది. జగతః = జగత్తునకు, ప్రియం చ = ప్రియము కూడ, కృతమ్ = చేయబడినది.

తా. ఈ లవణుడు చంపబడుటచే దేవతలకు, భూతములకు గొప్ప సంతోషము కలిగినది. జగత్తుకు ప్రియము జరిగినది. 10

మూ. తచ్చ యుద్ధం మయా దృష్టం యథావత్ పురుషర్షభ,
సభాయాం వాసవస్యాథ ఉపవిష్టేన రాఘవ. 11

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! రాఘవ = శత్రుఘ్నా, అథ = అటుపిమ్మట, వాసవస్య = ఇంద్రునియొక్క, సభాయామ్ = సభయందు, ఉపవిష్టేన = కూర్చున్న, మయా = నాచేత, తత్ = ఆ, యుద్ధమ్ = యుద్ధము, యథావత్ = యథార్థముగా, దృష్టమ్ = చూడబడినది.

తా. పురుషశ్రేష్ఠుడవైన శత్రుఘ్నా! ఆ యుద్ధమును పూర్తిగా నేను ఇంద్రుని సభలో కూర్చుండి చూచితిని. 11

మూ. మమాపి పరమా ప్రీతిర్హ్యది శత్రుఘ్న వర్తతే,
ఉపాఘ్రాస్యామి తే మూర్ధ్ని స్నేహాన్మేషా పరా గతిః. 12

ప్ర. అ. శత్రుఘ్న = శత్రుఘ్నా ! మమాపి = నాకు కూడ, హృది = హృదయమునందు, పరమా = గొప్ప, ప్రీతిః = సంతోషము, వర్తతే = ఉన్నది. తే = నీయొక్క, మూర్ధ్ని = శిరస్సునందు, ఉపాఘ్రాస్యామి = వాసనచూచెదను. ఏషా = ఇది, స్నేహస్య = స్నేహముయొక్క, పరా = గొప్పదైన, గతిః = గతి.

తా. శత్రుఘ్నా! నీ విషయమునందు నాకు కూడ గొప్ప సంతోషము కలిగినది. నీ శిరస్సును వాసన చూచెదను. ఇది ప్రేమకు అత్యుత్తమమైన లక్షణము. 12

మూ. ఇత్యుక్త్వా మూర్ధ్ని శత్రుఘ్నముపాఘ్రాయ మహామతిః,
ఆతిథ్యమకరోత్తస్య యే చ తస్య పదానుగాః. 13

ప్ర. అ. మహామతిః = గొప్ప బుద్ధి గల వాల్మీకి, ఇతి = ఇట్లు, ఉక్త్వా = పలికి, శత్రుఘ్నమ్ = శత్రుఘ్నుణ్ణి, మూర్ధ్ని = శిరస్సుపై, ఉపాఘ్రాయ = వాసనచూచి, తస్య = ఆతనికి, తస్య = ఆతని, పదానుగాః = అనుచరులు, యే = ఎవరున్నారో వారికి, ఆతిథ్యమ్ = ఆతిథ్యమును, అకరోత్ = చేసెను.

తా. గొప్ప బుద్ధి గల ఆ వాల్మీకి ఇట్లు పలికి, శత్రుఘ్నుణ్ణి శిరస్సుపై మూర్కొని, ఆతనికి, ఆతని అనుచరులకు ఆతిథ్యము చేసెను. 13

మూ. స భుక్తవాన్ నరశ్రేష్ఠో గీతమాధుర్యముత్తమమ్.
శుశ్రావ రామచరితం తస్మిన్ కాలే యథాకృతమ్. 14

ప్ర. అ. భుక్తవాన్ = భోజనము చేసిన, సః = ఆ, నరశ్రేష్ఠః = నరశ్రేష్ఠుడు, ఉత్తమమ్ = ఉత్తమమైన, గీతమాధుర్యమ్ = గీతమాధుర్యమును. తస్మిన్ = ఆ, కాలే = కాలమునందు, యథా = ఎట్లు, కృతమ్ = చేయబడినదో ఆ విధముగా, రామచరితమ్ = రాముని చరితమును, శుశ్రావ = వినెను.

తా. భోజనము చేసి కూర్చున్న శత్రుఘ్నుడు ఉత్తమమైన గీతమాధుర్యము గల రాముని చరితమును ఆ సమయమున రచించబడిన విధముగా వినెను. 14

మూ. తన్త్రీలయసమాయుక్తం త్రిస్థానకరణాన్వితమ్,
సంస్కృతం లక్షణోపేతం సమతాలసమన్వితమ్. 15
శుశ్రావ రామచరితం తస్మిన్ కాలే పురా కృతమ్,

ప్ర. అ. తన్త్రీలయసమాయుక్తమ్ = వీణాతంత్రుల లయతో కూడిన, త్రిస్థానకరణాన్వితమ్ = వక్షఃస్థలము. కంఠము, శిరస్సు అను మూడు స్థానముల యందు, మధ్యము, మంద్రము, తారము అను మూడు కరణములతో కూడినదీ, సంస్కృతమ్ = సంస్కరించబడినదీ, లక్షణోపేతమ్ = సంగీతశాస్త్రాదిలక్షణములతో కూడినది, సమతాలసమన్వితమ్ = సమమైన తాలముతో కూడినది, తస్మిన్ కాలే = ఆ కాలమునందు, పురా = పూర్వము, కృతమ్ = చేయబడినదీ అయిన, రామచరితమ్ = రామచరితమును, శ్రావ = వినెను.

తా. ఆ కాలమునందు పూర్వము రచింపబడిన రామచరితమును వినెను. అది వీణాతంత్రుల లయమునకు అనుగుణముగా ఉండెను. మూడు స్థానములందు మూడు కరణములతో కూడి, సంస్కృతమై, సంగీతశాస్త్రాదిలక్షణములతో ఉండెను.

మూ. తాన్యక్షరాణి సత్యాని యథావృత్తాని పూర్వశః, 16
శ్రుత్వా పురుషశార్దూలో విసంజ్ఞో బాష్పలోచనః,
స ముహూర్తమివాసంజ్ఞో వినిఃశ్వస్య ముహుర్ముహుః. 17
తస్మిన్ గీతే యథావృత్తం వర్తమానమివాశృణోత్.

ప్ర. అ. పురుషశార్దూలః = పురుషశ్రేష్ఠుడు, పూర్వశః = పూర్వము, యథావృత్తాని = జరిగినవి జరిగినట్లున్న, సత్యాని = సత్యములైన, తాని అక్షరాణి = ఆ అక్షరములను, శ్రుత్వా = విని, విసంజ్ఞః = సంజ్ఞ లేనివాడై, బాష్పలోచనః = కన్నీళ్ళ నేత్రములందు కలవాడయ్యెను. సః = అతడు, ముహూర్తమ్ ఇవ = ముహూర్తకాలము, అసంజ్ఞః = సంజ్ఞ లేనివాడై. ముహుః ముహుః = మాటిమాటికి, వినిఃశ్వస్య = నిట్టూర్చి, తస్మిన్ గీతే = ఆ గీతమునందు, యథావృత్తమ్ = జరిగిన కథను, వర్తమానమ్ ఇవ = జరుగుచున్నదానిని వలె, అశృణోత్ = వినెను.

తా. పూర్వము ఎట్లు జరిగెనో అట్లు సత్యములైన ఆ అక్షరములు (మాటలు) విని, పురుషశ్రేష్ఠుడైన శత్రుఘ్నుడు కన్నీళ్ళు కార్చుచు సంజ్ఞ కోల్పోయెను. అతడు ముహూర్తకాలముపాటు స్పృహ కోల్పోయినవాడై, మాటిమాటికి నిట్టూర్చుచు, జరిగిన కథనంతను ఆ గీతములో అప్పుడు జరుగుచున్నట్లుగా వినెను. 16,17

మూ. పదానుగాశ్చ యే రాజ్ఞస్తాం శ్రుత్వా గీతిసంపదమ్, 18
అవాఙ్ముఖాశ్చ దీనాశ్చ హ్యాశ్చర్యమితి చాబ్రువన్.

ప్ర. అ. రాజ్ఞః = రాజుయొక్క, యే = ఏ, పదానుగాః = అనుచరులు ఉన్నారో వాళ్ళు, తామ్ = ఆ, గీతిసంపదమ్ = గానసంపదను, శ్రుత్వా = విని, అవాఙ్ముఖాశ్చ = క్రిందికి ముఖములు కలవారై, దీనాః చ = దీనులై, ఆశ్చర్యమ్ ఇతి = ఆశ్చర్యము అని, అబ్రువన్ = పలికిరి.

తా. రాజు అనుచరులు గూడ ఆ గీతిసంపదను విని, తలలు క్రిందికి వంచి, దీనులై "ఎంత ఆశ్చర్యము"అనిరి. 18

మూ. పరస్పరం చ యే తత్ర సైనికాః సంబభాషిరే, 19
కిమిదం క్వ చ వర్తామః కిమేతత్స్వప్నదర్శనమ్.

ప్ర. అ. తత్ర = అక్కడ, యే = ఏ, సైనికాః = సైనికులు గలరో, వాళ్ళు, పరస్పరమ్ = పరస్పరము, సంబభాషిరే = మాటలాడుకొనిరి. ఇదమ్ = ఇది, కిమ్ = ఏమిటి? క్వ చ = ఎక్కడ, వర్తామః = ఉన్నాము? ఏతత్ = ఇది, స్వప్న దర్శనం కిమ్ = స్వప్నదర్శనమా?

తా. అక్కడ నున్న సైనికులు పరస్పరము ఇట్లు మాటలాడుకొనిరి. "ఇది ఏమిటి? మనము ఎక్కడ ఉన్నాము? స్వప్నము చూచుచున్నామా?" 19

మూ. అర్థో యో నః పురా దృష్టస్తమాశ్రమపదే పునః, 20
శృణుమః కిమిదం స్వప్నో గీతబన్ధనముత్తమమ్.

ప్ర. అ. యః = ఏ, అర్థః = విషయము, పురా = పూర్వము, నః = మనకు, దృష్టః = చూడబడినదో, తమ్ = దానినే, ఆశ్రమపదే = ఆశ్రమస్థానము నందు, పునః = మరల, శృణుమః = వినుచున్నాము, ఇదమ్ = ఇది, స్వప్నః కిమ్ = స్వప్నమా; ఉత్తమమ్ = ఉత్తమమైన, గీతిబన్ధనమ్ = సంగీతబంధనమా?

"పూర్వము మనము ప్రత్యక్షముగా చూచిన విషయమునే మరల ఈ ఆశ్రమములో వినుచున్నాము, ఇది స్వప్నమా? లేక ఉత్తమమైన సంగీతరచనయా?"

మూ. విస్మయం తే పరం గత్వా శత్రుఘ్నమిదమబ్రువన్, 21
సాధు పృచ్ఛ నరశ్రేష్ఠ వాల్మీకిం మునిపుఙ్గవమ్.

ప్ర. అ. తే = వాళ్ళు, పరమ్ = గొప్ప, విస్మయమ్ = ఆశ్చర్యమును, గత్వా = పొంది, శత్రుఘ్నమ్ = శత్రుఘ్నుణ్ణి గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రువన్ = పలికిరి. నరశ్రేష్ఠ = నరశ్రేష్ఠుడా! సాధు = బాగుగా, మునిపుఙ్గవమ్ = మునిశ్రేష్ఠుడైన, వాల్మీకిమ్ = వాల్మీకిని, పృచ్ఛ = అడుగుము.

తా. వారు చాల ఆశ్చర్యము చెంది శత్రుఘ్నునితో "ఓ! నరశ్రేష్ఠుడా! నీవు మునిశ్రేష్ఠుడైన వాల్మీకిని బాగుగా (స్పష్టముగా) అడుగుము" అని పలికిరి. 21

మూ. శత్రుఘ్నస్త్వబ్రవీత్సర్వాన్ కౌతూహలసమన్వితాన్, 22
సైనికా న క్షమోఽస్మాకం పరిప్రష్టుమిహేదృశః.

ప్ర. అ. శత్రుఘ్నః తు = శత్రుఘ్నుడైతే, కౌతూహలసమన్వితాన్ = వేడుకతో కూడిన, సైనికాన్ = సైనికులను, సర్వాన్ = అందరినీ గూర్చి, అబ్రవీత్ = పలికెను. ఇహ = ఇక్కడ, ఈదృశః = ఇట్టివిషయము, పరిప్రష్టుమ్ = అడుగుటకు, అస్మాకమ్ = మనకు, అక్షమః = తగనిది.

తా. కుతూహలముతో కూడిన ఆ సైనికులందరితో శత్రుఘ్నుడిట్లు పలికెను-"మనము ఇక్కడ ఇలాంటి విషయములను గూర్చి అడగకూడదు". 22

మూ. ఆశ్చర్యాణి బహూనీహ భవన్త్యస్యాశ్రమే మునేః, 23
న తు కౌతూహలాద్యుక్తమన్వేష్టుం తం మహామునిమ్.

ప్ర. అ. ఇహ = ఇక్కడ, మునేః = మునియొక్క, ఆశ్రమే = ఆశ్రమమునందు, బహూని = అనేకమైన, ఆశ్చర్యాణి = ఆశ్చర్యములు, భవన్తి = జరుగుచుండును, తు = కాని, కౌతూహలాత్ = వేడుకవలన, తమ్ = ఆ, మహామునిమ్ = మహామునిని, అన్వేష్టుమ్ = ప్రశ్నించుటకు, నయుక్తమ్ = యుక్తము కాదు.

తా. ఈ ముని ఆశ్రమములో అనేకములైన ఆశ్చర్యకరములైన విషయములు జరుగుచుండును. కాని మనము కౌతూహలముతో ఈ మహామునిని ప్రశ్నించుట యుక్తము కాదు. 23

మూ. ఏవం తద్వాక్యముక్త్వా తు సైనికాన్ రఘునన్దనః, 24
అభివాద్య మహర్షిం తం స్వం నివేశం యయౌ తదా.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకసప్తతితమః సర్గః.

ప్ర. ఆ. రఘునన్దనః = శత్రుఘ్నుడు, ఏవమ్ = ఇట్లు, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, సైనికాన్ = సైనికులను గూర్చి, ఉక్త్వా = పలికి, తం మహర్షిమ్ = ఆ మహర్షిని, అభివాద్య = నమస్కరించి, తదా = అప్పుడు, స్వమ్ = తన సంబంధమైన, నివేశమ్ = శయనస్థానమును గూర్చి, యయౌ = వెళ్ళెను.

తా. శత్రుఘ్నుడు సైనికులతో ఇట్లు పలికి, ఆ మహర్షికి నమస్కరించి, అప్పుడు తన శయనస్థానమునకు వెళ్లెను. 24

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు,
ఉత్తరకాండలో డెబ్భైఒకటవ సర్గ సమాప్తము.

అథ ద్విసప్తతితమః సర్గః

[శత్రుఘ్నుడు వాల్మీకి అనుజ్ఞ పొంది అయోధ్యకు వెళ్ళి రామాదులతో కలిసి అక్కడ ఏడు రోజులు ఉండి మరల మధురకు బయలుదేరి వెళ్ళుట.]

మూ. తం శయానం నరవ్యాఘ్రం నిద్రా నాభ్యాగమత్తదా,
చింతయానమనేకార్థం రామగీతమనుత్తమమ్. 1

ప్ర. అ. తదా = అప్పుడు, అనేకార్థమ్ = అనేకములైన అర్థములు గల, అనుత్తమమ్ = చాల శ్రేష్ఠమైన, రామగీతమ్ = రాముని గీతమును గూర్చి, చింతయానమ్ = చింతించుచున్న, శయానమ్ = శయినించిన, తం నరవ్యాఘ్రమ్ = ఆ నరశ్రేష్ఠుణ్ణి, నిద్రా = నిద్ర, నాభ్యగమత్ = చేరలేదు.

తా. అనేకములైన అర్థములు గల రామునికి సంబంధించిన గీతమును గూర్చి ఆలోచించుచు శయనించిన ఆ శత్రుఘ్నునికి అప్పుడు నిద్ర రాలేదు. 1

మూ. తస్య శబ్దం సుమధురం తన్త్రీలయసమన్వితమ్,
శ్రుత్వా రాత్రిర్జగామాశు శత్రుఘ్నస్య మహాత్మనః. 2

ప్ర. అ. సుమధురమ్ = చాల మధురమైన, తన్త్రీలయసమన్వితమ్ = వీణాతంత్రుల లయతో కూడిన, తస్య = ఆ రామచరితముయొక్క, శబ్దమ్ = శబ్దమును, శ్రుత్వా = విని, మహాత్మనః = మహాత్ముడైన, శత్రుఘ్నస్య = శత్రుఘ్నునకు, రాత్రిః = రాత్రి, ఆశు = శీఘ్రముగా, జగామ = గడచెను.

తా. చాల మధురము, వీణాతంత్రుల లయకు సరిపడునది అయిన ఆ రామచరితగీతధ్వనిని వినుచుండగా శత్రుఘ్నునకు రాత్రి శీఘ్రముగా గడచి పోయెను. 2

మూ. తస్యాం రజన్యాం వ్యుష్టాయాం కృత్వా పౌర్వాహ్ణికక్రమమ్,
ఉవాచ ప్రాఞ్జలిర్వాక్యం శత్రుఘ్నో మునిపుంగవమ్. 3

ప్ర. అ. తస్యామ్ = ఆ, రజన్యామ్ = రాత్రి, వ్యుష్టాయామ్ = తెల్లవారిన దగుచుండగా, శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, పౌర్వాహ్ణికక్రమమ్ = పూర్వాహ్ణమునకు సంబంధించిన కార్యక్రమమును, కృత్వా = చేసికొని, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, మునిపుంగవమ్ = మునిశ్రేష్ఠుని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. ఆ రాత్రి తెల్లవారిన పిదప శత్రుఘ్నుడు పూర్వాహ్ణకార్యక్రమమును పూర్తిచేసికొని, అంజలి ఘటించి వాల్మీకితో ఇట్లనెను. 3

మూ. భగవన్ ద్రష్టుమిచ్ఛామి రాఘవం రఘునన్దనమ్,
త్వయానుజ్ఞాతమిచ్ఛామి సహైభిః సంశితవ్రతైః. 4

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా! రఘునన్దనమ్ = రఘువంశీయులకు ఆనంద కరుడైన, రాఘవమ్ = రాముణ్ణి, ద్రష్టుమ్ = చూచుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను. సంశితవ్రతైః = తీవ్రమైన నియమములు గల, ఏభిః సహ = ఈ మునులతో కూడ, త్వయా = నీచేత, అనుజ్ఞాతమ్ = అనుజ్ఞను, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. పూజ్యుడా! రఘువంశీయులకు ఆనందకరుడైన రాముణ్ణి చూడవలెనని కోరుచున్నాను. గొప్ప తపోనియమము గల ఈ మునుల అనుజ్ఞను నీ అనుజ్ఞను కోరుచున్నాను. 4

మూ. ఇత్యేవం వాదినం తం తు శత్రుఘ్నం శత్రుసూదనమ్,
వాల్మీకిః సంపరిష్వజ్య విససర్జ స రాఘవమ్. 5

ప్ర. అ. సః వాల్మీకిః = ఆ వాల్మీకి, ఇత్యేవమ్ = ఇట్లు, వాదినమ్ = పలుకుచున్న, శత్రుసూదనమ్ = శత్రుసంహారకుడైన, తమ్ = ఆ, శత్రుఘ్నమ్ = శత్రుఘ్నుణ్ణి, సంపరిష్వజ్య = కౌగలించుకొని, రాఘవమ్ = ఆ శత్రుఘ్నుణ్ణి, విససర్జ = విడచెను.

తా. వాల్మీకి శత్రుసంహారకుడైన ఆ శత్రుఘ్నుని మాటలు విని ఆతనిని కౌగలించుకొని, వెళ్లుటకు అనుమతి ఇచ్చెను. 5

మూ. సోఽభివాద్య మునిశ్రేష్ఠం రథమారుహ్య సుప్రభమ్,
అయోధ్యామగమత్తూర్ణం రాఘవోత్సుకదర్శనః. 6

ప్ర. అ. సః = అతడు, మునిశ్రేష్ఠమ్ = ఆ మునిశ్రేష్ఠుని, అభివాద్య = నమస్కరించి, సుప్రభమ్ = మంచి కాంతి గల, రథమ్ = రథమును, ఆరుహ్య = ఎక్కి, రాఘవోత్సుకదర్శనః = రాముని చూచుటయందు వేడుక గలవాడై, తూర్ణమ్ = శీఘ్రముగా, అయోధ్యామ్ = అయోధ్యను గూర్చి, అగమత్ = వెళ్ళెను.

తా. శత్రుఘ్నుడు వాల్మీకికి నమస్కరించి, మంచి కాంతి గల రథమునెక్కి, రాముని దర్శనమునకై ఆతురతతో శీఘ్రముగా అయోధ్యకు వెళ్ళెను. 6

మూ. స ప్రవిష్టః పురీం రమ్యాం శ్రీమానిక్ష్వాకునన్దనః,
ప్రవివేశ మహాబాహుర్యత్ర రామో మహాద్యుతిః. 7

ప్ర. అ. ఇక్ష్వాకుకులనన్దనః = ఇక్ష్వాకుకులమునకు ఆనందకరుడైన, మహాబాహుః = గొప్ప బాహువులు గల, సః = ఆ శత్రుఘ్నుడు, రమ్యామ్ = సుందరమైన, పురీమ్ = పట్టణమును, ప్రవిష్టః = ప్రవేశించినవాడై, మహాద్యుతిః = గొప్పకాంతి గల, రామః = రాముడు, యత్ర = ఎక్కడ ఉండెనో, అక్కడికి, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. ఇక్ష్వాకువంశమునకు ఆనందమును కలిగించు, మహాబాహువైన ఆ శత్రుఘ్నుడు రమ్యమైన ఆ అయోధ్యకు వెళ్ళి గొప్ప కాంతి గల రాముడు ఉన్న భవనమునకు వెళ్ళెను. 7

మూ. స రామం మన్త్రిమధ్యస్థం పూర్ణచన్ద్రనిభాననమ్,
పశ్యన్నమరమధ్యస్థం సహస్రనయనం యథా. 8

ప్ర. అ. సః = అతడు, మన్త్రిమధ్యస్థమ్ = మంత్రుల మధ్యయందున్న, పూర్ణచన్ద్రనిభాననమ్ = పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గల, అమరమధ్యస్థమ్ = దేవతల మధ్యయందున్న, సహస్రనయనం యథా = ఇంద్రుడువలె ఉన్న, రామమ్ = రాముణ్ణి, పశ్యన్ = చూచుచు, (ప్రవేశించెను).

తా. అతడు పూర్ణచంద్రుని వంటి ముఖము గల, మంత్రిమధ్యయందు,

దేవతలమధ్యయం దున్న ఇంద్రుడు వలె ఉన్న రాముణ్ణి చూచుచు ప్రవేశించెను. 8

మూ. సోఽభివాద్య మహాత్మానం జ్వలన్తమివ తేజసా,
ఉవాచ ప్రాఞ్జలిర్వాక్యం రామం సత్యపరాక్రమమ్. 9

ప్ర. అ. సః = అతడు, తేజసా = తేజస్సుచేత, జ్వలన్తమివ = ప్రజ్వలించుచున్నట్లు ఉన్న, సత్యపరాక్రమమ్=సత్యమైన పరాక్రమము గల, మహాత్మానమ్=మహాత్ముడైన, రామమ్=రాముణ్ణి. అభివాద్య=నమస్కరించి, ప్రాఞ్జలిః= ఎత్తబడిన దోసిలి కలవాడై, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. శత్రుఘ్నుడు తేజస్సుతో ప్రజ్వలించుచున్నట్లున్న, సత్యమైన పరాక్రమము గల రామునికి నమస్కరించి అంజలి ఘటించి ఇట్లు పలికెను. 9

మూ. యదాజ్ఞప్తం మహారాజ సర్వం తత్ కృతవానహమ్,
హతః స లవణః పాపః పురీ చాస్య నివేశితా. 10

ప్ర. అ. మహారాజ=మహారాజా! యత్ = ఏది, ఆజ్ఞప్తమ్ = ఆజ్ఞాపించబడినదో, తత్=దానిని, సర్వమ్ = సమస్తమునూ, అహమ్=నేను, కృతవాన్= చేసినాను. పాపః = పాపాత్ముడైన, సః లవణః = ఆ లవణుడు, హతః = చంపబడినాడు. అస్య=వీనియొక్క, పురీ చ = పట్టణము కూడ, నివేశితా=నెలకొల్పబడినది.

తా. మహారాజా! నీవు ఆజ్ఞాపించిన విధముగ అంతా చేసినాను. పాపాత్ముడైన లవణుణ్ణి సంహరించి ఆతని పురమును నిర్మించితిని. 10

మూ. ద్వాదశైతే గతా వర్షాస్త్వాం వినా రఘునన్దన,
నోత్సహేయమహం వస్తుం త్వయా విరహితో నృప. 11

ప్ర. అ. రఘునన్దన = రామా! త్వాం వినా = నీవు లేకుండగా, ఏతే = ఈ, ద్వాదశ వర్షాః = పన్నెండు సంవత్సరములు, గతాః = గడచినవి. నృప = రాజా! అహమ్ = నేను, త్వయా వినా = నీవు లేకుండ, వస్తుమ్ = నివసించుటకు, న ఉత్సహే = ఉత్సాహవంతుడను కాను (ఇచ్ఛయించను.)

తా. రామా ! నీవు లేకుండగా ఈ పన్నెండు సంవత్సరములు గడచినవి. రాజా! నీవు లేకుండ నేను ఆక్కడ నివసించుటకు ఇచ్చగించను. 11

మూ. స మే ప్రసాదం కాకుత్స్థ కురుష్వామితవిక్రమ,
మాతృహీనో యథా వత్సో న చిరం ప్రవసామ్యహమ్. 12

ప్ర. అ. అమితవిక్రమ = అపరిమితమైన పరాక్రమముగల, కాకుత్స్థ = రామా! సః = అట్టి నీవు, మే = నాకు, ప్రసాదమ్ = అనుగ్రహమును, కురుష్వ = చేయుము. మాతృహీనః = తల్లి లేని, వత్సః యథా = లేగదూడ వలె, అహమ్ = నేను, చిరమ్ = చిరకాలము, న ప్రవసామి = దూరముగా ఉండజాలను.

తా. అపరిమితమైన పరాక్రమము గల రామా! నీవు నా విషయమున అనుగ్రహింపుము. తల్లి లేని లేగదూడ వలె నేను చాలకాలము దూరముగా ఉండజాలను. 12

మూ. ఏవం బ్రువాణం కాకుత్స్థః పరిష్వజ్యేదమబ్రవీత్,
మా విషాదం కృథాః శూర నైతత్ క్షత్రియచేష్టితమ్. 13

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, బ్రువాణమ్ = పలుకుచున్న శత్రుఘ్నుణ్ణి, కాకుత్స్థః = రాముడు, పరిష్వజ్య = కౌగలించుకొని, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను. శూర = శూరుడా ! విషాదమ్ = దుఃఖమును, మా కృథాః = చేయకుము. ఏతత్ = ఇది, క్షత్రియచేష్టితమ్ = క్షత్రియుడు చేయవలసిన పని, న = కాదు.

తా. ఇట్లు మాట్లాడుచున్న శత్రుఘ్నుణ్ణి రాముడు కౌగలించుకొని ఇట్లు పలికెను-"శూరుడా ! విషాదము చెందకుము, ఇది క్షత్రియులు చేయవలసినది కాదు". 13

మూ. నావసీదన్తి రాజానో విప్రవాసేన రాఘవ,
ప్రజా హి పరిపాల్యా హి క్షత్రధర్మేణ రాఘవ. 14

ప్ర. అ. రాఘవ = శత్రుఘ్నుడా ! రాజానః = రాజులు, విప్రవాసేన = ప్రవాసముచేత, నావసీదన్తి = దిగులు చెందరు. రాఘవ = రాఘవా ! ప్రజాః = ప్రజలు, క్షత్రధర్మేణ = క్షత్రియధర్మముచేత, పరిపాల్యాః హి = పాలించదగిన వారు కదా?

తా. "శత్రుఘ్నుడా ! ప్రవాసముచేత రాజులు దిగులుచెందరు. ప్రజలను క్షత్రియధర్మానుసారముగా పాలించవలెను కదా?" 14

మూ. కాలే కాలే తు మాం వీర అయోధ్యామవలోకితుమ్,
ఆగచ్ఛ త్వం నరశ్రేష్ఠ గన్తాసి చ పురం తవ. 15

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడా! వీర = వీరుడా! కాలే కాలే=ఆ యా సమయములయందు, మామ్ = నన్ను, అవలోకితుమ్ = చూచుటకు, అయోధ్యామ్ = అయోధ్యను గూర్చి, త్వమ్ = నీవు, ఆగచ్ఛ = రమ్ము. తవ = నీ యొక్క, పురమ్ = పట్టణమును గూర్చి, గన్తాసి = వెళ్ళగలవు.

తా. "నరులలో శ్రేష్ఠుడవైన వీరుడా! ఆప్పుడప్పుడు నన్ను చూచుటకై అయోధ్యకు వచ్చుచుండుము తిరిగి నీ పట్టణమునకు వెళ్ళవచ్చును." 15

మూ. మమాపి త్వం సుదయితః ప్రాణైరపి న సంశయః,
అవశ్యం కరణీయం చ రాజ్యస్య పరిపాలనమ్. 16

ప్ర. అ. త్వమ్ = నీవు, మమాపి = నాకు కూడ, ప్రాణైః అపి=ప్రాణాల చేత కూడ, సుదయితః = చాల ఇష్టుడవు. సంశయః = సంశయము, న=లేదు. రాజ్య స్య = రాజ్యముయొక్క, పరిపాలనమ్=పరిపాలనము, అవశ్యమ్=తప్పక, కరణీయం చ = చేయదగినది.

తా. "నీవు నాకు కూడ ప్రాణములకంటె కూడ ఇష్టుడవు, సంశయము లేదు రాజ్యపాలనము తప్పక చేయదగినది కదా?" 16

మూ. తస్మాత్త్వం వస కాకుత్స్థ సప్తరాత్రం మయా సహ,
ఊర్ధ్వం గన్తాసి మధురాం సభృత్యబలవాహనః. 17

ప్ర. అ. తస్మాత్ = ఆ కారణమువలన, కాకుత్స్థ = శత్రుఘ్నుడా ! త్వమ్ = నీవు, మయా సహ = నాతో కూడ, ఇహ = ఇక్కడ, సప్తరాత్రమ్ = ఏడు రోజులు, వస = నివసించుము. ఊర్ధ్వమ్=అటుపైన, సభృత్యబలవాహనః =భృత్యులతోను, సైన్యముతోను, వాహనములతోను కూడినవాడవై, మధురామ్= మధురను గూర్చి, గన్తాసి = వెళ్ళగలవు.

తా. "శత్రుఘ్నా, అందువలన నీవు నా దగ్గర ఒక వారము రోజులు ఉండుము. తరవాత నీ భృత్యులతోను, సైన్యముతోను, వాహనములతోను కలిసి మదురకు వెళ్ళగలవు." 17

మూ. రామస్యైతద్వచః శ్రుత్వా ధర్మయుక్తం మనోనుగమ్,
శత్రుఘ్నో దీనయా వాచా బాఢమిత్యేవ చాబ్రవీత్.18

ప్ర. అ రామస్య = రామునియొక్క, ధర్మయుక్తమ్ = ధర్మముతో కూడిన, మనోనుగమ్ = మనస్సుకు అనుకూలముగా ఉన్న, ఏతత్ వచః = ఈ వచనమును, శ్రుత్వా = విని, శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, దీనయా = దీనమైన, వాచా = వాక్కుతో, బాఢమ్ ఇత్యేవ చ = తప్పక అట్లే అని, అబ్రవీత్ = పలికెను.

తా. శత్రుఘ్నుడు ధర్మసంమతములు మనోహరములూ అయిన రాముని మాటలు విని దీనమైన వాక్కుతో "తప్పక అట్లే చేసెదను" అని పలికెను. 18

మూ. సప్తరాత్రం చ కాకుత్స్థో రాఘవస్య యథాజ్ఞయా,
ఉష్య తత్ర మహేష్వాసో గమనాయోపచక్రమే. 19

ప్ర. అ. మహేష్వాసః = గొప్ప ధనస్సు గల, కాకుత్స్థః = శత్రుఘ్నుడు, రాఘవస్య = రామునియొక్క, యథాజ్ఞయా = ఆజ్ఞానుసారముగా, సప్తరాత్రమ్ = ఒక వారము, తత్ర = అక్కడ, ఉష్య = ఉండి, గమనాయ = వెళ్ళుటకు, ఉప చక్రమే = ఉపక్రమించెను.

తా. మహాధనుర్ధరుడైన శత్రుఘ్నుడు రాముని ఆజ్ఞ ప్రకారము ఒకవారము అక్కడ ఉండి వెళ్ళుటకు ప్రయాణ మయ్యెను. 19

మూ. ఆమన్త్ర్య తు మహాత్మానం రామం సత్యపరాక్రమమ్,
భరతం లక్ష్మణం చైవ మహారథముపారుహత్. 20

ప్ర. అ. మహాత్మానమ్ = మహాత్ముడు, సత్యపరాక్రమమ్ = సత్యమైన పరాక్రమము కలవాడు అయిన, రామమ్ = రాముణ్ణి, భరతమ్ = భరతుణ్ణి, లక్ష్మణం చ ఏవ = లక్ష్మణుణ్ణి, ఆమన్త్ర్య = అనుమతింపచేసి, మహారథమ్ = గొప్ప రథమును, ఉపారుహత్ = ఎక్కెను.

తా. మహాత్ముడైన, సత్యమైన పరాక్రమము గల రామునివద్ద భరతుని వద్ద, లక్ష్మణుని వద్ద సెలవు తీసికొని మహారథముమ ఎక్కెను. 20

మూ. స దూరానుగతో వీరో లక్ష్మణేన మహాత్మనా,
భరతేన చ శత్రుఘ్నో జగామాశు పురీం తదా. 21

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ద్విసప్తతితమః సర్గః.

ప్ర అ. వీరః=వీరుడైన, సః శత్రుఘ్నః=ఆ శత్రుఘ్నుడు, మహాత్మనా =మహాత్ముడైన, లక్ష్మణేన=లక్ష్మణుని చేత, భరతేన=భరతునిచేత, దూరానుగతః=దూరము అనుసరించ బడినవాడై, తదా=అప్పుడు, ఆశు=శీఘ్రముగా, పురమ్=పట్టణమును గూర్చి, జగామ=వెళ్ళెను.

తా. అప్పుడు మహాత్ముడైన లక్ష్మణుడు, భరతుడు చాల దూరము వచ్చి సాగనంపగా వీరుడైన ఆ శత్రుఘ్నుడు, శీఘ్రముగా తన నగరమునకు వెళ్ళెను.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో డెబ్బది రెండవ సర్గ సమాప్తము.

అథ త్రిసప్తతితమః సర్గః

[ఒకనొక బ్రాహ్మణుడు మరణించిన బాలుడైన పుత్రుణ్ణి తీసికొని రాజద్వారము వద్దకు వచ్చి విలపించుట].

మూ. ప్రస్థాప్య స తు శత్రుఘ్నం భ్రాతృభ్యాం సహ రాఘవః,
ప్రముమోద సుఖీ రాజ్యం ధర్మేణ పరిపాలయన్. 1

ప్ర. అ. సః రాఘవః=ఆ రాముడు, శత్రుఘ్నమ్ శత్రుఘ్నుణ్ణి, ప్రస్థాప్య =పంపి,రాజ్యమ్=రాజ్యమును,ధర్మేణ=ధర్మముచేత,పరిపాలయన్=పాలించుచు, సుఖీ = సుఖవంతుడై, భ్రాతృభ్యాం సహ = ఇద్దరు సోదరులతో కూడ, ప్రముమోద = సంతోషించెను.

తా. రాముడు శత్రుఘ్నుణ్ణి పంపివేసి రాజ్యమును ధర్మముతో పరిపాలించుచు, సుఖవంతుడై లక్ష్మణ భరతులతో కూడ సంతోషముగా ఉండెను. 1

మూ. తతః కతిపయాహస్సు వృద్ధో జానపదో ద్విజః,
మృతం బాలముపాదాయ రాజద్వారముపాగమత్. 2

ప్ర. అ. తతః = అటు పిమ్మట, కతిపయాహస్సు = కొన్ని రోజులలో, వృద్ధః = వృద్ధుడైన, జానపదః = పల్లెకు సంబంధించిన, ద్విజః = బ్రాహ్మణుడు, మృతమ్ = మరణించిన, బాలమ్ = బాలుణ్ణి, ఉపాదాయ = గ్రహించి, రాజద్వారమ్ = రాజద్వారమును, ఉపాగమత్ = పొందెను.

తా. పిమ్మట కొన్నాళ్ళకు పల్లెటూరుకు చెందిన ఒక వృద్ధ బ్రాహ్మణుడు మరణించిన బాలుణ్ణి తీసికొని రాజద్వారము వద్దకు వచ్చెను. 2

మూ. రుదన్ బహువిధా వాచః స్నేహదుఃఖసమన్వితః,
అసకృత్ పుత్ర పుత్రేతి వాక్యమేతదువాచ హ. 3

ప్ర. అ. రుదన్ = ఏడ్చుచు, స్నేహదుఃఖసమన్వితః = పుత్ర ప్రేమతోను దుఃఖముతోను కూడినవాడై, పుత్ర పుత్ర ఇతి = పుత్రా పుత్రా అని, అసకృత్ = = మాటిమాటికి, బహువిధాః = అనేకవిధములైన, వాచః = వాక్కులను, (పలుకుచు), ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. ఆ బ్రాహ్మణుడు పుత్రప్రేమతోను, దుఃఖముతోను "పుత్రా! పుత్రా!" అని మాటి మాటికి అనేక విధములైన మాటలతో ఏడ్చుచు ఇట్లు పలికెను. 3

మూ. కిం ను మే దుష్కృతం కర్మ పురా దేహాన్తరే కృతమ్,
యదహం పుత్రమేకం తు పశ్యామి నిధనం గతమ్. 4

అప్రాప్తయౌవనం బాలం పఞ్చవర్షసహస్రకమ్,
అకాలే కాలమాపన్నం మమ దుఃఖాయ పుత్రక. 5

ప్ర. అ. పుత్రక = పుత్రా! పురా = పూర్వమునందు, దేహాన్తరే = మరొక దేహమునందు, మే = నాకు, కిమ్ = ఏ, దుష్కృతం కర్మ = పాపరూపమైన కర్మ, కృతమ్ = చేయబడినదో, యత్ = దేనివలన, అహమ్ = నేను, అప్రాప్త యౌవనమ్ = పొందబడని యౌవనము గలవాడు, పఞ్చవర్షసహస్రకమ్ = ఐదు వేల వర్షముల వయస్సు గలవాడు, మమ = నాయొక్క, దుఃఖాయ = దుఃఖము కొరకు, అకాలే = అకాలమునందు, కాలమ్ = మృత్యువును, ఆపన్నమ్ = పొందినవాడు, నిధనం గతమ్ = మరణించినవాడూ, బాలమ్ = బాలుడూ అయిన, ఏకం పుత్రమ్ = ఒక్క పుత్రుణ్ణి, పశ్యామి = చూచుచున్నానో.

తా. పుత్రా! నేను పూర్వజన్మలో ఎంత పాపము చేసితినో కదా! ఐదు వేల వర్షముల వయస్సునందు. యౌవనము పొందుటకు పూర్వమే నాకు దుఃఖము కలుగుటకై, అకాలమునందు మృత్యువు వాత పడి మరణించిన, బాలుడైన ఏకైక పుత్రుణ్ణి చూడవలసి వచ్చినది.

వి. "పఞ్చవర్ష సహస్రకమ్" అన్నప్పుడు "వర్ష" శబ్దానికి "సహస్ర సంవత్సరం సత్రముపాసీత" ఇత్యాది వాక్యములందు వలె దివసము అని అర్థ మనీ, అందుచేత కొందరి ప్రకారము దీనికి పదహారు సంవత్సరముల వయస్సు కలవాడు అనీ మరికొందరి ప్రకారము కొంచెము తక్కువ పద్నాలుగు సంవత్స రముల వయస్సు కలవాడు అనీ అర్థ మని తిలకవ్యాఖ్య. 4,5

మూ. అల్పైరహోభిర్నిధనం గమిష్యామి న సంశయః,
అహం చ జననీ చైవ తవ శోకేన పుత్రక. 6

ప్ర. అ. పుత్రక = పుత్రా! అల్పైః = అల్పములైన, అహోభిః=దినముల చేతనే, నిధనమ్ = మరణమును, గమిష్యామి = పొందగలను. సంశయః = సంశయము, న=లేదు, తవ శోకేన=నీ శోకముచేత,అహం చ=నేను, జననీ చైవ = నీ తల్లి కూడ మరణించగలము.

తా. పుత్రా! కొద్ది రోజులలోనే నేను మరణించెదను; సందేహము లేదు. నిన్ను గురించిన శోకముచేత, నేనూ, నీ తల్లి కూడ మరణించెదము. 6

మూ. నస్మరామ్యనృతం హ్యుక్తం నచ హింసాం స్మరామ్యహమ్,
సర్వేషాం ప్రాణినాం పాపం నస్మరామి కదాచన. 7

ప్ర. అ. అహమ్ = నేను, ఉక్తమ్ = పలకబడిన, అనృతమ్ = అసత్యమును గూర్చి, నస్మరామి = స్మరించను. హింసాం చ = హింసను కూడ, న స్మరామి = స్మరించను. కదాచన=ఎన్నడూ, సర్వేషామ్ = అన్ని, ప్రాణినామ్= ప్రాణులకూ కూడ, పాపమ్ = పాపమును, నస్మరామి = స్మరించను.

తా. నేను ఏనాడైనా అసత్యము పలికినట్లు కాని, హింస చేసినట్లు గాని, ఏ ప్రాణులవిషయమునందైనను పాపము ఆచరించినట్లు గాని నాకు జ్ఞాపకము లేదు. 7

మూ. కేనాద్య దుష్కృతేనాయం బాల ఏవ మమాత్మజః,
అకృత్వా పిత్కార్యాణి గతో వైవస్వతం క్షయమ్. 8

ప్ర. అ. అద్య=ఇప్పుడు, అయమ్=ఈ, మమ ఆత్మజః=నా కుమారుడు, బాలః ఏవ = బాలుడుగానే, పిత్కార్యాణి = పిత్కార్యములను, అకృత్వా = చేయకుండగా, కేన దుష్కృతేన = ఏ పాపముచేత, వైవస్వతక్షయమ్ = యమలోకమును గూర్చి, గతః = వెళ్లినాడు?

తా. నా పుత్రుడు తలిదండ్రులకు చేయవలసిన సేవాదులు, శ్రాద్ధాదులు చేయక మునుపే, బాలుడుగానే, ఏ పాపముచేత యమలోకమునకు వెళ్లినాడో కదా! 8

మూ. నేదృశం దృష్టపూర్వం మే శ్రుతం వా ఘోరదర్శనమ్,
మృత్యురప్రాప్తకాలానాం రామస్య విషయే యథా. 9

ప్ర. అ. రామస్య = రామునియొక్క, విషయే = దేశమునందు, అప్రాప్త కాలానామ్ = కాలము రానివారికే, యథా = ఎట్లు, మృత్యుః = మృత్యువు వచ్చినదో, ఈదృశమ్ = ఇట్టి, ఘోరదర్శనమ్ = ఘోరదర్శనము, న దృష్టపూర్వమ్ = పూర్వము చూడబడలేదు. న శ్రుతం వా = వినబడలేదు.

తా. రాముని దేశములో కాలము రానివారికే ఈ విధముగా మృత్యువు వచ్చు చున్నది. ఇట్టి ఘోరము పూర్వ మెన్నడూ నేను చూడలేదు, వినలేదు. 9

మూ. రామస్య దుష్కృతం కించిన్మహదస్తి న సంశయః,
యథా హి విషయస్థానాం బాలానాం మృత్యురాగతః. 10

ప్ర. అ. రామస్య = రామునియొక్క, కించిత్ = ఒకానొక, మహత్ = గొప్పదైన, దుష్కృతమ్ = పాపము, అస్తి = ఉన్నది; సంశయః = సంశయము, న = లేదు. యథా = ఎట్లు, విషయస్థానామ్ = దేశములో ఉన్న, బాలానామ్ = బాలులకు, మృత్యుః = మృత్యువు, ఆగతః = వచ్చినదో.

తా. దేశములో ఉన్న బాలులకు అకాలమరణము సంప్రాప్తించుచున్న దనగా తప్పక రాముని గొప్ప పాప మేదో ఉండి ఉండును. 10

మూ. న హ్యన్యవిషయస్థానాం బాలానాం మృత్యుతో భయమ్,
స రాజన్ జీవయైనం బాలం మృత్యువశం గతమ్.

ప్ర. అ. అన్యవిషయస్థానామ్ = ఇతరదేశములం దున్న, బాలానామ్ = బాలులకు, మృత్యుతః = మృత్యువువలన, భయమ్ = భయము, న హి = లేదు కదా? రాజన్ = రాజా! సః = అట్టి నీవు, మృత్యువశమ్ = మృత్యువశమును, గతమ్ = పొందిన, ఏనం బాలమ్ = ఈ బాలుణ్ణి, జీవయస్వ = జీవింపచేయుము.

తా. ఇతరదేశాలలో ఉన్న బాలులకు మృత్యుభయము లేదు కదా? అందు వలన, రాజా! మరణించిన ఈ బాలుణ్ణి బ్రతికించుము. 11

మూ. రాజద్వారి మరిష్యామి పత్న్యా సార్ధమనాథవత్,
బ్రహ్మహత్యాం తతో రామ సముపేత్య సుఖీ భవ. 12

ప్ర. అ. పత్న్యా సార్ధమ్=భార్యతో కూడ, రాజద్వారి = రాజద్వారమునందు, అనాథవత్=అనాథుడు వలె, మరిష్యామి=మరణించెదను. రామ=రామా! తతః = అటుపిమ్మట, బ్రహ్మహత్యామ్ = బ్రహ్మహత్యాపాపమును, సముపేత్య = పొంది, సుఖీ = సుఖవంతుడవు, భవ = అగుము.

తా. నేను, నా భార్యా కూడ అనాథులము వలె రాజద్వారమునందు మరణించెదము. రామా! పిమ్మట నీవు బ్రహ్మహత్యాపాపముతో సుఖముగా ఉండుము.

మూ. భ్రాతృభిః సహితో రాజన్ దీర్ఘమాయురవాప్స్యసి,
ఉషితాః స్మ సుఖం రాజ్యే తవాస్మిన్ సుమహాబల. 13

ప్ర. అ. రాజన్ = రాజా ! భ్రాతృభిః = సోదరులతో, సహితః = కూడినవాడవై, దీర్ఘమ్ = దీర్ఘమైన, ఆయుః = ఆయుర్దాయమును, అవాప్స్యసి = పొందగలవు. సుమహాబల=చాల గొప్ప బలము గలవాడా! తవ = నీయొక్క, అస్మిన్ రాజ్యే = ఈ రాజ్యమునందు, సుఖమ్ = సుఖముగా, ఉషితాః స్మ = ఉన్నాము.

తా. రాజా! సోదరులతో నీవు చాల కాలము జీవించుము. గొప్ప బలము కలవాడా! నీ ఈ రాజ్యములో ఎంతో సుఖముగా ఉన్నాము. 13

మూ. ఇదం తు పతితం తస్మాత్తవ రామ వశే స్థితాః,
కాలస్య వశమాపన్నాః స్వల్పం హి న హి నః సుఖమ్.

ప్ర. అ. రామ = రామా! ఇదం తు=ఇదియైతే, పతితమ్=వచ్చి పడినది. తస్మాత్=ఆ కారణమువలన, తవ వశే = నీ వశమునందు, స్థితాః=ఉన్న మేము, కాలస్య వశమ్=కాలవశమును, ఆపన్నాః=పొందినాము. నః=మాకు, స్వల్పమ్= స్వల్పమైన, సుఖమ్ = సుఖము కూడ, న హి = లేదు కదా?

వి. పదమూడవ శ్లోకానికి-"ఇంతవరకూ నీ రాజ్యంలో సుఖముగా ఉన్నాము; అందుచేత సోదరులతో దీర్ఘాయుర్దాయవంతుడవై వర్ధిల్లుము" అని భావ మని వ్యాఖ్యాతలు వ్రాసినారు. ఈ ఘట్టంలో దీనికి అధిక్షేపాపరముగానే భావము

చెప్పడం యుక్తంగా ఉంటుంది. "ఇలాంటి పుణ్యం చేసిన నీవు చాలాకాలం వర్ధిల్లు తావులే! ఆహా! నీ రాజ్యంలో మేము ఎంత సుఖంగా ఉన్నాము!" అని భావం చెపితే బాగుంటుంది. ఈ ఘట్టంలో పాచ్యపాఠంలోని శ్లోకాలు బాగున్నాయి.

"బ్రహ్మహత్యాం తతో రామః సముపేత్య సుఖీ భవేత్,
భ్రాతృభిః సహితో రాజా దీర్ఘమాయురవాప్నుయాత్.
ఉషితాః స్మ సుఖం రాజ్యే రాజ్ఞో దశరథస్య హ,
రామస్య విషయస్థానాం నాస్త్యల్పమపి నః సుఖమ్".

మూ. సంప్రత్యనాథో విషయ ఇక్ష్వాకూణాం మహాత్మనామ్,
రామం నాథమిహాసాద్య బాలాన్తకరణం ధ్రువమ్. 15

ప్ర. అ. బాలాన్తకరణమ్=బాలులకు మరణమును కలిగించు, రామమ్=రాముణ్ణి, నాథమ్=నాథుణ్ణిగా, ఆసాద్య=పొంది, ఇహ=ఇక్కడ, మహాత్మనామ్=మహాత్ములైన, ఇక్ష్వాకూణామ్=ఇక్ష్వాకురాజులయొక్క, విషయః=దేశము, సంప్రతి=ఇప్పుడు, అనాథః=నాథుడు లేనిది అయినది. ధ్రువమ్=నిశ్చయము.

తా. బాలుల మరణానికి హేతువైన రాముడు ఇప్పుడు నాథుడుగా వచ్చిన తరవాత, ఇక్ష్వాకురాజులు పాలించిన ఈ దేశము నాథుడు లేనిది అయినది. 15

మూ. రాజదోషైర్విపద్యన్తే ప్రజా హ్యవిధిపాలితాః,
అసద్వృత్తే హి నృపతావకాలే మ్రియతే జనః. 16

ప్ర. అ. అవిధిపాలితాః=శాస్త్రవిరుద్ధముగా పాలింపబడిన, ప్రజాః=ప్రజలు, రాజదోషైః=రాజుయొక్క దోషములచేత, విపద్యన్తే=ఆపదలు చెందుదురు. నృపతౌ=రాజు, అసద్వృత్తే=చెడ్డ నడవడిక కలవాడగుచుండగా, జనః=జనము, అకాలే=అకాలమునందు, మ్రియతే, హి=మరణించును కదా.

తా. శాస్త్రవిరుద్ధమైన రీతిలో పాలింపబడిన ప్రజలు రాజు చేసిన దోషాలకు ఆపదలు చెందుదురు. రాజు చరిత్ర మంచిది కానిచో జనులు అకాలమరణము చెందుదురు. 16

మూ. యద్వా పురేష్వయుక్తాని జనా జనపదేషు చ,
కుర్వతే న చ రక్షాస్తి తదా కాలకృతం భయమ్. 17

ప్ర. అ. యద్వా = లేదా, పురేషు = పట్టణములయందు, జనపదేషు చ = గ్రామములయందు, జనాః = జనులు, అయుక్తాని = అయుక్తకార్యములను, కుర్వతే = చేయుచుందురు; రక్షా = రక్షణము, న చ అస్తి = ఉండదు: తదా = అప్పుడు కూడ, కాలకృతమ్ = మృత్యువుచేత చేయబడిన, భయమ్ = భయము కలుగును.

తా. లేదా-పురములందు, గ్రామములందు నివసించు జనులు అయుక్త కార్యములు చేయుచున్నప్పుడు, రక్షణము లేనప్పుడు కూడ జనులకు మృత్యు భయము కలుగుచుండును. 17

మూ. సువ్యక్తం రాజదోషో హి భవిష్యతి న సంశయః,
పురే జనపదే చైవ తతో బాలవధో హ్యయమ్. 18

ప్ర. అ. సువ్యక్తమ్ = సుస్పష్టముగా, రాజదోషః = రాజదోషమే, భవిష్యతి = అయి ఉండును. సంశయః = సంశయము, న = లేదు. తతః = అందువలననే, పురే = పురమునందు, జనపదే చైవ = జనపదమునందు, అయమ్ = ఈ బాలవధః = బాలుల మరణము.

తా. ఇది తప్పక రాజదోషమే. సందేహము లేదు. అందుచేతనే పురముల లోను, గ్రామాలలోను బాలులు మరణించుచున్నారు. 18

మూ. ఏవం బహువిధైర్వాక్యైరుపరుధ్య ముహుర్ముహుః,
రాజానం దుఃఖసంతప్తః సుతం తముపగూహతి. 19

ఇత్యార్షే శ్రీమదార్షరామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
త్రిసప్తతితమః సర్గః.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, బహువిధైః = అనేకవిధములైన, వాక్యైః = వాక్యములతో, ముహుః ముహుః = మాటిమాటికి, రాజానమ్ = రాజును, ఉపరుధ్య =

నిర్బంధించి, దుఃఖసంతప్తః = దుఃఖపీడితుడై, తం సుతమ్ = ఆ పుత్రుణ్ణి, ఉప గూహతి = కౌగలించుకొనుచున్నాడు.

తా. ఇట్లు ఆ బ్రాహ్మణుడు అనేకవిధములైన మాటలచేత రాజును మాటి మాటికి నిర్బంధించుచు దుఃఖపీడితుడై ఆ పుత్రుణ్ణి కౌగలించుకొనుచుండెను. 19

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో డెబ్బైమూడవ సర్గ సమాప్తము.

అథ చతుఃసప్తతితమః సర్గః

[తపస్సు చేయుచున్న శూద్రుడు అధర్మముచేయుటయే బ్రాహ్మణ పుత్రుని మరణమునకు హేతువు అని నారదుడు రామునకు తెలుపుట].

మూ. తథా తు కరుణం తస్య ద్విజస్య పరిదేవనమ్,
శుశ్రావ రాఘవః సర్వం దుఃఖశోకసమన్వితమ్. 1

ప్ర. అ. రాఘవః = రాముడు, దుఃఖశోకసమన్వితమ్ = దుఃఖశోకములతో కూడిన, కరుణమ్ = దీనమైన, సర్వమ్ = సమస్తమైన, ద్విజస్య = బ్రాహ్మణుని యొక్క, తథా = అట్లు, పరిదేవనమ్ = విలాపమును, శుశ్రావ = వినెను.

తా. రాముడు దుఃఖముతోను, శోకముతోను కూడిన ఆ బ్రాహ్మణుడు చేసిన దీనమైన ఆ విలాపమునంతనూ వినెను 1

మూ. స దుఃఖేన చ సంతప్తో మన్త్రిణస్తానుపాహ్వయత్,
వసిష్ఠం వామదేవం చ భ్రాతృంశ్చ సహ నైగమాన్. 2

ప్ర. అ. సః = రాముడు, దుఃఖేన = దుఃఖముచేత, సంతప్తః = పీడితుడై, తాన్ = ఆ, మన్త్రిణః = మంత్రులనూ, వసిష్ఠమ్ = వసిష్ఠుని, వామదేవం చ = వామదేవునీ, సహనైగమాన్ = ఆ యా గణప్రముఖులతో కూడిన, భ్రాతృన్ చ = సోదరులను, ఆహ్వయత్ = పిలచెను.

తా. ఆ రాముడు దుఃఖముతో కూడినవాడై, మంత్రులను, వసిష్ఠవామదేవులను, సోదరులను, ఆ యా గణప్రముఖులను పిలిపించెను. 2

మూ. తతో ద్విజా వసిష్ఠేన సార్ధమష్టౌ ప్రవేశితాః,
రాజానం దేవసంకాశం వర్ధస్వేతి తతోఽబ్రువన్. 3

ప్ర. అ. తతః = అటుపిమ్మట, వసిష్ఠేన సార్ధమ్ = వసిష్ఠునితో కూడ,

ప్రవేశితాః = ప్రవేశ పెట్టబడిన, అష్టౌ = ఎనమండుగురు, ద్విజాః = బ్రాహ్మణులు, తతః = అటుపిమ్మట, దేవసంకాశమ్ = దేవతలతో సమానుడైన, రాజానమ్ = రాజును గూర్చి, వర్ధస్వ = వృద్ధిపొందుము, ఇతి = అని, అబ్రువన్ = పలికిరి.

తా. పిమ్మట వసిష్ఠునితో కలిసి ప్రవేశ పెట్టబడిన ఎనమండుగురు బ్రాహ్మణులు దేవతుల్యుడైన రాజును "విజయీ భవ"అని పలికి ఆశీర్వదించిరి. 3

మూ. మార్కణ్డేయోఽథ మౌద్గల్యో వామదేవశ్చ కాశ్యపః,
కాత్యాయనోఽథ జాబాలిర్గౌతమో నారదస్తథా, 4
ఏతే ద్విజర్షభాః సర్వే ఆసనేష్వపవేశితాః.

ప్ర. అ. మార్కణ్డేయః = మార్కండేయుడు, అథ = పిమ్మట, మౌద్గల్యః = మౌద్గల్యుడు, వామదేవశ్చ = వామదేవుడు, కాశ్యపః = కాశ్యపుడు, కాత్యాయనః = కాత్యాయనుడు, అథ = మరియు, జాబాలిః = జాబాలి, గౌతమః = గౌతముడు, తథా = మరియు, నారదః = నారదుడు, ఏతే = ఈ, సర్వే = సమస్త మైన, ద్విజర్షభాః = బ్రాహ్మణశ్రేష్ఠులు, ఆసనేషు = ఆసనములయందు, ఉపవేశితాః = కూర్చుండబెట్టబడిరి.

తా. మార్కండేయుడు, మౌద్గల్యుడు, వామదేవుడు, కాశ్యపుడు, కాత్యాయనుడు, జాబాలి, గౌతముడు, నారదుడు ఈ బ్రాహ్మణోత్తము లందరూ ఆసనములమీద కూర్చుండబెట్టబడిరి. 4

మూ. మహర్షీన్ సమనుప్రాప్తానభివాద్య కృతాఞ్జలిః, 5
మన్త్రిణో నైగమాశ్చైవ యథార్హమనుకూలితాః.

ప్ర. అ. సమనుప్రాప్తాన్ = వచ్చిన, మహర్షీన్ = మహర్షులను, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి కలవాడై, అభివాద్య = నమస్కరించి(ఆదరించెను). మన్త్రిణః = మంత్రులూ, నైగమాః చ ఏవ = నైగములు, యథార్హమ్ = తగు విధముగా, అనుకూలితాః = అనుకూలులుగా చేసికొనబడినారు.

తా. వచ్చిన మహర్షులకు రాముడు అంజలి ఘటించి నమస్కరించెను. మంత్రులను, నైగములను తగు విధముగా అనుకూలము చేసికొనెను.

మూ. తేషాం సముపవిష్టానాం సర్వేషాం దీప్తతేజసామ్, 6
రాఘవః సర్వమాచష్టే ద్విజోఽయముపరోధతి.

ప్ర. అ. సముపవిష్టానామ్=కూర్చున్న, దీప్తతేజసామ్ = ప్రకాశించుచున్న తేజస్సు గల, తేషామ్ = ఆ, సర్వేషామ్ = అందరికి, రాఘవః = రాముడు, అయమ్ = ఈ, ద్విజః = బ్రాహ్మణుడు, ఉపరోధతి = నిర్బంధించుచున్నాడు అని, సర్వమ్ = సమస్తమునూ, ఆచష్టే = చెప్పెను.

తా. తేజస్సుతో ప్రకాశించుచున్న వారందరూ కూర్చున్న పిమ్మట రాముడు "ఈ బ్రాహ్మణుడు మొండి పట్టు పట్టుచున్నాడు"అని ఆ విషయ మంతా చెప్పెను.

మూ. తస్య తద్వచనం శ్రుత్వా రాజ్ఞో దీనస్య నారదః, 7
ప్రత్యువాచ శుభం వాక్యమృషిణాం సంనిధౌ స్వయమ్.

ప్ర. అ. దీనస్య = దీనుడైన, తస్య రాజ్ఞః=ఆ రాజుయొక్క, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, నారదః = నారదుడు, ఋషీణామ్ = ఋషులయొక్క, సంనిధౌ = సంనిధియందు, స్వయమ్=స్వయముగా, శుభమ్= శుభమైన, వాక్యమ్ = వాక్యమును, ప్రత్యువాచ = బదులు చెప్పెను.

తా. దీనుడైన రాజు మాటలు విని ఆ ఋషుల సమక్షమునందు నారదుడు శుభమైన కాక్యము పలికెను. 7

మూ. శృణు రాజన్ యథాకాలే ప్రాప్తో బాలస్య సంక్షయః, 8
శ్రుత్వా కర్తవ్యతాం రాజన్ కురుష్వ రఘునన్దన.

ప్ర. అ. రాజన్=రాజా! బాలస్య=బాలునియొక్క, సంక్షయః=మరణము, అకాలే = అకాలమునందు, యథా = ఎట్లు, ప్రాప్తః = వచ్చినదో, శృణు = వినుము. రాజన్ = రాజా! రఘునన్దన = రామా! శ్రుత్వా = విని, కర్తవ్యతామ్= చేయదగినదానిని, కురుష్వ = చేయుము.

తా. రాజా! బాలునకు అకాలమరణము ఎట్లు ప్రాప్తించినదో వినుము. రామా! విని ఏమి చేయవలెనో చేయుము. 8

మూ. పురా కృతయుగే రాజన్ బ్రాహ్మణా వై తపస్వినః, 9
అబ్రాహ్మణస్తదా రాజన్న తపస్వీ కథంచన,

ప్ర. అ. రాజన్=రాజా! పురా = పూర్వము, కృతయుగే=కృతయుగము నందు, బ్రాహ్మణాః వై=బ్రాహ్మణులే, తపస్వినః=తపస్సుచేయువారు. రాజన్= రాజా! తదా = అప్పుడు, అబ్రాహ్మణః = బ్రాహ్మణభిన్నుడు, కథంచన = ఏ విధముగానూ కూడ, తపస్వీ = తపస్సుకలవాడుగా, న = లేడు.

తా. రాజా! పూర్వము కృతయుగములో బ్రాహ్మణులు మాత్రమే తపస్సు చేసుకొనేవారు. బ్రాహ్మణులు కానివారు ఏ విధముగానూ కూడ తపస్సు చేసికొనే వారు కారు. 9

మూ. తస్మిన్ యుగే ప్రజ్వలితే బ్రహ్మభూతే త్వనావృతే, 10
అమృత్యవస్తదా సర్వే జజ్ఞిరే దీర్ఘదర్శినః.

ప్ర. అ. ప్రజ్వలితే = ప్రకాశించుచున్న, బ్రహ్మభూతే = బ్రహ్మమయమైన. అనావృతే = అజ్ఞానావరణము లేని, తస్మిన్ యుగే = ఆ యుగమునందు, సర్వే=అందరూ, అమృత్యవః=మృత్యువు లేనివారుగాను, దీర్ఘదర్శినః=దీర్ఘదృష్టి గలవారుగాను, జజ్ఞిరే = అయిరి.

తా. ఆ యుగము అజ్ఞానావరణము లేక బ్రహ్మమయమై ప్రకాశించుచుండెను. అప్పుడు అందరు మృత్యువు లేనివారై త్రికాలజ్ఞానము కలవారై ఉండిరి.

ప్రాచ్యపాఠంలో పై రెండు శ్లోకాలు ఈ విధంగా ఉన్నాయి:-

"పురా కృతయుగే రామ బ్రహ్మ సర్వమనుత్తమమ్,
అబ్రాహ్మణో న వై కశ్చిదతపాశ్చ న విద్యతే".

"తస్మిన్ యుగే ప్రజ్వలితే బ్రహ్మభూతే హ్యనాపది,
అమృత్యవో ద్విజాః సర్వే జాయన్తే విగతామయాః".

రామా! పూర్వము కృతయుగములో సర్వమూ బ్రహ్మమయమై అత్యుత్తమ స్థితిలో ఉండెడిది. అబ్రాహ్మణుడు గాని, తపస్సులేనివాడు గాని ఎవ్వడూ ఉండెడివాడు కాదు". "ఈ బ్రహ్మమయ మైన ఆపదలు లేని ఆ యుగము దేదీప్యమానముగా ప్రకాశించుచున్నప్పుడు ద్విజు లందరు (అందరూ ద్విజులే) మృత్యువు (అకాలమృత్యువు) లేనివారై రోగములు లేనివారై ఉండిరి.

మూ. తతస్త్రేతాయుగం నామ మానవానాం వపుష్మతామ్, 11
క్షత్రియా యత్ర జాయన్తే పూర్వేణ తపసాన్వితాః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, వపుష్మతామ్ = దృఢదేహముగల, మానవానామ్ = మనువంశసంజాతులయొక్క, త్రేతాయుగం నామ = త్రేతాయుగ మనునది వచ్చినది. యత్ర = దేనియందు, క్షత్రియాః = క్షత్రియులు, పూర్వేణ = వెనుకటి బ్రాహ్మణునితోకూడ, తపసా = తపస్సుతో అన్వితాః = కూడినవారు.

తా. తరువాత వచ్చిన దృఢశరీరములు గల మనువంశీయులకు చెందిన త్రేతాయుగములో క్షత్రియులు కూడా బ్రాహ్మణులతో పాటు తపస్సుకలవారు అగుదురు. 11

మూ. వీర్యేణ తపసా చైవ తేఽధికాః పూర్వజన్మని, 12
మానవా యే మహాత్మానస్త్రేతాయుగే యుగే.

ప్ర. అ. పూర్వజన్మని = కృతయుగజన్మ యందు, తే = బ్రాహ్మణులు, వీర్యేణ = పరాక్రమముచేత, తపసా చైవ = తపస్సుచేతా, అధికాః = అధికులు. త్రేతాయుగే = త్రేతాయుగ మను, తత్ర = ఆ, యుగే = యుగమునందు, యే = ఎవరు, మానవాః = మనువంశమునందు పుట్టినారో వారు, మహాత్మానః = మహాత్ములు.

తా. కృతయుగమునందు వీర్యముచేతా, తపస్సుచేతా కూడ బ్రాహ్మణులు అధికులు. త్రేతాయుగములో మనువంశమునందు పుట్టిన క్షత్రియులు తపోవీర్యములచేత మహాత్ములు. కృతయుగములో బ్రాహ్మణులు మాత్రమే నిత్యనైమిత్తికాది కర్మలే కాక కాయక్లేశరూపమైన తపస్సు కూడ చేసేవారు. అందుచే వాళ్లే సర్వాధికులు. త్రేతాయుగము వచ్చుసరికి క్షత్రియులు కూడ తపస్సు చేసేవారు. అందుచేత వారు కూడ మహాత్ములే కాని వీరు కృతయుగబ్రాహ్మణుల కంటె తక్కువవారు. 12

మూ. బ్రహ్మ క్షత్రం చ తత్సర్వం యత్పూర్వమవరం చ యత్,
యుగయోరుభయోరాసీత్సమవీర్యసమన్వితమ్.

ప్ర. అ. ఉభయోః = రెండు, యుగయోః = కృతత్రేతాయుగములలో,

యత్ = ఏ, బ్రహ్మ = బ్రాహ్మణజాతి, పూర్వమ్ = కృతయుగములో ఆధిక్యము కలదై ఉండెడిదో, యత్ = ఏ, క్షత్రమ్ = క్షత్రియజాతి, అవరం చ = కృత యుగములో తక్కువదిగా ఉండెడిదో, తత్ = ఆది, సర్వమ్ = అంతా (బ్రాహ్మణ క్షత్రియజాతిద్వయము) సమవీర్యసమన్వితమ్ = సమానమైన వీర్యముతో కూడినది, ఆసీత్ = ఆయెను.

తా. కృతయుగములో బ్రాహ్మణజాతి తపోవీర్యములచేత అధికముగా ఉండెడిది. అప్పుడు క్షత్రియజాతి తక్కువగా ఉండెడిది. త్రేతాయుగములో క్షత్రియజాతికి కూడ తపస్సు ఉండుటచేత అపుడు ఈ రెండు జాతులూ తపోవీర్య ములచేత సమానములైనవి. త్రేతాయుగబ్రాహ్మణజాతి కూడ కృతయుగ బ్రాహ్మణ జాతికంటె న్యూనమే. 13

మూ. అపశ్యన్తస్తు తే సర్వే విశేషమధికం తతః, 14
స్థాపనం చక్రిరే తత్ర చాతుర్వర్ణ్యస్య సంమతమ్.

ప్ర. అ. తే సర్వే = ఆ శాస్త్రనిర్మాతలందరూ, తతః = అటుపైన, అధికమ్ = అధికమైన, విశేషమ్ = భేదమును, అపశ్యన్తః = చూడనివారై, తత్ర = అక్కడ, సంమతమ్ = అందరికీ ఇష్టమైన, చాతుర్వర్ణ్యస్య = నాలుగు వర్ణములయొక్క, స్థాపనమ్ = స్థాపనమును, చక్రిరే = చేసిరి.

తా. అప్పుడు శాస్త్రనిర్మాతలు బ్రాహ్మణక్షత్రియులలో భేదము అధిక ముగా లేకపోవుటచేత అందరికీ సంమతమైన చాతుర్వర్ణ్యమును ఏర్పాటు చేసిరి.

మూ. తస్మిన్ యుగే ప్రజ్వలితే ధర్మభూతే హ్యనావృతే. 15
అధర్మః పాదమేకం తు పాతయత్ పృథివీతలే,
అధర్మేణ తు సంయుక్తస్తేజోమన్దం భవిష్యతి. 16

ప్ర. అ. ("అధర్మేణ తు సంయుక్తాస్తేజోమన్దాస్తదా హి తే" అను ప్రాచ్య పాఠము భాగున్నది). ధర్మభూతే = ధర్మప్రచురమైన, అనావృతే = అధర్మావరణము లేని, తస్మిన్ = ఆ, యుగే = యుగము, ప్రజ్వలితే = ప్రకాశించుచుండగా, అధర్మః = అధర్మము, ఏకం పాదమ్ = ఒక పాదమును, పృథివీతలే = భూమి మీద, పాతయత్ = ఉంచెను. అధర్మేణ = అధర్మముతో, సంయుక్తాః = కూడిన,

తే = వాళ్లు, తదా = అప్పుడు, తేజోమన్తాఃహి = తేజస్సుచేత మంచులుగా అయిరి కదా?

తా. ధర్మ్రప్రచుర మై అధర్మావరణము లేని త్రేతాయుగము ప్రకాశించు చుండగా భూమిమీద అధర్మము ఒక పాదమును ఉంచెను. అప్పుడు అధర్మ సంబంధముచే వాళ్ళ తేజస్సు కొంచెము తగ్గినది. 15,16

మూ. ఆమిషం యచ్చ పూర్వేషాం రాజసం చ మలం భృశమ్,
అనృతం నామ తద్భూతం క్షిప్తేన పృథివీతలే. 17

ప్ర. అ. పృథివీతలే = భూమిమీద, క్షిప్తేన=ఉంచబడిన అధర్మపాదము చేత, పూర్వేషామ్=పూర్వికులకు, యత్ = ఏది, ఆమిషమ్=మాంసము వంటిదో, రాజసమ్ = రజోగుణప్రధానమైన, మలమ్ = మలము వంటిదో, తత్ = ఆ, అనృతమ్ = కృష్యాదికముగా, భృశమ్ = మిక్కిలి, భూతమ్ = అయినది.

తా. భూమిమీద అధర్మపాదము ప్రసరించుటచేత అంతకు పూర్వము ఏ కృష్యాదికమును మాంసమును వలె, రజోగుణజన్యమైన మలమును వలె పూర్వులు పరిహరించిరో అట్టి అనృతము (కృష్యాదికము) అధికముగా ప్రచారములోనికి వచ్చెను. 17

మూ. అనృతం పాతయిత్వా తు పాదమేకమధర్మతః,
తతఃప్రాదుష్కృతం పూర్వమాయుషఃపరినిష్ఠితమ్. 18

ప్ర. అ. ఏకమ్=ఒక, పాదమ్ = పాదమును, అనృతమ్=అనృతమును, పాతయిత్వా=ప్రవర్తింపచేసి, తతః = ఆటుపిమ్మట, అధర్మతఃఅధర్మముచేత, పూర్వమ్ = పూర్వమైన, ఆయుషః = ఆయుర్దాయముయొక్క, పరినిష్ఠితమ్ = పరిమాణము, ప్రాదుష్కృతమ్ = తగ్గించబడినది.

తా. అధర్మము ఒక పాదము అనృతమును ప్రవర్తింపజేసి పిదప పూర్వము (కృతయుగములో) ఉన్న ఆయుర్దాయప్రమాణమును కూడ తగ్గించినది. 18

మూ. పాతితే త్వనృతే తస్మిన్నధర్మేణ మహీతలే,
శుభాన్యేవాచరల్లోకఃసత్యధర్మపరాయణఃః. 19

ప్ర. అ. అధర్మేణ = అధర్మముచేత, మహీతలే = భూమిమీద, తస్మిన్ అనృతే = ఆ అనృతము, పాతితే = పడవేయబడినదగుచుండగా, లోకః = లోకము, సత్యధర్మపరాయణః = సత్యధర్మపరమై, శుభాన్యేవ = మంచి కార్యములనే, ఆచరత్ = చేసెను.

తా. అధర్మము భూమిమీద అనృతమును ప్రసరింపచేసినను లోకము సత్యధర్మములందు ఆసక్తి కలదై శుభకర్మలను మాత్రమే చేసెను. 19

మూ. త్రేతాయుగే చ వర్తన్తే బ్రాహ్మణాః క్షత్రియాశ్చ యే.
తపోఽతప్యన్త తే సర్వే శుశ్రూషామపరే జనాః. 20

ప్ర. అ. త్రేతాయుగే = త్రేతాయుగమునందు, యే = ఏ, బ్రాహ్మణాః = బ్రాహ్మణులు, క్షత్రియాః చ = క్షత్రియులు, వర్తన్తే = ఉన్నారో, తే సర్వే = వాళ్లందరూ, తపః = తపస్సును, అతప్యన్త = చేసిరి. అపరే జనాః = ఇతరజనులు, శుశ్రూషామ్ = శుశ్రూషను చేసిరి.

తా. త్రేతాయుగములో బ్రాహ్మణులూ క్షత్రియులూ కూడ తపస్సు చేసిరి. ఇతరజనులు మాత్రము వాళ్ల శుశ్రూష చేసిరి. 20

మూ. స ధర్మః పరమస్తేషాం వైశ్యశూద్రం తదాగమత్,
పూజాం చ సర్వవర్ణానాం శూద్రాశ్చక్రుర్విశేషతః. 21

ప్ర. అ. తదా = అప్పుడు, సః = అది, పరమః = గొప్ప, ధర్మః = ధర్మముగా, తేషామ్ = వారిలో, వైశ్యశూద్రమ్ = వైశ్యశూద్రులను, అగమత్ = పొందెను. శూద్రాః = శూద్రులు, విశేషతః = విశేషించి, సర్వవర్ణానామ్ = సమస్తవర్ణముల యొక్క, పూజామ్ = పూజను, చక్రుః = చేసిరి.

తా. వారిలో శుశ్రూషారూపమైన ధర్మము వైశ్యశూద్రుల పరమధర్మముగా ఏర్పడెను. విశేషించి శూద్రులు సమస్తవర్ణముల పూజను చేసిరి. 21

మూ. ఏతస్మిన్నన్తరే తేషామధర్మే చానృతే చ హ,
తతః పూర్వో పునర్వార్ధిసమగమన్నృపసత్తమ. 22

ప్ర. అ. నృపసత్తమ = రాజశ్రేష్ఠుడా ! తేషామ్ = వైశ్యశూద్రులకు, అధర్మే

చ = అధర్మము. అన్యతే చ = అన్యతము ఏర్పడగా, ఏతస్మిన్ అన్తరే = ఈ మధ్యయందు, తతః = పిమ్మట, పూర్వే = మొదటివారు, హ్రాసమ్ = తేజస్సు మొదలైనవాటియొక్క హ్రాసమును, అగమన్ = పొందిరి.

తా. ఓ! రాజశ్రేష్ఠుడా! వైశ్యశూద్రులకు అధర్మము అన్యతము సంక్రమించిన పిదప ఈ మధ్యకాలములో అనగా (త్రేతాద్వాపరసంధికాలములో అని వ్యాఖ్యాతలు) వెనుకటివారికి, అనగా బ్రాహ్మణక్షత్రియులకు, కూడ తేజోహ్రాసము కలిగెను. 22

మూ. తతః పాదమధర్మస్య ద్వితీయమవతారయత,
తతో ద్వాపరసంజ్ఞా సా యుగస్య సమజాయత. 23

ప్ర. అ. తతః = అటుపిమ్మట, అధర్మస్య = అధర్మముయొక్క, ద్వితీయమ్ = రెండవ, పాదమ్ = పాదము, అవతారయత్ = దిగెను. తతః = అందువలన, యుగస్య = ఆ యుగమునకు, ద్వాపరసంజ్ఞా = ద్వాపరసంజ్ఞ, సమజాయత = కలిగెను.

తా. పిదప రెండవ అధర్మపాదము భూమిమీద దిగెను. అందువలన ఆ యుగమునకు "ద్వాపరము" అను పేరు వచ్చెను. 23

మూ. తస్మిన్ ద్వాపరసంజ్ఞే తు వర్తమానే యుగే నృప,
అధర్మశ్చాన్యతం చైవ వవృధే పురుషర్షభ. 24

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! నృప = రాజా! ద్వాపరసంజ్ఞే = ద్వాపర మను పేరు గల, తస్మిన్ = ఆ యుగము, వర్తమానే = జరుగుచుండగా, అధర్మః చ = అధర్మము, అన్యతం చైవ = అన్యతము, వవృధే = వృద్ధిపొందును.

తా. పురుషశ్రేష్ఠుడవైన రాజా! ద్వాపర మను పేరు గల ఆ యుగము జరుగుచున్నప్పుడు అధర్మము, అన్యతము వృద్ధిపొందెను (పొందును). 24

మూ. అస్మిన్ ద్వాపరసంఖ్యానే తపో వైశ్యాన్ సమావిశత్,
త్రిభ్యో యుగేభ్యస్త్రీన్ వర్ణాన్ క్రమాద్వై తప ఆవిశత్.

ప్ర. అ. అస్మిన్ = ఈ, ద్వాపరసంఖ్యానే = ద్వాపర మను పేరు గల

యుగమునందు, తపః = తపస్సు, వైశ్యాన్ = వైశ్యులను, సమావిశత్ = ప్రవేశించెను, త్రిభ్యః=మూడు, యుగేభ్యః=యుగములవలన, తపః=తపస్సు, త్రీన్=మూడు, వర్ణాన్ = వర్ణములను, క్రమాత్ = క్రమమువలన, ఆవిశత్ వై = ప్రవేశించినది.

తా. ఈ ద్వాపరయుగములో తపస్సు వైశ్యులకు కూడ సంక్రమించెను. ఈ విధముగ తపస్సు మూడు యుగములలో క్రమముగా మూడు వర్ణములలో ప్రవేశించెను. 25

మూ. త్రిభ్యో యుగేభ్యస్త్రీన్ వర్ణాన్ ధర్మశ్చ పరినిష్ఠితః,
న శూద్రో లభతే ధర్మం యుగతస్తు నరర్షభ. 26

ప్ర. అ. నరర్షభ = నరశ్రేష్ఠా! త్రిభ్యః=మూడు, యుగేభ్యః = యుగముల వలన, ధర్మః = తపస్సు, త్రీన్ వర్ణాన్ = మూడు వర్ణములను, పరినిష్ఠితః = ఆశ్రయించి ఉన్నది. యుగతః = యుగానుసారముగా, శూద్రః = శూద్రుడు, ధర్మమ్ = ధర్మమును, న లభతే = పొందడు.

తా. రామా! మూడు యుగములందు తపస్సు మూడు వర్ణములవారిలో ఉన్నది. యుగానుసారము శూద్రునకు ధర్మము (తపస్సు) లభ్యము కాదు. 26

మూ. హీనవర్ణో నృపశ్రేష్ఠ తప్యతే న హి వై తపః,
భావినీ శూద్రయోన్యాం తు తపశ్చర్యా కలౌ యుగే. 27

ప్ర. అ. నృపశ్రేష్ఠ = రాజులలో శ్రేష్ఠుడా! హీనవర్ణః = శూద్రుడు, తపః = తపస్సును, న హి వై తప్యతే = చేయడు. కలౌ యుగే = = కలియుగము నందు, శూద్రయోన్యామ్ = శూద్రయోనియందు, తపశ్చర్యా = తపశ్చర్య. భావినీ = కాగలదు.

తా. రాజులలో శ్రేష్ఠుడవైన రామా! శూద్రుడు తపస్సు చేయకూడదు. కాని కలియుగములో శూద్రునికి కూడ తపస్సు చేయుట ఉండగలదు. 27

మూ. అధర్మః పరమో రాజన్ ద్వాపరే శూద్రజన్మనః,
స వై విషయపర్యన్తే తవ రాజన్ మహాతపాః. 28
అద్య తప్యతి దుర్బుద్ధిస్తేన బాలవధో హ్యయమ్,

ప్ర. అ. రాజన్ = రాజా! ద్వాపరే = ద్వాపరమునందు కూడ, శూద్ర జన్మనః = శూద్రునకు, పరమః = గొప్ప, అధర్మః = అధర్మము. రాజన్ = రాజా! తవ = నీయొక్క, విషయపర్యన్తే = దేశ ప్రాంతమునందు, మహాతపాః = గొప్ప తపస్సు గల, దుర్బుద్ధిః = దుర్బుద్ధి యైన, సః = ఆ శూద్రుడు, అద్య = ఇప్పుడు, తప్యతి = తపస్సు చేయుచున్నాడు. తేన = ఆ కారణముచేతనే, అయమ్ = ఈ, బాలవధః = బాలుని మృతి.

తా. రాజా! ద్వాపరయుగమునందు కూడ శూద్రుడు తపస్సు చేయుట గొప్ప అధర్మము. నీ దేశము ప్రాంతమునందు గొప్ప తపస్సు గల, దుర్బుద్ధి యైన శూద్రుడు తపస్సు చేయుచున్నాడు. అందువలననే ఈ బాలుడు మృతి చెందినాడు. 28

మూ. యో హ్యధర్మమకార్యం వా విషయే పార్థివస్య తు, 29
కరోతి చాశ్రీమూలం తత్పురే వా దుర్మతిర్నరః,
క్షిప్రం చ నరకం యాతి న చ రాజా న సంశయః. 30

ప్ర. అ. దుర్మతిః = దుష్టబుద్ధి గల, యః నరః = ఏ నరుడు, పార్థివస్య = రాజాయొక్క, విషయే = దేశమునందు గాని, పురే వా = పురమునందు గాని, అధర్మమ్ = అధర్మమును గాని, అకార్యం వా = అకార్యమును కాని, కరోతి = చేయునో, తత్ = అది, అశ్రీమూలమ్ = అలక్ష్మికి మూలము. సః రాజా చ = ఆ రాజా కూడ, క్షిప్రమ్ = శీఘ్రముగా, నరకమ్ = నరకమును గూర్చి, యాతి = వెళ్ళును. సంశయః = సంశయము, న = లేదు.

తా. దుర్మతియైన ఏ నరుడైనా రాజాయొక్క రాజ్యమునందు గాని, పురమునందు గాని, అధర్మమును గాని, చేయకూడని పని కాని చేసినచో అది అలక్ష్మిని కలిగించును. ఆ రాజా కూడ వెంటనే నరకములలో పడును. సంశయము లేదు. 30

మూ. అధీతస్య చ తప్తస్య కర్మణః సుకృతస్య చ,
షష్ఠం భజతి భాగం తు ప్రజా ధర్మేణ పాలయన్. 31

తా. రామా! ఎక్కడ పాపకార్యము జరుగుచున్నదో చూచుటకు ప్రయత్నము చేయుము. ఇట్లు చేసినచో ధర్మమునకు వృద్ధి, మానవులకు ఆయుర్వృద్ధి కలుగును. ఈ బాలుడు కూడ జీవించును. 33

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో డెబ్బదినాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చసప్తతితమః సర్గః

[రాముడు పుష్పకము నెక్కి తన రాజ్యములో అంతటా తిరుగుచు పాపకర్మలు జరుగుచున్నవా అని ఆన్వేషించుట, అంతటా పుణ్యకర్మలే జరుగుచుండుట చూచుట, దక్షిణదిక్కున తపస్సు చేయుచున్న శూద్రుని వద్దకు వెళ్లుట].

మూ. నారదస్య తు తద్వాక్యం శ్రుత్వామృతమయం యథా,
ప్రహర్షమతులం లేభే లక్ష్మణం చేదమబ్రవీత్. 1

ప్ర. అ. నారదస్య = నారదుని యొక్క, అమృతమయం యథా = అమృతమయము వలె ఉన్న, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, అతులమ్ = సాటి లేని, ప్రహర్షమ్ = సంతోషమును, లేభే = పొందెను. లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ చ = పలికెను కూడ.

తా. అమృతమయము వలె ఉన్న నారదుని మాటలు విని రాముడు సాటి లేని సంతోషమును పొందెను. లక్ష్మణునితో ఇట్లు పలికెను. 1

మూ. గచ్ఛ సౌమ్య ద్విజశ్రేష్ఠం సమాశ్వాసయ సువ్రతమ్,
బాలస్య చ శరీరం తత్తైలద్రోణ్యాం నిధాపయ. 2

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా, గచ్ఛ = వెళ్లుము, సువ్రతమ్ = మంచి నియమములు గల, ద్విజశ్రేష్ఠమ్ = బ్రాహ్మణశ్రేష్ఠుని, సమాశ్వాసయ = ఓదార్చుము. బాలస్య = బాలునియొక్క, తత్ = ఆ, శరీరమ్ = శరీరమును, తైల ద్రోణ్యామ్ = తైలము తొట్టెలో, నిధాపయ = ఉంచునట్లు చేయుము.

తా. సౌమ్యా నీవు వెళ్ళి ఉత్తమవ్రతములు గల ఆ బ్రాహ్మణశ్రేష్ఠుని ఓదార్చుము. ఆ బాలుని శరీరమును నూనె తొట్టెలో పెట్టించుము. 2

మూ. గన్ధైశ్చ పరమోదారైస్తైలైశ్చాపి సుగన్ధిభిః,
యథా న క్షీయతే బాలస్తథా సౌమ్య విధీయతామ్. 3

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! పరమోదారైః = చాల శ్రేష్ఠములైన, గన్ధైః చ = సుగంధ ద్రవ్యములచేతను, సుగన్ధిభిః = మంచి సువాసన గల, తైలైః చ అపి = తైలములచేతను, బాలః = బాలుడు, యథా = ఎట్లు, న క్షీయతే = క్షీణించడో, తథా = అట్లు, విధీయతామ్ = చేయబడుగాక.

తా. చాలా శ్రేష్ఠములైన సుగంధద్రవ్యములు, మంచి వాసనగల తైలములు ఉపయోగించి ఆ బాలుని శరీరము పాడవకుండునట్లు ఏర్పాటుచేయుము. 3

మూ. యథా శరీరో గుప్తః స్యాద్బాలస్యా క్లిష్టకర్మణః,
విపత్తిః పరిఖేదో వా న భవేచ్చ తథా కురు. 4

ప్ర. అ. అక్లిష్టకర్మణః = పుణ్యకర్మగల, బాలస్య = బాలుని యొక్క, శరీరః = శరీరము, యథా = ఎట్లు, గుప్తః = రక్షింపబడినది, స్యాత్ = అగునో, విపత్తిః = ఆపద గాని, పరిఖేదః వా = సంధులు విరుగుట కాని, యథా = ఎట్లు, న భవేత్ = కాదో, తథా = అట్లు, కురు = చేయుము.

తా. శుభకర్మ గల బాలుని శరీరము రక్షింపబడునట్లుగాను, దీనికి ఆపద గాని, సందులు విరుగుట కాని కలగనట్లు చేయుము. 4

మూ. ఏవం సందిశ్య కాకుత్స్థో లక్ష్మణం శుభలక్షణమ్,
మనసా పుష్పకం దధ్యావాగచ్ఛేతి మహాయశాః. 5

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గల, కాకుత్స్థః = రాముడు, శుభలక్షణమ్ = శుభలక్షణములు గల, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి, ఏవమ్ = ఇట్లు, సందిశ్య = ఆదేశించి, ఆగచ్ఛ ఇతి = రమ్ము అని, మనసా = మనస్సుచేత, పుష్పకమ్ = పుష్పకమును, దధ్యౌ = ధ్యానముచేసెను.

తా. గొప్పకీర్తి గల రాముడు శుభలక్షణములు గల లక్ష్మణునితో ఇట్లు చెప్పి "ఇక్కడికి రమ్ము" అని మనస్సులో పుష్పకమును గూర్చి ఆలోచించెను. 5

మూ. ఇఙ్గితం స తువిజ్ఞాయ పుష్పకో హేమభూషితః,
ఆజగామ ముహూర్తేన సమీపే రాఘవస్య వై. 6

ప్ర. అ. హేమభూషితః = బంగారముచేత అలంకరించబడిన, సః పుష్పకః = ఆ పుష్పకము, ఇఙ్గితమ్ = రాముని అభిప్రాయమును, విజ్ఞాయ = తెలిసికొని, ముహూర్తేన = ముహూర్తకాలముచేత, రాఘవస్య = రామునియొక్క, సమీపే = సమీపమునందు, ఆజగామ వై = వచ్చెను.

తా. బంగారముచేత అలంకరించబడిన ఆ పుష్పకము రాముని అభిప్రాయమును తెలిసికొని ముహూర్తకాలములో రామునివద్దకు వచ్చెను. 6

మూ. సోఽబ్రవీత్ప్రణతో భూత్వా అయమస్మి నరాధిప,
వశ్యస్తవ మహాబాహో కింకరః సముపస్థితః. 7

ప్ర. అ. సః = ఆ పుష్పకము, ప్రణతః భూత్వా = వంగి, అబ్రవీత్ = పలికెను. నరాధిప = రాజా ! అయమ్ = ఇదిగో నేను, అస్మి = ఉన్నాను. మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా ! తవ = నీకు, వశ్యః = వశ్యుడనైన, కింకరః = కింకరుడను, సముపస్థితః = వచ్చినాను.

తా. ఆ పుష్పకము వంగి నమస్కరించి-"రాజా! ఇదిగో ఇక్కడ ఉన్నాను; మహాబాహూ! నీవశ్యుడైన కింకరుడనైన నేను వచ్చినాను."అని పలికెను. 7

మూ. భాషితం రుచిరం శ్రుత్వా పుష్పకస్య నరాధిపః,
అభివాద్య మహర్షీన్ స విమానం సోఽధ్యరోహత. 8

ప్ర. అ. సః = ఆ, నరాధిపః = రాజు, పుష్పకస్య = పుష్పకముయొక్క, రుచిరమ్ = అందమైన, భాషితమ్ = మాటను, శ్రుత్వా = విని, మహర్షీన్ = మహర్షులను, అభివాద్య = నమస్కరించి, విమానమ్ = విమానమును, అధ్యరోహత = ఎక్కెను.

తా. ఆ రాజు పుష్పకము పలికిన మధురములైన మాటలు విని, మునులకు నమస్కరించి విమానమును ఎక్కెను. 8

మూ. ధనుర్గృహీత్వా తూణీం చ ఖడ్గం చ రుచిరప్రభమ్,
నిక్షిప్య నగరే చైతౌ సౌమిత్రిభరతావుభౌ, 9
ప్రాయాత్ప్రతీచీం హరితం విచిన్వంశ్చ తతస్తతః.

ప్ర. అ. ధనుః = ధనస్సును, తూణీం చ = అంబులపొదిని, రుచిర ప్రభమ్ = అందమైన కాంతి గల, ఖడ్గం చ = ఖడ్గమును, గృహీత్వా = గ్రహించి, నగరే = నగరమునందు, ఏతౌ = ఈ, ఉభౌ = ఇద్దరు, సౌమిత్రిభరతౌ = లక్ష్మణ భరతులను, నిక్షిప్య = ఉంచి, తతస్తతః = అన్నివైపులా, విచిన్వన్ = వెదకుచు, ప్రతీచీం హరితమ్ = పశ్చిమదిక్కును గూర్చి, ప్రాయాత్ = వెళ్ళెను.

తా. ధనస్సును, అంబులపొదిని, అందమైన కాంతి గల ఖడ్గమును ధరించి, లక్ష్మణభరతుల నిద్దరినీ నగరములో ఉంచి అటు ఇటు వెదకుచు పశ్చిమదిక్కునకు వెళ్ళెను. 9

మూ. ఉత్తరామగమచ్ఛ్రీమాన్ దిశం హిమవతావృతామ్, 10
అపశ్యమానస్తత్రాపి స్వల్పమప్యథ దుష్కృతమ్,
పూర్వామపి దిశం సర్వామథోఽపశ్యన్నరాధిపః, 11
ప్రవిశుద్ధసమాచారామాదర్శతలనిర్మలామ్.

ప్ర. అ. శ్రీమాన్ = శ్రీమంతుడైన, నరాధిపః = రాజు, హిమవతా = హిమవత్పర్వతముచేత, ఆవృతామ్ = కప్పబడిన, ఉత్తరాం దిశమ్ = ఉత్తరదిక్కును గూర్చి, శీఘ్రమ్ = శీఘ్రముగా, అగమత్ = వెళ్ళెను. తత్రాపి = అక్కడ కూడ, స్వల్పమ్ = స్వల్పమైన, దుష్కృతమ్ అపి = పాపమును కూడ, అపశ్యమానః = చూడనివాడై, అథో = అటుపిమ్మట, పరిశుద్ధసమాచారామ్ = పరిశుద్ధమైన ఆచారము గల, ఆదర్శతలనిర్మలామ్ = అద్దము వలె నిర్మలమైన, పూర్వాం దిశమ్ అపి = తూర్పు దిక్కును కూడ, అపశ్యత్ = చూచెను.

తా. శ్రీమంతుడైన ఆ రాజు హిమవత్పర్వతముచేత ఆవరింపబడిన ఉత్తర దిక్కువకు శీఘ్రముగా వెళ్ళి అక్కడ కూడ కొంచెము అధర్మమును కూడ చూడని వాడై పిమ్మట పరిశుద్ధమైన ఆచారము గల, అద్దము వలె నిర్మలముగా ఉన్న తూర్పు దిక్కును కూడ చూచెను. 10,11

మూ. పుష్పకస్థో మహాబాహు స్తదాపశ్యన్నరాధిపః, 12
దక్షిణాం దిశమాక్రామత్తతో రాజర్షినన్దనః,
శైవలస్యోత్తరే పార్శ్వే దదర్శ సుమహత్సరః. 13

ప్ర. అ. తదా=అప్పుడు, మహాబాహుః=గొప్ప బాహువులు గల, రాజర్షి నన్దనః=రాజర్షియైన దశరథుని కుమారుడైన, నరాధిపః=ఆ రాజు, పుష్పకస్థః=పుష్పకముమీద ఉన్నవాడై, దక్షిణామ్ = దక్షిణదిక్కును, ఆక్రామత్ = ఆక్రమించెను. తతః=అటుపిమ్మట, శైవలస్య=శైవలపర్వతముయొక్క, ఉత్తరే పార్శ్వే =ఉత్తర పార్శ్వమునందు, సుమహత్ = చాల గొప్పదైన, సరః = సరస్సును, దదర్శ=చూచెను.

తా. మహాబాహువు, రాజర్షి పుత్రుడూ అయిన ఆ మహారాజు పుష్పకముపై కూర్చొని దక్షిణదిక్కునకు వెళ్ళెను. పిమ్మట శైవలపర్వతమునకు ఉత్తరము ప్రక్క పెద్ద సరస్సును చూచెను. 12.13

మూ. తస్మిన్ సరసి తప్యన్తం తాపసం సుమహత్తపః.
దదర్శ రాఘవః శ్రీమాన్ లమ్బమానమధోముఖమ్. 14

ప్ర ఆ. రాఘవః = రాముడు, తస్మిన్ సరసి = ఆ సరస్సునందు, అధోముఖమ్ = క్రిందకి ముఖము కలుగునట్లుగా, లమ్బమానమ్ = వ్రేలాడుచున్న, సుమహత్ = చాల గొప్ప, తపః = తపస్సును, తప్యన్తమ్ = చేయుచున్న, తాపసమ్ = మునిని, దదర్శ = చూచెను.

తా. రాముడు, ఆ సరస్సులో క్రిందికి ముఖము ఉండునట్లుగా వ్రేలాడుచు గొప్ప తపస్సు చేయుచున్న ఒక మునిని చూచెను 14

మూ. రాఘవ స్తముపాగమ్య తప్యన్తం తప ఉత్తమమ్,
ఉవాచ చ నృపో వాక్యం ధన్య స్త్వమసి సువ్రత. 15

ప్ర. అ. నృపః = రాజైన, రాఘవః = రాముడు, ఉత్తమమ్ = ఉత్తమమైన, తపః = తపస్సును, తప్యన్తమ్ = చేయుచున్న, తమ్ = ఆతనిని, ఉపాగమ్య = సమీపించి, వాక్యమ్=వాక్యమును, ఉవాచ = పలికెను. సువ్రత=మంచి వ్రతము కలవాడా! త్వమ్ = నీవు, ధన్యః = ధన్యుడవు, అసి = అయి ఉన్నావు.

తా. ఉత్తమమైన తపస్సు చేయుచున్న ఆతనిని సమీపించి, రాజైన రాముడు ఇట్లు పలికెను-"మంచి నియమము కలవాడా నీపు ధన్యుడవు". 15

మూ. కస్యాం యోన్యాం తపోవృద్ధ వర్తసే దృఢవిక్రమ,
కౌతూహలాత్త్వాం పృచ్ఛామి రామో దాశరథిర్హ్యహమ్.

ప్ర. అ. తపోవృద్ధ = తపస్సుచేత వృద్ధుడా ! దృఢవిక్రమ = దృఢమైన పరాక్రమము కలవాడా! కస్యామ్ = ఏ, యోన్యామ్ = జాతియందు, వర్తసే = ఉంటున్నావు ? త్వామ్ = నిన్ను, కౌతూహలాత్ = వేడుకవలన, పృచ్ఛామి = అడుగుచున్నాను. అహమ్ = నేను, దాశరథిః = దశరథకుమారుడైన, రామః హి = రాముడను.

తా. తపస్సుచేత వృద్ధుడవైన, దృఢమైన మనఃస్థైర్యము గల ఓ! మునీంద్రా ! నీవు ఏజాతికి చెందినవాడవు? నేను తెలిసికొనవలె ననుు వేడుకచేత అడుగుచున్నాను, నేను దశరథ కుమారుడ నైన రాముడను. 16

మూ. కోఽర్థో మనీషితస్తుభ్యం స్వర్గలాభోపరోఽథవా,
వరాశ్రయో యదర్థం త్వం తపస్యన్యైః సుదుశ్చరమ్.

ప్ర. అ. తుభ్యమ్ = నీకు, కః = ఏ, వరాశ్రయః = వరమునకు సంబంధించిన, అర్థః = ప్రయోజనము, మనీషితః = కోరబడినది? స్వర్గలాభః = స్వర్గలాభమా ? అథవా = లేక, పరః = మరి యొకటా ? యదర్థమ్ = దేనికొరకై, త్వమ్ = నీవు, అన్యైః = ఇతరులచేత, సుదుశ్చరమ్ = ఏ మాత్రమూ చేయశక్యముకాని తపస్సును, తపసి = చేయుచున్నావో.

తా. నీవు ఎవరూ చేయజాలని తపస్సు చేయుచున్నావు; నీవు వరముగా పొందదలచిన ప్రయోజనము స్వర్గమా లేక మరొకటా? 17

మూ. యమాశ్రిత్య తప స్తప్తం శ్రోతుమిచ్ఛామి తాపస,
బ్రాహ్మణో వాసి భద్రం తే క్షత్రియో వాసి దుర్జయః, 18
వైశ్యస్తృతీయో వర్ణో వా శూద్రో వా సత్యవాగ్భవ.

ప్ర. అ. తాపస = మునీంద్రా ! యమ్ = ఏ కోరికను, ఆశ్రిత్య = ఆశ్ర

యించి, తపః = తపస్సు, తప్తమ్ = చేయబడినదో, శ్రోతుమ్ = వినుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను. బ్రాహ్మణః వా అసి = బ్రాహ్మణుడవా, దుర్జయః జయింప శక్యము కాని, క్షత్రియః = క్షత్రియుడవు, అసి వా = అయి ఉన్నావా, తృతీయః వర్ణః = మూడవవర్ణమైన, వైశ్యః వా = వైశ్యుడవా, శూద్రో వా = శూద్రుడవా? తే = నీకు, భద్రమ్ = క్షేమ మగుగాక, సత్యవాక్ = సత్యమైన వాక్కు కలవాడవు, భవ = అగుము.

తా. మహామునీ! నీవు ఏ కోరికతో తపస్సు చేయుచున్నావో వినగోరుచున్నాను. నీవు బ్రాహ్మణుడవా, జయింప శక్యముకాని క్షత్రియుడవా? మూడవ వర్ణమువాడవైన వైశ్యుడవా? లేక శూద్రుడవా? నీకు భద్ర మగుగాక, సత్యము చెప్పుము. 18

మూ. ఇత్యేవముక్తః స నరాధిపేన
అవాక్శిరా దాశరథాయ తస్మై,
ఉవాచ జాతిం నృపపుంగవాయ
యత్కారణం చైవ తపః ప్రయత్నః. 19

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
పఞ్చసప్తతితమః సర్గః.

ప్ర. అ. నరాధిపేన = రాజుచేత, ఇతి ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, సః = అతడు, అవాక్శిరాః = క్రిందికి శిరస్సు కలవాడై, నృపపుంగవాయ = రాజశ్రేష్ఠుడైన, తస్మై = ఆ, దాశరథాయ = రామునకు, జాతిమ్ = తన జాతిని, యత్కారణమ్ = దేని నిమిత్తము, తపఃప్రయత్నః = తపఃప్రయత్నమో దానినీ, ఉవాచ = చెప్పెను.

తా. శిరస్సు క్రిందికి వేలాడుచున్నట్లున్న ఆతడు రాముని మాటలు విని రాజశ్రేష్ఠుడైన ఆ రామునకు తన జాతినీ, తాను దేనినిమిత్తమై తపస్సు చేయుచున్నాడో దానినీ తెలిపెను. 19

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో డెబ్భదిఅయిదవ సర్గ సమాప్తము.

అథ షట్‌సప్తతితమః సర్గః

[రాముడు శంబూకుణ్ణి వధించుట; దేవతలు ప్రశంసించుట. అగస్త్యాశ్రమములో అగస్త్యుడు రాముణ్ణి సత్కరించి ఆతనికి అలంకారమును ఇచ్చుట].

మూ. తస్య తద్వచనం శ్రుత్వా రామస్యాక్లిష్టకర్మణః,
అవాక్శిరాస్తథాభూతో వాక్యమేతదువాచ హ. 1

ప్ర. అ. అక్లిష్టకర్మణః=శ్రమపడకుండగా పనులుచేయు, తస్య రామస్య = ఆ రామునియొక్క, తత్ = ఆ, వచనమ్ = ఆవచనమును, శ్రుత్వా = విని, అవాక్శిరాః = క్రిందికి శిరస్సు గల అతడు, తథాభూత్వా=అట్లే ఉండి, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. శ్రమపడకుండా కార్యములు సాధించు రాముని మాటలు విని అతడు తలక్రిందుగానే ఉండి ఇట్లు పలికెను. 1

మూ. శూద్రయోన్యాం ప్రజాతోఽస్మి తప ఉగ్రం సమాస్థితః,
దేవత్వం ప్రార్థయే రామ సశరీరో మహాయశః. 2

ప్ర. అ. మహాయశః = గొప్ప యశస్సు గలవాడా! రామ = రామా! శూద్రయోన్యామ్=శూద్రజాతియందు, ప్రజాతః అస్మి=పుట్టినవాడను. ఉగ్రమ్= ఉగ్రమైన, తపః = తపస్సును, సమాస్థితః = అవలంబించినాను, సశరీరః = శరీరముతో కూడినవాడనై, దేవత్వమ్=దేవత్వమును, కామయే=కోరుచున్నాను.

తా. గొప్పకీర్తి గల రామా! నేను శూద్రజాతిలో పుట్టినాను. ఈ శరీరముతోనే దేవత్వమును పొందుటకై ఉగ్రమైన తపస్సు చేయుచున్నాను. 2

మూ. న మిథ్యాహం వదే రామ దేవలోకజిగీషయా,
శూద్రం మాం విద్ధి కాకుత్స్థ శమ్బూకో నామ నామతః. 3

ప్ర. అ. రామ = రామా! అహమ్ = నేను, మిథ్యా = అసత్యముగా, న వదే = పలుకుటలేదు. దేవలోకజిగీష షా = దేవలోకమును జయించవలె ననుఇచ్ఛచేత (తపస్సు చేయుచున్నాను). కాకుత్స్థ = రామా ! మామ్ = నన్ను, శూద్రమ్ = శూద్రుణ్ణిగా, విద్ధి = తెలిసికొనుము. నామతః = పేరువలన, శమ్బూకో నామ = శంబూకు డని ప్రసిద్ధుడను.

తా. రామా! నేను అసత్యము చెప్పుటలేదు. దేవలోకమును జయించవలె నను కోరికతో ఉన్నాను. కాకుత్స్థా! నేను శూద్రుడను. నా పేరు శంబూకుడు. శి

మూ. భాషతస్తస్య శూద్రస్య ఖడ్గం సురుచిరప్రభమ్,
నిష్కృష్య కోశాద్విమలం శిరశ్చిచ్ఛేద రాఘవః. 4

ప్ర. అ. తస్య శూద్రస్య = ఆ శూద్రుడు, భాషతః = మాటలాడుచుండగనే, రాఘవః = రాముడు, సురుచిరప్రభమ్ = చాల అందమైన కాంతి గల, విమలమ్ = నిర్మలమైన, ఖడ్గమ్ = ఖడ్గమును, కోశాత్ = ఒరనుండి, నిష్కృష్య = పైకి లాగి, శిరః = శిరస్సును, చిచ్ఛేద = ఛేదించెను.

తా. అతడు ఇట్లు చెప్పుచుండగానే రాముడు ధగధగలాడుచున్న నిర్మల మైన ఖడ్గమును ఒరనుండి తీసి అతని శిరస్సు ఖండించెను. 4

మూ. తస్మిన్ శూద్రే హతే దేవాః సేన్ద్రాగ్నిః సాగ్నిపురోగమాః,
సాధు సాధ్వితి కాకుత్స్థం తే శశంసుర్ముహుర్ముహుః. 5

ప్ర. అ. తస్మిన్ = ఆ, శూద్రే = శూద్రుడు, హతే = చంపబడినవాడగు చుండగా, సేన్ద్రాగ్నిః = ఇంద్రునితో కూడిన, సాగ్నిపురోగమాః = అగ్ని పురఃసరుడుగా గల, తే = ఆ, దేవాః = దేవతలు, సాధు సాధు ఇతి = బాగు బాగు అని, కాకుత్స్థమ్ = రాముణ్ణి, ముహుఃముహుః = మాటిమాటికి, శశంసుః = పొగిడిరి.

తా. ఆ శూద్రుడు చంపబడిన పిమ్మట, ఇంద్రాగ్నులు మొదలైన దేవతలు "బాగు బాగు"అని రాముణ్ణి మాటి మాటికి ప్రశంసించిరి. 5

మూ. పుష్పవృష్టిర్మహత్యాసీద్దివ్యానాం సుసుగన్ధినామ్,
పుష్పాణాం వాయుముక్తానాం సర్వతః ప్రపపాత హ. 6

చారమువలన, ఆప్రాప్తకాలః = పొందబడని కాలము కలవాడైనను, కాలేన = కాలముచేత (మృత్యువుచేత). యమక్షయమ్ = యమలోకమును గూర్చి, నీతః = తీసికొనివెళ్ళబడినాడు.

తా. నా అపచారము వలన మృత్యువు ఆ బ్రాహ్మణుని ఏకైక పుత్రుడైన ఆ బాలుణ్ణి అకాలమునందే యమలోకమునకు తీసికొనిపోయెను. 11

మూ. తం జీవయథ భద్రం వో నాన్యతం కర్తుమర్హథ,
ద్విజస్య సంశ్రుతోఽర్థో మే జీవయిష్యామి తే సుతమ్. 12

ప్ర. అ. తమ్ = ఆ బాలుణ్ణి, జీవయథ = బ్రతికించండి. తే సుతమ్ = నీ పుత్రుణ్ణి, జీవయిష్యామి = జీవింపచేసెదను అని, మే = నాకు, (నాచేత). ద్విజస్య = బ్రాహ్మణునకు, అర్థః = విషయము, సంశ్రుతః = ప్రతిజ్ఞ చేయబడినది. అన్యతమ్ = అసత్యమునుగా, కర్తుమ్ = చేయుటకు, న అర్హథ = తగరు, వః = మీకు, భద్రమ్ = మంగళ మగుగాక.

తా. ఆ బాలుణ్ణి బ్రతికించండి. "నీ కుమారుణ్ణి బ్రతికించెదను" అని నేను ఆ బ్రాహ్మణునికి ప్రతిజ్ఞ చేసి చెప్పితిని. దానిని అసత్యము చేయకుడు. మీకు మంగళ మగుగాక. 12

మూ. రాఘవస్య తు తద్వాక్యం శ్రుత్వా విబుధసత్తమాః,
ప్రత్యూచూ రాఘవం ప్రీతా దేవాః ప్రీతిసమన్వితమ్. 13

ప్ర. అ. రాఘవస్య = రామునియొక్క, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, విబుధసత్తమాః = దేవతలలో శ్రేష్ఠులైన, దేవాః = దేవతలు, ప్రీతాః = సంతోషించినవారై, ప్రీతిసమన్వితమ్ = ప్రీతితో కూడినట్లుగా, ప్రత్యూచుః = తిరిగి పలికిరి.

తా. రాముని మాటలు విని దేవతలలో శ్రేష్ఠులైన ఆ ఇంద్రాది దేవతలు సంతోషించి, సంతోషపూర్వకముగా ఇట్లనిరి. 13

మూ. నిర్వ్యథో భవ కాకుత్స్థ సోఽస్మిన్నహని బాలకః,
జీవితం ప్రాప్తవాన్ భూయః సమేతశ్చాపి బన్ధుభిః. 14

ప్ర. అ. కాకుత్స్థ = రామా! నిర్వృతః = ఆనందము కలవాడవు, భవ = అగుము. అస్మిన్ = ఈ, అహని = దినమునందే, సః బాలకః = ఆ బాలుడు, భూయః = మరల, జీవితమ్ = జీవితమును, ప్రాప్తవాన్ = పొందినాడు. బన్ధుభిః = బంధువులతో, సమేతః చ అపి = కలిసినాడు కూడ.

తా. రామా! నిశ్చింతగా ఉండుము. ఈ దివసమునందే ఆ బాలుడు మరల ప్రాణాలు పొంది తన బంధువులవద్దకు వెళ్ళినాడు. 14

మూ. యస్మిన్ ముహూర్తే కాకుత్స్థ శూద్రోఽయం వినిపాతితః,
తస్మిన్ముహూర్తే బాలోఽసౌ జీవేన సమయుజ్యత. 15

ప్ర. అ. కాకుత్స్థ = రామా! అయం శూద్రః = ఈ శూద్రుడు, యస్మిన్ ముహూర్తే = ఏ ముహూర్తమునందు, వినిపాతితః = పడగొట్టబడినాడో, తస్మిన్ ముహూర్తే = ఆ ముహూర్తమునందే, అసౌ బాలః = ఆ బాలుడు, జీవేన = జీవునితో, సమయుజ్యత = కలిసెను.

తా. రామా! నీవు ఈ శూద్రుణ్ణి సంహరించిన ముహూర్తమునందే ఆ బాలుడు జీవించినాడు. 15

మూ. స్వస్తి ప్రాప్నుహి భద్రం తే సాధు యామ నరర్షభ,
ఆగస్త్యస్యాశ్రమపదం ద్రష్టుమిచ్ఛామ రాఘవ. 16

ప్ర. అ. నరర్షభ = పురుషశ్రేష్ఠా! రాఘవ = రామా! స్వస్తి = క్షేమమును, ప్రాప్నుహి = పొందుము. తే = నీకు, భద్రమ్ = క్షేమము, సాధు = మంచిది. యామ = వెళ్ళెదము, ఆగస్త్యస్య = అగస్త్యునియొక్క, ఆశ్రయపదమ్ = ఆశ్రమస్థానమును, ద్రష్టుమ్ = చూచుటకు, ఇచ్ఛామ = కోరుచున్నాము.

తా. నరశ్రేష్ఠుడవైన రామా! క్షేమమును పొందుము. నీకు మంగళమగుగాక. మంచిది; మేము వెళ్ళెదము. అగస్త్యుని ఆశ్రమము చూడవలెనని కోరుచున్నాము.

మూ. తస్య దీక్షా సమాప్తా హి బ్రహ్మర్షేః సుమహాద్యుతేః,
ద్వాదశం హి గతం వర్షం జలశయ్యాం సమాసతః. 17

ప్ర. అ. సుమహాద్యుతేః = చాల గొప్ప కాంతి గల, బ్రహ్మర్షేః = బ్రహ్మర్షి

యైన, తస్య = అతనియొక్క, దీక్షా = దీక్ష, సమాప్తా = సమాప్తమైనది. జల శయ్యామ్ = జలశయ్యను, సమాసతః = అధిష్ఠించి ఉన్న ఆతనికి, ద్వాదశమ్ = పన్నెండవ, వర్షమ్ = సంవత్సరము, గతం హి = గడచినది కదా?

తా. గొప్ప కాంతి గల బ్రహ్మర్షియైన ఆ అగస్త్యుని దీక్ష సమాప్తమైనది. జలశయ్యయందు ఆయన శయనించి పన్నెండవ సంవత్సరము గడిచినది. 17

మూ. కాకుత్స్థ తద్గమిష్యామో మునిం సమభినన్దితుమ్,
త్వం చాపి గచ్ఛ భద్రం తే ద్రష్టుం తమృషిసత్తమమ్.

ప్ర. అ. కాకుత్స్థ = రామా! తత్ = ఆ కారణమువలన, మునిమ్ = మునిని, సమభినన్దితుమ్ = అభినందించుటకు, గమిష్యామః = వెళ్ళెదము, తే = నీకు, భద్రమ్ = మంగళ మగుగాక, త్వం చాపి = నీవు కూడ, తమ్ = ఆ, ఋషిసత్తమమ్ = ఋషిశ్రేష్ఠుని, ద్రష్టుమ్ = చూచుటకు, గచ్ఛ = వెళ్ళుము.

తా. రామా! అందువలన ఆ మునిని అభినందించుటకు మేము వెళ్ళెదము. నీకు మంగళ మగుగాక. నీవు కూడ ఉత్తముడైన ఆ ఋషీశ్వరుణ్ణి చూచుటకు వెళ్లుము. 18

మూ. స తథేతి ప్రతిజ్ఞాయ దేవానాం రఘునన్దనః,
ఆరురోహ విమానం తం పుష్పకం హేమభూషితమ్. 19

ప్ర. అ. సః రఘునన్దనః = ఆ రాముడు, దేవానామ్ = దేవతలకు, తథేతి = అట్లే అని, ప్రతిజ్ఞాయ = చెప్పి, హేమభూషితమ్ = బంగారముచేత అలంకరించబడిన, తం పుష్పకమ్ = ఆ పుష్పకమును, ఆరురోహ = ఎక్కెను.

తా. అట్లే చేసెదను అని రాముడు దేవతలకు చెప్పి బంగారముచేత అలంకరించబడిన ఆ పుష్పకమును ఎక్కెను. 19

మూ. తతో దేవాః ప్రయాతాస్తే విమానైర్బహువిస్తరైః,
రామోఽప్యనుజగామాశు కుమ్భయోనేస్తపోవనమ్. 20

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తే దేవాః = ఆ దేవతలు, బహువిస్తరైః = అధికమైన విస్తరము గల, విమానైః = విమానములచేత, ప్రయాతాః = వెళ్ళిరి.

రామః అపి = రాముడు కూడ, ఆశు = శీఘ్రముగా, కుమ్భయోనేః = అగస్త్యుని యొక్క, తపోవనమ్ = తపోవనమును గూర్చి, ఆశు = శీఘ్రముగా, జగామ = వెళ్ళెను.

తా. పిమ్మట దేవతలు చాల విశాలములైన విమానాలపై ఎక్కి వెళ్ళిరి. రాముడు కూడ వారి వెంటనే అగస్త్యాశ్రమమునకు శీఘ్రముగా వెళ్లెను. 20

మూ. దృష్ట్వా తు దేవాన్ సంప్రాప్తానగస్త్యస్తపసాం నిధిః,
అర్చయామాస ధర్మాత్మా సర్వాంస్తానవిశేషతః. 21

ప్ర. అ. తపసామ్ = తపస్సులకు, నిధిః = నిధి, ధర్మాత్మా = ధర్మాత్ముడూ అయిన, అగస్త్యః = అగస్త్యుడు, సంప్రాప్తాన్ = వచ్చిన, దేవాన్ = దేవతలను, దృష్ట్వా = చూచి, తాన్ సర్వాన్ = వాళ్ళ నందరినీ, అవిశేషతః = భేదము లేకుండగా, అర్చయామాస = అర్చించెను.

తా. తపోనిధీ, ధర్మాత్ముడూ అయిన అగస్త్యుడు వచ్చిన దేవతలను చూ చి వారినందరిని సమముగా గౌరవించెను. 21

మూ. ప్రతిగృహ్య తతః పూజాం సంపూజ్య చ మహామునిమ్,
జగ్ముస్తే త్రిదశా హృష్టా నాకపృష్ఠం సహానుగాః. 22

ప్ర. అ. తతః = అటు పిమ్మట, తే = ఆ, త్రిదశాః = దేవతలు, పూజామ్ = పూజను, ప్రతిగృహ్య = స్వీకరించి. మహామునిమ్ = ఆ మహామునిని, సంపూజ్య చ = పూజించి, హృష్టాః = సంతోషించినవారై, సహానుగాః = అనుచరులతో కూడినవారై, నాకపృష్ఠమ్ = స్వర్గమును గూర్చి, జగ్ముః = వెళ్ళిరి.

తా. దేవతలు అగస్త్యుడు చేసిన పూజలు స్వీకరించి, ఆ మహామునిని కూడ పూజించి, అనుచరులతో కలిసి సంతోషముతో స్వర్గమునకు వెళ్ళిరి. 22

మూ. గతేషు తేషు కాకుత్స్థః పుష్పకాదవరుహ్య చ,
తతోఽభివాదయామాస అగస్త్యమృషిసత్తమమ్. 23

ప్ర. అ. తేషు = దేవతలు, గతేషు = వెళ్ళినవారగుచుండగా, కాకుత్స్థః = రాముడు, పుష్పకాత్ = పుష్పకమునుండి, అవరుహ్య = దిగి, తతః = అటు

పిమ్మట, ఋషిసత్తమమ్ = ఋషిశ్రేష్ఠుడైన, అగస్త్యమ్ = అగస్త్యుణ్ణి, అభివాదయామాస = నమస్కరించెను.

తా. ఆ దేవతలు వెళ్ళిన పిమ్మట రాముడు పుష్పకమునుండి దిగి ఋషిశ్రేష్ఠుడైన అగస్త్యునకు నమస్కరించెను.

మూ. సోఽభివాద్య మహాత్మానం జ్వలన్తమివ తేజసా,
ఆతిథ్యం పరమం ప్రాప్య నిషసాద నరాధిపః. 24

ప్ర. అ. సః నరాధిపః = ఆ రాజు, తేజసా = తేజస్సుచేత, జ్వలన్తమ్ ఇవ = మండుచున్న వాడు వలె ఉన్న, మహాత్మానమ్ = మహాత్ముణ్ణి, అభివాద్య = నమస్కరించి, పరమమ్ = గొప్ప, ఆతిథ్యమ్ = ఆతిథ్యమును, ప్రాప్య = పొంది, నిషసాద = కూర్చుండెను.

తా. రాముడు తేజస్సుతో ప్రజ్వలించుచున్నాడా అన్నట్లున్న మహాత్ముడైన అగస్త్యునకు నమస్కరించి గొప్పఆతిథ్యమును అందికొని కూర్చుండెను. 24

మూ. తమువాచ మహాతేజాః కుమ్భయోనిర్మహాతపాః,
స్వాగతం తే నరశ్రేష్ఠ దిష్ట్యా ప్రాప్తోఽసి రాఘవ. 25

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, మహాతపాః = గొప్ప తపస్సు గల, కుమ్భయోనిః = అగస్త్యుడు. తమ్ = రాముణ్ణి గూర్చి, ఉవాచ = పలికెను. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడవైన, రాఘవ = రామా! దిష్ట్యా = భాగ్యవశముచేత, ప్రాప్తః అసి = వచ్చినావు, తే = నీకు, స్వాగతమ్ = స్వాగతము.

తా. గొప్ప తేజస్సు, తపస్సు గల అగస్త్యుడు రామునితో ఇట్లనెను. నరులలో శ్రేష్ఠుడవైన రామా! భాగ్యవశముచేత వచ్చినావు, నీకు స్వాగతము. 25

మూ. త్వం మే బహుమతో రామ గుణైర్బహుభిరుత్తమైః,
అతిథిః పూజనీయశ్చ మమ నిత్యం హృది స్థితః. 26

ప్ర. అ. రామ = రామా! త్వమ్ = నీవు, ఉత్తమైః = ఉత్తమములైన, బహుభిః = అనేకములైన, గుణైః = గుణములచేత, మే = నాకు, బహుమతః = గౌరవింపబడినవాడవు, పూజనీయః = పూజించతగిన, అతిథిః = అతిథివి, నిత్యమ్

= నిత్యమూ, మమ = నాయొక్క, హృది = హృదయమునందు, స్థితః = ఉన్నావు.

తా. రామా! ఉత్తమములైన అనేక గుణములచేత నీవు నాకు బహుమాన పాత్రుడవు. పూజించదగిన అతిథివి. నిత్యమూ నా హృదయములో ఉందువు. 26

మూ. సురా హి కథయన్తి త్వామాగతం శూద్రఘాతినమ్,
బ్రాహ్మణస్య తు ధర్మేణ త్వయా జీవాపితః సుతః. 27

ప్ర. అ. సురాః = దేవతలు, త్వామ్ = నిన్ను, శూద్రఘాతినమ్ = శూద్ర సంహారకుడవుగా, ఆగతమ్ = వచ్చినవానినిగా, కథయన్తి = చెప్పుచున్నారు. త్వయా = నీచేత, ధర్మేణ = ధర్మముచేత, బ్రాహ్మణస్య = బ్రాహ్మణునియొక్క సుతః = పుత్రుడు, జీవాపితః = జీవింపచేయబడినాడు.

తా. నీవు శూద్రుని సంహరించుటకై వచ్చినా వని దేవతలు చెప్పిరి. నీవు ధర్మమును ఆచరించి బ్రాహ్మణపుత్రుణ్ణి బ్రతికించినావు. 27

మూ. ఉష్యతాం చేహ రజనీం సకాశే మమ రాఘవ,
త్వం హి నారాయణః శ్రీమాంస్త్వయి సర్వం ప్రతిష్ఠితమ్.

ప్ర. అ. రాఘవ = రామా! రజనీమ్ = రాత్రిని (రాత్రియందు), ఇహ = ఇక్కడ, మమ = నాయొక్క, సకాశే = సమీపమునందు, ఉష్యతామ్ = ఉందువు గాక, త్వమ్ = నీవు, శ్రీమాన్ = లక్ష్మీసమేతుడవైన, నారాయణః హి = నారాయణుడవు కదా? సర్వమ్ = సమస్తమూ, త్వయి = నీయందే, ప్రతిష్ఠితమ్ = ప్రతిష్ఠింపబడినది.

తా. రామా! ఈ రాత్రి ఇక్కడనే నాదగ్గర ఉండుము. నీవు లక్ష్మీసమేతుడవైన నారాయణుడవు. అంతయు నీయందే ప్రతిష్ఠితమై ఉన్నది. (నీవు అంతకూ ఆధారమైనవాడవు). 28

మూ. త్వం ప్రభుః సర్వదేవానాం పురుషస్త్వం సనాతనః,
ప్రభాతే పుష్పకేణ త్వం గన్తా స్వపురమేవ హి. 29

ప్ర. అ. త్వమ్ = నీవు, సర్వదేవానామ్ = సమస్తదేవతలకు, ప్రభుః =

ప్రభువు. త్వమ్ = నీవు, సనాతనః = ప్రాచీనుడవైన, పురుషః = పురుషుడవు, ప్రభాతే = ప్రాతఃకాలమునందు, పుష్పకేణ = పుష్పకముచేత, స్వపురమ్ ఏవ = నీ పురమును గూర్చి, గన్తా హి = వెళ్ళగలవాడవు కదా.

తా. నీవు సకలదేవతలకూ ప్రభువు. నీవు సనాతన పురుషుడవు. రేపు ప్రాతఃకాలమునందు పుష్పకముపై నీ పురమునకు వెళ్ళవచ్చును. 29

మూ. ఇదం చాభరణం సౌమ్య నిర్మితం విశ్వకర్మణా,
దివ్యం దివ్యేన వపుషా దీప్యమానం స్వతేజసా. 30

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! దివ్యేన = దివ్యమైన, వపుషా = ఆకారముతో, స్వతేజసా = తన తేజస్సుతో, దీప్యమానమ్ = ప్రకాశించుచున్న, ఇదమ్ = ఈ, దివ్యమ్ = దివ్యమైన, ఆభరణమ్ = ఆభరణము, విశ్వకర్మణా = విశ్వకర్మచేత, నిర్మితమ్ = నిర్మించబడినది.

తా. రామా! దివ్యమైన ఆకారముతో, తన తేజస్సుతో ప్రకాశించుచున్న దివ్యమైన ఈ ఆభరణము విశ్వకర్మచేత నిర్మించబడినది. 30

మూ. ప్రతిగృహ్ణీష్వ కాకుత్స్థ మద్ప్రియం కురు రాఘవ,
దత్తస్య హి పునర్దానే సుమహత్ఫలముచ్యతే. 31

ప్ర. అ. కాకుత్స్థ = కకుత్స్థవంశమునందు పుట్టినవాడా! రాఘవ = రామా? ప్రతిగృహ్ణీష్వ = తీసికొనుము. మద్ప్రియమ్ = నాకు ప్రియమును, కురు = చేయుము. దత్తస్య = ఒకరిచేత ఇవ్వబడినదానియొక్క, పునః = మరల, దానే = మరొకరికి ఇచ్చుటయందు, సుమహత్ = చాల గొప్ప, ఫలమ్ = ఫలము, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా. రామా! దీనిని స్వీకరించి నాకు ప్రియమును చేయుము. ఒకరు ఇచ్చినదానిని అనుభవించకుండగా మరల మరొకరికి ఇచ్చినచో గొప్ప ఫలము చెప్పబడినది. 31

మూ. భరతే హి భవాన్ శక్తః ఫలానాం మహతామపి,
త్వం హి శక్తస్తారయితుం సేన్ద్రానపి దివౌకసః. 32

ప్ర. అ. భవాన్ = నీవు, మహతామ్ = చాల గొప్పవైన, ఫలానామ్ = ఫలములయొక్క, భరణే = పోషణమునందు, శక్తః హి = సమర్థుడవు కదా. త్వమ్ = నీవు, సేన్ద్రాన్ = ఇంద్రునితో కూడిన, దివౌకసః అపి = దేవతలను కూడ, తారయితుమ్ = తరింపచేయుటకు, శక్తః హి = సమర్థుడవు కదా?

తా. నీవు చాల గొప్ప ఫలములను కూడ పోషించుటకు సమర్థుడవు కదా! నీవు ఇంద్రునితో సహా దేవతల నందరినీ తరింపచేయ సామర్థ్యము కలవాడవు కదా? 32

మూ. తస్మాత్ప్రదాస్యే విధివత్ప్రతీచ్ఛ నరాధిప,
దివ్యమాభరణం చిత్రం ప్రదీప్తమివ భాస్కరమ్. 33

ప్ర. అ. తస్మాత్ = ఆ కారణమువలన, నరాధిప = రాజా! ప్రదీప్తమ్ = ప్రకాశించుచున్న, భాస్కరమ్ ఇవ = సూర్యుడు వలె ఉన్న, చిత్రమ్ = ఆశ్చర్యకరమైన, దివ్యమ్ = దివ్యమైన, ఆభరణమ్ = ఆభరణమును, ప్రదాస్యే = ఇచ్చెదను. విధివత్ = యథావిధిగా, ప్రతీచ్ఛ = స్వీకరింపుము.

తా. రాజా! అందువలన సూర్యుడు వలె ప్రకాశించుచున్న, విచిత్రమైన, దివ్యమైన ఈ ఆభరణమును ఇచ్చెదను: యథావిధిగా తీసికొనుము. 33

మూ. అథోవాచ మహాత్మానమిక్ష్వాకూణాం మహారథః,
రామో మతిమతాం శ్రేష్ఠః క్షత్రధర్మమనుస్మరన్. 34

("రామోమతిమతాం" మొదలు "రామస్తదాభరణముత్తమమ్" వరకూ ఉన్న 14 శ్లోకాలు చాల ప్రతులలో లేవు. వీటికి వ్యాఖ్యాతలు వ్యాఖ్యలు వ్రాయలేదు.)

ప్ర. అ. అథ = అటుపిమ్మట, ఇక్ష్వాకూణామ్ = ఇక్ష్వాకువంశరాజులలో, మహారథః = మహారథుడైన, మతిమతామ్ = బుద్ధిమంతులలో, శ్రేష్ఠః = శ్రేష్ఠుడైన, రామః = రాముడు, క్షత్రధర్మమ్ = క్షత్రియధర్మమును, అనుస్మరన్ = స్మరించుచు, మహాత్మానమ్ = మహాత్ముడైన అగస్త్యుణ్ణి గూర్చి, ఉవాచ = పలికెను.

తా. పిమ్మట ఇక్ష్వాకువంశీయులలో మహారథుడు, బుద్ధిమంతులలో

శ్రేష్ఠుడూ అయిన రాముడు క్షత్రియధర్మమును స్మరించుచు మహాత్ముడైన అగస్త్యునితో ఇట్లు పలికెను. 34

మూ. ప్రతిగ్రహోఽయం భగవన్ బ్రాహ్మణస్యావిగర్హితః,
క్షత్రియేణ కథం విప్ర ప్రతిగ్రాహ్యం భవేత్తతః. 35

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా ! విప్ర = బ్రాహ్మణుడా ! అయం ప్రతిగ్రహః = ఈ దానముపట్టుట, బ్రాహ్మణస్య = బ్రాహ్మణునకు, అనిన్దితః = నిందింపబడనిది. తతః = అందువలన, క్షత్రియేణ = క్షత్రియునిచేత, కథమ్ = ఎట్లు, ప్రతిగ్రాహ్యమ్ = గ్రహింపదగినది, భవేత్ = అగును ?

తా. పూజ్యుడవైన బ్రాహ్మణుడా ! ప్రతిగ్రహము బ్రాహ్మణునకు విధింపబడినది గాన ఆతనికి నింద్యము కాదు. కాని క్షత్రియుడు ప్రతిగ్రహించుట ఎట్లు?

మూ. ప్రతిగ్రహో హి విప్రేన్ద్ర క్షత్రియాణాం సుగర్హితః,
బ్రాహ్మణేన విశేషేణ దత్తం తద్వక్తుమర్హసి. 36

ప్ర. అ. విప్రేన్ద్ర = బ్రాహ్మణోత్తమా ! ప్రతిగ్రహః = ప్రతిగ్రహము, క్షత్రియాణామ్ = క్షత్రియులకు, సుగర్హితః హి = మిక్కిలి నింద్యము కదా ! బ్రాహ్మణేన = బ్రాహ్మణునిచేత, దత్తమ్ = ఇవ్వబడినచో, విశేషేణ = విశేషముచేత, నింద్యము, తత్ = ఆ కారణమువలన, వక్తుమ్ = చెప్పుటకు, అర్హసి = తగియున్నావు.

తా. బ్రాహ్మణోత్తమా ! ప్రతిగ్రహము క్షత్రియులకు చాల నింద్యము కదా. విశేషించి బ్రాహ్మణులు ఇచ్చినదానిని ప్రతిగ్రహించుట ఇంకను నింద్యము. అందుచేత నీవే చెప్పుము. 36

మూ. ఏవముక్తస్తు రామేణ ప్రత్యువాచ మహాన్ ఋషిః,
ఆసన్ కృతయుగే రామ బ్రహ్మభూతే పురాయుగే, 37
అపార్థివాః ప్రజాః సర్వాః సురాణాం తు శతక్రతుః.

ప్ర. అ. రామేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలుకబడిన, మహాన్ = గొప్పవాడైన, ఋషిః = ఋషి, ప్రత్యువాచ = తిరిగి పలికెను. రామ=

రామా ! పురా = పూర్వము, బ్రహ్మభూతే = బ్రహ్మమయమైన, కృతయుగే = కృతయుగమునందు, సర్వాః = సమస్తమైన, ప్రజాః = ప్రజలు, అపార్థివాః = రాజులేనివారుగా, అసన్ = ఉండిరి. దేవానాం తు = దేవతలకైతే, శతక్రతుః = ఇంద్రుడు ఉండెను.

తా. రాముని మాటలు విని అగస్త్యమహర్షి ఇట్లు చెప్పెను– "రామా ! పూర్వము, బ్రహ్మమయమైన కృతయుగమునందు ప్రజలకు రాజు లేకుండెను. దేవతలకు మాత్రము ఇంద్రుడుండెను." 37

మూ. తాః ప్రజా దేవదేవేశం రాజార్థం సముపాద్రవన్, 38
సురాణాం స్థాపితో రాజా త్వయా దేవ శతక్రతుః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ప్రజాః = ప్రజలు, రాజార్థమ్ = రాజు కొరకు, దేవదేవేశమ్ = బ్రహ్మదేవుణ్ణి గూర్చి, సముపాద్రవన్ = శీఘ్రముగా వెళ్ళిరి. దేవ = దేవా ! త్వయా = నీచేత, శతక్రతుః = దేవేంద్రుడు, సురాణామ్ = దేవతలకు, రాజా = రాజుగా, స్థాపితః = స్థాపించబడినాడు.

తా. ఆప్రజలు రాజుకొరకై బ్రహ్మదేవునివద్దకు వెళ్ళి ఇట్లు ప్రార్థించిరి– "దేవా! నీవు దేవతలకు రాజుగా ఇంద్రుణ్ణి స్థాపించినావు." 38

మూ. ప్రయచ్ఛాస్మాసు లోకేశ పార్థివం నరపుఙ్గవమ్, 39
యస్మై పూజాం ప్రయుఞ్జానా ధూతపాపాశ్చరేమహి,
న వసామో వినా రాజ్ఞా ఏష నో నిశ్చయః పరః. 40

ప్ర. అ. లోకేశ = లోకాధిపతీ ! అస్మాసు = మాయందు, నరపుఙ్గవమ్ = నరశ్రేష్ఠుడైన, పార్థివమ్ = రాజును, ప్రయచ్ఛ = ఇమ్ము; యస్మై = ఎవనికి, పూజామ్ = పూజను, ప్రయుఞ్జానాః = చేయుచు, ధూతపాపాః = తొలగించబడిన పాపములు గలవారమై, చరేమహి = సంచరింతుమో, రాజ్ఞావినా = రాజు లేకుండా, న వసామః = నివసించము, ఏషః = ఇది, నః = మాయొక్క, పరః = గొప్ప, నిశ్చయః = నిశ్చయము.

తా. "లోకాధిపా ! మాకు ఒక నరశ్రేష్ఠుణ్ణి రాజుగా ఇమ్ము. ఆతనికి

పూజలు చేసుకొనుచు పాపములు తొలగించుకొని సంచరించెదము. రాజు లేకుండా మేము నివసించము. ఇది మా దృఢనిశ్చయము." 39, 40

మూ. తతో బ్రహ్మా సురశ్రేష్ఠో లోకపాలాన్ సవాసవాన్,
సమాహూయాబ్రవీత్సర్వాంస్తేజోభాగాన్ ప్రయచ్ఛత, 41
తతో దదుర్లోకపాలాః సర్వే భాగాన్ స్వతేజసః.

ప్ర. అ. తతః=ఆటుపిమ్మట, సురశ్రేష్ఠః=సురులలో శ్రేష్ఠుడైన, బ్రహ్మా =బ్రహ్మ, సవాసవాన్ = దేవేంద్రునితో కూడిన, లోకపాలాన్ = లోకపాలులను, సమాహూయ = పిలచి, సర్వాన్ = అందరినీ గూర్చి, అబ్రవీత్ = పలికెను. తేజో భాగాన్ = తేజస్సుయొక్క భాగములను, ప్రయచ్ఛత = ఇవ్వండి, తతః = అటు పిమ్మట, సర్వే = సమస్తమైన, లోకపాలాః = లోకపాలకులు, స్వతేజసః = తమ తేజస్సుయొక్క, భాగాన్ = భాగములను, దదుః = ఇచ్చిరి.

తా. పిమ్మట దేవతలలో శ్రేష్ఠుడైన బ్రహ్మదేవుడు ఇంద్రాదిలోకపాలకు లను పిలచి "మీరు మీ తేజస్సులో కొంత భాగము ఇవ్వండి" అని వారందరితో చెప్పగా వాళ్ళు తమ తేజస్సునుండి భాగములను ఇచ్చిరి. 41

మూ. అక్షుపచ్చ తతో బ్రహ్మా యతో జాతః క్షుపో నృపః, 42
తం బ్రహ్మా లోకపాలానాం సమాంశైః సమయోజయత్.

ప్ర. అ. తతః = ఆటుపిమ్మట, బ్రహ్మా = బ్రహ్మ, అక్షుపత్ =తుమ్మెను; యతః = దేనివలన, క్షుపః = క్షుపుడను, నృపః = రాజు, జాతః = పుట్టెనో, తమ్ =ఆతనిని, బ్రహ్మా=బ్రహ్మ, లోకపాలానామ్=లోకపాలులయొక్క, సమాంశైః = సమములైన అంశలతో, సమయోజయత్ = కూర్చెను.

తా. అప్పుడు బ్రహ్మదేవుడు తుమ్మెను. దానినుండి క్షుపు డను రాజు పుట్టెను. బ్రహ్మదేవుడు ఆతనిలో లోకపాలుల అంశములను సమముగా ఉంచెను.

మూ. తతో దదౌ నృపం తాసాం ప్రజానామీశ్వరం క్షుపమ్, 43
తతైర్నైర్ణి చ భాగేన మహిమాజ్ఞాపయన్నృపః.

ప్ర. అ. తతః = ఆటుపిమ్మట, నృపమ్ = రాజైన, క్షుపమ్ = క్షుపుణ్ణి,

తాసామ్ = ఆ, ప్రజానామ్ = ప్రజలకు, ఈశ్వరమ్ = ప్రభువునుగా, దదౌ = ఇచ్చెను. నృపః = రాజు, తత్ర = లోకపాలాంశలలో, ఐన్ద్రేణ = ఇంద్రునికి సంబంధించిన, భాగేన = భాగముచేత, మహీమ్ = భూమిని, ఆజ్ఞాపయత్ = ఆజ్ఞాపించెను.

తా. పిమ్మట బ్రహ్మదేవుడు రాజైన ఆ ఇక్ష్వాకుపుత్రి ప్రజలకు ప్రభువునుగా ఇచ్చెను. లోకపాలుల భాగములలో ఇంద్రుని భాగముచేత రాజు భూమిని ఆజ్ఞాపించెను. 43

మూ. వారుణేన తు భాగేన వపుః పుష్యతి పార్థివః, 44
కౌబేరేణ తు భాగేన విత్తమాసాం దదౌ తదా,
యస్తు యామ్యోఽభవద్భాగస్తేన శాస్తి స్మ స ప్రజాః. 45

ప్ర. అ. పార్థివః = రాజు, వారుణేన = వరుణునికి సంబంధించిన, భాగేన తు = భాగముచేతనైతే, వపుః = శరీరమును, పుష్యతి = పోషించును. కౌబేరేణ = కుబేరునికి సంబంధించిన, భాగేన తు = భాగముచేతనైతే, తదా = అప్పుడు, ఆసామ్ = ప్రజలకు, విత్తమ్ = ధనమును, దదౌ = ఇచ్చెను. యామ్యః = యముని సంబంధమైన, యః భాగః = ఏ భాగము, అభవత్ = ఉండెనో, తేన = దానిచేత, ప్రజాః = ప్రజలను, శాస్తి స్మ = శిక్షించెను.

తా. రాజు వరుణుని అంశచేత శరీరమును పోషించెను. కుబేరుని అంశచేత వారికి ధనమును ఇచ్చెను. యముని అంశచేత ప్రజలను శాసించెను. 44, 45

మూ. తత్రైన్ద్రేణ నరశ్రేష్ఠ భాగేన రఘునన్దన,
ప్రతిగృహ్ణీష్వ భద్రం తే తారణార్థం మమ ప్రభో. 46

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడా ! రఘునన్దన = రామా ! ప్రభో = ప్రభూ ! తత్ర = అందు, ఐన్ద్రేణ = ఇంద్రునికి సంబంధించిన, భాగేన = భాగముచేత, మమ = నాయొక్క, తారణార్థమ్ = తరింపచేయుటకొరకు, ప్రతిగృహ్ణీష్వ = తీసికొనుము. తే = నీకు, భద్రమ్ = మంగళ మగుగాక.

తా. నరులలో శ్రేష్ఠా ! ప్రభూ ! రామా ! ఇంద్రునికి సంబంధించిన భాగముచేత, నన్ను తరింపచేయుటకై దీనిని స్వీకరించుము. నీకు క్షేమ మగుగాక. 46

మూ. తద్రామః ప్రతిజగ్రాహ మునేస్తస్య మహాత్మనః,
దివ్యమాభరణం చిత్రం ప్రదీప్తమివ భాస్కరమ్. 47

ప్ర. అ. రామః = రాముడు, మహాత్మనః = మహాత్ముడైన, తస్య మునేః = ఆ మునియొక్క, ప్రదీప్తమ్ = ప్రకాశించుచున్న, భాస్కరమ్ ఇవ = సూర్యుడు పలె ఉన్న, చిత్రమ్ = విచిత్రమైన, దివ్యమ్ = దివ్యమైన, తత్ ఆభరణమ్ = ఆ ఆభరణమును, ప్రతిజగ్రాహ = తీసికొనెను.

తా. రాముడు మహాత్ముడైన ఆ ముని ఇచ్చిన, సూర్యుడు వలె ప్రకాశించుచున్న విచిత్రమైన, దివ్యమైన ఆ ఆభరణమును గ్రహించెను. 47

మూ. ప్రతిగృహ్య తతో రామస్తదాభరణముత్తమమ్,
ఆగమం తస్య దీప్తస్య ప్రష్టుమేవోపచక్రమే. 48

ప్ర. అ. రామః = రాముడు, ఉత్తమమ్ = ఉత్తమమైన, తత్ ఆభరణమ్ = ఆ ఆభరణమును, ప్రతిగృహ్య = గ్రహించి, తతః = ఆటుపిమ్మట, దీప్తస్య = ప్రకాశించుచున్న, తస్య = దానియొక్క, ఆగమమ్ = రాకను గూర్చి, ప్రష్టుమ్ ఏవ = అడుగుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. రాముడు ప్రకాశించుచున్న ఆ ఆభరణమును తీసికొని, పిమ్మట అది ఎట్లు వచ్చినదో తెలిసికొనుటకై ఇట్లు ప్రశ్నించెను. 48

మూ. అత్యద్భుతమిదం బ్రహ్మన్ వపుర్బిభ్రదనుత్తమమ్,
కథం వా భవతా ప్రాప్తం కుతో వా కేన వాహృతమ్. 49

ప్ర. అ. బ్రహ్మన్ = బ్రాహ్మణుడా ! అత్యద్భుతమ్ = చాల ఆశ్చర్యకరము, అనుత్తమమ్ = అత్యుత్తమమైన, వపుః = శరీరమును, బిభ్రత్ = ధరించుచున్నది అయిన, ఇదమ్ = ఇది, భవతా = నీచేత, కథమ్ = ఎట్లు, ప్రాప్తమ్ = పొందబడినది ? కుతః వా = ఎక్కడినుండి పొందబడినది ? కేన వా = ఎవనిచేత, ఆహృతమ్ = తీసికొనిరాబడినది ?

తా. మహామునీ ! అత్యుత్తమమైన ఆకారము గల చాల ఆశ్చర్యకరమైన ఈ ఆభరణము నీకు ఎక్కడ, ఎట్లు లభించినది ? ఎవరు తీసికొనివచ్చినారు? 49

మూ. కౌతూహలతయా బ్రహ్మన్ పృచ్ఛామి త్వాం మహాయశః,
ఆశ్చర్యాణాం బహూనాం హి నిధిః పరమకో భవాన్. 50

ప్ర. ఆ. బ్రహ్మన్ = బ్రాహ్మణుడా ! మహాయశః = గొప్ప కీర్తి గల వాడా ! కౌతూహలతయా = వేడుకచేత, త్వామ్ = నిన్ను, పృచ్ఛామి = అడుగు చున్నాను. భవాన్ = నీవు, బహూనామ్ = అనేకమైన, ఆశ్చర్యాణామ్ = ఆశ్చర్యములకు, పరమకః = గొప్ప, నిధిః హి = నిధివి కదా ?

తా. మునీంద్రా ! గొప్ప కీర్తి గలవాడా ! వేడుకతో నిన్ను అడుగు చున్నాను. నీవు అనేకమైన ఆశ్చర్యములకు గొప్ప నిధివి కదా ? 50

మూ. ఏవం బ్రువతి కాకుత్థ్సే మునిర్వాక్యమథాబ్రవీత్,
శృణు రామ యథావృత్తం పురా త్రేతాయుగే యుగే. 51

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
షట్‌సప్తతితమః సర్గః

ప్ర. అ. కాకుత్థ్సే = రాముడు, ఏవమ్ = ఇట్లు, బ్రువతి = పలుకుచుండగా, అథ = అటుపిమ్మట, మునిః = ముని, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను, రామ = రామా ! పురా = పూర్వము, త్రేతాయుగే = త్రేతాయుగ మను, యుగే = యుగమునందు, యథా = ఎట్లు, వృత్తమ్ = జరిగినదో, శృణు = వినుము.

తా. రాముని మాటలు విని ముని ఇట్లు పలికెను. "రామా ! పూర్వము త్రేతాయుగములో జరిగిన విషయమును వినుము". 51

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో డెబ్భైఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తషష్టితమః సర్గః

[అగస్త్యుడు రామునకు స్వర్గములో ఉండు ఒక పురుషుడు శవమును భక్షించిన కథ చెప్పుట.]

మూ. పురా త్రేతాయుగే రామ బభూవ బహువిస్తరమ్,
సమన్తాద్యోజనశతం విమృగం పక్షివర్జితమ్. 1

ప్ర. అ. రామ = రామా! పురా = పూర్వము, త్రేతాయుగే = త్రేతాయుగమునందు, సమన్తాత్ = చుట్టూ, యోజనశతమ్ = నూరు యోజనములు, విమృగమ్ = మృగములు లేని, పక్షివర్జితమ్ = పక్షిశూన్యమైన, బహువిస్తృతమ్ = చాల విస్తృతమైన స్థానము, బభూవ = ఉండెను.

తా. రామా! పూర్వము త్రేతాయుగమునందు చుట్టూ నూరు యోజనముల పరిధిలో మృగాలుకాని, పక్షులు కాని లేని చాల విశాలమైన స్థానము ఉండెను. 1

మూ. తస్మిన్నిర్మానుషేఽరణ్యే కుర్వాణస్తప ఉత్తమమ్,
అహమాక్రామితుం సౌమ్య తదరణ్యముపాగమమ్. 2

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! తస్మిన్ = ఆ, నిర్మానుషే = మనుష్యులు లేని, అరణ్యే = అరణ్యమునందు, ఉత్తమమ్ = ఉత్తమమైన, తపః = తపస్సును, కుర్వాణః = చేయుచున్న. అహమ్ = నేను, తత్ = ఆ, అరణ్యమ్ = అరణ్యమును, ఆక్రామితుమ్ = సంచరించుటకు, ఉపాగమమ్ = వచ్చితిని.

తా. మనుష్యులు లేని ఆ అరణ్యములో ఒక మూల ఉత్తమమైన తపస్సు చేసికొనుచున్న నేను ఆ అరణ్య మంతా తిరిగి చూచుటకై అక్కడికి వచ్చితిని. 2

మూ. తస్య రూపమరణ్యస్య నిర్దేష్టుం నశశాక హ,
ఫలమూలైః సుఖాస్వాదైర్బహురూపైశ్చ కాననైః. 3

ప్ర. అ. సుఖాస్వాదైః = సుఖకరమైన రుచి గల, ఫలమూలైః = ఫల మూలములతోను, బహురూపైః = అనేకరూపములు గల, కాననైః చ = అడవుల లోను, తస్య = ఆ, అరణ్యస్య = అరణ్యముయొక్క, రూపమ్ = రూపమును, నిర్దేష్టుమ్ = వర్ణించుటకు, న శక్తా హ = నేను సమర్థుడను కాలేదు.

తా. మంచి రుచి గల ఫలములతోను, దుంపలతోను సమృద్ధమైన, అనేక రూపములు గల అడవులతో నిండిన ఆ అరణ్యముస్వరూపమును వర్ణించి చెప్పుట శక్యము కాదు. 3

మూ. తస్యారణ్యస్య మధ్యే తు సరో యోజనమాయతమ్,
హంసకారణ్డవాకీర్ణం చక్రవాకోపశోభితమ్. 4
పద్మోత్పలసమాకీర్ణం సమతిక్రాన్తశైవలమ్,

ప్ర. అ. తస్య = ఆ, అరణ్యస్య = అరణ్యముయొక్క, మధ్యే = మధ్య యందు, హంసకారణ్డవాకీర్ణమ్ = హంసలచేతను, నీటికాకులచేతనూ వ్యాప్తము, చక్రవాకోపశోభితమ్ = చక్రవాకపక్షులచేత ప్రకాశింపచేయబడినది, పద్మోత్పల సమాకీర్ణమ్ = పద్మములచేత నల్లకలవలచేత వ్యాప్తమూ, సమతిక్రాన్తశైవలమ్ = పోయిన నాచు గలది అయిన, యోజనమ్ = ఒక యోజనము, ఆయతమ్ = విశాల మైన, సరః = సరస్సు ఉన్నది.

తా. ఆ అరణ్యమునకు మధ్యయందు ఒక యోజనము వైశాల్యము గల సరస్సు ఉండెను. దానిలో హంసలు, కారండవములు చక్రవాకములు విహరించు చుండెను. అది నాచు లేక, పద్మములతోను, కలవలతోను ప్రకాశించుచుండెను. 4

మూ. తదాశ్చర్యమివాత్యర్థం సుఖాస్వాదమనుత్తమమ్, 5
అరజస్కం తథాక్షోభ్యం శ్రీమత్పక్షిగణాయుతమ్.

ప్ర. అ. అత్యర్థమ్ = మిక్కిలి, సుఖాస్వాదమ్ = సుఖమైన ఆస్వాదము గలది, అనుత్తమమ్ = చాలశ్రేష్ఠము, అరజస్కమ్ = రజస్సు లేనిది, తథా = మరియు, అక్షోభ్యమ్ = క్షోభింపచేయుటకు శక్యము కానిది, శ్రీమత్ = శోభా యుక్తము, పక్షిగణాయుతమ్ = పక్షుల సముదాయముతో కూడినది అయిన, తత్ = ఆది, ఆశ్చర్యమ్ ఇవ = ఆశ్చర్యము వలె ఉండెను.

తా. సుఖకరమైన రుచి గల జలముతో ఆ సరస్సుస్వచ్ఛముగా, శోభాయుక్తమై ఉండెను. పక్షిగణములతో నిండిన అత్యుత్తమమైన ఆ సరస్సు చాలలోతుగా ఉండుటచేత క్షోభింప శక్యము కానిదై ఆశ్చర్యకరముగా నుండెను. 5

మూ. తస్మిన్ సరఃసమీపే తు మహదద్భుతమాశ్రమమ్, 6
పురాణం పుణ్యమత్యర్థం తపస్విజనవర్జితమ్.

ప్ర. అ. తస్మిన్ = ఆ, సరఃసమీపే తు = సరస్సు సమీపమునందు, పురాణమ్ = ప్రాచీనము, అత్యర్థమ్ = మిక్కిలి, పుణ్యమ్ = పుణ్యము అయిన, తపస్విజనవర్జితమ్ = మునులతో శూన్యమైన. అద్భుతమ్ = ఆశ్చర్యకరమైన, మహత్ = గొప్ప, ఆశ్రమమ్ = ఆశ్రమము ఉన్నది.

తా. ఆ సరస్సు సమీపమున అతిప్రాచీనము చాల పవిత్రము, ఆశ్చర్యకరమూ అయిన గొప్ప ఆశ్రమము ఉండెను. కాని దానిలో మును లెవ్వరూ లేకుండిరి. 6

మూ. తత్రాహమవసం రాత్రిం నైదాఘీం పురుషర్షభ, 7
ప్రభాతే కల్యముత్థాయ సరస్తదుపచక్రమే.

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! అహమ్ = నేను, నైదాఘీమ్ = గ్రీష్మమునకు సంబంధించిన, రాత్రిమ్ = రాత్రిని, తత్ర = అక్కడ, అవసమ్ = నివసించితిని. ప్రభాతే = ప్రాతఃకాలమునందు, కల్యమ్ = తెల్లవారుజాముననే, ఉత్థాయ = లేచి, తత్ = ఆ, సరః = సరస్సును గూర్చి, ఉపచక్రమే = నడచితిని.

తా. రామా! నేను ఆ గ్రీష్మరాత్రి అక్కడ నివసించితిని. ప్రాతఃకాలమువందు ప్రొద్దుటనే లేచి, ఆ సరస్సును గూర్చి వెళ్ళితిని. 7

మూ. అథాపశ్యం శవం తత్ర సుపుష్టమరజఃక్వచిత్, 8
తిష్ఠన్తం పరయా లక్ష్మ్యా తస్మింస్తోయాశయే నృప.

ప్ర. అ. నృప = రాజా! అథ = అటుపిమ్మట, తత్ర = అక్కడ, సుపుష్టమ్ = బాగా బలిసినది, క్వచిత్ = ఎక్కడా కూడ, అరజః = పరాగము లేనిది, తస్మిన్ = ఆ, తోయాశయే = సరస్సునందు, పరయా = గొప్ప, లక్ష్మ్యా = శోభతో, తిష్ఠన్తమ్ = ఉన్నది అయిన, శవమ్ = శవమును, అపశ్యమ్ = చూచితిని.

తా. రాజా! పిమ్మట అక్కడ సరస్సులో నేనొక చాలా బలిసిన శవమును చూచితిని. దానికి ఎక్కడా కూడ మాలిన్యము లేకుండెను. అది చాల శోభతో ఉండెను. 8

మూ. తమర్థం చింతయానోఽహం ముహూర్తం తత్ర రాఘవ, 9
విష్ఠితోఽస్మి సరస్తీరే కిం న్విదం స్యాదితి ప్రభో.

ప్ర. అ. రాఘవ = రామా ! ప్రభో = ప్రభూ ! అహమ్ = నేను, తమ్ = ఆ, అర్థమ్ = విషయమును, చింతయానః = ఆలోచించుచు, ఇదమ్ = ఇది, కిం ను స్యాత్ = ఏమి అగును, ఇతి = అని, తత్ర = ఆ, సరస్తీరే = సరస్తీరమునందు, ముహూర్తమ్ = ముహూర్తకాలమును, చింతయానః = ఆలోచించుచు, విష్ఠితః అస్మి = నిలచితిని.

తా. ప్రభూ! రామా! ఇది ఏమై ఉండునా అని ఆ విషయమునే ఆలోచించుచు నేను ముహూర్తకాలము ఆ సరస్తీరమునందే నిలచితిని. 9

మూ. అథాపశ్యం ముహూర్తాత్తు దివ్యమద్భుతదర్శనమ్, 10
విమానం పరమోదారం హంసయుక్తం మనోజవమ్.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, ముహూర్తాత్ తు = ముహూర్తకాలములో, దివ్యమ్ = దివ్యమూ, అద్భుతదర్శనమ్ = అద్భుతమైన దర్శనము కలదీ, పరమోదారమ్ = మిక్కిలి ఉదారము, హంసయుక్తమ్ = హంసలతో కూడినదీ, మనోజవమ్ = మనోవేగము గలదీ అయిన, విమానమ్ = విమానమును, అపశ్యమ్ = చూచితిని.

తా. పిమ్మట ముహూర్తకాలములో చూచుటకు ఆశ్చర్యకరమైన చాల సుందరమైన, మనోవేగము గల దివ్యమైన విమానమును చూచితిని. దానికి హంసలు కట్టబడెను. 10

మూ. అత్యర్థం స్వర్గిణం తత్ర విమానే రఘునన్దన, 11
ఉపాస్తేఽప్సరసాం వీర సహస్రం దివ్యభూషణమ్.

ప్ర. అ. వీర = వీరుడా! రఘునన్దన = రామా! తత్ర విమానే = ఆ విమానము

నందు, స్వర్గిణమ్=స్వర్గమునందుండు పురుషుణ్ణి, దివ్యభూషణమ్ = దివ్యములైన భూషణములు గల, అప్సరసామ్=అప్సరఃస్త్రీలయొక్క, సహస్రమ్=సహస్రము, అత్యర్థమ్ = మిక్కిలి, ఉపాస్తే = ఉపాసించుచున్నది.

తా. వీరా! రామా! ఆ విమానములో ఉన్న స్వర్గనివాసియైన ఒక పురుషుణ్ణి దివ్యములైన అలంకారములు ధరించిన వేయిమంది అప్సరసలు అధికముగా సేవించుచుండిరి. 11

మూ. గాయన్తి కాశ్చిద్రమ్యాణి వాదయన్తి తథాపరాః, 12
మృదఙ్గవీణాపణవాన్ నృత్యన్తి చ తథాపరాః.

ప్ర. ఆ. కాశ్చిత్=కొందరుస్త్రీలు, రమ్యాణి = రమ్యములైన గీతములను, గాయన్తి = గానముచేయుచున్నారు. తథా = మరియు, అపరాః = మరికొందరు, మృదఙ్గవీణాపణవాన్ = మృదంగములను, వీణలను, పణవములను, వాదయన్తి= మ్రోగించుచున్నారు. తథా = మరియు, అపరాః = మరికొందరు, నృత్యన్తి చ= నాట్యము చేయుచున్నారు.

తా. కొందరు అప్సరసలు మధురములైన గీతములను పాడుచుండిరి. కొందరు మృదంగ-వీణా-పణవములను మ్రోగించుచుండిరి. మరికొందరు నృత్యము చేయుచుండిరి. 12

మూ. అపరాశ్చన్ద్రరశ్మ్యాభైర్హేమదణ్డైశ్చ చామరైః, 13
దోధూయుర్వదనం తస్య పుణ్డరీకనిభేక్షణమ్.

ప్ర. ఆ. అపరాః=మరికొందరుస్త్రీలు, చన్ద్రరశ్మ్యాభైః=చంద్రకిరణముల వంటి కాంతి గల. హేమదణ్డైః = బంగారు దండములు గల, చామరైః = చామరములచేత, తస్య = ఆతనియొక్క, పుణ్డరీక నిభేక్షణమ్ = పద్మముల వంటి నేత్రములు గల, వదనమ్ = ముఖమును, దోధూయుః = వీచిరి.

తా. కొందరు అప్సరసలు చంద్రకిరణముల వలె తెల్లగా నున్న బంగారు దండములు గల చామరములతో ఆతని పద్మములవంటి నేత్రములు గల ముఖమును వీచుచుండిరి. 13

మూ. తతఃసింహాసనం హిత్వా మేరుకూటమివాంశుమాన్, 14
పశ్యతో మే తదా రామ విమానాదవరుహ్య చ,
తం శవం భక్షయామాస స స్వర్గీ రఘునన్దన. 15

ప్ర. అ. రఘునన్దన = రఘువంశమును ఆనందింప చేయువాడా! రామ = రామా! సః = ఆ, స్వర్గీ = స్వర్గనివాసి, అంశుమాన్ = సూర్యుడు, మేరుకూటమ్ ఇవ = మేరుపర్వతశిఖరమును పలె, సింహాసనమ్ = సింహాసనమును, హిత్వా = విడచి, తదా = అప్పుడు, మే = నేను, పశ్యతః = చూచుచుండగానే, విమానాత్ = విమానమునుండి, అవరుహ్య = దిగి, తం శవమ్ = ఆ శవమును, భక్షయామాస = భక్షించెను.

తా. రామా! పిమ్మట అతడు మేరుశిఖరమును సూర్యుడు వలె సింహాసనమును విడచి విమానమునుండి దిగి, నేను చూచుచుండగనే ఆ శవమును భక్షించెను.

మూ. తతో భుక్త్వా యథాకామం మాంసం బహు సు పీవరమ్,
ఆవతీర్య సరః స్వర్గీ సంస్పృష్టుముపచక్రమే. 16

ప్ర. అ. స్వర్గీ = ఆ స్వర్గనివాసి, తతః = అటుపిమ్మట, సు పీవరమ్ = బాగా బలసిన, మాంసమ్ = మాంసమును, బహు = అధికముగా, యథాకామమ్ = ఇష్టము వచ్చినట్లుగా. భుక్త్వా = భుజించి, సరః = సరస్సును, అవతీర్య = దిగి, సంస్పృష్టమ్ = ఆచమనము చేయుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. ఆ స్వర్గనివాసి పిమ్మట బాగా బలిసిన ఆ మాంసమును అధికముగా, కావలసినంత తిని, సరస్సులోనికి దిగి, ఆచమనము చేయుటకు ఉపక్రమించెను. 16

మూ. ఉపస్పృశ్య యథాన్యాయం స స్వర్గీ రఘునన్దన,
ఆరోఢుముపచక్రామ విమానవరముత్తమమ్. 17

ప్ర. అ. రఘునన్దన = రామా! సః స్వర్గీ = ఆ స్వర్గనివాసి, యథాన్యాయమ్ = యథావిధిగా, ఉపస్పృశ్య = ఆచమనము చేసి, ఉత్తమమ్ = ఉత్తమమైన, విమానవరమ్ = విమానశ్రేష్ఠమును, ఆరోఢుమ్ = ఎక్కుటకు, ఉపచక్రామ = ఉపక్రమించెను.

తా. రామా ! ఆ స్వర్గనివాసి యథావిధిగా ఆచమనము చేసి శ్రేష్ఠమైన ఆ విమానమును ఎక్కబోవుచుండెను. 17

మూ. తమహం దేవసంకాశమారోహన్తముదీక్ష్య వై,
అథాహమబ్రవం వాక్యం తమేవ పురుషర్షభ. 18

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా ! అథ = ఆటుపిమ్మట, అహమ్ = నేను, ఆరోహన్తమ్ = విమానమునుఎక్కుచున్న, దేవసంకాశమ్ = దేవతాతుల్యుడైన, తమ్ = అతనిని, ఉదీక్ష్య వై = చూచి, తమేవ = ఆతనిని గూర్చియే, వాక్యమ్ = వాక్యమును, అబ్రవమ్ = పలికితిని.

తా. పురుషశ్రేష్ఠుడ వైన రామా ! విమానమును ఎక్కబోతున్న ఆ దేవతాతుల్యుడైన పురుషుణ్ణి చూచి నేను ఆతనితోనే ఇట్లు పలికితిని. 18

మూ. కో భవాన్ దేవసంకాశ ఆహారశ్చ విగర్హితః,
త్వయేదం భుజ్యతే సౌమ్య కిమర్థం వక్తుమర్హసి. 19

ప్ర. అ. దేవసంకాశ = దేవతాతుల్యుడా! సౌమ్య = సౌమ్యుడా! భవాన్ = నీవు, కః = ఎవడవు? త్వయా = నీచేత, విగర్హితః = నింద్యమైన, ఆహారశ్చ = ఆహారము, భుజ్యతే = తినబడుచున్నది. ఇదమ్ = ఇది, కిమర్థమ్ = ఎందువలన, వక్తుమ్ = చెప్పుటకు, అర్హసి = తగి ఉన్నావు.

తా. దేవతాసమానుడవైన ఓ! సౌమ్యుడా ! నీవు ఎవరవు? నీవు నింద్యమైన ఆహారమును తినుచున్నావు! ఇది ఎందువలన? చెప్పుము. 19

మూ. కస్య స్యాదీదృశో భావ ఆహారో దేవసంమత,
ఆశ్చర్యం వర్తతే సౌమ్య శ్రోతుమిచ్ఛామి తత్త్వతః, 20
నాహమౌపయికం మన్యే తవ భక్ష్యమిమం శవమ్.

ప్ర. అ. దేవసంమత = దేవతుల్యుడా! ఈదృశః = ఇట్టి, భావః = భావము (స్థితి), ఆహారః = ఆహారమూ, కస్య = ఎవనికి, స్యాత్ = ఉండును? సౌమ్య = సౌమ్యుడా! ఆశ్చర్యమ్ = ఆశ్చర్యముగా, వర్తతే = ఉన్నది. తత్త్వతః = యథార్థముగా, శ్రోతుమ్ = వినుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను. తవ = నీకు, ఇమం శవమ్ = ఈ శవమును, ఔపయికమ్ = ఉపయోగ్యమైన, భక్ష్యమ్ = తినదగిన వస్తువునుగా, న మన్యే = తలవను.

దేవత వలె ఉన్నవాడా! దేవతాతుల్యమైన స్థితీ, ఇట్టి ఆహారమూ ఎవరికి ఉండును? చాల ఆశ్చర్యకరముగా ఉన్నది. దీనిలోని యథార్థమును విన గోరుచున్నాను. నీకు ఈ శవము తగిన భక్ష్య మని నేను భావించను. 20

మూ. ఇత్యేవముక్తః స నరేన్ద్ర నాకీ
కౌతూహలాత్ సూన్యతయా గిరా చ,
శ్రుత్వా చ వాక్యం మమ సర్వమేత
త్సర్వం తథా చాకథయన్మమేతి. 21

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
సప్తసప్తతితమః సర్గః

ప్ర. అ. నరేన్ద్ర=రాజా! కౌతూహలాత్ = వేడుకవలన, సూన్యతయా= సత్యమైన, గిరా చ = వాక్కుతోను, ఇత్యేవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, సః నాకీ=ఆ స్వర్గనివాసి, మమ=నాయొక్క, ఏతత్ = ఈ, సర్వమ్=సమస్తమైన, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా చ = విని, తథా = మరియు, మమ = నాకు, సర్వమ్ = సమస్తమును, అకథయత్ చ = చెప్పెను.

తా. రాజా! తెలిసికొనవలె నను వేడుకతో సత్యముగా నేను పలికిన మాటలు విని ఆ స్వర్గనివాసి ఆ విషయము నంతా నాకు ఇట్లు చెప్పెను. 21

"బాలనందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో డెబ్భైఏడవ సర్గ సమాప్తము.

అథ అష్టసప్తతితమః సర్గః

[శ్వేతుడు తనకు కుత్సితమైన ఆహారము తినవలసివచ్చినందుకు కారణమును అగస్త్యునకు చెప్పుట. బ్రహ్మతో తనకు జరిగిన సంభాషణమును తెలుపుట. అగస్త్యునకు దివ్యాలంకారమును దానము చేయుటచే అతడు ఆకలిదప్పులనుండి విముక్తుడగుట.]

మూ. శ్రుత్వా తు భాషితం వాక్యం మమ రామ శుభాక్షరమ్,
ప్రాఞ్జలిః ప్రత్యువాచేదం స స్వర్గీ రఘునన్దన. 1

ప్ర. అ. రఘునన్దన = రఘువంశీయులకు ఆనందము కలిగించువాడా! రామ = రామా! భాషితమ్ = పలకబడిన, శుభాక్షరమ్ = శుభములైన అక్షరములు గల, మమ వాక్యమ్ = నా వాక్యమును, శ్రుత్వా = విని, సః స్వర్గీ = ఆ స్వర్గనివాసి, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, ఇదమ్ = దీనిని, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. రఘునందనా! రామా! ఆ స్వర్గనివాసి, నేను పలికిన మధురాక్షరములు గల వాక్యమును విని అంజలి ఘటించి ఇట్లు పలికెను. 1

మూ. శృణు బ్రహ్మన్ పురావృత్తం మమైతత్సుఖదుఃఖయోః,
అనతిక్రమణీయం హి యథా పృచ్ఛసి మాం ద్విజ. 2

ప్ర. అ. బ్రహ్మన్ = ఋషీశ్వరా! ద్విజ = బ్రాహ్మణుడా! యథా = ఎట్లు, పృచ్ఛసి = అడుగుచున్నావో, మమ = నాయొక్క, సుఖదుఃఖయోః = సుఖదుఃఖములయొక్క, పురావృత్తమ్ = పూర్వము జరిగిన, అనతిక్రమణీయమ్ = అతిక్రమింప శక్యము కాని. ఏతత్ = ఈ కారణమును, శృణు = వినుము.

తా. బ్రహ్మర్షీ! నీవు అడిగిన విధముగ నా సుఖదుఃఖములకు కారణమైన అతిక్రమింప శక్యము కాని పూర్వము జరిగిన విషయమును వినుము. 2

మూ. పురా వైదర్భకో రాజా పితా మమ మహాయశాః,
సుదేవ ఇతి విఖ్యాతస్త్రిషు లోకేషు వీర్యవాన్. 3

ప్ర. అ. సుదేవః ఇతి = సుదేవుడు అని త్రిషు = మూడు. లోకేషు = లోకములయందు, విఖ్యాతః = ప్రసిద్ధుడు, మహాయశాః = గొప్ప కీర్తి గలవాడు, వీర్యవాన్ = పరాక్రమవంతుడు అయిన, పురా = పూర్వము వైదర్భకః రాజా = విదర్భదేశమునకు సంబంధించిన రాజు, మమ = నాయొక్క, పితా = తండ్రి.

తా. పూర్వము విదర్భదేశరాజైన, గొప్ప కీర్తి పరాక్రమమూ గల, మూడు లోకాలలోను ప్రసిద్ధుడైన సుదేవుడు నా తండ్రి. 3

మూ. తస్య పుత్రద్వయం బ్రహ్మన్ ద్వాభ్యాం స్త్రీభ్యామజాయత,
అహం శ్వేత ఇతి ఖ్యాతో యవీయాన్ సురథోఽభవత్. 4

ప్ర. అ. బ్రహ్మన్ = బ్రాహ్మణుడా ! తస్య = ఆతనికి, ద్వాభ్యాం స్త్రీభ్యామ్ = ఇద్దరు స్త్రీలచేత, పుత్రద్వయమ్ = పుత్రద్వయము, అజాయత = పుట్టెను, అహమ్ = నేను, శ్వేతః ఇతి = శ్వేతుడు అని, ఖ్యాతః = ప్రసిద్ధుడను, సురథః = సురథుడు, యవీయాన్ = చిన్నవాడుగా, అభవత్ = ఆయెను.

తా. ఆయనకు ఇద్దరు స్త్రీలయందు ఇద్దరు పుత్రులు పుట్టిరి. నా పేరు శ్వేతుడు, చిన్నవాని పేరు సురథుడు. 4

మూ. తతః పితరి స్వర్యాతే పౌరా మామభ్యషేచయన్,
తత్రాహం కృతవాన్ రాజ్యం ధర్మ్యం చ సుసమాహితః.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, పితరి = తండ్రి, స్వః యాతే = స్వర్గమునకు వెళ్ళినవాడగుచుండగా, పౌరాః = పౌరులు, మామ్ = నన్ను, అభ్యషేచయన్ = అభిషేకించిరి. తత్ర = అక్కడ, అహమ్ = నేను, సుసమాహితః = చాల సావధానచిత్తుడనై, ధర్మ్యమ్ = ధర్మసంమతమైన, రాజ్యమ్ = రాజ్యమును, కృతవాన్ = చేసినాను.

తా. మా తండ్రి స్వర్గస్థుడైన పిమ్మట ప్రజలు నన్ను రాజ్యాభిషిక్తుని చేసిరి. నేను సావధానచిత్తుడనై ధర్మసంమతముగా రాజ్యము చేసితిని. 5

మూ. ఏవం వర్షసహస్రాణి సమతీతాని సువ్రత,
రాజ్యం కారయతో బ్రహ్మన్ ప్రజా ధర్మేణ రక్షతః. 6

ప్ర. అ. సువ్రత = మంచి నియమములు కలవాడా ! బ్రహ్మన్ = బ్రాహ్మణుడా ! ఏవమ్ = ఇట్లు, రాజ్యమ్ = రాజ్యమును, కారయతః = చేయుచున్న, ధర్మేణ = ధర్మముచేత, రక్షతః చ = రక్షించుచున్న నాకు, వర్షసహస్రాణి = వేలకొలది వర్షములు, సమతీతాని = గడచినవి.

తా. ఉత్తమవ్రతము గల బ్రాహ్మణోత్తమా ! నేను ఈ విధముగా రాజ్యము చేయుచు ధర్మము చేత రక్షించుచుండగా వేలకొలది సంవత్సరములు గడచినవి. 6

మూ. సోఽహం నిమిత్తే కస్మింశ్చిద్విజ్ఞాతాయుర్ద్విజోత్తమ,
కాలధర్మం హృది న్యస్య తతో వనముపాగమమ్. 7

ప్ర. అ. ద్విజోత్తమ = బ్రాహ్మణశ్రేష్ఠుడా ! సః అహమ్ = అట్టి నేను, కస్మిన్ చిత్ = ఒకానొక, నిమిత్తే = నిమిత్తమునందు (శకునమును పట్టి), విజ్ఞాతాయుః = తెలియబడిన ఆయుర్దాయము కలవాడనై, కాలధర్మమ్ = మరణమును, హృది = హృదయమునందు, న్యస్య = ఉంచి, తతః = అటుపిమ్మట, వనమ్ = వనమును గూర్చి, గతః = వెళ్ళినాను.

తా. బ్రాహ్మణోత్తమా ! ఏదో ఒక నిమిత్తముచేత (సాముద్రిక.శకునాదులచేత) నా ఆయుర్దాయమును గూర్చి తెలిసికొనుటచే నేను మరణమును గూర్చి ఆలోచించుచు అరణ్యము చేరితిని. 7

మూ. సోఽహం వనమిదం దుర్గం మృగపక్షివివర్జితమ్,
తపశ్చర్తుం ప్రవిష్టోఽస్మి సమీపే సరసః శుభే. 8

ప్ర. అ. సః అహమ్ = అట్టి నేను, శుభే = సుందరమైన, సరసః = సరస్సుయొక్క, సమీపే = సమీపమునందు, తపః = తపస్సును, చర్తుమ్ = చేయుటకు, దుర్గమ్ = ప్రవేశింప శక్యము కాని, మృగపక్షివివర్జితమ్ = మృగపక్షులతో శూన్యమైన, ఇదం వనమ్ = ఈ వనమును, ప్రవిష్టః = ప్రవేశించినవాడను, అస్మి = అయితిని.

తా. నేను సుందరమైన ఈ సరస్తీరమునందు తపస్సు చేసికొనుటకై,

మృగములు గాని, పక్షులు కాని లేని, ప్రవేశింప శక్యము కాని ఈ వనములో ప్రవేశించితిని. 8

మూ. భ్రాతరం సురథం రాజ్యే అభిషిచ్య మహీపతిమ్,
ఇదం సరః సమాసాద్య తప స్తప్తం మయా చిరమ్. 9

ప్ర. అ. భ్రాతరమ్ = సోదరుడైన, సురథమ్ = సురథుణ్ణి, మహీపతిమ్ = రాజునుగా, రాజ్యే = రాజ్యమునందు, అభిషిచ్య = అభిషేకించి, ఇదమ్ = ఈ, సరః = సరస్సును, సమాసాద్య = పొంది, మయా = నాచేత, చిరమ్ = చిరకాలము, తపః = తపస్సు, తప్తమ్ = చేయబడినది.

తా. సోదరుడైన సురథుణ్ణి రాజ్యమునందు రాజునుగా అభిషేకించి, ఈ సరస్సువద్ద నేను చాల కాలము తపస్సు చేసితిని. 9

మూ. సోఽహం వర్షసహస్రాణి తపస్త్రీణి మహావనే,
తప్త్వా సుదుష్కరం ప్రాప్తో బ్రహ్మలోకమనుత్తమమ్.

ప్ర. అ. సః అహమ్ = అట్టి నేను, త్రీణి = మూడు, వర్షసహస్రాణి = వర్షముల సహస్రములను, మహావనే = ఈ మహారణ్యమునందు, సుదుష్కరమ్ = చేయ శక్యము కాని, తపః = తపస్సును, తప్త్వా = చేసి, అనుత్తమమ్ = చాల ఉత్తమమైన, బ్రహ్మలోకమ్ = బ్రహ్మలోకమును, ప్రాప్తః = పొందినాను.

తా. నేను మూడు వేల సంవత్సరములు మహారణ్యములో కఠిన తపస్సు చేసి అత్యుత్తమలోకమైన బ్రహ్మలోకమునకు వెళ్ళితిని. 10

మూ. తస్యేమే స్వర్గభూతస్య క్షుత్పిపాసే ద్విజోత్తమ,
బాధేతే పరమోదార తతోఽహం వ్యథితేన్ద్రియః. 11

ప్ర. అ. పరమోదార = చాల ఉదారుడా! ద్విజోత్తమ = బ్రాహ్మణోత్తమా, స్వర్గభూతస్య = స్వర్గస్థుడనైన నాకు, ఇమే = ఈ, క్షుత్పిపాసే = ఆకలిదప్పికలు, బాధేతే = బాధించుచున్నవి. తతః = ఆ కారణమువలన, అహమ్ = నేను, వ్యథితేన్ద్రియః = వ్యథ చెందిన ఇంద్రియములు కలవాడను.

తా. చాల ఉదారుడవైన బ్రాహ్మణోత్తమా! బ్రహ్మలోకములో ఉన్నను

నన్ను ఆకలిదప్పికలు బాధించుచుండెను; అందుచేత నా మనస్సు చాలా బాధ చెందినది. 11

మూ. గత్వా త్రిభువనశ్రేష్ఠం పితామహమువాచ హ,
భగవన్ బ్రహ్మలోకోఽయం క్షుత్పిపాసావివర్జితః. 12

ప్ర. అ. త్రిభువనశ్రేష్ఠమ్=మూడు లోకములలో శ్రేష్ఠుడైన, పితామహమ్ =బ్రహ్మదేవుణ్ణి గూర్చి, గత్వా = వెళ్ళి, ఉవాచ హ = పలికితిని. భగవన్ = భగవంతుడా ! అయమ్ = ఈ, బ్రహ్మలోకః = బ్రహ్మలోకము, క్షుత్పిపాసావివర్జితః = ఆకలిదప్పికలు లేనిది.

తా. మూడు లోకములలో శ్రేష్ఠుడైన బ్రహ్మవద్దకు వెళ్ళి ఇట్లు అడిగితిని. "భగవంతుడా ! ఈ బ్రహ్మలోకములో ఆకలిదప్పికలు ఉండవు కదా ? 12

మూ. కస్యాయం కర్మణః పాకః క్షుత్పిపాసానుగో హ్యహమ్,
ఆహారః కశ్చ మే దేవ తన్మే బ్రూహి పితామహ. 13

ప్ర. అ. అహమ్ = నేను, క్షుత్పిపాసానుగః హి = ఆకలి దప్పికలు అనుసరించునవిగా కలవాడను. అయమ్ = ఇది, కస్య కర్మణః = ఏ కర్మయొక్క, పాకః=పాకము ? దేవ=దేవా ! పితామహ = బ్రహ్మదేవా ! మే = నాకు, ఆహారః = ఆహారము, కః చ = ఏది ? తత్ = దానిని, మే = నాకు, బ్రూహి=చెప్పుము.

తా. కాని నన్ను ఆకలి దప్పికలు వెన్నంటుచున్నవి ? ఇది ఏ కర్మ ఫలము ? పితామహా ! నేను ఏమి ఆహారము భుజించవలెను ? చెప్పుము. 13

మూ. పితామహస్తు మామాహ తవాహారః సుదేవజ,
స్వాదూని స్వాని మాంసాని తాని భక్షయ నిత్యశః. 14

ప్ర. అ. పితామహః తు = బ్రహ్మదేవుడైతే, మామ్ = నన్ను గూర్చి, ఆహ = పలికెను. సుదేవజ = సుదేవుని కుమారుడా ! స్వాదూని = మధురమైన, స్వాని = నీ సంబంధమైన, మాంసాని = మాంసములే, తవ=నీయొక్క, ఆహారః = ఆహారము. నిత్యశః = నిత్యము, తాని = వాటిని, భక్షయ = భక్షించుము.

తా. పితామహుడు నాతో ఇట్లు చెప్పెను. సుదేవపుత్రా ! నీకు మధురమైన నీ మాంసాలే ఆహారము. నిత్యమూ వాటిని భక్షించుము. 14

మూ. స్వశరీరం త్వయా పుష్టం కుర్వతా తప ఉత్తమమ్,
అనుత్తం రోహతే శ్వేత న కదాచిన్మహామతే. 15

ప్ర. అ. ఉత్తమమ్ = ఉత్తమమైన, తపః = తపస్సును, కుర్వతా = చేయుచున్న నిచేత, స్వశరీరమ్ = నీశరీరము, పుష్టమ్ = పోషించబడినది. శ్వేత = శ్వేతుడా ! మహామతే = గొప్ప బుద్ధి గలవాడా ! అనుత్తమ్ = నాటనిది, కదాచిత్ = ఎన్నడూ, న రోహతే = మొలవదు.

తా. ఉత్తమమైన తపస్సు చేయుచు నీవు నీ శరీరము బాగా బలియునట్లు చేసినావు. గొప్ప బుద్ధి గల శ్వేతా ! వృత్తనము నాటనిదే మొలవదు కదా ? 15

మూ. దత్తం న తేఽస్తి సూక్ష్మోఽపి తప ఏవ నిషేవసే,
తేన స్వర్గగతో వత్స బాధ్యసే క్షుత్పిపాసయా. 16

ప్ర. అ తే = నీకు, సూక్ష్మః అపి = చాల అల్పమైనా, దత్తమ్ = ఇవ్వబడినది, నాస్తి = లేదు. తపః ఏవ = తపస్సునే, నిషేవసే = సేవించుచున్నావు. వత్స = వత్సా ! తేన = ఆ కారణముచేత, స్వర్గగతః = స్వర్గమును పొందికూడ, క్షుత్పిపాసయా = ఆకలిదప్పికలచేత, బాధ్యసే = బాధించబడుచున్నావు.

తా. నీవు కొంచెము కూడ దానము చేయలేదు. కేవలము తపస్సుమాత్రమే చేసితివి. వత్సా ! ఆ కారణముచేతనే నీవు ఆకలిదప్పికలతో బాధపడుచున్నావు.

మూ. స త్వం సుపుష్టమాహారైః స్వశరీరమనుత్తమమ్,
భక్షయిత్వామృతరసం తేన వృత్తిర్భవిష్యతి. 17

ప్ర. అ సః త్వమ్ = అట్టి నీవు, ఆహారైః = ఆహారములచేత, సుపుష్టమ్ = బాగా పోషింపబడిన, అనుత్తమమ్ = శ్రేష్ఠమైన, అమృతరసమ్ = అమృతము వంటి రుచి గల, స్వశరీరమ్ = నీ శరీరమును, భక్షయిత్వా = భక్షించి, తేన = దానిచేత, వృత్తిః = జీవనము, భవిష్యతి = కాగలదు.

తా. నీవు ఆహారములచే బాగా పోషింపబడిన, శ్రేష్ఠమైన, అమృతతుల్యమైన స్వదేహమును తినుము. దానితో నీకు జీవననిర్వాహము జరుగును. 17

మూ. యదా తు తద్వనం శ్వేత అగస్త్యః స మహానృషిః,
ఆగమిష్యతి దుర్ధర్షస్తదా కృచ్ఛ్రాద్విమోక్ష్యసే. 18

ప్ర. అ. శ్వేత = శ్వేతా ! యదా తు = ఎప్పుడైతే, సః = ఆ, మహాన్ ఋషిః = మహర్షియైన, అగస్త్యః = అగస్త్యుడు, తత్ వనమ్ = ఆ వనమును గూర్చి, ఆగమిష్యతి = రాగలడో, తదా = అప్పుడు, కృచ్ఛ్రాత్ = ఈ కష్టమునుండి, విమోక్ష్యసే = విముక్తుడవు కాగలవు.

తా. శ్వేతా ! అగస్త్యమహర్షి ఆ వనమునకు వచ్చినప్పుడు నీ కష్టము తొలగును. 18

మూ. స హి తారయితుం సౌమ్య శక్తః సురగణానపి,
కిం పునస్త్వాం మహాబాహో క్షుత్పిపాసావశం గతమ్. 19

ప్ర. అ. మహాబాహో = మహాబాహూ ! సౌమ్య = సౌమ్యుడా ! సః = అతడు, సురగణానపి = దేవతాగణములను కూడ, తారయితుమ్ = తరింపచేయుటకు, శక్తః = సమర్థుడు. క్షుత్పిపాసావశం గతమ్ = ఆకలిదప్పికలకు వశుడవైన, త్వామ్ = నిన్ను, కిం పునః = చెప్పనేల?

తా. మహాబాహువైన సౌమ్యుడా! ఆ అగస్త్యుడు దేవతాగణములను కూడ తరింప చేయ సమర్థుడు. ఆకలిదప్పికలతో బాధపడుచున్న నీ మాట చెప్పవలెనా?

మూ. సోఽహం భగవతః శ్రుత్వా దేవదేవస్య నిశ్చయమ్,
ఆహారం గర్హితం కుర్మి స్వశరీరం ద్విజోత్తమ. 20

ప్ర. అ. ద్విజోత్తమ = బ్రాహ్మణశ్రేష్ఠుడా ! సః అహమ్ = అట్టి నేను, భగవతః = భగవంతుడైన, దేవదేవస్య = దేవతల దేవుడైన బ్రహ్మదేవునియొక్క, నిశ్చయమ్ = నిశ్చయమును, శ్రుత్వా = విని, స్వశరీరమ్ = నా శరీరమును, గర్హితమ్ = నింద్యమైన, ఆహారమ్ = ఆహారమునుగా, కుర్మి = చేయుచున్నాను.

తా. బ్రాహ్మణోత్తమా! భగవంతుడైన బ్రహ్మదేవుని మాట ప్రకారము నేను నా శరీరమునే కుత్సితమైన ఆహారమునుగా తినుచున్నాను. 20

మూ. బ్రహ్మాన్వర్షగణాన్ బ్రహ్మన్ భుజ్యమానమిదం మయా,
క్షయం నాభ్యేతి బ్రహ్మర్షే తృప్తిశ్చాపి మమోత్తమా. 21

ప్ర. అ. బ్రహ్మన్ = బ్రాహ్మణుడా ! బ్రహ్మర్షే = బ్రహ్మర్షీ ! మయా = నాచేత, బహూన్ = అనేకమైన, వర్షగణాన్ = సంవత్సరసమూహములను, భుజ్యమానమ్ = తినబడుచున్న, ఇదమ్ = ఇది, క్షయమ్ = క్షయమును, నాభ్యేతి = పొందుటలేదు-మమ = నాయొక్క, తృప్తిః చ అపి = తృప్తి కూడ, ఉత్తమా = ఉత్తమమైనది.

తా. బ్రాహ్మణా ! బ్రహ్మర్షి ! నేను అనేకసంవత్సరముల పాటు తిన్ననూ ఇది తరుగుటలేదు. నాకు చాల గొప్ప తృప్తి కూడ కలుగుచున్నది. 21

మూ. తస్య మే కృచ్ఛ్రభూతస్య కృచ్ఛ్రాదస్మాద్విమోక్షయ,
అన్యేషాం న గతిర్హ్యత్ర కుమ్భయోనిమృతే ద్విజమ్. 22

ప్ర. అ. కృచ్ఛ్రభూతస్య = క్లేశమయుడనైన, తస్య మే = అట్టి నాకు, అస్మాత్ = ఈ, కృచ్ఛ్రాత్ = కష్టమునుండి, విమోక్షయ = విడిపించుము. ద్విజమ్ = బ్రాహ్మణుడైన, కుమ్భయోనిమ్ ఋతే = అగస్త్యుణ్ణి మినహాయించి, అన్యేషామ్ = ఇతరులకు, అత్ర = ఈవిషయమునందు, గతిః = గతి, నాస్తి హి = లేదు కదా?

తా. చాల కష్టములో ఉన్న నన్ను ఈ కష్టమునుండి విడిపింపుము. అగస్త్యునకు (నీకు) తప్ప మరెవ్వరికి ఈ పని చేయుటకు సామర్థ్యము లేదుకదా?

మూ. ఇదమాభరణం సౌమ్య ధారణార్థం ద్విజోత్తమ,
ప్రతిగృహ్ణీష్వ భద్రం తే ప్రసాదం కర్తుమర్హసి. 23

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడవైన, ద్విజోత్తమ = బ్రాహ్మణశ్రేష్ఠుడా! ఇదమ్ = ఈ, ఆభరణమ్ = ఆభరణమును, ధారణార్థమ్ = ధరించుటకై, ప్రతిగృహ్ణీష్వ = తీసికొనుము. తే = నీకు, భద్రమ్ = క్షేమమగుగాక. ప్రసాదమ్ = అనుగ్రహమును, కర్తుమ్ = చేయుటకు, అర్హసి = తగి ఉన్నావు.

తా. సౌమ్యుడవైన బ్రాహ్మణోత్తమా! ఈ ఆభరణమును ధరించుటకొరకై స్వీకరించుము, నీకు క్షేమ మగుగాక. అనుగ్రహించుము. 23

మూ. ఇదం తావత్సువర్ణం చ ధనం వాసాంసి చ ద్విజ,
భక్ష్యం భోజ్యం చ బ్రహ్మర్షే దదామ్యాభరణాని చ. 24

ప్ర అ. బ్రహ్మర్షే! బ్రహ్మర్షి! ద్విజ = బ్రాహ్మణుడా! ఇదమ్ = ఈ, సువర్ణం చ = బంగారమును, ధనమ్ = ధనమును, వాసాంసి = వస్త్రములను, భక్ష్యమ్ = భక్ష్యమును, భోజ్యం చ = భోజ్యమును, ఆభరణాని చ = ఆభరణములను, దదామి తావత్ = ఇచ్చుచున్నాను.

తా. ఓ! బ్రహ్మర్షి! ఈ బంగారమును, ధనమును, వస్త్రములను, భక్ష్య భోజ్యములను, ఆభరణములను ఇచ్చుచున్నాను. 24

మూ. సర్వాన్ కామాన్ ప్రయచ్ఛామి భోగాంశ్చ మునిపుంగవ,
తారణే భగవన్ మహ్యం ప్రసాదం కర్తుమర్హసి. 25

ప్ర. అ. మునిపుంగవ=మునిశ్రేష్ఠుడా! సర్వాన్=సమస్తమైన, కామాన్= కామములను, భోగాన్ చ = భోగములను, ప్రయచ్ఛామి = ఇచ్చుచున్నాను. భగవన్ = పూజ్యుడా! తారణే = తరింపచేయుటయందు, మహ్యమ్ = నాకొరకు, ప్రసాదమ్ = అనుగ్రహమును, కర్తుమ్ = చేయుటకు, అర్హసి = తగియున్నావు.

తా. పూజ్యుడవైన మహామునీ! అన్ని కామములను, భోగములను ఇచ్చెదను. నన్ను తరింపచేయుటకు అనుగ్రహించుము. 25

మూ. తస్యాహం స్వర్గిణో వాక్యం శ్రుత్వా దుఃఖసమన్వితమ్,
తారణాయోపజగ్రాహ తదాభరణముత్తమమ్. 26

ప్ర. అ. అహమ్ = నేను, తస్య స్వర్గిణః=ఆ స్వర్గనివాసియొక్క, దుఃఖ సమన్వితమ్ = దుఃఖముతో కూడిన, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, ఉత్తమమ్ = ఉత్తమమైన, తత్ = ఆ, ఆభరణమ్=ఆభరణమును, తారణాయ= తరింపచేయుటకు, ఉపజగ్రాహ=పరిగ్రహించితిని.

తా. నేను దుఃఖముతో నిండిన ఆ స్వర్గవాసి మాటలు విని ఆతనిని తరింపచేయుటకై ఉత్తమమైన ఆ ఆభరణమును తీసికొంటిని. 26

మూ. మయా ప్రతిగృహీతే తు తస్మిన్నాభరణే శుభే,
మానుషః పూర్వకో దేహో రాజర్షేర్విననాశ హ. 27

ప్ర అ. మయా = నాచేత, శుభే = సుందరమైన, తస్మిన్ ఆభరణే = ఆ

ఆభరణము, ప్రతిగృహీతే = ప్రతిగ్రహించబడగా, రాజర్షేః = రాజర్షియొక్క, పూర్వః = వెనుకటి, మానుషః దేహః = మనుష్యదేహము, విననాశ హ = నశించెను.

తా. నేను సుందరమైన ఆ ఆభరణమును ప్రతిగ్రహించగానే ఆ రాజర్షికి సంబంధించిన వెనుకటి మనుష్యదేహము నశించెను. 27

మూ. ప్రనష్టే తు శరీరేఽసౌ రాజర్షిః పరయా ముదా,
తృప్తః ప్రముదితో రాజా జగామ త్రిదివం సుఖమ్. 28

ప్ర. అ. శరీరే = శరీరము, ప్రనష్టే తు = నష్టము కాగా, అసౌ రాజర్షిః = ఆ రాజర్షి, పరయా = గొప్ప, ముదా = సంతోషముతో, తృప్తః = తృప్తి చెందినాడు. ప్రముదితః = సంతోషించిన, రాజా = రాజు, సుఖమ్ = సుఖముగా, త్రిదివమ్ = స్వర్గమును గూర్చి, జగామ = వెళ్లెను.

తా. ఆశరీరము అదృశ్యము కాగానే ఆ రాజర్షి చాల సంతోషించి సుఖముగా స్వర్గమునకు వెళ్లెను. 28

మూ. తేనేదం శక్రతుల్యేన దివ్యమాభరణం మమ,
తస్మిన్నిమిత్తే కాకుత్స్థ దత్తమద్భుతదర్శనమ్. 29

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
అష్టసప్తతితమః సర్గః.

ప్ర. అ. కాకుత్స్థ = రామా! శక్రతుల్యేన = ఇంద్రునితో సమానుడైన, తేన = ఆ రాజర్షిచేత, తస్మిన్ = ఆ, నిమిత్తే = కారణమునందు, అద్భుత దర్శనమ్ = ఆశ్చర్యకరమైన దర్శనము గల, దివ్యమ్ = దివ్యమైన, ఆభరణమ్ = ఆభరణము, మమ = నాకు, దత్తమ్ = ఇవ్వబడినది.

తా. రామా! ఇంద్రునితో సమానుడైన ఆ రాజర్షి ఆ కారణమును పురస్కరించుకొని చూచుటకు చాల ఆశ్చర్యకరమైన ఈ దివ్యమైన ఆభరణమును నాకు ఇచ్చినాడు. 29

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో డెబ్భైఎనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనాశీతితమః సర్గః

[ఇక్ష్వాకుపుత్రుడైన దండుని రాజ్యము.]

మూ. తదద్భుతతమం వాక్యం శ్రుత్వాగస్త్యస్య రాఘవః,
గౌరవాద్విస్మయాచ్చైవ భూయః ప్రష్టుం ప్రచక్రమే. 1

ప్ర. అ. రాఘవః = రాముడు, అగస్త్యస్య = అగస్త్యునియొక్క, అద్భుతతమమ్ = చాల అద్భుతమైన, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, గౌరవాత్ = గౌరవమువలన, విస్మయాత్ చ ఏవ = ఆశ్చర్యమువలనా, భూయః = మరల, ప్రష్టుమ్ = అడుగుటకు, ప్రచక్రమే = ప్రారంభించెను.

తా. రాముడు అగస్త్యుడు చెప్పిన ఆశ్చర్యకరములైన ఆ మాటలు విని గౌరవమువలనా, ఆశ్చర్యమువలనా మరల ఇట్లు ప్రశ్నించెను. 1

మూ. భగవంస్తద్వనం ఘోరం తపస్తప్యతి యత్రతః సః,
శ్వేతో వైదర్భకో రాజా కథం తదమృగద్విజమ్. 2

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా! సః = ఆ, వైదర్భకః = విదర్భదేశమునకు సంబంధించిన, రాజా = రాజైన, శ్వేతః = శ్వేతుడు, యత్ర = ఎక్కడ, తపః = తపస్సును, తప్యతి = చేయుచున్నాడో, తత్ = ఆ, ఘోరం వనమ్ = ఘోరమైన వనము, కథమ్ = ఎట్లు, అమృగద్విజమ్ = మృగములూ పక్షులూ లేనిదిగా అయినది?

తా. పూజ్యుడా! విదర్భరాజైన ఆ శ్వేతుడు తపస్సు చేసిన ఘోరమైన ఆ వనము ఎందుచేత మృగపక్షిశూన్య మైనది? 2

మూ. తద్వనం స కథం రాజా శూన్యం మనుజవర్జితమ్,
తపశ్చర్తుం ప్రవిష్టః స శ్రోతుమిచ్ఛామి తత్త్వతః. 3

ప్ర. అ. సః = ప్రసిద్ధుడైన, సః రాజా = ఆ రాజు, శూన్యమ్ = శూన్యము, మనుజవర్జితమ్ = మనుష్యశూన్యమూ అయిన, తత్ వనమ్ = ఆ వనమును, తపః = తపస్సును, చర్తుమ్ = చరించుటకు, కథమ్ = ఎట్లు, ప్రవిష్టః = ప్రవేశించినాడు? తత్త్వతః = యథార్థముగా, శ్రోతుమ్ = వినుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. ఆ రాజు జనులు లేని శూన్యమైన ఆ వనములో తపస్సు చేయుటకు ఎందుకు వెళ్ళినాడు? ఇందలి సత్యమును తెలుసుకొనగోరుచున్నాను. 3

మూ. రామస్య వచనం శ్రుత్వా కౌతూహలసమన్వితమ్,
వాక్యం పరమతేజస్వీ వక్తుమేవోపచక్రమే. 4

ప్ర. అ. పరమతేజస్వీ = గొప్ప తేజస్సు గల అగస్త్యుడు, రామస్య = రామునియొక్క, కౌతూహలసమన్వితమ్ = వేడుకతో కూడిన, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, వాక్యమ్ = వాక్యమును, వక్తుమ్ = చెప్పుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. గొప్ప తేజస్సు గల అగస్త్యుడు విన వేడుకతో కూడిన రాముని మాటలు విని ఇట్లు చెప్పెను. 4

మూ. పురా కృతయుగే రామ మనుర్దణ్డధరః ప్రభుః,
తస్య పుత్రో మహానాసీదిక్ష్వాకుః కులనన్దనః. 5

ప్ర అ రామ = రామా! పురా = పూర్వము, కృతయుగే = కృతయుగమునందు, ప్రభుః = ప్రభువైన, మనుః = మనువు, దణ్డధరః = దండమును ధరించినవాడు (పాలకుడు). తస్య = ఆతనియొక్క, కులనన్దనః = కులమునకు ఆనందమును కలిగించు, మహాన్ = గొప్పవాడైన, ఇక్ష్వాకుః = ఇక్ష్వాకువు అను, పుత్రః = పుత్రుడు, ఆసీత్ = ఉండెను.

తా. రామా! పూర్వము కృతయుగమునందు ప్రభువైన మనువు పాలకుడుగా ఉండెను. వంశమునకు ఆనందకరుడైన ఇక్ష్వాకువు ఆతని పుత్రుడు. 5

మూ. తం పుత్రం పూర్వకం రాజ్యే నిక్షిప్య భువి దుర్లభమ్,
పృథివ్యాం రాజవంశానాం భవ కర్తేత్యువాచ తమ్. 6

ప్ర. అ. భువి = భూమియందు, దుర్జయమ్ = జయింపశక్యముకాని, పూర్వకమ్ = పెద్దవాడైన, తం పుత్రమ్ = ఆ పుత్రుణ్ణి, రాజ్యే = రాజ్యమునందు, నిక్షిప్య = ఉంచి, పృథివ్యామ్ = భూమియందు, రాజవంశానామ్ = రాజవంశములకు, కర్తా = కర్తవు, భవ = అగుము, ఇతి = అని, తమ్ = వానిని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. భూలోకములో ఎవరిచేతను జయింప శక్యము కాని జ్యేష్ఠకుమారుడైన ఆ ఇక్ష్వాకువును రాజ్యాభిషిక్తుని చేసి మనువు "నీవు భూమియందు రాజవంశములను స్థాపించుము"అని ఆతనితో చెప్పెను. 6

మూ. తథైవ చ ప్రతిజ్ఞాతం పితుః పుత్రేణ రాఘవ,
తతః పరమసంతుష్టో మనుః పుత్రమువాచ హ. 7

ప్ర. అ. రాఘవ = రామా! పుత్రేణ = పుత్రునిచేత, పితుః = తండ్రికి, తథైవ = అట్లే, ప్రతిజ్ఞాతమ్ = ప్రతిజ్ఞ చేయబడినది. తతః = ఆటుపిమ్మట, పరమ సంతుష్టః = మిక్కిలి సంతోషించిన, మనుః = మనువు, పుత్రమ్ = పుత్రుని గూర్చి, ఉవాచ హ = పలికెను.

తా. రామా! పుత్రుడు అట్లే అని తండ్రికి మాట ఇచ్చెను. పిమ్మట చాల సంతోషించిన మనువు పుత్రునితో ఇట్లు వలికెను. 7

మూ. ప్రీతోఽస్మి పరమోదార కర్తా చాసి న సంశయః,
దణ్డేన చ ప్రజా రక్ష మా చ దణ్డమకారణే. 8

ప్ర. అ. పరమోదార = మిక్కిలి ఔదార్యవంతుడా! ప్రీతః అస్మి = సంతోషించితిని. కర్తా చ = చేయువాడవు, అసి = అయిఉన్నావు, సంశయః = సంశయము, న = లేదు. దణ్డేన = దండము (శిక్షించుట) చేత, ప్రజాః = ప్రజలను, రక్ష = రక్షించుము. అకారణే = కారణము లేకుండగా, దణ్డమ్ = దండమును, మా చ = ఉపయోగించవద్దు.

తా. అత్యున్నతస్వభావము కలవాడా! సంతోషించినాను. నీవు తప్పక చేయగలవు. దండముచేత ప్రజలను రక్షించుము. కారణము లేకుండా దండ ప్రయోగము చేయకుము. 8

మూ. అపరాధిషు యో దణ్డః పాత్యతే మానవేషు వై,
స దణ్డో విధివన్ముక్తః స్వర్గం నయతి పార్థివమ్. 9

ప్ర. అ. యః = ఏ, దణ్డః = దండము, అపరాధిషు = అపరాధము గల, మానవేషు = మానవులయందు, పాత్యతే వై = పడవేయబడునో, విధివత్ = యథాశాస్త్రముగా, ముక్తః = విడువబడిన, సః దణ్డః = ఆదండము, పార్థివమ్ = రాజును, స్వర్గమ్ = స్వర్గమును, నయతి = పొందించును.

తా. అపరాధుల విషయమున యథాశాస్త్రముగా విధించిన దండము రాజును స్వర్గమునకు తీసికొని వెళ్లును. 9

మూ. తస్మాద్దణ్డే మహాబాహో యత్నవాన్ భవ పుత్రక,
ధర్మో హి పరమో లోకే కుర్వతస్తే భవిష్యతి. 10

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా! పుత్రక = కుమారా! తస్మాత్ = ఆ కారణము వలన, దణ్డే = దండమునందు, యత్నవాన్ = ప్రయత్నము కలవాడవు, భవ = అగుము. కుర్వతః = ఇట్లు చేయుచున్న, తే = నీకు, లోకే = లోకమునందు, పరమః = గొప్ప, ధర్మః = ధర్మము, భవిష్యతి = కాగలదు.

తా. మహాబాహువైన పుత్రా! అందుచేత నీవు దండప్రయోగము విషయమున యత్నశీలుడవై ఉండవలెను. ఇట్లు చేయుచున్నచో నీకు ఈ లోకమునందు ధర్మవృద్ధి కలుగును. 10

మూ. ఇతి తం బహు సందిశ్య మనుః పుత్రం సమాధినా,
జగామ త్రిదివం హృష్టో బ్రహ్మలోకం సనాతనమ్. 11

ప్ర. అ. మనుః = మనువు, తం పుత్రమ్ = ఆ పుత్రుణ్ణి, ఇతి = ఇట్లు, బహు = ఎక్కువగా, సందిశ్య = ఉపదేశించి, హృష్టః = సంతోషించినవాడై, సమాధినా = యోగమార్గముచేత, సనాతనమ్ = నిత్యమైన, త్రిదివమ్ = స్వర్గమైన, బ్రహ్మలోకమ్ = బ్రహ్మలోకమును గూర్చి, జగామ = వెళ్లెను.

తా. మనువు కుమారునకు ఈ విధముగా చాలా ఉపదేశించి, యోగమార్గ

మును అవలంబించి నిత్యమైన స్వర్గలోకములో భాగమైన బ్రహ్మలోకమునకు వెళ్లెను. 11

మూ. ప్రయాతే త్రిదివం తస్మిన్నిక్ష్వాకురమితప్రభః,
జనయిష్యే కథం పుత్రానితి చింతాపరోఽభవత్. 12

ప్ర. అ. తస్మిన్ = మనువు, త్రిదివమ్ = స్వర్గమును గూర్చి, ప్రయాతే = వెళ్ళినవాడగుచుండగా, అమితప్రభః = గొప్ప కాంతి గల, ఇక్ష్వాకుః = ఇక్ష్వాకువు, పుత్రాన్ = పుత్రులను, కథమ్ = ఎట్లు, జనయిష్యే = పుట్టించెదను, ఇతి = అని, చింతాపరః = చింతలో నిమగ్నుడు, అభవత్ = ఆయెను.

తా. మనువు బ్రహ్మలోకమునకు వెళ్ళిపోయిన పిమ్మట ఇక్ష్వాకువు పుత్రులను ఎట్లు పుట్టించవలెనా అను ఆలోచనలో పడెను. 12

మూ. కర్మభిర్బహురూపైశ్చ తైస్తైర్మనుసుతస్తదా,
జనయామాస ధర్మాత్మా శతం దేవసుతోపమాన్. 13

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, మనుసుతః = ఇక్ష్వాకువు, తదా = అప్పుడు, తైః తైః = ఆ యా, కర్మభిః = కర్మలచేత, దేవసుతోపమాన్ = దేవసుతులతో సమానులైన, శతమ్ = నూరుగురిని, జనయామాస = పుట్టించెను.

తా. ధర్మాత్ముడైన ఇక్ష్వాకువు అనేక విధములైన ఆ యా కర్మలు చేసి దేవపుత్రులవంటి నూరుగురు పుత్రులను కనెను. 13

మూ. తేషామవరజస్తాత సర్వేషాం రఘునన్దన,
మూఢశ్చాకృతవిద్యశ్చ నభ్రూషతి హ్యపూజ్యాన్. 14

ప్ర. అ. తాత = తండ్రీ! రఘునన్దన = రామా! తేషామ్ = ఆ, సర్వేషామ్ = అందరిలో, అవరజః = చివర పుట్టినవాడు, మూఢః చ = మూఢుడు, అకృతవిద్యః చ = విద్యాభ్యాసము చేయనివాడు, పూజ్యాన్ = అన్నలను, న చ భ్రూషతి = భ్రూషచేయడు.

తా. నాయనా రామా! వాళ్ళందరిలోనూ చిన్నవాడు. విద్యాభ్యాసము లేక మూఢుడై (అన్నలను లేదా పెద్దలను) గౌరవించేవాడు కాదు. 14

మూ. నామ తస్య చ దణ్డేతి పితా చక్రేఽల్పతేజసః,
అవశ్యం దణ్డపతనం శరీరేఽస్య భవిష్యతి. 15

ప్ర. అ. అస్య = వీనియొక్క, శరీరే = శరీరమునందు, అవశ్యమ్ = తప్పక, దణ్డపతనమ్ = దండముయొక్క పతనము (శిక్ష), భవిష్యతి = కాగలదు (అని తెలిసికొని), పితా = తండ్రి, అల్పతేజసః = అల్పమైన తేజస్సు గల, తస్య = వానికి, దణ్డేతి = దండుడు అని, నామ = పేరు, చక్రే = చేసెను.

తా. "వీని శరీరమునందు తప్పక దండము పడగలదు" అని తెలిసికొన్న తండ్రి అల్పమైన తేజస్సు గల ఆతనికి దండుడు అని పేరు పెట్టెను. 15

మూ. అపశ్యమానస్తం దేశం ఘోరం పుత్రస్య రాఘవ,
విన్ధ్యశైవలయోర్మధ్యే రాజ్యం ప్రాదాదరిందమః. 16

ప్ర. అ. అరిందమ = శత్రుసంహారకుడా! రామా = రామా, పుత్రస్య = పుత్రునకు, ఘోరమ్ = ఘోరమైన, తం దేశమ్ = అట్టి దేశమును, అపశ్యమానః = చూడనివాడై, విన్ధ్యశైవలయోః = వింధ్యశైవలపర్వతములయొక్క, మధ్యే = మధ్యయందు, రాజ్యమ్ = రాజ్యమును, ప్రాదాత్ = ఇచ్చెను.

తా. శత్రుసంహారకుడవైన రామా! తండ్రి ఈ దండునకు తగిన భయంకరమైన దేశ మేదీ కనబడకపోవుటచేత ఆతనికి వింధ్యశైవలపర్వతముల మధ్యయందు రాజ్య మిచ్చెను. 16

మూ. స దణ్డస్తస్య రాజాభూద్రమ్యే పర్వతరోధసి,
పురం చాప్రతిమం రామ న్యవేశయదనుత్తమమ్. 17

ప్ర. అ. రామ = రామా! సః = ఆ, దణ్డః = దండుడు, రమ్యే = సుందరమైన, పర్వతరోధసి = పర్వతప్రాంతమునందు, తస్య = ఆ దేశమునకు, రాజా = రాజు, అభూత్ = ఆయెను. అప్రతిమమ్ = సాటిలేని, అనుత్తమమ్ = చాలా ఉత్తమమైన, పురం చ = పురమును కూడ, న్యవేశయత్ = నెలకొల్పెను.

తా. రామా! ఆ దండుడు పర్వతప్రాంతమునందున్న ఆ దేశమునకు రాజై ఆక్కడ సాటిలేని ఒక ఉత్తమమైన పురమును కూడ నెలకొల్పెను. 17

మూ. పురస్య చాకరోన్నామ మధుమన్తమితి ప్రభో,
పురోహితం తూశనసం వరయామాస సుప్రతమ్. 18

ప్ర. అ. ప్రభో = ప్రభూ! పురస్య = పురమునకు, మధుమన్తమ్ ఇతి = మధుమంతము అని, నామ = పేరు, చక్రే = చేసేను. సుప్రతమ్ = మంచి నియమములు గల, ఉశనసమ్ = శుక్రుణ్ణి, పురోహితమ్ = పురోహితునిగా, వరయామాస = వరించెను.

తా. ప్రభూ! ఆ పురమునకు మధుమంత మను పేరు పెట్టెను. మంచి నియమములు గల శుక్రాచార్యుణ్ణి పురోహితునిగా చేసికొనెను 18

మూ. ఏవం స రాజా తద్రాజ్యమకరోత్సపురోహితః,
ప్రహృష్టమనుజాకీర్ణం దేవరాజో యథా దివి. 19

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, సపురోహితః = పురోహితునితో కూడిన, సః రాజా = ఆ రాజు, ప్రహృష్టమనుజాకీర్ణమ్ = సంతోషించిన మనుష్యులతో నిండిన, తత్ = ఆ, రాజ్యమ్ = రాజ్యమును, దివి = స్వర్గమునందు, దేవరాజః యథా = దేవేంద్రుడు వలె, అకరోత్ = చేసెను.

తా. ఈ విధముగ పురోహితునితో కూడి అతడు సంతోషించిన జనులతో నిండిన ఆ రాజ్యమును స్వర్గమునందు దేవేంద్రుడు వలె పాలించెను. 19

మూ. తతః న రాజా మనుజేన్ద్రిపుత్రః
సార్ధం చ తేనోశనసా తదానీమ్,
చకార రాజ్యం సుమహన్మహాత్మా
శక్రో దివీవోశనసా సమేతః. 20

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకోనాశీతితమః సర్గః.

ప్ర. అ. "శక్రోదివీవాఙ్గిరసా సమేతః" అను ప్రాచ్యపాఠము యుక్తము. తతః = అటుపిమ్మట, మనుజేన్ద్రిపుత్రః = ఇక్ష్వాకుపుత్రుడైన, సః రాజా = ఆ రాజు, తదానీమ్ = అప్పుడు, తేన ఉశనసా సార్ధమ్ = ఆ శుక్రాచార్యునితో కూడ.

దివి = స్వర్గమునందు, అఙ్గిరసా = బృహస్పతితో, సమేతః = కూడిన, శక్రః ఇవ = ఇంద్రుడు వలె, సుమహత్ = చాలా గొప్పదైన, రాజ్యమ్ = రాజ్యమును, చకార = చేసెను.

తా. అప్పుడు శుక్రాచార్యునితో కూడిన మహాత్ముడైన, ఇక్ష్వాకుపుత్రుడైన ఆ రాజు స్వర్గమునందు బృహస్పతితో కూడిన ఇంద్రుడు వలె రాజ్యమును చేసెను. 20

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో డెబ్భైతొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ అశీతితమః సర్గః

[దండుడు శుక్రాచార్యుని పుత్రిని బలాత్కరించుట].

మూ. ఏతదాఖ్యాయ రామాయ మహర్షిః కుమ్భసంభవః,
అస్యామేవాపరం వాక్యం కథాయాముపచక్రమే. 1

ప్ర. అ. మహర్షిః=మహర్షియైన, కుమ్భసంభవః=అగస్త్యుడు, రామాయ =రామునికొరకు, ఏతత్ = దీనిని, ఆఖ్యాయ = చెప్పి, అస్యామ్ = ఈ, కథా యామ్ ఏవ = కథయందే, అపరమ్ = మరియొక, వాక్యమ్ = వాక్యమును, ఉప చక్రమే = ప్రారంభించెను.

తా. అగస్త్యమహర్షి రామున కిట్లు చెప్పి ఈ కథయందే మరొక వాక్యము చెప్పుటకు ప్రారంభించెను. 1

మూ. తతః స దణ్డః కాకుత్స్థ బహువర్షగణాయుతమ్,
అకరోత్తత్ర దాన్తాత్మా రాజ్యం నిహతకణ్టకమ్. 2

ప్ర. అ. కాకుత్స్థ=రామా! తతః=అటుపిమ్మట, సః దణ్డః=ఆదండుడు, దాన్తాత్మా = నిగ్రహించుకొనబడిన మనస్సు కలవాడై, తత్ర=అక్కడ, బహువర్ష గణాయుతమ్=అనేక అయుతముల సంవత్సరముల సముదాయమును, నిహతకణ్ట కమ్ = నశింపచేయబడిన శత్రువులు గల, రాజ్యమ్ = రాజ్యమును, అకరోత్ = చేసెను.

తా. రామా! పిమ్మట ఆ దండుడు మనోనిగ్రహవంతుడై అనేక అయుత ముల సంవత్సరములు శత్రుబాధ లేని రాజ్యమును పాలించెను. 2

మూ. అథ కాలే తు కస్మింశ్చిద్రాజా భార్గవమాశ్రమమ్,
రమణీయముపాక్రామచ్చైత్రే మాసి మనోరమే. 3

ప్ర. అ. అథ = అటుపిమ్మట, రాజ్ఞా = రాజు, కస్మింశ్చిత్ = ఒకానొక, కాలే = కాలమునందు, మనోరమే = మనోహరమైన, చైత్రే మాసి = చైత్రమాసమునందు, రమణీయమ్ = సుందరమైన, భార్గవమ్ = శుక్రాచార్యునకు సంబంధించిన, ఆశ్రమమ్ = ఆశ్రమమును గూర్చి, ఉపాక్రామత్ = వెళ్ళెను.

తా. పిమ్మట కొంత కాలమునకు ఆ రాజు మనోహరమైన చైత్రమాసములో సుందరమైన శుక్రాచార్యుని ఆశ్రమమునకు వెళ్ళెను. 3

మూ. తత్ర భార్గవకన్యాం స రూపేణాప్రతిమాం భువి,
విచరన్తీం వనోద్దేశే దణ్డోఽపశ్యదనుత్తమామ్. 4

ప్ర. అ. తత్ర = అక్కడ, సః = ఆ, దణ్డః = దండుడు, వనోద్దేశే = వనప్రాంతమునందు, విచరన్తీమ్ = సంచరించుచున్న, అనుత్తమామ్ = చాల ఉత్తమురాలైన, రూపేణ = రూపముచేత, భువి = భూలోకమునందు, అప్రతిమామ్ = సాటి లేని, భార్గవకన్యామ్ = శుక్రుని కన్యను, అపశ్యత్ = చూచెను.

తా. అక్కడ ఆ దండుడు వనప్రాంతమునందు సంచరించుచున్న శుక్రాచార్యుని పుత్రికను చూచెను. అత్యుత్తమురాలైన ఆమె భూలోకములో సాటి లేని సౌందర్యముతో ప్రకాశించుచుండెను. 4

మూ. స దృష్ట్వా తాం సుదుర్మేధా అనఙ్గశరపీడితః,
అభిగమ్య సుసంవిగ్నాం కన్యాం వచనమబ్రవీత్. 5

ప్ర. అ. సుదుర్మేధాః = చాల చెడ్డ బుద్ధి గల, సః = అతడు, తామ్ = ఆ, కన్యామ్ = కన్యను, దృష్ట్వా = చూచి, అనఙ్గశరపీడితః = మన్మథబాణములచేత పీడింపబడినవాడై, అభిగమ్య = సమీపించి, సుసంవిగ్నామ్ = చాల దిగులు చెందిన, కన్యామ్ = ఆ కన్యను గూర్చి, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. దుర్బుద్ధి గల అతడు ఆమెను చూచి, మన్మథశరములచేత పీడితుడై, చాల భయపడిన ఆమెను సమీపించి ఇట్లు పలికెను. 5

మూ. కుతస్త్వమసి సుశ్రోణి కస్య వాసి సుతా శుభే,
పీడితోఽహమనఙ్గేన పృచ్ఛామి త్వాం శుభాననే. 6

ప్ర. అ. సుశ్రోణి = మంచి కటిప్రదేశము కలదానా! త్వమ్=నీవు, కుతః = ఎచటినుండి, అసి = అయి ఉన్నావు? శుభే = మంగళప్రదురాలా! కస్య వా= ఎవనియొక్క, సుతా = కుమార్తెవు, అసి = అయిఉన్నావు? శుభాననే = శుభమైన ముఖము గలదానా! అహమ్ = నేను, అనఙ్గేన = మన్మథునిచేత, పీడితః=పీడించ బడినవాడనై, త్వామ్ = నిన్ను, పృచ్ఛామి = అడుగుచున్నాను.

తా. అందమైన కటిప్రదేశము గల మంగళప్రదురాలా! నీవు ఎక్కడి నుండి వచ్చినావు? నీవు ఎవరి కుమార్తెవు? సుందరమైన ముఖము గలదానా! నేను మన్మథునిచే పీడింపబడి అడుగుచున్నాను. 6

మూ. తస్య త్వేవం బ్రువాణస్య మోహోన్మత్త స్య కామినః,
భార్గవీ ప్రత్యువాచేదం వచః సానునయం నృపమ్. 7

ప్ర. అ. మోహోన్మత్త స్య = మోహముచేత ఉన్మత్తుడైన, కామినః = కాముకుడైన, తస్య = అతడు, ఏవమ్ = ఇట్లు, బ్రువాణస్య = పలుకుచుండగా, భార్గవీ = శుక్రాచార్యుని కూతురు, సానునయమ్ = అనునయముతో కూడినట్లుగా, నృపమ్ = రాజును గూర్చి, ఇదం వచః = ఈ వచనమును, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. మోహముచే మత్తుడైన ఆ కాముకుడు ఇట్లు మాటలాడుచుండగా శుక్రాచార్యుని కూతురు బ్రతిమాలుచు ఆతనితో ఇట్లు పలికెను. 7

మూ. భార్గవస్య సుతాం విద్ధి దేవస్యాక్లిష్టకర్మణః,
అరజాం నామ రాజేన్ద్ర జ్యేష్ఠామాశ్రమవాసినీమ్. 8

ప్ర. అ. రాజేన్ద్ర = రాజేంద్రా! ఆశ్రమవాసినీమ్ = ఆశ్రమములో నివసించుచున్న నన్ను, అక్లిష్టకర్మణః = క్లేశములేని కర్మలు గల, దేవస్య=ప్రకాశించుచున్న, భార్గవస్య = శుక్రాచార్యునియొక్క, అరజాం నామ = అరజ అను పేరు గల, జ్యేష్ఠాం సుతమ్ = పెద్ద కుమార్తెనుగా, విద్ధి = తెలుసుకొనుము.

తా. మహారాజా! నేను పుణ్యకర్మలు ఆచరించు ప్రకాశవంతుడైన శుక్రాచార్యుని పెద్ద కుమార్తెను. నా పేరు అరజ. నేను ఆశ్రమములో నివసింతును. 8

మూ. మా మాం స్పృశ బలాద్రాజన్ కన్యా పితృవశా హ్యహమ్,
గురుః పితా మే రాజేన్ద్ర త్వం చ శిష్యో మహాత్మనః, 9
వ్యసనం సుమహత్ క్రుద్ధః స తే దద్యాన్మహాతపాః.

ప్ర. అ. రాజన్ = రాజా! మామ్ = నన్ను, బలాత్ = బలాత్కారముగ, మా స్పృశ = స్పృశించకుము. అహమ్ = నేను, పితృవశా హి = తండ్రికి వశురాలను గదా! మే పితా = నా తండ్రి, గురుః = నీ గురువు. రాజేన్ద్ర = మహారాజా! త్వం చ = నీవు, మహాత్మనః = ఆ మహాత్మునియొక్క, శిష్యః = శిష్యుడవు. మహాతపాః = గొప్ప, తపస్సు గల, సః = అతడు, క్రుద్ధః = కోపించినవాడై, తే = నీకు, సుమహత్ = చాల గొప్ప, వ్యసనమ్ = దుఃఖమును, దద్యాత్ = ఇచ్చును.

తా. రాజా! నన్ను బలాత్కారముగా ముట్టుకొనకుము. నేను తండ్రివశములో ఉన్న కన్యను. మహారాజా! నా తండ్రి నీ గురువు. నీవు ఆ మహాత్ముని శిష్యుడవు. మహాతపఃశాలియైన ఆయన కోపించినచో నీకు గొప్ప ఆపద కలిగించును. 9

మూ. యది వాన్యన్మయా కార్యం ధర్మదృష్టేన సత్పథా, 10
వరయస్వ నరశ్రేష్ఠ పితరం మే మహాద్యుతిమ్.

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడా! మయా = నాచేత, అన్యత్ = మరియొక్క, కార్యమ్ = కార్యము, యది వా = ఉన్నట్లయితే, ధర్మదృష్టేన = ధర్మముచేత చూడబడిన, సత్పథా = సన్మార్గముచేత, మే = నాయొక్క, మహాద్యుతిమ్ = గొప్ప కాంతి గల, పితరమ్ = తండ్రిని, వరయస్వ = కోరుము.

తా. నావలన నీకేమైన ప్రయోజన మున్నచో, ఓ నరశ్రేష్ఠా! ధర్మసంమతమైన మార్గమును అనుసరించి గొప్ప తేజస్సు గల మా తండ్రిని కోరుము. 10

మూ. అన్యథా తు ఫలం తుభ్యం భవేద్ఘోరాభిసంహితమ్, 11
క్రోధేన హి పితా మేఽసౌ త్రైలోక్యమపి నిర్దహేత్,
దాస్యతే చానవద్యాఙ్గ తవ మా యాచితః పితా. 12

ప్ర. అ. అన్యథా = అట్లు కానిచో, తుభ్యమ్ = నీకు, ఘోరాభిసంహితమ్

= భయంకరమైన స్వభావముగల, ఫలమ్ = ఫలము, భవేత్ = అగును. క్రోధేన = కోపముచేత, అసౌ = ఈ, మే పితా = నా తండ్రి, త్రైలోక్యమపి = మూడు లోకముల సముదాయమును కూడ, నిర్దహేత్ = కాల్చివేయును. అనవద్యాఙ్గి = దోషములు లేని అవయవములు గలవాడా! యాచితః = యాచింపబడినవాడై, పితా = తండ్రి, తవ = నీకు, మా = నన్ను, దాస్యతే = ఇవ్వగలడు.

తా. అట్లు కానిచో నీకు చాల భయంకరమైన ఫలము కలుగును. నా తండ్రి క్రోధము వచ్చినచో మూడు లోకాలనూ కూడ కాల్చివేయును కదా! నిర్దుష్టములైన అవయవములు గల ఓ! రాజా! నీవు యాచించినచో నా తండ్రి నన్ను నీ కివ్వగలడు. 11, 12

మూ. ఏవం బ్రువాణామరజాం దణ్డః కామవశం గతః,
ప్రత్యువాచ మదోన్మత్తః శిరస్యాధాయ చాఞ్జలిమ్. 13

ప్ర. అ. కామశం గతః = కామమునకు వశుడైన, దణ్డః = దండుడు, మదోన్మత్తః = మదముచేత మత్తుడై, శిరసి = శిరస్సునందు, అఞ్జలిమ్ = దోసిలిని, ఆధాయ = ఉంచి, ఏవమ్ = ఇట్లు, బ్రువాణామ్ = పలుకుచున్న, అరజామ్ = అరజను గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. కామవశుడైన ఆ దండుడు మదముచేత ఉన్మత్తుడై, ఇట్లు పలుకుచున్న అరజతో, శిరస్సుపై అంజలి ఘటించి ఇట్లు పలికెను. 13

మూ. ప్రసాదం కురు సుశ్రోణి న కాలం క్షేప్తుమర్హసి,
త్వత్కృతే హి మమ ప్రాణా విదీర్యన్తే వరాననే. 14

ప్ర. అ. సుశ్రోణి = మంచి నితంబము కలదానా! ప్రసాదమ్ = అనుగ్రహమును, కురు = చేయుము. కాలమ్ = కాలమును, క్షేప్తుమ్ = గడపుటకు, న అర్హసి = తగవు. వరాననే = సుందరమైన ముఖము గలదానా! త్వత్కృతే = = నీ నిమిత్తమై, మమ = నాయొక్క, ప్రాణాః = ప్రాణములు, విదీర్యన్తే = చీల్చబడిపోవుచున్నది.

తా. అందమైన కటిప్రదేశము గలదానా! కాలము గడిపివేయకుము. ఓ సుందరముఖీ ! నీ మూలమున నా ప్రాణములు పోవుచున్నవి. 14

మూ. త్వాం ప్రాప్య మే వధో వాపి పాపం వాపి సుదారుణమ్,
భక్తం భజస్వ మాం భీరు భజమానం సువిహ్వలమ్. 15

ప్ర. అ. త్వామ్ = నిన్ను, ప్రాప్య = పొంది, మే = నాకు, వధః వా అపి = చావు గాని, సుదారుణమ్ = చాల దారుణమైన, పాపం వా అపి = పాపము గాని, వచ్చుగాక. భీరు = భయస్వభావము కలదానా, సువిహ్వలమ్ = చాలా వ్యాకులు డైన, భజమానమ్ = సేవించుచున్న, భక్తమ్ = ఈ భక్తుణ్ణి, భజస్వ = పొందుము.

తా. నిన్ను పొందిన పిమ్మట నాకు మరణము కలిగినను, భయంకరమైన పాపము వచ్చినను విచారము లేదు. ఓ! భయస్వభావముగలదానా! చాలా వ్యాకులత చెంది నిన్ను సేవించుచున్న ఈ భక్తుణ్ణి పొందుము. 15

మూ. ఏవముక్త్వా తు తాం కన్యాం దోర్భ్యాం గృహ్య బలాద్బలీ,
విస్ఫురన్తీం యథాకామం మైథునాయోపచక్రమే. 16

ప్ర. అ. బలీ = బలవంతుడైన ఆ దండుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, విస్ఫురన్తీమ్ = పెనుగులాడుచున్న, తాం కన్యామ్ = ఆ కన్యను, దోర్భ్యామ్ = బాహువులచేత, బలాత్ = బలాత్కారముగ, గృహ్య = గ్రహించి, యథాకామమ్ = కామానుసారము, మైథునాయ = మైథునముకొరకు, ఉపచక్రమే = ప్రారంభించెను.

తా. బలవంతుడైన ఆ దండుడు ఇట్లు పలికి ఆ కన్యను బాహువులతో బలాత్కారముగ పట్టుకొని, ఆమె పెనగులాడుచుండగా, యథేష్టముగా మైథునమునకు ఉపక్రమించెను. 16

మూ. తమనర్థం మహాఘోరం దణ్డః కృత్వా సుదారుణమ్,
నగరం ప్రయయావాశు మధుమన్తమనుత్తమమ్. 17

ప్ర. అ. దణ్డః = దండుడు, మహాఘోరమ్ = చాలా ఘోరమైన, సుదారుణమ్ = చాల దారుణమైన, తమ్ = ఆ, అనర్థమ్ = అకృత్యమును, కృత్వా = చేసి, ఆశు = శీఘ్రముగా, అనుత్తమమ్ = అత్యుత్తమమైన, మధుమన్తం నగరమ్ = మధుమంతనగరమును గూర్చి, ప్రయయౌ = వెళ్లెను.

తా. దండుడు చాల ఘోరము, దారుణము అయిన ఈ పాపకృత్యము చేసి వెంటనే తన నగరమైన మధుమంతమునకు వెళ్లెను. 17

మూ. అరజాపి రుదన్తీ సా ఆశ్రమస్యావిదూరతః,
ప్రతీక్షతే సుసంత్రస్తా పితరం దేవసంనిభమ్. 18

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
అశీతితమః సర్గః

ప్ర. అ. సా అరజాపి = ఆ అరజ కూడ, రుదన్తీ = ఏడ్చుచున్నదై, సుసంత్రస్తా = చాల భయపడినదై, ఆశ్రమస్య = ఆశ్రమమునకు, అవిదూరతః = సమీపమున, దేవసంనిభమ్ = దేవతాతుల్యుడైన, పితరమ్ = తండ్రిని, ప్రతీక్షతే = నిరీక్షించుచున్నది.

తా. అరజ చాలా భయపడి ఏడ్చుచు ఆశ్రమసమీపమునందు దేవతాతుల్యుడైన తండ్రికొరకై నిరీక్షించుచుండెను. 18

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో ఎనుబదవ సర్గ సమాప్తము.

అథ ఏకాశీతితమః సర్గః

[శుక్రాచార్యుని శాపముచేత దండుడు వాని రాజ్యము నశించుట].

మూ. స ముహూర్తాదుపశ్రుత్య దేవర్షిరమితప్రభః,
స్వమాశ్రమం శిష్యవృతః క్షుధార్తః సంన్యవర్తత. 1

ప్ర. అ. అమితప్రభః=అనంతమైన కాంతి గల, సః దేవర్షిః=ఆ దేవర్షి, ఉపశ్రుత్య=విని, శిష్యవృతః=శిష్యులతో కూడినవాడై, క్షుధార్తః=ఆకలిచేత పీడింపబడినవాడై, ముహూర్తాత్=ముహూర్తకాలములో, స్వమ్=తన సంబంధమైన, ఆశ్రమమ్=ఆశ్రమమును గూర్చి, సంన్యవర్తత=మరలెను.

తా. అనంతమైన తేజస్సుగల శుక్రాచార్యుడు ఈ విషయమునువిని, శిష్యసమేతుడై, ఆకలితో బాధపడుచు ముహూర్తకాలములో తన ఆశ్రమమునకు తిరిగి వచ్చెను. 1

మూ. సోఽపశ్యదరజాం దీనాం రజసా సమభిప్లుతామ్,
జ్యోత్స్నామివ గ్రహగ్రస్తాం ప్రత్యూషే నవిరాజతీమ్. 2

ప్ర. అ. సః=అతడు, దీనామ్=దీనురాలు, రజసా=పరాగముచేత, సమభిప్లుతామ్=కప్పబడినది, ప్రత్యూషే=ప్రాతఃకాలమునందు, గ్రహగ్రస్తామ్=గ్రహముచేత క్రమింగివేయబడిన, జ్యోత్స్నామివ=వెన్నెల వలె, న విరాజతీమ్=ప్రకాశించని, అరజామ్=అరజను, అపశ్యత్=చూచెను.

తా. శుక్రాచారుర్యులు దీనురాలైన అరజను చూచెను. ఆమె శరీరము పరాగముచేత కప్పబడి ఉండెను. ప్రాతఃకాలమునందు గ్రహముచేత (రాహువుచేత లేదా సూర్యునిచేత) కప్పివేయబడిన వెన్నెల వలె కాంతి విహీనురాలై ఉండెను. 2

మూ. తస్య రోషః సమభవత్ క్షుధార్తస్య విశేషతః,
నిర్దహన్నివ లోకాంస్త్రీన్ శిష్యాంశ్చైతదువాచ హ. 3

ప్ర. అ. తస్య = అతనికి, విశేషతః = విశేషించి, క్షుధార్తస్య = ఆకలి చేత పీడితుడైన అతనికి, రోషః = కోపము, సమభవత్ = కలిగెను. త్రీన్ = మూడు, లోకాన్ = లోకములను, నిర్దహన్ ఇవ = కాల్చివేయుచున్నవాడు వలె, శిష్యాన్ = శిష్యులను గూర్చి, ఏతత్ = ఈ వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. ఆ శుక్రాచార్యునకు, విశేషించి ఆకలిచేత బాధపడుచున్న వానికి, కోపము కలిగెను. అతడు మూడు లోకాలను కాల్చివేయుచున్నాడా అన్నట్లు శిష్యులతో ఇట్లనెను.

మూ. పశ్యధ్వం విపరీతస్య దణ్డస్యావిదితాత్మనః,
విపత్తిం ఘోరసంకాశాం క్రుద్ధాదగ్నిశిఖామివ. 4

ప్ర. అ. విపరీతస్య = విపరీతప్రవృత్తి గల, అవిదితాత్మనః = తెలియబడని తన శక్తి గల, లేదా మనోనిగ్రహములేని, దణ్డస్య = దండునియొక్క, ఘోరసంకాశామ్ = చాల ఘోరమైన, అగ్నిశిఖామివ = అగ్నిశిఖవంటి, విపత్తిమ్ = ఆపదను, క్రుద్ధాత్ = కోపించిన వానుండి, పశ్యధ్వమ్ = చూడండి.

తా. కోపించిన వానివలన విపరీతప్రవృత్తి గల వినయవిహీనుడైన ఈ దండునకు అగ్నిశిఖవంటి ఘోరమైన ఎట్టి ఆపద రానున్నదో చూడండి. 4

మూ. క్షయోఽస్య దుర్మతేః ప్రాప్తః సానుగస్య దురాత్మనః,
యః ప్రదీప్తామివాగ్నేయీం శిఖాం సంస్పృష్టవానిమామ్.

ప్ర. అ. సానుగస్య = అనుచరులతో కూడిన, దుర్మతేః = చెడ్డ బుద్ధి గల, అస్య దుర్మతేః = ఈ దుర్మతికి, క్షయః = వినాశము, ప్రాప్తః = ప్రాప్తించినది. యః = ఎవడు, ప్రదీప్తామ్ = మండుచున్న, ఆగ్నేయీమ్ = అగ్ని సంబంధమైన, శిఖామ్ ఇవ = జ్వాలను వలె, ఇమామ్ = ఈమెను, సంస్పృష్టవాన్ = స్పృశించినాడో.

తా. ప్రజ్వరిల్లుచున్న అగ్నిజ్వాలను స్పృశించినట్లు ఈమెను స్పృశించిన దుర్బుద్ధియైన ఈ దురాత్మునకు పరివారసహితముగా వినాశము దాపురించినది. 5

మూ. యస్మాత్స కృతవాన్ పాపమీదృశం ఘోరసంహితమ్,
తస్మాత్ ప్రాప్స్యతి దుర్మేధాః ఫలం పాపస్య కర్మణః.

ప్ర. అ. నః = అతడు, యస్మాత్ = ఏ కారణమువలన, ఈదృశమ్ = ఇట్టి, ఘోరసంహితమ్ = ఘోరమైన, పాపమ్ = పాపమును. కృతవాన్ = చేసినాడో, తస్మాత్ = ఆ కారణమువలన, దుర్మేధాః = ఈ దుష్టబుద్ధి, పాపస్య = పాపమైన, కర్మణః = కర్మయొక్క, ఫలమ్ = ఫలమును, ప్రాప్స్యతి = పొందగలడు.

తా. ఇతడు ఇట్టి ఘోరమైన పాపము చేసినాడు గాన ఈ దుర్బుద్ధి పాపకర్మకు ఫలమును పొందగలడు. 6

మూ. సప్తరాత్రేణ రాజాసౌ సపుత్రబలవాహనః,
పాపకర్మసమాచారో వధం ప్రాప్స్యతి దుర్మతిః. 7

ప్ర. అ. దుర్మతిః = దుష్టబుద్ధి గల, పాపకర్మసమాచారః = పాపకర్మ, ఆచారము గల, అసౌ రాజా = ఈ రాజు, సపుత్రబలవాహనః = పుత్ర-సైన్య-వాహనసహితుడై, సప్తరాత్రేణ = ఏడు రోజులలో, వధమ్ = వధను, ప్రాప్స్యతి = పొందగలడు.

తా. పాపకర్మ, పాపాచారము చేయు దుర్మతియైన ఈ రాజు పుత్రసైన్య వాహనములతో సహా ఏడు రోజులలో మరణించగలడు. 7

మూ. సమన్తాద్యోజనశతం విషయం చాస్య దుర్మతేః,
ధక్ష్యతే పాంసువర్షేణ మహతా పాకశాసనః. 8

ప్ర. అ. అస్య = ఈ, దుర్మతేః = దుర్మతియైన రాజుయొక్క, విషయమ్ = దేశమును, సమన్తాత్ = చుట్టూ, యోజనశతమ్ = నూరు యోజనములు, పాకశాసనః = ఇంద్రుడు, పాంసువర్షేణ = పరాగముయొక్క వర్షముచేత, ధక్ష్యతే = దహించివేయగలడు.

తా. దుర్మతియైన ఈతని దేశమును నూరు యోజనముల పరిధిలో ఇంద్రుడు గొప్ప పరాగమును కురిపించి కాల్చివేయగలడు. 8

మూ. సర్వసత్త్వాని యానీహ స్థావరాణి చరాణి చ,
మహతా పాంసువర్షేణ విలయం సర్వతోఽగమన్. 9

ప్ర. అ ఇహ = ఇక్కడ, యాని = ఏ, స్థావరాణి = స్థావరములు, చరాణి చ = జంగమములు ఆయినవి ఉన్నవో, సర్వసత్త్వాని = ఆ సమస్తప్రాణులూ కూడ, సర్వతః = అంతటా, మహతా = గొప్ప, పాంసువర్షేణ = పరాగము వర్షముచేత, విలయమ్ = వినాశమునును, అగమన్ = పొందినవి (పొందును).

తా. ఇక్కడ ఉన్న జంగమస్థావరాత్మకములైన అన్ని ప్రాణులూ కూడ అంతటా కురియు గొప్ప ధూళివర్షముచేత నశింపగలవు. 9

మూ. దణ్డస్య విషయో యావత్తావత్సర్వం సముచ్ఛయమ్,
పాంసువర్షమివాలక్ష్యం సప్తరాత్రం భవిష్యతి. 10

ప్ర. అ. దణ్డస్య = దండునియొక్క, విషయః = దేశము, యావత్ = ఎంతవరకు ఉన్నదో, తావత్ = అంతవరకు, సర్వమ్ = సమస్తమైన, సముచ్ఛయమ్ = ఉన్నతమైన ప్రాణిసముదాయము, సప్తరాత్రమ్ = ఏడురోజులు, పాంసువర్షమ్ = పరాగము వర్షమును, (ప్రాప్య = పొంది) అలక్ష్యమ్ ఇవ = కనబడనిదిగా, భవిష్యతి = కాగలదు.

తా. దండుని దేశము (సరిహద్దు) ఎంతవరకూ ఉన్నదో అంతవరకు ఎత్తుగా ఉన్న (నించి ఉన్న) ప్రాణిసముదాయము ఏడు రాత్రులు ధూళివర్షమును పొంది కనబడకుండపోవును. 10

మూ. ఇత్యుక్త్వా క్రోధతామ్రాక్షస్తమాశ్రమనివాసినమ్.
జనం జనపదాన్తేషు స్థీయతామితి చాబ్రవీత్. 11

ప్ర. అ. ఇతి = ఇట్లు, ఉక్త్వా = పలికి, క్రోధతామ్రాక్షః = క్రోధముచేత ఎఱ్ఱనైన కళ్ళు గల అతడు, ఆశ్రమనివాసినమ్ = ఆశ్రమములో నివసించుచున్న, తం జనమ్ = ఆ జనమును, జనపదాన్తేషు = దేశపు సరిహద్దులందు, స్థీయతామ్ = ఉందురు గాక, ఇతి = అని, అబ్రవీత్ చ = పలికెను కూడ.

తా. క్రోధముచేత ఎఱ్ఱనైన కళ్ళు గల అతడు ఇట్లు పలికి "మీరందరు దేశము సరిహద్దులందు నివసించుడు" అని ఆశ్రమనివాసులకు చెప్పెను. 11

మూ. శ్రుత్వా తూశనసో వాక్యం సోశ్రమావసథో జనః,
నిష్క్రాన్తో విషయాత్తస్మాత్ స్థానం చక్రేఽథ బాహ్యతః.

ప్ర. అ ఉశనసః = శుక్రునియొక్క, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, సః = ఆ, ఆశ్రమావసథః = ఆశ్రమము నివాసముగా గల, జనః = జనము, తస్మాత్ = ఆ, విషయాత్ = దేశమునుండి, నిష్క్రాన్తః = బైటకు వెళ్ళినదై, బాహ్యతః = వెలుపల, స్థానమ్ = స్థానమును, చక్రే = చేసి కొనెను.

తా. శుక్రాచార్యుని మాటలు విని ఆశ్రమములో ఉన్న జనము ఆ దేశమును విడచి వెలుపల నివసించెను. 12

మూ. స తథోక్త్వా మునిజనమరజామిదమబ్రవీత్.
ఇహైవ వస దుర్మేధే ఆశ్రమే సుసమాహితా. 13

ప్ర. అ. సః = అతడు, మునిజనమ్ = మునిజనమును గూర్చి, తథా = అట్లు, ఉక్త్వా = పలికి, అరజామ్ = అరజను గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను. దుర్మేధే = దుర్బుద్ధి గలదానా, సుసమాహితా = బాగా సావధానచిత్తురాలవై (యోగభ్యాసము చేయుచున్న దానవై), ఇహ = ఈ, ఆశ్రమే ఏవ = ఈ ఆశ్రమమునందే, వస = నివసించుము. (ఆ రాజు బలాత్కారము చేసినప్పుడు పూర్తిగా ఎదిరించకపోవుటచే దుర్మేధ అన్నాడని వ్యాఖ్యాతలు).

తా. ఆ శుక్రాచార్యుడు మునులతో ఇట్లు పలికి అరజను ఇట్లు ఆదేశించెను. "ఓ! దుర్బుద్ధి గలదానా! నీవు ఈ ఆశ్రమనందే యోగాభ్యాససక్తురాలవై నివసించుము. 13

మూ. ఇదం యోజనపర్యన్తం సరః సురుచిరప్రభమ్,
అరజే విజ్వరా భుఙ్క్ష్వ కాలశ్చాత్ర ప్రతీక్ష్యతామ్. 14

ప్ర. అ. అరజే = అరజా! యోజనపర్యన్తమ్ = యోజనమువరకు, సురుచిరమ్ = చాలమనోహరమైన, ఇదం సరః = ఈ సరస్సును విజ్వరా = మనోవ్యథ లేనిదానవై, భుఙ్క్ష్వ = అనుభవించుము. కాలః చ = కాలము కూడ, అత్ర = ఇక్కడ, ప్రతీక్ష్యతామ్ = నిరీక్షించబడుగాక.

తా. అరజా! యోజనము విశాలమైన చాలా మనోహరమైన ఈ సరస్సును మనోవ్యథ లేవీ లేనిదానవై అనుభవించుము. కాలమునకై వేచి ఉండుము. 14

మూ. త్వత్సమీపే చ యే సత్త్వా వాసమేష్యన్తి తాం నిశామ్,
అవధ్యాః పాంసువర్షేణ తే భవిష్యన్తి నిత్యదా. 15

ప్ర. అ. త్వత్సమీపే=సమీపమునందు, యే=ఏ, సత్త్వాః=మృగములు, తాం నిశామ్=ఆ రాత్రిని, వాసమ్=నివాసమును, ఏష్యన్తి=పొందగలవో, తే=అవి, నిత్యదా=నిత్యమూ, పాంసువర్షేణ=పరాగము వర్షముచేత, అవధ్యాః=చంపశక్యముకానివి, భవిష్యన్తి=కాగలవు.

తా. ఆ రాత్రి నీవద్ద ఏ ప్రాణులు నివసించునో అవి నిత్యమూ (ఏనాటికీ) ధూళివర్షముచేత చంపబడవు. 15

మూ. శ్రుత్వా నియోగం బ్రహర్షేః సారజా భార్గవీ తదా,
తథేతి పితరం ప్రాహ భార్గవం భృశదుఃఖితా. 16

ప్ర. అ. తదా=అప్పుడు, భార్గవీ=శుక్రుని కుమార్తె యైన, సా=ఆ, అరజా=అరజ, బ్రహ్మర్షేః=ఆ బ్రహ్మర్షియొక్క, నియోగమ్=ఆజ్ఞను, శ్రుత్వా=విని, భృశదుఃఖితా=చాలా దుఃఖించినదై, పితరమ్=తండ్రిని గూర్చి, తథేతి=అట్లే అని, ప్రాహ=పలికెను.

తా. అప్పుడు శుక్రాచార్యుని కుమార్తె యైన అరజ చాల దుఃఖించుచు బ్రహర్షియైన తన తండ్రి ఆజ్ఞను విని "అట్లే చేసెదను" అని ఆతనితో పలికెను.

మూ. ఇత్యుక్త్వా భార్గవో వాసమన్యత్ర సమకారయత్,
తచ్చ రాజ్యం నరేన్ద్రస్య సభృత్యబలవాహనమ్, 17
సప్తాహాద్భస్మసాద్భూతం యథోక్తం బ్రహ్మవాదినా.

ప్ర. అ. భార్గవః=శుక్రుడు, ఇతి=ఇట్లు, ఉక్త్వా=పలికి, అన్యత్ర=మరియొక చోట, వాసమ్=నివాసమును, సమకారయత్=చేయించెను. నరేన్ద్రస్య=రాజుయొక్క, సభృత్యబలవాహనమ్=భృత్యులతోను, సైన్యముతోను, వాహనములతోను కూడిన, తత్=ఆ, రాజ్యం చ=రాజ్యము, బ్రహ్మవాదినా=బ్రహ్మవాదియైన శుక్రునిచేత, యథా=ఎట్లు, ఉక్తమ్=చెప్పబడినదో అట్లు, సప్తాహాత్=ఏడురోజులలో, భస్మసాత్=భస్ముగా, భూతమ్=అయినది.

తా. శుక్రాచార్యులు ఇట్లు పలికి మరొక చోట నివాస మేర్పరచుకొనెను. ఆ రాజు రాజ్యము కూడ ఆతని భృత్య-సైన్య-వాహనములతో సహా శుక్రాచార్యులు చెప్పిన విధమున ఏడు రోజులలో భస్మమైపోయెను. 17

మూ. తస్యాసౌ దణ్డవిషయో విన్ధ్యశైవలయోర్నృప, 18
శప్తో బ్రహ్మర్షిణా తేన వైధర్మ్యే సహితే కృతే.

ప్ర. అ. నృప = రాజా! విన్ధ్యశైవలయోః = వింధ్యశైవలపర్వతముల మధ్య, అసౌ = ఈ, తస్య దణ్డవిషయః = వానిదండదేశము, సహితే = పూర్తిగా ధర్మ సౌఖ్యములతో కూడిన, కృతేకృతయుగమునందు, వైధర్మ్యే = అధర్మము జరిగినదగుచుండగా, తేన బ్రహ్మర్షిణా = ఆ బ్రహ్మర్షిచేత, శప్తః = శపించబడినది.

తా. రాజా! వింధ్యశైలపర్వతముల మధ్యనున్న ఆతని ఈ దండదేశమును ధర్మసౌఖ్యపరిపూర్ణమైన కృతయుగమునందు అధర్మము జరుగుటచే ఆ బ్రహ్మర్షి ఈ విధముగా శపించెను. 18

మూ. తతః ప్రభృతి కాకుత్స్థ దణ్డకారణ్యముచ్యతే, 19
తపస్వినః స్థితా హ్యత్ర జనస్థాన మతోఽభవత్,
ఏతత్తే సర్వముఖ్యాతం యన్మాం పృచ్ఛసి రాఘవ. 20

ప్ర. అ. తతః ప్రభృతి = అది మొదలు, కాకుత్స్థ = రామా! దణ్డకారణ్యమ్ = దండకారణ్యము అని, ఉచ్యతే = చెప్పబడుచున్నది. అత్ర = ఇక్కడ, తపస్వినః = మునులు, స్థితాః హి = ఉన్నారు కదా? అతః = ఆ కారణమువలన, జనస్థానమ్ = జనస్థానముగా, అభవత్ = ఆయెను. రాఘవ = రామా! యత్ = దేనిని గూర్చి, మామ్ = నన్ను, పృచ్ఛసి = అడుగుచున్నావో, ఏతత్ = ఇది, సర్వమ్ = అంతయూ, తే = నీకు, ఆఖ్యాతమ్ = చెప్పబడినది.

తా. కాకుత్స్థా! అది మొదలు దీనికి దండకారణ్య మని పేరు వచ్చినది. ఇక్కడ మునులు నివసించుటచే జనస్థాన మని కూడ పేరు. రామా! నీవు అడిగిన ఈ విషయమునంతనూ నీకు చెప్పినాను. 19, 20

మూ. సంధ్యాముపాసితుం వీర సమయో హ్యతివర్తతే,
ఏతే మహర్షయః సర్వే పూర్ణకుమ్భాః సమన్తతః, 21
కృతోదకా నరవ్యాఘ్ర ఆదిత్యం పర్యుపాసతే.

ప్ర. అ. వీర=వీరుడా! సంధ్యామ్ = సంధ్యను, ఉపాసితుమ్=ఉపాసించుటకు, సమయః = సమయము, అతివర్తతే హి = దాటిపోవుచున్నది కదా! నరవ్యాఘ్ర = నరశ్రేష్ఠుడా! ఏతే = ఈ, సర్వే=సమస్తమైన, మహర్షయః=మహర్షులు, సమన్తతః = అన్నివైపులా, పూర్ణకుమ్భాః = జలపూర్ణములైన కుంభములు గలవారై, కృతోదకాః = స్నానముచేసినవారై, ఆదిత్యమ్ = సూర్యుణ్ణి, పర్యుపాసతే = ఉపాసించుచున్నారు.

తా. వీరుడా! సంధ్యోపాసన చేయు సమయము దాటిపోవుచున్నది. నలుమూలలా ఈ మహర్షులు స్నానములు చేసి, జలపూర్ణకుంభములు దగ్గర ఉంచుకొని సూర్యుణ్ణి ఉపాసించుచున్నారు. 21

మూ. స తైర్బ్రాహ్మణమభ్యస్తం సహితైర్బ్రహ్మవిత్తమైః, 22
రవిరస్తంగతో రామ గచ్ఛోదకముపస్పృశ.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకాశీతితమః సర్గః.

ప్ర. అ. సహితైః = ఒక చోట కలిసిన, బ్రహ్మవిత్తమైః = బ్రహ్మవేత్తలలో గొప్పవారైన బ్రాహ్మణులచేత, బ్రాహ్మణమ్ = బ్రాహ్మణము, అభ్యస్తమ్ = చదవబడినది. సః=ఆ, రవిః = సూర్యుడు, అస్తం గతః = అస్తమించినాడు, రామ = రామా! గచ్ఛ = వెళ్లుము, ఉదకమ్ = ఉదకమును, ఉపస్పృశ = ఆచమనము చేయుము.

తా. ఒకచోట కలిసిన బ్రహ్మవేత్తలు బ్రాహ్మణమును పఠించుచున్నారు. సూర్యుడు అస్తమించినాడు. రామా! వెళ్ళి సంధ్యోపాసన చేయుము. 22

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు,
ఉత్తరకాండలో ఎనభై ఒకటవ సర్గ సమాప్తము.

అథ ద్వ్యశీతితమః సర్గః

[రాముడు అగస్త్యాశ్రమమునుండి అయోధ్యకు బయలుదేరుట.]

మూ. ఋషేర్వచనమాజ్ఞాయ రామః సంధ్యాముపాసితుమ్,
అపాక్రమత్సరః పుణ్యమప్సరోగణసేవితమ్. 1

ప్ర. అ. రామః = రాముడు, ఋషేః = ఋషియొక్క, వచనమ్ = వచనమును, ఆజ్ఞాయ = తెలిసికొని, సంధ్యామ్ = సంధ్యను, ఉపాసితుమ్ = ఉపాసించుటకు, అప్సరోగణసేవితమ్ = అప్సరసల గణముచేత సేవించబడిన, పుణ్యమ్ = పుణ్యమైన, సరః = సరస్సును గూర్చి, అపాక్రమత్ = వెళ్లెను.

తా. రాముడు అగస్త్యుని మాటలు విని సంధ్యోపాసన చేయుటకు అప్సరస్త్రీ సముదాయములతో నిండిన పవిత్రమైన సరస్సుకు వెళ్లెను. 1

మూ. తత్రోదకముపస్పృశ్య సంధ్యామన్వాస్య పశ్చిమామ్,
ఆశ్రమం ప్రావిశద్రామః కుమ్భయోనేర్మహాత్మనః. 2

ప్ర. అ. రామః = రాముడు, తత్ర = అక్కడ, ఉదకమ్ ఉపస్పృశ్య = ఉదకమును స్పృశించి, పశ్చిమాం సంధ్యామ్ = పశ్చిమసంధ్యను, ఉపాస్య = ఉపాసించి, మహాత్మనః = మహాత్ముడైన, కుమ్భయోనేః = అగస్త్యునియొక్క, ఆశ్రమమ్ = ఆశ్రమమును, ప్రావిశత్ = ప్రవేశించెను.

తా. రాముడు అక్కడ ఆచమనము చేసి, సాయంకాలసంధ్యను ఉపాసించి, మహాత్ముడైన అగస్త్యుని ఆశ్రమములో ప్రవేశించెను. 2

మూ. తస్యాగస్త్యో బహుగుణం కన్దమూలం తథౌషధమ్,
శాల్యాదీని పవిత్రాణి భోజనార్థమకల్పయత్. 3

ప్ర. అ. అగస్త్యః = అగస్త్యుడు, తస్య = వానియొక్క, భోజనార్థమ్ =

భోజనముకొరకు, బహుగుణమ్=చాల గుణములు గల, కన్దమూలమ్=దుంపలను, తథా = మరియు, ఔషధమ్ = శాకాదులను, పవిత్రాణి = పవిత్రములైన, శాల్యాదీని = వరి మొదలైనవాటిని, అకల్పయత్ = ఏర్పాటుచేసెను.

తా. అగస్త్యుడు రాముని భోజనముకొరకై ఉత్తమగుణము లున్న దుంపలు, శాకములు, వరి మొదలైనవాటిని ఏర్పరచెను. 3

మూ. స భుక్తవాన్నరశ్రేష్ఠస్తదన్నమమృతోపమమ్,
ప్రీతశ్చ పరితుష్టశ్చ తాం రాత్రిం సముపావిశత్. 4

ప్ర. అ. నరశ్రేష్ఠః=నరులలో శ్రేష్ఠుడైన, సః=రాముడు, అమృతోపమమ్= అమృతమువంటి, తత్ = ఆ, అన్నమ్ = అన్నమును, భుక్తవాన్ = భుజించినాడు. ప్రీతః చ = సంతోషించినవాడై, పరితుష్టః చ = తృప్తి చెందినవాడై, తాం రాత్రిమ్ = ఆ రాత్రిని, సముపావిశత్ = శయనించెను.

తా. నరులలో శ్రేష్ఠుడైన రాముడు అమృతముతో సమానమైన ఆ అన్నమును తిని తృప్తుడై సంతోషించి ఆ రాత్రి అక్కడనే శయనించెను. 4

మూ. ప్రభాతే కాల్యముత్థాయ కృత్వాహ్నికమరిందమః,
ఋషిం సముపచక్రామ గమనాయ రఘూత్తమః 5

ప్ర. అ. అరిందమః = శత్రుసంహారకుడైన, రఘూత్తమః = రాముడు, ప్రభాతే = ప్రాతఃకాలమునందు, కాల్యమ్ = తెల్లవారుజాముననే, ఉత్థాయ = లేచి, ఆహ్నికమ్ = ఆహ్నికకృత్యమును, కృత్వా = చేసికొని, గమనాయ = తిరిగి వెళ్లుటకై, ఋషిమ్ = ఋషిని, సముపచక్రామ = సమీపించెను.

తా. శత్రుసంహారకుడైన రాముడు ప్రాతఃకాలమునందు తెల్లవారుజాము నందే లేచి, ఆహ్నికకృత్యములు చేసికొని, తిరిగి వెళ్లుటకై అనుజ్ఞ పొందుటకు అగస్త్యుఋషి సమీపించెను. 5

మూ. అభివాద్యాబవీద్రామో మహర్షిం కుమ్భసంభవమ్,
ఆపృచ్ఛే స్వాం పురీం గన్తుం మామనుజ్ఞాతుమర్హసి. 6

ప్ర. అ. రామః = రాముడు, మహర్షిమ్=మహర్షియైన, కుమ్భసంభవమ్=

అగస్త్యుణ్ణి, అభివాద్య = నమస్కరించి, ఆబ్రవీత్ = పలికెను. ఆపృచ్ఛే = అనుమతి కోరుచున్నాను. స్వామ్ = నా సంబంధమైన, పురీమ్ = పట్టణమును గూర్చి, గన్తుమ్ = వెళ్లుటకు, అనుజ్ఞాతుమ్ = అనుజ్ఞ ఇచ్చుటకు, అర్హసి = తగి ఉన్నావు.

తా. రాముడు అగస్త్యమహర్షికి నమస్కరించి ఇట్లు పలికెను. "నేను నా నగరమునకు వెళ్లుటకు అనుమతి ఇమ్ము". 6

మూ. ధన్యోఽస్మ్యనుగృహీతోఽస్మి దర్శనేన మహాత్మనః,
ద్రష్టుం చైవాగమిష్యామి పావనార్థం మహాత్మనః. 7

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడవైననీయొక్క, దర్శనేన = దర్శనము చేత, ధన్యః = ధన్యుడను, అస్మి = అయినాను. అనుగృహీతః = అనుగ్రహింపబడినవాడను, అస్మి = అయినాను, మహాత్మనః = మహాత్ములైన మిమ్ములను, ద్రష్టుమ్ = చూచుటకు, పావనార్థమ్ = పవిత్రము చేసికొనుటకు, ఆగమిష్యామి = రాగలను.

తా. మహాత్ముడవైన నీ దర్శనముచేత ధన్యుడ నైతిని, అనుగ్రహింపబడితిని. మహాత్ములైన మిమ్ములను చూచుటకు, నన్ను నేను పవిత్రము చేసికొనుటకు రాగలను. 7

మూ. తథా వదతి కాకుత్స్థే వాక్యమద్భుతదర్శనమ్,
ఉవాచ పరమప్రీతో ధర్మనేత్రస్తపోధనః 8

ప్ర. అ. కాకుత్స్థే = రాముడు, తథా = అట్లు, అద్భుతదర్శనమ్ = అద్భుతమైన ఆలోచన గల, వాక్యమ్ = వాక్యమును, వదతి = పలుకుచుండగా, ధర్మనేత్రః = ధర్మము నేత్రముగా గల, తపోధనః = అగస్త్యుడు, పరమప్రీతః = చాల సంతోషించినవాడై, ఉవాచ = పలికెను.

తా. రాముడు ఆ విధముగ అద్భుతమైన ఆలోచన గల వాక్యమును పలుకుచుండగా, ధర్మము నేత్రముగా గల ఆమహాముని చాల సంతోషించి ఇట్లు పలికెను. 8

మూ. అత్యద్భుతమిదం వాక్యం తవ రామ శుభాక్షరమ్.
పావనః సర్వభూతానాం త్వమేవ రఘునన్దన. 9

ప్ర. అ. రామ = రామా! తవ = నీయొక్క, ఇదమ్ = ఈ, శుభాక్షరమ్ = శుభములైన అక్షరములు గల, వాక్యమ్ = వాక్యము, అత్యద్భుతమ్ = చాల అద్భుత మైనది. రఘునన్దన = రామా! త్వమేవ = నీవే, సర్వభూతానామ్ = సమస్తప్రాణు లకు, పావనః = పవిత్రము చేయువాడవు.

తా. రామా! శుభములైన అక్షరములు గల ఈ నీ వాక్యము చాల ఆశ్చర్య కరముగా ఉన్నది. రఘునందనా! నీవే సకలభూతములను పవిత్రముచేయువాడవు.

మూ. ముహూర్తమపి రామ త్వాం యే చ పశ్యన్తి కేచన,
పావితాః స్వర్గభూతాశ్చ పూజ్యాస్తే త్రిదశేశ్వరైః. 10

ప్ర. అ. రామ = రామా! యే కేచన = ఎవరైనను, త్వామ్ = నిన్ను, ముహూర్తమపి = ముహూర్తకాలమైనను, పశ్యన్తి = చూచెదరో, తే = వారు, పావితాః = పవిత్రముచేయబడినవారై, స్వర్గభూతాః = స్వర్గమును పొందినవారై, త్రిదివేశ్వరైః = దేవతలచేత, పూజ్యాః = పూజింపదగినవారు.

తా. రామా! నిన్ను ముహూర్తకాలమైనా ఎవరు చూతురో వారు పవిత్రులై స్వర్గమును పొంది దేవతలచేత పూజింపబడుదురు. 10

మూ. యే చ త్వాం ఘోరచక్షుర్భిః పశ్యన్తి ప్రాణినో భువి,
హతాస్తే యమదణ్డేన సద్యో నిరయగామినః. 11

ప్ర. అ. భువి = భూమియందు, యే చ = ఏ, ప్రాణినః = ప్రాణులు, త్వామ్ = నిన్ను, ఘోరచక్షుర్భిః = క్రూరములైన చూపులతో, పశ్యన్తి = చూతురో, తే = వారు, యమదణ్డేన = యమదండముచేత, హతాః = కొట్టబడినవారై, సద్యః = వెంటనే, నిరయగామినః = నరకమునకు వెళ్ళువారు.

ఈ భూలోకములోని ఏ ప్రాణులు నిన్ను క్రూరదృష్టులతో చూచెదరో వాళ్ళు యమదండముచేత కొట్టబడి వెంటనే నరకములో పడుదురు. 11

మూ. ఈదృశస్త్వం రఘుశ్రేష్ఠ పావనః సర్వదేహినామ్,
భువి త్వాం కథయన్తో హి సిద్ధిమేష్యన్తి రాఘవ. 12

ప్ర. అ. రఘుశ్రేష్ఠ = రఘువంశీయులలో శ్రేష్ఠుడా! రాఘవ = రామా!

త్వమ్ = నీవు, సర్వదేహినామ్ = సమస్తప్రాణులకు, ఈదృశః = ఇట్టి, పావనః = పవిత్రముచేయువాడవు. భువి = భూలోకమునందు, త్వామ్ = నిన్ను గూర్చి, కథయన్తః = చెప్పుచున్నవాళ్ళు, సిద్ధిమ్ = సిద్ధిని, ఏష్యన్తి = పొందగలరు.

తా. రామా! నీవు సకలప్రాణులను ఈ విధముగ పవిత్రులను చేయగల వాడవు. రాఘవా! భూలోకములో నిన్ను గూర్చి చెప్పుకొనువారు సిద్ధిని పొందుదురు. 12

మూ. త్వం గచ్ఛారిష్టమవ్యగ్రః పన్థానమకుతోభయమ్,
ప్రశాధి రాజ్యం ధర్మేణ గతిర్హి జగతో భవాన్. 13

ప్ర. అ. త్వమ్ = నీవు, అవ్యగ్రః = క్లేశరహితుడవై, అరిష్టమ్ = శుభకరమైన, అకుతోభయమ్ = ఎక్కడినుండీ భయము లేని, పన్థానమ్ = మార్గమును గూర్చి, గచ్ఛ = వెళ్ళుము. రాజ్యమ్ = రాజ్యమును, ధర్మేణ = ధర్మముతో, ప్రశాధి = పాలించుము. భవాన్ = నీవు, జగతః = జగత్తుకు, గతిః హి = గతివి కదా?

తా. నీవు ఎట్టి క్లేశములూ లేనివాడవై మంగళకరమైన, ఎక్కడినుండీ భయములేని మార్గమున వెళ్ళుము. రాజ్యమును ధర్మముచే పరిపాలించుము. నీవే ఈ జగత్తుకు గతివి కదా? 13

మూ. ఏవముక్తస్తు మునినా ప్రాఞ్జలిప్రగ్రహో నృపః,
అభ్యవాదయత ప్రాజ్ఞస్తమృషిం పుణ్యశీలినమ్. 14

ప్ర. అ. మునినా = మునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, నృపః = రాజు, ప్రాఞ్జలిప్రగ్రహః = కట్టపడిన అంజలిగ్రహణము గలవాడై, ప్రాజ్ఞమ్ = బుద్ధిమంతుడైన, పుణ్యశీలినమ్ = పుణ్యస్వభావము గల, తమ్ ఋషిమ్ = ఆ ఋషిని, అభ్యవాదయత = నమస్కరించెను.

తా. రాముడు ఆ మునీశ్వరుని మాటలు విని పుణ్యశీలము గల ఆతనికి అంజలి ఘటించి నమస్కరించెను. 14

మూ. అభివాద్య ఋషిశ్రేష్ఠం తాంశ్చ సర్వాంస్తపోధనాన్,
అధ్యారోహత్తదవ్యగ్రః పుష్పకం హేమభూషితమ్. 15

ప్ర. అ. ఋషిశ్రేష్ఠమ్ = ఋషిశ్రేష్ఠుణ్ణి, సర్వాన్ = సమస్తమైన, తాన్ = ఆ, తపోధనాన్ = మునులను, అభివాద్య = నమస్కరించి, హేమభూషితమ్ = బంగారముచేత అలంకరించబడిన, తత్ = ఆ, పుష్పకమ్ = పుష్పకమును, అవ్యగ్రః = సావధానచిత్తుడై, అధ్యారోహత్ = ఎక్కెను.

తా. ఆ అగస్త్యమహాముని కి, సమస్తమైన ఆ మునీశ్వరులకు నమస్కరించి, బంగారముచేత అలంకరించబడిన ఆ పుష్పకమును సావధానచిత్తుడై ఎక్కెను. 15

మూ. తం ప్రయాన్తం మునిగణా ఆశీర్వాదైః సమన్తతః,
అపూజయన్ మహేన్ద్రాభం సహస్రాక్షమివామరాః. 16

ప్ర. అ. మునిగణాః = మునిసముదాయములు, ప్రయాన్తమ్ = వెళ్ళుచున్న, మహేన్ద్రాభమ్ = మహేంద్రుని వంటి కాంతి గల, తమ్ = ఆ రాముణ్ణి, అమరాః = దేవతలు, సహస్రాక్షమివ = ఇంద్రుణ్ణి వలె, సమన్తతః = అన్ని వైపులా, ఆశీర్వాదైః = ఆశీర్వాదములతో, అపూజయన్ = పూజించినవి.

తా. మును లందరూ వెళ్ళుచున్న మహేంద్రుని వంటి ఆ రాముణ్ణి దేవతలు ఇంద్రుణ్ణి వలె, అన్ని వైపులనుండీ ఆశీర్వాదములతో పూజించినవి. 16

మూ. స్వస్థః స దదృశే రామః పుష్పకే హేమభూషితే,
శశీ మేఘసమీపస్థో యథా జలధరాగమే. 17

ప్ర. అ. హేమభూషితే = బంగారముచేత అలంకరించబడిన, పుష్పకే = పుష్పకమునందు, స్వస్థః = సుఖముగా కూర్చున్న, రామః = రాముడు, జలధరాగమే = వర్షకాలమునందు, మేఘసమీపస్థః = మేఘసమీపమునందున్న, శశీ యథా = చంద్రుడు వలె, దదృశే = చూడబడెను.

తా. బంగారముచేత అలంకరించబడిన పుష్పకములో సుఖముగా కూర్చున్న రాముడు వర్షకాలమునందు మేఘము దగ్గర నున్న చంద్రుడు వలె ప్రకాశించెను. 17

మూ. తతోఽర్దదివసే ప్రాప్తే పూజ్యమానస్తతస్తతః,
అయోధ్యాం ప్రాప్య కాకుత్స్థో మధ్యకక్షామవాతరత్. 18

ప్ర. అ. తతః = అటుపిమ్మట, అర్ధదివసే = మధ్యాహ్నసమయము, ప్రాప్తే = వచ్చినదగుచుండగా, కాకుత్స్థః = రాముడు, తతస్తతః = ఆ యా ప్రదేశములయందు, పూజ్యమానః = పూజింపబడుచు, అయోధ్యామ్ = అయోధ్యను, ప్రాప్య = పొంది, మధ్యకక్షామ్ = మధ్యవాకిలిని (యందు), అవాతరత్ = దిగెను.

తా. రాముడు మధ్యాహ్న మయే సరికి అయోధ్య చేరి అక్కడక్కడ పూజింపబడుచు, మధ్యవాకిలిలో దిగెను. 18

మూ. తతో విసృజ్య రుచిరం పుష్పకం కామగామినమ్,
విసర్జయిత్వా గచ్ఛేతి స్వస్తి తేఽస్త్వితి చ ప్రభుః 19
కక్షాన్తరస్థితం క్షిప్రం ద్వాఃస్థం రామోఽబ్రవీద్వచః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ప్రభుః = ప్రభువైన, రామః = రాముడు, గచ్ఛ = వెళ్ళుము, తే = నీకు, స్వస్తి = క్షేమము, అస్తు = అగుగాక, ఇతి = అని, రుచిరమ్ = సుందరమైన, కామగామినమ్ = స్వేచ్ఛగా వెళ్ళు, పుష్పకమ్ = పుష్పకమును, విసర్జయిత్వా = విడచి, కక్షాన్తరస్థితమ్ = వాకిలి మధ్యయందున్న, ద్వాఃస్థమ్ = ద్వారపాలకుణ్ణి గూర్చి, క్షిప్రమ్ = శీఘ్రముగా, వచః = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట ప్రభువైన రాముడు "నీవు వెళ్ళుము; నీకు క్షేమ మగుగాక" అని వలుకుచు సుందరమైన, స్వేచ్ఛగా ప్రయాణము చేయు పుష్పకవిమాన మును పంపివేసి, వాకలి మధ్యయందున్న ద్వారపాలకునితో తొందరగా ఇట్లు పలికెను. 19

మూ. లక్ష్మణం భరతం చైవ గత్వా తౌ లఘువిక్రమౌ, 20
మమాగమనమాఖ్యాయ శబ్దాపయ చ మా చిరమ్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ద్వ్యశీతితమః సర్గః.

ప్ర. అ. లఘువిక్రమౌ = శీఘ్రమైన వరాక్రమము గల, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి గూర్చి, భరతం చ ఏవ = భరతుణ్ణి గూర్చి, గత్వా = వెళ్ళి, మమ =

నాయొక్క, ఆగమనమ్ = రాకను గూర్చి, ఆఖ్యాయ = చెప్పి, శబ్దాపయ = పిలువుము. చిరమ్ = చిరకాలము, మా = చేయవద్దు.

తా. శీఘ్రమైన పరాక్రమము గల లక్ష్మణ భరతుల దగ్గరికి వెళ్ళి, నేను వచ్చినట్లు చెప్పి నావద్దకు పిలువుము. ఆలస్యము చేయవద్దు. 20

'బాలానందిని' అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో ఎనభైరెండవ సర్గ సమాప్తము.

అథ త్ర్యశీతితమః సర్గః

[భరతుడు సలహా చెప్పగా రాముడు రాజసూయయాగము చేయు ప్రయత్నమునుండి విరమించుట.]

మూ. తచ్ఛ్రుత్వా భాషితం తస్య రామస్యాక్లిష్టకర్మణః,
ద్వాఃస్థః కుమారావాహూయ రాఘవాయ న్యవేదయత్ 1

ప్ర. అ. అక్లిష్టకర్మణః = క్లేశము లేని పనులు గల, రామస్య = రాముని యొక్క, తత్ = ఆ, భాషితమ్ = మాటను, శ్రుత్వా = విని, ద్వాఃస్థః = ద్వార పాలకుడు, కుమారౌ = ఆ రాజకుమారులను, ఆహూయ = పిలుచుకొనివచ్చి, రాఘవాయ = రామునకు, న్యవేదయత్ = తెలిపెను.

తా. ద్వారపాలకుడు క్లేశము లేని పనులు గల రాముని మాటలు విని, లక్ష్మణభరతులను తీసికొనివచ్చి రామునకు తెలిపెను. 1

మూ. దృష్ట్వా తు రాఘవః ప్రాప్తావుభౌ భరతలక్ష్మణౌ,
పరిష్వజ్య తతో రామో వాక్యమేతదువాచ హ 2

ప్ర. అ. రాఘవః = రఘువంశసంజాతుడైన, రామః = రాముడు, భరత లక్ష్మణౌ = భరత లక్ష్మణులను, ఉభౌ = ఇద్దరినీ, ప్రాప్తౌ = వచ్చినవారినిగా, దృష్ట్వా = చూచి, పరిష్వజ్య = కౌగలించుకొని, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. రాముడు భరతశత్రఘ్నులిద్దరూ వచ్చినట్లు చూచి, వాళ్ళను కౌగలించుకొని ఇట్లు పలికెను. 2

మూ. కృతం మయా యథాతథ్యం ద్విజకార్యమనుత్తమమ్,
ధర్మసేతుమథో భూయః కర్తుమిచ్ఛామి రాఘవౌ. 3

ప్ర. అ. రాఘవౌ = భరతలక్ష్మణులారా! మయా = నాచేత, అనుత్తమమ్ = అత్యుత్తమమైన, ద్విజకార్యమ్ = బ్రాహ్మణుని కార్యము, యథా = ఎట్లు, తథ్యమ్ = యథార్థముగా, కృతమ్ = చేయబడినదో, అథో = ఇటుపిమ్మట, భూయః = మరల, ధర్మసేతుమ్ = ధర్మమునకు సేతువును, కర్తుమ్ = చేయుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. భరత శత్రుఘ్నులారా! అత్యుత్తమమైన బ్రాహ్మణకార్యమును చేసినట్లే ఇపుడు మరల ధర్మసేతువును, రాజ ధర్మమునకు సంబంధించిన అత్యుత్తమ మర్యాదను, చేయవలె నని కోరుచున్నాను. (రాజసూయము చేయు అర్హత రాజుకు మాత్రమే ఉన్నది గాన అది రాజధర్మానికి సంబంధించిన అత్యున్నతమైన పరిధి అని భావము.)

మూ. అక్షయ శ్చావ్యయ్య శ్చైవ ధర్మసేతుర్మతో మమ,
ధర్మప్రసాధకం హ్యేతత్సర్వపాపప్రణాశనమ్. 4

ప్ర. అ. ధర్మసేతుః = ధర్మసేతువు, అక్షయః చ ఏవ = క్షయము లేనిది అని, అవ్యయః చ ఏవ = వ్యయము లేనిది అని, మమ = నాకు, మతః = ఇష్టము. ఏతత్ = ఇది, ధర్మప్రసాధకమ్ = ధర్మమును సాధించునది. సర్వపాప ప్రణాశనమ్ = సమస్త పాపములను నశింపచేయునది.

తా. ఈ ధర్మసేతువు అక్షయము, వ్యయరహితము అని నా అభిప్రాయము. ఇది ధర్మమును పోషించును, సమస్తపాపములను నశింపచేయును. 4

మూ. యువాభ్యామాత్మభూతాభ్యాం రాజసూయమనుత్తమమ్,
సహితో యష్టుమిచ్ఛామి తత్ర ధర్మస్తు శాశ్వతః. 5

ప్ర. అ. ఆత్మభూతాభ్యామ్ = నా ఆత్మలైన, యువాభ్యామ్ = మీ ఇద్దరితో, సహితః = కూడినవాడనై, అనుత్తమమ్ = అత్యుత్తమమైన, రాజసూయమ్ = రాజసూయమును, యష్టుమ్ = చేయుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను. తత్ర = దానియందు, ధర్మః = ధర్మము, శాశ్వతః = శాశ్వతము.

తా. నాకు ఆత్మవంటివారైన మీ ఇద్దరితో కలిసి అత్యుత్తమమైన రాజసూయము చేయవలె నని కోరుచున్నాను. దానియందు ధర్మము శాశ్వతముగా నిలచి ఉండును. 5

మూ. ఇష్ట్వా తు రాజసూయేన మిత్రః శత్రునిబర్హణః,
సుహుతేన సుయజ్ఞేన వరుణత్వముపాగమత్. 6

ప్ర అ. శత్రునిబర్హణః = శత్రువినాశకుడైన, మిత్రః = మిత్రుడు, సుహుతేన = బాగా హోమము చేయబడిన, సుయజ్ఞేన = మంచి యజ్ఞమైన, రాజసూయేన = రాజసూయముచేత, ఇష్ట్వా = యాగముచేసి, వరుణత్వమ్ = వరుణత్వమును, ఉపాగమత్ = పొందెను.

తా. శత్రువినాశకుడైన మిత్రుడు బాగా నిర్వహింపబడిన ఉత్తమయజ్ఞమైన రాజసూయము చేసి వరుణత్వమును పొందెను. 6

మూ. సోమశ్చ రాజసూయేన ఇష్ట్వా ధర్మేణ ధర్మవిత్,
ప్రాప్తశ్చ సర్వలోకేషు కీర్తిం స్థానం చ శాశ్వతమ్. 7

ప్ర. అ. ధర్మవిత్ = ధర్మవేత్త అయిన, సోమః చ = సోముడు కూడ, ధర్మేణ = ధర్మముచేత, రాజసూయేన ఇష్ట్వా = రాజసూయయాగము చేసి, సర్వలోకేషు = సమస్తలోకములయందు, కీర్తిం చ = కీర్తిని, శాశ్వతమ్ = శాశ్వతమైన, స్థానం చ = స్థానమును, ప్రాప్తః = పొందినాడు.

తా. ధర్మముల నెరిగిన సోముడు కూడ ధర్మానుసారముగా రాజసూయము చేసి సకలలోకములలో కీర్తిని, శాశ్వతమైన స్థానమును పొందెను. 7

మూ. అస్మిన్నహని యచ్ఛ్రేయశ్చిన్త్యతాం తన్మయా సహ,
హితం చాయతియుక్తం చ ప్రయతౌ వక్తుమర్హథః. 8

ప్ర. అ. అస్మిన్ = ఈ, అహని = దినమునందు, మయా సహ = నాతో కూడ, యత్ = ఏది, శ్రేయః = శ్రేయస్కరమో అది, చిన్త్యతామ్ = చింతింపబడుగాక. ప్రయతౌ = శ్రద్ధావంతులై (బాగా ఆలోచించినవారై), హితం చ = హితమూ, ఆయతియుక్తం చ = మంచి భవిష్యత్తు కలదీ అయినదానిని, వక్తుమ్ = చెప్పుటకు, అర్హథః = తగిఉన్నారు.

తా. మనకు ఏది శ్రేయస్కరమో మీరు నేడు నాతో ఆలోచించుడు. శ్రద్ధగా ఆలోచించి ఏది హితమో, ఏది మున్ముందు మంచి ఫలము నిచ్చునో అది చెప్పుడు. 8

మూ. శ్రుత్వా తు రాఘవస్యైతద్వాక్యం వాక్యవిశారదః,
భరతః ప్రాఞ్జలిర్భూత్వా వాక్యమేతదువాచ హ. 9

ప్ర. అ. వాక్యవిశారదః = వాక్యములయందు నేర్పు గల, భరతః = భరతుడు, రాఘవస్య = రామునియొక్క, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడు, భూత్వా = అయి, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. వాక్యములలో నేర్పరియైన భరతుడు రాముడు పలికిన ఈ మాటలు విని అంజలి ఘటించి ఇట్లు వలికెను. 9

మూ. త్వయి ధర్మ్యః పరః సాధో త్వయి సర్వా వసుంధరా,
ప్రతిష్ఠితా మహాబాహో యశశ్చామితవిక్రమ. 10

ప్ర. అ. సాధో = సత్పురుషుడా! మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా! అమితవిక్రమ = అమితమైన పరాక్రమము కలవాడా! త్వయి = నీ యందు, సర్వా = సమస్తమైన, వసుంధరా = భూమి, ప్రతిష్ఠితా = నిలబడినది. త్వయి = నీయందు, పరః = గొప్ప, ధర్మ్యః = ధర్మము, యశః చ = కీర్తి (ప్రతిష్ఠితములైనవి).

తా. సత్పురుషుడా! మహాబాహూ! అమితమైన పరాక్రమము కలవాడా! నీ యందే ధర్మము ప్రతిష్ఠితమైనది. నీ యందే సమస్తమైన భూమి ప్రతిష్ఠితమైనది, నీ యందే కీర్తి ప్రతిష్ఠితమైనది. 10

మూ. మహీపాలాశ్చ సర్వే త్వాం ప్రజాపతిమివామరాః,
నిరీక్షన్తే మహాత్మానం లోకనాథం యథా వయమ్. 11

ప్ర. అ సర్వే = సమస్తమైన, మహీపాలాః = రాజులు, అమరాః = దేవతలు, ప్రజాపతిమ్ ఇవ = బ్రహ్మదేవుణ్ణి వలె, మహాత్మానమ్ = మహాత్ముడవు, లోకనాథమ్ = లోకనాథుడవు, అయిన, త్వామ్ = నిన్ను, వయమ్ = మేము, యథా = ఎట్లో ఆట్లు, నిరీక్షన్తే = చూచుచున్నారు.

తా. రాజులందరూ మహాత్ముడవు, లోకములకు నాథుడవూ అయిన నిన్ను,

దేవతలు బ్రహ్మదేవునివలె చూచుచున్నారు; నిన్ను మేము ఎట్లు చూచుచున్నామో అట్లు చూచుచున్నారు. 11

మూ. పుత్రాశ్చ పితృవద్రాజన్ పశ్యన్తి త్వాం మహాబల,
పృథివ్యా గతిభూతోఽసి ప్రాణినామపి రాఘవ. 12

ప్ర. అ. రాజన్ = రాజా! రాఘవ = రామా! మహాబల = గొప్ప బలము గలవాడా! పుత్రాః = పుత్రులు, పితృవత్ = తండ్రిని వలె, త్వామ్ = నిన్ను, పశ్యన్తి = చూచుచున్నారు. పృథివ్యాః = భూమికి, ప్రాణినామ్ అపి = సకలప్రాణులకు కూడ, గతిభూతః అసి = గతి అయి ఉన్నావు.

తా. గొప్ప బలము గల రాజా! రామా! రాజు లందరు నిన్ను పుత్రులు తండ్రిని చూచినట్లు చూచుచున్నారు. భూమికి, సకలప్రాణులకీ కూడ నీవే గతివి. 12

మూ. స త్వమేవంవిధం యజ్ఞమాహర్తాసి కథం నృప,
పృథివ్యా రాజవంశానాం వినాశో యత్ర దృశ్యతే. 13

ప్ర. అ. నృప = రాజా! సః త్వమ్ = అట్టి నీవు, యత్ర = దేనియందు, పృథివ్యాః = భూమియొక్క, రాజవంశానామ్ = రాజవంశములయొక్క, వినాశః = వినాశము, దృశ్యతే = చూడబడుచున్నదో, ఏవం విధమ్ = ఇట్టి, యజ్ఞమ్ = యజ్ఞమును, కథమ్ = ఎట్లు, ఆహర్తాసి = చేయగలవు.

తా. రాజా! ఏ యజ్ఞమువలన భూమిమీద ఉన్న రాజవంశము లన్నీ నశించుటకు అవకాశ మున్నదో అట్టి యజ్ఞమును, అంత గౌరవపాత్రుడవైన నీవెట్లు చేసెదవు? 13

మూ. పృథివ్యాం యే చ పురుషా రాజన్ పౌరుషమాగతాః,
సర్వేషాం భవితా తత్ర సంక్షయః సర్వకోపజః. 14

ప్ర. అ. రాజన్ = రాజా! పృథివ్యామ్ = భూమిమీద, పౌరుషమ్ = పౌరుషమును, ఆగతాః = పొందిన, యే చ = ఏ, పురుషాః = పురుషులు గలరో, సర్వేషామ్ = వాళ్ళ అందరియొక్క, సర్వకోపజః = అందరి కోపమువలన కలిగిన, సంక్షయః = క్షయము, భవితా = కాగలదు.

తా. భరతునితో శుభమైన వాక్యమును పలికెను. "దోషము లేనివాడా? ఇప్పుడు నీ మాటలచేత నాకు చాల ఆనందము కలిగినది". 17

మూ. ఇదం వచనమక్లీబం త్వయా ధర్మసమాగతమ్,
వ్యాహృతం పురుషవ్యాఘ్ర పృథివ్యాః పరిపాలనమ్. 18

ప్ర. అ. పురుషవ్యాఘ్ర = పురుషశ్రేష్ఠుడా! త్వయా = నీచేత, ధర్మసమాగతమ్ = ధర్మముతో కూడినది, పృథివ్యాః = భూమికి, పరిపాలనమ్ = పాలించునది అయిన, ఇదం వచనమ్ = ఈ ఈ వచనము, అక్లీబమ్ = ధైర్యముగా, వ్యాహృతమ్ = పలకబడినది.

తా. పురుషశ్రేష్ఠుడా! నీవు ధర్మసంమతము, భూమికి పాలనహేతువు అయిన ఈ వాక్యమును నిర్భయముగా చెప్పినావు. 18

మూ. ఏష తస్మాదభిప్రాయం రాజసూయాత్ క్రతూత్తమాత్,
నివర్తయామి ధర్మజ్ఞ తవ సువ్యాహృతేన చ. 19

ప్ర. అ. ధర్మజ్ఞ = ధర్మములు తెలిసినవాడా! ఏషః = ఈ నేను, తవ = నీ యొక్క, సువ్యాహృతేన = మంచి మాటచేత, తస్మాత్ = ఆ, క్రతూత్తమాత్ = క్రతువులతో శ్రేష్ఠమైన, రాజసూయాత్ = రాజసూయమునుండి, అభిప్రాయమ్ = అభిప్రాయమును, నివర్తయామి = మరలించుచున్నాను.

తా. ధర్మములు తెలిసిన భరతా! నీవు పలికిన మంచి మాటల ప్రకారము నేను క్రతువులలో శ్రేష్ఠమైన ఈ రాజసూయమునుండి నా అభిప్రాయమును నివర్తింపచేయుచున్నాను. 19

మూ. లోకపీడాకరం కర్మ న కర్తవ్యం విచక్షణైః,
బాలానాం తు శుభం వాక్యం గ్రాహ్యం లక్ష్మణపూర్వజ,
తస్మాచ్ఛ్రుణోమి తే వాక్యం సాధు యుక్తం మహాబల20.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
త్ర్యశీతితమః సర్గః

ప్ర. అ. మహాబల = గొప్ప బలము గలవాడా! లక్ష్మణపూర్వజ =

భరతుడా! విచక్షణైః = బుద్ధిమంతులచేత, లోకపీడాకరమ్ = లోకపీడను చేయు, కార్యమ్ = కార్యము, న కర్తవ్యమ్ = చేయదగినది కాదు. బాలానామ్ = చిన్న వాళ్ళయొక్క, శుభం వాక్యం తు = మంచి వాక్యమైతే, గ్రాహ్యమ్ = గ్రహించ దగినది. తస్మాత్ = ఆ కారణమువలన, సాధు = మంచి దైన, యుక్తమ్ = తగిన తే వాక్యమ్ = నీ వాక్యమును, శృణోమి = వినుచున్నాను.

తా. బలశాలివైన భరతా! బుద్ధిమంతులు లోకపీడాహేతువైన పని చేయ గూడదు చిన్నవారి మంచి మాట గ్రహింపదగినది. అందువలన మంచిదీ, యుక్తి యుక్తమూ ఆయిన నీ మాట వినుచున్నాను.

'బాలానందిని' అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో ఎనభైమూడవ సర్గ సమాప్తము.

అథ చతురశీతితమః సర్గః.

[లక్ష్మణుడు అశ్వమేధయాగమును గూర్చి చెప్పుచు ఇంద్ర వృత్రుల కథను చెప్పుట. వృత్రుడు తపస్సు చేయుట. అతనిని చంపు మని ఇంద్రుడు విష్ణువును ప్రార్థించుట].

మూ. తథోక్తవతి రామే తు భరతే చ మహాత్మని,
లక్ష్మణోఽథ శుభం వాక్యమువాచ రఘునన్దనమ్. 1

ప్ర. అ. రామే = రాముడు, మహాత్మని = మహాత్ముడైన, భరతే చ = భరతుడూ, తథా = అట్లు, ఉక్తవతి = పలికినవాడగుచుండగా, అథ = అటుపిమ్మట, లక్ష్మణః = లక్ష్మణుడు, రఘునన్దనమ్ = రాముణ్ణి గూర్చి, శుభమ్ = శుభమైన, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. రాముడు, భరతుడు పలికిన మాటలు విని లక్ష్మణుడు రామునితో శుభమైన వాక్యము పలికెను. 1

మూ. అశ్వమేధో మహాయజ్ఞః పావనః సర్వపాప్మనామ్,
పావనస్తవ దుర్ధర్షో రోచతాం రఘునన్దన. 2

ప్ర. అ. మహాయజ్ఞః = మహాయజ్ఞమైన, అశ్వమేధః = అశ్వమేధము, సర్వపాప్మనామ్ = సమస్తపాపములకు, పావనః = పవిత్రంపచేయునది రఘునన్దన = రామా! దుర్ధర్షః = ఎదిరింప శక్యము కాని, పావనః = పవిత్రము చేయు ఆ యజ్ఞము, తవ = నీకు, రోచతామ్ = ఇష్ట మగుగాక.

తా. రామా! అశ్వమేధమహాయజ్ఞము సర్వపాపములను తొలగించును. ఎదిరింప శక్యముకాని పవిత్రత్వమును చేకూర్చు ఆ యజ్ఞము నీకు ఇష్టమగుగాక.

మూ. శ్రూయతే హి పురా వృత్తం వాసవే సుమహాత్మని,
బ్రహ్మహత్యావృతః శక్రో హయమేధేన పావితః. 3

ప్ర. అ. సుమహాత్మని = చాల గొప్పవాడైన, వాసవే = దేవేంద్రుని విషయమునందు, పురా = పూర్వము, వృత్తమ్ = జరిగినది, శ్రూయతే హి = వినబడుచున్నది కదా. బ్రహ్మహత్యావృతః = బ్రహ్మహత్యతో కూడిన, శక్రః = ఇంద్రుడు, హయమేధేన = అశ్వమేధముచేత, పావితః = పవిత్రము చేయబడినాడు.

తా. మహాత్ముడైన ఇంద్రుని విషయమున పూర్వము జరిగిన కథ ప్రసిద్ధమే కదా? బ్రహ్మహత్యాపాపము తగిలిన ఇంద్రుడు అశ్వమేధముచేత పవిత్రుడైనాడు. 3

మూ. పురా కిల మహాబాహో దేవాసురసమాగమే,
వృత్రో నామ మహానాసీద్దైతేయో లోకసంమతః. 4

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా! పురా = పూర్వము, దేవాసురసమాగమే = దేవాసురుల స్నేహకాలమునందు, లోకసంమతః = లోకమునకు ఇష్టుడైన, వృత్రో నామ = వృత్రుడను, మహాన్ = గొప్ప, దైతేయః = అసురుడు, ఆసీత్ = ఉండెను.

తా. మహాబాహూ! దేవాసురులు స్నేహముగా ఉంటూన్న పూర్వకాలమునందు లోకములకు ఇష్టుడైన వృత్రుడనే గొప్ప దైత్యుడు ఉండెను. 4

మూ. విస్తీర్ణో యోజనశతముచ్ఛ్రితస్త్రిగుణం తతః
అనురాగేణ లోకాంస్త్రీన్ స్నేహాత్ పశ్యతి సర్వతః. 5

ప్ర. అ. యోజనశతమ్ = నూరు యోజనములు, విస్తీర్ణః = విస్తారము కలవాడు, తతః = అంతకలబె, త్రిగుణమ్ = మూడు రెట్లు, ఉచ్ఛ్రితః = ఎత్తైనవాడూ అయిన అతడు, త్రీన్ లోకాన్ = మూడు లోకములను, సర్వతః = అన్ని విధాల, అనురాగేణ = అనురాగముతోను, స్నేహాత్ = స్నేహమువలన, పశ్యతి = చూచును.

తా. వంద యోజనములు లావు, మూడు వందల యోజనముల ఎత్తూ ఉన్న అతడు మూడులోకాలనూ కూడ స్నేహానురాగాలతో చూచుచుండెడివాడు.

మూ. ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ బుద్ధ్యా చ పరినిష్ఠితః,
శశాస పృథివీం స్ఫీతాం ధర్మేణ సునమాహితః. 6

ప్ర. అ. ధర్మజ్ఞః చ=ధర్మములు తెలిసినవాడు, కృతజ్ఞః చ=కృతజ్ఞుడు, బుద్ధ్యా=బుద్ధితో, పరినిష్ఠితః చ=కూడినవాడూ అయిన అతడు, సుసమాహితః=బాగుగా సావధానచిత్తుడై, స్ఫీతామ్=విశాలమైన, పృథివీమ్=భూమిని, ధర్మేణ=ధర్మముచేత, శశాస=పాలించెను.

తా. ధర్మములు తెలిసినవాడు, కృతజ్ఞుడు, బుద్ధిశాలీ అయిన అతడు సావధానచిత్తుడై విశాలమైన భూమిని ధర్మముచేత పాలించెను. 6

మూ. తస్మిన్ ప్రశాసతి తదా సర్వకామదుఘా మహీ,
రసవన్తి ప్రసూనాని మూలాని చ ఫలాని చ. 7

ప్ర. అ. తదా=అప్పుడు, తస్మిన్=అతడు, మహీమ్=భూమిని, ప్రశాసతి=శాసించుచుండగా, మహీ=భూమి, సర్వకామదుఘా=సకలకామములను ఇచ్చేదిగా ఉంచెను. ప్రసూనాని=పుష్పములు, మూలాని చ=మూలములు, ఫలాని చ=ఫలములు, రసవన్తి=రసము గలవి.

తా. అప్పుడు అతడు శాసించుచున్న కాలమునందు భూమి సమస్తకామములను ఇచ్చెను. పుష్పములు మూలములు, ఫలములు రసభరితములై ఉండెను. 7

మూ. అకృష్టపచ్యా పృథివీ సుసంపన్నా మహాత్మనః,
స రాజ్యం తాదృశం భుఙ్క్తే స్ఫీతమద్భుతదర్శనమ్. 8

ప్ర. అ. మహాత్మనః=మహాత్ముడైన అతనియొక్క, పృథివీ=భూమి, అకృష్టపచ్యా=దున్నకుండగనే పండేదిగాను, సుసంపన్నా=సుసమృద్ధముగాను ఉండెను. సః=అతడు, స్ఫీతమ్=విశాలమైన, అద్భుతదర్శనమ్=అద్భుతమైన దర్శనము గల, తాదృశమ్=అట్టి, రాజ్యమ్=రాజ్యమును, భుఙ్క్తే=అనుభవించుచున్నాడు.

తా. మహాత్ముడైన అతని భూమి దున్నకనే పండుచు సుసమృద్ధమై ఉండెను. అతడు అతివిశాలమైన, ఆశ్చర్యకరమైన అట్టి రాజ్యమును అనుభవించెను. 8

మూ. తస్య బుద్ధిః సముత్పన్నా తపః కుర్యామనుత్తమమ్,
తపో హి పరమం శ్రేయః సంమోహమితరత్సుఖమ్. 9

ప్ర. అ. తస్య = అతనికి, బుద్ధిః = బుద్ధి, సముత్పన్నా = పుట్టినది. అనుత్తమమ్ = చాల ఉత్తమమైన, తపః = తపస్సును, కుర్యామ్ = చేయుదును గాక. తపః=తపస్సు, పరమమ్ = గొప్పదైన, శ్రేయః=శ్రేయస్సు, ఇతరత్ = ఇతరమైన, సుఖమ్ = సుఖము, సంమోహమ్ = మోహాత్మకమైనది.

తా. "నేను అత్యుత్తమమైన తపస్సు చేసెదను. తపస్సు చాల శ్రేయస్కరము. ఇతర సుఖము లన్నీ మోహజనకములు" అని ఆతనికి అభిప్రాయము కలిగెను. 9

మూ. స నిక్షిప్య సుతం జ్యేష్ఠం పౌరేషు మధురేశ్వరమ్,
తప ఉగ్రం సమాతిష్ఠత్తాపయన్ సర్వదేవతాః. 10

ప్ర. అ. సః = అతడు, జ్యేష్ఠం సుతమ్ = పెద్ద కుమారుడైన, మధురేశ్వరమ్ = మధుర డను ప్రభువును, పౌరేషు=పౌరులయందు, నిక్షిప్య = ఉంచి, సర్వదేవతాః = సకలదేవతలను, తాపయన్ = తపింపచేయుచు, ఉగ్రమ్ = ఉగ్రమైన, తపః = తపస్సును, సమాతిష్ఠత్ = చేసెను.

తా. అతడు తన జ్యేష్ఠకుమారుడైన మధురుడు అను ప్రభువును ప్రజలకు అధిపతినిగా చేసి సకలదేవతలకు భయము కలుగునట్లు ఉగ్రమైన తపస్సు చేసెను. 10

మూ. తప స్తప్యతి వృత్రే తు వాసవః పరమార్తవత్,
విష్ణుం సముపసంక్రమ్య వాక్యమేతదువాచ హ. 11

ప్ర. అ. వృత్రే = వృత్రాసురుడు, తపః = తపస్సును, తప్యతి = చేయుచుండగా, వాసవః = దేవేంద్రుడు, పరమార్తవత్ = చాల దుఃఖితుడై, విష్ణుమ్ = విష్ణువును, సముపసంక్రమ్య = చేరి, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. వృత్రుడు తపస్సు చేయుట చూచి ఇంద్రుడు భయార్తుడై విష్ణువు దగ్గరకు వెళ్ళి ఇట్లు పలికెను. 11

మూ. తపస్యతా మహాబాహో లోకాః సర్వే వినిర్జితాః,
బలవాన్న హి ధర్మాత్మా నైనం శక్ష్యామి శాసితుమ్. 12

ప్ర. అ. మహాబాహో = మహాబాహూ ! తపస్యతా = తపస్సుచేయుచున్న వానిచేత, సర్వే = సమస్తమైన, లోకాః = లోకములు, వినిర్జితాః = జయించ బడినవి. సః=ఆ, ధర్మాత్మా=ధర్మాత్ముడైన వృత్రుడు, బలవాన్=బలవంతుడు. ఏనమ్ = వీనిని, శాసితుమ్ = శాసించుటకు, న శక్ష్యామి = సమర్థుడను కాను.

తా. మహాబాహూ ! తపస్సు చేయుచున్న ఆ వృత్రుడు అన్ని లోకాలను జయించినాడు. ధర్మాత్ముడైన అతడు చాలా బలవంతుడు. నేను ఆతనిని శాసించ జాలను. 12

మూ. యద్యసౌ తప ఆతిష్ఠేద్భూయ ఏవ సురేశ్వర,
యావల్లోకా ధరిష్యన్తి తావదస్య వశానుగాః. 13

ప్ర. అ. సురేశ్వర = దేవతల అధిపతీ! అసౌ=ఇతడు, భూయః ఏవ = ఇంకను, తపః = తపస్సును, ఆతిష్ఠేత్ యది = చేసినట్లయితే, లోకాః = లోక ములు, యావత్ = ఎంతవరకు, ధరిష్యన్తి = నిలచునో, తావత్ = అంతవరకు, అస్య = వీనికి, వశానుగాః = వశములై ఉండును.

తా. దేవతల ప్రభువైన ఓ ! విష్ణూ ! అతడు ఇంకా తపస్సు చేసినచో ఈ లోకము లున్నంతవరకు ఇతనికి వశములై ఉండును. 13

మూ. తం చైనం పరమోదారముపేక్షసి మహాబలమ్,
క్షణం హి న భవేద్వృత్రః క్రుద్ధే త్వయి సురేశ్వర. 14

ప్ర. అ. సురేశ్వర = దేవతల ఈశ్వరుడా ! మహాబలమ్ = గొప్ప బలము గల, పరమోదారమ్=చాల ఉదారుడైన, తమ్ ఏనమ్ = అట్టి వానిని, ఉపేక్షసి= ఉపేక్షించుచున్నావు. త్వయి = నీవు, క్రుద్ధే = కోపించినవాడవగుచుండగా, వృత్రః = వృత్రుడు, క్షణమ్ = క్షణమును కూడ, న భవేత్ = ఉండడు.

తా. సురాధీశా ! చాల ఉదారస్వభావము గల, మహాబలశాలియైన ఇతనిని ఉపేక్షించుచున్నావు. నీవు కోపించినచో వృత్రుడు క్షణకాలము కూడ ఉండడు కదా. 14

మూ. యదా హి ప్రీతిసంయోగం త్వయా విష్ణో సమాగతః,
తదా ప్రభృతి లోకానాం నాథత్వముపలబ్ధవాన్. 15

ప్ర. అ. విష్ణో = విష్ణూ ! యదా = ఎప్పుడు, త్వయా = నీతో, ప్రీతి సంయోగమ్ = స్నేహమును, సమాగతః = పొందినాడో, తదా ప్రభృతి = అది మొదలు, లోకానామ్ = లోకములకు, నాథత్వమ్ = ప్రభుత్వమును, ఉపలబ్ధవాన్ = పొందినాడు.

తా. విష్ణూ! ఇతనిపై నీకు స్నేహభావము కలిగినప్పటినుండి కూడ ఇతడు లోకములకు ప్రభువైనాడు. 15

మూ. స త్వం ప్రసాదం లోకానాం కురుష్వ సుసమాహితః,
త్వత్కృతేన హి సర్వం స్యాత్ ప్రశాన్తమరుజం జగత్.

ప్ర. అ. సః త్వమ్ = అట్టి నీవు, సుసమాహితః = చాల సావధానచిత్తుడవై, లోకానామ్ = లోకములయొక్క, ప్రసాదమ్ = అనుగ్రహమును, కురుష్వ = చేయుము. త్వత్కృతేన = నీచేత చేయబడిన రక్షణముచేత, జగత్ = జగత్తు, సర్వమ్ = సమస్తమూ, ప్రశాన్తమ్ = శాంతము, అరుజమ్ = బాధలు లేనిది, స్యాత్ హి = అగును.

తా. అట్టి నీవు సావధానచిత్తుడవై లోకములను అనుగ్రహించుము. నీవు చేసిన రక్షణముచేత జగత్తు అంతా ప్రశాంతముగా, బాధారహితమై ఉండునుకదా?

మూ. ఇమేహి సర్వే విష్ణో త్వాం నిరీక్షన్తే దివౌకసః,
వృత్రహాతేన మహతా తేషాం సాహ్యం కురుష్వ హ. 17

ప్ర. అ. విష్ణో = విష్ణూ ! సర్వే = సమస్తమైన, ఇమే = ఈ, దివౌకసః = దేవతలు, త్వామ్ = నిన్ను, నిరీక్షన్తే = ఎదురుచూచుచున్నారు. మహతా = గొప్పదైన, వృత్రహాతేన = వృత్రాసురసంహారముచేత, తేషామ్ = వారికి, సాహ్యమ్ = సాహాయ్యమును, కురుష్వ హ = చేయుము.

తా. విష్ణూ ! దేవత లందరూ నీకొరకు ఎదురుచూచుచున్నారు. గొప్ప వృత్రాసురసంహారము చేసి వారికి సాహాయ్యము చేయుము. 17

మూ. త్వయా హి నిత్యశః సాహ్యం కృతమేషాం మహాత్మనామ్,
అశక్యమిదమన్యేషామగతీనాం గతిర్భవాన్. 18

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
చతురశీతితమః సర్గః.

ప్ర. అ. ("అసహ్యమిదమన్యేషామ్" అను పాఠానికి బదులు "అశక్యమిద మన్యేషామ్"అను ప్రాచ్యపాఠము గ్రహించబడినది). త్వయా=నీచేత, నిత్యశః= ఎల్లప్పుడూ, మహాత్మనామ్=మహాత్ములైన, ఏషామ్=ఈ దేవతలకు, సాహ్యామ్= సాహాయ్యము, కృతమ్=చేయబడినది. అన్యేషామ్ = ఇతరులకు, ఇదమ్=ఇది, అశక్యమ్ = శక్యముకాదు. భవాన్ = నీవు, అగతీనామ్ = గతి లేనివాళ్ళకు, గతిః = గతివి.

తా. మహాత్ములైన ఈ దేవతలకు నీవు నిత్యము సాహాయ్యము చేసినావు. ఇతరు లెవరూ ఈ పని చేయజాలరు. గతి లేనివాళ్ళకు నీవే గతివి. 18

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో ఎనభైనాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చాశీతితమః సర్గః

[ఇంద్రునిలోను వాని వజ్రాయుధములోను విష్ణుతేజస్సు ప్రవేశించుట. ఇంద్రుని వజ్రాయుధముచేత వృత్రాసురుని సంహారము. బ్రహ్మహత్య ఆవహించిన ఇంద్రుడు తమోమయమైన ప్రదేశములోనికి వెళ్లిపోవుట.]

మూ. లక్ష్మణస్య తు తద్వాక్యం శ్రుత్వా శత్రునిబర్హణః,
వృత్రఘాతమశేషేణ కథయేత్యాహ సువ్రత. 1

ప్ర. అ. శత్రునిబర్హణః = శత్రుసంహారకుడైన రాముడు, లక్ష్మణస్య = లక్ష్మణునియొక్క, తత్ వాక్యమ్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, సువ్రత = మంచి వ్రతము కలవాడా! వృత్రఘాతమ్ = వృత్రసంహారమును, అశేషేణ = పూర్తిగా, కథయ = చెప్పుము, ఇతి = అని, ఆహ = పలికెను.

తా. శత్రుసంహారకుడైన రాముడు లక్ష్మణుని మాటలు విని "మంచి వ్రతము కలవాడా! వృత్రసంహారమును పూర్తిగా చెప్పుము" అని పలికెను. 1

మూ. రాఘవేణైవముక్తస్తు సుమిత్రానన్దవర్ధనః,
భూయ ఏవ కథాం దివ్యాం కథయామాస సువ్రతః. 2

ప్ర అ. రాఘవేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, సువ్రతః = మంచి వ్రతములు గల, సుమిత్రానందవర్ధనః = లక్ష్మణుడు, భూయః ఏవ = మరల, దివ్యామ్ = దివ్యమైన, కథామ్ = కథను, కథయామాస = చెప్పెను.

తా. ఉత్తమమైన నియమము గల లక్ష్మణుడు రాముని మాటలు విని మరల దివ్యమైన ఆ కథను చెప్పెను. 2

మూ. సహస్రాక్షవచః శ్రుత్వా సర్వేషాం చ దివౌకసామ్,
విష్ణుర్దేవానువాచేదం సర్వానింద్రపురోగమాన్. 3

ప్ర. అ. విష్ణుః = విష్ణువు, సహస్రాక్షవచః = ఇంద్రుని వచనమును, సర్వేషామ్ = సమస్తమైన, దివౌకసామ్ = దేవతల వచనమును, శ్రుత్వా = విని, ఇన్ద్రపురోగమాన్ = ఇంద్రుడు మొదలుగా గల, సర్వాన్ = అందరినీ గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. విష్ణువు ఇంద్రుని మాటలు, సకలదేవతల మాటలు విని ఇంద్రాది దేవత లందరితో ఇట్లు పలికెను. 3

మూ. పూర్వసౌహృదబద్ధోఽస్మి వృత్రస్య తు మహాత్మనః,
తేన యుష్మత్ప్రియార్థం హి నాహం హన్మి మహాసురమ్.

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన, వృత్రస్య = వృత్రునకు, పూర్వ సౌహృదబద్ధః = వెనుకటి స్నేహముచేత కట్టబడినవాడను, అస్మి = అయి ఉన్నాను. తేన = ఆ కారణముచేత, యుష్మత్ప్రియార్థమ్ = మీ ప్రియముకొరకు మహాసురమ్ = ఆ మహాసురుణ్ణి, అహమ్ = నేను, న హన్మి = చంపను.

తా. నేను మహాత్ముడైన వృత్రాసురునితో పూర్వపు స్నేహముచేత కట్ట బడి ఉన్నాను. అందుచే మీకు ప్రియము చేకూర్చుటకై నేను ఆ మహాసురుణ్ణి చంపజాలను. 4

మూ. అవశ్యం కరణీయం చ భవతాం సుఖముత్తమమ్,
తస్మాదుపాయమాఖ్యాస్యే సహస్రాక్షో వధిష్యతి. 5

ప్ర. అ. భవతామ్ = మీయొక్క, ఉత్తమమ్ = ఉత్తమమైన, సుఖమ్ = సుఖము, అవశ్యమ్ = తప్పక, కరణీయం చ = చేయ దగినది. తస్మాత్ = ఆ కారణమువలన, ఉపాయమ్ = ఉపాయమును, ఆఖ్యాస్యే = చెప్పగలను; సహస్రాక్షః = ఇంద్రుడు, వధిష్యతి = చంపగలడు.

తా. మీకు ఉత్తమమైన సుఖమును తప్పక కల్పించవలెను. అందువలన ఇంద్రుడే ఆతనిని చంపు ఉపాయమును చెప్పెదను. 5

మూ. త్రేధాభూతం కరిష్యామి ఆత్మానం సురసత్తమాః,
తేన వృత్రం సహస్రాక్షో వధిష్యతి న సంశయః. 6

ప్ర. అ. సురసత్తమాః = దేవతాశ్రేష్ఠులారా, ఆత్మానమ్ = నన్ను, త్రేధా = మూడు విధములుగా, కరిష్యామి = చేసెదను. తేన = దానిచేత, సహస్రాక్షః = ఇంద్రుడు, వృత్రమ్ = వృత్రుణ్ణి, వధిష్యతి = చంపగలడు, సంశయః = సంశయము, న = లేదు.

తా. దేవతోత్తములారా! నేను నా స్వరూపమును మూడుగా విభజించెదను. అట్లు చేయుటచే ఇంద్రుడు వృత్రుణ్ణి నిఃసంశయముగా చంపగలడు. 6

మూ. ఏకాంశో వాసవం యాతు ద్వితీయో వజ్రమేవ చ,
తృతీయో భూతలం యాతు తదా వృత్రం హనిష్యతి. 7

ప్ర. అ. ఏకాంశః = ఒక అంశ, వాసవమ్ = దేవేంద్రుణ్ణి, యాతు = పొందుగాక. ద్వితీయః = రెండవది, వజ్రమ్ ఏవ చ = వజ్రాయుధమును పొందుగాక. తృతీయః = మూడవది, భూతలమ్ = భూతలమును, యాతు = పొందుగాక. తదా = అప్పుడు, వృత్రమ్ = వృత్రుణ్ణి, హనిష్యతి = చంపగలడు.

తా. ఒక అంశ ఇంద్రుణ్ణి, రెండవది వజ్రాయుధమును, మూడవది భూమిని పొందును. అప్పుడు ఇంద్రుడు వృత్రుణ్ణి చంపగలడు. 7

మూ. తథా బ్రువతి దేవేశే దేవా వాక్యమథాబ్రువన్,
ఏవమేతన్న సందేహో యథా వదసి దైత్యహన్. 8

ప్ర. అ. దేవేశే = విష్ణువు, తథా = అట్లు, బ్రువతి = పలుకుచుండగా, అథ = అటుపిమ్మట, దేవాః = దేవతలు, వాక్యమ్ = వాక్యమును, ఆబ్రువన్ = పలికిరి. దైత్యహన్ = దైత్యులను సంహరించినవాడా! యథా = ఎట్లు, వదసి = పలుకుచున్నావో, ఏతత్ = ఇది, ఏవమ్ = ఇట్లే, సందేహః = సందేహము, న = లేదు.

తా. విష్ణుపు మాటలు విని దేవతలు ఇట్లు పలికిరి. "దైత్యసంహారకా! నీవు ఎట్లు చెప్పుచున్నావో అట్లే; సందేహము లేదు." 8

మూ. భద్రం తేఽస్తు గమిష్యామో వృత్రాసురవధైషిణః,
భజస్వ పరమోదార వాసవం స్వేన తేజసా. 9

ప్ర. అ. తే = నీకు, భద్రమ్ = మంగళము, అస్తు = అగుగాక. పరమోదార = చాల ఉదారుడా! వృత్రాసురవధైషిణః = వృత్రాసురుని వధను కోరుచున్న మేము, గమిష్యామః = వెళ్లెదము, స్వేన = నీసంబంధమైన, తేజసా = తేజస్సుతో, వాసవమ్ = ఇంద్రుణ్ణి, భజస్వ = పొందుము.

తా. చాల ఔదార్యము గలవాడా! నీకు క్షేమ మగుగాక. వృత్రాసురుని సంహారమును కోరుచున్న మేము వెళ్లెదము. నీవు నీ తేజస్సును ఇంద్రునిలో ప్రవేశ పెట్టుము. 9

మూ. తతః సర్వే మహాత్మానః సహస్రాక్షపురోగమాః,
తదరణ్యముపాక్రామన్ యత్ర వృత్రో మహాసురః. 10

ప్ర. అ. "తతః = అటుపిమ్మట, సహస్రాక్షపురోగమాః = ఇంద్రుడు మొదలైన, మహాత్మానః = మహాత్ములు, మహాసురః = మహాసురుడైన, వృత్రః = వృత్రుడు, యత్ర = ఎక్కడ ఉన్నాడో, తత్ = ఆ, అరణ్యమ్ = అరణ్యమును గూర్చి, ఉపాక్రామన్ = వెళ్ళిరి.

తా. పిమ్మట మహాత్ములైన ఇంద్రాదిదేవతలు వృత్రాసురు డున్న మహారణ్యమునకు వెళ్ళిరి.

మూ. తేఽపశ్యంస్తేజసా భూతం తపన్తమసురోత్తమమ్,
పిబన్తమివ లోకాంస్త్రీన్ నిర్దహన్తమివామ్బరమ్. 11

ప్ర అ. తే = ఆ దేవతలు, తేజసా = తేజస్సుతో, భూతమ్ = వ్యాపించబడినవాడు, తపన్తమ్ = తపస్సు చేయుచున్నవాడు, త్రీన్ = మూడు, లోకాన్ = లోకములను, పిబన్తమ్ ఇవ = త్రాగుచున్నట్లు ఉన్నవాడు, అమ్బరమ్ = ఆకాశమును, నిర్దహన్తమ్ ఇవ = కాల్చుచున్నట్లు ఉన్నవాడు అయిన, అసురోత్తమమ్ = ఆ మహాసురుణ్ణి, అపశ్యన్ = చూచిరి.

తా. ఆ దేవతలు తపస్సు చేయుచున్న, తేజస్సుతో నిండిన ఆ మహా

సురుణ్ణి చూచిరి, అతడు మూడు లోకాలను త్రాగుచున్నాడా అన్నట్లు, ఆకాశమును కాల్చివేయుచున్నాడా అన్నట్లు ఉండెను. 11

మూ. దృష్ట్వైవ చాసురశ్రేష్ఠం దేవాస్త్రాసముపాగమన్,
కథమేనం వధిష్యామః కథం న స్యాత్పరాజయః 12

ప్ర. అ. అసురశ్రేష్ఠమ్=అసురశ్రేష్ఠుణి, దృష్ట్వైవ=చూడగానే, దేవాః=దేవతలు, త్రాసమ్=భయమును, ఉపాగమన్=పొందిరి. ఏనమ్=వీనిని, కథమ్=ఎట్లు, వధిష్యామః=చంపెదము? పరాజయః=పరాజయము, కథమ్=ఎట్లు, న స్యాత్=రాకుండును?

తా. ఆ వృత్రాసురుణ్ణి చూడగానే దేవతలు - "ఇతనిని ఎట్లు చంపగలము; మనకు పరాజయము రాకుండుటకు ఉపాయ మేమి?" అని ఆలోచించుచు భయపడిరి. 12

మూ తేషాం చిన్తయతాం తత్ర సహస్రాక్షః పురందరః,
వజ్రం ప్రగృహ్య పాణిభ్యాం ప్రాహిణోద్వృత్రమూర్ధని.

ప్ర. అ. తత్ర=అక్కడ, తేషామ్=వాళ్లు, చిన్తయతామ్=ఆలోచించుచుండగా, సహస్రాక్షః=వేయి నేత్రములు గల, పురందరః=దేవేంద్రుడు, పాణిభ్యామ్=రెండు బాహువులచేత, వజ్రమ్=వజ్రమును, ప్రగృహ్య=గ్రహించి, వృత్రమూర్ధని=వృత్రాసురుని శిరస్సుమీద, ప్రాహిణోత్=పంపెను.

తా. వాళ్లు అక్కడ ఆ విధముగా ఆలోచించుచుండగా దేవేంద్రుడు వజ్రాయుధమును రెండు చేతులతో పట్టుకొని వృత్రాసురుని శిరస్సుపై ప్రయోగించెను. 13

మూ. కాలాగ్నినేవ ఘోరేణ దీప్తేనేవ మహార్చిషా,
పతతా వృత్రశిరసా జగత్త్రాసముపాగమత్. 14

ప్ర. అ. ఘోరేణ=భయంకరమైన, కాలాగ్నినేవ=ప్రళయకాలాగ్ని చేత వలె, దీప్తేన=మండుచున్న, మహార్చిషా ఇవ=గొప్ప జ్వాలచేత వలె,

పతతా = పడుచున్న, వృత్రశిరసా = వృత్రాసురుని శిరస్సుచేత, జగత్ = జగత్తు, త్రాసమ్ = భయమును, ఉపాగమత్ = పొందెను.

తా. భయంకరమైన కాలాగ్ని వలె, మండుచున్న గొప్ప అగ్నిజ్వాల వలె వృత్రుని శిరస్సు క్రింద పడుచుండగా జగత్తు భయము చెందెను. 14

మూ. అసంభావ్యం వధం తస్య వృత్రస్య విబుధాధిపః,
చిన్తయానో జగామాశు లోకస్యాన్తం మహాయశాః. 15

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గల, విబుధాధిపః = ఇంద్రుడు, తస్య వృత్రస్య = ఆ వృత్రునియొక్క, వధమ్ = వధను, అసంభావ్యమ్ = ఊహింప శక్యము కానిదానినిగా, చిన్తయానః = ఆలోచించుచు, ఆశు = శీఘ్రముగా, లోకస్య = లోకముయొక్క, అన్తమ్ = చివరి ప్రదేశమును గూర్చి, జగామ = వెళ్ళెను.

తా. గొప్ప కీర్తి గల దేవేంద్రుడు ఆ వృత్రాసురుడు చచ్చుట ఊహింప శక్యముకానిది అని తలచి వెంటనే లోకముల చివరి దేశమునకు వెళ్ళిపోయెను.

మూ. తమిన్ద్రం బ్రహ్మహత్యాశు గచ్ఛన్తమనుగచ్ఛతి,
అపతచ్చాస్య గాత్రేషు తమిన్ద్రం దుఃఖమావిశత్. 16

ప్ర. అ. గచ్ఛన్తమ్ = వెళ్లుచున్న, తమ్ ఇన్ద్రమ్ = ఆ ఇంద్రుణ్ణి, ఆశు = శీఘ్రముగా, బ్రహ్మహత్యా = బ్రహ్మహత్య, అనుగచ్ఛతి = అనుసరించినది. అస్య = వీనియొక్క, గాత్రేషు = అవయవములమీద, అపతత్ చ = పడెను. తమ్ ఇన్ద్రమ్ = ఆ ఇంద్రుణ్ణి దుఃఖమ్ = దుఃఖము, ఆవిశత్ = ప్రవేశించెను.

తా. ఆతడు పారిపోవుచుండగా వెంటనే ఆతనిని బ్రహ్మహత్య వెంబడించి ఆతని అవయవములలో ప్రవేశించెను. అప్పుడు ఇంద్రుడు దుఃఖాక్రాంతుడయ్యెను.

మూ. హతారయః ప్రణష్టేన్ద్రా దేవాః సాగ్నిపురోగమాః,
విష్ణుం త్రిభువనేశానం ముహుర్ముహురపూజయన్. 17

ప్ర. అ. హతారయః = చంపబడిన శత్రువులు గల, ప్రణష్టేన్ద్రాః = కనబడకుండ పోయిన ఇంద్రుడు గల, సాగ్నిపురోగమాః = ముందు ఉన్న

అగ్నితో కూడిన, దేవాః = దేవతలు, త్రిభువనేశానమ్ = మూడు లోకములకు ప్రభువైన, విష్ణుమ్ = విష్ణువును, ముహుః ముహుః = మాటిమాటికి, అపూజయన్ = పూజించిరి.

తా. శత్రువును చంపి ఇంద్రుడు కనబడకుండ పోయిన పిమ్మట అగ్ని మొదలైన దేవతలు మూడు లోకములకు ప్రభువైన విష్ణువును మాటిమాటికి పూజించిరి. 17

మూ. త్వం గతిః పరమేశాన పూర్వజో జగతః పితా,
రక్షార్థం సర్వభూతానాం విష్ణుత్వముపజగ్మివాన్. 18

ప్ర. అ. ఈశాన = ప్రభూ! త్వమ్ = నీవు, పరమా = గొప్ప, గతిః = గతివి. పూర్వజః = పూర్వమునందు పుట్టిన, జగతః = జగత్తుయొక్క, పితా = తండ్రివి. సర్వభూతానామ్ = సమస్తప్రాణులయొక్క, రక్షార్థమ్ = రక్షకొరకు, విష్ణుత్వమ్ = విష్ణుత్వమును, ఉపజగ్మివాన్ = పొందినావు.

తా. ప్రభూ! నీవే ఉత్తమమైన గతివి. అన్నింటికంటెను పూర్వము ఉన్న జగత్పితవు. సకలభూతలరక్షణముకొరకై విష్ణువు అయినావు. 18

మూ. హతశ్చాయం త్వయా వృత్రో బ్రహ్మహత్యా చ వాసవమ్,
బాధతే సురశార్దూల మోక్షం తస్య వినిర్దిశ. 19

ప్ర. అ. సురశార్దూల = దేవశ్రేష్ఠా! త్వయా = నీచేత, అయం వృత్రః = ఈ వృత్రుడు, హతః చ = చంపబడినాడు. బ్రహ్మహత్యా చ = బ్రహ్మహత్య, వాసవమ్ = ఇంద్రుణ్ణి, బాధతే = బాధించుచున్నది. తస్య = వానికి, మోక్షమ్ = మోక్షమును, వినిర్దిశ = చూపుము.

తా. దేవతాశ్రేష్ఠుడా! నీవు వృత్రాసురుణ్ణి చంపినావు. బ్రహ్మహత్య ఇంద్రుణ్ణి బాధించుచున్నది. ఆతనికి దానినుండి విడుదలను ఇమ్ము. 19

మూ. తేషాం తద్వచనం శ్రుత్వా దేవానాం విష్ణురబ్రవీత్,
మామేవ యజతాం శక్రః పావయిష్యామి వజ్రిణమ్. 20

ప్ర. అ. తేషాం దేవానామ్ = ఆ దేవతలయొక్క, తత్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, విష్ణుః = విష్ణువు, అబ్రవీత్ = పలికెను. శక్రః =

ఇంద్రుడు, మామ్ ఏవ = నన్నే, యజతామే = పూజించుగాక. వ్రజిణమ్ = ఇంద్రుణ్ణి, పావయిష్యామి = పవిత్రంపచేసెదను.

తా. ఆ దేవతల మాటలు విని విష్ణువు ఇట్లు పలికెను. "ఇంద్రుడు నన్నే పూజించినచో నేను ఆతనిని పవిత్రుని చేసెదను". 20

మూ. పుణ్యేన హయమేధేన మామిష్ట్వా పాకశాసనః,
పునరేష్యతి దేవానామింద్రత్వమకుతోభయః. 21

ప్ర అ. పాకశాసనః = ఇంద్రుడు, పుణ్యేన = పుణ్యమైన, హయమేధేన = అశ్వమేధముచేత, మామ్ = నన్ను, ఇష్ట్వా = పూజించి, అకుతోభయః = ఎక్కడినుండీ భయము లేనివాడై, పునః = మరల, దేవానామ్ = దేవతలకు, ఇంద్రత్వమ్ = ప్రభుత్వమును, ఏష్యతి = పొందగలడు.

తా. ఇంద్రుడు పుణ్యమైన అశ్వమేధయాగముచేత నన్నే పూజించినచో ఎట్టి భయమూ లేనివాడై మరల దేవేంద్రత్వమును పొందగలడు. 21

మూ. ఏవం సందిశ్య తాం వాణీం దేవానాం చామృతోపమామ్,
జగామ విష్ణుర్దేవేశః స్తూయమానస్త్రివిష్టపమ్. 22

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
పఞ్చాశీతితమః సర్గః.

ప్ర. అ. దేవేశః = దేవతలప్రభువైన, విష్ణుః = విష్ణువు, ఏవమ్ = ఇట్లు, అమృతోపమామ్ = అమృతముతో సమానమైన, తాం వాణీమ్ = ఆ వాక్కును, దేవానామ్ = దేవతలకు, సందిశ్య = ఇచ్చి, స్తూయమానః = స్తుతింపబడుచు, త్రివిష్టపమ్ = స్వర్గమును గూర్చి, జగామ = వెళ్లెను.

తా. దేవతల ప్రభువైన విష్ణువు ఈ విధముగా అమృతము వంటి ఆ వాక్కును దేవతలకు వినిపించి, వాళ్లు స్తుతించుచుండగా స్వర్గమునకు వెళ్లెను. 22

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో ఎనభైఐదవ సర్గ సమాప్తము.

అథ షడశీతితమః సర్గః.

[ఇంద్రుడు లేకపోవుటచే జగత్తులో అశాంతి పెరుగుట. ఇంద్రుడు అశ్వామేధము చేసి బ్రహ్మహత్యానుండి విముక్తుడగుట.]

మూ. తదా వృత్రవధం సర్వమఖిలేన స లక్ష్మణః,
కథయిత్వా నరశ్రేష్ఠః కథాశేషం ప్రచక్రమే. 1

ప్ర. అ. తదా = అప్పుడు, సః లక్ష్మణః = ఆ లక్ష్మణుడు, సర్వమ్ = సమస్తమైన, వృత్రవధమ్ = వృత్రాసురవధను, అఖిలేన = పూర్తిగా, కథయిత్వా = చెప్పి, నరశ్రేష్ఠః = ఆ నరశ్రేష్ఠుడు, కథాశేషమ్ = కథయొక్కశేషమును, ప్రచక్రమే = ప్రారంభించెను.

తా. నరులలో శ్రేష్ఠుడైన ఆ లక్ష్మణుడు అప్పుడు వృత్రాసురవధను పూర్తిగా చెప్పి మిగిలిన కథను ప్రారంభించెను. 1

మూ. తతో హతే మహావీర్యే వృత్రే దేవభయంకరే,
బ్రహ్మహత్యావృతః శక్రః సంజ్ఞాం లేభే న వృత్రహా. 2

ప్ర. అ. తతః = ఆటుపిమ్మట, మహావీర్యే = గొప్ప పరాక్రమము గల, దేవభయంకరే = దేవతలకు భయమును కలిగించు, వృత్రే = వృత్రుడు, హతే = చంపబడిన వాడగుచుండగా, వృత్రహా = వృత్రుణ్ణి చంపిన, శక్రః = ఇంద్రుడు, బ్రహ్మహత్యాయుతః = బ్రహ్మహత్యతో కూడినవాడై, సంజ్ఞామ్ = సంజ్ఞను, న లేభే = పొందలేదు.

తా. గొప్ప పరాక్రమము గల వృత్రాసురుణ్ణి సంహరించిన పిదప ఇంద్రుడు బ్రహ్మహత్యాపాపముచేత స్పృహ కోల్పోయెను. 2

మూ. సోఽన్తమాశ్రిత్య లోకానాం నష్టసంజ్ఞో విచేతనః,
కాలం తత్రావసత్ కం చిద్వేష్టమాన ఇవోరగః. 3

ప్ర. అ. సః = అతడు, లోకానామ్ = లోకములయొక్క, అన్తమ్ = అంతమును, ఆశ్రిత్య = ఆశ్రయించి. నష్టసంజ్ఞః = నష్టమైన సంజ్ఞ కలవాడై, విచేతనః = చైతన్యము లేనివాడై, ఉరగః ఇవ = సర్పము వలె, వేష్టమానః = దొర్లుచు, తత్ర = అక్కడ, కంచిత్ = కొంత, కాలమ్ = కాలమును, అవసత్ = నివసించెను.

తా. అతడు లోకముల చివరికి పోయి సంజ్ఞ కోల్పోయి, చైతన్యరహితుడై కొంత కాలము సర్పము వలె దొర్లుచుండెను. 3

మూ. అథ నష్టే సహస్రాక్షే ఉద్విగ్నమభవజ్జగత్,
భూమిశ్చ ధ్వస్తసంకాశా నిఃస్నేహా శుష్కకాననా. 4

ప్ర. అ అథ = అటు పిమ్మట, సహస్రాక్షే = ఇంద్రుడు, నష్టే = కనబడకుండ పోయినవాడగుచుండగా, జగత్ = జగత్తు, ఉద్విగ్నమ్ = ఉద్వేగము చెందినది, అభవత్ = ఆయెను, భూమిః చ = భూమి కూడ, నిఃస్నేహా = చమురు (తడి) లేనిదై, శుష్కకాననా = ఎండిన అడవులు కలదై, ధ్వస్తసంకాశా = నశించి పోయినట్లు అయిపోయెను.

తా. ఇంద్రుడు కనబడకుండ పోగానే జగత్తు దిగులుచెందెను. భూమి కూడ తడి లేక, అడవులు ఎండిపోయి, పాడుపడినట్లు ఉండెను. 4

మూ. నిఃస్రోతసస్తే సర్వే తు హ్రదాశ్చ సరితస్తథా,
సంక్షోభశ్చైవ సత్త్వానామనావృష్టికృతోఽభవత్. 5

ప్ర అ. సర్వే = సమస్తమైన, తే = ఆ, హ్రదాః = చెరువులు, తథా = మరియు, సరితః చ = నదులు, నిఃస్రోతసః = ప్రవాహము లేనివి అయినవి. సత్త్వానామ్ = ప్రాణులకు, అనావృష్టికృతః = అనావృష్టివలన గలుగు, సంక్షోభః చ ఏవ = సంక్షోభము, అభవత్ = ఆయెను.

తా. చెరువులలోను, నదులలోను నీరు ఎండిపోయెను. అనావృష్టివలన ప్రాణులకు గొప్ప సంక్షోభము ఏర్పడెను. 5

మూ. క్షీయమాణే తు లోకేఽస్మిన్ సంభ్రాన్తమనసః సురాః,
యదుక్తం విష్ణునా పూర్వం తం యజ్ఞం సముపానయన్.

ప్ర. అ. అస్మిన్ లోకే = ఈ లోకము, క్షీయమాణే = క్షీణించుచుండగా, సురాః = దేవతలు, సంభ్రాన్తమనసః = భ్రాంతి (భయము) చెందిన మనస్సు గల వారై, పూర్వమ్ = పూర్వము, యత్ = ఏది, ఉక్తమ్ = చెప్పబడినదో, తం యజ్ఞమ్ = ఆ యజ్ఞమును, సముపానయన్ = సమకూర్చిరి.

తా. లోకము ఈ విధముగ క్షీణించుట చూచి దేవతలు దిగులుచెంది పూర్వము విష్ణువు చెప్పిన యజ్ఞమును సమకూర్చిరి. 6

మూ. తతః సర్వే సురగణాః సోపాధ్యాయాః సహర్షిభిః,
తం దేశం సముపాజగ్ముర్యత్రేన్ద్రో భయమోహితః.

ప్ర. తతః = అటుపిమ్మట, సర్వే = సమస్తమైన, సురగణాః = దేవతా గణములు, సోపాధ్యాయాః = ఉపాధ్యాయులతో కూడినవారై, సహర్షిభిః = ఋషులతో కూడ, భయమోహితః = భయముచేత మోహింపచేయబడిన, ఇన్ద్రః = ఇంద్రుడు, యత్ర = ఎక్కడ ఉన్నాడో, తం దేశమ్ = ఆ దేశమును గూర్చి, సముపాజగ్ముః = వచ్చిరి.

తా. పిమ్మట దేవత లందరు ఉపాధ్యాయులతోను, ఋషులతోను కలిసిన వారై, భయముచేత మోహితుడైన ఇంద్రు డున్న చోటికి వెళ్ళిరి. 7

మూ. తే తు దృష్ట్వా సహస్రాక్షమావృతం బ్రహ్మహత్యయా,
తం పురస్కృత్య దేవేశమశ్వమేధం ప్రచక్రిరే. 8

ప్ర. అ. తే = వారు, బ్రహ్మహత్యయా = బ్రహ్మహత్యచేత, ఆవృతమ్ = ఆవరించబడిన, సహస్రాక్షమ్ = ఇంద్రుణ్ణి, దృష్ట్వా = చూచి, దేవేశమ్ = దేవతా ప్రభువైన, తమ్ = ఆ ఇంద్రుణ్ణి, పురస్కృత్య = ముందు ఉంచికొని, అశ్వమేధమ్ = అశ్వమేధమును, ప్రచక్రిరే = చేసిరి.

తా. వారు బ్రహ్మహత్యచేత ఆవరింపబడిన ఇంద్రుణ్ణి చూచి, దేవతా ప్రభువైన ఆతనిని ముందు ఉంచుకొని అశ్వమేధయాగము చేసిరి. 8

మూ. తతోఽశ్వమేధః సుమహాన్ మహేన్ద్రస్య మహాత్మనః,
వవృతే బ్రహ్మహత్యాయాః పావనార్థం నరేశ్వర. 9

ప్ర. అ. నరేశ్వర = రాజా! తతః = అటుపిమ్మట, బ్రహ్మహత్యాయాః = బ్రహ్మహత్యనుండి, పావనార్థమ్ = పవిత్రముచేయుటకై, మహాత్మనః = మహాత్ముడైన, మహేన్ద్రస్య = మహేంద్రునియొక్క, సుమహాన్ = చాల గొప్పదైన, అశ్వమేధః = అశ్వమేధము, వవృతే = జరిగెను.

తా. రాజా! పిమ్మట బ్రహ్మహత్యా పాపమునుండి విముక్తికొరకై మహాత్ముడైన మహేంద్రుని గొప్ప అశ్వమేధము జరిగెను. 9

మూ. తతో యజ్ఞే సమాప్తే తు బ్రహ్మహత్యా మహాత్మనః,
అభిగమ్యాబ్రవీద్వాక్యం క్వ మే స్థానం విధాస్యథ. 10

ప్ర. అ. తతః = అటుపిమ్మట, యజ్ఞే = యజ్ఞము, సమాప్తే = సమాప్తమైన దగుచుండగా, మహాత్మనః = మహాత్మునియొక్క, బ్రహ్మహత్యా = బ్రహ్మహత్య, అభిగమ్య = వచ్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. మే = నాకు, క్వ = ఎక్కడ; స్థానమ్ = స్థానమును; విధాస్యథ = చేసెదరు?

తా. యజ్ఞము సమాప్తమైన పిమ్మట మహాత్ముడైన ఇంద్రుని బ్రహ్మహత్య వారి వద్దకు వచ్చి "నాకు ఎక్కడ స్థానము కల్పించెదరు?"అని ప్రశ్నించెను. 10

మూ. తే తామూచుస్తతో దేవాస్తుష్టాః ప్రీతిసమన్వితాః,
చతుర్ధా విభజాత్మానమాత్మనైవ దురాసదే. 11

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తే దేవాః = ఆ దేవతలు, తుష్టాః = సంతోషించినవారై, ప్రీతిసమన్వితాః = ఆనందముతో కూడినవారై, తామ్ = దానిని గూర్చి, ఊచుః = పలికిరి. దురాసదే = సమీపింప శక్యముకానిదానా! ఆత్మానమ్ = తనను, ఆత్మనైవ = తనచేతనే, చతుర్ధా = నాలుగు భాగములుగా, విభజ = విభజించుము.

తా. అప్పు డా దేవతలు సంతోషించి దానితో ఇట్లు పలికిరి-"సమీపింప శక్యము కాని ఓ! బ్రహ్మహత్యా ! నిన్ను నీవే నాలుగు భాగాలుగా విభజించుకొనుము." 11

మూ. దేవానాం భాషితం శ్రుత్వా బ్రహ్మహత్యా మహాత్మనామ్,
సందధౌ స్థానమన్యత్ర వరయామాస దుర్వసా. 12

ప్ర. అ. బ్రహ్మహత్యా = బ్రహ్మహత్య, మహాత్మనామ్ = మహాత్ములైన, దేవానామ్ = దేవతలయొక్క, భాషితమ్ = మాటను, శ్రుత్వా = విని, సందధౌ = (నాలుగు భాగములు) చేసెను. దుర్వసా = దుఃఖమును కలిగించు నివాసము గల ఆ బ్రహ్మహత్య, అన్యత్ర = మరి యొకచోట, స్థానమ్ = స్థానమును, వరయామాస = వరించెను.

తా. దుఃఖమును కలిగించు నివాసము గల ఆ బ్రహ్మహత్య మహాత్ములైన దేవతల మాటలు విని, ఆ విధముగ నాలుగు భాగములుగా అయి, మరొక చోట నివాసమును కోరెను. 12

మూ. ఏకేనాంశేన వత్స్యామి పూర్ణోదాసు నదీషు వై,
చతురో వార్షికాన్ మాసాన్ దర్పఘ్నీ కామచారిణీ. 13

ప్ర. అ. ఏకేన = ఒక, అంశేన = అంశచేత, పూర్ణోదాసు = పూర్ణమైన ఉదకము గల, నదీషు = నదులయందు, చతురః = నాలుగు, వార్షికాన్ = వర్షకాల సంబంధమైన, మాసాన్ = మాసములను, దర్పఘ్నీ (పాపాత్ముల) దర్పమును తొలగించుచు, కామచారిణీ = స్వేచ్ఛగా సంచరించుచు, వత్స్యామి = నివసించ గలను.

తా. నేను ఒక అంశతో నాలుగు వర్షకాలమాసములలో జలపూర్ణములైన నదులలో, పాపాత్ముల దర్పమును తొలగించుచు, స్వేచ్ఛగా సంచరించుచు, నివసించెదను. 13

మూ. భూమ్యామహం సర్వకాలమేకేనాంశేన సర్వదా,
వసిష్యామి న సన్దేహః సత్యేనైతద్ బ్రవీమి తే. 14

ప్ర. అ. అహమ్ = నేను, ఏకేన = ఒక, అంశేన = అంశచేత, సర్వదా = ఎల్లప్పుడు, సర్వకాలమ్ = అన్ని కాలములయందు, భూమ్యామ్ = చవటనేలమీద, వసిష్యామి = నివసించెదను. ఏతత్ = దీనిని, సత్యేన = సత్యముచేత, తే = నీకు, బ్రవీమి = చెప్పుచున్నాను. సన్దేహః = సందేహము, న = లేదు.

తా. నేను ఒక అంశముచేత ఎల్లప్పుడూ, అన్ని కాలములయందూ కూడ చవటనేలలో నివసించెదను; సందేహము లేదు; సత్యముగా చెప్పుచున్నాను. 14

మూ. యోఽయమంశస్తృతీయో మే స్త్రీషు యౌవనశాలిషు,
త్రిరాత్రం దర్భపూర్ణాసు వసిష్యే దర్భమూతినీ. 15

ప్ర. అ. మే=నాయొక్క, యః = ఏ, అయమ్=ఈ, తృతీయః అంశః= మూడవ అంశము ఉన్నదో దానిచేత, యౌవనశాలిషు = యౌవనముతో ప్రకాశించుచున్న, దర్భపూర్ణాసు = దర్భముతో కూడిన, స్త్రీషు = స్త్రీలయందు, దర్భమూతినీ=దర్భమును తొలగించుదాననై, త్రిరాతమ్=మూడు రోజులు, వసిష్యే= నివసించెదను.

తా. నా మూడవ అంశముచేత యౌవనవతులైన, దర్భము గల స్త్రీలలో వాళ్ళ దర్భమును తొలగించుచు మూడు దివసములు ఉందును. 15

మూ. హన్తారో బ్రాహ్మణాన్యే తు మృషాపూర్వమదూషకాన్,
తాంశ్చతుర్థేన భాగేన సంశ్రయిష్యే సురర్షభాః. 16

ప్ర. అ. సురర్షభాః = దేవతాశ్రేష్ఠులారా ! యే = ఎవరు, అదోషకాన్= దూషించని (అపరాధము లేని), బ్రాహ్మణాన్=బ్రాహ్మణులను, మృషాపూర్వమ్ =వంచనపూర్వకముగా, హన్తారః = చంపువారో, తాన్ = వాళ్ళను, చతుర్థేన భాగేన = నాల్గవ భాగముచేత, సంశ్రయిష్యే = ఆశ్రయించెదను.

తా. దేవతాశ్రేష్ఠులారా ! నాల్గవ భాగముచేత అపరాధము లేని బ్రాహ్మణులను ఎవరు వంచన పూర్వకముగా చంపుదురో వాళ్లను ఆశ్రయించి ఉందును. 16

మూ. ప్రత్యూచుస్తాం తదా దేవా యథా వదసి దుర్వసే,
తథా భవతు తత్సర్వం సాధయస్వ యదీప్సితమ్. 17

ప్ర. అ. దేవాః = దేవతలు, తామ్ = దానిని గూర్చి, తదా = అప్పుడు, ప్రత్యూచుః = తిరిగి పలికిరి. దుర్వసే = దుఃఖమును కలిగించు నివాసము కల దానా ? యథా = ఎట్లు, వదసి = పలుకుచున్నావో, తథా = అట్లు, భవతు = అగుగాక, యత్ = ఏది, ఈప్సితమ్ = ఇష్టమో, తత్ సర్వమ్ = దాని నంతనీ, సాధయస్వ = సాధించుము.

తా. అప్పుడు దేవతలు దానితో ఇట్లనిరి- "ఓ! దుర్వసా ! నీవు చెప్పినట్లే అంతా అగుగాక. నీకు ఎట్లు ఇష్టమో అట్లు చేయుము". 17

మూ. తతః ప్రీత్యాన్వితా దేవాః సహస్రాక్షం వవన్దిరే,
విజ్వరః పూతపాప్మా చ వాసవః సమపద్యత. 18

ప్ర. అ. తతః = అటుపిమ్మట, దేవాః = దేవతలు, ప్రీత్యా = సంతోషముతో, అన్వితాః = కూడినవారై. సహస్రాక్షమ్ = ఇంద్రుణ్ణి, వవన్దిరే = నమస్కరించిరి. వాసవః = ఇంద్రుడు, పూతపాప్మా = పవిత్రముచేయబడిన పాపము కలవాడై, విజ్వరః = బాధలేనివాడు, సమపద్యత = అయ్యేను.

తా. పిమ్మట దేవతలు సంతోషించుచు ఇంద్రునకు నమస్కరించిరి. అతడు కూడ పాపము తొలగి బాధ లేనివాడు అయ్యేను. 18

మూ. ప్రశాన్తం చ జగత్సర్వం సహస్రాక్షే ప్రతిష్ఠితే,
యజ్ఞం చాద్భుతసంకాశం తదా శక్రోఽభ్యపూజయత్.

ప్ర. అ. సహస్రాక్షే = ఇంద్రుడు, ప్రతిష్ఠితే = ప్రతిష్ఠింపబడినవాడగుచుండగా, సర్వమ్ = సమస్తమైన, జగత్ = జగత్తు, ప్రశాన్తమ్ = శాంతించినది. తదా = అప్పుడు, శక్రః = దేవేంద్రుడు, అద్భుత సంకాశమ్ = ఆశ్చర్యకరమైన, యజ్ఞమ్ = యజ్ఞమును, అభ్యపూజయత్ = పూజించెను.

తా. ఇంద్రుడు ప్రతిష్ఠితుడు అయిన వెంటనే జగత్తు అంతా ప్రశాంతమయ్యెను. ఇంద్రుడు అద్భుతమైన ఆ అశ్వమేధయాగమును కొనియాడెను. 19

మూ. ఈదృశో హ్యశ్వమేధస్య ప్రసాదో రఘునన్దన,
యజస్వ సుమహాభాగ హయమేధేన పార్థివ. 20

ప్ర. అ. రఘునన్దన = రామా! అశ్వమేధస్య = అశ్వమేధముయొక్క, ప్రసాదః = అనుగ్రహము, ఈదృశః = ఇట్టిది. సుమహాభాగ = చాల గొప్ప భాగ్యము గలవాడా! పార్థివ = రాజా! హయమేధేన = అశ్వమేధముచేత, యజస్వ = యాగముచేయుము.

తా. రామా! అశ్వమేధము అనుగ్రహము ఇట్టిది. చాల గొప్ప భాగ్యము గల రాజా! అశ్వమేధయాగము చేయుము. 20

మూ. ఇతి లక్ష్మణవాక్యముత్తమం
నృపతిరతీవ మనోహరం మహాత్మా,

పరితోషమవాప హృష్టచేతాః
స నిశమ్యేన్ద్రిసమానవిక్రమౌజాః. 21

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
షడశీతితమః సర్గః.

ప్ర. అ. మహాత్మా = మహాత్ముడు, ఇన్ద్రిసమానవిక్రమౌజాః = ఇంద్రునితో సమానమైన పరాక్రమము తేజస్సు గల, సః నృపతిః = ఆ రాజు, అతీవ = మిక్కిలి, మనోహరమ్ = మనోహరమైన, ఇతి = ఇట్లు, ఉత్తమమ్ = ఉత్తమమైన, లక్ష్మణవాక్యమ్ = లక్ష్మణుని వాక్యమును, నిశమ్య = విని, హృష్టచేతాః = సంతోషించిన చిత్తముకలవాడై, పరితోషమ్ = ఆనందమును, అవాప = పొందెను.

తా. మహాత్ముడు, ఇంద్రునితో సమానమైన పరాక్రమము, తేజస్సు గల ఆ రాజు చాల మనోహరము, ఉత్తమము అయిన లక్ష్మణుని మాట విని సంతోషించెను. 21

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో ఎనబైఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తాశీతితమః సర్గః

[రాముడు లక్ష్మణునకు ఇలోపాఖ్యానము చెప్పుట, ఇలుడు ఒక మాసము పాటు స్త్రీగాను, ఒక మాసము పురుషుడుగాను ఉండుట.]

మూ. తచ్ఛ్రుత్వా లక్ష్మణేనోక్తం వాక్యం వాక్యవిశారదః,
ప్రత్యువాచ మహాతేజాః ప్రహసన్ రాఘవో వచః. 1

ప్ర. అ. లక్ష్మణేన = లక్ష్మణునిచేత, ఉక్తమ్ = చెప్పబడిన, తత్ వాక్యమ్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, వాక్య విశారదః = మాటలలో నేర్పరి అయిన, రాఘవః = రాముడు, ప్రహసన్ = నవ్వుచు, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. లక్ష్మణుని మాటలు విని మాటలలో నేర్పరి, మహాతేజఃశాలి అయిన రాముడు నవ్వుచు ఇట్లు పలికెను. 1

మూ. ఏవమేవ నరశ్రేష్ఠ యథా వదసి లక్ష్మణ,
వృత్రహాతమశేషేణ వాజిమేధఫలం చ యత్. 2

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడా, లక్ష్మణ = లక్ష్మణా ! వృత్ర హాతమ్ = వృత్రాసురవధను, యత్ = ఏ, వాజిమేధఫలం చ = అశ్వమేధఫల మును, అశేషేణ = పూర్తిగా, యథా = ఎట్లు, వదసి = చెప్పుచున్నావో అది, ఏవమ్ ఏవ = అట్లే.

తా. లక్ష్మణా ! నరశ్రేష్ఠా ! వృత్రసంహారమును గూర్చి అశ్వమేధ ఫలమును గూర్చి నీవు చెప్పిన దంతా యథార్థమే. 2

మూ. శ్రూయతే హి పురా సౌమ్య కర్దమస్య ప్రజాపతేః,
పుత్రో వాహ్లీశ్వరః శ్రీమానిలో నామ సుధార్మికః. 3

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! పురా = పూర్వము, కర్దమస్య ప్రజాపతేః = కర్దమప్రజాపతియొక్క, పుత్రః = పుత్రుడు, వాహ్లీశ్వరః = వాహ్లీకదేశరాజు, సుధార్మికః = చాల ధార్మికుడు, శ్రీమాన్ = శ్రీమంతుడూ అయిన, ఇలో నామ = ఇలుడు అనే రాజు, శ్రూయతే హి = వినబడుచున్నాడు కదా ?

తా. సౌమ్యా ! పూర్వము కర్దమప్రజాపతి కుమారుడు, చాల ధార్మికుడు, శ్రీమంతుడు అయిన ఇలుడు అను వాహ్లీదేశరాజు ఉండెడివాడు. 3

మూ. స రాజా పృథివీం సర్వాం వశే కృత్వా మహాయశాః,
రాజ్యం చైవ నరవ్యాఘ్ర పుత్రవత్పర్యపాలయత్. 4

ప్ర. అ. నరవ్యాఘ్ర = నరశ్రేష్ఠుడా ! మహాయశాః = గొప్ప కీర్తి గల, సః రాజా = ఆ రాజు, సర్వామ్ = సమస్తమైన, పృథివీమ్ = భూమిని, వశీ కృత్వా = వశమునం దుంచుకొని, రాజ్యమ్ = రాజ్యమును, పుత్రవత్ = పుత్రుని వలె, పర్యపాలయత్ = పాలించెను.

తా. నరశ్రేష్ఠుడా ! గొప్ప కీర్తి గల ఆ రాజు భూమి నంతను తన వశములో ఉంచుకొని ప్రజలను పుత్రులను వలె పాలించెను. 4

మూ. సురైశ్చ పరమోదారైర్దైతేయైశ్చ మహాధనైః,
నాగరాక్షసగన్ధర్వైర్యక్షైశ్చ సుమహాత్మభిః. 5
పూజ్యతే నిత్యశః సౌమ్య భయార్తై రఘునన్దన,
అబిభ్యంశ్చ త్రయో లోకాః సరోషస్య మహాత్మనః. 6

ప్ర అ. సౌమ్య = సౌమ్యుడా ! రఘునన్దన = లక్ష్మణా ! పరమోదారైః = చాల ఉదారులైన, సురైః చ = దేవతలచేతను, మహాధనైః = గొప్ప ధనము గల, దైతేయైః చ = దైత్యులచేతను, భయార్తైః = భయపీడితులైన, నాగరాక్షస గన్ధర్వైః = నాగ-రాక్షస-గంధర్వులచేతను, సుమహాత్మభిః = మహాత్ములైన, యక్షైః చ = యక్షులచేతను, నిత్యశః = నిత్యమూ, పూజ్యతే = పూజింపబడుచున్నాడు. సరోషస్య = కోపముతో కూడిన, మహాత్మనః = ఆ మహాత్మునకు, త్రయః లోకాః = మూడు లోకములు, అబిభ్యన్ చ = భయపడినవి.

తా. సౌమ్యుడవైన లక్ష్మణా! దేవతలు, మహాధనవంతులైన దైత్యులు, మహాత్ములైన నాగ-రాక్షస-గంధర్వులు, యక్షులూ కూడ భయముతో నిత్యమూ ఇతనిని పూజించుచుండిరి. ఇతనికి రోషము వచ్చినపుడు మూడు లోకాలూ కూడ భయపడుచుండెడివి. 5,6

మూ. స రాజా తాదృశో హ్యాసీద్ధర్మే వీర్యే చ నిష్ఠితః,
బుద్ధ్యా చ పరమోదారో బాహ్లీకేశో మహాయశాః. 7

ప్ర. అ. బాహ్లీకేశః = బాహ్లీకదేశమునకు ప్రభువైన, మహాయశాః = గొప్ప కీర్తి గల, సః = ఆ, రాజా = రాజు, ధర్మే = ధర్మమునందు, వీర్యే చ = పరాక్రమమునందు, తాదృశః = అట్టి, నిష్ఠితః = స్థిరుడుగా, బుద్ధ్యా = బుద్ధిచేత, పరమోదారః = చాల ఉదారుడుగా, ఆసీత్ = ఉండెను.

తా. బాహ్లీకదేశప్రభువు, మహాకీర్తిశాలి అయిన ఆ రాజు ఆ విధముగ ధర్మమునందు, పరాక్రమమునందు స్థిరుడై, చాల ఉదారమైన బుద్ధితో ప్రకాశించుచుండెను. 7

మూ. స ప్రచక్రే మహాబాహుర్మృగయాం రుచిరే వనే,
చైత్రే మనోరమే మాసే సభృత్యబలవాహనః. 8

ప్ర. అ. మహాబాహుః = గొప్ప బాహువులు గల, సః = అతడు, సభృత్య బలవాహనః = భృత్య-సైన్య-వాహనములతో కూడినవాడై, మనోరమే = మనోహర మైన, చైత్రే మాసే = చైత్రమాసమునందు, రుచిరే = సుందరమైన, వనే = వనమునందు, మృగయామ్ = వేటను, ప్రచక్రే = చేసెను.

తా. మహాబాహువైన ఆ రాజు భృత్యులతోను, సైన్యముతోను, వాహనములతోను అందమైన అరణ్యమునకు వెళ్ళి, మనోహరమైన చైత్రమాసమునందు వేటాడెను. 8

మూ. ప్రజఘ్నే స నృపోఽరణ్యే మృగాన్ శతసహస్రశః,
హతైర్వైవ తృప్తిర్నాభూచ్చ రాజ్ఞస్తస్య మహాత్మనః. 9

ప్ర. అ. సః నృపః = ఆ రాజు, అరణ్యే = అరణ్యమునందు, శతసహస్రశః

=వందలకొలది, వేలకొలది, మృగాన్ = మృగములను, ప్రజఘ్నే = చంపెను. హత్వైవ = చంపి కూడ, మహాత్మనః = మహాత్ముడైన, తస్య రాజ్ఞః = ఆ రాజునకు, తృప్తిః = తృప్తి, నాభూత్ చ = కలగలేదు.

తా. ఆ రాజు అరణ్యములో వందలకొలది వేలకొలది మృగములను చంపెను కాని మహాత్ముడైన ఆతనికి తృప్తి కలగలేదు. 9

మూ. నానామృగాణామయుతం వధ్యమానం మహాత్మనా,
యత్ర జాతో మహాసేనస్తం దేశముపచక్రమే. 10

ప్ర అ. మహాత్మనా = ఆ మహాత్మునిచేత, నానామృగాణామ్ = అనేక విధములైన మృగములయొక్క, అయుతమ్ = అయుతము, వధ్యమానమ్=చంపబడుచున్నది (ఆయెను). మహాసేనః = కుమారస్వామి, యత్ర = ఎక్కడ, జాతః = పుట్టినాడో, తం దేశమ్ = ఆ దేశమును గూర్చి, ఉపచక్రమే = వెళ్లెను.

తా. మహాత్ముడైన అతడు అనేకవిధములైన మృగముల అయుతము చంపెను. పిదప అతడు మహాసేనుడు జన్మించిన దేశమునకు వెళ్లెను. 10

మూ. తస్మిన్ ప్రదేశే దేవేశః శైలరాజసుతాం హరః,
రమయామాస దుర్ధర్షః సర్వైరనుచరైః సహ. 11

ప్ర. అ తస్మిన్ = ఆ, ప్రదేశే = ప్రదేశమునందు, దేవేశః = దేవతల ప్రభువు, దుర్ధర్షః = ఎదిరింప శక్యముకానివాడూ అయిన, హరః = ఈశ్వరుడు, సర్వైః = సమస్తమైన, అనుచరైః సహ = అనుచరులతో కూడ, శైలరాజసుతామ్ = పార్వతిని, రమయామాస = విహరింపచేసెను

తా. ఆ ప్రదేశమునందు దేవతల ప్రభువు, ఎదిరింప శక్యము కానివాడూ అయిన శివుడు అనుచరులతో కలిసి, పార్వతిని విహరింపచేయుచుండెను. 11

మూ. కృత్వా స్త్రీరూపమాత్మానముమేశో గోపతిధ్వజః,
దేవ్యాః ప్రియచికీర్షుః సంస్తస్మిన్ పర్వతనిర్ఝరే. 12

ప్ర. అ. గోపతిధ్వజః = వృషభము ధ్వజమునందు గల, ఉమేశః =

శివుడు, దేవ్యాః = దేవికి, ప్రియచికీర్షుః సన్ = ప్రియము చేయదలచినవాడై, ఆత్మానమ్ = తనను, స్త్రీరూపమ్ = స్త్రీరూపము కలవానినిగా చేసికొని, తస్మిన్ = ఆ, పర్వతనిర్ఝరే = పర్వతము నెలయేరునందు ఉండెను.

తా. వృషభధ్వజుడైన ఆ పరమేశ్వరుడు పార్వతికి ప్రియమును చేయ గోరి ఆ పర్వతముపై నున్న నెలయేటిలో స్త్రీరూపమును ధరించి ఉండెను. 12

మూ. యత్ర యత్ర వనోద్దేశే సత్త్వాః పురుషవాదినః,
వృక్షాః పురుషనామానస్తే సర్వే స్త్రీజనాభవన్. 13

ప్ర. అ. యత్ర యత్ర = ఏయే, వనోద్దేశే = వనప్రదేశమునందు, పురుషవాదినః = పురుష లని చెప్పే, సత్త్వాః = జంతువులు గలవో అవి, పురుష నామానః = పురుషుల పేర్లు గల, వృక్షాః = వృక్షము లున్నవో, తే = అవి, సర్వే = అన్నీ, స్త్రీజనాః = స్త్రీజనులుగా, అభవన్ = అయినవి.

తా. ఆ వనప్రాంతమునం దున్న మగ ప్రాణులు, పుంలింగములో ఉన్న చెట్లూ అన్నీ కూడ స్త్రీలుగా మారిపోయిరి. 13

మూ. యచ్చ కించన తత్సర్వం నారీసంజ్ఞం బభూవ హ,
ఏతస్మిన్నన్తరే రాజా స ఇలః కర్దమాత్మజః, 14
నిఘ్నన్ మృగసహస్రాణి తం దేశముపచక్రమే.

ప్ర. అ. యత్ చ కించన = ఏదైతే ఉన్నదో, తత్ = అది, సర్వమ్ = సమస్తమూ, నారీసంజ్ఞమ్ = స్త్రీ సంజ్ఞ కలది, బభూవ హ = అయెను. ఏతస్మిన్ అన్తరే = ఈ మధ్యలో, కర్దమాత్మజః = కర్దముని కుమారుడైన, రాజా = రాజైన, సః ఇలః = ఆ ఇలుడు, మృగసహస్రాణి = మృగముల సహస్రములను, నిఘ్నన్ = కొట్టుచు, తమ్ = ఆ, దేశమ్ = దేశమును గూర్చి, ఉపచక్రమే = వచ్చెను.

తా. అక్కడ నున్న ప్రతి వస్తువూ స్త్రీసంజ్ఞతో మారిపోయెను, ఇంతలో కర్దమ ప్రజాపతి కుమారుడైన ఇలమహారాజు, వేలకొలది మృగములను చంపుచు ఆ ప్రదేశమునకు వచ్చెను. 14

మూ. స దృష్ట్వా స్త్రీకృతం సర్వం సవ్యాలమృగపక్షికమ్, 15
ఆత్మానం స్త్రీకృతం చైవ సానుగం రఘునన్దన,
తస్య దుఃఖం మహచ్చాసీద్దృష్ట్వాత్మానం తథాగతమ్.16

ప్ర. అ. రఘునన్దన = లక్ష్మణా! సః=అతడు, సవ్యాలమృగ పక్షికమ్ = హాతుక మృగములతోను, పక్షులతోను కూడిన, సర్వమ్ = సమస్తమును, స్త్రీ కృతమ్ = స్త్రీగా చేయబడినదానినిగా, దృష్ట్వా = చూచి, సానుగమ్ = అనుచరులతో కూడిన, ఆత్మానం చ ఏవ = తనను కూడ, స్త్రీకృతమ్ = స్త్రీగా చేయబడినవానినిగా (కనుగొనెను). ఆత్మానమ్ = తనను, తథాగతమ్ = అట్లు అయినవానినిగా, దృష్ట్వా = చూచి, తస్య=వానికి, మహత్ = గొప్ప, దుఃఖమ్= దుఃఖము, ఆసీత్ = ఆయెను.

తా. లక్ష్మణా! క్రూరమృగములతో, లేళ్ళతో పక్షులతో సహా సమస్తము స్త్రీల రూపములో మారిపోవుటను చూచి, ఇలుడు తాను, అనుచరులూ కూడ అట్లు మారిపోయినటు గు రించెను. తాను అటు ఆయినందుకు అతనికి చాల దుఃఖము కలిగెను. 15, 16

మూ. ఉమాపతేశ్చ తత్కర్మ జ్ఞాత్వా త్రాసముపాగమత్,
తతో దేవం మహాత్మానం శితికణ్ఠం కపర్దినమ్. 17
జగామ శరణం రాజా సభృత్యబలవాహనః.

ప్ర. అ. తత్ = దానిని, ఉమాపతేః=శివునియొక్క, కర్మ=కర్మనుగా, జ్ఞాత్వా = తెలిసికొని, త్రాసమ్ = భయమును, ఉపాగమత్ = పొందెను. తతః= అటుపిమ్మట, సభృత్యబలవాహనః = భృత్యులతోను, సైన్యముతోను వాహనములతోను కూడిన, రాజా = రాజు, దేవమ్ = దేవుడు, మహాత్మానమ్ = మహాత్ముడు, కపర్దినమ్ = కపర్ద మను జటాజూటము కలవాడు అయిన, శితికణ్ఠమ్ = శివుణ్ణి, శరణం జగామ = శరణు పొందెను. 17

తా. ఆది శివుడు చేసిన పని అని తెలుసుకొని, భయము చెంది, భృత్యులతోను, సైన్యములతోను, వాహనములతోను కూడిన ఆ రాజు జటాజూటధారియైన శివుణ్ణి శరణు పొందెను. 17

మూ. తతః ప్రహస్య వరదః సహ దేవ్యా మహేశ్వరః, 18
ప్రజాపతిసుతం వాక్యమువాచ వరదః స్వయమ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, వరదః = వరముల నిచ్చు, దేవ్యా సహ = దేవితో కలిసి ఉన్న, మహేశ్వరః = మహేశ్వరుడు, ప్రహస్య = నవ్వి, స్వయమ్ = స్వయముగా, వరదః = వరమును ఇచ్చువాడై, ప్రజాపతిసుతమ్ = ప్రజాపతి పుత్రుని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. పిమ్మట దేవీసమేతుడైన మహేశ్వరుడు నవ్వెను. స్వయముగా వరమును ఇవ్వ నున్నవాడై ఇలునితో ఇట్లు పలికెను. 18

మూ. ఉత్తిష్ఠోత్తిష్ఠ రాజర్షే కార్దమేయ మహాబల, 19
పురుషత్వమృతే సౌమ్య వరం వరయ సువ్రత.

ప్ర. అ. కార్దమేయ = కర్దముని పుత్రుడా ! మహాబల = గొప్ప బలము గలవాడా ! రాజర్షే = రాజర్షి ! ఉత్తిష్ఠ ఉత్తిష్ఠ = లెమ్ము లెమ్ము. సౌమ్య = సౌమ్యుడా ! సువ్రత = మంచి వ్రతములు కలవాడా ! పురుషత్వమ్ ఋతే = పురుషత్వము తప్ప, వరమ్ = వరమును, వరయ = కోరుము.

తా. కర్దమపుత్రుడవైన మహాబలశాలివైన రాజర్షీ లెమ్ము లెమ్ము. ఉత్తమ వ్రతములు గల సౌమ్యుడా ! పురుషత్వము తప్ప ఏ వరమైనను కోరుకొనుము.

మూ. తతః స రాజా శోకార్తః ప్రత్యాఖ్యాతో మహాత్మనా, 20
స్త్రీభూతోఽసౌ న జగ్రాహ వరమన్యం సురోత్తమాత్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సః రాజా = ఆ రాజు, మహాత్మనా = మహాత్ముడైన శివునిచేత, ప్రత్యాఖ్యాతః = ప్రత్యాఖ్యానము చేయబడినవాడై, శోకార్తః = శోకార్తు డయ్యెను. స్త్రీభూతః = స్త్రీ అయిన, అసౌ = ఇతడు, సురోత్తమాత్ = సురులలో ఉత్తముడైన ఆ శివునినుండి, అన్యం వరమ్ = మరియొక వరమును, న జగ్రాహ = గ్రహించలేదు.

తా. స్త్రీగా మారిన ఆ రాజు మహాత్ముడైన ఆ శివునిచేత ప్రత్యాఖ్యానింపబడినవాడై, ఆ దేవోత్తమునినుండి మరొక వరమును తీసికొనలేదు. 20

మూ. తతః శోకేన మహతా శైలరాజసుతాం నృపః, 21
ప్రణిపత్య ఉమాం దేవీం సర్వేణైవాన్తరాత్మనా.

ప్ర. అ. తతః = పిమ్మట, మహతా = గొప్పదైన, శోకేన = శోకముతో, నృపః = రాజు, శైలరాజసుతామ్ = హిమవంతుని పుత్రికయైన, ఉమాం దేవీమ్ = ఉమాదేవిని, సర్వేణైవ = సమస్తమైన, అన్తరాత్మనా = మనస్సుతో, ప్రణిపత్య = నమస్కరించి ప్రార్థించెను.

తా. అప్పుడా రాజు చాల శోకముతో శైలరాజు కుమార్తె యైన పార్వతీ దేవికి పరిపూర్ణ భక్తిభావముతో నమస్కరించి ఇట్లు ప్రార్థించెను. 21

మూ. ఈశే వరాణాం వరదే లోకానామసి భామిని, 22
అమోఘదర్శనే దేవి భజ సౌమ్యేన చక్షుషా.

ప్ర. అ. వరాణామ్ = వరములకు, ఈశే = సమర్థురాలా ! భామిని = ఓ ! దేవీ ! లోకానామ్ = లోకములకు, వరదే = వరముల నిచ్చుదానవు, అసి = అయి ఉన్నావు. అమోఘదర్శనే = వ్యర్థము కాని దర్శనముగల, దేవి = దేవీ ! సౌమ్యేన = సౌమ్యమైన, చక్షుషా = నేత్రముతో, భజ = నన్నుపొందుము (చూడుము)

తా. వరము లీయ సమర్థురాలవైన ఓ ! దేవీ ! నీవు లోకములకు వరము లను ఇచ్చెదవు. వ్యర్థము కాని దర్శనము కలదానా ! నన్ను సౌమ్యమైన నేత్ర ముతో చూడుము. 22

మూ. హృద్గతం తస్య రాజర్షేర్విజ్ఞాయ హరసంనిధౌ, 23
ప్రత్యువాచ శుభం వాక్యం దేవీ రుద్రస్య సంమతా.

ప్ర. అ. రుద్రస్య = రుద్రునకు, సంమతా = ప్రియురాలైన, దేవీ = దేవి, హరసంనిధౌ = శివుని సంనిధియందు, తస్య రాజర్షేః = ఆ రాజర్షియొక్క, హృద్గతమ్ = హృదయములో నున్న దానిని, విజ్ఞాయ = తెలిసికొని, శుభమ్ = శుభమైన, వాక్యమ్ = వాక్యమును, ప్రత్యువాచ = బదులుగా పలికెను.

తా. రుద్రుని ప్రియురాలైన ఆ దేవి ఈశ్వరసంనిధిలో ఆ రాజర్షి మన స్సులో ఉన్న అభిప్రాయము తెలిసికొని ఇట్లు పలికెను. 23

మూ. అర్ధస్య దేవో వరదో వరార్ధస్య తవ హ్యహమ్, 24
తస్మాదర్ధం గృహాణ త్వం స్త్రీపుంసోర్యావదిచ్ఛసి.

ప్ర.అ. దేవః = శివుడు, అర్ధస్య = సగమునకు, వరదః = వరము నిచ్చువాడు. తవ = నీయొక్క, వరార్ధస్య = వరముయొక్క అర్ధమునకు ఇచ్చుదానను, అహమ్ = నేను. తస్మాత్ = ఆ కారణమువలన, స్త్రీపుంసోః = స్త్రీపురుషులలో, యావత్ = ఎంత (దేనిని), ఇచ్ఛసి = కోరుచున్నావో, అర్ధమ్ = సగమును, గృహాణ = గ్రహించుము.

తా. నీకు శివుడు సగము వరము నిచ్చును. నేను సగము వరము నిచ్చెదను. అందువలన స్త్రీత్వ పురుషత్వములలో ఏది కావలెనో దానిలోని సగము కోరుకొనుము. 24

మూ. తదద్భుతతరం శ్రుత్వా దేవ్యా వరమనుత్తమమ్, 25
సంప్రహృష్టమనా భూత్వా రాజా వాక్యమథాబ్రవీత్.

ప్ర.అ. దేవ్యాః = దేవియొక్క, అద్భుతతరమ్ = చాల ఆశ్చర్యకరమైన, అనుత్తమమ్ = శ్రేష్ఠమైన, తత్ వరమ్ = ఆ వరమును, శ్రుత్వా = విని, రాజా = రాజు, సంపుహృష్టమనాః = సంతోషించిన మనస్సు గలవాడు, భూత్వా = అయి, అథ = పిమ్మట, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. ఆశ్చర్యకరము, ఉత్తమమూ అయిన దేవి ఇచ్చిన వరమును విని రాజు మనస్సులో సంతోషించుచు ఇట్లు పలికెను. 25

మూ. యది దేవి ప్రసన్నా మే రూపేణాప్రతిమా భువి, 26
మాసం స్త్రీత్వముపాసిత్వా మాసం స్యాం పురుషః పునః.

ప్ర. అ. దేవి = దేవీ! రూపేణ = రూపముచేత, భువి = భూమియందు అప్రతిమా = సాటిలేని నీవు, మే = నాకు, ప్రసన్నా యది = ప్రసన్నురాల వైనచో, మాసమ్ = ఒక మాసమును, స్త్రీత్వమ్ = స్త్రీత్వమును, ఉపాసిత్వా = పొంది, పునః = మరల, మాసమ్ = ఒకమాసము, పురుషః = పురుషుడనుగా, స్యామ్ = అగుదునుగాక.

తా. దేవీ! సౌందర్యములో సాటి లేని నీవు నీ విషయమున ప్రసన్నురాల వైనచో ఒక మాసము స్త్రీత్వమును పొంది, మరల ఒక మాసము పురుషుడను అగుదునుగాక. 26

మూ. ఈప్సితం తస్య విజ్ఞాయ దేవీ సురుచిరాననా, 27
ప్రత్యువాచ శుభం వాక్యమేవమేవ భవిష్యతి.

ప్ర. అ. సురుచిరాననా = చాల సుందరమైన ముఖము గల, దేవీ = దేవి, తస్య = వానియొక్క, ఈప్సితమ్ = కోరికను, విజ్ఞాయ = తెలుసుకొని, శుభమ్ = శుభమైన, వాక్యమ్ = వాక్యమును, ప్రత్యువాచ = తిరిగి పలికెను. ఏవమేవ = ఇట్లే, భవిష్యతి = కాగలదు.

తా. సుందరమైన ముఖము గల ఆ దేవి ఆతని అభిలాషను తెలుసుకొని శుభమైన వాక్యమును పలికెను- "ఇట్లే కాగలదు". 22

మూ. రాజన్ పురుషభూతస్త్వం స్త్రీభావం న స్మరిష్యసి. 28
స్త్రీభూతశ్చ పరం మాసం న స్మరిష్యసి పౌరుషమ్.

ప్ర. అ. రాజన్ = రాజా! పురుషభూతః = పురుషుడవైన, త్వమ్ = నీవు, స్త్రీభావమ్ = స్త్రీత్వమును, న స్మరిష్యసి = స్మరించవు. పరం మాసమ్ = తరువాతి మాసమును, స్త్రీభూతః చ = స్త్రీవి అయి, పౌరుషమ్ = పురుషత్వమును, న స్మరిష్యసి = స్మరించవు.

తా. రాజా! నీవు పురుషుడవుగా ఉన్నప్పుడు స్త్రీత్వమును స్మరించవు. తరువాతి మాసమునందు స్త్రీగా ఉన్నప్పుడు పురుషత్వమును స్మరించవు. 28

మూ. ఏవం స రాజా పురుషో మాసం భూత్వాథ కార్దమిః, 29
త్రైలోక్యసుందరీ నారీ మాసమేకమిలాభవత్,

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
సప్తాశీతితమః సర్గః

ప్ర. అ. కార్దమిః = కర్దమప్రజాపతి పుత్రుడైన, సః రాజా = ఆ రాజు, ఏవమ్ = ఈ విధముగా, మాసమ్ = మాసమును, పురుషః = పురుషుడుగా, భూత్వా

= అయి, ఏకమాసమ్ = ఒక మాసమును, త్రైలోక్యసున్దరీ = మూడు లోకముల లోను సుందరియైన, ఇలా = ఇల అను, నారీ = స్త్రీగా, అభవత్ = ఆయెను.

తా. ఈ విధముగా ఆ ఇలమహారాజు ఒక మాసము పురుషుడుగా అయి మరొక మాసము మూడులోకములలోను సుందరియైన ఇల అను స్త్రీగా అగుచుండెను.

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో ఎనభైఏడవ సర్గ సమాప్తము.

అథ అష్టాశీతితమః సర్గః

[ఇలాబుధుల పరస్పరదర్శనము. ఇలా సహచారిణులకు కింపురుషి అను పేరు పెట్టి బుధుడు వాళ్ళను పర్వతముమీద నివసింపు డని పంపుట].

మూ. తాం కథామైలసంబద్ధాం రామేణ సముదీరితామ్,
లక్ష్మణో భరతశ్చైవ శ్రుత్వా పరమవిస్మితౌ. 1

రామేణ = రామునిచేత, సముదీరితామ్ = పలకబడిన, ఐలసంబద్ధామ్ = ఇలునితో సంబంధించిన, తాం కథామ్ = ఆ కథను, శ్రుత్వా = విని, లక్ష్మణః = లక్ష్మణుడు, భరతః చ ఏవ = భరతుడు, పరమవిస్మితౌ = చాల ఆశ్చర్యపడిరి.

తా. రాముడు చెప్పిన ఇలునికి సంబంధించిన కథను విని లక్ష్మణ భరతులు చాల ఆశ్చర్యము చెందిరి. 1

మూ. తౌ రామం ప్రాఞ్జలీ భూత్వా తస్య రాజ్ఞో మహాత్మనః,
విస్తరం తస్య భావస్య తదా పప్రచ్ఛతుః పునః. 2

ప్ర. అ. తౌ = వారిద్దరూ, ప్రాఞ్జలీ = కట్టబడిన దోసిళ్లు కలవారు, భూత్వా = అయి, మహాత్మనః = మహాత్ముడైన, తస్య రాజ్ఞః = ఆ రాజుయొక్క, తస్య = ఆ, భావస్య = స్త్రీత్వపుంస్త్వభావములయొక్క, విస్తరమ్ = విస్తరమును, పునః = మరల, రామమ్ = రాముణ్ణి, తదా = అప్పుడు, పప్రచ్ఛతుః = ఆడిగిరి.

తా. ఆ లక్ష్మణభరతులు మహాత్ముడైన ఆ రాజుకు కలిగిన స్త్రీత్వపుంస్త్వములను గూర్చిన విస్తరమును నమస్కారపూర్వకముగా రాముణ్ణి మరల ఆడిగిరి. 2

మూ. కథం స రాజా స్త్రీభూతో వర్తయామాస దుర్గతిః,
పురుషః స యదా భూతః కాం వృత్తిం వర్తయత్యసౌ. 3

ప్ర. అ. దుర్గతిః = దుర్గతియైన, స్త్రీభూతః = స్త్రీయైన, సః రాజా = ఆ రాజు, కథమ్ = ఎట్లు, వర్తయామాస = ప్రవర్తించెను ? యదా = ఎప్పుడు, పురుషః భూతః = పురుషు డైనాడో అప్పుడు, అసౌ = ఇతడు, కాం వృత్తిమ్ = ఏ వృత్తిని, వర్తయతి = ప్రవర్తింపచేయుచున్నాడు (చేసెను)?

తా. దుర్గతిని చెందిన ఆ రాజు స్త్రీ అయినప్పుడు ఎట్లు ప్రవర్తించెను? పురుషుడు అయినప్పుడు ఎట్లు ప్రవర్తించెను ? 3

మూ. తయోస్తద్భాషితం శ్రుత్వా కౌతూహలసమన్వితమ్,
కథయామాస కాకుత్స్థస్తస్య రాజ్ఞో యథాగతమ్. 4

ప్ర. అ. కాకుత్స్థః = రాముడు, తయోః = వారిద్దరియొక్క, కౌతూహల సమన్వితమ్ = వేడుకతో కూడిన, తత్ భాషితమ్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, తస్య రాజ్ఞః = ఆ రాజునకు, యథా గతమ్ = ఎట్లు జరిగినదో అట్లు, కథయామాస = చెప్పెను.

తా. కుతూహలముతో వారు అడిగిన ప్రశ్న విని రాముడు ఆ రాజుకు ఏమి జరిగెనో చెప్పెను. 4

మూ. తమేవ ప్రథమం మాసం స్త్రీభూత్వా లోకసున్దరీ,
తాభిః పరివృతా స్త్రీభిర్యేఽస్య పూర్వం పదానుగాః. 5

తత్కాననం విగాహ్యాశు విజహ్రే లోకసున్దరీ,
ద్రుమగుల్మలతాకీర్ణం పద్భ్యాం పద్మదలేక్షణా. 6

ప్ర. అ. తమ్ = ఆ, ప్రథమమ్ = మొదటి, మాసమ్ ఏవ = మాసమునే, లోక సున్దరీ = లోకసుందరియైన, స్త్రీ = స్త్రీగా, భూత్వా = అయి, యే = ఎవరు, పూర్వమ్ = పూర్వము. అస్య = ఈ రాజుయొక్క, పదానుగాః = పదమును అసరించినారో, తాభిః = వారితో, పరివృతా = కూడినది. పద్మదలేక్షణా = పద్మములవంటి నేత్రములు గల, లోకసున్దరీ = లోకసుందరి, ద్రుమగుల్మలతాకీర్ణమ్ = వృక్షములతోను, పొదల తోను, లతలతోను వ్యాకులమైన, తత్ = ఆ, కాననమ్ = అడవిని, పద్భ్యామ్ = పాదములచేత, ఆశు = శీఘ్రముగా, విజహ్రే = విహరించెను.

తా. లోకసుందరియైన స్త్రీగా అయి మొదటిమాసమునందు పూర్వము

ఆ రాజును (తనను) అనుసరించి వచ్చిన స్త్రీలుగా మారినవారితో కూడి ఉండెను. పద్మపత్రముల వంటి నేత్రములు గల ఆ లోకసుందరి వృక్షములతోను, పొదల తోను లతలతోను వ్యాకులమైన ఆ అరణ్యములో పాదాలతోనే విహరించెను. 5,6

మూ. వాహనాని చ సర్వాణి సంత్యక్త్వా వై సమన్తతః,
పర్వతాభోగవివరే తస్మిన్ రేమే ఇలా తదా. 7

ప్ర. అ. తదా = అప్పుడు, ఇలా = ఇల, సర్వాణి = సమస్తమైన, వాహనాని చ = వాహనములను, సంత్యక్త్వా = విడచి, తస్మిన్ = ఆ, పర్వతాభోగవివరే = పర్వతమునకు సంబంధించిన విశాలప్రదేశముయొక్క వివరమునందు, సమన్తతః = అంతటను, రేమే వై = రమించెను.

తా. అప్పుడు ఆ ఇల సమస్తములైన వాహనములను విడచి ఆ పర్వత వివరమునందు అంతటా క్రీడించెను. 7

మూ. అథ తస్మిన్ వనోద్దేశే పర్వతస్యావిదూరతః,
సరః సురుచిరప్రఖ్యం నానాపక్షిగణాయుతమ్. 8

దదర్శ సా ఇలా తస్మిన్ బుధం సోమసుతం తదా,
జ్వలన్తం స్వేన వపుషా పూర్ణం సోమమివోదితమ్. 9

ప్ర. అ. అథ = అటుపిమ్మట, సా ఇలా = ఆ ఇల, తస్మిన్ = ఆ, వనోద్దేశే = వనప్రదేశమునందు, పర్వతస్య = పర్వతముయొక్క, అవిదూరతః = సమీపమునందు, సురుచిరప్రఖ్యమ్ = చాల అందమైన కాంతి గల, నానాపక్షిగణాయుతమ్ = అనేకవిధములైన పక్షిగణములతో కూడిన, సరః = సరస్సును, తస్మిన్ = దానియందు, స్వేన వపుషా = తన శరీరముతో, జ్వలన్తమ్ = ప్రజ్వలించుచున్న, పూర్ణమ్ = పూర్ణమైన, ఉదితమ్ = ఉదయించిన, సోమమ్ ఇవ = చంద్రుడు వలె ఉన్న, సోమసుతమ్ = చంద్రుని పుత్రుడైన, బుధమ్ = బుధుణ్ణి, దదర్శ = చూచెను.

తా. పిమ్మట ఆ వనప్రదేశమునందు పర్వతమునకు సమీపమునందు అనేక విధములైన పక్షుల సముదాయములతో కూడిన చాల సుందరమైన కాంతి గల

సరస్సును; ఆసరస్సులో చంద్రుని కుమారుడైన బుధుణ్ణి ఆఇల చూచెను. అతడు ఉదయించిన పూర్ణచంద్రుడు వలె తన శరీరముతో ప్రజ్వలించుచుండెను. 8,9

మూ. తపన్తం చ తపస్తీవ్రమమ్భోమధ్యే దురాసదమ్,
యశస్కరం కామకరం తారుణ్యే పర్యవస్థితమ్. 10

ప్ర అ. అమ్భోమధ్యే=జలమధ్యమునందు, తీవ్రమ్ = తీవ్రమైన, తపః= తపస్సును, తపన్తమ్ = చేయుచున్నవాడు, దురాసదమ్=సమీపించుటకు శక్యము కానివాడు, యశస్కరమ్ = కీర్తిని చేయువాడు, కామకరమ్ = కోరికలను ఇచ్చువాడు, తరుణ్యే = యౌవనమునందు; పర్యవస్థితమ్=ఉన్నవాడు అయిన, ఆతనిని చూచెను.

తా. బుధుడు జలమధ్యమునందు తీవ్రమైన తపస్సు చేయుచుండెను. ఎదిరింప శక్యము కాని, కీర్తిని ఇచ్చు అతడు మంచి యౌవనములో ఉండెను 10

మూ. సా తం జలాశయం సర్వం క్షోభయామాస విస్మితా,
సహ తైః పూర్వపురుషైః స్త్రీభూతై రఘునన్దన. 11

ప్ర. అ. రఘునన్దన=లక్ష్మణా! లేదా భరతా! స్త్రీభూతైః=స్త్రీలుగా మారిన, తైః పూర్వపురుషైః సహ=పూర్వపురుషులతో కూడ, సా=ఆమె, విస్మితా=ఆశ్చర్యము చెందినదై, సర్వమ్ = సమస్తమైన, తం జలాశయమ్ = ఆ సరస్సును, క్షోభయామాస = క్షోభింపచేసెను

తా. రఘునందనా! ఆమె ఆశ్చర్యము చెందినదై స్త్రీలుగా మారిన ఆ పూర్వపురుషులతో కలిసి ఆ సమస్తమైన సరస్సును క్షోభింపచేసెను. 11

మూ. బుధస్తు తాం సమీక్ష్యైవ కామబాణవశం గతః,
నోపలేభే తదాత్మానం స చచాల తదామ్భసి. 12

ప్ర. అ. బుధః తు = బుధుడైతే, తామ్ = ఆమెను, సమీక్ష్యైవ = చూడగానే, కామబాణవశమ్ = మన్మథబాణముల వశమును, గతః = పొందినవాడై, తదా = అప్పుడు, ఆత్మానమ్=మనస్సును (మనఃస్థైర్యమును)న ఉపలేభే = పొందలేదు. సః = అతడు; తదా = అప్పుడు, అమ్భసి = నీటియందు, చచాల = చలించెను.

తా. బుధుడు ఆమెను చూడగానే మన్మథబాణములకు వశుడై అప్పుడు మనఃస్థైర్యమును పొందలేదు. అతడు అప్పుడు నీటిలో చలించిపోయెను. 12

మూ. ఇలాం నిరీక్షమాణస్తు త్రైలోక్యాదధికాం శుభామ్,
చిన్తయామాస కామార్తః కాన్వియం దేవతాధికా. 13

ప్ర. అ. త్రైలోక్యాత్ = మూడు లోకములకంటె, శుభామ్ = శుభమైన, ఇలామ్ = ఇలను, నిరీక్షమాణః తు = చూచుచు, కామార్తః = కామార్తుడై, చిన్తయామాస = చింతించెను. దేవతాధికా = దేవతకంటె అధికురాలైన, ఇయమ్ = ఈమె, కా ను = ఎవరు?

తా. ఆమూడు లోకములందలిస్త్రీలకంటె సుందరియైన ఇలను చూచుచు, కామార్తుడై అతడు చింతించెను-"దేవతకంటె అధికురాలైన ఈమె ఎవరో?" 13

మూ. న దేవీషు న నాగీషు నాసురీష్వప్సరఃసు చ,
దృష్టపూర్వా మయా కాచిద్రూపేణానేన శోభితా. 14

ప్ర. అ. అనేన = ఈ, రూపేణ = రూపముచేత, శోభితా = శోభింపచేయబడినది, దేవీషు = దేవతాస్త్రీలలో, మయా = నాచేత, న దృష్టపూర్వా = పూర్వము చూడబడలేదు; నాగీషు = నాగస్త్రీలలో, న = చూడబడలేదు. ఆసురీషు = అసురస్త్రీలలోను, అప్సరస్సుచ = అప్సరసలలోనూ కూడ, న = చూడబడలేదు.

తా. ఇట్టి రూపముతో శోభించు స్త్రీని దేవతాస్త్రీలలో గాని, నాగస్త్రీలలో గాని, అసురస్త్రీలలో గాని, అప్సరఃస్త్రీలలో గాని నేను చూడలేదు. 14

మూ. సదృశీయం మమ భవేద్యది నాన్యపరిగ్రహః,
ఇతి బుద్ధిం సమాస్థాయ జలాత్కూలముపాగమత్. 15

ప్ర. అ. ఇయమ్ = ఈమె, అన్యపరిగ్రహః = అన్యుని భార్య, న యది = కాకపోయినచో, మమ = నాకు, సదృశీ = తగినది, భవేత్ = అగును. ఇతి = ఇట్లు, బుద్ధిమ్ = బుద్ధిని, సమాస్థాయ = అవలంబించి, జలాత్ = జలమునుండి, కూలమ్ = తీరమును, ఉపాగమత్ = పొందెను.

తా. "ఈమె ఇతరుని భార్య కాకపోయినచో నాకు తగినది అగును." ఈ విధముగా ఆలోచించి అతడు నీటినుండి ఒడ్డుమీదికి వచ్చెను. 15

మూ. ఆశ్రమం తదుపాగమ్య తతస్తాః ప్రమదోత్తమాః,
శబ్దాపయత ధర్మాత్మా తాశ్చైనం చ వవన్దిరే. 16

ప్ర. అ. ధర్మాత్మా = ఆ ధర్మాత్ముడు, తతః = అటు పిమ్మట, తత్ = ఆ, ఆశ్రమమ్ = ఆశ్రమమును, ఉపాగమ్య = చేరి, తాః = ఆ, ప్రమదోత్తమాః = ఉత్తమస్త్రీలను, శబ్దాపయత = పిలచెను. తాః చ = వాళ్లు కూడ, ఏనమ్ = వీనిని, వవన్దిరే = నమస్కరించిరి.

తా. అతడు ఆ ఆశ్రమము చేరి ఆ ఉత్తమస్త్రీలను పిలచెను. వాళ్ళు కూడ ఇతనికి నమస్కరించిరి. 16

మూ. స తాః పప్రచ్ఛ ధర్మాత్మా కస్యైషా లోకసున్దరీ,
కిమర్థమాగతా చైవ సర్వమాఖ్యాత మా చిరమ్. 17

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, సః = అతడు, తాః = వాళ్ళను, పప్రచ్ఛ = అడిగెను. ఏషా = ఈ, లోకసున్దరీ = త్రిలోకసుందరి, కస్య = ఎవరిది ? కిమర్థమ్ = ఎందుకు, ఆగతా చైవ = వచ్చినది. సర్వమ్ = అంతా, ఆఖ్యాత = చెప్పండి. చిరమ్ = చిరకాలము, మా = వద్దు.

తా. ధర్మాత్ముడైన అతడు వాళ్ళను ప్రశ్నించెను-"త్రిలోకసుందరియైన ఈమె ఎవరిని భార్య ? ఎందుకు వచ్చినది ? అంతా చెప్పండి, ఆలస్యము చేయ వద్దు." 17

మూ. శుభం తు తస్య తద్వాక్యం మధురం మధురాక్షరమ్,
శ్రుత్వా స్త్రియశ్చ తాః సర్వా ఊచుర్మధురయా గిరా. 18

ప్ర. అ. తస్య = ఆతనియొక్క, శుభమ్ = శుభమైన, మధురమ్ = మధుర మైన, మధురాక్షరమ్ = మధురములైన అక్షరములు గల, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, తాః = ఆ, సర్వాః = సమస్తమైన, స్త్రియః = స్త్రీలు, మధురయా = మధురమైన, గిరా = వాక్కుతో, ఊచుః = పలికిరి.

తా. మధురము, మధురములైన అక్షరములు గలదీ ఆయిన ఆతని ఆ మాటలు విని ఆ స్త్రీలు అందరూ మధురమైన వాక్కు-తో ఇట్లు పలికిరి. 18

మూ. అస్మాకమేషా సుశ్రోణీ ప్రభుత్వే వర్తతే సదా,
అపతిః కాననాన్తేషు సహాస్మాభిశ్చరత్యసౌ. 19

ప్ర. అ. సుశ్రోణీ = అందమైన కటిప్రదేశముగల, ఏషా = ఈమె, సదా = ఎల్లప్పుడూ, అస్మాకమ్ = మాయొక్క, ప్రభుత్వే = ప్రభుత్వమునందు, వర్తతే = ఉంటున్నది. అపతిః = భర్తలేని, అసౌ = ఈమె, అస్మాభిః సహ = మాతో కూడ, కాననాన్తేషు = అరణ్యమధ్యములయందు, చరతి = సంచరించుచున్నది.

తా. అందమైన కటిప్రదేశము గల ఈమె ఎల్లప్పుడూ మాపై ఆధిపత్యము వహించి ఉన్నది. వివాహము కాని ఈమె మాతో కలిసి అరణ్యములలో తిరుగుచుండును. 19

మూ. తద్వాక్యమవ్యక్తపదం తాసాం స్త్రీణాం నిశమ్య చ,
విద్యామావర్తనీం పుణ్యామావర్తయతి స ద్విజః. 20

ప్ర. అ. ద్విజః = క్షత్రియుడైన, సః = ఆ బుధుడు, తాసాం స్త్రీణామ్ = ఆ స్త్రీలయొక్క, అవ్యక్తపదమ్ = అస్పష్టములైన పదములు గల తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, పుణ్యామ్ = పుణ్యమైన, ఆవర్తనీమ్ = ఆవర్తని అను, విద్యామ్ = విద్యను, ఆవర్తయతి = ఆవర్తించెను.

తా. అస్పష్టపదములు గల ఆ స్త్రీల వాక్యము విని క్షత్రియుడైన ఆ బుధుడు పవిత్రమైన ఆవర్తని అను విద్యను (తెలియని అర్థమును తెలుసుకొనే శక్తిని కలిగించు మంత్రమును) మనస్సులో జపించెను. 20

మూ. సోఽర్థం విదిత్వా సకలం తస్య రాజ్ఞో యథా తథా,
సర్వా ఏవ స్త్రియస్తాశ్చ బభాషే మునిపుంగవః. 21

ప్ర. అ. సః మునిపుంగవః = ఆ మునిశ్రేష్ఠుడు, తస్య రాజ్ఞః = ఆ రాజాయొక్క, సకలమ్ = సమస్తమైన, అర్థమ్ = విషయమును, యథా తథా = ఉన్నది ఉన్నట్లుగా, విదిత్వా = తెలుసుకొని, సర్వాః ఏవ = సమస్తమైన, వరస్త్రియః = శ్రేష్ఠలైన స్త్రీలను గూర్చి, బభాషే = పలికెను.

తా. ఆ మునిశ్రేష్ఠుడు ఆ రాజునకు సంబంధించిన వృత్తాంతమును అంతనూ యథాతథముగా తెలుసుకొని ఆ ఉత్తమస్త్రీలతో పలికెను. 21

మూ. అత్ర కింపురుషీర్భూత్వా శైలరోధసి వత్స్యథ,
ఆవాసస్తు గిరావస్మిన్ శీఘ్రమేవ విధీయతామ్. 22

ప్ర. అ. అత్ర = ఇక్కడ, శైలరోధసి = శైలము పైభాగమునందు, కింపురుషీభూత్వా = కింపురుషీలుగా అయి, వత్స్యథ = నివసించండి. అస్మిన్ = ఈ, గిరౌ = పర్వతముమీద, శీఘ్రమ్ఏవ = శీఘ్రముగా, ఆవాసః = నివాసము, విధీయతామ్ = చేయబడుగాక.

తా. మీరు ఈ పర్వతము పైభాగమునందు కింపురుషీలుగా అయి నివసించుడు ఈ పర్వతముమీద శీఘ్రముగా నివాసము చేయుడు. 22

మూ. మూలపత్రఫలైః సర్వా వర్తయిష్యథ నిత్యదా,
స్త్రియః కింపురుషాన్నామ భర్తౄన్ సముపలప్స్యథ. 23

ప్ర. అ. స్త్రియః=స్త్రీలారా! సర్వాః=మీరందరూ నిత్యదా=ఎల్లప్పుడు, మూలపత్రఫలైః = మూలములతోను, ఆకులతోను, పండ్లతోను, వర్తయిష్యథ = జీవనము గడపెదరు. కింపురుషాన్ నామ=కింపురుషు లను, భర్తౄన్=భర్తలను, సముపలప్స్యథ = పొందెదరు.

తా. స్త్రీలారా! మీరందరూ నిత్యము మూలములతోను, ఆకులతోను, పండ్లతోను జీవనమును గడపెదరు. కింపురుషులు అను భర్తలను పొందగలరు.

మూ. తాః శ్రుత్వా సోమపుత్రస్య స్త్రియః కింపురుషీకృతాః,
ఉపాసాంచక్రిరే శైలం వధ్వస్తా బహులాస్తదా. 24

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
అష్టాశీతితమః సర్గః.

ప్ర. అ. తాః స్త్రియః = ఆ స్త్రీలు, సోమపుత్రస్య = బుధుని వాక్యమును, శ్రుత్వా=విని, కింపురుషీకృతాః=కింపురుషీలుగా చేయబడినారు. తదా=అప్పుడు,

బహులాః = అనేకలైన, తాఃవధ్వఃఆ స్త్రీల. . లమ్ = పర్వతమును, ఉపాసాం చక్రిరే = ఉపాసించిరి.

తా. ఆ స్త్రీలు బుధుని మాట వినగానే కింపురుషీలుగా అయిరి. ఆ స్త్రీలందరు అప్పుడు ఆ పర్వతముమీదికి వెళ్ళిరి. 24

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో ఎనబైఎనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోననవతితమః సర్గః

[ఇలాబుధులకు పురూరవుడు అను పుత్రుడు పుట్టుట.]

మూ. శ్రుత్వా కింపురుషోత్పత్తిం లక్ష్మణో భరతస్తథా,
ఆశ్చర్యమితి చ బ్రూతాముభౌ రామం జనేశ్వరమ్. 1

ప్ర. అ లక్ష్మణః = లక్ష్మణుడు, తథా = మరియు, భరతః = భరతుడు, ఉభౌ = ఇద్దరూ, కింపురుషోత్పత్తిమ్ = కింపురుషుల ఉత్పత్తిని, శ్రుత్వా = విని, జనేశ్వరమ్ = రాజైన, రామమ్ = రాముణ్ణి గూర్చి, ఆశ్చర్యమ్ ఇతి = చాల ఆశ్చర్యము అని, బ్రూతామ్ = పలికిరి.

తా. లక్ష్మణభరతు లిద్దరూ కింపురుషుల ఉత్పత్తిని గూర్చి విని రాజైన రామునితో "ఇది చాల ఆశ్చర్యకరము"అని పలికిరి. 1

మూ. అథ రామః కథామేతాం భూయ ఏవ మహాయశాః,
కథయామాస ధర్మాత్మా ప్రజాపతిసుతస్య వై. 2

ప్ర. అ. అథ=అటుపిమ్మట, మహాయశాః=గొప్ప కీర్తి గల, ధర్మాత్మా = ధర్మాత్ముడైన, రామః = రాముడు, ప్రజాపతిసుతస్య=ఇలునియొక్క, ఏతాం కథామ్ = ఈ కథను, భూయః ఏవ = మరల, కథయామాస = చెప్పెను.

తా. ధర్మాత్ముడు, మహాకీర్తిమంతుడు అయిన రాముడు మరల ఇలుని కథను చెప్పెను. 2

మూ. సర్వాస్తా విహృతా దృష్ట్వా కింనరీర్ఋషిసత్తమః,
ఉవాచ రూపసంపన్నాం తాం స్త్రియం ప్రహసన్నివ. 3

ప్ర. అ. ఋషిసత్తమః = ఋషిశ్రేష్ఠుడైన బుధుడు, విహృతాః = విహరించు చున్న, సర్వాః = సమస్తమైన, తాః కింనరీః=ఆ కింనరస్త్రీలను, దృష్ట్వా = చూచి,

ప్రహసన్నివ=నవ్వుచు. రూపసంపన్నామ్=మంచి రూపము గల, తాం స్త్రియమ్=ఆ స్త్రీని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. బుధుడు ఆ కింనరస్త్రీ లందరు విహరించుట చూచి మంచి సౌందర్యము గల ఆ స్త్రీతో నవ్వుచు ఇట్లు పలికెను. 3

మూ. సోమస్యాహం సుదయితః సుతః సురుచిరాననే,
భజస్వ మాం వరారోహే భక్త్యా స్నిగ్ధేన చక్షుషా. 4

ప్ర. అ. సురుచిరాననే=చాల అందమైన నేత్రములు గలదానా! అహమ్=నేను, సోమస్య = చంద్రునియొక్క, దయితః=ఇష్టుడ నైన, సుతః = పుత్రుడను. వరారోహే = శ్రేష్ఠమైన కటిప్రదేశము గలదానా, మామ్ = నన్ను, స్నిగ్ధేన = స్నేహముతో కూడిన, చక్షుషా = నేత్రముతో, భక్త్యా = భక్తితో, భజస్వ = చేరుము.

తా. ఓ! సుందరవదనా! నేను చంద్రుని ప్రియపుత్రుడను. ఓ! సుందరమైన కటిప్రదేశము కలదానా! నన్ను స్నేహపూర్ణమైన దృష్టితో చూచుచు, భక్తితో చేరుము. 4

మూ. తస్య తద్వచనం శ్రుత్వా శూన్యే స్వజనవర్జితే,
ఇలా సురుచిరప్రఖ్యం ప్రత్యువాచ మహాప్రభమ్. 5

ప్ర. అ. స్వజనవర్జితే = స్వజనముచేత విడువబడిన, శూన్యే = శూన్యప్రదేశమునందు, తస్య = ఆతనియొక్క, తత్ = ఆ, వచనమ్=వచనమును, శ్రుత్వా విని, ఇలా = ఇల, సురుచిరప్రఖ్యమ్=చాల అందమైన కాంతి గల, మహాప్రభమ్ = గొప్ప కాంతి గల ఆతనిని గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. స్వజనులు ఎవరూ లేని ఆ శూన్యప్రదేశమునందు ఆతని మాటలు విని చాల అందమైన గొప్ప కాంతి గల అతనితో ఇల ఇట్లనెను. 5

మూ. అహం కామచరీ సౌమ్య తవాస్మి వశవర్తినీ,
ప్రశాధి మాం సోమసుత యథేచ్ఛసి తథా కురు. 6

ప్ర. అ. సౌమ్య=సౌమ్యుడా! కామచరీ=స్వేచ్ఛగా సంచరించు, అహమ్

= నేను, తవ = నీయొక్క, వశవర్తినీ = వశమునం దున్న దానను, అస్మి = అయి ఉన్నాను. సోమసుత = చంద్రుని పుత్రుడా! మామ్ = నన్ను, ప్రభాధి = ఆజ్ఞాపించుము. యథా = ఎట్లు, ఇచ్ఛసి = కోరుచున్నావో, తథా = అట్లు, కురు = చేయుము.

తా. సౌమ్యుడా! స్వేచ్ఛగా సంచరించు నేను నీకు వశురాల నైతిని. చంద్రపుత్రా! నన్ను ఆజ్ఞాపించుము. నీకు ఎట్లు ఎష్టమో అట్లు చేయుము. 6

మూ. తస్యాస్తదద్భుతప్రఖ్యం శ్రుత్వా హర్షముపాగతః,
స వై కామీ సహ తయా రేమే చన్ద్రిమసః సుతః. 7

ప్ర. అ. కామీ = కాముకుడైన, సః = ఆ, చన్ద్రిమసః సుతః = చంద్రుని కుమారుడు, తస్యాః = ఆమెయొక్క, అద్భుతప్రఖ్యమ్ = ఆశ్చర్యకరమైన, తత్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, హర్షమ్ = సంతోషమును, ఉపాగతః = పొందినవాడై, తయా సహ = ఆమెతో కూడ, రేమే = రమించెను.

తా. కాముకుడైన ఆ బుధుడు ఆశ్చర్యకరమైన ఆమె మాట విని సంతోషించి ఆమెతో విహరించెను. 7

మూ. బుధస్య మాధవో మాసస్తామిలాం రుచిరాననామ్,
గతో రమయతోఽత్యర్థం క్షణవత్తస్య కామినః. 8

ప్ర. అ. రుచిరాననామ్ = సుందరమైన ముఖము గల, తామ్ = ఆ, ఇలామ్ = ఇలను, అత్యర్థమ్ = మిక్కిలి, రమయతః = క్రీడింపచేయుచున్న, తస్య = ఆ, కామినః = కాముకుడైన, బుధస్య = బుధునికి, మాధవః మాసః = వైశాఖమాసము, క్షణవత్ = క్షణము వలె, గతః = గడిచినది.

తా. సుందరమైన ముఖము గల ఆ ఇలను అధికముగా క్రీడింపచేయుచున్న కాముకుడైన ఆ బుధునకు వైశాఖమాసము ఒక క్షణము వలె గడచిపోయెను. 8

మూ. అథ మాసే తు సంపూర్ణే పూర్ణేన్దుసదృశాననః,
ప్రజాపతిసుతః శ్రీమాన్ శయనే ప్రత్యబుధ్యత. 9

ప్ర. అ. అథ = అటుపిమ్మట, మాసే = మాసము, సంపూర్ణే = సంపూర్ణమైన దగుచుండగా, పూర్ణేన్దుసదృశాననః = పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గల, శ్రీమాన్ = శ్రీమంతుడైన, ప్రజాపతిసుతః = ఇలుడు, శయనే = శయనమునందు, ప్రత్యబుధ్యత = మేల్కొనెను.

తా. మాసము పూర్తిగానే పూర్ణచంద్రుని వంటి ముఖము గల శ్రీమంతుడైన ఇలుడు శయనముమీద మేల్కొనెను. 9

మూ. సోఽపశ్యత్ సోమజం తత్ర తపన్తం సలిలాశయే,
ఊర్ధ్వబాహుం నిరాలమ్బం తం రాజా ప్రత్యభాషత. 10

ప్ర. అ. సః = అతడు. తత్ర = అక్కడ, సలిలాశయే = సరస్సునందు, తపన్తమ్ = తపస్సు చేయుచున్న, ఊర్ధ్వబాహుమ్ = పైకి బాహువులు గల, నిరాలమ్బమ్ = ఆధారములేని, సోమజమ్ = బుధుణ్ణి, అపశ్యత్ = చూచెను. రాజా = రాజు, తం ప్రతి = అతనిని గూర్చి, అభాషత = పలికెను.

తా. ఆ రాజు అక్కడ సరస్సులో చేతులు పైకి ఎత్తి, ఆధార మేమీ లేకుండా నిలచి తపస్సు చేయుచున్న బుధుణ్ణి చూచి ఆతనితో ఇట్లనెను. 10

మూ. భగవన్ పర్వతం దుర్గం ప్రవిష్టోఽస్మి సహానుగః,
న చ పశ్యామి తత్రైన్యం క్వ ను తే మామకా గతాః.

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా! సహానుగః = అనుచరులతో కూడినవాడనై, దుర్గమ్ = ప్రవేశింపశక్యముకాని, పర్వతమ్ = పర్వతమును, ప్రవిష్టః = ప్రవేశించితిని. తత్ = ఆ, సైన్యమ్ = సైన్యమును, న పశ్యామి చ = చూడను. తే = ఆ, మామకాః = నావాళ్ళు, క్వ = ఎక్కడికి, గతాః ను = వెళ్ళినారో!

తా. పూజ్యుడా? అనుచరులతో కలిసి నేను ప్రవేశింపశక్యముకాని పర్వతము మీదికి వచ్చితిని కాని నా సైన్యము కనబడుటలేదు. నా వాళ్ళందరు ఎక్కడికి పోయినారో తెలియదు. 11

మూ. తచ్ఛ్రుత్వా తస్య రాజర్షేర్నష్టసంజ్ఞస్య భాషితమ్,
ప్రత్యువాచ శుభం వాక్యం సాన్త్వయన్ పరయా గిరా.

ప్ర. అ. నష్టసంజ్ఞస్య = నశించిన స్మృతి గల, తస్య రాజర్షేః = ఆ రాజర్షియొక్క, తత్ = ఆ, భాషితమ్ = మాటను, శ్రుత్వా = విని, పరయా = గొప్పదైన, గిరా = వాక్కుతో, సాన్త్వయన్ = ఓదార్చుచు, శుభమ్ = శుభమైన, వాక్యమ్ = వాక్యమును, ప్రత్యువాచ = పలికెను.

తా. స్మృతిని కోల్పోయిన ఆ రాజర్షి మాటలు విని బుధుడు మంచి మాటలతో ఓదార్చుచు శుభమైన వాక్యమును పలికెను. 12

మూ. అశ్మవర్షేణ మహతా భృత్యాస్తే వినిపాతితాః,
త్వం చాశ్రమపదే సుప్తో వాతవర్షభయార్దితః. 13

ప్ర. అ. మహతా = గొప్పదైన, అశ్మవర్షేణ = రాళ్ళ వర్షముచేత, తే భృత్యాః = నీ భృత్యులు, వినిపాతితాః = పడగొట్టబడినారు, వాతవర్షభయార్దితః = గాలివానల భయముచేత పీడితుడవైన, త్వం చ = నీవు, ఆశ్రమపదే = ఆశ్రమమునందు, సుప్తః = నిద్రించినావు.

తా. పెద్ద రాళ్ళ వానకు నీ అనుచరు లందరూ మరణించినారు. నీవు గాలివానలకు భయపడి ఆశ్రమమునకు వచ్చి నిద్రించితివి. 13

మూ. సమాశ్వసిహి భద్రం తే నిర్భయో విగతజ్వరః,
ఫలమూలాశనో వీర నివసేహ యథాసుఖమ్. 14

ప్ర. అ వీర = వీరుడా! సమాశ్వసిహి = ఊరడిల్లుము, తే = నీకు, భద్రమ్ = క్షేమము. నిర్భయః = భయము లేనివాడవై, విగతజ్వరః = పోయిన దుఃఖము కలవాడవై, ఫలమూలాశనః = ఫలములను దుంపలను తినుచు, యథాసుఖమ్ = సుఖముగా, ఇహ = ఇక్కడ, నివస = నివసించుము.

తా. వీరుడా! ఊరడిల్లుము. నీకు క్షేమ మగుగాక. నీవు భయమును దుఃఖమును విడచి, ఫలమూలములను తినుచు సుఖముగా ఇక్కడ నివసించుము.

మూ. స రాజా తేన వాక్యేన ప్రత్యాశ్వస్తో మహామతిః,
ప్రత్యువాచ శుభం వాక్యం దీనో భృత్యజనక్షయాత్. 15

ప్ర. అ. మహామతిః = గొప్ప బుద్ధి గల, సః రాజా = ఆ రాజు, తేన

వాక్యేన = ఆ వాక్యముచేత, ప్రత్యాశ్వస్తః = ఊరడిల్లినవాడై, భృత్యజనక్షయాత్ = భృత్యుల నాశమువలన, దీనః = దీనుడై, శుభమ్ = శుభమైన, వాక్యమ్ = వాక్యమును, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. గొప్ప బుద్ధిగల ఆ రాజు ఆ మాటలకు ఊరడిల్లి భృత్యులు నశించుటచే దీనుడై, శుభమైన వాక్యమును పలికెను. 15

మూ. త్యక్ష్యామ్యహం స్వకం రాజ్యం నాహం భృత్యైర్వినాకృతః,
వర్తయేయం క్షణం బ్రహ్మన్ సమనుజ్ఞాతుమర్హసి. 16

ప్ర. అ. భృత్యైః వినా = భృత్యులు లేనివాడనుగా, కృతః = చేయబడిన అహమ్ = నేను, స్వకమ్ = నా సంబంధమైన, రాజ్యమ్ = రాజ్యమును, త్యక్ష్యామి = విడచెదను, క్షణమ్ = క్షణకాలము కూడ, న వర్తయేయమ్ = ఇచట ఉండను. బ్రహ్మన్ = ఓ! మునీ! అనుజ్ఞాతుమ్ = అనుజ్ఞ ఇచ్చుటకు, అర్హసి = తగి ఉన్నావు.

తా. నా భృత్యులు లేని నా రాజ్యమును విడిచివేసెదను. బ్రాహ్మణోత్తమా! ఇక్కడ క్షణము ఉండను. నాకు వెళ్ళుటకు అనుజ్ఞ ఇమ్ము. 16

మూ. సుతో ధర్మపరో బ్రహ్మన్ జ్యేష్ఠో మమ మహాయశాః,
శశబిన్దురితి ఖ్యాతః స మే రాజ్యం ప్రపత్స్యతే. 17

ప్ర. అ. బ్రహ్మన్ = బ్రాహ్మణా! మమ = నాయొక్క, జ్యేష్ఠః = పెద్ద, సుతః = కుమారుడు, మహాయశాః = గొప్ప కీర్తి కలవాడు, శశబిన్దుః ఇతి = శశబిందువు అని, ఖ్యాతః = ప్రసిద్ధుడు ఉన్నాడు. సః = అతడు, మే రాజ్యమ్ = నా రాజ్యమును, ప్రపత్స్యతే = పొందగలడు.

తా. బ్రాహ్మణా! ధర్మపరుడు, గొప్ప కీర్తి గలవాడు, శశబిందు వను పేరు గలవాడూ అయిన నా జ్యేష్ఠపుత్రుడు రాజ్యమును పొందగలడు. 17

మూ. న హి శక్ష్యామ్యహం హిత్వా భృత్యాన్ దారాన్ సుఖాన్వితాన్,
ప్రతివక్తుం మహాతేజః కించిదప్యశుభం వచః. 18

ప్ర. అ. మహాతేజః = గొప్ప తేజస్సు కలవాడా! అహమ్ = నేను, సుఖా

న్వితాన్ = సుఖములతో కూడిన, భృత్యాన్ = భృత్యులను, దారాన్ = భార్యలను, హిత్వా = విడచి, న హి శక్ష్యామి = ఉండ సమర్థుడను కాను కదా? కించిదపి = ఏమి, అశుభం వచః = అశుభమైన వచనమును, ప్రతివక్తుమ్ = చెప్పుటకు, (నార్హసి = తగవు).

తా. గొప్ప తేజస్సు కలవాడా! నేను సుఖవంతులైన భృత్యులను, భార్యలను విడచి ఉండజాలను. 'ఇక్కడనే ఉండుము' వంటి అశుభవాక్యమును నీవు పలకవద్దు. 18

మూ. తథా బ్రువతి రాజేన్ద్రే బుధః పరమమద్భుతమ్,
సాన్త్వపూర్వమథోవాచ వాసస్తే ఇహ రోచతామ్. 19

ప్ర. అ. రాజేన్ద్రే = ఆ రాజేంద్రుడు, తథా = అట్లు, బ్రువతి = పలుకుచుండగా, అథ = అటుపిమ్మట, బుధః = బుధుడు, సాన్త్వపూర్వమ్ = సాంత్వపూర్వమునందు కలుగునట్లుగా, పరమమ్ = మిక్కిలి, అద్భుతమ్ = ఆశ్చర్యకరమైన వాక్యమును, ఉవాచ = పలికెను. తే = నీకు, ఇహ = ఇక్కడ, వాసః = నివాసము, రోచతామ్ = ఇష్టమగుగాక.

తా. ఆ రాజు అట్లు పలుకుచుండగా బుధుడు అతనిని ఓదార్చుచు చాల అద్భుతమైన వాక్యమును పలికెను- "నీకు ఇక్కడ నివాసము ఇష్ట మగుగాక".

మూ. న సంతాపస్త్వయా కార్యః కార్దమేయ మహాబల,
సంవత్సరోషితస్యేహ కారయిష్యామి తే హితమ్. 20

ప్ర. అ. మహాబల = గొప్ప బలము గలవాడా! కార్దమేయ = కర్దమ ప్రజాపతి పుత్రుడా! త్వయా = నీచేత, సంతాపః = దుఃఖము, న కార్యః = చేయ దగినది కాదు, ఇహ = ఇక్కడ, సంవత్సరోషితస్య = సంవత్సరము ఉన్న, తే = నీకు, హితమ్ = హితమును, కారయిష్యామి = చేసెదను.

తా. మహాబలశాలివైన మహారాజా! నీవు దుఃఖము చెందకుము. ఇక్కడ నీవు ఒక సంవత్సరము ఉన్నచో నీకు హితము చేయించెదను. 20

మూ. తస్య తద్వచనం శ్రుత్వా బుధస్యాక్లిష్టకర్మణః,
వాసాయ విదధే బుద్ధిం యదుక్తం బ్రహ్మవాదినా. 21

ప్ర. అ. అక్లిష్టకర్మణః = క్లేశములేవి పనులు గల, తస్య బుధస్య = ఆ బుదునియొక్క, తత్ వాక్యమ్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, బ్రహ్మవాదినా = వేదవక్తయైన అతనిచేత, యత్ = ఏది, ఉక్తమ్ = చెప్పబడినదో ఆ విధముగా, వాసాయ = నివాసముకొరకు, బుద్ధిమ్ = బుద్ధిని, విదధే = చేసెను.

తా. క్లేశము లేని పనులు చేయు ఆ బుధుడు చెప్పిన మాటలు విని అతడు చెప్పిన విధముగా నివసించుటకు నిశ్చయించుకొనెను. 21

మూ. మాసం స స్త్రీ తదా భూత్వా రమయత్యనిశం శుభా,
మాసం పురుషభావేన ధర్మబుద్ధిం చకార సః. 22

ప్ర. అ. సః = అతడు, మాసమ్ = ఒక మాసమును, శుభా = సుందరియైన, స్త్రీ = స్త్రీగా, భూత్వా = అయి, తదా = అప్పుడు, అనిశమ్ = ఎల్లప్పుడూ, రమయతి = రమింపచేయుచున్నది. సః = అతడు, మాసమ్ = మాసమును, పురుషభావేన = పురుషత్వముతో, ధర్మబుద్ధిమ్ = ధర్మబుద్ధిని, చకార = చేసెను.

తా. ఆ రాజు ఒక మాసము సుందరియైన స్త్రీగా అయి ఆ బుధుణ్ణి రమింపచేసెను. మరొక మాసము పురుషుడుగా అయి ధర్మబుద్ధితో ఉండెను. 22

మూ. తతః సా నవమే మాసి ఇలా సోమసుతాత్సుతమ్,
జనయామాస సుశ్రోణీ పురూరవసమూర్జితమ్. 23

ప్ర. అ. తతః = ఆటుపిమ్మట, సుశ్రోణీ = అందమైన పిరుదులు గల, సా ఇలా = ఆ ఇల, నవమే = తొమ్మిదవ, మాసి = మాసమునందు, సోమసుతాత్ = బుధునివలన, ఊర్జితమ్ = బలవంతుడైన, పురూరవసమ్ = పురూరవుడను, సుతమ్ = కుమారుణ్ణి, జనయామాస = కనెను.

తా. పిమ్మట సుశ్రోణియైన ఆ ఇల తొమ్మిదవ మాసమునందు బుధునివలన గొప్ప బలము గల పురూరవసుడు అను పుత్రుణ్ణి కనెను. 23

మూ. జాతమాత్రే తు సుశ్రోణీ పితుర్హస్తే న్యవేశయత్,
బుధస్య సమవర్ణం చ ఇలాపుత్రం మహాబలమ్. 24

ప్ర. అ. జాతమాత్రే తు = పుట్టగానే, బుధస్య = బుధునకు, సమవర్ణమ్ = సమానమైన వర్ణముగల, మహాబలమ్ = గొప్ప బలము గల, పుత్రమ్ =

పుత్రుణ్ణి, సుశ్రోణీ = అందమైన కటిప్రదేశము గల, ఇలా = ఇల, పితుః = తండ్రి యొక్క, హస్తే = హస్తమునందు, న్యవేశయత్ = ఉంచెను.

తా. అతడు పుట్టగానే సుశ్రోణియైన ఆ ఇల తండ్రితో సమానమైన వర్ణము, గొప్ప బలము గల ఆ పుత్రుణి తండ్రి చేతిలో ఉంచెను. 24

మూ. బుధస్తు పురుషీభూతం స వై సంవత్సరాన్తరమ్,
కథాభీ రమయామాస ధర్మయుక్తాభిరాత్మవాన్. 25

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకోననవతితమః సర్గః.

ప్ర. ఆ. ఆత్మవాన్ = బుద్ధిమంతుడైన, సః బుధస్తుః = ఆ బుధుడైతే, సంవత్సరాన్తరమ్ = సంవత్సరము తరువాత, పురుషీభూతమ్ = పురుషుడైన ఆ రాజును, ధర్మయుక్తాభిః = ధర్మముతో కూడిన, కథాభిః = కథలచేత, రమయామాస = సంతోషపెట్టెను.

తా. బుద్ధిమంతుడైన బుధుడు సంవత్సరానంతరము పురుషుడైన ఆ ఇలుణ్ణి ధర్మసంబద్ధములైన కథలతో ఆనందింపచేసెను. 25

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు,
ఉత్తరకాండలో ఎనభైతొమ్మిదవసర్గ సమాప్తము.

అథ నవతితమః సర్గః

[అశ్వమేధయాగము చేయుటచే ఇలకు పురుషత్వము లభించుట]

మూ. తథోక్తవతి రామే తు తస్య జన్మ తదద్భుతమ్,
ఉవాచ లక్ష్మణో భూయో భరతశ్చ మహాయశాః. 1

ప్ర. అ. అద్భుతమ్ = అద్భుతమైన, తత్ = ఆ, తస్య జన్మ = వాని జన్మను గూర్చి, రామే = రాముడు, తథా = అట్లు, ఉక్తవతి = పలికినవాడగు చుండగా, భూయః = మరల, లక్ష్మణః = లక్ష్మణుడు, ఉవాచ = పలికెను. మహా యశాః = గొప్పకీర్తిగల, భరతః చ = భరతుడుకూడ పలికెను.

తా. రాముడు చెప్పిన ఆ పురూరవుని అద్భుతమైన జన్మను గూర్చి విని లక్ష్మణ భరతులు మరల ఇట్లనిరి. 1

మూ. ఇలా సా సోమపుత్రస్య సంవత్సరమథోషితా,
అకరోత్కిం నరశ్రేష్ఠ తత్త్వం శంసితుమర్హసి. 2

ప్ర. అ. నరశ్రేష్ఠ = మనుష్యులలో శ్రేష్ఠుడా! సోమపుత్రస్య = బుధుని సమీపమునందు, ఉషితా = ఉన్న, సా ఇలా = ఆ ఇల, అథ = అటుపిమ్మట, కిమ్ = ఏమి, అకరోత్ = చేసెను? తత్ = దానిని, త్వమ్ = నీవు, శంసితుమ్ = చెప్పుటకు, అర్హసి = తగి ఉన్నావు..

తా. నరులలో శ్రేష్ఠుడవైన రామా! బుధునివద్ద సంవత్సర కాలము ఉన్న ఇల పిమ్మట ఏమి చేసినదో చెప్పుము. 2

మూ. తయోస్తద్వాక్యమాధుర్యం నిశమ్య పరిపృచ్ఛతోః,
రామః పునరువాచేమాం ప్రజాపతిసుతే కథామ్. 3

ప్ర. అ. రామః = రాముడు, పరిపృచ్ఛతోః = అడుగుచున్న, తయోః = వారిద్దరియొక్క, వాక్యమాధుర్యమ్ = మాధుర్యముతోకూడిన వాక్యమును, నిశమ్య

= విని, పునః ఏవ = మరల, ప్రజాపతిసుతే = ఇలునియందు, ఇమామ్ = ఈ, కథామ్ = కథను, ఉవాచ = పలికెను.

తా. ఈ విధముగా ప్రకాశించుచున్న ఆ ఇద్దరి వాక్యములోనున్న మాధుర్యమును విని, (ఆస్వాదించి), రాముడు ఇలునికి సంబంధించిన కథను మరల ఇట్లు చెప్పెను. 3

మూ. పురుషత్వం గతే శూరే బుధః పరమబుద్ధిమాన్,
సంవర్తం పరమోదారమాజుహావ మహాయశాః. 4

ప్ర. అ. శూరే = శూరుడైన ఇలుడు, పురుషత్వమ్ = పురుషత్వమును, గతే = పొందినవాడగుచుండగా, పరమబుద్ధిమాన్ = గొప్ప బుద్ధిగల, మహాయశాః = గొప్ప కీర్తి గల, బుధః = బుధుడు, పరమోదారమ్ = చాల ఉదారుడైన, సంవర్తమ్ = సంవర్తుణ్ణి, ఆజుహావ = పిలచెను.

తా. ఇలుడు పురుషత్వమును పొందిన పిమ్మట గొప్ప బుద్ధి, కీర్తి గల బుధుడు చాల ఉదారస్వభావము గల సంవర్తుణ్ణి పిలిచెను. 4

మూ. చ్యవనం భృగుపుత్రం చ మునిం చారిష్టనేమినమ్,
ప్రమోదనం మోదకరం తతో దుర్వాససం మునిమ్. 5

ప్ర. అ. భృగుపుత్రమ్ = భృగుపుత్రుడైన, చ్యవనమ్ = చ్యవనుణ్ణి, అరిష్టనేమినమ్ = అరిష్టనేమి అను, మునిం చ = మునిని, మోదకరమ్ = ఆనందమును కలిగించు, ప్రమోదనమ్ = ప్రమోదనుణ్ణి, తతః = అటు పిమ్మట, దుర్వాససమ్ = దుర్వాసు డను, మునిమ్ = మునినీ, (పిలచెను).

తా. భృగుపుత్రుడైన చ్యవనుణ్ణి, అరిష్టనేమిమునిని, ఆనందకరుడైన ప్రమోదనుణ్ణి, దుర్వాసమునిని పిలచెను. 5

మూ. ఏతాన్ సర్వాన్ సమానీయ వాక్యజ్ఞః తత్త్వదర్శనః,
ఉవాచ సర్వాన్ సుహృదో ధైర్యేణ సుసమాహితాన్. 6

ప్ర. అ. వాక్యజ్ఞః = మాటలు ఎరిగిన, తత్త్వదర్శనః = యథార్థమును చూడగలిగిన బుధుడు, ఏతాన్ సర్వాన్ = వీరి నందరినీ, సమానీయ = రప్పించి,

ధైర్యేణ=ధైర్యముచేత, సుసమాహితాన్=బాగా సావధానచిత్తులైన, సుహృదః=మంచి హృదయము గల, సర్వాన్ = వారినందరినీ గూర్చి, ఉవాచ = పలికెను.

తా. మాటలలో నేర్పరి, తత్త్వమును ఎరిగినవాడు అయిన బుధుడు వీరినందరినీ పిలిపించి, ధైర్యముచేత సావధానచిత్తులూ, మంచి మనస్సు గలవారూ అయిన వారందరితో ఇట్లనెను. 6

మూ. అయం రాజా మహాబాహుః కర్దమస్య ఇలః సుతః,
జానీతైనం యథాభూతం శ్రేయో హ్యస్య విధీయతామ్. 7

ప్ర. అ. మహాబాహుః = గొప్ప బాహువులు గల, అయం రాజా = ఈ రాజు, కర్దమస్య = కర్దమునియొక్క, సుతః = కుమారుడైన, ఇలః = ఇలుడు. ఏనమ్ = వీనిని గూర్చి, యథాభూతమ్ = ఎట్లు జరిగినదో, జానీత = తెలుసుకొనండి. అస్య = వీనికి, శ్రేయః = శ్రేయస్సు, విధీయతామ్ = చేయబడుగాక.

తా. మహాబాహువైన ఈ రాజు కర్దమప్రజాపతివృత్తుడైన ఇలుడు. ఇతని విషయమున ఏమి జరిగినదో తెలిసికొనుడు. ఇతనికి శ్రేయస్సు కలుగునట్లు చేయుడు. 7

మూ. తేషాం సంవదతామేవ ద్విజైః సహ మహాత్మభిః,
కర్దమస్తు మహాతేజా స్తదాశ్రమముపాగమత్. 8

ప్ర. అ. తేషామ్ = వారు సంవదతామ్ ఏవ=మాటలాడుకొనుచుండగనే, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, కర్దమః తు = కర్దముడు, మహాత్మభిః = మహాత్ములైన, ద్విజైః సహ = బ్రాహ్మణులతో కూడ, తదాశ్రమమ్ = ఆ ఆశ్రమమును గూర్చి, ఉపాగమత్ = వచ్చెను

తా. వారిట్లు మాటలాడుకొనుచుండగనే గొప్ప తేజస్సు గల కర్దముడు మహాత్ములైన బ్రాహ్మణులతో కలిసి ఆ ఆశ్రమమునకు వచ్చెను. 8

మూ. పులస్త్యశ్చ క్రతుశ్చైవ వషట్కా-రస్తథైవ చ,
ఓంకారశ్చ మహాతేజా స్తమాశ్రమముపాగమన్. 9

ప్ర. అ. పులస్త్యః చ = పులస్త్యుడు, క్రతుః చ ఏవ = క్రతువు, తథైవ

చ=మరియు, వషట్కారః=వషట్కారుడు, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, ఓంకారః చ = ఓంకారుడు, తమ్ = ఆ, ఆశ్రమపదమ్=ఆశ్రమస్థానమును గూర్చి, ఉపాగమన్ = వచ్చిరి.

తా. పులస్త్యుడు, క్రతువు, వషట్కారుడు, గొప్ప తేజస్సు గల ఓంకారుడు ఆశ్రమమునకు వచ్చిరి. 9

మూ. తే సర్వే హృష్టమనసః పరస్పరసమాగమే,
హితైషిణో బల్హిపతేః పృథగ్వాక్యాన్యథాబ్రువన్. 10

ప్ర. అ. పరస్పరసమాగమే=పరస్పరము కలుసుకొనుటయందు (చేత), హృష్టమనసః=సంతోషించిన మనస్సులు గల, తే సర్వే=వారందరూ, బల్హిపతేః = బాహ్లీకదేశరాజైన ఆ ఇలునియొక్క, హితైషిణః = హితమును కోరుచున్న వారై, అథ = అటుపిమ్మట, పృథక్ = వేరువేరుగా, వాక్యాని = వాక్యములను, అబ్రువన్ = పలికిరి.

తా. పరస్పరము కలియుటచే సంతోషభరితములైన మనస్సులతో వారందరు ఇలుని హితము కోరుచు వేరువేరుగా ఇట్లు పలికిరి. 10

మూ. కర్దమస్త్వబ్రవీద్వాక్యం సుతార్థం పరమం హితమ్,
ద్విజాః శృణుత మద్వాక్యం యచ్ఛ్రేయః పార్థివస్య హి.

ప్ర. అ. కర్దమః తు = కర్దముడు, సుతార్థమ్ = కుమారుని నిమిత్తము, పరమమ్ = మిక్కిలి, హితమ్ = హితమైన, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. ద్విజాః = బ్రాహ్మణులారా! పార్థివస్య = ఈ రాజునకు, యత్ = ఏది, శ్రేయః = శ్రేయస్కరమో, మద్వాక్యమ్ = నా మాటను, శృణుత = వినండి.

తా. కర్దముడు పుత్రునకు చాల హితమైన వాక్యమును పలికెను-"బ్రాహ్మణులారా! ఈ రాజునకు ఏది హితమో నా మాటను వినుడు". 11

మూ. నాన్యం పశ్యామి భైషజ్యమన్తరా వృషభధ్వజమ్,
నాశ్వమేధాత్ పరో యజ్ఞః ప్రియశ్చైవ మహాత్మనః. 12

ప్ర. అ. వృషభధ్వజమ్ అన్తరా=శివుడు తప్ప, అన్యమ్ = మరియొక,

భైషజ్యమ్ = చికిత్సను, న పశ్యామి = చూడను. మహాత్మనః = మహాత్ముడైన శివునకు, అశ్వమేధాత్ = అశ్వమేధముకంటె, పరః = మరియొక, ప్రియః = ఇష్టమైన, యజ్ఞః = యజ్ఞము, న = లేదు.

తా. శివుడు తప్ప మరొక చికిత్స నాకు కనబడుటలేదు, మహాత్ముడైన ఆ శివునకు అశ్వమేధముకంటె ఎక్కువ ప్రియమైన యజ్ఞము లేదు. 12

మూ. తస్మాద్యజామహే సర్వే పార్థివార్థే దురాసదమ్,
కర్దమేనైవముక్తాస్తు సర్వ ఏవ ద్విజర్షభాః, 13
రోచయన్తి స్మ తం యజ్ఞం రుద్రస్యారాధనం ప్రతి.

ప్ర. అ. తస్మాత్ = ఆ కారణమువలన, సర్వే = మనమందరము, పార్థివార్థే = రాజుకొరకై, దురాసదమ్ = పొంద శక్యము కాని ఆ యజ్ఞమును, యజామహే = చేసెదము. కర్దమేన = కర్దమునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తాః = పలకబడిన, సర్వేఏవ = సమస్తమైన, ద్విజర్షభాః = బ్రాహ్మణశ్రేష్ఠులు, రుద్రస్య = రుద్రునియొక్క, ఆరాధనం ప్రతి = ఆరాధనమును గూర్చి, తం యజ్ఞమ్ = ఆ యజ్ఞమును, రోచయన్తి = ఇష్టపడిరి.

తా. "అందువలన మన మందరము రాజుకొరకై చాల కష్టమైన ఈ యజ్ఞము చేసెదము". కర్దముని మాటలు విని ఆ బ్రాహ్మణశ్రేష్ఠులు రుద్రుణ్ణి ఆరాధించుటకై ఆ యజ్ఞము చేయవలె నని అంగీకరించిరి. 13

మూ. సంవర్తస్య తు రాజర్షేః శిష్యః పరపురంజయః, 14
మరుత్త ఇతి విఖ్యాతస్తం యజ్ఞం సముపాహరత్.

ప్ర. అ. పరపురంజయః = శత్రుపురములను జయించినవాడు, మరుత్తః ఇతి = మరుత్తుడు అని, విఖ్యాతః = ప్రసిద్ధుడూ అయిన, రాజర్షేః = రాజర్షియైన, సంవర్తస్య = సంవర్తునియొక్క, శిష్యః = శిష్యుడు, తమ్ = ఆ, యజ్ఞమ్ = యజ్ఞమును, సముపాహరత్ = ఏర్పాటుచేసెను.

తా. రాజర్షియైన సంవర్తుని శిష్యుడు, శత్రుపురములను జయించినవాడూ అయిన మరుత్తుడు ఆ యజ్ఞము ఏర్పాట్లన్నీ చేసెను. 14

మూ. తతో యజ్ఞో మహానాసీద్బుధాశ్రమసమీపతః, 15
రుద్రశ్చ పరమం తోషమాజగామ మహాయశాః.

ప్ర. అ. తతః = అటుపిమట, బుధాశ్రమసమీపతః = బుధుని ఆశ్రమము వద్ద, మహాన్ = గొప్ప, యజ్ఞః = యజ్ఞము, ఆసీత్ = ఆయెను. మహాయశాః = గొప్ప కీర్తి గల, రుద్రః చ = రుద్రుడు కూడ, పరమమ్ = గొప్ప, తోషమ్ = సంతోషమును, ఆజగామ = పొందెను.

తా. అప్పుడు బుధుని ఆశ్రమము దగ్గర గొప్ప యజ్ఞము జరిగెను. గొప్ప కీర్తి గల రుద్రుడు చాల సంతోషించెను. 15

మూ. అథ యజ్ఞే సమాప్తే తు ప్రీతః పరమయా ముదా, 16
ఉమాపతిర్ద్విజాన్ సర్వానువాచ ఇలసంనిధౌ.

ప్ర. అ. అథ = పిమ్మట, యజ్ఞే = యజ్ఞము, సమాప్తే తు = సమాప్తమైనదగు చుండగా, ఉమాపతిః = శివుడు, ప్రీతః = సంతోషించినవాడై, ఇలసంనిధౌ = ఇలుని సంనిధియందు, సర్వాన్ = సమస్తమైన, ద్విజాన్ = బ్రాహ్మణులను గూర్చి, పరమయా = గొప్ప. ముదా = సంతోషముతో, ఉవాచ = పలికెను.

తా. యజ్ఞము సమాప్తమైన పిమ్మట శివుడు సంతోషించి ఇలుని సమక్షమున ఆ బ్రాహ్మణులందరితో చాల సంతోషముతో ఇట్లు పలికెను. 16

మూ. ప్రీతోఽస్మి హయమేధేన భక్త్యా చ ద్విజసత్తమాః, 17
అస్య బాహ్లీపతేశ్చైవ కిం కరోమి ప్రియం శుభమ్.

ప్ర. అ. ద్విజసత్తమాః = బ్రాహ్మణశ్రేష్ఠులారా! హయమేధేన = అశ్వమేధముచేతను, భక్త్యా చ = భక్తిచేతను, ప్రీతః అస్మి = సంతోషించినాను. అస్య = ఈ, బాహ్లీపతేః = బాహ్లీకదేశరాజునకు, కిమ్ = ఏమి, ప్రియమ్ = ఇష్టమును, శుభమ్ = శుభమును, కరోమి = చేయుదును.

తా. బ్రాహ్మణోత్తములారా! ఈ అశ్వమేధముచేతను మీ భక్తికిని సంతోషించితిని. ఈ ఇలునికి ఏమి ప్రియము, శుభము చేయవలెను? 17

మూ. తథా వదతి దేవేశే ద్విజాస్తే సుసమాహితాః, 18
ప్రసాదయన్తి దేవేశం యథా స్యాత్ పురుషస్త్రీలా.

ప్ర. అ. దేవేశే = దేవతాప్రభువైన శివుడు, తథా = అట్లు, వదతి = పలుకుచుండగా, తే ద్విజాః = ఆ బ్రాహ్మణులు, సుసమాహితాః = బాగా సావధానచిత్తులై, ఇలా = ఇల, యథా = ఎట్లు, పురుషః = పురుషుడు, స్యాత్ = అగునో అట్లు, దేవేశమ్ = శివుణ్ణి, ప్రసాదయన్తి = అనుగ్రహింపచేసికొనుచున్నారు.

తా. శివుడు ఇట్లు పలకగా ఆ బ్రాహ్మణులు సావధానచిత్తులై ఇల పురుషుడు అగునట్లు, ఆయనను అనుగ్రహింపచేసికొనిరి. 18

మూ. తతః ప్రీతో మహాదేవః పురుషత్వం దదౌ పునః. 19
ఇలాయై స మహాతేజా దత్త్వా చాన్తరధీయత.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ప్రీతః = సంతోషించిన, సుమహాతేజాః = చాల గొప్ప తేజస్సు గల, సః మహాదేవః = ఆ మహాదేవుడు, ఇలాయై = ఇలకు, పునః = మరల, పురుషత్వమ్ = పురుషత్వమును, దదౌ = ఇచ్చెను. దత్త్వా చ = ఇచ్చి, అన్తరధీయత = అంతర్ధానము చెందెను.

తా. పిమ్మట గొప్ప తేజస్సు గల ఆ మహాదేవుడు సంతోషించి ఇలకు మరల పురుషత్వమును ఇచ్చి అంతర్ధానము చెందెను. 19

మూ. నివృత్తే హయమేధే చ గతే చాదర్శనం హరే, 20
యథాగతం ద్విజాః సర్వే తేఽగచ్ఛన్ దీర్ఘదర్శినః.

ప్ర. అ. హయమేధే = అశ్వమేధము, నివృత్తే = పూర్తి అయిన దగుచుండగా, హరే = శివుడు, అదర్శనమ్ = కనబడకపోవుటను, గతే = పొందినవాడగుచుండగా, దీర్ఘదర్శినః = దీర్ఘదృష్టి గల, తే = ఆ, సర్వే = సమస్తమైన, ద్విజాః = బ్రాహ్మణులు, యథాగతమ్ = వచ్చినట్లుగానే, అగచ్ఛన్ = వెళ్ళిరి.

తా. హయమేధము పూర్తి అయి శివుడు అంతర్ధానము చెందిన పిమ్మట దీర్ఘదృష్టి గల ఆ బ్రాహ్మణు లందరూ వచ్చినట్లుగానే వెళ్ళిపోయిరి. 20

మూ. రాజా తు బాహ్లీముత్సృజ్య మధ్యదేశే హ్యనుత్తమమ్,
నివేశయామాస పురం ప్రతిష్ఠానం యశస్కరమ్.

ప్ర. అ. రాజా తు = రాజైతే, బాహ్లీమ్ = బాహ్లీకదేశమును, ఉత్సృజ్య

= విడచి, మధ్యదేశే = మధ్యదేశమునందు, అనుత్తమమ్ = చాలా ఉత్తమమైన, యశస్కరమ్ = కీర్తిని చేయు, ప్రతిష్ఠానం పురమ్ = ప్రతిష్ఠానపురమును, నివేశయామాస = ఏర్పరచెను.

తా. ఇలుడైతే బాహ్లికదేశమును విడచి మధ్యదేశములో అత్యుత్తమమైన, కీర్తిని ఇచ్చు ప్రతిష్ఠానపురమును నెలకొల్పెను. 21

మూ. శశబిన్దుశ్చ రాజర్షిర్బాహ్లీం పరపురంజయః, 22
ప్రతిష్ఠానే ఇలో రాజా ప్రజాపతిసుతో బలీ.

ప్ర. అ. పరపురంజయః = శత్రుపురములను జయించిన, రాజర్షిః = రాజర్షియైన, శశబిన్దుః చ = శశబిందువు, బాహ్లీమ్ = బాహ్లికదేశమును (పాలించెను). ప్రజాపతిసుతః = ప్రజాపతి పుత్రుడూ, బలీ = బలవంతుడూ అయిన, ఇలః = ఇలుడు, ప్రతిష్ఠానే = ప్రతిష్ఠాపురమునందు, రాజా = రాజు.

తా. శత్రుపురములను జయించు రాజర్షియైన శశబిందువు బాహ్లికదేశమును, కర్దమప్రజాపతి పుత్రుడు, బలశాలి అయిన ఇలుడు ప్రతిష్ఠానమును పాలించెను. 22

మూ. స కాలే ప్రాప్తవాన్ లోకమితో బ్రాహ్మమనుత్తమమ్, 23
ఐలః పురూరవా రాజా ప్రతిష్ఠానమథాప్తవాన్.

ప్ర. అ. సః ఇలః = ఆ ఇలుడు, కాలే = కాలమునందు, అనుత్తమమ్ = అత్యుత్తమమైన, బ్రాహ్మమ్ = బ్రహ్మకు సంబంధించిన, లోకమ్ = లోకమును. ప్రాప్తవాన్ = పొందినాడు. అథ = అటుపిమ్మట, ఐలః = ఇలుని కుమారుడైన, పురూరవాః = పురూరవుడు, ప్రతిష్ఠానమ్ = ప్రతిష్ఠానమును, రాజా = రాజుగా, ఆవాప్తవాన్ = పొందినాడు.

తా. కొంతకాలమునకు ఇలుడు అత్యుత్తమైన బ్రహ్మలోకమునకు వెళ్లెను. పిదప ఇలుని పుత్రుడైన పురూరవుడు ప్రతిష్ఠానమునందు రాజయ్యెను. 23

మూ. ఈదృశో హ్యశ్వమేధస్య ప్రభావః పురుషర్షభ, 24
స్త్రీభూతః పౌరుషం లేభే యచ్చాన్యదపి దుర్లభమ్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
నవతితమః సర్గః.

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! అశ్వమేధస్య = అశ్వమేధము యొక్క, ప్రభావః = ప్రభావము, ఈదృశః = ఇట్టిది. స్త్రీభూతః = స్త్రీ అయినవాడు, పౌరుషమ్ = పురుషత్వమును, యత్ = ఏది, దుర్లభమ్ = దుర్లభమో, అట్టి, అన్యదపి = మరొకదానినీ, (బ్రహ్మలోకమునూ), లేభే = పొందెను.

తా. పురుషశ్రేష్ఠుడా! అశ్వమేధము ప్రభావము ఇటువంటిది. స్త్రీ అయినవాడు పురుషుడు అయి, దుర్లభమైన బ్రహ్మలోకమును కూడ పొందెను. 24

'బాలానందిని' అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
తొంభైయవ సర్గ సమాప్తము.

అథ ఏకనవతితిమః సర్గః

[రాముని ఆజ్ఞచేత అశ్వమేధయాగమునకు ఏర్పాటు జరుగుట].

మూ. ఏతదాఖ్యాయ కాకుత్థ్సో భ్రాతృభ్యామమితప్రభః,
లక్ష్మణం పునరేవాహ ధర్మయుక్తమిదం వచః. 1

ప్ర. అ. అమితప్రభః = గొప్ప కాంతి గల, కాకుత్థ్సః = రాముడు, భ్రాతృభ్యామ్ = సోదరులకు, ఏతత్ = ఏది, ఆఖ్యాయ = చెప్పి, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి గూర్చి, పునః ఏవ = మరల, ధర్మయుక్తమ్ = ధర్మముతో కూడిన ఇదం వచః = ఈ వచనమును, ఆహ = పలికెను.

తా. అపరిమితమైన కాంతిగల రాముడు సోదరులిద్దరికీ ఈ వృత్తాంతము చెప్పి లక్ష్మణునితో మరల ధర్మసంమతమైన వాక్యము నిట్లు పలికెను. 1

మూ. వసిష్ఠం వామదేవం చ జాబాలిమథ కశ్యపమ్,
ద్విజాంశ్చ సర్వప్రవరానశ్వమేధపురస్కృతాన్. 2

ఏతాన్ సర్వాన్ సమానీయ మన్త్రయిత్వా చ లక్ష్మణ,
హయం లక్షణసంపన్నం విమోక్ష్యామి సమాధినా. 3

ప్ర. అ లక్ష్మణ = లక్ష్మణా! వసిష్ఠమ్ = వసిష్ఠుణి, వామదేవం చ = వామదేవుణ్ణి, జాబాలిమ్ = జాబాలిని, అథ = మరియు, కశ్యపమ్ = కశ్యపుణ్ణి, అశ్వమేధపురస్కృతాన్ = అశ్వమేధమునందు ముందుగా గౌరవింపబడిన, సర్వ ప్రవరాన్ = అందరికంటె శ్రేష్ఠులైన, ద్విజాన్ చ = బ్రాహ్మణులను, ఏతాన్ = వీరిని, సర్వాన్ = అందరినీ, సమానీయ = పిలిచి, మన్త్రయిత్వా = ఆలోచించి, లక్షణసంపన్నమ్ = మంచి లక్షణములతో కూడిన, హయమ్ = అశ్వమును, సమాధినా = ఏకాగ్రచిత్తముతో, మోక్ష్యామి = విడచెదను.

తా. లక్ష్మణా! వసిష్ఠుని, కామదేవుని, జాబాలిని, కశ్యపుని, అశ్వమేధ

యాగమునందు ముందు ఉండవలసిన, అందరికంటె ఉత్తములైన బ్రాహ్మణులను వీరి నందరిని పిలిచి, వీరితో ఆలోచించి మంచి లక్షణము లున్న అశ్వమును నియమపూర్వకముగా విడవదలచుచున్నాను. 2, 3

మూ. తద్వాక్యం రాఘవేణోక్తం శ్రుత్వా త్వరితవిక్రమః,
ద్విజాన్ సర్వాన్ సమాహూయ దర్శయామాస రాఘవమ్.

ప్ర. అ. రాఘవేణ = రామునిచేత, ఉక్తమ్ = పలకబడిన, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, త్వరితవిక్రమః = శీఘ్రమైన గమనము కలవాడై, సర్వాన్ = సమస్తమైన, ద్విజాన్ = బ్రాహ్మణులను, సమాహూయ = పిలచి, రాఘవమ్ = రాముణ్ణి, దర్శయామాస = చూపెను.

తా. లక్ష్మణుడు రాముని మాట విని శీఘ్రముగా వెళ్ళి ఆ బ్రాహ్మణుల నందరినీ తీసికొనివచ్చి వారికి రాముణ్ణి చూపెను. 4

మూ. తే దృష్ట్వా దేవసంకాశం కృతపాదాభివన్దనమ్,
రాఘవమ్ సుదురాధర్షమాశీర్భిః సమపూజయన్. 5

ప్ర. అ. తే = వారు, దేవసంకాశమ్ = దేవతతో సమానుడు, కృతపాదాభివన్దనమ్ = చేయబడిన పాదాభివందనము కలవాడు అయిన, రాఘవమ్ = రాముణ్ణి, దృష్ట్వా = చూచి, సుదురాధర్షమ్ = మిక్కిలి ఎదిరింప శక్యము కాని ఆతనిని, ఆశీర్భిః = ఆశీస్సులతో, సమపూజయన్ = పూజించిరి.

తా. ఆ ద్విజులు దేవసమానుడు, ఎదిరింపశక్యము కానివాడు ఆయిన, పాదాభివందనము చేసిన ఆ రాముణ్ణి ఆశీర్వాదములచేత పూజించిరి. 5

మూ. ప్రాఞ్జలిః స తదా భూత్వా రాఘవో ద్విజసత్తమాన్,
ఉవాచ ధర్మసంయుక్తమశ్వమేధాశ్రితం వచః. 6

ప్ర. అ. తదా = అప్పుడు, సః రాఘవః = ఆ రాముడు, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలికలవాడు, భూత్వా = అయి, ద్విజసత్తమాన్ = ఆ ద్విజశ్రేష్ఠులను గూర్చి, ధర్మసంయుక్తమ్ = ధర్మముతో కూడిన, అశ్వమేధాశ్రితమ్ = అశ్వమేధమునకు సంబంధించిన, వచః = వచనమును, ఉవాచ = పలికెను.

తా అప్పుడు రాముడు అంజలి ఘటించి నమస్కరించి ఆ ద్విజోత్తములతో అశ్వమేధమును గూర్చి ధర్మసంమతమైన వాక్యము పలికెను. 6

మూ. తేఽపి రామస్య తచ్ఛ్రుత్వా నమస్కృత్వా వృషధ్వజమ్,
అశ్వమేధం ద్విజాః సర్వే పూజయన్తి స్మ సర్వశః. 7

ప్ర. అ. సర్వే = సమస్తమైన, తే = ఆ, ద్విజాః అపి = ద్విజులు కూడ, రామస్య = రామునియొక్క, తత్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, వృషధ్వజమ్ = మహేశ్వరుణ్ణి, నమస్కృత్వా = నమస్కరించి, సర్వశః = అన్ని విధముల, అశ్వమేధమ్ = అశ్వమేధమును, పూజయన్తి = పూజించుచున్నారు.

తా. ఆ బ్రాహ్మణులందరూ కూడ రాముని మాటలు విని, అశ్వమేధము చేత ఆరాధ్యుడైన మహేశ్వరునికి నమస్కరించుచు, అశ్వమేధమును ప్రశంసించిరి. 7

మూ. స తేషాం ద్విజముఖ్యానాం వాక్యమద్భుతదర్శనమ్,
అశ్వమేధాశ్రితం శ్రుత్వా భృశం ప్రీతోఽభవత్తదా. 8

ప్ర. అ. తదా = అప్పుడు, సః = రాముడు, తేషామ్ = ఆ, ద్విజముఖ్యానామ్ = బ్రాహ్మణశ్రేష్ఠులయొక్క, అద్భుతదర్శనమ్ = అద్భుతమైన దృష్టి గల, అశ్వమేధాశ్రితమ్ = అశ్వమేధమునకు సంబంధించిన, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, భృశమ్ = మిక్కిలి, ప్రీతః = సంతోషించినవాడు, అభవత్ = ఆయెను.

తా. అప్పుడు ఆ రాముడు ఆ బ్రాహ్మణోత్తములు పలికిన అశ్వమేధమునకు సంబంధించిన, ఆశ్చర్యకరమైన దృష్టితో కూడిన మాటలు విని సంతోషించెను. 8

మూ. విజ్ఞాయ కర్మ తత్తేషాం రామో లక్ష్మణమబ్రవీత్,
ప్రేషయస్వ మహాబాహో సుగ్రీవాయ మహాత్మనే. 9

ప్ర. అ. రామః = రాముడు, తేషామ్ = వారియొక్క, తత్ కర్మ = ఆ పనిని, విజ్ఞాయ = తెలుసుకొని, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను. మహాబాహో = మహాబాహూ! మహాత్మనే = మహాత్ముడైన, సుగ్రీవాయ = సుగ్రీవునికొరకు, ప్రేషయస్వ = పంపుము.

తా. రాముడు ఆ బ్రాహ్మణులు చేయదలచిన కర్మను తెలిసికొని లక్ష్మణు

నితో ఇట్లు పలికెను-"మహాబాహూ! మహాత్ముడైన సుగ్రీవుని ఆహ్వానించుటకై దూతను పంపుము". 9

మూ. యథా మహద్భిర్హరిభిర్బహుభిశ్చ వనౌకసామ్,
సార్ధమాగచ్ఛ భద్రం తే అనుభోక్తుం మహోత్సవమ్. 10

ప్ర అ. యథా = ఎట్లనగా, మహద్భిః = గొప్పవారైన, హరిభిః = వానరులతోను, వనౌకసామ్ = వానరులయొక్క, బహుభిః చ సార్ధమ్ = చాలమందితోను, మహోత్సవమ్ = మహోత్సవమును, అనుభోక్తుమ్ = అనుభవించుటకు, ఆగచ్ఛ = రమ్ము, తే = నీకు, భద్రమ్ = మంగళ మగుగాక.

తా. వానరనాయకులతోను వనములో నివసించు వానరాదులలో చాలమందితోను ఈ మహోత్సవమును అనుభవించుటకై రమ్ము అని ఆహ్వానము పంపుము

మూ. విభీషణశ్చ రక్షోభిః కామగైర్బహుభిర్వృతః,
అశ్వమేధం మహాయజ్ఞమాయాత్వతులవిక్రమః. 11

ప్ర. అ. అతులవిక్రమః = సాటి లేని పరాక్రయము గల, విభీషణః చ = విభీషణుడు కూడ, కామగైః = స్వేచ్ఛానుసారము వెళ్లు, బహుభిః = అనేకులైన, రక్షోభిః = రాక్షసులతో, వృతః = కూడినవాడై, మహాయజ్ఞమ్ = మహాయజ్ఞమైన, అశ్వమేధమ్ = అశ్వమేధమును గూర్చి, ఆయాతు = వచ్చుగాక.

తా. సాటి లేని పరాక్రమము గల విభీషణుడు కూడ నేచ్ఛగా సంచరించ గలిగిన శక్తి గల చాలమంది రాక్షసులతో కలిసి ఈ అశ్వమేధమహాయజ్ఞమునకు వచ్చుగాక. 11

మూ. రాజానశ్చ మహాభాగా యే మే ప్రియచికీర్షవః,
సానుగాః క్షిప్రమాయాన్తు యజ్ఞం ద్రష్టుమనుత్తమమ్. 12

ప్ర. అ. మే = నాకు, ప్రియచికీర్షవః = ప్రియము చేయదలచిన, యే = ఏ, మహాభాగాః = మహాభాగ్యవంతులైన, రాజానః = రాజులు గలరో వారు, సానుగాః = పరివారసమేతులై, అనుత్తమమ్ = అత్యుత్తమమైన, యజ్ఞమ్ = యజ్ఞమును, ద్రష్టుమ్ = చూచుటకు, ఆయాన్తు = వచ్చెదరుగాక.

తా. నాకు ప్రియము చేయదలచిన మహాభాగ్యవంతులైన రాజులు కూడ పరివారసహితులై ఈ మహాయజ్ఞమును చూచుటకు వచ్చెదరుగాక. 12

మూ. దేశా న్తరగతా యే చ ద్విజా ధర్మసమాహితాః,
ఆమ న్త్రియస్వ తాన్ సర్వానశ్వమేధాయ లక్ష్మణ. 13

ప్ర. ఆ. లక్ష్మణ = లక్ష్మణా! దేశా న్తరగతాః = ఇతరదేశములలో ఉన్న, ధర్మసమాహితాః = ధర్మమునందు శ్రద్ధ గల, యే ద్విజాః = ఏ ద్విజులు గలరో, తాన్ సర్వాన్ = వారి నందరినీ, అశ్వమేధాయ = అశ్వమేధముకొరకు, ఆమ న్త్రి యస్వ = పిలువుము.

తా. లక్ష్మణా! ఇతరదేశాలలో ఉన్న ధర్మశ్రద్ధ గల ద్విజులందరినీ కూడ అశ్వమేధయాగమునకు ఆహ్వానించుము. 13

మూ. ఋషయశ్చ మహాబాహో ఆహూయన్తాం తపోధనాః,
దేశా న్తరగతాః సర్వే సదారాశ్చ ద్విజాతయః. 14

ప్ర. ఆ. మహాబాహో = మహాబాహూ! తపోధనాః = తపస్సే ధనముగా గల, ఋషయః = ఋషులు, దేశా న్తరగతాః = కార్యాంతరముచేత దేశాంతరమునకు వెళ్ళిన, సదారాః = భార్యాసహితులైన, సర్వే = సమస్తమైన, ద్విజాతయః = బ్రాహ్మణులు, ఆహూయన్తామ్ = పిలవబడుదురుగాక.

తా. మహాబాహూ! తపస్సే ధనముగా గల ఋషులను, కార్యవశముచేత దేశాంతరములలో ఉన్న భార్యాసహితులైన ద్విజులను, అందరినీ ఆహ్వానించవలెను. 14

మూ. తథైవ తాలావచరాస్తథైవ నటనర్తకాః,
యజ్ఞవాటశ్చ సుమహాన్ గోమత్యా నైమిషే వనే. 15

ఆజ్ఞాప్యతాం మహాబాహో తద్ధి పుణ్యమనుత్తమమ్,
శాన్తయశ్చ మహాబాహో ప్రవర్తన్తాం సమన్తతః. 16

ప్ర. ఆ. తథైవ = మరియు, తాలావచరాః = తాలములు వాయించుచు సంచరించేవారు, తథైవ = మరియు, నటనర్తకాః = నటులు నర్తకులు, ఆహ్వానింప

ఐదుదురుగాక. నైమిషే వనే = నైమిషవనమునందు, గోమత్యా = గోమతీనదీతీరమున, సుమహాన్ = చాల గొప్పదైన, యజ్ఞవాటః చ = యజ్ఞవాటము, ఆజ్ఞాప్యతామ్ = ఆజ్ఞాపించబడుగాక. మహాబాహో = మహాబాహూ ! తత్ = ఆది, అనుత్తమమ్ = చాలఉత్తమమైన, పుణ్యం హి = పుణ్యక్షేత్రము కదా? మహాబాహో = మహాబాహూ! సమన్తతః = అంతటను, శాన్తయః = శాంతులు, ప్రవర్తన్తామ్ = ప్రవర్తించుగాక.

తా. తాలములు వాయించుచు దేశసంచారము చేసేవాళ్లను, నటులను, నర్తకులను కూడ ఆహ్వానించవలెను. నైమిశారణ్యమునందు గోమతీతీరమునందు చాల పెద్ద యజ్ఞవాటమును నిర్మించుటకు ఆజ్ఞాపించుము, అది చాల పవిత్రమైన ప్రదేశము కదా? మహాబాహూ! అంతటా కూడ శాంతులు ప్రవర్తించుగాక. 15,16

మూ. శతశశ్చాపి ధర్మజ్ఞాః క్రతుముఖ్యమనుత్తమమ్,
అనుభూయ మహాయజ్ఞం నైమిషే రఘునన్దన. 17

ప్ర. అ. రఘునన్దన = లక్ష్మణా! శతశః = వందలకొలది, ధర్మజ్ఞాః చ అపి = ధర్మములు ఎరిగినవారు కూడ, నైమిషే = నైమిషమునందు, అనుత్తమమ్ = చాల ఉత్తమమైన, మహాయజ్ఞమ్ = మహాయజ్ఞమును, అనుభూయ = అనుభవించి (ధన్యు లగుదురుగాక.)

తా. లక్ష్మణా! వందలకొలది ధర్మవేత్తలు నైమిషములో అత్యుత్తమమైన ఈ మహాయజ్ఞమును చూచి ధన్యులగుదురుగాక. 17

మూ. తుష్టః పుష్టశ్చ సర్వోఽసౌ మానితశ్చ యథావిధి,
ప్రతియాస్యతి ధర్మజ్ఞ శీఘ్రమామన్త్ర్యతాం జనః. 18

ప్ర. అ. ధర్మజ్ఞ = ధర్మములు తెలిసినవాడా ! జనః = జనము, శీఘ్రమ్ = శీఘ్రముగా, ఆమన్త్ర్యతామ్ = పిలవబడుగాక. సర్వః = సమస్తమైన, అసౌ = ఆ జనము, తుష్టః = సంతోషించినదై, పుష్టః చ = పరిపుష్టమై, యథావిధి = యథాశాస్త్రముగా, మానితః చ = గౌరవించబడినదై, ప్రతియాస్యతి = తిరిగి వెళ్ళగలదు.

తా. ధర్మములు తెలిసినవాడా! ఈ జనుల నందరినీ శీఘ్రముగా ఆహ్వా

నించుము. వీరందరూ యథావిధిగా సత్కరింపబడి సంతోషముతో పరిపుష్టులై తిరిగి వెళ్ళగలరు. 18

మూ. శతం వాహసహస్రాణాం తణ్డులానాం వపుష్మతామ్,
అయుతం తిలముద్గస్య ప్రయాత్వగ్రే మహాబల. 19
చణకానాం కులిత్థానాం మాషాణాం లవణస్య చ,
అతోఽనురూపం స్నేహం చ గన్ధం సంక్షిప్తమేవ చ. 20

ప్ర. అ. మహాబల = గొప్ప బలము గలవాడా! వపుష్మతామ్ = మంచి ఆకారము గల (విరగని), తణ్డులానామ్ = బియ్యముయొక్క, వాహసహస్రాణామ్ = వాహనముల వేలయొక్క, శతమ్ = శతము, తిలముద్గస్య = తిలముయొక్క, పెసలయొక్క (వాహనముల), అయుతమ్ = అయుతము, చణకానామ్ = శనగలయొక్క, కులిత్థానామ్ = ఉలవలయొక్క, మాషాణామ్ = మినుములయొక్క, లవణస్య = లవణముయొక్క వాహనములు, అగ్రే = ముందు, ప్రయాతు = వెళ్లుగాక. అతః = అటుపిమ్మట, అనురూపమ్ = తగిన, స్నేహం చ = తైలాదికము, సంక్షిప్తమ్ ఏవ చ = దానికంటె తక్కువైన, గన్ధం చ = సుగంధ ద్రవ్యము వెళ్లుగాక.

తా. ముక్కలు కాని బియ్యమును మోయు వాహనములు ఒక లక్ష, తిలలు, పెసలు మోయు పదివేల వాహనములు ముందు వెళ్ళుగాక. శనగలు, ఉలవలు, మినుములు, లవణము వీటికి తగిన తైలాదికము, అంతకంటె తక్కువ ప్రమాణములలో గంధద్రవ్యములు కూడ వెళ్లుగాక. 19, 20

మూ. సువర్ణకోట్యో బహులా హిరణ్యస్య శతోత్తరాః,
అగ్రతో భరతః కృత్వా గచ్ఛత్వగ్రే సమాధినా. 21

ప్ర. అ. భరతః = భరతుడు, బహులాః = అనేకమైన, సువర్ణకోట్యః = = వెండియొక్క కోట్లను, హిరణ్యస్య = బంగారముయొక్క, శతోత్తరాః = నూరుకు మించిన కోట్లను, అగ్రతః కృత్వా = ముందు ఉంచుకొని, అగ్రే = ముందు, సమాధినా = ఏకాగ్రచిత్తముతో, గచ్ఛతు = వెళ్లుగాక.

తా. భరతుడు చాల కోట్ల వెండినాణెములు, నూరు కోట్లకు మించిన బంగారు నాణెములు తీసికొని, జాగరూకుడై ముందు వెళ్లుగాక. 21

మూ. అన్తరాపణవీథ్యశ్చ సర్వే చ నటనర్తకాః,
సూదా నార్యశ్చ బహవో నిత్యం యౌవనశాలినః. 22
భరతేన తు సార్ధం తే యాన్తు సైన్యాని చాగ్రతః.

ప్ర. అ. అన్తరాపణవీథ్యః చ = మార్గమధ్యమునందు దుకాణముల వీథులు, సర్వే = సమస్తమైన, నటనర్తకాః = నటులు నర్తకులు, సూదాః = వంటవాళ్ళు, నార్యః = స్త్రీలు, నిత్యమ్ = నిత్యమూ, యౌవనశాలినః = యౌవనముతో ప్రకాశించు, బహవః = చాలమంది, తే = పురుషులు, భరతేన సార్ధమ్ = భరతునితో కూడ, యాన్తు = వెళ్ళెదరుగాక. సైన్యాని చ = సైన్యములు కూడ, అగ్రతః = ఎదుట వెళ్ళుగాక.

తా. కావలసిన చోట్ల అంగళ్ళ వీథులు తెరచు వర్తకులు, నటులు, నర్తకులు, వంటవాళ్ళు, వంటలు చేసే స్త్రీలు, నిత్యము యౌవనముతో ఉండు (దృఢకాయులైన) చాలమంది పురుషులు భరతునితో కలిసి వెళ్ళవలెను. 22

మూ. నైగమాన్ బాలవృద్ధాంశ్చ ద్విజాంశ్చ సుసమాహితాన్,
కర్మాన్తికాన్ వర్ధకినః కోశాధ్యక్షాంశ్చ నైగమాన్,
మమ మాత్యాస్తథా సర్వాః కుమారాన్తఃపురాణి చ, 24

కాఞ్చనీం మమ పత్నీం చ దీక్షాయాం జ్ఞాంశ్చ కర్మణి,
అగ్రతో భరతః కృత్వా గచ్ఛత్వగ్రే మహాయశాః 25

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గల, భరతః = భరతుడు, నైగమాన్ = ఆ యా సంఘముల ముఖ్యులను, బాలవృద్ధాన్ చ = బాలలను, వృద్ధులను, సుసమాహితాన్ = బాగా సావధానచిత్తులైన, ద్విజాన్ చ = బ్రాహ్మణులను, కర్మాన్తికాన్ = కర్మపర్యవేక్షకులను, వర్ధకినః = వడ్రంగులను, కోశాధ్యక్షాన్ = కోశాధ్యక్షులైన, నైగమాన్ = నైగములను, తథా = మరియు, సర్వాః = సమస్తమైన, మమ మాత్యాః = నా తల్లులను, కుమారాన్తఃపురాణి చ = కుమారుల (సోదరుల) అంతఃపురములను, దీక్షాయామ్ = యజ్ఞదీక్షయందు, కాఞ్చనీమ్ = బంగారము వికారమైన, మమ పత్నీమ్ = నా భార్యను, కర్మణి = పనియందు, జ్ఞాన్ చ = తెలివిగలవారిని, అగ్రతః = ముందు, కృత్వా = ఉంచుకొని, అగ్రే = ముందు, గచ్ఛతు = వెళ్ళుగాక.

తా. గొప్ప కీర్తి గల భరతుడు ఆ యా సంఘముల ముఖ్యులను, బాలులను, వృద్ధులను, సావధానచిత్తులైన బ్రాహ్మణులను, కర్మపర్యవేక్షకులను, ధనాగారముల అధ్యక్షులను, ధనాగారములకు సంబంధించిన ఇతర ముఖ్యులను, మనత్తల్లులను అందరిని, సోదరుల అంతఃపురములను, దీక్షకు ఉపయోగించవలసిన నా భార్య బంగారు ప్రతిమను, ఆ యా కర్మలలో దక్షులైన వారిని ముందు ఉంచుకొని ముందుగా వెళ్ళుగాక. 23.25

మూ. ఉపకార్యా మహార్హాశ్చ పార్థివానాం మహౌజసామ్,
సానుగానాం నరశ్రేష్ఠో వ్యాదిదేశ మహాబలః. 26
అన్నపానాని వస్త్రాణి అనుగానాం మహాత్మనామ్.

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గల, నరశ్రేష్ఠః = నరులలో శ్రేష్ఠుడైన ఆ రాముడు, మహౌజసామ్ = గొప్ప తేజస్సు గల, సానుగానామ్ = అనుచరులతో కూడిన, పార్థివానామ్ = రాజులకు, మహార్హాః = చాల విలువ గల, ఉపకార్యాః = వస్త్రములతో నిర్మించిన గుడారములను, మహాత్మానామ్ = మహాత్ముడైన, అనుగానామ్ = అనుచరులకు, అన్నపానాని = అన్నపానములను, వస్త్రాణి = వస్త్రములను, వ్యాదిదేశ = ఆజ్ఞాపించెను. (ఏర్పాటుచేయించెను).

తా. గొప్ప బలము గల ఆ నరశ్రేష్ఠుడు, గొప్ప తేజస్సు గల, పరివార సహితులైన రాజులకొరకు మంచి గుడారములను, మహాత్ములైన వారి అనుచరులకొరకు అన్నపానములను, వస్త్రములను ఏర్పాటు చేయించెను. 26

మూ. భరతః స తదా యాతః శత్రుఘ్నసహితస్తదా, 27
వానరాశ్చ మహాత్మానః సుగ్రీవసహితాస్తదా.

ప్ర. అ. తదా = అప్పుడు, శత్రుఘ్నసహితః = శత్రుఘ్నునితో కూడిన, భరతః = భరతుడు, యాతః = వెళ్లెను. తదా = అప్పుడు, సుగ్రీవసహితాః = సుగ్రీవునితో కూడిన, మహాత్మానః = మహాత్ములైన, వానరాః చ = వానరులు కూడ వెళ్ళిరి.

తా. అప్పుడు శత్రుఘ్నునితో కలిసి భరతుడు వెళ్లెను. అప్పుడు సుగ్రీవ సహితులైన మహాత్ములైన వానరులు కూడ వెళ్ళిరి. 27

మూ. విప్రాణాం ప్రవరాః సర్వే చక్రుశ్చ పరివేషణమ్, 28
విభీషణశ్చ రక్షోభిః స్త్రీభిశ్చ బహుభిర్వృతః,
ఋషీణాముగ్రతపసాం పూజాం చక్రే మహాత్మనామ్. 29

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకనవతితమః సర్గః.

ప్ర. అ. బహుభిః = చాలమంది, రక్షోభిః = రాక్షసులతోను, స్త్రీభిః చ = స్త్రీలతోను, వృతః = కూడిన, విభీషణః చ = విభీషణుడు, ఉగ్రతపసామ్ = ఉగ్రమైన తపస్సు గల, మహాత్మానామ్ = మహాత్ములైన, ఋషీణామ్ = ఋషుల యొక్క, పూజామ్ = పూజను. చక్రే = చేసెను. విప్రాణామ్ = బ్రాహ్మణులలో, ప్రవరాః = శ్రేష్ఠులైన, సర్వే = అందరూ, పరివేషణమ్ = వడ్డనను, చక్రుః = చేసిరి.

తా. చాలామంది రాక్షసులతోను, స్త్రీలతోను కలిసి విభీషణుడు ఉగ్రమైన తపస్సు గల మహాత్ములైన ఋషులకు పూజచేసెను. బ్రాహ్మణోత్తములు వారికి వడ్డన చేసిరి.

వి. 26-29 శ్లోకాలు ప్రాచ్యప్రతిలో లేవు. అది యుక్తము. ముఖ్యముగా 28, 29 శ్లోకాలు ఇక్కడ కుదరవు. 29

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో తొంభై ఒకటవ సర్గ సమాప్తము.

అథ ద్వినవతితమః సర్గః.

[రాముని అశ్వమేధయాగములో దానగౌరవములు బాగా జరుగుట]

మూ. తత్సర్వమఖిలేనాశు ప్రస్థాప్య భరతాగ్రజః,
హయం లక్షణసంపన్నం కృష్ణసారం ముమోచ హ. 1

ప్ర. అ. భరతాగ్రజః=రాముడు, తత్ సర్వమ్=దాని నంతనూ, అఖిలేన =పూర్తిగా, ప్రస్థాప్య=పంపి, లక్షణసంపన్నమ్=మంచి లక్షణములతో కూడిన, కృష్ణసారమ్ = అధికముగా నల్లగా ఉన్న, హయమ్ = గుఱ్ఱమును, ముమోచ హ = విడచెను.

తా. రాముడు కావలసిన సామగ్రి అంతా పూర్తిగా పంపి మంచి లక్షణములు గల, ప్రధానముగా నల్లగా ఉన్న, అశ్వమును విడచెను. 1

మూ. ఋత్విగ్భిర్లక్ష్మణం సార్ధమశ్వే చ వినియుజ్య చ,
తతోఽభ్యగచ్ఛత్ కాకుత్స్థః సహ సైన్యేన నైమిషమ్. 2

ప్ర. అ. కాకుత్స్థః = రాముడు, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి, ఋత్విగ్భిః సార్ధమ్ = ఋత్విక్కులతో కూడ, అశ్వే = అశ్వమునందు, వినియుజ్య = నియమించి, తతః = అటుపిమ్మట, సహ సైన్యేన = సైన్యముతో కూడ, నైమిషమ్ = నైమిషమును గూర్చి, అభ్యగచ్ఛత్ = వెళ్లెను.

తా. రాముడు లక్ష్మణుణ్ణి ఋత్విక్కులతో కూడ గుఱ్ఱము వెనుక సంచరించుటకు ఆజ్ఞాపించి సైన్యముతో కూడ నైమిషమునకు వెళ్లెను. 2

మూ. యజ్ఞవాటం మహాబాహుర్దృష్ట్వా పరమమద్భుతమ్,
ప్రహర్షమతులం లేభే శ్రీమానితి చ సోఽబ్రవీత్. 3

ప్ర. అ. మహాబాహుః = గొప్ప బాహువులు గల రాముడు, పరమమ్=

మిక్కిలి, అద్భుతమ్ = ఆశ్చర్యకరమైన, యజ్ఞవాటమ్ = యజ్ఞవాటమును, దృష్ట్వా = చూచి, అతులమ్ = సాటిలేని, ప్రహర్షమ్ = ఆనందమును, లేభే = పొందెను. సః = అతడు, శ్రీమాన్ = శోభాయుక్తముగ ఉన్నది, ఇతి చ = అని కూడ, అబ్రవీత్ = పలికెను.

తా. మహాబాహువైన రాముడు చాల అద్భుతమైన ఆ యజ్ఞవాటమును చూచి, చాల సంతోషించి "ఇది చాల బాగున్నది" అని అనెను. 3

మూ. నైమిషే వసతస్తస్య సర్వ ఏవ నరాధిపాః,
ఆనిన్యురుపహారాంశ్చ తాన్ రామః ప్రత్యపూజయత్. 4

ప్ర. అ. నైమిషే = నైమిషమునందు, వసతః = నివసించుచున్న, తస్య = ఆ రామునకు, సర్వే ఏవ = సమస్తమైన, నరాధిపాః = రాజులు, ఉపహారాన్ = కానుకలను, ఆనిన్యుః = తీసికొనివచ్చిరి. రామః = రాముడు, తాన్ = వాళ్లను, ప్రత్యపూజయత్ = తిరిగి సన్మానించెను.

తా. రాజు లందరూ నైమిషములో నివసించుచున్న రామునకు కానుకలు తీసికొనివచ్చిరి. రాముడు వారిని మరల సన్మానించెను. 4

మూ. అన్నపానాది వస్త్రాణి సర్వోపకరణాని చ,
భరతః సహశత్రుఘ్నో నియుక్తో రాజపూజనే. 5

ప్ర. అ. రాజపూజనే = రాజులను పూజించుటయందు, నియుక్తః = నియమించబడిన, సహశత్రుఘ్నః = శత్రుఘ్నునితో కూడిన, భరతః = భరతుడు, అన్నపానాది = అన్నపానాదికమును, వస్త్రాణి = వస్త్రములను, సర్వోపకరణాని చ = సమస్తములైన ఉపకరణములను, (సమకూర్చెను.)

తా. రాజులను పూజించుటయందు నియుక్తులైన భరతశత్రుఘ్నులు అన్నపానాదికమును, వస్త్రములను, ఇతరవస్తువులను ఏర్పాటుచేసిరి. 5

మూ. వానరాశ్చ మహాత్మానః సుగ్రీవసహితా స్తదా,
పరివేషణం చ విప్రాణాం ప్రయతాః సంప్రచక్రిరే. 6

ప్ర. అ. తదా = అప్పుడు, సుగ్రీవసహితాః = సుగ్రీవునితో కూడిన,

మహాత్మానః = మహాత్ములైన, వానరాః చ = వానరులు, ప్రయతాః = నియమవంతులై, విప్రాణామ్ = బ్రాహ్మణులకు, పరివేషణమ్ = వడ్డనను, సంప్రచక్రిరే = చేసిరి.

తా. అప్పుడు సుగ్రీవుడు మొదలైన మహాత్ములైన వానరులు నియమవంతులై బ్రాహ్మణులకు వడ్డన చేసిరి. 6

మూ. విభీషణశ్చ రక్షోభిర్బహుభిః సుసమాహితః,
ఋషీణాముగ్రతపసాం కింకరః సమపద్యత. 7

ప్ర. అ. బహుభిః = చాలమంది, రక్షోభిః = రాక్షసులతో, విభీషణః = విభీషణుడు, సుసమాహితః = బాగా సావధానచిత్తుడై, ఉగ్రతపసామ్ = ఉగ్రమైన తపస్సు గల, ఋషీణామ్ = ఋషులకు, కింకరః = కింకరుడుగా, సమపద్యత = ఆయెను.

తా. చాలమంది రాక్షసులతో కూడిన విభీషణుడు చాల సావధానచిత్తుడై ఉగ్రమైన తపస్సు గల ఋషులకు కింకరు డయ్యేను. 7

మూ. ఉపకార్యా మహార్హాశ్చ పార్థివానాం మహాత్మనామ్,
సానుగానాం నరశ్రేష్ఠో వ్యాదిదేశ మహాబలః. 8

ప్ర. అ. తా. 91వ సర్గలోని 26వ శ్లోకము చూడుడు. 8

మూ. ఏవం సువిహితో యజ్ఞో హ్యశ్వమేధో హ్యవర్తత,
లక్ష్మణేన సుగుప్తా సా హయచర్యా ప్రవర్తత. 9

ప్ర. అ. అశ్వమేధః యజ్ఞః = అశ్వమేధయజ్ఞము, ఏవమ్ = ఇట్లు, సువిహితః = బాగా ఏర్పాటుచేయబడినదిగా, అవర్తత = ఉండెను. లక్ష్మణేన = లక్ష్మణునిచేత, సుగుప్తా = బాగా రక్షించబడిన, సా = ఆ, హయచర్యా = అశ్వము యొక్క సంచారము, ప్రవర్తత = ప్రవర్తించెను.

తా. ఈ విధముగా ఆ అశ్వమేధయజ్ఞము బాగుగా ఏర్పరుపబడెను. అశ్వ సంచారము లక్ష్మణునిచేత రక్షింపబడినదై జరిగెను. 9

మూ. ఈదృశం రాజసింహస్య యజ్ఞప్రవరముత్తమమ్,
నాన్యః శబ్దోఽభవత్తత్ర హయమేధే మహాత్మనః, 10
ఛన్దతో దేహి దేహీతి యావత్తుష్యన్తి యాచకాః.

ప్ర. అ. రాజసింహస్య = ఆ మహారాజుయొక్క, యజ్ఞప్రవరమ్ = శ్రేష్ఠమైన యజ్ఞము, ఈదృశమ్ = ఈ విధముగా, ఉత్తమమ్ = ఉత్తమముగా ఉండెను. యావత్ = ఎంతవరకు, యాచకాః = యాచకులు, తుష్యన్తి = సంతోషింతురో అంతవరకు, ఛన్దతః = ఇష్టము వచ్చినట్లు, దేహి దేహి ఇతి = ఇమ్ము ఇమ్ము అను దానికంటె, అన్యః శబ్దః = వేరైన శబ్దము, మహాత్మనః = మహాత్మునియొక్క, తత్ర = ఆ, హయమేధే = అశ్వమేధమునందు, నాభవత్ = కాలేదు.

తా. మహాత్ముడైన ఆ రాముని అశ్వమేధయజ్ఞమునందు - "యాచకులు సంతృప్తి చెందే వరకు ఇమ్ము ఇమ్ము"అను మాటలు తప్ప మరి ఏ మాటలు వినబడలేదు. ఆ రాజశ్రేష్ఠుడైన రాముని ఉత్తమమైన యజ్ఞము ఈ విధముగా ఉండెను.

మూ. తావత్సర్వాణి దత్తాని క్రతుముఖ్యే మహాత్మనః, 11
వివిధాని చ గౌడాని ఖాణ్డవాని తథైవ చ.

ప్ర. అ. మహాత్మనః = ఆ మహాత్ముని యొక్క, క్రతుముఖ్యే = ముఖ్యమైన యజ్ఞమునందు, వివిధాని = అనేకవిధములైన, గౌడాని = బెల్లముతో చేసిన భక్ష్యములు, తథైవ చ = మరియు, ఖాణ్డవాని = పటికబెల్లముతో చేసిన భక్ష్యములు, సర్వాణి = అన్నీ కూడ, తావత్ = యాచకులు తృప్తి చెందు నంతవరకు, దత్తాని = ఇవ్వబడినవి.

తా. మహాత్ముడైన రాముడు చేసిన ఆ మహాయజ్ఞమునందు యాచకులు తృప్తి చెందువరకు, అనేకవిధములైన బెల్లముతో చేసిన భక్ష్యములు, పటికబెల్లముతో చేసిన భక్ష్యములు అన్నీ ఇవ్వబడెను. 11

మూ. న నిఃసృతం భవత్యేష్టాద్వచనం యావదర్థినామ్, 12
తావద్వానరరక్షోభిర్దత్తమేవాభ్యదృశ్యత.

ప్ర. అ. అర్థినామ్ = యాచకులయొక్క, ఓష్ఠాత్ = పెదవినుండి, వచనమ్ = వచనము, యావత్ = ఎంతలో, నిఃసృతమ్ = బైటకు వచ్చినది, న భవతి =

కాదో, తావత్ = అంతలోనే, వానరరక్షోభిః = వానరులచేతను రాక్షసులచేతను, దత్తమ్ ఏవ = ఇవ్వబడినదిగానే, అదృశ్యత = చూడబడెను.

తా. యాచకుల పెదవులనుండి మాట బైటకు రాకమునుపే వానరులు రాక్షసులు వారికి కావలసినదానిని ఇచ్చుచుండిరి. 12

మూ. న కశ్చిన్మలినో వాపి దీనో వాప్యథవా కృశః, 13
తస్మిన్ యజ్ఞవరే రాజ్ఞో హృష్టపుష్టజనావృతే.

ప్ర. అ. రాజ్ఞః=రాజుయొక్క, హృష్టపుష్టజనావృతే=సంతోషించిన పరిపుష్టులైన జనులతో కూడిన, తస్మిన్ = ఆ, యజ్ఞవరే = శ్రేష్ఠమైన యజ్ఞమునందు, మలినః వాపి = మలినుడు గాని, దీనః వాపి = దీనుడు గాని, అథవా = లేక, కృశః = చిక్కినవాడు గాని, కశ్చిత్ = ఒక్కడూ కూడ, న = లేడు.

తా. సంతోషముతో పరిపుష్టి చెందిన జనులతో నిండిన ఆ యజ్ఞములో మలినముగా ఉన్నవాడు గాని, దీనుడు గాని, లేదా చిక్కినవాడు గాని లేడు. 13

మూ. యే చ తత్ర మహాత్మానో మునయశ్చిరజీవినః, 14
నాస్మరంస్తాదృశం యజ్ఞం దానౌఘసమలంకృతమ్.

ప్ర. అ. తత్ర = అక్కడ, మహాత్మానః = మహాత్ములైన, చిరజీవినః = చిరకాలము జీవించు, యే = ఏ, మునయః = మునులు గలరో వారు, దానౌఘస మలంకృతమ్ = దానముల సముదాయముచేత అలంకరించబడిన, తాదృశమ్ = అట్టి, యజ్ఞమ్ = యజ్ఞమును, న అస్మరన్ = స్మరించలేదు.

తా. అక్కడ ఉన్న చిరంజీవులైన మునులకు ఇన్ని దానములు చేసిన మరొక యజ్ఞము ఏదీ కూడ స్మృతికి రాలేదు. 14

మూ. యః కృత్యవాన్ సువర్ణేన సువర్ణం లభతే స్మ సః, 15
విత్తార్థీ లభతే విత్తం రత్నార్థీ రత్నమేవ చ.

ప్ర. అ. యః = ఎవడు, సువర్ణేన = బంగారముచేత, కృత్యవాన్ = పని కలవాడో, సః = అతడు, సువర్ణమ్ = బంగారమును, లభతే స్మ = పొందెను విత్తార్థీ=ధనమును కోరువాడు, విత్తమ్=ధనమును, లభతే=పొందెను రత్నార్థీ= రత్నములు కోరువాడు, రత్నమ్ ఏవ చ = రత్నమును పొందెను.

తా. బంగారము కావలసినవానికి బంగారము, ధనము కావలసినవానికి ధనము, రత్నములు కావలసినవానికి రత్నములు లభించెను. 15

మూ. హిరణ్యానాం సువర్ణానాం రత్నానామథ వాససామ్, 16
అనిశం దీయమానానాం రాశిః సముపదృశ్యతే.

ప్ర. అ. అనిశమ్ = ఎల్లప్పుడూ, దీయమానానామ్ = ఇవ్వబడుచున్న, హిరణ్యానామ్ = బంగారములయొక్క, సువర్ణానామ్ = వెండివస్తువులయొక్క, రత్నానామ్ = రత్నములయొక్క, అథ = మరియు, వాససామ్ = వస్త్రముల యొక్క, రాశిః = రాశి, సముపదృశ్యతే = చూడబడెను.

తా. నిరంతరము ఇచ్చివేయుచున్నను, బంగారము, వెండి, రత్నములు, వస్త్రములు రాసులుగా అక్కడ కనబడుచుండెను. 16

మూ. న శక్రస్య న సోమస్య యమస్య వరుణస్య వై, 17
ఈదృశో దృష్టపూర్వో న ఏవమూచుస్తపోధనాః.

ప్ర. అ. ఈదృశః = ఇట్టి యజ్ఞము, దృష్టపూర్వః = పూర్వము చూడ బడిఉన్నది, న = కాదు. శక్రస్య = ఇంద్రునిది, న = కాదు, సోమస్య = చంద్రు నిది, న = కాదు. యమస్య = యమునిది, వరుణస్యవై = వరుణునిది, న = కాదు. తపోధనాః = మునులు, ఏవమ్ = ఇట్లు, ఊచుః = పలికిరి.

తా. "ఇట్టి యజ్ఞమును మేము పూర్వ మెన్నడూ చూడలేదు. ఇంద్రుని యజ్ఞము గాని, సోముని యజ్ఞము గాని, యముని యజ్ఞము గాని, వరుణుని యజ్ఞము గాని ఇట్లు లేదు"అని మునులు పలికిరి. 17

మూ. సర్వత్ర వానరాస్తస్థుః సర్వత్రైవ చ రాక్షసాః, 18
వాసోధనాన్నమర్థిభ్యః పూర్ణహస్తా దదుర్భృశమ్.

ప్ర. అ. సర్వత్ర = అంతటా, వానరాః = వానరులు, తస్థుః = నిలిచి ఉండిరి. సర్వత్ర = అంతటా, రాక్షసాః చ ఏవ = రాక్షసులు, ఉండిరి. పూర్ణహస్తాః = నిండిన హస్తములు గలవారై, అర్థిభ్యః = యాచకులకొరకు, వాసోధనాన్నమ్ = వస్త్రములను, ధనమును, అన్నమును, దదుః = ఇచ్చిరి.

తా. ఎక్కడ చూచినా వానరులూ, రాక్షసులూ నిలిచి ఉండిరి. వారు నిండిన చేతులతో యాచకులకు వస్త్రములు, ధనము, అన్నము ఇచ్చుచుండిరి. 18

మూ. ఈదృశో రాజసింహస్య యజ్ఞః సర్వగుణాన్వితః, 19
సంవత్సరమయో సాగ్రం వర్తతే న చ హీయతే.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ద్వినవతితమః సర్గః.

ప్ర. అ. రాజసింహస్య = రాజులలో శ్రేష్ఠుడైన రామునియొక్క, సర్వ గుణాన్వితః = సమస్తగుణములతో కూడిన, యజ్ఞః = యజ్ఞము, ఈదృశః = ఈవిధమైనదై, సాగ్రమ్ = కొంచెము అధికముగా, సంవత్సరమయః = సంవత్సరము వ్యాపించినదై, వర్తతే = ఉన్నది. న హీయతే చ = తగ్గలేదు.

తా. రాజశ్రేష్ఠుడైన రాముని యజ్ఞము ఏ మాత్రము దానాదులలో తగ్గుదల లేక ఇదే విధముగ కొంచెము ఎక్కువ సంవత్సరము నడచెను. 19

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో తొంభైరెండవ సర్గ సమాప్తము.

అథ త్రినవతితమః సర్గః

[వాల్మీకి రాముని యజ్ఞమునకు వచ్చుట. రామాయణము గానము చేయుడని వాల్మీకి కుశలవులను ఆదేశించుట.]

మూ. వర్తమానే తథాభూతే యజ్ఞే చ పరమాద్భుతే,
సశిష్య ఆజగామాశు వాల్మీకిర్భగవాన్ఋషిః. 1

ప్ర. అ. తథాభూతే = అట్టి, పరమాద్భుతే = చాల ఆశ్చర్యకరమైన, యజ్ఞే = యజ్ఞము, వర్తమానే = జరుగుచుండగా, భగవాన్ = పూజ్యుడైన, వాల్మీకిః ఋషిః = వాల్మీకిమహర్షి, సశిష్యః = శిష్యులతో కూడినవాడై, ఆశు = శీఘ్రముగా, ఆజగామ = వచ్చెను.

తా. ఈ విధముగా చాల ఆశ్చర్యకరమైన ఆ యజ్ఞము జరుగుచుండగా, పూజ్యుడైన వాల్మీకిమహర్షి శిష్యులతో అక్కడికి శీఘ్రముగా వచ్చెను. 1

మూ. స దృష్ట్వా దివ్యసంకాశం యజ్ఞమద్భుతదర్శనమ్,
ఏకాన్తే ఋషివాటానాం చకార ఉటజాన్ శుభాన్. 2

ప్ర. అ. సః = ఆతడు, దివ్యసంకాశమ్ = దివ్యమైన, అద్భుతదర్శనమ్ = అద్భుతమైన దర్శనముగల, యజ్ఞమ్ = యజ్ఞమును, దృష్ట్వా = చూచి, ఋషి వాటానామ్ = ఋషుల నివాసప్రదేశముల, ఏకాన్తే = సమీపమునందు, శుభాన్ = శుభములైన, ఉటజాన్ = పర్ణశాలలను, చకార = నిర్మించెను.

తా. వాల్మీకి దివ్యమైన, చూచుటకు ఆశ్చర్యకరమైన ఆ యజ్ఞమును చూచి ఋషుల నివాసప్రదేశముల దగ్గర పర్ణశాలను నిర్మించెను. 2

మూ. శకటాంశ్చ బహూన్ పూర్ణాన్ ఫలమూలాంశ్చ శోభనాన్,
వాల్మీకివాటే రుచిరేఽస్థాపయన్నవిదూరతః. 3

ప్ర. అ. బహూన్ = అనేకమైన, పూర్ణాన్ = నిండిన, శకటాన్ చ = బండ్లను, శోభనాన్ = మంచి, ఫలమూలాన్ చ = ఫలములను, మూలములను, రుచిరే = సుందరమైన, వాల్మీకి వాటే = వాల్మీకి నివాసప్రదేశమునందు, అవిదూరతః = దగ్గరగా, అస్థాపయాన్ = ఉంచిరి.

తా. వాల్మీకి నివసించుచున్న అందమైన ప్రదేశము దగ్గర అనేక వస్తువులతో నిండిన బండ్లను, మంచి ఫలమూలములను ఉంచిరి. 3

మూ. ఆసీత్సుపూజితో రాజ్ఞా మునిభిశ్చ మహాత్మభిః,
వాల్మీకిః సుమహాతేజా న్యవసత్పరమాత్మవాన్. 4

ప్ర. అ. సుమహాతేజాః = చాల గొప్ప తేజస్సు గల, పరమాత్మవాన్ = ఉత్తమమైన మనస్సు గల, వాల్మీకిః = వాల్మీకి, రాజ్ఞా = రాజుచేతను, మహాత్మభిః = మహాత్ములైన, మునిభిః చ = మునులచేతను, సుపూజితః = బాగా పూజింపబడినవాడు, ఆసీత్ = ఆయెను. న్యవసత్ = నివసించెను.

తా. గొప్ప తేజస్సు ఉత్తమమైన మనస్సుగల ఆ వాల్మీకిని రాజు, మహాత్ములైన మునులు పూజించిరి. అతడు అక్కడ నివసించెను. 4

మూ. స శిష్యావబ్రవీద్దృష్టో యువాం గత్వా సమాహితౌ,
కృత్స్నం రామాయణం కావ్యం గాయతాం పరయా ముదా.

ప్ర. అ. సః = అతడు, హృష్టో = సంతోషించిన, శిష్యౌ = శిష్యులను గూర్చి, అబ్రవీత్ = పలికెను. యువామ్ = మీరిద్దరూ, సమాహితౌ = సావధానచిత్తులై, గత్వా = వెళ్ళి, పరయా = గొప్ప, ముదా = సంతోషముతో, కృత్స్నమ్ = సమస్తమైన, రామాయణం కావ్యమ్ = రామాయణకావ్యమును, గాయతామ్ = గానము చేయుడు.

తా. అతడు సంతోషించుచున్న శిష్యులిద్దరితో ఇట్లు పలికెను- "మీరిద్దరూ సావధానచిత్తులై సంతోషముతో రామాయణకావ్యము నంతనూ గానము చేయుడు". 5

మూ. ఋషివాటేషు పుణ్యేషు బ్రాహ్మణావసథేషు చ,
రథ్యాసు రాజమార్గేషు పార్థివానాం గృహేషు చ. 6.

ప్ర. అ. ఋషివాటేషు = ఋషుల నివాసస్థానములయందు, పుణ్యేషు = పవిత్రములైన, బ్రాహ్మణావసథేషు చ = బ్రాహ్మణుల గృహములయందు, రథ్యాసు = వీథులందు, రాజమార్గేషు = రాజమార్గములయందు, పార్థివానామ్ = రాజులయొక్క, గృహేషు చ = గృహములయందు, గానము చేయండి.

తా. ఋషులు నివసించు ప్రదేశములయందు, పవిత్రములైన బ్రాహ్మణ గృహములయందు, వీథులలోను, రాజమార్గములయందు, రాజుల ఇండ్లలోను గానము చేయుడు. 6

మూ. రామస్య భవనద్వారి యత్ర కర్మ చ కుర్వతే,
ఋత్విజామగ్రతశ్చైవ తత్ర గేయం విశేషతః. 7

ప్ర. అ. రామస్య = రామునియొక్క, భవనద్వారి = గృహద్వారమునందు, యత్ర = ఎక్కడ, కర్మ = అశ్వమేధయాగమును, కుర్వతే = చేయుచున్నారో, తత్ర = అక్కడ, ఋత్విజామ్ = ఋత్విక్కుల, అగ్రతః చ ఏవ = ఎదుటా, విశేషతః = విశేషించి, గేయమ్ = గానము చేయదగినది.

తా. రాముని గృహద్వారమునందు, అశ్వమేధముచేయుచున్న ప్రదేశమునందు, ఋత్విక్కుల ఎదుట విశేషించి గానము చేయవలెను. 7

మూ. ఇమాని చ ఫలాన్యత్ర స్వాదూని వివిధాని చ,
జాతాని పర్వతాగ్రేషు ఆస్వాద్యాస్వాద్య గమ్యతామ్. 8

ప్ర. అ. అత్ర = ఇక్కడ, పర్వతాగ్రేషు = పర్వతాగ్రములయందు, జాతాని = పుట్టిన, ఇమాని = ఈ, స్వాదూని = మధురమైన, వివిధాని = అనేక విధములైన, ఫలాని = ఫలములను, ఆస్వాద్య ఆస్వాద్య = తినీ తిని, గమ్యతామ్ = వెళ్లబడుగాక (వెళ్లెదరుగాక).

తా. ఇక్కడ పర్వతాగ్రములయందు, పుట్టిన మధురములైన, అనేక విధములైన ఫలములను తినీ తిని వెళ్లుడు. 8

మూ. న యాస్యథః శ్రమం వత్సౌ భక్షయిత్వా ఫలాని వై,
మూలాని చ సుమృష్టాని న రాగాత్పరిహాస్యథః. 9

ప్ర. అ. వత్సా = వత్సలారా! ఫలాని = ఫలములను, సుమృష్టాని = పరిశుద్ధములైన, మూలాని చ = మూలములను, భక్షయిత్వా = భక్షించి, శ్రమమ్ = శ్రమను, న యాస్యథః = పొందరు. రాగాత్ = రాగమునుండి, న పరిహాస్యథః = దూరముకారు.

తా. వత్సలారా! ఫలములను, పరిశుద్ధములైన మూలములను భక్షించినచో మీకు శ్రమ కలగదు: రాగము (కంఠస్వరము) చెడదు. 9

మూ. యది శబ్దాపయేద్రామః శ్రవణాయ మహీపతిః,
ఋషిణాముపవిష్టానాం తతో గేయం ప్రవర్తతామ్. 10

ప్ర. అ. మహీపతిః = రాజైన, రామః = రాముడు, శ్రవణాయ = వినుటకు శబ్దాపయేద్యది = పిలిపించినట్లయితే, తతః = అప్పుడు, ఋషీణామ్ = ఋషులు, ఉపవిష్టానామ్ = కూర్చొనిఉండగా, గేయమ్ = గానము, ప్రవర్తతామ్ = ప్రవర్తించుగాక.

తా. రాజైన రాముడు వినుటకై మిమ్ములను పిలిపించినచో ఋషులందరూ కూడ అక్కడ కూర్చొని ఉండగా గానము జరుగుగాక. 10

మూ. దివసే వింశతిః సర్గా గేయా మధురయా గిరా,
ప్రమాణైర్బహుభిస్తత్ర యథోద్దిష్టం మయా పురా. 11

ప్ర. అ. పురా = పూర్వము, మయా = నాచేత, బహుభిః = అనేకములైన, ప్రమాణైః = ప్రమాణములచేత, తత్ర = ఆ రామాయణమునందు, యథా = ఎట్లు, ఉద్దిష్టమ్ = చెప్పబడినదో ఆ విధముగా, దివసే = ఒక దివసమునందు, వింశతిః = ఇరవై, సర్గాః = సర్గలు, మధురయా = మధురమైన, గిరా = వాక్కుతో, గేయాః = గానముచేయదగినవి.

తా. నేను పూర్వము శ్లోకసంఖ్య మొదలైన ప్రమాణములను పట్టి చెప్పినట్లు రోజుకు ఇరవై చొప్పున ఆ రామాయణములోని సర్గలు మధురమైన వాక్కుతో గానముచేయవలెను. 11

మూ. లోభశ్చాపి న కర్తవ్యః స్వల్పోఽపి ధనవాఞ్ఛయా,
కిం ధనేనాశ్రమస్థానాం ఫలమూలాశినాం సదా. 12

ప్ర. అ. ధనవాఞ్ఛయా = ధనమునందు కోరికతో, స్వల్పః అపి = స్వల్పమైనను, లోభః చ = లోభము కూడ, న కర్తవ్యః = చేయదగినది కాదు. సదా = ఎల్లప్పుడూ, ఆశ్రమస్థానామ్ = ఆశ్రమములో ఉన్న, ఫలమూలాశినామ్ = ఫలమూలములను తినువారికి, ధనేన = ధనముచేత, కిమ్ = ఏమి ప్రయోజనము?

తా. ధనమునందు కోరికతో కొంచెము కూడ లోభము చేయకూడదు. నిత్యమూ ఆశ్రమములో ఉండి ఫలమూలములను తినుచుండువారికి ధన మెందుకు?

మూ. యది పృచ్ఛేత్న కాకుత్థ్సో యువాం కస్యేతి దారకౌ,
వాల్మీకేరస్య శిష్యౌ ద్వౌ బ్రూతమేవం నరాధిపమ్. 13

ప్ర. అ. కాకుత్థ్సః = రాముడు, యువామ్ = మీరు, కస్య = ఎవనియొక్క, దారకౌ ఇతి = పిల్లలు అని, పృచ్ఛేత యది = అడిగినట్లయితే, ద్వౌ = మేమిద్దరము, అస్య = ఈ, వాల్మీకేః = వాల్మీకియొక్క, శిష్యౌ = శిష్యులము; ఏవమ్ = ఇట్లు, నరాధిపమ్ = రాజును గూర్చి, బ్రూతమ్ = చెప్పుడు.

తా. మీరు ఎవరి పుత్రులు అని రాముడు అడిగినట్లయితే "మేము ఈ వాల్మీకి శిష్యులము" అని ఆ రాజుతో చెప్పుడు. 13

మూ. ఇమాస్తన్త్రీః సుమధురాః స్థానం వాపూర్వదర్శనమ్,
మూర్ఛయిత్వా సుమధురం గాయతం విగతజ్వరౌ. 14

ప్ర. అ. సుమధురాః = చాల మధురములైన, ఇమాః = ఈ, తన్త్రీః = వీణ తీగలను కాని, స్థానం వా = తంత్రులు బిగించే స్థానమును కాని, మూర్ఛయిత్వా = నాదవ్యాప్తి కలవాటినిగా చేసి, అపూర్వదర్శనమ్ = అపూర్వమైన దర్శనము కలుగునట్లుగా, సుమధురమ్ = చాల మధురముగా, విగతజ్వరౌ = ఏ బాధలూ లేనివారై, గాయతమ్ = గానముచేయుడు.

తా. చాల మధురస్వరమును పుట్టించు ఈ వీణాతంత్రులను కాని, వేరు వేరు స్వరముల నిష్పత్తికి మూలములైన వీణారస్సుమీద తీగలు బిగించిన స్థానముల మీద గాని నాదవ్యాప్తి కలుగునట్లు చేసి, నిర్భయముగా, మధురముగా గానము చేయుడు. 14

మూ. ఆదిప్రభృతి గేయం స్యాన్న చావజ్ఞాయ పార్థివమ్,
పితా హి సర్వభూతానాం రాజా భవతి ధర్మతః. 15

ప్ర. అ. ఆదిప్రభృతి = ప్రారంభముమొదలు, గేయమ్ = గానము చేయ వలసినది, స్యాత్ = అగును. పార్థివమ్ = రాజును, అవజ్ఞాయ = అనాదరము చేసి, న చ = గానము చేయదగదు. రాజా = రాజు, ధర్మతః = ధర్మమువలన, సర్వ భూతానామ్ = సకలభూతములకు, పితా = తండ్రి, భవతి హి = అగును కదా ?

తా. కావ్యమును మొదటినుండి గానము చేయవలెను. రాజు విషయమున అనాదరభావముతో గానము చేయకూడదు. ధర్మానుసారము రాజు సకలప్రాణు లకూ తండ్రి కదా ? 15

మూ. తద్యువాం హృష్టమనసౌ శ్వః ప్రభాతే సమాహితౌ,
గాయతం మధురం గేయం తన్త్రీలయసమన్వితమ్. 16

ప్ర. అ. తత్ = ఆ కారణమువలన, యువామ్ = మీరిద్దరూ, శ్వః = రేపు, ప్రభాతే = ప్రాతఃకాలమునందు, హృష్టమానసౌ = సంతోషించిన మనస్సులు కల వారై, సమాహితౌ = సావధానచిత్తులై, తన్త్రీలయసమన్వితమ్ = వీణ తీగల లయకు అనుగుణముగా, మధురమ్ = మధురమైన, గేయమ్ = గేయమును, గాయతమ్ = గానముచేయండి.

తా. అందువలన మీరిద్దరూ రేపు ప్రాతఃకాలమునందు, ఉత్సాహముతో, సావధానచిత్తులై, వీణాతంత్రుల లయకు సరిపోవునట్లు మధురమైన గేయమును గానము చేయండి. 16

మూ. ఇతి సందిశ్య బహుశో మునిః ప్రాచేతసస్తదా,
వాల్మీకిః పరమోదారస్తూష్ణిమాసీన్మహాయశాః. 17

ప్ర. అ. ప్రాచేతనః మునిః = ప్రచేతసుని వంశమునకు చెందిన ముని యైన, మహాయశాః = గొప్ప కీర్తి గల, పరమోదారః = మిక్కిలి ఉదారుడైన, వాల్మీకిః = వాల్మీకి, ఇతి = ఇట్లు, బహుశః = అనేకవిధముల, సందిశ్య = ఉపదే శించి, తూష్ణిమ్ ఆసీత్ = ఊరుకొనెను.

తా. ప్రచేతసుని వంశమునకు చెందిన, మిక్కిలి ఉదారుడైన, గొప్ప కీర్తిగల వాల్మీకి ఇట్లు అనేకవిధముల ఉపదేశించి మౌనముగా ఉండెను. 17

మూ. సందిష్టౌ మునినా తేన తావుభౌ మైథిలీసుతౌ,
తథైవ కరవావేతి నిర్జగ్మతురరిందమౌ. 18

ప్ర. అ. తేన = ఆ, మునినా = మునిచేత, సందిష్టౌ = ఉపదేశింపబడిన, అరిందమౌ = శత్రుసంహారకులైన, తౌ = ఆ, ఉభౌ = ఇద్దరు, మైథిలీసుతౌ = సీతాపుత్రులు, తథైవ = అట్లే, కరవావ = చేసెదము, ఇతి = అని, నిర్జగ్మతుః = వెళ్ళిరి.

తా. ఆ ముని ఇట్లు ఉపదేశించగా శత్రుసంహారకులైన ఆ సీతాపుత్రులిద్దరూ "అట్లే చేసెదము" అని పలికి వెళ్ళిరి. 18

మూ. తామద్భుతాం తౌ హృదయే కుమారౌ
నివేశ్య వాణీమృషిభాషితాం తదా,
సముత్సుకౌ తాం సుఖమూషతుర్నిశాం
యథాశ్వినౌ భార్గవనీతిసంహితామ్. 19

ప్ర అ. తౌ కుమారౌ = ఆ బాలులు, తదా = అప్పుడు, ఋషిభాషితామ్ = ఋషిచేత పలకబడిన, అద్భుతామ్ = అద్భుతమైన, తామ్ = ఆ, వాణీమ్ = వాక్కును, భార్గవనీతిసంహితామ్ = భార్గవుని నీతిసంహితను, అశ్వినౌ యథా = అశ్వినీదేవతలు వలె, హృదయే = హృదయమునందు, నివేశ్య = ఉంచి, సముత్సుకౌ = వేడుకగలవారై, తాం నిశామ్ = ఆ రాత్రిని, సుఖమ్ = సుఖముగా, ఊషతుః = ఉండిరి.

తా. ఆ బాలులు ఇద్దరూ ఋషి పలికిన అద్భుతములైన ఆ మాటలను, శుక్రుడు చెప్పిన నీతిశాస్త్రమును అశ్వినీదేవతలు వలె హృదయములో ఉంచుకొని, వేడుకతో, ఆ రాత్రిని సుఖముగా గడిపిరి. 19

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో తొంభైమూడవ సర్గ సమాప్తము.

అథ చతుర్నవతితమః సర్గః

[కుశలవులు రామాయణము గానము చేయుట. రాముడు ఆ గానమును సభలో వినుట.]

మూ. తౌ రజన్యాం ప్రభాతాయాం స్నాతౌ హుతహుతాశనౌ,
యథోక్తమృషిణా పూర్వం సర్వం తత్రోపగాయతామ్. 1

ప్ర. అ. తౌ = వారిద్దరూ, రజన్యామ్ = రాత్రి, ప్రభాతాయామ్ = తెల్లవారిన దగుచుండగా, స్నాతౌ = స్నానము చేసినవారై, హుతహుతాశనౌ = హోమము చేయబడిన అగ్ని కలవారై, పూర్వమ్ = పూర్వము, ఋషిణా = ఋషి చేత, యథా = ఎట్లు, ఉక్తమ్ = చెప్పబడినదో అట్లు, సర్వమ్ = సమస్తమును, తత్ర = అక్కడ, ఉపగాయతామ్ = గానముచేసిరి.

తా. రాత్రి తెల్లవారగానే వాళ్ళిద్దరూ స్నానము చేసి, అగ్నిలో హోమము చేసి పూర్వము ఋషి చెప్పిన విధముగ అక్కడ గానము చేసిరి. 1

మూ. తాం స శుశ్రావ కాకుత్స్థః పూర్వాచార్యవినిర్మితామ్,
అపూర్వాం పాఠ్యజాతిం చ గేయేన సమలంకృతామ్. 2

ప్ర. అ. సః = ఆ, కాకుత్స్థః = రాముడు, పూర్వాచార్యవినిర్మితామ్ = పూర్వాచార్యులచేత నిర్మింపబడిన, అపూర్వామ్ = క్రొత్తదైన, గేయేన = గానముతో, సమలంకృతామ్ = అలంకరించబడిన, పాఠ్యజాతిం చ = పాఠ్యములైన షడ్జాదుల జాతిని, శుశ్రావ = వినెను.

తా. రాముడు ప్రాచీనులైన సంగీతాచార్యులచేత నిర్మించబడిన, గానముచేత అలంకరింపబడిన, అపూర్వమైన ఆషడ్జాదిస్వరజాతిని (ఆ మునికుమారులు పాడుచుండగా) వినెను. 2

మూ. ప్రమాణైర్బహుభిర్బద్ధాం తన్త్రీలయసమన్వితామ్,
బాలాభ్యాం రాఘవః శ్రుత్వా కౌతూహలపరోఽభవత్. 3

ప్ర. అ. బహుభిః = అనేకములైన, ప్రమాణైః=ద్రుత-మధ్య-విలంబితాది ధ్వనిప్రమాణముతో, బద్ధామ్ = కూర్చబడిన, తన్త్రీలయసమన్వితామ్ = తీగల లయతో కూడిన ఆ గీతిని, రాఘవః = రాముడు, బాలాభ్యామ్ = బాలుల నుండి, శ్రుత్వా = విని, కౌతూహలపరః = వేడుకగలవాడు, అభవత్ = ఆయెను.

తా. రాముడు, ద్రుత-మధ్య-విలంబితాది ప్రమాణములతో కూడిన, వీణా తంత్రీలయకు అనుగుణముగా ఉన్న ఆ గీతిని బాలులనుండి విని కుతూహలము చెందెను ? 3

మూ. అథ కర్మాన్తరే రాజా సమాహూయ మహామునీన్,
పార్థివాంశ్చ నరవ్యాఘ్రః పణ్డితాన్నైగమాంస్తదా. 4
పౌరాణికాన్ శబ్దవిదో యే వృద్ధాశ్చ ద్విజాతయః,
స్వరాణాం లక్షణజ్ఞాంశ్చ ఉత్సుకాన్ ద్విజసత్తమాన్. 5
లక్షణజ్ఞాంశ్చ గాన్ధర్వాన్నైగమాంశ్చ విశేషతః,
పాదాక్షరసమాసజ్ఞాంశ్చన్దస్సు పరినిష్ఠితాన్. 6
కలామాత్రావిశేషజ్ఞాన్ జ్యోతిషే చ పరం గతాన్,
క్రియాకల్పవిదశ్చైవ తథా కావ్యవిశారదాన్. 7
భాషాజ్ఞానిఙ్గితజ్ఞాంశ్చ నైగమాంశ్చాప్యశేషతః,
హేతూపచారకుశలాన్ హైతుకాంశ్చ బహుశ్రుతాన్. 8
ఛన్దోవిదః పురాణజ్ఞాన్ వైదికాన్ ద్విజసత్తమాన్,
చిత్రజ్ఞాన్ వృత్తసూత్రజ్ఞాన్ గీతనృత్యవిశారదాన్. 9
శాస్త్రజ్ఞాన్నీతినిపుణాన్వేదాన్తార్థప్రకాశకాన్,
ఏతాన్ సర్వాన్ సమానీయ గాతౌ రౌ సమవేశయత్. 10

ప్ర. అ. అథ = అటుపిమ్మట, నరవ్యాఘ్రః=నరశ్రేష్ఠుడైన, రాజా=రాజు,

కర్మాన్తరే = యాగకర్మమధ్యయందు, మహామునీన్ = మహాములను, పార్థివాన్ చ = రాజులను, పణ్డితాన్ = పండితులను, తథా = మరియు, నైగమాన్ = శాస్త్రజ్ఞులను, పౌరాణికాన్ = పౌరాణికులను, శబ్దవిదః = శబ్దవేత్తలను, వృద్ధాః = వృద్ధులైన, యే = ఏ, ద్విజాతయః = బ్రాహ్మణులు గలరో వాళ్ళను, స్వరాణామ్ = స్వరములయొక్క, లక్షణజ్ఞాన్ = లక్షణములను ఎరిగినవాళ్ళను, ఉత్సుకాన్ = వేడుకగల, ద్విజసత్తమాన్ = బ్రాహ్మణశ్రేష్ఠులను, లక్షణజ్ఞాన్ చ = లక్షణములు ఎరిగినవాళ్ళను, విశేషతః = విశేషించి, గాన్ధర్వాన్ = గాంధర్వశాస్త్రవేత్తలను, నైగమాన్ = ఆ యా సంఘముల అధ్యక్షులను, పాదాక్షరసమాసజ్ఞాన్ = పాదలములయొక్క అక్షరములయొక్క సంబంధమును ఎరిగినవాళ్ళను, ఛన్దఃసు = ఛందస్సులలో, పరినిష్ఠితాన్ = విశారదులను, కలామాత్రావిశేషజ్ఞాన్ = అచ్చుల, మాత్రల విశేషములను ఎరిగినవార్లను, జ్యోతిషే = జ్యోతిషమునందు, పరమ్ = ఉత్తమస్థానమును, గతాన్ = పొందినవారినీ, క్రియాకల్పవిదః చైవ = అలంకారశాస్త్రమును ఎరిగినవారిని, కావ్యవిశారదాన్ = కావ్యములందు నేర్పుగల వారిని, భాషాజ్ఞాన్ = సకలభాషలను ఎరిగినవారిని, అశేషతః = సమస్తమైన, నైగమాన్ = వర్తకులను, ఇఙ్గితజ్ఞాన్ = ఇతరుల మనోభావములను ఎరిగినవారిని, హేతూపచారకుశలాన్ = వ్యవహారకాలమునందు యుక్తులను ప్రయోగించుటలో నేర్పు గలవారిని, హైతుకాన్ చ = న్యాయశాస్త్రవేత్తలను, బహుశ్రుతాన్ = బాగా చదువుకున్నవారినీ, ఛన్దోవిదః = చందస్సులను ఎరిగినవారిని, పురాణజ్ఞాన్ = పురాణములు తెలిసినవారినీ, వైదికాన్ = వేదపండితులను, ద్విజసత్తమాన్ = ఉత్తములైన ద్విజులను, చిత్రజ్ఞాన్ = చిత్రకళ ఎరిగినవారిని, వృత్తసూత్రజ్ఞాన్ = వృత్తశాస్త్రములు ఎరిగినవారినీ, గీతనృత్యవిశారదాన్ = గీతమునందు, నృత్యమునందు విశారదులను, శాస్త్రజ్ఞాన్ = శాస్త్రములను ఎరిగినవారిని, నీతినిపుణాన్ = నీతియందు నేర్పు గలవారిని, వేదాన్తార్థప్రకాశకాన్ = వేదాంతవిషయములను బోధించేవారినీ, ఏతాన్ = వీరిని, సర్వాన్ = అందరినీ, సమాహూయ = పిలిచి, సమానీయ = రప్పించి, గాతారౌ = ఆ గాయకులిద్దరినీ, సమవేశయత్ = సభకు రప్పించెను.

తా. పిమ్మట, నరులలో శ్రేష్ఠుడైన రాజు అశ్వమేధయాగము మధ్య మహాములను, రాజులను, పండితులను, ఆ యా సంఘముల అధ్యక్షులను, పౌరాణికులను; శబ్దశాస్త్రవేత్తలైన వృద్ధులైన బ్రాహ్మణులను, స్వరలక్షణము తెలిసిన

వాళ్ళను, గానము వినుటయందు ఆసక్తిగల బ్రాహ్మణోత్తములను, లక్షణశాస్త్రము తెలిసినవాళ్ళను, విశేషించి గాంధర్వశాస్త్రనిపుణులను, పాదములయొక్క సంబంధము తెలిసినవాళ్ళను. ఛందస్సులలో మంచి జ్ఞానము కలవాళ్ళను, స్వరముల (అచ్చుల) మాత్రల విశేషములను ఎరిగినవాళ్ళను, జ్యోతిషమునందు పరినిష్ఠితులను, అలంకారశాస్త్రవేత్తలను, కావ్యములలో విశారదులను, అనేకభాషలు తెలిసినవారిని, పరుల మనస్సులోని భావమును గ్రహించే నేర్పు కలవారినీ, అనేకులు వక్తలను, వ్యవహారములందు యుక్తియుక్తముగా మాటలాడగలవారిని, న్యాయశాస్త్రప్రవీణులను, అత్యధికశాస్త్రజ్ఞానవంతులను, ఛందస్సు తెలిసినవాళ్ళను, పురాణములు తెలిసినవాళ్ళను, వేదపండితులైన ద్విజశ్రేష్ఠులను, చిత్రకళ తెలిసినవారినీ, వృత్తశాస్త్రమునందు ప్రవేశ మున్నవాళ్ళను, గీత-నృత్యములయందు విశారదులను, శాస్త్రజ్ఞులను, నీతియందు నేర్పుగలవారిని, వేదాంతార్థమును విశదీకరించువారినీ, వీరి నందరినీ పిలిపించి, రప్పించి గాయకులైన ఆ బాలులను సభకు పిలిపించెను. 4-10

మూ. తేషాం సంవదతాం తత్ర శ్రోతృణాం హర్షవర్ధనమ్,
గేయం ప్రచక్రతుస్తత్ర తావుభౌ మునిదారకౌ. 11

ప్ర. అ. తేషామ్ = ఆ, శ్రోతృణామ్=శ్రోతలు, తత్ర = అక్కడ, సంవదతామ్ = మాటలాడుకొనుచుండగా, తత్ర = ఆ సమయమునందు, తౌ = ఆ, మునిదారకౌ = మునిబాలకులు, ఉభౌ=ఇద్దరూ, హర్షవర్ధనమ్ = హర్షమును వృద్ధి పొందించు, గేయమ్=గానమును, ప్రచక్రతుః=ప్రారంభించిరి.

తా. ఆ శ్రోత లందరూ మాటలాడుకొనుచుండగా ఆ మునికుమారు లిద్దరూ అక్కడ ఆనందమును వృద్ధి పొందించు గానమును ప్రారంభించిరి. 11

మూ. తతః పవృత్తం మధురం గాన్ధర్వమతిమానుషం,
న చ తృప్తిం యయుః సర్వే శ్రోతారో గేయసంపదా. 12

ప్ర. అ. తతః = అటుపిమ్మట, అతిమానుషమ్ = మనుష్యులను అతిక్రమించిన, మధురమ్=మధురమైన, గాన్ధర్వమ్=సంగీతము, ప్రవృత్తమ్=ప్రారంభమైనది. సర్వే = సమస్తమైన, శ్రోతారః = శ్రోతలు, గేయసంపదా = గానసంపదచేత, తృప్తిమ్ = తృప్తిని, న యయుః=పొందలేదు.

తా. పిమ్మట మనుష్యులలో దుర్లభమైన మధురమైన గానము ప్రారంభమయ్యెను. ఆ గానసంపదను ఎంత విన్నను శ్రోతలకు తృప్తి కలగలేదు. 12

మూ. హృష్టా మునిగణాః సర్వే పార్థివాశ్చ మహౌజసః,
పిబన్త ఇవ చక్షుర్భిః పశ్యన్తి స్మ ముహుర్ముహుః 13

ప్ర. అ. హృష్టాః=సంతోషించిన, మునిగణాః=మునిగణములు, సర్వే=అన్నీ, మహౌజసః=గొప్ప తేజస్సు గల, పార్థివాః చ=రాజులూ, చక్షుర్భిః=నేత్రములచేత, పిబన్తః ఇవ=త్రాగుచున్నవారు వలె, ముహుః ముహుః=మాటి మాటికి, పశ్యన్తి స్మ=చూచుచుండిరి.

తా. సమస్తమైన మునులు, గొప్ప తేజస్సు గల రాజులు నేత్రాలతో త్రాగుచున్నారా అన్నట్లు మాటి మాటికి ఆ బాలులను చూచుచుండిరి. 13

మూ. ఊచుః పరస్పరం చేదం సర్వ ఏవ సమాహితాః,
ఉభౌ రామస్య సదృశౌ బిమ్బాద్బిమ్బమివోద్ధృతమ్. 14

ప్ర. అ సర్వే ఏవ=అందరూ, సమాహితాః=సావధానచిత్తులై, ఇదమ్=ఈ వాక్యమును, పరస్పరమ్=పరస్పరమును, ఊచుః=పలికిరి. బిమ్బాత్=బింబమునుండి, ఉద్ధృతమ్=పైకి తీయబడిన, బిమ్బమ్ ఇవ=బింబమువలె, ఉభౌ=ఇద్దరూ కూడ, రామస్య=రామునకు, సదృశౌ=సమముగా ఉన్నారు.

తా. సావధానచిత్తులైన వారందరూ ఒకరితో ఒకరు ఇట్లు అనుకొనుచుండిరి. "ఈ బాలు లిద్దరూ బింబమునుండి వెలికి తీసిన బింబము వలె రాముని పోలికతో ఉన్నారు. 14

మూ. జటిలౌ యది నస్యాతాం నవల్కలధరౌ యది,
విశేషం నాధిగచ్ఛామో గాయతో రాఘవస్య చ. 15

ప్ర. అ. జటిలౌ=జటాధారులు, నస్యాతాం యది=కాకపోయినచో, వల్కలధరౌ=నారబట్టలను ధరించినవారు, న యది=కాకపోయినచో, గాయతోః=గానముచేయుచున్నవారికీ, రాఘవస్య చ=రామునికీ, విశేషమ్=భేదమును, నాధిగచ్ఛామః=చూడము.

తా. ఈ బాలులిద్దరూ జటలు, నారబట్టలు ధరించకపోయినచో గానము చేయుచున్న ఈ బాలులకూ రామునకూ భేద మేమీ కనబడదు. 15

మూ. ఏవం ప్రభాషమాణేషు పౌరజానపదేషు చ,
ప్రవృత్తమాదితః పూర్వసర్గం నారదదర్శితమ్. 16

ప్ర. అ. పౌరజానపదేషు = పౌరులూ జానపదులూ, ఏవమ్ = ఇట్లు, ప్రభాషమాణేషు=మాటలాడుచుండగా, ఆదితః=మొదటిదైన, నారదదర్శితమ్= నారదునిచేత చూపబడిన, పూర్వసర్గమ్ = మొదటిదైన సర్గ, ప్రవృత్తమ్ = జరిగినది.

తా. పౌరులు, జానపదులు ఇట్లు మాట్లాడుకొనుచుండగా నారదుడు రామ కథను వాల్మీకికి చెప్పిన మొదటి సర్గ పూర్తి అయినది. 16

మూ. తతః ప్రభృతిః సర్గాంశ్చ యావద్వింశత్యగాయతామ్,
తతోఽపరాహ్ణసమయే రాఘవః సమభాషత, 17
శ్రుత్వా వింశతిసర్గాంస్తాన్ భ్రాతరం భ్రాతృవత్సలః.

ప్ర. అ. తతః ప్రభృతి = ఆది మొదలు (అనగా రెండవ సర్గ మొదలు) యావద్వింశతి = ఇరవైయవ సర్గవరకు, అగాయతామ్ = గానముచేసిరి. తతః అటుపిమ్మట, భ్రాతృవత్సలః=సోదరులయందుప్రేమగల, రాఘవః=రాముడు, తాన్=ఆ. వింశతి సర్గాన్ = ఇరవైసర్గలను, శ్రుత్వా=విని, భ్రాతరమ్=సోదరుని గూర్చి, అపరాహ్ణ సమయే=అపరాహ్ణసమయమునందు, పర్యభాషత=పలికెను.

తా. పిమ్మట రెండవ సర్గ మొదలు ఇరవై సర్గలు గానము చేసిరి. పిమ్మట ఆ ఇరవై సర్గలు విని, సోదరులయందు ప్రేమ గల రాముడు అపరాహ్ణసమయము నందు సోదరునితో ఇట్లనెను. 17

మూ. అష్టాదశసహస్రాణి సువర్ణస్య మహాత్మనోః, 18
ప్రయచ్ఛ శీఘ్రం కాకుత్స్థ యదన్యదభికాఙ్క్షితమ్,
దదౌ స శీఘ్రం కాకుత్స్థో బాలయోర్వై పృథక్ పృథక్.

ప్ర. అ. కాకుత్స్థ = లక్ష్మణా! మహాత్మనోః=మహాత్ములకు, సువర్ణస్య=

బంగారముయొక్క, అష్టాదశసహస్రాణి = పదునెనిమిది వేలను, అన్యత్ = ఇతరమైన, అభికాఙ్క్షితమ్ = కోరబడినది, యత్ = ఏది ఉండునో దానినీ, శీఘ్రమ్ = శీఘ్రముగా, ప్రయచ్ఛ = ఇమ్ము. సః = ఆ, కాకుత్స్థః = లక్ష్మణుడు, బాలయోః = బాలులకు, పృథక్ పృథక్ = వేరు వేరుగా, శీఘ్రమ్ = శీఘ్రముగా, దదౌ = ఇచ్చెను.

తా. "లక్ష్మణా! ఈ మహాత్ములిద్దరికీ, శీఘ్రముగా, పద్దెనిమిది వేల బంగారు నాణెములు, వీరికి ఇంకను ఏమైన కావలసినచో దానిని ఇమ్ము". లక్ష్మణుడు వెంటనే ఆ బాలులకు వేరు వేరుగా ఇచ్చెను. 18,19

మూ. దీయమానం సువర్ణం తు నాగృహ్ణీతాం కుశీలవౌ,
ఊచతుశ్చ మహాత్మానౌ కిమనేనేతి విస్మితౌ. 20

ప్ర. అ. కుశీలవౌ = ఆ గాయకులు, దీయమానమ్ = ఇవ్వబడుచున్న, సువర్ణమ్ = బంగారమును, నాగృహ్ణీతామ్ = తీసికొనలేదు. అనేన = దీనిచేత, కిమ్ = ఏమి ప్రయోజనము, ఇతి = అని, విస్మితౌ = ఆశ్చర్యముచెందినవారై, మహాత్మానౌ = ఆమహాత్ములు, ఊచతుః చ = పలికిరి.

తా. ఆ గాయకులు లక్ష్మణు డిచ్చుచున్న ఆ బంగారు నాణెములను తీసికొనలేదు. ఆ మహాత్ములు ఈ బంగారము ఎందుకు అని ఆశ్చర్యపడుచు ఇట్లనిరి.

మూ వన్యేన ఫలమూలేన నిరతౌ వనవాసినౌ,
సువర్ణేన హిరణ్యేన కిం కరిష్యామ హే వనే. 21

ప్ర. అ. వన్యేన = వనమునకు సంబంధించిన, ఫలమూలేన = ఫలమూలములతో, నిరతౌ = ఆసక్తులమైన, వనవాసినౌ = వనమునందు నివసించు మేము, సువర్ణేన = వెండిచేత, హిరణ్యేన = బంగారముచేత, వనే = వనమునందు, కిం కరిష్యావహే = ఏమి చేసెదము?

తా. వనములో లభించు ఫలమూలములతో జీవించు వనవాసులమైన మేము, వనములో వెండితోను, బంగారముతోను ఏమి చేసికొనెదము? 21

మూ. తథా తయోః ప్రబ్రువతోః కౌతూహలసమన్వితాః,
శ్రోతారశ్చైవ రామశ్చ సర్వ ఏవ తు విస్మితాః. 22

ప్ర అ. తయోః = వాళ్ళిద్దరూ, తథా = అట్లు, ప్రబ్రువతోః = పలుకు చుండగా, శ్రోతారః చ = శ్రోతలు, రామః చ = రాముడు, సర్వే ఏవ = అందరూ, కౌతూహలసమన్వితాః = వేడుకతో కూడినవారై, సువిస్మితాః = చాల ఆశ్చర్యపడిరి.

తా. వారిద్దరూ ఆ విధముగా పలుకుచుండగా శ్రోతలు, రాముడు, అందరూ కూడ వేడుకతో కూడినవారై ఆశ్చర్యపడిరి. 22

మూ. తస్య చైవాగమం రామః కావ్యస్య శ్రోతుముత్సుకః,
పప్రచ్ఛ తౌ మహాతేజసావుభౌ మునిదారకౌ. 23

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, రామః = రాముడు, తస్య కావ్యస్య = ఆ కావ్యముయొక్క, ఆగమమ్ = రాకను, శ్రోతుమ్ = వినుటకు, ఉత్సుకః = వేడుక గలవాడై, తే = ఆ, మునిదారకౌ = మునికుమారులను, ఉభౌ = ఇద్దరిని, పప్రచ్ఛ = అడిగెను.

తా. గొప్ప తేజస్సు గల రాముడు ఆ కావ్యము ఎట్లు వచ్చినదో తెలిసికొన వలె ననుకోరికతో ఆ మునికుమారుల నిద్దరినీ ప్రశ్నించెను. 23

మూ. కింప్రమాణమిదం కావ్యం కా ప్రతిష్ఠా మహాత్మనః,
కర్తా కావ్యస్య మహతః క్వ చాసౌ మునిపుఙ్గవః. 24

ప్ర. అ. ఇదమ్ = ఈ, కావ్యమ్ = కావ్యము, కింప్రమాణమ్ = ఏమి ప్రమాణము గలది? మహాత్మనః = ఆ మహాత్మునియొక్క, ప్రతిష్ఠా = ప్రతిష్ఠ, కా = ఏమి? మహతః = గొప్పదైన, కావ్యస్య = కావ్యముయొక్క, కర్తా = కర్త యైన, అసౌ = ఈ, మునిపుంగవః = మునిశ్రేష్ఠుడు, క్వ చ = ఎక్కడ ఉన్నాడు?

తా. ఈ కావ్యము ప్రమాణ మెంత? మహాత్ముడైన రచయిత జేశ మేది? ఈ గొప్ప కావ్యమును రచించిన మునిశ్రేష్ఠుడు ఎక్కడ ఉన్నాడు? 24

మూ. పృచ్ఛన్తం రాఘవం వాక్యమూచతుర్మునిదారకౌ,
వాల్మీకిర్భగవాన్ కర్తా సంప్రాప్తో యజ్ఞసంవిధమ్. 25

ప్ర. అ. పృచ్ఛన్తమ్ = అడుగుచున్న, రాఘవమ్ = రాముణ్ణి గూర్చి, మునిదారకౌ = మునికుమారులు, వాక్యమ్ = వాక్యమును, ఊచతుః = పలికిరి,

కర్తా = కర్తయైన, భగవాన్ = భగవంతుడైనట్టి వాల్మీకిః = వాల్మీకి, యజ్ఞసంవిధమ్ = యజ్ఞసమీపమును గూర్చి, సంప్రాప్తః = వచ్చినాడు.

తా. ఇట్లు ప్రశ్నించుచున్న రామునితో ఆ మునికుమారులు ఇట్లు పలికిరి. "ఈ కావ్యమును రచించిన భగవంతుడైన వాల్మీకి యజ్ఞసమీపమునకు వచ్చి ఉన్నాడు. 25

మూ. యేనేదం చరితం తుభ్యమశేషం సంప్రదర్శితమ్,
సంనిబద్ధం హి శ్లోకానాం చతుర్వింశత్సహస్రకమ్. 26

ప్ర. అ. యేన = ఏకావ్యముచేత, తుభ్యమ్ = నీయొక్క, అశేషమ్ = సమస్తమైన, చరితమ్ = చరితము, సంప్రదర్శితమ్ = చూపబడినదో ఆ కావ్యము, శ్లోకానామ్ = శ్లోకములయొక్క, చతుర్వింశత్సహస్రకమ్ = ఇరవైనాలుగు వేలుగా, సంనిబద్ధం హి = రచింపబడినది.

తా. నీ చరిత్రమును పూర్తిగా వర్ణించిన ఈ కావ్యము ఇరవైనాలుగు వేల శ్లోకాలలో రచింపబడినది. 26

మూ. ఉపాఖ్యానశతం చైవ భార్గవేణ తపస్వినా,
ఆదిప్రభృతి వై రాజన్ పఞ్చసర్గశతాని చ, 27
కాణ్డాని షట్ కృతానీహ సోత్తరాణి మహాత్మనా.

ప్ర. అ. రాజన్ = రాజా! ఉపాఖ్యానశతంచైవ = వందఉపాఖ్యానములు, ఆదిప్రభృతి = మొదటిది మొదలు, పఞ్చ = ఐదు, సర్గశతాని = సర్గల శతములు, సోత్తరాణి = ఉత్తరకాండతో కూడిన, షట్ = ఆరు, కాణ్డాని = కాండములు, ఇహ = దీనియందు, మహాత్మనా = మహాత్ముడైన, తపస్వినా = తపస్సుగల, భార్గవేణ = వాల్మీకిచేత, కృతాని = చేయబడినవి.

తా. రాజా! మహాత్ముడైన, తపఃశాలియైన వాల్మీకిమహాముని నూరు ఉపాఖ్యానములను, మొదటి సర్గ మొదలు ఐదువందల సర్గలను, ఉత్తరకాండతోకూడిన ఆరు కాండలను ఈ కావ్యములో రచించెను. 27

మూ. కృతాని గురుణాస్మాకమృషిణా చరితం తవ, 28
ప్రతిష్ఠా జీవితం యావత్తావత్సర్వస్య వర్తతే.

ప్ర. అ. తవ = నీయొక్క, చరితమ్ = చరిత్రను గూర్చి, అస్మాకమ్ = మాయొక్క, ఋషిణా = ఋషిచేత, కృతాని = రచించబడినవి. జీవితమ్ = నాయకుని జీవితము, యావత్ = ఎంత వరకో, తావత్ = అంతవరకు, సర్వస్య = సమస్తమైన చరితముయొక్క, ప్రతిష్ఠా = ప్రతిష్ఠ (దీనిలో ఉన్నది).

తా. మా ఋషి నీ చరిత్రకు సంబంధించిన ఈ కాండాదులను రచించెను. కావ్యనాయకుని జీవితము ఎంతవరకు ఉండునో అంతవరకు ఉన్న కథ దీనిలో నిక్షిప్తమై ఉన్నది. 28

మూ. యది బుద్ధిః కృతా రాజన్ శ్రవణాయ మహారథ, 29
కర్మాన్తరే క్షణీభూతస్తచ్ఛృణుష్వ సహానుజః.

ప్ర. అ. మహారథ = మహారథుడవైన, రాజన్ = రాజా! శ్రవణాయ = వినుటకొరకు, బుద్ధిః = బుద్ధి, కృతా యది = చేయబడినట్లయితే, కర్మాన్తరే = యాగములో లభించు అవకాశమునందు, క్షణీభూతః = తీరికగలవాడవై, సహానుజః = తమ్ములతో కూడినవాడవై, తత్ = దానిని, శృణుష్వ = వినుము.

తా. మహారథుడవైన రాజా! నీకు వినవలె ననుబుద్ధిఉన్నచో యజ్ఞ మధ్యమునందు తీరిక చేసికొని, తమ్ములతో కలిసి వినుము. 29

మూ. బాఢమిత్యబ్రవీద్రామస్తౌ చానుజ్ఞాప్య రాఘవమ్, 30
ప్రహృష్టౌ జగ్మతుః స్థానం యత్రాస్తే మునిపుంగవః.

ప్ర. అ. రామః = రాముడు, బాఢమ్ = తప్పక అట్లే, ఇతి = అని, అబ్రవీత్ = పలికెను, తౌ చ = వారిద్దరూ, రాఘవమ్ = రాముణ్ణి, అనుజ్ఞాప్య = అనుజ్ఞ ఇచ్చునట్లు చేసికొని, ప్రహృష్టౌ = సంతోషించినవారై, మునిపుంగవః = మునిశ్రేష్ఠుడు, యత్ర = ఎక్కడ; ఆస్తే = ఉన్నాడో, స్థానమ్ = ఆ స్థానమును గూర్చి జగ్మతుః = వెళ్ళిరి.

తా. రాముడు "తప్పక అట్లే చేసెదము" అనెను. ఆ ఱాలు లిద్దరూ రాముని అనుమతి పొంది, వాల్మీకి ఉన్న స్థానమునకు వెళ్ళిరి. 30

మూ. రామోఽపి మునిభిః సార్ధం పార్థివైశ్చ మహాత్మభిః, 31
శ్రుత్వా తద్గీతమాధుర్యం కర్మశాలాముపాగమత్.

ప్ర. అ. రామోఽపి = రాముడు కూడ, మునిభిః సార్ధమ్ = మునులతోను, మహాత్మభిః = మహాత్ములైన, పార్థివైః చ = రాజులతోను, తద్గీతమాధుర్యమ్ = ఆ గీతముయొక్క మాధుర్యమును, శ్రుత్వా = విని, కర్మశాలామ్ = యజ్ఞశాలను గూర్చి, ఉపాగమత్ = వచ్చెను.

తా. రాముడు కూడ మునులతోను మహాత్ములైన రాజులతోను కలిసి ఆ గీతమాధుర్యమును ఆస్వాదించి యజ్ఞశాలకు వెళ్ళెను. 31

మూ. శుశ్రావ తత్తాలలయోపపన్నం
సర్గాన్వితం సుస్వరశబ్దయుక్తమ్,
తన్త్రీలయవ్యఞ్జనయోగయుక్తం
కుశీలవాభ్యాం పరిగీయమానమ్. 32

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
చతుర్నవతితమః సర్గః

ప్ర. అ తాలలయోపపన్నమ్ = తాలలయలతో కూడిన, సర్గాన్వితమ్ = సర్గలతో కూడిన, సుస్వరశబ్దయుక్తమ్ = మంచి స్వరములు గల శబ్దములతో కూడిన, తన్త్రీలయవ్యఞ్జనయోగయుక్తమ్ = తంత్రుల లయముతోను, వ్యంజన యోగముతోను కూడిన, కుశీలవాభ్యామ్ = ఆ గాయకులచేత, పరిగీయమానమ్ = గానము చేయబడుచున్న, తత్ = ఆ కావ్యమును, శుశ్రావ = వినెను.

తా. ఆ గాయకులైన బాలులు గానము చేసిన కావ్యము తాలలయలకు సరిపడునట్లు ఉండెను. సర్గలలో విభక్తమైన ఆ కావ్యములోని శబ్దములు స్వరములకు అనుకూలముగా ఉండెను. వీణాతంత్రుల లయకు అనుగుణమై మధురమైన వ్యంజనముల (హల్లుల)తో కూడి యున్న ఆ కావ్యమును; రాముడు వినెను (ఈ శ్లోకము చాల ప్రతులలో లేదు.)

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో తొంభైనాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చనవతితమః సర్గః.

[సీత తన పరిశుద్ధత్వాము విషయమున శపథము చేయవలె నని రాముడు అనుట.]

మూ. రామో బహూన్యహాన్యేవం తద్ గీతం పరమం శుభమ్,
శుశ్రావ మునిభిః సార్ధం పార్థివైః సహ వానరైః. 1

ప్ర. అ. రామః=రాముడు; మునిభిః సార్ధమ్=మునులతోను, పార్థివైః=రాజులతోను, వానరైఃసహ = వానరులతోను, ఏవమ్=ఇట్లు, బహూని = అనేకములైన, అహాని = దివసములను, పరమమ్ = మిక్కిలి, శుభమ్ = శుభమైన, తత్ గీతమ్ = ఆ గీతమును, శుశ్రావ = వినెను.

తా. రాము డీ విధముగ మునులతోను, రాజులతోను, వానరులతోను కలిసి శుభమైన ఆ గీతమును చాల రోజులు వినెను 1

మూ. తస్మిన్ గీతే తు విజ్ఞాయ సీతాపుత్రౌ కుశీలవౌ,
తస్యాఃపరిషదో మధ్యే రామో వచనమబ్రవీత్, 2
దూతాన్ శుద్ధసమాచారానాహూయాత్మమనీషయా.

ప్ర. అ. తస్మిన్ = ఆ, గీతే = గీతమునందు, కుశీలవౌ=ఆ గాయకులను, సీతాపుత్రౌ = సీతయొక్క పుత్రులనుగా, విజ్ఞాయ = తెలిసికొని, రామః = రాముడు, శుద్ధసమాచారాన్ = పరిశుద్ధమైన ఆచారము గల, దూతాన్ = దూతలను, ఆత్మమనీషయా = తన బుద్ధిచేత, ఆహూయ=పిలచి, తస్యాఃపరిషదఃమ ఆ పరిషత్తుయొక్క, మధ్యే = మధ్యయందు, వచనమ్ = వచనమును, అబ్రవీత్ =పలికెను.

తా. ఆ గీతమును పట్టి ఆ గాయకులు సీత పుత్రులే అని తెలిసికొని రాముడు తన ఆలోచనప్రకారమే పరిశుద్ధమైన నడవడిక గల దూతలను పిలచి ఆ పరిషత్తుమధ్యలో ఇట్లు పలికెను. 2

మూ. మద్వచో బ్రూత గచ్ఛధ్వమితో భగవతోఽన్తికే, 3
యది శుద్ధసమాచారా యది వా వీతకల్మషా,
కరోత్వీహాత్మనః శుద్ధిమనుమాన్య మహామునిమ్. 4

ప్ర. అ. ఇతః = ఇక్కడినుండి, గచ్ఛధ్వమ్ = వెళ్లుడు. భగవతః = పూజ్యుడైన వాల్మీకియొక్క, అన్తికే = సమీపమునందు, మద్వచః = నా మాటను, బ్రూత = చెప్పుడు. శుద్ధసమాచారా యది = పరిశుద్ధమైన చరిత్ర కలదైనచో, వీత కల్మషా వా యది = పాపము లేనిదైతే (సీత), మహామునిమ్ = మహామునిని, అనుమాన్య = అంగీకరింపచేసి, ఇహ = ఇక్కడ, ఆత్మనః = తనయొక్క, శుద్ధిమ్ = పరిశుద్ధిని, కరోతు = చేయుగాక.

తా. మీరు ఇక్కడినుండి పూజ్యుడైన వాల్మీకి దగ్గరకు వెళ్ళి నా మాటగా చెప్పుడు. "సీత పరిశుద్ధమైన ప్రవర్తన కలదైనచో, పాపరహిత అయినచో మహా ముని అనుజ్ఞ పొంది ఇక్కడ తన శుద్ధిని నిరూపించుకొనుగాక" 3, 4

మూ. ఛన్దం మునేశ్చ విజ్ఞాయ సీతాయాశ్చ మనోగతమ్,
ప్రత్యయం దాతుకామాయాస్తతః శంసత మే లఘు. 5

ప్ర. అ మునేః = మునియొక్క, ఛన్దమ్ = ఇచ్ఛను, ప్రత్యయమ్ = నమ్మకమును, దాతుకామాయాః = ఇవ్వ దలచిన, సీతాయాః = సీతయొక్క, మనోగతమ్ = మనస్సులోని అభిప్రాయమును, విజ్ఞాయ = తెలిసికొని, తతః = అటుపిమ్మట, లఘు = శీఘ్రముగా, మే = నాకు, శంసత = చెప్పుడు.

తా. వాల్మీకి అభిప్రాయమును, నమ్మకము కలుగు ప్రమాణమును చూపు టకు అంగీకరించిన సీత అభిప్రాయమును తెలిసికొని శీఘ్రముగా వచ్చి నాకు తెలుపుడు 5

మూ. శ్వఃప్రభాతే తు శపథం మైథిలీ జనకాత్మజా,
కరోతు పరిషన్మధ్యే శోధనార్థం మమైవ చ. 6

ప్ర. అ. శ్వః = రేపు, ప్రభాతే = ప్రాతఃకాలమునందు, జనకాత్మజా = జనకుని కూతురైన, మైథిలీ = సీత, పరిషన్మధ్యే = ఈ పరిషత్తు మధ్యయందు,

మమైవ = నాయొక్క, శోధనార్థం చ = శోధనముకొరకు కూడ, శపథమ్ = శపథమును, కరోతు = చేయుగాక.

తా. జనకుని కుమార్తెయైన సీత రేపు ప్రాతఃకాలము వరిష్ఠు మధ్యయందు, నన్ను నిర్దోషినిగా నిరూపించుటకు కూడ శపథము చేయుగాక. 6

మూ. శ్రుత్వా తు రాఘవస్యైతద్వచః పరమమద్భుతమ్,
దూతాః సంప్రయయుర్వాటం యత్ర వై మునిపుంగవః.

ప్ర. అ. రాఘవస్య=రామునియొక్క, పరమమ్ అద్భుతమ్=చాల ఆశ్చర్యకరమైన, ఏతత్ = ఈ, వచః=వచనమును, శ్రుత్వా = విని, దూతాః=దూతలు, మునిపుంగవః=ఆ మునిశ్రేష్ఠుడు, యత్ర వై = ఎక్కడ ఉన్నాడో అట్టి, వాటమ్ = (నివాస) ప్రదేశమును గూర్చి, సంప్రయయుః = వెళ్ళిరి.

తా. రాముడు పలికిన చాల ఆశ్చర్యకరమైన ఆ మాట విని దూతలు వాల్మీకి ఉన్న ప్రదేశమునకు వెళ్ళిరి. 7

మూ. తే ప్రణమ్య మహాత్మానం జ్వలన్తమమితప్రభమ్,
ఊచుస్తే రామవాక్యాని మృదూని మధురాణి చ. 8

ప్ర. అ. తే = వాళ్ళు, జ్వలన్తమ్ = ప్రకాశించుచున్న, అమితప్రభమ్ = అమితమైన కాంతి గల, మహాత్మానమ్ = ఆ మహాత్ముణ్ణి, ప్రణమ్య = నమస్కరించి, మృదూని = మృదువులు, మధురాణి చ = మధురములు అయిన, రామ వాక్యాని = రాముని వాక్యములను, ఊచుః = పలికిరి.

తా. ఆ దూతలు అపరిమితమైన కాంతితో ప్రజ్వలించుచున్న ఆ మహాత్మునకు నమస్కరించి రాముడు చెప్పిన మృదుమధురములైన మాటలు తెలిపిరి. 8

మూ. తేషాం తద్భాషితం శ్రుత్వా రామస్య చ మనోగతమ్,
విజ్ఞాయ స మహాతేజా మునిర్వాక్యమథాబ్రవీత్. 9

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, సః మునిః = ఆ ముని, తేషామ్ = వాళ్ళయొక్క, తత్ = ఆ, భాషితమ్ = మాటను, శ్రుత్వా = విని,

రామస్య = రామునియొక్క, మనోగతమ్ = మనస్సులో ఉన్నదానిని, విజ్ఞాయ = తెలిసికొని, అథ = పిమ్మట, వాక్యమ్ = వాక్యమును, ఆబ్రవీత్ = పలికెను.

తా. గొప్ప తేజస్సుగల ఆ ముని రాముని దూతల మాటలువిని, రాముని మనస్సులోని అభిప్రాయమును తెలిసికొని ఇట్లు పలికెను. 9

మూ. ఏవం భవతు భద్రం వో యథా వదతి రాఘవః,
తథా కరిష్యతే సీతా దైవతం హి పతిః స్త్రియః. 10

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, భవతు = అగుగాక. వః = మీకు, భద్రమ్ = క్షేమ మగుగాక. రాఘవః = రాముడు, యథా = ఎట్లు, వదతి = పలుకుచున్నాడో, తథా = అట్లు, సీతా = సీత, కరిష్యతే = చెయ్యగలదు. స్త్రియః = స్త్రీకి, పతిః = భర్త, దైవతం హి = దేవత కదా.

తా. ఇట్లే అగుగాక. మీకు క్షేమ మగుగాక. సీత రాముడు చెప్పినట్లు చేయగలదు. స్త్రీకి భర్త యే దేవత కదా? 10

మూ. తథోక్తా మునినా సర్వే రాజదూతా మహౌజసమ్,
ప్రత్యేత్య రాఘవం సర్వం మునివాక్యం బభాషిరే. 11

ప్ర. అ. మునినా = మునిచేత, తథా = అట్లు, ఉక్తాః = పలకబడిన, సర్వే = సమస్తమైన, రాజదూతాః = రాజదూతలు, మహౌజసమ్ = గొప్ప తేజస్సు గల, రాఘవమ్ = రాముణ్ణి గూర్చి, ప్రత్యేత్య = తిరిగి వచ్చి, సర్వమ్ = సమస్తమైన, మునివాక్యమ్ = మునివాక్యమును, బభాషిరే = చెప్పిరి.

తా. రాజదూతలు మునీశ్వరుని మాటలు విని తిరిగి గొప్ప తేజస్సు గల రాముని పద్దకు వచ్చి, ముని పలికిన మాట లన్నీ చెప్పిరి. 11

మూ. తతః ప్రహృష్టః కాకుత్స్థః శ్రుత్వా వాక్యం మహాత్మనః,
ఋషింస్తత్ర సమేతాంశ్చ రాజ్ఞశ్చైవాభ్యభాషత. 12.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మహాత్మనః = మహాత్ముడైన వాల్మీకి యొక్క, వాక్యమ్ = మాటను, శ్రుత్వా = విని, ప్రహృష్టః = సంతోషించిన, కాకుత్స్థః = రాముడు, తత్ర = అక్కడ, సమేతాన్ = వచ్చి ఉన్న, ఋషీన్ = ఋషులను గూర్చి, రాజ్ఞః చైవ = రాజులను గూర్చి, అభ్యభాషత = పలికెను.

తా. వాల్మీకి మాటలు విని సంతోషించిన రాముడు అక్కడ వచ్చిఉన్న ఋషులతోను, రాజులతోను, ఇట్లు పలికెను. 12

మూ. భగవన్తః సశిష్యా వై సానుగాశ్చ నరాధిపాః,
పశ్యన్తు సీతాశపథం యశ్చైవాన్యోఽపి కాఙ్క్షతే. 13

ప్ర. అ. సశిష్యాః = శిష్యులతో కూడిన, భగవన్తః = పూజ్యులైన మీరు, సానుగాః = అనుచరులతో కూడిన, నరాధిపాః = రాజులూ, యః = ఎవడు, కాఙ్క్షతే = కోరుచున్నాడో అట్టి, అన్యః అపి = ఇతరుడూ కూడ, సీతాశపథమ్ = సీతయొక్క శపథమును, పశ్యన్తు = చూచెదరుగాక.

తా. శిష్యులతో కూడిన పూజ్యులైన ఋషులు, అనుచరులతో కూడిన రాజులు, చూడదలచినవారు ఎవరైన ఇంకా ఉన్నచో వారూ సీత చేయనున్న శపథమును చూచెదరుగాక. 13

మూ. తస్య తద్వచనం శ్రుత్వా రాఘవస్య మహాత్మనః,
సర్వేషామృషిముఖ్యానాం సాధువాదో మహానభూత్. 14

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన, తస్య రాఘవస్య = ఆ రాముని యొక్క, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, సర్వేషామ్ = సమస్తమైన, ఋషిముఖ్యానామ్ = ఋషిశ్రేష్ఠుల యొక్క, మహాన్ = గొప్ప, సాధువాదః = బాగు బాగు అను వాదము, అభూత్ = ఆయెను.

తా. మహాత్ముడైన రాముని మాటలు విన్న పిమ్మట ఋషిశ్రేష్ఠు లందరూ "బాగు బాగు" అని బిగ్గరగా అనిరి. 14

మూ. రాజానశ్చ మహాత్మానః ప్రశంసన్తి స్మ రాఘవమ్,
ఉపపన్నం నరశ్రేష్ఠ త్వయ్యేవ భువి నాన్యతః. 15

ప్ర. అ. మహాత్మానః = మహాత్ములైన, రాజానః చ = రాజులు కూడ, రాఘవమ్ = రాముణ్ణి, ప్రశంసన్తి స్మ = ప్రశంసించిరి. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడా! త్వయ్యేవ = నీయందే, ఉపపన్నమ్ = తగియున్నది. అన్యతః = ఇతరునియందు, న = కాదు.

తా. రాముని మాటలు విని మహాత్ములైన రాజులు కూడ- "నరశ్రేష్ఠా! ఇది నీకే తగును; ఇతరు లెవ్వరూ ఇట్లు చేయజాలరు" అని పలుకుచు ప్రశంసించిరి. 15

మూ. ఏవం వినిశ్చయం కృత్వా శ్వోభూత ఇతి రాఘవః,
విసర్జయామాస తదా సర్వాంస్తాన్ శత్రుసూదనః, 16

ప్ర. అ. శత్రుసూదనః = శత్రువినాశకుడైన, రాఘవః = రాముడు, శ్వోభూతే ఇతి = మరునాడు అని, ఏవమ్ = ఇట్లు, వినిశ్చయమ్ = నిశ్చయమును, కృత్వా = చేసి, తదా = అప్పుడు, తాన్ = వారిని, సర్వాన్ = అందరినీ, విసర్జయామాస = పంపివేసెను.

తా. శత్రుసంహారకుడైన రాముడు "మరునాడు (రేపు) జరుగును" అని నిశ్చయము చేసి వారినందరినీ పంపివేసెను. 16

మూ. ఇతి సంప్రవిచార్య రాజసింహః
శ్వోభూతే శపథస్య నిశ్చయమ్,
విససర్జ మునీన్ నృపాంశ్చ సర్వాన్
స మహాత్మా మహతో మహానుభావః. 17

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
పఞ్చనవతితమః సర్గః

ప్ర. అ. రాజసింహః = ఆ రాజశ్రేష్ఠుడు, ఇతి = ఇట్లు, శ్వోభూతే = మరునాడు, శపథస్య = శపథముయొక్క, నిశ్చయమ్ = నిశ్చయమును, సంప్రవిచార్య = ఆలోచించి, మహాత్మా = మహాత్ముడు, మహానుభావః = గొప్ప సామర్థ్యము కలవాడూ అయిన, సః = అతడు, సర్వాన్ = సమస్తమైన, మునీన్ = మునులను, నృపాన్ చ = రాజులను, విససర్జ = పంపివేసెను.

తా. మహాత్ముడు, మహానుభావుడు అయిన రాజశ్రేష్ఠుడైన ఆ రాముడు "శపదథము మరునాడు జరుగును" అని నిర్ణయము చేసి ఆ మునులను, రాజులను అందరినీ కూడ పంపివేసెను. 17

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో తొంభై అయిదవ సర్గ సమాప్తము.

అథ షణ్ణవతితమః సర్గః

[సీత పరిశుద్ధురాలని వాల్మీకి ఘోషించుట]

మూ. తస్యాం రజన్యాం వ్యుష్టాయాం యజ్ఞవాటం గతో నృపః,
ఋషీన్ సర్వాన్ మహాతేజాః శబ్దాపయతి రాఘవః. 1

ప్ర. ఆ. తస్యామ్ = ఆ, రజన్యామ్ = రాత్రి, వ్యుష్టాయామ్ = తెల్లవారిన దగుచుండగా, నృపః = రాజూ, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడూ అయిన, రాఘవః = రాముడు, యజ్ఞవాటమ్ = యజ్ఞ పదేశమును, గతః = పొందినవాడై, సర్వాన్ = సమస్తమైన, ఋషీన్ = ఋషులను, శబ్దాపయతి = పిలిపించెను.

తా. రాత్రి తెల్లవారగానే మహాతేజఃశాలీ రాజూ అయిన రాముడు యజ్ఞశాలకు వెళ్ళి ఋషు లందరినీ పిలిపించెను. 1

మూ. వసిష్ఠో వామదేవశ్చ జాబాలిరథ కాశ్యపః,
విశ్వామిత్రో దీర్ఘతమా దుర్వాసాశ్చ మహాతపాః. 2

పులస్త్యోఽపి తథా శక్తిర్భార్గవశ్చైవ వామనః,
మార్కణ్డేయశ్చ దీర్ఘాయుర్మౌద్గల్యశ్చ మహాయశాః. 3

గర్గశ్చ చ్యవనశ్చైవ శతానన్దశ్చ ధర్మవిత్,
భరద్వాజశ్చ తేజస్వీ అగ్నిపుత్రశ్చ సుప్రభః. 4

నారదః పర్వతశ్చైవ గౌతమశ్చ మహాయశాః,
కాత్యాయనః సుయజ్ఞశ్చాప్యగస్త్యస్తపసాం నిధిః. 5

ఏతే చాన్యే చ బహవో మునయః సంశితవ్రతాః,
కౌతూహలసమావిష్టాః సర్వ ఏవ సమాగతాః. 6

ప్ర. అ. వసిష్ఠః = వసిష్ఠుడు, వామదేవః చ = వామదేవుడు, జాబాలిః = జాబాలి, అథ = మరియు, కాశ్యపః = కాశ్యపుడు, దీర్ఘతపాః = దీర్ఘతపస్సుగల, విశ్వామిత్రః = విశ్వామిత్రుడు, మహాతపాః = గొప్ప తపస్సు గల, దుర్వాసాః = దుర్వాసుడు, పులస్త్యః అపి = పులస్త్యుడు, తథా = మరియు, శక్తిః = శక్తి, భార్గవః చైవ = భార్గవుడు, వామనః = వామనుడు, దీర్ఘాయుః = దీర్ఘాయుర్దాయవంతుడైన, మార్కండేయః చ = మార్కండేయుడు, మహాయశాః = గొప్ప కీర్తి గల, మౌద్గల్యః చ = మౌద్గల్యుడు, గర్గః చ = గర్గుడు, చ్యవనః చ = చ్యవనుడు, ధర్మవిత్ = ధర్మముల నెరిగిన, శతానన్దః చ = శతానందుడు, తేజస్వీ = తేజఃశాలియైన, భరద్వాజః చ = భరద్వాజుడు, సుప్రభః = మంచి కాంతి గల, అగ్నిపుత్రః చ = అగ్నిపుత్రుడు, నారదః = నారదుడు, పర్వతః చైవ = పర్వతుడు. మహాయశాః = గొప్ప కీర్తి గల, గౌతమః చ = గౌతముడు, కాత్యాయనః = కాత్యాయనుడు, సుయజ్ఞః చ = సుయజ్ఞుడు, తపసామ్ = తపస్సులకు, నిధిః = నిధియైన, అగస్త్యః చ = అగస్త్యుడు, ఏతే = వీరు, సంశితవ్రతాః = గొప్ప నియమములు గల, బహవః = చాలామంది, అన్యే చ = ఇతరులు, సర్వే ఏవ = అందరూ, కౌతుహలసమావిష్టాః = కౌతుహలముతో కూడినవారై, సమాగతాః = వచ్చిరి.

తా. వసిష్ఠ-వామదేవ-జాబాలి-కాశ్యపులు, దీర్ఘమైన తపస్సు గల విశ్వామిత్రుడు, గొప్ప తపస్సు గల దుర్వాసుడు, పులస్త్య-శక్తి-భార్గవ-వామనులు, దీర్ఘాయువైన మార్కండేయుడు, గొప్ప కీర్తి గల మౌద్గల్యుడు, గర్గ-చ్యవనులు, ధర్మవేత్తయైన శతానందుడు, తేజఃశాలియైన భరద్వాజుడు, మంచి కాంతి గల అగ్నిపుత్రుడు, నారద-పర్వతులు, గొప్ప యశస్సు గల గౌతముడు, కాత్యాయనసుయజ్ఞులు, తపోనిధియైన అగస్త్యుడు, వీరే కాక గొప్ప నియమములు గల ఇతరమునులు, అందరూ కూడా వేడుకతో వచ్చిరి. 2-6

మూ. రాక్షసాశ్చ మహావీర్యా వానరాశ్చ మహాబలాః,
సర్వ ఏవ సమాజగ్ముర్మహాత్మానః కుతూహలాత్. 7

ప్ర. అ. మహావీర్యాః = గొప్ప పరాక్రమము గల, రాక్షసాః చ = రాక్షసులు, మహాబలాః = గొప్ప బలము గల, వానరాః చ = వానరులు, సర్వే = సమస్త

మైన, మహాత్మానః = మహాత్ములు, కుతూహలాత్ = వేడుకవలన, సమాజగ్ముః = వచ్చిరి.

తా. గొప్ప పరాక్రమము గల రాక్షసులు, గొప్ప బలము గల వానరులు, ఆ మహాత్ములందరూ వేడుకతో వచ్చిరి. 7

మూ. క్షత్రియా యే చ శూద్రాచ్చ వైశ్యాశ్చైవ సహస్రశః,
నానాదేశాగతాశ్చైవ బ్రాహ్మణాః సంశితవ్రతాః. 8

జ్ఞాననిష్ఠాః కర్మనిష్ఠా యోగనిష్ఠాస్తథాపరే,
సీతాశపథవీక్షార్థం సర్వ ఏవ సమాగతాః. 9

ప్ర. అ. యే = ఏ, క్షత్రియాః = క్షత్రియులు, శూద్రాః చ = శూద్రులు, వైశ్యాః చ = వైశ్యులూ ఉన్నారో వారు, సహస్రశః = వెలకొలది, నానాదేశాగతాః = అనేకదేశములనుండి వచ్చిన, సంశితవ్రతాః = తీవ్రమైన వ్రతముగల, జ్ఞాన నిష్ఠాః = జ్ఞాననిష్ఠ కలవారు, కర్మనిష్ఠాః = కర్మలయందు నిష్ఠ కలవారు, తథా = మరియు, అపరే = ఇతరులైన, యోగనిష్ఠాః = యోగమునందు నిష్ఠ కలవారు ఆయిన, బ్రాహ్మణాః = బ్రాహ్మణులు, సర్వే ఏవ = అందరూ కూడ, సీతాశపథ వీక్షార్థమ్ = సీత శపథమును చూచుటకు, సమాగతాః = వచ్చిరి.

తా వేలకొలది క్షత్రియులు, శూద్రులు, వైశ్యులు, అనేక దేశములనుండి వచ్చిన, తీవ్రములైన వ్రతము గల జ్ఞాననిష్ఠులూ, కర్మనిష్ఠులూ, యోగనిష్ఠులూ ఆయిన బ్రాహ్మణులూ, వీరందరూ కూడ సీత చేయనున్న శపథమును చూచుటకై వచ్చిరి 8, 9

మూ. తదా సమాగతం సర్వమశ్మభూతమివాచలమ్,
శ్రుత్వా మునివరస్తూర్ణం ససీతః సముపాగమత్. 10

ప్ర. అ. తదా = అప్పుడు, అశ్మభూతమ్ ఇవ = శిలలుగా మారినదా అన్నట్లు, అచలమ్ = నిశ్చలముగా ఉన్న, సర్వమ్ = సమస్తమైన జనసముదాయ మును, సమాగతమ్ = వచ్చినట్లుగా, శ్రుత్వా = విని, మునివరః = మునిశ్రేష్ఠుడు, ససీతః = సీతతో కూడినవాడై, తూర్ణమ్ = శీఘ్రముగా, సముపాగమత్ = వచ్చెను.

తా. శిలాప్రతిమలుగా మారిపోయినారా అన్నట్లు నిశ్చలముగా ఉన్న ఆ జనులందరు వచ్చి నట్లు విని వాల్మీకి సీతతో శీఘ్రముగా అక్కడికి వచ్చెను. 10

మూ. తమృషిం పృష్ఠతః సీతా అన్వగచ్ఛదవాఙ్ముఖీ,
కృతాఞ్జలిర్బాష్పగలా కృత్వా రామం మనోగతమ్. 11

ప్ర. అ. అవాఙ్ముఖీ = క్రిందికి ముఖము గల, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి గల, బాష్పగలా = కన్నీరు కంఠమునందు గల, సీతా = సీత, రామమ్ = రాముణ్ణి, మనోగతమ్ = మనస్సులో ఉన్నవానినిగా, కృత్వా = చేసి, తమ్ ఋషిమ్ = ఆ ఋషిని, పృష్ఠతః = వెనుక, అన్వగచ్ఛత్ = అనుసరించి వెళ్ళెను.

తా. సీత మనస్సులో రాముణ్ణి స్మరించుచు, కన్నీరు కంఠమునందు నిలిపి అంజలి ఘటించి, తలవంచుకొని ఆ ముని వెనుకనే వచ్చెను. 11

మూ. దృష్ట్వా శ్రుతిమివాయాన్తిం బ్రహ్మణమనుగామినీమ్,
వాల్మీకేః పృష్ఠతః సీతాం సాధువాదో మహానభూత్. 12

ప్ర. అ. బ్రహ్మణమ్ = బ్రహ్మదేవుణ్ణి అనుగామినీమ్ = అనుసరించుచున్న, ఆయాన్తిమ్ = వచ్చుచున్న, శ్రుతిమివ = శ్రుతివలె ఉన్న, వాల్మీకేః పృష్ఠతః = వాల్మీకి వెనుక నున్న, సీతామ్ = సీతను, దృష్ట్వా = చూచి, మహాన్ = గొప్ప, సాధువాదః = బాగు బాగు అను వాదము. అభూత్ = అయెను.

బా బ్రహ్మదేవుని వెనుక శ్రుతి వచ్చుచున్నట్లు వాల్మీకి వెనుక సీత వచ్చుచుండగా చూచి పెద్ద "బాగు బాగు" అను ధ్వని బయలుదేరెను. 12

మూ. తతో హలహలాశబ్దః సర్వేషామేవమాబభౌ,
దుఃఖజన్మవిశాలేన శోకేనాకులితాత్మనామ్. 13

ప్ర. త. తతః = అటుపిమ్మట, దుఃఖజన్మవిశాలేన = దుఃఖము కలుగుట చేత అధికమైన, శోకేన = శోకముచేత, ఆకులితాత్మనామ్ = వ్యాకులము చేయబడిన మనస్సులు గల, సర్వేషామ్ = అందరియొక్క, హలహలాశబ్దః = కోలాహలధ్వని, ఏవమ్ = ఇట్లు, ఆబభౌ = ప్రకాశించెను (బయలుదేరెను).

తా. అప్పుడు దుఃఖమువలన అత్యధికమైన శోకముతో నిండిన మనస్సులతో అక్కడివాళ్ళు అందరూ కోలాహలము చేసిరి. 13

మూ. సాధు రామేతి కేచిత్తు సాధు సీతేతి చాపరే,
ఉభావేవ చ తత్రాన్యే ప్రేషకాః సంప్రచుక్రుశుః 14

ప్ర. అ. రామ = రామా! సాధు = బాగు బాగు, ఇతి = అని, కేచిత్ = కొందరు, ప్రేషకాః = ప్రేషకులు, సీతే = సీతా! సాధు = బాగు బాగు, ఇతి = అని, అపరే చ = ఇతరులైన ప్రేషకులు, ఉభౌ ఏవ = ఇద్దరిని గూర్చి, (సీతా రాములారా బాగు బాగు అని), అన్యే చ = మరికొందరు, సంప్రచుక్రుశుః = అరచిరి.

తా. ఆ ప్రేషకులలో కొందరు ''రామా బాగు బాగు" అనీ, కొందరు "సీతా బాగు బాగు" అనీ, మరి కొందరు "సీతారాములారా బాగుబాగు" అనీ అరచిరి. 14

మూ. తతో మధ్యే జనౌఘస్య ప్రవిశ్య మునిపుంగవః,
సీతాసహాయో వాల్మీకిరితి హోవాచ రాఘవమ్. 15

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సీతాసహాయః = సీతకు సహాయుడైన, మునిపుంగవః = మునిశ్రేష్ఠుడైన, వాల్మీకిః = వాల్మీకి, జనౌఘస్య = జనసముదాయముయొక్క, మధ్యే = మధ్యయందు, ప్రవిశ్య = ప్రవేశించి, రాఘవమ్ = రాముణ్ణి గూర్చి, ఇతి = ఇట్లు, ఉవాచ = పలికెను.

తా. సీతకు సహాయుడుగా ఉన్న మునిశ్రేష్ఠుడైన వాల్మీకి అప్పుడు జనసముదాయము మధ్య నిలచి రామునితో ఇట్లనెను. 15

మూ. ఇయం దాశరథే సీతా సువ్రతా ధర్మచారిణీ,
అపవాదాత్పరిత్యక్తా మమాశ్రమసమీపతః. 16

ప్ర అ. దాశరథే = రామా! సువ్రతా = మంచి నియమము గల, ధర్మచారిణీ = ధర్మమును ఆచరించు, ఇయం సీతా = ఈ సీత, అపవాదాత్ = లోకాపవాదమువలన, మమ = నాయొక్క, ఆశ్రమసమీపతః = ఆశ్రమము దగ్గర, పరిత్యక్తా = విడవబడినది.

తా. రామా! ఉత్తమనియమవంతురాలూ, ధర్మమును ఆచరించేదీ అయిన ఈ సీతను నీవు లోకపవాదమువలన నా ఆశ్రమముదగ్గర విడచినావు. 16

మూ. లోకాపవాదభీతస్య తవ రామ మహావ్రత,
ప్రత్యయం దాస్యతే సీతా తామనుజ్ఞాతుమర్హసి. 17

ప్ర. అ. మహావ్రత=గొప్ప వ్రతము గలవాడా! రామ!=రామా! లోకాప వాదభీతస్య=లోకాపవాదము వలన భయపడిన, తవ=నీకు, సీతా=సీత, ప్రత్యయమ్=విశ్వాసయోగ్యమైన ప్రమాణమును, దాస్యతే=ఇవ్వగలదు. తామ్=ఆమెను, అనుజ్ఞాతుమ్=అనుజ్ఞ ఇచ్చుటకు, అర్హసి=తగి ఉన్నావు.

తా. గొప్ప వ్రతము గల రామా! లోకాపవాదమువలన భయబడిన నీకు ఈ సీత విశ్వాసయోగ్యమైన ప్రమాణమును చూపగలదు. ఆమెకు అనుమతి ఇమ్ము.

మూ. ఇమౌ తు జానకీపుత్రావుభౌ చ యమజాతకౌ,
సుతౌ తవైవ దుర్ధర్షౌ సత్యమేతద్బ్రవీమి తే. 18

ప్ర. అ. యమజాతకౌ=కలవలుగా పుట్టిన, ఇమౌ=ఈ, ఉభౌ=ఇద్దరూ, జానకీపుత్రౌ=జానకి కుమారులు. దుర్ధర్షౌ=ఎదిరింప శక్యముకాని వీరిద్దరూ, తవ=నీయొక్క, సుతౌ ఏవ=కుమారులే. తే=నీకు, ఏతత్=దీనిని, సత్యమ్=సత్యముగా, బ్రవీమి=చెప్పుచున్నాను

తా. కవలలైన ఈ ఇద్దరూ సీత పుత్రులు. ఎదిరింప శక్యముకాని ఈ ఇద్దరూ నీ కుమారులే. నీకు నేను సత్యము చెప్పుచున్నాను. 18

మూ. ప్రచేతసోఽహం దశమః పుత్రో రాఘవనన్దన,
న స్మరామ్యనృతం వాక్యమిమౌ తు తవ పుత్రకౌ. 19

ప్ర. అ. రాఘవనన్దన=రామా! అహమ్=నేను, ప్రచేతసః=ప్రచేతస్సు యొక్క, దశమః=పదవ, పుత్రః=పుత్రుడను. అనృతమ్=అసత్యమైన, వాక్యమ్=వాక్యమును, న స్మరామి=స్మరించను. ఇమౌ=వీరిద్దరూ, తవ=నీయొక్క, పుత్రకౌ=పుత్రులు.

తా. రామా! నేను ప్రచేతసుని పదవ పుత్రుడను. (లేదా ప్రచేతసుని వంశములో పదవవాడను-పదవ తరమునకు చెందినవాడను, అని కొందరు వ్యాఖ్యాతలు). నేను ఎప్పుడూ అసత్యము పలికి ఎరుగను. వీరిద్దరూ నీ పుత్రులు.

మూ. బహువర్షసహస్రాణి తపశ్చర్యా మయా కృతా,
నోపాశ్నియాం ఫలం తస్యా దుష్టేయం యది మైథిలీ.

ప్ర. అ. మయా = నాచేత, బహువర్షసహస్రాణి = అనేక సంవత్సరముల సహస్రములు, తపశ్చర్యా = తపశ్చర్య, కృతా = చేయబడినది. ఇయమ్ = ఈ, మైథిలీ = సీత, దుష్టా యది = దోషము కలది అయితే, తస్యాః = ఆ తపశ్చర్య యొక్క, ఫలమ్ = ఫలమును, న ఉపాశ్నియామ్ = అనుభవించకుందును గాక.

తా. నేను కొన్ని వేల సంవత్సరములు తపస్సు చేసితిని. ఈ సీతలో దోష ము న్నట్లయితే నాకు ఆ తపస్సు ఫలితము లభించకుండు గాక. 20

మూ. మనసా కర్మణా వాచా భూతపూర్వం న కిల్బిషమ్,
తస్యాహం ఫలమశ్నామి అపాపా మైథిలీ యది. 21

ప్ర. అ. మనసా = మనస్సుచేత, కర్మణా = కర్మచేత, వాచా = వాక్కు చేత, కిల్బిషమ్ = పాపము, న భూతపూర్వమ్ = పూర్వ మెన్నడూ జరుగలేదు. మైథిలీ = సీత, అకల్మషా యది = పాపములు లేనిదైనచో, తస్య = దానికి, ఫలమ్ = ఫలమును, అశ్నియామ్ = అనుభవింతును.

తా. మనస్సుచేత గాని, కర్మ చేత గాని, వాక్కు చేత గాని పూర్వము నేను పాపము చేయలేదు. సీత పాపములేనిది అయిననే నాకు దాని ఫలము లభించుగాక.

మూ. అహం పఞ్చసు భూతేషు మనఃషష్ఠేషు రాఘవ,
విచిన్త్య సీతా శుద్ధేతి జగ్రాహ వననిర్ఋతే. 22

ప్ర. అ. రాఘవ = రామా! అహమ్ = నేను, మనఃషష్ఠేషు = మనస్సు ఆరవదిగా గల, పఞ్చసు = ఐదు, భూతేషు = ఇంద్రియములయందు, సీతా = సీత, శుద్ధా ఇతి = పరిశుద్ధురాలు అని, వననిర్ఋతే = వనమునందలి నైఋతి దగ్గర, జగ్రాహ = గ్రహించితిని.

తా. రామా! సీత ఐదుజ్ఞానేంద్రియములయందు, మనస్సునందూ కూడా పరిశుద్ధురా లని నేను వనమునందలి నైఋతి దగ్గర గ్రహించితిని. తెలిసికొని ఆమెను కాపాడితిని అని భావము. 22

మూ. ఇయం శుద్ధసమాచారా అపాపా పతిదేవతా,
లోకాపవాదభీతస్య ప్రత్యయం తవ దాస్యతి. 23

ప్ర. అ. శుద్ధసమాచారా = పరిశుద్ధమైన నడవడిక గల, అపాపా = పాపములు లేని, పతిదేవతా = పతియే దేవతగా గల, ఇయమ్ = ఈమె, లోకాపవాద భీతస్య = లోకాపవాదమువలన భయపడిన, తవ = నీకు, ప్రత్యయమ్ = నమ్మదగిన ప్రమాణమును, దాస్యతి = ఇవ్వగలదు.

తా. పరిశుద్ధమైన సమాచారము గల, పతినే దేవతగా ఆరాధించు ఈమె లోకాపవాదమునకు భయపడిన నీకు ప్రత్యయమును ఇవ్వగలదు. 23

మూ. తస్మాదియం నరవరాత్మజ శుద్ధభావా
దివ్యేన దృష్టివిషయేణ మయా ప్రదిష్టా,
లోకాపవాదకలుషీకృతచేతసా యా
త్యక్తా త్వయా ప్రియతమా విదితాపి శుద్ధా. 24

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
షణ్ణవతితమః సర్గః.

ప్ర. అ. నరవరాత్మజ = దశరథరాజకుమారా! తస్మాత్ = ఆ కారణమువలన, శుద్ధా = పరిశుద్ధురాలుగా, విదితాపి = తెలియబడినదైనను, ప్రియతమా = మిక్కిలిప్రియురాలైన, యా = ఏ సీత, లోకాపవాదకలుషీకృతచేతసా = లోకాపవాదముచేత కలుషముగా చేయబడిన చిత్తము గల, త్వయా = నీచేత, త్యక్తా = విడవబడినదో, ఇయమ్ = అట్టి ఈ సీత, శుద్ధభావా = పరిశుద్ధమైన భావము కలదిగా, దివ్యేన = దివ్యమైన, దృష్టివిషయేణ = జ్ఞానముచేత, మయా = నాచేత, ప్రదిష్టా = నీకు తెలపబడినది.

తా. అందువలన, రామా! ప్రియతమురాలైన ఏ సీతను నీవు పరిశుద్ధురాలని తెలిసి కూడ లోకాపవాదమునకు భయపడి విడిచివేసినావో అట్టి ఈ సీత పరిశుద్ధమైన భావము గలది అని నేను దివ్యజ్ఞానముచేత తెలిసికొని నీకు తెలుపుచున్నాను.

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో తొంభైఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తనవతితమః సర్గః

[సీత శపథము చేయుట. రసాతలములో ప్రవేశించుట.]

మూ. వాల్మీకినైవముక్తస్తు రాఘవః ప్రత్యభాషత
ప్రాఞ్జలిర్జగతో మధ్యే దృష్ట్వా తాం వరవర్ణినీమ్. 1

ప్ర. అ. వాల్మీకినా = వాల్మీకిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, రాఘవః = రాముడు, జగతః = జగత్తుయొక్క, మధ్యే = మధ్యయందు, తామ్ = ఆ, వరవర్ణినీమ్ = శ్రేష్ఠమైన శరీరవర్ణము గల సీతను, దృష్ట్వా = చూచి, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలికలవాడై, ప్రత్యభాషత = తిరిగి పలికెను.

తా. వాల్మీకి మాటలు విని, రాముడు జనుల మధ్య నున్న సీతను చూచి వాల్మీకికి అంజలి ఘటించి నమస్కరించుచు ఇట్లనెను. 1

మూ. ఏవమేతన్మహాభాగ యథా వదసి ధర్మవిత్,
ప్రత్యయస్తు మమ బ్రహ్మంస్తవ వాక్యైరకల్మషైః. 2

ప్ర. అ. మహాభాగ = గొప్ప భాగ్యము కలవాడా! ధర్మవిత్ = ధర్మము తెలిసిన నీవు, యథా = ఎట్లు, వదసి = చెప్పుచున్నావో, ఏతత్ = ఇది, ఏవమ్ = ఇట్లే. బ్రహ్మన్ = బ్రాహ్మణా! మమ తు = నాకైతే, అకల్మషైః = దోషము లేని, తవ వాక్యైః = నీ మాటలచేత, ప్రత్యయః = నమ్మకము ఉన్నది.

తా. ధర్మవేత్తవైన మహానుభావా! నీవు చెప్పినది యథార్థమే. నీవు చెప్పిన దోషరహితములైన మాటలపై నాకైతే పూర్తి నమ్మక మున్నది. 2

మూ. ప్రత్యయశ్చ పురావృత్తో వైదేహ్యాః సురసంనిధౌ,
శపథశ్చ కృతస్తత్ర తేన వేశ్మ ప్రవేశితా. 3

ప్ర. అ. పురా = పూర్వము, సురసంనిధౌ = దేవతలసంనిధియందు, వైదేహ్యాః = సీతయొక్క, ప్రత్యయః = నమ్మకము, వృత్తః = జరిగినది. తత్ర =

ఆక్కడ, శపథః చ = శపథము కూడ, కృతః = చేయబడినది. తేన = ఆ కారణము చేతనే, వేశ్మ = గృహమును, ప్రవేశితా = ప్రవేశ పెట్టబడినది.

తా. పూర్వము దేవతల సమక్షమున సీత విషయమున నమ్మకము ఏర్పడినది. ఆక్కడ శపథము కూడ చేయబడినది. అందుచేతనే ఇంటికి సీతకొని వచ్చినాను. 3

మూ. లోకాపవాదో బలవాన్యేన త్యక్తా హి మైథిలీ,
సేయం లోకభయాద్బ్రహ్మన్నపాపేత్యభిజానతా, 4
పరిత్యక్తా మయా సీతా తద్భవాన్ క్షన్తుమర్హతి.

ప్ర. అ. బ్రహ్మన్ = ఓ! బ్రాహ్మణా! లోకాపవాదః = లోకాపవాదము, బలవాన్ = బలము గలది. యేన = దేనిచేత, మైథిలీ = సీత. త్యక్తా హి = విడవ బడినదో. సా ఇయమ్ = అట్టి ఈ, సీతా = సీత, అపాపా = పాపము లేనిది, ఇతి = అని, అభిజానతా = తెలిసినవాడనైనను, మయా = నాచేత, లోకభయాత్ = లోకభయమువలన, పరిత్యక్తా = విడవబడినది. తత్ = దానిని, భవాన్ = నీవు, క్షన్తుమ్ = క్షమించుటకు, అర్హతి = తగిఉన్నావు.

తా. మహాముని! లోకాపవాదము బలవత్తరముగా ఉండుటచేత నేను సీతను విడిచితిని. ఈమెలో ఏ పాపమూ లేదని తెలిసి కూడ నేను లోకభయము చేత త్యజించితిని. అందుకు నన్ను క్షమించుము. 4

మూ. జానామి చేమౌ పుత్రౌ మే యమజాతౌ కుశీలవౌ, 5
శుద్ధాయాం జగతో మధ్యే మైథిల్యాం ప్రీతిరస్తు మే.

ప్ర. అ. ఇమౌ = ఈ, కుశీలవౌ = గాయకులను, మే = నాయొక్క, యమజాతౌ = కవలలుగా పుట్టిన, పుత్రౌ = పుత్రులనుగా, జానామి = ఎరుగుదును. జగతః = జగత్తుయొక్క, మధ్యే = మధ్యయందు, శుద్ధాయామ్ = పరిశుద్ధురాలైన, మైథిల్యామ్ = సీతయందు, మే = నాకు, ప్రీతిః = ప్రేమ, అస్తు = అగుగాక.

తా. ఈగాయకు లిద్దరూ నా కవలలుగా పుట్టిన పుత్రులని నేను ఎరుగుదును. జనుల మధ్య పరిశుద్ధురాలుగా నిర్ణయింపబడిన పిమ్మటనే నాకు సీతయందు ప్రేమ కలుగుగాక. 5

మూ. అభిప్రాయం తు విజ్ఞాయ రామస్య సురసత్తమాః, 6
సీతాయాః శపథే తస్మిన్ మహేన్ద్రాద్యా మహౌజసః,
పితామహం పురస్కృత్య సర్వ ఏవ సమాగతాః. 7

ప్ర. అ. రామస్య = రామునియొక్క, అభిప్రాయమ్ = అభిప్రాయమును, విజ్ఞాయ = తెలుసుకొని, తస్మిన్ = ఆ, సీతాయాః శపథే = సీతయొక్క శపథము నందు, పితామహమ్ = బ్రహ్మదేవుణ్ణి, పురస్కృత్య = ముందు ఉంచుకొని, మహేన్ద్రాద్యాః = మహేంద్రుడు మొదలైన, మహౌజసః = గొప్ప తేజస్సు గల, సర్వే ఏవ = సమస్తమైన, సురసత్తమాః = దేవతాశ్రేష్ఠులు, సమాగతాః = వచ్చిరి.

తా. రాముని అభిప్రాయము తెలిసికొని మహేంద్రుడు మొదలైన మహా తేజఃశాలులైన దేవత లందరు ఆ సీతాశపథసమయమునందు అక్కడికి వచ్చిరి.

మూ. ఆదిత్యా వసవో రుద్రా విశ్వేదేవా మరుద్గణాః,
సాధ్యాశ్చ దేవాః సర్వే తే సర్వే చ పరమర్షయః. 8
నాగాః సుపర్ణాః సిద్ధాశ్చ తే సర్వే హృష్టమానసాః,
సీతాశపథసంభ్రాన్తాః సర్వ ఏవ సమాగతాః. 9

ప్ర. అ. ఆదిత్యాః = ఆదిత్యులు, వసవః = వసువులు, రుద్రాః = రుద్రులు, విశ్వేదేవాః = విశ్వేదేవతలు, మరుద్గణాః = మరుద్గణములు, సాధ్యాః చ = సాధ్యులు, తే = ఆ, సర్వే = సమస్తమైన, దేవాః = దేవతలు, సర్వే = సమస్తమైన, పరమర్షయః చ = మహర్షులు, నాగాః = నాగులు, సుపర్ణాః = పక్షులు, సిద్ధాః చ = సిద్ధులూ, తే సర్వే = వారందరూ, హృష్టమానసాః = సంతోషించిన మనస్సు కలవారై, సీతా శపథసంభ్రాన్తాః = సీత శపథమునుగూర్చి తొందరపడుచున్నవారై, సర్వే ఏవ = అందరూ, సమాగతాః = వచ్చిరి.

తా. ఆదిత్యులు, వసువులు, రుద్రులు, విశ్వేదేవతలు, మరుద్గణములు, ఈ సమస్తదేవతలు, సాధ్యులు, సమస్తపరమర్షులు, నాగులు, పక్షులు, సిద్ధులు-వీరందరూ కూడ సంతోషముతో కూడిన మనస్సులతో అక్కడికి వచ్చిరి. అందరూ కూడ సీతాశపథమును గూర్చి కంగారుపడుచు వచ్చిరి. 8, 9

మూ. దృష్ట్వా దేవానృషింశ్చైవ రాఘవః పునరబ్రవీత్,
ప్రత్యయో మే సురశ్రేష్ఠా ఋషివాక్యైరకల్మషైః. 10
శుద్ధాయాం జగతో మధ్యే వైదేహ్యాం ప్రీతిరస్తు మే,

ప్ర. అ. దేవాన్ = దేవతలను, ఋషీన్ చ ఏవ = ఋషులను, దృష్ట్వా = చూచి, రాఘవః = రాముడు, పునః = మరల, అబ్రవీత్ = పలికెను. సురశ్రేష్ఠాః = దేవతాశ్రేష్ఠులారా! అకల్మషైః = దోషములు లేని, మునివాక్యైః = మునివాక్యముల చేత, మే = నాకు, ప్రత్యయః = నమ్మకము ఉన్నది. జగతః మధ్యే = జగత్తు యొక్క మధ్యయందు, శుద్ధాయామ్ = పరిశుద్ధురాలైన, వైదేహ్యామ్ = సీతయందు, మే = నాకు, ప్రీతిః = ప్రేమ, అస్తు = అగుగాక.

తా. దేవతలను, ఋషులను చూచి రాముడు మరల పలికెను. దేవతాశ్రేష్ఠులారా! నాకు దోషరహితములైన వాల్మీకి మాటలయందు నమ్మక మున్నది. కాని జనులమధ్య పరిశుద్ధయైన సీతపై నాకు ప్రేమ కలుగుగాక. 10

మూ. తతో వాయుః శుభః పుణ్యో దివ్యగన్ధో మనోరమః, 11
తం జనౌఘం సురశ్రేష్ఠో హ్లాదయామాస సర్వతః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, శుభః = శుభకరుడు, పుణ్యః = పుణ్యమైనవాడు, దివ్యగన్ధః = దివ్యమైన సువాసన గలవాడు, మనోరమః = మనోహరుడూ, సురశ్రేష్ఠః = దేవతలలో శ్రేష్ఠుడూ అయిన, వాయుః = వాయుదేవుడు, తం జనౌఘమ్ = ఆ జనసముదాయమును, సర్వతః = అంతటా, హ్లాదయామాస = సంతోషపెట్టెను.

తా. పిమ్మట అక్కడ ఉన్న జనసముదాయమునకు, శుభము, పుణ్యము, దివ్యగంధము గలది, మనోహరము అయిన వాయువు ఆనందమును కలిగించెను.

మూ. తదద్భుతమివాచిన్త్యం నిరైక్షన్త సమాహితాః, 12
మానవాః సర్వరాష్ట్రేభ్యః పూర్వం కృతయుగే యథా.

ప్ర. అ. సర్వరాష్ట్రేభ్యః = సమస్తరాష్ట్రములనుండి వచ్చిన, మానవాః = మానవులు, సమాహితాః = సావధానచిత్తులై, పూర్వమ్ = పూర్వము, కృత

యుగే యథా = కృతయుగమునందు వలె, అచిన్త్యమ్=ఊహింప శక్యము కాని; అద్భుతమ్ఇవ = ఆశ్చర్యమును వలె, తత్ = దానిని, నిరైక్షన్త = చూచిరి.

తా. సమస్త రాష్ట్రములనుండి వచ్చిన మానవులు, పూర్వము కృత యుగమునందు వలె, ఊహింప శక్యము కాని ఆశ్చర్యమును చూచినట్లు దానిని సావధానచిత్తులై చూచిరి. 12

మూ. సర్వాన్ సమాగతాన్ దృష్ట్వా సీతా కాషాయవాసినీ, 13
అబవీత్ప్రాఞ్జలిర్వాక్యమధోదృష్టిరవాఙ్ముఖీ.

ప్ర. అ. సమాగతాన్ = వచ్చిన, సర్వాన్ = అందరినీ, దృష్ట్వా=చూచి, కాషాయవాసినీ = కాషాయవస్త్రము ధరించిన, సీతా = సీత, ప్రాఞ్జలిః = కట్టి బడిన దోసిలి కలదై, అధోదృష్టిః = క్రిందికి దృష్టి గలదై, అవాఙ్ముఖీ = క్రిందికి ముఖము గలదై, వాక్యమ్ = వాక్యమును, అబవీత్ = పలికెను.

తా. కాషాయవస్త్రము ధరించి ఉన్న సీత అక్కడికి వచ్చిన అందరినీ చూచి, అంజలి ఘటించి, తల వంచి, క్రిందికి చూచుచు ఇట్లు పలికెను. 13

మూ. యథాహం రాఘవాదన్యం మనసాపి న చిన్తయే, 14
తథా మే మాధవీ దేవీ వివరం దాతుమర్హతి.

ప్ర. అ. అహమ్ = నేను, రాఘవాత్ = రామునికంటె, అన్యమ్ = ఇతరుని, మనసాపి = మనస్సుచేత కూడ, యథా = ఎట్లు, న చిన్తయే = తలవనో, తథా = అట్లు, దేవీ = దేవియైన, మాధవీ = మాధవుని భార్యయైన భూమి, వివరమ్ = వివరమును, దాతుమ్ = ఇచ్చుటకు, అర్హతి = తగియున్నది.

తా. నేను రాముణ్ణి తప్ప మరెవ్వానినీ మనసా కూడ స్మరించనిచో భూదేవి నాకు వివరమును ఇచ్చుగాక. 14

మూ. మనసా కర్మణా వాచా యథా రామం సమర్చయే, 15
తథా మే మాధవీ దేవీ వివరం దాతుమర్హతి.

ప్ర. అ. మనసా = మనస్సుచేత, కర్మణా = కర్మచేత, వాచా = వాక్కుచేత, యథా = ఎట్లు, రామమ్ = రాముణ్ణి, సమర్చయే = పూజించుచున్నానో,

తథా = అట్లు, మాధవీ దేవీ = భూదేవి, మే = నాకు, వివరమ్ = వివరమును, దాతుమ్ = ఇచ్చుటకు, అర్హతి = తగిఉన్నది.

తా. నేను మనోవాక్కాయములచేత రాముణ్ణి మాత్రమే పూజించినట్లయితే నాకు భూదేవి వివరమును ఇచ్చుగాక. 15

మూ. యథైతత్సత్యముక్తం మే వేద్మి రామాత్ పరం న చ,
తథా మే మాధవీ దేవీ వివరం దాతుమర్హతి.

ప్ర. అ. ఏతత్ = ఈ, సత్యమ్ = సత్యము, యథా = ఎట్లు, మే = నాకు (నాచేత). ఉక్తమ్ = పలకబడినదో, రామాత్ = రామునికంటె, పరమ్ = ఇతరుణ్ణి, న వేద్మి చ = ఎరుగనో, తథా = అట్లు, మాధవీ దేవీ = భూదేవి, మే = నాకు, వివరమ్ = వివరమును, దాతుమ్ = ఇచ్చుటకు, అర్హతి = తగిఉన్నది.

తా. నేను ఇప్పుడు చెప్పినది అంతా సత్యమైతే, నేను రాముడు తప్ప మరొకనిని ఎరుగకపోయినచో భూదేవి నాకు వివరము ఇచ్చుగాక. 16

మూ. తథా శపన్త్యాం వైదేహ్యాం ప్రాదురాసీత్తదద్భుతమ్, 17
భూతలాదుత్థితం దివ్యం సింహాసనమనుత్తమమ్,
ధ్రియామాణం శిరోభిస్తు నాగైరమితవిక్రమైః, 18
దివ్యం దివ్యేన వపుషా దివ్యరత్నవిభూషితైః.

ప్ర. అ. వైదేహ్యామ్ = సీత, తథా = అట్లు, శపన్త్యామ్ = ఒట్టు పెట్టుచుండగా, అద్భుతమ్ = ఆశ్చర్యకరము, భూతలాత్ = భూతలమునుండి, ఉత్థితమ్ = లేచినది, అనుత్తమమ్ = చాల ఉత్తమము, దివ్యేన = దివ్యమైన, వపుషా = ఆకారముతో, దివ్యమ్ = ప్రకాశించుచున్నది, దివ్యరత్న విభూషితైః = దివ్యములైన రత్నములచేత అలంకరింపబడిన, అమితవిక్రమైః = అపరిమితమైన పరాక్రమము గల, నాగైః = నాగములచేత, శిరోభిః = శిరస్సులచేత, ధ్రియమాణమ్ = మోయబడుచున్నది అయిన, తత్ = ఆ, దివ్యమ్ = దివ్యమైన, సింహాసనమ్ = సింహాసనము, ప్రాదురాసీత్ = ఆవిర్భవించెను.

తా. సీత ఆ విధముగా శపథము చేయుచుండగా అత్యుత్తమము, అద్భు

తమూ ఆయిన ఒక దివ్యమైన సింహాసనము భూతలమునుండి పైకి లేచెను. అద్భుతమైన ఆకారముతో ప్రకాశించుచున్న ఆ సింహాసనమును దివ్యములైన రత్నములచే అలంకరింపబడిన, అమితమైన బలము గల సర్పములు తమ శిరస్సులపై మోయుచుండెను. 17, 18

మూ. తస్మింస్తు ధరణీదేవీ బాహుభ్యాం గృహ్య మైథిలీమ్, 19
స్వాగతేనాభినన్ద్యైనామాసనే చోపవేశయత్.

ప్ర. అ. తస్మిన్ తు = ఆ సింహాసనమునందు ఉన్న, ధరణీదేవీ = భూదేవి, మైథిలీమ్ = సీతను, బాహుభ్యామ్ = బాహువులతో, గృహ్య = గ్రహించి, ఏనామ్ = ఈమెను, స్వాగతేన = స్వాగతముచేత, అభినన్ద్య = అభినందించి, ఆసనే = ఆ సింహాసనమునందు, ఉపవేశయత్ చ = కూర్చుండ బెట్టుకొనెను.

తా. ఆ సింహాసనమునందున్న భూదేవి సీతను బాహువులతో పట్టుకొని, "వత్సా! రమ్ము" అని స్వాగతముతో ఆమెను అభినందించి సింహాసనముమీద కూర్చుండబెట్టుకొనెను. 19

మూ. తామాసనగతాం దృష్ట్వా ప్రవిశన్తీం రసాతలమ్, 20
పుష్పవృష్టిరవిచ్ఛిన్నా దివ్యా సీతామవాకిరత్.

ప్ర. అ. ఆసనగతామ్ = సింహాసనమునందున్న, రసాతలమ్ = రసాతలమును, ప్రవిశన్తీమ్ = ప్రవేశించుచున్న, సీతామ్ = సీతను, దృష్ట్వా = చూచి, దివ్యా = దివ్యమైన, పుష్పవృష్టిః = పుష్పవృష్టి, అవిచ్ఛిన్నా = అవిచ్ఛిన్నమై, అవాకిరత్ = వర్షించెను.

తా. సింహాసనమునందు కూర్చుండి రసాతలములోనికి ప్రవేశించుచున్న సీతను చూడగానే దివ్యమైన పుష్పవృష్టి అవిచ్ఛిన్నముగా పడెను. 20

మూ. సాధుకారశ్చ సుమహాన్ దేవానాం సహసోత్థితః, 21
సాధు సాధ్వితి తే సీతే యస్యాస్తే శీలమీదృశమ్.

ప్ర. అ. సీతే = సీతా! యస్యాః = ఏ, తే = నీయొక్క, శీలమ్ = శీలము ఈదృశమ్ = ఇట్టిదో, అట్టి, తే = నీవిషయమునందు, సాధు సాధు = బాగు బాగు,

ఇతి = అని, సుమహాన్ = చాల పెద్దదైన, దేవానామ్ = దేవతలయొక్క, సాధు వాదః = బాగు బాగు అను శబ్దము, సహసా = వెంటనే, ఉత్థితః = బయలు దేరినది.

తా. "సీతా! నీ శీలము ఎంత గొప్పది! బాగు, బాగు' అని దేవతలు పలికిన సాధువాదము వెంటనే బిగ్గరగా వినవచ్చెను. 21

మూ. ఏవం బహువిధా వాచో హ్యన్తరిక్షగతాః సురాః, 22
వ్యాజహ్రుర్హృష్టమనసో దృష్ట్వా సీతాప్రవేశనమ్.

ప్ర. అ. అన్తరిక్షగతాః = ఆకాశమునందున్న, సురాః = దేవతలు, సీతా ప్రవేశనమ్ = సీతయొక్క ప్రవేశమును, దృష్ట్వా = చూచి, హృష్టమనసః = సంతోషించిన మనస్సులు కలవారై, ఏవమ్ = ఇట్లు, బహువిధాః = అనేకవిధములైన, వాచః = వాక్కులను, వ్యాజహ్రుః = పలికిరి.

తా. ఆకాశమునందున్న దేవతలు సీత రసాతలప్రవేశమును చూచి, సంతోషించిన మనస్సులతో ఇట్లు అనేకవిధములైన మాటలు పలికిరి. 22

మూ. యజ్ఞవాటగతాశ్చాపి మునయః సర్వ ఏవ తే, 23
రాజానశ్చ నరవ్యాఘ్రా విస్మయాన్నోపరేమిరే.

ప్ర. అ. యజ్ఞవాటగతాః = యజ్ఞప్రదేశమునందున్న, సర్వే = సమస్తమైన, తే = ఆ, మునయః = మునులు, రాజానః చ = రాజులు, నరవ్యాఘ్రాః = నరశ్రేష్ఠులు, విస్మయాత్ = ఆశ్చర్యమునుండి, న ఉపరేమిరే = ఉపరమించలేదు.

తా. యజ్ఞప్రదేశమునందున్న అందరు మునులకు, రాజులకు, ఉత్తములైన ఇతరజనులకు కూడ ఆశ్చర్యము తగ్గలేదు. 23

మూ. అన్తరిక్షే చ భూమౌ చ సర్వే స్థావరజఙ్గమాః, 24
దానవాశ్చ మహాకాయాః పాతాలే పన్నగాధిపాః,
కేచిద్వినేదుః సంహృష్టాః కేచిద్ధ్యానపరాయణాః, 25
కేచిద్రామం నిరీక్షన్తే కేచిత్సీతామచేతసః.

ప్ర. అ. అన్తరిక్షే = ఆకాశమునందు ఉన్నవారు, భూమౌ చ = భూమి

యందున్న, స్థావరజఙ్గమాఃన స్థావరములు, జంగమములు, మహాకాయాఃన గొప్ప శరీరము గల, దానవాఃచ = దానవులు, పాతాలే = పాతాలమునందున్న, పన్నగాధిపాఃన సర్పనాయకులు, కేచిత్ = కొందరు, సంహృష్టాఃన సంతోషించిన వారై, వినేదుఃన ధ్వనిచేసిరి. కేచిత్ = కొందరు, ధ్యానపరాయణాఃన ధ్యానము నందు ఆసక్తులైరి. కేచిత్ = కొందరు, అచేతసఃన చిత్తము లేనివారై (కలత చెందిన మనస్సులతో), రామమ్ = రాముణ్ణి, నిరీక్షన్తే = చూచుచుండిరి. కేచిత్ = కొందరు, సీతామ్ = సీతను చూచుచుండిరి.

తా. ఆకాశమునందున్నవారిలోను, భూమిమీద ఉన్న స్థావరజంగమముల లోను, పెద్దశరీరములు గల దానవులలోను, పాతాలములో ఉన్న నాగనాయకుల లోను కొందరు సీత పాతివ్రత్యమునకు సంతోషించి బిగ్గరగా అరచిరి. కొందరు ఆలోచనలో పడిరి. కొందరు కలతచెందిన మనస్సులతో రాముణ్ణి, కొందరు సీతనూ చూచుచుండిరి. 24,25

మూ. సీతాప్రవేశనం దృష్ట్వా తేషామాసీత్సమాగమఃన 26
తన్ముహూర్తమివాత్యర్థం సమం సంమోహితం జగత్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
సప్తనవతితమఃన సర్గఃన.

("ముహూర్తమివ తత్సర్వం తూష్ణీంభూతమచేతనమ్,
సీతాప్రవేశనం దృష్ట్వా జగదాసీత్సమాకులమ్"

అను ప్రాచ్యపాఠము బాగున్నది.)

ప్ర. అ. సీతాప్రవేశనమ్ = సీతయొక్క ప్రవేశమును, దృష్ట్వా = చూచి, సమాకులమ్ = వ్యాకులమైన తత్ = ఆ, సర్వమ్ = సమస్తమైన, జగత్ = జగత్తు, ముహూర్తమివ = ముహూర్తకాలము, అచేతనమ్ = చైతన్యశూన్యమై, తూష్ణీంభూతమ్ = మౌనముగా ఉండిపోయెను.

తా. సీత రసాతలములో ప్రవేశించుట చూచి ఆ జగత్తు అంతా కలత చెందెను. ముహూర్తకాలముపాటు స్పృహ తప్పినట్లు అయి నిఃశబ్దముగా ఉండిపోయెను. 26

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో తొంభైఏడవ సర్గ సమాప్తము.

అథ అష్టనవతితమః సర్గః

[సీతకై రాముని శోకము, బ్రహ్మదేవుడు ఓదార్చి ఉత్తరకాండ శేషమును వినుమని చెప్పుట.]

మూ. రసాతలం ప్రవిష్టాయాం వైదేహ్యాం సర్వవానరాః,
చుక్రుశుః సాధు సాధ్వితి మునయో రామసంనిధౌ. 1

ప్ర. అ. వైదేహ్యామ్=సీత, రసాతలమ్ = రసాతలమును, ప్రవిష్టాయామ్ = ప్రవేశించినదగుచుండగా, సర్వవానరాః = సమస్తవానరులు, చుక్రుశుః = అరచిరి. రామసంనిధౌ = రాముని సమీపమునందున్న, మునయః = మునులు, సాధు సాధు ఇతి = "బాగు బాగు" అనిరి.

తా. సీత రసాతలములో ప్రవేశించుట చూచి వానరులు దుఃఖముతో అరచిరి. రాముని ప్రక్కనున్న మునులు ఆమెను కొనియాడుచు "బాగు బాగు" అనిరి. 1

మూ. దణ్డకాష్ఠమవష్టభ్య బాష్పవ్యాకులితేక్షణః,
అవాక్శిరా దీనమనా రామో హ్యాసీత్సుదుఃఖితః. 2

ప్ర అ. రామః=రాముడు, దణ్డకాష్ఠమ్ = కఱ్ఱను, అవష్టభ్య=ఆనుకొని, బాష్పవ్యాకులితేక్షణః=కన్నీళ్ళచేత వ్యాకులము చేయబడిన నేత్రములు కలవాడై, అవాక్శిరాః = క్రిందికి శిరస్సు కలవాడై, దీనమనాః = దీనమైన మనస్సు కలవాడై, సుదుఃఖితః = చాల దుఃఖితుడు, ఆసీత్ = ఆయెను.

తా. రాముడు యజ్ఞదీక్షలో ఉన్నవాళ్ళు చేతిలో ఉంచుకొనవలసిన పలాశ దండమును ఆనుకొని, కన్నీళ్ళచేత నేత్రములు వ్యాకులములు కాగా, తల క్రిందికి వంచి, దీనమైన మనస్సుతో చాల దుఃఖితు డయ్యెను. 2

మూ. స రుదిత్వా చిరం కాలం బహుళో బాష్పముత్సృజన్,
క్రోధశోకసమావిష్టో రామో వచనమబ్రవీత్. 3

ప్ర. అ. సః రామః = ఆ రాముడు, చిరం కాలమ్ = చాల సేపు, రుదిత్వా = ఏడ్చి, బహుళః = అధికముగా, బాష్పమ్ = కన్నీటిని, ఉత్సృజన్ = విడచుచు, క్రోధశోకసమావిష్టః = క్రోధముతోను, శోకముతోను కూడినవాడై, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. రాముడు చాల సేపు ఏడ్చి, అధికముగా కన్నీరు కార్చుచు, క్రోధ శోకములతో కూడినవాడై ఇట్లనెను. 3

మూ. అభూతపూర్వం శోకం మే మనః స్పృష్టుమివేచ్ఛతి,
పశ్యతో మే యథా నష్టా సీతా శ్రీరివ రూపిణీ. 4

ప్ర. అ. రూపిణీ = రూపము గల, శ్రీరివ = లక్ష్మివంటి, సీతా = సీత, మే = నేను, పశ్యతః = చూచుచుండగనే, యథా = ఎట్లు, నష్టా = నష్టమైనదో, అందుచేత, అభూతపూర్వమ్ = పూర్వమెన్నడూ లేని, శోకమ్ = శోకము, మనః = మనస్సును, స్పృష్టుమ్ = స్పృశించుటకు, ఇచ్ఛతీవ = కోరుచున్నట్లున్నది.

తా. (సీతా) రూపముదాల్చిన లక్ష్మి వంటి సీత నేను చూచుచుండగానే అదృశ్యురా లగుటచే పూర్వ మెన్నడూ లేని శోకము నా మనస్సులో ప్రవేశింప దలచుచున్నట్లు ఉన్నది. 4

మూ. సాదర్శనం పురా సీతా లఙ్కాం పారే మహోదధేః,
తతశ్చాపి మయా నీతా కిం పునర్వసుధాతలాత్. 5

ప్ర. అ. ("సా మమాపశ్యతో నీతా లఙ్కాపారే (లఙ్కాం పారే) మహో దధేః, తతశ్చాపి మయా నీతా కిం పునర్వసుధాతలాత్". అను ప్రాచ్యపాఠము బాగున్నది.)
సా = ఆమె, మమ = నేను, అపశ్యతః = చూడకుండగా, మహోదధేః పారే = మహాసముద్రము అవతలి ఒడ్డున, లఙ్కామ్ = లంకను గూర్చి, నీతా = తీసికొని వెళ్ళబడినది. తతః చ అపి = అక్కడినుండి కూడ, మయా = నాచేత, ఆనీతా = తీసికొనిరాబడినది. వసుధాతలాత్ = భూమినుండి, కిం పునః = చెప్పనేల?

తా. నేను చూడనప్పుడు ఆమెను మహాసముద్రము అవతలి ఒడ్డున లంకకు అపహరించుకొనిపోయినారు. అక్కడినుండియే నేను తీసికొనివచ్చితిని, భూమినుండి వేరే చెప్పవలెనా? 5

మూ. వసుధే దేవి భవతి సీతా నిర్యాత్యతాం మమ,
దర్శయిష్యామి వా రోషం యథా మామవగచ్ఛసి. 6

ప్ర. అ. వసుధే దేవి = భూదేవీ! భవతి = పూజ్యురాలా! సీతా = సీత, మమ = నాకు, నిర్యాత్యతామ్ = తిరిగి ఇవ్వబడుగాక. వా = అట్లు కానిచో, మామ్ = నన్ను, యథా = ఎట్లు, అవగచ్ఛసి = తెలిసికొనెదవో అట్లు, రోషమ్ = రోషమును, దర్శయిష్యామి = చూపగలను.

తా. పూజ్యురాలవైన భూదేవీ! నాకు సీతను తిగిరి ఇచ్చివేయుము. అట్లు కానిచో నేను ఎట్టివాడనో నీకు తెలిసే విధముగా కోపము చూపెదను. 6

మూ. కామం శ్వశ్రూర్మమైవ త్వం త్వత్సకాశాద్ధి మైథిలీ,
కర్షతా ఫాలహస్తేన జనకేనోద్ధృతా పురా. 7

ప్ర. అ. త్వమ్ = నీవు, మమ = నాకు, శ్వశ్రూః ఏవ = అత్తగారివే, అసి కామమ్ = అయి ఉన్నావు నిజమే. ఫాలహస్తేన = నాగలి హస్తమునందు గల, కర్షతా = దున్నుచున్న, జనకేన = జనకునిచేత, పురా = పూర్వము, మైథిలీ = సీత, త్వత్సకాశాత్ = నీ సమీపమునుండియే, ఉద్ధృతా హి = పైకి తీయబడినది కదా?

తా. నీవు నాకు తప్పక అత్తగారివే. ఎందుచేత ననగా పూర్వము నాగలి దున్నుచున్న జనకుడు నీనుండియే సీతను పైకి తీసినాడు. 7

మూ. తస్మాన్నిర్యాత్యతాం సీతా వివరం వా ప్రయచ్ఛ మే,
పాతాలే నాకపృష్ఠే వా వసేయం సహితస్తయా. 8

ప్ర. అ. తస్మాత్ = ఆ కారణమువలన, సీతా = సీత, నిర్యాత్యతామ్ = తిరిగి ఇవ్వబడుగాక. వా = లేదా, మే = నాకు, వివరమ్ = వివరమును, ప్రయచ్ఛ = ఇమ్ము. పాతాలే = పాతాలములో నైనా, నాకపృష్ఠే వా = స్వర్గమునందైనా, తయా = ఆమెతో, సహితః = కూడినవాడనై, వసేయమ్ = నివసింతును.

తా. అందువలన సీతనైనా తిరిగి ఇమ్ము, లేదా నాకు కూడ వివరమును ఇమ్ము. పాతాలములో నైనా, స్వర్గములో నైనా నేను ఆమెతో కలిసియే నివసించెదను. 8

మూ. ఆనయ త్వం హి తాం సీతాం మత్తోఽహం మైథిలీకృతే,
న మే దాస్యసి చేత్సీతాం యథారూపాం మహీతలే, 9

సపర్వతవనాం కృత్స్నాం వ్యథయిష్యామి తే స్థితిమ్,
నాశయిష్యామ్యహం భూమిం సర్వమాపో భవన్త్విహ. 10

ప్ర. అ. త్వమ్ = నీవు, తాం సీతామ్ = ఆ సీతను, ఆనయ = తీసికొని రమ్ము. అహమ్ = నేను, మైథిలీకృతే = సీతకొరకై, మత్తః = మదించి ఉన్నాను. మహీతలే = భూమిలోపల నున్న, సీతామ్ = సీతను, యథా = ఏ రూపములో ఉండేదో ఆ రూపము గలదానినిగా, మే = నాకు, న దాస్యసి = ఇవ్వకపోయినచో, సపర్వతవనామ్ = పర్వతములతోను, వనములతోను కూడిన, కృత్స్నామ్ = సమస్తమైన, తే స్థితిమ్ = నీ స్థితిని, వ్యథయిష్యామి = తారుమారుచేసెదను. అహమ్ = నేను, భూమిమ్ = భూమిని, నాశయిష్యామి = నశింపచేసెదను. ఇహ = ఇక్కడ, సర్వమ్ = సమస్తమూ, ఆపః = ఉదకములుగా, భవన్తు = అగుగాక.

తా. ఆ సీతను నాకు తీసికొని రమ్ము. నేను ఆమెకోసము ఉన్మత్తుడనైతిని. భూమిలో ఉన్న సీతను ఆమె పూర్వ మెట్లు ఉండెడిదో అట్లు ఇవ్వకపోయినచో పర్వతములతోను, అరణ్యములతోను కూడిన నీ స్థితిని తారు మారు చేసెదను. ఈ భూమిని నశింపచేసెదను. అంతా జలమయము అగుగాక. 10

మూ. ఏవం బ్రువాణే కాకుత్స్థే క్రోధశోకసమన్వితే,
బ్రహ్మా సురగణైః సార్ధమువాచ రఘునన్దనమ్. 11

ప్ర. అ. క్రోధశోకసమన్వితే = క్రోధముతోను శోకముతోను కూడిన, కాకుత్స్థే = రాముడు, ఏవమ్ = ఇట్లు, బ్రువాణే = పలుకుచుండగా, బ్రహ్మా = బ్రహ్మ, సురగణైః సార్ధమ్ = దేవతాగణములతో కూడ, రఘునన్దనమ్ = రాముణ్ణి గూర్చి, ఉవాచ = పలికెను.

తా. క్రోధశోకములతో కూడిన రాము డీ విధముగా పలుకుచుండగా, దేవగణములతో కూడిన బ్రహ్మదేవుడు రామునితో ఇట్లనెను. 11

మూ. రామ రామ న సంతాపం కర్తుమర్హసి సువ్రత,
స్మర త్వం పూర్వకం భావం మన్త్రిం చామిత్రకర్శన.

ప్ర. అ. సువ్రత=మంచి నియమములు కలవాడా! రామ రామ=రామా! రామా! సంతాపమ్ = దుఃఖమును, కర్తుమ్ = చేయుటకు, న అర్హసి = తగవు. అమిత్రకర్శన = శత్రువులను బాధించువాడా! త్వమ్ = నీవు, పూర్వకమ్ = పూర్వపు, భావమ్ = స్థితిని. మన్త్రిం చ = ఆలోచనను, స్మర = స్మరించుము.

తా. రామా! రామా! ఉత్తమములైన నియమములు కలవాడా! దుఃఖించకుము. నీ పూర్వపు స్వరూపమును, ఆలోచనను స్మరించుము. 12

మూ. న ఖలు త్వాం మహాబాహో స్మారయేయమనుత్తమ,
ఇమం ముహూర్తం దుర్ధర్ష స్మర త్వం జన్మ వైష్ణవమ్.

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా! అనుత్తమ=చాల ఉత్తముడా! త్వామ్ = నిన్ను, న ఖలు స్మారయే = స్మరింపచేయుటలేదు. దుర్ధర్ష = ఎదిరింప శక్యము కానివాడా! ఇమం ముహూర్తమ్ = ఈ ముహూర్తమును (నందు), త్వమ్ = నీవు, వైష్ణవమ్ = విష్ణు సంబంధమైన, జన్మ = జన్మను, స్మర = స్మరించుము.

తా. గొప్ప బాహుబలము గలవాడా, అత్యుత్తమపురుషా! నేను నిన్ను స్మరింపచేయుటలేదు. ఎదిరింప శక్యము కానివాడా! ఈ క్షణమునందు నీవు వైష్ణవ జన్మను గూర్చి స్మరించుము. 13

మూ. సీతా హి విమలా సాధ్వీ తవ పూర్వపరాయణా,
నాగలోకం సుఖం ప్రాయాత్త్వదాశ్రయతపోబలాత్.

ప్ర. అ. విమలా = నిర్మలురాలు, సాధ్వీ = పతివ్రత, తవ = నీయొక్క, పూర్వపరాయణా = పూర్వ ప్రకృతియందు అనగా విష్ణుస్వరూపమునందు ఆసక్తి గలది అయిన, సీతా = సీత, త్వదాశ్రయతపోబలాత్ = నీ ఆశ్రయమనే తపస్సు యొక్క బలమువలన, సుఖమ్ = సుఖముగా, నాగలోకమ్ = నాగలోకమును, ప్రాయాత్ = వెళ్లెను.

తా. మాలిన్యము లేనిది, పతివ్రతా అయిన సీత నీ పూర్వరూపమును

కోరుచు, నీ ఆశ్రయ మనే తపస్సుయొక్క బలమువలన సుఖముగా నాగలోకము నకు వెళ్ళినది.

మూ. స్వర్గే తే సంగమో భూయో భవిష్యతి న సంశయః,
అస్యాస్తు పరిషన్మధ్యే యద్ బ్రవీమి నిబోధ తత్. 15

ప్ర. అ. తే=నీకు, భూయః=మరల, స్వర్గే=స్వర్గమునందు, సంగమః=సంగమము, భవిష్యతి = కాగలదు, సంశయః = సంశయము, న = లేదు. అస్యాః = ఈ, పరిషన్మధ్యే=పరిషత్తు మధ్యయందు, యత్=దేనిని, బ్రవీమి=చెప్పుచున్నానో, తత్ = దానిని, నిబోధ = తెలుసుకొనుము.

తా. నీకు మరల ఆమె సంగము స్వర్గములో కలుగును, సంశయము లేదు. ఈ పరిషత్తు మధ్యలో నేను చెప్పుచున్న మాట వినుము. 15

మూ. ఏతదేవ హి కావ్యం తే కావ్యానాముత్తమం శ్రుతమ్,
సర్వం విస్తరతో రామ వ్యాఖ్యాస్యతి న సంశయః. 16

ప్ర. అ. తే = నీకు, శ్రుతమ్ = వినబడిన, కావ్యానామ్ = కావ్యములలో, ఉత్తమమ్ = ఉత్తమమైన, ఏతత్ = ఈ, కావ్యమేవ = కావ్యమే, రామ=రామా! సర్వమ్ = సమస్తమును, విస్తరతః = విస్తరముతో, వ్యాఖ్యాస్యతి = వివరించి చెప్పగలదు. సంశయః = సంశయము, న = లేదు.

తా. రామా! నీవు వినిన అన్ని కావ్యములలోను ఉత్తమమైన ఈ కావ్యమే నీకు విపులముగ స్పష్టముగ చెప్పగలదు, సంశయము లేదు. 16

మూ. జన్మప్రభృతి తే వీర సుఖదుఃఖోపసేవనమ్,
భవిష్యదుత్తరం చేహ సర్వం వాల్మీకినా కృతమ్. 17

ప్ర. అ. వీర = వీరుడా! జన్మప్రభృతి = జన్మ మొదలుకొని, తే = నీయొక్క, సుఖదుఃఖోపసేవనమ్ = సుఖదుఃఖముల అనుభవము, భవిష్యత్ = జరుగబోవు, ఉత్తరం చ = తరువాతి వృత్తము, సర్వమ్ = అంతా, ఇహ = దీనియందు, వాల్మీకినా = వాల్మీకిచేత, కృతమ్ = చేయబడినది.

తా. వీరుడా! నీ జన్మ మొదలు నీకు కలిగిన సుఖదుఃఖముల అనుభవ

మును, రాబోవు వృత్తాంతమునూ అంతనూ కూడ వాల్మీకి ఈ కావ్యములో నిబంధించినాడు. 17

మూ. ఆదికావ్యమిదం రామ త్వయి సర్వం ప్రతిష్ఠితమ్,
న హ్యన్యోఽర్హతి కావ్యానాం యశోభాగ్రాఘవాదృతే.

ప్ర. ఆ. రామ = రామా! ఇదమ్ = ఈ, ఆదికావ్యమ్ = ఆదికావ్యము, సర్వమ్ = సమస్తమూ కూడ, త్వయి = నీయందు, ప్రతిష్ఠితమ్ = ప్రతిష్ఠితమై ఉన్నది. రాఘవాత్ ఋతే = రాముడు (నీవు) తప్ప, అన్యః = మరియొకడు. కావ్యానామ్ = కావ్యములయొక్క, యశోభాక్ = యశస్సును పొందేవాడుగా, నార్హతి హి = తగడు కదా?

తా. ఈ ఆదికావ్య మంతా నీకే సంబంధించి యున్నది. రాముడు తప్ప కావ్యయశస్సును పొందతగినవాడు మరొకడు లేడు కదా? 18

మూ. శ్రుతం తే సర్వమేతద్ధి మయా సర్వం సురైః సహ.
దివ్యమద్భుతరూపం చ సత్యవాక్యమనావృతమ్. 19

ప్ర. ఆ. దివ్యమ్ = దివ్యము, అద్భుతరూపం చ = అద్భుతమైన రూపము గలది, సత్యవాక్యమ్ = సత్యమైన వాక్యములు గలది, అనావృతమ్ = దాచబడనిది, ఏతత్ = ఇది, సర్వమ్ = సమస్తమూ, మయా = నాచేత, సురైః సహ = దేవతలతో కూడ, మయా = నాచేత, శ్రుతం హి = వినబడినది కదా?

తా. దివ్యమూ, ఆశ్చర్యకరమూ, సత్యమూ, అయిన, ఏ వృత్తాంతమూ దాచని ఈ కావ్యమును పూర్తిగా నేనూ దేవతలూ కలిసి విని ఉన్నాము. 19

మూ. స త్వం పురుషశార్దూల ధర్మేణ సుసమాహితః,
శేషం భవిష్యం కాకుత్స్థ కావ్యం రామాయణం శృణు.

ప్ర. ఆ. పురుషశార్దూల = పురుషశ్రేష్ఠుడా! కాకుత్స్థ = రామా! సః త్వమ్ = అట్టి నీవు, ధర్మేణ = ధర్మముచేత, సుసమాహితః = బాగా సావధాన చిత్తుడవై, శేషమ్ = మిగిలిన, భవిష్యత్ = జరుగబోవు, రామాయణం కావ్యమ్ = రామాయణ కావ్యమును, శృణు = వినుము.

తా. పురుషశ్రేష్ఠుడవైన రామా! నీవు ధర్మానుసారముగా, సావధాన చిత్తుడవై రామాయణములోని రాబోవు కథను చెప్పు మిగిలిన భాగమును వినుము. 20

మూ. ఉత్తరం నామ కావ్యస్య శేషమత్ర మహాయశః,
తచ్ఛృణుష్వ మహాతేజ ఋషిభిః సార్ధముత్తమమ్. 21

ప్ర. అ. మహాయశః = గొప్ప కీర్తి గలవాడా! అత్ర = ఇక్కడ, కావ్యస్య = కావ్యముయొక్క, శేషమ్ = మిగిలిన భాగము, ఉత్తరం నామ = ఉత్తర మను పేరు గలది. మహాతేజః = గొప్ప తేజస్సు కలవాడా! ఋషిభిః సార్ధమ్ = ఋషులతో కూడ, ఉత్తమమ్ = ఉత్తమమైన, తత్ = దానిని, శృణుష్వ = వినుము.

తా. గొప్ప కీర్తి గలవాడా! ఈ కావ్యములోని మిగిలిన భాగమునకు ఉత్తరభాగము అని పేరు. గొప్ప తేజస్సు గల రామా! ఉత్తమమైన దానిని ఋషులతో కలిసి వినుము. 21

మూ. న ఖల్వన్యేన కాకుత్స్థ శ్రోతవ్యమిదముత్తమమ్,
పరమఋషిణా వీర త్వయైవ రఘునన్దన. 22

ప్ర. అ. కాకుత్స్థ = రామా! ఉత్తమమ్ = ఉత్తమమైన, ఇదమ్ = ఈ కావ్యభాగము, అన్యేన = ఇతరునిచేత, న శ్రోతవ్యమ్ = వినదగినది కాదు. వీర = వీరుడా, రఘునన్దన = రామా! పరమఋషిణా = గొప్పరాజర్షివైన, త్వయైవ = నీచేతనే వినదగినది.

తా. రామా! ఉత్తమమైన ఈ భాగము మరొకరు ఎవరూ వినగూడదు. వీరుడవైన రామా! గొప్ప రాజర్షివైన నీవే (ముందుగా) వినవలెను. 22

మూ. ఏతావదుక్త్వా వచనం బ్రహ్మా త్రిభువనేశ్వరః,
జగామ త్రిదివం దేవో దేవైః సహ సభాన్దవైః. 23

ప్ర. అ. త్రిభువనేశ్వరః = ముల్లోకములకు ప్రభువైన, బ్రహ్మా = బ్రహ్మ దేవుడు, ఏతావత్ = ఇంతమాత్రము, వచనమ్ = వచనమును, ఉక్త్వా = పలికి,

దేవః = దేవుడైన అతడు. సబాన్ధవైః = బంధువులతో కూడిన, దేవైః సహ = దేవతలతో కూడ, త్రిదివమ్ = స్వర్గమును గూర్చి, జగామ = వెళ్లెను.

తా. ముల్లోకములకు ప్రభువైన బ్రహ్మదేవుడు ఇట్లు పలికి బంధువులతో కూడిన దేవతలతో కూడ కలిసి స్వర్గమునకు వెళ్ళిపోయెను. 23

మూ. యే చ తత్ర మహాత్మాన ఋషయో బ్రాహ్మలౌకికాః,
బ్రహ్మణా సమనుజ్ఞాతా న్యవర్తన్త మహౌజసః. 24

ప్ర. అ. బ్రాహ్మలౌకికాః = బ్రహ్మలోకమునకు సంబంధించిన. మహాత్మానః = మహాత్ములైన, యే = ఏ. ఋషయః = ఋషులు గలరో, మహౌజసః = గొప్ప తేజస్సు కల వారు, బ్రహ్మణా = బ్రహ్మచేత, సమనుజ్ఞాతాః = అనుజ్ఞ ఇవ్వబడినవారై, తత్ర = ఆచటికి, న్యవర్తన్త = మరలి వచ్చిరి.

తా. బ్రహ్మలోకమునకు సంబంధించిన మహాతేజః శాలులైన ఋషులందరూ బ్రహ్మ అనుజ్ఞ తీసికొని ఉత్తరకథ వినుటకై వెనుకకు తిరిగి వచ్చిరి.

మూ. ఉత్తరం శ్రోతుమనసో భవిష్యం యచ్చ రాఘవే,
తతో రామః శుభాం వాణీం దేవదేవస్య భాషితామ్, 25
శ్రుత్వా పరమతేజస్వీ వాల్మీకిమిదమబ్రవీత్.

ప్ర. అ. ఉత్తరమ్ = ఉత్తరభాగమును, రాఘవే = రామునియందు, యత్ = ఏది, భవిష్యం చ = కానున్నదో దానిని, శ్రోతుమనసః = వినుటకు మనస్సు కలవారై (తిరిగి వచ్చిరి). పరమతేజస్వీ = మిక్కిలి తేజస్సు గల, రామః = రాముడు, దేవదేవస్య = బ్రహ్మదేవునియొక్క, భాషితామ్ = పలకబడిన, శుభాం వాణీమ్ = శుభమైన వాక్కును, శ్రుత్వా = విని, తతః = ఆటు పిమ్మట, వాల్మీకిమ్ = వాల్మీకిని గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. రామాయణములోని ఉత్తర భాగమును, రామునికి భవిష్యత్తులో ఏమి జరుగ నున్నదో దానిని వినుటకై తిరిగి వచ్చిరి. గొప్ప తేజస్సు గల రాముడు బ్రహ్మదేవుడు పలికిన శుభమైన వాక్కును విని వాల్మీకితో ఇట్లనెను.

వి. ఈ ఘట్టంలో సీతాదేవి త్రిభువనవ్యాప్తమహాశక్తిస్వరూపిణి అని తెలిపే కొన్ని శ్లోకాలు ప్రాచ్యప్రతిలో ఉన్నవి :-

శ్లో॥ ఏతస్మిన్తరే వాణీ నిఃసృతా ధరణీతలాత్,
జహి త్వం రామ సంతాపం కృతాన్తో హ్యత్ర కారణమ్.

తా. ఇంతలో భూమిలోపలినుండి ఒక వాణి వినబడెను "రామా! నీవు తాపము విడిచిపెట్టుము. ఇందుకు దైవమే కారణము.

శ్లో॥ కాఙ్క్షసే యచ్చ వైదేహీం తద్వృథా పరితప్యసే,
దుర్లభం దర్శనం తస్యాస్త్రిలోక్యే యా ప్రతిష్ఠితా.

తా. నీవు సీత కావాలని కోరుచున్నావు. ఇది వృథాపరితాపమే. ఆమె దర్శనము లభించదు. ఆమె మూడు లోకాలలోను వ్యాపించి ఉన్నది.

శ్లో॥ ఇహస్థా పూజ్యతే నాగైర్మర్త్యలోకే చ మానుషైః
పితృణాం చ సుధా (స్వధా) స్వర్గే సా తృప్తిరమృతాశినామ్

తా. ఇక్కడ ఉన్న ఈమెను నాగులు పూజించుచుందురు. మానవ లోకములో మానవులు పూజించుచుందురు. ఈమె పితృదేవతలకు తృప్తి నిచ్చు స్వధ. స్వర్గములో అమృతమును భుజించు దేవతల తృప్తి ఈమె స్వరూపమే.

శ్లో॥ శ్రీవత్సవక్షసో దేహే సైవ లక్ష్మీః ప్రతిష్ఠితా,
సిద్ధానాం స్వర్గసంస్థానాం సా చ సిద్ధిః ప్రతిష్ఠితా.

తా. మహావిష్ణువు దేహమునందు ఈమెయే లక్ష్మిగా ప్రతిష్ఠిత అయి ఉన్నది. స్వర్గములో ఉన్న సిద్ధపురుషుల సిద్ధిగా ప్రతిష్ఠిత అయి ఉన్నది.

శ్లో॥ నివర్తయ మతిం రామ వైదేహ్యా దర్శనం ప్రతి,
ద్రష్టవ్యా యది తే సీతా పుత్రౌ పశ్య కుశీలవౌ.

తా. రామా! సీతను చూడవలె ననే ప్రయత్నమును విరమించుకొనుము. సీతను చూడవలె నని ఉన్నచో పుత్రులైన కుశీలవులను (కుశలవులను) చూచుకొనుము. ఈ దృష్టితో చూస్తే సీతారాములు అప్పుడు ఉండేవారు, ఇప్పుడూ ఉన్నారు; ఎప్పుడూ ఉంటారు అంతటా ఉన్నారు, ఉంటారు.

మూ. భగవన్ శ్రోతుమనస ఋషయో బ్రాహ్మలౌకికాః, 26
భవిష్యదుత్తరం యన్మే శ్వోభూతే సంప్రవర్తతామ్.

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా! బ్రాహ్మలౌకికాః = బ్రహ్మలోకమునకు చెందిన, ఋషయః = ఋషులు, యత్ = ఏది, మే = నాకు, భవిష్యత్ = కాను న్నదో, ఉత్తరమ్ = అట్టి ఉత్తరకథావస్తువును, శ్రోతుమనసః = వినవలె ననుమనస్సు కలవారు. శ్వోభూతే = రేపు, సంప్రవర్తతామ్ = జరుగుగాక.

తా. పూజ్యుడా! బ్రహ్మలోకమునకు చెందిన ఈ ఋషులు నాకు జరగబోవు దానిని వినవలె ననుకోరికతో ఉన్నారు. దాని గానము రేపు జరుగు గాక. 26

మూ. ఏవం వినిశ్చయం కృత్వా సంప్రగృహ్య కుశీలవౌ, 27
తం జనౌఘం విసృజ్యాథ పర్ణశాలాముపాగమత్,
తామేవ శోచతః సీతాం సా వ్యతీతా చ శర్వరీ. 28

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
అష్టనవతితమః సర్గః.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, వినిశ్చయమ్ = నిశ్చయమును, కృత్వా = చేసి, కుశీలవౌ = గాయకులైన బాలులను, సంప్రగృహ్య = తీసికొని, తం జనౌఘమ్ = ఆ జనసముదాయమును, విసృజ్య = పంపివేసి, అథ = పిమ్మట, పర్ణశాలామ్ = పర్ణశాలను, ఉపాగమత్ = పొందెను. తామ్ = ఆ, సీతామేవ = సీతనే గూర్చి, శోచతః = ఆలోచించుచుండగా, సా = ఆ, శర్వరీ = రాత్రి, వ్యతీతా = గడచిపోయినది.

తా. ఇట్లు నిశ్చయము చేసి, ఆ జనుల నందరినీ పంపివేసి కుశలవులను తీసికొని, పర్ణశాలలోనికి వెళ్లెను. ఆ సీతను గూర్చిన ఆలోచనతోనే ఆ రాత్రి గడచిపోయెను. 27,28

'బాలానందిని' అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
తొంభై ఎనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనశతతమః సర్గః

[సీత రసాతలములో ప్రవేశించిన పిమ్మట రాముని జీవన విధానము. రామరాజ్యములోని పరిస్థితులు. రాముని తల్లులు స్వర్గస్థ లగుట.]

మూ. రజన్యాం తు ప్రభాతాయాం సమానీయ మహామునీన్,
గీయతామవిశఙ్కా-భ్యాం రామః పుత్రావువాచ హ. 1

ప్ర. అ. రజన్యామ్ = రాత్రి, ప్రభాతాయామ్ = తెల్లవారిన దగుచుండగా, రామః = రాముడు, మహామునీన్ = మహామునులను, సమానీయ = పిలిపించి, అవిశఙ్కా-భ్యామ్ = శంక లేని మీచేత, గీయతామ్ = గానము చేయబడుగాక అని, పుత్రౌ = పుత్రులను గూర్చి, ఉవాచ హ = పలికెను.

తా. రాత్రి తెల్లవారిన పిమ్మట రాముడు మహామునులను పిలిపించి "మీరు ఏ మాత్రము సంకోచము చెందక గానము చేయండి"అని పుత్రులకు చెప్పెను. 1

మూ. తతః సముపవిష్టేషు మహర్షిషు మహాత్మసు,
భవిష్యదుత్తరం కావ్యం జగతుస్తౌ కుశీలవౌ. 2

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మహాత్మసు = మహాత్ములైన, మహర్షిషు = మహర్షులు, సముపవిష్టేషు = కూర్చున్నవారగుచుండగా, కుశీలవౌ = ఆ గాయకులు, భవిష్యత్ = జరుగగనున్న, ఉత్తరం కావ్యమ్ = ఉత్తరకావ్యమును, జగతుః = గానముచేసిరి.

తా. మహాత్ములైన మహర్షులు కూర్చున్న పిమ్మట ఆ కుశలవులు జరుగ బోవు కథను చెప్పు ఉత్తరకావ్యమును గానము చేసిరి. 2

మూ. ప్రవిష్టాయాం తు సీతాయాం భూతలం సత్యసంపదా,
తస్యావసానే యజ్ఞస్య రామః పరమదుర్మనాః. 3

అపశ్యమానో వైదేహీం మేనే శూన్యమిదం జగత్,
శోకేన పరమాయస్తో న శాన్తిం మనసాగమత్. 4

ప్ర. అ. సీతాయామ్=సీత, సత్యసంపదా=సత్యముయొక్క సంపదచేత, భూతలమ్=రసాతలమును, ప్రవిష్టాయామ్=ప్రవేశించిన దగుచుండగా, తస్య యజ్ఞస్య=ఆ యజ్ఞముయొక్క, అవసానే=అంతమునందు, రామః=రాముడు, పరమదుర్మనాః=చాల దుఃఖముతో కూడినవాడై, వైదేహీమ్=సీతను, అపశ్యమానః=చూడనివాడై, ఇదం జగత్=ఈ జగత్తును, శూన్యమ్=శూన్యమైనదానినిగా, మేనే=తలచెను. శోకేన=శోకముచేత, పరమాయస్తః=మిక్కిలి ఆయాసము చెందినవాడై, మనసా=మనస్సుచేత, శాన్తిమ్=శాంతిని, న అగమత్=పొందలేదు.

తా. సత్యప్రభావముచేత సీత రసాతలములో ప్రవేశించిన పిదప, యజ్ఞము పూర్తియైన తరువాత రాముడు చాల శోకాక్రాంతు డయ్యెను. సీత కనబడకపోవుటచే ఆతనికి ఈ జగత్తు శూన్యముగా కనబడెను. శోకముచేత తప్తుడై మనఃశాంతిని పొందజాలకపోయెను. 3,4

మూ. విసృజ్య పార్థివాన్ సర్వాన్ఋక్షవానరరాక్షసాన్,
జనౌఘం విప్రముఖ్యానాం విత్తపూర్వం విసృజ్య చ. 5

ఏవం సమాప్య యజ్ఞం తు విధివత్స తు రాఘవః,
తతో విసృజ్య తాన్ సర్వాన్ రామో రాజీవలోచనః, 6
హృది కృత్వా స తాం సీతామయోధ్యాం ప్రవివేశ హ.

ప్ర. అ. రాఘవః=రఘువంశసంజాడుడు, రాజీవలోచనః=పద్మముల వంటి నేత్రములు కలవాడు అయిన, సః=ఆ, రామః=రాముడు, యజ్ఞమ్=యజ్ఞమును, విధివత్=యథాశాస్త్రముగా, ఏవమ్=ఇట్లు, సమాప్య=సమాప్తి పొందించి, సర్వాన్=సమస్తమైన, పార్థివాన్=రాజులను, ఋక్షవానరరాక్షసాన్=భల్లూకములను వానరులను, రాక్షసులను, విసృజ్య=విడచి (పంపివేసి), విప్రముఖ్యానామ్=బ్రాహ్మణశ్రేష్ఠులయొక్క, జనౌఘమ్=జనసముదాయమును, విత్తపూర్వమ్=ధనపూర్వకముగా, విసృజ్య=విడచి, తాన్ సర్వాన్=వాళ్ళ నందరినీ

కూడ, విసృజ్య = విడచి, తాం సీతామ్ = ఆ సీతను, హృది = హృదయమునందు, కృత్వా = చేసి (ఉంచుకొని), అయోధ్యామ్ = అయోధ్యను, ప్రవివేశ హ = ప్రవేశించెను.

తా. తామరపూలరేకుల వంటి కండ్లు గల ఆ రాముడు యథావిధిగా యజ్ఞము పూర్తిచేసికొని, ఋక్ష-వానర-రాక్షసుల నందరినీ పంపివేసి, బ్రాహ్మణ శ్రేష్ఠులకు ధనదానము చేసి వారిని కూడ పంపివేసి, ఇతరజనులను అందరినీ కూడ పంపివేసి మనస్సులో సీతను గూర్చియే తలచుచు అయోధ్యలో ప్రవేశించెను. 5,6

మూ. ఇష్టయజ్ఞో నరపతిః పుత్రద్వయసమన్వితః. 7
న సీతాయాః పరాం భార్యాం వవ్రే స రఘునన్దనః,
యజ్ఞే యజ్ఞే చ పత్న్యర్థం జానకీ కాఞ్చనీ భవత్. 8

ప్ర. అ. ఇష్టయజ్ఞః = చేయబడిన యజ్ఞము గల, నరపతిః = రాజు, పుత్రద్వయసమన్వితః = పుత్రద్వయముతో కూడినవాడై (అయోధ్యలో ప్రవేశించెను). సః రఘునన్దనః = ఆ రాముడు, సీతాయాః = సీతకంటె, పరామ్ = అన్యురాలైన, భార్యామ్ = భార్యను, న వవ్రే = వరించలేదు. యజ్ఞే యజ్ఞే చ = ప్రతియజ్ఞమునందూ, పత్న్యర్థమ్ = భార్య కృత్యముకొరకు, కాఞ్చనీ = బంగారము వికారమైన, జానకీ = సీత, భవత్ = ఆయెను.

తా. ఆ రాజు యజ్ఞము పూర్తి చేసికొని ఇద్దరు పుత్రులతో కలిసి అయోధ్యలో ప్రవేశించెను. ఆ రాముడు సీతను తప్ప మరెవ్వరినీ భార్యనుగా స్వీకరించలేదు. ప్రతియజ్ఞమునందూ కూడ పత్నీకార్యములు చేయుటకు బంగారు సీత ఉండెను. 7,8

మూ. దశవర్షసహస్రాణి వాజిమేధానథాకరోత్,
వాజపేయాన్ దశగుణాంస్తథా బహుసువర్ణకాన్. 9

ప్ర. అ. అథ = అటుపిమ్మట, దశవర్షసహస్రాణి = పదివేల సంవత్సరములు, వాజిమేధాన్ = అశ్వమేధములను, అకరోత్ = చేసెను. తథా = మరియు, బహుసువర్ణకాన్ = అధికమైన బంగారము గల, దశగుణాన్ = పది రెట్లు, వాజపేయాన్ = వాజపేయములను చేసెను.

తా. పది వేల సంవత్సరములు ఎన్నో అశ్వమేధయాగములను, వాటికి పదిరెట్లు, అత్యధికమైన బంగారము దక్షిణగా ఇచ్చిన వాజపేయయాగములను చేసెను. 9

మూ. అగ్నిష్టోమాతిరాత్రాభ్యాం గోసవైశ్చ మహాధనైః,
ఈజే క్రతుభిరన్యైశ్చ స శ్రీమానాప్తదక్షిణైః. 10

ప్ర. అ. శ్రీమాన్ = శ్రీమంతుడైన, సః = రాముడు, అగ్నిష్టోమాతిరాత్రాభ్యామ్ = అగ్నిష్టోమ - అతిరాత్రములచేత, మహాధనైః = గొప్ప ధనము గల, గోసవైః చ = గోసవములచేత, ఆప్తదక్షిణైః = అధికమైన దక్షిణ గల, అన్యైః = ఇతరములైన, క్రతుశతైః చ = వందలకొలది క్రతువులచేతా, ఈజే = యాగము చేసెను.

తా. శ్రీమంతుడైన రాముడు అగ్నిష్టోమము, అతిరాత్రము, అధికమైన ధనము గల (ధనవ్యయము జరుగు) గోసవము లను యజ్ఞములు, పరిపూర్ణదక్షిణ లిచ్చిన ఇరతయజ్ఞములు చేసెను. 10

మూ. ఏవం స కాలః సుమహాన్ రాజ్యస్థస్య మహాత్మనః,
ధర్మే ప్రయతమానస్య వ్యతీయాద్రాఘవస్య చ. 11

ప్ర. అ. రాజ్యస్థస్య = రాజ్యమునందున్న, ధర్మే = ధర్మమునందు, ప్రయతమానస్య = ప్రయత్నముచేయుచున్న, మహాత్మనః = మహాత్ముడైన, రాఘవస్య = రామునకు, ఏవమ్ = ఈవిధముగ, సుమహాన్ = చాల గొప్పదైన, సః కాలః = ఆ కాలము, వ్యతీయాత్ = గడచెను.

తా. మహాత్ముడైన రాముడు ఈ విధముగా రాజ్యపాలనము చేయుచు, ధర్మమును రక్షించుటకై ప్రయత్నించుచుండగా అతిదీర్ఘమైన కాలము గడచెను. 11

మూ. ఋక్షవానరరక్షాంసి స్థితా రామస్య శాసనే,
అనురజ్యన్తి రాజానో హ్యహన్యహని రాఘవమ్. 12

ప్ర. అ. ఋక్షవానరరక్షాంసి = ఎల్లుకములు, వానరములు, రాక్షసులూ, రామస్య = రామునియొక్క, శాసనే = శాసనమునందు, స్థితాః = ఉండిరి. అహని

అహని = ప్రతిదినమూ, రాజానః=రాజులు, రాఘవమ్ = రాముణ్ణి, అనురక్షన్తి= రంజింపచేయుచున్నారు.

తా. భల్లూకములు, వానరులు, రాక్షసులూ కూడ రాముని శాసనములో ఉండిరి. సామంతరాజులు ప్రతిదినమూ కూడ రామునకు ఆనందము కలిగించు చుండిరి. 12

మూ. కాలే వర్షతి పర్జన్యః సుభిక్షం విమలా దిశః,
హృష్టపుష్టజనాకీర్ణం పురం జనపదాస్తథా. 13

ప్ర. అ. పర్జన్యః = మేఘము, సుభిక్షమ్ = సుభిక్షముగా ఉండునట్లు, కాలే=కాలమునందు, వర్షతి = వర్షించుచున్నాడు. దిశః = దిక్కులు, విమలాః= నిర్మలములైనవి. పురమ్ = పురము, హృష్టపుష్టజనాకీర్ణమ్ = సంతోషించిన, పరి పుష్టులైన జనులతో నిండినది. తథా = మరియు, జనపదాః = గ్రామములు (అట్టి జనులతో నిండినవి).

తా. సుభిక్షముగా ఉండు నట్లు మేఘము కాలమునందు వర్షించుచుండెను. దిక్కులు నిర్మలములుగా ఉండెను. నగరములు, గ్రామములూ కూడ ఆనంద ముతో పుష్టిగా ఉన్న జనులతో నిండి ఉండెను. 13

మూ. నాకాలే మ్రియతే కశ్చిన్న వ్యాధిః ప్రాణినాం తథా,
నానర్థో విద్యతే కశ్చిద్రామే రాజ్యం ప్రశాసతి. 14

ప్ర. అ. రామే = రాముడు, రాజ్యమ్ = రాజ్యమును, ప్రశాసతి = పరిపా లించుచుండగా, కశ్చిత్ =ఎవ్వడూ కూడ, అకాలే=అకాలమునందు, న మ్రియతే= మరణించలేదు. తథా = మరియు ప్రాణినామ్ = ప్రాణులకు, వ్యాధిః = వ్యాధి, న = లేదు. కశ్చిత్ = ఏమీ, అనర్థః = అనర్థము, న విద్యతే = లేదు.

తా. రాముడు రాజ్యమును పాలించుచుండగా ఎవ్వనికీ అకాలమరణము రాలేదు. ప్రాణులకు వ్యాధులు లేవు. ఎట్టి అనర్థములూ కలుగలేదు. 14

మూ. అథ దీర్ఘస్య కాలస్య రామమాతా యశస్వినీ,
పుత్రపౌత్రైః పరివృతా కాలధర్మముపాగమత్. 15

ప్ర. అ. పుత్రపౌత్రైః = పుత్రపౌత్రులతో, పరివృతా = కూడిన, యశస్వినీ = కీర్తిగల, రామమాతా = రాముని తల్లి, అథ = అనంతరము, దీర్ఘస్య = దీర్ఘమైన, కాలస్య = కాలమునకు, కాలధర్మమ్ = మరణమును, ఉపాగమత్ = పొందెను

తా. పుత్రపౌత్రులతో ఆనందించుచున్న కీర్తిమంతురాలైన కౌసల్య చాల కాలమునకు మరణించెను. 15

మూ. అన్వ్యాయ సుమిత్రా చ కైకేయీ చ యశస్వినీ,
ధర్మం కృత్వా బహువిధం త్రిదివే పర్యవస్థితా. 16

ప్ర. అ. యశస్వినీ = కీర్తిమంతురాలైన, సుమిత్రా చ = సుమిత్రయు, కైకేయీ చ = కైకేయి, అన్వ్యాయ = ఆమెను అనుసరించి వెళ్ళిరి. బహువిధమ్ = అనేకవిధములైన, ధర్మమ్ = ధర్మమును, కృత్వా = చేసి, త్రిదివే = స్వర్గమునందు, పర్యవస్థితా = ఉన్నది.

తా. కీర్తిగల సుమిత్ర, కైకేయీ కూడ అనేకవిధములైన ధర్మములు చేసి కౌసల్యను అనుసరించి వెళ్ళి స్వర్గములో ఉండిరి. 16

మూ. సర్వాః ప్రముదితాః స్వర్గే రాజ్ఞా దశరథేన చ,
సమాగతా మహాభాగాః సర్వధర్మం చ లేభిరే. 17

ప్ర. అ. సర్వాః = సమస్తమైన, మహాభాగాః = మహాభాగ్యవతులైన వారు ముగ్గురూ, స్వర్గే = స్వర్గమునందు, రాజ్ఞా = రాజైన, దశరథేన = దశరథునితో, సమాగతాః = కలిసినవారై, ప్రముదితాః = సంతోషించినవారై, సర్వధర్మమ్ = సకలధర్మఫలమును, లేభిరే = పొందిరి.

తా. మహాభాగ్యవతులైన వారు ముగ్గురూ స్వర్గములో దశరథమహారాజుతో కలిసి సంతోషించుచు సకలధర్మములచేత లభించు సౌఖ్యమును అనుభవించిరి.

మూ. తాసాం రామో మహాదానం కాలే కాలే ప్రయచ్ఛతి,
మాత్యాణామవిశేషేణ బ్రాహ్మణేషు తపస్విషు. 18

ప్ర. అ. రామః = రాముడు, కాలే కాలే = ఆ యా కాలములందు, తాసామ్ = ఆ, మాతృణామ్ = తల్లుల తృప్తికొరకు, అవిశేషేణ = భేదభావము లేకుండగా, తపస్వీషు = తపస్సు గల, బ్రాహ్మణేషు = బ్రాహ్మణులయందు, మహాదానమ్ = గొప్ప దానమును, ప్రయచ్ఛతి = ఇచ్చుచున్నాడు.

తా. రాముడు ఆ యా సమయములయందు తల్లులందరికీ తృప్తి కలుగుటకై, భేదబుద్ధిలేకుండగా, తపస్సంపన్నులైన బ్రాహ్మణులకు మహాదానము లిచ్చుచుండెను. 18

మూ. పిత్ర్యాణి బ్రహ్మరత్నాని యజ్ఞాన్ పరమదుస్తరాన్,
చకార రామో ధర్మాత్మా పిత్ర్యాన్ దేవాన్ వివర్ధయన్.

ప్ర. అ. ధర్మాత్మా = ధరాత్ముడైన, రామః = రాముడు, పిత్ర్యాన్ దేవాన్ = పితృదేవతలను, వివర్ధయన్ = సంతృప్తి పరచుచు, పిత్ర్యాణి = పితృదేవతలకు తృప్తి నిచ్చు, బ్రహ్మరత్నాని = బ్రాహ్మణులకు ఇవ్వవలసిన శ్రేష్ఠవస్తువులను (దానముచేసెను). పరమదుస్తరాన్ = పూర్తిచేయుటకు చాల కష్టమైన, యజ్ఞాన్ = యజ్ఞములను, చకార = చేసెను.

తా. ధర్మాత్ముడైన రాముడు పితృదేవతల సంతృప్తికొరకై బ్రాహ్మణులకు అనేకములైన మంచి వస్తువులను దానము చేసెను; పూర్తిచేయుటకు చాల కష్టమైన యజ్ఞములు చేసెను. 19

మూ. ఏవం వర్షసహస్రాణి బహూన్యథ యయుః సుఖమ్,
యజ్ఞైర్బహువిధం ధర్మం వర్ధయానస్య సర్వదా. 20

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకోనశతతమః సర్గః.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, యజ్ఞైః = యజ్ఞములచేత, బహువిధమ్ = అనేక విధములైన, ధర్మమ్ = ధర్మమును, సర్వదా = ఎల్లప్పుడూ, వర్ధయానస్య = వృద్ధిపొందించుచున్న రామునకు, అథ = పిమ్మట, బహూని = అనేకములైన, వర్ష

సహస్రాణి = సంవత్సరముల సహస్రములు, సుఖమ్ = సుఖముగా, యయుః = వెళ్ళినవి.

తా. ఈ విధముగా రాముడు యజ్ఞములచేత అనేకవిధములైన ధర్మమును వృద్ధిపొందించుచుండగా, చాల వేల సంవత్సరములు సుఖముగా గడచినవి. 20

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో తొంభైతొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ శతతమః సర్గః

[కేకయదేశమునుండి కానుకలు తీసికొని గార్గ్యుడు వచ్చుట; ఆతడు తీసికొనివచ్చిన సందేశమును అనుసరించి భరతుడు రాముని ఆజ్ఞచేత, ఇద్దరు కుమారులతో కలిసి గంధర్వదేశమును ఆక్రమించుటకు వెళ్లుట.]

మూ. కస్య చిత్త్వథ కాలస్య యుధాజిత్ కేకయో నృపః,
స్వగురుం ప్రేషయామాస రాఘవాయ మహాత్మనే. 1
గార్గ్యమఙ్గిరసః పుత్రం బ్రహ్మర్షిమమితప్రభమ్,

ప్ర. అ. అథ = అటుపిమ్మట, కస్యచిత్ = ఒకానొక, కాలస్య = కాలమునకు, కేకయః నృపః = కేకయదేశమునకు రాజైన, యుధాజిత్ = యుధాజిత్తు, మహాత్మనే = మహాత్ముడైన, రాఘవాయ = రామునకు, స్వగురుమ్ = తన గురువు, అఙ్గిరసః = అంగిరస్సుయొక్క, పుత్రమ్ = పుత్రుడు, అమితప్రభమ్ = గొప్ప కాంతి కలవాడు అయిన, బ్రహ్మర్షిమ్ = బ్రహ్మర్షిని, ప్రేషయామాస = పంపెను.

తా. తరువాత కొంత కాలానికి కేకయదేశరాజైన యుధాజిత్తు మహాత్ముడైన రామునివద్దకు తనగురువు, అంగిరసుని పుత్రుడు, గొప్ప తేజస్సు కలవాడు, బ్రహ్మర్షి అయిన, గార్గ్యుణ్ణి పంపెను.

మూ. దశ చాశ్వసహస్రాణి ప్రీతిదానమనుత్తమమ్, 2
కమ్బలాని చ రత్నాని చిత్రవస్త్రమథోత్తమమ్,
రామాయ ప్రదదౌ రాజా శుభాన్యాభరణాని చ. 3

ప్ర. అ. రాజా = రాజు, దశ = పది, అశ్వసహస్రాణి = అశ్వముల సహస్రములను, కమ్బలాని చ = కంబలములను, రత్నాని = రత్నములను, అథ = అటుపిమ్మట, ఉత్తమమ్ = ఉత్తమమైన, చిత్రవస్త్రమ్ = చిత్రవస్త్రమును, శుభాని =

సుందరములైన, ఆభరణాని చ = ఆభరణములను, రామాయ = రామునకు, అనుత్తమమ్ = అత్యుత్తమమైన, ప్రీతిదానమ్ = ప్రేమతో ఇచ్చే దానమునుగా, ప్రదదౌ = ఇచ్చెను.

తా. ఆ రాజు రామునకు పది వేల అశ్వములను, కంబలములను, రత్నములను, ఉత్తమములైన రంగు రంగుల వస్త్రములను, అందమైన ఆభరణములను కానుకగా పంపెను. 2,3

మూ. శ్రుత్వా తు రాఘవో ధీమాన్ మహర్షిం గార్గ్యమాగతమ్.
మాతులస్యాశ్వపతినః ప్రహితం తన్మహాధనమ్, 4

ప్రత్యుద్గమ్య చ కాకుత్స్థః క్రోశమాత్రం సహానుజః,
గార్గ్యం సంపూజయామాస యథా శక్రో బృహస్పతిమ్.

ప్ర. అ. ధీమాన్ = బుద్ధిమంతుడైన, రాఘవః = రాముడు, మహర్షిమ్ = మహర్షియైన, గార్గ్యమ్ = గార్గ్యుణ్ణి, ఆగతమ్ = వచ్చినవానినిగా, శ్రుత్వా = విని, మాతులస్య = మేనమామయైన, అశ్వపతినః = అశ్వపతియొక్క, ప్రహితమ్ = పంపబడిన, తత్ = ఆ, మహాధనమ్ = మహాధనమును గూర్చి (విని), కాకుత్స్థః = కకుత్స్థవంశసంజాతుడైన ఆ రాముడు, సహానుజః = తమ్ములతో కూడినవాడై, క్రోశమాత్రమ్ = క్రోశ దూరము, ప్రత్యుద్గమ్య = ఎదురేగి, బృహస్పతిమ్ = బృహస్పతిని, శక్రః యథా = ఇంద్రుడు వలె, సంపూజయామాస = పూజించెను.

తా. బుద్ధిమంతుడైన కకుత్స్థవంశీయుడైన రాముడు మహర్షి యైన గార్గ్యుడు వచ్చి నట్లు విని, మేనమామయైన అశ్వపతి పంపిన ఆ మహాధనమును గూర్చి విని, తమ్ములతో కలిసి క్రోశదూరము ఎదురు వెళ్ళి, ఇంద్రుడు బృహస్పతిని పూజించి నట్లు పూజించెను. 4,5

మూ. తథా సంపూజ్య తమృషిం తద్ధనం ప్రతిగృహ్య చ,
పృష్ట్వా ప్రతిపదం సర్వం కుశలం మాతులస్య చ, 6
ఉపవిష్టం మహాభాగం రామః ప్రష్టుం ప్రచక్రమే.

ప్ర. అ. రామః = రాముడు, తమ్ ఋషిమ్ = ఆ ఋషిని, తథా = ఆట్లు, సంపూజ్య = పూజించి, తత్ ధనమ్ = ఆ ధనమును, ప్రతిగృహ్య చ = తీసికొని,

ప్రతిపదమ్ = అడుగడుగునా, మాతులస్య = మేన మామయొక్క, సర్వమ్ = సమస్తమైన. కుశలమ్ = కుశలమును, పృష్ట్వా = అడిగి, ఉపవిష్టమ్ = కూర్చొని ఉన్న, మహాభాగమ్ = మహాభాగ్యవంతుడైన ఆ ఋషిని, ప్రష్టుమ్ = అడుగుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. రాముడు ఆ ఋషిని ఆ విధముగా పూజించి, ఆ ధనము తీసికొని, మేనమామ కుశలమును గూర్చి మాటి మాటికి అడిగి, కూర్చున్న ఆతనిని ప్రశ్నించుటకు ఉపక్రమించెను. 4

మూ. కిమాహ మాతులో వాక్యం యదర్థం భగవానిహ, 7
ప్రాప్తో వాక్యవిదాం శ్రేష్ఠః సాక్షాదివ బృహస్పతిః.

ప్ర. అ. మాతులః = మేనమామ, కిం వాక్యమ్ = ఏమి వాక్యమును, ఆహ = పలికెను ? యదర్థమ్ = దేని నిమిత్తమై, వాక్యవిదామ్ = వాక్యవేత్తలలో, శ్రేష్ఠః = శ్రేష్ఠుడవు, సాక్షాత్ = సాక్షాత్తు, బృహస్పతిః ఇవ = బృహస్పతి వంటి, భవాన్ = నీవు, ఇహ = ఇక్కడికి, ప్రాప్తః = వచ్చినావో.

తా. మా మేనమామ ఏమి చెప్పి పంపగా మాటలలో నేర్పు గలవారిలో శ్రేష్ఠుడవైన పూజ్యుడవైన నీవు, సాక్షాత్తు బృహస్పతి వలె ఇక్కడకు వచ్చినావు?

మూ. రామస్య భాషితం శ్రుత్వా మహర్షిః కార్యవిస్తరమ్ 8
వక్తుమద్భుతసంకాశం రాఘవాయోపచక్రమే.

ప్ర. అ. మహర్షిః = మహర్షి, రామస్య = రామునియొక్క, భాషితమ్ = మాటను, శ్రుత్వా = విని, అద్భుతసంకాశమ్ = ఆశ్చర్యకరమైన, కార్యవిస్తరమ్ = కార్యవిస్తారమును, రాఘవాయ = రామునకు, వక్తుమ్ = చెప్పుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. మహర్షి రాముని మాటలు విని అద్భుతమైన పెద్ద కార్యమును గూర్చి చెప్పుటకు ఉపక్రమించెను. 8

మూ. మాతులస్తే మహాభాహో వాక్యమాహ నరర్షభ, 9
యుధాజిత్ ప్రీతిసంయుక్తం శ్రూయతాం యది రోచతే.

ప్ర. అ. నరర్షభ = నరులలో శ్రేష్ఠుడా! మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా! తే మాతులః = నీ మేనమామయైన, యుధాజిత్ = యుధాజిత్తు, ప్రీతిసంయుక్తమ్ = ప్రేమతో కూడిన, వాక్యమ్ = మాటను, ఆహ = చెప్పినాడు. రోచతే యది = ఇష్టమైనచో, శ్రూయతామ్ = వినబడుగాక.

తా. గొప్ప బాహుబలము గల నరశ్రేష్ఠుడా! నీ మేనమామయైన యుధాజిత్తు ప్రేమపూర్వకముగా పలికిన మాటలను ఇష్టమైనచో వినుము. 9

మూ. అయం గన్ధర్వవిషయః ఫలమూలోపశోభితః, 10
సిన్ధోరుభయతః పార్శ్వే దేశః పరమశోభనః

ప్ర. అ. సిన్ధోః = సింధునదియొక్క, ఉభయతః పార్శ్వే = రెండు పార్శ్వములయందు, గన్ధర్వవిషయః = గంధర్వనివాసమైన, ఫలమూలోపశోభితః=ఫలములతోను మూలములతోను ప్రకాశింపచేయబడిన, దేశః=దేశము, పరమశోభనః = చాల అందమైనది.

తా. (మా దేశము దగ్గర) సింధునదికి రెండు ప్రక్కలా ఉన్న, గంధర్వ నివాసమైన, ఫలమూలములతో ప్రకాశించుచున్న ఈ దేశము చాల అందమైనది. 10

మూ. తం చ రక్షన్తి గన్ధర్వాః సాయుధా యుద్ధకోవిదాః, 11
శైలూషస్య సుతా వీర తిస్రః కోట్యో మహాబలాః.

ప్ర. అ. సాయుధాః = ఆయుధములతో కూడిన, యుద్ధకోవిదాః = యుద్ధమునందు నేర్పు గల, మహాబలాః = గొప్ప బలము గల, శైలూషస్య = శైలూషనియొక్క, సుతాః = కుమారులైన, తిస్రః కోట్యః = మూడు కోటులు, గన్ధర్వాః = గంధర్వులు, తమ్ = ఆ దేశమును, రక్షన్తి = రక్షించుచున్నారు.

తా. శైలూష డనే గంధర్వుని వంశమునకు చెందిన, ఆయుధధారులు, యుద్ధవికారదులు, గొప్ప బలము గలవారు అయిన, మూడు కోట్లమంది గంధర్వులు ఆ దేశమును రక్షించుచున్నారు. 11

మూ. తాన్ వినిర్జిత్య కాకుత్స్థ గన్ధర్వనగరం శుభమ్, 12
నివేశయ మహాబాహో స్వే పురే సుసమాహితే.

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా! కాకుత్స్థ = రామా! తాన్ = వారిని, శుభమ్ = సుందరమైన, గన్ధర్వనగరమ్ = గంధర్వ నగరమును, వినిర్జిత్య = జయించి, సుసమాహితే = బాగా ఏర్పరుపబడిన, స్వే = నీ సంబంధమైన, పురే = పురములను, నివేశయ = నిర్మించుము.

తా. గొప్ప బాహుబలము గల రామా! నీవు ఆ గంధర్వులను, గంధర్వ నగరమును జయించి ఆ స్థానమునందు నీకు సంబంధించిన రెండు నగరములను చక్కగా నిర్మించుము. 12

మూ. అన్యస్య న గతిస్తత్ర దేశః పరమశోభనః, 13
రోచతాం తే మహాబాహో నాహం త్వామహితం వదే.

ప్ర. అ. దేశః = ఆ దేశము, పరమ శోభనః = చాల సుందరమైనది. తత్ర = దానియందు, అన్యస్య = ఇతరునకు, గతిః = గమనము, నాస్తి = లేదు. మహాబాహో = మహాబాహూ! తే = నీకు, రోచతామ్ = ఇష్ట మగుగాక. అహమ్ = నేను, త్వామ్ = నిన్ను గూర్చి, అహితమ్ = అహితమును, న వదే = పలుకను.

తా. మహాబాహూ! చాల సుందరమైన ఆ దేశము నీకు ఇష్ట మగుగాక, మరొకరు ఎవరూ దానిని ఆక్రమింపజాలరు నేను నీకు అహితమును చెప్పను. 13

మూ. తచ్ఛ్రుత్వా రాఘవః ప్రీతో మహర్షేర్మాతులస్య చ 14
ఉవాచ బాఢమిత్యేవ భరతం చాన్వవైక్షత

ప్ర. అ. రాఘవః = రాముడు, మాతులస్య = మేనమామయొక్క, తత్ = ఆ వాక్యమును, మహర్షేః = మహర్షినుండి, శ్రుత్వా = విని, బాఢమ్ ఇత్యేవ = తప్పక అట్లే అని, ఉవాచ = పలికెను. భరతమ్ = భరతుణ్ణి, అన్వవైక్షత చ = చూచెను కూడ.

తా. రాముడు మేనమామ సందేశమును మహర్షి ద్వారా విని "తప్పక అట్లే చేసెదను" అని పలికి భరతుని వైపు చూచెను. 14

మూ. సోఽబ్రవీ ద్రాఘవః ప్రీతః సాఞ్జలిప్రగ్రహో ద్విజమ్,
ఇమౌ కుమారౌ తం దేశం బ్రహ్మర్షే విచరిష్యతః.

భరతస్యాత్మజౌ వీరౌ తక్షః పుష్కల ఏవ చ,
మాతులేన సుగుప్తౌ తు ధర్మేణ సుసమాహితౌ. 16

ప్ర. అ. సః రాఘవః = ఆ రాముడు, ప్రీతః = సంతోషించినవాడై, సాఞ్జలిప్రగ్రహః = దోసిలి పట్టుటతో కూడినవాడై (దోసిలి పట్టి), ద్విజమ్ = ఆ బ్రాహ్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను. బ్రహ్మర్షే=బ్రహ్మర్షీ! భరతస్య= భరతునియొక్క, ఆత్మజౌ = పుత్రులు, వీరౌ = వీరులు, తక్షః = తక్షుడు, పుష్కలః ఏవ చ = పుష్కలుడూ అను, ఇమౌ = ఈ, కుమారౌ = కుమారులు, మాతులేన = మా మేనమామచేత, సుగుప్తౌ = బాగుగా రక్షింపబడినవారై, ధర్మేణ=ధర్మముచేత, సుసమాహితౌ = మిక్కిలి సావధానచిత్తులై, తం దేశమ్= ఆ దేశమును, విచరిష్యతః=సంచరించగలరు.

తా. రాముడు సంతోషించి, అంజలి ఘటించి ఆ బ్రాహ్మణునితో ఇట్లనెను. బ్రహ్మర్షీ! తక్షుడు, పుష్కలుడు అను భరతపుత్రులైన, వీరులైన ఈ కుమారులిద్దరూ మా మేనమామచే రక్షింపబడుచు, ధర్మమునందు సావధానచిత్తులై ఆ దేశములో సంచరించగలరు. 15, 16

మూ. భరతం చాగ్రతః కృత్వా కుమారౌ సబలానుగౌ,
నిహత్య గన్ధర్వసుతాన్ ద్వే పురే విభజిష్యతః. 17

ప్ర. ఆ. సబలానుగౌ=సైన్యముతోను అనుచలతోను కూడిన, కుమారౌ= ఈ కుమారులు, భరతమ్ = భరతుణ్ణి, అగ్రతః కృత్వా = ముందు ఉంచుకొని, గన్ధర్వసుతాన్=గంధర్వకుమారులను, నిహత్య = చంపి, ద్వే = రెండు, పురే= పట్టణములను. విభజిష్యతః = పంచుకొనగలరు.

తా. ఈ కుమారులిద్దరూ భరతుణ్ణి ముందు ఉంచుకొని సైన్యముతోను అనుచరులతోను కలిసి వెళ్ళి, గంధర్వులను సంహరించి రెండు పట్టణములను విభజించు కొనగలరు. 17

మూ. నివేశ్య తే పురవరే ఆత్మజౌ సంనివేశ్య చ,
ఆగమిష్యతి మే భూయః సకాశమతిధార్మికః. 18

ప్ర. అ. అతిధార్మికః = మిక్కిలి ధార్మికుడైన భరతుడు, తే పురవరే =

ఆ పురశ్రేష్ఠములను, నివేశ్య = నిలిపి, ఆత్మజౌ = పుత్రులను, నివేశ్య = నిలిపి, భూయః = మరల, మే సకాశమ్ = నా సమీపమును గూర్చి, ఆగమిష్యతి = రాగలడు.

తా. పరమధార్మికుడైన భరతుడు రెండు పురములను నిర్మించి, పుత్రులను ఆచట నిలిపి, మరల నావద్దకు రాగలడు. 18

మూ. మహర్షిమేవముక్త్వా తు భరతం సబలానుగమ్,
ఆజ్ఞాపయామాస తదా కుమారౌ చాభ్యషేచయత్. 19

ప్ర. అ. మహర్షిమ్ = మహర్షిని గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి తదా = అప్పుడు, సబలానుగమ్ = సైన్యముతోను, అనుచరులతోను కూడిన, భరతమ్ = భరతుణ్ణి, ఆజ్ఞాపయామాస = ఆజ్ఞాపించెను. కుమారౌ = ఆ కుమారులిద్దరినీ, అభ్యషేచయత్ చ = అభిషేకించెను.

తా. రాముడు మహర్షితో ఇట్లు పలికి, సైన్యముతోను, అనుచరులతోను కూడిన భరతుణ్ణి ఆదేశించి అప్పుడు ఆ పురద్వయ రాజ్యమునందు ఆ కుమారులిద్దరికీ అభిషేకము చేసెను. 19

మూ. నక్షత్రేణ చ సౌమ్యేన పురస్కృత్యాఙ్గిరఃసుతమ్,
భరతః సహ సైన్యేన కుమారాభ్యాం వినిర్యయౌ. 20

ప్ర. అ. భరతః = భరతుడు, ఆఙ్గిరఃసుతమ్ = అంగిరసుని పుత్రుణ్ణి, పురస్కృత్వా = ముందు ఉంచుకొని, సైన్యేన = సైన్యముతో, కుమారాభ్యామ్ = కుమారులతో, సౌమ్యేన = సౌమ్యమైన, నక్షత్రేణ = నక్షత్రముచేత, వినిర్యయౌ = బయలుదేరెను.

తా. భరతుడు అంగిరసుని పుత్రుడైన ఆ గార్గ్యుణ్ణి ముందు ఉంచుకొని. శుభనక్షత్రమునందు సైన్యముతోను కుమారు లిద్దరితోను బయలుదేరెను. 20

మూ. సా సేనా శక్రయుక్తేవ నగరాన్నిర్యయావథ,
రాఘవానుగతా దూరం దురాధర్షా సురైరపి. 21

ప్ర. అ. అథ = అటుపిమ్మట, దూరమ్ = కొంత దూరమును, రాఘవాను

గతా = రామునిచేత అనుసరించబడిన, సురైరపి = దేవతలచేత కూడ, దురాధర్షా = ఎదిరింప శక్యము కాని, సా సేనా = ఆ సేన, శక్రయుక్తేవ = ఇంద్రునితో కూడినది వలె, నగరాత్ = నగరమునుండి, నిర్యయౌ = బయల్వెడలెను.

తా. దేవతలు కూడ ఎదిరింపజాలని ఆ సైన్యమును కొంత దూరము వరకు రాముడు అనుసరించి వెళ్ళగా అది ఇంద్రునితో కూడిన సైన్యము వలె నగరమునుండి బయల్వెడలెను. 21

మూ. మాంసాశినశ్చ యే సత్త్వా రక్షాంసి సుమహాన్తి చ,
అనుజగ్ముర్హి భరతం రుధిరస్య పిపాసయా. 22

ప్ర. అ. మాంసాశినః = మాంసమును తిను, యే = ఏ, సత్త్వాః = మృగములు కలవో అవి, సుమహాన్తి = చాల గొప్పవారైన, రక్షాంసి చ = రాక్షసులు, రుధిరస్య = రక్తముయొక్క, పిపాసయా = త్రాగవలె ననుకోరికచేత, భరతమ్ = భరతుణ్ణి, అనుజగ్ముః హి = అనుసరించి వెళ్ళిరి.

తా. మాంసమును తినే జంతువులు, గొప్ప రాక్షసులు రక్తము త్రాగవలె నను ఇచ్ఛతో భరతుని వెంట వెళ్లెను. 22

మూ. భూతగ్రామాశ్చ బహవో మాంసభక్షాః సుదారుణాః,
గన్ధర్వపుత్రమాంసాని భోక్తుకామాః సహస్రశః. 23

ప్ర. అ. మాంసభక్షాః = మాంసమును భక్షించు, సుదారుణాః = చాల భయంకరములైన, బహవః = అనేకమైన, భూతగ్రామాః = భూతముల సముదాయములు, సహస్రశః = వేలకొలది, గన్ధర్వపుత్రమాంసాని = గంధర్వపుత్రుల మాంసములను, భోక్తుకామాః = భుజించుటకు కోరిక గలవై వెళ్ళినవి.

తా. మాంసమును భుజించు క్రూరములైన వేలకొలది భూతసముదాయములు కూడ గంధర్వపుత్రుల మాంసములను తినుటవై భరతుని వెంట వెళ్లెను.

మూ. సింహవ్యాఘ్రవరాహాణాం శ్వచరాణాం చ పక్షిణామ్,
బహూని వై సహస్రాణి సేనాయా యయురగ్రతః 24

ప్ర. అ. సింహవ్యాఘ్రవరాహాణామ్ = సింహములయొక్క పెద్దపులుల

యొక్క, పరాహములయొక్క, ఖేచరాణామ్ = ఆకాశమునందు సంచరించు, పక్షిణాం చ = పక్షులయొక్క, బహూని = అనేకమైన, సహస్రాణి = సహస్రములు, సేనాయాః = సేనయొక్క, అగ్రతః = ఎదుట, యయుః = వెళ్ళినవి.

తా. ఎన్నో వేల సింహములు, వ్యాఘ్రములు, అడవిపందులు, ఆకాశమునందు సంచరించు పక్షులూ సేనకు ముందు వెళ్ళినవి. 24

మూ. అధ్యర్ధమాసముషితా పథి సేనా నిరామయా,
హృష్టపుష్టజనాకీర్ణా కేకయం సముపాగమత్. 25

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
శతతమః సర్గః.

ప్ర. అ. పథి = మార్గమునందు, అధ్వర్ధమాసమ్ = మాసార్ధము ఎక్కువగా గల మాసమును, ఉషితా = ఉన్న, నిరామయా = రోగములు లేని, హృష్టపుష్టజనాకీర్ణా = సంతోషించిన పరిపుష్టి చెందిన జనులతో నిండిన, సేనా = సేన, కేకయమ్ = కేకయదేశమును, సమాపాగమత్ = చేరెను.

తా. మార్గములో ఒకటిన్నర మాసములు ప్రయాణము చేసి, ఉత్సాహవంతులైన, పుష్టిగా ఉన్న జనులతో నిండిన ఆ సేన, ఏ రోగబాధలు లేక కేకయదేశమును చేరెను. 25

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు,
ఉత్తరకాండలో వందవ సర్గ సమాప్తము.

అథ ఏకోత్తరశతతమః సర్గః

[భరతుడు గంధర్వులను సంహరించి, రెండు పురములను నెలకొల్పి, వాటిని పుత్రు లిద్దరికీ ఇచ్చి మరల అయోధ్యకు తిరిగి వచ్చుట]

మూ. శ్రుత్వా సేనాపతిం ప్రాప్తం భరతం కేకయాధిపః,
యుధాజిత్ గార్గ్యసహితం పరాం ప్రీతిముపాగమత్. 1

ప్ర. అ. కేకయాధిపః = కేకయదేశము రాజైన, యుధాజిత్ = యుధాజిత్తు, సేనాపతిమ్ = సేనాపతియైన, గార్గ్యసహితమ్ = గార్గ్యునితో కూడిన, భరతమ్ = భరతుణ్ణి, ప్రాప్తమ్ = వచ్చినవానినిగా, శ్రుత్వా = విని, పరామ్ = గొప్ప, ప్రీతిమ్ = సంతోషమును, ఉపాగమత్ = పొందెను.

తా. కేకయదేశరాజైన యుధాజిత్తు గార్గ్యునితో కూడ సైన్యమునకు నాయకుడై భరతుడు వచ్చి నట్లు విని చాల సంతోషించెను. 1

మూ. స నిర్యయౌ జనౌఘేన మహతా కేకయాధిపః,
త్వరమాణోఽభిచక్రామ గన్ధర్వాన్ కామరూపిణః. 2

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సుగల, సః కేకయాధిపః = ఆ కేకయదేశరాజు, మహతా = గొప్ప, జనౌఘేన = జనసముదాయముతో, నిర్యయౌ = బయలువెడలెను. త్వరమాణః = తొందరపడుచు, కామరూపిణః = స్వేచ్ఛారూపముగల, గన్ధర్వాన్ = గంధర్వులను గూర్చి, అభిచక్రామ = వెళ్ళెను.

తా. యుధాజిత్తు గొప్ప జనసముదాయముతో కలిసి బయలుదేరి స్వేచ్ఛారూపధారులైన గంధర్వులమీదికి శీఘ్రముగా వెళ్లెను. 2

మూ. భరతశ్చ యుధాజిచ్చ సమేతౌ లఘువిక్రమైః,
గన్ధర్వనగం ప్రాప్తౌ సబలౌ సపదానుగౌ. 3

ప్ర. అ. భరతశ్చ = భరతుడు, యుధాజిత్ చ = యుధాజిత్తు, సమేతౌ = కలిసినవారై, సబలౌ = సేనాసహితులై, సపదానుగౌ = నడిచి వచ్చు అనుచరులతో కూడినవారై, లఘువిక్రమైః = శీఘ్రమైన గమనములచేత, గన్ధర్వనగరమ్ = గంధర్వనగరమును, ప్రాప్తౌ = పొందిరి.

తా. భరతుడు యుధాజిత్తు కలిసి, సైన్యముతోను అనుచరులతో కూడ శీఘ్రముగా గంధర్వనగరము చేరిరి. 3

మూ. శ్రుత్వా తు భరతం ప్రాప్తం గన్ధర్వాస్తే సమాగతాః,
యోద్ధుకామా మహావీర్యా వ్యనదంస్తే సమన్తతః. 4

ప్ర. అ. మహావీర్యాః = గొప్ప పరాక్రమము గల, తే గన్ధర్వాః = ఆ గంధర్వులు, భరతమ్ = భరతుణ్ణి, ప్రాప్తమ్ = వచ్చినవానినిగా, శ్రుత్వా = విని, సమాగతాః = కలిసినవారై, యోద్ధుకామాః = యుద్ధముచేయుటకు కోరిక గలవారై, సమన్తతః = అంతటా, వ్యనదన్ = ధ్వని చేసిరి.

తా. గొప్ప పరాక్రమము గల ఆ గంధర్వులు భరతుడు వచ్చినట్లు విని యుద్ధము చేయవలె నను కోరికతో ఒక చోట చేరి, అన్ని వైపులా బిగ్గరగా గర్జించిరి. 4

మూ. తతః సమభవద్యుద్ధం తుములం రోమహర్షణమ్,
సప్తరాత్రం మహాభీమం న చాన్యతరయోర్జయః. 5

ప్ర. అ. తతః = ఆటుపిమ్మట, తుములమ్ = వ్యాకులము, రోమహర్షణమ్ = రోమాంచము కలిగించేదీ అయిన, మహాభీమమ్ = చాల భయంకరమైన, యుద్ధమ్ = యుద్ధము, సప్తరాత్రమ్ = ఏడురోజులు, సమభవత్ = ఆయెను. అన్యతరయోః = ఏ ఒక్కరికి, జయః = జయము, న చ = లభించలేదు.

తా. పిమ్మట వ్యాకులము, రోమాంచమును కలిగించేది, చాల భయంకరమూ ఆయిన యుద్ధము ఏడు రోజులు జరిగెను. కాని ఏ పక్షమూవారికి జయము రాలేదు. 5

మూ. ఖడ్గశక్తిధనుర్గ్రాహా నద్యః శోణితసంస్రవాః,
నృకలేవరవాహిన్యః ప్రవృత్తాః సర్వతోదిశమ్. 6

ప్ర. అ. ఖడ్గశక్తిధనుర్గ్రాహాః=ఖడ్గములు, శక్తులు, ధనస్సులు, మొసళ్లుగా గల, శోణితసంస్రవాః = రక్తమును ప్రవహించు, నృకలేవరవాహిన్యః = మనుష్యుల శరీరములను మోసికొని (కొట్టుకొని) వచ్చుచున్న, నద్యః=నదులు. సర్వతోదిశమ్ = అన్ని దిక్కులయందు, ప్రవృత్తాః = ప్రారంభమైనవి.

తా. ఖడ్గము, శక్తులు, ధనస్సులు అను మొసళ్ళతో, రక్తప్రవాహములతో నిండి మనుష్యుల మృతదేహములు కొట్టుకొని రాగా నదులు అన్ని దిక్కులందు ప్రారంభమైనవి. 6

మూ. తతో రామానుజః క్రుద్ధః కాలస్యాస్త్రం సుదారుణమ్,
సంవర్తం నామ భరతో గన్ధర్వేష్వభ్యచోదయత్. 7

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రామానుజః = రాముని తమ్ముడైన, భరతః = భరతుడు, క్రుద్ధః=కోపించినవాడై, సంవర్తంనామ=సంవర్తము అను, సుదారుణమ్ = చాల భయంకరమైన, కాలస్య అస్త్రమ్ = ప్రలయకాలాగ్న్యస్త్రమును, గన్ధర్వేషు = గంధర్వులయందు, అభ్యచోదయత్ = ప్రయోగించెను.

తా. అప్పుడు రాముని తమ్ముడు, భరతుడు కోపించి ఆ గంధర్వులపై చాల భయంకరమైన, కాలాగ్న్యస్త్రమైన సంవర్త మను అస్త్రమును ప్రయోగించెను. 7

మూ. తే బద్ధాః కాలపాశేన సంవర్తేన విదారితాః,
క్షణేనాభిహతాస్తేన త్రిస్రః కోట్యో మహాత్మనా. 8

ప. అ. త్రిస్రః = మూడు, కోట్యః = కోటులైన, తే = ఆ గంధర్వులు, మహాత్మనా = మహాత్ముడైన, తేన = ఆ భరతునిచేత, కాలపాశేన = కాలపాశముచేత, బద్ధాః = కట్టబడినవారై, సంవర్తేన = సంవర్తముచేత, విదారితాః = చీల్చబడినవారై, క్షణేన = క్షణముచేత, హతాః = చంపబడిరి.

తా. మహాత్ముడైన ఆ భరతుడు క్షణకాలములో మూడు కోట్ల గంధర్వులను కాలపాశముచేత పట్టి సంవర్తముచేత చీల్చి చంపివేసెను. 8

మూ. తద్యుద్ధం తాదృశం ఘోరం న స్మరన్తి దివౌకసః,
నిమేషాన్తరమాత్రేణ తాదృశానాం మహాత్మనామ్. 9

ప్ర. అ. ("ఏవం ఘోరం హి సమరం న స్మరన్తి దివౌకసః,
నిమేషాన్తరమాత్రేణ యః కృతో భరతేన హ"
అను ప్రాచ్యపాఠము బాగున్నది.)

భరతేన = భరతునిచేత, నిమేషాన్తరమాత్రేణ = ఒక్క నిమిషముచేత, యః = ఏ యుద్ధము, కృతః = చేయబడినదో, ఏవమ్ = ఇట్లు, ఘోరమ్ = ఘోరమైన, సమరమ్ = యుద్ధమును, దివౌకసః = దేవతలు, న స్మరన్తి = స్మరించరు.

తా. భరతుడు ఒక్క నిమిషము కాలములో ఎట్టి యుద్ధమును చేసెనో అట్టి ఘోరమైన మరి యొక యుద్ధమును దేవతలు కూడ స్మరించలేదు. 9

మూ. హతేషు తేషు సర్వేషు భరతః కేకయీసుతః,
నివేశయామాస తదా సమృద్ధే ద్వే పురోత్తమే. 10

ప్ర. అ. తేషు సర్వేషు = వాళ్ళందరూ, హతేషు = చంపబడినవాళ్ళగు చుండగా, కేకయీసుతః = కైకేయి పుత్రుడైన, భరతః = భరతుడు, సమృద్ధే = సమృద్ధములైన, ద్వే = రెండు, పురోత్తమే = ఉత్తమములైన పురములను, నివేశయామాస = నిర్మింపచేసెను.

తా. వాళ్ళందరినీ సంహరించి కైకేయి పుత్రుడైన భరతుడు సుసమృద్ధములైన రెండు పురములను నిర్మింపచేసెను. 10

మూ. తక్షం తక్షశిలాయాం తు పుష్కలం పుష్కలావతే,
గన్ధర్వదేశే రుచిరే గాన్ధారవిషయే చ సః. 11

ప్ర. అ. గన్ధర్వదేశే = గంధర్వదేశమునందు, తక్షశిలాయామ్ = తక్షశిల యను పురమునందు, తక్షమ్ = తక్షుణ్ణి, గాన్ధారవిషయే = గాంధారదేశమునందు, పుష్కలావతే = పుష్కరావతపురమునందు, పుష్కలమ్ = పుష్కలుణ్ణి, సః = భరతుడు (రాజునుగా చేసెను).

తా. భరతుడు గంధర్వదేశములోని తక్షశిల అను పురములో తక్షుణ్ణి, గాంధారదేశమునందు పుష్కలావతపురమునందు పుష్కలుణ్ణి రాజునుగా చేసెను.

మూ. ధనరత్నౌఘసంకీర్ణే కాననైరుపశోభితే,
అన్యోన్యసంఘర్షకృతే స్పర్ధయా గుణవిస్తరైః. 12

ప్ర. అ. ధనరత్నౌఘసంకీర్ణే = ధనముతోను రత్నముల సముదాయముల తోను నిండినవి, కాననైః = అడవులతో, ఉపశోభితే = ప్రకాశింపచేయబడినవి, గుణవిస్తరైః = అనేకగుణములచేత, స్పర్ధయా = పోటిచేత, అన్యోన్యసంఘర్ష కృతే = పరస్పరము పోటీగా నిర్మింపబడినవి.

తా. ఆ పురములు రెండూ ధనములతోను, రత్నములతోను నిండి ఉన్నవి. గుణముల సముదాయములచేత ఒకదానిలో ఒకటి పోటిపడు నట్లు నిర్మించ బడినవి. 12

మూ. ఉభే సురుచిరప్రఖ్యే వ్యవహారైరకిల్బిషైః,
ఉద్యానయానసంపూర్ణే సువిభక్తాన్తరాపణే. 13

ప్ర. అ. ఉభే = రెండు పురములూ కూడ. అకిల్బిషైః = పాపములు లేని, వ్యవహారైః = వ్యవహారములచేత, సురుచిరప్రఖ్యే = చాల అందమైన కాంతి గలవి. ఉద్యానయానసంపూర్ణే = ఉద్యానములతోను, వాహనములతోను నిండినవి. సువిభక్తాన్తరాపణే = బాగా విభజించబడిన ఆపణముల (అంగళ్ళ) మధ్యభాగ ములు గలవి.

తా. ఆ రెండు నగరములూ కూడ పాపరహితములైన వ్యవహారములచే చాల సుందరములుగా ఉన్నవి. ఉద్యానములతోను, వాహనాలతోను నిండి యున్నవి. వేరు వేరుగా ఉన్న విశాలములైన విపణివీథులు కలవి. 13

మూ. ఉభే పురవరే రమ్యే విస్తరైరుపశోభితే,
గృహముఖ్యైః సురుచిరైర్విమానైర్బహుభిర్వృతే. 14

ప్ర. అ. రమ్యే = సుందరములైన, పురవరే = పురశ్రేష్ఠములు, ఉభే = రెండూ, విస్తరైః = వెనుక చెప్పిన వస్తువుల విస్తరములతో, ఉపశోభితే = శోభింప బడినవి. సురుచిరైః = చాల అందమైన, గృహముఖ్యైః = ముఖ్యములైన గృహ ములతోను, బహుభిః = అనేకములైన, విమానైః = విమానములతోను (ఏడు అంతస్తుల ప్రాసాదములతోను), వృతే = కూడినవి.

తా. శ్రేష్ఠములైన ఆ రెండు పురములూ కూడ అనేక వస్తుసంపదలతో ప్రకాశించుచున్నవి. ముఖ్యములైన గృహములతోను, అనేక విమానములతోను కూడినవి. 14

మూ. శోభితే శోభనీయైశ్చ దేవాయతనవిస్తరైః,
తాలైస్తమాలైస్తిలకైర్వకులైరుపశోభితే. 15

ప్ర. అ. శోభనీయైః = అందమైన, దేవాయతనవిస్తరైః = దేవాలయవిస్తారములచేత, శోభితే = ప్రకాశించుచున్నవి. తాలైః = తాలములచేత, తమాలైః = తమాలములచేత, తిలకైః = తిలకములచేత, వకులైః = వకులములచేత, ఉపశోభితే = ప్రకాశింపచేయబడినవి.

తా. అందమైన విశాలములైన దేవాలయములతోను, తాల-తమాల-తిలక వకులవృక్షములతోను ప్రకాశించుచున్నవి. 15

మూ. నివేశ్య పఞ్చభిర్వర్షైర్భరతో రాఘవానుజః,
పునరాయాన్మహాబాహురయోధ్యాం కేకయీసుతః. 16

ప్ర. అ. రాఘవానుజః = రాముని తమ్ముడు, మహాబాహుః = గొప్ప బాహువులు కలవాడు, కేకయీసుతః = కేకయి కుమారుడూ అయిన, భరతః = భరతుడు, పఞ్చభిః = ఐదు, వర్షైః = సంవత్సరములచేత, నివేశ్య = ఏర్పరచి, పునః = మరల, అయోధ్యామ్ = అయోధ్యను గూర్చి, ఆయాత్ = వచ్చెను.

తా. రాముని తమ్ముడు, మహాబాహువు, కైకేయి కుమారుడు అయిన భరతుడు ఐదు సంవత్సరములలో ఆ పురములను ఏర్పరచి తిరిగి అయోధ్యకు వచ్చెను. 16

మూ. సోఽభివాద్య మహాత్మానం సాక్షాద్ధర్మమివాపరమ్,
రాఘవం భరతః శ్రీమాన్ బ్రహ్మాణమివ వాసవః. 17

శశంస చ యథావృత్తం గన్ధర్వవధముత్తమమ్,
నివేశనం చ దేశస్య శ్రుత్వా ప్రీతోఽస్య రాఘవః. 18

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకోత్తరశతతమః సర్గః.

ప్ర. అ. శ్రీమాన్ = శ్రీమంతుడైన, భరతః = ఆ భరతుడు, వాసవః = ఇంద్రుడు, బ్రహ్మాణమ్ ఇవ = బ్రహ్మదేవుణ్ణి వలె, మహాత్మానమ్ = మహాత్ముడైన, సాక్షాత్ = సాక్షాత్తు, అపరమ్ = మరి యొక, ధర్మమ్ ఇవ = ధర్మమువలె ఉన్న, రాఘవమ్ = రాముణ్ణి, అభివాద్య = నమస్కరించి, యథావృత్తమ్ = జరిగిన విధముగా, ఉత్తమమ్ = ఉత్తమమైన, గన్ధర్వవధమ్ = గంధర్వవధను, దేశస్య = దేశముయొక్క, నివేశనమ్ = ఏర్పాటును, శశంస = చెప్పెను. రాఘవః = రాముడు, శ్రుత్వా = విని, అస్య = ఇతనికి, ప్రీతః = సంతోషించెను.

తా. శ్రీమంతుడైన ఆ భరతుడు సాక్షాత్తు మరొక ధర్మము వలె ఉన్న ఆ రామునకు, ఇంద్రుడు బ్రహ్మదేవునకు నమస్కరించినట్లు నమస్కరించి ఉత్తమమైన గంధర్వవధను, పురనిర్మాణమును గూర్చి, జరిగినది జరిగినట్లుగా, ఆతనికి తెలిపెను. రాముడు విని ఆతని విషయమున సంతోషించెను. 18.

'బాలానందిని' అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో నూట ఒకటవ సర్గ సమాప్తము.

అథ ద్వ్యుత్తరశతతమః సర్గః

[రాముని ఆజ్ఞను అనుసరించి భరతలక్ష్మణులు కారుపథ ప్రదేశమునందు వేరు వేరు రాజ్యములలో లక్ష్మణుని పుత్రులైన అంగద చంద్ర కేతువులను నియమించుట].

మూ. తచ్ఛ్రుత్వా హర్షమాపేదే రాఘవో భ్రాతృభిః సహ,
వాక్యం చాద్భుతసంకాశం భ్రాతౄన్ ప్రోవాచ రాఘవః.

ప్ర. అ. రాఘవః = రాముడు, తత్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, భ్రాతృభిః = సోదరులతో కూడ, హర్షమ్ = సంతోషమును, ఆపేదే = పొందెను. రాఘవః = రాముడు, అద్భుతసంకాశమ్ = అద్భుతమైన, వాక్యం చ = వాక్యమును కూడ, భ్రాతౄన్ = సోదరులను గూర్చి, ప్రోవాచ = పలికెను.

తా. భరతుని మాటలు విని సోదరులతో కూడిన రాముడు సంతోషించెను. రాముడు సోదరులతో ఆశ్చర్యకరమైన వాక్యము పలికెను. 1

మూ. ఇమౌ కుమారౌ సౌమిత్రే తవ ధర్మవిశారదౌ,
అఙ్గదశ్చన్ద్రకేతుశ్చ రాజ్యార్థే దృఢవిక్రమౌ. 2

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా! తవ = నీయొక్క, కుమారౌ = కుమారులైన, ఇమౌ = ఈ, అఙ్గదః = అంగదుడు, చన్ద్రకేతుః = చంద్రకేతువూ, ధర్మవిశారదౌ = ధర్మమునందు నేర్పు గలవారు. రాజ్యార్థే = రాజ్యము నిమిత్తము, దృఢవిక్రమౌ = దృఢమైన పరాక్రమము గలవారు.

తా. లక్ష్మణా! నీ కుమారులైన ఈ అంగదుడూ, చంద్రకేతువూ కూడ ధర్మము తెలిసినవారు. రాజ్యమునకు తగిన దృఢపరాక్రమము కలవారు. 2

మూ. ఇమౌ రాజ్యేఽభిషేక్ష్యామి దేశః సాధు విధీయతామ్,
రమణీయో హ్యసంబాధో రమేతాం యత్ర దన్వినౌ. 3

ప్ర. అ. ఇమౌ = వీరిద్దరినీ, రాజ్యే = రాజ్యమునందు, అభిషేక్ష్యామి = అభిషేకించెదను, యత్ర = ఎక్కడ, ధన్వినౌ = ధనుర్ధరులైన వీరు, రమేతామ్ = క్రీడింతురో అట్టి, రమణీయః = సుందరమైన, అసంబాధః = ఇరుకు కాని, దేశః = దేశము, సాధు = బాగుగా, విధీయతామ్ = నిర్ణయించబడుగాక.

తా. వీరిద్దరినీ రాజ్యాభిషిక్తులను చేసెదను, ధనుర్ధరులైన వీరిద్దరూ సుఖముగా ఉండుటకు తగిన, అందమైన, జనసంమర్దము లేని దేశమును బాగా ఆలోచించి నిర్ణయించుడు. 3

మూ. న రాజ్ఞాం యత్ర పీడా స్యా న్నాశ్రమాణాం వినాశనమ్,
న దేశో దృశ్యతాం సౌమ్య నాపరాధ్యామహే యథా. 4

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! యత్ర = ఎక్కడ, రాజ్ఞామ్ = ఇతర రాజులకు, పీడా = పీడ, న స్యాత్ = కలగదో, ఆశ్రమాణామ్ = ఆశ్రమముల యొక్క, వినాశనమ్ = నాశనము, న = కలగదో, యథా = ఎట్లు, న అపరాధ్యామహే = అపరాధము చేయమో, సః దేశః = అట్టి దేశము, దృశ్యతామ్ = చూడబడుగాక.

తా. సౌమ్యుడా! ఏ దేశమునందు ఇతరరాజులకు బాధ కలుగదో, ఆశ్రమములు నశించవో, అట్టి దేశమును, మన అపరాధము ఏమీ ఉండని విధమున అన్వేషించుము. 4

మూ. తథోక్తవతి రామే తు భరతః ప్రత్యువాచ హ,
అయం కారుపథో దేశో రమణీయో నిరామయః 5

ప్ర. అ రామే = రాముడు, తథా = అట్లు, ఉక్తవతి = పలికినవా డగుచుండగా, భరతః = భరతుడు, ప్రత్యువాచా హ = పలికెను, అయమ్ = ఈ, కారుపథః దేశః = కారుపథదేశము, రమణీయః = సుందరమైనది, నిరామయః = రోగాదులు లేనిది.

తా. రాముని మాటలు విని భరతు డిట్లు పలికెను. "ఈ కారుపథదేశము సుందరమైనది, రోగములు లేనిది" 5

మూ. నివేశ్యతాం తత్ర పురమఙ్గదస్య మహాత్మనః,
చన్ద్రకేతోః సురుచిరం చన్ద్రకాన్తం నిరామయమ్. 6

ప్ర. అ. తత్ర = అక్కడ, మహాత్మనః = మహాత్ముడైన, అఙ్గదస్య = అంగదునియొక్క, పురమ్ = పురము, నివేశ్యతామ్ = ఏర్పరుపబడుగాక. చన్ద్రకేతోః = చంద్రకేతువుయొక్క, సురుచిరమ్ = చాల అందమైన, నిరామయమ్ = రోగములు లేని. చన్ద్రకాన్తమ్ = చంద్రకాంతపురము, ఏర్పరుపబడుగాక.

తా. అక్కడ మహాత్ముడైన అంగదునకు పురము నిర్మింపబడుగాక. చంద్రకేతువునకు చాల అందమైన, రోగాదులు లేని చంద్రకాంతపురము నిర్మింపబడుగాక. 6

మూ. తద్వాక్యం భరతేనోక్తం ప్రతిజగ్రాహ రాఘవః,
తం చ కృత్వా వశే దేశమఙ్గదస్య న్యవేశయత్. 7

ప్ర అ. భరతేన = భరతునిచేత, ఉక్తమ్ = పలకబడిన, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, రాఘవః = రాముడు, ప్రతిజగ్రాహ = అంగీకరించెను, తం దేశమ్ = ఆ దేశమును, వశీ కృత్వా = స్వాధీనము చేసికొని, అఙ్గదస్య = అంగదునియొక్క పురమును, న్యవేశయత్ = ఏర్పరచెను.

తా. రాముడు భరతుడు చెప్పినది అంగీకరించి ఆ దేశమును స్వాధీనము చేసికొని అంగదునికొరకు ఏర్పాటు చేసెను. 7

మూ. అఙ్గదీయా పురీ రమ్యాప్యఙ్గదస్య నివేశితా,
రమణీయా సుగుప్తా చ రామేణాక్లిష్టకర్మణా. 8

ప్ర. అ. అక్లిష్టకర్మణా = శ్రమ లేని పనులు గల, రామేణ = రామునిచేత, అంగదస్య = అంగదునియొక్క, రమణీయా = సుందరమైన, సుగుప్తా చ = బాగా రక్షింపబడిన, అఙ్గదీయా పురీ = అంగదీయ అను పురము, నివేశితా = ఏర్పరుపబడినది.

తా. శ్రమపడకుండా పనులు సాధించు రాముడు అంగదునికొరకై సుందరము, సురక్షితమూ అయిన అంగదీయపురమును నిర్మించెను. 8

మూ. చన్ద్రికేతోశ్చ మల్లస్య మల్లభూమ్యాం నివేశితా,
చన్ద్రికాన్తేతి విఖ్యాతా దివ్యా స్వర్గపురీ యథా. 9

ప్ర. ఆ మల్లస్య = మల్లుడైన, చన్ద్రికేతోః = చంద్రకేతువుయొక్క, స్వర్గపురీ యథా = అమరావతి వలె, దివ్యా = దివ్యమైన, చన్ద్రికాన్తా ఇతి = చంద్రకాంత అని, విఖ్యాతా = ప్రసిద్ధమైన పురము, మల్లభూమ్యామ్ = మల్లభూమియందు, నివేశితా = ఏర్పరుపబడినది.

తా. మల్లుడైన చంద్రకేతువుకొరకై అమరావతి వలె దివ్యమైన, చంద్రకాంత అని ప్రసిద్ధి పొందిన నగరి మల్లభూమియందు స్థాపింపబడెను. 9

మూ. తతో రామః పరాం ప్రీతిం లక్ష్మణో భరత స్తథా,
యయుర్యుద్ధే దురాధర్షా అభిషేకం చ చక్రిరే. 10

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రామః = రాముడు, లక్ష్మణః = లక్ష్మణుడు, తథా = మరియు, భరతః = భరతుడు, వరామ్ = గొప్ప, ప్రీతిమ్ = సంతోషమును, యయుః = పొందిరి. యుద్ధే = యుద్ధమునందు, దురాధర్షాః = ఎదిరింప శక్యముకాని వారు, అభిషేకం చ = అభిషేకమునుకూడ, చక్రిరే = చేసిరి.

తా. అప్పుడు యుద్ధములో జయింప శక్యము కాని రామ లక్ష్మణ భరతులు చాల సంతోషించి వారిద్దరికీ అభిషేకము చేసిరి. 10

మూ. అభిషిచ్య కుమారౌ స ప్రస్థాపయతి రాఘవః,
అఙ్గదం పశ్చిమాం భూమిం చన్ద్రికేతుముదఙ్ముఖమ్. 11

ప్ర. అ. సః రాఘవః = ఆ రాముడు, కుమారౌ = ఆ కుమారులను, అభిషిచ్య = అభిషేకముచేసి, అఙ్గదమ్ = అంగదుఁజి, పశ్చిమాం భూమిమ్ = పశ్చిమ భూమిని గూర్చి, చన్ద్రికేతుమ్ = చంద్రకేతువును, ఉదఙ్ముఖమ్ = ఉత్తరము ముఖము కలవానినిగాను, ప్రస్థాపయతి = పంపెను.

తా. రాముడు ఆ కుమారు లిద్దరికీ అభిషేకము చేసి అంగదుని పశ్చిమ ప్రాంతమునకు, చంద్రకేతువును ఉత్తరప్రాంతమునకు పంపెను. 11

మూ. అఙ్గదం బాపి సౌమిత్రిర్లక్ష్మణోఽనుజగామ హ,
చన్ద్రికేతోస్తు భరతః పార్ష్ణిగ్రాహో బభూవ హ. 12

ప్ర. అ. సౌమిత్రిః = సుమిత్రా కుమారుడైన, లక్ష్మణః చ అపి = లక్ష్మణుడు కూడ, అఙ్గదమ్ = అంగదుణ్ణి, అనుజగామ హ = అనుసరించి వెళ్ళెను. భరతః = భరతుడు, చన్ద్రకేతోః = చంద్రకేతువు యొక్క, పార్ష్ణిగ్రాహః = సైన్యము వెనుక భాగమును రక్షించువాడుగా, బభూవ హ = ఆయెను.

తా. లక్ష్మణుడు అంగదుని వెంట వెళ్ళెను. చంద్రకేతువు వెంట భరతుడు వెళ్ళెను. 12

మూ. లక్ష్మణస్త్వఙ్గదీయాయాం సంవత్సరమథోషితః,
పుత్రే స్థితే దురాధర్షే అయోధ్యాం పునరాగమత్. 13

ప్ర. అ. లక్ష్మణః తు = లక్ష్మణుడైతే, అఙ్గదీయాయామ్ = అంగదీయమందు, సంవత్సరమ్ = ఒక సంవత్సరమును, ఉషితః = ఉన్నవాడై, అథ = పిమ్మట, పుత్రే = పుత్రుడు, దురాధర్షే = ఎదిరింప శక్యము కానివాడుగా, స్థితే = ఉండగా, పునః = తిరిగి, అయోధ్యామ్ = అయోధ్యను గూర్చి, ఆగమత్ = వచ్చెను.

తా. లక్ష్మణుడు అంగదీయలో ఒక సంవత్సరము ఉండి పుత్రుడు ఎవరి చేతా ఎదిరింపశక్యము కానివాడుగా స్థిరపడిన తరవాత అయోధ్యకు తిరిగి వచ్చెను. 13

మూ. భరతోఽపి తథైవోష్య సంవత్సరమతోధికమ్,
అయోధ్యాం పునరాగమ్య రామపాదావుపాస్త సః. 14

ప్ర. అ. సః = ఆ, భరతః అపి = భరతుడు కూడ, తథైవ = అట్లే, సంవత్సరమ్ = సంవత్సరమును, అతః = అంతకంటే, అధికమ్ = అధికమును, ఉష్య = ఉండి, పునః = తిరిగి, అయోధ్యామ్ = అయోధ్యను గూర్చి, ఆగమ్య = వచ్చి, రామపాదౌ = రామపాదములను, ఉపాస్త = ఉపాసించెను.

తా. భరతుడు కూడ అట్లే సంవత్సరముకంటె కొంచెము అధికముగా చంద్రకేతువు దగ్గర ఉండి అయోధ్యకు తిరిగి వచ్చి రాముని పాదములను ఉపాసించెను. 14

మూ. ఉభౌ సౌమిత్రిభరతౌ రామపాదావనువ్రతౌ,
కాలం గతమపి స్నేహాన్న జజ్ఞాతేఽతిధార్మికౌ. 15

ప్ర. అ. రామపాదౌ = రాముని పాదములను, అనువ్రతౌ = అనుసరించిన వ్రతము గల, అతిధార్మికౌ = మిక్కిలి ధార్మికులైన, సౌమిత్రి భరతౌ = లక్ష్మణ భరతులు, ఉభౌ = ఇద్దరూ, గతమ్ = గడచిన, కాలమ్ అపి = కాలమును కూడ, న జజ్ఞాతే = తెలిసికొనలేదు.

తా. రామపాదసేవాతత్పరులైన, చాల ధార్మికులైన లక్ష్మణభరతులిద్దరూ స్నేహము వలన ఎంత కాలము గడచినను గుర్తించలేదు. 15

మూ. ఏవం వర్షసహస్రాణి దశ తేషాం యయుస్తదా,
ధర్మే ప్రయతమానానాం పౌరకార్యేషు నిత్యదా. 16

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, ధర్మే = ధర్మమునందు, ప్రయతమానానామ్ = ప్రయత్నించుచున్న, నిత్యదా = ఎల్లప్పుడూ, పౌరకార్యేషు = పౌరుల కార్యములయందు, ప్రయతమానానామ్ = ప్రయత్నించుచున్న, తేషామ్ = వారికి, తదా = అప్పుడు, ఏవమ్ = ఈ విధముగా, దశ = పది, వర్షసహస్రాణి = సంవత్సరముల సహస్రములు, యయుః = గడచినవి.

తా. ఈ విధముగా వారు ధర్మమార్గతత్పరులై, నిత్యమూ పౌరుల కార్యములు చూచుటకు ప్రయత్నించుచుండగా పది వేల సంవత్సరములు గడచినవి.

మూ. విహృత్య కాలం పరిపూర్ణమానసాః
శ్రియా వృతా ధర్మపురే చ సంస్థితాః,
త్రయః సమిద్ధా ఇవ దీప్తతేజసో
మహాధ్వరే సాధు హుతాస్త్రయోఽగ్నయః. 17

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ద్వ్యుత్తరశతతమః సర్గః.

ప్ర. అ. కాలమ్ = దీర్ఘకాలము, విహృత్య = విహరించి, పరిపూర్ణమానసాః = పరిపూర్ణమైన మనస్సులు గల, శ్రియా = శోభతో, ఆవృతాః = కప్పబడిన,

ధర్మపురే చ = ధర్మసాధనమైన అయోధ్యాపురమునందు, సంస్థితాః = ఉన్న, త్రయః = ఆ ముగ్గురూ, మహాధ్వరే = మహాయజ్ఞమునందు, సాధు = బాగుగా, హుతాః = హోమముచేయబడిన, సమిద్ధాః = ప్రజ్వలించుచున్న, త్రయః = మూడు, అగ్నయః ఇవ = అగ్నులు వలె, దీప్త తేజసః = ప్రకాశించుచున్న తేజస్సు కలవారు ఆయిరి.

తా. ధర్మసాధనమైన అయోధ్యాపురములో నివసించుచు, చాల కాలము గడిపి, పరిపూర్ణములైన మనస్సులతో కూడిన లక్ష్మీసంపన్నులైన ఆ రామలక్ష్మణభరతులు ముగ్గురూ మహాయజ్ఞములో చక్కగా హోమము చేయగా ప్రజ్వరిల్లుచున్న మూడు అగ్నులు వలె ప్రకాశించుచుండిరి. 17

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో నూటరెండవసర్గ సమాప్తము.

అథ త్రయ్యుత్తరశతతమః సర్గః

[రాముని వద్దకు కాలపురుషుడు వచ్చుట. ఒక సమయము (షరతు) పెట్టి ఆ కాలపురుషుడు రామునితో మాటలాడుటకు ఉద్యమించుట.]

మూ. కస్య చిత్త్వథ కాలస్య రామే ధర్మపరే స్థితే,
కాలస్తాపసరూపేణ రాజద్వారముపాగమత్. 1

ప్ర. అ. రామే = రాముడు, ధర్మపరే = ధర్మపరుడై, స్థితే = ఉండగా, అథ = అటుపిమ్మట, కస్య చిత్ = ఒకానొక, కాలస్య = కాలమునకు, కాలః = కాల పురుషుడు, తాపసరూపేణ = మునిరూపముతో, రాజద్వారమ్ = రాజద్వారమును గూర్చి, ఉపాగమత్ = వచ్చెను.

తా. రాముడు ఈ విధముగ ధర్మపరుడై ఉంటుండగా, కొంత కాలమునకు కాలపురుషుడు మునిరూపములో రాజద్వారమునకు వచ్చెను.

మూ. సోఽబ్రవీల్లక్ష్మణం వాక్యం ధృతిమన్తం యశస్వినమ్,
మాం నివేదయ రామాయ సంప్రాప్తం కార్యగౌరవాత్. 2

ప్ర. అ. సః = అతడు, ధృతిమన్తమ్ = ధైర్యవంతుడు, యశస్వినమ్ = కీర్తి గలవాడు అయిన, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. మామ్ = నన్ను, కార్యగౌరవాత్ = కార్యముయొక్క గౌరవమువలన, సంప్రాప్తమ్ = వచ్చినవానినిగా, రామాయ = రామునకు, నివేదయ = తెలుపుము.

తా. అతడు ధైర్యవంతుడు కీర్తి గలవాడూ అయిన లక్ష్మణునితో ఇట్లు పలికెను- "నేను ఎంతో ముఖ్యమైన వనిమీద వచ్చినా నని రామునకు చెప్పుము."2

మూ. దూతో హ్యతిబలస్యాహం మహర్షేరమితౌజసః,
రామం దిదృక్షురాయాతః కార్యేణ హి మహాబల. 3

ప్ర. అ. మహాబల = గొప్ప బలము గలవాడా! అహమ్ = నేను, అమితౌజసః = అమితమైన తేజస్సు గల, అతిబలస్య = అత్యధికమైన బలము గల, మహర్షేః = మహర్షియొక్క, బ్రహ్మదేవునియొక్క, దూతః హి = దూతను. కార్యేణ = ఒక పనిచేత, రామమ్ = రాముణ్ణి, దిదృక్షుః = చూడతలచినవాడనై, ఆయాతః = వచ్చినాను.

తా. గొప్ప బలము గలవాడా! నేను అమితమైన తేజస్సు గల, గొప్ప బలము గల మహర్షి (బ్రహ్మదేవుని) దూతను. ఒక పనిమీద రాముణ్ణి చూచుటకై వచ్చినాను. 3

మూ. తస్య తద్వచనం శ్రుత్వా సౌమిత్రిస్త్వరయాన్వితః,
న్యవేదయత రామాయ తాపసం తం సమాగతమ్. 4

ప్ర. అ. తస్య = ఆతనియొక్క, తత్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, సౌమిత్రిః = లక్ష్మణుడు, త్వరయా = తొందరతో, అన్వితః = కూడినవాడై, తమ్ = ఆ, తాపసమ్ = మునిని, సమాగతమ్ = వచ్చినవానినిగా, రామాయ = రామునకు, న్యవేదయత్ = తెలిపెను.

తా. లక్ష్మణుడు ఆతని మాటలు విని తొందరపడుచు వెళ్ళి ఆ ముని వచ్చినట్లు రామునకు తెలిపెను. 4

మూ. జయస్వ రాజధర్మేణ ఉభౌ లోకౌ మహాద్యుతే,
దూతస్త్వాం ద్రష్టుమాయాత స్తపసా భాస్కరప్రభః. 5

ప్ర. అ. మహాద్యుతే = గొప్ప కాంతి గలవాడా! రాజధర్మేణ = రాజధర్మముచేత, ఉభౌ = రెండు, లోకౌ = లోకములను, జయస్వ = జయించుము. తపసా = తపస్సుచేత, భాస్కర ప్రభః = సూర్యునివంటి కాంతి గల, దూతః = దూత, త్వామ్ = నిన్ను, ద్రష్టుమ్ = చూచుటకు, ఆయాతః = వచ్చినాడు.

తా. గొప్ప కాంతి గలవాడా! రాజధర్మముచేత రెండు లోకములను

జయించుము. తపస్సుచేత సూర్యునివంటి కాంతి గల దూత నిన్ను చూచుటకు వచ్చినాడు. 5

మూ. తద్వాక్యం లక్ష్మణోక్తం వై శ్రుత్వా రామ ఉవాచ హ,
ప్రవేశ్యతాం మునిస్తాత సత్కృతః పూర్వమేవ హి. 6

ప్ర. అ. లక్ష్మణోక్తమ్ = లక్ష్మణునిచేత పలకబడిన, తత్ వాక్యమ్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, రామః = రాముడు, ఉవాచ హ = పలికెను. తాత = నాయనా! పూర్వమ్ ఏవ హి = ముందుగానే, సత్కృతః = సత్కరించబడిన వాడై, మునిః = ముని, ప్రవేశ్యతామ్ = ప్రవేశ పెట్టబడుగాక.

తా. లక్ష్మణుని మాటలు విని రాముడు - "నాయనా! ముందుగానే సత్కరించి ఆ మునిని లోపలికి తీసికొనిరమ్ము"అని పలికెను. 6

మూ. సౌమిత్రిస్తు తథేత్యుక్త్వా ప్రావేశయత తం మునిమ్,
జ్వలన్తమివ తేజోభిః ప్రదహన్తమివాంశుభిః. 7

ప్ర. అ. సౌమిత్రిః తు = లక్ష్మణుడైతే, తథా ఇతి = అట్లే అని, ఉక్త్వా = పలికి, తేజోభిః = తేజస్సులతో, జ్వలన్తమ్ ఇవ = మండుచున్నాడా అన్నట్లున్న, అంశుభిః = కిరణములచేత, ప్రదహన్తమ్ ఇవ = దహించుచున్నాడా అన్నట్లున్న, తమ్ = ఆ మునిని, ప్రావేశయత = ప్రవేశ పెట్టెను.

తా. లక్ష్మణుడు "అట్లే చేసెదను" అని పలికి తేజస్సుచేత మండుచున్నాడా అన్నట్లు, కిరణములచేత కాల్చుచున్నాడా అన్నట్లు ఉన్న ఆ మునిని లోపల ప్రవేశ పెట్టెను. 7

మూ. సోఽభిగమ్య రఘుశ్రేష్ఠం దీప్యమానం స్వతేజసా,
ఋషిర్మధురయా వాచా వర్ధస్వేత్యాహ రాఘవమ్. 8

ప్ర. అ. సః ఋషిః = ఆ ఋషి. స్వతేజసా = తన తేజస్సుతో, దీప్యమానమ్ = ప్రకాశించుచున్న, రఘుశ్రేష్ఠమ్ = రాముణ్ణి, అభిగమ్య = సమీపించి, మధురయా = మధురమైన, వాచా = వాక్కుతో, రాఘవమ్ = ఆరాముణ్ణి గూర్చి, వర్ధస్వ = వృద్ధిపొందుము, ఇతి = అని, ఆహ = పలికెను.

తా. ఆ ఋషీశ్వరుడు తేజస్సుతో ప్రకాశించుచున్న ఆ రాముణ్ణి సమీపించి మధురమైన వాక్కుతో - "వృద్ధి పొందుము" అని పలికెను. 8

మూ. తస్మై రామో మహాతేజాః పూజామర్ఘ్యపురోగమామ్,
దదౌ కుశలమవ్యగ్రం ప్రష్టుం చైవోపచక్రమే. 9

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, రామః=రాముడు, తస్మై= ఆతనికి, అర్ఘ్యపురోగమామ్ = అర్ఘ్యము మొదలైన, పూజామ్=పూజను, దదౌ= ఇచ్చెను. అవ్యగ్రమ్ = వ్యగ్రత లేకుండగా, కుశలమ్=కుశలమును, ప్రష్టుమ్= అడుగుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. గొప్ప తేజస్సు గల రాముడు ఆ మునీశ్వరునకు అర్ఘ్యము మొదలైన పూజను సావధానచిత్తముతో ఇచ్చి కుశలప్రశ్న వేయుటకు ఆరంభించెను. 9

మూ. పృష్టశ్చ కుశలం తేన రామేణ వదతాం వరః,
ఆసనే కాఞ్చనే దివ్యే నిషసాద మహాయశాః. 10

ప్ర. అ. తేన రామేణ = ఆ రామునిచేత, కుశలమ్ = కుశలమును, పృష్టః = అడగబడిన, వదతాం వరః = మాటలాడువారిలో శ్రేష్ఠుడైన, మహాయశాః = గొప్ప కీర్తి గల అతడు, కాఞ్చనే = బంగారము వికారమైన, దివ్యే= దివ్యమైన, ఆసనే = ఆసనమునందు, నిషసాద = కూర్చుండెను.

తా. రాముడు కుశలప్రశ్న చేయగా మాటలాడువారిలో శ్రేష్ఠుడు, గొప్ప కీర్తి కలవాడూ అయిన ఆ ముని దివ్యమైన బంగారు ఆసనముమీద కూర్చుండెను.

మూ. తమువాచ తతో రామః స్వాగతం తే మహామునే,
ప్రాపయాస్య చ వాక్యాని యతో దూతస్త్వమాగతః. 11

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రామః = రాముడు, తమ్ = ఆతనిని గూర్చి, ఉవాచ = పలికెను, మహామునే = మహాముని! తే = నీకు, స్వాగతమ్= స్వాగతము, త్వమ్ = నీవు, యతః = ఎవనినుండి, దూతః = దూతవుగా, ఆగతః = వచ్చినావో, అస్య = వీనియొక్క, వాక్యాని = మాటలను, ప్రాపయ= పొందించుము.

తా. పిమ్మట రాముడు ఆతనితో - "మహామునీ! నీకు స్వాగతము. నీవు ఎవరి దూతగా వచ్చినావో ఆతని మాటలు వినిపించుము (చెప్పుము అనెను). 11

మూ. చోదితో రాజసింహేన మునిర్వాక్యమభాషత,
ద్వన్ద్వే హ్యేత ప్రవక్తవ్యం హితం వై యద్యపేక్షసే.

ప్ర. అ. రాజసింహేన = రాజశ్రేష్ఠునిచేత, చోదితః = ప్రేరేపింపబడిన, మునిః = ముని, వాక్యమ్ = వాక్యమును, అభాషత = పలికెను. హితమ్ = హితమును, అపేక్షసే యది = (నీవు) అపేక్షించినట్లయితే, ఏతత్ = ఇది, ద్వన్ద్వే = ఇద్దరు మాత్రమే ఉన్నప్పుడు, ప్రవక్తవ్యమ్ = చెప్పదగినది.

తా. రామునిచేత ప్రేరేపింపబడిన ఆ ముని ఇట్లు పలికెను. "నీవు హితమును కోరినచో ఇది రహస్యమునందే చెప్పదగినది". 12

మూ. యః శృణోతి నిరీక్షేద్వా స వధ్యో భవితా తవ,
మహర్షేర్మునిముఖ్యస్య వచనం యద్యవేక్షసే. 13

ప్ర. అ. మునిముఖ్యస్య = మునులలో ముఖ్యుడైన, మహర్షేః = మహర్షి యొక్క, వచనమ్ = వచనమును, అవేక్షసే యది = నీవు మన్నించినచో, యః = ఎవడు, శృణోతి = వినునో, నిరీక్షేద్వా = లేదా చూచునో, సః = అతడు, తవ = నీకు, వధ్యః = చంపదగినవాడు, భవితా = కాగలడు.

తా. "మునులలో ముఖ్యుడైన మహర్షి వచనమును నీవు మన్నించినచో మన మాటలను ఎవడు వినునో, లేదా మాటలాడుకొనుచున్న మనలను చూచునో ఆతనిని నీవు చంపవలెను." 13

మూ. తథేతి చ ప్రతిజ్ఞాయ రామో లక్ష్మణమబ్రవీత్,
ద్వారి తిష్ఠ మహాబాహో ప్రతిహారం విసర్జయ. 14

ప్ర. అ. రామః = రాముడు, తథేతి = అట్లే అని, ప్రతిజ్ఞాయ = ప్రతిజ్ఞ చేసి, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను. మహాబాహో = ఓ! మహాబాహూ! ద్వారి = ద్వారమునందు, తిష్ఠ = ఉండుము, ప్రతీహారమ్ = ద్వార పాలకుణ్ణి, విసర్జయ = పంపివేయుము.

తా. రాముడు అట్లే అని ప్రతిజ్ఞ చేసి లక్ష్మణునితో ఇట్లు పలికెను. "మహా బాహూ! ద్వారపాలకుణ్ణి పంపివేసి ద్వారమునందు నిలచి ఉండుము." 14

మూ. స మే వధ్యః ఖలు భవేద్వాచం ద్వన్ద్వాసమీరితామ్,
ఋషేర్మమ చ సౌమిత్రే పశ్యేద్వా శృణుయాచ్చ యః.

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా! ఋషేః = ఋషియొక్క, మమ చ = నాయొక్క, ద్వన్ద్వాసమీరితామ్ = రహస్యమునందు పలకబడిన, వాచమ్ = వాక్కును, యః = ఎవడు, పశ్యేత్ = చూచునో, శృణుయాత్ చ = వినునో, సః = అతడు, మే = నాకు, వధ్యః = చంపదగినవాడు, భవేత్ = అగును.

తా. లక్ష్మణా! నేనూ ఈ ఋషి రహస్యమునందు మాటలాడుకొను చుండగా ఎవడు చూచునో లేదా వినునో ఆతనిని నేను చంపివేయవలసి ఉండును. 15

మూ. తతో నిక్షిప్య కాకుత్స్థో లక్ష్మణం ద్వారి సంగ్రహమ్,
తమువాచ మునే వాక్యం కథయస్వేతి రాఘవః. 16

ప్ర అ. తతః = అటుపిమ్మట, కాకుత్స్థః = కకుత్స్థవంశమునందు జనించిన, రాఘవః = రాముడు, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి, ద్వారి = ద్వారమునందు, సంగ్రహమ్ = అడ్డుకొనేవానినిగా, నిక్షిప్య = ఉంచి, మునే = మునీ! వాక్యమ్ = వాక్యమును, కథయస్వ = చెప్పుము, ఇతి = అని, తమ్ = ఆతనిగూర్చి, ఉవాచ = పలికెను.

తా. రాముడు లక్ష్మణుణ్ణి ద్వారమునందు రక్షకుణ్ణిగా ఉంచి ఆతనితో ఇట్లనెను — "మునీ! ఆ వాక్యమును చెప్పుము." 16

మూ. తత్తే మనీషితం వాక్యం యేన వాసి సమాగతః,
కథయస్వావిశఙ్కస్త్వం మమాపి హృది వర్తతే. 17

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
త్ర్యుత్తర శతతమః సర్గః

ప్ర. అ. యేన వా = దేనిచేత, సమాగతః అసి = వచ్చినావో, తత్ = ఆ,

తే = నీకు, మనీషితమ్ = ఇష్టమైన, వాక్యమ్ = వాక్యమును, త్వమ్ = నీవు, ఆవిశఙ్కఃః = శంక లేనివాడవై, కథయస్వ = చెప్పుము. మమ = నాయొక్క, హృదయేపి = హృదయమునందు కూడ, వర్తతే = ఉన్నది.

తా. దేనిచేత ఇక్కడకు వచ్చినావో నీ కిష్టమైన ఆ వాక్యమును ఎట్టిశంకా లేకుండ చెప్పుము. నా మనస్సులో కూడ వినవలె నని ఉన్నది. (నేను కూడ ఆవిషయమే ఆలోచించుచున్నాను.) 17

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో నూటమూడవ సర్గ సమాప్తము.

అథ చతురధికశతతమః సర్గః

[కాలపురుషుడు రామునకు బ్రహ్మదేవుని సందేశము చెప్పుట. రాముడు అంగీకరించుట.]

మూ. శృణు రాజన్ మహాసత్త్వ యదర్థమహమాగతః,
పితామహేన దేవేన ప్రేషితోఽస్మి మహాబల. 1

ప్ర. అ. మహాసత్త్వ = గొప్ప బుద్ధిబలము గలవాడా ! రాజన్ = రాజా! యదర్థమ్ = ఎందు నిమిత్తము, అహమ్ = నేను, ఆగతః = వచ్చినానో, శృణు = వినుము. మహాబల = గొప్ప బలము గలవాడా ! దేవేన = దేవుడైన, పితామహేన = బ్రహ్మచేత, ప్రేషితః అస్మి = పంపబడితిని.

తా. గొప్ప బుద్ధి బలము గల రాజా! నేను ఎందుకు వచ్చితినో వినుము. గొప్ప బలము గలవాడా ! నన్ను బ్రహ్మదేవుడు పంపినాడు. 1

మూ. తవాహం పూర్వకే భావే పుత్రః పరపురంజయ,
మాయాసంభావితో వీర కాలః సర్వసమాహరః. 2

ప్ర అ. పరపురంజయ = శత్రుపురములను జయించువాడా ! వీర = వీరుడా ! అహమ్ = నేను, పూర్వకే భావే = పూర్వావస్థయందు, అనగా హిరణ్యగర్భోత్పత్తి సమయమునందు, మాయాసంభావితః = మాయచేత, అనగా సంకల్పముచేత, పుట్టించబడిన, తవ పుత్రః = నీ పుత్రుడనైన, సర్వసమాహరః = సర్వసంహర్తయైన, కాలః = కాలమును.

తా. శత్రుపురములను జయించు వీరుడా ! నేను పూర్వావస్థయందు నీవు సంకల్పముచే పుట్టించిన, సకలసంహారకర్తయైన, నీ పుత్రుడైన కాలమును. 2

మూ. పితామహశ్చ భగవానాహ లోకపతిః ప్రభుః,
సమయస్తే కృతః సౌమ్య లోకాన్ సంపరిరక్షితుమ్. 3

ప్ర. అ. లోకపతిః = లోకముల ప్రభువు, ప్రభుః = సమర్థుడూ, భగవాన్ = భగవంతుడూ అయిన, పితామహః చ = పితామహుడు, ఆహ = ఇట్లు చెప్పుచున్నాడు. సౌమ్య = సౌమ్యుడా ! లోకాన్ = లోకములను, సంపరిరక్షితుమ్ = రక్షించుటకు, తే = నీకు (నీచేత), సమయః = ఒక అంగీకారము (ఒప్పందము), కృతః = చేయబడినది.

తా. లోకముల అధిపతి, సర్వసమర్థుడు, భగవంతుడు అయిన బ్రహ్మదేవుడు ఇట్లు అనుచున్నాడు-"సౌమ్యా ! లోకములను రక్షించుటకై నీవు ఒక అంగీకారము చేసి ఉన్నావు." 3

మూ. సంక్షిప్య హి పురా లోకాన్ మాయయా స్వయమేవ హి,
మహార్ణవే శయానోఽప్సు మాం త్వం పూర్వమజీజనః. 4

ప్ర. అ. పురా = పూర్వము, మాయయా = మాయచేత, స్వయమ్ = వీవ = స్వయముగానే, లోకాన్ = లోకములను, సంక్షిప్య = సంక్షేపించి, మహార్ణవే = మహాసముద్రమునందు, అప్సు = ఉదకమునందు, శయానః = శయనించుచున్న, త్వమ్ = నీవు, పూర్వమ్ = ముందుగా, మామ్ = నన్ను, అజీజనః = పుట్టించితివి.

తా. పూర్వము నీవు మాయాబలము చేత లోకములను అన్నింటిని స్వయముగానే అదృశ్యములను చేసి మహాసముద్రములో శయనించి ఉండి ముందుగా నన్ను సృష్టించినావు. 4

మూ. భోగవన్తం తతో నాగమనన్తముదకేశయమ్,
మాయయా జనయిత్వా త్వం ద్వౌ చ సత్త్వౌ మహాబలౌ,
మధుం చ కైటభం చైవ యయోరస్థిచయైర్వృతా,
ఇయం పర్వతసంబాధా మేదినీ చాభవత్తదా. 6

ప్ర. అ. తతః = అటుపిమ్మట, భోగవన్తమ్ = పడగలుగల, ఉదకేశయమ్ = ఉదకమునందు శయనించు, అనన్తం నాగమ్ = అనంత మనే నాగమును, త్వమ్ = నీవు, మాయయా = మాయచేత, జనయిత్వా = పుట్టించి, మధుం చ = మధువు, కైటభం చైవ = కైటభుడు అను, మహాబలౌ = గొప్ప బలము గల,

ద్వౌ=రెండు, సత్త్వౌ = ప్రాణులను సృష్టించితివి. తదా = అప్పుడు, యయోఃఎవరియొక్క, అస్థిచయైఃఎముకల సముదాయములతో. వృతా = కూడిన, ఇయం మేదినీ = ఈ భూమి, పర్వతసంబాధా = పర్వతములచేత ఇరుకైనదిగా, అభవత్ = ఆయెనో.

తా. పిమ్మట నీవు మాయాబలముచేత పెద్ద పడగలు గల, ఉదకనివాసియైన ఆదిశేషుణ్ణి సృష్టించి మహాబలవంతులైన మధుకైటభు లను రెండు గొప్ప ప్రాణులను సృష్టించితివి. వాళ్ళ ఎముకలతో వ్యాప్తమై ఈ భూమి పర్వతములతో నిండెను. 5,6

మూ. పద్మే దివ్యేఽర్క-సంకాశే నాభ్యాముత్పాద్య మామపి,
ప్రాజాపత్యం త్వయా కర్మ మయి సర్వం నివేశితమ్. 7

ప్ర. అ. నాభ్యామ్ = నాభియందు, దివ్యే = దివ్యమైన, అర్క-సంకాశే = సూర్యునితో సమానమైన, దివ్యే పద్మే=దివ్యమైన పద్మమునందు, మామ్=నన్ను, ఉత్పాద్య = సృష్టించి, త్వయా = నీచేత, సర్వమ్ = సమస్తమైన, ప్రాజాపత్యమ్=ప్రాజాపతికి సంబంధించిన, కర్మ = పని, నివేశితమ్=ఉంచబడినది.

తా. నీ నాభియందు సూర్యునితో సమానమైన దివ్యమైన పద్మమునందు నన్ను సృష్టించి నీవు ప్రజాపతిత్వమును పూర్తిగా నాకు అప్పగించినావు. 7

మూ. సోఽహం సంన్యస్తభారో హి త్వాముపాస్య జగత్పతిమ్,
రక్షాం విధత్స్వ భూతేషు మమ తేజస్కరో భవాన్. 8

ప్ర. అ. సంన్యస్తభారఃఉంచబడిన సృష్టిభారము గల, సఃఅహమ్ = అట్టి నేను, జగత్పతిమ్ = జగత్పతివైన, త్వామ్=నిన్ను, ఉపాస్య = ఉపాసించి, సర్వభూతేషు = సకలభూతములయందు, రక్షామ్ = రక్షను, విధత్స్వ = చేయుము. భవాన్=నీవే, మమ = నాకు, తేజస్కరఃతేజస్సును ఇచ్చినవాడవు (అని ప్రార్థించితిని).

తా. ప్రజాపతిత్వభారమును నీవు నాపై ఉంచగా నేను జగత్పతివైన నిన్ను ఉపాసించి, "నాకు తేజస్సును ఇచ్చినవాడవు నీవే; సమస్తభూతములను రక్షించుము"అని నిన్ను ప్రార్థించితిని. 8

మూ. తత స్త్వమసి దుర్ధర్షాత్తస్మాద్భావాత్సనాతనాత్,
రక్షాం విధాస్యన్ భూతానాం విష్ణుత్వముపజగ్మివాన్. 9

ప్ర. అ. తతః = అటుపిమ్మట, త్వమ్ = నీవు, దుర్ధర్షాత్ = ఎదిరింప శక్యము కాని, సనాతనాత్ = ప్రాచీనమైన, తస్మాత్ = ఆ, భావాత్ = హిరణ్యగర్భ స్థితినుండి, భూతానామ్ = భూతములయొక్క, రక్షామ్ = రక్షను, విధాస్యన్ = చేయనున్నవాడవై, విష్ణుత్వమ్ = విష్ణుత్వమును, ఉపజగ్మివాన్ = పొందితివి.

తా. అప్పుడు నీవు ప్రాణులను రక్షించుటకై సనాతనము, ఎదిరింప శక్యము కానిదీ అయిన ఆ హిరణ్యగర్భస్థితినుండి విష్ణుత్వమును పొందినావు. 9

మూ. అదిత్యాం వీర్యవాన్ పుత్రో భ్రాతృణాం వీర్యవర్ధనః,
సముత్పన్నేషు కృత్యేషు తేషాం సాహ్యాయ కల్పసే. 10

ప్ర. అ. అదిత్యామ్ = అదితియందు, వీర్యవాన్ = పరాక్రమము గల, భ్రాతృణామ్ = సోదరులయొక్క, వీర్యవర్ధనః = పరాక్రమమును వృద్ధిపొందించు, పుత్రః = పుత్రుడవుగా పుట్టి, కృత్యేషు = కృత్యములు, సముత్పన్నేషు = పుట్టినవగుచుండగా, తేషామ్ = సోదరులయొక్క, సాహ్యాయ = సాహాయ్యముకొరకు, కల్పసే = అగుచున్నావు.

తా. అదితియందు మహాపరాక్రమశాలియైన పుత్రుడుగా (ఉపేంద్రుడుగా) పుట్టి సోదరులైన దేవతల పరాక్రమమును వృద్ధిపొందించుచు పనులు వచ్చినప్పుడు వాళ్ళకి సహాయము చేయుచుందువు. 10

మూ. స త్వముజ్జాస్యమానాసు ప్రజాసు జగతో వర,
రావణస్య వధాకాఙ్క్షీ మానుషేషు మనోఽదధాః. 11

ప్ర. అ. జగతః = జగత్తుయొక్క, వర = శ్రేష్ఠుడా! సః త్వమ్ = అట్టి నీవు, ప్రజాసు = ప్రజలు, ఉజ్జాస్యమానాసు = పీడించబడుచున్నవారగుచుండగా, రావణస్య = రావణునియొక్క, వధాకాఙ్క్షీ = వధను కోరుచున్నవాడవై, మానుషేషు = మనుష్యులలో, మనః = మనస్సును, అదధాః = ఉంచితివి.

తా. జగత్తులో శ్రేష్ఠుడా! అట్టి నీవు, ప్రజలు రావణునిచేత హింసింపబడుచుండగా, రావణుని సంహరించుటకై మనుష్యజన్మ ఎత్తుటకు సంకల్పించితివి.

మూ. దశ వర్షసహస్రాణి దశ వర్షశతాని చ,
కృత్వా వాసస్య నియమం స్వయమేవాత్మనా పురా. 12

ప్ర. అ. పురా = పూర్వము, స్వయమేవ = స్వయముగానే, ఆత్మనా = తనచేత, దశవర్షసహస్రాణి = పది వేల సంవత్సరములు, దశవర్షశతాని చ = పది వందల సంవత్సరాలు, వాసస్య = నివాసమునకు, నియమమ్ = నియమమును, కృత్వా = చేసి (మానవుడుగా జన్మించితివి).

తా. పదకొండువేల సంవత్సరములు భూలోకములో ఉండెద నని స్వయముగానే నియమము ఏర్పరచుకొని మానవుడుగా జన్మించితివి. 12

మూ. స త్వం మనోమయః పుత్రః పూర్ణాయుర్మానుషేష్విహ,
కాలో నరవరశ్రేష్ఠ సమీపముపవర్తితుమ్. 13

ప్ర. అ. మనోమయః పుత్రః = నీ మనఃసకల్పమువలన దశరథపుత్రుడ వైన, సః త్వమ్ = అట్టి నీవు, ఇహ = ఇక్కడ, మానుషేషు = మనుష్యులయందు, పూర్ణాయుః = పూర్ణాయుర్దాయము కలవాడవు. నరవరశ్రేష్ఠ = నరవరులలో శ్రేష్ఠుడా! సమీపమ్ = సమీపమును గూర్చి, ఉపవర్తితుమ్ = వచ్చుటకు, కాలః = కాలము.

తా. స్వసంకల్పముచేత (దశరథ) పుత్రుడుగా పుట్టిన నీకు మనుష్యులలో పూర్ణాయుర్దాయము పూర్తి అయినది. అందుచేత, నరవరులలో శ్రేష్ఠుడా! ఇక నీవు మా దగ్గరకు తిరిగి వచ్చుటకు కాలము వచ్చినది. 13

మూ. యది భూయో మహారాజ ప్రజా ఇచ్ఛస్యుపాసితుమ్,
వస వా వీర భద్రం తే ఏవమాహ పితామహః. 14

ప్ర. అ. మహారాజ = మహారాజా! వా = లేదా, భూయః = ఇంకనూ, ప్రజాః = ప్రజలను, ఉపాసితుమ్ = రక్షించుటకు, ఇచ్ఛసి యది = ఇచ్ఛయించినట్లయితే, వీర = వీరుడా! వస = ఇక్కడనే ఉండుము. తే = నీకు, భద్రమ్ = క్షేమమగుగాక. పితామహః = బ్రహ్మదేవుడు, ఏవమ్ = ఇట్లు, ఆహ = పలికెను.

తా. "మహారాజా! ఇంకను ప్రజలను రక్షించవలె నని నీకున్నచో ఇక్కడనే ఉండుము. నీకు క్షేమము అగుగాక" బ్రహ్మదేవుడు ఇట్లు చెప్పినాడు. 14

మూ. అథవా విజిగీషా తే సురలోకాయ రాఘవ,
సనాథా విష్ణునా దేవా భవన్తు విగతజ్వరాః. 15

ప్ర. అ. అథవా = లేదా, రాఘవ = రామా! తే = నీకు, దేవలోకాయ = దేవలోకముకొరకు, విజిగీషా = జయించవలె ననుకోరిక ఉన్నచో, దేవాః = దేవతలు, విష్ణునా = విష్ణువుతో, సనాథాః = కూడినవారై, విగతజ్వరాః = పోయిన మనఃక్లేశము కలవారు, భవన్తు = అగుదురుగాక.

తా. రామా ! అట్లు కాక సురలోకమును పాలించు అభిలాష ఉన్నచో దేవతలు విష్ణువైన నీ సంరక్షణమును పొందినవారై నిర్భయులుగా ఉందురుగాక.

మూ. శ్రుత్వా పితామహేనోక్తం వాక్యం కాలసమీరితమ్,
రాఘవః ప్రహసన్ వాక్యం సర్వసంహారమబ్రవీత్. 16

ప్ర. అ. కాలసమీరితమ్ = కాలపురుషునిచేత చెప్పబడిన, పితామహేన = బ్రహ్మదేవునిచేత, ఉక్తమ్ = పలకబడిన, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, రాఘవః = రాముడు, ప్రహసన్ = నవ్వుచు, సర్వసంహారమ్ = సర్వమునూ సంహరించు కాలుణ్ణి గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. కాలపురుషుని ద్వారా బ్రహ్మదేవుడు పలికిన మాటలు (పంపిన సందేశమును) విని రాముడు నవ్వుచు ఆ కాలపురుషునితో ఇట్లనెను. 16

మూ. శ్రుత్వా మే దేవదేవస్య వాక్యం పరమమద్భుతమ్,
ప్రీతిర్హి మహతీ జాతా తవాగమనసంభవా. 17

ప్ర. అ. పరమమ్ = మిక్కిలి, అద్భుతమ్ = ఆశ్చర్యకరమైన, దేవదేవస్య = బ్రహ్మదేవునియొక్క, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, మే = నాకు, తవ = నీయొక్క, ఆగమనసంభవా = ఆగమనమువలన పుట్టిన, మహతీ = గొప్ప, ప్రీతిః = సంతోషము, జాతా = పుట్టినది.

తా. చాల అద్భుతమైన బ్రహ్మదేవుని మాటలు విని నాకు నీరాకవలన చాల సంతోషము కలిగినది. 17

మూ. త్రయాణామపి లోకానాం కార్యార్థం మమ సంభవః,
భద్రం తేఽస్తు గమిష్యామి యత ఏవాహమాగతః, 18

ప్ర. అ. త్రయాణామ్ = మూడు, లోకానామ్ = లోకములయొక్క, కార్యార్థమ్ = కార్యముకొరకే, మమ = నాయొక్క, సంభవః = పుట్టుక. తే = నీకు, భద్రమ్ = మంగళము, అస్తు = అగుగాక. అహమ్ = నేను, యతః ఏవ = ఎక్కడినుండి, ఆగతః = వచ్చినానో అక్కడికే, గమిష్యామి = వెళ్ళగలను.

తా. నేను పుట్టినది మూడు లోకముల కార్యమును సాధించుటకే. నీకు మంగళ మగుగాక; నేను ఎక్కడికినుండి వచ్చినానో అక్కడికే వెళ్ళెదను. 18

మూ. హృద్గతో హ్యసి సంప్రాప్తో న మే తత్ర విచారణా,
మయా హి సర్వకృత్యేషు దేవానాం వశవర్తినా, 19
స్థాతవ్యం సర్వసంహార యథాహ్యేహ పితామహః.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
చతురధికశతతమః సరః

ప్ర. అ. మే = నాకు, హృద్గతః = నా మనస్సులో ఉన్నవాడవే, సంప్రాప్తః అసి = వచ్చినావు; మే = నాకు అత్ర = ఈ విషయమునందు, విచారణా = ఆలోచన, న = లేదు. సర్వసంహార = కాలపురుషా! పితామహః = బ్రహ్మదేవుడు, యథా = ఎట్లు, ఆహ = పలికెనో అట్లు, మయా = నాచేత, సర్వకృత్యేషు = అన్నికృత్యముల యందు, దేవానామ్ = దేవతలకు, వశవర్తినా = వశుడుగా, స్థాతవ్యం హి = ఉండ దగినది కదా?

తా. కాలపురుషా ! నేను నిన్ను గూర్చి ఆలోచించుచుండగానే నీవు వచ్చి నావు. ఈ విషయమున నాకు మరి యొక ఆలోచన లేదు. బ్రహ్మదేవుడు చెప్పి నట్లు నేను అన్ని పనులయందు దేవతల వశములో ఉండవలెను కదా?

"బాలానందిని"ను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో నూటనాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చాధికశతతమః సర్గః

[దుర్వాసుడు శపించు ననే భయముచేత లక్ష్మణుడు నియమ భంగమైనను లెక్కచేయక రాముని దగ్గరకు వచ్చి ఆతని రాకను గూర్చి చెప్పుటు. రాముడు దుర్వాసునకు భోజనము పెట్టుటు. ఆతడు వెళ్లిపోయిన వెమ్మటు రామునకు లక్ష్మణుని విషయమున చింత కలుగుటు.]

మూ. తథా తయోఃసంవదతోర్దుర్వాసా భగవాన్ ఋషిః,
రామస్య దర్శనాకాఙ్క్షీ రాజద్వారముపాగమత్. 1

ప్ర. అ. తయోఃవారిద్దరూ, తథా = అట్లు, సంవదతోఃసంభాషణ చేయుచుండగా, భగవాన్ = పూజ్యుడైన, దుర్వాసాఃఋషిః = దుర్వాసఋషి, రామస్య = రామునియొక్క, దర్శనాకాఙ్క్షీ = దర్శనమును కోరుచున్నవాడై, రాజద్వారమ్ = రాజద్వారమును, ఉపాగమత్ = పొందెను.

తా. ఆ రాముడు కాలపురుషుడు ఈ విధముగా సంభాషణ చేయుచుండగా పూజ్యుడైన దుర్వాసముని రాముని దర్శనమును కోరుచు రాజద్వారము వద్దకు వచ్చెను. 1

మూ. సోఽభిగమ్య తు సౌమిత్రిమువాచ ఋషిసత్తమః,
రామం దర్శయ మే శీఘ్రం పురా మేఽర్థోఽతివర్తతే. 2

ప్ర. అ. సఃఋషిసత్తమఃఆ మునిశ్రేష్ఠుడు, సౌమిత్రిమ్=లక్ష్మణుణ్ణి, అభిగమ్య = సమీపించి, ఉవాచ = పలికెను. శీఘ్రమ్ = శీఘ్రముగా, రామమ్ = రాముణ్ణి, దర్శయ = చూపుము; మే = నాయొక్క, అర్థఃపని, పురా అతివర్తతే = దాటిపోగలదు.

తా. ఆ మహాముని లక్ష్మణుని సమీపించి- "శీఘ్రముగా నాకు రాముణ్ణి చూపుము; కానిచో నా కార్యము మించిపోవును" అని పలికెను. 2

మూ. మునేస్తు భాషితం శ్రుత్వా లక్ష్మణః పరవీరహా,
అభివాద్య మహాత్మానం వాక్యమేతదువాచ హ. 3

ప్ర. అ. పరవీరహా = శత్రువీరసంహారకుడైన, లక్ష్మణః = లక్ష్మణుడు, మునేః = మునియొక్క, భాషితమ్ = మాటను, శ్రుత్వా = విని, మహాత్మానమ్ = ఆ మహాత్ముణ్ణి, అభివాద్య = నమస్కరించి, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. శత్రువీరసంహారకుడైన లక్ష్మణుడు ఆ ముని మాటలు విని, మహాత్ముడైన ఆతనికి నమస్కరించి ఇట్లు పలికెను. 3

మూ. కిం కార్యం బ్రూహి భగవన్ కో హ్యర్థః కిం కరోమ్యహమ్,
వ్యగ్రో హి రాఘవో బ్రహ్మన్ ముహూర్తం ప్రతిపాల్యతామ్.

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా! కార్యమ్ = కార్యము, కిమ్ = ఏమి? బ్రూహి = చెప్పుము. అర్థః = ప్రయోజనము, కః = ఏమి? అహమ్ = నేను, కిమ్ = ఏమి, కరోమి = చేయుదును? బ్రహ్మన్ = బ్రాహ్మణా! రాఘవః = రాముడు, వ్యగ్రః హి = పనితొందరలో ఉన్నాడు. ముహూర్తమ్ = ముహూర్తకాలము, ప్రతిపాల్యతామ్ = నిరీక్షింపబడుగాక.

తా. పూజ్యుడా! ఏమి పనో చెప్పుము. ఏ ప్రయోజనమునకై వచ్చినావు? నేను నీకు ఏమి చేయుదును? బ్రాహ్మణా! రాముడు పనితొందరలో ఉన్నాడు. ఒక్క ముహూర్తము నిరీక్షించుము. 4

మూ. తచ్ఛ్రుత్వా మునిశార్దూలః క్రోధేన కలుషీకృతః,
ఉవాచ లక్ష్మణం వాక్యం నిర్దహన్నివ చక్షుషా. 5

ప్ర. అ. మునిశార్దూలః = ముని శ్రేష్ఠుడు, తత్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, క్రోధేన = కోపముచేత, కలుషీకృతః = కలుషముచేయబడినవాడై, చక్షుషా = నేత్రముచేత, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి నిర్దహన్ ఇవ = కాల్చివేయుచున్నవాడు వలె, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. ఆ మునిశ్రేష్ఠుడు ఆ మాట విని కోపావేశము పొంది లక్ష్మణుణ్ణి చూపుతో కాల్చివేయుచున్నాడా అన్నట్లు చూచుచు ఇట్లు పలికెను. 5

మూ. అస్మిన్ క్షణే మాం సౌమిత్రే రామాయ ప్రతివేదయ,
అస్మిన్ క్షణే మాం సౌమిత్రే న నివేదయసే యది. 6

విషయం త్వాం పురం చైవ శపిష్యే రాఘవం తథా,
భరతం చైవ సౌమిత్రే యుష్మాకం యా చ సంతతిః. 7
న హి శక్ష్యామ్యహం భూయో మన్యుం ధారయితుం హృది.

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా ! అస్మిన్ క్షణే = ఈ క్షణమునందు, మామ్ = నన్ను, రామాయ = రామునకు, ప్రతివేదయ = తెలుపుము. సౌమిత్రే = లక్ష్మణా! అస్మిన్ క్షణే = ఈ క్షణమునందు, మామ్ = నన్ను, న నివేదయసేయది = తెలుపకపోయినట్లయితే, విషయమ్ = దేశమును, త్వామ్ = నిన్ను, పురం చైవ = పట్టణమును, తథా = మరియు, రాఘవమ్ = రాముణ్ణి, భరతం చ = భరతుణ్ణి, యుష్మాకమ్ = మీయొక్క, యా = ఏ, సంతతిః = సంతాన మున్నదో దానిని, శపిష్యే = శపించెదను, సౌమిత్రే = లక్ష్మణా ! అహమ్ = నేను, మన్యుమ్ = కోపమును, హృది = హృదయమునందు, ధారయితుమ్ = ధరించుటకు, భూయః = మరల, న శక్ష్యామి హి = సమర్థుడను కానుకదా ?

తా. లక్ష్మణా ! నన్ను గూర్చి రామునకు ఈ క్షణమునందే తెలుపుము. అట్లు చేయకపోయినచో ఈ దేశమును, నిన్ను, రాముణ్ణి, భరతుణ్ణి, మీ సంతాన మును కూడ శపించెదను. నేను నా కోపమును మనస్సులో అణచుకొనజాలను. 6,7

మూ. తచ్ఛ్రుత్వా ఘోరసంకాశం వాక్యం తస్య మహాత్మనః,
చింతయామాస మనసా తస్య వాక్యస్య నిశ్చయమ్. 8

వ్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన, తస్య = ఆ మునియొక్క, ఘోర సంకాశమ్ = భయంకరమైన, తత్ వాక్యమ్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, తస్య వాక్యస్య = ఆ వాక్యముయొక్క, నిశ్చయమ్ = నిర్ణయమును గూర్చి, చింతయామాస = ఆలోచించెను.

తా. మహాప్రభావవంతుడైన ఆ మునీశ్వరుని భయంకరమైన ఆ వాక్య మును విని లక్ష్మణుడు ఆ వాక్యము విషయమున చేయవలసిన నిర్ణయమును గూర్చి ఆలోచించెను. 8

మూ. ఏకస్య మరణం మేఽస్తు మా భూత్సర్వవినాశనమ్.
ఇతి బుద్ధ్యా వినిశ్చిత్య రాఘవాయ న్యవేదయత్. 9

ప్ర. అ. ఏకస్య = ఒక్క, మే = నా యొక్క, మరణమ్ = మరణము, అస్తు = అగుగాక. సర్వవినాశనమ్ = అందరియొక్క నాశనము, మా భూత్ = కలగకపోవుగాక. ఇతి = ఇట్లు, బుద్ధ్యా = బుద్ధి చేత, వినిశ్చిత్య = నిశ్చయించి, రాఘవాయ = రామునకు, న్యవేదయత్ = తెలిపెను.

తా. "నాకు ఒక్కనికే మరణము వచ్చుగాక, అందరికి వినాశము రాకుండు గాక" అని మనస్సులో నిశ్చయించుకొని లక్ష్మణుడు రామునకు అతనిని గూర్చి తెలిపెను. 9

మూ. లక్ష్మణస్య వచః శ్రుత్వా రామః కాలం విసృజ్య చ,
నిఃసృత్య త్వరితో రాజా అత్రేః పుత్రం దదర్శ హ. 10

ప్ర. అ. రాజా = రాజైన, రామః = రాముడు, లక్ష్మణస్య = లక్ష్మణుని యొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, కాలమ్ = కాలపురుషుణ్ణి, విసృజ్య చ = పంపివేసి, త్వరితః = తొందరపడుచున్నవాడై, నిఃసృత్య = బైటకు వచ్చి, అత్రేః = అత్రిమహర్షియొక్క, పుత్రమ్ = పుత్రుడైన దుర్వాసుణ్ణి, దదర్శ హ = చూచెను.

తా. రాజైన రాముడు లక్ష్మణుని మాటలు విని, కాలపురుషుణ్ణి పంపివేసి, తొందరపడుచు బైటకు వచ్చి దుర్వాసుణ్ణి చూచెను. 10

మూ. సోఽభివాద్య మహాత్మానం జ్వలన్తమివ తేజసా,
కిం కార్యమితి కాకుత్స్థః కృతాఞ్జలిరభాషత. 11

ప్ర. అ. సః కాకుత్స్థః = ఆ రాముడు, తేజసా = తేజస్సుతో, జ్వలన్తమ్ ఇవ = మండుచున్నాడా అన్నట్లు ఉన్న, మహాత్మానమ్ = ఆ మహాత్ముణ్ణి, అభివాద్య = నమస్కరించి, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి కలవాడై, కిమ్ = ఏమి, కార్యమ్ = చేయవలెను, ఇతి = అని, అభాషత = పలికెను.

తా. రాముడు తేజస్సుతో మండుచున్నాడా అన్నట్లున్న ఆ మునీశ్వరునికి నమస్కరించి అంజలి ఘటించి "ఏమి చేయవలెను?" అని ప్రశ్నించెను. 11

మూ. తద్వాక్యం రాఘవేణో క్తం శ్రుత్వా మునివరః ప్రభుః, 12
ప్రత్యాహ రామం దుర్వాసాః శ్రూయతాం ధర్మవత్సల.

ప్ర. అ. ప్రభుః = సర్వసమర్థుడు, మునివరః = మునిశ్రేష్ఠుడు అయిన, దుర్వాసాః = దుర్వాసుడు, రాఘవేణ = రాముని చేత, ఉక్తమ్ = పలకబడిన, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, రామమ్ = రాముణ్ణి గూర్చి, ప్రత్యాహ = తిరిగి పలికెను. ధర్మవత్సల = ధర్మమునందు ప్రేమ కలవాడా! శ్రూయతామ్ = వినబడుగాక.

తా. సమర్థుడు, మునిశ్రేష్ఠుడూ అయిన ఆ దుర్వాసుడు రాముని మాటలు విని రామునితో ఇట్లనెను- "ధర్మమునందు ఆసక్తి కలవాడా ! వినుము." 12

మూ. అద్య వర్షసహస్రస్య సమాప్తిర్మమ రాఘవ, 13
సోఽహం భోజనమిచ్ఛామి యథాసిద్ధం తవానఘ.

ప్ర. అ. రాఘవ = రామా! అద్య = నేడు, మమ = నాకు, వర్షసహస్రస్య = వెయ్యి సంవత్సరముల యొక్క- సమాప్తిః = సమాప్తి. అనఘ = దోషములు లేనివాడా ! సః అహమ్ = అట్టి నేను, తవ = నీయొక్క-, యథాసిద్ధమ్ = ఎట్లు సిద్ధముగా ఉన్నదో అట్టి, భోజనమ్ = భోజనమును, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. రామా ! నేను అనశనవ్రతము ప్రారంభించి ఈ నాటికి వెయ్యి సంవత్సరములు పూర్తి అయినవి. అట్టి నేను నీ విచ్చిన భోజనమును, ఎట్లు సిద్ధముగా ఉన్నదో అట్లు, చేయ వలె నని కోరుచున్నాను. 13

మూ. తచ్ఛ్రుత్వా వచనం రాజా రాఘవః ప్రీతమానసః, 14
భోజనం మునిముఖ్యాయ యథాసిద్ధముపాహరత్.

ప్ర. అ. రాజా = రాజైన, రాఘవః = రాముడు, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, ప్రీతమానసః = సంతోషించిన మనస్సు కలవాడై, మునిముఖ్యాయ = మునులలో ముఖ్యుడైన దుర్వాసునకు, యథాసిద్ధమ్ = ఎట్లు సిద్ధముగా ఉన్నదో అట్లు, భోజనమ్ = భోజనమును, ఉపాహరత్ = సమర్పించెను.

తా. ఆ మాటలు విని రాజైన రాముడు సంతోషించి ఆ దుర్వాసునకు యథాసిద్ధముగా భోజనము పెట్టించెను. 14

మూ. స తు భుక్త్వా మునిశ్రేష్ఠస్తదన్నమమృతోపమమ్, 15
సాధు రామేతి సంభాష్య స్వమాశ్రమముపాగమత్.

ప్ర. అ. సః=ఆ, మునిశ్రేష్ఠః=మునిశ్రేష్ఠుడు, అమృతోపమమ్=అమృతముతో సమానమైన, తత్=ఆ, అన్నమ్=అన్నమును, భుక్త్వా=భుజించి, రామ=రామా! సాధు=బాగున్నది, ఇతి = అని, సంభాష్య = పలికి, స్వమ్ ఆశ్రమమ్= తన ఆశ్రమమును, ఉపాగమత్ = పొందెను.

తా. ఆ మునిశ్రేష్ఠుడు అమృతము వంటి ఆ అన్నమును తిని "రామా చాలా బాగున్నది" అని పలికి తన ఆశ్రమమునకు వెళ్ళిపోయెను. 15

మూ. తస్మిన్ గతే మునివరే స్వాశ్రమం లక్ష్మణాగ్రజః, 16
సంస్మృత్య కాలవాక్యాని తతో దుఃఖముపాగమత్

ప్ర. అ. తస్మిన్ = ఆ, మునివరే = మునిశ్రేష్ఠుడు, స్వాశ్రమమ్ = తన ఆశ్రమమును గూర్చి, గతే = వెళ్ళిన వాడగుచుండగా, లక్ష్మణాగ్రజః=రాముడు, కాలవాక్యాని = కాలపురుషుని వాక్యములను, సంస్మృత్య = స్మరించి, తతః= పిమ్మట, దుఃఖమ్ = దుఃఖమును, ఉపాగమత్ = పొందెను.

తా. దుర్వాసుడు ఆశ్రమమునకు వెళ్ళిన పిమ్మట రాముడు కాలపురుషుని మాటలు స్మరించి దుఃఖాక్రాంతు డయ్యెను. 16

మూ. దుఃఖేన చ సుసంతప్తః స్మృత్వా తద్ఘోరదర్శనమ్, 17
అవాఙ్ముఖో దీనమనా వ్యాహర్తుం నశశాక హ.

ప్ర. అ. ఘోరదర్శనమ్ = ఘోరమైన దర్శనము గల, తత్ = ఆ వాక్యమును, స్మృత్వా = స్మరించి. దుఃఖేన= దుఃఖముచేత, సుసంతప్తః = మిక్కిలి తపింపచేయబడినవాడై, అవాఙ్ముఖః = క్రిందికి ముఖము గలవాడై, దీనమనాః = దీనమైన మనస్సు గలవాడై, వ్యాహర్తుమ్ = మాటలాడుటకు, న శశాక = సమర్థుడు కాలేదు.

తా. భయంకరముగా కనబడుచున్న ఆ వాక్యమును స్మరించి దుఃఖసంతప్తుడై, దైన్యముతో తలవంచుకొని ఏమీ మాటలాడజాలక పోయెను. 17

మూ. తతో బుద్ధ్యా వినిశ్చిత్య కాలవాక్యాని రాఘవః, 18
నైతదస్తీతి నిశ్చిత్య తూష్ణీమాసీన్మహాయశాః.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
పఞ్చోత్తరశతతమః సర్గః

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గల, రాఘవః = రాముడు, తతః = అటు పిమ్మట, కాలవాక్యాని = కాలపురుషుని వాక్యములను, బుద్ధ్యా = బుద్ధిచేత, వినిశ్చిత్య = నిశ్చయించుకొని, ఏతత్ = ఇది, నాస్తి = లేదు, ఇతి = అని, నిశ్చిత్య = నిశ్చయించి, తూష్ణీమ్ ఆసీత్ = మౌనముగా ఉండెను.

తా. మహాకీర్తిమంతుడైన రాముడు పిమ్మట కాలపురుషుడు చెప్పిన మాటలు స్మరించి ఇంక ఏమైనా సోదరాది పరివార మంతా నశించవలసినదే అని నిర్ణయించుకొని మౌనముగా నుండెను.

"బాలనందిని" ఆను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో నూట ఐదవ సర్గ సమాప్తము.

అథ షడుత్తరశతతమః సర్గః

[రామునిచే విడువబడిన లక్ష్మణుడు శరీరముతో స్వర్గమునకు వెళ్ళుట].

మూ. అవాఙ్ముఖమథో దీనం దృష్ట్వా సోమమివాప్లుతమ్,
రాఘవం లక్ష్మణో వాక్యం హృష్టో మధురమబ్రవీత్. 1

ప్ర. అ. అథో = అటుపిమ్మట. అవాఙ్ముఖమ్ = క్రిందికి ముఖము కలవాడు, దీనమ్ = దీనుడు, ఆప్లుతమ్ = రాహుగ్రస్తుడైన, సోమమ్ ఇవ = చంద్రుడు వలె ఉన్న, రాఘవమ్ = రాముణ్ణి గూర్చి, లక్ష్మణః = లక్ష్మణుడు, హృష్టః = సంతోషించిన వాడై, మధురమ్ = మధురమైన వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. తల క్రిందికి వంచి దీనుడై రాహుగ్రస్తుడైన చంద్రుడు వలె ఉన్న రాముణ్ణి చూచి లక్ష్మణుడు సంతోషపూర్వకముగా మధురమైన వాక్యము పలికెను.

మూ. న సంతాపం మహాబాహో మదర్థం కర్తుమర్హసి,
పూర్వనిర్మాణబద్ధా హి కాలస్య గతిరీదృశీ. 2

ప్ర. అ. మహాబాహో = మహాబాహూ ! మదర్థమ్ = నా నిమిత్తము, సంతాపమ్ = తాపమును, కర్తుమ్ = చేయుటకు, న అర్హసి = తగవు. కాలస్య = కాలముయొక్క, పూర్వనిర్మాణ బద్ధా = ముందుగానే జరిగిన ఏర్పాటుచేత బద్ధమైన, గతిః = గతి, ఈదృశీ హి = ఇట్టిదే కదా ?

తా. మహాబాహూ ! నా నిమిత్తము దుఃఖము చెందకుము. పూర్వము చేయబడిన నిర్మాణముచేత కాలగతి ఈ విధముగానే ఉండును గదా ? 2

మూ. జహి మాం సౌమ్య విస్రబ్ధం ప్రతిజ్ఞాం పరిపాలయ,
హీనప్రతిజ్ఞాః కాకుత్స్థ ప్రయాన్తి నరకం నరాః. 3

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! మామ్ = నన్ను, విస్రబ్ధమ్ = నిస్సంశ

యముగా, జపి=చంపుము. ప్రతిజ్ఞామ్=ప్రతిజ్ఞను, పరిపాలయ=పాలించుము. కాకుత్స్థ=రామా! హీనప్రతిజ్ఞాః=హీనమైన ప్రతిజ్ఞ కల, నరాః=మానవులు, నరకమ్=నరకమును గూర్చి, ప్రయాన్తి=వెళ్ళుదురు.

తా. సౌమ్యా! నిఃసందేహముగా నన్ను చంపుము. ప్రతిజ్ఞను పరిపాలించుము. ప్రతిజ్ఞ నిలబెట్టుకొనని నరులు నరకమునకు పోవుదురు. 3

మూ. లక్ష్మణేన తథోక్తస్తు రామః ప్రచలితేన్ద్రియః,
మన్త్రిణః సముపానీయ తథైవ చ పురోధసః, 4

ఆబ్రవీచ్చ తదా వృత్తం తేషాం మధ్యే స రాఘవః,
దుర్వాసోఽభిగమం చైవ ప్రతిజ్ఞాం తాపసస్య చ. 5

ప్ర. అ. లక్ష్మణేన=లక్ష్మణునిచేత, తథా=అట్లు, ఉక్తః=పలకబడిన, రామః=రాముడు, ప్రచలితేన్ద్రియః=చలించిన మనస్సు గలవాడై, మన్త్రిణః=మంత్రులను, తథైవ=మరియు, పురోధసః=పురోహితులను, సముపానీయ=రప్పించి, తదా=అప్పుడు, సః రాఘవః=ఆ రాముడు, తేషామ్=వారియొక్క, మధ్యే=మధ్యయందు, దుర్వాసోభిగమం చైవ=దుర్వాసుని రాకను, తాపసస్య=మునియొక్క, ప్రతిజ్ఞాం చైవ=ప్రతిజ్ఞను, వృత్తమ్=జరిగినదానిని అంతనూ, ఆబ్రవీత్ చ=చెప్పెను.

తా. రాముడు లక్ష్మణుని మాటలు విని, చలించిన మనస్సుతో (మనస్సులో దుఃఖించుచు), మంత్రులను పురోహితులను పిలిపించి వారికి దుర్వాసుని రాక, ఆ తాపసుని ప్రతిజ్ఞ మొదలైన వృత్తాంతమును చెప్పెను. 4,5

మూ. తచ్ఛ్రుత్వా మన్త్రిణః సర్వే సోపాధ్యాయాః సమాసత,
వసిష్ఠస్తు మహాతేజా వాక్యమేతదువాచ హ. 6

ప్ర. అ. తత్=దానిని, శ్రుత్వా=విని, సోపాధ్యాయాః=ఉపాధ్యాయులతోకూడిన, మన్త్రిణః=మంత్రులు, సర్వే=అందరూ, సమాసత=మౌనముగా కూర్చుండిరి. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, వసిష్ఠస్తు=వసిష్ఠుడైతే, ఏతత్=ఈ, వాక్యమ్=వాక్యమును, ఉవాచ హ=పలికెను.

తా. ఆ విషయము విన్న మంత్రులు, ఉపాధ్యాయులు అందరూ కూడ

మౌనముగా కూర్చుండిరి. గొప్ప తేజస్సు గల వసిష్ఠుడు మాత్రము ఇట్లు పలికెను. 6

మూ. దృష్టమేతన్మహాబాహో క్షయం తే రోమహర్షణమ్,
లక్ష్మణేన వియోగశ్చ తవ రామ మహాయశః. 7

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా! మహాయశః = గొప్ప కీర్తి కలవాడా! రామ = రామా! తే = నీయొక్క, ఏతత్ = ఈ, రోమహర్షణమ్ = రోమాంచమును కలిగించు, క్షయమ్ = క్షయము, లక్ష్మణేన = లక్ష్మణునితో, తవ = నీయొక్క, వియోగః చ = వియోగము, దృష్టమ్ = చూడబడినది.

తా. గొప్ప తపస్సు, కీర్తి గల రామా! నీకు రాబోవు భయంకరమైన ఈ క్షయమును గూర్చి లక్ష్మణునితో నీకు వియోగమును గూర్చి నాకు ముందుగానే తెలియును. 7

మూ. త్యజైనం బలవాన్ కాలో మా ప్రతిజ్ఞాం వృథా కృథాః,
ప్రతిజ్ఞాయాం హి నష్టాయాం ధర్మో హి విలయం వ్రజేత్.

ప్ర. అ. ఏనమ్ = ఇతనిని, త్యజ = విడువుము. కాలః = కాలము, బలవాన్ = బలము కలది. ప్రతిజ్ఞామ్ = ప్రతిజ్ఞను, వృథా = వ్యర్థమునుగా, మా కృథాః = చేయకుము. ప్రతిజ్ఞాయామ్ = ప్రతిజ్ఞ, నష్టాయామ్ = నష్టమైన దగుచుండగా, ధర్మః = ధర్మము, విలయమ్ = వినాశమును, వ్రజేత్ హి = పొందును కదా.

తా. ఈ లక్ష్మణుణ్ణి విడిచివేయుము. కాలము బలవత్తరమైనది. ప్రతిజ్ఞను వ్యర్థము చేయకుము. ప్రతిజ్ఞ నష్టమైనచో ధర్మము నశించును కదా? 8

మూ. తతో ధర్మే వినష్టే తు త్రైలోక్యం సచరాచరమ్,
సదేవర్షిగణం సర్వం వినశ్యేత్తు న సంశయః. 9

ప్ర. అ. ధర్మే = ధర్మము, వినష్టే తు = నష్టమైనచో, తతః = అటు పిమ్మట, సచరాచరమ్ = చరాచరములతో కూడిన, సదేవర్షిగణమ్ = దేవర్షిగణములతో కూడిన, త్రైలోక్యమ్ = మూడు లోకముల సముదాయము, సర్వమ్ = సమస్తమూ, వినశ్యేత్ తు = నశించును. సంశయః = సంశయము, న = లేదు.

తా. ధర్మము నశించినచో స్థావరజంగమములతోను, దేవగణఋషిగణములతోను కూడిన మూడులోకములు నశించును, సంశయము లేదు. 9

మూ. స త్వం పురుషశార్దూల త్రైలోక్యస్యాభిపాలనాత్,
లక్ష్మణేన వినా చాద్య జగత్ స్వస్థం కురుష్వ హ. 10

ప్ర. ఆ. పురుషశార్దూల = పురుషశ్రేష్ఠుడా ! సః త్వమ్ = అట్టి నీవు, అద్య = ఇప్పుడు, లక్ష్మణేన వినా = లక్ష్మణుడు లేకుండా ఉండుటచేత, త్రైలోక్యస్య = మూడులోకములయొక్క, అభిపాలనాత్ = పాలనమువలన, జగత్ = జగత్తును, స్వస్థమ్ = స్వస్థమైనదానినిగా, కురుష్వ హ = చేయుము.

తా. పురుషశ్రేష్ఠుడా! అట్టి నీవు ఇప్పుడు లక్ష్మణుణ్ణి విడచిపెట్టుట ద్వారా ముల్లోకములను రక్షించుటవలన జగత్తు స్వస్థముగా ఉండు నట్లు చేయుము. 10

మూ. తేషాం తత్సమవేతానాం వాక్యం ధర్మార్థసంహితమ్,
శ్రుత్వా పరిషదో మధ్యే రామో లక్ష్మణమబ్రవీత్. 11

ప్ర. ఆ. సమవేతానామ్ = కలిసిన, తేషామ్ = వాళ్లయొక్క, ధర్మార్థ సంహితమ్ = ధర్మార్థములతో కూడిన, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = నిని, పరిషదః = పరిషత్తుయొక్క, మధ్యే = మధ్యయందు, రామః = రాముడు, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను

తా. సభలో కలిసిన వారందరూ పలికిన ధర్మార్థములకు సంమతమైన ఆ వాక్యమును విని రాముడు పరిషత్తు మధ్యయందు లక్ష్మణునితో ఇట్లనెను. 11

మూ. విసర్జయే త్వాం సౌమిత్రే మా భూద్ధర్మవిపర్యయః,
త్యాగో వధో వా విహితః సాధూనాం హ్యుభయం సమమ్.

ప్ర. ఆ. సౌమిత్రే = లక్ష్మణా! త్వామ్ = నిన్ను, విసర్జయే = విడచివేయుచున్నాను. ధర్మవిపర్యయః = ధర్మమునకు వైపరీత్యము, మా భూత్ = కలుగకుండుగాక. సాధూనామ్ = సత్పురుషులకు, విహితః = విధించబడిన, త్యాగః = త్యాగమైనా, వధో వా = వధయైనా, ఉభయమ్ = ఉభయమూ కూడ, సమమ్ = సమానమే.

తా. లక్ష్మణా! ధర్మవైపరీత్యము కాకుండుటకై నిన్ను విడిచివేయుచున్నాను. సత్పురుషులకు త్యాగము విధించినా, వధను విధించినా రెండూ సమానములే. 12

మూ. రామేణ భాషితే వాక్యే బాష్పవ్యాకులితేన్ద్రియః,
లక్ష్మణస్త్వరితః ప్రాయాత్స్వగృహం న వివేశ హ. 13

ప్ర. అ. రామేణ = రామునిచేత, వాక్యే = వాక్యము, భాషితే = పలకబడిన దగుచుండగా, లక్ష్మణః = లక్ష్మణుడు, బాష్పవ్యాకులితేన్ద్రియః = కన్నీళ్ళచేత వ్యాకులము చేయబడిన ఇంద్రియములు కలవాడై, త్వరితః = తొందరపడుచున్నవాడై, ప్రాయాత్ = వెళ్ళిపోయెను. స్వగృహమ్ = తన గృహమును, న వివేశ హ = ప్రవేశించలేదు.

తా. రాముడు ఇట్లు అనగానే లక్ష్మణుడు, కన్నీళ్ళతో ఇంద్రియములు వ్యాకులములు కాగా, తన ఇంటికి కూడ వెళ్ళకుండగా, తొందరగా, వెళ్ళిపోయెను. 13

మూ. స గత్వా సరయూతీరముపస్పృశ్య కృతాఞ్జలిః,
నిగృహ్య సర్వస్రోతాంసి నిఃశ్వాసం న ముమోచ హ.

ప్ర. అ. సః = లక్ష్మణుడు, సరయూతీరమ్ = సరయూనదీతీరమును గూర్చి, గత్వా = వెళ్ళి, ఉపస్పృశ్య = ఆచమనము చేసి, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి కలవాడై, సర్వస్రోతాంసి = అన్ని రంధ్రములను, నిగృహ్య = నిగ్రహించుకొని, నిఃశ్వాసమ్ = శ్వాసను, న ముమోచ హ = విడవలేదు.

తా. ఆ లక్ష్మణుడు సరయూనదీతీరమునకు వెళ్ళి ఆచమనము చేసి, అంజలి ఘటించి నమస్కరించి, అన్ని శరీరద్వారములను నిగ్రహించి ఊపిరి బైటకు విడవకుండ కూర్చుండెను. 14

మూ. అనిఃశ్వసన్తం యుక్తం తం సశక్రాః సాప్సరోగణాః,
దేవాః సర్షిగణాః సర్వే పుష్పైరభ్యకిరంస్తదా. 15

ప్ర. అ. అనిఃశ్వసన్తమ్ = నిఃశ్వాసము చేయని, యుక్తమ్ = యోగసమాధిలో ఉన్న, తమ్ = అతనిని, తదా = అప్పుడు, సశక్రాః = ఇంద్రునితో కూడిన, సాప్సరోగణాః = అప్సరఃస్త్రీసముదాయముతో కూడిన, సర్షిగణాః = ఋషి

గణములతో కూడిన, సర్వే = సమస్తమైన, దేవాః = దేవతలు, పుష్పైః = పుష్పములచేత, అభ్యకిరన్ = చల్లిరి

తా. ఉచ్ఛ్వాసనిఃశ్వాసలు లేక యోగసమాధిలో ఉన్న ఆతనిపై ఇంద్రుడు, అప్సరఃస్త్రీలు, ఋషులు, సకలదేవతలూ కూడ పుష్పములు చల్లిరి. 15

మూ. అదృశ్యం సర్వమనుజైః సశరీరం మహాబలమ్,
ప్రగృహ్య లక్ష్మణం శక్రస్త్రిదివం సంవివేశ హ. 16

ప్ర. అ. శక్రః = దేవేంద్రుడు, సర్వమనుజైః = సకలమనుజులచేతను, అదృశ్యమ్ = చూడబడని, మహాబలమ్ = గొప్ప బలము గల, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి, సశరీరమ్ = శరీరసహితునిగా, ప్రగృహ్య = గ్రహించి, త్రిదివమ్ = స్వర్గమును, సంవివేశ హ = ప్రవేశించెను.

తా. ఇంద్రుడు మనుష్యుల కెవరికీ కనబడని మహాబలశాలియైన ఆ లక్ష్మణుణ్ణి సశరీరముగా తీసికొనివెళ్ళి స్వర్గములో ప్రవేశించెను. 16

మూ. తతో విష్ణోశ్చతుర్భాగమాగతం సురసత్తమాః,
దృష్ట్వా ప్రముదితాః సర్వే పూజయన్తి స్మ రాఘవమ్. 17

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
షడుత్తరశతతమః సర్గః.

ప్ర. అ. తతః = ఆటుపిమ్మట, సర్వే = సమస్తమైన, సురసత్తమాః = దేవతాశ్రేష్ఠులు, విష్ణోః = విష్ణువుయొక్క, చతుర్భాగమ్ = నాల్గవ భాగమును, ఆగతమ్ = వచ్చినదానినిగా, దృష్ట్వా = చూచి, ప్రముదితాః = సంతోషించినవారై, రాఘవమ్ = లక్ష్మణుణ్ణి, పూజయన్తి స్మ = పూజించిరి.

తా. అప్పుడు దేవతాముఖ్యు లందరూ విష్ణువు నాల్గవ భాగము వచ్చినట్లు చూచి చాల సంతోషించి లక్ష్మణుణ్ణి పూజించిరి. 17

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు,
ఉత్తరకాండలో నూటఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తోత్తరశతతమః సర్గః

[వసిష్ఠుని ఆజ్ఞ ప్రకారము పౌర లందరినీ తనతో పరమధామమునకు తీసికొనివెళ్లవలె నని రాముడు ఆలోచించుట, కుశలవులను రాజ్యమునందు అభిషిక్తులను చేయుట.]

మూ. విసృజ్య లక్ష్మణం రామో దుఃఖశోకసమన్వితః,
పురోధసం మన్త్రిణశ్చ నైగమాంశ్చేదమబ్రవీత్. 1

ప్ర. అ. రామః = రాముడు, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి, విసృజ్య = విడచి, దుఃఖశోకసమన్వితః = దుఃఖశోకములతో కూడినవాడై, పురోధసమ్ = పురోహితుణ్ణి, మన్త్రిణః చ = మంత్రులను, నైగమాన్ చ = సంఘముఖ్యులను గూర్చి, ఇదమ్ = దీనిని, అబ్రవీత్ = పలికెను.

తా. రాముడు లక్ష్మణుణ్ణి విడిచివేసి, దుఃఖశోకములతో బాధపడుచు పురోహితునితోను, మంత్రులతోను, సంఘముఖ్యులతోను ఇట్లు పలికెను. 1

మూ. అద్య రాజ్యేఽభిషేక్ష్యామి భరతం ధర్మవత్సలమ్,
అయోధ్యాయాః పతిం వీరం తతో యాస్యామ్యహం వనమ్.

ప్ర. అ. ధర్మవత్సలమ్ = ధర్మమునందు ప్రేమ గల, వీరమ్ = వీరుడైన, భరతమ్ = భరతుణ్ణి. అద్య = నేడు, రాజ్యే = రాజ్యమునందు, అయోధ్యాయాః = అయోధ్యయొక్క, పతిమ్ = ప్రభువునుగా, అభిషేక్ష్యామి = అభిషేకించెదను. తతః = అటుపిమ్మట, అహమ్ = నేను, వనమ్ = వనమును గూర్చి, యాస్యామి = వెళ్లెదను.

తా. ధర్మమునందు ఆసక్తి గల వీరుడైన భరతుణ్ణి రాజ్యమునందు, అయోధ్యాధిపతినిగా నేడు అభిషేకించి నేను వనమునకు వెళ్ళెదను. 2

మూ. ప్రవేశయత సంభారాన్ మా భూత్కాలస్య పర్యయః,
అద్యైవాహం గమిష్యామి లక్ష్మణేన గతాం గతిమ్. 3

ప్ర. అ. సంభారాన్ = సంభారములను, ప్రవేశయత = ప్రవేశపెట్టండి. కాలస్య = కాలముయొక్క, పర్యయః = గడచిపోవుట, మా భూత్ = జరగకపోవుగాక. అహమ్ = నేను, అద్యైవ = ఇప్పుడే, లక్ష్మణేన = లక్ష్మణునిచేత, గతామ్ = పొందబడిన, గతిమ్ = గతిని, గమిష్యామి = పొందగలను.

తా కావలసిన సామగ్రి తీసికొనిరండి. అలస్యము కాకూడదు. నేడే నేను కూడ లక్ష్మణుడు పొందిన గతిని పొందెదను. 3

మూ. తచ్ఛ్రుత్వా రాఘవేణోక్తం సర్వాః ప్రకృతయో భృశమ్,
మూర్ధభిః ప్రణతా భూమౌ గతసత్త్వా ఇవాభవన్. 4

ప్ర. అ. రాఘవేణ = రామునిచేత, ఉక్తమ్ = పలకబడిన, తత్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, సర్వాః = సమస్తమైన, ప్రకృతయః = అమాత్యాదులు, మూర్ధభిః = శిరస్సులతో, భూమౌ = భూమియందు, ప్రణతాః = వంగినవారై, భృశమ్ = మిక్కిలి, గతసత్త్వాః ఇవ = పోయిన చైతన్యము కలవారువలె, అభవన్ = అయిరి.

తా. రాముని మాటలు విని సమస్తమైన అమాత్యాది ప్రకృతులు మిక్కిలి చైతన్యవిహీనులు వలె అయి, తలలతో నేలమీద పడిరి. 4

మూ. భరతశ్చ విసంజ్ఞోఽభూచ్ఛ్రుత్వా రాఘవభాషితమ్,
రాజ్యం విగర్హ్యామాన వచనం చేదమబ్రవీత్. 5

ప్ర. అ. రాఘవభాషితమ్ = రాముని మాటలను, శ్రుత్వా = విని, భరతః చ = భరతుడు, విసంజ్ఞః = సంజ్ఞ లేనివాడు, అభూత్ = ఆయెను. రాజ్యమ్ = రాజ్యమును, విగర్హ్యామాస = నిందించెను ఇదమ్ = ఈ, వచనం చ = వచనమును కూడ, అబ్రవీత్ = పలికెను.

తా. రాముని మాటలు విని భరతుడు నిశ్చేష్టుడయ్యెను. రాజ్యమును నిందించి ఇట్లు పలికెను. 5

మూ. సత్యేనాహం శపే రాజన్ స్వర్గభోగేన చైవ హి,
న కామయే యథా రాజ్యం త్వాం వినా రఘునన్దన. 6

ప్ర. అ. రాజన్ = రాజా ! రఘునన్దన = రామా ! త్వాం వినా = నీవు లేకుండగా, రాజ్యమ్ = రాజ్యమును, యథా = ఎట్లు, న కామయే = కోరనో, సత్యేన = సత్యముచేత, స్వర్గభోగేన చైవ హి = స్వర్గభోగముచేత, అహమ్ = నేను, శపే = ఒట్టు పెట్టుచున్నాను.

తా. రాజా ! రామా ! నీవు లేనిచో నేను రాజ్యమును కోర నని సత్యము మీద, స్వర్గసుఖాల మీదా ఒట్టు పెట్టి చెప్పుచున్నాను. 6

మూ. ఇమౌ కుశీలవౌ రాజన్నభిషిచ్య నరాధిప,
కోశలేషు కుశం వీరముత్తరేషు తథా లవమ్. 7

ప్ర. అ. నరాధిప = నరుల ప్రభువైన, రాజన్ = రాజా ! వీరమ్ = వీరుడైన, కుశమ్ = కుశుణ్ణి, కోశలేషు = దక్షిణ కోశలదేశమునందు, తథా = మరియు, లవమ్ = లవుణ్ణి, ఉత్తరేషు = ఉత్తకోశలదేశమునందు, ఇమౌ = ఈ, కుశీలవౌ = కుశలవులను, అభిషిచ్య = అభిషేకించి (వెళ్ళెదము).

తా. రాజా ! వీరుడైన కుశుణ్ణి దక్షిణకోశలదేశమునందు, లవుణ్ణి ఉత్తర కోశలదేశమునందూ, ఈ విధముగ కుశలవు లిద్దరిని రాజ్యాభిషిక్తులను చేసి వెళ్ళెదము. 7

మూ. శత్రుఘ్నస్య చ గచ్ఛన్తు దూతాస్త్వరితవిక్రమాః,
ఇదం గమనమస్మాకం శీఘ్రమాఖ్యాన్తు మా చిరమ్. 8

ప్ర. అ. శత్రుఘ్నస్య = శత్రుఘ్నునకు, త్వరితవిక్రమాః = శీఘ్రగమనము గల, దూతాః = దూతలు, గచ్ఛన్తు = వెళ్ళెదరు గాక. అస్మాకమ్ = మనయొక్క, ఇదమ్ = ఈ, గమనమ్ = గమనమును, శీఘ్రమ్ = శీఘ్రముగా, ఆఖ్యాన్తు = చెప్పెదరుగాక. చిరం మా = ఆలస్యము వద్దు.

తా. శీఘ్రముగా వెళ్ళగల దూతలు శత్రుఘ్నుని వద్దకు వెళ్ళి మన ఈ గమనమును గూర్చి వెంటనే చెప్పెదరుగాక. ఆలస్యము వద్దు. 8

మూ. తచ్ఛ్రుత్వా భరతేనోక్తం దృష్ట్వా చాపి హ్యధోముఖాన్,
పౌరాన్ దుఃఖేన సంతప్తాన్ వసిష్ఠో వాక్యమబ్రవీత్. 9

ప్ర. అ. వసిష్ఠః = వసిష్ఠుడు, భరతేన = భరతునిచేత, ఉక్తమ్ = చెప్పబడిన ఆ వాక్యమును, శ్రుత్వా = విని, అధోముఖాన్ = క్రిందికి ముఖములు గల, దుఃఖేన = దుఃఖముచేత, సంతప్తాన్ = బాధపడుచున్న, పౌరాన్ = పౌరులను, దృష్ట్వా చాపి = చూచి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. వసిష్ఠుడు భరతుని మాటలు విని, దుఃఖపీడితులై తలలు క్రిందికి వంచి ఉన్న పౌరులను చూచి ఇట్లు పలికెను. 9

మూ. వత్స రామ ఇమాః పశ్య ధరణీం ప్రకృతీర్గతాః,
జ్ఞాత్వైషామీప్సితం కార్యం మా చైషాం విప్రియం కృథాః.

ప్ర. అ. రామ=రామా ! వత్స=నాయనా, ధరణీమ్ = భూమిని, గతాః = పొందిన, ఇమాః ప్రకృతీః = ఈ ప్రజలను. పశ్య = చూడుము. ఏషామ్ = వీరియొక్క, ఈప్సితమ్ = ఇష్టమును, జ్ఞాత్వా = తెలిసికొని, కార్యమ్ = చేయదగినది. ఏషామ్=వీరికి, విప్రియమ్=అనిష్టమును, మా చ కృథాః=చేయకుము.

తా. నాయనా ! రామా ! నేలమీద పడి ఉన్న ఈ ప్రజలను చూడుము. వీరి ఇష్ట మేమో తెలిసికొని అది చేయుము. అనిష్టమైనదానిని చేయకుము. 10

మూ. వసిష్ఠస్య తు వాక్యేన ఉత్థాప్య ప్రకృతీజనమ్,
కిం కరోమీతి కాకుత్స్థః సర్వాన్ వచనమబ్రవీత్. 11

ప్ర. అ. కాకుత్స్థః = రాముడు, వసిష్ఠస్య = వసిష్ఠునియొక్క, వాక్యేన= మాటచేత, ప్రకృతీజనమ్ = ప్రకృతులను, ఉత్థాప్య = లేవదీసి, కిం కరోమి = ఏమి చేయుదును, ఇతి = అని, సర్వాన్ = అందరినీ గూర్చి, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. రాముడు వసిష్ఠుని మాట ప్రకారము ప్రకృతులను లేవదీసి "నేను ఏమి చేయవలెను ?" అని వారి నందరినీ అడిగెను. 11

మూ. తతః సర్వాః ప్రకృతయో రామం వచనమబ్రువన్,
గచ్ఛస్తమనుగచ్ఛామో యత్ర రామ గమిష్యసి. 12

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సర్వాః = సమస్తమైన, ప్రకృతయః = ప్రకృతులు, రామమ్ = రాముణ్ణి గూర్చి, వచనమ్ = వచనమును, ఆబ్రువన్ = పలికిరి. రామ = రామా ! యత్ర = ఎచ్చటికి, గమిష్యసి = వెళ్ళగలవో, గచ్ఛన్తమ్ = వెళ్ళుచున్న నిన్ను, అనుగచ్ఛామః = అనుసరించి వెళ్ళెదము.

తా. అప్పుడు ఆ ప్రకృతు లందరూ రామునితో ఇట్లు పలికిరి. "రామా ! నీవు ఎక్కడికి వెళ్ళెదవో అక్కడికి మేము నీ వెనుకనే వచ్చెదము." 12

మూ. పౌరేషు యది తే ప్రీతిర్యది స్నేహో హ్యనుత్తమః,
సపుత్రదారాః కాకుత్స్థ సమం గచ్ఛామ సత్పథమ్. 13

ప్ర. అ. కాకుత్స్థ = రామా ! తే = నీకు, పౌరేషు = పౌరులయందు, ప్రీతిః యది = ప్రేమ ఉన్నచో, అనుత్తమః = అత్యుత్తమమైన, స్నేహః = స్నేహమున్నచో, సపుత్రదారాః = పుత్రులతోను, భార్యలతోను కూడిన మేము, సమమ్ = నీతో కూడ, సత్పథమ్ = సన్మార్గమును గూర్చి, గచ్ఛామ = వెళ్ళెదము.

తా. రామా ! నీకు పౌరులమైన మాపై ప్రేమ, అత్యధికమైన స్నేహము ఉన్నచో మేము భార్యాపుత్రాదులతో కలిసి నీతో సన్మార్గమున వెళ్ళెదము. 13

మూ. తపోవనం వా దుర్గం వా నదీమమ్భోనిధిం తథా,
వయం తే యది న త్యాజ్యాః సర్వాన్నో నయ ఈశ్వర.

ప్ర. అ. ఈశ్వర = ప్రభూ ! వయమ్ = మేము, తే = నీకు, న త్యాజ్యాః యది = విడువదగినవారము కానిచో, సర్వాన్ = సమస్తమైన, నః = మమ్ములను, తపోవనం వా = తపోవనమును గూర్చి గాని, దుర్గం వా = దుర్గమును గూర్చి గాని, నదీమ్ = నదిని గూర్చి గాని, తథా = మరియు, అమ్భోనిధిం వా = సముద్రమును గూర్చి గాని, నయ = తీసికొనివెళ్ళుము.

తా. ప్రభూ ! మేము విడిచివేయదగినవారము కాము అని నీ కున్నచో, మమ్ములను అందరినీ తపోవనమునకైనా, దుర్గమునకైనా, నదిలోనికైనా, సముద్రములోనికైనా నీతో తీసికొనివెళ్ళుము. 14

మూ. ఏషా నః పరమా ప్రీతిరేష నః పరమో వరః,
హృద్గతా నః సదా ప్రీతిస్త్వానుగమనే నృప. 15

ప్ర. అ. నృప = రాజా ! ఏషా = ఇదే, నః = మాయొక్క, పరమా = గొప్ప, ప్రీతిః = సంతోషము. ఏషః = ఇదే, నః = మాయొక్క, పరమః = గొప్ప, వరః = వరము, తవ = నీయొక్క, అనుగమనే = అనుసరించి వెళ్ళుటయందే, సదా = ఎల్లప్పుడూ, నః = మాయొక్క, హృద్గతా = హృదయములో ఉన్న, ప్రీతిః = ఆనందము.

తా. రాజా ! ఇదే మా గొప్ప సంతోషము. ఇదే మాకు గొప్ప వరము. నిన్ను అనుసరించి వెళ్ళుట మాకు పరమానందము. 15

మూ. పౌరాణాం దృఢభక్తిం చ బాఢమిత్యేవ సోఽబ్రవీత్,
స్వకృతాన్తం చాన్వవేక్ష్య తస్మిన్నహని రాఘవః. 16

ప్ర. అ. సః = ఆ, రాఘవః = రాముడు, తస్మిన్ = ఆ, అహని = దివసమునందు, పౌరాణామ్ = పౌరులయొక్క, దృఢభక్తిం చ = దృఢమైన భక్తినీ, స్వకృతాన్తం చ = తాను నిర్ణయించిన సిద్ధాంతమును, అన్వవేక్ష్య = చూచి, బాఢమ్ = తప్పక అట్లే, ఇత్యేవ = అని, అబ్రవీత్ = పలికెను.

తా. రాముడు ఆనాడు పౌరుల దృఢభక్తిని, తాను చేసికొన్న కార్య నిర్ణయమును దృష్టిలో పెట్టుకొని "తప్పక అట్లే" అనెను. 16

మూ. కోసలేషు కుశం వీరముత్తరేషు తథా లవమ్,
అభిషిచ్య మహాత్మానావుభౌ రామః కుశీలవౌ. 17

ప్ర. అ. రామః = రాముడు, వీరమ్ = వీరుడైన, కుశమ్ = కుశుణ్ణి, కోసలేషు = దక్షిణకోసలదేశమునందు, తథా = మరియు, లవమ్ = లవుణ్ణి, ఉత్తరేషు = ఉత్తరకోసల దేశమునందు, మహాత్మానౌ = మహాత్ములైన, కుశీలవౌ = కుశీలవులను, ఉభౌ = ఇద్దరినీ, అభిషిచ్య = అభిషేకించి, ప్రయాణము చేయించెను.

తా. రాముడు వీరుడైన కుశుణ్ణి దక్షిణకోసలదేశమునకు రాజు గాను, లవుణ్ణి ఉత్తరకోసలదేశ రాజుగాను అభిషేకించెను. మహాత్ములైన ఆ కుశలవులను ఇద్దరినీ ఇట్లు అభిషిక్తులను చేసి ప్రయాణము చేయించెను. 17.

మూ. అభిషిక్తౌ సుతావజ్ఞ్యా ప్రతిష్ఠాప్య పురే తతః,
పరిష్వజ్య మహాబాహుర్మూర్ధ్న్యుపాఘ్రాయ చాసకృత్.

రథానాం తు సహస్రాణి నాగానామయుతాని చ,
దశ చాశ్వసహస్రాణి ఏకైకస్య ధనం దదౌ. 19

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మహాబాహుః = గొప్ప బాహువులు గల రాముడు, పురే = పురమునందు, అభిషిక్తౌ = అభిషేకించబడిన, సుతౌ = పుత్రులను, అజ్ఞా = ఒడిలో, ప్రతిష్ఠాప్య = కూర్చుండబెట్టుకొని, పరిష్వజ్య = కౌగలించుకొని, ఆపక్వత్ = మాటిమాటికి, మూర్ధ్ని = శిరస్సుపై, ఉపాఘ్రాయ = వాసన చూచి, ఏకైకస్య = ఒక్కొక్కనికి, రథానామ్ = రథములయొక్క, సహస్రాణి = సహస్రములను, నాగానామ్ = ఏనుగులయొక్క, అయుతాని చ = అయుతములను, దశ = పది, అశ్వసహస్రాణి = అశ్వములయొక్క సహస్రములను, ధనమ్ = ధనమునుగా, దదౌ = ఇచ్చెను.

తా. పిమ్మట మహాబాహువైన రాముడు రాజ్యాభిషిక్తులైన పుత్రులను ఒడిలో కూర్చుండబెట్టుకొని కౌగలించుకొని, మాటిమాటికి శిరస్సుపై ఆఘ్రాణించి ముద్దుపెట్టుకొని, వేలకొలది రథములు, ఆయుతముల (10,000) కొలది ఏనుగులు, పది అశ్వసహస్రములు ధనముగా వారి కిచ్చెను. 18, 19

మూ. బహురత్నౌ బహుధనౌ హృష్టపుష్టజనావృతౌ,
స్వే పురే ప్రేషయామాస భ్రాతరౌ తే కుశీలవౌ. 20

ప్ర. అ. బహురత్నౌ = చాల రత్నములు గలవారు, బహుధనౌ = అధికమైన ధనము గలవారు, హృష్టపుష్టజనావృతౌ = సంతోషించిన పరిపుష్టులైన జనులతో కూడినవారు ఆయిన, భ్రాతరౌ = సోదరులైన, తౌ = ఆ, కుశీలవౌ = కుశలవులను, స్వే = తమ, పురే = పురములను గూర్చి, ప్రేషయామాస = పంపెను.

తా. అనేకములైన రత్నములు, అధికమైన ధనమూ గల, ఉత్సాహవంతులు దృఢకాయులు అయిన జనులతో కూడిన, ఆ సోదరులైన కుశలవులను వారి పట్టణములకు పంపెను. 20

మూ. అభిషిచ్య తతో వీరౌ ప్రస్థాప్య స్వపురే తదా,
దూతాన్ సంప్రేషయామాస శత్రుఘ్నాయ మహాత్మనే.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
సప్తోత్తరశతతమః సర్గః.

ప్ర. అ. వీరౌ = వీరులైన, సుతౌ = పుత్రులను, అభిషిచ్య = అభిషేకించి, తతః = అటుపిమ్మట, స్వపురే = తమ పురములను గూర్చి, ప్రస్థాప్య = ప్రయాణముచేయించి, తదా = అప్పుడు, మహాత్మనే = మహాత్ముడైన, శత్రుఘ్నాయ = శత్రుఘ్నునికొరకు, దూతాన్ = దూతలను, సంప్రేషయామాస = పంపెను.

తా. వీరులైన కుమారులను రాజ్యాభిషిక్తులను చేసి, వారిని తమ రాజధానులకు పంపి, మహాత్ముడైన శత్రుఘ్నునకు దూతలను పంపెను. 21

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు,
ఉత్తరకాండలో నూటపదవ సర్గ సమాప్తము.

అథ అష్టోత్తరశతతమః సర్గః

[సోదరులతోను, వానరులతోను, భల్లూకములతోను కలిసి వరమ ధామమునకు వెళ్ళవలె నని రాముడు నిశ్చయించుకొనుట. మీరు భూలోకమునందే ఉండుడు అని విభీషణ-హనుమత్-జాంబవత్-మైంద-ద్వివిదులను ఆజ్ఞాపించుట.]

మూ. తే దూతా రామవాక్యేన చోదితా లఘువిక్రమాః,
ప్రజగ్ముర్మధురాం శీఘ్రం చక్రుర్వాసం న చాధ్వని. 1

ప్ర. అ రామవాక్యేన = రామునివాక్యముచేత, చోదితాః = ప్రేరేపించబడిన, లఘువిక్రమాః = శీఘ్రగమనము గల, తే దూతాః = ఆ దూతలు, శీఘ్రమ్ = శీఘ్రముగా, మధురామ్ = మధురను గూర్చి, ప్రజగ్ముః = వెళ్ళిరి. అధ్వని = మార్గమునందు, వాసమ్ = నివాసమును, న చ చక్రుః = చేయలేదు.

తా. రామునిచే ఆజ్ఞాపించబడిన శీఘ్రగమనము గల ఆ దూతలు శీఘ్రముగ, మార్గమధ్యమునందు ఆగకుండగా మధురకు వెళ్ళిరి. 1

మూ. తతస్త్రిభిరహోరాత్రైః సంప్రాప్య మధురామథ,
శత్రుఘ్నాయ యథాతత్త్వమాచఖ్యుః సర్వమేవ తత్. 2

ప్ర. అ. త్రిభిః = మూడు, అహోరాత్రైః = అహోరాత్రములచేత, మధురామ్ = మధురను, సంప్రాప్య = చేరి, అథ = పిమ్మట, తత్ = దానిని, సర్వమేవ = అంతనూ, యథాతత్త్వమ్ = యథార్థముగా, శత్రుఘ్నాయ = శత్రుఘ్నునకు, ఆచఖ్యుః = చెప్పిరి.

తా. వాళ్ళు మూడు పగళ్ళు మూడు రాత్రుళ్ళు ప్రయాణము చేసి మధుర చేరి, జరిగిన విషయమును యథాతథముగా శత్రుఘ్నునకు తెలిపిరి. 2

మూ. లక్ష్మణస్య పరిత్యాగం ప్రతిజ్ఞాం రాఘవస్య చ,
పుత్రయోరభిషేకం చ పౌరానుగమనం తథా. 3

ప్ర. అ. లక్ష్మణస్య = లక్ష్మణునియొక్క, పరిత్యాగమ్ = పరిత్యాగమును, రాఘవస్య = రామునియొక్క, ప్రతిజ్ఞామ్ = ప్రతిజ్ఞను, పుత్రయోః = పుత్రుల యొక్క, అభిషేకం చ = అభిషేకమును, తథా = మరియు, పౌరానుగమనమ్ = పౌరుల అనుగమనమును (తెలిపిరి).

తా. రాముని ప్రతిజ్ఞను, రాముడు లక్ష్మణుణ్ణి విడిచివేయుటను, కుశలవుల అభిషేకమును, పౌరులు రాముని వెంట వెళ్ళుటకు సంకల్పించుటను తెలిపిరి. 3

మూ. కుశస్య నగరీ రమ్యా విన్ధ్యపర్వతరోధసి,
కుశావతీతి నామ్నా సా కృతా రామేణ ధీమతా. 4

ప్ర. అ. ధీమతా = బుద్ధిమంతుడైన, రామేణ = రామునిచేత, విన్ధ్యపర్వత రోధసి = వింధ్యపర్వతప్రాంతమునందు, కుశావతీతి = కుశావతి అను, నామ్నా = పేరుతో, రమ్యా = సుందరమైన, కుశస్య = కుశునియొక్క, సా = ఆ, నగరీ = నగరము, కృతా = చేయబడినది.

తా. ధీమంతుడైన రాముడు కుశునికొరకు వింధ్యపర్వతసమీపమునందు కుశావతి అను నగరమును నిర్మించెను (అని చెప్పిరి). 4

మూ. శ్రావస్తీతి పురీ రమ్యా శ్రావితా చ లవస్య హ,
అయోధ్యాం విజనాం కృత్వా రాఘవో భరతస్తథా, 5
స్వర్గస్య గమనోద్యోగం కృతవన్తౌ మహారథౌ.

ప్ర. అ. లవస్య = లవునియొక్క, రమ్యా = సుందరమైన, శ్రావస్తీతి = శ్రావస్తి అను, పురీ = పట్టణము, శ్రావితా = ప్రసిద్ధము చేయబడినది. రాఘవః = రాముడు, తథా = మఱియు, భరతః = భరతుడు, అయోధ్యామ్ = అయోధ్యను, విజనామ్ = జనశూన్య మైనదానినిగా, కృత్వా = చేసి, మహారథౌ = మహారథులైన వారిద్దరూ కూడ, స్వర్గస్య = స్వర్గముయొక్క, గమనోద్యోగమ్ = గమనమునకు ప్రయత్నమును, కృతవన్తౌ = చేసినారు.

తా. లవునికొరకు రమ్యమైన పురము నిర్మించబడినది దానికి శ్రావస్తి అను పేరు ప్రసిద్ధము చేయబడినది. మహారథులైన రాముడు, భరతుడు అయోధ్యను జనశూన్యము చేసి స్వర్గమునకు వెళ్ళుటకు ప్రయత్నము చేయుచున్నారు. 5

మూ. ఏవం సర్వం నివేద్యాశు శత్రుఘ్నాయ మహాత్మనే, 6
విరేమురే తతో దూతా స్త్వర రాజేతి చాబ్రువన్.

ప్ర. అ. తే = ఆ, దూతాః = దూతలు, మహాత్మనే = మహాత్ముడైన, శత్రుఘ్నాయ = శత్రుఘ్నునకు, ఏవమ్ = ఇట్లు, సర్వమ్ = సమస్తమును, ఆశు = శీఘ్రముగా, నివేద్య = తెలిపి, విరేమురః = విరమించిరి. రాజ = రాజా ! త్వర = తొందరపడుము, ఇతి చ = అని కూడ, అబ్రువన్ = పలికిరి.

తా. ఆ దూతలు మహాత్ముడైన శత్రుఘ్నునకు దానిని అంతా చెప్పి,"రాజా తొందరపడుము" అని కూడ పలికి విరమించిరి. 6

మూ. తచ్ఛ్రుత్వా ఘోరసంకాశం కులక్షయముపస్థితమ్, 7
ప్రకృతీస్తు సమానీయ కాఞ్చనం చ పురోధసమ్,
తేషాం సర్వం యథావృత్తమబ్రవీద్రఘునన్దనః, 8
ఆత్మనశ్చ విపర్యాసం భవిష్యం భ్రాతృభిః సహ.

ప్ర. అ. రఘునన్దనః = శత్రుఘ్నుడు, ఘోరసంకాశమ్ = చాల ఘోరమైన, ఉపస్థితమ్ = సమీపించిన, తత్ = ఆ, కులక్షయమ్ = కులక్షయమును, శ్రుత్వా = విని. ప్రకృతీః=ప్రకృతులను, పురోధసమ్=పురోహితుడైన, కాఞ్చనం చ = కాంచనుణ్ణి, సమానీయ = రప్పించి, తేషామ్ = వారికి, భ్రాతృభిః సహ = తన సోదరులతో కూడ, భవిష్యమ్ = కానున్న, ఆత్మనః = తనయొక్క, విపర్యాసమ్ = ఆపదను, యథావృత్తమ్ = జరిగినది జరిగినట్లుగా, సర్వమ్ = అంతనూ, అబ్రవీత్ = చెప్పెను.

తా. శత్రుఘ్నుడు చాల భయంకరమైన, వచ్చి పడిన ఆ కులక్షయమును గూర్చి విని, ప్రకృతులను, పురోహితుడైన కాంచనుణ్ణి పిలిపించి, వారికి జరిగిన అంత విషయమునూ, సోదరుతో పాటు తనకు రానున్న శరీరత్యాగమును తెలిపెను. 7, 8

మూ. తతః పుత్రద్వయం వీరః సోఽభ్యషిఞ్చన్నరాధిపః, 9
సుబాహుర్మధురాం లేభే శత్రుఘాతీ చ వైదిశమ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, వీరః = వీరుడైన, సః నరాధిపః = ఆ రాజు, పుత్రద్వయమ్ = పుత్రద్వయమును, అభ్యషిఞ్చత్ = అభిషేకించెను. సుబాహుః = సుబాహువు, మధురామ్ = మధురను, లేభే = పొందెను. శత్రుఘాతీ = శత్రుఘాతి, వైదిశమ్ = వైదిశమును పొందెను.

తా. పిమ్మట వీరుడైన ఆ రాజు పుత్రులను ఇద్దరినీ రాజ్యాభిషిక్తులను చేసెను. సుబాహువు మధురను, శత్రుఘాతి వైదిశనగరమును పొందెను. 9

మూ. ద్విధా కృత్వా తు తాం సేనాం మాధురీం పుత్రయోర్ద్వయోః,
ధనం చ యుక్తం కృత్వా వై స్థాపయామాస పార్థివః.

ప్ర. అ. పార్థివః = ఆ రాజు, మాధురీమ్ = మధురకు సంబంధించిన, తామ్ = ఆ, సేనామ్ = సేనను, ద్వయోః = ఇద్దరు, పుత్రయోః = పుత్రులమధ్య, ద్విధా = రెండు భాగములుగా, కృత్వా = చేసి, ధనం చ = ధనమును కూడ, యుక్తమ్ = తగు విధముగా, కృత్వా వై = (రెండు భాగాలుగా)చేసి, స్థాపయామాస = స్థాపించెను.

తా. శత్రుఘ్నుడు మధురలో ఉన్న సైన్యమును, ధనమును రెండు భాగాలుగా చేసి ఇద్దరు కుమారులకు ఇచ్చెను. 10

మూ. సుబాహుం మధురాయాం చ వైదిశే శత్రుఘాతినమ్, 11
యయౌ స్థాప్య తదాయోధ్యాం రథేనైకేన రాఘవః.

ప్ర. అ. సుబాహుమ్ = సుబాహువును, మధురాయాం చ = మధురయందు, శత్రుఘాతినమ్ = శత్రుఘాతిని, వైదిశే = వైదిశమునందు, స్థాప్య = స్థాపించి, రాఘవః = శత్రుఘ్నుడు, ఏకేన = ఒక్క, రథేన = రథము చేత, తదా = అప్పుడు, అయోధ్యామ్ = అయోధ్యను గూర్చి, యయౌ = వెళ్లెను.

తా. శత్రుఘ్నుడు సుబాహువును మధురయందు, శత్రుఘాతిని వైదిశమునందు స్థాపించి ఒక్క రథముతో అయోధ్యకు వెళ్లెను. 11

మూ. స దదర్శ మహాత్మానం జ్వలన్తమివ పావకమ్, 12
సూక్ష్మక్షౌమామ్బరధరం మునిభిః సార్ధమక్షయైఃం.

ప్ర. అ. సః = అతడు, జ్వలన్తమ్ = ప్రజ్వలించుచున్న, పావకమ్ ఇవ = అగ్ని వలె ఉన్న, సూక్ష్మక్షౌమామ్బరధరమ్ = సన్నని పట్టుబట్టలు ధరించిన, అక్షయైఃం = క్షయములేని, మునిభిః సార్ధమ్ = మునులతో కూడ కూర్చున్న, మహాత్మానమ్ = మహాత్ముడైన రాముణ్ణి, దదర్శ = చూచెను.

తా. ఆతడు ప్రజ్వలించుచున్న అగ్ని వలె ఉన్న మహాత్ముడైన రాముణ్ణి చూచెను. తెల్లని, సన్నని పట్టుబట్టలు ధరించి ఉన్న ఆ రాముని దగ్గర చాలమంది మునీశ్వరులు కూర్చుండిరి. 12

మూ. సోఽభివాద్య తతో రామం ప్రాఞ్జలిః ప్రయతేన్ద్రియఃం 13
ఉవాచ వాక్యం ధర్మజ్ఞం ధర్మమేవానుచిన్తయన్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సః = అతడు, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, ప్రయతేన్ద్రియఃం = నిగ్రహించబడిన ఇంద్రియములు కలవాడై, రామమ్ = రాముణ్ణి, అభివాద్య = నమస్కరించి, ధర్మజ్ఞమ్ = ధర్మమును ఎరిగిన అతనిని గూర్చి, ధర్మమ్ ఏవ = ధర్మమునే, అనుచిన్తయన్ = ఆలోచించుచు, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. పిమ్మట శత్రుఘ్నుడు ధర్మముల నెరిగిన ఆ రామునకు అభివాదనము చేసి, అంజలి ఘటించి, ఇంద్రియ నిగ్రహవంతుడై, ధర్మమును ఆలోచించుచు ఇట్లు పలికెను. 13

మూ. కృత్వాభిషేకం సుతయోర్ద్వయో రాఘవనన్దన, 14
తవానుగమనే రాజన్విద్ధి మాం కృతనిశ్చయమ్.

ప్ర. అ. రాఘవనన్దన = రామా! రాజన్ = రాజా! ద్వయోఃం = ఇద్దరు, సుతయోఃం = కుమారులకు, అభిషేకమ్ = అభిషేకముకు, కృత్వా = చేసి, మామ్ = నన్ను, తవ = నీయొక్క, అనుగమనే = అనుగమనమునందు, కృతనిశ్చయమ్ = చేయబడిన నిశ్చయము కలవానినిగా, విద్ధి = తెలుసుకొనుము.

తా. రాజా ! రామా ! నా కుమారు లిద్దరికి రాజ్యాభిషేకము చేసి వచ్చి నాను. ఇప్పుడు నిన్ను ఆనుసరించి వచ్చుటకు నిశ్చయించుకొని ఉన్నాను. 14

మూ. న చాన్యదద్య వక్తవ్యమతో వీర న శాసనమ్, 15
విహన్యమానమిచ్ఛామి మద్విధేన విశేషతః.

ప్ర. అ. వీర = వీరుడా ! అద్య = ఇప్పుడు, అతః = దానికంటె, అన్యత్ = అన్యము ఏదీ, న వక్తవ్యమ్ = చెప్పదగినది కాదు. శాసనమ్ = నీ ఆజ్ఞను, విహన్యమానమ్ = విహతము కలిగించబడినదానినిగా, విశేషతః = విశేషించి, మద్విధేన = నావంటివానిచేత, న ఇచ్ఛామి = ఇచ్ఛయించను.

తా. వీరుడా ఇప్పుడు దీనికి భిన్నముగ ఏమీ చెప్పకుము: నీ ఆజ్ఞ తిరస్కరింపబడుటను, విశేషించి నావంటివానిచే తిరస్కరింపబడుటను, నేను ఇచ్ఛగింపను. 15

మూ. తస్య తాం బుద్ధిమక్లీబాం విజ్ఞాయ రఘునన్దనః, 16
బాఢమిత్యేవ శత్రుఘ్నం రామో వాక్యమువాచ హ.

ప్ర. అ. రఘునన్దనః = రఘువంశీయులకు ఆనందకరుడైన, రామః = రాముడు, తస్య = ఆతనియొక్క, అక్లీబామ్ = దుర్బలము కాని, తామ్ = ఆ, బుద్ధిమ్ = బుద్ధిని, విజ్ఞాయ = తెలిసికొని, శత్రుఘ్నమ్ = శత్రుఘ్నుణ్ణి గూర్చి, బాఢత్ ఇత్యేవ = తప్పక అట్లే అని, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. రాముడు శత్రుఘ్నుని ఆ దృఢనిశ్చయమును చూచి "తప్పక అట్లే" అని పలికెను.

మూ. తస్య వాక్యస్య చాథాన్తే వానరాః కామరూపిణః, 17
ఋక్షరాక్షససంఘాశ్చ సమాపేతురనేకశః.

ప్ర. అ. "(తస్య వాక్యస్య వాక్యాన్తే" అను పాఠమునకు బదులు పై ప్రాచ్యపాఠము తీసికొనబడినది). అథ = అటుపిమ్మట తస్య వాక్యస్య = ఆ వాక్యము యొక్క. అన్తే = అంతమునందు, కామరూపిణః = స్వేచ్ఛానుసారము రూపములు గల, వానరాః = వానరులు, ఋక్ష రాక్షససంఘాః చ = భల్లూక రాక్షససముదాయములు, అనేకశః = అనేకమార్గమునుండి, సమాపేతుః = వచ్చిదిగిరి.

తా. ఈ మాటలు జరుగుచుండగా స్వేచ్ఛారూపధారులైన వానరులు, భల్లూకములు, రాక్షసులు అనేకమార్గములనుండి గుంపు గుంపులుగా వచ్చిరి 17

మూ. సుగ్రీవం తే పురస్కృత్య సర్వ ఏవ సమాగతాః,
తం రామం ద్రష్టుమనసః స్వర్గాయాభిముఖం స్థితమ్. 18

ప్ర. అ. తే = ఆ, సర్వే ఏవ = అందరూ. స్వర్గాయ = స్వర్గముకొరకు, అభిముఖమ్ = అభిముఖుడుగా, స్థితమ్ = ఉన్న, తం రామమ్ = ఆ రాముణ్ణి, ద్రష్టుమనసః = చూడవలె ననుమనస్సు కలవారై, సుగ్రీవమ్ = సుగ్రీవుణ్ణి, పురస్కృత్య = ముందు ఉంచుకొని, సమాగతాః = వచ్చినారు.

తా. ఆ వానరులందరు సుగ్రీవుణ్ణి ముందు ఉంచుకొని. స్వర్గగమనాభిముఖుడై ఉన్న రాముణ్ణి చూడవలె ననుకోరికతో వచ్చిరి. 18

మూ. దేవపుత్రా ఋషిసుతా గన్ధర్వాణాం సుతాస్తథా, 19
రామక్షయం విదిత్వా తే సర్వ ఏవ సమాగతాః.

ప్ర. అ. రామక్షయమ్ = రాముని క్షయమును, విదిత్వా = తెలిసికొని, దేవపుత్రాః = దేవతల పుత్రులు. ఋషిసుతాః = ఋషుల పుత్రులు. తథా = మరియు, గన్ధర్వాణామ్ = గంధర్వులయొక్క, సుతాః = పుత్రులూ అయిన, తే సర్వే ఏవ = ఆ వానరులందరు, సమాగతాః = వచ్చినారు.

తా. రాముని క్షయమును గూర్చి తెలిసిన, దేవతల పుత్రులు, ఋషుల పుత్రులు, గంధర్వుల పుత్రులూ అయిన ఆ వానరు లందరూ వచ్చిరి 19

మూ. తే రామమభివాద్యోచుః సర్వే వానరరాక్షసాః, 20
తవానుగమనే రాజన్ సంప్రాప్తాః స్మ సమాగతాః.

ప్ర. అ. సర్వే = సమస్తమైన, తే = ఆ, వానరరాక్షసాః = వానరులు రాక్షసులు, రామమ్ = రాముణ్ణి, అభివాద్య = నమస్కరించి, ఊచుః = పలికిరి. రాజన్ = రాజా! సమాగతాః = కలిసిన మేము. తవ = నీయొక్క, అనుగమనే = అనుగమనమునిమిత్తము, సంప్రాప్తాః స్మ = వచ్చినాము.

తా. ఆ వానర రాక్షసు లందరూ రామునకు నమస్కరించి ఇట్లు పలికిరి— "రాజా ! మేమందరమూ కలిసి నీ వెనుకనే వచ్చుటకు వచ్చినాము". 20

మూ. యది రామ వినాస్మాభిర్గచ్ఛేస్త్వం పురుషోత్తమ, 21
యమదణ్డమివోద్యమ్య త్వయా స్మ వినిపాతితాః.

ప్ర అ. పురుషోత్తమ = పురుషశ్రేష్ఠుడా! రామ = రామా! అస్మాభిః = వినా = మేము లేకుండగా, గచ్ఛేః యది = నీవు వెళ్ళినట్లయితే, త్వయా = నీచేత, యమదణ్డమ్ = యమదండమును, ఉద్యమ్య = ఎత్తి, వినిపాతితాః ఇవ = పడగొట్ట బడిన వారము వలె, స్మ = అగుదుము.

తా. పురుషోత్తమా ! రామా ! మేము నీవెంట రాకుండగా నీవు వెళ్ళినచో యమదండము ప్రయోగించి మమ్ములను చంపివేసి నట్లు అగును. 21

మూ. ఏతస్మిన్తరే రామం సుగ్రీవోఽపి మహాబలః 22
ప్రణమ్య విధివద్వీరం విజ్ఞాపయితుముద్యతః.

ప్ర. అ. ఏతస్మిన్ అన్తరే = ఇంతలో, మహాబలః = గొప్ప బలము గల, సుగ్రీవః అపి = సుగ్రీవుడు కూడ, వీరమ్ = వీరుడైన, రామమ్ = రామున్ని, విధివత్ = యథాశాస్త్రముగా, ప్రణమ్య = నమస్కరించి, విజ్ఞాపయితుమ్ = విజ్ఞాపన చేయుటకు, ఉద్యతః = ఉద్యుక్తుడయ్యెను.

తా. ఇంతలో మహాబలిశాలియైన సుగ్రీవుడు కూడ. రామునకు యథావిధిగా నమస్కరించి, ఆవీరునితో ఇట్లు విన్నవించుటకు ఉపక్రమించెను. 22

మూ. అభిషిచ్యాఙ్గదం వీరమాగతోఽస్మి నరేశ్వర 23
తవానుగమనే రాజన్విద్ధి మాం కృతనిశ్చయమ్.

ప్ర. అ. నరేశ్వర = రాజా ! వీరమ్ = వీరుడైన, అఙ్గదమ్ = ఆంగదుణ్ణి, అభిషిచ్య = అభిషేకించి, ఆగతః అస్మి = వచ్చినాను. రాజన్ = రాజా! తవ = నీయొక్క, అనుగమనే = అనుగమనమునందు, మామ్ = నన్ను, కృతనిశ్చయమ్ = చేయబడిన నిశ్చయము కలవానినిగా, విద్ధి = తెలుసుకొనుము.

తా. రాజా ! నేను వీరుడైన అంగదునకు రాజ్యాభిషేకము చేసి వచ్చినాను. నిన్ను అనుసరించి వెళ్ళుటకై దృఢ నిశ్చయముతో ఉన్నాను. 23

మూ. తస్య తద్వచనం శ్రుత్వా రామో రమయతాం వరః, 24
వానరేన్ద్ర మథోవాచ మైత్రం తస్యానుచిన్తయన్.

ప్ర. అ. రమయతామ్ = ఆనందింపచేయువారితో, వరః = శ్రేష్ఠుడైన, రామః = రాముడు, తస్య = అతనియొక్క తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, తస్య = ఆతనియొక్క, మైత్రమ్ = మిత్రత్వమును, అనుచిన్తయన్ = ఆలోచించుచు, అథ = ఆటుపిమ్మట, వానరేన్ద్రమ్ = సుగ్రీవుణ్ణి గూర్చి, ఉవాచ = పలికెను..

తా. ఆనందింపచేయువారిలో శ్రేష్ఠుడైన రాముడు ఆ సుగ్రీవుని మాటలు విని, అతని మైత్రీ భావమును స్మరించుచు ఇట్లు పలికెను 24

మూ. సఖే శృణుష్వ సుగ్రీవ న త్వయాహం వినాకృతః, 25
గచ్ఛేయం దేవలోకం వా పరమం వా పదం మహత్.

ప్ర. అ. సఖే = మిత్రుడా ! సుగ్రీవ = సుగ్రీవా ! శృణుష్వ = వినుము. అహమ్ = నేను, త్వయా = నీతో, వినాకృతః = దూరముచేయ బడినవాడనై, దేవలోకం వా = దేవలోకమును గూర్చి గాని, మహత్ = గొప్పదైన, పరమం పదం వా = పరమపదమును గూర్చి గాని. న గచ్ఛేయమ్ = వెళ్లను.

తా. మిత్రుడా ! సుగ్రీవా ! వినుము, నీవు ప్రక్కన లేకుండా నేను స్వర్గలోకమునకు గాని పరమపదమునకు గాని వెళ్ళను. (ఈ శ్లోకము, పై శ్లోకము చాలా ప్రతులలో లేవు.) 25

మూ. తైరేవముక్తః కాకుత్స్థో బాఢమిత్యబ్రవీత్ స్మయన్, 26
విభీషణమథోవాచ రాక్షసేన్ద్రం మహాయశాః.

ప్ర. అ. తైః = వాళ్ళచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలుకబడిన, కాకుత్స్థః = రాముడు, స్మయన్ = నవ్వుచు, బాఢమ్ ఇత్యేవ = తప్పక అట్లే అని, అబ్రవీత్ = పలికెను. మహాయశాః = గొప్ప కీర్తి గల ఆతడు, అథ = ఆటుపిమ్మట రాక్షసేన్ద్రమ్ = రాక్షసరాజైన, విభీషణమ్ = విభీషణుని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. రాముడు వాళ్ళ మాటలు విని, నవ్వుచు, 'తప్పక అట్లే' అని అనెను. పిమ్మట గొప్ప కీర్తి గల ఆ రాముడు రాక్షసేంద్రుడైన విభీషనుతో ఇట్లు పలికెను. 26

మూ. యావత్ ప్రజా ధరిష్యన్తి తావత్త్వం వై విభీషణ, 27
రాక్షసేన్ద్ర మహావీర్య లఙ్కాస్థః స్వం ధరిష్యసి.

ప్ర. అ. రాక్షసేన్ద్ర = రాక్షసరాజా ! మహావీర్య = గొప్ప పరాక్రమము కలవాడా ! విభీషణ = విభీషణా ! ప్రజాః = ప్రజలు, యావత్ = ఎంతవరకు, ధరిష్యన్తి = జీవించగలరో, తావత్ = అంతపరకు, త్వమ్ = నీవు, లఙ్కాస్థః = లంకలో ఉన్నవాడవై, స్వమ్ = తనను, ధరిష్యసి = ప్రాణములతో ఉంచుకొన గలవు.

తా. రాక్షసరాజా ! మహాపరాక్రమవంతుడా ! విభీషణా ! ప్రజలు ఈ భూమిమీద జీవించి ఉన్నంతకాలము నీవు లంకలో జీవించి ఉండగలవు. 27

మూ. యావచ్చన్ద్రశ్చ సూర్యశ్చ యావత్తిష్ఠతి మేదినీ, 28
యావచ్చ మత్కథా లోకే తావద్రాజ్యం తవాస్త్విహ.

ప్ర. అ చన్ద్రః చ = చంద్రుడు, సూర్యః చ = సూర్యుడు, యావత్ = ఎంతవరకు ఉందురో, మేదినీ = భూమి, యావత్ = ఎంతవరకు, తిష్ఠతి = ఉండునో, మత్కథా = నా కథ, లోకే = లోకమునందు, యావచ్చ = ఎంత వరకు ఉండునో, తావత్ = అంతవరకు. ఇహ = ఈ లోకమునందు, తవ రాజ్యమ్ = నీ రాజ్యము, అస్తు = ఉండుగాక !

తా. సూర్యచంద్రులు ఎంతవరకు ఉందురో, భూమి ఎంతవరకు ఉండునో, నా కథ లోకములో ఎంత వరకు వ్యాప్తిలో ఉండునో అంతవరకు నీవు రాజ్యము చేయుదువుగాక. 28

మూ. శాసితశ్చ సఖిత్వేన కార్యం తే మమ శాసనమ్, 29
ప్రజాః సంరక్ష ధర్మేణ నోత్తరం వక్తుమర్హసి.

ప్ర. అ. సఖిత్వేన = స్నేహభావముచేత, శాసితః చ = శాసింపబడు చున్నావు. తే = నీకు, మమ = నాయొక్క, శాసనమ్ = శాసనము, కార్యమ్ = చేయదగినది. ప్రజాః = ప్రజలను, ధర్మేణ = ధర్మముచేత, సంరక్ష = రక్షించుము, ఉత్తరమ్ = ప్రత్యుత్తరమును, వక్తుమ్ = పలుకుటకు, న అర్హసి = తగవు.

తా. స్నేహభావమును పురస్కరించుకొని నిన్ను ఆజ్ఞాపించుచున్నాను. నా ఆజ్ఞ ప్రకారము చేయవలెను. ప్రజలను ధర్మానుసారము రక్షించుము. బదులు చెప్పవద్దు. 29

మూ. కిం చాన్యద్వక్తుమిచ్ఛామి రాక్షసేన్ద్ర మహాబల, 30
ఆరాధయ జగన్నాథమిక్ష్వాకుకులదైవతమ్,
ఆరాధనీయమనిశం దేవైరపి సవాసవైః. 31

ప్ర. అ. మహాబల = గొప్ప బలముగలవాడా! కించ = మరియు, అన్యత్ = మరియొకటి, వక్తుమ్ = చెప్పుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను. ఇక్ష్వాకుకులదైవతమ్ = ఇక్ష్వాకుల కులదేవతయైన, సవాసవైః = ఇంద్రునితో కూడిన, దేవైరపి = దేవతలచేత కూడ, ఆరాధనీయమ్ = ఆరాధింపదగిన, జగన్నాథమ్ = జగన్నాథుని, అనిశమ్ = ఎల్లప్పుడు, ఆరాధయ = ఆరాధించుము.

తా. గొప్ప బలము గల విభీషణా! మరొకవిషయము చెప్ప గోరుచున్నాను. ఇక్ష్వాకుల కులదేవత, ఇంద్రాదిదేవతలచేత కూడ పూజింప బడువాడు అయిన జగన్నాథుణ్ణి ఆరాధించుము. 30, 31

మూ. తథేతి ప్రతిజగ్రాహ రామవాక్యం విభీషణః,
రాజా రాక్షసముఖ్యానాం రాఘవాజ్ఞామనుస్మరన్. 32

ప్ర. అ. రాక్షసముఖ్యానామ్ = రాక్షసనాయకులయొక్క, రాజా = రాజైన, విభీషణః = విభీషణుడు, రాఘవాజ్ఞామ్ = రాముని ఆజ్ఞను, అనుస్మరన్ = స్మరించుచు, రామవాక్యమ్ = రాముని వాక్యమును, తథా = అట్లే, ఇతి = అని, ప్రతిజగ్రాహ = స్వీకరించెను

తా. రాక్షసరాజైన విభీషణుడు రామాజ్ఞను స్మరించుచు రాముని మాటలను "ఆట్లే చేసెదను" అని స్వీకరించెను. 32

మూ. తమేవముక్త్వా కాకుత్స్థో హనుమన్తమథాబ్రవీత్,
జీవితే కృతబుద్ధిస్త్వం మా ప్రతిజ్ఞాం వృథా కృథాః. 33

ప్ర. అ. కాకుత్స్థః = రాముడు, తమ్ = విభీషణుని గూర్చి, ఏవమ్ =

ఇట్లు, ఉక్త్వా = పలికి, అథ = అటుపిమ్మట, హనుమన్తమ్ = హనుమంతుని గూర్చి, అబ్రవీత్ = పలికెను. జీవితే = దీర్ఘజీవితమునందు, కృతబుద్ధిః = చేయ బడిన బుద్ధి గల, త్వమ్ = నీవు, ప్రతిజ్ఞామ్ = ప్రతిజ్ఞను, వృథా = వ్యర్థమునుగా, మా కృథాః = చేయుము.

తా. రాముడు విభీషణునితో ఇట్లు పలికి పిదప హనుమంతునితో కూడ ఇట్లనెను. "జీవితమునందు నిశ్చయము చేసికొనిన నీవు నీ ప్రతిజ్ఞను వ్యర్థము చేయకుము." హనుమంతునకు బ్రహ్మదేవుడు దీర్ఘాయుర్దాయము నిచ్చెను. "రామాయణకథ లోకములో ప్రచారములో ఉన్నంతవరకు నేను దానిని వినుచుందును గాక" అని కోరగా రాముడు ఆ వరమును ఇచ్చెను. అందుచేత దానిని వ్యర్థము చేయక చిరకాలము జీవించు మని భావము. 33

మూ. మత్కథాః ప్రచరిష్యన్తి యావల్లోకే హరీశ్వర,
తావద్రమస్వ సుప్రీతో మద్వాక్యమనుపాలయన్. 34

ప్ర. అ హరీశ్వర = వానరనాయకా! మత్కథాః = నా కథలు, యావత్ = ఎంతవరకు, లోకే = లోకమునందు, ప్రచరిష్యన్తి = ప్రచారములో ఉండునో, తావత్ = అంతవరకు, సుప్రీతః = చాల సంతోషము కలవాడవై, మద్వాక్యమ్ = నా వాక్యమును, అనుపాలయన్ = పాలించుచు, రమస్వ = సుఖముగా ఉండుము.

తా. హనుమంతుడా! నా కథలు లోకములో ప్రచారములో ఉన్నంత వరకు నీవు సంతోషించుచు, నా మాటను మన్నించి సుఖముగా ఉండుము. 34

మూ. ఏవముక్తస్తు హనుమాన్ రాఘవేణ మహాత్మనా,
వాక్యం విజ్ఞాపయామాస పరం హర్షమవాప్య చ. 35

ప్ర. అ. మహాత్మనా = మహాత్ముడైన, రాఘవేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలుకబడిన, హనుమాన్ = హనుమంతుడు, పరమ్ = అధికమైన, హర్షమ్ = సంతోషమును, అవాప్య = పొంది, వాక్యమ్ = వాక్యమును, విజ్ఞాపయామాస చ = విజ్ఞాపన చేసెను.

తా మహాత్ముడైన రాముని మాటలు విని హనుమంతుడు చాల సంతోషించుచు ఇట్లు విజ్ఞాపనచేసెను. 35

మూ. యావత్తవ కథా లోకే విచరిష్యతి పావనీ,
తావత్ స్థాస్యామి మేదిన్యాం తవాజ్ఞామనుపాలయన్. 36

ప్ర. అ. పావనీ = పవిత్రమైన, తవ కథా = నీ కథ, యావత్ = ఎంత వరకు, లోకే = లోకమునందు, ప్రచరిష్యతి = ప్రచారములో ఉండునో, తావత్ = అంతవరకు, తవ = నీయొక్క, ఆజ్ఞామ్ = ఆజ్ఞను, అనుపాలయన్ = పాలించుచు, మెదిన్యామ్ = భూమిమీద, స్థాస్యామి = ఉండగలను.

తా. పవిత్రమైన నీ కథ లోకములో ప్రచారములో ఉన్నంతవరకు నీ ఆజ్ఞను పాలించుచు భూలోకములో ఉండెదను. 36

ఎూ. జామ్బవన్తం తథోక్త్వా తు వృద్ధం బ్రహ్మసుతం తథా,
మైన్దం చ ద్వివిదం చైవ పఞ్చ జామ్బవతా సహ, 37
యావత్కలిశ్చ సంప్రాప్తస్తావజ్జీవత సర్వదా.

ప్ర. అ. వృద్ధమ్ = వృద్ధుడు, బ్రహ్మసుతమ్ = బ్రహ్మపుత్రుడూ అయిన, జామ్బవన్తమ్ = జాంబవంతుని గూర్చి, తథా = అట్లే, ఉక్త్వా = పలికి, మైన్దం చ = మైందుణ్ణి, ద్వివిదం చైవ = ద్వివిదుణ్ణి గూర్చి కూడ, తథా = అట్లు పలికెను. కలిః = కలి, యావత్ = ఎంతవరకు, సంప్రాప్తః = వచ్చునో, తావత్ = అంతవరకు, సర్వదా = ఎల్లప్పుడు, జీవత = జీవించండి అని, జామ్బవతా సహ = జాంబవంతునితో కూడ, పఞ్చ = ఐదుగురిని గూర్చి పలికెను.

తా. వృద్ధుడు, బ్రహ్మపుత్రుడూ అయిన జాంబవంతునితో కూడ అట్లే చెప్పి. మైందద్వివిదులకు కూడ ఆ విధముగనే చెప్పెను. ఈ విధముగ "కలి యుగము వచ్చువరకు మీరు జీవించి ఉండుడు" అని జాంబవంతునితో సహా ఐదుగురిని ఆదేశించెను. 37

మూ. తథైవముక్త్వా కాకుత్స్థః సర్వాంస్తాన్ఋక్షవానరాన్,
ఉవాచ బాఢం గచ్ఛధ్వం మయా సార్ధం యథోదితమ్. 38

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
అష్టోత్తరశతతమః సర్గః.

ప్ర. ఆ. కాకుత్స్థః = రాముడు, తథా = ఆ ప్రకారము, ఉక్త్వా = పలికి, సర్వాన్ = సమస్తమైన, తాన్ = ఆ, ఋక్షవానరాన్ = భల్లూకములను వానరులను గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉవాచ = పలికెను. యథోదితమ్ = చెప్పినట్లుగా, మయా సార్ధమ్ = నాతో కూడ, బాఢమ్ = నిశ్చయముగ, గచ్ఛధ్వమ్ = నడవండి.

తా. రాముడు వారితో (విభీషణాదులతో) ఆ విధముగా చెప్పి ఋక్షవానరు లందరితోను "నేను ముందుగానే చెప్పిన విధముగ తప్పక నాతో రండి" అని పలికెను. 38

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో నూట ఎనిమిదవ సర్గ సమాప్తము.

అథ నవాధికశతతమః సర్గః

[పరమధామమును చేరుటకై బయలుదేరిన రామునితో అయోధ్యా వాసు లందరూ కూడ బయలుదేరుట.]

మూ. ప్రభాతాయాం తు శర్వర్యాం పృథువక్షా మహాయశాః,
రామః కమలపత్రాక్షః పురోధసమథాబ్రవీత్. 1

ప్ర. ఆ. అథ=పిమ్మట, శర్వర్యామ్= రాత్రి, ప్రభాతాయామ్= తెల్ల వారినదగుచుండగా, పృథువక్షాః=విశాలమైన వక్షఃస్థలము కలవాడు, మహాయశాః =గొప్ప కీర్తి కలవాడు, కమలపత్రాక్షః= కమలపత్రముల వంటి నేత్రములు కలవాడూ అయిన, రామః= రాముడు, పురోధసమ్ = పురోహితుణ్ణి గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట రాత్రి తెల్లవారగానే విశాలమైన వక్షఃస్థలము, గొప్ప కీర్తి, కమలపత్రముల వంటి నేత్రములూ గల రాముడు పురోహితునితో ఇట్లనెను. 1

మూ. అగ్నిహోత్రం ప్రజత్వగ్రే దీప్యమానం సహ ద్విజైః,
వాజపేయాతపత్రం చ శోభమానం మహాపథే. 2

ప్ర. ఆ. దీప్యమానమ్=మండుచున్న, అగ్నిహోత్రమ్=అగ్నిహోత్రము, ద్విజైః సహ = బ్రాహ్మణులతో కూడ, అగ్రే = ముందు, ప్రజతు = వెళ్లుగాక. శోభమానమ్ = శోభించుచున్న, వాజపేయాతపత్రం చ = వాజపేయాతపత్రము కూడ, మహాపథే = రాజమార్గమునందు వెళ్ళుగాక.

తా. ప్రజ్వలించుచున్న అగ్నిహోత్రాగ్ని బ్రాహ్మణులతో కూడ ముందు వెళ్ళుగాక. శోభించుచున్న వాజపేయచ్ఛత్రము కూడ సాకేత రాజమార్గమునందు వెళ్ళుగాక. (వాజపేయ యాగము చేసినవారు మాత్రమే గౌరవసూచకంగా ధరించు ఛత్రము వాజపేయాతపత్రము). 2

మూ. తతో వసిష్ఠస్తేజస్వీ సర్వం నిరవశేషతః,
చకార విధివద్ధర్మం మహాప్రాస్థానికం విధిమ్. 3

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తేజస్వీ = తేజఃశాలియైన, వసిష్ఠః = వసిష్ఠుడు, ధర్మమ్ = ధర్మమును, మహాప్రాస్థానికమ్ = మహాప్రస్థానమునకు సంబంధించిన, విధిమ్ = విధిని, సర్వమ్ = అంతనూ, విధివత్ = యథాశాస్త్రముగా, నిరవశేషతః = నిఃశేషముగా, చకార = చేసెను.

తా. పిమ్మట తేజఃశాలియైన వసిష్ఠుడు మహాప్రస్థానమునకు సంబంధించిన విధిని అంతనూ యథాశాస్త్రముగా, పూర్తిగా చేసెను. 3

మూ. తతః సూక్ష్మాంబరధరో బ్రహ్మావర్తయన్ పరమ్,
కుశాన్ గృహీత్వా పాణిభ్యాం సరయూం ప్రయయావథ. 4

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సూక్ష్మాంబరధరః = సన్నని వస్త్రము ధరించినవాడై, పరం బ్రహ్మమ్ = పరబ్రహ్మను, ఆవర్తయన్ = స్మరించుచు, పాణిభ్యామ్ = హస్తములచేత, కుశాన్ = కుశలను, గృహీత్వా = గ్రహించి, అథ = అటుపిమ్మట, సరయూమ్ = సయూనదిని గూర్చి, ప్రయయౌ = వెళ్లెను.

తా. పిమ్మట రాముడు సూక్ష్మవస్త్రములు ధరించి, పరబ్రహ్మను ధ్యానించుచు, చేతులలో దర్భలు గ్రహించి, సరయూనదికి వెళ్లెను. 4

మూ. అవ్యాహరన్ క్వచిత్ కించిన్నిశ్చేష్టో నిఃసుఖః పథి,
నిర్జగామ గృహాత్తస్మాద్దీప్యమానో యథాంశుమాన్. 5

ప్ర. అ. పథి = మార్గమునందు, క్వచిత్ = ఎక్కడా కూడ, కించిత్ = ఏమీ కూడ, అవ్యాహరన్ = మాటలాడనివాడై, నిశ్చేష్టః = చేష్టలులేనివాడై, నిఃసుఖః = సుఖము లేనివాడై, దీప్యమానః = ప్రకాశించుచున్న, అంశుమాన్ యథా = సూర్యుడు వలె, తస్మాత్ = ఆ, గృహాత్ = గృహమునుండి, నిర్జగామ = బయలుదేరెను.

తా. మార్గమునందు ఎక్కడా ఏమీ మాటలాడక, నడక తప్ప ఇతర చేష్టలేవీ లేనివాడై. సుఖదృష్టి లేనివాడై, ప్రకాశించుచున్న సూర్యుడు వలె, ఆ గృహమునుండి బయలుదేరెను. 5

మూ. రామస్య దక్షిణే పార్శ్వే పద్మా శ్రీః సముపస్థితా,
సవ్యేఽపి చ మహీ దేవీ వ్యవసాయస్తథాగ్రతః. 6

ప్ర. అ. రామస్య=రామునియొక్క, దక్షిణే పార్శ్వే=కుడిప్రక్క, పద్మా =పద్మము గల, శ్రీః=లక్ష్మి, సముపస్థితా=వచ్చినది. సవ్యేఽపి=ఎడమ పార్శ్వమునందు, మహీ దేవీ=భూదేవి, తథా=మరియు, వ్యవసాయః=వ్యవసాయ శక్తి (సంహారశక్తి), అగ్రతః=ఎదుట ఉండెను.

తా. అప్పుడు రాముని కుడి ప్రక్క పద్మహస్తయైన లక్ష్మి, ఎడమప్రక్క భూదేవి, ఎదుటి భాగమునందు వ్యవసాయశక్తి (సంహారశక్తి) నడచుచుండెను. 6

మూ. శరా నానావిధాశ్చాపి ధనురాయతముత్తమమ్,
తథాయుధాశ్చ తే సర్వే యయుః పురుషవిగ్రహాః. 7

ప్ర. అ. నానావిధాః=అనేకవిధములైన, శరాః=బాణములు, ఆయతమ్ =దీర్ఘమైన, ఉత్తమమ్=ఉత్తమమైన, ధనుః=ధనస్సు, తథా=మరియు, సర్వే =సమస్తమైన, ఆయుధాః చ=ఆయుధములు, పురుషవిగ్రహాః=పురుషరూప ములు గలవై, యయుః=వెళ్ళినవి.

తా. అనేకవిధములైన బాణములు, పొడవైన ఉత్తమమైన ధనస్సు, సమస్త ఆయుధములు అన్నీ కూడ పురుషరూపము ధరించి రాముని వెనుక వెళ్ళినవి. 7

మూ. వేదా బ్రాహ్మణరూపేణ గాయత్రీ సర్వరక్షిణీ,
ఓంకారోఽథ వషట్కారః సర్వే రామమనువ్రతాః. 8

ప్ర. అ. వేదాః=వేదములు, సర్వరక్షిణీ=సర్వమును రక్షించు, గాయత్రీ =గాయత్రి, ఓంకారః=ఓంకారము, అథ=మరియు, వషట్కారః=వష ట్కారము, సర్వే=అందరూ కూడ, బ్రాహ్మణరూపేణ=బ్రాహ్మణరూపముతో, రామమ్=రాముణ్ణి, అనువ్రతాః=అనుసరించి వెళ్ళిరి.

తా. వేదములు, సర్వరక్షకురాలైన గాయత్రి, ఓంకారము, వషట్కా రము అందరూ కూడ బ్రాహ్మణరూపములలో రాముణ్ణి అనుసరించి వెళ్ళిరి. 8

మూ. ఋషయశ్చ మహాత్మానః సర్వ ఏవ మహీసురాః,
అన్వగచ్ఛన్మహాత్మానం స్వర్గద్వారమపావృతమ్. 9

ప్ర. అ. మహాత్మానః = మహత్ములైన, ఋషయః చ = ఋషులు, సర్వే = సమస్తమైన, మహీసురాః = బ్రాహ్మణులు, అపావృతమ్ = తెరవబడిన, స్వర్గ ద్వారమ్ = స్వర్గద్వారమును గూర్చి, మహాత్మానమ్ = మహాత్ముడైన రాముణ్ణి, అన్వగచ్ఛన్ = అనుసరించి వెళ్ళిరి.

తా. మహాత్ములైన ఋషులు, సమస్తమైన బ్రాహ్మణులు, తెరవబడిన స్వర్గ ద్వారమును గూర్చి, ఆ రాముణ్ణి అనుసరించి వెళ్ళిరి. 9

మూ. తం యాన్తమనుగచ్ఛన్తి హ్యన్తఃపురచరాః స్త్రియః,
సవృద్ధబాలదాసీకాః సవర్షవరకింకరాః. 10

ప్ర. అ. సవృద్ధబాలదాసీకాః = వృద్ధులైన దాసీలతోను, బాలలైన దాసీల తోను కూడిన, సవర్షవరకింకరాః = కంచుకులతోను కింకరులతోను కూడిన, అన్తఃపురచరాః = అంతఃపురమునందు సంచరించు, స్త్రియః = స్త్రీలు, యాన్తమ్ = వెళ్లుచున్న, తమ్ = ఆ రాముణ్ణి, అనుయాన్తి = అనుసరించి వెళ్ళిరి.

తా. అంతఃపురస్త్రీలు, వృద్ధదాసీలు, బాలదాసీలు, కంచుకులు, కింకరులు రాముని వెనుక వెళ్ళిరి. 10

మూ. సాన్తఃపురశ్చ భరతః శత్రుఘ్నసహితో యయౌ,
రామం గతిముపాగమ్య సాగ్నిహోత్రమనువ్రతాః. 11

ప్ర. అ. సాన్తఃపురః = అంతఃపురముతో కూడిన, భరతః = భరతుడు, శత్రుఘ్నసహితః = శత్రుఘ్నునితో కూడినవాడై, యయౌ = వెళ్ళెను. సాగ్ని హోత్రమ్ = అగ్నిహోత్రముతో కూడిన, రామమ్ = రాముణ్ణి, గతిమ్ = గతినిగా, ఉపాగమ్య = పొంది, అనువ్రతాః = అనుసరించుచున్నవారై (వెళ్ళిరి).

తా. భరతుడు అంతపురముతోను, శత్రఘ్నునితోను కలిసి వెళ్ళెను. వారందరూ అగ్నిహోత్రాగ్నితో కూడిన రాముణ్ణి గతిగా పొంది ఆతనిని అనుస రించిరి. 11

మూ. తే చ సర్వే మహాత్మానః సాగ్నిహోత్రాః సమాగతాః,
సపుత్రదారాః కాకుత్స్థమనుజగ్ముర్మహామతిమ్. 12

ప్ర. అ. సాగ్నిహోత్రాః = అగ్నిహోత్రాగ్నిసహితులై, సమాగతాః = వచ్చిన, సర్వే = సమస్తమైన, తే మహాత్మానః = ఆ మహాత్ములు, సపుత్రదారాః = భార్యాపుత్రులతో కూడినవారై, మహామతిమ్ = గొప్ప బుద్ధి గల ఆ రాముణ్ణి, అనుజగ్ముః = అనుసరించివెళ్ళిరి.

తా. తమ తమ అగ్నిహోత్రాగ్నులను తీసికొని వచ్చిన ఆ మహాత్ములందరూ, భార్యాపుత్రసహితులై రాముణ్ణి అనుసరించి వెళ్ళిరి. 12

మూ. మన్త్రిణో భృత్యవర్గాశ్చ సపుత్రపశుబాన్ధవాః,
సర్వే సహానుగా రామమన్వగచ్ఛన్ ప్రహృష్టవత్. 13

ప్ర. అ. మన్త్రిణః = మంత్రులు, సపుత్రపశుబాన్ధవాః = పుత్రపశుబంధువులతో కూడిన, భృత్యవర్గాః చ = భృత్యసముదాయములు, సర్వే = అందరూ, సహానుగాః = అనుచరులతో కూడినవారై, ప్రహృష్టవత్ = సంతోషించుచు, రామమ్ = రాముణ్ణి, అన్వగచ్ఛన్ = అనుసరించిరి.

తా. మంత్రులు, పుత్రపశుబంధుసహితులైన భృత్యులు అందరూ కూడ తమ అనుచరులతో కూడ సంతోషముతో రాముని వెనుక వెళ్ళిరి. 13

మూ. తతః సర్వాః ప్రకృతయో హృష్టపుష్టజనావృతాః,
గచ్ఛన్తమనుగచ్ఛన్తి రాఘవం గుణరఞ్జితాః. 14

ప్ర. అ తతః = అటుపిమ్మట, హృష్టపుష్టజనావృతాః = సంతోషించుచున్న, ఆరోగ్యవంతులైన జనులతో కూడిన, సర్వాః = సమస్తమైన, ప్రకృతయః = ప్రజలు, గుణరఞ్జితాః = రాముని సద్గుణములచేత రంజిపచేయబడినవారై, గచ్ఛన్తమ్ = వెళ్ళుచున్న ఆ రాముణ్ణి, అనుగచ్ఛన్తి = అనుసరించి వెళ్ళిరి.

తా. పిమ్మట సంతోషించుచున్న ఆరోగ్యవంతులైన జనులతో నిండిన ప్రజ లందరూ రాముని గుణములచేత రంజింపచేయబడినవారై వెళ్ళుచున్న ఆతనిని అనుసరించి వెళ్ళిరి. 14

మూ. తతః సస్త్రీపుమాంసస్తే సపక్షిపశుబాన్ధవాః,
రాఘవస్యానుగాః సర్వే హృష్టా విగతకల్మషాః. 15

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సస్త్రీపుమాంసః = స్త్రీపురుషులతో కూడిన, సపక్షిపశుబాన్ధవాః = పక్షులతోను, పశువులతోను. బంధువులతోను కూడిన, రాఘవస్య = రామునియొక్క, అనుగాః = అనుచరులైన. తే సర్వే = వారందరూ, హృష్టాః = సంతోషించినారు. విగతకల్మషాః = పోయిన పాపములుకలవారుగా ఉండిరి.

తా. రాముణ్ణి అనుసరించి వచ్చిన స్త్రీలు, పురుషులు, పక్షులు, పశువులు అందరూ కూడ పాపరహితులై ఉత్సాహసంపన్నులై ఉండిరి. 15

మూ. స్నాతాః ప్రముదితాః సర్వే హృష్టపుష్టాశ్చ వానరాః,
దృఢం కిలకిలాశబ్దైః సర్వం రామమనువ్రతమ్. 16

ప్ర. అ. హృష్టపుష్టాః చ = సంతోషముతో కూడినవారు పరిపుష్టితో ఉన్న వారు అయిన, సర్వే = సమస్తమైన, వానరాః = వానరులు, స్నాతాః = స్నానము చేసినవారై, ప్రముదితాః = ఆనందముతో ఉండిరి సర్వమ్ = ఆ వానరసమూహము అంతా, దృఢమ్ = దృఢముగా, కిలకిలాశబ్దైః = కిలకిలాశబ్దములతో, రామమ్ = రాముణ్ణి, అనువ్రతమ్ = అనుసరించి ఉన్నది.

తా. వానరులందరు హృష్టులై, పుష్టులై, స్నానముచేసి ఆనందముతో ఉండిరి. ఆ వానరసముదాయము అంతా కిలకిలాశబ్దము చేయుచు రాముణ్ణి అనుసరించుటకు స్థిరసంకల్పముతో ఉండెను. 16

మూ. న తత్ర కశ్చిద్దీనో వా వ్రీడితో వాపి దుఃఖితః,
హృష్టం ప్రముదితం సర్వం బభూవ పరమాద్భుతమ్. 17

ప్ర. అ. తత్ర = అక్కడ, దీనో వా = దీనుడు గాని, వ్రీడితో వాపి = సిగ్గుతో ఉన్నవాడు గాని, దుఃఖితో వాపి = దుఃఖించుచున్నవాడు గాని, కశ్చిత్ = ఎవ్వడూ కూడ. న = లేకుండెను. సర్వమ్ = సమస్తమూ కూడ, హృష్టమ్ = హర్షపూర్ణమై, ప్రముదితమ్ = ఆనందభరితమై, పరమాద్భుతమ్ = చాల ఆశ్చర్యకరముగ, బభూవ = ఉండెను.

తా. ఆక్కడ దీనుడు గాని సిగ్గుపడుచున్నవాడు గాని, దుఃఖితుడు గాని ఎవ్వడూ కూడ లేకుండెను. సమస్తమూ కూడ హర్షపూర్ణము, ఆనందభరితము అయి ఆశ్చర్యకరముగ ఉండెను. 17

మూ. ద్రష్టుకామోథ నిర్యాన్తం రామం జానపదో జనః,
యః ప్రాప్తః సోఒపి దృష్ట్వైవ స్వర్గాయానుగతో ముదా.

ప్ర. అ. అథ = పిమ్మట, నిర్యాన్తమ్ = వెళ్ళుచున్న, రామమ్=రాముణ్ణి, ద్రష్టుకామః = చూచుటకు ఇచ్ఛ గల, యః = ఏ, జానపదః = పల్లెలకు సంబంధించిన, జనః = జనము, ప్రాప్తః = వచ్చినదో, సః అపి = ఆ జనము కూడ, దృష్ట్వైవ = చూడగానే, ముదా = సంతోషముతో, స్వర్గాయ = స్వర్గముకొరకు, అనుగతః = అనుసరించి వెళ్ళినది.

తా. రాముడు వెళ్ళిపోవుచున్నా డని చూచుటకై పల్లెలనుండి వచ్చినవాళ్లు కూడ ఆతనిని చూడగానే సంతోషముతో, స్వర్గముకొరకు, ఆతనిని అనుసరించి వెళ్ళిరి. 18

మూ. ఋక్షవానరరక్షాంసి జనాశ్చ పురవాసినః,
ఆగచ్ఛన్ పరయా భక్త్యా పృష్ఠతః సుసమాహితాః 19

ప్ర. అ. ఋక్షవానరరక్షాంసి=భల్లూకములు, వానరులు, రాక్షసులు, పురవాసినః = పురమునందు నివసించుచున్న, జనాః చ = జనులు, సుసమాహితాః = చాల సావధానచిత్తులై, పరయా = గొప్ప, భక్త్యా = భక్తితో, పృష్ఠతః = రాముని వెనుకనే, ఆగచ్ఛన్ = వచ్చిరి.

తా. భల్లూకములు, వానరులు, రాక్షసులు, నగరవాసులైన జనులు సావధానచిత్తులై, గొప్ప భక్తితో రాముని వెనుకనే వచ్చిరి. 19

మూ. యాని భూతాని నగరేఒప్యన్తర్ధానగతాని చ,
రాఘవం తాన్యనుయయుః స్వర్గాయ సముపస్థితమ్. 20

ప్ర. అ. నగరే=నగరమునందు, అన్తర్ధానగతాని=అంతర్ధానము చెందిన, యాని = ఏ, భూతాని = భూతములు కలవో, తాన్యపి = అవి కూడ, స్వర్గాయ

= స్వర్గముకొరకు, సముపస్థితమ్ = వచ్చిన, రామమ్ = రాముణ్ణి, అనుయయుః = అనుసరించి వెళ్ళినవి.

తా. నగరములో అదృశ్యములుగా ఉన్న భూతములు కూడ స్వర్గమునకు బయలుదేరిన రాముణ్ణి అనుసరించి వెళ్ళినవి. 20

మూ. యాని పశ్యన్తి కాకుత్స్థం స్థావరాణి చరాణి చ,
సర్వాణి రామగమనే అనుజగ్ముర్హి తాన్యపి. 21

ప్ర అ. రామగమనే = రాముని గమనసమయమునందు, స్థావరాణి = స్థావరములు, చరాణి చ = చరములూ అయిన, యాని = ఏవి, కాంకుత్స్థమ్ = రాముణ్ణి, పశ్యన్తి = చూచినవో, సర్వాణి = సమస్తమైన, తాన్యపి = అవి కూడ, అనుజగ్ముః = అనుసరించి వెళ్ళినవి.

తా. రాముడు వెళ్ళుచున్నప్పుడు ఆతనిని చూచిన జంగమములు, స్థావరములూ కూడ ఆతనిని అనుసరించి వెళ్ళినవి. (రాముని దృష్టి ప్రసరించగానే స్థావరములైన వృక్షాదులలో కూడ జ్ఞానము ఉద్భవించి ఆవి కూడ [ఆ జీవులు కూడ] రామునివెంట వెళ్ళినవి). 21

మూ. నోచ్ఛ్వాసత్తదయోధ్యాయాం సుసూక్ష్మమపి దృశ్యతే,
తిర్యగ్యోనిగతాశ్చైవ సర్వే రామమనువ్రతాః. 22

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
నవాధికశతతమః సర్గః.

ప్ర. అ. అయోధ్యాయామ్ = అయోధ్యయందు, ఉచ్ఛ్వాసత్ = శ్వాస పీల్చునది, తత్ = అట్టిది, సుసూక్ష్మమ్ అపి = చాల సూక్ష్మమైనది కూడ, న దృశ్యతే = కనబడలేదు. సర్వే=సమస్తమైన, తిర్యగ్యోనిగతాః చైవ=తిర్యగ్జంతువులు కూడ, రామమ్ = రాముణ్ణి, అనువ్రతాః = అనుసరించినవి.

తా. అయోధ్యలో, ఊపిరి పీల్చే ఒక్క చాల చిన్న ప్రాణి కూడ మిగలలేదు. తిర్యగ్జంతువులు అన్నీ కూడ రాముణ్ణి అనుసరించి వెళ్ళినవి. 22

'బాలానందిని' అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో నూట తొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ దశాధికశతతమః సర్గః

[సోదరసహితుడైన రాముడు తన వైష్ణవతేజస్సులో ప్రవేశించుట, ఆ రామునితో వచ్చినవారి కందరికీ సంతానక మను లోకము లభించుట.]

మూ. అధ్యర్ధయోజనం గత్వా నదీం పశ్చాన్ముఖాశ్రితామ్,
సరయూం పుణ్యసలిలాం దదర్శ రఘునన్దనః. 1

ప్ర. అ. రఘునన్దనః = రాముడు, అధ్యర్ధయోజనమ్ = యోజనముకంటె అర్ధము అధికము గల దూరము, గత్వా = వెళ్ళి, పుణ్యసలిలామ్ = పుణ్యమైన ఉదకము గల, పశ్చాన్ముఖాశ్రితామ్ = పశ్చిమాభిముఖుడుగా అన్న తనచేత ఆశ్రయించబడిన, సరయూం నదీమ్ = సరయూనదిని, దదర్శ = చూచెను.

తా. రాముడు ఒకటిన్నర యోజనముల దూరము వెళ్ళి పుణ్యమైన ఉదకము గల, పశ్చిమాభిముఖుడుగా ఉన్న తనచేత ఆశ్రయించబడిన సరయూనదిని చూచెను. 1

మూ. తాం నదీమాకులావర్తాం సర్వ్రతానుసరన్నృపః,
ఆగతః సప్రజో రామస్తం దేశం రఘునన్దనః. 2

ప్ర. అ. నృపః = రాజు, రఘునన్దనః = రఘువంశమునకు ఆనందము కలిగించువాడు అయిన, రామః = రాముడు, ఆకులావర్తామ్ = వ్యాకులములైన సుళ్ళు గల, తాం నదీమ్ = ఆ నదిని. సర్వ్రత = అంతట, అనుసరన్ = అనుసరించుచు, సప్రజః = ప్రజలతో కూడినవాడై, తం దేశమ్ = ఆ ప్రదేశమును గూర్చి, ఆగతః = వచ్చినాడు.

తా. రాజైన రాముడు సుళ్ళతో వ్యాకులమైన జలము గల ఆ నదిని అంతటా

పరిశీలించుచు తిరిగి, ప్రజలతో తాను ప్రవేశించుటకు తగిన (స్వర్గప్రాపకమైన) ప్రదేశమునకు వచ్చెను. 2

మూ. అథ తస్మిన్ ముహూర్తే తు బ్రహ్మా లోకపితామహః,
సర్వైః పరివృతో దేవైర్భూషితైశ్చ మహాత్మభిః. 3

ఆయయౌ యత్ర కాకుత్స్థః స్వర్గాయ సముపస్థితః,
విమానశతకోటీభిర్దివ్యాభిరభిసంవృతః. 4

ప్ర. అ. అథ = ఆటుపిమ్మట, తస్మిన్ ముహూర్తే = ఆ ముహూర్తమునందు, లోకపితామహః = లోకములకు పితామహుడైన, బ్రహ్మా = బ్రహ్మ, భూషితైః = అలంకరించబడిన, మహాత్మభిః = మహాత్ములైన, సర్వైః = సమస్తమైన, దేవైః = దేవతలతో, పరివృతః = కూడినవాడై, దివ్యాభిః = దివ్యములైన, విమానశతకోటిభిః = విమానముల శతకోటులతో, అభిసంవృతః = కూడినవాడై, కాకుత్స్థః = రాముడు, స్వర్గాయ = స్వర్గముకొరకు, యత్ర = ఎక్కడికి, సముపస్థితః = వచ్చియున్నాడో అక్కడికి, అయయౌ = వచ్చెను.

తా. అప్పుడు సమస్తలోకములకు పితామహుడైన బ్రహ్మదేవుడు బాగుగా అలంకరించుకొనిన మహాత్ములైన సకలదేవతలతో కలిసి, దివ్యములైన శతకోటి విమానములు వెంట రాగా, రాముడు స్వర్గమునకు వెళ్ళుటకై, వచ్చిన స్థానమునకు వచ్చెను. 3, 4

మూ. దివ్యతేజోన్వితం వ్యోమ జ్యోతిర్భూతమనుత్తమమ్.
స్వయంప్రభైః స్వతేజోభిః స్వర్గిభిః పుణ్యకర్మభిః, 5

ప్ర. అ. స్వయంప్రభైః = స్వయముగా కాంతి గల, స్వతేజోభిః = స్వీయమైన తేజస్సు గల, పుణ్యకర్మభిః = పుణ్యకర్మలు గల, స్వర్గిభిః = దేవతలచేత, అనుత్తమమ్ = అత్యుత్తమమైన, వ్యోమ = ఆకాశము, దివ్యతేజోన్వితమ్ = దివ్యమైన తేజస్సుతో కూడినదై, జ్యోతిర్భూతమ్ = తేజస్సుగా అయిపోయినది.

తా. సహజమైన కాంతి, తేజస్సు గల పుణ్యాత్ములైన దేవతలతో అత్యుత్తమమైన ఆకాశము దివ్యమైన తేజస్సుతో నిండినదై తేజోరూపమైపోయెను. 5

మూ. భ్రాతృభిః సహ దేవాభైః ప్రవిశస్వ స్వీకాం తనుమ్,
యామిచ్ఛసి మహాబాహో తాం తనుం ప్రవిశ స్వీకామ్.

ప్ర. అ. దేవాభైః = దేవతలవంటి కాంతి గల, భ్రాతృభిః సహ = సోదరులతో కూడ, స్వీకామ్ = నీ సంబంధమైన, తనుమ్ = శరీరమును, ప్రవిశస్వ = ప్రవేశించుము. మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా ! యామ్ = ఏ, స్వీకామ్ = స్వీయమైన, తనుమ్ = శరీరమును, ఇచ్ఛసి = కోరుచున్నావో, తామ్ = దానిని, ప్రవిశ = ప్రవేశించుము.

తా. మహాబాహూ ! దేవతల వంటి సోదరులతో కూడ నీ స్వీయదేహములో ప్రవేశించుము. నీ దేహములలో దేనిలో ప్రవేశించవలె నని కోరెదవో దానిలో ప్రవేశించుము. 9

మూ. వైష్ణవీం వా మహాతేజో యద్వాకాశం సనాతనమ్,
త్వం హి లోకగతిర్దేవ న త్వాం కేచిత్ప్రజానతే. 10
ఋతే మాయాం విశాలాక్షీం తవ పూర్వపరిగ్రహామ్,
త్వామచిన్త్యం మహద్భూతమక్షయం చాజరం తథా,
యామిచ్ఛసి మహాతేజస్తాం తనుం ప్రవిశ స్వయమ్. 11

ప్ర. అ. మహాతేజః = గొప్ప తేజస్సు కలవాడా ! వైష్ణవీం వా = వైష్ణవమైన శరీరమును గాని, యద్వా = లేదా, సనాతనమ్ = నిత్యమైన, ఆకాశమ్ = శుద్ధబ్రహ్మస్వరూపమును గాని, ప్రవేశించుము. దేవ = దేవా, త్వమ్ = నీవు, లోకగతిః హి = లోకమునకు గతివి కదా ? అచిన్త్యమ్ = ఊహించ శక్యము కాని, మహద్ భూతమ్ = గొప్ప భూతమైన, అక్షయమ్ = నాశము లేని, తథా = మరియు, అజరమ్ = జీర్ణత్వము లేని, త్వామ్ = నిన్ను, విశాలాక్షీమ్ = విశాలములైన నేత్రములు గల, తవ పూర్వపరిగ్రహామ్ = నీ అతి పురాతనసహజశక్తియైన, మాయాం ఋతే = మాయ తప్ప, కేచిత్ = ఎవ్వరూ కూడ, న ప్రజానతే = తెలిసికొనజాలరు. మహాతేజః = గొప్ప తేజస్సు కలవాడా ! యామ్ = దేనిని, ఇచ్ఛసి = కోరుచున్నావో, తాం తనుమ్ = ఆ శరీరమును, స్వయమ్ = స్వయముగా, ప్రవిశ = ప్రవేశించుము.

తా. గొప్ప తేజస్సు కలవాడా ! ఆ వైష్ణవశరీరమును గాని, నిత్యమైన శుద్ధబ్రహ్మస్వరూపమును గాని ప్రవేశించుము. దేవా ! నీవే లోకములకు గతివి. నీవు అనాదిసిద్ధముగా ఉన్న విశాలములైన నేత్రములు గల మాయ తప్ప మరెవ్వరిచేతా ఊహింప శక్యముకానివాడవు. గొప్ప భూతము, నాశరహితుడవు, జరాశూన్యుడవు అయిన నిన్ను తెలిసికొనజాలరు.

వి. పైన ఇచ్చిన "వైష్ణవీమ్...." "ఋతే మాయామ్..." ఇత్యాది శ్లోకార్ధాలకి బదులు ప్రాచ్యపాఠంలో "వైష్ణవం సుమహాతేజస్తవాకాశం సనాతనమ్"అని, "ఋతే మత్తో విశాలాక్ష భూతపూర్వపరిగ్రహమ్" అనీ పాఠాలు ఉన్నవి. "నిత్యమైన ఆకాశస్వరూపమైన నీ వైష్ణవరూపమును"అని, "ఓ విశాలాక్షా ! అతిపురాతన కాలమునుండి నీచే స్వీకరించబడిన నేను తప్ప" అని వాటి అర్థాలు. 11

మూ. పితామహవచః శ్రుత్వా వినిశ్చిత్య మహామతిః,
వివేశ వైష్ణవం తేజః సశరీరః సహానుజః. 12

ప్ర. అ. మహామతిః = గొప్ప బుద్ధి గల రాముడు, పితామహవచః=బ్రహ్మదేవుని వచనమును, శ్రుత్వా = విని, వినిశ్చిత్య=నిశ్చయముచేసికొని, సహానుజః = తమ్ములతో కూడినవాడై, సశరీరః = శరీరముతో కూడినవాడై, వైష్ణవం తేజః = విష్ణువునకు సంబంధించిన తేజస్సును, వివేశ = ప్రవేశించెను.

తా. గొప్ప బుద్ధి గల రాముడు బ్రహ్మదేవుని మాటలు విని, నిశ్చయించుకొని, తమ్ములతో కూడ, సశరీరముగా వైష్ణవతేజస్సులో ప్రవేశించెను. 12

మూ. తతో విష్ణుమయం దేవం పూజయన్తి స్మ దేవతాః,
సాధ్యా మరుద్గణాశ్చైవ సేన్ద్రాగ్నిః సాగ్నిపురోగమాః. 13

యే చ దివ్యా ఋషిగణా గన్ధర్వాప్సరసశ్చ యాః,
సుపర్ణనాగయక్షాశ్చ దైత్యదానవరాక్షసాః. 14

ప్ర. అ. తతః = అటుపిమ్మట, విష్ణుమయమ్ = విష్ణుస్వరూపుడైన, దేవమ్ = రాముణ్ణి, దేవతాః = దేవతలు, సాధ్యాః = సాధ్యులు, సేన్ద్రాగ్నిః = ఇంద్రునితో కూడిన, సాగ్నిపురోగమాః = అగ్ని ముందునడచువాడుగా గల, మరుద్గణాః చ ఏవ = మరుద్గణములు, దివ్యాః = దివ్యములైన, యే = ఏ, ఋషిగణాః = ఋషి

గణము లున్నవో అవి, యాః = ఏ, గన్ధర్వాప్సరసః చ = గంధర్వులూ అప్సరసలూ గలరో వారు, సుపర్ణనాగయక్షాః చ = గరుత్మంతులు, నాగులు, యక్షులు, దైత్యదానవరాక్షసాః = దైత్యులు, దానవులు, రాక్షసులు, పూజయన్తి స్మ = పూజించిరి.

తా. పిమ్మట విష్ణురూపములో నిలీనుడై విష్ణువైపోయిన ఆ రామున్ని దేవతలు, సాధ్యులు, మరుద్గణములు, ఇంద్రుడు, అగ్ని, దివ్యఋషులు, గంధర్వులు, అప్సరసలు, గరుత్మంతులు, నాగులు, యక్షులు, దైత్య – దానవ – రాక్షసులు పూజించిరి. 13, 14

మూ. సర్వం పుష్టం ప్రముదితం సుసంపూర్ణమనోరథమ్,
సాధు సాధ్వితి తైర్దేవైస్త్రిదివం గతకల్మషమ్. 15

ప్ర. అ. గతకల్మషమ్ = పోయిన కల్మషము గల, సర్వమ్ = సమస్తమైన, త్రిదివమ్ = స్వర్గము, పుష్టమ్ = పరిపుష్టమైనది. ప్రముదితమ్ = బాగా సంతోషించినది. సుసంపూర్ణమనోరథమ్ = బాగా సంపూర్ణమైన మనోరథము కలది, సాధు సాధు = బాగు, బాగు, ఇతి = అని, తైః = ఆ, దేవైః = దేవలచేత పలకబడెను.

తా. దేవత లందరు – "కల్మషరహితమైన ఈ స్వర్గము అంతా ఇప్పుడు పరిపుష్టమైనది, సంతోషముతో నిండినది. దీని మనోరథములు పూర్ణమైనవి. బాగు బాగు" అని పలికిరి. 15

మూ. అథ విష్ణుర్మహాతేజాః పితామహమువాచ హ,
ఏషాం లోకం జనౌఘానాం దాతుమర్హసి సువ్రత. 16

ప్ర. అ. అథ = అటుపిమ్మట, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, విష్ణుః = విష్ణువు, పితామహమ్ = బ్రహ్మదేవుణ్ణి గూర్చి, ఉవాచ హ = పలికెను. సువ్రత = మంచి నియమములు కలవాడా! ఏషామ్ = ఈ, జనౌఘానామ్ = జనసముదాయములకు, లోకమ్ = ఉత్తమలోకమును, దాతుమ్ = ఇచ్చుటకు, అర్హసి = తగి ఉన్నావు.

తా. పిమ్మట గొప్ప తేజస్సు గల విష్ణువు బ్రహ్మదేవునితో ఇట్లనెను-"ఓ! సువ్రతా! ఈ జను లందరికీ ఉత్తమలోకమును ఇమ్ము". 16

మూ. ఇమే హి సర్వే స్నేహాన్మామనుయాతా మనస్వినః,
భక్తా హి భజితవ్యాశ్చ త్యక్తాత్మానశ్చ మత్కృతే. 17

ప్ర. అ. ఇమే = ఈ, సర్వే = సమస్తమైన, మనస్వినః = ఉత్తమమైన మనస్సు గలవారు, స్నేహాత్ = స్నేహమువలన, మామ్ = నన్ను, అనుయాతాః = అనుసరించినారు. మత్కృతే = నా నిమిత్తమై, త్యక్తాత్మానః = విడవబడిన దేహములుగల, భక్తాః = భక్తులు, భజితవ్యాః హి = సేవింపదగినవారు కదా ?

తా. ఉత్తమమనస్సు గల వీరందరూ నాపై నున్న స్నేహముచేత నా వెనుక వచ్చినారు. నా నిమిత్తము దేహములు వదిలిన భక్తులు సేవించదగినవారు కదా ? 17

మూ. తచ్ఛ్రుత్వా విష్ణువచనం బ్రహ్మా లోకగురుః ప్రభుః,
లోకాన్ సంతానకాన్నామ యాస్యన్తీమే సమాగతాః. 18

ప్ర. అ. తత్ = ఆ, విష్ణువచనమ్ = విష్ణువచనమును, శ్రుత్వా = విని, లోకగురుః = లోకముల గురువు, ప్రభుః = ప్రభువూ అయిన, బ్రహ్మా = బ్రహ్మ, సమాగతాః = నీతో వచ్చిన, ఇమే = వీరు, సంతానకాన్ నామ = సంతానకములను, లోకాన్ = లోకములను గూర్చి, యాస్యన్తి = వెళ్ళగలరు.

తా. విష్ణువు పలికిన మాట విని లోకగురువు, సమర్థుడు అయిన బ్రహ్మ దేవుడు ఇట్లు పలికెను. "నీ వెనుకనే వచ్చిన వీరు సంతానక మను లోకమునకు వెళ్ళగలరు." 18

మూ. యచ్చ తిర్యగ్గతం కించిత్ త్వామేవమనుచిన్తయత్,
ప్రాణాంస్త్యక్ష్యతి భక్త్యా తత్సన్తానే వినివత్స్యతి, 19
సర్వైర్బ్రహ్మగుణైర్యుక్తే బ్రహ్మలోకాదనన్తరే.

ప్ర. అ. తిర్యగ్గతమ్ = తిర్యగ్యోనిని పొందిన, యచ్చ కించిత్ = ఏ ప్రాణియైనా, భక్త్యా = భక్తితో, త్వామేవ = నిన్నే, అనుచిన్తయత్ = స్మరించుచు, ప్రాణాన్ = ప్రాణములను, త్యక్ష్యతి = విడువగలదో, తత్ = అది, సర్వైః = సమస్తమైన, బ్రహ్మగుణైః = బ్రహ్మగుణములతో, యుక్తే = కూడిన, బ్రహ్మలో

కాత్ = బ్రహ్మలోకముకంటె, అనన్తరే = అవ్యవహితమైన, సంతానే = సంతాన లోకమునందు, వినివత్స్యతి = నివసించగలదు.

తా. తిర్యగ్జంతువు కూడ భక్తితో నిన్నే స్మరించుచు ప్రాణాలను విడిచి పెట్టినచో ఆది అన్ని బ్రహ్మగుణములూ ఉన్న, బ్రహ్మలోకమునకు ప్రక్కనే ఉన్న సంతాన లోకములలో నివసించును. 19

మూ. వానరాశ్చ స్వికాం యోనిమృక్షాశ్చ ప్రతిపేదిరే, 20
యేభ్యో వినిఃసృతాః సర్వే సురేభ్యః సురసంభవాః.

ప్ర. అ. సురసంభవాః = దేవతలవలన పుట్టిన, వానరాః = వానరులు, ఋక్షాః చ = భల్లూకములు, సర్వే = అందరూ, యేభ్యః = ఎవరినుండి, వినిఃసృతాః = ఆవిర్భవించిరో, స్వికామ్ = తమసంబంధమైన, యోనిమ్ = కారణమును, ప్రతిపేదిరే = పొందిరి.

తా. దేవతలవలన పుట్టిన వానరులు, భల్లూకములు, అందరూ కూడ తమ తమ ఉత్పత్తికి కారణభూతులైన దేవతలలో లీనమైపోయిరి (ఇతరులు సంతాన లోకమునకు వెళ్ళిరి). 20

మూ. తేషు ప్రవివిశే చైవ సుగ్రీవః సూర్యమణ్డలమ్, 21
పశ్యతాం సర్వదేవానాం స్వాన్ పితౄన్ ప్రతిపేదిరే.

ప్ర. అ. తేషు = అట్టివారిలో, సుగ్రీవః = సుగ్రీవుడు, సూర్యమణ్డలమ్ = సూర్యమండలమును, ప్రవివిశే చైవ = ప్రవేశించెను. (ఇతరులు), సర్వదేవానామ్ = సమస్తదేవతలు, పశ్యతామ్ = చూచుచుండగా, స్వాన్ = తమ సంబంధమైన, పితౄన్ = తండ్రులను, ప్రతిపేదిరే = పొందిరి.

తా. వారిలో సుగ్రీవుడు సూర్యమండలములో ప్రవేశించెను. ఇతరులు దేవత లందరూ చూచుచుండగా, తమ తండ్రులను పొందిరి. 21

మూ. తథా బ్రువతి దేవేశే గోప్రతారముపాగతాః, 22
భేజిరే సరయూం సర్వే హర్షపూర్ణాశ్రువిక్లవాః.

ప్ర. అ దేవేశే = బ్రహ్మదేవుడు, తథా = అట్లు, బ్రువతి = పలుకు

చుండగా, గోప్రతారమ్ = గోప్రతారక్షేత్రమును, ఉపాగతాః = పొందిన, సర్వే = అందరూ, హర్షపూర్ణాశ్రువిక్లవాః = సంతోషముతో నిండినకన్నీళ్ళచేత వ్యాకులులై, సరయూమ్ = సరయూనదిని, భేజిరే = పొందిరి.

తా. బ్రహ్మదేవుడు ఆ విధముగా పలుకుచుండగా సరయూనదియందలి గోప్రతారక్షేత్రమునకు వచ్చిన జనులు సంతోషముతో నిండిన కన్నీళ్ళతో వ్యాకులులై సరయూనదిలో ప్రవేశించిరి. 22

మూ. అవగాహ్యాప్సు యో యో వై ప్రాణాంస్త్యక్త్వా ప్రహృష్టవత్,
మానుషం దేహముత్సృజ్య విమానం సోఽధ్యరోహత.

ప్ర. ఆ. యః యః = ఎవడెవడు, అప్సు = నీటియందు, అవగాహ్య = ప్రవేశించి, ప్రాణాన్ = ప్రాణములను, త్యక్త్వా = విడచి, ప్రహృష్టవత్ = సంతోషించెనో, సః = అతడు, మానుషమ్ = మనుష్యసంబంధమైన, దేహమ్ = దేహమును, ఉత్సృజ్య = విడచి, విమానమ్ = విమానమును, అధ్యరోహత = ఎక్కెను.

తా. జలములో దిగి సంతోషపూర్వకముగా ప్రాణాలను విడచిన ప్రతి ఒక్కడూ కూడ మనుష్యదేహమును విడచి విమానమును ఎక్కి వెళ్లెను. 23

మూ. తిర్యగ్యోనిగతానాం చ శతాని సరయూజలమ్, 24
సంప్రాప్య త్రిదివం జగ్ముః ప్రభాసురవపూంషి తు.

ప్ర. ఆ. తిర్యగ్యోనిగతానామ్ = తిర్యగ్జన్మను పొందినవాటియొక్క, శతాని = వందలు, సరయూజలమ్ = సరయూజలమును, సంప్రాప్య = పొంది, ప్రభాసురవపూంషి = ప్రకాశించుచున్న శరీరములు కలవై, త్రిదివమ్ = స్వర్గమును గూర్చి, జగ్ముః = వెళ్ళినవి.

తా. పశుపక్ష్యాదులు కూడ ఆ సరయూనదీజలములో ప్రవేశించి ప్రకాశించుచున్న దేహములతో స్వర్గమునకు వెళ్లెను. 24

మూ. దివ్యా దివ్యేన వపుషా దేవా దీప్తా ఇవాభవన్, 25
గత్వా తు సరయూతోయం స్థావరాణి చరాణి చ
ప్రాప్య తత్తోయవిక్లేదం దేవలోకముపాగమన్. 26

ప్ర. అ. దివ్యాః=దివ్యములై, దివ్యేన=దివ్యమైన, వపుషా = దేహముతో, దీప్తాః = ప్రకాశించుచున్న, దేవాః ఇవ = దేవతలువలె, అభవన్ = అయినవి. స్థావరాణి = స్థావరములు, చరాణి చ = జంగమములుకూడ, సరయూతోయమ్ = సరయూనదీజలమును, గత్వా = పొంది, తత్తోయవిక్లేదమ్ = ఆ జలముతో తడుపును, ప్రాప్య = పొంది, దేవలోకమ్ = దేవలోకమును, ఉపాగమన్ = పొందినవి.

తా. (ఆ తిర్యగ్జంతువులు) దివ్యములై, దివ్యమైన శరీరముతో ప్రకాశించుచున్న దేవతలవలె ఉండెను. సరయూనదీజలములో ప్రవేశించిన స్థావరములు, జంగమములూ కూడ ఆ నీటిలో తడియగానే దేవలోకమును చేరెను. 25, 26

మూ. తస్మిన్యేపి సమాపన్నా ఋక్షవానరరాక్షసాః,
తేఽపి స్వర్గం ప్రవివిశుర్దేహాన్నిక్షిప్య చామ్భసి. 27

ప్ర. అ. తస్మిన్ = ఆ సరయూనదీజలమునందు, యే = ఏ, ఋక్షవానర రాక్షసాః = భల్లూకములు, వానరులు, రాక్షసులు, సమాపన్నాః=మరణించినారో, తే అపి=వారు కూడ, అమ్భసి = జలమునందు, దేహాన్=దేహములను, నిక్షిప్య= ఉంచి, స్వర్గమ్ = సర్గమును, ప్రవివిశుః = ప్రవేశించిరి.

తా. ఆ జలములో ప్రాణాలు విడిచిన భల్లూక–వానర–రాక్షసులు తమ దేహములను ఆ జలమునందు విడచి స్వర్గము చేరిరి. 27

మూ. తతః సమాగతాన్ సర్వాన్ స్థాప్య లోకగురుర్దివి,
హృష్టైః ప్రముదితైర్దేవైర్జగామ త్రిదివం మహత్. 28

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
దశాధికశతతమః సర్గః

ప్ర. అ. తతః = అటుపిమ్మట, లోకగురుః = లోకమునకు గురువైన బ్రహ్మదేవుడు, సమాగతాన్=వచ్చిన, సర్వాన్=అందరినీ, దివి=స్వర్గమునందు, స్థాప్య = ఉంచి, హృష్టైః = హర్షించిన, ప్రముదితైః = ఆనందించిన, దేవైః=దేవ

తలతో. మహత్ = గొప్పదైన, త్రిదివమ్ = స్వర్గమును గూర్చి, జగామ = వెళ్ళెను.

తా. బ్రహ్మదేవుడు వచ్చినవారినందరినీ స్వర్గలోకములో ఉంచి, సంతోషాతిశయముతో కూడిన దేవతలతో కలిసి బ్రహ్మలోకమునకు వెళ్ళెను.

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో నూటపదవ సర్గ సమాప్తము.

అథ ఏకాదశోత్తరశతతమః సర్గః

[శ్రీమద్రామాయణమాహాత్మ్యము]

మూ. ఏతావదేతదాఖ్యానం సోత్తరం బ్రహ్మపూజితమ్,
రామాయణమితి ఖ్యాతం ముఖ్యం వాల్మీకినా కృతమ్. 1

ప్ర. అ. సోత్తరమ్ = ఉత్తరభాగముతో కూడిన, ఏతావత్ = ఇంత ప్రమాణము గల, బ్రహ్మపూజితమ్ = బ్రహ్మచేత పూజించబడిన, ఏతత్ = ఈ, ఆఖ్యానమ్ = ఆఖ్యానము, ముఖ్యమ్ = ఉత్తమమైనది. రామాయణమ్ ఇతి = రామాయణము అని, ఖ్యాతమ్ = ప్రసిద్ధమైనది. వాల్మీకినా = వాల్మీకిచేత, కృతమ్ = చేయబడినది.

తా. ఉత్తరభాగసహితమైన ఇంత ప్రమాణము గల, ఈ ఆఖ్యానము బ్రహ్మదేవునిచేత పూజించ బడినది. రామాయణమను పేరుతో ప్రసిద్ధి పొందిన ఈ ముఖ్యమైన ఆఖ్యానమును వాల్మీకి రచించెను. 1

మూ. తతః ప్రతిష్ఠితో విష్ణుః స్వర్గలోకే యథా పురా,
యేన వ్యాప్తమిదం సర్వం త్రైలోక్యం సచరాచరమ్. 2

ప్ర. అ. తతః = అటుపిమ్మట, యేన = ఏవిష్ణువుచేత, ఇదమ్ = ఈ, సర్వమ్ = సమస్తమైన, సచరాచరమ్ = చరాచరములతో కూడిన, త్రైలోక్యమ్ = మూడు లోకముల సముదాయము, వ్యాప్తమ్ = వ్యాపించబడినదో అట్టి, విష్ణుః = విష్ణువు, యథాపురా = పూర్వమునందు వలె, స్వర్గలోకే = స్వర్గలోకమునందు, ప్రతిష్ఠితః = ప్రతిష్ఠితుడైనాడు.

తా. చరాచరాత్మకములైన మూడు లోకములను వ్యాపించి ఉన్న శ్రీమహా విష్ణువు, పిమ్మట, పూర్వమునందు వలె, స్వర్గమునందు సంప్రతిష్ఠితు డయ్యెను.

మూ. తతో దేవాః సగన్ధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః,
నిత్యం శృణ్వన్తి సంహృష్టాః కావ్యం రామాయణం దివి.

ప్ర. అ. తతః = అందువలన, సగన్ధర్వాః = గంధర్వులతో కూడిన, దేవాః = దేవతలు, సిద్ధాః చ = సిద్ధులు, పరమర్షయః = మహర్షులు, సంహృష్టాః = సంతోషించినవారై, దివి = స్వర్గమునందు, రామాయణం కావ్యమ్ = రామాయణ కావ్యమును, నిత్యమ్ = నిత్యము, శృణ్వన్తి = వినుచున్నారు

తా. ఇది శ్రీమహావిష్ణువు చరిత్ర అగుటవలన స్వర్గలోకములో దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు, సంతోషించుచు నిత్యమూ ఈ రామాయణ మహాకావ్యమును వినుచుందురు. 3

మూ. ఇదమాఖ్యానమాయుష్యం సౌభాగ్యం పాపనాశనమ్,
రామాయణం వేదసమం శ్రాద్ధేషు శ్రావయేద్బుధః. 4

ప్ర. అ. ఆయుష్యమ్ = ఆయుర్వర్ధకము, సౌభాగ్యమ్ = మంచి భాగ్యమును ఇచ్చునది, పాపనాశనమ్ = పాపములను నశింపచేయునది, వేదసమమ్ = వేదముతో సమానమూ అయిన, ఇదమ్ = ఈ, రామాయణమ్ ఆఖ్యానమ్ = రామాయణ మను ఆఖ్యానమును, బుధః = పండితుడు, శ్రాద్ధేషు = శ్రాద్ధముల యందు, శ్రావయేత్ = వినిపించవలెను.

తా. ఈ రామాయణాఖ్యానము ఆయుస్సును వృద్ధి పొందించును. సౌభాగ్యమును ఇచ్చును. పాపములను తొలగించును. వేదముతో సమానము. అందుచేత పండితుడు శ్రాద్ధసమయములలో కూడ దీనిని వినిపించవలెను. 4

మూ. అపుత్రో లభతే పుత్రమధనో లభతే ధనమ్,
సర్వపాపైః ప్రముచ్యేత పాదమప్యస్య యః పఠేత్. 5

ప్ర. అ. అపుత్రః = పుత్రుడు లేనివాడు, పుత్రమ్ = పుత్రుణ్ణి, లభతే = పొందును. అధనః = ధనము లేనివాడు, ధనమ్ = ధనమును, లభతే = పొందును. యః = ఎవడు, అస్య = దీనియొక్క, పాదమపి = ఒక్క పాదమునైనా, పఠేత్ = చదువునో అతడు, సర్వపాపైః = సమస్తపాపములచేత, ప్రముచ్యేత = ముక్తుడగును.

తా. పుత్రుడు లేనివాడు పుత్రుణ్ణి పొందును. ధనము లేనివాడు ధనమును పొందును. రామాయణములోని ఒక్క శ్లోకపాదమును చదివినవాడు కూడ సకల పాపములనుండి విముక్తు డగును. 5

మూ. పాపాన్యపి చ యః కుర్యాదహన్యహని మానవః,
పఠత్యేకమపి శ్లోకం పాపాత్స పరిముచ్యతే. 6

ప్ర. అ. యః మానవః = ఏ మానవుడు, అహన్యహని = ప్రతి దినమునందు, పాపాని = పాపములను, కుర్యాదపి = చేసినను, ఏకమపి = ఒక్కటైనా, శ్లోకమ్ = శ్లోకమును, పఠతి = చదువునో, సః = అతడు, పాపాత్ = పాపమునుండి, పరిముచ్యతే = విడువబడును.

తా. ప్రతిదినము పాపములు చేయుచున్న మానవుడు కూడ ఒక్క శ్లోకమైనా పఠించినచో పాపమునుండి విముక్తు డగును. 6

మూ. వాచకాయ చ దాతవ్యం వస్త్రం ధేనుహిరణ్యకమ్,
వాచకే పరితుష్టే తు తుష్టాః స్యుః సర్వదేవతాః. 7

ప్ర అ వాచకాయ = చదువువానికి, వస్త్రమ్ = వస్త్రము, ధేనుహిరణ్యకమ్ = ధేనువు, బంగారము, దాతవ్యమ్ = ఇవ్వదగినది. వాచకే = చదువువాడు, పరితుష్టే తు = సంతోషించినవాడగు చుండగా, సర్వదేవతాః = సకలదేవతలు, తుష్టాః = సంతోషించినవారు, స్యుః = అగుదురు

తా. చదివినవానికి వస్త్రములు, ధేనువు, బంగారము ఇవ్వవలెను. చదువువాడు సంతోషించినచో సమస్తదేవతలు సంతోషింతురు. 7

మూ. ఏతదాఖ్యానమాయుష్యం పఠన్ రామాయణం నరః,
సపుత్రపౌత్రో లోకేఽస్మిన్ ప్రేత్య చేహ మహీయతే.

ప్ర. అ. ఆయుష్యమ్ = ఆయుర్దాయమును ఇచ్చు, ఏతత్ = ఈ, రామాయణమ్ ఆఖ్యానమ్ = రామాయణ మను ఆఖ్యానమును, పఠన్ = చదువు, నరః = నరుడు, సపుత్రపౌత్రః = పుత్రపౌత్రులతో కూడినవాడై, అస్మిన్ లోకే = ఈ లోకమునందు, మహీయతే = పూజించబడును. ప్రేత్య = మరణించి, ఇహ

చ = (పరలోకమునందు) ఇహలోకమునందూ కూడ, మహీయతే = పూజించ బడును.

తా. ఆయుర్వర్ధకమైన ఈ రామాయణ మను ఆఖ్యానమును పఠించు పురుషుడు పుత్రపౌత్రసహితుడై ఈ లోకములో పూజింపబడును. మరణానంత రము రెండు లోకములలోను పూజింపబడును. 8

మూ. రామాయణం గోవిసర్గే మధ్యాహ్నే వా సమాహితః,
సాయాహ్నే చాపరాహ్ణే చ వాచయన్నావసీదతి. 9

ప్ర. ఆ సమాహితః = సావధానచిత్తుడై, గోవిసర్గే=ప్రాతఃకాలమునందు గాని, మధ్యాహ్నే వా=మధ్యాహ్నమునందు గాని, సాయాహ్నే=సాయంకాలము నందు గాని, అపరాహ్ణే చ = అపరాహ్ణమునందు గాని, రామాయణమ్=రామాయ ణమును, వాచయన్ = పఠించువాడు. నావసీదతి = దుఃఖము పొందడు.

తా ప్రాతఃకాలమునందు గాని మధ్యాహ్నమునందు గాని, సాయం కాలమునందు గాని, అపరాహ్ణమునందు గాని సావధానచిత్తుడై రామాయణమును పఠించువాడు ఎన్నటికీ చెడడు. 9

మూ అయోధ్యాపి పురీ రమ్యా శూన్యా వర్షగణాన్ బహూన్,
ఋషభం ప్రాప్య రాజానం నివాసముపయాస్యతి. 10

ప్ర అ బహూన్ = అనేకములైన, వర్షగణాన్ = సంవత్సర సము దాయములను, శూన్యా = శూన్యముగా ఉన్న, రమ్యా = సుందరమైన, అ యోధ్యా పురీ అపి = అయోధ్యానగరము కూడ, ఋషభమ్=ఋషభు డను, రా జానమ్= రాజును, ప్రాప్య=పొంది, నివాసమ్=నివాసమును, ఉపయాస్యతి=పొందగలదు.

తా. అనేక సంవత్సరములు శూన్యముగా ఉన్న రమ్యమైన అయోధ్య ఋషభు డను రాజు వచ్చిన తరువాత మరల నివాసస్థానము (జనులతో నిండి నది) అగును. 10

మూ. ఏతదాఖ్యానమాయుష్యం సభవిష్యం సహోత్తరమ్,
కృతవాన్ ప్రచేతసః పుత్రస్తద్బ్రహ్మాప్యన్వమన్యత. 11

ప్ర. అ. ఆయుష్యమ్ = ఆయుర్దాయవర్ధకము, సభవిష్యమ్ = జరుగ

బోవు కథతో కూడినది, సహోత్తరమ్=ఉత్తరకథతో కూడినది అయిన, ఏతత్= ఈ, ఆఖ్యానమ్ = ఆఖ్యానమును, ప్రచేతసః = ప్రచేతసునియొక్క, పుత్రః = పుత్రుడైన వాల్మీకి, కృతవాన్ = రచించినాడు. తత్ = దానిని, బ్రహ్మాపి = బ్రహ్మ కూడ, అన్వమన్యత = అంగీకరించెను.

తా. ఆయుర్వర్ధకమైనది, భవిష్యత్కథతోను ఉత్తరకథతోను కూడినది. అయిన ఈ రామాయణమును ప్రచేతసుని పుత్రుడు వాల్మీకి రచించెను. దీనిని బ్రహ్మదేవుడు కూడ ఆమోదించెను. 11

(ఇటుపైన వచ్చు 15 శ్లోకాలు చాల ప్రతులలో లేవు. వీటికి వ్యాఖ్యాతలు వ్యాఖ్యానము చేయలేదు. ప్రక్షిప్తములై ఉండును).

మూ. అశ్వమేధసహస్రస్య వాజపేయాయుతస్య చ
లభతే శ్రవణాదేవ సర్గస్యైకస్య మానవః. 12

ప్ర. ఆ. మానవః = మానవుడు, ఏకస్య = ఒక్క, సర్గస్య = సర్గ యొక్క, శ్రవణాదేవ = వినుటవలననే, అశ్వమేధసహస్రస్య = వేయి అశ్వమేధములయొక్క, వాజపేయాయుతస్య చ = వాజపేయయాగముల అయుతము యొక్క ఫలమును, లభతే = పొందును.

తా. మానవుడు ఒక్క సర్గను వినినా కూడ వెయ్యి అశ్వమేధములు, పది వేల వాజపేయములు చేసిన ఫలమును పొందును. 12

మూ. ప్రయాగాదీని తీర్థాని గఙ్గాద్యాః సరితస్తథా,
నైమిశాదీన్యరణ్యాని కురుక్షేత్రాదికాన్యపి 13
గతాని తేన లోకేఽస్మిన్ యేన రామాయణం శ్రుతమ్.

ప్ర. ఆ. యేన = ఎవనిచేత, రామాయణమ్=రామాయణము, శ్రుతమ్= వినబడినదో, తేన = వానిచేత, ప్రయాగాదీని = ప్రయాగ మొదలైన, తీర్థాని = తీర్థములు, తథా = మరియు, గఙ్గాద్యాః = గంగ మొదలైన, సరితః = నదులు, నైమిశాదీని = నైమిశము మొదలైన, అరణ్యాని = అరణ్యములు, కురుక్షేత్రాది కాన్యపి = కురుక్షేత్రము మొదలైనవి, గతాని = వెళ్ళబడినవి.

తా. ఈ లోకములో రామాయణము విన్నవాడు ప్రయాగాది తీర్థములకు గంగాదినదులకు, నైమిశాద్యరణ్యములకు, కురుక్షేత్రాదులకు యాత్ర చేసినట్లే.

మూ. హేమభారం కురుక్షేత్రే ప్రగస్తే భానౌ ప్రయచ్ఛతి, 14
యశ్చ రామాయణం లోకే శృణోతి సదృశావుభౌ.

ప్ర. ఆ భానౌ = సూర్యుడు, ప్రగస్తే = మింగబడిన వాడగుచుండగా, (ఎవడు), కురుక్షేత్రే = కురుక్షేత్రమునందు, హేమభారమ్ = బంగారముయొక్క భారమును, ప్రయచ్ఛతి = ఇచ్చునో, యః చ = ఎవడు, రామాయణమ్ = రామాయణమును, శృణోతి = వినునో, ఉభౌ = ఇద్దరూ కూడ, లోకే = లోకమునందు, సదృశౌ = సమానులు.

తా. సూర్యగ్రహణ పుణ్యకాలమునందు కురుక్షేత్రములో పుట్టెడు బంగారము దానము చేసినవాడు, రామాయణము చదివినవాడు, ఇద్దరూ ఈ లోకములో సమానులు. 14

మూ. సమ్యక్ శ్రద్ధాసమాయుక్తః శృణుతే రాఘవీం కథామ్,
సర్వపాపాత్ ప్రముచ్యేత విష్ణులోకం స గచ్ఛతి. 15

ప్ర. ఆ. రాఘవీం = రామునకు సంబంధించిన, కథామ్ = కథను, సమ్యక్ = బాగుగా, శ్రద్ధాసమాయుక్తః = శ్రద్ధతో కూడినవాడై, శృణుతే = ఎవడు వినునో, సః = అతడు, సర్వపాపాత్ = సకలపాపమునుండి, ప్రముచ్యేత = విడువబడును. విష్ణులోకమ్ = విష్ణులోకమును, గచ్ఛతి = పొందును.

తా. మంచి శ్రద్ధతో రామకథను వినినవాడు సకలపాపములనుండి విముక్తుడై విష్ణులోకమునకు వెళ్లును. 15

మూ. ఆదికావ్యమిదం త్వార్షం పురా వాల్మీకినా కృతమ్, 16
యః శృణోతి సదా భక్త్యా స గచ్ఛేద్వైష్ణవీం తనుమ్
పుత్రదారాశ్చ వర్ధన్తే సంపదః సన్తతిస్తథా. 17

ప్ర. ఆ. పురా = పూర్వము, వాల్మీకినా = వాల్మీకిచేత, కృతమ్ = రచించబడిన, ఆర్షమ్ = ఋషిప్రోక్తమైన, ఇదమ్ = ఈ, ఆదికావ్యమ్ = ఆదికావ్యమును,

యః = ఎవడు, సదా = ఎల్లప్పుడూ, భక్త్యా = భక్తితో, శృణోతి = వినునో, సః = అతడు, వైష్ణవీమ్ = విష్ణుసంబంధమైన, తనుమ్ = దేహమును, గచ్ఛేత్ = పొందును. పుత్రదారాః = పుత్రులు, భార్యలు, సంపదః = సంపదలు, తథా = మరియు, సన్ తతిః = సంతానము, వర్ధతే = వృద్ధిపొందును.

తా. పూర్వము వాల్మీకి రచించిన, ఆర్షమైన ఈ ఆదికావ్యమును ఎల్లప్పుడు భక్తితో వినువాడు విష్ణుశరీరమును పొందును. ఆతని పుత్రులు, భార్యలు, సంపదలు, సంతానము వృద్ధిచెందును. 16, 17

మూ. సత్యమేతద్విదిత్వా తు శ్రోతవ్యం నియతాత్మభిః,
గాయత్ర్యాశ్చ స్వరూపం తద్రామాయణమనుత్తమమ్ 18

ప్ర. అ అనుత్తమమ్ = చాల శ్రేష్ఠమైన, తత్ = ఆ, రామాయణమ్ = రామాయణము, గాయత్ర్యాః = గాయత్రియొక్క, స్వరూపమ్ = స్వరూపము ఏతత్ = ఈ, సత్యమ్ = సత్యమును, విదిత్వా = తెలిసికొని, నియతాత్మభిః = నిగ్రహించుకొనబడిన మనస్సుకలవారిచేత, శ్రోతవ్యమ్ = వినదగినది

తా. ఈ అత్యుత్తమమైన రామాయణము గాయత్రీస్వరూపము. ఈ సత్యమును తెలిసికొని దీనిని పరిశుద్ధమైన అంతఃకరణముతో వర్ణించవలెను. 18

మూ. అపుత్రో లభతే పుత్రమధనో లభతే ధనమ్,
సర్వపాపైః ప్రముచ్యేత పాదమప్యస్య యః పఠేత్. 19

ప్ర. ఆ. తా. వైన లేవ శ్లోకము చూడుడు.

మూ. యః పఠేచ్ఛృణుయాన్నిత్యం చరితం రాఘవస్య చ,
భక్త్యా నిష్కల్మషో భూత్వా దీర్ఘమాయురవాప్నుయాత్.

ప్ర ఆ. యః = ఎవడు, నిత్యమ్ = నిత్యమూ, రాఘవస్య = రాముని యొక్క, చరితమ్ = చరిత్రను, భక్త్యా = భక్తితో, పఠేత్ = చదువునో, శృణు యాత్ = వినునో, అతడు, నిష్కల్మషః = పాపములు లేనివాడుగా, భూత్వా = అయి, దీర్ఘమ్ = దీర్ఘమైన, ఆయుః = ఆయుర్దాయమును, అవాప్నుయాత్ = పొందును.

తా. రాముని చరిత్రమును నిత్యము భక్తిపూర్వకముగా చదువువాడు వినువాడు కూడ పాపము లన్నీ తొలగి దీర్ఘాయుర్దాయవంతు డగును. 20

మూ. చింతయేద్రాఘవం నిత్యం శ్రేయః ప్రాప్తుం య ఇచ్ఛతి,
శ్రావయేదిదమాఖ్యానం బ్రాహ్మణేభ్యో దినే దినే. 21

ప్ర. అ. యః = ఎవడు, శ్రేయః = శ్రేయస్సును, ప్రాప్తుమ్ = పొందుటకు, ఇచ్ఛతి = కోరునో, అతడు, నిత్యమ్ = నిత్యము, రాఘవమ్ = రాముణ్ణి, చింతయేత్ = స్మరించవలెను. దినే దినే = ప్రతి దినమునందు, ఇదమ్ ఆఖ్యానమ్ = ఈ ఆఖ్యానమును, బ్రాహ్మణేభ్యః = బ్రాహ్మణులకొరకు, శ్రావయేత్ = వినిపింప చేయవలెను.

తా. శ్రేయస్సు పొందగోరువాడు నిత్యము రాముణ్ణి స్మరించవలెను ప్రతి దినము ఈ రామాయణమును బ్రాహ్మణులకు వినిపింపచేయవలెను. 21

మూ. య స్త్విదం రఘునాథస్య చరితం సకలం పఠేత్,
సోఽసుషయే విష్ణులోకం గచ్ఛత్యేవ న సంశయః. 22

ప్ర అ. యః = ఎవడు, రఘునాథస్య = రామునియొక్క, సకలమ్ = సమస్తమైన, ఇదం చరితమ్ = ఈ చరితమును, పఠేత్ = చదువునో, సః = ఆతడు, అసుషయే = మరణానంతరము, విష్ణులోకమ్ = విష్ణులోకమును గూర్చి, గచ్ఛతి ఏవ = తప్పక వెళ్ళును. సంశయః = సంశయము, న = లేదు.

తా. ఈ రామచరితమును అంతా చదువువాడు మరణానంతరము తప్పక విష్ణులోకమునకు వెళ్ళును, సంశయము లేదు. 22

మూ. పితా పితామహ స్తస్య తథైవ ప్రపితామహః,
తత్పితా తత్పితాచైవ విష్ణుం యా న్తి న సంశయః. 23

ప్ర. అ. తస్య = రామాయణమును పూర్తిగా చదివినవానియొక్క, పితా = తండ్రి, పితామహః = తాత, తథైవ = మరియు, ప్రపితామహః = ముత్తాత, తత్పితా = ఆతని తండ్రి, తత్పితా చ ఏవ = ఆతని తండ్రి కూడ, విష్ణుమ్ = విష్ణువును, యా న్తి = పొందెదరు; సంశయః = సంశయము, న = లేదు.

తా. రామాయణమును పూర్తిగా చదివినవాని తండ్రి, తాత, ముత్తాత, ముత్తాత తండ్రి, ఆతని తండ్రి కూడ విష్ణువును చేరుదురు. సంశయము లేదు. 23

మూ. చతుర్వర్గప్రదం నిత్యం చరితం రాఘవస్య తు,
తస్మాద్యత్నవతా నిత్యం శ్రోతవ్యం పరమం సదా. 24

ప్ర. అ. రాఘవస్య = రామునియొక్క. చరితమ్ = చరిత్ర, నిత్యమ్ = ఎల్లప్పుడూ, చతుర్వర్గప్రదమ్ = చతుర్వర్గమును ఇచ్చునది. తస్మాత్ = ఆ కారణమువలన, నిత్యమ్ = నిత్యము, యత్నవతా = ప్రయత్నముగలవానిచేత, పరమమ్ = శ్రేష్ఠమైన ఈ రామాయణము, సదా = ఎల్లప్పుడు, శ్రోతవ్యమ్ = వినదగినది.

తా. రాముని చరితము ధర్మార్థకామమోక్షము లను నాలుగుపురుషార్థము లను ఇచ్చును. అందువలన మానవుడు నిత్యము ప్రయత్నశీలుడై శ్రేష్ఠమైన ఈ రామాయణమును ఎల్లప్పుడూ చదువుచుండవలెను. 24

మూ. శృణ్వన్ రామాయణం భక్త్యా యః పాదం పదమేవ వా,
స యాతి బ్రహ్మణః స్థానం బ్రహ్మణా పూజ్యతే సదా. 25

ప్ర. అ. యః = ఎవడు, రామాయణమ్ = రామాయణమును, పాదమ్ = పాదమును కాని, పదమ్ ఏవ వా = పదమును కాని, భక్త్యా = భక్తితో, శృణ్వన్ = వినుచు ఉండునో, సః = అతడు, బ్రహ్మణః = బ్రహ్మయొక్క, స్థానమ్ = స్థానమును, యాతి = పొందును. సదా = ఎల్లప్పుడూ, బ్రహ్మణా = బ్రహ్మచేత, పూజ్యతే = పూజింపబడును.

తా. రామాయణములోని ఒక శ్లోకపాదమును గాని, ఒక్క పదమునైనా గాని భక్తితో వినువాడు బ్రహ్మలోకమునకు వెళ్ళును. నిత్యము బ్రహ్మచేత పూజింపబడును. 25

మూ. ఏవమేతత్పురావృత్తమాఖ్యానం భద్రమస్తు వః,
ప్రవ్యాహరత విస్రబ్ధమ్ బలం విష్ణోః ప్రవర్ధతామ్. 26

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకాదశాధికశతతమః సర్గః.

ఉత్తరకాణ్డం సంపూర్ణమ్.

శ్రీమద్వాల్మీకిరామాయణం సంపూర్ణమ్.

ప్ర. అ. ఏతత్ = ఇది, ఏవమ్ = ఇట్లు, పురా = పూర్వము, వృత్తమ్ = జరిగిన, ఆఖ్యానమ్ = ఆఖ్యానము. వః = మీకు. భద్రమ్ = మంగళము, అస్తు = అగుగాక. విష్ణోః = విష్ణువుయొక్క, బలమ్ = బలము, ప్రవర్ధతామ్ = వృద్ధి పొందు గాక అని, విస్రబ్ధమ్ = విశ్వాసపూర్వకముగా, ప్రవ్యాహరత = చాటి చెప్పండి.

తా. ఇది ఈ విధముగా పూర్వము జరిగిన ఆఖ్యానము. చదువువారికి, వినువారికి, స్మరించువారికీ కూడ మంగళము ఆగుగాక. "శ్రీమహావిష్ణువు బలము వృద్ధిపొందుగాక" అని దృఢవిశ్వాసముతో చాటి చెప్పండి. 26

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
నూటపదకొండవ సర్గ సమాప్తము.

ఉత్తరకాండము సంపూర్ణము

శ్రీమద్రామాయణము సంపూర్ణము

పుల్లెల శ్రీరామచంద్రుడు రచించిన శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానము
"బాలానందిని" సమాప్తము.

శ్రీః శ్రీః శ్రీః

యత్కృపాలేశసంసర్గాద్వ్యాఖ్యేయం రచితా మయా,
తస్యైవ జానకీజానేః పదయోరియమర్ప్యతే.
దేవతానుగ్రహః పిత్రోస్తపశ్చార్యసత్కృపా,
కర్తాస్మద్గర్భజాతస్య కరణం కేవలం వయమ్.

భావనామ సంవత్సర చైత్ర శుక్ల ద్వితీయ; బుధవారం

13.4.1994